Al Fatiha

**1.అల్ ఫాతిహ**

ఆయతులు : 7    అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**1.అల్ ఫాతిహ**   1 - 3 అల్లా హ్  మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన సకల లోకాలకు ప్రభువు   , అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు, ప్రతిఫలదినానికి స్వామి.

**1.అల్ ఫాతిహ**   4 - 7  మేము నిన్నే ఆరాధిస్తాము , సహాయం కొరకు నిన్నే అర్థిస్తాము. మాకు రుజుమార్గం చూపించు - నీవు అనుగ్రహించినవారూ , నీ ఆగ్రహానికి గురికానివారూ , మార్గభ్రష్టులు కానివారూ అనుసరించిన మార్గము.

2. Al Baqara

**2. అల్ బఖర**

ఆయతులు : 286      అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**2. అల్ బఖర**  1 - 5  అలిఫ్ లామ్ మీమ్. ఇది అల్లాహ్ గ్రంథము. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. అల్లాహ్ భీతి కలవారికి ఈ గ్రంథం మార్గదర్శకం - వారు అగోచర విషయాలను విశ్వసిస్తారు. నమాజును స్థాపిస్తారు. మేము ప్రసాదించిన దానినుండి (మా మార్గంలో) ఖర్చుచేస్తారు. మేము నీపై అవతరింపచేసిన గ్రంథాన్నీ (ఖురాను) , నీకు పూర్వం అవతరింపచేసిన గ్రంథాలనూ విశ్వసిస్తారు. పరలోకాన్ని దృఢంగా నమ్ముతారు. ఇలాంటి వారు తమ ప్రభువు తరఫునుండి రుజుమార్గంలో ఉన్నారు. సాఫల్యం పొందేవారు వారే.

**2. అల్ బఖర**  6 - 7 (ఈ విషయాలను) తిరస్కరించిన వారిని నీవు హెచ్చరించినా , హెచ్చరించకపోయినా ఒకటే. వారు విశ్వసించేవారు కారు. అల్లా  హ్ వారి హృదయాలకూ , వారి చెవులకూ ముద్రవేశాడు. వారి కన్నులపై తెరపడిరది. వారు కఠిన శిక్షకు అర్హులు.

**2. అల్ బఖర**  8 - 20 ‘‘అల్లాహ్ ను , అంతిమదినాన్ని మేము విశ్వసించాము ’’ అని అనేవారు కూడా కొందరు ఉన్నారు. కాని వాస్తవంగా వారు విశ్వాసులు కారు. అల్లాహ్ ను , విశ్వాసులనూ వారు మోసం చేస్తున్నారు. కాని యథార్థంగా వారు తమను తాము తప్ప మరెవరినీ మోసం చెయ్యటం లేదు. అయితే ఈ విషయాన్ని వారు

గ్రహించటం లేదు. వారి హృదయాలకు ఒక రోగం పట్టుకుంది. అల్లా హ్ ఆ రోగాన్ని మరింత అధికం చేశాడు. వారు చెప్పే ఈ అబద్ధానికిగాను, వారికి వ్యధాభరితమయిన శిక్ష పడుతుంది. ''అవనిలో కల్లోలాన్ని రేకెత్తించకండి'' అని వారితో అన్నప్పుడల్లా వారు ''మేము సంస్కర్తలము మాత్రమే'' అని అంటారు - జాగ్రత్త! వాస్తవంగా వారే అసలు కల్లో లాన్ని సృష్టించేవారు. కాని వారు గ్రహించటం లేదు. ''ఇతరులు విశ్వసించిన విధంగానే మీరూ విశ్వసించండి'' అని వారితో అన్నప్పుడు వారు ''మూర్ఖులు విశ్వసించిన విధంగా మేము విశ్వ సించాలా ?'' అని జవాబిస్తారు - జాగ్రత్త! వాస్తవంగా వారే మూర్ఖులు , కాని అది వారికి తెలియదు. విశ్వాసులను కలసినప్పుడు వారు ''మేము విశ్వసించాము'' అని అంటారు. కాని తమ షైతానులను ఏకాంతంగా కలసినప్పుడు వారు ''అసలు మేము మీతోనే ఉన్నాము. వారిని కేవలం ఎగతాళి చేస్తున్నాము'' అని అంటారు - అల్లాహ్ వారిని ఎగతాళి చేస్తున్నాడు. ఆయన వారికి వ్యవధినిస్తూ పోతున్నాడు. వారు తలబిరుసుతనం వల్ల అంధులై గమ్యరహితంగా తిరుగుతూ పోతున్నారు. సన్మార్గానికి బదులుగా అపమార్గాన్ని కొనుక్కున్న ప్రజలు వారే. కాని వారి ఈ బేరం వారికి లాభదాయకమయింది కాదు. వారు ఏమాత్రం సత్యమార్గంలో లేరు. వారి ఉపమానం ఇలా వుంది : ఒక వ్యక్తి నిప్పు రాజేసినంతనే పరిసరాలన్నీ ప్రకాశించాయి. అప్పుడు అల్లాహ్ వారి కంటి వెలుగును హరింపజేసి , అంధకారంలో ఏమీ కానరాని స్థితిలో వారిని వదిలాడు. వారు చెవిటివారు , మూగవారు, గ్రుడ్డివారు. ఇక వారు (రుజుమార్గానికి) మరలిరారు. లేదా మరొక ఉపమానం : ఆకాశం నుండి భారీగా వర్షం కురుస్తోంది. దానికి తోడు చిమ్మచీకట్లు , ఉరుములు, మెరుపులు! ఉరుముల భీకర ధ్వని విని , మృత్యు భయంచేత వారు తమ ప్రేళ్ళను చెవులలో దూర్చుకుంటారు. అల్లాహ్ ఈ సత్యతిరస్కారులను అన్ని వైపుల నుండి పరివేష్టించి ఉన్నాడు. వారి పరిస్థితి , మెరుపులు వారి దృష్టిని ఎగర వేసుకపోతాయా అనేవిధంగా ఉంది. వెలుగును చూసినప్పుడల్లా వారు కొంత దూరం నడుస్తారు. చీకటి క్రమ్ముకోగానే ఆగిపోతారు - అల్లాహ్ కోరితే వారి వినికిడినీ , వారి చూపునూ సంపూర్ణంగా నశింపచేసేవాడే. నిశ్చయంగా ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు.

**2. అల్ బఖర** 21 - 22 మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది. మీ కొరకు భూమిని పాన్పుగాను , ఆకాశాన్ని కప్పుగాను సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటుచేసి మీకు ఉపాధి కల్పించినవాడూ ఆయనే! ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్ సమానులుగా నిలబెట్టకండి.

**2. అల్ బఖర** 23 - 24 మేము మా దాసునిపై అవతరింపజేసిన గ్రంథం గురించి, అది మా గ్రంథం అవునో కాదో అని మీకు సందేహం ఉన్నట్లయితే దానివంటి ఒక్క సూరానైనా మీరు రచించి తీసుకురండి. మీ సహచరులందరినీ పిలుచుకోండి. ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి సహాయాన్నయినా పొందండి. మీరు సత్యవంతులే అయితే ఈ పని చేసి చూపించండి. కాని మీరు అలా చెయ్యకపోతే - నిశ్చ యంగా ఎన్నటికీ చెయ్యలేరు-భయపడండి , మానవులు, రాళ్ళు ఇంధనం కాగల ఆ అగ్నికి. అది సత్యతిరస్కారుల కొరకు తయారు చెయ్యబడిరది.

**2. అల్ బఖర** 25 ప్రవక్తా! ఈ గ్రంథాన్ని విశ్వసించి, (దాని బోధనలకు అనుగుణంగా) తమ నడవడికను తీర్చిదిద్దుకునే వారికి సంతోషవార్త వినిపించు : కాలువలు ప్రవహించే ఉద్యానవనాలు వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి అని. ఆ వనాలలోని పండ్లు ఆకారంలో భూలోకంలోని పండ్లను పోలి ఉంటాయి. తినటానికి ఏమైనా పండ్లు ఇవ్వబడినప్పుడల్లా, వారు ''ఇలాంటి పండ్లే పూర్వం భూలోకంలో మాకు ఇవ్వబడేవి '' అని అంటారు. అక్కడ వారికొరకు పవిత్రలైన భార్యలు ఉంటారు. వారు అక్కడే శాశ్వతంగా ఉంటారు.

**2. అల్ బఖర** 26 - 27 అవును. దోమ లేక దానికంటే మరీ అల్పమైన వస్తువును దృష్టాంతంగా చెప్పటానికి అల్లాహ్ ఎంతమాత్రం సిగ్గుపడడు. ఈ దృష్టాంతాన్నే సత్యస్వీకారులు చూసి , ఇది తమ ప్రభువు తరఫునుండి వచ్చిన సత్యమే అని గ్రహిస్తారు. కాని సత్యతిరస్కారులు వాటిని విని ''ఈ ఉపమానాల ద్వారా అల్లాహ్ చెప్పదలచుకున్నదేమిటి?'' అని ప్రశ్నిస్తారు. ఈ విధంగా అల్లాహ్ ఒకే విషయంతో ఎంతో మందిని అపమార్గం వైపునకు తీసుకుపోతాడు. ఎంతోమందికి రుజుమార్గం చూపుతాడు. అల్లాహ్ దీనిద్వారా అపమార్గం పట్టించేది వీరినే - అల్లాహ్ ఆజ్ఞలను ఉల్లంఘించేవారు , అల్లాహ్ తీసుకున్న ప్రమాణాన్ని దృఢపరచిన తరువాత భంగపరచేవారు , కలిపివుంచండి అని అల్లాహ్ ఆదేశించిన దాన్ని తెంచేవారు , ఇంకా భువిలో కల్లోలాన్ని రేకెత్తించేవారు - వాస్తవంగా నష్టపడేవారు వీరే.

**2. అల్ బఖర** 28 - 29 మీరు అల్లాహ్ పట్ల తిరస్కార వైఖరిని ఎలా అవలంబించగలుగుతారు ? వాస్తవానికి ప్రాణంలేని మీకు ఆయన ప్రాణం పోశాడు. మళ్ళీ మీ ప్రాణాన్ని తీసేదీ ఆయనే. తిరిగి మిమ్మల్ని బ్రతికించేదీ ఆయనే. చివరకు మీరంతా ఆయన వద్దకే మరలిపోతారు. ఇంకా ఆయనే ధరణిలో ఉన్న సమస్తాన్నీ మీ కొరకు సృష్టించినవాడు. తరువాత తన ధ్యానాన్ని పైకి మరల్చి సప్తాకాశాలను సృజించినవాడూ ఆయనే. ప్రతి విషయమూ క్షుణ్ణంగ తెలిసినవాడూ ఆయనే.

**2. అల్ బఖర** 30 - 33 ఈ సంఘటనను జ్ఞాపకం తెచ్చుకో : ''నేను భువిలో ఒక ప్రతినిధిని సృష్టించబోతున్నాను'' అని నీ ప్రభువు తన దూతలతో అన్నప్పుడు వారు , ''భూవ్యవస్థను అస్తవ్యస్తం చేసి రక్తం చిందించేవాణ్ణి నియమించబోతున్నావా ప్రభూ ? మేము నీ స్తోత్రం చేస్తూ నీ గొప్పతనాన్ని కొనియాడుతూ నీ పవిత్ర నామం స్మరిస్తూనే ఉన్నాము కదా!'' అని విన్నవించుకున్నారు. దానికి అల్లాహ్ , ''మీకు తెలియనివన్నీ నాకు తెలుసు '' అని సమాధానం పలికాడు. తరువాత అల్లాహ్ ఆదమ్‌కు అన్ని వస్తువుల పేర్లూ నేర్పాడు. వాటిని దూతలకు చూపించి, ''(ప్రతినిధి నియామకం సంక్షోభానికి దారితీస్తుంది అనే) మీ అభిప్రాయమే నిజమయితే , వీటి పేర్లు కాస్త నాకు చెప్పండి ?'' అని అల్లాహ్ వారిని అడిగాడు. వారు కడు వినమ్రులై ఇలా అన్నారు: ''(ప్రభూ!) దోష రహితుడవు నీవే! నీవు తెలిపినది తప్ప మాకు మరేమీ తెలియదు. వాస్తవంగా సర్వం తెలిసినవాడవూ సర్వాన్ని అర్థం చేసుకోగలవాడవూ నీవే!'' అప్పుడు అల్లాహ్ ఆదమ్‌తో , ''ఈ వస్తువుల పేర్లను నీవు వారికి తెలుపు '' అని

అన్నాడు. ఆదమ్ వారికి వాటి పేర్లన్నీ తెలుపగానే , అల్లాహ్ ఇలా ప్రకటించాడు : ''భూమ్యాకాశాలలో మీకు గోప్యంగావున్న సత్యాలన్నీ నాకు తెలుసనీ , మీరు ప్రకటించేవీ, మీరు దాచేవీ అన్నీ నాకు తెలుసనీ నేను మీకు చెప్పలేదా?''

**2. అల్ బఖర** 34 మేము దూతలకు ''మీరు అందరూ ఆదమ్‌కు తలవంచండి '' అని ఆదేశించినప్పుడు , వారందరూ తలవంచారు. కాని ఇబ్లీసు ధిక్కరించాడు. దురహంకారానికి గురిఅయ్యాడు. అవిధేయులలో కలసిపోయాడు.

**2. అల్ బఖర** 35 - 37 మళ్ళీ మేము ఆదమ్‌తో ఇలా అన్నాము: ''నీవూ, నీ భార్య ఇద్దరూ కలసి స్వర్గంలో నివసించండి. ఇక్కడ మీరు మీకు ఇష్టమైన దానిని యధేచ్ఛగా తినండి. కాని ఈ చెట్టు దరిదాపులకు పోవద్దు. ఒకవేళ పోతే, మీరు అతిక్రమణదారులలో కలసిపోతారు.'' చివరకు షైతాను వారిద్దరిని ఆ చెట్టు వైపునకు ఆకర్షించి , మా ఆజ్ఞాపాలనం నుండి దూరం చేశాడు. వారిని తమ పూర్వపు స్థితి నుండి తొలగించి వదలిపేశాడు. అప్పుడు మేము ఇలా ఆజ్ఞాపించాము : ''ఇక మీరంతా ఇక్కడ నుండి దిగిపొండి. మీరు ఒకరికొకరు శత్రువులు. ఒక పరిమిత కాలం వరకు మీరు భూలోకంలో ఉండి అక్కడే జీవితం గడపవలసి ఉంది. '' అప్పుడు ఆదమ్ తన ప్రభువు నుండి కొన్ని మాటలు నేర్చుకుని, పశ్చాత్తాపపడుతూ క్షమాభిక్ష అర్థించాడు. అతని ప్రభువు అతని వేడుకోలును మన్నించాడు. ఎందుకంటే, ఆయన అమితంగా క్షమించేవాడు, కనికరించేవాడూను.

**2. అల్ బఖర** 38 - 39 మేము ఇలా తెలిపాము : ''మీరంతా ఇక్కడి నుండి దిగిపొండి. ఇకపై నా తరఫు నుండి ఏదైనా ఉపదేశం మీ వద్దకు వచ్చినప్పుడు , నా ఈ ఉపదేశాన్ని అనుసరించేవారికి ఏ విధమైన భయంకానీ , విచారంకానీ కలిగే అవకాశం ఉండదు. దానిని స్వీకరించటానికి నిరాకరించేవారూ , మా ''ఆయతులు'' అసత్యాలని తృణీకరించేవారూ, నరకాగ్నిలోకి పోతారు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు.

**2. అల్ బఖర** 40 - 46 ఇస్రాయీలు వంశీయులారా! నేను మీకు ప్రసాదించిన కానుకను గురించి ఆలోచించండి. మీరు నాతో చేసిన వాగ్దానం నెరవేర్చండి. నేను మీతో చేసిన వాగ్దానం నెరవేరుస్తాను. నాకు మాత్రమే మీరు భయపడండి. నేను ఇప్పుడు పంపిన గ్రంథాన్ని విశ్వసించండి. ఇదివరకే మీ వద్ద ఉన్న దివ్య గ్రంథాన్ని అది ధ్రువీకరిస్తుంది. కనుక మీరే అందరికంటే ముందు దానిని తిరస్కరించేవారు అవకండి. అల్ప ధరకు నా ఆయతులను అమ్మకండి. నా ఆగ్రహానికి భయపడండి. సత్యాన్ని అసత్యంతో కలిపి దానిని కలగాపులగం చెయ్యకండి. బుద్ధిపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చెయ్యకండి. నమాజును స్థాపించండి. జకాత్ ఇవ్వండి. నా సాన్నిధ్యంలో వినమ్రులై తలవంచే వారితో పాటు మీరూ వినమ్రులై తలవంచండి. సన్మార్గాన్ని అవలంబించండి అని మీరు ఇతరులకయితే ఉపదేశిస్తారు - కాని మిమ్మల్ని మీరు మరచిపోతారేమిటి ? వాస్తవానికి మీరు ధర్మగ్రంథం పారాయణం చేస్తారు. అయినా మీరు బుద్ధిని బొత్తిగా ఉపయోగించరేమిటి ? సహనం ద్వారా ,

నమాజు ద్వారా సహాయం పొందండి. నిస్సందేహంగా నమాజు కష్టతరమైన కార్యం. కాని అల్లాహ్ కు విధేయులైన దాసులకు అది ఎంతమాత్రం కష్టం కాదు - వారు తాము ఎట్టకేలకు తమ ప్రభువును కలుసుకోవలసి ఉందనీ , ఆయన వైపునకే మరలిపోవలసి ఉందనీ నమ్ముతారు.

**2. అల్ బఖర** 47 - 48 ఇస్రాయీలు వంశీయులారా! నేను మీకు చేసిన మహోపకారాన్నీ, మిమ్మల్ని ప్రపంచంలోని జాతులలోకెల్లా ఘనతగల ఒక జాతిగా ఆదరించిన విషయాన్నీ గుర్తుకు తెచ్చుకోండి. ఎవరూ ఎవరికీ ఏమాత్రం తోడ్పడలేని, ఎవరి సిఫారసూ అంగీకరించబడని , పరిహారం తీసుకుని ఎవరినీ విడుదల చెయ్యని , అపరాధులకు సహాయం ఎక్కడ నుండీ లభించని ఆ దినానికి మీరు భయపడండి.

**2. అల్ బఖర** 49 ఫిరౌను ప్రజల బానిసత్వం నుండి మేము మీకు విముక్తి కలిగించిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి - వారు మిమ్మల్ని ఘోర హింసకు గురిచేసేవారు. మీ కుమారులను వధించి , మీ కుమార్తెలను సజీవంగా విడిచిపెట్టేవారు. ఇందులో మీ ప్రభువు తరఫు నుండి మీకు కఠినపరీక్ష ఉండినది.

**2. అల్ బఖర** 50 సముద్రాన్ని చీల్చి మేము మీకు మార్గం ఏర్పాటు చేసిన సంఘటనను గుర్తుకు తెచ్చుకోండి. ఆ తరువాత దానినుండి మిమ్మల్ని సురక్షితంగా ఆవలి ఒడ్డుకు చేరవేశాము. మీ కళ్ళముందే ఫిరౌను ప్రజలను మేము అందులో ముంచివేశాము.

**2. అల్ బఖర** 51 - 52 మేము మూసాను నలువది రేయింబవళ్ళ నిర్ణీత కాలం వరకు పిలిచినప్పుడు , మీరు అతను లేకపోవటం చూసి ఆవుదూడను ఆరాధ్య దైవంగా చేసుకున్నారు. ఆ విధంగా మీరు ఘోర దురాచారానికి పాల్పడ్డారు. అయినప్పటికీ మీరు కృతజ్ఞులౌతారేమో అని మేము మిమ్మల్ని క్షమించాము.

**2. అల్ బఖర** 53 గుర్తుకు తెచ్చుకోండి : (ఈ ఘోర పాతకంలో మీరు మునిగి వున్నప్పుడు) మీరు రుజుమార్గం పొందగలందుకు మేము మూసాకు గ్రంథాన్నీ, గీటురాయినీ ప్రసాదించాము.

**2. అల్ బఖర** 54 జ్ఞాపకం తెచ్చుకోండి : (అల్లాహ్ ప్రసాదించిన ఈ కానుకతో తిరిగి వచ్చిన) మూసా తన జాతి ప్రజలతో ఇలా అన్నాడు : ‘‘జనులారా! ఆవుదూడను ఆరాధ్య దైవంగా ఎన్నుకుని మీకు మీరే అన్యాయం చేసుకున్నారు. కనుక పశ్చాత్తాపంతో క్షమాభిక్ష కొరకు మీరు మీ సృష్టికర్తను వేడుకోండి , మీలోని ఘోర పాతకులను సంహరించండి. మీ సృష్టికర్త దృష్టిలో ఇదే మీకు అత్యంత శ్రేయస్కరమైనది.’’ అప్పుడు మీ సృష్టికర్త మీ పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు. ఆయన ఎక్కువగా క్షమించేవాడూ, అమితంగా కరుణించేవాడూను.

**2. అల్ బఖర** 55 - 56 మూసాతో మీరు అన్న మాటలను జ్ఞప్తికి తెచ్చుకోండి : ‘‘మూసా! మేము అల్లాహ్ ను (నీతో మాట్లాడుతూ ఉండగా) కళ్ళారా చూడనంతవరకు , నీ మాటలను ఎంతమాత్రం విశ్వసించము. ’’ అదే సమయంలో మీరు చూస్తూ ఉండగానే, ఒక భయంకరమైన పిడుగు మీపై పడిరది. మీరంతా నిర్జీవులై నేలకొరిగారు.

మళ్ళీ మేము ప్రాణం పోసి మిమ్మల్ని లేపాము , కనీసం ఈ ఉపకారం తరువాతైనా మీరు కృతజ్ఞత చూపుతారేమో అని.

**2. అల్ బఖర** 57 మేము మీపై మేఘాల ఛాయను కల్పించాము. మన్న్ సల్వాలను మీ కొరకు ఆహారంగా దించి, ‘‘మేము మీకు ప్రసాదించిన వాటిలో పరిశుభ్రమూ , పరిశుద్ధమూ అయిన వస్తువులను తినండి ’’ అని చెప్పాము. (అయినప్పటికీ మీ పూర్వీకులు మా ఆజ్ఞలను ఉల్లంఘించారు) అయితే వారు మాకు ఏమాత్రం అన్యాయం చేయలేదు. తమకు తామే అన్యాయం చేసుకున్నారు.

**2. అల్ బఖర** 58 - 59 గుర్తుకు తెచ్చుకోండి, మేము మీతో ఇలా అన్నాము : ‘‘(మీ ముందు ఉన్న ) ఈ నగరంలో ప్రవేశించండి. అక్కడ పండే పంటలను మీ ఇష్టానుసారం తృప్తిగా తినండి. కాని వినమ్రులై తలవంచుతూ నగర ద్వారంలో ప్రవేశించాలి. ‘హిత్తతున్, హిత్తతున్’ అంటూ ముందుకు సాగిపోవాలి. అప్పుడు మేము మీరు చేసిన తప్పులను మన్నిస్తాము. సజ్జనులను అత్యధికంగా అనుగ్రహిస్తాము. ’’ కాని దుర్మార్గులు మేము వారితో అన్న మాటలను సమూలంగా మార్చివేశారు. కనుక దుర్మార్గం చేసిన వారిపై మేము ఆకాశం నుండి ఆపదను దింపాము. ఇది వారు చూపుతూ వచ్చిన అవిధేయతలకు శిక్ష.

**2. అల్ బఖర** 60 జ్ఞాపకం తెచ్చుకోండి, మూసా తన ప్రజల కొరకు నీటికోసం ప్రార్థించినప్పుడు , మేము ‘‘నీవు ఆ కొండ రాతిని నీ చేతి కర్రతో కొట్టు ’’ అని ఆదేశించాము. తదనుగుణంగా కొండరాయి నుండి పన్నెండు ఊటలు పెల్లుబికాయి. ప్రతి తెగవారు తమ నీరు త్రాగే స్థలాన్ని కనుగొన్నారు. (అప్పుడు వారికి ఈ విధంగా ఆదేశించబడిరది) ‘‘అల్లాహ్ మీకు ప్రసాదించిన దానిని తినండి , త్రాగండి. కాని ధరణిపై కల్లోలం రేకెత్తిస్తూ తిరగకండి.’’

**2. అల్ బఖర** 61 మీరు మూసాకు చేసిన ఫిర్యాదును జ్ఞాపకం తెచ్చుకోండి. ‘‘ఒకే రకమైన భోజనాన్ని మేము భరించలేకుండా ఉన్నాము. భూమిలో ఉత్పత్తి అయ్యే ఆకుకూరలు , కూరగాయలు, గోధుమలు, వెల్లుల్లి, ఉల్లిపాయలు, పప్పు దినుసులు మొదలైనవి మా కొరకు పండిరచు అని నీవు నీ ప్రభువును ప్రార్థించు. ’’ అప్పుడు మూసా ఇలా అడిగాడు : ‘‘శ్రేష్ఠమైన దానికి బదులుగా నీచమైనదానిని కోరుకుంటున్నారా? సరే, మంచిది. ఏదో ఒక పట్టణానికి మీరంతా తరలిపొండి. అక్కడ మీరు కోరేదంతా దొరుకుతుంది. ’’ చివరకు వారు తీవ్ర అవమానానికీ , పరాభవానికీ, దురవస్థకూ, దుర్భర దారిద్ర్యానికీ గురిఅయ్యారు. ఇంకా వారు అల్లాహ్ ఆగ్రహానికి అర్హులయ్యారు. అదంతా వారు అల్లాహ్ ఆయతులను తిరస్కరించినదాని ఫలితం ప్రవక్తలను అన్యాయంగా చంపినదాని ఫలం అల్లాహ్ పట్ల అవిధేయత చూపినదాని పరిణామం షరీయత్తు హద్దులను మాటిమాటికీ అతిక్రమించినదాని పర్యవసానం.

**2. అల్ బఖర** 62 అరేబియా ప్రవక్త (ముహమ్మద్)ను విశ్వసించేవారుకానీ , యూదులుకానీ, క్రైస్తవులుకానీ, సాబియీలుకానీ - ఎవరైనాసరే - అల్లాహ్ ను , అంతిమదినాన్ని విశ్వసించి మంచి పనులు చేసినవారికి నిస్సందేహంగా వారి ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం ఉంది. వారికి ఏ విధమైన భయంకానీ , విచారంకానీ కలిగే అవకాశం లేదు.

**2. అల్ బఖర** 63 - 64 మేము తూర్ పర్వతాన్ని ఎత్తి మీపై నిలిపి మీ చేత చేయించిన ప్రమాణాన్ని గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడు ''మేము మీకు ప్రసాదిస్తున్న గ్రంథాన్ని దృఢంగా పట్టుకోండి , అందులో ఉన్న ఆజ్ఞలను , ఉపదేశాలను జ్ఞాపకం ఉంచుకోండి. దీని ద్వారానే మీరు భయభక్తుల బాటలో నడువగలరు '' అని బోధించాము. కాని తరువాత మీరు ఆ ఒడంబడికను త్రోసిరాజన్నారు. అయినప్పటికీ అల్లాహ్ మిమ్మల్ని తన అనుగ్రహానికీ , కారుణ్యానికీ దూరం చెయ్యలేదు. లేకపోతే మీరు ఎప్పుడో వినాశానికి గురిఅయి ఉండేవారు.

**2. అల్ బఖర** 65 - 66 సబ్బత్ శాసనం ఉల్లంఘించిన మీ వారి గాథ మీకు బాగా తెలుసు. మేము వారిని ''అందరూ అసహ్యంగా , నీచంగా చూసే కోతులుగా మారిపోండి '' అని శపించాము. ఈ విధంగా మేము వారి ముగింపును ఆ కాలం వారికీ , భావితరాల వారికీ ఒక గుణపాఠంగానూ , భయభక్తులు కలవారికి ఒక హితోపదేశంగానూ చేశాము.

**2. అల్ బఖర** 67 - 71 ఈ సంఘటనను కూడ గుర్తుకు తెచ్చుకోండి : మూసా తన జాతివారితో , ''అల్లాహ్ మిమ్మల్ని ఒక గోవును బలిగా ఇవ్వండి అని ఆజ్ఞాపిస్తున్నాడు '' అని అన్నప్పుడు వారు ''మాతో నీవు పరిహాసమాడుతున్నావా?'' అని బదులు పలికారు. ''అవివేకుల మాదిరిగా నేనూ మాట్లాడకుండా నన్ను రక్షించు అని అల్లాహ్ ను శరణు వేడుకుంటున్నాను '' అని మూసా అన్నాడు. అప్పుడు వారు , ''సరే, ఆ ఆవును గురించి వివరంగా మాకు చెప్పు అని నీవు నీ ప్రభువును అడుగు '' అని మూసాను కోరారు. అతను ఇలా సమాధానం చెప్పాడు : ''అది ముసలిదీ కాదు, లేగదూడా కాదు. మధ్య వయస్సులో ఉన్న ఆవు అయివుండాలి అని అల్లాహ్ అంటున్నాడు. కనుక ఆజ్ఞాపించిన విధంగా చెయ్యండి.'' వారు ఇంకా అడిగారు : ''దాని రంగు ఏదయి ఉండాలో నీ ప్రభువును అడిగి మాకు చెప్పు.'' మూసా, ''అది మెరిసే పసుపువన్నె కలిగి చూసేవారికి మనోహరంగా కన్పించాలి అని అల్లాహ్ ఆజ్ఞ'' అని వారికి తెలిపాడు. మళ్ళీ వారు ఇలా అన్నారు : ''అసలు ఏ విధమైన ఆవు కావాలో నీ ప్రభువును అడిగి మాకు స్పష్టంగా తెలుపు. దానిని నిర్ణయించటంలో మాకు సందేహం కలిగింది. అల్లాహ్ కోరితే మేము దానిని కనుగొంటాము.'' మూసా, ''అది ఏ కృషీ చెయ్యనిదై భూమి దున్ననిదై మోట లాగనిదై ఏ లోపమూ లేనిదై పరిపూర్ణారోగ్యము కలిగినదై ఉండాలి అని అల్లాహ్ అంటున్నాడు '' అని వారికి జవాబు చెప్పాడు. ''ఆ! అర్థమయింది. నీవు ఇప్పుడు సరియైన గుర్తులు చెప్పావు'' అని వారు పలికారు. అప్పుడు వారు ఆవును బలి ఇచ్చారు. లేకపోతే వారు అలా చేసేవారు కాదు.

**2. అల్ బఖర** 72 - 74 మరొక సంఘటనను కూడా మీరు గుర్తుకు తెచ్చుకోండి : మీరు ఒక వ్యక్తిని హత్య చేశారు. దానిని గురించి మీలో మీరు వాదులాడుకుంటూ , హత్యానేరాన్ని ఒకళ్ళపైనొకళ్ళు మోపుకోవటం ప్రారంభించారు. కాని మీరు గుప్తంగా ఉంచుతున్న దానిని బట్టబయలు చెయ్యటానికే అల్లాహ్ నిర్ణయం చేశాడు. కనుక మేము ''హతుని శవాన్ని దాని ఒక భాగంతో కొట్టండి '' అని వారిని ఆజ్ఞాపించాము. చూడండి! మృతులను అల్లాహ్ ఎలా బ్రతికిస్తాడో మీరు అర్థం చేసుకోవాలని తన సూచనలను మీకు ఎలా చూపుతాడో. కాని , ఈ సూచనలను చూసిన తరువాత కూడా మీ హృదయాలు కఠినమైపోయాయి - పాషాణాల మాదిరిగా , కాదు వాటికంటే కూడా కఠినమైపోయాయి. ఎందుకంటే రాళ్ళల్లో కొన్నింటినుండి సెలయేళ్ళు ప్రవహిస్తాయి. కొన్ని పగలగా వాటి నుండి నీరు చిమ్ముతుంది. మరికొన్ని అల్లాహ్ కు భయపడి కంపించి నేలకొరుగుతాయి - జాగ్రత్త! మీరు చేస్తున్నదంతా అల్లాహ్ కు తెలియకుండా లేదు.

**2. అల్ బఖర** 75 - 82 ముస్లిములారా! వారు మీ సందేశాన్ని విశ్వసిస్తారనే ఇంకా మీరు ఆశిస్తున్నారా ? వాస్తవానికి వారిలోని ఒక వర్గానికి , అల్లాహ్ ప్రవచనం విని బాగా అర్థం చేసుకుంటూనే , బుద్ధిపూర్వకంగా దానిని తారుమారు చేసే అలవాటు ఉంది. (ప్రవక్త ముహమ్మద్‌ను) విశ్వసించిన వారిని వారు కలసినప్పుడు , ''మేమూ ఆయనను విశ్వసించాము'' అని అంటారు. కాని వారు ఏకాంతంగా ఒకరినొకరు కలసినప్పుడు, ''మీకేమన్నా బుద్ధి ఉందా? అల్లాహ్ మీకు స్పష్టంచేసిన విషయాలను వారిముందు ఎందుకు వెల్లడిచేస్తారు ? మీ ప్రభువు సమక్షంలో మీకు వ్యతిరేకంగా వాటిని నిదర్శనాలుగా వారు వినియోగించటానికా ?'' అని అంటారు. వారు దాచేదంతా , వెల్లడిచేసేదంతా, అల్లాహ్ కు తెలుసని వారికి నిజంగానే తెలియదా ? వారిలో నిరక్షరాస్యుల వర్గం మరొకటి ఉంది. వారికి గ్రంథజ్ఞానం ఎంతమాత్రం లేదు. లేనిపోని ఆశలను , కోరికలను పెంచుకుని కేవలం వట్టి ఊహలతో జీవిస్తూ పోతున్నారు. షరీయత్తు గ్రంథాన్ని స్వహస్తాలతో రచించి , తద్వారా తుచ్ఛప్రయోజనం పొందే నిమిత్తం , ''ఇది అల్లాహ్ వద్దనుండి వచ్చింది'' అని ప్రజలకు చెప్పేవారికి వినాశం తప్పదు. వారి ఈ స్వహస్త లిఖిత రచన కూడ వారి వినాశానికి దారితీస్తుంది వారి ఈ సంపాదన కూడ వారి సర్వనాశనానికి కారణభూతం అవుతుంది. ఇంకా వారు ''నరక జ్వాలలు మమ్మల్ని ఏమాత్రం ముట్టుకోవు. ఒకవేళ మాకు శిక్ష పడినప్పటికీ అది కేవలం కొన్ని రోజులు మాత్రమే'' అని అంటారు. వారిని అడగండి, ''అల్లాహ్ నుండి మీరేమన్నా వాగ్దానం పొందారా ఆయన దాన్ని భంగం చెయ్యలేకపోవటానికి? లేక అల్లాహ్ బాధ్యత వహించినట్లు మీకు తెలియని విషయాలను మీరు అల్లాహ్ కు ఆపాదించి చెబుతున్నారా ? అసలు నరకాగ్ని మిమ్మల్ని ఎందుకు ముట్టుకోదు ?'' పాపం సంపాదించి , పాపజాలంలోనే ఇరుక్కుపోయేవారు నరకవాసులు. వారు నరకంలోనే శాశ్వతంగా ఉంటారు. విశ్వసించి , మంచి పనులు చేసేవారే స్వర్గవాసులు. వారు స్వర్గంలోనే శాశ్వతంగా ఉంటారు.

**2. అల్ బఖర** 83 - 86 మేము ఇస్రాయీలు సంతానం నుండి మరొక వాగ్దానం తీసుకున్నాము. దానిని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి : ''అల్లాహ్ ను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రులను , బంధువులను,

అనాథులను, నిరుపేదలను ఆదరించాలి. ప్రజలను సహృదయంతో పలుకరించాలి. నమాజును స్థాపించాలి. జకాత్ ఇవ్వాలి.'' కాని కొందరు తప్ప మీరంతా వాగ్దానభంగం చేశారు. ఇప్పటికీ మీరు దానిని లక్ష్యపెట్టటం లేదు. మేము మీ నుండి తీసుకున్న మరొక వాగ్దానాన్ని గుర్తుకు తెచ్చుకోండి: ''మీరు ఒకరి నొకరు చంపుకోరాదు. గృహాల నుండి బహిష్కరించుకోరాదు.'' దానిని మీరు అంగీకరించారు. దానికి మీరే స్వయంగా సాక్షులు. కాని మీరే నేడు మీ సోదరులను సంహరిస్తున్నారు. మీలోని ఒక వర్గం వారిని మీరు వారి ఇండ్లనుండి బహిష్కరిస్తున్నారు. దౌర్జన్యంగా, అన్యాయంగా, మీరు వారికి వ్యతిరేకంగా ముఠాలను కడుతున్నారు. వారు మీ వద్దకు యుద్ధఖైదీలుగా వచ్చినప్పుడు వారి విమోచన ధనం విషయంలో మీరు బేరం చేస్తున్నారు. అసలు మీరు వారిని ఇళ్ళనుండి బహిష్కరించటమే అధర్మం. మీరు దైవ గ్రంథంలోని ఒక భాగాన్ని విశ్వసించి, మరొక భాగాన్ని తిరస్కరిస్తారా? మీలో ఇలా చేసేవారిని ఇహలోక జీవితంలో ఘోర అవమానానికీ , పరలోకంలో తీవ్రమైన బాధకూ గురిచెయ్యటం తప్ప మరొక శిక్ష ఏముంటుంది ? మీ చేష్టలు అల్లాహ్ కు తెలియకుండా లేవు , జాగ్రత్త! పరలోకాన్ని విక్రయించి దానికి బదులుగా ప్రాపంచిక జీవితాన్ని కొనుక్కున్నవారు వీరే! కనుక వారికి పడే శిక్షా తగ్గదు వారికి ఏ సహాయమూ లభించదు.

**2. అల్ బఖర** 87 - 90 మేము మూసాకు దివ్య గ్రంథం ప్రసాదించాము. అతని తరువాత వరుసగా ప్రవక్తలను పంపాము. చివరకు మర్యమ్ కుమారుడైన ఈసాకు స్పష్టమైన సూచనలు ఇచ్చి పంపాము. పరిశుద్ధాత్మ ద్వారా అతనికి సహాయం చేశాము. మీ మనోవాంఛలకు ప్రతికూలంగా ఉన్న దానిని తీసుకుని ఏ ప్రవక్త అయినా మీ వద్దకు వచ్చినప్పుడు , మీరు ఆయన పట్ల తలబిరుసుతనంతో ప్రవర్తించారు. కొందరిని తిరస్కరించారు. మరికొందరిని చంపారు. ఇదేమి వైఖరి? - వారు, ''మా హృదయాలు సురక్షితంగా ఉన్నాయి'' అని అంటారు. కాదు, అది నిజం కాదు. అసలు విషయం ఏమిటంటే, వారి అవిశ్వాస వైఖరి కారణంగా అల్లాహ్ వారిని శపించాడు. కనుక వారు విశ్వసించటం అనేది కాని పని. అల్లాహ్ నుండి వారి వద్దకు ఇప్పుడు వచ్చిన గ్రంథం పట్ల వారి ప్రవర్తన ఎలా ఉంది? వారి వద్ద పూర్వం నుండే ఉన్న దైవ గ్రంథాన్ని ఈ గ్రంథం ధ్రువీకరిస్తున్నప్పటికీ , దీని రాకకు ముందు అవిశ్వాసులపై విజయం ప్రసాదించు అని వారు ప్రార్థిస్తూ వచ్చినప్పటికీ, తీరా అది వచ్చిన తరువాత వారు దానిని గుర్తించి కూడా తిరస్కరించారు. అటువంటి తిరస్కారులపై అల్లాహ్ శాపం అవతరించుగాక! తమ హృదయాలను తృప్తిపరచటానికి వారు అనుసరించే మార్గం ఎంత నీచమైనది? అల్లాహ్ తన ఇష్టానుసారం తన దాసులలోని ఒకరిపై తన అనుగ్రహం అవతరింపచేశాడనే ద్వేషం వల్ల వారు అల్లాహ్ పంపిన ఆ ఉపదేశాలను తిరస్కరిస్తున్నారు. కనుక వారు ఆగ్రహంపై ఆగ్రహానికి గురి అయ్యారు. ఇటువంటి అవిశ్వాసులకు తీవ్రపరాభవంతో కూడుకున్న శిక్ష పడుతుంది.

**2. అల్ బఖర** 91 - 93 వారితో, ''అల్లాహ్ అవతరింపచేసిన దానిని విశ్వసించండి '' అని అన్నప్పుడు ''మా (ఇస్రాయీలు వంశం లోనివారి) వద్దకు వచ్చిన దానిని మాత్రమే మేము విశ్వసిస్తాము' అని అంటారు. తమ గ్రంథం

కానటువంటి ప్రతి దానినీ, అది సత్యమైనప్పటికీ, వారివద్ద పూర్వం నుండే ఉన్న దానిని అది ధ్రువీకరిస్తున్నప్పటికీ, వారు దానిని తిరస్కరిస్తారు. సరే , వారిని ఇలా అడుగు : ''మీ వద్దకు వచ్చిన దానినే మీరు మన్ఞపూర్వకంగా విశ్వసించే వారే అయితే , ఇంతకు పూర్వం (ఇస్రాయీలు వంశంలో పుట్టిన) అల్లాహ్ ప్రవక్తలను ఎందుకు హత్య చేస్తూ వచ్చారు ? ఎంత స్పష్టంగా ఉన్న సూచనలను మూసా మీ వద్దకు తీసుకు వచ్చాడు! అతను కొంచెం అటుపోగానే, మీరు ఆవు దూడను ఆరాధ్య దైవంగా చేసుకున్నారు. ఎంత దుర్మార్గులు మీరు! మేము తూర్ పర్వతాన్ని ఎత్తి మీపై నిలిపి మీతో చేయించిన ప్రమాణాన్ని కూడా గుర్తుకు తెచ్చుకోండి : ''మేము మీకు చేస్తున్న ఉపదేశాలను స్థిరంగా పాటించండి , జాగ్రత్తగా వినండి'' అని మేము నొక్కి చెప్పాము. మీ పూర్వీకులు , ''మేము విన్నాము, కాని శిరసావహించేది లేదు '' అని చెప్పారు. అసత్యారాధనవల్ల వారి హృదయాలు ఆవుదూడ మీది ప్రేమతో నిండిపోయాయి. (ముహమ్మద్!) వారితో ఇలా చెప్పు , ''మీరు విశ్వాసులే అయితే , ఈ చెడు చేష్టలను చెయ్యండి అని ఆదేశించే మీ ఈ విశ్వాసం చాలా విచిత్రమైనది.''

**2. అల్ బఖర** 94 - 96 ఇంకా వారిని ఇలా అడుగు : ''ఒకవేళ అల్లాహ్ వద్ద, పరలోక నివాసం మానవులందరికీ కాక కేవలం మీకు మాత్రమే ప్రత్యేకించబడితే, మీరు మీ ఈ అభిప్రాయంలో సత్యవంతులే అయితే మీరు మరణాన్ని తప్పక కోరాలి.'' - వారు ఎప్పటికీ మరణాన్ని కోరరు అనే విషయాన్ని నమ్ము. ఎందుకంటే , వారు స్వహస్తాలతో సంపాదించి అక్కడకు పంపినదాని కారణంగా (వారు అక్కడికి వెళ్లడానికి ఇష్టపడరు). ఈ దుర్మార్గుల మనస్తత్వం అల్లాహ్ కు బాగా తెలుసు. జీవితం పట్ల అందరికంటే ఎక్కువ వ్యామోహం వీరిలోనే ఉందనే విషయం నీవు గ్రహిస్తావు. ఈ విషయంలో వారు ముష్రిక్కులనే మించిపోయారు. వారిలోని ఒక్కొక్క వ్యక్తి ఏదో ఒక విధంగా వేయి సంవత్సరాలు బ్రతకాలని కోరుకుంటాడు. కాని దీర్ఘాయుర్దాయం వారిని శిక్ష నుండి ఎంతమాత్రం తప్పించలేదు. వారు ఏయే పనులు చేస్తున్నారో వాటిని అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు.

**2. అల్ బఖర** 97 - 98 ప్రవక్తా! వారితో ఇంకా ఇలా చెప్పు : ''జిబ్రీల్ పట్ల విరోధం ఉన్న ప్రతివాడూ ఈ యథార్థాన్ని గ్రహించాలి. అల్లాహ్ ఆజ్ఞతోనే అతను ఈ ఖురానును నీ హృదయ ఫలకంపై అవతరింపజేశాడు. పూర్వం వచ్చిన అన్ని గ్రంథాలనూ అది ధ్రువీకరిస్తుంది. అవి నిజమని బలపరుస్తుంది. విశ్వసించే వారికి అది హితోపదేశం సాఫల్యం సిద్ధిస్తుందని తెలిపే శుభవార్త. (జిబ్రీలు పట్ల వారికున్న విరోధానికి కారణం ఇదే అయితే , వారికి ఇలా తెలుపు) : అల్లాహ్ కు , ఆయన దూతలకు, ఆయన ప్రవక్తలకు, జిబ్రీలుకు, మికాయీలుకు ఎవరు శత్రువులో, అటువంటి అవిశ్వాసులకు అల్లాహ్ శత్రువు.''

**2. అల్ బఖర** 99 - 103 సత్యాన్ని స్పష్టంగా ప్రకటించే వాక్యాలను మేము నీపై అవతరింపజేశాము. అవిధేయులు తప్ప మరెవ్వరూ వాటిని తిరస్కరించరు. వారు ఏదైనా వాగ్దానం చేసినప్పుడల్లా , వారిలోని ఏదో ఒక వర్గం దానిని త్రోసిపుచ్చటం ఎల్లప్పుడూ జరుగుతూ రాలేదా ? అంతేకాదు, మన్ఞపూర్వకంగా విశ్వసించనివారు చాలామంది

వారిలో ఉన్నారు. వారివద్ద పూర్వం నుంచే ఉన్న దైవ గ్రంథాన్ని ధ్రువపరుస్తూ ఏ ప్రవక్త అయినా అల్లాహ్ తరఫు నుండి వచ్చినప్పుడు, గ్రంథ ప్రజలలోని ఒక వర్గం వారు అల్లాహ్ గ్రంథాన్ని , దానిని గురించి ఏమీ తెలియనివారుగా త్రోసిపుచ్చారు. సులైమాను రాజ్యం పేరు చెప్పి షైతానులు ప్రచారం చేసే విషయాలను వారు అనుసరించసాగారు. కాని వాస్తవంగా సులైమాను ఎన్నడూ అవిశ్వాసానికి ఒడిగట్టలేదు. అసలు అవిశ్వాసానికి పాల్పడిరది ప్రజలకు చేతబడిని బోధించే షైతానులే. వారు హారూత్ , మారూత్ అనే ఇద్దరు దైవదూతలపై బాబిలోనియాలో అవతరింపచేసిన దానివెంట పడ్డారు. ఎవడికైనా ఆ విద్యను నేర్పినప్పుడు ఆ దైవదూతలు స్పష్టంగా ఇలా హెచ్చరిక చేసేవారు : ''జాగ్రత్త! మేము కేవలం ఒక పరీక్ష మాత్రమే! అవిశ్వాసానికి గురికాకు. '' అయినప్పటికీ వారు భార్యాభర్తలను వేరుచేసే విద్యను ఆ దూతల వద్ద నేర్చుకునేవారు. అల్లాహ్ అనుమతి లేకుండా వారు ఈ విద్య ద్వారా ఎవరికీ ఏమాత్రం హాని కలిగించలేరనే విషయం సుస్పష్టం. కాని వారు నేర్చుకున్నది వారికి నష్టం కలిగించేదే కాని లాభం కలిగించేది ఎంతమాత్రం కాదు. ఈ విద్యను కొనేవారికి పరలోక సౌఖ్యాలలో ఏమాత్రం భాగం లేదనే విషయం వారికి బాగా తెలుసు. ఎంత తుచ్ఛమైన సొమ్ముకు బదులుగా వారు తమ ఆత్మలను అమ్ముకున్నారో వారికి తెలిస్తే ఎంత బాగుండేది! వారు విశ్వసించి , భయభక్తుల మార్గం అవలంబించి ఉన్నట్లయితే దానికి అల్లాహ్ వద్ద వారికి లభించి ఉండే ప్రతిఫలం ఎంతో శ్రేష్ఠమయినది. దీనిని వారు గ్రహిస్తే ఎంత బాగుండేది!

**2. అల్ బఖర** 104 - 105 విశ్వసించిన ప్రజలారా! 'రాయినా' అనకూడదు, 'ఉన్‌జుర్నా' అనండి. ప్రతి మాటను శ్రద్ధతో వినండి. ఈ అవిశ్వాసులు అత్యంత ఘోరమైన శిక్షకు అర్హులు. సత్య సందేశాన్ని తిరస్కరించినవారు గ్రంథ ప్రజలయినా లేక ముష్రిక్కులయినా వారికి మీపై మీ ప్రభువు తరఫు నుండి ఏ మేలూ అవతరించటం సుతరామూ ఇష్టం లేదు. కాని అల్లాహ్ తాను కోరిన వారిని తన కరుణ కొరకు ఎన్నుకుంటాడు. అల్లాహ్ అమితంగా అనుగ్రహించేవాడు.

**2. అల్ బఖర** 106 - 107 మేము మా ప్రవచనం ఒక దానిని రద్దు చేసినా లేక మరపింపచేసినా దాని స్థానంలో దానికంటే శ్రేష్ఠమైన దానిని లేక కనీసం దానితో సమానమైన దానిని తీసుకువస్తాము. అన్నింటిమీద అల్లాహ్ కు సర్వాధికారాలున్న విషయం మీకు తెలియదా ? భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపత్యం కేవలం అల్లాహ్ కే చెందుతుందని, ఆయన తప్ప మిమ్మల్ని సంరక్షించేవారు , మీకు సహాయం చేసేవారు మరెవ్వరూ లేరనే సంగతి మీకు తెలియదా?

**2. అల్ బఖర** 108 - 110 పూర్వం మూసాను అడిగిన ప్రశ్నలవంటి వాటినే మీరు మీ ప్రవక్తను అడుగుదామనుకుంటున్నారా? వాస్తవానికి విశ్వాస వైఖరిని అవిశ్వాస వైఖరిగా మార్చుకున్నవాడు సన్మార్గం తప్పుతాడు. గ్రంథ ప్రజలలోని పలువురు మిమ్మల్ని ఏదో ఒక విధంగా విశ్వాస మార్గం నుండి మరల్చి మళ్ళీ అవిశ్వాస మార్గం వైపునకు తీసుకుపోదామని కోరుతున్నారు. సత్యం వారికి సుస్పష్టం అయినప్పటికీ వారి ఈ

కోరికకు కారణం వారి మనస్సులలో ఉన్న అసూయ. అయితే అల్లాహ్ తన తీర్పును అమలుపరిచే వరకు మీరు సహించి వారిని క్షమించండి. మీరు నిశ్చింతగా ఉండండి. అల్లాహ్ కు అన్నింటి మీద సర్వాధికారాలు ఉన్నాయి. నమాజును స్థాపించండి. జకాత్ ఇవ్వండి. మీ భవిష్యత్తుకోసం మీరు చేసి ముందుగా పంపించే సత్కార్యాలను మీరు అల్లాహ్ వద్ద చూస్తారు. మీరు చేసేదంతా అల్లాహ్ దృష్టిలో ఉంది.

**2. అల్ బఖర** 111 - 112 ''యూదులు కాని వారెవ్వరూ లేక (క్రైస్తవుల ప్రకారం) క్రైస్తవులు కానివారెవ్వరూ స్వర్గంలో ప్రవేశించలేరు'' అని వారు ప్రకటిస్తారు. ఇవి వారి కాంక్షలు మాత్రమే. వారిని ఇలా అడుగు : ''మీరు అనేది సత్యమే అయితే, దానికి నిదర్శనాలేమిటో చూపండి.'' (అసలు మీలోగాని, మరెవ్వరిలోగానీ ఏ విధమైన ప్రత్యేకత లేదు). వాస్తవమేమిటంటే , ఎవరు తమను తాము అల్లాహ్ పట్ల విధేయతకు అంకితం చేసుకుని , ఆచరణలో సన్మార్గం అవలంబిస్తారో , దానికి వారు తమ ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం పొందుతారు. అటువంటి వారికి భయంకాని, దుఃఖం కాని కలిగే అవకాశం ఎంతమాత్రం లేదు.

**2. అల్ బఖర** 113 క్రైస్తవుల వద్ద (సత్యమనేది) ఏమీ లేదు అని యూదులు అంటారు. యూదుల వద్ద (సత్యమనేది) ఏమీలేదు అని క్రైస్తవులు అంటారు - కాని వారు ఉభయులూ చదివేది దైవ గ్రంథమే! గ్రంథ జ్ఞానం లేనివాళ్ళు కూడ ఇదేవిధంగా ప్రగల్భాలు పలుకుతారు. వీరందరిలో ఉన్న అభిప్రాయ భేదాలను గురించి నిశ్చయంగా అల్లాహ్ ప్రళయదినం నాడు తీర్పు చెపుతాడు.

**2. అల్ బఖర** 114 అల్లాహ్ ఆరాధనాలయాలలో ఆయన నామ సంస్మరణను నిషేధించి, వాటి వినాశానికి ఒడికట్టే వానికంటె పరమ దుర్మార్గుడెవడు ? అటువంటి వారు ఆ ఆరాధనాలయాలలో అడుగు పెట్టటానికి అర్హులు కారు. ఒకవేళ వారు వాటిలో ప్రవేశించినా , భయపడుతూ ప్రవేశించాలి. కాని వారికి ప్రపంచంలో తీవ్రపరాభవమూ , పరలోకంలో ఘోరశిక్షా తప్పవు.

**2. అల్ బఖర** 115 ప్రాక్పశ్చిమాలన్నీ అల్లాహ్వే. మీరు మీ ముఖాన్ని ఏ దిక్కుకు త్రిప్పినా, అక్కడ మీకు అల్లాహ్ సమ్ముఖం లభిస్తుంది. అల్లాహ్ అంతటా వ్యాపించి ఉన్నాడు. ఆయన అంతా తెలిసినవాడు.

**2. అల్ బఖర** 116 - 117 అల్లాహ్ ఒకరిని తన కుమారుడుగా చేసుకున్నాడు అని వారు అంటారు. కాని అల్లాహ్ ఆ విషయాలకు అతీతుడు. ఆయన అత్యంత పవిత్రుడు. అసలు యథార్థం ఏమిటంటే , భూమ్యాకాశాలలో ఉన్నవన్నీ ఆయన సొంతమే! అవన్నీ ఆయన యెడల విధేయతకు అంకితమైనవే! ఆయన ఆకాశాలకూ , భూమండలానికి సృష్టికర్త. తాను ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు , ఆయన దానిని కేవలం ''అయిపో'' అని ఆజ్ఞాపిస్తాడు. అది వెంటనే అయిపోతుంది.

**2. అల్ బఖర**    118 - 119 ''అల్లాహ్ స్వయంగా మాతో ఎందుకు మాట్లాడడు ? లేక ఏదన్నా సూచన మా వద్దకు ఎందుకు రాదు ?''  అని అజ్ఞానులు అడుగుతారు. వారికి పూర్వం వారు కూడా ఇవే ప్రశ్నలను అడిగేవారు. (సన్మార్గం తప్పిన) వారందరి మనస్తత్వాలూ ఒక్కటే. నమ్మేవారికి మేము మా సూచనలను స్పష్టం చేశాము. (దీనికంటే స్పష్టమైన సూచన మరొకటి ఏముంటుంది    ?)  సత్యజ్ఞానం ప్రసాదించి నిన్ను మేము శుభవార్త తెలిపేవానిగా,  హెచ్చరిక చేసేవానిగా పంపాము. నరకవాసం ఎన్నుకున్న వారిని గురించి నీవు ఎంతమాత్రం బాధ్యుడవు, జవాబుదారుడవు కావు.

**2. అల్ బఖర**  120 - 121 నీవు (ముహమ్మద్!) వారి విధానాన్ని అవలంబించనంతవరకు , యూదులు, క్రైస్తవులు నీవంటే సంతోషం వ్యక్తం చెయ్యరు. అల్లాహ్ చూపిన మార్గమే సరిఅయిన మార్గం అని నీవు వారికి స్పష్టం చెయ్యి. దివ్య జ్ఞానం నీ వద్దకు వచ్చిన పిపద కూడ , ఒకవేళ నీవు వారి కోరికలకు లొంగిపోతే , నిన్ను అల్లాహ్ పట్టునుండి రక్షించే మిత్రుడూ, సహాయుడూ ఎవడూ లేడు. మేము గ్రంథాన్ని ప్రసాదించిన వారు దానిని పఠించవలసిన విధంగా పఠిస్తారు. దానిని (ఖుర్ఆన్‌ను) వారు హృదయపూర్వకంగా విశ్వసిస్తారు. దాని యెడల తిరస్కారభావం చూపేవారే అసలు నష్టపడేవారు.

**2. అల్ బఖర**  122 - 123 ఇస్రాయీలు వంశీయులారా! నేను మీకు ప్రసాదించిన అనుగ్రహాన్ని జ్ఞాపకం చెయ్యండి. ప్రపంచంలోని అన్ని జాతుల కంటే , మిమ్మల్ని నేను ఒక అత్యుత్తమమైన జాతిగా ఆదరించాను. భయపడండి ఆ దినానికి - ఆనాడు ఎవరూ ఎవరికీ ఏమాత్రమూ ఉపయోగపడరు. ఎవరినుండీ పరిహారం స్వీకరించబడదు. ఏ సిఫారసూ ఎవరికీ లాభకరం కాదు. ఇంకా, ఈ అపరాధులకు ఎక్కడ నుండీ ఏ సహాయమూ లభించదు.

**2.  అల్ బఖర**      124 మరొక సందర్భాన్ని కూడ గుర్తుకు తెచ్చుకోండి. ఇబ్రాహీమ్‌ను అతని ప్రభువు కొన్ని విషయాలలో పరీక్షించాడు. వాటన్నిటిలో అతను పూర్తిగా నెగ్గాడు. అప్పుడు అతని ప్రభువు ఇలా అన్నాడు : ''నేను నిన్ను మానవులందరికీ నాయకునిగా చెయ్యబోతున్నాను.'' ఇబ్రాహీమ్ తన ప్రభువును ఇలా అడిగాడు : ''ఈ నీ వాగ్దానం నా సంతానానిక్కూడా వర్తిస్తుందా    ?''  అప్పుడు అల్లాహ్ ,  ''నా వాగ్దానం దుర్మార్గులైన వారికి వర్తించదు'' అని సమాధానం చెప్పాడు.

**2. అల్ బఖర**    125 ఈ గృహాన్ని (కాబా) మేము మానవులందరికీ కేంద్రంగానూ , శాంతి నిలయంగానూ చేశాము. ఇబ్రాహీము ఆరాధన కొరకు నిలబడిన ప్రదేశాన్ని శాశ్వతమైన నమాజు స్థలంగా చేసుకోవలసిందని ప్రజలను మేము ఆదేశించాము. ఇంకా నా ఈ గృహాన్ని  , దానికి ప్రదక్షిణం చేసేవారి కొరకు , దానిలో ఏతెకాఫ్ పాటించేవారి కొరకు,  రుకూ,  సజ్దాలు చేసేవారి కొరకు పరిశుద్ధంగా ఉంచవలసిందని ఇబ్రాహీమును     ,  ఇస్మాయీలును నిర్దేశించాను.

**2. అల్ బఖర** 126 ఆ తరువాత ఇబ్రాహీము అల్లాహ్ ను ఇలా అర్థించాడు : ''ప్రభూ! ఈ నగరాన్ని సుఖశాంతుల నగరం చెయ్యి. ఈ నగర వాసులలో అల్లాహ్ ను , పరలోకాన్నీ విశ్వసించేవారికి అన్ని రకాల పండ్లు , ఫలాలు ఆహారంగా ప్రసాదించు.'' అప్పుడు అతని ప్రభువు ఇలా జవాబు పలికాడు : ''విశ్వసించని వారికి కూడ ఇహలోకపు తాత్కాలిక జీవితావసరాలను ప్రసాదిస్తాను. కాని చివరకు వారిని నరకయాతన వైపునకు ఈడుస్తాను. అది అత్యంత దుర్భరమైన నివాస స్థలం.''

**2. అల్ బఖర** 127 - 129 ఇబ్రాహీము, ఇస్మాయీలు ఈ ఇంటి గోడలను ఎత్తేటప్పుడు ఈ విధంగా ప్రార్థించేవారు : ''ఓ మా ప్రభూ! మా ఈ సేవను నీవు దయతో స్వీకరించు. నీవు అందరి మొరలు ఆలకించేవాడవు. అన్నీ తెలిసిన వాడవు. ప్రభూ! మా ఇద్దరినీ నీకు విధేయులుగా చేసుకో. పూర్తిగా నీ విధేయతకే అంకితమయ్యే ఒక జాతిని మా సంతతి నుండి ఆవిర్భవింపచెయ్యి. నీ ఆరాధనా రీతులను మాకు తెలుపు. మా తప్పులను మన్నించు. నీవు అమితంగా క్షమించేవాడవు మరియు అనంతంగా కరుణించేవాడవు. ప్రభూ! నీ వాక్యాలు వారికి వినిపించి , నీ గ్రంథాన్నీ, దివ్య జ్ఞానాన్నీ వారికి బోధించి , వారి జీవితాలను తీర్చిదిద్దే ఒక ప్రవక్తను స్వయంగా వారి జాతి నుండే వారిలో పుట్టించు. నీవు సాటిలేని సర్వాధికారివి. అనుపమ ప్రజ్ఞాశాలివి.''

**2. అల్ బఖర** 130 - 133 ఇబ్రాహీము విధానాన్ని ఇక ద్వేషించేవాడెవడు - తనను తాను అజ్ఞానానికీ , అహంభావానికీ గురిచేసుకునేవాడు తప్ప. ప్రపంచంలో మా సేవ కొరకు మేము ఎన్నుకున్న వ్యక్తి ఇబ్రాహీము. పరలోకంలో అతను సజ్జనులతో పాటు ఉంటాడు. అతను ఎలాంటివాడంటే , ''ముస్లిమ్‌వు అయిపో'' అని అతని ప్రభువు అతనితో అన్నప్పుడు అతను వెంటనే, ''నేను విశ్వ ప్రభువు యొక్క 'ముస్లిమ్‌ను' అయిపోయాను'' అని జవాబు పలికాడు. ఇదే మార్గంలో నడవండి అని ఇబ్రాహీము తన సంతానానికి హితోపదేశం చేశాడు. ఈ ఉపదేశాన్నే యాఖూబ్ కూడా తన సంతానానికి చేశాడు : ''నా బిడ్డలారా! ఈ ధర్మాన్నే అల్లాహ్ మీ కొరకు ఎన్నిక చేశాడు. కనుక మీరు మరణించే వరకూ ముస్లిములుగానే ఉండండి. '' యాఖూబు మృత్యు దశలో ఉన్నప్పుడు మీరు అక్కడ ఉన్నారా? మరణించే ముందు అతను తన కుమారులను ఇలా అడిగాడు : ''బిడ్డలారా! నా తరువాత మీరు ఎవరిని ఆరాధిస్తారు ?'' వారంతా ఇలా సమాధానం చెప్పారు : ''మీరూ, మీ పెద్దలైన ఇబ్రాహీము , ఇస్మాయీలు, ఇస్‌హాఖ్ దేవుడుగా భావించిన ఆ ఏకైక దేవుణ్ణే మేమూ ఆరాధిస్తాము. మేము ఆయనకే ముస్లిములమై ఉంటాము.''

**2. అల్ బఖర** 134 వారంతా గతించిన ఒక సంఘం, వారు సంపాదించింది వారిది. మీరు సంపాదించేది మీది. వారు చేసినదాన్ని గురించి మిమ్మల్ని అడగటం జరగదు.

**2. అల్ బఖర** 135 - 136 ''యూదులుగా మారితేనే రుజుమార్గం లభిస్తుంది '' అని యూదులు అంటారు. ''క్రైస్తవులుగా మారితేనే ధర్మమార్గం పొందగలుగుతారు '' అని క్రైస్తవులు అంటారు. మీరు వారితో ఇలా అనండి :

''కాదు,  మేము అన్ని మార్గాలను విసర్జించి , ఒక్క ఇబ్రాహీము మార్గాన్నే అనుసరిస్తాము. ఇబ్రాహీము ముష్రిక్కులలోని వాడు కాదు. '' ముస్లిములారా! ఇలా ప్రకటించండి : ''మేమంతా అల్లాహ్ ను , ఆయన మా వైపునకు పంపిన హితోపదేశాన్నీ విశ్వసించాము. ఇంకా ఇబ్రాహీము , ఇస్మాయీలు, ఇస్హాఖు, యాఖూబు, యాఖూబు సంతానంపై అవతరించినదానినీ మూసాకూ, ఈసాకూ ఇతర ప్రవక్తలందరికీ వారి ప్రభువు ప్రసాదించిన దానినీ మేము విశ్వసించాము. వారిలో ఏ ఒక్కరిపట్లా మేము భేదభావం చూపము. మమ్మల్ని మేము ముస్లిములుగా అల్లాహ్ కు సమర్పించుకున్నాము.''

**2. అల్ బఖర** 137 మీరు విశ్వసించినట్లే వారూ విశ్వసిస్తే , అప్పుడు వారు ధర్మమార్గంలో ఉన్నట్లు. కాని , వారు ఒకవేళ దీనికి విముఖ్యం చూపితే , కేవలం వైషమ్యంతో మంకుపట్టు పడుతున్నారన్నది విశదము. కనుక వారి బారినుండి మిమ్మల్ని ఆదుకునేందుకు అల్లాహ్ చాలు. మీరు నిశ్చింతగా ఉండండి. ఆయన అన్నీ వింటాడు , ఆయనకు అన్నీ తెలుసు.

**2. అల్ బఖర** 138 వారితో ఇలా చెప్పండి : ''అల్లాహ్ రంగును స్వీకరించండి. అల్లాహ్ రంగు కంటె మరెవరి రంగు శ్రేష్ఠతరమైనది? మేము కేవలం ఆయననే ఆరాధిస్తాము.''

**2. అల్ బఖర** 139 - 141 ప్రవక్తా! వారితో ఇలా అను : ''అల్లాహ్ విషయంలో మీరు మాతో వాదులాడుతారా ? వాస్తవానికి ఆయనే మాకూ ప్రభువు , మీకూ ప్రభువు. మా కర్మలు మాకు , మీ కర్మలు మీకు. మేమయితే మా దాస్యాన్ని కేవలం అల్లాహ్ కే ప్రత్యేకం చేసుకున్నాము. లేకపోతే ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్హాఖు, యాఖూబు, యాఖూబ్ సంతానము - వీరంతా యూదులని లేక క్రైస్తవులని మీరు అంటారా ?'' ఇలా అడుగు : ''మీకు బాగా తెలుసా లేక అల్లాహ్కా?'' అల్లాహ్ అప్పగించిన సాక్ష్యాన్ని దాచే వ్యక్తికంటే పరమ దుర్మార్గుడు ఎవడు? మీ చేష్టలను అల్లాహ్ గమనించకుండా ఉండటం లేదు. వారంతా గతించిన ఒక సంఘం. వారి సంపాదన వారిది. మీ సంపాదన మీది. వారి కర్మలను గురించి మిమ్మల్ని ప్రశ్నించటం సంభవించదు.

**2. అల్ బఖర** 142 - 143 మూర్ఖజనులు ఇలా అంటారు : ''పూర్వం ఏ ఖిబ్లా వైపునకు తిరిగి వారు నమాజు చేసేవారో, దాని నుండి ఇంత అకస్మాత్తుగా మరలటానికి కారణం ?'' ప్రవక్తా! వారితో ఇలా అను : ''ప్రాక్పశ్చిమాలు అన్నీ అల్లాహ్వే. అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గం చూపుతాడు. '' ఈవిధంగా మేము మిమ్మల్ని ఒక ''మధ్యస్థ సమాజం''గా చేశాము. ఇకపై మీరు సమస్త మానవజాతికి సాక్షులుగా ఉంటారు. ప్రవక్త మీకు సాక్షిగా ఉంటాడు...

**2. అల్ బఖర** 143 .... ఎవరు ప్రవక్తను అనుసరిస్తారో, ఎవరు వెనుతిరిగి పోతారో పరీక్షించాలనే మేము పూర్వం మీరు మీ ముఖాన్ని ఏ దిక్కు వైపునకు తిప్పేవారో ఆ దిక్కునే మీ ఖిబ్లాగా నిర్ణయించాము. ఇది నిజంగా ఎంతో

కఠినమైన విషయం! కాని అల్లాహ్ సన్మార్గ భాగ్యం కలుగజేసిన వారికి ఇది ఏ మాత్రం కష్టతరం కాలేదు. ఈ మీ విశ్వాసాన్ని అల్లాహ్ ఏ మాత్రం వృధాకానివ్వడు. మానవుల పట్ల అల్లాహ్ కు ఎంతో కరుణ , వాత్సల్యం ఉన్నాయనే విషయాన్ని నిశ్చయంగా నమ్మండి.

**2. అల్ బఖర** 144 ప్రవక్తా! నీవు మాటిమాటికీ నీ ముఖాన్ని ఆకాశం వైపునకు ఎత్తటం మేము గమనిస్తూనే ఉన్నాము. ఇదిగో, నీకు అత్యంత ప్రీతికరమైన ఖిబ్లా వైపునకే ఇప్పుడు మేము నిన్ను త్రిప్పుతున్నాము. కాబట్టి నీవు ముఖాన్ని 'మస్జిదె హరామ్' వైపునకు త్రిప్పు. ఇకపై మీరెక్కడున్నాసరే , ముఖాన్ని ఆ వైపునకు పెట్టి నమాజు చెయ్యండి....

**2. అల్ బఖర** 144 - 147 .... (ఖిబ్లా మార్పునకు సంబంధించిన) ఈ ఆదేశాన్ని వారి ప్రభువే ఇచ్చాడనీ , అది సత్యం అనీ గ్రంథ ప్రజలకు బాగా తెలుసు. కాని ఇది తెలిసిన తరువాత కూడ , వారు ఏమి చేస్తున్నారో , దానిని అల్లాహ్ గమనించకుండా ఉండటం లేదు. గ్రంథ ప్రజలకు నీవు ఏ నిదర్శనం చూపినా , వారు నీ ఖిబ్లాను అనుసరించటం సంభవించదు. వారి ఖిబ్లాను అనుసరించటం నీకూ సాధ్యపడదు. వారిలోని ఏ వర్గం వారు కూడా మరొకరి ఖిబ్లాను అనుసరించటానికి తయారుగా లేరు. నీవు ఈ జ్ఞానం పొందిన తరువాత కూడ, ఒకవేళ నీవు వారి కోరికలను అనుసరిస్తే, నిశ్చయంగా దుర్మార్గులలో చేరిపోతావు. మేము ఎవరికి గ్రంథం ప్రసాదించామో , వారు తమ సంతానాన్ని ఏవిధంగా గుర్తిస్తారో అదేవిధంగా (ఖిబ్లాగా నిర్ణయింపబడిన) ఈ స్థలాన్ని గుర్తిస్తారు. కాని వారిలోని ఒక వర్గం బుద్ధిపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చుతోంది. నిస్సందేహంగా ఇది మీ ప్రభువు నుండి వచ్చిన సత్యం. కనుక దీని విషయంలో మీరు ఏమాత్రం సంశయంలో పడకండి.

**2. అల్ బఖర** 148 ప్రతి ఒక్కడికి ఒక దిక్కు ఉన్నది. దాని వైపునకు అతడు తిరుగుతాడు. కనుక మీరు మంచి పనులలో మిన్నగా ఉండటానికి ప్రయత్నించండి. మీరంతా ఎక్కడున్నాసరే అల్లాహ్ మిమ్మల్ని కనుగొంటాడు. ఆయన శక్తికి అతీతమైనది ఏదీ లేదు.

**2. అల్ బఖర** 149 - 152 మీరు ఏ ప్రాంతంలో ప్రయాణం చేసినా , మీ ముఖాన్ని (నమాజు సమయంలో) 'మస్జిదె హరామ్' వైపునకు త్రిప్పండి. ఎందుకంటే ఇది మీ ప్రభువు చేసిన న్యాయమైన నిర్ణయం. మీ కర్మలను అల్లాహ్ గమనించకుండా ఉండటం లేదు. మీరు ఏ ప్రదేశంలో ప్రయాణం చేసినా, మీ ముఖాన్ని 'మస్జిదె హరామ్' వైపునకే త్రిప్పండి. మీరు ఎక్కడున్నాసరే , దాని వైపునకే తిరిగి నమాజు చెయ్యండి. దీనివల్ల మీకు వ్యతిరేకంగా వాదించటానికి ప్రజలకు అవకాశం లభించదు - కాని వారిలో దుర్మార్గులైన వారి నోరు ఎట్టి పరిస్థితులలోనూ ఊరుకోదు. అందుకని వారికి భయపడకండి, నాకు భయపడండి. ఇంకా నేను మీపై నా అనుగ్రహాన్ని పూర్తిచేస్తాను. మీరు నా ఈ ఆజ్ఞాపాలన ద్వారా సాఫల్య మార్గం పొందే అవకాశం ఉంది. ఆ ప్రకారంగానే (ఈ విషయాల వల్ల మీకు సాఫల్య భాగ్యం కలిగింది.) మేము మీలో నుండే ఒకరిని ప్రవక్తగా మీ మధ్యకు పంపాము. అతను మీకు మా

వాక్యాలను వినిపిస్తాడు. మీ జీవితాలను తీర్చిదిద్దుతాడు. మీకు గ్రంథాన్నీ , దివ్య జ్ఞానాన్నీ బోధిస్తాడు. మీకు తెలియని ఎన్నో విషయాలు నేర్పుతాడు. కనుక మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోండి. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటాను. నాకు కృతజ్ఞతలు తెలుపండి. చేసిన మేలును మరువకండి.

**2. అల్ బఖర** 153 - 157 విశ్వాసులారా! సహనం ద్వారా , నమాజు ద్వారా సహాయం అర్థించండి. సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు. అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని 'మృతులు' అనకండి. వాస్తవానికి వారు సజీవులు. కాని మీరు వారి జీవితాన్ని గ్రహించలేరు. భయప్రమాదాలకు , ఆకలి బాధకు ధన , ప్రాణ, ఆదాయాల నష్టానికి గురిచేసి మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము. ఈ పరిస్థితులలో మన్నస్థైర్యంతో ఉండేవారు కష్టకాలం దాపురించినప్పుడు, ''మేమంతా అల్లాహ్ కే చెందినవారము. అల్లాహ్ వైపునకే మరలిపోవలసినవారము' అని అనేవారికి శుభవార్తలు తెలుపు. వారిపై వారి ప్రభువు తన అపూర్వ అనుగ్రహాలను కురిపిస్తాడు. ఆయన కారుణ్యచ్ఛాయలు వారికి ఆశ్రయమిస్తాయి. వారే సన్మార్గగాములు.

**2. అల్ బఖర** 158 సఫా మర్వాలు నిశ్చయంగా అల్లాహ్ యొక్క చిహ్నాలు. కనుక కాబా గృహానికి హజ్ కొరకు లేక 'ఉమ్రహ్ా' కొరకు పోయేవారు , ఈ రెండు కొండల మధ్య 'సయీ' చేస్తే, అది దోషం ఎంతమాత్రం కాదు. స్వచ్ఛందంగా, హృదయపూర్వకంగా ఎవరైనా ఏదైనా సత్కార్యం చేస్తే అది అల్లాహ్ కు తెలుస్తుంది. ఆయన దానిని ఆదరిస్తాడు.

**2. అల్ బఖర** 159 - 160 మేము అవతరింపచేసిన స్పష్టమైన జ్ఞానబోధలు , ధర్మోపదేశాలు వాస్తవానికి మానవులందరి మార్గదర్శకత్వం కోసం అని మేము మా గ్రంథంలో విశదం చేసిన తరువాత కూడా వాటిని దాచేవారిని అల్లాహ్ తప్పకుండా శపిస్తాడు , ఇంకా శపించే వారంతా వారిని శపిస్తారు. కాని ఎవరు పశ్చాత్తాపంతో తమ ఈ వైఖరిని మార్చుకుంటారో , తమ నడవడికను సంస్కరించుకుంటారో , తాము గోప్యంగా ఉంచుతూ వచ్చినదానిని ప్రకటిస్తారో, వారిని నేను క్షమిస్తాను. నేను అమితంగా మన్నించేవాణ్ణి అధికంగా కరుణించేవాణ్ణి.

**2. అల్ బఖర** 161 - 162 అవిశ్వాస వైఖరిని అవలంబించి, అవిశ్వాసులుగానే అసువులు బాసిన వారిని అల్లాహ్, ఆయన దూతలు , ఇంకా మానవులందరూ శపిస్తారు. ఆ శాపగ్రస్త స్థితిలోనే వారు సదా ఉంటారు. వారి శిక్షను తగ్గించటం కానీ, వారికి మళ్ళీ ఏ వ్యవధీ ఇవ్వటం కానీ సంభవించదు.

**2. అల్ బఖర** 163 - 167 మీ దేవుడు ఒక్కడే. ఆ కరుణామయుడు, ఆ కృపాకరుడు తప్ప మరొక దేవుడు లేడు. (ఈ సత్యం గ్రహించటానికి ఏవైనా గుర్తులు , తార్కాణాలు అవసరం అయితే) వివేకం ఉన్నవారికి భూమ్యాకాశాల నిర్మాణంలో, రేయింబవళ్ళు ఒకదాని వెంట ఒకటి చేసే నిరంతరమైన పయనంలో, ప్రజాబాహుళ్యానికి ఉపయోగపడే వస్తువులు మోసుకుంటూ నదులలో, సముద్రాలలో సంచరించే ఓడలలో, పైనుండి అల్లాహ్ కురిపించే వర్షపు నీటిలో

- తద్వారా ఆయన మృతభూమికి ప్రాణం పోస్తాడు. (ఈ ఏర్పాటు ద్వారా) భువిలో వివిధ ప్రాణులను వర్ధిల్లజేస్తాడు - వాయువుల సంచారంలో , భూమ్యాకాశాల మధ్య అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడివున్న మేఘమాలికలలో అసంఖ్యాకమైన సూచనలు కానవస్తాయి. కాని (అల్లాహ్ ఏకత్వాన్ని స్పష్టంగా, బహిరంగంగా చాటే ఇన్ని సూచనలు ఉన్నప్పటికీ) కొందరు అల్లాహ్ ను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా , ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాహ్పట్ల కలిగి వుండవలసిన ప్రేమతో వారిని ప్రేమిస్తారు - కాని విశ్వాసులు అన్నిటికంటె అధికంగా అల్లాహ్ని ప్రేమిస్తారు - సర్వశక్తులూ , సర్వాధికారాలూ అల్లాహ్ గుప్పెట్లో ఉన్నాయని , ఇంకా శిక్షించటంలో కూడా ఆయన చాలా కఠినుడు అనీ ఈ దుర్మార్గులకు , మున్ముందు ఘోరశిక్షను ప్రత్యక్షంగా చూసిన తరువాత బోధపడేబదులు , ఇప్పుడే బోధపడితే ఎంత బాగుంటుంది! అల్లాహ్ వారిని శిక్షించే సమయాన వారు ప్రపంచంలో ఏ నాయకుల , ఏ మార్గదర్శకుల అడుగు జాడలలో నడిచేవారో , ఆ నాయకులు, ఆ మార్గదర్శకులు తమ అనుచరులతో , ఏమాత్రం సంబంధం లేని విధంగా ప్రవర్తిస్తారు. కాని వారికి శిక్షమాత్రం తప్పదు. ఇంకా వారి సకల సాధనా సంపత్తుల పరంపర తెగిపోతుంది. అప్పుడు అనుచరులు ఇలా అంటారు: ''మాకు (ప్రపంచానికి మళ్ళీ తిరిగిపోయే) మరొక అవకాశం లభిస్తే , వారు ఈ రోజు మమ్మల్ని త్యజిస్తున్న విధంగానే మేమూ వారిని అప్పుడు త్యజిస్తాము.''ఈవిధంగా ప్రపచంలో వారు చేసిన కర్మలను అల్లాహ్ వారిముందు ఉంచుతాడు. వారు అప్పుడు నిస్పృహతో, తీవ్ర అవమాన భారంతో క్రుంగిపోతారు. అయినప్పటికీ నరకాగ్ని నుండి బయటపడటం వారికి సాధ్యపడదు.

**2. అల్ బఖర** 168 - 169 ప్రజలారా! భూమిలోని ధర్మసమ్మతమైన, పరిశుభ్రమైన వాటినన్నింటినీ మీరు తినండి. షైతాను చూపే మార్గాలను తొక్కకండి. వాడు మీకు బహిరంగ శత్రువు. దుర్మార్గాన్నీ , అశ్లీలాన్నీ చెయ్యండి అని వాడు మిమ్మల్ని ఆజ్ఞాపిస్తాడు. ఏ విషయాలను గురించి అయితే (అల్లాహ్ చెప్పినట్లు) మీకు తెలియదో ఆ విషయాలను అల్లాహ్ పేరుతో చెప్పండి అని మిమ్మల్ని ప్రేరేపిస్తాడు.

**2. అల్ బఖర** 170 - 171 ''అల్లాహ్ అవతరింపచేసిన ఆదేశాలను అనుసరించండి'' అని వారితో అన్నప్పుడు, వారు ''మా పూర్వీకులు అవలంబిస్తూ ఉండగా చూచిన పద్ధతినే మేము అనుసరిస్తాము '' అని సమాధానం చెబుతారు. వారి పూర్వీకులు జ్ఞానం లేని వారైనప్పటికీ , సన్మార్గం పొందనివారైనప్పటికీ, వారు వారినే అనుసరిస్తూ పోతారా? అల్లాహ్ చూపిన మార్గాన్ని తిరస్కరించేవారి పోలిక ఇలా ఉంది: పశువుల కాపరి పశువులను కేకవేస్తాడు. కాని అవి ఆ కేకల , అరుపుల ధ్వనిని తప్ప దేనినీ వినలేవు. వారు చెవిటివారు , మూగవారు, గ్రుడ్డివారు. అందుకని ఏ విషయమూ వారి బుర్రకెక్కదు.

**2. అల్ బఖర** 172 - 173 విశ్వసించిన ప్రజలారా! నిజంగానే మీరు అల్లాహ్ ఆరాధకులు అయితే , మేము మీకు ప్రసాదించిన పరిశుభ్రమైన వస్తువులను నిస్సంకోచంగా తినండి. అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపండి. అల్లాహ్

నిషేధించినవి ఏమన్నా ఉంటే అవి ఇవి మాత్రమే : మరణించిన వాటిని తినకండి. రక్తాన్ని , పందిమాంసాన్ని ముట్టకండి. ఇంకా అల్లాహ్ కు కాక ఇతరులకు సమర్పించబడిన దానిని తినకండి. కాని ఎవరైనా గత్యంతరం లేక వాటిలోని ఏ పదార్థాన్నయినా తింటే అది పాపం కాదు. అయితే నిషేధాజ్ఞను ఉల్లంఘించే ఉద్దేశ్యం ఉండకూడదు. ఇంకా అవసరానికి మించి తినకూడదు. అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూను.

**2. అల్ బఖర** 174 - 176 వాస్తవమేమిటంటే, అల్లాహ్ తన గ్రంథంలో ప్రవచించిన ఆజ్ఞలను దాచేవారూ , వాటిని స్వల్ప ప్రాపంచిక ప్రయోజనాల కొరకు విక్రయించేవారూ , నిశ్చయంగా తమ ఉదరాలను అగ్నితో నింపుకుంటున్నారు. ప్రళయదినంనాడు అల్లాహ్ వారిని ఏమాత్రం పలుకరించడు. పవిత్రులుగా పరిగణించడు. వారికి వ్యధాభరితమైన శిక్ష కలదు. సన్మార్గానికి బదులు వక్రమార్గాన్నీ , క్షమాభిక్షకు బదులు ఘోరశిక్షనూ కొనుక్కున్న వారు వీరు. ఎంత ధైర్యం వీరికి, నరక శిక్షను సైతం భరించటానికి సిద్ధంగా ఉన్నారు! ఇదంతా ఎందుకు సంభవించిందంటే అల్లాహ్ సత్యంతో కూడుకున్న గ్రంథాన్ని అవతరింపచేశాడు , కాని ఈ గ్రంథంలో విభేదాలు కల్పించినవారు తమ తగాదాలలో పడి అసలు సత్యం నుండే చాలా దూరం వెళ్ళిపోయారు.

**2. అల్ బఖర** 177 సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్ ను అంతిమ దినాన్నీ , దూతలనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించటం. ఇంకా అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడేధనాన్ని బంధువుల కొరకూ, అనాధుల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ, సహాయం చెయ్యండి అని అర్థించేవారి కొరకూ , ఖైదీలను విడుదల చెయ్యటానికి వ్యయ పరచటం. ఇంకా నమాజును స్థాపించటం , జకాత్ ఇవ్వటం, వాగ్దానం చేస్తే దానిని పాలించేవారూ , కష్టకాలంలో, లేమిలో, సత్యానికీ అసత్యానికీ మధ్య జరిగే పోరాటంలో స్థైర్యం చూపేవారూ సత్పురుషులు. వాస్తవంగా సత్యసంధులు, అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వీరే.

**2. అల్ బఖర** 178 - 179 విశ్వసించిన ప్రజలారా! హత్యా వ్యవహారాలలో మీ కొరకు ప్రతీకార న్యాయం నిర్ణయించబడిరది. హత్యచేసిన వ్యక్తి స్వతంత్రుడయితే , ఆ స్వతంత్రుణ్ణే శిక్షించాలి. బానిస అయితే ఆ బానిసనే వధించాలి. స్త్రీ అయితే ఆ స్త్రీనే చంపాలి. ఒకవేళ హతుని సోదరుడు హంతకుణ్ణి కనికరించదలిస్తే , న్యాయ సమ్మతంగా రక్తశుల్క నిర్ణయం జరగాలి. హంతకుడు రక్తధనాన్ని ఉత్తమ రీతిలో అతనికి చెల్లించాలి. ఇది మీ ప్రభువు నుండి మీకు లభించే సౌకర్యం , కారుణ్యం. దీని తరువాత కూడ ఈ హద్దులను అతిక్రమించేవారు ఘోరశిక్షకు గురిఅవుతారు. బుద్ధిజ్ఞానం కల ఓ మానవులారా! ఈ ప్రతీకార న్యాయం మీ సమాజానికి ఊపిరి. ఈ శాసనోల్లంఘునానికి మీరు దూరంగా ఉంటారని ఆశించబడుతోంది.

**2. అల్ బఖర** 180 - 182 మీలో ఎవరికైనా మరణకాలం సమీపించినప్పుడు, వారు ఆస్తిపాస్తులు కలవారైతే, తమ తల్లిదండ్రులకు, బంధువులకు న్యాయసమ్మతంగా పంచిపెడుతూ మరణ శాసనం విధిగా వ్రాయాలి. ఇది అల్లాహ్

పట్ల భయభక్తులు కలవారి విధ్యుక్త ధర్మం. ఇంకా , మరణ శాసనం విన్నవారు, తరువాత ఒకవేళ దాన్ని మార్చితే, దాని పాపమంతా ఆ మార్చిన వారిదే. అల్లాహ్ అంతా వింటాడు. ఆయనకు అన్నీ తెలుసు. కాని మరణ శాసనం చేసిన వ్యక్తి, తెలియకపోవటంవల్లనో లేక బుద్ధిపూర్వకంగానో అన్యాయం చేశాడనే అనుమానం ఎవరికైనా కలిగితే , వారు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వారందరి మధ్య రాజీ కుదిరిస్తే , అందులో ఏమాత్రం దోషం లేదు. అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూను.

**2. అల్ బఖర** 183 - 184 విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడిరది - ఏవిధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి కూడ విధించబడిరదో. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది. ఈ ఉపవాసం కొన్ని దినాల వరకే. కాని మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులయితే లేక ప్రయాణంలో ఉంటే వేరే దినాలలో ఆ ఉపవాస దినాలను పూర్తిచెయ్యాలి. ఉపవాసం ఉండే శక్తి కలవారు (ఒకవేళ దానిని పాటించకపోతే) పరిహారం చెల్లించాలి. ఒక ఉపవాస దినానికి పరిహారం ఒక పేదవానికి భోజనం పెట్టడం. కాని ఎవరైనా సహృదయంతో ఇంకా ఎక్కువ పుణ్యం చేస్తే, అది వారికే మేలు. అయితే మీరు విషయాన్ని గ్రహించగలిగితే , ఉపవాసం ఉండటమే మీకు ఉత్తమం.

**2. అల్ బఖర** 185 పవిత్ర ఖురాను అవతరించిన నెల రమజాను నెల. మానవులందరికీ (ఆ గ్రంథం) మార్గదర్శకం. రుజుమార్గం చూపే , సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి. కనుక ఇక నుండి రమజాను నెలను పొందే వ్యక్తి ఆ నెల అంతా విధిగా ఉపవాసం ఉండాలి. కాని వ్యాధిగ్రస్తులైనవారు లేదా ప్రయాణంలో ఉన్నవారు , ఆ ఉపవాస దినాలను వేరే దినాలలో పూర్తిచెయ్యాలి. అల్లాహ్ మీకు సౌలభ్యం కలుగజెయ్యాలనే అభిలషిస్తాడు. మిమ్మల్ని కష్టపెట్టాలనే తలంపు ఆయనకు లేదు. కనుక మీరు ఉపవాస దినాల సంఖ్యను పూర్తిచెయ్యగలగటానికీ , అల్లాహ్ మీకు ప్రసాదించిన మహోపదేశానికి మీరు అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడటానికీ, ఆయనకు మీరు కృతజ్ఞతలు తెలుపుకోవటానికి ఈ పద్ధతి తెలుపబడుతోంది.

**2. అల్ బఖర** 186 నా దాసులు నన్ను గురించి నిన్ను అడిగితే , నేను వారికి అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును వింటాను , సమాధానం పలుకుతాను అనీ , ఓ ప్రవక్తా నీవు వారికి తెలుపు. కనుక వారు నా సందేశం విని దానిని స్వీకరించాలి. నన్ను విశ్వసించాలి. (ఈ విషయం నీవు వారికి వినిపించు) వారు రుజుమార్గం పొందే అవకాశం ఉంది.

**2. అల్ బఖర** 187 ఉపవాసకాలంలో రాత్రి సమయాలలో మీరు మీ భార్యల వద్దకు పోవడం మీకకొరకు ధర్మ సమ్మతం చెయ్యబడిరది. వారు మీకు దుస్తులు , మీరు వారికి దుస్తులు , మీరు రహస్యంగా ఆత్మద్రోహానికి పాల్పడుతున్నారనే విషయం అల్లాహ్ కు తెలిసిపోయింది. అయినప్పటికీ ఆయన మీ అపరాధాన్ని క్షమించాడు , మిమ్మల్ని మన్నించాడు. ఇకనుండి మీరు మీ భార్యలతో సంభోగం చేయవచ్చు. అల్లాహ్ మీ కొరకు ధర్మసమ్మతం

చేసిన సుఖానుభవాన్ని పొందండి. ఇంకా రాత్రి నలుపు రేఖల నుండి ఉషోదయపు ధవళ రేఖలు ప్రస్ఫుటమయ్యేవరకు, మీరు తినండి, త్రాగండి. ఆ తరువాత వీటన్నింటినీ త్యజించి చీకటి పడేవరకు మీ ఉపవాసం పూర్తి చెయ్యండి. కాని మసీదులలో 'ఏతెకాఫ్' పాటించేటప్పుడు మీరు మీ భార్యలతో సంభోగించకండి. ఇవి అల్లాహ్ ఏర్పరచిన హద్దులు. వీటి దరిదాపులకు కూడ పోకండి. ఈ విధంగా అల్లాహ్ తన ఆజ్ఞలను ప్రజలకు స్పష్టం చేస్తాడు. తప్పుడు మార్గాల నుండి వారు తమను తాము రక్షించుకుంటారని ఆశించబడుతోంది.

**2. అల్ బఖర** 188 మీలో మీరు ఒకరి ఆస్తిని మరొకరు అన్యాయంగా కబళించకండి. బుద్ధిపూర్వకంగా , అక్రమమైనరీతిలో ఇతరుల ఆస్తిలో కొంత భాగం కాజేసే అవకాశం లభిస్తుందేమో అనే దురుద్దేశ్యంతో దానిని న్యాయనిర్ణేతల వద్దకు తీసుకునిపోకండి.

**2. అల్ బఖర** 189 ప్రవక్తా! తరిగే పెరిగే చంద్రుని రూపాలను గురించి ప్రజలు నిన్ను అడుగుతుంటారు. నీవు వారికి ఇలా తెలుపు : ''తేదీల లెక్కకూ, హజ్ కాల నిర్ణయానికీ అవి గుర్తులు.'' ఇంకా వారికి ఇలా చెప్పు: ''మీరు మీ ఇళ్ళల్లోకి వాటి వెనుక భాగం నుండి ప్రవేశించటం సత్కార్యం ఎంతమాత్రం కాదు. దైవాగ్రహానికి దూరంగా ఉండటమే అసలు నిజమైన సత్కార్యం. కనుక మీరు వాకిళ్ళ నుండే ఇళ్ళల్లోకి ప్రవేశించండి. అయితే అల్లాహ్ కు భయపడుతూ ఉండండి. బహుశా మీకు వాస్తవమైన సాఫల్యభాగ్యం కలుగవచ్చు.''

**2. అల్ బఖర** 190 - 192 మీతో పోరాడేవారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించ కండి. హద్దులు అతిక్రమించే వారిని అల్లాహ్ ప్రేమించడు. మీకు వారు ఎక్కడ ఎదురైనా , మీరు వారితో పోరాడండి. మిమ్మల్ని వారు ఎక్కడనుండి పారద్రోలారో , అక్కడి నుండి మీరూ వారిని పార ద్రోలండి. చంపటం చెడ్డదే. కాని , 'ఫిత్నా' (పీడన) అంతకంటే చెడ్డది. 'మస్జిదె హరామ్' వద్ద వారు మీతో యుద్ధం చెయ్యనంత వరకు , మీరూ వారితో యుద్ధం చెయ్యకండి. కాని వారే అక్కడ కయ్యానికి కాలుదువ్వితే , మీరు వారిని చంపటానికి వెనుదీయకండి. అవిశ్వాసులకు ఇదే తగిన శిక్ష. వారు యుద్ధం చెయ్యటం మానుకుంటే (మీరూ మానండి) అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూ అనే విషయం తెలుసుకోండి.

**2. అల్ బఖర** 193 పీడన (ఫిత్నా ) అంతమయ్యేవరకు , దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మానుకుంటే దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు.

**2. అల్ బఖర** 194 నిషిద్ధ మాసానికి బదులు నిషిద్ధమాసమే. నిషేధాలన్నింటినీ అందరూ సమానంగా గౌరవించవలసినదే. కనుక మీపై ఎవరన్నా దాడిచేస్తే , మీరూ వారిపై అదేవిధంగా దాడిచెయ్యండి. అయితే అల్లాహ్ కు భయపడుతూ ఉండండి. అల్లాహ్ ఏర్పరచిన హద్దులను అతిక్రమించకుండా ఉండేవారితోనే అల్లాహ్ ఉంటాడు అనే విషయం తెలుసుకోండి.

**2. అల్ బఖర** 195 అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టండి. చేతులారా మిమ్మల్ని మీరు వినాశంపాలు చేసుకోకండి. మేలు చెయ్యండి. మేలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.

**2. అల్ బఖర** 196 'హజ్'ను, 'ఉమ్రహ్'ను అల్లాహ్ సంతోషం కోసం చెయ్యాలని సంకల్పించుకుంటే , దానిని నెరవేర్చండి. మార్గమధ్యంలో చిక్కుకుంటే మీరు ఇవ్వగలిగిన ఖుర్బానీని అల్లాహ్ కు సమర్పించండి. ఖుర్బానీ తన స్థానం చేరనంతవరకు మీరు శిరోముండనం చేయించుకోకండి. కాని మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులై లేదా తల బాధకులోనై (ఖుర్బానీ తన స్థానానికి చేరక మునుపే) శిరోముండనం చేయించుకుంటే దానికి పరిహారంగా ఉపవాసం ఉండాలి లేక దానధర్మాలు చెయ్యాలి లేక ఖుర్బానీ ఇవ్వాలి. తరువాత శాంతిభద్రతలు నెలకొన్నట్లయితే (మీరు హజ్‌కు ముందే మక్కా చేరుకున్నట్లయితే) ఈ అవకాశం వినియోగించుకుంటూ హజ్ కాలం వచ్చేవరకు మీలో ఎవరైనా 'ఉమ్రహ్' చేసినట్లయితే, వారు తమ శక్తికి తగినవిధంగా 'ఖుర్బానీ' ఇవ్వాలి. ఖుర్బానీ ఇవ్వలేకపోతే, హజ్ కాలంలో మూడు ఉపవాసాలు , ఇంటికి తిరిగి వచ్చిన పిదప ఏడు ఉపవాసాలు , ఈ విధంగా మొత్తం పది ఉపవాసాలు ఉండాలి. 'మస్జిదె హరామ్ 'కు సమీపంలో ఇల్లూ వాకిలీ లేని వారికే ఈ సౌకర్యం వర్తిస్తుంది. అల్లాహ్ ఇచ్చే ఈ ఆజ్ఞలను మీరు ఉల్లంఘించకండి. అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడని మీరు స్పష్టంగా తెలుసుకోండి.

**2. అల్ బఖర** 197 203 హజ్ మాసాలు అందరికీ తెలిసినవే. ఈ నిర్ణీత మాసాలలో హజ్ చేసే సంకల్పం ఉన్న వ్యక్తి అప్రమత్తుడై మెలగాలి. హజ్ సమయంలో అతడు కామచేష్టలకూ దుష్కార్యాలకూ , ఘర్షణలకూ దూరంగా ఉండాలి. మీరు చేసే ఏ పుణ్య కార్యమైనా అది అల్లాహ్ కు తెలుస్తుంది. హజ్ యాత్రకు ప్రయాణ సామగ్రిని తీసుకువెళ్ళండి. భయభక్తులు అన్నిటికంటే ఉత్తమమైన సామగ్రి. కనుక వివేకవంతులారా! నాకు అవిధేయత చూపకండి. హజ్ యాత్రతో పాటు మీరు అల్లాహ్ అనుగ్రహం అన్వేషిస్తే అందులో దోషం లేదు. 'అరఫాత్' నుండి బయలుదేరి, 'మష్అరె హరామ్' (ముజ్‌దల్ఫ) వద్ద ఆగి అల్లాహ్ ను స్మరించండి. అల్లాహ్ మీకు బోధించిన విధంగా ఆయనను స్మరించండి. వాస్తవానికి మీరు పూర్వం మార్గం తప్పి నడిచేవారు. తరువాత ప్రజలంతా ఏ స్థలం నుండి వెనుకకు మరలుతారో, అదే స్థలం నుండి మీరూ మరలండి. క్షమించు అని అల్లాహ్ ను వేడుకోండి. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడూ , కరుణించేవాడూను. మీ హజ్ విధులను ముగించిన తరువాత , మీరు మీ తాత ముత్తాతలను పూర్వం స్మరించే విధంగానే ఇంకా దానికంటే అధికంగానే అల్లాహ్ ను స్మరించండి. (కాని అల్లాహ్ ను స్మరించేవారిలో కూడా ఎంతో వ్యత్యాసం ఉంది). వారిలో కొందరు , ''మా ప్రభూ! మాకు ఈ లోకంలోనే అన్నీ ప్రసాదించు'' అని ప్రార్థిస్తారు. అలాంటివారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. ఇంకా కొందరు ఈవిధంగా ప్రార్థిస్తారు : ''మా ప్రభూ! ఇహలోకంలోనూ , పరలోకంలోనూ మాకు మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరకబాధ నుండి కాపాడు.'' ఇలాంటి వారు తమ సంపాదనకు అనుగుణంగా ఉభయ లోకాలలో తమ వాటాను పొందుతారు. లెక్క తేల్చటం అల్లాహ్ కు ఎంతోసేపు పట్టదు. మీరు అల్లాహ్ నామ సంస్మరణలో గడుపవలసిన రోజులు లెక్కకు కొన్ని

మాత్రమే. త్వరగా రెండు రోజులలోనే ఇక్కడ నుండి తిరిగి వెళ్ళితే , అది ఏమాత్రం దోషం కాదు. ఎవరైనా ఇంకా కొంతకాలం ఉండి తిరిగివెళ్ళినా తప్పులేదు. అయితే ఆ దినాలను అతడు భయభక్తులతో గడపాలి. అల్లాహ్పట్ల అవిధేయతకు దూరంగా ఉండండి. ఒకరోజు మీరంతా ఆయన సన్నిధిలో హాజరు కావలసి ఉంది అని బాగా తెలుసుకోండి.

**2. అల్ బఖర** 204 - 210 మానవుల్లోని ఒకడు చెప్పేమాటలు ఇహలోక జీవితంలో నిన్ను ఎంతో రంజింపచేస్తాయి. తన సంకల్పశుద్ధిని గురించి తెలుపడానికి అతడు అల్లాహ్ ను మాటిమాటికి సాక్షిగా నిలబెడతాడు. కాని వాస్తవంగా అతడు సత్యానికి బద్ధవిరోధి. అతడికి అధికారం లభించినప్పుడు అతడు లోకంలో కల్లోల వ్యాప్తికి, పంట పొలాల విధ్వంసానికీ, మానవ సంతతి వినాశానికీ నిత్యం కృషి చేస్తాడు - (అతడు సాక్షిగా నిలబెట్టే) అల్లాహ్ కల్లోలాన్ని ఏమాత్రం సహించడు. "అల్లాహ్ కు భయపడు " అని అతడితో అన్నప్పుడు , అహంభావం అతడిని పాపానికే అంటుకుపోయేలా చేస్తుంది. అలాంటి వాడికి తగిన స్థలం నరకమే. అది అతి చెడ్డ నివాసం. మరో వైపు మానవుల్లోనే మరొకడు అల్లాహ్ సంతోషం పొందటానికే తన పూర్తి జీవితాన్ని అంకితం చేస్తాడు. అల్లాహ్ అటువంటి తన దాసుణ్ణి అమితంగా ప్రేమిస్తాడు. విశ్వసించిన ప్రజలారా! మీరు పూర్తిగా ఇస్లామ్‌లో ప్రవేశించండి. షైతాను అడుగుజాడలు త్రొక్కకండి. అతడు మీకు బహిరంగ శత్రువు. మీ వద్దకు వచ్చిన స్పష్టమైన హితోపదేశాలను మీరు స్వీకరించిన తరువాత మళ్ళీ తప్పటడుగువేస్తే, అల్లాహ్ సర్వశక్తిమంతుడూ సర్వజ్ఞుడూ అనే విషయం బాగా తెలుసుకోండి. (ఇన్ని హితోపదేశాల తరువాత కూడా ప్రజలు తమను తాము సరిదిద్దుకోకపోతే) మేఘాల షామియానాలలో దూతలు వెంటరాగా, అల్లాహ్ వారి ముందు స్వయంగా ప్రత్యక్షమై వారిని గురించి తీర్పు చెప్పే సమయం కోసం వారు నిరీక్షిస్తున్నారని దాని అర్థమా ? చివరకు అన్ని వ్యవహారాలూ అల్లాహ్ ముందే పెట్టబడతాయి.

**2. అల్ బఖర** 211 మేము ఎన్ని స్పష్టమైన గుర్తులు వారికి చూపించామో ఇస్రాయీలు వంశీయులను అడగండి. ఇంకా, అల్లాహ్ అనుగ్రహ భాగ్యం కలిగిన తరువాత దాన్ని దౌర్భాగ్యంగా మార్చుకునే జాతిని అల్లాహ్ ఎంత కఠినంగా శిక్షిస్తాడో (కూడా వారిని అడగండి).

**2. అల్ బఖర** 12 అవిశ్వాస వైఖరిని అవలంబించిన వారికి ఇహలోక జీవితం ప్రియమైనదిగానూ మనోహరమైనది గానూ కనిపించేలా చేయబడిరది. వారు విశ్వాస వైఖరి అవలంబించిన వారిని పరిహసిస్తారు. కాని ప్రళయదినం నాడు భయభక్తులు కలవారే వారి కంటె ఉన్నత స్థానంలో ఉంటారు. ఇక ఐహిక సంపదనైతే , తాను కోరిన వారికి లెక్కలేకుండా ఇచ్చే అధికారం అల్లాహ్ కే ఉంది.

**2. అల్ బఖర** 213 ప్రారంభంలో మానవులంతా ఒకే మార్గం అనుసరించారు. (కాని తరువాత పరిస్థితులు మారాయి. అభిప్రాయభేదాలు ఉత్పన్నమయ్యాయి). అప్పుడు అల్లాహ్ ప్రవక్తలను పంపాడు. వారు సత్యమార్గంలో

నడిచేవారికి శుభవార్తలు తెలిపేవారు. వక్రమార్గం అనుసరిస్తే దుష్ఫలితాలు కలుగుతాయని హెచ్చరిక చేసేవారు. సత్యం గురించి ప్రజలలో పొడచూపిన విభేదాలు పరిష్కరించటానికి వారితోపాటు పరమ సత్యం వున్న గ్రంథాన్ని కూడ పంపాడు - (ఈ అభిప్రాయ భేదాలు తల ఎత్తటానికి కారణం ప్రారంభంలో ప్రజలకు సత్యం తెలుపబడకపోవటం ఎంతమాత్రం కాదు) ఈ విభేదాలను సృష్టించినవారు సత్యజ్ఞానం ప్రసాదించబడ్డవారే. స్పష్టమైన హితోపదేశాలు పొందిన తరువాత కూడ వారు కేవలం ఒకరికొకరు అన్యాయం చేసుకునే ఉద్దేశ్యంతో అసలు సత్యాన్ని వదలి విభిన్న పద్ధతులను సృష్టించుకున్నారు - అయితే ప్రవక్తలను విశ్వసించిన వారికి అల్లాహ్ తన అనుమతితో ప్రజలు వివాదపడిన సత్యాన్ని పొందేమార్గం చూపాడు. అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గం చూపుతాడు.

**2. అల్ బఖర** 214 స్వర్గ ప్రవేశం ఊరకే లభిస్తుందని మీరు అపోహపడుతున్నారా ? మీకు పూర్వం విశ్వాసులకు సంభవించినవన్నీ ఇంకా మీకు సంభవించనేలేదే! వారిపై ఆపదలు , ఎనలేని వ్యధలు విరుచుకుపడ్డాయి , వారు కుదిపివేయబడ్డారు. చివరకు అప్పటి ప్రవక్త , విశ్వాసులైన అతని అనుచరులు ''అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుంది'' అని ఆక్రోశించారు. అప్పుడు , ''అదిగో, అల్లాహ్ సహాయం సమీపంలోనే ఉంది '' (అని వారిని ఓదార్చటం జరిగింది).

**2. అల్ బఖర** 215 ''మేము ఏమి ఖర్చు చెయ్యాలి'' అని ప్రజలు అడుగుతారు. ''మీరు ఏమి ఖర్చుచేసినా దానిని మీ తల్లిదండ్రుల కొరకూ, బంధువుల కొరకూ, అనాధులు, నిరుపేదలు, బాటసారుల కొరకూ ఖర్చు చెయ్యండి. మీరు ఏ మేలుచేసినా, దాన్ని అల్లాహ్ తెలుసుకుంటాడు'' అని వారికి చెప్పండి.

**2. అల్ బఖర** 216 యుద్ధం చెయ్యండి అని మీకు ఆజ్ఞాపించబడిరది. కాని అది మీకు ఇష్టంగా లేదు. మీకు నచ్చని విషయమే మీకు లాభకరం కావచ్చు మీకు నచ్చే విషయమే మీకు నష్టకరం కావచ్చు. ఈ విషయం అల్లాహ్ కు తెలుసు. మీకు తెలియదు.

**2. అల్ బఖర** 217 - 218 నిషిద్ధ మాసంలో యుద్ధం చెయ్యటాన్ని గురించి ప్రజలు నిన్ను అడుగుతారు. వారికి ఇలా సమాధానం చెప్పు : ''ఆ మాసంలో యుద్ధం చెయ్యటం మహా నేరమే. కాని అల్లాహ్ మార్గంలో అవరోధాలు కల్పించటం, అల్లాహ్ ను తిరస్కరించటం , అల్లాహ్ ఆరాధకులను 'మస్జిదె హరామ్ 'ను దర్శించకుండా ఆటంకపరచటం, అందులో ఉండే వారిని బయటికి గెంటివెయ్యటం అల్లాహ్ దృష్టిలో అంతకంటే గొప్ప నేరం. ఇంకా , హింస ద్వారా పరధర్మాన్ని అణచటం రక్తపాతం కంటే అత్యంత తీవ్రమైనది. '' మిమ్మల్ని మీ ధర్మాన్నుండి మళ్ళించగలగటం వారికి సాధ్యపడితే, వారు అంతవరకు మీతో యుద్ధం చేస్తూనే పోతారు (ఈ విషయం బాగా అర్థం చేసుకోండి). మీలో ఎవరైనా తన ధర్మాన్ని పరిత్యజించి , అవిశ్వాస పరిస్థితిలో మరణిస్తే , అతడు చేసిన మంచిపనులన్నీ ఇహపరలోకాలు రెండిరటిలోనూ వృధా అవుతాయి. అటువంటి వారంతా నరకవాసులు. నరకంలోనే వారు శాశ్వతంగా ఉంటారు. కాని దీనికి భిన్నంగా విశ్వసించి , అల్లాహ్ మార్గంలో తమ ఇల్లూ వాకిలీ

సహితం విడిచి జిహాద్ చేసేవారు దైవకారుణ్యం ఆశించటానికి అన్నివిధాలా అర్హులు. అల్లాహ్ వారి తప్పులను క్షమించి వారిని కరుణిస్తాడు.

**2. అల్ బఖర** 219 మద్యపానము గురించీ , జూదము గురించీ ప్రజలు నిన్ను ప్రశ్నిస్తారు. నీవు వారికి ఇలా ఉపదేశించు : ''ఈ రెంటిలోనూ కీడు ఉన్నది వాటిలో ప్రజలకు కొన్ని లాభాలు ఉన్నా , ఈ లాభాలకంటే కలిగే కీడే ఎక్కువ.'' ''మేము అల్లాహ్ మార్గంలో ఏమి ఖర్చుపెట్టాలి ?'' అని వారు అడుగుతారు. ''మీ నిత్యావసరాలకు పోగా మిగిలినది'' అని నీవు వారికి చెప్పు. ఇహపరాల చింతన మీలో కలిగేందుకుగాను అల్లాహ్ ఈవిధంగా తన ఆజ్ఞలను విశదీకరిస్తాడు.

**2. అల్ బఖర** 220 అనాధులతో వ్యవహరించే తీరును గురించి వారు నిన్ను అడుగుతారు. నీవు వారికి ఇలా బోధించు : ''ఏవిధంగా వ్యవహరిస్తే వారికి ఎక్కువ మేలు కలుగుతుందో , ఆ విధంగా వ్యవహరించటం ఉత్తమం. ఒకవేళ మీరూ వారూ కలసివుంటూ, ఉభయుల ఖర్చులను ఉమ్మడిగా భరిస్తే, అందులో అభ్యంతరం లేదు. ఎటొచ్చీ వారు మీకు సోదరతుల్యులే కదా! కీడు చేసే వారెవరో , మేలు చేసేవారెవరో అల్లాహ్ కు బాగా తెలుసు. అల్లాహ్ కోరితే, ఈ విషయంలో మీతో కఠినంగా వ్యవహరించి ఉండేవాడే. కాని ఆయన సర్వాధికారియేకాదు , వివేకవంతుడు కూడా.''

**2. అల్ బఖర** 221 ముష్రిక్కు మహిళలు విశ్వసించనంతవరకు మీరు వారిని ఎట్టి పరిస్థితులలోనూ వివాహమాడరాదు. ముష్రిక్కు కులీన స్త్రీ మీకు ఎంత నచ్చినా , ఆమె కంటే విశ్వాసురాలైన ఒక బానిస స్త్రీ ఎంతో మేలు. (అదేవిధంగా) ముష్రిక్కు పురుషులు విశ్వాసులు కానంతవరకు మీరు మీ మహిళలను వారికిచ్చి ఎన్నటికీ వివాహం చెయ్యకూడదు. ముష్రిక్కు కులీనుడు మీకు ఎంత నచ్చినా, అతడికంటె విశ్వాసి అయిన ఒక బానిస ఎంతో మేలు. ఈ ముష్రిక్కులు మిమ్మల్ని అగ్ని వైపునకు ఆహ్వానిస్తారు. కాని అల్లాహ్ తన అనుజ్ఞతో మిమ్మల్ని స్వర్గం వైపునకూ క్షమాభిక్ష వైపునకూ రమ్మని పిలుస్తాడు. గుణపాఠం గ్రహించి హితబోధను స్వీకరిస్తారని ప్రజలకు అల్లాహ్ తన ఆజ్ఞలను స్పష్టంగా తెలుపుతాడు.

**2. అల్ బఖర** 222 - 223 రుతుస్రావానికి సంబంధించిన ఉత్తరువు ఏమిటి అని వారు నిన్ను అడుగుతారు. నీవు వారికి ఇలా తెలుపు : ''అదొక అపరిశుద్ధావస్థ. కనుక రుతు కాలంలో భార్యలకు దూరంగా ఉండండి. వారు పరిశుద్ధలు కానంతవరకు వారి వద్దకు పోకండి. వారు పరిశుద్ధలు అయిన తరువాత , అల్లాహ్ ఆదేశించిన విధంగా మీరు వారి వద్దకు పోవచ్చు. చెడుగుకు దూరంగా ఉండేవారిని , పరిశుద్ధతను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. మీ స్త్రీలు మీ యొక్క సేద్యపు భూములు. మీ పొలాలకు మీరు కోరిన విధంగా పోవటానికి మీకు అధికారం ఉంది. కాని మీరు మీ భవిష్యత్తును గురించి తగు జాగ్రత్త వహించండి. అల్లాహ్ ఆగ్రహానికి దూరంగా ఉండండి. ఒకరోజున

ఆయనను కలుసుకోవలసి వుందని బాగా తెలుసుకోండి. ప్రవక్తా! నీ ఉపదేశాలను స్వీకరించిన వారికి (సాఫల్యము సౌభాగ్యము ఉన్నాయనే) శుభవార్త వినిపించు.

**2. అల్ బఖర** 224 - 225 సత్కార్యాలూ, భయభక్తులూ, మానవ సంక్షేమమూ - వీటికి దూరంగా ఉండే ఉద్దేశ్యంతో మీరు చేసే ప్రమాణాలకు అల్లాహ్ పవిత్రనామాన్ని ఉపయోగించకండి. అల్లాహ్ మీ మాటలన్నింటినీ వింటున్నాడు. ఆయనకు అంతా తెలుసు. అనాలోచితంగా మీరు చేసే అర్థరహిత ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు. కాని హృదయపూర్వకంగా మీరు చేసే ప్రమాణాలను గురించి ఆయన తప్పకుండా అడుగుతాడు. అల్లాహ్ మన్నించేవాడు, సహనశీలుడూను.

**2. అల్ బఖర** 226 - 227 తమ భార్యలను కలవకూడదని ప్రమాణం చేసుకునే వారికి నాలుగు మాసాల వ్యవధి కలదు. కాని వారు తమ దాంపత్య జీవితాన్ని మళ్ళీ ప్రారంభిస్తే అల్లాహ్ క్షమించేవాడు , కరుణించే వాడూను. కాని వారు చివరకు విడాకుల కొరకే నిర్ణయం తీసుకుంటే , అల్లాహ్ అంతా వింటాడు , ఆయనకు అన్నీ తెలుసు అనే విషయం వారు తెలుసుకోవాలి.

**2. అల్ బఖర** 228 విడాకులివ్వబడిన స్త్రీలు మూడు రుతువుల కాలం పూర్తి అయ్యేవరకు విధిగా వేచివుండాలి. వారి గర్భాశయాలలో అల్లాహ్ సృష్టించిన దానిని దాచటం వారికి ధర్మం కాదు. అల్లాహ్ ను , అంతిమదినాన్నీ వారు నిజంగానే విశ్వసించేవారేఅయితే , ఆ విధంగా చెయ్యటం ఎంతమాత్రం భావ్యం కాదు. వారి భర్తలు దాంపత్య సంబంధాలను సరిదిద్దుకొనుటకు సిద్ధంగా ఉంటే , ఈ నిరీక్షణా కాలంలో వారిని తమ భార్యలుగా తిరిగి స్వీకరించే హక్కు వారికి ఉంది. మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి. కాని పురుషులకు స్త్రీలపై కొంచెం ఆధిక్యం ఉన్నది. అందరిపై అల్లాహ్ కు ఆధిక్యం ఉన్నది. ఆయన సర్వాధికారి, సర్వజ్ఞాని, వివేచనాపరుడు.

**2. అల్ బఖర** 229 విడాకులు రెండుసార్లు ఇవ్వాలి. తరువాత భార్యను సక్రమంగా తమ వద్ద ఉండనివ్వాలి లేదా ఆమెను సహృదయంతో సాగనంపాలి. సాగనంపేటప్పుడు , మీరు వారికి పూర్వం ఇచ్చిన వాటినుండి దేన్నయినా తిరిగి తీసుకోవటం ధర్మసమ్మతం కాదు - అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేమనే భయం దంపతులకు కలిగిన పక్షంలో ఒక మినహాయింపు ఉంది. ఇలాంటి సందర్భంలో దంపతులిద్దరూ అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేరనే భయం మీకు కలిగితే , స్త్రీ తన భర్తకు ఏదైనా పరిహారం ఇచ్చి వేరు కావటానికి వారిద్దరూ అంగీకరిస్తే, అందులో ఏమాత్రం దోషం లేదు. ఇవి అల్లాహ్ విధించిన హద్దులు. వీటిని అతిక్రమించకండి. అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించేవారే దుర్మార్గులు.

**2. అల్ బఖర** 230 ఆ తరువాత (రెండుసార్లు విడాకులిచ్చిన పిదప భర్త భార్యకు మూడవసారి) విడాకులిస్తే , ఇక ఆ స్త్రీ అతనికి హలాల్ (ధర్మసమ్మతం) కాదు. ఆమె వివాహం వేరే పురుషునితో జరిగి, అతడు ఆమెకు విడాకులిస్తే తప్ప. అప్పుడు మొదటి భర్త, ఈ స్త్రీ ఉభయులూ తాము అల్లాహ్ హద్దులకు లోబడి ఉండగలమని భావిస్తే , వారు పునర్వివాహం చేసుకోవటంలో దోషం లేదు. ఇవి అల్లాహ్ ఏర్పరచిన హద్దులు. (అల్లాహ్ హద్దులు అతిక్రమిస్తే కలిగే పర్యవసానం) ఎరిగిన వారికి మార్గదర్శకంగా ఉండటానికి వాటిని ఆయన విశదపరుస్తున్నాడు.

**2. అల్ బఖర** 231 మీరు మీ స్త్రీలకు విడాకులిచ్చినప్పుడు , వారికొరకు నిర్ణయింపబడిన గడువు (ఇద్దత్) దగ్గరపడగానే, వారిని సహృదయంతో మీ వద్ద ఉంచుకోవాలి లేదా మంచితనంతో సాగనంపాలి. కేవలం పీడిరచే ఉద్దేశ్యంతో వారిని మీతో ఉంచుకోవటం అన్యాయం. ఆవిధంగా చేసేవాడు వాస్తవానికి తనకు తానే అన్యాయం చేసుకుంటున్నాడు. అల్లాహ్ వాక్యాలతో చెలగాటం ఆడకండి. అల్లాహ్ మీకు గొప్ప కానుకను ప్రసాదించిన విషయాన్ని మరువకండి. తాను మీపై అవతరింపజేసిన గ్రంథాన్నీ , దివ్య జ్ఞానాన్నీ తగువిధంగా గౌరవించండి అని అల్లాహ్ మీకు బోధిస్తున్నాడు. అల్లాహ్ కు భయపడండి. అంతా ఆయనకు తెలుసు అనే విషయం మీరు బాగా తెలుసుకోండి.

**2. అల్ బఖర** 232 మీరు మీ స్త్రీలకు విడాకులిచ్చివేసిన తరువాత వారు తమ నిరీక్షణా వ్యవధి (ఇద్దత్)ని పూర్తిచేసి, తమ నిశ్చిత భర్తలను ధర్మసమ్మతంగా పరస్పరం ఇష్టపడి వివాహం చేసుకోదలిస్తే , మీరు వారిని ఆటంకపరచకూడదు. మీరు నిజంగా అల్లాహ్ ను అంతిమదినాన్ని విశ్వసించినవారే అయితే , అలా ఎంతమాత్రం చెయ్యకూడదని మీకు బోధించబడుతోంది. మీకొరకు సంస్కారవంతమూ పవిత్రమూ అయిన పద్ధతి ఏమిటంటే మీరు దానికి దూరంగా ఉండటమే. అల్లాహ్ కు అన్నీ తెలుసు, మీకు తెలియదు.

**2. అల్ బఖర** 233 తమ సంతానం యొక్క పాలుపట్టే గడువు పూర్తికావాలని తండ్రులు కోరినపక్షంలో తల్లులు తమ బిడ్డలకు పూర్తిగా రెండు సంవత్సరాలు పాలుపట్టాలి. అప్పుడు ఆమెకు పిల్లల తండ్రి తగురీతిగా భోజన వస్త్రాలను ఇచ్చి పోషించవలసి ఉంటుంది. కాని శక్తికి మించిన భారం ఎవరిమీదా మోపకూడదు. (అంటే) బిడ్డనుకన్న కారణంగా తల్లిమీద ఎక్కువ భారం మోపటం భావ్యం కాదు. బిడ్డకు తండ్రి కనుక తండ్రిని ఇరకాటంలో పెట్టటం కూడ సమంజసం కాదు - పాలిచ్చే తల్లిని పోషించే బాధ్యత తండ్రిపై ఉన్న విధంగానే తండ్రి వారసులపై కూడా ఉంటుంది - కాని ఇరుపక్షాలవారు సంప్రదించుకుని పరస్పరాంగీకారంతో బిడ్డచే పాలు విడిపిస్తే అందులో దోషం లేదు. ఇంకా మీరు మీ సంతానానికి వేరే స్త్రీ ద్వారా పాలు ఇప్పించే ఏర్పాటు చెయ్యదలిస్తే , అదీ ఆక్షేపణీయం కాదు. కాని మీరు ఆమెకు ఇవ్వవలసిన దానిని న్యాయసమ్మతంగా చెల్లించాలి. అల్లాహ్ కు భయపడండి. మీరు చేస్తున్నదంతా అల్లాహ్ దృష్టిలో ఉంది అనే విషయం తెలుసుకోండి.

**2. అల్ బఖర** 234 - 235 మీలో ఎవరైనా మరణించి , వారి భార్యలు సజీవంగా ఉంటే , వారు నాలుగు నెలల పదిరోజుల వరకు తమను తాము నిగ్రహించుకోవాలి. ఈ గడువు (ఇద్దత్) పూర్తి అయిన పిదప , వారు తమ కొరకు ఏది ఉచితమో దానిని యుక్తమైన రీతిలో చేసుకోవటానికి స్వేచ్ఛ కలిగి ఉన్నారు. దానికి మీరు బాధ్యులుకారు. మీరు చేసే పనులన్నీ అల్లాహ్ కు తెలుసు. ఈ వితంతువులను వివాహం చేసుకోవాలనే మీ సంకల్పాన్ని మీరు వారి నిరీక్షణాకాలం (ఇద్దత్)లో పరోక్షంగా తెలిపినా లేక దానిని మీ మనస్సులలో గోప్యంగా ఉంచినా అది దోషం కాదు. వారిని గురించిన ఆలోచన సహజంగానే మీకు కలుగుతుందని అల్లాహ్ కు తెలుసు. కాని రహస్యంగా ఎలాంటి ఒప్పందం చేసుకోరాదు. అయితే మీరేమన్నా మాట్లాడదలిస్తే గౌరవమైన రీతిలో మాట్లాడండి. నిరీక్షణా వ్యవధి (ఇద్దత్) పూర్తి కానంతవరకు వివాహ నిర్ణయం తీసుకోకూడదు. మీ మనస్సులలో ఉన్న విషయం సహితం అల్లాహ్ కు తెలుసు అని తెలుసుకోండి. కనుక ఆయనకు భయపడండి. ఇంకా ఆయన అత్యంత సహనశీలుడని (చిన్న చిన్న తప్పులను) మన్నిస్తాడని కూడా తెలుసుకోండి.

**2. అల్ బఖర** 236 - 237 మీరు మీ స్త్రీలను ముట్టుకోకముందే లేక వారి మహర్ (స్త్రీ ధనం) నిర్ణయం కాకపూర్వమే మీరు వారికి విడాకులిస్తే,అది పాపం కాదు. అప్పుడు మీరు వారికి ఏదో కొంత తప్పకుండా ఇవ్వాలి. ధనవంతుడైన వ్యక్తి తన శక్తికొలదీ , పేదవాడైన మనిషి తన స్థితినిబట్టి ధర్మసమ్మతమైన విధంగా చెల్లించాలి. ఇది సజ్జనులైన వారి విధి. మీరు తాకకపూర్వమే మీ స్త్రీలకు విడాకులిస్తే, ఒకవేళ అప్పటికే వారి మహర్ నిర్ణయింపబడి ఉన్నట్లయితే అప్పుడు సగం మహర్‌ను చెల్లించవలసి ఉంటుంది. కాని స్త్రీ గనక ఉదార బుద్ధితో వ్యవహరించి (మహర్‌ను క్షమించి విడిచిపెట్టి)నట్లయితే లేక నికాహ్ బంధం తన చేతిలో ఉన్న పురుషుడు ఔదార్యంతో (పూర్తి మహర్) చెల్లించినట్లయితే అది అభ్యంతరకరం కాదు. మీరు (పురుషులు) ఉదార స్వభావంతో వ్యవహరిస్తే , అది భయభక్తులకు సన్నిహితమైనది. పరస్పర వ్యవహారాలలో ఔదార్యం చూపటం మరువకండి. మీరు చేసే పనులను అల్లాహ్ చూస్తున్నాడు.

**2. అల్ బఖర** 238 - 239 మీరు మీ నమాజులను సంరక్షించుకోండి - ముఖ్యంగా అత్యుత్తమమైన నమాజును. అల్లాహ్ సన్నిధానంలో విధేయులైన దాసులుగా నిలబడండి. పరిస్థితులు ప్రమాదకరంగా ఉంటే , నడుస్తూవున్నా లేక స్వారీ చేస్తూవున్నా , ఎలా సాధ్యమయితే అలా నమాజు చెయ్యండి. శాంతి భద్రతలు నెలకొన్న తరువాత , అల్లాహ్ మీకు నేర్పిన పద్ధతి ప్రకారం ఆయనను స్మరించండి. ఈ పద్ధతి పూర్వం మీకు తెలియదు.

**2. అల్ బఖర** 240 - 241 మీలోని వారెవరైనా మరణించి, వారి భార్యలు సజీవంగా వుంటే, వారు తమ భార్యలకు ఒక సంవత్సరం వరకు భరణపు ఖర్చులు ఇవ్వాలనీ వారిని ఇంటి నుండి బహిష్కరించరాదనీ ఒక వీలునామా వ్రాయాలి. కాని వారు తమంతట తామే వెళ్ళిపోయి , తమ విషయంలో ధర్మసమ్మతంగా ఏమి చేసినా దానికి మీరు

బాధ్యులు కారు. అల్లాహ్ సర్వాధికారి , సర్వమూ తెలిసినవాడు. ఇదేవిధంగా విడాకులివ్వబడిన స్త్రీలకు కూడా సముచితరీతిని ఎంతో కొంత ఇచ్చి సాగనంపాలి. భయభక్తులు కలవారు దీనిని విధిగా పాటించాలి.

**2. అల్ బఖర** 242 ఈవిధంగా అల్లాహ్ తన ఆజ్ఞలను మీకు స్పష్టంగా తెలుపుతాడు. మీరు అర్థం చేసుకుని ప్రవర్తిస్తారని ఆశించబడుతోంది.

**2. అల్ బఖర** 243 - 245 మరణభీతితో తమ ఇళ్ళూవాకిళ్ళను విడిచివెళ్ళినవారి ఉదంతాన్ని గురించి నీవు తలపోశావా? వారు వేల సంఖ్యలో ఉండేవారు. అల్లాహ్ వారితో ''చావండి'' అని అన్నాడు. మళ్ళీ ఆయన వారిని బ్రతికించాడు. వాస్తవం ఏమిటంటే , అల్లాహ్ మానవులపట్ల అత్యంత అనుగ్రహం కలవాడు. కాని చాలామంది కృతజ్ఞతలు చూపరు. ముస్లిములారా! అల్లాహ్ మార్గంలో యుద్ధం చెయ్యండి. అల్లాహ్ అన్నీ వింటాడు , ఆయనకు అంతా తెలుసు అని మీరు బాగా తెలుసుకోండి. అల్లాహ్ కు మంచి రుణం ఇచ్చేవారు మీలో ఎవరైనా ఉన్నారా ? దానిని ఆయన ఎన్నో రెట్లు అధికంచేసి తిరిగి ఇస్తాడు. (ఐశ్వర్యాన్ని ) తగ్గించటం , అధికం చెయ్యటం - అంతా అల్లాహ్ చేతులలోనే ఉంది. ఆయన వైపునకే మీరంతా తిరిగి పోవలసివుంది.

**2. అల్ బఖర** 246 మూసా (నిర్యాణం) తరువాత ఇస్రాయీలు నాయకులకు ఎదురైన పరిస్థితులను గురించి నీవు ఆలోచించావా? వారు తమ ప్రవక్తను ఇలా అడిగారు : ''మేము అల్లాహ్ మార్గంలో యుద్ధం చెయ్యటానికి నీవు మాకొరకు ఒక రాజును నియమించు. '' అప్పుడు ప్రవక్త వారిని ఇలా అడిగాడు : ''తీరా మిమ్మల్ని యుద్ధం చెయ్యండి అని ఆదేశిస్తే , అప్పుడు మీరు నిరాకరించరుకదా ?'' వారు ఇలా అన్నారు : ''మేము మా ఇళ్ళనుండి గెంటివేయబడ్డాము. మా పిల్లలు మాకు దూరం చెయ్యబడ్డారు. అలాంటప్పుడు మేము అల్లాహ్ మార్గంలో యుద్ధం చెయ్యకుండా ఉండటమనేది ఎలా సాధ్యం ?'' కాని, యుద్ధం చెయ్యండి అని ఆజ్ఞాపించగానే వారిలో కొందరు తప్ప అందరూ వెన్నుచూపారు. ఈ దుర్మార్గులలో ప్రతి ఒక్కడూ అల్లాహ్ కు తెలుసు.

**2. అల్ బఖర** 247 - 248 వారి ప్రవక్త వారితో ఇలా అన్నాడు : ''మీకు ఏలికగా అల్లాహ్ తాలూత్‌ను నియమించాడు.'' ఇది విని వారు ఇలా అన్నారు : ''మాపై రాజ్యం చేసే హక్కు అతనికెలా సంక్రమిస్తుంది ? రాజ్యం చేసే హక్కూ, అర్హతలూ అతనికంటే మాకే ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే , అతడు శ్రీమంతుడు కాదు. '' దానికి సమాధానంగా ప్రవక్త వారితో ఇలా అన్నాడు : ''మీకు బదులుగా అల్లాహ్ అతనినే ఎన్నిక చేశాడు. అల్లాహ్ అతనికి బుద్ధిబలాన్నీ, కండబలాన్నీ సమృద్ధిగా ప్రసాదించాడు. తాను కోరిన వారికి తన రాజ్యం ప్రసాదించే అధికారం అల్లాహ్ కు ఉంది. అల్లాహ్ అంతా వ్యాపించి ఉన్నాడు , సర్వమూ తెలిసినవాడు. '' వారి ప్రవక్త వారికి ఇంకా ఈవిధంగా తెలియజేశాడు : ''అల్లాహ్ అతనిని మీపై రాజుగా నియమించాడు అనటానికి తార్కాణమేమిటంటే , అతని ప్రభుత్వ కాలంలో మీ పెట్టె (ఆర్క్) మీకు తిరిగి లభిస్తుంది. మీ ప్రభువు నుండి మీ కొరకు మనశ్శాంతి సామగ్రి అందులో ఉంది. ఇంకా అందులో మూసా కుటుంబం, హారూను కుటుంబం వదలి వెళ్ళిన పవిత్ర అవశేషాలు ఉన్నాయి. దానిని

ప్రస్తుతం దూతలు కాపాడుతున్నారు. మీరు విశ్వసించినవారే అయితే , ఇది నిశ్చయంగా మీకొక మహత్తరమైన చిహ్నం.''

**2. అల్ బఖర** 249 తరువాత యుద్ధానికి సైన్యంతో బయలుదేరుతూ తాలూత్ ఇలా ప్రకటించాడు : ''ఒక నదితీరాన అల్లాహ్ మిమ్మల్ని పరీక్షింపబోతున్నాడు. దానిలో నీళ్ళు త్రాగేవాడు నా సహచరుడు కాడు. దాని నీళ్ళతో తన దాహం తీర్చుకోనివాడే నా సహచరుడు. కాని చేతితో ఒక గుక్కెడు త్రాగితే ఫర్వాలేదు. '' అయితే కొందరు తప్ప అందరూ ఆ నదీజలాన్ని కడుపునిండా త్రాగారు....

**2. అల్ బఖర** 249 - 251 ..... తాలూత్, అతని ముస్లిము సహచరులు ఆ నదిని దాటి ముందుకుపోయినప్పుడు వారు తాలూత్‌తో ఇలా అన్నారు : ''జాలూత్‌ను, అతని సైన్యాలను ఎదుర్కొనే శక్తి ఈ రోజు మాలో లేదు.'' కాని ఒక రోజున అల్లాహ్ ను కలవటం తప్పదు అని విశ్వసించినవారు ఈ విధంగా ప్రకటించారు : ''ఒక చిన్న వర్గం ఒక పెద్ద వర్గాన్ని అల్లాహ్ అనుమతితో జయించటం ఎన్నోసార్లు జరిగింది. అల్లాహ్ సాహచర్యం, స్థైర్యం కలవారికి లభిస్తుంది.'' జాలూత్‌తో, అతని సైన్యంతో పోరాడటానికి బయలు దేరుతూ వారు ఇలా ప్రార్థించారు : ''మా ప్రభూ! మాకు ధైర్యస్థైర్యాలు ప్రసాదించు. మా కాళ్ళకు నిలకడను చేకూర్చు. అవిశ్వాస వర్గంపై మాకు విజయం అనుగ్రహించు. '' చివరకు అల్లాహ్ అనుజ్ఞతో వారు అవిశ్వాసులను ఓడిరచి పారద్రోలారు. దావూద్ జాలూత్‌ను సంహరించాడు. అల్లాహ్ అతనికి రాజ్యాధికారాన్నీ, బుద్ధికౌశల్యాన్నీ ప్రసాదించాడు. ఇంకా తాను కోరిన విషయాల జ్ఞానాన్ని ఆయన అతనికి ప్రదానం చేశాడు. ఈ విధంగా అల్లాహ్ మానవుల ఒక వర్గాన్ని మరొక వర్గం ద్వారా తొలగించక పోతే , భూలోక వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది. కాని ప్రపంచ మానవులపై అల్లాహ్ కు ఎనలేని అనుగ్రహం. (కనుకనే ఈ విధంగా ఆయన అరాజకాన్ని, సంక్షోభాన్నీ రూపుమాపే ఏర్పాట్లుచేస్తూ ఉంటాడు).

**2. అల్ బఖర** 252 - 253 ఇవన్నీ అల్లాహ్ వాక్యాలు. వాటిని మేము యథాతథంగా నీకు వినిపిస్తున్నాము. ముహమ్మద్! నిశ్చయంగా నీవు సందేశహరులుగా పంపబడిన వారిలోనివాడవు. (మానవులకు సత్య మార్గం చూపటానికి పంపబడిన) ఈ ప్రవక్తలకు ఒకరిపై మరొకరికి ఉన్నత స్థానాలు ప్రసాదించాము. వారిలోని ఒకరితో అల్లాహ్ స్వయంగా మాట్లాడాడు. మరొకరికి పేరేవిధంగా ఘనతను ఇచ్చి ఆదరించాడు. చివరన మర్యమ్ కుమారుడైన ఈసాకు మేము స్పష్టమైన సూచనలు ప్రసాదించాము , పరిశుద్ధాత్మతో అతనిని ఆదుకున్నాము. అల్లాహ్ సంకల్పించి ఉన్నట్లయితే , ప్రవక్తల తరువాత స్పష్టమైన గుర్తులు చూసిన ప్రజలు పరస్పరం కలహించుకునేవారు కాదు. కాని (ప్రజలను విభేదాలకు లోనుకాకుండా బలవంతంగా ఆపటం అల్లాహ్ ఉద్దేశం కాదు, అందుకని) వారు పరస్పరం విభేదాలకు లోనయ్యారు. కొందరు విశ్వసించారు , మరికొందరు అవిశ్వాసమార్గాన్ని అవలంబించారు. కాని అల్లాహ్ కోరితే , వారు పరస్పరం కలహించుకునే వారే కాదు. కాని అల్లాహ్ తాను కోరింది చేస్తాడు.

**2. అల్ బఖర** 254 విశ్వసించిన ప్రజలారా! క్రయవిక్రయాలు కూడా జరగని , మైత్రీ ఉపయోగపడని, సిఫారసు కూడా చెల్లని, ఆ (చివరి) దినము రాకపూర్వమే, మేము మీకు ప్రసాదించిన సిరిసంపదల నుండి (మా మార్గంలో) ఖర్చుపెట్టండి. వాస్తవంగా అవిశ్వాస మార్గం అవలంబించేవారే దుర్మార్గులు.

**2. అల్ బఖర** 255 అల్లాహ్ - ఆయన తప్ప ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు. సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన ఆయన సజీవుడు , నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు , ఆయనకు కునుకూ రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే. ఆయన సమ్ముఖంలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చెయ్యగల వాడెవ్వడు ? ప్రజల ముందు ఉన్న దానినీ ఆయన ఎరుగును. వారికి గుప్తంగా ఉన్నదీ ఆయనకు తెలుసు. ఆయన స్వయంగా తెలియజెయ్యాలని అభిలషిస్తే తప్ప ఆయనకున్న జ్ఞాన విశేషాలలోని ఏ విషయమూ వారి గ్రహణ పరిధిలోకి రాదు. ఆయన రాజ్యాధికారం ఆకాశాలనూ భూమిని పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఎంతమాత్రం అలసట కలిగించదు. ఆయన మాత్రమే సర్వాధికుడు సర్వోత్తముడూను.

**2. అల్ బఖర** 256 - 257 ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారంకానీ లేవు. సత్యవాక్కు అసత్యవాక్కుల నుండి ప్రస్ఫుటం చెయ్యబడిరది. ఇకనుండి 'తాగూత్'ను తిరస్కరించి, అల్లాహ్ ను విశ్వసించిన వాడు సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆశ్రయం పొందినట్లే. (అతడు ఆశ్రయించిన) అల్లాహ్ సర్వమూ వింటాడు , సమస్తమూ తెలిసినవాడు. అల్లాహ్ విశ్వాసులకు సంరక్షకుడు, సహాయకుడూను. ఆయన వారిని కటిక చీకట్లనుండి వెలికితీసి వెలుగు చూపిస్తాడు. తాగూత్ అవిశ్వాస మార్గం అవలంబించే వారికి సంరక్షకులు , సహాయకులూను. వీరు వారిని వెలుగునుండి చీకటి వైపునకు లాక్కుపోతారు. వారు అగ్ని జ్వాలలకు గురి అయ్యేవారు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు.

**2. అల్ బఖర** 258 ఇబ్రాహీము ప్రభువు ఎవరు అనే విషయంపై అతనితో వివాదపడిన వ్యక్తి విషయాన్ని గురించి నీవు ఆలోచించలేదా? అల్లాహ్ ఆ వ్యక్తికి రాజ్యాధికారం ఇవ్వటం వల్ల ఈ వివాదం తలెత్తింది. ''జీవన్మరణాలు ఎవరి అధీనంలో ఉన్నాయో, ఆయనే నా ప్రభువు '' అని ఇబ్రాహీము అన్నప్పుడు , అతడు ఇలా జవాబు పలికాడు : ''చావు బ్రతుకులు రెండూ నా అధీనంలోనే ఉన్నాయి. '' ఇబ్రాహీము ఇలా అన్నాడు : ''సరే, అల్లాహ్ సూర్యుణ్ణి తూర్పు నుండి ఉదయింపచేస్తాడు. నీవు కాస్త దానిని పడమర నుండి ఉదయింపజెయ్యి. '' ఇది విన్న ఆ సత్యధిక్కారి బిత్తరపోయాడు. అయితే అల్లాహ్ దుష్టులకు రుజుమార్గం చూపడు.

**2. అల్ బఖర** 259 లేక ఉదాహరణకు - ఇళ్ళ కప్పులపై తలక్రిందులుగా పడివున్న పట్టణం మీదుగా ప్రయాణం చేసిన ఆ వ్యక్తిని చూడు. అతడు ఆశ్చర్యంతో ఇలా పలికాడు : ''శిథిలమైపోయిన ఈ పట్టణానికి అల్లాహ్ మళ్ళీ ఏవిధంగా జీవం పోస్తాడు. '' అప్పుడు అల్లాహ్ అతని ప్రాణాన్ని తీసేశాడు. ఆ స్థితిలో అతడు నూరేళ్ళ వరకు ఉన్నాడు. తరువాత అల్లాహ్ అతనిని మళ్ళీ బ్రతికించి ఇలా అడిగాడు : ''నీవు ఇక్కడ ఎంతకాలం ఉన్నావో

చెప్పు.'' అతడు ''ఒకరోజో లేక కొన్ని గంటలో'' అని చెప్పాడు. అల్లాహ్ ఇలా తెలిపాడు : ''ఇక్కడ ఈ స్థితిలో నీవు నూరు సంవత్సరాలు పడివున్నావు. నీవు కొంచెం నీ అన్నపానీయాలవైపు చూడు. వాటిలో ఏమాత్రం మార్పు లేదు. ఇంకా నీవు నీ గాడిదను కూడ చూడు. (దాని ఎముకలు సహితం కృశించి పోతున్నాయి). ప్రజలకు నిన్ను ఒక దృష్టాంతంగా చూపే ఉద్దేశ్యంతో మేము ఈ విధంగా చేశాము. ఇంకా చూడు! ఆ (గాడిద) అస్థిపంజరాన్ని మేము ఏ విధంగా లేపి , దానిని మాంసంతో నింపుతామో.'' ఈ విధంగా సత్యం అతనికి తేటతెల్లం కాగానే , అతడు ఇలా అన్నాడు: ''అల్లాహ్ సర్వశక్తిమంతుడని నాకు తెలుసు.''

**2. అల్ బఖర** 260 మరొక సంఘటనను కూడ దృష్టిలో ఉంచుకో. ఇబ్రాహీము ఇలా అడిగాడు : ''ఓ నా ప్రభూ! నీవు మృతులను ఏవిధంగా బ్రతికిస్తావో నాకు చూపించు. '' అల్లాహ్ ''నీకు విశ్వాసం లేదా ?'' అని అడిగాడు. ఇబ్రాహీము వినయంగా ఇలా అన్నాడు : ''నాకు విశ్వాసం అయితే ఉంది. కాని మనస్సును తృప్తి పరచటం కోసం అడుగుతున్నాను.'' అప్పుడు అల్లాహ్ చెప్పాడు : ''సరే, మంచిది, నాలుగు పక్షులను తీసుకో. వాటిని బాగా మచ్చిక చేసుకో తరువాత ఒక్కొక్కదాని భాగాన్ని ఒక్కొక్క కొండపై పెట్టి రా. మళ్ళీ వాటిని రమ్మని పిలువు. అవి నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాయి. అల్లాహ్ సర్వశక్తిమంతుడూ సర్వజ్ఞుడూ అని బాగా జ్ఞాపకం ఉంచుకో.''

**2. అల్ బఖర** 261 - 265 తమ సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చుచేసే వారి ఖర్చు ఉపమానం ఇలా ఉంటుంది: ఒక్క విత్తనాన్ని నాటితే, అది మొలిచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదేవిధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింపచేస్తాడు. అల్లాహ్ అమితంగా ఇచ్చేవాడూ అన్నీ తెలిసినవాడూను. అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని వ్యయంచేసి , ఆ తరువాత తమ దాతృత్వాన్ని మాటిమాటికీ చాటుతూ, గ్రహీతల మనస్సును గాయపరచని వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంది. వారికి ఏ విధమైన భయంకాని, ఖేదం కాని ఉండవు. మనస్సును గాయపరచే దానం కంటే , మృదుభాషణం, క్షమాగుణం ఎంతో మేలైనవి. అల్లాహ్ అన్నింటికీ అతీతుడు , అత్యంత సహనశీలుడూను. విశ్వసించిన ఓ ప్రజలారా! కేవలం పరుల మెప్పును పొందటానికే తన ధనం ఖర్చుచేసేవాని మాదిరిగా అల్లాహ్ ను అంతిమదినాన్నీ విశ్వసించని వాని మాదిరిగా, మీరు దెప్పిపొడిచి, గ్రహీత మనస్సును గాయపరచి మీ దాన ధర్మాలను మట్టిలో కలపకండి. అతడు చేసిన ధన వ్యయాన్ని ఈ విధంగా పోల్చవచ్చు : ఒక కొండరాతిపై ఒక మట్టిపొర ఏర్పడి ఉంది. భారీవర్షం దానిపై కురవగా ఆ మట్టి కాస్తా కొట్టుకు పోయింది. చివరకు మిగిలింది ఉత్త కొండరాయి మాత్రమే. ఇలాంటి వారు తాము దానం చేస్తున్నామని భావించి చేసే పుణ్యకార్యం వల్ల వారికి ఏ ప్రయోజనమూ కలుగదు. అవిశ్వాసులకు సత్యమార్గం చూపటం అల్లాహ్ సంప్రదాయం కాదు. దీనికి భిన్నంగా తమ సంపదను చిత్తశుద్ధితో కేవలం అల్లాహ్ సంతోషం పొందే ఉద్దేశ్యంతో వ్యయపరచేవారి వ్యయాన్ని మెట్టప్రదేశంలో ఉన్న తోటతో పోల్చవచ్చు. భారీ వర్షం కురిస్తే అది రెట్టింపు పంటను ఇస్తుంది. ఒకవేళ భారీవర్షం కురవక , సన్నని జల్లు పడినా అదే దానికి చాలు. మీరు చేసేదంతా అల్లాహ్ దృష్టిలో ఉంది.

**2. అల్ బఖర** 266 సతతం నీరు పారే పిల్లకాలువలతో, ఖర్జూరం, ద్రాక్ష మొదలైన సకల ఫలాలతో నిండి పచ్చగా అలరారే తోట మీలో ఎవరికైనా ఉండి , అతడు వయోభారంతో క్రుంగి , యోగ్యులు కానటువంటి చిన్నపిల్లలు ఉన్న సంకట సమయంలో ఆ తోట సుడిగాలికి గురిఅయి నశించిపోవటం మీలో ఎవరికైనా సమ్మతమేనా ? మీరు యోచించగలందులకు ఈ విధంగా అల్లాహ్ తన హితవులను విశదపరుస్తాడు.

**2. అల్ బఖర** 267 - 269 విశ్వసించిన ప్రజలారా! మీరు సంపాదించిన ధనంలోని, మేము మీ కొరకు నేల నుండి ఉత్పత్తి చేసిన దానిలోని మేలైన భాగాన్ని దైవమార్గంలో ఖర్చుపెట్టండి. ఆయన మార్గంలో ఇవ్వటానికి పనికిరాని వస్తువులను ఏరితీసే ప్రయత్నం చెయ్యకండి. ఒకవేళ ఆ వస్తువులనే ఎవరన్నా మీకు ఇస్తే, వాటిని మీరు తృణీకార భావంతో తప్ప, మనసారా స్వీకరించరు కదా! అల్లాహ్ కు ఏదీ ఏమాత్రం అవసరం లేదనీ ఆయన మహోత్తమమైన గుణములు కలవాడనీ మీరు తెలుసుకోండి. దారిద్ర్య ప్రమాదం చూపి షైతాను మిమ్మల్ని భయపెడతాడు. నీతిబాహ్యమైన, నీచమైన మార్గం అవలంబించండి అని ప్రేరేపిస్తాడు. కాని మిమ్మల్ని క్షమిస్తానని , అనుగ్రహిస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. అల్లాహ్ అత్యంత ఉదార స్వభావుడు, అన్నీ తెలిసినవాడు. తాను కోరిన వారికి దివ్య జ్ఞానం ప్రసాదిస్తాడు, ఎవరికి దివ్య జ్ఞానం లభించిందో, వాస్తవంగా వారికి మహా భాగ్యం లభించినట్లే. విజ్ఞత ఉన్నవారే ఈ విషయాల నుండి పాఠం నేర్చుకుంటారు.

**2. అల్ బఖర** 270 - 271 మీరేమి ఖర్చుపెట్టినదీ, మీరు మొక్కుబడి చేసుకున్నదీ, అంతా అల్లాహ్ కు తెలుసు. దుర్మార్గులకు సహాయం చేసేవారు ఎవ్వరూ లేరు. మీరు మీ దానధర్మాలను బహిరంగంగా చేసినా మంచిదే. కాని రహస్యంగా నిరుపేదలకు దానమివ్వటం మీకు ఎక్కువ మేలు చేకూరుస్తుంది. మీ దుష్కార్యాలు ఎన్నో దీనివల్ల సమసిపోతాయి. మీరు ఏమి చేసినా అది అల్లాహ్ కు తెలుస్తుంది.

**2. అల్ బఖర** 272 ప్రవక్తా! ప్రజలను సత్యమార్గంలో నడిపించే బాధ్యత నీపై లేదు. తాను కోరిన వారిని అల్లాహ్యే సత్యమార్గంలో నడుపుతాడు. మంచిమార్గంలో మీరు ఖర్చుచేసే ధనం మీకే మేలు చేకూరుస్తుంది. అసలు మీరు ఖర్చుచేసేది అల్లాహ్ సంతోషం పొందటానికేగా! కనుక మంచిమార్గంలో మీరు ఏమి ఖర్చుచేసినా , దాని ప్రతిఫలం మీకు పూర్తిగా లభిస్తుంది. మీకు అన్యాయం ఎంతమాత్రం జరగదు.

**2. అల్ బఖర** 273 అల్లాహ్ కార్యంలో నిమగ్నులైన కారణంగా, తమ జీవనోపాధి కోసం భూమిపై తిరిగే అవకాశం లేనందువల్ల లేమికి గురిఅయినవారు ప్రత్యేకంగా ధన సహాయానికి అర్హులు. వారిని ఎరుగని మనిషి వారి ఆత్మాభిమానం చూసి వారు భాగ్యవంతులని భావిస్తాడు. వారి ముఖాలను చూసి మీరు వారి నిజస్థితిని గ్రహించగలరు. లోకుల వెంటపడి సహాయం చెయ్యండి అని బ్రతిమాలే మనుషులు కారు వారు. మీరు వారి సహాయార్థం ఏమి ఖర్చుచేసినా, అది అల్లాహ్ కు తెలియకుండా ఉండదు.

**2. అల్ బఖర** 274 - 277 తమ సంపదను రేయింబవళ్ళు బహిరంగంగానూ , రహస్యంగానూ ఖర్చు చేసే వారు తమ ప్రతిఫలాన్ని తమ ప్రభువువద్ద పొందుతారు. వారికి ఏ విధమైన భయంగాని , దుఃఖంగాని కలిగే అవకాశం లేదు. కాని వడ్డీ తినేవారి స్థితి షైతాను పట్టటం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితి లాంటిది. ఈ స్థితికి వారు గురికావటానికి కారణం వారు ''వ్యాపారం కూడ వడ్డీలాంటిదేగా'' అని అనటమే. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు. కనుక తన ప్రభువు చేసిన ఈ హితబోధ అందేవ్యక్తి ముమ్ముందు వడ్డీ తినటం త్యజిస్తే , అతను పూర్వం తిన్నదేదో తిన్నాడు. అతని వ్యవహారం చివరకు అల్లాహ్ వద్దకే పోతుంది. ఈ ఆదేశం తరువాత మళ్ళీ ఈ దుశ్చేష్టకు పాల్పడేవాడు నిశ్చయంగా నరకవాసి. అక్కడ అతడు శాశ్వతంగా ఉంటాడు. అల్లాహ్ వడ్డీని నశింపజేస్తాడు. దానధర్మాలను పెంచి అధికం చేస్తాడు. కృతఘ్నుడూ, దుష్టుడూ అయిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమించడు. కాని విశ్వసించి మంచిపనులు చేసేవారికి , నమాజును స్థాపించే వారికి జకాత్‌ను ఇచ్చేవారికి వారి ప్రభువువద్ద తగిన ప్రతిఫలం లభిస్తుంది. వారికి భయంకానీ , శోకంకానీ కలిగే అవకాశం లేదు.

**2. అల్ బఖర** 278 - 281 విశ్వసించిన ప్రజలారా! మీరు నిజంగా విశ్వాసులే అయితే , అల్లాహ్ కు భయపడండి, ఇంకా మీకు ప్రజల నుండి రావలసిన వడ్డీని విడిచిపెట్టండి. కాని ఒకవేళ మీరు అలా చెయ్యకపోతే , మీపై అల్లాహ్ తరఫునుండి ఆయన ప్రవక్త తరఫు నుండి యుద్ధ ప్రకటన ఉంది అనే విషయం తెలుసుకోండి. ఇప్పుడైనా మీరు పశ్చాత్తాపపడితే (వడ్డీని వదులుకుంటే) అసలు సొమ్ము తీసుకోవటానికి హక్కు దారులవుతారు. మీరూ అన్యాయం చెయ్యకూడదు, మీకూ అన్యాయం జరగకూడదు. మీ బాకీదారుడు ఆర్థిక ఇబ్బందులలో ఉంటే , అతని పరిస్థితి మెరుగుపడే వరకు గడువు ఇవ్వండి. లేక మీరు తెలిసినవారే అయితే, ఆ బాకీని అతనికి దానం చెయ్యండి. అది మీకు ఎక్కువ శ్రేయస్కరం. అల్లాహ్ వద్దకు మీరు మరలి వెళ్ళేరోజున జరిగే పరాభవం నుండి , కలిగే ఆపద నుండి రక్షించుకోండి. అక్కడ ప్రతి ఒక్కడికి అతడు చేసిన మంచి చెడ్డలకు పరిపూర్ణ ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఏమాత్రం అన్యాయం జరగదు.

**2. అల్ బఖర** 282 విశ్వసించిన ప్రజలారా! మీరు పరస్పరం ఒక నిర్ణీత కాలం కొరకు అప్పు తీసుకున్నప్పుడు, ఆ వ్యవహారాన్ని వ్రాసి పదిలపరచండి. ఇరుపక్షాల మధ్య న్యాయంగా దస్తావేజును ఒక వ్యక్తి వ్రాయాలి. అల్లాహ్ ఎవడికైతే అక్షరజ్ఞానం ప్రసాదించాడో , అతడు వ్రాయటానికి నిరాకరించకూడదు. అతడు వ్రాయాలి. బాధ్యత మోపబడిన వ్యక్తి (అప్పు తీసుకునేవాడు) చెప్పి వ్రాయించాలి. అతడు తన ప్రభువైన అల్లాహ్ కు భయపడాలి. నిర్ణయమైన షరతులలో హెచ్చుతగ్గులు చెయ్యరాదు. కాని రుణం తీసుకునే వ్యక్తి అమాయకుడు లేక బలహీనుడు లేక చెప్పి వ్రాయించలేని అసమర్థుడు అయితే , అతని సంరక్షకుడు న్యాయంగా చెప్పి వ్రాయించాలి. ఇంకా మీరు మీలోని ఇద్దరు పురుషులను దానికి సాక్షులుగా పెట్టుకోవాలి. ఇద్దరు పురుషులు లభించని పక్షంలో , ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు సాక్షులుగా ఉండాలి. ఎందుకంటే వారిలో ఒకామె మరచిపోతే, రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం

చేస్తుంది. ఎవరి సాక్ష్యం మీ అందరికీ ఆమోదయోగ్యమో వారినుండే ఈ సాక్షులు ఎన్నుకోబడాలి. సాక్ష్యం ఇవ్వండి అని ఆహ్వానించినప్పుడు , సాక్షులు నిరాకరించకూడదు. వ్యవహారం చిన్నదైనా , పెద్దదైనా, దానిని గడువు నిర్ణయంతో దస్తావేజు రూపంలో వ్రాయించటానికి అశ్రద్ధ చెయ్యకూడదు. అల్లాహ్ దృష్టిలో ఈ పద్ధతి మీకొరకు అత్యంత న్యాయసమ్మతమైనది. సులభంగా సాక్ష్య నిర్ణయం చెయ్యటానికి ఇది తోడ్పడుతుంది. ఇంకా , మీరు అనుమానాలకు, అపోహలకు గురిఅయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. కాని మీరు అప్పటికప్పుడు పరస్పరం చేసుకునే (సాధారణ) వ్యాపారసంబంధమైన లావాదేవీలను వ్రాయకుండావుంటే, అందులో అభ్యంతరం లేదు. కాని వ్యాపార వ్యవహారాలు నిశ్చయించేటప్పుడు, తప్పకుండా సాక్షులను పెట్టుకోండి. దస్తావేజు వ్రాసేవానినీ, సాక్షులనూ పీడిరచరాదు. ఆ విధంగా చేస్తే అది పాపం అవుతుంది. అల్లాహ్ ఆగ్రహాన్నుండి రక్షించుకోండి. ఆయన మీకు సరిఐౖఁన పద్ధతిని బోధిస్తున్నాడు. ఆయనకు ప్రతిదీ తెలుసు.

**2. అల్ బఖర** 283 మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు , దస్తావేజు వ్రాసేవాడు దొరకని పక్షంలో , మీవద్ద ఉన్న వస్తువును తాకట్టుపెట్టండి. మీలో ఎవరైనా మరొకర్ని నమ్మి అతనితో ఒక వ్యవహారం చేసినట్లయితే , ఆ వ్యక్తి తనవద్ద ఉన్న అమానతును తిరిగి ఇవ్వాలి. అతడు తన ప్రభువైన అల్లాహ్ కు భయపడాలి. ఎట్టి పరిస్థితులలోనూ సాక్ష్యాన్ని దాచకండి. సాక్ష్యాన్ని దాచేవాడి హృదయం పాపభూయిష్టమైనది. మీరు చేసేవన్నీ అల్లాహ్ కు తెలుసు.

**2. అల్ బఖర** 284 ఆకాశాలలో , భూమిపై ఉన్న సమస్తమూ అల్లాహ్దే. మీరు మీ మనస్సులలో ఉన్న విషయాలను ప్రకటించినా లేక దాచినా , వాటిని గురించి ఎట్టకేలకు అల్లాహ్ లెక్క తీసుకుంటాడు. ఇంకా , తాను కోరిన వారిని క్షమించటానికీ , తాను కోరిన వారిని శిక్షించటానికి ఆయనకు అధికారం ఉంది. ఆయన అన్నిటిపైన అధికారం కలవాడు.

**2. అల్ బఖర** 285 ప్రవక్త తనపై తన ప్రభువు నుండి అవతరించిన దాన్ని విశ్వసించాడు. ఈ ప్రవక్తను విశ్వసించేవారు కూడా దానిని హృదయపూర్వకంగా స్వీకరించారు. వారంతా అల్లాహ్ ను , ఆయన దూతలనూ, ఆయన గ్రంథాలనూ , ఆయన ప్రవక్తలనూ విశ్వసిస్తారు. వారు ఇలా అంటారు : ‘‘మేము అల్లాహ్ పంపిన ప్రవక్తలలోని ఏ ఒక్కరినీ భేదభావంతో చూడము. మేము ఆదేశం విన్నాము , శిరసావహించాము. స్వామీ! క్షమాభిక్ష పెట్టు అని మేము నిన్ను అర్థిస్తున్నాము. చివరకు మేమంతా నీదెసకే మరలి వస్తాము.’’

**2. అల్ బఖర** 286 ఏ ప్రాణిపైనా అల్లాహ్ దాని శక్తి సామర్థ్యాలకు మించిన బరువు బాధ్యతలను మోపడు. తాను సంపాదించిన పుణ్యానికి సత్ఫలితాన్నీ, తాను కూడబెట్టిన పాపానికి దుష్ఫలితాన్నీ ప్రతి వ్యక్తీ అనుభవిస్తాడు.

(విశ్వసించిన ప్రజలారా! మీరు ఈ విధంగా ప్రార్థిస్తూ ఉండండి) : ‘‘మా ప్రభూ! పొరపాటువల్ల జరిగే మా తప్పులను పట్టబోకు. స్వామీ! మాకు పూర్వం వారిపై మోపిన భారాన్ని మాపై మోపకు. ప్రభూ! ఏ బరువును మోసే శక్తి

మాలో లేదో , దానిని మాపై పెట్టకు. మమ్మల్ని మన్నించు. మమ్మల్ని క్షమించు. మమ్మల్ని కరుణించు. నీవు మాకు రక్షకుడవు. అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయపడు.''

**3. ఆలి ఇమ్రాన్**

ఆయతులు : 200 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**3. ఆలి ఇమ్రాన్** 1 - 2 అలిఫ్ లామ్ మీమ్. అల్లాహ్ - సజీవుడు , నిత్యుడు, విశ్వ వ్యవస్థకు ఆధారభూతుడు. వాస్తవానికి ఆయన తప్ప మరొక దేవుడు లేడు.

**3. ఆలి ఇమ్రాన్** 3 - 4 ప్రవక్తా! ఆయన ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాడు. అది సత్యాన్ని తీసుకువచ్చింది. మునుపు అవతరించిన గ్రంథాలను ధృవపరుస్తుంది. దీనికి పూర్వం ఆయన మానవులకు రుజుమార్గం చూపటానికి తౌరాతు, ఇన్‌జీలు గ్రంథాలను అవతరింపజేశాడు. ఇంకా (సత్యాసత్యాలను వేరుచేసి చూపే) గీటురాయిని అవతరింపజేశాడు. ఇకనుండి అల్లాహ్ ఆజ్ఞలను ధిక్కరించే వారికి కఠినశిక్ష పడటం నిశ్చయం. అల్లాహ్ మహత్తర శక్తి సంపన్నుడు, దుష్టత్వానికి తగిన ప్రతిఫలం ఇచ్చేవాడూను.

**3. ఆలి ఇమ్రాన్** 5 - 9 భూమ్యాకాశాలలోని ఏ వస్తువూ అల్లాహ్ కు గోప్యంగా లేదు. మాతృగర్భాలలో మీ రూపాలను తన ఇష్టానుసారం తీర్చిదిద్దేది ఆయనే కదా! మహాశక్తిశాలీ , మహా వివేకీ అయిన ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ప్రవక్తా! నీపై ఈ గ్రంథాన్ని అవతరింపజేసినవాడు ఆ దేవుడే! ఈ గ్రంథంలో రెండు రకాల ఆయతులు ఉన్నాయి. మొదటివి, ముహ్కమాత్ (స్పష్టమైనవి). అవి గ్రంథానికి పునాదుల వంటివి. రెండోవి , ముతషాబిహాత్ (అస్పష్టమైనవి). వక్ర మనస్కులు కలతలను రేపేందుకు ఎల్లప్పుడూ 'ముతషాబిహాత్' వెంటపడి వాటికి అర్థాలు తొడిగే ప్రయత్నం చేస్తారు. కాని వాటి అసలు అర్థాన్ని అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఎరుగరు. దీనికి భిన్నంగా , పరిపక్వ జ్ఞానం కలవారు ఇలా అంటారు: ''వాటిని మేము విశ్వసించాము. ఇవన్నీ మా ప్రభువు నుండి వచ్చినవే.'' యథార్థం ఏమిటంటే, ఏ విషయాన్నుండైనా విజ్ఞతగలవారే గుణపాఠం నేర్చుకుంటారు. వారు అల్లాహ్ ను ఇలా ప్రార్థిస్తారు : ''ప్రభూ! నీవు మాకు సరియైన మార్గాన్ని చూపావు. ఇక మా మనస్సులను వక్రమార్గం వైపునకు మళ్ళించకు. నీ కారుణ్య నిధినుండి మాకు కారుణ్యాన్ని ప్రసాదించు. నిజమైనదాతవు నీవే. ప్రభూ! నీవు నిశ్చయంగా మానవులందరినీ ఒక రోజున సమావేశపరుస్తావు. ఆ రోజు రావటంలో ఏమాత్రం సందేహం లేదు. నీవు ఎన్నటికీ ఆడిన మాట తప్పేవాడవు కావు.''

**3. ఆలి ఇమ్రాన్** 10 - 13 అవిశ్వాస వైఖరిని అవలంబించిన వారికి, వారి ఐశ్వర్యబలంకాని, సంతానబలంకాని అల్లాహ్ కు ప్రతికూలంగా ఉపయోగపడవు. వారు నరకానికి ఇంధనం అయి తీరుతారు. చివరకు వారి ముగింపు ఫిరౌను

అనుచరులు, అంతకు పూర్వపు అవిధేయుల ముగింపు వంటిది అవుతుంది - వారు అల్లాహ్ ఆయతులను అసత్యాలుగా తిరస్కరించారు. పర్యవసానంగా వారి పాపాలకుగాను అల్లాహ్ వారిని పట్టుకున్నాడు. వాస్తవం ఏమిటంటే, నిశ్చయంగా అల్లాహ్ కఠినంగా శిక్షిస్తాడు. కనుక ప్రవక్తా! నీ సందేశాన్ని స్వీకరించటానికి నిరాకరించిన వారికి ఇలా చెప్పు : ''అనతికాలంలోనే మీరు లోబరుచుకో బడతారు , నరకానికి తరుమబడతారు. నరకం చాలా చెడ్డ నివాసం.'' (బదర్ యుద్ధరంగంలో) మార్కొన్న ఆ రెండు వర్గాలలో మీకు గుణపాఠ సూచన ఉండినది. ఒక వర్గం అల్లాహ్ మార్గంలో పోరాడింది. రెండోది అవిశ్వాసుల వర్గం. అవిశ్వాసులు విశ్వాసులకు రెట్టింపుగా ఉన్న విషయాన్ని చూసేవాళ్ళు స్వయంగా తమ కళ్ళతోనే చూశారు. కాని అల్లాహ్ తాను ఇష్టపడ్డ వారిని తన సహాయంతో బలపరుస్తాడు (అనే విషయాన్ని యుద్ధపరిణామం నిరూపించింది). కళ్ళున్న వారికి ఇందులో ఒక మహత్తరమైన బోధ ఇమిడి ఉంది.

**3. ఆలి ఇమ్రాన్** 14 - 17 స్త్రీలూ, సంతానమూ, వెండి బంగారు రాసులూ, మేలుజాతి గుర్రాలూ, పశువులూ, సేద్యపు భూములూ వంటి వ్యామోహాలపై ప్రేమ ఆకర్షకంగా చెయ్యబడిరది. కాని ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంపదలు మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్ వద్ద ఉన్నదే. ఇలా చెప్పు : వాటికంటే ప్రశస్తమైనదేదో నేను మీకు తెలిపేదా ? భయభక్తులు కలవారి కొరకు వారి ప్రభువు వద్ద ఉద్యానవనాలు ఉన్నాయి. వాటి క్రిందుగా కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారికి శాశ్వతమైన జీవితం లభిస్తుంది. పరిశుద్ధ చరిత్రలైన భార్యల సాంగత్యం లభిస్తుంది. అల్లాహ్ సమ్మతి లభిస్తుంది. అల్లాహ్ తన దాసుల నడవడికను శ్రద్ధతో గమనిస్తాడు. వారు అల్లాహ్ ను ఇలా వేడుకుంటారు : ''ప్రభూ! మేము విశ్వసించాము. మా తప్పులను మన్నించు. మమ్మల్ని నరక జ్వాలల నుండి కాపాడు.'' వారు సహనశీలురు, సత్యసంధులు, విధేయులు, దానపరులు, క్షమించు అని రాత్రి చివరి గడియలలో అల్లాహ్ ను వేడుకుంటారు.

**3. ఆలి ఇమ్రాన్** 18 - 20 తాను తప్ప మరొక దైవం లేడు అనే సత్యానికి స్వయంగా అల్లాహ్యే సాక్ష్యమిచ్చాడు. దైవదూతలు, సమస్త జ్ఞానులు కూడ ఆ మహాశక్తిమంతుడూ , ఆ మహాజ్ఞానీ తప్ప వాస్తవానికి మరొక దైవం లేడు అని నిజాయితీగానూ, న్యాయంగానూ సాక్ష్యమిస్తారు. అల్లాహ్ దృష్టిలో అసలు ధర్మం కేవలం ఇస్లామ్ మాత్రమే. గ్రంథం ఇవ్వబడిన వారు ఈ ధర్మాన్ని త్రోసిరాజని విభిన్న విధానాలను అవలంబించారు. వారి ఈ వైఖరికి కారణం , వారు జ్ఞానం వచ్చిన తరువాత కూడా ఒకరిపై ఒకరు అత్యాచారం చెయ్యటానికి సంకల్పించటమే. అల్లాహ్ ఆజ్ఞలను, ఆయన బోధలను శిరసావహించ టానికి తిరస్కరించేవారి లెక్కలను పరిష్కరించటం అల్లాహ్ కు ఎంతోసేపు పట్టదు. ప్రవక్తా! ఇక వీరు నీతో ఘర్షణకు తలపడితే , ఇలా చెప్పు : ''నేనూ నా అనుచరులూ అల్లాహ్ కు సంపూర్ణంగా విధేయులమయ్యాము.'' గ్రంథం కలవారినీ , గ్రంథం లేనివారినీ ఉభయులనూ ఇలా అడుగు : ''మీరు కూడ ఆయనపట్ల విధేయతకూ , దాస్యానికీ అంగీకరించారా ?'' అలా చేస్తే వారు సరియైన మార్గాన్ని పొందినట్లే. కాని

ఒకవేళ వారు దానికి విముఖులైతే , నీ బాధ్యత కేవలం సందేశాన్ని అంద జెయ్యటమే. తరువాత అల్లాహ్ తన దాసుల విషయాలను తానే స్వయంగా చూసుకుంటాడు.

**3. ఆలి ఇమ్రాన్** 21 - 22 అల్లాహ్ ఆదేశాలనూ , బోధలనూ శిరసావహించటానికి తిరస్కరించేవారికీ , ఆయన ప్రవక్తలను అన్యాయంగా చంపేవారికీ, సత్యాన్నీ న్యాయాన్నీ శాసించటానికి ప్రజలలో నుండి లేచే వారి ప్రాణాల వెంట పడేవారికీ బాధాకరమైన శిక్షను గురించిన శుభవార్తను వినిపించు. వారి కర్మలు ఇహపరాలు రెండిరటిలోనూ వృధా అవుతాయి. వారికి సహాయపడే వాడెవడూ ఉండడు.

**3. ఆలి ఇమ్రాన్** 23 - 25 గ్రంథ జ్ఞానంలోని కొంత భాగం పొందిన వారి పరిస్థితి ఎలా ఉందో నీవు గమనించలేదా ? దైవగ్రంథం వారి మధ్య తీర్పు చెప్పగలందులకుగాను వారిని దాని వైపునకు ఆహ్వానించినప్పుడు , వారిలోని ఒక వర్గంవారు జారుకుంటారు. ఆ తీర్పు పట్ల వైముఖ్యం చూపుతారు. వారి ఈ నడతకు కారణం , వారు, ''మమ్మల్ని నరకాగ్ని అసలు ముట్టుకోదు. ఒకవేళ మాకు నరకశిక్ష పడినా, అది కొన్ని రోజులు మాత్రమే'' అని చెప్పుకోవటం. స్వయం కల్పితాలైన వారి నమ్మకాలే వారిని తమ ధర్మం విషయంలో అనేక అపోహలకు లోనుచేశాయి. ఏ దినమైతే రావటం తథ్యమో, ఆ దినాన మేము వారిని సమావేశపరచినప్పుడు వారి గతి ఏమవుతుందో ? ఆ రోజున ప్రతి మనిషికీ తాను సంపాదించుకున్నదానికి పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఎవరికీ అన్యాయం జరగదు.

**3. ఆలి ఇమ్రాన్** 26 - 27 ఇలా అను : ''ఓ అల్లాహ్! విశ్వసామ్రాజ్యాధిపత్యానికి ప్రభూ! నీవు కోరినవారికి ప్రభుత్వాధికారాన్ని ప్రసాదిస్తావు. నీవు కోరిన వారి నుండి దాన్ని లాక్కుంటావు. నీవు కోరిన వారికి గౌరవాన్ని ప్రసాదిస్తావు. నీవు కోరిన వారిని పరాభవంపాలు చేస్తావు. శుభాలు నీ అధీనంలో ఉన్నాయి. నిస్సందేహంగా నీకు అన్నింటిపైనా అధికారం ఉంది. నీవు రాత్రిని పగటిలోకి ప్రవేశింపచేస్తావు. పగలును రాత్రిలోకి ప్రవేశింపచేస్తావు. ప్రాణంలేని దాని నుండి ప్రాణమున్న దానిని తీస్తావు. ప్రాణమున్న దాని నుండి ప్రాణం లేనిదానిని తీస్తావు. నీవు కోరిన వారికి లెక్కలేనంత ఉపాధిని ప్రసాదిస్తావు.''

**3. ఆలి ఇమ్రాన్** 28 - 30 విశ్వాసులు తోటి విశ్వాసులను కాదని అవిశ్వాసులను తమ మిత్రులుగా, తమ సహచరులుగా, తమ సహాయకులుగా ఎంతమాత్రం ఎన్నుకోరాదు. అలా చేసేవారికి అల్లాహ్తో ఏ విధమైన సంబంధమూ లేదు. అయితే వారి దౌర్జన్యం నుండి రక్షణ పొందటానికి , మీరు ఆ వైఖరిని అభినయిస్తే అది క్షమార్హమే. కాని అల్లాహ్ తనకే భయపడండి అని హెచ్చరిస్తున్నాడు. మీరంతా ఆయన వద్దకే మరలిపోవలసి ఉంది. ప్రవక్తా! ప్రజలను ఇలా హెచ్చరించు : ''మీ మనస్సులలో ఉన్నదంతా - మీరు దానిని దాచినా లేక బహిర్గతం చేసినా - అల్లాహ్ కు తెలుసు. భూమ్యాకాశాలలో ఉన్నది ఏదీ ఆయనకు తెలియకుండా లేదు. ఆయన అధికారం అన్నింటిపైనా ఉంది. ప్రతి మనిషీ తాను చేసిన- మంచి చేసినా లేక చెడ్డ చేసినా-దాని ఫలితాన్ని ప్రత్యక్షంగా చూసేరోజు రాబోతోంది. తనకు ఈ రోజు ఇంకా ఎంతో దూరంగా ఉంటే ఎంత బాగుండేది అని మనిషి ఆ రోజున

కోరుకుంటాడు. అల్లాహ్ తనకు భయపడండి అని మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు. ఆయనకు తన దాసులంటే ఎంతో ప్రేమ.''

**3. ఆలి ఇమ్రాన్** 31 - 32 ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు : ''మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అనన్యంగా కరుణించేవాడూను.'' వారితో ఇంకా, ''అల్లాహ్ కూ, ప్రవక్తకూ విధేయత చూపండి'' అని అను. ఒకవేళ వారు నీ ఈ సందేశాన్ని స్వీకరించకపోతే , అల్లాహ్ తనకూ, తన ప్రవక్తకూ విధేయత చూపటానికి నిరాకరించిన వారిని ప్రేమించటం అనేది నిశ్చయంగా జరగదు.

**3. ఆలి ఇమ్రాన్** 33 - 37 అల్లాహ్ ఆదమ్‌కూ, నూహ్ కూ, ఇబ్రాహీము సంతతికీ, ఇమ్రాను సంతతికీ, సమస్త భూలోక వాసులపై ప్రాధాన్యత ఇచ్చి (తన సందేశం కొరకు) ఎన్నుకున్నాడు. ఒకరి వంశాన్నుండి ఒకరు జన్మించిన వీరందరూ ఒకే పరంపరకు చెందినవారు. అల్లాహ్ అంతా వింటాడు, ఆయనకు అంతా తెలుసు. ఇమ్రాను స్త్రీ అల్లాహ్ ను ఇలా ప్రార్థించినపుడు (అల్లాహ్ విన్నాడు). ''ప్రభూ! నా గర్భంలో ఉన్న శిశువును నేను నీకు సమర్పించుకుంటున్నాను. అది నీ సేవకు అంకితం. నా ఈ కానుకను స్వీకరించు. నీవు అన్నీ వినేవాడవు , అన్నీ తెలిసిన వాడవు.'' తరువాత ఆమెకు ఆడు శిశువు జన్మించినపుడు, ఆమె ఇలా విన్నవించుకుంది : ''ప్రభూ! నాకు ఆడు శిశువు కలిగింది - ఆమెకు ఏ శిశువు పుట్టిందో అల్లాహ్ కు బాగా తెలుసు - బాలుడు బాలిక వంటివాడు కాడు. సరే, నేను దానికి మర్యమ్ అని పేరు పెట్టాను. శాపగ్రస్తుడైన షైతాను బారినుండి రక్షణ కొరకు నేను దానినీ , దాని సంతానాన్నీ నీకు అప్పగిస్తున్నాను. '' చివరకు ఆమె ప్రభువు ఆ బాలికను సంతోషంతో స్వీకరించి ఆమెను ఒక మంచి బాలికగా తీర్చిదిద్దాడు. ఇంకా, జకరియ్యాను ఆమెకు సంరక్షకుడుగా నియమించాడు....

**3. ఆలి ఇమ్రాన్** 37 - 41 .... జకరియ్య ఆమె గదికి పోయినప్పుడల్లా , ఆమె వద్ద ఆయన ఏవో కొన్ని భోజన పదార్థము లను చూసేవాడు. ఆమెను ఇలా అడిగేవాడు : ''మర్యమ్! ఇవి నీ వద్దకు ఎక్కడ నుండి వచ్చాయి ?'' ఆమె ఇలా జవాబు చెప్పేది : ''అల్లాహ్ నుండి వచ్చాయి. అల్లాహ్ తాను కోరిన వారికి లెక్కలేనంత ఉపాధిని ప్రసాదిస్తాడు.'' ఈ పరిస్థితిని చూసిన జకరియ్య తన ప్రభువును ఇలా ప్రార్థించాడు , ''ప్రభూ! నీవు నీ మహిమతో నాకు మంచి సంతానాన్ని ప్రసాదించు. ప్రార్థనలను వినేవాడవు నీవే. '' జకరియ్య తన గదిలో నిలబడి నమాజు చేస్తూ ఉన్నప్పుడు , దైవదూతలు సమాధానంగా ఇలా ప్రకటించారు : ''అల్లాహ్ నీకు యహ్యా (ను గురించిన) శుభవార్త ఇస్తున్నాడు. అతను అల్లాహ్ ఆజ్ఞను ఒకదాన్ని ధ్రువపరిచేవాడుగా వస్తాడు. అతనిలో నాయకత్వపు దర్పమూ, పెద్దరికపు ఠీవీ ఉంటాయి. గొప్ప మనోనిగ్రహం కలిగి ఉంటాడు. ప్రవక్తగా నియమింపబడతాడు. సజ్జనులలో పరిగణింపబడతాడు.'' జకరియ్య ఇలా అన్నాడు : ''ప్రభూ! నేనా ముసలివాణ్ణి , నా భార్యయేమో గొడ్రాలు. నాకు కొడుకు ఎలా కలుగుతాడు ?'' ఇలా సమాధానం వచ్చింది: ''అలానే అవుతుంది. అల్లాహ్ తాను

కోరిన దానిని చేస్తాడు. '' అతను ఇలా మనవి చేసుకున్నాడు : ''స్వామీ! నా కొరకేదయినా సూచనను నిర్ణయించు.'' అల్లాహ్ ఇలా అన్నాడు : ''సూచన ఏమిటంటే, నీవు మూడు రోజుల వరకు సైగలతో తప్ప ప్రజలతో మాట్లాడవు (మాట్లాడలేవు), అప్పుడు నీవు నీ ప్రభువును ఎక్కువగా స్మరించు. ఉదయం , సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడు.''

**3. ఆలి ఇమ్రాన్** 42 - 43 తరువాత ఒకప్పుడు దైవదూతలు వచ్చి మర్యమ్‌తో ఇలా అన్నారు : ''మర్యమ్! అల్లాహ్ నిన్ను ఎన్నుకున్నాడు. నీకు పరిశుద్ధతను ప్రసాదించాడు. ప్రపంచ మహిళలందరిపై నీకు ప్రాధాన్యము నిచ్చి నిన్ను తన సేవకొరకు ఎన్నుకున్నాడు. మర్యమ్! నీవు నీ ప్రభువునకు విధేయురాలవుగా ఉండు. ఆయన సాన్నిధ్యంలో సజ్‌దా చెయ్యి (సాష్టాంగపడు). రుకూచేసే దాసులతో నీవూ రుకూ చెయ్యి (నమ్రతతో వంగు).''

**3. ఆలి ఇమ్రాన్** 44 ప్రవక్తా! ఇవన్నీ అగోచర విషయాలకు సంబంధించిన వార్తలు. వాటిని మేము నీకు వహీ ద్వారా తెలుపుతున్నాము. లేకపోతే , మర్యమ్ సంరక్షకుడు ఎవరు అవ్వాలి అనే విషయ నిర్ణయం కొరకు , ఆలయ సేవకులు తమ తమ కలములను విసరినప్పుడు నీవు అక్కడ లేవుకదా! ఇంకా , వారి మధ్య వివాదం చెలరేగినప్పుడు కూడా నీవు అక్కడ లేవు.

**3. ఆలి ఇమ్రాన్** 45 - 48 దైవదూతలు ఇలా అన్నారు : ''మర్యమ్! అల్లాహ్ తన ఒక 'ఆజ్ఞ'కు సంబంధించిన శుభ వార్తను నీకు పంపుతున్నాడు. అతని పేరు ఈసా మసీహ్. అతను మర్యమ్ కుమారుడు. అతడు ఇహపర లోకాలలో గౌరవనీయుడౌతాడు. అల్లాహ్ సామీప్యం పొందిన దాసులలోని వాడుగా పరిగణింపబడతాడు. ఉయ్యాలలో ఉన్నప్పుడూ , పెరిగి పెద్దవాడైనప్పుడూ ప్రజలతో సంభాషిస్తాడు. ఇంకా అతను ఒక సత్పురుషుడౌతాడు.'' ఇది విన్న మర్యమ్ ఇలా అన్నారు : ''ప్రభూ! నాకు శిశువు ఎలా జన్మిస్తుంది ? నన్ను ఏ పురుషుడూ చేతితోనైనా తాకలేదే!'' సమాధానం లభించింది : ''అలానే జరుగుతుంది. అల్లాహ్ తాను కోరినదాన్ని సృష్టిస్తాడు. ఆయన ఒక పనిని చెయ్యాలని నిర్ణయించినప్పుడు , కేవలం దానిని ''అయిపో'' అంటాడు. అంతే, అది అయిపోతుంది.'' (దైవదూతలు ఇంకా ఇలా అన్నారు): ''అల్లాహ్ అతనికి గ్రంథాన్నీ , దివ్య జ్ఞానాన్నీ బోధిస్తాడు. తౌరాతు, ఇంజీలు గ్రంథాల జ్ఞానాన్ని నేర్పుతాడు.

**3. ఆలి ఇమ్రాన్** 49 - 51 ఇంకా అతనిని ఇస్రాయీలు సంతతి వద్దకు తన ప్రవక్తగా పంపుతాడు. '' (ప్రవక్తగా ఇస్రాయీలు సంతతి వద్దకు వచ్చినప్పుడు అతను ఇలా అన్నాడు) : ''నేను మీ ప్రభువు నుండి మీ వద్దకు సూచనను తీసుకువచ్చాను. మీముందే నేను మట్టితో పక్షి ఆకారం గల ఒక బొమ్మను తయారుచేసి దానిలోకి శ్వాస ఊదుతాను. అది అల్లాహ్ ఆజ్ఞతో పక్షి అవుతుంది. నేను అల్లాహ్ ఆజ్ఞతో పుట్టుగ్రుడ్డిని , కుష్ఠరోగిని బాగుచేస్తాను. ఆయన అనుజ్ఞతో మృతులను బ్రతికిస్తాను. ఇంకా మీరు ఏమేమి తింటారో , మీ గృహాలలో ఏమేమి నిలువ చేసి ఉంచుతారో కూడా మీకు తెలుపుతాను. మీరు విశ్వసించే వారే అయితే , వాస్తవంగా ఇందులో మీకు

గొప్ప సూచన ఉంది. ప్రస్తుతం నా కాలంలో ఉన్న తౌరాతు గ్రంథోపదేశాలను ధ్రువపరచటానికి నేను వచ్చాను. ఇంకా, పూర్వం మీకు నిషేధించబడిన (హరామ్) కొన్ని వస్తువులను ధర్మసమ్మతం (హలాల్) చెయ్యటానికి కూడా వచ్చాను. చూడండి! నేను మీ ప్రభువు నుండి మీ వద్దకు సూచనను తీసుకువచ్చాను. కనుక అల్లాహ్ కు భయపడండి, నన్ను అనుసరించండి. అల్లాహ్ నాకూ ప్రభువే మీకూ ప్రభువే. కనుక మీరు ఆయన దాస్యాన్నే చెయ్యండి. ఇదే రుజుమార్గం.

**3. ఆలి ఇమ్రాన్** 52 - 53 ఇస్రాయీలు వంశస్థుల అవిశ్వాసాన్ని , తిరస్కారాన్ని పసిగట్టినప్పుడు ఈసా ఇలా అన్నాడు: ''అల్లాహ్ మార్గంలో నాకు సహాయకులుగా ఎవరు ఉంటారు ?'' అప్పుడు హవారీలు ఇలా జవాబు పలికారు : ''మేము అల్లాహ్ కు సహాయకులం. మేము అల్లాహ్ ను విశ్వసించాము. మేము ముస్లిములము (అల్లాహ్ కు విధేయులము) అనే విషయానికి మీరు సాక్షిగా ఉండండి. ప్రభూ! నీవు అవతరింపజేసిన ఆజ్ఞను మేము విశ్వసించాము. సందేశహరుణ్ణి అనుసరించటానికి మేము అంగీక రించాము. మా పేర్లు సాక్షుల జాబితాలో వ్రాయి.''

**3. ఆలి ఇమ్రాన్** 54 - 57 ఇస్రాయీలు సంతతివారు (ఈసాకు వ్యతిరేకంగా) రహస్యపుటెత్తులు పన్నసాగారు. వారి ఎత్తులకు పై ఎత్తులను అల్లాహ్ కూడా పన్నాడు. ఎత్తులు వెయ్యటంలో అల్లాహ్ మేటి. (అది అల్లాహ్ రహస్య తంత్రమే). అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు : ''ఈసా! నేను నిన్ను తిరిగి నా దగ్గరకు రప్పించుకుంటాను , నా వైపునకు లేపుకుంటాను. నిన్ను తిరస్కరించిన వారి నుండి (అంటే వారి చెడు సాంగత్యం నుండి , వారి కలుషిత పరిసరాలలో వారితో కలిసి ఉండటం నుండి కాపాడి) నిన్ను పరిశుద్ధునిగా చేస్తాను. నిన్ను అనుసరించిన వారికి , నిన్ను తిరస్కరించిన వారిపై ప్రళయం వరకు ఆధిక్యాన్ని ప్రసాదిస్తాను. మీరంతా చివరకు నా వద్దకే మరలివస్తారు. అప్పుడు మీమధ్య తలెత్తిన విభేదాలను గురించి తీర్పు చెబుతాను. అవిశ్వాస వైఖరినీ తిరస్కార ధోరణినీ అవలంబించిన వారిని ఇహపరాలు రెండిరటిలోనూ కఠినంగా శిక్షిస్తాను. వారు సహాయకులనెవ్వరినీ పొందలేరు. ఇక విశ్వసించి మంచిపనులు చేసేవారికి వారి బహుమానాలు పూర్తిగా ఇవ్వబడతాయి. బాగా తెలుసుకోండి! దుర్మార్గులను అల్లాహ్ ఎంతమాత్రం ప్రేమించడు.''

**3. ఆలి ఇమ్రాన్** 58 - 60 ప్రవక్తా! మేము నీకు వినిపించేవి సూచనలతోనూ , వివేకంతోనూ నిండివున్న గాథలు. అల్లాహ్ దృష్టిలో ఈసా పుట్టుక ఆదమ్ పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదమును మట్టితో చేసి ''అయిపో'' అని ఆజ్ఞాపించాడు, అతను అయ్యాడు. అసలు వాస్తవం ఇది. అది మీ ప్రభువు తరఫు నుండి మీకు తెలుపబడుతోంది. దాన్ని శంకించేవారిలో నీవు చేరిపోకు.

**3. ఆలి ఇమ్రాన్** 61 - 63 ఈ జ్ఞానం వచ్చిన తరువాత ఇక నీతో ఎవరైనా ఈ విషయంలో వివాదానికి దిగితే, ప్రవక్తా! వారితో ఇలా అను: ''రండి! మీరూ మేమూ స్వయంగానూ వద్దాము. మన ఆలుబిడ్డలను కూడ పిలుచుకు

వద్దాము. ''అసత్యం పలికే వారిపై అల్లాహ్ శాపం పడుగాక అని ప్రార్థిద్దాము. '' ఇవి పూర్తిగా నిజమైన సంఘటనలే. వాస్తవం ఏమిటంటే అల్లాహ్ తప్ప వేరే దేవుడు లేడు. అల్లాహ్ - నిశ్చయంగా ఆయన శక్తియే అన్ని శక్తులకంటే మహత్తరమైనది. ఆయన వివేకమే విశ్వవ్యవస్థను నడుపుతున్నది. ఒకవేళ వారు (ఈ షరతుపై పోటీలో పాల్గొనటానికి) విముఖులైతే (వారు సంక్షోభాన్ని రేకెత్తించేవారు మాత్రమే అనేది స్పష్టమైపోతుంది). అల్లాహ్ సంక్షోభాన్ని రేకెత్తించేవారి స్థితిని బాగా ఎరిగినవాడే.

**3. ఆలి ఇమ్రాన్** 64 ప్రవక్తా! ఇలా చెప్పు : ''గ్రంథ ప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్ కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్ ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది.'' ఈ సందేశాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే , వారితో స్పష్టంగా ఇలా అను : ''మేము ముస్లిములము (కేవలం అల్లాహ్కు దాస్యం చేసేవారు , విధేయత చూపేవారు) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి.''

**3. ఆలి ఇమ్రాన్** 65 - 68 గ్రంథప్రజలారా! ఇబ్రాహీము ధర్మం గురించి మీరు ఎందుకు తగాదాపడుతున్నారు ? తౌరాతు, ఇంజీలు గ్రంథాలు ఇబ్రాహీము తరువాతేగా అవతరించాయి. మీరు ఈ స్వల్ప విషయాన్ని కూడా అర్థం చేసుకోలేరా? మీకు తెలిసిన విషయాలను గురించి మీరు బాగా వాదించారు. కాని మీకు తెలియని విషయాలను గురించి కూడా మీరు ఇప్పుడు ఎందుకు వాదిస్తున్నారు ? అల్లాహ్ కు తెలుసు కానీ మీకు తెలియదు. ఇబ్రాహీము యూదుడూ కాదు , క్రైస్తవుడూ కాదు. అతను అచంచలమైన విశ్వాసముకల ముస్లిము. అతను ఎంతమాత్రం ముష్రిక్కులలోని వాడు కాదు. ఇబ్రాహీముతో సంబంధం కలిగి వుండే హక్కు ఎవరికైనా ఉందీ అంటే , అది అతన్ని అనుసరించిన ప్రజలకు మాత్రమే. ఇప్పుడు ఈ ప్రవక్త , ఇతన్ని విశ్వసించేవారు ఆ సంబంధానికి అందరికంటే ఎక్కువగా అర్హులు. కేవలం విశ్వసించిన వారికే అల్లాహ్ అండదండలు లభిస్తాయి.

**3. ఆలి ఇమ్రాన్** 69 - 71 (విశ్వసించిన ప్రజలారా!) గ్రంథ ప్రజలలోని ఒక వర్గం ఏదో ఒక విధంగా మిమ్మల్ని రుజుమార్గం నుండి తొలగించాలని కోరుతున్నది. వాస్తవానికి వారు తమను తాము తప్ప మరెవరినీ అపమార్గం పట్టించటం లేదు. కాని వారు దానిని గ్రహించటం లేదు. గ్రంథప్రజలారా! అల్లాహ్ సూచనలను మీరు ఎందుకు తిరస్కరిస్తున్నారు, స్వయంగా మీరే వాటిని చూస్తూ ఉన్నప్పటికీ ? గ్రంథ ప్రజలారా! మీరు సత్యానికి అసత్యపు రంగును పులిమి దానిని ఎందుకు అనుమానాస్పదం చేస్తారు? బుద్ధిపూర్వకంగా సత్యాన్ని ఎందుకు దాస్తారు?

**3. ఆలి ఇమ్రాన్** 72 - 74 గ్రంథ ప్రజలలోని ఒక వర్గం ఇలా అంటుంది: ''ఈ ప్రవక్తను విశ్వసించిన వారిపై అవతరించిన దాన్ని ఉదయం విశ్వసించండి , సాయంత్రం తిరస్కరించండి. బహుశా ఈ ఉపాయం వల్ల వారు తమ విశ్వాసం నుండి వెనక్కి మరలవచ్చు. '' ఇంకా వారు ''మన మతం వాణ్ణి తప్ప మరెవరినీ నమ్మకండి '' అని పరస్పరం

చెప్పుకుంటారు. ప్రవక్తా! వారితో ఇలా అను : ''వాస్తవానికి మార్గదర్శకత్వ మంటే అల్లాహ్ యొక్క మార్గదర్శకత్వమే. మీకు ఒకప్పుడు ఇవ్వబడిన దానినే ఆయన మరొకరికి ఇవ్వటం అనేదీ , లేదా మీ ప్రభువు సమక్షంలో మీకు వ్యతిరేకంగా నివేదించటానికి ఇతరులకు బలమైన వాదాన్ని ఇవ్వటం అనేదీ కేవలం ఆయన అనుగ్రహమే.'' ప్రవక్తా! వారితో ఇంకా ఇలా అను : ''అనుగ్రహమూ, గౌరవమూ అనేవి అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి. ఆయన తాను కోరినవారికి వాటిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ విశాల దృష్టి కలవాడు , అంతా తెలిసినవాడు, తాను కోరినవారిని తన కారుణ్యం కొరకు ప్రత్యేకించుకుంటాడు. అల్లాహ్ అనుగ్రహం మహత్తరమైనది.''

**3. ఆలి ఇమ్రాన్** 75 - 77 గ్రంథ ప్రజలలో ఒకడు ఎలాంటివాడంటే అతడిపై నమ్మకంతో మీరు ధన , కనక రాశిని అప్పగించినా, దానిని అతడు మీకు తిరిగి ఇస్తాడు. మరొకడు , కేవలం ఒక దీనార్ విషయంలో కూడా మీరు అతణ్ణి నమ్మితే, అతడు దానిని , మీరు అతడి నెత్తిపై నిల్చుంటే తప్ప , తిరిగి ఇవ్వడు. వారి ఈ నైతిక స్థితికి కారణం ఏమిటంటే, వారు ఈ విధంగా అంటారు : ''ఉమ్మీల (యూదులు కానివారి) వ్యవహారంలో మమ్మల్ని పట్టుకోవటం జరగదు.'' ఈ అబద్ధాన్ని వారు కల్పించి అల్లాహ్ కు ఆరోపిస్తున్నారు. అది (అంటే అటువంటి ఏ మాటనూ అల్లాహ్ అనలేదనే విషయం) వారికి బాగా తెలుసు. అసలు వారిని ప్రశ్నించటం ఎందుకు జరగదు ? ఎవరు తమ ప్రమాణాన్ని నెరవేరుస్తారో , చెడుకు దూరంగా ఉంటారో , వారు అల్లాహ్ కు ప్రీతిపాత్రులవుతారు. ఎందుకంటే , భయభక్తులు కలవారంటే అల్లాహ్ కు ఎంతో ప్రేమ. ఇక ఎవరు అల్లాహ్ కు చేసిన వాగ్దానాన్ని , తమ ప్రమాణాలను స్వల్పమైన వెలకు విక్రయిస్తారో , వారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. ప్రళయం రోజున అల్లాహ్ వారిని పలుకరించడు, వారివైపు చూడడు, వారిని పరిశుద్ధులుగానూ చెయ్యడు. పైగా వారికి అత్యంత బాధాకరమైన శిక్ష పడుతుంది.

**3. ఆలి ఇమ్రాన్** 78 వారిలో కొందరు , తాము చదివేది గ్రంథంలోని ఒక భాగమే అని మీరు భావించాలని , గ్రంథం పఠిస్తూ తమ నాలుకలను మెలికలు త్రిప్పుతారు. కాని వాస్తవంగా అది గ్రంథంలోని భాగం కాదు. వారు , ''మేము చదివేదంతా అల్లాహ్ తరఫు నుండి వచ్చినదే '' అని అంటారు. కాని అది అల్లాహ్ తరఫు నుండి రాలేదు. వారు బుద్ధిపూర్వకంగా అబద్ధాన్ని అల్లాహ్ కు అంటగడుతున్నారు.

**3. ఆలి ఇమ్రాన్** 79 - 80 ఏ వ్యక్తికైనా అల్లాహ్ గ్రంథాన్ని, వివేకాన్ని, ప్రవక్తపదవిని ప్రసాదిస్తే, అతడు ప్రజలతో, ''మీరు అల్లాహ్ కు బదులుగా నాకు దాసులు కండి '' అని అనటం తగదు. అతడు ఇదే అంటాడు , ''మీరు ఇతరులకు బోధించేటటువంటి, స్వయంగా చదివేటటువంటి గ్రంథంలోని ఉపదేశాలు కోరేవిధంగా నిజమైన ''రబ్బానీలు'' అవండి.'' దైవదూతలనో లేక ప్రవక్తలనో ప్రభువులుగా చేసుకోండి అని అతను మీతో ఎన్నటికీ అనడు. ముస్లిములయిన మీకు ఒక ప్రవక్త అవిశ్వాసాన్ని అవలంబించండి అని ఆదేశించటం సాధ్యమా?

**3. ఆలి ఇమ్రాన్** 81 - 82 జ్ఞాపకం తెచ్చుకోండి, ప్రవక్తల నుండి అల్లాహ్ ఈ వాగ్దానం తీసుకున్నాడు : ''నేను ఈ రోజు మీకు గ్రంథాన్ని, వివేకాన్ని ప్రసాదిస్తాను. పూర్వం నుండి మీ వద్ద ఉన్న హితోపదేశాన్ని ధ్రువీకరిస్తూ రేపు ప్రవక్త ఎవరైనా మీ వద్దకు వస్తే , ఆయనను మీరు విశ్వసించవలసి ఉంటుంది , ఆయనకు సహాయం చెయ్యవలసి ఉంటుంది. ఈ విధంగా ప్రవచించి అల్లాహ్ ఇలా అడిగాడు : ''ఈ విషయాన్ని మీరు అంగీకరిస్తారా? నా తరఫు నుండి మీపై మోపబడిన ఈ ప్రమాణం బరువు బాధ్యతలను మీరు స్వీకరిస్తారా?'' వారు ఇలా అన్నారు: ''అవును, మేము స్వీకరిస్తాము.'' అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు: ''అయితే దీనికి సాక్షులుగా ఉండండి. మీతోపాటు నేను కూడా సాక్షిగా ఉంటాను. ఇకపై ఎవరు తమ వాగ్దానం నుండి మరలుతారో, వారే హద్దులు మీరేవారు.''

**3. ఆలి ఇమ్రాన్** 83 - 85 ఇక ఈ ప్రజలు అల్లాహ్ కు విధేయత చూపే విధానాన్ని (అల్లాహ్ ధర్మాన్ని) వదలిపెట్టి , మరొక విధానాన్ని దేన్నయినా కోరుతున్నారా ఏమిటి ? వాస్తవంగా భూమ్యాకాశాలలో ఉన్న సకల వస్తువులూ ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా అల్లాహ్ విధేయతకు కట్టుబడి ముస్లిములై ఉన్నాయి. ఆయన వైపునకే అంతా మరలిపోవలసి ఉంది. ప్రవక్తా! ఇలా అను : ''మేము అల్లాహ్ ను విశ్వసిస్తాము. మాపై అవతరింపజెయ్యబడిన హితోపదేశాన్ని విశ్వసిస్తాము. ఇంకా ఇబ్రాహీము , ఇస్మాయీలు, ఇస్హాఖు, యాఖూబు మరియు యాఖూబు సంతానములపై అవతరించిన దానిని కూడ విశ్వసిస్తాము. ఇంకా మూసా , ఈసా, ఇతర ప్రవక్తలకు వారి ప్రభువు తరఫు నుండి ఇవ్వబడిన ఉపదేశాలను కూడా విశ్వసిస్తాము. మేము వారి మధ్య విచక్షణ చెయ్యము. మేము అల్లాహ్ విధేయతకు కట్టుబడి (ముస్లిములుగా) ఉన్నాము. '' ఎవడైనా ఈ విధేయతా విధానాన్ని (ఇస్లామ్) కాక మరొక విధానాన్ని అవలంబించదలిస్తే , ఆ మార్గం ఎంతమాత్రం ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడౌతాడు, నష్టపోతాడు.

**3. ఆలి ఇమ్రాన్** 86 - 91 విశ్వాసవరం పొందిన తరువాత మళ్ళీ అవిశ్వాసాన్ని అవలంబించే ప్రజలకు అల్లాహ్ సన్మార్గం చూపుతాడనేది ఎలా జరుగుతుంది ? వాస్తవానికి, ఈయన ప్రవక్త అనే విషయం సత్యం అని వారే స్వయంగా సాక్ష్యమిచ్చారు. ఇంకా వారి వద్దకు స్పష్టమైన సూచనలు కూడా వచ్చాయి. అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు. వారి ఈ దుర్మార్గానికి తగిన ప్రతిఫలం వారిని అల్లాహ్ , దైవదూతలు, సర్వమానవులు శపించటమే. ఇదే స్థితిలో వారు సదా ఉంటారు. వారి శిక్షా తగ్గదు వారికి వ్యవధీ ఇవ్వబడదు. కాని ఎవరు తరువాత పశ్చాత్తాపపడతారో, తమ నడవడికను సరిదిద్దు కుంటారో వారు రక్షింపబడతారు. అల్లాహ్ క్షమించేవాడూ కనికరించేవాడూను. అయితే , విశ్వసించిన తరువాత , ఎవరు అవిశ్వాస వైఖరిని అవలంబిస్తారో , ఇంకా తమ అవిశ్వాసంలోనే ముందుకు పోతారో , వారి పశ్చాత్తాపం ఎంతమాత్రం అంగీకరించబడదు. ఇటువంటివారు పక్కా మార్గభ్రష్టులు. ఎవరు అవిశ్వాసం అవలంబించి అవిశ్వాస స్థితిలోనే అసువులు బాశారో , వారిలో ఎవరైనా తమను తాము శిక్ష నుండి కాపాడుకోవటానికి భూమినంతా బంగారం నింపి పరిహారంగా ఇచ్చినా స్వీకరించబడదు అనే

విషయం నిశ్చయం. ఇలాంటి వారికొరకు బాధాకరమైన శిక్ష సిద్ధంగా ఉంది. ఇంకా వారికి సహాయం చేసేవారెవరూ ఉండరు.

**3. ఆలి ఇమ్రాన్** 92 మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చుపెట్టనంత వరకు మీరు సత్కార్యస్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

**3. ఆలి ఇమ్రాన్** 93 - 95 ఈ ఆహార పదార్థాలన్నీ (ముహమ్మద్ షరీయత్తులో ధర్మ సమ్మతమైనవి) ఇస్రాయీలు సంతతికి కూడ ధర్మ సమ్మతంగా ఉండేవి. కాని తౌరాతు గ్రంథం అవతరణకు పూర్వం ఇస్రాయీలు (హజ్రత్ యాఖూబు) స్వయంగా తనకు కొన్ని వస్తువులను నిషేధించుకున్నాడు. వారిని ఇలా అడుగు: ''మీరు (అభ్యంతరం తెలుపుటలో) సత్యవంతులే అయితే తౌరాతును తీసుకురండి. దానిలోని ఏదైనా భాగాన్ని చూపించండి. దీని తరువాత కూడ ఎవరైనా అబద్ధాన్ని సృష్టించి అల్లాహ్ కు ఆపాదించినట్లయితే వారే వాస్తవానికి దుర్మార్గులు.'' వారికి ఇలా బోధించు : ''అల్లాహ్ చెప్పింది నిజం. కనుక మీరు ఏకాగ్ర మనస్కులై ఇబ్రాహీము పద్ధతినే అనుసరించాలి. ఇబ్రాహీము షిర్కు చేసే వారిలోని వాడు కాదు.''

**3. ఆలి ఇమ్రాన్** 96 - 97 ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనా గృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వప్రజలందరికీ అది మార్గదర్శక కేంద్రంగా రూపొందించబడిరది. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి, ఇబ్రాహీము యొక్క ప్రార్థనాస్థలం ఉన్నది. దానిలో ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు. ప్రజలపై అల్లాహ్ కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ గృహానికి వెళ్ళే శక్తిగలవారు దాని హజ్‌ను విధిగా చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించేవాడు అల్లాహ్ కు ప్రపంచ ప్రజల అవసరం ఎంతమాత్రం లేదు అని స్పష్టంగా తెలుసుకోవాలి.

**3. ఆలి ఇమ్రాన్** 98 - 99 ఇలా చెప్పు: ''గ్రంథ ప్రజలారా! మీరు అల్లాహ్ మాటలను ఎందుకు తిరస్కరిస్తారు ? మీరు చేసే చేష్టలన్నింటినీ అల్లాహ్ కనిపెడుతూనే ఉన్నాడు.'' ఇంకా ఇలా అను : ''గ్రంథ ప్రజలారా! ఏమిటి మీ ఈ వైఖరి, అల్లాహ్ మాటను విశ్వసించే వాణ్ణి కూడా అల్లాహ్ మార్గంపై నడవకుండా అడ్డుకుంటున్నారా? (అతడు సత్యమార్గంపై ఉన్నాడనటానికి) స్వయంగా మీరే సాక్షులై కూడా అతడు వక్రమార్గంలో నడవాలని కోరుకుంటున్నారా? అల్లాహ్ మీ చేష్టలపట్ల అజాగ్రత్తగా లేడు.''

**3. ఆలి ఇమ్రాన్** 100 - 101 విశ్వసించిన ప్రజలారా! మీరు గ్రంథ ప్రజలలోని ఒక వర్గం వారి మాటను వింటే , వారు మిమ్మల్ని విశ్వాసం నుండి మళ్ళీ అవిశ్వాసం దెసకు మరలిస్తారు. మీరు అవిశ్వాసం దెసకు ఎలా మరలిపోగలరు , అల్లాహ్ వాక్యాలు మీకు వినిపించబడుతూ ఉన్నప్పుడు , ఆయన ప్రవక్త మీ మధ్య ప్రత్యక్షంగా ఉన్నప్పుడు ? అల్లాహ్ ను గట్టిగా పట్టుకునేవాడికి తప్పకుండా రుజుమార్గం లభిస్తుంది.

**3. ఆలి ఇమ్రాన్** 102 - 103 విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కు ఏవిధంగా భయపడాలో , ఆ విధంగా భయపడండి. ముస్లిములుగా తప్ప మీరు మరణించకండి. అంతా కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. విభేదాలలో పడకండి. అల్లాహ్ మీకు చేసిన మేలును జ్ఞాపకం తెచ్చుకోండి. మీరు ఒకరికొకరు శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలను కలిపాడు. ఆయన కటాక్షం వల్లనే మీరు పరస్పరం సోదరులయ్యారు. మీరు నిప్పుతో నిండివున్న ఒక గుండం ఒడ్డున నిలబడి ఉన్నారు. అల్లాహ్ మిమ్మల్ని దాని నుండి కాపాడాడు. అల్లాహ్ ఈ విధంగా తన సూచనలను మీకు స్పష్టం చేస్తున్నాడు , బహుశా ఈ సూచనల ద్వారా సాఫల్యం సిద్ధించే సరియైన మార్గం మీకు లభిస్తుందేమో అని.

**3. ఆలి ఇమ్రాన్** 104 - 109 మీలో మంచి వైపునకు పిలిచేవారూ , మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించేవారూ , చెడు నుండి వారించేవారూ కొందరు తప్పకుండా ఉండాలి. ఈ పనిని చేసేవారే సాఫల్యం పొందుతారు. స్పష్టమైన ఉపదేశాలను పొందిన తరువాత కూడా ఎవరైతే తెగలుగా చీలిపోయారో , ఎవరైతే విభేదాలకు గురిఅయ్యారో, వారి మాదిరిగా మీరూ కావద్దు. కొందరి ముఖాలు (సంతోషంతో) ప్రకాశిస్తూ ఉండేరోజున , మరికొందరి ముఖాలు నల్లబడిపోయేరోజున, ఇటువంటి వైఖరిని అవలంబించేవారికి కఠిన శిక్ష పడుతుంది. ఎవరి ముఖాలయితే నల్లబడిపోతాయో (వారితో ఇలా అనబడుతుంది): ''విశ్వాస భాగ్యం పొందిన తరువాత కూడా మీరు అవిశ్వాస వైఖరిని అవలంబించారా? సరే, కృతఘ్నత చూపిన దానికి ఫలితంగా మీరు ఇప్పుడు ఘోర శిక్షను చవిచూడండి. ఇక ఎవరి ముఖాలు ప్రకాశిస్తూ ఉంటాయో వారికి అల్లాహ్ కారుణ్యచ్ఛాయలో చోటు లభిస్తుంది. అదేస్థితిలో వారు శాశ్వతంగా ఉంటారు. ఇవి అల్లాహ్ సూక్తులు. వాటిని మేము మీకు యథాతథంగా వినిపిస్తున్నాము. ఎందుకంటే , ప్రపంచ ప్రజలకు అన్యాయం చేయాలనే ఉద్దేశ్యం అల్లాహ్ కు ఏ మాత్రం లేదు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తానికి అల్లాహ్ యజమాని. అన్ని వ్యవహారాలూ అల్లాహ్ సమక్షంలోనే పెట్టబడతాయి.''

**3. ఆలి ఇమ్రాన్** 110 - 112 ఇకనుండి ప్రపంచంలో మానవులకు మార్గం చూపటానికీ, వారి సంస్కరణకూ రంగంలోకి తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరే. మీరు మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడునుండి ఆపుతారు. అల్లాహ్ ను విశ్వసిస్తారు. ఈ గ్రంథ ప్రజలు విశ్వసించి ఉన్నట్లయితే , వారికే మేలు కలిగి వుండేది. వారిలో కొందరు విశ్వాసులు కూడా ఉన్నారు. కాని వారిలో అధికులు అవిధేయులు. వారు మీకు ఏమాత్రం హాని కలిగించలేరు - మహాఅయితే కొంచెం బాధించటం తప్ప. ఒకవేళ వారు మీతో పోరాడితే వెన్ను చూపుతారు. తరువాత వారు ఎంత అసహాయులై పోతారంటే , వారికి ఎక్కడ నుండీ తోడ్పాటు లభించదు. వారు ఎక్కడున్నా అవమానానికే గురిచెయ్యబడతారు - అల్లాహ్ శరణులోనో లేక మానవుల రక్షణలోనో వారికి ఆశ్రయం లభిస్తే అది వేరే విషయం. వారు అల్లాహ్ ఆగ్రహంలో చిక్కుకున్నారు. పరాధీనత , పరాజయం వారిపై ముద్రించబడ్డాయి. ఇదంతా కేవలం ఇందువల్లనే జరిగింది వారు అల్లాహ్ ఆయతులను తిరస్కరిస్తూ వచ్చారు. ప్రవక్తలను అన్యాయంగా చంపారు. ఇది వారి అవిధేయతల, అతిక్రమణల పర్యవసానం.

**3. ఆలి ఇమ్రాన్** 113 - 117 కాని గ్రంథ ప్రజలందరూ ఒకలాంటివారు కాదు. వారిలో సత్యమార్గంలో స్థిరంగా ఉన్నవారు కూడా కొందరు ఉన్నారు. వారు రాత్రి సమయాలలో అల్లాహ్ ఆయతులను పఠిస్తారు. ఆయన ముందు సజ్దా చేస్తారు. అల్లాహ్నూ, అంతిమ దినాన్నీ విశ్వసిస్తారు. మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడుల నుండి ఆపుతారు. సత్కార్యాలలో సతతం చురుకుగా ఉంటారు. వారు సజ్జనులు. వారు చేసే ఏ మంచి పనికైనా విలువను ఇవ్వకపోవటం అనేది జరగదు. భయభక్తులు కలవారిని అల్లాహ్ బాగా ఎరుగును. ఇక అవిశ్వాస వైఖరిని అవలంబించిన వారి విషయం : వారి సంపద కానీ , వారి సంతానం కానీ వారికి అల్లాహ్ కు వ్యతిరేకంగా ఉపకరించవు. వారు అగ్నిలోకి పోయేవారు. అగ్నిలోనే సదా ఉంటారు - వారు తమ ఈ ఐహిక జీవితంలో చేసే ధనవ్యయాన్ని తమకు తామే అన్యాయం చేసుకునేవారి పంట పొలాలపై వీచి వాటిని సమూలంగా నాశనం చేసే మంచుగాలితో పోల్చవచ్చును - అల్లాహ్ వారికి అన్యాయం చెయ్యలేదు. వాస్తవానికి వారు తమకు తామే అన్యాయం చేసుకుంటున్నారు.

**3. ఆలి ఇమ్రాన్** 118 - 120 విశ్వాసులారా! మీ పక్షంవారిని తప్ప ఇతరులెవ్వరినీ మీకు ఆంతరంగికులుగా చేసుకోకండి. వారు మీకు హాని కలిగించే ఏ అవకాశాన్నైనా ఉపయోగించుకోవటానికి వెనుదీయరు. మీకు నష్టం కలిగించేదే వారికి ప్రీతికరం. వారి కడుపుమంట వారి నోటి నుండి బయటపడుతుంది. కానీ వారు తమ హృదయాలలో దాచివుంచింది దీనికంటే తీవ్రమైనది. మేము మీకు స్పష్టమైన సూచనలు ఇచ్చాము. మీకు వివేకమే ఉంటే, (వారితో మీ సంబంధాలను గురించి జాగ్రత్తపడతారు) మీరు వారిని ప్రేమిస్తారు. కాని వారికి మీరంటే ప్రేమలేదు. వాస్తవానికి మీరు దైవగ్రంథాలన్నింటినీ విశ్వసిస్తారు. వారు మీతో కలిసినప్పుడు ఇలా అంటారు : ‘‘మేమూ (మీ ప్రవక్తనూ , మీ గ్రంథాన్నీ ) విశ్వసించాము. ’’ కాని వేరుగా ఉన్నప్పుడు వారు మీపై కోపావేశంవల్ల తమ వ్రేళ్ళను కొరుక్కుంటారు - వారితో ఇలా అను : ‘‘మీ కోపావేశంలో మీరే మాడిచావండి. ’’ హృదయాలలో దాగివున్న రహస్యాలు సైతం అల్లాహ్ కు తెలుసు - మీకు మేలు కలిగితే వారు బాధపడతారు. మీకు కీడు జరిగితే వారు సంబరపడతారు. మీరు సహనం కలిగివుంటే, అల్లాహ్ కు భయపడుతూ పనిచేస్తూపోతే, వారి ఏ కుతంత్రమూ మీకు వ్యతిరేకంగా పనిచేయదు. వారు చేస్తూవున్న దాన్ని అల్లాహ్ పరివేష్టించి ఉన్నాడు.

**3. ఆలి ఇమ్రాన్** 121 (ప్రవక్తా! నీవు ముస్లిములకు ఆ సమయాన్ని గురించి తెలుపు) అప్పుడు నీవు వేకువజామున నీ ఇంటి నుండి బయలుదేరి (ఉహుద్ క్షేత్రంలో) ముస్లిములను యుద్ధం కొరకు వారి వారి స్థానాలలో నియమించావు. అల్లాహ్ అన్ని మాటలూ వింటాడు. ఆయన అన్నీ తెలిసినవాడు.

**3. ఆలి ఇమ్రాన్** 122 - 123 మీలోని రెండు వర్గాలు పిరికితనం చూపటానికి సిద్ధపడిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. వాస్తవానికి అల్లాహ్ వారికి సహాయంగా అక్కడ ఉన్నాడు. విశ్వాసులైన వారు అల్లాహ్నే నమ్ముకోవాలి. ఈ మధ్యనే బదర్ సంగ్రామంలో అల్లాహ్ మీకు సహాయం చేశాడు కదా! యథార్థానికి అప్పుడు మీరు

చాలా బలహీనంగా ఉన్నారు. కనుక అల్లాహ్ పట్ల కృతఘ్నుతకు దూరంగా ఉండండి , తద్వారా ఇప్పుడైనా మీరు కృతజ్ఞులౌతారని ఆశ.

**3. ఆలి ఇమ్రాన్** 124 - 127 ప్రవక్తా! నీవు విశ్వాసులతో ఇలా అన్న సందర్భాన్ని గుర్తుకు తెచ్చుకో : ''అల్లాహ్ మూడువేల మంది దూతలను దింపి మీకు సహాయం చెయ్యటం మీకు సరిపోదా ?'' మీరు సహనం చూపితే , ఆచరణలో అల్లాహ్ కు భయపడితే , ఏ క్షణంలో శత్రువులు మీపై దాడిచేస్తారో , ఆ క్షణంలో మీ ప్రభువు (మూడు వేలు కాదు) ఐదు వేలమంది ప్రత్యేక గుర్తులు కల దూతలతో మీకు నిస్సందేహంగా సహాయం చేస్తాడు. అల్లాహ్ మీకు ఈ విషయాన్ని తెలిపింది, మీకు సంతోషం కలగాలని, మీ మనస్సులకు తృప్తి కలగాలని. విజయం, సహాయం వచ్చేది అల్లాహ్ తరఫు నుండి మాత్రమే. ఆయన అత్యంత శక్తిసంపన్నుడు, అత్యంత వివేకవంతుడు. (ఈ సహాయం ఆయన మీకు ఎందుకు చేస్తాడంటే) అవిశ్వాస మార్గంలో నడిచేవారి ఒక పార్శ్వాన్ని ఖండిరచాలని లేదా వారు ఘోర పరాజయం పొంది ఆశాభంగంతో వెనుతిరిగి పోవాలని.

**3. ఆలి ఇమ్రాన్** 128 - 129 (ప్రవక్తా!) నిర్ణయాధికారాలలో నీకు పాత్ర ఏదీ లేదు. వారిని క్షమించే , శిక్షించే అధికారం అల్లాహ్ కు మాత్రమే ఉంది. ఎందుకంటే వారు దుష్టులు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తానికీ యజమాని అల్లాహ్. ఆయన తాను కోరినవారిని క్షమిస్తాడు. తాను కోరినవారిని శిక్షిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు , అనంతంగా కరుణించేవాడూను.

**3. ఆలి ఇమ్రాన్** 130 - 138 విశ్వసించిన ప్రజలారా! ఇబ్బడిముబ్బడిగా పెరిగే ఈ వడ్డీని తినటం మానండి. అల్లాహ్ కు భయపడండి. మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది. అవిశ్వాసుల కొరకు తయారు చెయ్యబడిన ఆ అగ్ని నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. అల్లాహ్ కూ , ప్రవక్తకూ విధేయత చూపండి. మీరు కరుణింపబడే అవకాశం ఉంది. మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు, స్వర్గం వైపునకు పోయే మార్గంలో పరుగెత్తండి. ఆ స్వర్గం భూమ్యాకాశాల అంత విశాలమయింది. అది భయభక్తులు కలవారి కొరకు తయారు చెయ్యబడిరది. వారు కలిమిలో , లేమిలో, ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చుచేసేవారు , కోపాన్ని దిగమ్రింగేవారు, ఇతరుల తప్పులను క్షమించేవారు - ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్ కు ఎంతో ఇష్టం- వారి స్థితి ఎలా ఉంటుందంటే , ఎప్పుడైనా ఏదైనా అశ్లీలకార్యం వారివల్ల జరిగిపోతే లేదా ఏదైనా పాపం చేసి , వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లయితే , వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అప్పుడు వారు ఆయనను తమ తప్పులు క్షమించు అని వేడుకుంటారు - ఎందుకంటే అల్లాహ్ తప్ప పాపాలను క్షమించగలిగే వాడెవడున్నాడని - వారు తాము చేసిన తప్పులను గురించి బుద్ధిపూర్వకంగా మొండివాదం చెయ్యరు. అలాంటి వారికి తమ ప్రభువు వద్ద లభించే ప్రతిఫలం ఏమిటంటే, ఆయన వారిని క్షమిస్తాడు. క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యానవనాలలోకి వారిని ప్రవేశింపజేస్తాడు. వారు అక్కడ శాశ్వతంగా ఉంటారు. మంచిపనులు చేసేవారికి ఎంత చక్కని ప్రతిఫలం! మీకు పూర్వం ఎన్నో యుగాలు

గతించాయి. (అల్లాహ్ ఉపదేశాలు అసత్యాలని) తిరస్కరించే వారి ముగింపు ఎలా జరిగిందో స్వయంగా భూమిపై సంచారం చేసి చూడండి. ఇది ప్రజలకు ఒక స్పష్టమైన హెచ్చరిక , అల్లాహ్ కు భయపడే వారికి మార్గదర్శకత్వం , హితోపదేశం.

**3. ఆలి ఇమ్రాన్** 139 - 143 క్రుంగిపోకండి, దుఃఖపడకండి, మీరే ప్రాబల్యం పొందుతారు. మీరు విశ్వాసులే అయితే. ఇప్పుడు మీరు దెబ్బతిన్నారు. నిజమే. ఇదివరకు మీ ప్రత్యర్థికూడ ఇటువంటి దెబ్బనే తిన్నాడు కదా! ఇవి కాలం యొక్క మిట్టపల్లాలు. వాటిని మేము ప్రజల మధ్య త్రిప్పుతూ ఉంటాము. ఇటువంటి కాలం మీకు ఎందుకు ప్రాప్తించిందంటే మీలో నిజమైన విశ్వాసులెవరో అల్లాహ్ చూడదలిచాడు. (సత్యానికి) నిజమైన సాక్షులెవరో ఏరదలిచాడు - ఎందుకంటే దుర్మార్గులైన ప్రజలంటే అల్లాహ్ కు ఇష్టం లేదు - ఇంకా ఆయన ఈ పరీక్ష ద్వారా విశ్వాసులను వేరుచేసి అవిశ్వాసులను తుదముట్టించ దలిచాడు. మీరు ఇట్టే స్వర్గంలో ప్రవేశించాలని అనుకుంటున్నారా? వాస్తవానికి ఆయన మార్గంలో ప్రాణాలు తెగించి కృషిచేసేవారు , ఆయన కొరకు సహనం చూపేవారు మీలో ఎవరో అల్లాహ్ ఇంకా చూడనేలేదు కదా! మీరు ఇదివరకు మరణాన్ని కోరుతూ ఉండేవారు! కాని ఇది, మరణం మీ ముందుకు రానప్పటి విషయం. ఇదిగో, అది ఇప్పుడు మీ ముందుకే వచ్చింది. దాన్ని స్వయంగా మీరే మీ కళ్ళతో చూశారు.

**3. ఆలి ఇమ్రాన్** 144. ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కారు. అతనికి పూర్వం ఇంకా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు ఒకవేళ అతను మరణిస్తే లేక హత్య చెయ్యబడితే మీరు వెనుకంజవేసి మరలిపోతారా ? జ్ఞాపకం ఉంచుకోండి, మరలిపోయే వాడు అల్లాహ్ కు ఏమాత్రం నష్టం కలిగించలేడు. కాని అల్లాహ్ కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించే వారిని ఆయన తగువిధంగా బహూకరిస్తాడు.

**3. ఆలి ఇమ్రాన్** 145 - 148 అల్లాహ్ అనుమతి లేనిదే ఏ ప్రాణి కూడా చావజాలదు. మరణకాలం వ్రాయబడే ఉంది. ప్రాపంచిక ప్రతిఫలం పొందే ఉద్దేశ్యంతో పనిచేసే వాడికి మేము ప్రపంచాన్నుండే ఇస్తాము. పరలోక ప్రతిఫలాపేక్షతో పనిచేసే వాడు పరలోక ప్రతిఫలాన్ని పొందుతాడు. కృతజ్ఞతలు తెలిపే వారికి మేము వారి ప్రతిఫలాన్ని తప్పకుండా ప్రసాదిస్తాము. ఇంతకు పూర్వం ఎంతోమంది ప్రవక్తలు గతించారు. వారితో కలిసి దైవభక్తులు యుద్ధంచేశారు. అల్లాహ్ మార్గంలో ఎదురయిన కష్టాలకు వారు క్రుంగిపోలేదు. బలహీనత కనబరచలేదు. (అసత్యం ముందు) తలవంచలేదు. అలాంటి సహనశీలురనే అల్లాహ్ ప్రేమిస్తాడు. వారి ప్రార్థన కేవలం ఇదే : ''మా ప్రభూ! మా తప్పులను, మా పొరపాట్లను మన్నించు. మా పనులలో జరిగిన నీ హద్దుల అతిక్రమణను క్షమించు. మా పాదాలకు స్థైర్యాన్ని ప్రసాదించు. అవిశ్వాసులకు ప్రతికూలంగా మాకు సహాయం చెయ్యి. '' చివరకు అల్లాహ్ వారికి ఇహలోక ప్రతిఫలాన్నీ ఇచ్చాడు, దానికంటే మేలైన పరలోక ప్రతిఫలాన్నీ ప్రసాదించాడు. అల్లాహ్ కు మంచిపనులు చేసే ఇలాంటి ప్రజలే ఇష్టం.

**3. ఆలి ఇమ్రాన్** 149 - 151 విశ్వాసులారా! మీరు గనక అవిశ్వాస మార్గం అవలంబించిన వారి సలహాలను పాటిస్తే వారు మిమ్మల్ని అవిశ్వాసం వైపునకు మరలిస్తారు. అప్పుడు మీరు నష్టపోతారు. (వారు చెప్పేదంతా అసత్యం) వాస్తవం ఏమిటంటే అల్లాహ్యే మీకు అండ , ఆయనే మీకు తోడు. ఆయనే అందరికంటే ఉత్తమ సహాయకుడు. సత్య తిరస్కారుల హృదయాలను మేము భయంతో నింపే సమయం త్వరలోనే రాబోతోంది. ఎందుకంటే ఎవరిని గురించి అల్లాహ్ ఏ ప్రమాణాన్నీ అవతరింపజెయ్యలేదో , వారిని, వారు అల్లాహ్తో పాటు దైవత్వంలో భాగస్వాములుగా నిలబెట్టారు. వారి తుది నివాసం నరకం. ఆ దుర్మార్గులకు లభించే ఈ నివాసం ఎంతో చెడ్డది.

**3. ఆలి ఇమ్రాన్** 152 అల్లాహ్ మీకు చేసిన (సహాయం చేస్తాననే) తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. ప్రారంభంలో ఆయన ఆజ్ఞ ప్రకారం మీరే వారిని చంపుతూ ఉన్నారు. కాని మీరు బలహీనతను ప్రదర్శించినప్పుడు మీ కర్తవ్యం విషయంలో పరస్పరం విభేదాలకు గురిఅయినప్పుడు మీరు వ్యామోహపడిన వస్తువును (అంటే విజయధనం) అల్లాహ్ మీకు చూపగానే మీరు మీ నాయకుని ఆజ్ఞను ఉల్లంఘించారు - ఎందుకంటే , మీలో కొందరు ఇహాన్ని కోరారు, మరికొందరు పరాన్ని కోరారు - అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని పరీక్షించటానికి అవిశ్వాసులకు బదులుగా మిమ్మల్ని ఓటమిపాలు జేశాడు. అయినప్పటికీ వాస్తవానికి అల్లాహ్ మిమ్మల్ని క్షమించాడు. ఎందుకంటే , విశ్వాసుల పట్ల అల్లాహ్ కు ఎనలేని అనుగ్రహం.

**3. ఆలి ఇమ్రాన్** 153 జ్ఞాపకం తెచ్చుకోండి , అప్పుడు మీరు పారిపోతున్నారు. వెనక్కి తిరిగి ఎవరినీ చూసే అంత స్పృహ కూడా మీకు లేదు. వెనుక నుండి ప్రవక్త మిమ్మల్ని కేకవేస్తూ ఉన్నాడు. అప్పుడు మీ ఈ వైఖరికి ప్రతిఫలంగా అల్లాహ్ మీకు దుఃఖం తరువాత దుఃఖం కలుగజేశాడు, మీరు ఏదైనా పోగొట్టు కున్నా లేదా మీకు ఏదైనా ఆపద కలిగినా మీరు చింతించకుండా ఉండేటందుకు ఇది భవిష్యత్తులో మీ కొరకు గుణపాఠంగా ఉండాలని. అల్లాహ్ కు మీరు చేసే పనులన్నీ తెలుసు.

**3. ఆలి ఇమ్రాన్** 154 ఈ దుఃఖం తరువాత అల్లాహ్ మీలో కొందరిపై నిశ్చింత స్థితిని ఆవహింపజేశాడు. దానివల్ల వారు కునికిపాట్లు పడసాగారు. కాని కేవలం స్వప్రయోజనానికే పూర్తిగా ప్రాముఖ్యం ఇచ్చే రెండోవర్గం వారు అల్లాహ్ ను గురించి అజ్ఞాన భూయిష్టమైన , సత్యదూరమైన అనుమానాలు వ్యక్తం చెయ్యసాగారు. వారు ఇప్పుడు ఏమంటారంటే : ''ఈ వ్యవహారాన్ని నడపటంలో మాకూ ఏదైనా భాగం ఉందా ?'' వారికి ఇలా చెప్పు : ''(ఎవరికీ ఏ భాగమూ లేదు) ఈ వ్యవహారానికి సంబంధించిన సమస్త అధికారాలూ అల్లాహ్ చేతుల్లో ఉన్నాయి. '' వాస్తవానికి వారు తమ హృదయాలలో దాచుకున్న దానిని మీకు వ్యక్తం చెయ్యటం లేదు. వారి అసలు ఉద్దేశ్యమేమిటంటే : ''(నాయకత్వపు) అధికారాలలో మాకూ భాగం ఉండివున్నట్లయితే ఇక్కడ మేము చంపబడి ఉండేవారము కాము.'' వారితో ఇలా అను : ''మీరు మీ ఇళ్ళల్లోనే ఉండివున్నప్పటికీ, మరణం వ్రాయబడి ఉన్నవారు స్వయంగా తమ వధ్యస్థానాలకు తరలివచ్చి ఉండేవారు. ఈ వ్యవహారమంతా ఎందుకు జరిగిందంటే, మీ గుండెలలో దాగివున్న

దానిని అల్లాహ్ పరీక్షించేందుకు , మీ మనస్సులలో ఉన్న మాలిన్యాన్ని వేరుచెయ్యటానికి. అంతరంగాల స్థితి అల్లాహ్ కు బాగా తెలుసు.

**3. ఆలి ఇమ్రాన్** 155 మీలో కొందరు శత్రువును మార్కొనే రోజున వెన్ను చూపారు. వారి ఈ పొరపాటుకు కారణమేమి టంటే, వారిలోని కొన్ని బలహీనతలవల్ల షైతాను వారి పాదాలను చలింపజేశాడు. అయినా అల్లాహ్ వారిని క్షమించాడు. అల్లాహ్ అధికంగా క్షమించేవాడు, సహించేవాడూను.

**3. ఆలి ఇమ్రాన్** 156 - 158 విశ్వాసులారా! అవిశ్వాసులు మాదిరిగా ప్రవర్తించకండి. తమ బంధుమిత్రులు ఎప్పుడైనా ప్రయాణంలో ఉంటే లేదా యుద్ధంలో ఉంటే, (అక్కడ వారు ఏదైనా ప్రమాదానికి గురిఅయితే) వారు ఇలా అంటారు : ''వారు మాతోపాటు ఉండివున్నట్లయితే చనిపోయేవారూ కాదు , చంపబడేవారూ కాదు.'' ఈ విధమైన వారి మాటలను అల్లాహ్ వారి హృదయశోకానికీ , ఆవేదనకూ కారణాలుగా చేస్తాడు. వాస్తవానికి చంపేవాడూ , బ్రతికించేవాడూ అల్లాహ్ మాత్రమే. మీరు చేసే అన్ని పనులనూ ఆయన కనిపెట్టే ఉన్నాడు. మీరు అల్లాహ్ మార్గంలో చంపబడినా లేక చనిపోయినా మీ వంతుగా మీకు లభించే అల్లాహ్ కారుణ్యం , ఆయన క్షమాభిక్ష, వారు కూడబెట్టే సమస్త వస్తువులకంటే ఎంతో ఉత్తమమైనవి. మీరు చనిపోయినా లేక చంపబడినా, ఏ స్థితిలో అయినాసరే మీరంతా అల్లాహ్ సమక్షంలో సమీకరింపబడతారు.

**3. ఆలి ఇమ్రాన్** 159 - 160 (ప్రవక్తా!) అల్లాహ్ యొక్క అనంత కరుణ వల్లనే నీవు వారిపట్ల మృదుస్వభావుడవు అయ్యావు. నీవేగనక కర్కశుడవు , కఠిన హృదయుడవు అయినట్లయితే వారందరూ నీ చుట్టుపక్కల నుండి దూరంగా పోయేవారు. వారి తప్పులను మన్నించు , వారిని క్షమించు అని అల్లాహ్ ను ప్రార్థించు. ధర్మానికి సంబంధించిన పనిలో వారిని కూడా సంప్రదించు. అయితే ఒక నిర్ణయాన్ని తీసుకుని దాన్ని అమలుపరచటానికి సంకల్పించినప్పుడు అల్లాహ్పై భారం వెయ్యి. తననే నమ్ముకుని పనిచేసే వారంటే అల్లాహ్ కు ఎంతో ఇష్టం. అల్లాహ్ మీకు సహాయం చేస్తూ ఉన్నట్లయితే , ఏ శక్తీ మీపై ఆధిక్యాన్ని సాధించలేదు. ఆయన మిమ్మల్ని విడిచిపెట్టినట్లయితే, ఆ తరువాత మీకు సహాయం చేయగలవాడెవడు ? కనుక నిజమైన విశ్వాసులు అల్లాహ్నే నమ్ముకోవాలి.

**3. ఆలి ఇమ్రాన్** 161 - 164 ఏ ప్రవక్త అయినా నమ్మక ద్రోహాని (ఖియానత్)కి పాల్పడడు. నమ్మకద్రోహం చేసినవాడు ప్రళయంనాడు తన నమ్మకద్రోహంతో పాటు హాజరవుతాడు. అప్పుడు ప్రతి ప్రాణికి తన సంపాదనకు పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఏమాత్రం అన్యాయం జరగదు - ఎల్లప్పుడూ అల్లాహ్ అభీష్టం ప్రకారం నడిచే వ్యక్తి, అల్లాహ్ ఆగ్రహానికి గురిఅయి , తన చివరి నివాసము , అతి చెడ్డ నివాసము అయిన నరకానికి పోయే వ్యక్తి మాదిరిగా వ్యవహరించడం ఎలా సంభవం ? అల్లాహ్ దృష్టిలో ఈ రెండు రకాల వ్యక్తుల మధ్య , స్థానాల విషయంలో ఎంతో తారతమ్యముంది. అల్లాహ్ అందరి పను లను పరిశీలిస్తున్నాడు. వాస్తవానికి అల్లాహ్ విశ్వాసులకు

మహోపకారం చేశాడు : స్వయంగా వారినుండే వారిమధ్య ఒక ప్రవక్తను లేపాడు. అతడు ఆయన ఆయతులను వారికి వినిపిస్తాడు. వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు. వారికి గ్రంథాన్నీ , వివేకాన్నీ నేర్పుతాడు. వాస్తవానికి వారు ఇంతకు పూర్వం స్పష్టమయిన అపమార్గాలలో పడివున్నారు.

**3. ఆలి ఇమ్రాన్** 165 - 168 మీపై ఆపద వచ్చిపడగానే , ''ఇదెక్కణ్ణుంచి దాపురించింది'' అని అంటారేమిటి? (బదర్ సంగ్రామంలో) దీనికి రెండింతల ఆపద స్వయంగా మీ చేతుల ద్వారానే (మీ శత్రువులపై) పడిరదికదా! ప్రవక్తా! వారితో ఇలా చెప్పు : ''ఈ ఆపద స్వయంగా మీరు తెచ్చుకున్నదే. '' నిశ్చయంగా అల్లాహ్ కు ప్రతి వస్తువుపై అధికారం ఉంది. పోరాటం నాడు మీకు కలిగిన నష్టం అల్లాహ్ అనుమతితోనే కలిగింది. ఎందుకంటే తద్వారా మీలో విశ్వాసులెవరో కపటులెవరో అల్లాహ్ చూడదలచాడు - ఆ కపటులతో : ''రండి, అల్లాహ్ మార్గంలో యుద్ధం చెయ్యండి. లేదా కనీసం (మీ నగరాన్నయినా) రక్షించుకోండి'' అని అన్నప్పుడు వారు ఇలా అన్నారు : ''ఈ రోజు యుద్ధం జరుగుతుందని మాకు తెలిసివున్నట్లయితే మేము తప్పకుండ మీతోపాటు వచ్చివుండే వారము. '' ఈ మాటలు అంటున్నప్పుడు వారు విశ్వాసానికంటే అవిశ్వాసానికే చేరువగా ఉన్నారు. వారు తమ హృదయాలలో లేని మాటలను తమ నోటితో అంటారు. వారు తమ హృదయాలలో దాస్తున్న దానిని గురించి అల్లాహ్ కు బాగా తెలుసు. తాము మాత్రం కూర్చుండిపోయి , యుద్ధం చెయ్యటానికి పోయి చంపబడినటువంటి తమ సోదరులను గురించి : ''వారు గనక మా మాటలు ఆలకించివున్నట్లయితే చంపబడి ఉండేవారు కారు '' అని అన్నవారు వీరే. వారితో ఇలా చెప్పు: ''మీరు చెప్పే విషయంలో మీరు గనక నిజాయితీపరులే అయితే , మీకు చావు దాపురించినప్పుడు మీరు దానిని నివారించి చూపాలి.''

**3. ఆలి ఇమ్రాన్** 169 - 175 అల్లాహ్ మార్గంలో చంపబడ్డ వారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు సజీవులే. తమ ప్రభువువద్ద జీవికను పొందుతున్నారు. అల్లాహ్ తన కృపతో ప్రసాదించిన దానితో వారు ఎంతో సుఖంగా, సంతోషంగా ఉన్నారు. తమ వెనుక ప్రపంచంలో ఉండిపోయి ఇంకా తమతో చేరని విశ్వాసులకు కూడా ఏ విధమైన భయంకానీ, దు్ఖంకానీ కలిగే అవకాశం లేదని వారు నిశ్చింతగా ఉన్నారు. అల్లాహ్ బహుమానాలకు , ఆయన అనుగ్రహాలకు వారు పొంగిపోతున్నారు. విశ్వాసుల ప్రతిఫలాన్ని అల్లాహ్ వృధాకానివ్వడని వారికి తెలిసిపోయింది క్షతగాత్రులయిన తరువాత కూడా అల్లాహ్ పిలుపునకు , ప్రవక్త పిలుపునకు సమాధానమిచ్చినటువంటి విశ్వాసుల ప్రతిఫలం - వారిలో సజ్జనులు , భయభక్తులు కలవారు అయిన వ్యక్తుల కొరకు గొప్ప ప్రతిఫలం ఉంది - వారితో ప్రజలు , ''మీకు వ్యతిరేకంగా పెద్ద సైన్యాలు మోహరించి ఉన్నాయి , వాటికి భయపడండి'' అని అన్నప్పుడు దానిని విని వారి విశ్వాసం ద్విగుణీకృత మయింది. వారు ఇలా సమాధానం చెప్పారు: ''మాకు అల్లాహ్ చాలు. ఆయనే శ్రేష్ఠుడైన కార్యసాధకుడు. '' చివరకు వారు అల్లాహ్ ప్రసాదించిన వరాలతో, అనుగ్రహంతో తిరిగి వచ్చారు. వారికి ఏ విధమైన హాని కలగలేదు. ఇంకా వారికి అల్లాహ్ అభీష్టం ప్రకారం నడిచే మహాభాగ్యం కూడా లభించింది. అల్లాహ్ అపరిమితంగా అనుగ్రహించేవాడు. వాస్తవానికి తన మిత్రులను

గురించి ఊరకే ప్రజలను భయపెట్టింది షైతానేనని ఇప్పుడు మీరు గ్రహించే ఉంటారు. కనుక మీరు నిజమైన విశ్వాసులే అయితే ఇక ముందు మానవులకు భయ పడకండి. నాకు భయపడండి.

**3. ఆలి ఇమ్రాన్** 176 - 178 ప్రవక్తా! నేడు అవిశ్వాస మార్గంలో గట్టిగా ప్రయత్నం చేస్తున్న వారి కార్యకలాపాలు నిన్ను ఖేదపరచరాదు. వారు అల్లాహ్ కు ఏమాత్రం హాని కలిగించలేరు. పరలోకంలో వారికి ఏ భాగమూ ఇవ్వరాదనేదే అల్లాహ్ అభిమతం. చివరకు వారికి కఠిన శిక్ష పడుతుంది. విశ్వాసాన్ని విడిచిపెట్టి అవిశ్వాసాన్ని కొనుక్కునేవారు నిశ్చయంగా అల్లాహ్ కు ఏ నష్టమూ కలిగించటం లేదు. వారికొరకు వ్యధాభరితమైన శిక్ష సిద్ధంగా ఉంది. మేము ఇస్తూ ఉన్నటువంటి అవకాశాన్ని ఈ అవిశ్వాసులు తమకు మేలుగా భావించరాదు. వారు ఇంకా ఎక్కువ పాపాలు కూడబెట్టుకోవాలనే మేము వారికి ఈ అవకాశాన్ని ఇస్తున్నాము. వారికి తీవ్ర అవమానంతో కూడుకున్న శిక్ష పడుతుంది.

**3. ఆలి ఇమ్రాన్** 179 మీరు ప్రస్తుతం ఉన్నటువంటి స్థితిలో అల్లాహ్ విశ్వాసులను ఏమాత్రం ఉండనివ్వడు. ఆయన పవిత్రులను అపవిత్రులనుండి తప్పకుండా వేరుచేస్తాడు. అయితే అగోచర విషయాల రహస్యాలను మీకు తెలుపడం అల్లాహ్ విధానం కాదు. (అగోచర విషయాలు తెలుపడానికి) అల్లాహ్ తన ప్రవక్తలలో నుండి తాను కోరినవారిని ఎన్నుకుంటాడు. కనుక (అగోచర విషయాలను గురించి) అల్లాహ్ ను , ఆయన ప్రవక్తలను నమ్మండి. మీరు గనక విశ్వాస భయభక్తుల మార్గాన్ని అవలంబిస్తే మీకు పెద్ద బహుమానం లభిస్తుంది.

**3. ఆలి ఇమ్రాన్** 180 అల్లాహ్ తన అనుగ్రహాన్ని విరివిగా ప్రసాదించినప్పటికీ పిసినారితనం చూపేవారు , ఈ పిసినారితనం తమకు మేలైనదని భావించరాదు. కాదు , ఇది వారికొరకు ఎంతో హానికరమయినది. వారు తమ లోభత్వంతో కూడబెడుతూ ఉన్నదే ప్రళయం నాడు వారి పాలిట కంఠపాశం అవుతుంది. భూమ్యాకాశాల వారసత్వం అల్లాహ్కే చెందుతుంది. మీరు ఏదైతే చేస్తారో అది అల్లాహ్ కు తెలుసు.

**3. ఆలి ఇమ్రాన్** 181 - 182 ''అల్లాహ్ దరిద్రుడు. మేము ధనికులం'' అని అన్నవారి ప్రేలాపన అల్లాహ్ విన్నాడు. వారి ఈ మాటలను కూడా మేము వ్రాసుకుంటాము. ఇంకా ఇదివరకు వారు అన్యాయంగా ప్రవక్తలను చంపిన విషయం కూడా వారి కర్మపత్రంలో వ్రాశాము. (తీర్పు సమయం వచ్చినప్పుడు) మేము వారితో ఇలా అంటాము : ''ఇదిగో నరకబాధను చవిచూడండి. ఇది స్వయంగా మీచేతి సంపాదనే. అల్లాహ్ తన దాసులకు అన్యాయం చేసేవాడు కాడు.''

**3. ఆలి ఇమ్రాన్** 183 - 185 ''(ఆకాశం నుండి) అగ్ని (దిగివచ్చి) తినేటటువంటి బలిని మా సమక్షంలో ఇయ్యనంత వరకూ మేము ఎవరినీ ప్రవక్తగా స్వీకరించకూడదని అల్లాహ్ మాకు ఉపదేశించాడు '' అని అనేవారితో ఇలా అను : ''నాకు పూర్వం మీ వద్దకు చాలామంది ప్రవక్తలు వచ్చారు. స్పష్టమైన ఎన్నో నిదర్శనాలు తీసుకువచ్చారు. మీరు

ప్రస్తావించిన ఈ నిదర్శనాన్ని సైతం తీసుకువచ్చారు. (ప్రవక్తలను విశ్వసించటానికి ఈ షరతును పెట్టటంలో) మీరు గనక సత్యవంతులే అయితే , ఆ ప్రవక్తలను మీరు ఎందుకు హత్యచేశారు ?'' ప్రవక్తా! ఇక వారు గనక నిన్ను తిరస్కరిస్తే నీకు ముందు ప్రత్యక్ష నిదర్శనాలను , సహీఫాలను (Psalms) వెలుగును ప్రసాదించే గ్రంథాలను తీసుకువచ్చిన చాలామంది ప్రవక్తలు కూడా తిరస్కరించబడ్డారు. చివరకు ప్రతి మనిషీ మరణిస్తాడు. మీరంతా మీ పూర్తి ప్రతిఫలాన్ని ప్రళయంనాడు పొందుతారు. అక్కడ నరకాగ్ని నుండి కాపాడబడి , స్వర్గంలో ప్రవేశపెట్టబడేవాడు మాత్రమే యథార్థానికి సఫలీకృతుడు. ఇక ఈ ప్రపంచం, అది కేవలం మాయావస్తువు మాత్రమే.

**3. ఆలి ఇమ్రాన్** 186 - 189 ముస్లిములారా! మీరు ధన ప్రాణాలకు సంబంధించిన పరీక్షను తప్పకుండా ఎదుర్కొంటారు. గ్రంథ ప్రజల నుండి , ముష్రిక్కుల నుండి మీరు కష్టం కలిగించే మాటలు అనేకం వింటారు. ఈ పరిస్థితులలో మీరు గనక సహనంతో, భయభక్తులతో నిలకడగా ఉంటే, ఇది ఎంతో సాహసంతో కూడుకున్న కార్యం. గ్రంథోపదేశాలను ప్రజలలో వ్యాపింపజేయాలని , వాటిని మరుగుపరచరాదని , అల్లాహ్ వారితో చేయించిన ప్రమాణాన్ని కూడా గ్రంథ ప్రజలకు జ్ఞాపకం చెయ్యండి. కాని వారు గ్రంథాన్ని తమ వీపుల వెనుక పడవేశారు. స్వల్ప మూల్యానికి దానిని అమ్మి వేశారు. వారు చేసే ఈ వ్యాపారం ఎంత చెడ్డది! తాము చేసిన పనులకు సంతోషపడేవారు, యథార్థంగా తాము చేయని పనులకు తమకు ప్రశంసలు లభించాలని కోరేవారు శిక్షను తప్పించుకుంటారని భావించకండి. వాస్తవానికి వారికొరకు బాధాకరమైన శిక్ష సిద్ధంగా ఉంది. భూమికీ, ఆకాశాలకూ యజమాని అల్లాహ్, ఆయన శక్తి సమస్తాన్నీ ఆవరించివుంది.

**3. ఆలి ఇమ్రాన్** 190 - 194 భూమీ , ఆకాశాల సృష్టిలో రేయింబవళ్ళు ఒకదాని తరువాత ఒకటి రావడంలో , నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అన్నివేళలా అల్లాహ్ ను స్మరించే వారున్నూ , భూమీ, ఆకాశాల నిర్మాణం గురించి చింతన చేసేవారున్నూ అయిన వివేకవంతులకు ఎన్నో సూచనలు ఉన్నాయి. (వారు అప్రయత్నంగా ఇలా అంటారు) ప్రభూ! ఇదంతా నీవు వ్యర్థంగా , లక్ష్యరహితంగా సృష్టించలేదు. నీవు పరిశుద్ధుడవు కాబట్టి నిష్ఫల కార్యాలు చెయ్యవు. కనుక ప్రభూ! మమ్మల్ని నరక బాధనుండి కాపాడు. నీవు ఎవడినైతే నరకంలో పడవేస్తావో వాణ్ణి వాస్తవానికి అధోగతికీ , అవమానానికీ గురిచేసినట్లే. ఇక ఇటువంటి దుర్మార్గులకు సహాయం చేసేవాడెవడూ ఉండడు. ప్రభూ! మేము విశ్వాసం వైపునకు పిలిచేవాని పిలుపును విన్నాము. మీ ప్రభువును విశ్వసించండి అని అతను అనేవాడు. మేము అతని సందేశాన్ని స్వీకరించాము. కనుక మా స్వామీ! మేము చేసిన తప్పులను మన్నించు. మాలో ఉన్న చెడులను దూరం చెయ్యి. సజ్జనులతో పాటు మా జీవితానికి ముగింపు ప్రసాదించు. దేవా! నీవు నీ ప్రవక్తల ద్వారా చేసినటువంటి బాసలను మా విషయంలో నెరవేర్చు. ప్రళయం నాడు మమ్మల్ని పరాభవానికి గురి చెయ్యకు. నిస్సందేహంగా నీవు నీ వాగ్దానాలకు భిన్నంగా వ్యవహరించవు.

**3. ఆలి ఇమ్రాన్** 195 సమాధానంగా వారి ప్రభువు ఇలా అన్నాడు : ''మీలోని ఎవరి శ్రమనూ నేను వృధాగా పోనివ్వను. పురుషుడైనా స్త్రీ అయినా మీరంతా ఒకే రాశికి చెందినవారు. కనుక నా కొరకు తమ దేశాన్ని విడిచిపెట్టినవారు, నా మార్గంలో తమ గృహాల నుండి గెంటివేయబడినవారు , హింసించబడినవారు, నా కొరకు పోరాడి చంపబడిన వారు - అటువంటివారి తప్పులన్నింటినీ నేను క్షమిస్తాను. క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యానవనాలలోకి వారిని ప్రవేశింపజేస్తాను.'' ఇది అల్లాహ్ వద్ద వారికి లభించే ప్రతిఫలం - ఉత్తమమైన ప్రతిఫలం అల్లాహ్ వద్దనే ఉంది.

**3. ఆలి ఇమ్రాన్** 196 - 199 ప్రవక్తా! ప్రపంచ దేశాలలో ఉన్నటువంటి అవిశ్వాసులు దర్జాగా తిరుగాడటం నిన్ను మోసంలో పడవేయరాదు. అది కేవలం కొన్ని రోజుల జీవితపు కొద్దిపాటి సుఖం మాత్రమే. తరువాత వారంతా నరకానికి పోతారు. అది అధ్వాన్నమైన నివాసస్థలం. దీనికి భిన్నంగా తమ ప్రభువుకు భయపడుతూ జీవితం గడిపేవారి కొరకు, క్రింద కాలువలు ప్రవహించే తోటలు ఉన్నాయి. ఆ తోటలలో వారు కలకాలం ఉంటారు. ఇది అల్లాహ్ తరఫు నుండి వారికి లభించే ఆతిథ్యం. అల్లాహ్ వద్ద ఉన్నదే సజ్జనుల కొరకు అన్నింటికంటే శ్రేష్ఠమైనది. గ్రంథ ప్రజలలో కూడా కొందరు అల్లాహ్ ను విశ్వసిస్తారు. నీ వైపునకు పంపబడిన ఈ గ్రంథాన్ని విశ్వసిస్తారు. స్వయంగా వారి వైపునకు ఇదివరకు పంపబడిన గ్రంథాన్ని కూడ విశ్వసిస్తారు. అల్లాహ్ సమక్షంలో వినమ్రులౌతారు. అల్లాహ్ ఆయత్తులను స్వల్పమయిన మూల్యా నికి అమ్మరు. వారి ప్రతిఫలం వారి ప్రభువువద్ద ఉంది. అల్లాహ్ లెక్క తీసుకోవడంలో ఆలస్యం చెయ్యడు.

**3. ఆలి ఇమ్రాన్** 200 విశ్వాసులారా! సహనంతో వ్యవహరించండి. అసత్యవాదుల ముందు పరాక్రమం చూపండి. సత్య సేవకొరకు సిద్ధంగా ఉండండి. అల్లాహ్ కు భయపడుతూ ఉండండి. తద్వారా మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది.

4. అన్ నిసా

ఆయతులు : 176 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**4. అన్ నిసా** 1 మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతోమంది పురుషులను , స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో , ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి.

**4. అన్ నిసా** 2 అనాథుల ఆస్తిని వారికి తిరిగి ఇవ్వండి. వారి మంచి వస్తువులను మీ చెడ్డ వస్తువులతో మార్చకండి. వారి ఆస్తిని మీ ఆస్తితో కలిపి కబళించకండి. ఇది మహాపాపం.

**4. అన్ నిసా** 3 అనాథులకు న్యాయం చెయ్యలేమనే భయం మీకు కలిగితే , మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరేసిగాని , ముగ్గురేసిగాని, నలుగురేసిగాని వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే భయం మీకుంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి లేదా మీ స్వాధీనంలోకి వచ్చిన స్త్రీలను దాంపత్యంలోకి తీసుకోండి. అన్యాయానికి దూరంగా ఉండేందుకు ఇది ఉత్తమ మార్గం.

**4. అన్ నిసా** 4 స్త్రీలకు వారి మహర్‌ను సంతోషంగా (విధిగా భావిస్తూ) చెల్లించండి. అయితే వారు తమంత తాము మహర్‌లో కొంత భాగాన్ని తమ ఇష్టపూర్వకంగా విడిచిపెడితే, దానిని మీరు సంతోషంగా అనుభవించండి.

**4. అన్ నిసా** 5 అల్లాహ్ మీకు జీవనాధారంగా చేసిన సంపదను అవివేకులకు అప్పగించకండి. అయితే దానినుండి వారికి అన్న వస్త్రాలు కల్పించండి. వారికి హితబోధ చెయ్యండి.

**4. అన్ నిసా** 6 అనాథులకు పెళ్ళీ ఈడు వచ్చేవరకు వారిని అజమాయిషీ చేస్తూ ఉండండి. వారిలో మీకు యోగ్యత కనిపించినపుడు వారి ఆస్తిని వారికి అప్పగించండి. వారు పెద్దవారై తమ హక్కును కోరు తారేమో అని భయపడి వారి ఆస్తిని న్యాయసీమలను అతిక్రమించి తొందర తొందరగా ఎన్నడూ తినకండి. అనాథుల సంరక్షకుడు సంపన్నుడైతే, అతడు వారి సొమ్ముకు దూరంగా ఉండాలి. ఒకవేళ అతడు పేదవాడైతే దాన్ని ధర్మసమ్మతంగా అనుభవించాలి. తరువాత వారి ఆస్తిని వారికి అప్పగించేటప్పుడు దానికి ఇతరులను సాక్షులుగా పెట్టండి. లెక్క తీసుకోవటానికి అల్లాహ్ చాలు.

**4. అన్ నిసా** 7 తల్లిదండ్రులు , దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అదేవిధంగా తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది - అది తక్కువైనా సరే లేక ఎక్కువైనా సరే. ఈ భాగం (అల్లాహ్చే) నిర్ణయించబడిరది.

**4. అన్ నిసా** 8 ఆస్తి పంపకం జరిగేటప్పుడు ఇతర బంధువులు , అనాథులు, నిరుపేదలు వస్తే, ఆ ఆస్తినుండి వారికి కూడ కొంత ఇవ్వండి. వారిని మంచిమాటలతో పలుకరించండి.

**4. అన్ నిసా** 9 - 10 ప్రజలు ఈ విషయాన్ని గురించి ఆలోచించి భయపడాలి : ఒకవేళ వారే తమ పిల్లలను నిస్సహాయులుగా విడిచిపెట్టి వెళ్ళవలసివస్తే మరణ సమయంలో వారు ఆ పిల్లలను గురించి ఎంతగా ఆందోళన చెందేవారో! కనుక వారు అల్లాహ్ కు భయపడాలి. న్యాయం పలకాలి. అనాథుల ఆస్తిని అన్యాయంగా తినేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటారు. వారు తప్పకుండా మండే నరకాగ్నిలో త్రోయబడతారు.

**4. అన్ నిసా** 11 మీ సంతానం విషయంలో అల్లాహ్ మీకు ఇలా ఆదేశిస్తున్నాడు : ఒక పురుషుని భాగం ఇద్దరు స్త్రీల భాగాలకు సమానం. ఒకవేళ (మృతునికి వారసులుగా) ఇద్దరికంటే ఎక్కువమంది ఆడ పిల్లలు ఉంటే , వారికి మొత్తం ఆస్తిలో మూడిరట రెండు భాగాలు ఇవ్వాలి. ఒకే ఆడపిల్ల వారసురాలైతే , ఆస్తిలో అర్ధ భాగం ఆమెకు చెందుతుంది. మృతుడు సంతానం కలవాడైతే , అతని తల్లిదండ్రులలో ఒక్కొక్కరికి మొత్తం ఆస్తిలో ఆరోభాగం లభించాలి. ఒకవేళ అతడు సంతానం లేనివాడై అతని తల్లిదండ్రులు మాత్రమే అతనికి వారసులైతే , అప్పుడు తల్లికి మూడో భాగం ఇవ్వాలి. మృతుడికి సోదరీసోదరులు కూడా ఉంటే, అప్పుడు తల్లికి ఆరోభాగం లభిస్తుంది. మృతుడు రాసిన వీలునామా అమలుజరిపి అతనిపై ఉన్న అప్పులు తీర్చిన తరువాతనే (ఈ భాగాల పంపకం జరగాలి). మీ తల్లిదండ్రులలో, మీ సంతానంలో ప్రయోజనం రీత్యా మీకు ఎవరు ఎక్కువ సన్నిహితులో మీకు తెలియదు. ఈ భాగాలను అల్లాహ్ నిర్ణయించాడు. నిశ్చయంగా అల్లాహ్ యథార్థాలన్నీ తెలిసినవాడు, మర్మాలన్నీ ఎరిగినవాడు.

**4. అన్ నిసా** 12 మీ భార్యలకు సంతానం లేనిపక్షంలో , వారు విడిచిపోయిన ఆస్తిలో మీకు అర్ధభాగం లభిస్తుంది. కాని వారికి సంతానం ఉంటే అప్పుడు వారు విడిచివెళ్ళిన ఆస్తిలో మీకు నాలుగోభాగం లభిస్తుంది. ఇది వారు వ్రాసిపోయిన వీలునామా అమలు జరిపిన తరువాత, వారు చేసిపోయిన అప్పులు తీర్చిన తరువాత జరగాలి. మీకు సంతానం లేనిపక్షంలో మీరు విడిచిపోయే ఆస్తిలోని నాలుగో భాగానికి వారు (మీ భార్యలు) హక్కుదారులౌతారు. కాని మీరు సంతానవంతులైతే అప్పుడు వారికి ఎనిమిదో భాగం లభిస్తుంది. ఇది మీరు వ్రాసిన వీలునామాను అమలుజరిపిన తరువాత, మీరు చేసిన అప్పులు తీర్చిన తరువాత జరగాలి.

(మరణించిన) పురుషుడు లేక స్త్రీ సంతానహీనులై వారి తల్లిదండ్రులు కూడా జీవించి ఉండకపోతే , కాని వారికి ఒక సోదరుడు లేక ఒక సోదరి ఉంటే అప్పుడు వారిద్దరిలో ఒక్కొక్కరికి ఆరోభాగం లభిస్తుంది. కాని సోదరీ సోదరులు ఒకరికంటే ఎక్కువమంది ఉంటే అప్పుడు మొత్తం ఆస్తిలోని మూడో భాగానికి వారంతా భాగస్వాములౌతారు. మృతుడు వ్రాసిన వీలునామా అమలు జరిపిన తరువాత , అతడు చేసిన అప్పులు తీర్చిన తరువాత ఈ పంపిణీ జరగాలి. కాని ఇది (వారసులకు) నష్టం కలిగించేది కాకూడదు. ఇది అల్లాహ్ వైపు నుండి వచ్చిన ఆదేశం. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, అత్యంత మృదుస్వభావుడు.

**4. అన్ నిసా** 13 - 14 ఇవి అల్లాహ్ విధించిన హద్దులు. అల్లాహ్కూ ఆయన ప్రవక్తకూ విధేయత చూపేవాణ్ణి అల్లాహ్, క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యానవనాలలో ప్రవేశింపజేస్తాడు. ఆ వనాలలో అతడు కలకాలం ఉంటాడు. అసలు ఇదే గొప్ప సాఫల్యం. అల్లాహ్కూ ఆయన ప్రవక్తకూ అవిధేయత చూపుతూ అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించే వాణ్ణి అల్లాహ్ అగ్నిలో పడవేస్తాడు. అందులో అతడు సదా ఉంటాడు. అతనికి మిక్కిలి అవమానకరమైన శిక్ష పడుతుంది.

**4. అస్ నిసా** 15 - 16 మీ స్త్రీలలో ఎవరైనా సిగ్గుమాలిన పనికి ఒడిగట్టితే , వారికి వ్యతిరేకంగా మీలో నలుగురు మనుషుల సాక్ష్యం తీసుకోండి. నలుగురు మనుషులు గనక సాక్ష్యం ఇస్తే , వారు మరణించే వరకైనా లేదా వారికొరకు అల్లాహ్ ఏదైనా మార్గం చూపించేవరకైనా వారిని ఇళ్ళల్లో నిర్బంధించండి. మీలో ఈ అకృత్యానికి పాల్పడిన వారినిద్దరినీ బాధించండి. తరువాత వారు పశ్చాత్తాపపడి , తమ నడతను సరిదిద్దుకుంటే వారిని విడిచిపెట్టండి. అల్లాహ్ పశ్చాత్తాపాన్ని అధికంగా అంగీకరిస్తాడు, ఎక్కువగా కనికరిస్తాడు.

**4. అస్ నిసా** 17 - 18 అజ్ఞానం వల్ల ఏదైనా చెడ్డపని చేసి వెనువెంటనే పశ్చాత్తాపపడే వారి పశ్చాత్తాపాన్ని మాత్రమే స్వీకరించే బాధ్యత అల్లాహ్ పై ఉంది అని తెలుసుకోండి. అలాంటివారి పట్ల అల్లాహ్ కరుణాదృష్టితో తిరిగి సుముఖుడవుతాడు. అల్లాహ్ అన్ని విషయాలు తెలిసినవాడూ , వివేకసంపన్నుడూను. చావు గడియ సమీపించేవరకు ఎడతెగకుండా అకృత్యాలు చేస్తూవుండి , ''ఇప్పుడు నేను పశ్చాత్తాప పడుతున్నాను '' అని అనేవారి పశ్చాత్తాపం ఎంతమాత్రం స్వీకరించబడదు. ఇదేవిధంగా , మరణించే వరకు అవిశ్వాసులుగానే ఉండేవారి పశ్చాత్తాపం కూడా స్వీకరించబడదు. అటువంటి వారి కొరకు మేము అత్యంత బాధాకరమైన శిక్షను సిద్ధంచేసి ఉంచాము.

**4. అస్ నిసా** 19 - 21 విశ్వసించిన ప్రజలారా! బలవంతంగా స్త్రీలకు వారసులు కావటం మీకు ధర్మసమ్మతం కాదు. ఇంకా, వారిని వేధించి సాధించి మీరు వారికి ఇచ్చిన 'మహర్'లో కొంత భాగాన్ని కాజేసే ప్రయత్నం చెయ్యటం కూడా ధర్మసమ్మతం కాదు. అయితే వారు గనక బాహాటంగా చెడు నడతకు పాల్పడినట్లయితే, (అప్పుడు వారిపట్ల కఠినంగా ప్రవర్తించే అధికారం మీకు ఉంది). వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టివుండవచ్చు. ఒకవేళ మీరు ఒక భార్య స్థానంలో మరొక భార్యను తీసుకొచ్చే సంకల్పమే చేసుకుంటే , మీరు ఆమెకు ఒక పెద్ద ధనరాశిని ఇచ్చి ఉన్నాసరే దానినుండి ఏ కొంచెం కూడా తిరిగి తీసుకోవద్దు. ఆమెపై అపనిందమోపి, ఘోరమైన అన్యాయానికి పాల్పడి దాన్ని తిరిగి తీసుకుంటారా? మీరు పరస్పరం దాంపత్య సుఖం అనుభవించిన తరువాత, వారు మీ నుండి గట్టి వాగ్దానం తీసుకున్న తరువాత, మీరు దానిని ఎలా తిరిగి తీసుకుంటారు?

**4. అస్ నిసా** 22 మీ తండ్రులు వివాహం చేసుకున్న స్త్రీలను మీరు ఎంతమాత్రమూ వివాహమాడకండి. పూర్వం జరిగిందేదో జరిగిపోయింది. వాస్తవానికి ఇది ఒక సిగ్గుమాలిన పని, జుగుప్సాకరమైనది, ఒక దుర్నడత.

**4. అస్ నిసా** 23 మీకు ఈ స్త్రీలు (హరామ్) నిషేధించబడ్డారు : మీ తల్లులు , కుమార్తెలు, సోదరీమణులు, మీ మేనత్తలు, మీ తల్లి సోదరీమణులు (పినతల్లులు) , మీ సోదరుల కుమార్తెలు , మేనకోడళ్ళు, మీకు పాలిచ్చిన తల్లులు, మీతోపాటు పాలు త్రాగిన సోదరీమణులు , మీ భార్యల తల్లులు , మీ సంరక్షణలో పెరిగిన మీ భార్యల కుమార్తెలు - అంటే మీరు రమించిన భార్యల కుమార్తెలు అయితే ఒకవేళ (వివాహం మాత్రమే అయి) రమించటం

జరిగి వుండకపోతే (వారికి విడాకులిచ్చి , వారి కుమార్తెలను వివాహమాడటం) మీకు దోషం కాదు - మీ వెన్ను నుండి పుట్టిన మీ కుమారుల భార్యలు. ఇంకా ఏకకాలంలో అక్కాచెల్లెళ్ళు ఇద్దరినీ చేర్చి భార్యలుగా చేసుకోవటం కూడా నిషిద్ధమే. పూర్వం జరిగిందేదో జరిగిపోయింది. అల్లాహ్ క్షమించేవాడూ కరుణించేవాడూను.

**4. అస్ నిసా** 24 - 25 ఇంకా ఇతరుల వివాహబంధంలో ఉండే స్త్రీలు కూడా మీకు హరామ్ , మీ చేతికి (యుద్ధంలో) చిక్కిన స్త్రీలు తప్ప. ఇది అల్లాహ్ అనుశాసనం. దీనిని మీరు విధిగా పాటించాలి. వీరు తప్ప మిగతా స్త్రీలందరినీ మీరు మీ ధనం ద్వారా పొందటం మీకు హలాల్ (ధర్మసమ్మతం) చెయ్యబడిరది. అయితే వారికి వివాహబంధంతో రక్షణ కల్పించాలి. కాని విశృంఖలమైన కామక్రీడలకు ఒడిగట్టరాదు. తరువాత వారిద్వారా మీరు అనుభవించిన దాంపత్య సుఖానికి బదులుగా వారి 'మహర్'ను ఒక విధిగా భావించి చెల్లించండి. కాని 'మహర్' ఒప్పందం జరిగిన తరువాత పరస్పరమైన అంగీకారంతో మీ మధ్య ఏదైనా రాజీ కుదిరితే , అందులో దోషం లేదు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, అత్యంత వివేకసంపన్నుడు. మీలో ఎవరైనా ఒకరు ముస్లిము కుటుంబానికి చెందిన వనితలను వివాహం చేసుకునే స్తోమత లేకపోతే , మీ స్వాధీనంలో ఉన్నటువంటి ముస్లిములైనటువంటి బానిస స్త్రీలలో ఎవరినైనా అతడు వివాహం చేసుకోవాలి. మీ విశ్వాసం యొక్క స్థితిగతులు అల్లాహ్ కు బాగా తెలుసు. మీరంతా ఒకే వర్గానికి చెందినవారు. అందువల్ల వారి సంరక్షకుల అనుమతితో వారిని వివాహం చేసుకోండి. న్యాయమైన పద్ధతిలో వారికి మహర్ ఇవ్వండి - వారు వివాహ బంధంలో సురక్షితంగా ఉండేందుకు , స్వేచ్ఛాకామక్రీడలకు దిగకుండా ఉండేందుకు , దొంగచాటు సంబంధాలను ఏర్పరచు కోకుండా ఉండేందుకు. వివాహబంధంలో వారు రక్షణపొందిన తరువాత ఏదైనా చెడునడతకు పాల్పడితే, కుటుంబ స్త్రీల (ముహ్సనాత్)కు నిర్ణయించబడిన శిక్షలోని సగం శిక్ష వారికి విధించబడుతుంది. వివాహం చేసుకోక పోవటం వల్ల భయభక్తుల బంధాలు తెగిపోతాయని మీలో భయపడే వారికొరకే ఈ సౌలభ్యం అనుమతించబడిరది. మీరు నిగ్రహశక్తి కలిగివుంటే , అది మీకే శ్రేయస్కరం. అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను.

**4. అస్ నిసా** 26 - 28 మీకు పూర్వం గతించిన సజ్జనులు అవలంబించిన మార్గాలను మీకు విశదపరచి ఆ మార్గాలలోనే మిమ్మల్ని కూడా నడపాలని అల్లాహ్ కోరుతున్నాడు. ఆయన తన కారుణ్యంతో మీ వైపునకు మరలాలని అభిలషిస్తున్నాడు. ఆయన సర్వమూ తెలిసినవాడు, మహావివేకి కూడా. అల్లాహ్ అయితే మీ వైపునకు కారుణ్యంతో మరలాలనే కోరుతున్నాడు. కాని తమ మనోవాంఛలను అనుసరిస్తున్నవారు మీరు సన్మార్గం తొలగి దూరంగా పోవాలని కోరుతారు. మీపై ఉన్న ఆంక్షలను అల్లాహ్ తేలిక చెయ్యాలని కోరుతున్నాడు. ఎందుకంటే మానవుడు బలహీనంగా సృష్టించబడ్డాడు.

**4. అస్ నిసా** 29 - 31 విశ్వసించిన ప్రజలారా! ఒకరి సొమ్మును మరొకరు అధర్మంగా తినకండి. ఇచ్చి పుచ్చుకోవటం జరగవలసిందే, అయితే పరస్పర అంగీకారంతో. మిమ్మల్ని మీరు చంపుకోకండి. అల్లాహ్ కు మీరంటే ఎంతో దయ

అని నమ్మండి. హింసా దౌర్జన్యాల ద్వారా అలా చేసేవాణ్ణి మేము తప్పకుండా అగ్నిలో పడవేస్తాము. ఇది అల్లాహ్ కు అంత కష్టమైన పని కాదు. మీకు నిషేధించబడినటువంటి మహా పాపాలకు గనక మీరు దూరంగా ఉంటే , మీ చిన్న చిన్న దోషాలను మేము మీ లెక్క నుండి తీసివేస్తాము. మిమ్మల్ని గౌరవస్థానాల్లో ప్రవేశింపజేస్తాము.

**4. అన్ నిసా** 32 అల్లాహ్ మీలో ఎవరికైనా ఇతరులకు ఇచ్చినదానికంటే ఎక్కువగా ప్రసాదించివుంటే మీరు దానికి ఆశపడకండి. పురుషులు సంపాదించిన దానికి తగినట్లుగా వారి భాగం ఉంటుంది. స్త్రీలు సంపాదించిన దానికి తగినట్లుగా వారి భాగం ఉంటుంది. అయితే అల్లాహ్ ను ఆయన అనుగ్రహం కొరకు ప్రార్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ సకల విషయ పరిజ్ఞానం కలవాడు.

**4. అన్ నిసా** 33 తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళే ప్రతి ఆస్తికి మేము హక్కుదారులను నిర్ణయించాము. ఇక మీరు వాగ్దానం చేసిన వారు - వారికి ఇవ్వవలసిన భాగం వారికి ఇవ్వండి. నిశ్చయంగా అల్లాహ్ అన్నింటినీ కనిపెట్టి ఉన్నాడు.

**4. అన్ నిసా** 34 - 35 పురుషులు స్త్రీలకు అధికారులు (ఖవ్వామ్), ఎందుకంటే అల్లాహ్ వారిలో ఒకరికి మరొకరిపై ఆధిక్యతను ప్రసాదించటంవల్ల , ఇంకా పురుషులు తమ సంపదను వారికొరకు ఖర్చు చేస్తున్నందువల్ల. కనుక సుగుణవతులైన స్త్రీలు విధేయత కలిగివుంటారు. పురుషులు లేనప్పుడు అల్లాహ్ రక్షణలో ఉంటూ వారి హక్కులను కాపాడుతారు. ధిక్కరిస్తారనే భయం మీకు ఏ స్త్రీల విషయంలో కలుగుతుందో వారికి నచ్చజెప్పండి. పడకగదులలో వారికి దూరంగా ఉండండి, మరియు కొట్టండి, తరువాత వారు మీకు విధేయలైతే, అకారణంగా వారిని వేధించటానికి సాకులు వెతక్కండి. గొప్పవాడూ , అధికుడూ అయిన అల్లాహ్ పైన ఉన్నాడనే విషయాన్ని తెలుసుకోండి. భార్యభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయనే భయం మీకు కలిగితే , భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని నియమించండి. వారిద్దరు సంస్కరణను కోరితే అల్లాహ్ వారిమధ్య సమాధానం కుదరటానికి మార్గం చూపుతాడు. అల్లాహ్ సర్వజ్ఞాని సకలమూ ఎరిగినవాడు.

**4. అన్ నిసా** 36 - 42 మీరంతా అల్లాహ్ కు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చేయవద్దు. తల్లిదండ్రుల ఎడల సద్భావంతో మెలగండి. బంధువులూ , అనాథులూ, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి. పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులయిన పొరుగువారు, ప్రక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న దాసదాసీ జనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించండి. గర్వాతి శయంతో కన్నూమిన్నూ కాననివారు , తమ గొప్పతనం గురించి విర్రవీగేవారు అంటే అల్లాహ్ ఇష్టపడడు అని గట్టిగా నమ్మండి. ఇంకా, పిసినారితనంతో ప్రవర్తిస్తూ ఇతరులక్కూడా పిసినారితనాన్ని గరపేవారిని కూడా అల్లాహ్ ప్రేమించడు. మా అనుగ్రహాలను తిరస్కరించే ఇటువంటి వారికొరకు మేము అవమానకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాము. కేవలం ప్రజలకు చూపటానికి తమ సంపదను ఖర్చు పెట్టేవారు , అల్లాహ్ ను , అంతిమదినాన్ని హృదయపూర్వకంగా విశ్వసించనివారు అంటే కూడా

అల్లాహ్ కు అనిష్టమే. యథార్థమేమిటంటే షైతాన్ ఎవడి స్నేహితుడయ్యాడో వాడికి దుస్సాంగత్యం లభించినట్లే. వారు గనక అల్లాహ్ ను, అంతిమ దినాన్ని విశ్వసిస్తే, అల్లాహ్ ఇచ్చిన దానినుండి ఖర్చుపెడితే వారిపైకి ఏ విపత్తు వచ్చిపడుతుంది? వారు ఆవిధంగా చేసి వున్నట్లయితే వారి సత్కార్యాలు అల్లాహ్ కు తెలియకుండా ఉండేవి కావు కదా! అల్లాహ్ ఎవరికీ రవ్వంత అన్యాయం కూడా చెయ్యడు. ఎవరైనా ఒక మంచి పని చేస్తే , దాన్ని అల్లాహ్ రెండింతలు చేస్తాడు. ఇంకా తన తరఫు నుండి పెద్ద ప్రతిఫలం కూడా ప్రసాదిస్తాడు. మేము ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి నిన్ను (ముహమ్మద్- సఅసమ్‌ను) వారికి సాక్షిగా నిలబెట్టినప్పుడు వారు ఏం చేస్తారో ఆలోచించు. ప్రవక్త మాటను తిరస్కరించి , ఆయనకు అవిధేయత చూపిన ప్రజలంతా అప్పుడు భూమి బ్రద్దలై తాము భూమిలో స్థాపితమైపోతే ఎంత బాగుండును అని తలపోస్తారు. అక్కడ వారు అల్లాహ్ ముందు ఏ విషయాన్నీ దాచలేరు.

**4. అన్ నిసా** 43 విశ్వాసులారా! మీరు నిషాస్థితిలో ఉన్నప్పుడు నమాజ్ దరిదాపులకు వెళ్ళకండి. మీరు పలికేదేమిటో మీకు తెలిసినప్పుడే నమాజ్ చెయ్యాలి. ఇదేవిధంగా అపరిశుద్ధ స్థితిలో కూడా , స్నానం చెయ్యనంతవరకు నమాజ్ దగ్గరకు వెళ్ళకండి, దారినిపోతూ ఉన్నప్పుడు తప్ప. మీరు ఎప్పుడైనా అస్వస్థులైతే లేక ప్రయాణంలో ఉంటే లేక మీలో ఎవరైనా మలమూత్ర విసర్జనం చేసివుంటే లేక మీరు మీ స్త్రీలను తాకివుంటే , మీకు నీరు లభ్యంకాని పక్షంలో , పరిశుభ్రమైన మట్టిని ఉపయోగించండి , దానితో మీ ముఖాలను , చేతులను రుద్దుకొనండి. నిస్సందేహంగా అల్లాహ్ ఉదారస్వభావుడు, క్షమాగుణం కలవాడు.

**4. అన్ నిసా** 44 - 46 గ్రంథ జ్ఞానంలో కొంతభాగం ఇవ్వబడినవారిని కూడా మీరు చూశారా ? వారే స్వయంగా అపమార్గాన్ని కొనితెచ్చుకున్నారు. మీరు కూడా మార్గం తప్పాలని కోరుతున్నారు. మీ శత్రువులను అల్లాహ్ బాగా ఎరుగును. మీకు సహాయం చేయటానికి , మిమ్మల్ని కాపాడటానికి అల్లాహ్యే చాలు. యూదుల పద్ధతిని అవలంబించిన వారిలో కొందరు పదాలను వాటి సందర్భాల నుండి తారుమారు చేస్తారు. సత్యధర్మానికి వ్యతిరేకంగా ప్రచారం చెయ్యటానికి, వారు తమ నాలుకలను మెలితిప్పి ''సమినా వ అసయ్‌నా'' అని, ''ఇస్మగైరముస్‌మఇన్'' అనీ, ''రాఇనా'' అనీ పలుకుతారు. అలాకాకుండా, ''సమినా వ అతానా'' అని, ''ఇస్‌మ'', ''ఉన్‌జుర్‌నా'' అనీ, అని ఉంటే వారికే మేలు కలిగివుండేది. అది ఉత్తమమైన పద్ధతిగా ఉండేది. కాని వారి అసత్యానుసరణం కారణంగా , వారిపై అల్లాహ్ శాపం పడే ఉంది. కనుక వారు విశ్వసించటం అనేది చాలా తక్కువ.

**4. అన్ నిసా** 47 - 48 గ్రంథ ప్రజలారా! మేము ఇప్పుడు అవతరింపజేసిన గ్రంథాన్ని విశ్వసించండి. అది , మీ వద్ద పూర్వం నుండే ఉన్న గ్రంథాన్ని ధ్రువపరుస్తుంది , సమర్థిస్తుంది. మేము ముఖాలను వికృతంచేసి వెనక్కి తిప్పకముందే, లేక మేము సబ్బత్ వారిని శపించినట్లుగా వారినీ శపించక ముందే , దీనిని విశ్వసించండి. అల్లాహ్ ఆజ్ఞ తప్పకుండా అమలు పరచబడుతుందని గుర్తుపెట్టుకోండి. అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది

తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను ఇష్టపడిన వారికొరకు క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్ కు భాగస్వాములుగా చేసేవాడు, ఎంతో ఘోరమైన అబద్ధాన్ని కల్పించాడు అన్నమాట , ఎంతో తీవ్రమైన పాపపుమాట అన్నాడు అన్నమాట.

**4. అస్ నిసా** 49 - 50 తమ ఆత్మ పరిశుద్ధతను గురించి గొప్పలు చెప్పుకునే వారిని కూడా మీరు గమనించారా ? నిజానికి పరిశుద్ధతను అల్లాహ్యే తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. (వారికి పరిశుద్ధత లభించకపోతే) వారికి రవ్వంత అన్యాయం కూడా జరిగినట్లు కాదు. చూశారా! వారు అల్లాహ్ పై లేనిపోని అభాండాలు వెయ్యటానిక్కూడా జంకడం లేదు. వారు స్పష్టంగా పాపాత్ములని చెప్పటానికి ఈ ఒక్క పాపం చాలు.

**4. అస్ నిసా** 51 - 57 గ్రంథ జ్ఞానంలో కొంత భాగం ఇవ్వబడిన వారిని నీవు చూడలేదా ? వారి పరిస్థితి ఎలా వుందంటే, వారు 'జిబ్త్ను, ''తాగూత్''ను నమ్ముతారు. ఇంకా వారు అవిశ్వాసులను గురించి, ''విశ్వాసులకంటే వీరే చాలావరకు సరైన మార్గంలో ఉన్నారు '' అని అంటారు. ఇటువంటి వారినే అల్లాహ్ శపించింది. అల్లాహ్ శపించినవాడికి సహాయం చేసే వాడెవ్వడూ నీకు దొరకడు. పరిపాలనలో వారికేమైనా భాగం ఉందా ? ఉంటే వారు ఇతరులకు చిల్లిగవ్వకూడా ఇవ్వరు. లేక ఇతరులను చూచి వారు అసూయపడటానికి కారణం అల్లాహ్ వారికి తన అనుగ్రహాన్ని ప్రసాదించాడనా? ఇదే నిజమయితే వారు ఈ విషయం తెలుసుకోవాలి: మేము ఇబ్రాహీము సంతతికి గ్రంథాన్ని, వివేకాన్ని ప్రసాదించాము. వారికి మహత్తరమైన సామ్రాజ్యాన్ని ప్రదానం చేశాము. కాని , వారిలో కొంతమంది ఆ గ్రంథాన్ని విశ్వసించారు, మరికొంతమంది దానికి విముఖులయ్యారు. వైముఖ్యం చూపేవారికి మండే నరకాగ్నియే చాలు. మా ఆయత్లను నిరాకరించిన వారిని మేము నిశ్చయంగా అగ్నిలో పడవేస్తాము. ఇంకా వారి శరీర చర్మం కాలి కరిగి పోయినప్పుడల్లా, దాని స్థానంలో మేము మరొక చర్మాన్ని సృష్టిస్తాము , వారు శిక్షను బాగా రుచిచూడాలని. అల్లాహ్ సర్వశక్తిమంతుడు. తన నిర్ణయాలను అమలుపరచే విజ్ఞత ఆయనకు నిండుగా ఉంది. మా ఆయత్లను విశ్వసించి మంచి పనులు చేసేవారిని మేము , క్రింద కాలువలు ప్రవహించే ఉద్యానవనాలలో ప్రవేశపెడతాము. అక్కడ వారు కలకాలం ఉంటారు. ఇంకా , వారికి పరిశుద్ధలయిన భార్యలు లభిస్తారు. మేము వారిని దట్టమైన నీడలలో ఉంచుతాము.

**4. అస్ నిసా** 58 ముస్లిములారా! ''అమానతులను యోగ్యులైన వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పు చెప్పే టప్పుడు న్యాయంగా చేయండి '' అని అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు. అల్లాహ్ మీకు ఎంతో చక్కని హితబోధచేస్తున్నాడు. నిశ్చయంగా ఆయన అన్నీ వింటాడు, అన్నీ చూస్తాడు.

**4. అస్ నిసా** 59 విశ్వసించిన ప్రజలారా! విధేయత చూపండి అల్లాహ్ కు , విధేయత చూపండి ప్రవక్తకు , మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు. మీమధ్య ఏ విషయంలోనైనా వివాదం తల ఎత్తితే దాన్ని అల్లాహ్ కు , ప్రవక్తకు

నివేదించండి. మీరు నిజంగానే అల్లాహ్మీద అంతిమ దినం మీదా విశ్వాసం కలవారే అయితే. ఇదే సరి jైన పద్ధతి. ఫలితాన్ని బట్టి కూడా ఇదే ఉత్తమమైనది.

**4. అన్ నిసా** 60 - 70 ప్రవక్తా! ‘‘నీవద్దకు పంపబడిన గ్రంథాన్ని , నీకు పూర్వం పంపబడిన గ్రంథాలను మేము విశ్వసించాము’’ అని ప్రకటన అయితే చేసి తమ వ్యవహారాల పరిష్కారం కొరకు ‘తాగూత్’ వద్దకు పోవాలని కోరేవారిని నీవు చూడలేదా ? వాస్తవానికి ‘తాగూత్’ను తిరస్కరించండి అని వారిని ఆదేశిం చటం జరిగింది-షైతాన్ వారిని పెడత్రోవపట్టించి సన్మార్గానికి బహుదూరంగా తీసుకుపోవాలని చూస్తాడు. వారితో , ‘‘అల్లాహ్ పంపిన దాని వైపునకు రండి , ప్రవక్త వైపునకు రండి ’’ అని చెప్పినప్పుడు , ఆ కపటులు నీ వైపునకు రాకుండా తప్పించుకోవడాన్ని నీవు చూస్తావు. అయితే వారు తమ చేజేతులా తెచ్చుకున్న ఆపద వారిపైకి వచ్చిపడినప్పుడు వారి ప్రవర్తన ఎలా ఉంటుంది ? అప్పుడు వారు నీ వద్దకు ప్రమాణాలు చేస్తూ వస్తారు. వచ్చి , ‘‘దేవుని సాక్షిగా! మేము మంచినే కాంక్షిస్తాము. ప్రత్యర్థుల మధ్య ఏదో ఒక విధంగా రాజీ కుదరాలనేదే మా ఉద్దేశ్యం’’ అని అంటారు - వారి మనస్సులో ఏదైతే ఉందో అది అల్లాహ్ కు తెలుసు. కనుక వారితో వివాదానికి దిగకు. వారికి నచ్చజెప్పు. వారి హృదయాలలో నాటుకునే విధంగా బోధచేయి. (వారికి ఇలా తెలుపు) మేము ఏ ప్రవక్తను పంపినా అల్లాహ్ అనుజ్ఞ ప్రకారం అతనికి విధేయత చూపాలనే పంపాము. వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్న తరువాత వారి కొరకు ఉత్తమమయిన పద్ధతి ఏమిటంటే , వారు నీ వద్దకు వచ్చి ఉండవల సింది, క్షమించు అని అల్లాహ్ ను అర్థించి ఉండవలసింది, ఇంకా ప్రవక్త కూడ వారికొరకు మన్నింపుకై విజ్ఞాపన చేసి ఉండేవాడు. అప్పుడు వారు నిశ్చయంగా అల్లాహ్ ను క్షమించేవాడూ , కరుణించేవాడుగా కనుగొని ఉండేవారు. కాదు, ముహమ్మద్! నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయనిర్ణేతగా స్వీకరించబడనంతవరకు, ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో కూడా ఏమాత్రం సంకోచం లేకుండా దానిని యథాతథంగా శిరసావహించనంతవరకు వారు నిజమైన విశ్వాసులు కాలేరు. మేము వారిని, ‘‘మిమ్మల్ని మీరు చంపుకోండి ’’ లేక ‘‘మీ గృహాలను వదలండి ’’ అని ఆజ్ఞాపించివున్నట్లయితే, వారిలో కొద్దిమంది మాత్రమే దాన్ని పాటించేవారు. వారికి హితబోధ చేయబడిన విధంగా వారు గనక నడచుకొని ఉన్నట్లయితే, అది వారికి శ్రేయస్కరమైనదిగా , (విశ్వాసములో) దృఢత్వాన్ని కలిగించేదిగా ఉండేది. మేము మా తరఫు నుండి వారికి గొప్ప ప్రతిఫలం ఇచ్చివుండేవారము. ఇంకా వారికి ఋజుమార్గం చూపించి ఉండేవారము. అల్లాహ్ కు , ప్రవక్తకు విధేయత చూపేవారు అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన వారితో ఉంటారు , అంటే ప్రవక్తలు , సత్యసంధులు, షహీదులు, సజ్జనులూను. ఎవరికి దొరికినా ఈ స్నేహితులు ఎంత మంచివారు! అల్లాహ్ నుండి లభించే అసలైన అనుగ్రహం ఇదే. యథార్థం తెలుసుకోవడానికి అల్లాహ్ పంపిన జ్ఞానమే చాలు.

**4. అన్ నిసా** 71 - 76 విశ్వాసులారా! యుద్ధానికి ఎల్లప్పుడూ సన్నద్ధులై ఉండండి. వీలునుబట్టి వేరు వేరు జట్లుగానో లేక అంతా కలసియో బయలుదేరండి. యుద్ధమంటే తప్పించుకు తిరిగేవారు కూడా మీలో కొందరు

ఉన్నారు. ఒకవేళ మీకు ఏదన్నా ఆపదవస్తే వారు , ''అల్లాహ్ మాపై దయచూపాడు , కనుకనే మేము వారితో వెళ్ళలేదు'' అని అంటారు. ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని అనుగ్రహిస్తే వారు ఇలా అంటారు - మీకూ వారికి మధ్య ఏ విధమయిన అనురాగబంధమే లేనట్లుగా అంటారు - ''మేమూ వారితోపాటు వెళ్ళి ఉన్నట్లయితే మంచిఫలితం దక్కివుండేది.'' (అటువంటి వారు తెలుసుకోవాలి) : పరలోకానికి బదులుగా ఇహలోక జీవితాన్ని అమ్మివేసినవారు అల్లాహ్ మార్గంలో పోరాడాలి. అల్లాహ్ మార్గంలో పోరాడి చంపబడేవానికి లేక విజయాన్ని పొందేవానికి మేము తప్పకుండా గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాము. అసలు మీరు , నిస్సహాయులైన ఆ పురుషులు, స్త్రీలు, పిల్లలకొరకు అల్లాహ్ మార్గంలో పోరాడక పోవటానికి కారణం ఏమిటి ? బలహీనులవటంచేత అణచబడి , వారు, ''మా ప్రభూ! దుర్మార్గులైన ఈ నగరవాసుల నుండి మాకు విమోచనం కలిగించు. మా కొరకు నీ తరఫు నుండి ఒక సహాయకుణ్ణి, ఒక రక్షకుణ్ణి పంపించు '' అని ఫిర్యాదు చేస్తున్నారే! విశ్వాస మార్గాన్ని ఎన్నుకున్న వారు అల్లాహ్ మార్గంలో పోరాడతారు. అవిశ్వాస మార్గాన్ని ఎన్నుకున్నవారు తాగూత్ మార్గంలో పోరాడతారు. కనుక షైతాన్ సహచరులతో పోరాడండి. వాస్తవంగా షైతాన్ జిత్తులు ఎంతో బలహీనమైనవని నమ్మండి.

**4. అన్ నిసా** 77 - 78 ''మీ చేతులను (యుద్ధం చెయ్యకుండా) నిలిపి ఉంచండి. నమాజును స్థాపించండి. జకాత్ ఇవ్వండి'' అని చెప్పబడినవారిని కూడా నీవు చూశావా ? తీరా ఇప్పుడు యుద్ధం చెయ్యండి అని వారికి ఆజ్ఞ ఇస్తే వారిలో కొందరి స్థితి ఎలా ఉందంటే , వారు దైవానికి భయపడినట్లుగా మనుషులకు భయపడుతున్నారు. కాదు , అంతకంటే అధికంగానే. ''ప్రభూ! యుద్ధం చెయ్యండి అనే ఈ ఆజ్ఞను మా కొరకు ఎందుకు వ్రాసిపెట్టావు ? మాకు ఇంకా కొంత వ్యవధిని ఎందుకివ్వలేదు?'' అని అంటారు. వారితో ఇలా అను: ''ఐహిక జీవిత భోగాలు అల్పమైనవి, దైవభక్తి పరాయణుడైన మనిషికి పరలోకమే ఎక్కువ మేలైనది. మీకు రవ్వంత అన్యాయం కూడా జరగదు. '' ఇక మృత్యువు, మీరు ఎక్కడున్నాసరే అది మీకు వచ్చి తీరుతుంది, మీరు ఎంతటి ధృఢమైన భవనాలలో ఉన్నాసరే...

**4. అన్ నిసా** 78 - 79 ... వారికి ఏదైనా లాభం కలిగితే , ''ఇది అల్లాహ్ తరఫు నుండి వచ్చింది '' అని అంటారు. ఒకవేళ ఏదైనా నష్టం కలిగితే , ''ప్రవక్తా! ఇది నీ వల్ల జరిగింది '' అని అంటారు. ''అంతా అల్లాహ్ తరఫునుండే జరిగింది'' అని వారికి చెప్పు. అసలు వారికి ఏమయింది , వారు ఏ విషయాన్నీ అర్థం చేసుకోరు ? మనిషీ! నీకు ఏ మేలు కలిగినా అల్లాహ్ కరుణవల్లనే కలుగుతుంది. నీకు ఏ కీడు కలిగినా అది నీవు స్వయంగా సంపాదించుకున్న దాని ఫలితమే...

**4. అన్ నిసా** 79 - 80 ... ముహమ్మద్! మేము నిన్ను మానవజాతికి సందేశహరుడుగా చేసి పంపాము. దీనికి అల్లాహ్ సాక్ష్యం చాలు. ప్రవక్తకు విధేయత చూపినవాడు వాస్తవంగా అల్లాహ్ కు విధేయత చూపినట్లే. కాని ఎవడైతే విముఖుడయ్యాడో అటువంటివారిపై మేము నిన్ను కావలివానిగా చేసి పంపలేదు.

**4. అస్ నిసా** 81 - 82 వారు నీ సమక్షంలోనయితే ''మేము విధేయులం'' అని అంటారు. కాని నీ వద్ద నుండి వెళ్ళిన తరువాత వారిలోని ఒక వర్గంవారు రాత్రివేళ సమావేశమై నీ మాటలకు వ్యతిరేకంగా సంప్రదిం పులు జరుపుతారు. వారి ఈ రహస్యాలోచనలన్నింటినీ అల్లాహ్ వ్రాస్తున్నాడు. నీవు వారిని లెక్కచేయకు. అల్లాహ్ పై భారం మోపు. భారం మోపటానికి ఆయనే చాలు. ఈ ప్రజలు ఖురానును గురించి ఆలోచన చెయ్యరా? ఇది అల్లాహ్ తరఫు నుండి కాక వేరొకరి తరఫునుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర విరుద్ధాలైన విషయాలు ఉండేవి.

**4. అస్ నిసా** 83 వారు ఎక్కడన్నా ఏదైనా సంతృప్తికరమైన వార్తగాని లేదా భయంకరమైన వార్తగాని విన్నప్పుడు దాన్ని వ్యాపింపచేస్తారు. అలాకాక వారు దానిని ప్రవక్తకు , సంఘంలోని బాధ్యతాయుతులైన తమ పెద్దలకు తెలిపివుంటే వారిలో, దానిని ఆధారంగా చేసుకుని సరి jైన నిర్ణయం తీసుకోగలిగే సామర్థ్యం కలవారి దృష్టికి అది వచ్చి ఉండేది. మీపై గనక అల్లాహ్ అనుగ్రహం , కారుణ్యం లేకపోయినట్లయితే , (మీ బలహీనతలు ఎలాంటివంటే) మీలో ఎవరో కొద్దిమంది తప్ప మీరందరూ షైతానును అనుసరించి ఉండేవారు.

**4. అస్ నిసా** 84 - 85 కనుక ప్రవక్తా! నీవు అల్లాహ్ మార్గంలో యుద్ధం చెయ్యి. నీవు నీ విషయంలో తప్ప మరెవరి విషయంలోనూ బాధ్యుడవు కావు. అయితే విశ్వాసులను యుద్ధం చెయ్యండి అని ప్రేరేపించు. అల్లాహ్ అవిశ్వాసుల శక్తిని అణచవచ్చు. అల్లాహ్ శక్తి అందరి శక్తికంటే ఎంతో అధికమైనది. ఆయన శిక్ష అన్ని శిక్షల కంటే తీవ్రమైనది. మంచి విషయం నిమిత్తం సిఫారసు చేసేవానికి అందులో భాగం లభిస్తుంది. చెడు విషయం నిమిత్తం సిఫారసు చేసేవానికి అందులో భాగం లభిస్తుంది. అల్లాహ్ ప్రతి వస్తువుపై తన దృష్టిని ఉంచుతాడు.

**4. అస్ నిసా** 86 - 87 మీకు ఎవరైనా గౌరవభావంతో సలాము చేస్తే అతనికి మీరు అంతకంటే ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలాము చెయ్యండి. లేదా కనీసం అదేవిధంగానైనా చెయ్యండి. అల్లాహ్ ప్రతి దానికి లెక్క తీసుకుంటాడు. అల్లాహ్ - ఆయన తప్ప వేరే దైవం లేడు. ఆయన మీ అందరినీ ప్రళయదినం నాడు సమావేశపరుస్తాడు. అది రావటంలో ఏమాత్రం సందేహం లేదు. అల్లాహ్ మాటకంటే మరెవరి మాట నిజం కాగలదు?

88 - 91 మీకు ఏమయింది , మీ మధ్య కపటులను గురించి రెండు అభిప్రాయాలు ఉన్నాయి ? వాస్తవానికి వారు సంపాదించుకున్న దుష్టకర్మల ఫలితంగానే అల్లాహ్ వారిని వెనక్కు (పూర్వపు స్థితి) మరల్చాడు. అల్లాహ్ మార్గం చూపనివానికి మీరు మార్గం చూపదలచారా ? వాస్తవంగా అల్లాహ్ అపమార్గం పట్టించినవాని కొరకు మీరు ఏ మార్గాన్నీ కనుగొనలేరు. స్వయంగా వారు అవిశ్వాసులుగా ఉన్నట్లుగానే మీరు కూడా అవిశ్వాసులుగా మారి , మీరూ వారూ సమానులై పోవాలని వారు కోరుతున్నారు. కనుక అల్లాహ్ మార్గంలో వారు హిజ్రత్ (వలస) చెయ్యనంతవరకు, వారిలో ఎవ్వరినీ మీరు మీ మిత్రులుగా ఎన్నుకోకండి. ఒకవేళ వారు హిజ్రత్ చెయ్యకపోతే , ఎక్కడ దొరికినా వారిని పట్టుకోండి , చంపండి. వారిలో ఎవ్వరినీ మీ మిత్రులుగా , సహాయకులుగా చేసుకోకండి. అయితే మీతో ఒప్పందం చేసుకున్న జాతితో కలిసిపోయిన కపటులకు ఈ ఉత్తరువు నుండి మినహాయింపు ఉంది.

అదేవిధంగా మీ వద్దకు వచ్చి యుద్ధం పట్ల విముఖతను వ్యక్తం చేసి మీతోగాని , లేక స్వజాతి వారితోగాని యుద్ధం చెయ్యటానికి సమ్మతించని కపటులకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. అల్లాహ్ గనక సంకల్పించి ఉంటే , వారికి మీపై ఆధిక్యాన్ని ఇచ్చి ఉండేవాడు. నిశ్చయంగా వారూ మీతో పోరాడి ఉండేవారే. కాబట్టి వారు మీ నుండి పైదొలగితే, యుద్ధం చెయ్యటం మానివేస్తే , సంధికొరకు, శాంతి కొరకు చేయిచాపితే , అప్పుడు వారిపై దాడి చెయ్యటానికి అల్లాహ్ మీ కొరకు ఏ కారణాన్నీ వదలలేదు. మరొక రకం కపటులను మీరు చూస్తారు. వారు మీతోనూ, తమ జాతి వారితోనూ శాంతియుతంగా ఉండాలని కోరుకుంటారు. కాని ఎప్పుడైనా అల్లకల్లోల పరిస్థితి ఏర్పడినప్పుడు, అదును చూసి, వారు అందులోకి దూకుతారు. అలాంటివారు మీతో పోరాడటం మానుకోకపోతే , సంధికొరకు శాంతి కొరకు చేయిచాపకపోతే , తమ చేతులను ఆపివుంచకపోతే , అప్పుడు వారిని ఎక్కడ దొరికితే అక్కడ పట్టుకోండి, సంహరించండి. వారితో యుద్ధం చెయ్యటానికి మేము మీకు స్పష్టమైన అధికారం ఇచ్చాము.

**4. అన్ నిసా** 92 - 93 పొరపాటుగా తప్ప , ఒక విశ్వాసి మరొక విశ్వాసిని చంపటం తగనిపని. ఒక విశ్వాసిని పొరపాటుగా చంపినవాడు , దానికి పరిహారంగా ఒక ముస్లిము బానిసకు విముక్తి కలిగించాలి. ఇంకా హతుని వారసులకు రక్తపరిహారాన్ని అతడు చెల్లించాలి, వారు దాన్ని క్షమించి రద్దుచేస్తే తప్ప. కాని ఆ ముస్లిము హతుడు మీ శత్రుజాతికి చెందినవాడైతే , దానికి పరిహారం ఒక ముస్లిము బానిసకు విముక్తి కలిగించటం. ఒకవేళ అతడు మీతో ఒడంబడిక చేసుకున్న ముస్లిమేతర జాతికి చెందినవాడైతే అతని వారసులకు రక్తపరిహారాన్ని చెల్లించాలి. ఇంకా ఒక ముస్లిము బానిసను విడుదల చెయ్యాలి. బానిస దొరకనివారు వరుసగా రెండు మాసాలు ఉపవాసం ఉండాలి. ఈ అపరాధానికిగాను అల్లాహ్ ముందు పశ్చాత్తాపపడే పద్ధతి ఇదే. అల్లాహ్ అన్నీ తెలిసినవాడూ, అత్యంత వివేకవంతుడూను. ఇక బుద్ధిపూర్వకంగా ఒక విశ్వాసిని చంపేవానికి ప్రతిఫలం నరకం. అందులో అతడు సదా ఉంటాడు. అతనిపై అల్లాహ్ ఆగ్రహం , శాపం అవతరిస్తాయి. అల్లాహ్ అతడి కొరకు కఠినమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు.

**4. అన్ నిసా** 94 విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్ మార్గంలో ''జిహాద్'' కొరకు బయలుదేరినప్పుడు, మిత్రులు శత్రువుల మధ్య విచక్షణ చేయండి. మీ వైపునకు సలాము చేస్తూ ముందుకు వచ్చేవాణ్ణి , ''నీవు ముస్లిమువు కావు'' అని త్వరపడి అనకండి. మీరు గనక ప్రాపంచిక ప్రయోజనాలను పొందగోరితే , అల్లాహ్ వద్ద మీకొరకు విజయధనాలు సమృద్ధిగా ఉన్నాయి. దీనికి పూర్వం స్వయంగా మీరూ ఇదేస్థితిలో ఉన్నారుకదా! ఆ తరువాత అల్లాహ్ మిమ్మల్ని కనికరించాడు. కనుక వివేచనతో వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

**4. అన్ నిసా** 95 - 96 కారణమేదీ లేకుండానే ఇంటివద్ద కూర్చుండిపోయే ముస్లిములు , అల్లాహ్ మార్గంలో తమ ధనప్రాణాలతో ''జిహాద్'' చేసే ముస్లిములు ఉభయుల స్థానం సమానం కాదు. కూర్చుండి పోయేవారి స్థానం కంటే ధనప్రాణాలతో ''జిహాద్'' చేసేవారి స్థానాన్ని అల్లాహ్ సమున్నతం చేశాడు. ప్రతి ఒక్కరికి అల్లాహ్ మేలునే వాగ్దానం

చేసినమాట వాస్తవమే అయినా ఆయన వద్ద ముజాహిద్‌ల సేవలకు లభించే ప్రతిఫలం , కూర్చుండిపోయే వారికి లభించే ప్రతిఫలంకంటే ఎంతో ఎక్కువ. వారి కొరకు అల్లాహ్ తరఫు నుండి ఉన్నత స్థానాలూ ఉన్నాయి. క్షమాభిక్ష కారుణ్యం కూడా ఉన్నాయి. అల్లాహ్ ఎక్కువగా క్షమించేవాడూ అమితంగా కరుణించేవాడూను.

**4. అన్ నిసా** 97 - 100 తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారి ప్రాణాలను తీసి , దైవదూతలు వారిని, ‘‘ఇదేమిటి మీ స్థితి ఇలా ఉంది ?’’ అని అడిగారు. అప్పుడు వారు ఇలా సమాధానం చెప్పారు: ‘‘మేము భూమిపై బలహీనులముగా, నిస్సహాయులముగా ఉండేవారము.’’ దైవదూతలు ‘‘అల్లాహ్ భూమి విశాలంగా లేదా మీరు వలస పోవటానికి ?’’ అని అడిగారు. వారి నివాసం నరకం. అది మహాచెడ్డ నివాసం. అయితే , నిజంగానే నిస్సహాయులై బయలుదేరటానికి ఏ మార్గమూ, ఏ సాధనసంపత్తీ లేని పురుషులనూ, స్త్రీలనూ, పిల్లలనూ అల్లాహ్ క్షమించవచ్చు. (ఎందుకంటే) అల్లాహ్ ఎక్కువగా క్షమించేవాడూ అధికంగా మన్నించేవాడూను. అల్లాహ్ మార్గంలో వలసపోయేవాడు ఆశ్రయం పొందటానికి పుడమిలో కావలసినంత స్థలాన్నీ , బ్రతుకు తెరువుకు ఎక్కువ అవకాశాలనూ పొందుతాడు. అల్లాహ్ వైపునకు , ఆయన ప్రవక్త వైపునకు వలసపోవటానికి తన గృహం నుండి బయలుదేరి మార్గమధ్యంలోనే మరణించినవానికి విధిగా ప్రతిఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్ దే. అల్లాహ్ క్షమాభిక్ష పెట్టేవాడు, కరుణించేవాడూను.

**4. అన్ నిసా** 101 మీరు ప్రయాణానికి బయలుదేరినప్పుడు నమాజును సంక్షిప్తం చేస్తే అది తప్పుకాదు , (ముఖ్యంగా) అవిశ్వాసులు మిమ్మల్ని వేధిస్తారనే భయం మీకు కలిగినప్పుడు. ఎందుకంటే వారు మీతో బహిరంగవైరానికి పూనుకున్నారు.

**4. అన్ నిసా** 102 - 103 ప్రవక్తా! నీవు ముస్లిముల మధ్య ఉండి (పోరాటం జరుగుతూ ఉండగా) నమాజ్ చేయించటానికి వారితో నిలబడితే , వారిలోని ఒక వర్గం నీతోపాటు నిలబడాలి. వారు అస్త్రధారులై ఉండాలి. వారు తమ సజ్దాను పూర్తి చేసుకుంటే వెనక్కి వెళ్ళిపోవాలి. అప్పుడు ఇంకా నమాజ్ చెయ్యని రెండోవర్గం వచ్చి నీతోపాటు నమాజ్ చెయ్యాలి. వారు కూడా జాగరూకులై ఉండాలి. తమ ఆయుధాలను ధరించి ఉండాలి. ఎందుకంటే మీరు మీ ఆయుధాలపట్ల, మీ సామానుల పట్ల ఏ కొద్దిపాటి అజాగ్రత్త చూపినా మీపై ఒక్కసారిగా విరుచుకుపడాలని అవిశ్వాసులు కాచుకుని ఉన్నారు. అయితే వర్షంవల్ల మీకు ఇబ్బందిగా ఉంటే లేక మీరు అస్వస్థులైతే ఆయుధాలను దించటం తప్పు కాదు. అయినప్పటికీ మీ జాగ్రత్తలో మీరు ఉండాలి. అవిశ్వాసుల కొరకు అల్లాహ్ నిశ్చయంగా అవమానకరమైన శిక్షను సిద్ధంచేసి ఉంచాడు. నమాజ్‌ను పూర్తిచేసిన తరువాత , నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా ఏ స్థితిలోవున్నా, అల్లాహ్ ను మటుకు స్మరిస్తూ ఉండండి. శాంతిభద్రతలు నెలకొన్నప్పుడు పూర్తి నమాజ్ చెయ్యండి. వాస్తవానికి నమాజ్ విశ్వాసులు నిర్ణీత సమయాలలో విధిగా పాటించవలసిన ధర్మం.

**4. అన్ నిసా** 104 ఈ వర్గాన్ని వెన్నాడటంలో బలహీనతను ప్రదర్శించకండి. ఒకవేళ మీరు బాధపడుతూ ఉంటే మీ మాదిరిగానే వారు కూడా బాధపడుతున్నారు. పైగా అల్లాహ్ నుండి వారు ఆశించని దానిని మీరు ఆశిస్తున్నారు. అల్లాహ్ కు అంతా తెలుసు. ఆయన అత్యంత వివేకసంపన్నుడు.

**4. అన్ నిసా** 105 - 112 ప్రవక్తా! అల్లాహ్ నీకు చూపిన రుజుమార్గానికి అనుగుణంగా నీవు ప్రజల మధ్య తీర్పు చెయ్యటానికి మేము ఈ గ్రంథాన్ని సత్యంతో నీ వద్దకు పంపాము. నీవు నీతిలేనివారి తరఫున వాదిగా నిలబడకు. క్షమాభిక్ష కొరకు అల్లాహ్ ను ప్రార్థించు. ఆయన ఎక్కువగా క్షమించేవాడూ అధికంగా కరుణించేవాడూను. ఆత్మద్రోహం చేసుకునేవారిని నీవు బలపరచకు. నమ్మకద్రోహి , నిత్యపాపి అయిన మనిషిని అల్లాహ్ ప్రేమించడు. వారు తమ దుష్కర్మలను మానవులకు తెలియకుండా దాచగలరు. కాని అల్లాహ్ కు తెలియకుండా దాచలేరు. రాత్రులందు వారు ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా రహస్య సమాలోచనలు జరిపే సమయంలో కూడా ఆయన వారితో ఉంటాడు. వారి సకల చర్యలను అల్లాహ్ పరివేష్టించి ఉన్నాడు. మీరు ఈ అపరాధుల తరఫున ఇహలోక జీవితం లోనయితే వాదించారు. కాని ప్రళయం రోజున వారి తరఫున అల్లాహ్తో ఎవరు వాదిస్తారు ? వారిని అక్కడ సమర్థించే వాడెవడు? చెడ్డపని చేసినవాడు లేదా తన ఆత్మకు అన్యాయం చేసుకున్నవాడు తరువాత క్షమాభిక్ష పెట్టు అని అల్లాహ్ ను అర్థిస్తే , అతడు అల్లాహ్ ను క్షమించేవాడుగా కరుణా మయుడుగా తెలుసుకుంటాడు. కాని ఎవడైనా చెడును సంపాదించుకుంటే , (తరువాత పశ్చాత్తాప పడకపోతే) అతని ఈ సంపాదన అతనికే విపత్తుగా పరిణమిస్తుంది. అల్లాహ్ కు అన్ని విషయాలూ తెలుసు. ఆయన వివేక సంపన్నుడు. ఎవడైనా ఏదైనా నేరంగాని లేక పాపంగాని చేసి , ఆ నిందను ఏ నిర్దోషిపైనైనా మోపితే అతడు తీవ్రమైన అపనిందను , ఘోరపాతకాన్ని మూటగట్టుకుంటాడు.

**4. అన్ నిసా** 113 ప్రవక్తా! అల్లాహ్ అనుగ్రహం గనక నీపై ఉండివుండకపోతే , ఆయన కారుణ్యం నీకు తోడుగా ఉండివుండకపోతే, వారిలోని ఒక వర్గం నిన్ను అపార్థానికి గురిచెయ్యాలనే నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి వారు తమను తాము తప్ప మరెవ్వరినీ అపార్థానికి గురిచేసుకోలేదు. నీకు ఏమాత్రం నష్టం కలిగించివుండేవారు కాదు. అల్లాహ్ నీపై గ్రంథాన్ని , వివేకాన్ని అవతరింపజేశాడు. పూర్వం నీకు తెలియనిదంతా నీకు నేర్పాడు. నిజంగానే ఆయనకు నీమీద ఎక్కువ అనుగ్రహం ఉంది.

**4. అన్ నిసా** 114 - 115 ప్రజలు జరిపే రహస్య సమాలోచనలలో సాధారణంగా ఏ మేలూ ఉండదు. కాని ఎవరైనా రహస్యంగా దానధర్మాలు చెయ్యండి అని బోధిస్తే లేక ఏదైనా సత్కార్యం కొరకు లేదా ప్రజల వ్యవహారాలను చక్కబరిచే ఉద్దేశ్యంతో ఎవరితోనైనా ఏదైనా రహస్యం చెబితే అది మంచి విషయమే. ఎవరైనా అల్లాహ్ సంతోషం కొరకు ఈ విధంగా చేస్తే వారికి మేము గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాము. కాని తనకు రుజుమార్గం విశదమైనప్పటికీ

ఎవడైనా ప్రవక్తకు వ్యతిరేకంగా నడుంబిగిస్తే , విశ్వాసుల వైఖరి కాక మరొక వైఖరి అవలంబిస్తే , అతన్ని మేము అతడు మళ్ళిన దిక్కుకే నడిపిస్తాము. ఇంకా అతన్ని నరకంలో పడవేస్తాము. అది అతి నీచమైన నివాస స్థలం.

**4. అస్ నిసా** 116 - 122 అల్లాహ్ దృష్టిలో కేవలం షిర్కు ఒక్కటే క్షమార్హం కానిది. అది తప్ప తాను కోరిన వారి అన్ని పాపాలను ఆయన క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్ కు భాగస్వాములుగా చేసినవాడు అపమార్గాన బహుదూరం వెళ్ళిపోయాడు. వారు అల్లాహ్ ను వదలి స్త్రీ దేవతలను ఆరాధ్యులుగా చేసుకుంటారు. అల్లాహ్ శాపానికి గురిఅయిన ఆ తిరుగుబాటుదారు షైతాన్‌ను తమ ఆరాధ్యుడుగా చేసుకుంటారు. (వారు విధేయత చూపే ఆ షైతాను) అల్లాహ్తో ఇలా అన్నాడు : ''నేను నీ దాసుల నుండి ఒక నిర్ణీతమైన భాగ్యాన్ని నిశ్చయంగా తీసుకుంటాను. నేను వారిని మార్గం తప్పిస్తాను. నేను వారిలో లేనిపోని ఆశలు కల్పిస్తాను. నేను వారిని ఆజ్ఞాపిస్తాను. వారు నా ఆజ్ఞానుసారం జంతువుల చెవులు చీలుస్తారు. నేను వారిని ఆదేశిస్తాను. వారు నా ఆదేశం ప్రకారం అల్లాహ్ సృష్టిలో మార్పులు చేస్తారు. అల్లాహ్ కు బదులుగా ఈ షైతానును తన సంరక్షకుడుగా , స్నేహితుడుగా చేసుకునేవాడు స్పష్టంగా నష్టానికి గురి అవుతాడు. అతడు వారితో వాగ్దానాలు చేస్తాడు. వారికి ఆశలు చూపుతాడు. కాని షైతాను వాగ్దానాలు కేవలం మోసాలు తప్ప మరేమీ కావు. ఇటువంటి ప్రజల నివాసం నరకం. దానినుండి తప్పించుకోవటానికి వారికి ఏ మార్గమూ లభించదు. ఇక విశ్వసించి మంచిపనులు చేసేవారిని మేము క్రింద కాలువలు ప్రవహించే ఉద్యానవనాలలో ప్రవేశపెడతాము. వారు అక్కడ శాశ్వతంగా ఉంటారు. అల్లాహ్ చేసిన ఈ వాగ్దానం నిజమైనది. అల్లాహ్ కంటే ఎక్కువ సత్యవంతు డెవడు?

**4. అస్ నిసా** 123 - 126 అంతిమ ఫలితం మీ కోరికలపైగాని లేక గ్రంథప్రజల కోరికలపైగాని ఆధారపడి లేదు. దుర్మార్గం చేసినవాడు దాని ఫలితం అనుభవిస్తాడు. అల్లాహ్ కు వ్యతిరేకంగా తనను సమర్థించేవాణ్ణిగాని , తనకు సహాయం చేసేవాణ్ణిగాని అతడు పొందలేడు. మంచిపనులు చేసేవారు - పురుషులైనా స్త్రీలైనా - వారుగనక విశ్వాసులైతే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి రవ్వంత అన్యాయం కూడా జరగదు. అల్లాహ్ కు తనను తాను సమర్పించుకున్నవాడూ, సత్ప్రవర్తన కలవాడూ , అల్లాహ్ తన మిత్రునిగా ఎన్నుకున్న ఇబ్రాహీము విధానాన్ని ఏకాగ్ర మనస్సుతో అనుసరించేవాడూ అయిన వ్యక్తి జీవన విధానంకంటె మేలైనది మరెవరిది కాగలుగుతుంది ? ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్ దే. అల్లాహ్ ప్రతి వస్తువును పరివేష్టించి ఉన్నాడు.

**4. అస్ నిసా** 127 ప్రజలు నిన్ను స్త్రీల వ్యవహారంలో ధార్మిక తీర్పు (ఫత్వా) ఏమిటో అడుగుతున్నారు. వారితో ఇలా చెప్పు - ''వారి విషయంలో అల్లాహ్ మీకు ధార్మిక తీర్పు ఇస్తున్నాడు. దానితోపాటు పూర్వం నుండి మీకు ఈ గ్రంథంలో వినిపించబడుతూ వచ్చిన ఉత్తరువులను కూడా జ్ఞాపకం చేస్తున్నాడు. అంటే మీరు హక్కులను నెరవేర్చని, మీరు వివాహం చేయని అనాథ బాలికలకు (దురాశతో స్వయంగా మీరే వారిని వివాహం

చేసుకోదలిచారు) సంబంధించిన ఉత్తరువులు. అనాథులతో న్యాయంగా వ్యవహరించండి అని అల్లాహ్ మీకు ఆజ్ఞాపిస్తున్నాడు. మీరు ఏ మంచిపని చేసినా అది అల్లాహ్ కు తెలియకుండా ఉండదు.

**4. అన్ నిసా** 128 - 134 ఒక స్త్రీ తనను భర్త నిరాదరించి, వేధిస్తాడేమో అనీ లేదా విముఖుడై ఈసడిరచుకుంటాడేమో అనీ భయపడితే, భార్యాభర్తలిద్దరూ పరస్పరం (ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో) సర్దుబాటు చేసుకోవడంలో దోషం లేదు. ఏమైనప్పటికీ సర్దుబాటే అన్ని విధాలా ఉత్తమమైనది. మనస్సులు సంకుచిత భావాల వైపునకు త్వరగా మొగ్గుతాయి. అయితే మీరు ఉదారబుద్ధితో వ్యవహరిస్తే , భయభక్తులతో మెలిగితే , అల్లాహ్ కు మీ ఈ ప్రవర్తన తెలియకుండా ఉండదని నమ్మండి. భార్యల మధ్య పూర్తి న్యాయం చెయ్యటం మీ శక్తికి మించిన పని. మీరు ఎంత కోరినా దీనిని సాధించలేరు. కనుక ఒక భార్య వైపునకు ఎక్కువగా మొగ్గి మరొకామెను డోలాయమాన స్థితిలో పడవెయ్యకండి. (అప్పుడు దైవశాసనం యొక్క ఉద్దేశ్యం పూర్తవుతుంది). మీరు మీ ప్రవర్తనను సరిజేసుకుని అల్లాహ్ కు భయపడుతూ ఉంటే , అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను. కాని ఒకవేళ దంపతులు పరస్పరం విడిపోవటమే జరిగితే, అప్పుడు అల్లాహ్ తన అపారమైన శక్తి ద్వారా వారికి ఒకరి అవసరం మరొకరికి లేకుండా చేస్తాడు. అల్లాహ్ అనంతమైన వనరులు కలవాడు. ఆయన వివేకవంతుడు , అన్నీ తెలిసినవాడూను. ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్ దే. అల్లాహ్ కు భయపడుతూ ప్రవర్తించండి అని మీకు పూర్వం మేము గ్రంథం ఇచ్చిన వారికి ఉపదేశించాము , ఇప్పుడు మీకూ ఉపదేశిస్తున్నాము. ఒకవేళ మీరు నిరాకరిస్తే నిరాకరించండి. భూమ్యాకాశాలలో ఉన్న సమస్త వస్తువులకూ యజమాని అల్లాహ్యే. ఆయన అక్కరలేనివాడు , ప్రతి స్తోత్రానికి అర్హుడు. అవును , అల్లాహ్యే యజమాని , ఆకాశాలలో ఉన్న సమస్తానికీ , భూమిలో ఉన్న సర్వానికీ. కార్యసాఫల్యానికి ఆయనేచాలు. ఆయన సంకల్పిస్తే మిమ్మల్ని తొలగించి , మీ స్థానంలోకి ఇతరులను తీసుకురాగలడు. ఆయన దీనిని చెయ్యగల సర్వశక్తిమంతుడు. కేవలం ఇహలోక ఫలాన్నే కోరేవ్యక్తి , అల్లాహ్ వద్ద ఇహలోక ఫలమూ ఉన్నది, పరలోక ఫలమూ ఉన్నదని తెలుసుకోవాలి. అల్లాహ్ అన్నీ వింటాడు అన్నీ చూస్తాడు.

**4. అన్ నిసా** 135 విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం , మీ సాక్ష్యం మీకూ , మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా , నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే , న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు అని.

**4. అన్ నిసా** 136 - 141 విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ను , ఆయన ప్రవక్తనూ, ఆయన తన ప్రవక్తపై అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఇంకా ఆయన దీనికి పూర్వం అవతరింపజేసిన ప్రతి గ్రంథాన్నీ విశ్వసించండి. అల్లాహ్ ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను , ఆయన ప్రవక్తలను , అంతిమదినాన్ని తిరస్కరించినవాడు నిశ్చయంగా మార్గం

తప్పి అపమార్గంలో పడి చాలాదూరం పోయాడు. ఇక విశ్వసించి , తరువాత తిరస్కరించి, మళ్ళీ విశ్వసించి, మళ్ళీ తిరస్కరించి ఆ తిరస్కారంలోనే పురోగమించేవారిని అల్లాహ్ సుతరామూ క్షమించడు , వారికి ఎన్నటికీ రుజుమార్గం చూపడు. విశ్వాసులను త్రోసిరాజని, అవిశ్వాసులను తమ మిత్రులుగా చేసుకునే కపటులకు వ్యధాభరితమైన శిక్ష సిద్ధంగా ఉందనే శుభవార్తను వినిపించండి. వీరు గౌరవం పొందే ఆశతోనా వారివద్దకు పోయేది ? వాస్తవానికి గౌరవం అంతా పూర్తిగా అల్లాహ్ కు మాత్రమే చెందుతుంది. అల్లాహ్ ఈ గ్రంథంలో మీకు ఇదివరకే ఈ ఉత్తరువు ఇచ్చివున్నాడు : అల్లాహ్ ఆయతులకు వ్యతిరేకంగా తిరస్కారవచనాలు వాగటాన్ని , వాటిని పరిహసించటాన్ని మీరు విన్నట్లయితే ప్రజలు వేరే విషయాన్ని ప్రారంభించ నంతవరకు మీరు అక్కడ కూర్చోరాదు. ఇప్పుడు మీరుగనక అలా చేస్తే మీరూ వారిలాంటి వారే. అల్లాహ్ కపటులనూ , అవిశ్వాసులనూ నరకంలో ఒకచోట పోగుచెయ్యబోతున్నాడనే విషయం నిశ్చయ మని తెలుసుకోండి. ఈ కపటులు మీ విషయంలో నిరీక్షిస్తున్నారు (గాలి ఎటు వీస్తుందో అని). అల్లాహ్ తరఫునుండి విజయం గనక మిమ్మల్ని వరిస్తే మీవద్దకు వచ్చి వారు ''మేము మీతో ఉండ లేదా ?'' అని అంటారు. ఒకవేళ అవిశ్వాసులదే పైచెయ్యి అయితే , వారితో ''మీకు వ్యతిరేకంగా పోరాడేశక్తి మాకు లేదా ? అయినప్పటికీ మేము మిమ్మల్ని ముస్లిముల బారినుండి కాపాడాము '' అని అంటారు. మీ ఉభయుల వ్యవహారాన్ని అల్లాహ్ ప్రళయంనాడు పరిష్కరిస్తాడు (ఆ పరిష్కారంలో) ముస్లిములపై విజయం పొందే ఏ మార్గాన్నీ అవిశ్వాసులకు అల్లాహ్ వదలడు.

**4. అన్ నిసా** 142 - 143 ఈ కపటులు అల్లాహ్ ను మోసం చేస్తున్నారు. వాస్తవానికి అల్లాహ్యే వారిని మోసంలో పడవేశాడు. వారు నమాజ్ కొరకు లేస్తే , బద్ధకంగా, కేవలం ప్రజలకు చూపేందుకే లేస్తారు. అల్లాహ్ ను చాలా తక్కువగా స్మరిస్తారు. వారు విశ్వాస తిరస్కారాల మధ్య ఊగిసలాడుతున్నారు. పూర్తిగా ఇటూ కాదు , పూర్తిగా అటూ కాదు. అల్లాహ్ మార్గం తప్పించినవానికి నీవు ఏ మార్గాన్నీ చూపలేవు.

**4. అన్ నిసా** 144 - 147 విశ్వసించిన ప్రజలారా! విశ్వాసులను కాదని అవిశ్వాసులను మీ మిత్రులుగా చేసుకోకండి. మీరు, మీకే వ్యతిరేకంగా అల్లాహ్ కు స్పష్టమైన సాక్ష్యం ఇవ్వదలచుకున్నారా ? బాగా తెలుసుకోండి , కపటులు నరకంలో అట్టడుగు ప్రదేశానికి పోతారు. వారికి సహాయం చేసేవాడెవడూ మీకు దొరకడు. అయితే వారిలో పశ్చాత్తాపపడి, తమ ప్రవర్తనను సంస్కరించుకునేవారూ , ఇంకా అల్లాహ్ ను గట్టిగా నమ్ముకుని తమ ధర్మాన్ని అల్లాహ్ కొరకే ప్రత్యేకించుకునేవారూ విశ్వాసులతో ఉంటారు. అల్లాహ్ విశ్వాసులకు తప్పకుండా గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. మీరు కృతజ్ఞతలు చూపేదాసులుగా ఉన్నప్పుడు , విశ్వాస మార్గంలో నడుస్తూ ఉన్నప్పుడు మిమ్మల్ని అల్లాహ్ నిష్కారణంగా ఎందుకు శిక్షిస్తాడు ? అల్లాహ్ యోగ్యతకు ఎంతో విలువ ఇస్తాడు. ఆయన అందరిస్థితినీ ఎరిగినవాడు.

**4. అస్ నిసా** 148 - 149 అన్యాయం జరిగితే తప్ప , మనిషి చెడు పలకటాన్ని అల్లాహ్ ఇష్టపడడు. అల్లాహ్ అన్నీ వినేవాడూ అన్నీ తెలిసినవాడూనూ. (అన్యాయం జరిగితే చెడు పలికే హక్కు మీకు ఉంది) అయి నప్పటికీ మీరు బహిరంగంగానూ, చాటుగానూ మేలే చేస్తూపోతే లేదా కనీసం చెడును క్షమతో ఉపేక్షిస్తే అల్లాహ్ (గుణం కూడా ఇదే, ఆయన) క్షమించేవాడు. (వాస్తవానికి ఆయన శిక్షించే) శక్తి కలవాడు కూడ.

**4. అస్ నిసా** 150 - 152 అల్లాహ్ ను , ఆయన ప్రవక్తలను తిరస్కరించేవారూ , అల్లాహ్ ఆయన ప్రవక్తల మధ్య భేదభావం చూపేవారూ, ''మేము కొందరిని విశ్వసిస్తాము, మరికొందరిని విశ్వసించము'' అని అనే వారూ, అవిశ్వాస విశ్వాసాలకు మధ్య ఒక (కొత్త) మార్గాన్ని కనిపెట్టాలనే ఉద్దేశ్యం కలవారు - వారు అందరూ పరమ అవిశ్వాసులే. అటువంటి అవిశ్వాసుల కొరకు మేము అత్యంత అవమానకరమైన శిక్షను సిద్ధంచేసి ఉంచాము - దీనికి భిన్నంగా అల్లాహ్ ను, ఆయన ప్రవక్తలందరినీ విశ్వసించి , వారి మధ్య భేదభావం చూపని వారికి మేము వారి ప్రతిఫలాన్ని తప్పక ప్రసాదిస్తాము. అల్లాహ్ అధికంగా మన్నించేవాడూ, అనన్యంగా కరుణించేవాడూను.

**4. అస్ నిసా** 153 - 162 ప్రవక్తా! ఈ గ్రంథ ప్రజలు ఒకవేళ ఈనాడు ''ఆకాశం నుండి ఏదైనా గ్రంథాన్ని మాపై అవతరింపచెయ్యి'' అని నిన్ను కోరుతున్నట్లయితే ఇంతకంటే పరమ ఘోరమైన కోరికలనే వారు పూర్వం మూసాను కోరివున్నారు. ఆయనను వారు , ''అల్లాహ్ ను మాకు ప్రత్యక్షంగా చూపించు '' అనే కోరారు. వారి ఈ తలబిరుసుతనం కారణంగానే వారిపై అకస్మాత్తుగా పిడుగు విరుచుకుపడిరది. తరువాత వారు ఆవుదూడను తమ ఆరాధ్యదైవంగా చేసుకున్నారు. వాస్తవానికి వారు స్పష్టమైన సూచనలు చూసివున్నారు. దానిక్కూడా మేము వారిని మన్నించాము. మేము మూసాకు స్పష్టమైన ఆజ్ఞను ప్రసాదించాము. వారిపై తూర్ పర్వతమెత్తి (ఈ ఆజ్ఞకు మేము విధేయులమై ఉంటామనే) ప్రమాణాన్ని తీసుకున్నాము. సజ్దా చేస్తూ (నగర) ద్వారంలోకి ప్రవేశించండి అని మేము వారిని ఆజ్ఞాపించాము. 'సబ్బత్' శాసనాన్ని ఉల్లంఘించకూడదని మేము వారికి చెప్పాము. దీనికిగాను వారినుండి గట్టి ప్రమాణం తీసుకున్నాము. చివరకు , వారు ప్రమాణ భంగం చెయ్యటం వల్లా , అల్లాహ్ ఆయతులను నిరాకరించటంవల్లా , ఎంతోమంది ప్రవక్తలను అన్యాయంగా హత్య చేయటం వల్లా , ఇంకా ''మా హృదయాలు గలేబులలో సురక్షితంగా ఉన్నాయి '' అని చెప్పటం వల్లా , - యథార్థం ఏమిటంటే వారు అసత్యాన్ని అనుసరించిన కారణంగా అల్లాహ్ వారి హృదయాలకు ముద్రవేశాడు. కనుకనే వారు తక్కువగా విశ్వసిస్తారు - వారు తమ అవిశ్వాసంలో ఎంత ముందుకు పోయారంటే , మర్యమ్‌పైనే తీవ్రమైన నిందమోపారు. స్వయంగా , ''మేము మసీహ్, మర్యమ్ కుమా రుడైన ఈసా అనే దైవప్రవక్తను చంపాము '' అని అన్నారు - వాస్తవానికి వారు ఆయనను చంపనూలేదు, శిలువపైకి ఎక్కించనూ లేదు. కాని ఆ విషయంలో వారు భ్రమకు గురిచెయ్యబడ్డారు. ఈ విషయం గురించి అభిప్రాయభేదం వ్యక్తం చేసిన వారు కూడా సందేహానికి లోనయ్యారు. దీనిని గురించి వారికి అసలు ఏమీ తెలియదు. వారు కేవలం ఊహనే అనుసరిస్తున్నారు. వారు అతనిని నిశ్చయంగా చంపలేదు. కాని అల్లాహ్ ఆయనను తన వైపునకు లేపుకున్నాడు. అల్లాహ్ అద్భుత శక్తి సంపన్నుడు , అత్యంత వివేకవంతుడు.

గ్రంథ ప్రజలలో ఎవ్వరూ అతనిని అతని మరణానికి పూర్వం విశ్వసించకుండా ఉండరు. ప్రళయం నాడు ఆయన వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాడు - యూదుల ఈ దుర్మార్గ వైఖరివల్లా , ఇంకా వారు ఎక్కువగా అల్లాహ్ మార్గంలో ఆటంకాలను సృష్టిస్తున్నందువల్లా , వారికి నిషేధించబడిన వడ్డీని తీసుకుంటున్నందువల్లా , అధర్మంగా ఇతరుల సొమ్మును కబళిస్తున్నందువల్లా , మేము వారి కొరకు పూర్వం ధర్మసమ్మతములైన ఎన్నో పరిశుద్ధమైన వస్తువులను నిషిద్ధాలుగా చేశాము. వారిలో అవిశ్వాసులుగా ఉన్న వారికొరకు మేము వ్యధాభరితమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాము. అయితే , వారిలోని గొప్ప జ్ఞానులు , నిజాయితీపరులు అందరూ , ప్రవక్తా! నీపై అవతరింపచెయ్యబడిన దానినీ నీకు పూర్వం అవతరింపచెయ్యబడినదానినీ విశ్వసిస్తారు. ఈ విధంగా విశ్వసించే వారికి నమాజ్, జకాత్ల నియమాలను పాటించే వారికి , అల్లాహ్ ను, అంతిమదినాన్ని చిత్తశుద్ధితో నమ్మేవారికి మేము గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాము.

**4. అన్ నిసా** 163 - 169 ప్రవక్తా! మేము నీ వైపునకు వహీ (దైవవాణి)ని పంపాము , నూహ్ వైపునకు ఆయన తరువాతి ప్రవక్తల వైపునకు పంపినట్లు. మేము ఇబ్రాహీము , ఇస్మాయీల్, ఇస్హాఖ్, యాఖూబ్, యాఖూబ్ సంతతి, ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్, సులైమాన్ల వైపునకు వహీని పంపాము. మేము దావూద్కు 'జబూర్'ను ప్రసాదించాము. మేము ఇంతకుముందు నీతో ప్రస్తావించిన ప్రవక్తల వైపునకు కూడ వహీని పంపాము. నీతో ప్రస్తావించని ప్రవక్తల వైపునకు కూడా పంపివున్నాము. సంభాషణలో మాదిరిగా మేము మూసాతో ప్రత్యక్షంగా మాట్లాడాము. ఈ ప్రవక్తలందరూ శుభవార్తను తెలిపేవారుగా, హెచ్చరిక చేసేవారుగా పంపబడ్డారు - వారి ఆవిర్భావం తరువాత, అల్లాహ్ కు ప్రతికూలంగా వాదించటానికి ప్రజలవద్ద ఏ సాకూ మిగలకూడదని. ఎట్టి పరిస్థితులలోనైనా అల్లాహ్యే ఆధిక్యం కలిగివుండేవాడు, మహా వివేకవంతుడు (ప్రజలు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా). ప్రవక్తా! నీపై తాను అవతరింపజేసిన దానిని తన జ్ఞానంతో అవతరింపజేశానని అల్లాహ్ సాక్ష్యమిస్తున్నాడు. దీనికి దైవదూతలు కూడ సాక్షులుగా ఉన్నారు , అల్లాహ్ సాక్షిగా ఉండటమే సరిపోయినప్పటికీ. దీనిని విశ్వసించటానికి స్వయంగా తిరస్కరిస్తూ, ఇతరులను కూడ అల్లాహ్ మార్గంలోకి రాకుండా నిరోధించే వారు నిశ్చయంగా అపమార్గంలో పడి సత్యానికి చాలా దూరంగా వెళ్ళిపోయారు. ఈవిధంగా అవిశ్వాసవైఖరిని , తిరుగుబాటు వైఖరిని అవలంబించి అన్యాయానికి, అక్రమానికి పాల్పడేవారిని అల్లాహ్ ఎన్నటికీ క్షమించడు , వారికి నరకమార్గం తప్ప మరేమార్గమూ చూపడు. అక్కడ వారు కలకాలం ఉంటారు. ఇది అల్లాహ్ కు ఏమంత కష్టమైన పనికాదు.

**4. అన్ నిసా** 170 మానవులారా! ఈ ప్రవక్త మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి సత్యం తీసుకువచ్చాడు. అతన్ని విశ్వసించండి, మీకే మంచిది. కాని మీరు గనక తిరస్కరిస్తే , ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్ దే అనే విషయం తెలుసుకోండి. అల్లాహ్ అన్నీ తెలిసినవాడూ, అత్యంత వివేకీనూ.

**4. అన్ నిసా** 171 గ్రంథ ప్రజలారా! మీ ధర్మ విషయాలలో అతిగా ప్రవర్తించకండి. అల్లాహ్ కు సత్యం తప్ప వేరే విషయాన్ని ఆపాదించకండి. మసీహ్, మర్యమ్ కుమారుడైన ఈసా, అల్లాహ్ పంపిన ఒక ప్రవక్త, అల్లాహ్ మర్యమ్ వైపునకు పంపిన ఒక ఆజ్ఞ , అల్లాహ్ తరఫు నుండి వచ్చిన (మర్యమ్ గర్భంలో బిడ్డ రూపం దాల్చిన) ఒక ఆత్మ తప్ప మరేమీ కాదు. కనుక అల్లాహ్ ను, ఆయన ప్రవక్తలను విశ్వసించండి. 'ముగ్గురు' అని అనకండి. ఇలా అనటం మానివెయ్యండి. ఇది మీకే శ్రేయస్కరం. అల్లాహ్ ఒక్కడే దేవుడు. ఆయన పరిశుద్ధుడు. ఆయనకు ఒక కొడుకు ఉన్నాడనే విషయానికి ఆయన అతీతుడు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన ఆస్తియే. దాని పోషణకు, దాని రక్షణకు ఆయనే చాలు.

**4. అన్ నిసా** 172 - 173 తాను అల్లాహ్ కు దాసుడుగా ఉండటాన్ని మసీహ్ అగౌరవంగా భావించలేదు. అల్లాహ్ కు అత్యంత సన్నిహితంగా ఉండే దూతలు కూడా దీనిని తమకు అగౌరవంగా భావించరు. అల్లాహ్ దాస్యాన్ని తనకు అగౌరవమైనదిగా భావించేవాడు, అలా భావిస్తూ విర్రవీగేవాడు , అల్లాహ్ అందరినీ పోగుచేసి తనముందు హాజరు పరచబోయే ఒక సమయం వస్తుంది (అని తెలుసుకోవాలి). అప్పుడు విశ్వసించి , సత్ప్రవర్తనా వైఖరిని అవలంబించిన వారు తమ ప్రతిఫలాన్ని పూర్తిగా పొందుతారు. అల్లాహ్ తన అనుగ్రహంతో వారికి మరింత ఎక్కువ బహుమానం ప్రసాదిస్తాడు. ఇక దాస్యాన్ని అగౌరవ మైనదిగా భావించి విర్రవీగిన వారికి అల్లాహ్ అతి బాధాకరమైన శిక్షను విధిస్తాడు. అల్లాహ్ ను కాదని వారు ఎవరెవరి సహకార సంరక్షణలను నమ్ముకున్నారో , వారిలో ఎవరినీ వారు అక్కడ పొందలేరు.

**4. అన్ నిసా** 174 - 175 మానవులారా! మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు స్పష్టమైన నిదర్శనం వచ్చింది. మేము మీ వద్దకు మీకు స్పష్టంగా మార్గం చూపే జ్యోతిని పంపాము. ఇక అల్లాహ్ మాటను ఆలకించేవారిని , ఆయన శరణువేడుకునే వారిని అల్లాహ్ తన కరుణతో తన అనుగ్రహంతో కప్పివేస్తాడు. వారికి తన వైపునకు వచ్చే రుజుమార్గం చూపుతాడు.

**4. అన్ నిసా** 176 ప్రవక్తా! ప్రజలు నిన్ను ''కలాలా'' విషయంలో ధార్మిక తీర్పు అడుగుతున్నారు. అల్లాహ్ మీకు ఈ ధార్మిక తీర్పు ఇస్తున్నాడు అని చెప్పు. ఒక మనిషి గనక సంతానం లేకుండా మరణిస్తే , అతనికి ఒక సోదరి ఉంటే, అప్పుడు ఆమె అతని ఆస్తిలో సగభాగం పొందుతుంది. సోదరి గనక సంతానం లేకుండా మరణిస్తే ఆమె సోదరుడు ఆమెకు వారసుడౌతాడు. ఒకవేళ మృతునికి (వారసులు) ఇద్దరు సోదరీమణులైతే , వారు అతని ఆస్తిలోని మూడిరట రెండు భాగాలకు హక్కుదారులు అవుతారు. ఒకవేళ సోదరీ సోదరులు అనేకులు ఉన్నట్లయితే అప్పుడు స్త్రీలకు ఒక వంతు పురుషులకు రెండు వంతులు లభిస్తాయి. అల్లాహ్ మీ కొరకు తన ఆజ్ఞలను విశదపరుస్తున్నాడు - మీరు మార్గం తప్పి తిరగకుండా ఉండేందుకు. అల్లాహ్ కు ప్రతి విషయమూ తెలుసు.

5. అల్ మాఇద

ఆయతులు : 120 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**5. అల్ మాఇద** 1 విశ్వాసులారా! కట్టుబాట్లను పూర్తిగా పాటించండి. మీ కొరకు పశువులను పోలిన జంతువులన్నీ ధర్మసమ్మతం (హలాల్) చెయ్యబడ్డాయి - ముందు మీకు తెలుపబడబోయేవి తప్పు. కాని ఇహ్రామ్ స్థితిలో వేటను మీ కొరకు ధర్మసమ్మతం చేసుకోకండి. నిస్సందేహంగా అల్లాహ్ తాను కోరిన ఆజ్ఞను జారీ చేస్తాడు.

**5. అల్ మాఇద** 2 విశ్వసించిన ప్రజలారా! దైవభక్తి చిహ్నాలను అగౌరవపరచకండి-నిషిద్ధ మాసాలలో ఏ మాసాన్నీ ధర్మ సమ్మతం చేసుకోకండి. ఖుర్బానీ పశువులపై చెయ్యి చేసుకోకండి. అల్లాహ్ మొక్కుబడికి సూచనగా మెడలలో పట్టెడలు కలిగివున్న జంతువులను ముట్టుకోకండి. తమ ప్రభువు అనుగ్రహాన్ని , ఆయన సంతోషాన్ని అన్వేషిస్తూ పవిత్ర మందిరం (కాబా) వైపునకు పోయేవారి జోలికి పోకండి. అయితే ఇహ్రామ్ స్థితి సమాప్తమయిన తరువాత మీరు వేటాడవచ్చు - చూడండి! మిమ్మల్ని మస్జిదె హరామ్‌కు పోనియ్యకుండా ఒక వర్గంవారు నిరోధించారని వారిపై ఆగ్రహించి , ఆవేశంలో మీరూ వారిపై అనుచితమైన దౌర్జన్యానికి పాల్పడకండి. కాని మంచికి , దైవభక్తికి సంబంధించిన పనులలో అందరి తోనూ సహకరించండి. పాప కార్యాలలో అత్యాచారాలలో ఎవరితోనూ సహకరించకండి. అల్లాహ్ కు భయపడండి. ఆయన శిక్ష బహు కఠినమైనది.

**5. అల్ మాఇద** 3 మీకు ఇవి నిషేధించబడినాయి - మృత పశువు , రక్తము, పంది మాంసము, అల్లాహ్ పేరుతో కాక మరెవరి పేరుతోనైనా 'జిబహ్' చెయ్యబడిన పశువు, ఊపిరాడక లేక దెబ్బతిని, ఎత్తు ప్రదేశం నుండి పడి లేక దేన్నయినా ఢీకొని లేక అడవి మృగం చీల్చగా మరణించిన జంతువు - సజీవంగా ఉండి మీరు 'జిబహ్' చేసినది తప్ప - బలిపీఠంపై వధింపబడినది. ఇంకా పాచికల ద్వారా అదృష్టం తెలుసు కోవటం కూడ మీకు నిషేధించబడిరది. ఇవన్నీ పాపకృత్యాలు. ఈనాడు అవిశ్వాసులు మీ ధర్మం గురించి పూర్తిగా ఆశలు వదులుకున్నారు. కనుక మీరు వారికి భయపడకండి. నాకు భయపడండి. ఈనాడు నేను మీ ధర్మాన్ని మీకొరకు పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తిచేశాను. మీ కొరకు ఇస్లామ్‌ను మీ ధర్మంగా అంగీకరించాను. (కనుక మీకు విధించబడిన హరామ్, హలాల్ నియమాలను పాటించండి) అయితే , ఎవరైనా ఆకలివల్ల గత్యంతరం లేని పరిస్థితిలో , పాపం వైపునకు మొగ్గకుండా వీటిలోని ఏ వస్తువునైనా తిన్నట్లయితే అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూను.

**5. అల్ మాఇద** 4 ప్రజలు తమ కొరకు ఏది హలాల్ చెయ్యబడిరది అని అడుగుతారు. ఇలా బోధించు : పరిశుభ్రమైన వస్తువులన్నీ మీ కొరకు హలాల్ చెయ్యబడ్డాయి. మీరు తర్ఫీదు ఇచ్చిన వేట జంతువులు - దేవుడు మీకు ప్రసాదించిన జ్ఞానం ఆధారంగా మీరు వేటాడే తర్ఫీదును ఇచ్చినవి - అవి మీ కొరకు పట్టిన జంతువును

కూడ మీరు తినవచ్చు. కాని దానిపై అల్లాహ్ పేరును ఉచ్చరించండి. అల్లాహ్ శాసనాన్ని ఉల్లంఘించేందుకు భయపడండి. లెక్క తీసుకోవాలంటే అల్లాహ్ కు ఎంతోసేపు పట్టదు.

**5. అల్ మాఇద** 5 ఈనాడు మీ కొరకు పరిశుభ్రమైన వస్తువులన్నీ హలాల్ చెయ్యబడ్డాయి. గ్రంథ ప్రజల భోజనం మీకు హలాల్ మీ భోజనం వారికి హలాల్. సుచరితలైన స్త్రీలు కూడ మీకు హలాల్ , వారు విశ్వాసుల వర్గానికి చెందినవారైనా సరే లేక మీకు పూర్వం గ్రంథం పొందిన జాతులకు చెందినవారైనా సరే. కాని మీరు వారి మహరును చెల్లించి వివాహం చేసుకుని వారికి రక్షకులు కావాలి. అంతేగాని, వారితో స్వేచ్ఛా కామక్రీడలకు పాల్పడటంగాని లేక దొంగచాటు సంబంధాలను పెంచుకోవటంగాని చెయ్యరాదు. విశ్వాస వైఖరిని అవలంబించటానికి తిరస్కరించేవాడు తన జీవితంలో సాధించినదంతా వ్యర్థం అవుతుంది. ఇంకా అతడు పరలోకంలో దివాలా తీస్తాడు.

**5. అల్ మాఇద** 6 విశ్వసించిన ప్రజలారా! మీరు నమాజు కొరకు లేచినప్పుడు , మీ ముఖాలను , చేతులను మోచేతుల వరకు ప్రక్షాళనం చేసుకోండి తలపై చేతులతో రాయండి , కాళ్ళను చీలమండ వరకు కడుక్కోండి. మీరు అపరిశుద్ధంగా ఉంటే, స్నానం చేసి పరిశుద్ధులు అవ్వండి. మీరు గనక అస్వస్థులైతే లేక ప్రయాణస్థితిలో ఉంటే లేక మీలో ఎవరైనా కాలకృత్యాలు తీర్చుకుని వస్తే లేక మీరు స్త్రీలను ముట్టుకుంటే , అప్పుడు నీరు లభించని పక్షంలో పరిశుభ్రమైన మట్టితో విధిని నిర్వహించండి దానిపై చేతులతో కొట్టి మీ ముఖాలపై , చేతులపై రాయండి. మీకు జీవితాన్ని కష్టతరం చేయటం అల్లాహ్ అభిమతం కాదు. కాని ఆయన మిమ్మల్ని పరిశుద్ధం చేయగోరుతున్నాడు , మీపై తన అనుగ్రహాన్ని పూర్తిచేయగోరుతున్నాడు మీరు కృతజ్ఞులవుతారేమో అని.

**5. అల్ మాఇద** 7 - 10 అల్లాహ్ మీకు ప్రసాదించిన వరాన్ని జ్ఞాపకం ఉంచుకోండి. ఆయన మీనుండి తీసుకున్న దృఢమైన ప్రమాణాన్ని మరువకండి. అంటే , మీరు ఇలా అన్నారు : ''మేము విన్నాము, విధేయత చూపటానికి అంగీకరించాము.'' అల్లాహ్ కు భయపడండి. అల్లాహ్ కు హృదయాలలో ఉన్న మర్మాలు కూడా తెలుసు. విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది. అల్లాహ్ కు భయపడుతూ వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్ కు పూర్తిగా తెలుసు. విశ్వసించి మంచిపనులు చేసేవారికి అల్లాహ్ వాగ్దానం చేశాడు , వారి పాపాలకు క్షమాభిక్ష , వారికి గొప్ప బహుమానం లభిస్తాయని. ఇక అవిశ్వాసానికి పాల్పడేవారు , అల్లాహ్ ఆయతులను నిరాకరించేవారు నరకానికి పోతారు.

**5. అల్ మాఇద** 11 విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ మీకు (మొన్న మొన్ననే) చేసిన ఆ మహోపకారాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. అప్పుడు ఒక వర్గం వారు మీపై చెయ్యి చేసుకోవాలని సంకల్పించారు. కాని అల్లాహ్ వారి చేతులను , మీపైకి లేపకుండా ఆపాడు. అల్లాహ్ కు భయపడుతూ పనిచెయ్యండి. విశ్వాసులు అల్లాహ్నే నమ్ముకోవాలి.

**5. అల్ మాఇద** 12 - 13 అల్లాహ్ ఇస్రాయీలు సంతతినుండి దృఢమైన ప్రమాణాన్ని తీసుకున్నాడు. వారిలో పన్నెండు మందిని నాయకులుగా నియమించాడు. ఇంకా వారితో ఇలా అన్నాడు : ''నేను మీతో ఉన్నాను. మీరు గనక నమాజును స్థాపిస్తే , జకాత్ ఇస్తే, నా ప్రవక్తలను విశ్వసించి వారికి తోడ్పడితే , అల్లాహ్ కు మంచి రుణాన్ని ఇస్తూవుంటే, నమ్మండి! నేను మీలోని చెడుగులను మీనుండి తుడిచివేస్తాను. ఇంకా మిమ్మల్ని క్రింద కాలువలు ప్రవహించే ఉద్యాన వనాలలోకి ప్రవేశింపజేస్తాను. అయితే , దీని తరువాత మీలో తిరస్కార వైఖరిని అవలంబించేవాడు వాస్తవానికి రుజుమార్గం (సవాఉస్సబీల్) తప్పినవాడౌతాడు. '' వారు తమ వాగ్దానాన్ని భంగపరచిన కారణంగా మేము వారిని మా కారుణ్యానికి దూరంగా విసరివేశాము. వారి హృదయాలను కర్కశం చేశాము. ఇప్పుడు వారి స్థితి ఎలా ఉందంటే, వారు పదాలను తారుమారు చేసి వాటి అర్థాన్ని, సందర్భాన్ని పూర్తిగా మార్చివేస్తారు. వారికి ఇవ్వబడిన బోధలలో ఎక్కువ భాగాన్ని వారు మరచిపోయారు. అనుదినం వారు చేసే ఏదో ఒక ద్రోహాన్ని గురించి నీకు తెలుస్తూనే ఉంటుంది. వారిలో ఈ లోపం లేకుండా ఉన్నవారు బహు తక్కువ. (వారు ఈ స్థితికి దిగజారిపోయినప్పుడు , వారు ఏ దుర్మార్గాలు చేసినా , అది పూర్తిగా అనుకున్నదే) కనుక వారిని క్షమించండి. వారి చేష్టలను ఉపేక్షించండి. ఉదార స్వభావులను అల్లాహ్ ప్రేమిస్తాడు.

**5. అల్ మాఇద** 14 ఇదేవిధంగా , 'మేము క్రైస్తవులం ' అని చెప్పుకున్నవారి నుండి కూడా మేము దృఢమైన ప్రమాణం తీసుకున్నాము. కాని వారు తమకు బోధించబడిన విషయంలో ఒక పెద్ద భాగాన్ని విస్మరించారు. చివరకు మేము వారిమధ్య పరస్పర విరోధ , విద్వేష బీజాలను ప్రళయం వరకు ఉండేవిధంగా నాటాము. వారు ప్రపంచంలో ఏమేమి చేస్తూ ఉండేవారో, దానిని అల్లాహ్ వారికి చూపే ఒక సమయం అవశ్యం వస్తుంది.

**5. అల్ మాఇద** 15 - 16 గ్రంథ ప్రజలారా! మా ప్రవక్త మీవద్దకు విచ్చేశాడు. మీరు కప్పిపుచ్చుతూ ఉండిన దైవగ్రంథం లోని ఎన్నో విషయాలను ఆయన మీ ముందు బహిర్గతం చేస్తున్నాడు. ఇంకా ఎన్నో విషయాలను వదిలివేస్తున్నాడు. మీ వద్దకు అల్లాహ్ తరఫు నుండి కాంతి వచ్చేసింది. సత్యం వైపునకు మార్గం చూపే ఒక గ్రంథం కూడా. దాని ద్వారా అల్లాహ్ తన సంతోషం పొందగోరేవారికి శాంతి పథా లను చూపుతాడు. తన ఇచ్ఛానుసారం వారిని చీకట్ల నుండి వెలికితీసి వెలుగు వైపునకు తీసుకువస్తాడు. ఇంకా వారిని రుజుమార్గం వైపునకు నడుపుతాడు.

**5. అల్ మాఇద** 17 మర్యమ్ కుమారుడైన మసీహ్ాయే దేవుడు అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడ్డారు. ప్రవక్తా! వారితో ఇలా అను: ''అల్లాహ్ గనక మర్యము కొడుకైన మసీహ్ానీ , ఆయన తల్లినీ, సమస్త భూలోకవాసులనూ నాశనం చెయ్యగోరితే, ఆయన తన ఈ సంకల్పాన్ని విరమించుకునేలా చేసే శక్తి ఎవరికుంది ? అల్లాహ్ భూమికీ, ఆకాశాలకూ, వాటిమధ్య ఉన్న సమస్తానికీ ప్రభువు. తాను కోరిన దానిని సృష్టిస్తాడు. ఆయన అధికారం ప్రతి వస్తువును లోబరచుకుని ఉంది.''

**5. అల్ మాఇద** 18 యూదులు, క్రైస్తవులు ఇలా అంటారు : ''మేము అల్లాహ్ పుత్రులం, ఆయనకు ప్రీతిపాత్రులం.'' వారిని ఇలా అడుగు : ''అయితే ఆయన మీ పాపాలకు మిమ్మల్ని ఎందుకు శిక్షిస్తున్నాడు ? వాస్తవానికి మీరు కూడా అల్లాహ్ సృష్టించిన ఇతర మానవుల్లాంటి మానవులే! ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు. తాను కోరిన వారిని శిక్షిస్తాడు. భూమీ , ఆకాశాలూ వాటిలో ఉన్న సమస్తమూ ఆయన ఆస్తియే. ఆయన వైపునకే అందరూ పోవలసి ఉంది.''

**5. అల్ మాఇద** 19 గ్రంథ ప్రజలారా! ప్రవక్తల ఆగమన క్రమం ఎంతో కాలంగా ఆగిపోయి ఉన్నప్పుడు మా ఈ ప్రవక్త మీవద్దకు వచ్చాడు. మీకు స్పష్టమైన ధర్మోపదేశాలను అందజేస్తున్నాడు. మా వద్దకు శుభవార్త తెలిపేవాడు , హెచ్చరికలు చేసేవాడు ఎవడూ రాలేదు అని మీరు అనగలగకుండా ఉండాలని. కనుక చూడండి! ఆ శుభవార్త తెలిపేవాడు, హెచ్చరికలు చేసేవాడు ఇప్పుడు విచ్చేశాడు - అల్లాహ్ ప్రతి వస్తువుపై అధికారం కలవాడు.

**5. అల్ మాఇద** 20 - 26 మూసా తన జాతి వారితో ఇలా అన్న విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి : ''నా జాతి ప్రజలారా! అల్లాహ్ మీకు ప్రసాదించిన ఈ వరాన్ని గురించి ఆలోచించండి - ఆయన మీలో ప్రవక్తలను ఆవిర్భవింపజేశాడు. మిమ్మల్ని పాలకులుగా చేశాడు. ప్రపంచంలో ఎవరికీ ఇవ్వనిదానిని మీకు ఇచ్చాడు - నా జాతి సోదరులారా! అల్లాహ్ మీ కొరకు వ్రాసి వుంచిన పవిత్ర భూమిలో ప్రవేశించండి. వెన్ను చూపకండి. లేకపోతే విఫలులై ఘోర పరాజయంతో మరలివస్తారు. '' వారు ఇలా జవాబు పలికారు : ''మూసా! అక్కడ మహా బలవంతులైన ప్రజలు ఉంటున్నారు. వారు అక్కడి నుంచి వెళ్ళిపోనంతవరకు మేము సుతరామూ అక్కడకు పోము. ఒకవేళ వారు వెళ్ళిపోతే , మేము ప్రవేశించడానికి సిద్ధంగా ఉన్నాము. '' ఆ భయపడే వారిలో అల్లాహ్ అనుగ్రహం పొందిన ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారు. వారు ఇలా అన్నారు : ''ద్వారం గుండా లోపలకు జొరబడి ఆ బలవంతులను ఎదుర్కోండి. ఒకసారి మీరు లోనికి ప్రవేశించారా , మీదే పైచెయ్యి అవుతుంది. మీరు నిజంగానే ముస్లిమ్‌లైతే అల్లాహ్ పై భారం వెయ్యండి. '' కాని వారు మళ్ళీ ఇలా అన్నారు : ''మూసా! వారు అక్కడ ఉన్నంతవరకూ మేము అక్కడకు ఎన్నటికీ పోము. నీవూ , నీ ప్రభువూ ఉభయులూ పోయి పోరాడండి. మేము ఇక్కడే కూర్చుని ఉంటాము.'' దానిపై మూసా ఇలా అన్నాడు : ''నా ప్రభూ! నా అధీనంలో ఎవ్వరూ లేరు-నేనూ నా సోదరుడూ తప్ప. కనుక నీవు మమ్మల్ని ఈ అవిధేయుల నుండి వేరు చెయ్యి.'' అల్లాహ్ ఇలా అన్నాడు : ''సరే, అయితే, ఆ దేశం వారికి నలభై సంవత్సరాల వరకు నిషిద్ధం. వారు ధరణిలో నిలువ నీడలేకుండా సంచరిస్తారు. ఈ అవిధేయుల స్థితికి ఎంతమాత్రం జాలి పడకండి.''

**5. అల్ మాఇద** 27 - 31 వారికి ఆదము యొక్క ఇద్దరు తనయుల వృత్తాంతాన్ని కూడా పొల్లుపోకుండా వినిపించు. వారిద్దరూ ఖుర్బానీ ఇచ్చినప్పుడు , ఒకరి ఖుర్బానీ స్వీకరించబడిరది. మరొకరిది స్వీకరించబడలేదు. రెండోవాడు ఇలా అన్నాడు : ''నేను నిన్ను చంపివేస్తాను. '' సమాధానంగా మొదటివాడు ఇలా అన్నాడు: ''భయభక్తులు

గలవారి మొక్కుబడులనే అల్లాహ్ స్వీకరిస్తాడు. నీవు నన్ను చంపటానికి చెయ్యి ఎత్తినా , నేను నిన్ను చంపటానికి చెయ్యి ఎత్తను. సకల లోకాలకు ప్రభువైన అల్లాహ్ కు నేను భయ పడతాను. నీవే నా పాపాన్నీ , నీ పాపాన్నీ రెంటినీ మూట కట్టుకోవాలని , నరకవాసివి కావాలని నేను కోరుతున్నాను. దుర్మార్గుల దుర్మార్గానికి ఇదే తగిన ప్రతిఫలం.'' చివరకు అతడి మనస్సు తన సోదరుని హత్యను అతడి కొరకు సులభసాధ్యం చేసింది. అతడు అతన్ని చంపి నష్టపోయేవారిలో కలిసిపోయాడు. అప్పుడు అల్లాహ్ ఒక కాకిని పంపాడు. అది నేలను త్రవ్వసాగింది , తన సోదరుని శవాన్ని ఏ విధంగా దాచాలో అతడికి తెలుపటానికి. ఇది చూసి అతడు రోదించాడు : ''అయ్యో నేను పాడుగాను! నేను ఈ కాకిపాటివాణ్ణి కూడ కాలేకపోయానే , నా సోదరుని శవాన్ని దాచే ఉపాయం వెతకలేకపోయానే!'' తరువాత అతడు తాను చేసిన దానికి ఎంతో పశ్చాత్తాపపడ్డాడు.

**5. అల్ మాఇద** 32 ఈ కారణం వల్లనే మేము ఇస్రాయీలు సంతతికి ఈ ఫర్మానాను వ్రాసి ఇచ్చాము : ''హత్యకు బదులుగాగాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే.'' కాని వారి పరిస్థితి ఎలా ఉందంటే , మా ప్రవక్తలు ఒకరి తరువాత ఒకరు స్పష్టమైన ఉపదేశాలు తీసుకుని వారివద్దకు వచ్చినప్పటికీ వారిలోని ఎక్కువమంది భూమిపై అత్యాచారాలు చేసేవారే.

**5. అల్ మాఇద** 33 - 34 అల్లాహ్తో, ఆయన ప్రవక్తతో పోరాడేవారికీ , ధరణిలో కల్లోలాన్ని సృష్టిస్తూ తిరిగేవారికీ శిక్ష ఏమిటంటే, వారిని చంపటం లేదా శిలువపైకి ఎక్కించటం లేదా చేతులను, కాళ్ళను అభిముఖ దిశలలో ఖండించటం లేదా దేశం నుండి బహిష్కరించటం. ఇవి వారికి ఇహలోకంలో జరిగే అగౌరవం , అవమానం. పరలోకంలో వారికి అంతకంటె ఘోరమైన శిక్ష ఉంటుంది. మీరు వారిని స్వాధీన పరచుకోకముందు పశ్చాత్తాపపడే వారికి తప్ప - అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు అనే విషయం మీరు తెలుసుకోవాలి.

**5. అల్ మాఇద** 35 - 37 విశ్వాసులారా! అల్లాహ్ కు భయపడండి. ఆయన సాన్నిధ్యానికి చేరే మార్గాన్ని అన్వేషించండి. ఆయన మార్గంలో నిరంతర కృషి చెయ్యండి. బహుశా మీకు సాఫల్య భాగ్యం లభించవచ్చు. స్పష్టంగా తెలుసుకోండి. తిరస్కారవైఖరిని అవలంబించిన వారి అధీనంలో సమస్త భూసంపద , ఇంకా అంతే సంపద దానితోపాటు ఉండి , వారు గనక ప్రళయదిన శిక్ష నుండి తప్పించుకోవడానికి ఆ మొత్తం సంపదను విమోచన ధనంగా ఇవ్వగోరినా, అది స్వీకరించబడదు. వారికి వ్యధాభరితమైన శిక్ష పడితీరుతుంది. నరకాగ్ని నుండి వారు బయటకు పారిపోవాలని కోరుకుంటారు. కాని బయటికి రాలేరు. వారికి సదా ఉండే శిక్ష విధించబడుతుంది.

**5. అల్ మాఇద** 38 - 40 దొంగ - స్త్రీ అయినా పురుషుడైనా , ఉభయుల చేతులూ నరకండి. ఇది వారి సంపాదనకు ప్రతిఫలం. అల్లాహ్ తరఫు నుండి గుణపాఠం నేర్పే శిక్ష. అల్లాహ్ సర్వశక్తిమంతుడు , అత్యంత వివేక సంపన్నుడు. దుర్మార్గం చేసిన తరువాత పశ్చాత్తాపపడి తనను తాను సంస్కరించుకునే వాడివైపునకు అల్లాహ్ కారుణ్య వీక్షణం

మరలుతుంది. అల్లాహ్ ఎక్కువగా క్షమించేవాడు , కరుణించేవాడూను. అల్లాహ్ భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువనే విషయం మీకు తెలియదా ? ఆయన తాను కోరిన వారిని శిక్షిస్తాడు. తాను కోరినవారిని క్షమిస్తాడు. ఆయన సర్వాధికారాలు కలవాడు.

**5. అల్ మాఇద** 41 ప్రవక్తా! అవిశ్వాస మార్గంలో పరుగులు తీసే ప్రజలను చూచి నీవు ధ్ఖుఖపడకు. వారు ''మేము విశ్వసించాము'' అని తమ నోటితో పలికే వారిలోని వారు కావచ్చు. కాని వారి హృదయాలు మాత్రం విశ్వసించలేదు. లేదా వారు యూదుల లోనివారైనా కావచ్చు. వారి (యూదుల) పరిస్థితి ఎలా ఉందంటే , వారు అబద్ధాలను కుతూహలంతో చెవియొగ్గి వింటారు. ఇంకా నీ వద్దకు ఎన్నడూ రాని ఇతర ప్రజల కొరకు గూఢచారులుగా వ్యవహరిస్తారు. అల్లాహ్ గ్రంథంలోని పదాల సందర్భం నిర్ణయమై ఉన్నప్పటికీ వాటి అసలు అర్థాన్ని తారుమారు చేస్తారు. ప్రజలతో ఇలా అంటారు : ''మీకు ఈ విధమైన ఆజ్ఞ ఇస్తే స్వీకరించండి , లేకపోతే స్వీకరించకండి. అల్లాహ్యే పరీక్షకు గురిచెయ్యాలని నిశ్చయించిన వారిని అల్లాహ్ పట్టునుండి తప్పించటానికి నీవు ఏమీ చెయ్యలేవు. ఎవరి హృదయాలను అల్లాహ్ పరిశుద్ధ పరచదలచుకోలేదో , వారు వీరే. వీరు ఇహంలో పరాభవానికీ, పరంలో కఠిన శిక్షకూ గురి అవుతారు.

**5. అల్ మాఇద** 42 - 43 వీరు, అబద్ధం వినేవారు. నిషిద్ధమైన సొమ్ము తినేవారు. కనుక ఒకవేళ నీ వద్దకు (తమ వ్యాజ్యములను తీసుకుని) వస్తే , నీకు ఇష్టమైతే వారిమధ్య తీర్పు చెప్పే అధికారం నీకు ఇవ్వబడుతోంది లేదా తిరస్కరించు. నీవు తిరస్కరిస్తే , వారు నీకు ఏమాత్రం హాని కలిగించలేరు. నీవు గనక తీర్పు చెబితే , కచ్చితంగా న్యాయంగా చెప్పు. అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు - అల్లాహ్ ఆజ్ఞ వ్రాయబడివున్న తౌరాతు గ్రంథం వారివద్ద ఉన్నప్పటికీ దానిపట్ల వైముఖ్యం ప్రదర్శిస్తూనే వారు నిన్ను ఎలా న్యాయనిర్ణేతగా చేసుకుంటారు ? అసలు విషయం ఏమిటంటే, వారిలో విశ్వాసమే లేదు.

**5. అల్ మాఇద** 44 మేము తౌరాతును అవతరింపజేశాము. అందులో మార్గదర్శకత్వమూ , జ్యోతీ ఉన్నాయి. ముస్లిము లైన ప్రవక్తలంతా దాని ప్రకారమే ఈ యూదుల వ్యవహారాలను పరిష్కరించేవారు. ఇదేవిధంగా రబ్బీలు , షరీయత్తువేత్తలు కూడా (దాని ఆధారంగానే తీర్పు చెప్పేవారు). ఎందుకంటే , అల్లాహ్ గ్రంథాన్ని రక్షించే బాధ్యత వారిపై మోపబడిరది. వారు దీనికి సాక్షులుగా ఉండేవారు. కనుక (యూదు లారా!) మానవులకు భయపడకండి. నాకు భయపడండి. నా ఆయతులను కొద్దిపాటి మూల్యం కొరకు అమ్మటం మానండి. అల్లాహ్ అవతరింపజేసిన చట్టం ప్రకారం తీర్పు చెయ్యనివారే అవిశ్వాసులు.

**5. అల్ మాఇద** 45 తౌరాతు గ్రంథంలో మేము యూదుల కొరకు ఈ ఆజ్ఞను వ్రాశాము : ప్రాణానికి బదులు ప్రాణం , కన్నుకు బదులు కన్ను, ముక్కుకు బదులు ముక్కు, చెవికి బదులు చెవి, పన్నుకు బదులు పన్ను, ఇలా సమస్త

గాయాల కొరకు సమానమైన ప్రతీకారం. కాని ఎవరైనా ప్రతీకారం చెయ్యకుండా క్షమిస్తే , అది అతనికి కప్ఫారా (పాపపరిహారం) అవుతుంది. అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పుచెయ్యని వారే దుర్మార్గులు.

**5. అల్ మాఇద** 46 - 47 ఈ ప్రవక్తల తరువాత మేము మర్యమ్ కుమారుడైన ఈసాను పంపాము. ఆయన తన కాలంలో ఉన్నటువంటి తౌరాతు గ్రంథంలోని విషయాన్ని ధ్రువీకరించేవాడు. మేము ఆయనకు ఇంజీలును ప్రసాదించాము. అందులో మార్గదర్శకత్వమూ, జ్యోతీ ఉండేవి. అది కూడా ఆ కాలంలో ఉన్న తౌరాతులోని దానిని ధ్రువీకరించేది. అల్లాహ్ యందు భక్తిశ్రద్ధలు కలవారికి అది మార్గదర్శకం. అంతేకాదు , హితోపదేశం కూడా. మేము ఇంజీలు గ్రంథ ప్రజలను ఆ గ్రంథంలో అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పుచెయ్యాలని ఆజ్ఞాపించాము. అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యని వారే హద్దులు మీరినవారు.

**5. అల్ మాఇద** 48 - 50 ప్రవక్తా! మేము నీ వద్దకు పంపిన ఈ గ్రంథం సత్యాన్ని తీసుకొని వచ్చింది. తన కాలంలో ఉన్నటువంటి ''అల్ కితాబ్''లోని భాగాలను అది ధ్రువీకరిస్తుంది, పరిరక్షిస్తుంది. కనుక నీవు అల్లాహ్ పంపిన చట్టం ప్రకారం ప్రజల వ్యవహారాలను పరిష్కరించు. నీ వద్దకు వచ్చిన సత్యానికి విముఖుడవై వారి వాంఛలను అనుసరించకు - మేము మీ (మానవుల) లోని ప్రతి ఒక్కరికీ ఒక షరీయత్తునూ , ఒక జీవిత విధానాన్నీ నిర్ణయించాము. మీ దేవుడు కోరుకున్నట్లయితే, మీ అందరినీ ఒకే ఒక సంఘంగా కూడా రూపొందించి ఉండేవాడు. కాని ఆయన మీకు ఇచ్చిన దాని విషయంలో మిమ్మల్ని పరీక్షిం చేందుకు ఈ విధంగా చేశాడు. కనుక మంచి పనులలో ఒకరినొకరు మించిపోవటానికి ప్రయత్నించండి. చివరకు మీరంతా అల్లాహ్ వద్దకే మరలిపోవలసి ఉంది. అప్పుడు ఆయన మీరు భేదాభిప్రాయం కలిగివున్న దాని అసలు యథార్థం ఏమిటో మీకు తెలుపుతాడు - కనుక ప్రవక్తా! నీవు అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం ప్రజల వ్యవహారాలను పరిష్కరించు. వారి కోరికలను అనుస రించకు. మిమ్మల్ని వారు మోసంలో పడవేసి అల్లాహ్ మీ వద్దకు పంపిన ఉపదేశానికి రవ్వంత కూడా విముఖులను చెయ్యకుండా మీరు అప్రమత్తులై ఉండండి. వారు గనక దానికి విముఖులైతే , అల్లాహ్ వారు చేసిన కొన్ని పాపాలకు శాస్తిగా వారిని ఆపదకు గురిచెయ్యాలన్న నిర్ణయానికే వచ్చాడు అని తెలుసుకోండి. వారిలోని చాలామంది అవిధేయులు అనేది వాస్తవం. (వారు అల్లాహ్ శాసనానికి విముఖులై) అజ్ఞానపు (జాహిలియ్యహ్) తీర్పు కావాలని కోరుకుంటున్నారా ? కాని అల్లాహ్ పై నమ్మకం కలవారి దృష్టిలో అల్లాహ్ కంటే మంచితీర్పు చెయ్యగలవాడెవడు?

**5. అల్ మాఇద** 51 విశ్వాసులారా! యూదులనూ, క్రైస్తవులనూ మీ మిత్రులుగా చేసుకోకండి. వారు తమలో తామే ఒకరికొకరు మిత్రులు. మీలో ఎవడైనా వారిని తన మిత్రులుగా స్వీకరిస్తే అతడు కూడా వారిలో ఒకడుగా పరిగణింపబడతాడు. నిశ్చయంగా అల్లాహ్ దుర్మార్గులను తన మార్గదర్శకత్వానికి దూరం చేస్తాడు.

**5. అల్ మాఇద** 52 - 53 హృదయాలలో కాపట్య రోగం ఉన్నవారు వారితోనే ఎక్కువగా కార్యకలాపాలు సాగిస్తూ తిరగటం నీవు చూస్తావు. వారు , ''మేము ఏదన్నా ఆపదల వలయంలో చిక్కుకుంటామేమో అనే భయం మాకు ఉంది'' అని అంటారు. కాని అల్లాహ్ మీకు తిరుగులేని విజయాన్ని ప్రసాదించినప్పుడు లేక తన తరఫు నుండి మరేదైనా విషయాన్ని బహిర్గతం చేసినప్పుడు , వారు తమ మనస్సులలో గుప్తంగా ఉంచిన ఈ కాపట్యానికి సిగ్గుపడటం అనేది కూడా అసంభవం కాదు. అప్పుడు విశ్వాసులు ఇలా అంటారు : ''మేము మీతోనే ఉన్నాము అని అల్లాహ్ పేరుపై కఠోర ప్రమాణాలు చేసి నమ్మకం కలిగిస్తూ ఉండేవారు వీరేనా?'' - వారు చేసిన పనులన్నీ వృధా అయ్యాయి. చివరకు వారికి మిగిలింది అపజయం, ఆశాభంగమూను.

**5. అల్ మాఇద** 54 విశ్వాసులారా! మీలో ఎవరైనా తమ ధర్మం నుండి వైదొలగిపోతే (పోవచ్చు). అల్లాహ్ ఇంకా ఎంతోమందిని సృష్టిస్తాడు. అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు. వారు అల్లాహ్ ను ప్రేమిస్తారు. వారు విశ్వాసులపట్ల మృదువుగానూ, అవిశ్వాసులపట్ల కఠినంగానూ ప్రవర్తిస్తారు. అల్లాహ్ మార్గంలో అవిశ్రాంత కృషి చేస్తారు. నిందించే వారి నిందలకు వారు భయపడరు. ఇది అల్లాహ్ అనుగ్రహం. ఆయన దానిని తాను కోరినవారికి ప్రసాదిస్తాడు. ఆయన అపారమైన సాధనసంపత్తికి యజమాని, సర్వమూ తెలిసినవాడు.

**5. అల్ మాఇద** 55 - 56 వాస్తవానికి మీ మిత్రులు కేవలం అల్లాహ్ , అల్లాహ్ ప్రవక్త, నమాజును స్థాపించే జకాత్ ఇచ్చే, అల్లాహ్ ముందు రుకూ చేసే విశ్వాసులు మాత్రమే. అల్లాహ్నూ , ఆయన ప్రవక్తనూ, విశ్వాసులనూ తమ మిత్రులుగా స్వీకరించేవారు, అల్లాహ్ పక్షమే ఆధిక్యం వహిస్తుందని తెలుసుకోవాలి.

**5. అల్ మాఇద** 57 - 60 విశ్వాసులారా! మీకు పూర్వపు గ్రంథ ప్రజలలో మీ ధర్మాన్ని ఒక పరిహాసంగా, ఒక వినోద వస్తువుగా పరిగణించిన వారినీ, ఇతర అవిశ్వాసులనూ మీ మిత్రులుగా , సహచరులుగా చేసుకోకండి. మీరు గనక విశ్వాసులే అయితే అల్లాహ్ కు భయపడండి. మీరు నమాజు కొరకు పిలుపునిస్తే , వారు దానిని పరిహసించి వినోదిస్తారు. దీనికి కారణం వారికి బుద్ధి లేకపోవటమే. వారితో ఇలా అను : ''గ్రంథ ప్రజలారా! మీరు మాపై కినుక వహించటానికి కారణం మేము అల్లాహ్నూ మా వైపునకు అవతరించిన , మాకు పూర్వం కూడా అవతరించిన ధర్మోపదేశాన్ని విశ్వసించామనే విషయమూ ఇంకా మీలో చాలామంది అవిధేయులైనవారు ఉన్నారనే విషయమూ తప్ప మరొకటేముంది?'' ఇంకా ఇలా చెప్పు : ''అల్లాహ్ వద్ద ఎవరి ముగింపు అవిధేయుల ముగింపుకంటే కూడా హీనతరంగా ఉంటుందో వారిని గురించి తెలియజేయనా ? వారు అల్లాహ్ శాపగ్రస్తులు. వారిపై ఆయన ఆగ్రహం విరుచుకుపడిరది. వారు కోతులుగా , పందులుగా చెయ్యబడ్డారు. వారు తాగూత్ దాస్యం చేశారు. వారు ఎంతో అధ్వాన్నస్థితిలో ఉన్నారు. వారు రుజుమార్గం తప్పి బహుదూరం పోయారు.''

**5. అల్ మాఇద** 61 - 63 వారు మీ వద్దకు వచ్చినప్పుడు, ''మేము విశ్వసించాము'' అని అంటారు. కాని వాస్తవానికి వారు అవిశ్వాసాన్ని మోసుకువచ్చారు. అవిశ్వాసాన్నే మోసుకుని తిరిగిపోయారు. అల్లాహ్ కు బాగా తెలుసు ,

వారు తమ హృదయాలలో ఏమేమి దాచివుంచారో. వారిలో చాలామంది పాప కార్యాలలో , హింసా దౌర్జన్యాలలో చురుకుగా పొల్గొంటూ తిరగటాన్నీ , హరాము సొమ్మును తినటాన్నీ నీవు చూస్తావు. వారు చేసే ఈ చేష్టలు బహుచెడ్డవి. వారి పండితులూ, మత గురువులూ పాపపు మాటలు పలక్కుండా, హరాము సంపాదన తినకుండా వారిని ఎందుకు నిరోధించరు? నిశ్చయంగా వారు సిద్ధం చేసుకుంటున్న తమ జీవిత కర్మ పత్రం చాలా చెడ్డది.

**5. అల్ మాఇద** 64 యూదులు ఇలా అంటారు : ''అల్లాహ్ చేతులు బంధింపబడివున్నాయి'' - వాస్తవంగా బంధాలు వారి చేతులకే పడివున్నాయి. శాపం వారిపైనే పడిరది. వారి వాగుడుకు ప్రతిఫలంగా - అల్లాహ్ చేతులు విశాలంగా ఉన్నాయి. తాను కోరిన ప్రకారం ఆయన ఖర్చు చేస్తాడు. వాస్తవం ఏమిటంటే , నీ ప్రభువు తరఫు నుండి నీపై అవతరించిన గ్రంథం వారిలో చాలామంది యొక్క తలబిరుసుతనమూ , అసత్యానుసరణమూ అతిశయించటానికి కారణ భూతమయింది. (ఈ కారణంగా) మేము వారి మధ్య విరోధ విద్వేషాలు ప్రళయం వరకూ ఉండేవిధంగా చేశాము. వారు యుద్ధజ్వాలను ప్రజ్వలింపజేసినప్పుడల్లా , అల్లాహ్ దానిని చల్లారుస్తాడు. వారు భూమిలో సంక్షోభాన్ని వ్యాపింపచెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నారు. కాని అల్లాహ్ సంక్షోభం సృష్టించేవారిని ఎంతమాత్రం ప్రేమించడు.

**5. అల్ మాఇద** 65 - 66 (ఈ తలబిరుసుతనానికి బదులుగా) ఈ గ్రంథ ప్రజలు విశ్వసించి ఉంటే , అల్లాహ్పట్ల భయభక్తుల వైఖరిని అవలంబించి ఉంటే , మేము వారి పాపాలను వారినుండి దూరం చేసి ఉండేవారము. వారిని భోగభాగ్యాలతో నిండివున్న స్వర్గవనాలలో ప్రవేశింపజేసి వుండేవారము. వారు తౌరాతునూ , ఇంజీలునూ, వారి ప్రభువు తరఫు నుండి వారి వద్దకు పంపబడిన ఇతర గ్రంథాలనూ అనుష్ఠించి ఉన్నట్లయితే ఎంత బాగుండేది! ఆ విధంగా చేసివుంటే , వారికొరకు ఆహారం పైనుండి వర్షించి ఉండేది , క్రిందినుండి పొంగివుండేది. వారిలో కొందరు రుజువర్తనులు కూడా ఉన్నారన్నమాట నిజమే. కాని వారిలో అధిక సంఖ్యాకులు బహు దుర్మార్గులు.

**5. అల్ మాఇద** 67 - 69 ప్రవక్తా! నీ ప్రభువు తరఫు నుండి నీపై అవతరించిన దానిని ప్రజలకు అందజెయ్యి. ఒకవేళ నీవు ఆ విధంగా చెయ్యకపోతే , ఆయన ప్రవక్తగా నీవు నీ ధర్మాన్ని నిర్వహించనట్లే. ప్రజల బారినుండి అల్లాహ్ నిన్ను రక్షిస్తాడు. ఆయన (నీకు ప్రతికూలంగా) అవిశ్వాసులకు విజయం పొందే మార్గాన్ని ఎన్నటికీ చూపడు అని నమ్ము. స్పష్టంగా ఇలా చెప్పు : ''గ్రంథ ప్రజలారా! మీరు తౌరాతునూ, ఇంజీలునూ మీ ప్రభువు తరఫు నుండి మీ వైపునకు అవతరింపచెయ్యబడిన ఇతర గ్రంథాలనూ ప్రతిష్ఠించనంత వరకు, అసలు మీరు ఏ పునాదిపైనా లేనట్లే.'' నీపై అవతరింపచెయ్యబడిన ఈ ఫర్మానా వారిలోని అధికుల తలబిరుసుతనాన్నీ , తిరస్కారభావాన్నీ తప్పకుండా మరింత అతిశయింపచేస్తుంది. కాని తిరస్కరించేవారి స్థితికి నీవు విచారపడవద్దు. (ఇక్కడ ప్రత్యేకమైన హక్కు ఏ ఒక్కరికీ లేదు) ముస్లిములైనా, యూదులైనా, సాబియీలైనా, క్రైస్తవులైనా, ఎవరైనాసరే, వారు గనక అల్లాహ్ ను , చివరి రోజును విశ్వసించి, మంచి పనులుచేస్తే నిస్సందేహంగా వారికి భయంకాని, శోకంగాని కలిగే ఆస్కారం లేదు.

**5. అల్ మాఇద** 70 - 71 మేము ఇస్రాయీలు సంతానం నుండి గట్టి ప్రమాణాన్ని తీసుకున్నాము. వారివద్దకు ఎంతోమంది ప్రవక్తలను పంపాము, కాని వారివద్దకు వారి మనోవాంఛలకు వ్యతిరేకమైన దానిని ఏ ప్రవక్త అయినా తెచ్చినప్పుడల్లా, వారు కొందరిని అసత్యవాదులని తిరస్కరించారు. మరికొందరిని హత్యచేశారు. ఆ విధంగా చెయ్యటం వల్ల ఏ ఉపద్రవమూ సంభవించదని వారు భావించారు. కనుక వారు గ్రుడ్డివారు , చెవిటివారు అయ్యారు. తరువాత అల్లాహ్ వారిని క్షమించాడు. అయినా వారిలో చాలామంది మరింత గ్రుడ్డివారుగా , మరింత చెవిటివారుగా అవుతూ పోయారు. అల్లాహ్ వారి ఈ చేష్టలన్నింటినీ చూస్తూనే ఉన్నాడు.

**5. అల్ మాఇద** 72 మర్యమ్ కుమారుడైన మసీహ్ాయే అల్లాహ్ అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినట్లే. వాస్తవానికి మసీహ్ా ఇలా అన్నాడు : ఇస్రాయీలు వంశీయులారా! అల్లాహ్ కు దాస్యం చెయ్యండి. ఆయన నాకూ ప్రభువే మీకూ ప్రభువే. ఇతరులను అల్లాహ్ కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయం అందించే వాడెవడూ లేడు.

**5. అల్ మాఇద** 73 - 74 ''అల్లాహ్ ముగ్గురిలో ఒకడు'' అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినవారు. వాస్తవమేమిటంటే, దేవుడు ఒక్కడే. మరొక దేవుడు లేడు. వారు గనక తమ ఈ మాటలను మానుకోకపోతే, వారిలో అవిశ్వాసానికి ఒడిగట్టిన వారికి వ్యధాభరితమైన శిక్షపడుతుంది. అయితే , వారు అల్లాహ్ వైపునకు మరలరా ? క్షమించు అని ఆయనను వేడుకోరా? అల్లాహ్ అమితంగా మన్నించేవాడు, కరుణించేవాడూను.

**5. అల్ మాఇద** 75 మర్యమ్ పుత్రుడైన మసీహ్ా ఒక ప్రవక్త తప్ప మరేమీ కాడు. ఆయనకు పూర్వం కూడా ఎంతోమంది ప్రవక్తలు గతించారు. ఆయన తల్లి సద్గుణ సంపన్నురాలు. వారు ఉభయులూ (ప్రతిరోజు) భోజనం చేసేవారు - చూడండి! మేము వారిముందు యథార్థానికి సంబంధించిన సూచనలను ఎలా విశదీకరిస్తున్నామో చూడండి! అయినా వారు సన్మార్గం తప్పి ఎటుపోతున్నారో!

**5. అల్ మాఇద** 76 - 77 వారితో ఇలా అను : ''ఇదేమిటి, మీరు అల్లాహ్ ను వదలి , మీకు నష్టంగాని, లాభంగాని కలిగించే అధికారం లేని దానిని పూజిస్తున్నారు ? అందరిదీ వినేవాడూ అంతా తెలిసినవాడూ అల్లాహ్ మాత్రమే. '' ఇలా చెప్పు : గ్రంథప్రజలారా! మీ ధర్మం విషయంలో అన్యాయంగా హద్దులు మీరి ప్రవర్తించకండి. మీకు పూర్వం , స్వయంగా తామూ మార్గభ్రష్టులై , ఇంకా చాలామందిని మార్గభ్రష్టులుగా చేసి , రుజుమార్గం తప్పినవారి ఊహాపోహలను అనుసరించకండి.

**5. అల్ మాఇద** 78 - 81 ఇస్రాయీలు సంతతివారిలో అవిశ్వాస మార్గం అవలంబించిన వారిని దావూద్ నోట , మర్యమ్ కుమారుడైన మసీహ్ా నోట శపించటం జరిగింది. ఎందుకంటే వారు అవిధేయులయ్యారు. అత్యాచారాలు చేయసాగారు. చెడు పనులు చెయ్యకుండా వారు ఒకరినొకరు నిరోధించటం మాని వేశారు. వారు అవలంబించిన

మార్గం చాలా చెడ్డది. ఈనాడు నీవు వారిలో చాలా ఎక్కువమందిని (విశ్వాసులకు ప్రతికూలంగా) అవిశ్వాసులను బలపరచే వారుగా, వారితో మైత్రిచేసేవారుగా చూస్తావు. నిశ్చయంగా వారి మనస్సులు వారి కొరకు తయారు చేసిపెట్టిన ముగింపు బహు చెడ్డది. ఈ కారణంగా అల్లాహ్ వారిపై ఆగ్రహోదగ్రుడయ్యాడు. వారు శాశ్వత శిక్షకు గురిఅవుతారు. వారు నిజంగానే అల్లాహ్నూ , ప్రవక్తనూ, ప్రవక్తపై అవతరించినదానినీ విశ్వసించేవారే అయితే (విశ్వాసులకు ప్రతి కూలంగా) అవిశ్వాసులను ఎన్నటికీ మిత్రులుగా చేసుకొని ఉండేవారు కాదు. కాని వారిలో చాలామంది అల్లాహ్ పట్ల విధేయతకు దూరమైపోయారు.

**5. అల్ మాఇద** 82 - 86 విశ్వాసుల పట్ల విరోధం విషయంలో , నీవు యూదులనూ, ముష్రిక్కులనూ అందరికంటే ఎక్కువ ప్రచండులుగా కనుగొంటావు. విశ్వాసులపట్ల మైత్రి విషయంలో ''మేము క్రైస్తవులం'' అని అన్నవారిని అత్యంత సన్నిహితులుగా చూస్తావు. దీనికి కారణం ఏమిటంటే వారిలో దైవభక్తిగల విద్వాంసులూ , ప్రపంచాన్ని పరిత్యజించిన సన్యాసులూ ఉన్నారు. ఇంకా వారిలో అహంభావం లేదు. ప్రవక్తపై అవతరించిన ఈ గ్రంథాన్ని వారు విన్నప్పుడు, సత్యాన్ని గ్రహించిన కారణంగా వారి కళ్ళు అశ్రువులతో చెమ్మగిల్లటం నీవు చూస్తావు. వారు ఇలా అనేస్తారు : ''ప్రభూ! మేము విశ్వసించాము. మా పేర్లను సాక్ష్యం ఇచ్చేవారిలో వ్రాయి.'' ఇంకా వారు ఇలా అంటారు : ''మా ప్రభువు మమ్మల్ని సజ్జనులలో చేర్చాలనే ఆకాంక్ష మాకు ఉన్నప్పుడు మేము అల్లాహ్ ను ఎందుకు విశ్వసించకూడదు? మా వద్దకు వచ్చిన సత్యాన్ని ఎందుకు స్వీకరించకూడదు ?'' వారు ఇలా పలికిన కారణంగా అల్లాహ్ వారికి కింద కాలువలు ప్రవహించే ఉద్యానవనాలను ప్రసాదించాడు. వారు అక్కడ కలకాలం ఉంటారు. సద్వర్తనులకు లభించే ప్రతిఫలం ఇది. ఇక మా ఆయత్తులను స్వీకరించటానికి తిరస్క రించేవారూ , వాటిని అసత్యాలుగా చిత్రించి నిరాకరించేవారూ నరకానికి అర్హులు.

**5. అల్ మాఇద** 87 - 88 విశ్వాసులారా! అల్లాహ్ మీ కొరకు ధర్మ సమ్మతం చేసిన పరిశుద్ధ వస్తువులను నిషిద్ధం చేసుకోకండి. హద్దులను అతిక్రమించకండి. మితిమీరి ప్రవర్తించేవారంటే అల్లాహ్ కు ఏమాత్రం ఇష్టం ఉండదు. అల్లాహ్ మీకు ప్రసాదించిన ధర్మసమ్మతమూ , పరిశుద్ధమూ అయిన ఆహారాన్ని తినండి , త్రాగండి. మీరు విశ్వసించిన దైవం పట్ల అవిధేయతకు దూరంగా ఉండండి.

**5. అల్ మాఇద** 89 మీరు చేసే అర్థం లేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు. కాని మీరు బుద్ధి పూర్వకంగా చేసే ప్రమాణాలను గురించి ఆయన మిమ్మల్ని తప్పకుండా ప్రశ్నిస్తాడు. (అటువంటి ప్రమాణభంగానికి) పరిహారం ఏమిటంటే మీరు మీ ఆలుబిడ్డలకు తినిపించే మామూలు భోజనం పదిమంది పేదలకు పెట్టటం లేదా వారికి కట్టుబట్టలు ఇవ్వటం లేదా ఒక బానిసను స్వతంత్రునిగా చెయ్యటం. ఈ స్తోమతలేనివారు మూడు రోజుల పాటు ఉపవాసం ఉండాలి. మీరు ప్రమాణం చేసి భంగపరిస్తే , మీ ప్రమాణాలకు పరిహారం ఇది. మీరు మీ

ప్రమాణాలను కాపాడుకోండి. మీరు కృతజ్ఞతలు తెలుపుతారని అల్లాహ్ ఈ విధంగా తన ఆజ్ఞలను మీ కొరకు విశదం చేస్తున్నాడు.

**5. అల్ మాఇద** 90 - 92 విశ్వాసులారా! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం - ఇవన్నీ అసహ్యకరమైన షైతాను పనులు. వాటిని విసర్జించండి. మీకు సాఫల్య భాగ్యం కలిగే అవకాశం ఉంది. షైతాను సారాయి, జూదాల ద్వారా మీ మధ్య విరోధ విద్వేషాలను సృష్టించాలనీ , మిమ్మల్ని అల్లాహ్ స్మరణ నుండీ, నమాజు నుండీ వారించాలని కోర్తాడు. కనుక మీరు వీటిని మానుకుంటారా లేదా? అల్లాహ్ మాటను ఆయన ప్రవక్త మాటను వినండి. వాటిని మానుకోండి. కాని మీరు గనక ఆజ్ఞలను పాలించకపోతే , బాగా తెలుసుకోండి, మా ప్రవక్తపై ఉన్న బాధ్యత కేవలం ఆజ్ఞలను స్పష్టంగా అందచేయటమే.

**5. అల్ మాఇద** 93 విశ్వసించి మంచి పనులు చేసేవారిని వారు పూర్వం తిన్నదానిని గురించి , త్రాగినదానిని గురించి ప్రశ్నించటం జరగదు. కాని వారు ఇక ముందు హరాము చెయ్యబడిన వస్తువులకు దూరంగా ఉండాలి. స్థిరమైన విశ్వాసం కలిగి ఉండాలి. మంచి పనులు చెయ్యాలి. ఇంకా మానుకోవాలని ఆజ్ఞాపించబడిన వస్తువులన్నింటినీ మానుకోవాలి. అల్లాహ్ ఆజ్ఞను అంగీకరించాలి. భయభక్తులతో పాటు సద్వర్తన కూడా కలిగి ఉండాలి. అల్లాహ్ సౌశీల్యవంతులను ప్రేమిస్తాడు.

**5. అల్ మాఇద** 94 - 95 విశ్వాసులారా! మీ చేతులకూ మీ ఈటెల దెబ్బకూ పూర్తిగా అందుబాటులో వున్న వేట వస్తువు ద్వారా అల్లాహ్ మిమ్మల్ని కఠిన పరీక్షకు గురిచేస్తాడు , తనను చూడకుండానే మీలో , ఎవరు తనకు భయపడతారో చూద్దామని. ఈ హెచ్చరిక తరువాత అల్లాహ్ నిర్ణయించిన హద్దులను అతిక్రమించేవారికి వ్యధాభరితమైన శిక్ష పడుతుంది. విశ్వసించిన ప్రజలారా! 'ఇహ్రాము' స్థితిలో వేటాడకండి. ఒకవేళ మీలో ఎవరైనా బుద్ధిపూర్వకంగా అలా చేస్తే , అతడు తాను చంపిన జంతువుతో సరితూగే ఒక పశువును నజరానా (మొక్కుబడి)గా సమర్పించుకోవాలి. దానిని మీలో న్యాయస్థులైన ఇద్దరు వ్యక్తులు నిర్ణయించాలి. ఈ నజరానాను కాబాకు చేర్చాలి. లేకపోతే, ఆ పాపానికి పరిహారంగా కొంతమంది పేదలకు భోజనం పెట్టాలి. లేదా దానికి సమానంగా ఉపవాసాలు ఉండాలి. ఎందుకంటే తాను చేసిన దానియొక్క ఫలితాన్ని అతడు చవిచూడాలి. పూర్వం జరిగినదానిని అల్లాహ్ క్షమించాడు. కాని ఇకముందు ఎవరైనా మళ్ళీ అలాచేస్తే , అల్లాహ్ వారికి ప్రతీకారం చేస్తాడు. అల్లాహ్ అత్యంత శక్తిసంపన్నుడు. ప్రతీకారం చేసే శక్తి ఆయనకు ఉంది.

**5. అల్ మాఇద** 96 సముద్ర జంతువులని వేటాడటం , వాటిని తినటం మీ కొరకు ధర్మసమ్మతం చెయ్యబడ్డాయి. మీరు మజిలీ చేసేచోట కూడా వాటిని తినవచ్చు. ఇంకా వాటిని ప్రయాణీకుల బృందం కొరకు భోజన సామగ్రిగా కూడా చేసుకోవచ్చు. అయితే మీరు 'ఇహ్రాము' స్థితిలో ఉన్నంతవరకూ , నేలపై వేటాడటం మీకు నిషిద్ధం

చెయ్యబడిరది. కనుక అల్లాహ్ అవిధేయతకు దూరంగా ఉండండి. ఆయన సమక్షంలో మీరంతా ప్రోగుచెయ్యబడి హాజరుపరచబడతారు.

**5. అల్ మాఇద** 97 - 100 పవిత్ర గృహమైన కాబాను అల్లాహ్ మానవజాతి (సమైక్యజీవన) సంస్థాపనకు సాధనంగా చేశాడు. ఇంకా పవిత్ర మాసాన్నీ , ఖుర్బానీ పశువులనూ వాటి కంఠపట్టికలను కూడా (ఈ కార్యసాధనలో సహాయపడేవిగా) చేశాడు, ఆకాశాలలో భూమిలో ఉన్న పరిస్థితులన్నీ అల్లాహ్ కు తెలుసనీ , ఆయన సర్వజ్ఞాని అనీ మీకు తెలియటానికి. తెలుసుకోండి! అల్లాహ్ శిక్షించటంలో కూడా కఠినుడు. దానితో పాటు ఆయన అధికంగా మన్నించేవాడు, కరుణించేవాడూను. ప్రవక్తపై కేవలం సందేశాన్ని అందజేసే బాధ్యత మాత్రమే ఉంది. ఆ తరువాత మీ బాహ్యాంతర పరిస్థితులన్నింటినీ తెలుసుకునే వాడు అల్లాహ్యే. ప్రవక్తా! వారితో ఇలా అను: పరిశుద్ధము , అపరిశుద్ధము ఎట్టి పరిస్థితులలోనూ సమానం కావు , అపరిశుద్ధం యొక్క పుష్కలత నిన్ను ఎంతగా మరులు గొలిపినప్పటికీ. వివేకంగల ప్రజలారా! అల్లాహ్ పట్ల అవిధేయతకు దూరంగా ఉండండి. మీకు సాఫల్య భాగ్యం కలిగే ఆశ ఉంది.

**5. అల్ మాఇద** 101 - 102 విశ్వాసులారా! మీకు గనక వివరిస్తే మీకే బాధ కలిగించే విషయాలను గురించి ప్రశ్నించ కండి. కాని మీరు వాటిని ఖురాను అవతరించే సమయంలో అడిగితే , అవి మీకు విశదం చెయ్య బడతాయి. ఇంతవరకు మీరు చేసినదానిని అల్లాహ్ క్షమించాడు. అల్లాహ్ క్షమించేవాడు , సహించే వాడూను. మీకు పూర్వం ఒక వర్గంవారు ఇటువంటి ప్రశ్నలనే అడిగారు. వారు ఆ ప్రశ్నల కారణంగానే అవిశ్వాసానికి గురిఅయ్యారు.

**5. అల్ మాఇద** 103 - 104 అల్లాహ్ 'బహీరా'నుగాని, 'సాయిబా'ను గాని , 'వశీలా'నుగాని, 'హామ్'నుగాని ఎంతమాత్రం నిర్ణయించలేదు. అయినా ఈ అవిశ్వాసులు అల్లాహ్ పై అపనిందను మోపుతున్నారు. వారిలో చాలామంది బుద్ధిలేనివాళ్ళు. (వారు ఇటువంటి భ్రమలను నమ్ముతున్నారు). ''అల్లాహ్ అవతరింప జేసిన శాసనం వైపునకు రండి , ప్రవక్త వైపునకు రండి '' అని వారితో చెప్పినప్పుడు , వారు ''మా కొరకు మా తాతముత్తాతలు అవలంబిస్తూ ఉండగా మేము చూసిన విధానమే చాలు '' అని జవాబు చెబుతారు. ఏమిటి! వారు తమ తాత ముత్తాతలనే అనుసరిస్తూ పోతారా, వారికి ఏమీ తెలియనప్పటికీ, రుజుమార్గజ్ఞానమే వారికి లేకపోయినప్పటికీ?

**5. అల్ మాఇద** 105 విశ్వాసులారా! మిమ్మల్ని గురించి మీరు ఆలోచించుకోండి. మీరు గనక స్వయంగా సన్మార్గంలో ఉంటే, ఇతరులు మార్గభ్రష్టులైనప్పటికీ మీకు ఎంతమాత్రం హాని కలగదు. మీరందరూ అల్లాహ్ వైపునకే మరలిపోవలసి ఉంది. అప్పుడు ఆయన మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో మీకు తెలుపుతాడు.

**5. అల్ మాఇద** 106 - 108 విశ్వాసులారా! మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమై అతడు వీలునామా వ్రాయిస్తున్నప్పుడు, దాని సాక్ష్యానికి అనుసరించవలసిన పద్ధతి ఏమిటంటే , మీలో న్యాయవర్తనులైన ఇద్దరు

వ్యక్తులు సాక్షులుగా చెయ్యబడాలి లేక ఒకవేళ మీరు ప్రయాణ స్థితిలో ఉండి అక్కడ మీకు మృత్యు విపత్తు సంభవిస్తే అప్పుడు ముస్లిమేతరుల నుండే ఇద్దరు సాక్షులను తీసుకోవాలి. తరువాత ఏదైనా అనుమానం కలిగితే , నమాజు చేసిన పిదప ఆ ఇద్దరు సాక్షులనూ (మసీదులో) ఆపాలి. వారిద్దరూ అల్లాహ్ పై ప్రమాణం చేసి ఇలా చెప్పాలి : ''మేము స్వార్థం కొరకు సాక్ష్యాన్ని అమ్మేవాళ్ళం కాదు -అతడు మాకు దగ్గర బంధువైనాసరే (మేము అతని విషయంలో పక్షపాతం చూపం). మేము అల్లాహ్ కొరకు ఇచ్చే సాక్ష్యాన్ని దాచేవారం కాము. మేము ఆవిధంగా చేస్తే పాపాత్ములలో లెక్కింపబడతాము. '' కాని ఆ ఉభయులు తమను తాము పాపానికి గురిచేసుకున్నట్లు తెలిస్తే అప్పుడు వారి స్థానంలో సాక్ష్యమివ్వటానికి వారికంటే యోగ్యులైన మరో ఇద్దరు వ్యక్తులు - హక్కు విషయంలో అన్యాయం జరిగిన వారినుండి ముందుకు రావాలి. వారు అల్లాహ్ పై ప్రమాణం చేసి ఇలా చెప్పాలి : ''మా సాక్ష్యం వారి సాక్ష్యం కంటే ఎక్కువ సత్యమైనది. మేము మా సాక్ష్యం విషయంలో ఏ విధమైన అక్రమానికి పాల్పడలేదు. మేము ఆ విధంగా చేస్తే అన్యాయపరులలో చేరిపోతాము. '' ఈ పద్ధతివల్ల ప్రజలు నిజమైన సాక్ష్యం ఇస్తారనీ , లేదా వారి ప్రమాణాలను , తరువాత తీసుకోబడే ఇతరుల ప్రమాణాలు ఖండిస్తాయనే భయమైనా కనీసం వారికి కలుగుతుందనీ ఎక్కువగా ఆశించ వచ్చు. అల్లాహ్ కు భయపడండి , ఆలకించండి, అవిధేయత చూపేవారిని అల్లాహ్ తన మార్గదర్శ కత్వానికి దూరం చేస్తాడు.

**5. అల్ మాఇద** 109 - 119 అల్లాహ్, ప్రవక్తలందరినీ సమావేశపరచి, ''మీకు ఏమని జవాబు ఇవ్వబడిరది ?'' అని అడిగే రోజున ''మాకు ఏమీ తెలియదు. గుప్తంగా ఉన్న యథార్థాలన్నీ మీకే తెలుసు '' అని వారు సమాధానం చెబుతారు. ఇంకా అల్లాహ్ ఈ విధంగా అడగబోయే ఆ సమయాన్ని గురించి ఊహించండి , ''మర్యమ్ కుమారుడైన ఈసా! జ్ఞాపకం తెచ్చుకో, నేను నీకూ, నీ తల్లికి ప్రసాదించిన అనుగ్రహాన్ని నేను పరిశుద్ధాత్మ ద్వారా నీకు సహాయం చేశాను. నీవు ఊయలలో సైతం ప్రజలతో మాట్లాడేవాడివి , అదేవిధంగా ఎదిగిన తరువాత కూడా. నేను నీకు గ్రంథాన్నీ , వివేకాన్నీ, తౌరాతునూ ఇంజీలునూ నేర్పాను. నీవు నా ఆదేశంతో పక్షి ఆకారంగల మట్టిబొమ్మను తయారుచేసి, దానిలో ఊదేవాడివి. అది నా ఆజ్ఞతో పక్షి అయ్యేది. నీవు పుట్టు గ్రుడ్డినీ కుష్ఠరోగినీ నా ఆజ్ఞతో బాగుచేసేవాడివి. నీవు మృతులను నా ఆజ్ఞతో వెలికి తీసేవాడివి. నీవు స్పష్టమైన సూచనలతో ఇస్రాయీలు సంతతి వారి వద్దకు వచ్చినప్పుడు, వారిలోని సత్యతిరస్కారులు ''ఈ సూచనలు మాయ తప్ప మరేమీ కాదు'' అని అన్నారు. అప్పుడు నేనే నిన్ను వారి బారినుండి రక్షించాను. నేను హవారీలకు , ''నన్నూ నా ప్రవక్తను విశ్వసించండి'' అని సూచించినప్పుడు వారు ''మేము విశ్వసించాము , మేము ముస్లిములము అయ్యామన్న దానికి నీవే సాక్షి '' అని అన్నారు - (హవారీల విషయంలో) మరొక సంఘటనను కూడా జ్ఞాపకం తెచ్చుకో. వారు ''మర్యమ్ కుమారుడైన ఈసా! నీ ప్రభువు మా కొరకు ఆహార పదార్థాలతో నిండిన ఒక పళ్ళాన్ని ఆకాశం నుండి దింపగలడా?'' అని అడిగినప్పుడు, ఈసా, ''మీరు విశ్వాసులే అయితే అల్లాహ్ కు భయపడండి '' అని అన్నాడు. వారు ఇలా అన్నారు : ''ఆ పళ్ళెంలో ఉన్న ఆహారాన్ని భుజించాలనీ , మా హృదయాలకు తృప్తి కలగాలనీ , నీవు

మాకు చెప్పినదంతా నిజమనే విషయం మాకు తెలియాలనీ, ఇంకా మేము దానికి సాక్షులుగా ఉండాలనీ మాత్రమే మేము కోరుతున్నాము.'' దానిపై మర్యమ్ కుమారుడైన ఈసా ఇలా ప్రార్థించాడు : ''అల్లాహ్! మా ప్రభూ! ఆకాశం నుండి మాపై ఆహారంతో నిండిన పళ్ళాన్ని ఒక దానిని అవతరింపజెయ్యి. అది మాకూ , మా పూర్వీకులకూ, మా తరువాతి వారికీ ఒక పండుగ సమయంగా నిర్ణయింపబడాలి. నీ తరఫునుండి ఒక సూచన కాగలగాలి. మాకు ఆహారం ప్రసాదించు. నీవు ఉత్తమ ఆహారప్రదాతవు. '' అల్లాహ్ ఇలా జవాబు పలికాడు : ''నేను దానిని మీపై అవతరింపజేస్తాను. కాని దాని తరువాత కూడా మీలో ఎవరైనా అవిశ్వాసానికి పాల్పడితే , వారికి నేను ఇంతవరకూ ఎవరికీ విధించని శిక్ష విధిస్తాను.'' - (ఈ అనుగ్రహాలను గుర్తుచేసి) అల్లాహ్, ''మర్యమ్ కుమారుడవైన ఈసా! నీవు మనుజ జాతితో , అల్లాహ్ ను కాదని నన్నూ , నా తల్లిని దేవుళ్ళుగా భావించండి అని బోధించావా ?'' అని అడిగినపుడు అతను ఇలా మనవి చేసుకుంటాడు : ''నీవు అత్యంత పవిత్రుడవు! ఏ మాటను అనే హక్కు నాకు లేదో ఆ మాటను అనటం నాకు యుక్తమైన పనికాదు. ఒకవేళ నేను ఆవిధంగా అని ఉంటే , అది నీకు తప్పకుండా తెలిసివుండేది. నా మనస్సులో ఏముందో నీకు తెలుసు. నీ మనస్సులో ఏముందో నాకు తెలియదు. నీవు గుప్తంగా ఉన్న యథార్థాలన్నీ తెలిసిన మహాజ్ఞానివి. నీవు ఆదేశించిన దానిని తప్ప దేనినీ నేను వారికి చెప్పలేదు. అది ఏమిటంటే అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. నేను వారిమధ్య ఉన్నంత కాలంవరకే నేను వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉంటున్నావు. నీవు సర్వ విషయాలను కనిపెట్టి ఉండేవాడవు. ఇప్పుడు ఒకవేళ నీవు వారిని శిక్షించినట్లయితే వారు నీ దాసులు, ఒకవేళ క్షమించినట్లయితే నీవు శక్తిమంతుడవు , వివేకవంతుడవు.'' అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు : ''ఈ రోజు సత్యవంతులకు వారి సత్యం లాభాన్ని ఇస్తుంది. క్రింద కాలువలు ప్రవహించే ఉద్యాన వనాలు వారికి లభిస్తాయి. అక్కడ వారు ఎల్లప్పుడూ ఉంటారు. వారు అల్లాహ్ అంటే ఇష్టపడతారు. అల్లాహ్ వారంటే ఇష్టపడతాడు. ఇదే గొప్ప విజయం.''

**5. అల్ మాఇద** 120 భూమి, ఆకాశాలు వాటిలో ఉన్న సమస్తం యొక్క సామ్రాజ్యాధిపత్యం అల్లాహ్ కే చెందుతుంది. ఆయనకు ప్రతి వస్తువుపైనా అధికారం ఉంది.

6. అల్ అన్ ఆమ్

ఆయతులు : 165 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**6. అల్ అన్ ఆమ్** 1 - 3 స్తోత్రం అల్లాహ్ కు మాత్రమే శోభిస్తుంది. ఆయన భూమినీ , ఆకాశాలనూ నిర్మించాడు. వెలుగునూ చీకట్లనూ సృష్టించాడు. అయినా సత్యసందేశాన్ని స్వీకరించటానికి నిరాకరించినవారు ఇతరులను తమ

ప్రభువుకు సమానులుగా పరిగణిస్తున్నారు. ఆయనే మిమ్మల్ని మట్టితో సృజించాడు. తరువాత మీ కొరకు ఒక జీవన వ్యవధిని నిర్ణయించాడు. ఆయన వద్ద నిర్ణయమై ఉన్న మరొక వ్యవధికూడా ఉంది. కాని మీరు ఇంకా సంశయంలోనే పడివున్నారు. ఆ ఏకైక దైవమే ఆకాశాలలోనూ ఉన్నాడు, భూమిలోనూ ఉన్నాడు. మీరు బయటికి తెలియపరచేదీ, లోపల దాచిపెట్టేదీ అంతా ఆయనకు తెలుసు. మీరు సముపార్జించుకునే చెడునూ మంచినీ ఆయన బాగా ఎరుగును.

**6. అల్ అన్ ఆమ్** 4 - 6 ప్రజల స్థితి ఏమిటంటే , వారి ముందుకు వచ్చిన తమ ప్రభువు సూచనలలో వారు వైముఖ్యం చూపని సూచన ఏదీ లేదు. ఇప్పుడు వారు తమ వద్దకు వచ్చిన సత్యాన్ని కూడా అసత్యమని తిరస్కరించారు. సరే, వారు ఇంతవరకూ ఎగతాళి చేస్తూ వచ్చిన విషయానికి సంబంధించిన కొన్ని వార్తలు త్వరలోనే వారికి అందుతాయి. తమ తమ కాలాలలో అధిక ప్రాబల్యంకల ఎన్ని జాతులను మేము వారికి పూర్వం నాశనం చేశామో వారు చూడలేదా ? మేము మీకు ప్రసాదించని అధికారాన్ని పుడమిపై వారికి ప్రసాదించాము. వారిపై మేము ఆకాశం నుండి మంచి వర్షాలను కురిపించాము. క్రింద నదులను ప్రవహింపచేశాము. (కాని వారు మా అనుగ్రహాలపట్ల కృతఘ్నత చూపితే) చివరకు మేము వారు చేసిన పాపాల ఫలితంగా వారిని సర్వనాశనం చేశాము. వారి స్థానంలో మరొక తరం జాతులను లేపాము.

**6. అల్ అన్ ఆమ్** 7 - 9 ప్రవక్తా! మేము కాగితం మీద వ్రాయబడిన ఒక గ్రంథాన్ని నీపై అవతరింపజేసినా , ప్రజలు దానిని స్వహస్తాలతో తాకి చూసినా , సత్యతిరస్కారులు మటుకు ''ఇది పచ్చి కనికట్టు తప్ప మరేమీ కాదు '' అని అంటారు. వారు , ''ఈ ప్రవక్తపై ఒక దైవదూత ఎందుకు అవతరింపజేయబడలేదు ?'' అని అడుగుతారు. మేము ఒకవేళ దైవదూతనే పంపి ఉన్నట్లయితే ఇప్పటికే తీర్పు జరిగి ఉండేది. వారికి వ్యవధి ఇవ్వబడి ఉండేది కాదు. ఒకవేళ మేము దైవదూతను అవతరింపజేసినా అతనిని మానవ రూపంలోనే అవతరింపజేసి ఉండేవారము. ఈ విధంగా మేము వారిని, ప్రస్తుతం వారు ఏ సంశయంలో పడివున్నారో ఆ సంశయానికే గురిచేసి ఉండేవారము.

**6. అల్ అన్ ఆమ్** 10 - 11 ప్రవక్తా! నీకు పూర్వం కూడ చాలామంది ప్రవక్తలను ఎగతాళి చెయ్యటం జరిగింది. కాని చివరకు ఆ ఎగతాళి చేసేవారు ఏ యథార్థాన్ని ఎగతాళి చేస్తూ ఉండేవారో , ఆ యథార్థమే వారి నెత్తిపై పడిరది. వారితో ఇలా అను : ''కొంచెం భూసంచారం చేసి చూడండి, సత్యతిరస్కారుల ముగింపు ఎలా జరిగిందో తెలుస్తుంది.''

**6. అల్ అన్ ఆమ్** 12 వారిని అడుగు : ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా ఎవరిదని? - అను, సమస్తమూ అల్లాహ్దే అని. దయాదాక్షిణ్యాలు చూపటాన్ని ఆయన తన మీద విధించుకున్నాడు. (కనుకనే ఆయన మీ అవిధేయతలకు, తలబిరుసుతనాలకు మిమ్మల్ని వెంటనే పట్టుకోడు). ప్రళయం నాడు ఆయన మీ అందరినీ తప్పకుండా సమావేశపరుస్తాడు. ఇది అనుమానానికి ఏమాత్రం ఆస్కారంలేని యథార్థం. కాని తమను తాము వినాశకరమైన ప్రమాదానికి గురిచేసుకున్నవారు మాత్రం దీనిని విశ్వసించరు.

**6. అల్ అన్ ఆమ్** 13 - 18 రాత్రి చీకటిలో పగటివెలుగులో నిలిచేది అంతా అల్లాహ్దే. ఆయన అన్నీ వింటాడు , అన్నీ తెలిసినవాడు. ఇలా అను : ''భూమ్యాకాశాల సృష్టికర్త , ఉపాధి ప్రదాతేగాని ఉపాధి గ్రహీత కానివాడు అయిన అల్లాహ్ను కాదని నేను మరెవరినయినా నా సంరక్షకుడుగా చేసుకోవాలా ?'' ఇలా చెప్పు : అందరికంటే ముందు నేను ఆయనకు విధేయుణ్ణి కావాలని నన్ను ఆదేశించటం జరిగింది. (ఇంకా ఇలా తాకీదు ఇవ్వబడిరది. ఎవరైనా షిర్క్ చేస్తే చెయ్యనీ) ''నీవు మాత్రం ముష్రిక్కులలో కలసిపోవద్దు.'' ఇంకా ఇలా అను : ''నేను ఒకవేళ నా ప్రభువు ఆజ్ఞలను ఉల్లంఘిస్తే , ఒక మహా (భయంకరమైన) రోజున శిక్షను అనుభవించవలసి వస్తుందని నేను భయపడుతున్నాను. ఆ రోజున శిక్షను తప్పించుకున్న వాడిని అల్లాహ్ నిజంగా కరుణించినట్లే. అదే ప్రస్ఫుటమైన సాఫల్యం. అల్లాహ్ గనక మీకు ఏదైనా నష్టం కలిగిస్తే , ఆయన తప్ప ఆ నష్టాన్నుండి మిమ్మల్ని రక్షించగలిగే వారెవరూ లేరు. ఆయన మీకు ఏదైనా మేలు కలుగజేస్తే , ఆయనకు అన్నింటిపైనా అధికారం ఉంది. ఆయన తన దాసులపై సంపూర్ణమైన అధికారాలు కలిగి వున్నాడు. ఇంకా అత్యంత వివేకవంతుడు అన్నీ తెలిసినవాడు.''

**6. అల్ అన్ ఆమ్** 19 - 21 వారిని అడుగు : ఎవరి సాక్ష్యం అందరి సాక్ష్యం కంటే గొప్పది? అని - ఇలా అను : నాకూ మీకూ మధ్య అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు. ఈ ఖురాను నా వద్దకు వహీ ద్వారా పంపబడిరది. మిమ్మల్నీ , ఇది ఎవరెవరివద్దకు చేరుతుందో వారందరినీ నేను హెచ్చరించాలని. అల్లాహ్తో పాటు ఇంకా ఇతర దేవుళ్ళు కూడా ఉన్నారని మీరు నిజంగానే సాక్ష్యం ఇవ్వగలరా? ఇలా అను : నేను అలాంటి సాక్ష్యం ఎంతమాత్రం ఇవ్వలేను. అను: దేవుడు ఆయన ఒక్కడే. మీరు చేసే షిర్కును నేను అసహ్యిం చుకుంటున్నాను. మేము ఎవరికైతే గ్రంథాన్ని ప్రసాదించామో, తమ కుమారులను ఏమాత్రం సందేహం లేకుండా గుర్తించే విధంగానే ఈ విషయాన్ని కూడా నిస్సందేహంగా గుర్తిస్తారు. కాని తమను తామే నష్టానికి గురిచేసుకున్న వారు దీన్ని నమ్మరు. అల్లాహ్ పై బూటకపు అభాండాలు వేసేవాడికంటే లేదా అల్లాహ్ సూచనలు అసత్యాలని తిరస్కరించేవాడికంటే పరమ దుర్మార్గుడు ఎవడుంటాడు? నిశ్చయంగా అటువంటి దుర్మార్గులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు.

**6. అల్ అన్ ఆమ్** 22 - 24 మేము వారందరినీ సమావేశపరిచే రోజున ముష్రిక్కులను ఇలా అడుగుతాము : ''మీరు మీ దైవాలుగా భావించి నిలబెట్టిన ఆ భాగస్వాములంతా ఇప్పుడెక్కడున్నారు?'' అప్పుడు వారు : ''ఓ మా ప్రభూ! నీతోడు! మేము ముష్రిక్కులము కానేకాము '' అని (అసత్యం) పలకటం తప్ప వేరే కుతంత్రాన్ని సృష్టించలేరు. చూడండి! అప్పుడు వారు తమను గురించి తామే ఏ విధంగా అబద్ధాలు కల్పిస్తారో! అక్కడ వారి బూటకపు దేవుళ్ళందరూ మటుమాయమైపోతారు.

**6. అల్ అన్ ఆమ్** 25 - 30 వారిలో నీ మాటను చెవియొగ్గి వినేవారు కొందరు ఉన్నారు. కాని విషయం ఏమిటంటే మేము వారి హృదయాలపై పరదాలు వేసి ఉంచాము. అందువల్ల వారు దానిని ఏమాత్రం అర్థం చేసుకోరు. వారి చెవులను మొద్దుబారేటట్లు చేశాము. (కనుక అంతా విన్నప్పటికీ ఏమీ వినలేరు). వారు ఏ సూచనను చూసినా ,

దానిని విశ్వసించటం అనేది జరగదు. చివరకు వారు నీ వద్దకు వచ్చి నీతో వాదులాడేటప్పుడు , వారిలో తిరస్కరించాలనే నిర్ణయం చేసుకున్నవారు (అంతా విన్న తరువాత) ''ఇదంతా పాతకాలపు గాథ తప్ప మరేదీ కాదు'' అని అంటారు. వారు ప్రజలను ఈ సత్య విషయాన్ని విశ్వసించకుండా ఆపుతారు. స్వయంగా వారు కూడా దానికి దూరంగా పారిపోతారు. (ఇలా చేసి నీకు హాని కలుగజేస్తున్నామని వారు భావిస్తారు). వాస్తవానికి వారు అసలు తమ వినాశాన్ని తామే కొని తెచ్చుకుంటున్నారు. కాని వారికి దాని స్పృహలేదు. నరకం గట్టుపై వారిని నిలబెట్టే దృశ్యాన్ని నీవు గనక చూడగలిగితే ఎంత బాగుంటుంది. అప్పుడు వారు ఇలా అంటారు :''అయ్యో! మేము మళ్ళీ భూలోకానికి తిరిగి పంపబడే , మా ప్రభువు సూచనలు అసత్యాలని తిరస్కరించకుండా ఉండే , విశ్వాసులలో మేము కలసిపోయే మార్గం ఏదైనా ఉంటే ఎంత బాగుండును. '' వాస్తవానికి వారు ఇలా అనటానికి కారణం , కేవలం వారు కప్పిపుచ్చిన సత్యం అప్పుడు వారి ముందు బహిర్గతం కావటమే! ఒకవేళ వారిని గత జీవితం వైపునకు తిరిగి పంపితే నిషేధించటం జరిగిన దాన్నంతా మళ్ళీ చేస్తారు. వారు అసలు ఎల్లప్పుడూ అబద్ధం చెప్పేవారే. (కనుక వారు తమ ఈ కోరికను వ్యక్తం చెయ్యటంలో కూడా అబద్ధాన్నే ప్రయోగిస్తారు). వారు ఈనాడు ఇలా అంటారు : ''జీవితం అంటే కేవలం ఇహలోక జీవితమే. మరణం తరువాత మనం మళ్ళీ లేపబడటం అనేది జరగదు. '' వారు తమ ప్రభువు ముందు నిలబెట్టబడే దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుండును! అప్పుడు వారి ప్రభువు వారిని ''ఇదంతా యథార్థం కాదా ?'' అని అడుగుతాడు. వారు ఇలా అంటారు : ''అవును మా ప్రభూ! ఇదంతా యథార్థమే!'' అప్పుడు ఆయన ఇలా సెలవిస్తాడు : ''సరే, అయితే మీరు యథార్థాన్ని తిరస్కరించిన దానికి ఫలితంగా ఇప్పుడు శిక్షను చవిచూడండి.''

**6. అల్ అన్ ఆమ్** 31 - 32 అల్లాహ్తో తమ సమావేశపు వర్తమానాన్ని అబద్ధంగా పరిగణించిన వారు నష్టానికి గురి అయ్యారు. అకస్మాత్తుగా ఆ గడియ వచ్చిపడినప్పుడు వారే వాపోతారు: ''అయ్యో! ఈ విషయంలో మేము ఎంత పొరపాటు చేశాము!'' అని. వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే , తమ పాపాల బరువును తమ వీపులపై మోస్తూ ఉంటారు. చూడండి! వారు మోస్తూవున్న ఈ బరువు ఎంత చెడ్డదో! ఇహలోక జీవితం ఒక ఆట , ఒక తమాషా మాత్రమే. వాస్తవానికి నష్టం నుండి తప్పించుకొనగోరే వారికి పరలోకవాసమే అత్యంత శ్రేష్ఠమైనది. అయితే మీరు బుద్ధిని ఉపయోగించరా?

**6. అల్ అన్ ఆమ్** 33 - 36 ప్రవక్తా! ఈ ప్రజలు కల్పించే మాటలవల్ల నీకు బాధ కలుగుతుందనే విషయం మాకు బాగా తెలుసు. కాని వారు తిరస్కరించేది నిన్ను కాదు. ఈ దుర్మార్గులు వాస్తవానికి తిరస్కరిస్తున్నది అల్లాహ్ ఆయతులనే. నీకు పూర్వం కూడా చాలామంది ప్రవక్తలు తిరస్కరించబడ్డారు. కాని వారు ఆ తిరస్కారానికి , తాము గురిచెయ్యబడిన వ్యధలకు సహనం వహించారు. చివరకు మా సహాయం వారికి అందింది. అల్లాహ్ మాటలను మార్చేశక్తి ఎవరికీ లేదు. పూర్వపు ప్రవక్తలకు జరిగినదాని సమాచారాలు నీకు ఇదివరకే అందాయి. అయినా ఒకవేళ నీకు వారి వైముఖ్యాన్ని భరించటం కష్టంగా ఉంటే , నీకు గనక శక్తివుంటే, భూమిలో ఒక సొరంగాన్ని వెదకి

లేదా ఆకాశానికి నిచ్చెనవేసి , వారివద్దకు ఏదైనా సూచనను తీసుకొనివచ్చే ప్రయత్నం చెయ్యి. అల్లాహ్ గనక కోరివుంటే, వారందరినీ సన్మార్గంపై చేర్చి ఉండేవాడే. కనుక నీవు అవివేకివి కావద్దు. వినేవారు మాత్రమే సత్య సందేశాన్ని స్వీకరిస్తారు. ఇక మృతుల విషయం, అల్లాహ్ వారిని నేరుగా గోరీల నుండి లేపుతాడు. తరువాత వారు (ఆయన న్యాయస్థానంలో హాజరు అయ్యేందుకు) తిరిగి తీసుకొని రాబడతారు.

**6. అల్ అన్ ఆమ్** 37 - 41 ''ఈ ప్రవక్తపై అతని ప్రభువు తరఫు నుండి ఏదైనా సూచన ఎందుకు అవతరింపజేయ బడలేదు?'' అని వారు అడుగుతారు. అను: ''అల్లాహ్ కు సూచనను అవతరింపజేసే శక్తి పూర్తిగా ఉంది '' అని. అయితే వారిలో అనేకులు అజ్ఞానంలో పడివున్నారు. భూమిపై సంచరించే ఏ జంతువు నైనా , గాలిలో రెక్కలతో ఎగిరే ఏ పక్షినైనా చూడండి. ఇవన్నీ మీవంటి జీవరాసులే. వాటి విధివ్రాత ఉన్న గ్రంథంలో మేము ఏ కొరతా చెయ్యలేదు. తరువాత ఇవన్నీ తమ ప్రభువు వద్ద ప్రోగుచెయ్యబడేవే. అయితే మా సూచనలను తిరస్కరిస్తూ ఉన్నవారు చెవిటివారు , మూగవారు, చీకట్లలో పడివున్నవారు. అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టులుగా చేస్తాడు. తాను కోరిన వారిని రుజుమార్గవర్తనులుగా చేస్తాడు. వారితో ఇలా అను: ''కొంచెం ఆలోచించి చెప్పండి: ఎప్పుడైనా అల్లాహ్ తరఫు నుండి ఏదైనా పెద్ద ఆపద మీపై వచ్చిపడినప్పుడు లేదా చివరి గడియయే దాపురించినప్పుడు, మీరు అల్లాహ్ను తప్ప మరెవ్వర్నయినా పిలుస్తారా ? చెప్పండి, మీరు సత్యవంతులే అయితే. అప్పుడు మీరు అల్లాహ్ నే పిలుస్తారు. ఆయన గనక కోరితే ఆ ఆపదను మీపై నుండి తొలగిస్తాడు. అటువంటి సందర్భాలలో మీరు నిలబెట్టిన దైవత్వపు భాగస్వాములను మీరు మరచిపోతారు.''

**6. అల్ అన్ ఆమ్** 42 - 45 మీకు పూర్వం అనేక జాతుల వద్దకు మేము ప్రవక్తలను పంపాము. ఆ జాతులను మేము కష్టాలకు , కడగండ్లకు గురిచేశాము , వారు మా ముందు వినయంతో తలవంచాలని. మా తరఫునుండి వారిపైకి ఆపద వచ్చిపడినప్పుడు వారు ఎందువల్ల వినమ్రులు కాలేదు ? కాని వారి హృదయాలు మరీ కఠినమయ్యాయి. షైతాను, ''మీరు చేసేదంతా బాగానే ఉంది'' అని వారిని నమ్మించాడు. తరు వాత వారు తమకు చెయ్యబడిన హితోపదేశాన్ని విస్మరించినప్పుడు , మేము వారికొరకు సకల భోగభాగ్యాల ద్వారాలను తెరిచాము. చివరకు వారు తమకు ప్రసాదించబడిన ఆనందాలలో నిమగ్నులై ఉండగా , అకస్మాత్తుగా మేము వారిని పట్టుకున్నాము. అప్పుడు పరిస్థితి ఎలా ఉందంటే , వారు ప్రతి మేలు విషయంలో హతాశులయ్యారు. ఈ విధంగా దుర్మార్గానికి పాల్పడినవారిని సమూలంగా నిర్మూలించటం జరిగింది. సకల లోక ప్రభువైన అల్లాహ్యే స్తుతికి పాత్రుడు. (ఆయన వారిని సమూలంగా నాశనం చేశాడు).

**6. అల్ అన్ ఆమ్** 46 - 49 ప్రవక్తా! వారితో ఇలా అను: ''మీరెప్పుడైనా ఆలోచించారా, అల్లాహ్ మీ చూపును మీ వినికిడిని మీనుంచి లాక్కుంటే , మీ హృదయాలకు ముద్రవేస్తే , మళ్ళీ మీకు ఈ శక్తులను అల్లాహ్ తప్ప తిరిగి ఇవ్వగల మరొక దేవుడెవడున్నాడు ?'' చూడు! ఏవిధంగా మేము మాటిమాటికీ మా సూచనలను వారికి

తెలుపుతామో, మరేవిధంగా వారు వాటి నుండి తమ దృష్టిని మరల్చుకుంటారో! ఇలా అను : ''మీరెప్పుడైనా యోచించారా, అల్లాహ్ తరఫునుండి అకస్మాత్తుగానో , బహిరంగంగానో మీపై శిక్ష అవతరిస్తే , అప్పుడు దుర్మార్గులు తప్ప మరెవరైనా నాశనమవుతారా? మేము ప్రవక్తలను పంపేది, వారు సచ్చరిత్రులకు సంతోష వార్తను ఇచ్చేవారు, దుశ్చరిత్రులను భయపెట్టేవారు కావాలని. కనుక , వారి మాట విని , తమ నడవడికను సంస్కరించుకునే వారికి భయంకానీ విచారంకానీ కలిగే అవకాశం లేదు. కాని మా ఆయతులు అసత్యాలని తిరస్కరించేవారు తమ అవిధేయతలకు ఫలితంగా శిక్ష తప్పకుండా అనుభవిస్తారు.

**6. అల్ అన్ ఆమ్** 50 ప్రవక్తా! వారితో ఇలా అను: ''నా వద్ద అల్లాహ్ నిధి నిక్షేపాలు ఉన్నాయనిగానీ , నాకు అగోచర జ్ఞానం కలదనిగానీ , నేను మీతో చెప్పటం లేదు. ఇంకా నేను దైవదూతనని కూడా అనటం లేదు. నేను కేవలం నాపై అవతరింపచేయబడే 'వహీ'ని మాత్రమే అనుసరిస్తాను. '' వారిని అడుగు : ''గ్రుడ్డివాడూ కళ్ళు ఉన్నవాడూ ఇద్దరూ ఒకటి కాగలరా? మీరు అసలు ఆలోచించరా?'' అని.

**6. అల్ అన్ ఆమ్** 51 - 55 ప్రవక్తా! తమ ప్రభువు ముందు ఆయన తప్ప తమకు అండగా నిలిచి , సహాయం చేసే (అధికారం కల) వాడుగానీ లేదా తమ కొరకు సిఫారసు చేసేవాడుగానీ ఎవడూ ఉండని స్థితిలో ఎప్పుడైనా హాజరు కావలసివస్తుందని భయపడుతూ ఉండేవారికి నీవు దీని (వహీ జ్ఞానం) ద్వారా ఉపదేశించు. బహుశా వారు (ఈ ఉపదేశం వల్లనైనా జాగరూకులై) భయభక్తుల వైఖరి అవలంబి స్తారేమో! రేయింబవళ్ళూ తమ ప్రభువును వేడుకునేవారినీ ఆయన ప్రసన్నతను పొందగోరే ప్రయత్నంలో నిమగ్నులై ఉన్నవారినీ నీవు దూరంగా తొలగిపొమ్మనకు. వారికి సంబంధించిన లెక్కలోని ఏ విషయాన్ని గురించిన భారమూ నీపై లేదు. నీకు సంబంధించిన లెక్కలోని ఏ విషయాన్ని గురించిన భారమూ వారిపై లేదు. దీని తరువాత కూడ నీవు గనక వారిని దూరంగా త్రోసివేస్తే దుర్మార్గులలో చేరిపోతావు. అసలు మేము ఈ విధంగా వారిలోని కొందరిని కొందరి ద్వారా పరీక్షకు గురిచేశాము. వారు వీరిని చూసి, ''మా మధ్య అల్లాహ్ దయాదాక్షిణ్యాలను పొందిన వారు వీరేనా?'' అని అనేందుకు - అవును! అల్లాహ్ , కృతజ్ఞతలు చూపే తన భక్తులను వీరికంటే బాగా ఎరుగడా ? మా ఆయతులను విశ్వసించేవారు నీ వద్దకు వచ్చినప్పుడు , వారితో ఇలా అను : ''మీకు శాంతి సమకూరుగాక! మీ ప్రభువు తనపై దయాదాక్షిణ్యాలను విధించుకున్నాడు. (కేవలం ఆయన కృపవల్లనే), ఒకవేళ మీలో ఎవరైనా అజ్ఞానం వల్ల ఏదైనా చెడుచేసి, తరువాత పశ్చాత్తాపపడి సంస్కరించుకుంటే , ఆయన అతనిని క్షమిస్తాడు. అతని పట్ల ఉదారంగా వ్యవహరిస్తాడు.'' ఈ విధంగా మేము మా సూచనలను స్పష్టంగా వివరిస్తాము. అపరాధుల మార్గం పూర్తిగా విస్పష్టం కావాలని.

**6. అల్ అన్ ఆమ్** 56 - 62 ప్రవక్తా! వారితో ఇలా అను: ''అల్లాహ్ను కాక మీరు వేడుకునే ఇతరులకు దాస్యం చెయ్యటం నాకు నిషేధించబడిరది.'' ఇలా అను : ''నేను మీ కోరికలను అనుసరించను. అలా చేసినట్లయితే , నేను

మార్గభ్రష్టుడనయిపోతాను. సన్మార్గం పొందిన వారిలో ఉండను. '' అను : ''నా ప్రభువు వద్ద నుండి వచ్చిన ఒక సుస్పష్టమైన ప్రమాణం విషయంలో నేను స్థిరంగా ఉన్నాను. మీరు దానిని అసత్యమని తిరస్కరించారు. ఇప్పుడు మీరు తొందరపెడుతున్న విషయం మాత్రం నా అధీనంలో లేదు. నిర్ణయాధికారం పూర్తిగా అల్లాహ్కు ఉంది. ఆయనే సత్య విషయాన్ని ప్రకటిస్తాడు. ఆయనే ఉత్తమ నిర్ణయం చేసేవాడు. '' ఇలా అను: ''మీరు తొందరపెట్టే విషయం నా అధీనంలోనే గనక ఉన్నట్లయితే, నాకూ మీకూ మధ్య ఎప్పుడో తీర్పు జరిగిపోయి ఉండేది. కాని దుర్మార్గుల పట్ల ఎలా వ్యవహరించాలో అల్లాహ్ కు బాగా తెలుసు. అగోచరాల తాళం చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. వాటిని ఆయన తప్ప ఎవరూ ఎరుగరు. భూమిలోనూ , సముద్రంలోనూ ఉన్నదంతా ఆయనకు తెలుసు. చెట్టునుండి ఏ ఆకైనా ఆయనకు తెలియకుండా రాలదు. భూమిలోని చీకటి పొరలలో ఉన్న ఏ గింజైనా ఆయనకు తెలియకుండా లేదు. తడిగా ఉన్నదీ , పొడిగా ఉన్నదీ అంతా ఒక విపులమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది. ఆయనే రాత్రివేళ మీ ఆత్మలను వశపరచుకుంటాడు. పగటివేళ మీరు చేసేదంతా ఆయన తెలుసుకుంటాడు. మళ్ళీ రెండోరోజు ఆయన మిమ్మల్ని ఈ వ్యవహార ప్రపంచంలోకి తిరిగి పంపుతాడు , మీ నిర్ణీత జీవిత కాలం పూర్తికావటానికి. చివరకు మీరు ఆయన వైపునకే మరలిపోవాలి. అప్పుడు ఆయన మీకు మీరు చేస్తూ ఉన్నదంతా చూపుతాడు. తన దాసులపై ఆయనకు పూర్తి అధికారం ఉంది. మిమ్మల్ని కనిపెట్టి ఉండేవారిని నియమించి పంపుతాడు. చివరకు మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమైనప్పుడు , ఆయన పంపిన దూతలు అతని ప్రాణం తీసుకుంటారు. తమ కర్తవ్య నిర్వహణలో వారు ఏమాత్రం అజాగ్రత్త చూపరు. మళ్ళీ వారంతా తమ నిజమైన ప్రభువు, అల్లాహ్ సన్నిధికి మరలింపబడతారు. తెలుసుకోండి , తీర్పు చేసే సర్వాధికారాలు ఆయనకే ఉన్నాయి. లెక్కను తీసుకోవటంలో ఆయన వడిగలవాడు.''

**6. అల్ అన్ ఆమ్** 63 - 67 ప్రవక్తా! వారిని ఇలా అడుగు: ''భూసముద్రాల చీకట్లలోని ప్రమాదాల నుండి మిమ్మల్ని కాపాడేది ఎవరు ? మీరు (ఆపద సమయంలో) కడు దీనంగా విలపిస్తూ అతి గోప్యంగా వేడుకొనేది ఎవరిని ? ఈ ఉపద్రవం నుండి ఆయన గనక మమ్మల్ని రక్షిస్తే , మేము తప్పకుండా కృతజ్ఞులం అవుతాము అని మీరు అనేది ఎవరితో?'' - ఇలా అను : ''అల్లాహ్ మీకు దానినుండీ ప్రతి బాధనుండీ విముక్తి కలిగిస్తాడు. తరువాత మీరు ఇతరులను ఆయనకు భాగస్వాములుగా నిలబెడతారు.'' ఇలా చెప్పు : ''ఆయనకు ఈ శక్తి ఉంది - ఏదైనా శిక్షను పైనుండి మీపై అవతరింపచేయగలడు లేదా మీ పాదాల కింద నుండి తీసుకురాగలడు లేదా మిమ్మల్ని వర్గాలుగా విభజించి ఒక వర్గం బలాన్ని మరొక వర్గానికి రుచి చూపించగలడు. '' చూడండి! వారు బహుశా సత్యాన్ని గ్రహిస్తారని, మేము ఏవిధంగా మా సూచనలను మాటిమాటికీ రకరకాలుగా వారి ముందు పెడుతున్నామో! అది సత్యం అయినా , మీ జాతి దాన్ని తిరస్కరిస్తోంది. వారితో ఇలా చెప్పు : ''నేను మీ ప్రవర్తనకు బాధ్యుడనుగా నియమింపబడలేదు. ప్రతి వార్త నిజం కావడానికి ఒక గడువు అంటూ నిర్ణయమై ఉంది. త్వరలోనే స్వయంగా మీకే ఫలితమేమిటో తెలిసిపోతుంది.''

**6. అల్ అన్ ఆమ్** 68 - 70 ప్రవక్తా! ప్రజలు గనక మా ఆయతులలో తప్పులెన్నటాన్ని నీవు గమనిస్తే వారిమధ్య నుండి తొలగిపో, వారు ఈ ప్రస్తావనను వదలిపెట్టి మరో విషయాన్ని గురించి మాట్లాడటం మొదలుపెట్టేవరకు. ఒకవేళ నిన్ను షైతాను ఎప్పుడైనా ఏమరిపాటుకు గురిచేస్తే , నీవు ఈ పొరపాటును గ్రహించిన తరువాత , మళ్ళీ అటువంటి దుర్మార్గుల వద్ద కూర్చోవద్దు. వారి లెక్కలోని ఏ విషయానికీ భయభక్తులు కలవారు బాధ్యులు కారు. అయితే హితవు గరపటం వారి విధి. బహుశా వారు చెడునడతను మానుకుంటారేమో! తమ ధర్మాన్ని ఒక క్రీడగా, ఒక తమాషాగా భావించినవారిని ఇహలోక జీవితం మాయకు గురిచేసిన వారిని నీవు వదలిపెట్టు. కాని ఈ ఖురానును వినిపించి హితబోధ చెయ్యి. హెచ్చరిక చేస్తూ ఉండు. ఎందుకంటే , ఏ వ్యక్తీ తాను చేసిన చేష్టల దుష్ఫలితంలో చిక్కుకోకూడదు. ఆ చిక్కుకోవటం కూడా అల్లాహ్ నుండి రక్షింపగల సహాయకుడూ , రక్షకుడూ, ఇంకా సిఫారసు జేసేవాడూ ఎవడూ లేని స్థితిలో, ఇంకా అతడు సాధ్యమైన ప్రతిదానినీ పరిహారంగా ఇచ్చి విడుదల కావాలని కోరినా, అది కూడా అతడి నుండి స్వీకరించబడని స్థితిలో. ఎందుకంటే అటువంటివారు స్వయంగా తాము సంపాదించిన దాని ఫలితంగా పట్టుకోబడతారు. వారికి తమ సత్య నిరాకరణకు ప్రతిఫలంగా కాగే నీరు త్రాగటానికీ , వ్యధాభరితమైన శిక్ష అనుభవించటానికీ దొరుకుతాయి.

**6. అల్ అన్ ఆమ్** 71 - 73 ప్రవక్తా! వారిని ఇలా అడుగు : అల్లాహ్ను వదలిపెట్టి , మాకు లాభంకానీ, నష్టంకానీ కలిగించలేని వారిని మేము వేడుకోవాలా? అల్లాహ్ మాకు రుజుమార్గం చూపిన తరువాత మేము ముందుకువేసిన అడుగును వెనక్కి తిప్పుకోవాలా ? షైతానులు ఎడారిలో దారి తప్పించగా సహచరులు 'ఇటురా, సరైన మార్గం ఇక్కడుంది', అని పిలుస్తూ ఉన్నప్పటికీ గాభరాపడి కలవరపాటుతో తిరుగాడే వాని స్థితి మాదిరిగానే మేము మా స్థితిని కూడా చేసుకోవాలా ? వారితో ఇలా అను : ''వాస్తవానికి, నిజమైన మార్గదర్శకత్వం కేవలం అల్లాహ్ మార్గదర్శకత్వమే. ఆయన నుండి మాకు ఈ ఆజ్ఞ అందజేయ బడిరది : ''సృష్టి ప్రభువు ముందు విధేయతతో తలవంచండి. నమాజును స్థాపించండి. ఆయనపట్ల అవిధేయతకు దూరంగా ఉండండి. ఆయన వైపునకే మీరంతా తీసుకుపోబడతారు.'' ఆయనే ఆకాశాన్నీ భూమినీ సత్యం ఆధారంగా సృష్టించాడు. ఆయన ప్రళయాన్ని ''అయిపో'' అని ఆజ్ఞాపించే రోజునే అది సంభవిస్తుంది. ఆయన వాక్కు పూర్తిగా సత్యమైనది. శంఖం ఊదబడే రోజున విశ్వాధిపత్యం ఆయనదే. ఆయన గోచర అగోచర విషయాలు అన్నీ తెలిసిన జ్ఞాని అత్యంత వివేకి, సర్వసంవేది.

**6. అల్ అన్ ఆమ్** 74 -82 ఇబ్రాహీము గాధను జ్ఞాపకం తెచ్చుకో. అతను తన తండ్రి ఆజరుతో ఇలా అన్నాడు : ''ఏమిటీ నీవు విగ్రహాలను దేవుళ్ళుగా చేస్తున్నావా ? నేను నిన్నూ , నీ జాతివారినీ స్పష్టమైన అపమార్గంలో ఉన్నట్లుగా చూస్తున్నాను. '' ఇదేవిధంగా మేము ఇబ్రాహీముకు భూమ్యాకాశాల పాలనా వ్యవస్థను చూపించేవారము. ఎందుకు చూపేవారమంటే, అతను దృఢంగా విశ్వసించేవారిలో ఒకడు కావాలని. రాత్రి అతనిపై ఆవరించగానే అతను ఒక నక్షత్రాన్ని చూశాడు. అన్నాడు : ''ఇది నా ప్రభువు'' అని. కాని అది అస్తమించగానే అతను ''అస్తమించేవాటిని నేను ప్రేమించను'' అని అన్నాడు. చంద్రుడు ప్రకాశిస్తూ కనిపించగానే అతను, ''ఇదీ నా

ప్రభువు'' అని అన్నాడు. కాని అదీ అస్తమించగానే ''నా ప్రభువు గనక నాకు మార్గమే చూపి ఉండకపోతే , నేనూ మార్గభ్రష్టులలో కలసిపోయి ఉండేవాణ్ణే '' అని అన్నాడు. తరువాత అతను సూర్యుణ్ణి ప్రకాశిస్తూ ఉండగా చూసి , ''అసలు ఇదీ నా ప్రభువు! ఇది అన్నిటికంటే పెద్దది '' అని పలికాడు. కాని అది కూడా అస్తమించగానే ఇబ్రాహీము ఎలుగెత్తి ఇలా ప్రకటించాడు: ''నా జాతి సోదరులారా! మీరు దైవానికి భాగస్వాములుగా నిలబెట్టే వాటన్నింటి తోనూ నాకు ఏవిధమైన సంబంధం లేదు. నేను ఏకాగ్రతతో నా ముఖాన్ని భూమ్యాకాశాలను సృష్టించిన శక్తివైపునకు త్రిప్పుకున్నాను. నేను 'షిర్క్'కు ఒడిగట్టే వారిలోని వాణ్ణి ఎంతమాత్రం కాను. '' అతని జాతివారు అతనితో వాదులాటకు దిగగా అతను వారితో ఇలా అన్నాడు : ''మీరు అల్లాహ్ విషయంలో నాతో కలహిస్తున్నారా ? వాస్తవానికి ఆయన నాకు రుజుమార్గం చూపించాడు. మీరు నిలబెట్టిన భాగస్వాములకు నేను భయపడను. అయితే నా ప్రభువు ఏదైనా కోరితే అది తప్పకుండా జరగవచ్చు. నా ప్రభువు జ్ఞానం ప్రతిదానినీ ఆవరించి ఉన్నది. మీరు స్పృహలోకి రారా? నేను అసలు మీరు నిలబెట్టే భాగస్వాములకు ఎందుకు భయపడాలి ? వాటి విషయంలో అల్లాహ్ మీపై ఏ ప్రమాణాన్నీ అవతరింప చేయనప్పటికీ వాటిని మీరు ఆయనతో పాటు దైవత్వంలో భాగస్వాములుగా చేస్తూ భయపడనప్పుడు? మన ఉభయ పక్షాలలో ఎవరు నిర్భయత్వానికీ, ప్రశాంతతకూ ఎక్కువ అర్హులో మీకేమైనా తెలిస్తే చెప్పండి ? వాస్తవానికి విశ్వసించిన వారికే , తమ విశ్వాసాన్ని దుర్మార్గంతో కలుషితం చేయనివారికే శాంతి, వారు మాత్రమే రుజుమార్గంపై ఉన్నారు.

**6. అల్ అన్ ఆమ్** 83 ఇదీ మా తర్కము. దానినే మేము ఇబ్రాహీముకు , తన జాతికి వ్యతిరేకంగా ప్రసాదించాము. మేము కోరినవారికీ ఉన్నత స్థానాలను ప్రసాదిస్తాము. సత్యం ఏమిటంటే నీ ప్రభువు వివేకవంతుడు , అన్నీ తెలిసినవాడు.

**6. అల్ అన్ ఆమ్** 84 - 90 మేము తరువాత ఇబ్రాహీముకు , ఇస్హాఖ్, యాఖూబ్ వంటి సంతానాన్ని ప్రసాదించాము. ప్రతి ఒక్కరికి మేము రుజుమార్గం చూపించాము. (ఈ రుజుమార్గాన్నే ) వారికి పూర్వం నూహ్‌కు చూపాము. ఇంకా అతని సంతతి లోనివారైన దావూదు , సులైమాన్, అయ్యూబ్, యూసుఫ్, మూసా హారూన్‌లకు మేము (సన్మార్గం చూపించాము). ఈ విధంగా మేము సజ్జనులకు వారు చేసిన సత్కార్యానికి ప్రతిఫలం ఇస్తాము. (అతని సంతతికి చెందిన) జకరియ్యా , యహ్యా, ఈసా ఇల్యాస్ లకు (మార్గం చూపాము). వారిలో ప్రతి ఒక్కడూ సజ్జనుడే. (ఇంకా ఆయన కుటుంబానికే చెందిన) ఇస్మాయీలు , అల్‌యస్అ, యూనుస్, లూత్‌లకు (సన్మార్గం చూపాము). వారిలో ప్రతి ఒక్కరికీ మేము భూలోక వాసులందరిపై ఘనతను ప్రసాదించాము. ఇంకా వారి తాత ముత్తాతలనూ వారి సంతానాన్నీ వారి తోబుట్టువులలో చాలా మందినీ మేము అనుగ్రహించాము. వారిని మా సేవకొరకు ఎన్నుకున్నాము. వారికి రుజుమార్గం వైపునకు దారి చూపాము. ఇది అల్లాహ్ మార్గదర్శకత్వం. దానిద్వారా ఆయన తన దాసులలో తాను కోరిన వారికి మార్గం చూపుతాడు. కాని వారు ఒకవేళ షిర్క్ చేసి ఉండినట్లయితే, వారు చేసిన సమస్తం నాశనం అయివుండేదే. మేము గ్రంథాన్నీ , ఆజ్ఞనూ, ప్రవక్త పదవినీ

ప్రసాదించిన వారు వీరే. ఒకవేళ వారు దానిని విశ్వసించటానికి తిరస్కరిస్తే (ఫర్వాలేదు) మేము ఈ అనుగ్రహాన్ని వేరే ప్రజలకు అప్పగించాము. వారు దానిని తిరస్కరించేవారు కారు. ప్రవక్తా! వారే అల్లాహ్ తరఫు నుండి మార్గదర్శకత్వం పొందినవారు. వారి మార్గాన్నే నీవు అనుసరించు. ప్రకటించు : ''నేను ఈ (ధర్మంయొక్క ప్రచార, ప్రబోధ) కార్యానికిగాను మీనుండి ఏ ప్రతిఫలాన్నీ ఆశించటం లేదు. ఇది ఒక హితబోధ , సమస్త భూప్రజ కొరకు'' అని.

**6. అల్ అన్ ఆమ్** 91 - 94 ''అల్లాహ్ ఏ మానవుడిపైనా దేనినీ అవతరింపచెయ్యలేదు '' అని పలికి ఈ ప్రజలు అల్లాహ్ను గురించి చాలా తప్పుడుగా అంచనావేశారు. వారిని అడుగు : ''అయితే మూసా తెచ్చిన గ్రంథం - అది సమస్త మానవజాతికి జ్యోతి , మార్గదర్శకత్వం, దానిని మీరు ముక్కలు ముక్కలుగా చేసి ఉంచుతారు , కొంతభాగాన్ని చూపిస్తారు , ఎక్కువ భాగాన్ని దాస్తారు , దాని ద్వారా మీకూ , మీ తాత ముత్తాతలకూ లేని జ్ఞానసంపద మీకు ఇవ్వబడిరది , అసలు దాన్ని అవతరింపజేసిన వాడెవడు ? ఆయన ''అల్లాహ్'' అని మాత్రం చెప్పండి. ఆపై వారిని తమ కుతర్కాలతో ఆడుకోవటానికి వదిలెయ్యండి. (ఆ గ్రంథం మాదిరిగా) ఇది కూడా మేము అవతరింపజేసిన ఒక గ్రంథం. అది ఎనలేని శుభాలు , మేళ్ళు కలది. తనకు పూర్వం వచ్చిన దానిని ధ్రువీకరిస్తుంది. దాని ద్వారా నీవు ఈ పురముల కేంద్రం (అంటే మక్కా) లోనూ దాని చుట్టుపట్లా ఉండేవారినీ హెచ్చరిక చెయ్యటానికి అది అవతరింపచెయ్యబడిరది. పరలోకాన్ని నమ్మేవారు ఈ గ్రంథాన్ని విశ్వసిస్తారు. వారు తమ నమాజులను నియమం తప్పకుండా చేస్తారు. అబద్ధపు అపనిందను సృష్టించి అల్లాహ్ పై మోపే వాడికంటే , తనపై ఏ వహీ అవతరించకపోయినప్పటికీ ''నాపై వహీ అవతరించింది '' అని చెప్పేవాడి కంటే లేదా అల్లాహ్ అవతరింపచేసినటువంటి విషయాలనే ''నేను కూడా అవతరింపచేసి చూపిస్తాను '' అని పలికేవాడికంటే మించిన దుర్మార్గుడు ఎవడు? ఈ దుర్మార్గులు మరణవేదనలో మునిగి తేలుతూ ఉండగా , దైవదూతలు తమ హస్తాలను చాచి ''ఇటు తెండి! బయటకు తీయండి మీ ప్రాణాలను , అల్లాహ్ పై అపనిందను మోపి అన్యాయంగా కూసిన కూతలకూ, ఆయన ఆయతుల పట్ల తలబిరుసుతనం ప్రదర్శించినందుకూ ఫలితంగా ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడు తుంది '' అని అంటూ ఉండగా ఆ దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుంటుంది! (అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు): ''మేము మొదటిసారి మిమ్మల్ని ఒంటరిగా సృష్టించినట్లే ఇప్పుడు ఇదిగో మీరు ఒంటరిగా మాముందు హాజరయ్యారు. మేము ప్రపంచంలో మీకు ఇచ్చినదంతా , మీరు అక్కడే వదలిపెట్టి వచ్చారు. ఇప్పుడు మీ వెంట మీ పనులు నెరవేరడంలో కొంత పాత్ర ఉందని మీరు భావించిన మీ సిఫారసుదారులను కూడా మేము చూడటం లేదు. ఇప్పుడు మీ మధ్య సంబంధాలు అన్నీ తెగిపోయాయి. ఎవరిని గురించి మీరు గర్వపడేవారో వారందరూ మీకు కనుమరుగై పోయారు.''

**6. అల్ అన్ ఆమ్** 95 - 103 విత్తనాన్నీ , టెంకనూ చీల్చేవాడు అల్లాహ్. ఆయనే సజీవమైన దానిని నిర్జీవమైన దానినుండి తీస్తాడు. ఇంకా నిర్జీవమైనదానిని సజీవమైనదానినుండి విసర్జింపచేసేవాడూ ఆయనే. ఈ పనులన్నీ

చేసేవాడు అల్లాహ్యే. అటువంటప్పుడు మీరు మార్గంతప్పి ఎటు కొట్టుకుపోతున్నారు ? రాత్రి తెరను చీల్చి ఆయనే ప్రభాతాన్ని వెలికితీస్తాడు. ఆయనే రాత్రిని ప్రశాంతి సమయంగా చేశాడు. ఆయనే సూర్యచంద్రుల ఉదయాస్తమయాల కాలాలను నిర్ణయించాడు. ఇవన్నీ ఆ అపూర్వ శక్తిమంతుడు , జ్ఞాన సంపన్నుడు చేసిన నిర్ణయాలే. ఆయనే నక్షత్రాలను మీ కొరకు ఎడారి చీకటిలో , సముద్రపు చీకట్లలో మార్గాన్ని తెలుసుకునే సాధనంగా చేశాడు. చూడండి, మేము జ్ఞానవంతుల కొరకు సూచనలను విశదీకరించాము. ఆయనే మిమ్మల్ని ఒకే ప్రాణినుండి పుట్టించాడు. ఇంకా ప్రతి ఒక్కరికీ ఒక నివాస స్థలం ఉంది. అప్పగించబడే ఒక స్థలం ఉంది. విజ్ఞత ఉన్నవారి కొరకు మేము ఈ సూచనలను స్పష్టపరిచాము. ఆయనే ఆకాశం నుండి వర్షాన్ని కురిపించాడు. దానిద్వారా సకల వృక్ష జాతులను ఉద్భవింపజేశాడు. ఇంకా పచ్చని పొలాలనూ పచ్చని చెట్లనూ సృష్టించాడు. ఒకదానిపై ఒకటి ఒత్తుగా పెరిగిన గింజలను పండిరచాడు. ఖర్జూరపు పువ్వుల నుండి బరువుతో వంగిన పండ్ల గుత్తులను సృజించాడు. ఇంకా ద్రాక్ష , జైతూను, దానిమ్మ తోటలను సృష్టించాడు. వాటి పండ్లు ఒకదానినొకటి పోలివుండినప్పటికీ ప్రతిదాని ప్రత్యేకతలు వేర్వేరుగా కూడా ఉంటాయి. ఈ వృక్షాలు పంటకు వచ్చినప్పుడు , వాటికి పండ్లు కాయటం, అవి పండటం - ఈ స్థితిని మీరు కొంచెం ఆలోచనా దృష్టితో గమనించండి. విశ్వసించే వారికి వీటిలో సూచనలు ఉన్నాయి. అయినా ప్రజలు జిన్నాతులను అల్లాహ్ కు భాగస్వాములుగా నిలబెట్టారు. వాస్తవానికి ఆయన వాటి సృష్టికర్త. తెలియకపోయినా వారు ఆయనకు కొడుకులను , కూతుళ్లను కల్పించారు. యథార్థానికి ఆయన అత్యంత పరిశుద్ధుడు , వారు చెప్పే ఈ మాటలకు అతీతుడు. ఆయన ఆకాశాలను , భూమినీ ప్రభవింపజేసినవాడు. ఆయనకు ఒక జీవిత సహచరి అంటూ లేనప్పుడు ఆయనకు కొడుకు ఎలా ఉంటాడు ? ఆయన ప్రతి వస్తువును పుట్టించాడు. ఆయనకు ప్రతి వస్తువును గురించీ తెలుసు. ఆయనే అల్లాహ్. మీ ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయన సర్వానికీ సృష్టికర్త. కనుక మీరు ఆయననే ఆరాధించండి. ఆయన ప్రతిదానికీ సంరక్షకుడు. చూపులు ఆయనను అందుకోలేవు. ఆయన చూపులను అందుకుంటాడు. ఆయన సూక్ష్మద్రష్ట, సర్వజ్ఞాని.

**6. అల్ అన్ ఆమ్** 104 చూడండి! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి వివేచనా కాంతులు వచ్చేశాయి. కనుక ఇక దృష్టిని వినియోగించుకునే వ్యక్తి తనకు తానే మేలు చేసుకుంటాడు. మరి గ్రుడ్డిగా వ్యవహరించే వ్యక్తి తానే నష్టపోతాడు. నేను మాత్రం మీకు కావలివాణ్ణి కాను.

**6. అల్ అన్ ఆమ్** 105 - 108 ఈవిధంగా మేము మా ఆయతులను మాటిమాటికీ విభిన్నరీతులలో వివరిస్తూ ఉంటాము. ఎందుకిలా చేస్తామంటే, ఈ ప్రజలు, ''నీవు ఎవరివద్దనో పాఠాలు నేర్చుకుని వచ్చావు '' అని అనాలని, ఇంకా మేము విజ్ఞులైన వారికి యథార్థాన్ని విశదపరచాలని. ప్రవక్తా! నీపై నీ ప్రభువు తరఫు నుండి అవతరించిన 'వహీ'ని అనుసరిస్తూ ఉండు. ఎందుకంటే, ఆ ప్రభువు ఒక్కడు తప్ప మరొక దేవుడు లేనేలేడు. ఈ ముష్రిక్కులను పట్టించుకోకు. అల్లాహ్ సంకల్పించి ఉన్నట్లయితే, (స్వయంగా ఆయనే ఏ ఏర్పాటుచేసి ఉండేవాడంటే) వారు షిర్కు

చేసేవారు కాదు. మేము నిన్ను వారికి కావలివానిగా నియమించనూ లేదు , నీవు వారికి బాధ్యుడవూ కావు. (ముస్లిములారా!) వారు అల్లాహ్ను కాదని వేడుకునే ఇతరులను దూషించకండి. ఎందుకంటే , వారు షిర్కుకంటే ఇంకా ముందుకుపోయి అజ్ఞానంచేత అల్లాహ్ను దూషిస్తారేమో. ఈ విధంగానే మేము ప్రతి వర్గం వారికి వారు చేసే పనులు ఆకర్షకంగా ఉండేలా చేశాము. వారు తరువాత తమ ప్రభువు వైపునకే మరలి రావలసి ఉంది. అప్పుడు ఆయన వారికి తెలుపుతాడు, వారు ఏమేమి చేస్తూ ఉండేవారో.

**6. అల్ అన్ ఆమ్** 109 - 115 ఈ ప్రజలు గట్టి ప్రమాణాలు చేస్తూ ఇలా అంటారు : ''మా ముందుకు ఏదైనా సూచన (అంటే ఒక అద్భుతం) వస్తే , మేము దానిని తప్పక విశ్వసిస్తాము. '' ప్రవక్తా! వారికి చెప్పు : ''సూచనలు అల్లాహ్ వశంలోనే ఉన్నాయి'' అని. ఒకవేళ సూచనలు వచ్చినా, వారు విశ్వసించేవారు కారు అని నీకు ఎలా బోధపరచాలి? మొట్టమొదట వారు దానిని (ఈ గ్రంథాన్ని ) విశ్వసించనివిధంగానే మేము వారి హృదయాలను , వారి చూపులను ఇప్పుడు మళ్ళిస్తున్నాము, మేము వారిని తమ తలబిరుసుతనంలోనే దారితప్పి తిరిగేలా వదలివేస్తాము. మేము వారిపై దైవదూతలను సైతం అవతరింపజేసినా , మరణించినవారు వారితో మాట్లాడినా , మేము వారి కళ్ళముందు ప్రపంచంలోని వస్తువులు ఎన్నింటిని ప్రోగుజేసి పెట్టినా , అప్పుడుకూడా వారు విశ్వసించేవారు కాదు , (వారు విశ్వసించాలని) అల్లాహ్ సంకల్పిస్తే తప్ప. కాని వారిలో చాలామంది అజ్ఞానపు మాటలు పలుకుతారు. మేము ఇదేవిధంగా ఎల్లప్పుడూ మానవ షైతానులను జిన్నాతు షైతానులను ప్రతి ప్రవక్తకు శత్రువులుగా చేశాము. ప్రజలను వంచించే నిమిత్తం వారు సొంపైన మాటలను పరస్పరం ప్రేరేపించుకుంటారు. వారు ఈ విధంగా చెయ్యకూడదని నీ ప్రభువు సంకల్పమేఅయితే , వారు ఎన్నటికీ అలా చెయ్యరు. కనుక వారిని వారి మానాన వదలిపెట్టు, అబద్ధపు నిందారోపణలు చేయటానికి. (మేము వారిని ఇదంతా ఎందుకు చెయ్యనిస్తున్నామంటే) పరలోకాన్ని విశ్వసించని వారి హృదయాలు ఆ (అందమైన మోసం) వైపునకు మొగ్గాలని , వారు అదంటే ఇష్టపడాలని, వారు తాము ఆర్జించుకోదలచిన చెడులను ఆర్జించుకోవాలని - పరిస్థితి ఇదైనప్పుడు నేను అల్లాహ్ను కాదని తీర్పు చెప్పే మరొకడికోసం అన్వేషించాలా , వాస్తవానికి ఆయన పూర్తి వివరాలతో మీ వద్దకు గ్రంథాన్ని పంపినప్పుడు? మేము (నీకు పూర్వం) గ్రంథం ఇచ్చిన వారికి తెలుసు , ఈ గ్రంథం నీ ప్రభువు తరఫునుండే సత్యం ఆధారంగా అవతరించిందని. కనుక నీవు శంకించేవారిలో చేరిపోకు. సత్యం రీత్యా న్యాయం రీత్యా నీ ప్రభువు వాక్కు పరిపూర్ణమైనది. ఆయన ఆదేశాలను మార్చేవాడు ఎవడూ లేడు. ఆయన అన్నీ వింటాడు. ఆయనకు అంతా తెలుసు.

**6. అల్ అన్ ఆమ్** 116 - 117 ప్రవక్తా! ఒకవేళ పుడమిపై నివసించే ప్రజలలో అధికసంఖ్యాకులు చెప్పినట్లుగా నీవు నడిస్తే, వారు నిన్ను అల్లాహ్ మార్గం నుండి తొలగిస్తారు. వారు కేవలం అంచనాలను అనుసరిస్తారు , ఊహాకల్పనలుచేస్తారు, వాస్తవానికి నీ ప్రభువుకే బాగా తెలుసు , ఎవరు ఆయన మార్గం నుండి వైదొలగి ఉన్నారో , ఎవరు రుజుమార్గంపై ఉన్నారో.

**6. అల్ అన్ ఆమ్** 118 - 121 ఇక మీకు అల్లాహ్ ఆయతులపై విశ్వాసమే ఉంటే , అల్లాహ్ నామం స్మరించబడిన పశువు మాంసం తినండి. అల్లాహ్ పేరు స్మరించబడిన వస్తువును మీరు తినకపోవటానికి అసలు కారణం ఏమిటి? వాస్తవానికి గత్యంతరం లేని సంకట పరిస్థితులలో తప్ప , మిగతా అన్ని పరిస్థితులలోనూ అల్లాహ్ ఏ వస్తువుల వినియోగాన్ని నిషేధించాడో, వాటి వివరాలను మీకు ఆయన ఇదివరకే తెలియజేశాడు. చాలామంది ప్రజలు జ్ఞానం లేకపోయినా కేవలం తమ కోరికలకు లోనయి అపమార్గం పట్టించే విషయాలను మాట్లాడుతూ ఉంటారు. ఈ హద్దులు మీరే వారిని నీ ప్రభువు బాగా ఎరుగును. మీరు బహిరంగ పాపాలకూ దూరంగా ఉండండి. రహస్య పాపాలకూ దూరంగా ఉండండి. పాపాలను సంపాదించుకునే వారు తమ ఈ సంపాదనకు ప్రతిఫలం పొందితీరుతారు. అల్లాహ్ పేరుతో 'జిబహ్' చెయ్యబడని జంతువు మాంసం తినకండి. అలా చెయ్యటం పాపం. మీతో కయ్యానికి దిగటానికిగాను షైతానులు తమ సహచరుల మనస్సులలో అనుమానాలను , అభ్యంతరాలను ప్రేరేపిస్తారు. కాని ఒకవేళ మీరు వారిపట్ల విధేయత చూపటానికి అంగీకరిస్తే నిశ్చయంగా మీరూ ముష్రిక్కులే.

**6. అల్ అన్ ఆమ్** 122 - 123 మొదట మృతుడై, మేము ప్రాణంపోసి జ్యోతిని ప్రసాదించగా, దాని వెలుగులో ప్రజల మధ్య జీవన యాత్ర కొనసాగించే వ్యక్తీ , చీకట్లలో కూరుకుపోయి వాటి నుండి ఏవిధంగానూ బయటకు రాలేని వ్యక్తీ ఒకటే అవుతారా? ఇదేవిధంగా అవిశ్వాసులకు వారి పనులు మనోహరమైనవిగా చెయ్యబడ్డాయి. ఇంకా ఇదేవిధంగా మేము ప్రతి పట్టణంలోనూ దానిలో ఉన్న పెద్ద పెద్ద నేరస్తులను అక్కడ తమ కుతంత్రాలు , వంచనలు అనే వలను పరచటానికి నియమించాము. వాస్తవానికి వారు తమ కుతంత్రాల వలలో తామే ఇరుక్కుంటారు. కాని వారికి దాని స్పృహలేదు.

**6. అల్ అన్ ఆమ్** 124 వారి ముందుకు ఏదైనా ఆయత్ వచ్చినప్పుడు వారు , ''అల్లాహ్ ప్రవక్తలకు ఇవ్వబడిరదే, స్వయంగా మాకూ ఇవ్వబడనంతవరకు , మేము విశ్వసించము '' అని అంటారు. తన సందేశాన్ని ఎవరిద్వారా ప్రచారం చేయించాలో ఎలా చేయించాలో అల్లాహ్కు బాగా తెలుసు. ఈ దోషులు తమ కుతంత్రాలకు పర్యవసానంగా అల్లాహ్ వద్ద తీవ్రపరాభవమూ, కఠినశిక్షా అనుభవించే సమయం సమీపంలోనే ఉంది.

**6. అల్ అన్ ఆమ్** 125 - 127 కనుక (యథార్థం ఇది) అల్లాహ్ తాను సన్మార్గం చూపదలచిన వ్యక్తి హృదయాన్ని ఇస్లామ్ కొరకు తెరుస్తాడు. తాను అపమార్గం పాలు చెయ్యదలచిన వ్యక్తి హృదయాన్ని సంకుచితం చేసి ఇక దానిని ఎంతగా అదుముతాడంటే (ఇస్లామ్ భావన రాగానే) అతనికి తన ఆత్మ ఆకాశానికి ఎగిరిపోతూ ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ విధంగా అల్లాహ్ (సత్యం నుండి పారిపోయే , సత్యాన్ని ద్వేషించే మనస్తత్వం అనే) మాలిన్యాన్ని అవిశ్వాసులపై రుద్దుతాడు. వాస్తవానికి ఈ మార్గం నీ ప్రభువు యొక్క రుజుమార్గం. దాని చిహ్నాలు హితబోధను స్వీకరించే వారికొరకు స్పష్టం చెయ్యబడ్డాయి. వారు అవలంబించిన సరియైన ప్రవర్తన కారణంగా వారి ప్రభువు వద్ద వారికొరకు శాంతి నిలయం ఉంది. ఆయన వారికి సంరక్షకుడుగా ఉంటాడు.

**6. అల్ అన్ ఆమ్** 128 - 131 అల్లాహ్ వారందరినీ చుట్టుముట్టి సమావేశపరచే రోజున జిన్నాతులను (అంటే జిన్నాతులలోని షైతానులను) సంబోధిస్తూ ఇలా అంటాడు : ''జిన్నాతు వర్గీయులారా! మీరు మానవ జాతిని పూర్తిగా వాడుకున్నారు. '' మానవులలోని వారి మిత్రులు ఇలా విన్నవించుకుంటారు : ''ప్రభూ! మేమంతా ఒకరినొకరము బాగా వాడుకున్నాము. నీవు మా కొరకు నిర్ణయించిన సమయానికి మేము ఇప్పుడు చేరుకున్నాము.'' అల్లాహ్ అంటాడు: ''సరే! ఇక అగ్నియే మీ నివాసం. అందులో మీరు కలకాలం ఉంటారు. '' కేవలం అల్లాహ్ రక్షించదలచిన వారే దానినుండి సురక్షితంగా ఉంటారు. నిస్సందేహంగా నీ ప్రభువు వివేకవంతుడు, జ్ఞానవంతుడూను. చూడండి! ఈవిధంగా మేము (పరలోకంలో) దుర్మార్గులను ఒకరికొకరు సహచరులుగా చేస్తాము, వారు (ప్రపంచంలో ఒకరితో ఒకరు కలసి) సంపాదించిన సంపాదనకు కారణంగా. (ఈ తరుణంలో అల్లాహ్ వారిని ఇదీ అడుగుతాడు): ''జిన్నాతులారా! మానవులారా! మా ఆయతులను మీకు వినిపించే ఈనాటి ఫలితాన్ని గురించి హెచ్చరించే ప్రవక్తలు మీ వద్దకు స్వయంగా మీనుండే రాలేదా?'' వారు ఇలా అంటారు : ''అవును వచ్చారు. మాకు వ్యతిరేకంగా స్వయంగా మేమే సాక్ష్యమిస్తున్నాము. '' ఈనాడు ప్రాపంచిక జీవితం వారిని మోసానికి గురిచేసింది. కాని ఆనాడు తాము అవిశ్వాసులమని స్వయంగా వారే తమకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తారు. ప్రజలు యథార్థమేమిటో తెలియని స్థితిలో ఉన్నప్పుడు నీ ప్రభువు వారి పట్టణాలను అన్యాయంగా నాశనం చెయ్యడు. (ఈ విషయాన్ని నిరూపించటానికే వారిచే ఈవిధంగా సాక్ష్యం చెప్పించటం జరుగుతుంది).

**6. అల్ అన్ ఆమ్** 132 - 135 ప్రతి వ్యక్తి స్థానం అతడు చేసే పనులకు అనుగుణంగా ఉంటుంది. నీ ప్రభువు ప్రజల పనులు ఎరుగని వాడు కాడు. నీ ప్రభువు ఏ అక్కరా లేనివాడు. కనికరించటం ఆయన స్వభావం. ఒకవేళ ఆయన అభిలషిస్తే, మిమ్మల్ని తొలగించి, మీ స్థానంలో తాను కోరిన వేరే ప్రజలను తీసుకువస్తాడు , ఆయన మిమ్మల్ని వేరే ప్రజల సంతతి నుండి ఉద్భవింపజేసినవిధంగా. మీకు వాగ్దానం చెయ్యబడుతూ ఉన్న విషయం తప్పకుండా వస్తుంది. దేవుణ్ణి అశక్తుడుగా చేసే శక్తి మీకు లేదు. ప్రవక్తా! ఇలా అను: ''ప్రజలారా! మీరు చేసేపని మీరు చేస్తూ ఉండండి. నేను కూడా నా పనిచేస్తూ ఉన్నాను. ఫలితం ఎవరి విషయంలో మేలైనదిగా ఉంటుందో త్వరలోనే మీకు తెలిసి పోతుంది.'' ఏమైనప్పటికీ దుర్మార్గులు సాఫల్యం పొందలేరు అనేది వాస్తవం.

**6. అల్ అన్ ఆమ్** 136 అల్లాహ్ కొరకు ఈ ప్రజలు స్వయంగా ఆయనే సృష్టించిన పొలాల నుండీ పశువుల నుండీ ఒక భాగాన్ని కేటాయించారు. ఇది అల్లాహ్ కొరకు , ఇది మేము నిలబెట్టిన భాగస్వాముల కొరకు అని స్వయంగా తామే తీర్మానించుకుని అంటారు. వారు నిలబెట్టిన భాగస్వాములకు చెందే భాగం అల్లాహ్ కు ఎలాగూ చేరదు. కాని అల్లాహ్ కు చెందేది మాత్రం వారు నిలబెట్టిన భాగస్వాములకు చేరిపోతుంది. ఎలాంటి తప్పుడు నిర్ణయాలు చేస్తారు ఈ ప్రజలు!

**6. అల్ అన్ ఆమ్** 137 ఇదేవిధంగా చాలామంది ముష్రిక్కులకు తమ సంతాన హత్యను , వారు నిలబెట్టిన భాగస్వాములు సరైనదిగా కనిపించేలా చేశారు , వారిని వినాశానికి గురిచెయ్యటానికి , వారికి వారి ధర్మం సంశయాస్పద మైనదిగా చెయ్యటానికి. అల్లాహ్ సంకల్పించి ఉన్నట్లయితే , వారు ఆవిధంగా చేసి ఉండేవారు కాదు. కనుక వారిని తమ తప్పుడు నిందారోపణలు చేసుకోవటానికి వదిలిపెట్టండి.

**6. అల్ అన్ ఆమ్** 138 ఇలా అంటారు : ''ఈ జంతువులు, ఈ పొలాలు ప్రత్యేకించబడ్డాయి. మేము తినిపించదలచిన వారే వీటిని తినగలుగుతారు.'' వాస్తవానికి ఈ కట్టుబాటు వారు స్వయంగా కల్పించుకున్నదే. ఇంకా వారు కొన్ని జంతువులపై స్వారీ చెయ్యటాన్ని , వాటిచే బరువు లాగించటాన్ని నిషేధించారు. మరికొన్ని జంతువులపై వారు అల్లాహ్ నామాన్ని ఉచ్చరించరు. ఇవన్నీ వారు అల్లాహ్ కు అంటగట్టిన అబద్ధాలు. త్వరలోనే అల్లాహ్ ఈ తప్పుడు ఆరోపణలకు వారికి ప్రతిఫలం ఇస్తాడు.

**6. అల్ అన్ ఆమ్** 139 ఇంకా ఇలా అంటారు : ''ఈ జంతువుల గర్భంలో ఉన్నది మా పురుషులకు ప్రత్యేకం , మా స్త్రీలకు నిషిద్ధం. కాని అది మరణించినదైతే ఉభయులూ కలసి దానిని తినవచ్చు. '' వారు కల్పించిన ఈ మాటలకు అల్లాహ్ వారికి ప్రతిఫలం ఇచ్చి తీరుతాడు. నిశ్చయంగా ఆయన వివేకవంతుడు. ఆయనకు అన్ని విషయాలూ తెలుసు.

**6. అల్ అన్ ఆమ్** 140 అజ్ఞానం వల్ల , మూర్ఖత్వం వల్ల తమ సంతానాన్ని హత్యచేసినవారూ , అల్లాహ్ ఇచ్చిన ఉపాధిని అల్లాహ్ పై అబద్ధాలు మోపి నిషేధించుకున్నవారూ నిశ్చయంగా నష్టానికి గురిఅయ్యారు. నిశ్చయంగా వారు మార్గం తప్పారు. ఎన్నటికీ రుజుమార్గం పొందేవారు కారు.

**6. అల్ అన్ ఆమ్** 141 - 144 అల్లాహ్యే నిటారు చెట్లుగల పలురకాల తోటలనూ , ద్రాక్షతోటలనూ, ఖర్జూరపు తోటలనూ సృష్టించాడు. పొలాలను పండిరచాడు. వాటిద్వారా రకరకాల ఆహార పదార్థాలు లభిస్తాయి. జైతూను చెట్లనూ దానిమ్మ చెట్లనూ ఉద్భవింపజేశాడు. వాటి పండ్లు రూపంలో ఒకటే. కాని వాటి రుచి వేరు. అవి పండినప్పుడు వాటి పంటను తినండి. వాటి పంటనుకోసేటప్పుడు మీపై ఉన్న అల్లాహ్ హక్కును చెల్లించండి. హద్దులు మీరకండి. హద్దులు మీరే వారిని అల్లాహ్ ప్రేమించడు. ఇంకా , ఆయనే పశువులలో స్వారీ చెయ్యటానికి , బరువు మొయ్యటానికి , తినటానికి, పరచుకోవటానికి కూడా వినియోగపడే జంతువులను సృష్టించాడు. అల్లాహ్ మీకు ప్రసాదించిన వాటిని తినండి. షైతానును అనుసరించకండి. వాడు మీకు బహిరంగ శత్రువు. ఇవి , మగవీ ఆడవీ కలసి ఎనిమిది. రెండు గొర్రె జాతినుండి , మరొక రెండు మేక జాతి నుండి. ప్రవక్తా! వారిని ఇలా అడుగు : అల్లాహ్ నిషేధించింది మగ జంతువులనా లేక ఆడజంతువులనా లేక ఆ గొర్రెల గర్భాలలో, మేకల గర్భాలలో ఉన్న పిల్ల జంతువులనా? మీరు సత్యవంతులే అయితే నాకు సరియైన జ్ఞానంతో తెలుపండి. ఇదేవిధంగా రెండు ఒంటె జాతిలోనివి, మరొక రెండు ఆవుజాతిలోనివి. అడుగు వారిని : వీటిలో అల్లాహ్ నిషేధించినవి మగపశువులా లేక

ఆడపశువులా లేక ఒంటెల , ఆవుల గర్భాలలో ఉన్న పిల్ల పశువులా ? వీటిని నిషేధిస్తూ అల్లాహ్ ఆజ్ఞలు ఇచ్చే సమయంలో మీరు ఉన్నారా? జ్ఞానం లేకుండా ప్రజలను పెడమార్గం పట్టించే నిమిత్తం అబద్ధాన్ని కల్పించి దానిని అల్లాహ్ కు ఆపాదించే వ్యక్తికంటే మించిన దుర్మార్గుడెవడు ? నిశ్చయంగా అల్లాహ్ అటువంటి దుర్మార్గులకు రుజుమార్గం చూపడు.

**6. అల్ అన్ ఆమ్** 145 - 147 ప్రవక్తా! వారితో ఇలా అను: నా వద్దకు వచ్చిన వహీలో , తినేవాడికొరకు ఏ వస్తువూ నిషేధించబడినట్లు నాకు కనిపించదు, చచ్చిన జంతువు, కారిన రక్తము, పంది మాంసము, ఇది అపరిశుద్ధం గనక, లేక ఫిస్ఖ్ (అపచారం)అంటే, అల్లాహ్ పేరుతోకాక వేరేవారి పేరుతో జిబహ్ చెయ్యబడినది (మొదలైనవి) తప్ప. కాని ఎవరైనా గత్యంతరం లేని పరిస్థితులలో (వీటిలో దేన్నయినా తింటే) , అవిధేయతకు ఒడిగట్టే ఉద్దేశం లేకుండా , ఆవశ్యకత హద్దును మీరకుండా ఉంటే , నిశ్చయంగా నీ ప్రభువు మన్నిస్తాడు , కరుణిస్తాడు. యూదుమతం అవలంబించిన వారికి మేము గోళ్ళు ఉన్న అన్ని జంతువులనూ నిషేధించాము. ఆవు , మేకల కొవ్వును కూడా , వాటి వీపునకూ లేక ప్రేగులకూ లేక ఎముకలకూ అంటివున్నది తప్ప. ఇది మేము వారి తలబిరుసుతనానికిగాను వారికి విధించిన శిక్ష. మేము చెప్పేదంతా పూర్తిగా నిజం. ఇక, ఒకవేళ వారు నిన్ను తిరస్కరిస్తే, నీవు వారితో ఇలా చెప్పెయ్యి: ''మీ ప్రభువు కారుణ్య పరిధి సువిశాలమైనది. అపరాధులపై పడకుండా ఆయన శిక్షను ఆపటం అసాధ్యం.''

**6. అల్ అన్ ఆమ్** 148 - 149 ఈ ముష్రిక్కు జనులు (మీ ఈ మాటలకు బదులుగా) తప్పకుండా ఇలా అంటారు : ''ఒకవేళ అల్లాహ్యే కోరి ఉండినట్లయితే , మేమూ మా పూర్వీకులూ షిర్కుచేసి ఉండేవారమే కాదు. మేము దేనినీ నిషేధించి ఉండేవారము కూడా కాదు. ఇటువంటి మాటలనే మాటిమాటికీ కల్పించి చివరకు వారు మా శిక్షను చవిచూచారు. వారితో ఇలా అను : ''మీ వద్ద ఏదైనా జ్ఞానం ఉందా , మాముందు పెట్టటానికి ? మీరు కేవలం అంచనాలను అనుసరిస్తున్నారు. మీరు చేసేవన్నీ వట్టి ఊహాగానాలే. '' ఇంకా ఇలా అను: ''(మీ ఈ వాదానికి భిన్నంగా) సత్యానికి చేర్చేవాదన అల్లాహ్ వద్ద ఉంది. అల్లాహ్ గనక సంకల్పించి ఉన్నట్లయితే నిస్సందేహంగా మీ అందరికీ ఆయన మార్గం చూపి ఉండేవాడు.''

**6. అల్ అన్ ఆమ్** 150 వారితో ఇలా అడుగు: ''అల్లాహ్యే ఈ వస్తువులను నిషేధించాడు అని సాక్ష్యమిచ్చే మీ సాక్షులను తీసుకురండి.'' ఒకవేళ వారు అలా సాక్ష్యమిస్తే , నీవు వారితో కలసి సాక్ష్యం ఇవ్వకు. మా ఆయతులను అసత్యాలుగా చిత్రించి తిరస్కరించినవారూ , పరలోకాన్ని నిరాకరించినవారూ , ఇతరు లను తమ ప్రభువుకు సమానులుగా నిలబెట్టినవారూ - అలాంటి వారి కోరికలను నీవు ఎంతమాత్రం అనుసరించకు.

**6. అల్ అన్ ఆమ్** 151 - 153 ప్రవక్తా! వారికి ఇలా చెప్పు: ''రండి మీకు వినిపిస్తాను, మీ ప్రభువు మీపై విధించిన కట్టుబాట్లు ఏమిటో. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చెయ్యరాదు. తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి.

పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము మీకూ ఉపాధినిస్తున్నాము. వారికీ ఇస్తాము. అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి , బహిరంగమైనవైనా సరే లేక గోప్యమైనవైనా సరే. సత్యంతో తప్ప అల్లాహ్ పవిత్రంగా నిర్ణయించిన ఏ ప్రాణాన్నీ హతమార్చకండి , ఈ విషయాలనే పాటించమని ఆయన మీకు ఉపదేశించాడు, బహుశా మీరు ఆలోచించి పని చేస్తారని. అనాథుల ఆస్తి దరిదాపులకు పోకండి, ఉత్తమమైన రీతిలో తప్ప - వారు యుక్త వయస్సుకు చేరేవరకు. కొలతలో , తూనికలో పూర్తి న్యాయం చెయ్యండి. మేము ప్రతి మనిషిపైనా అతని శక్తిమేరకే బాధ్యతా భారాన్ని మోపుతాము. పలికితే న్యాయమే పలకండి , వ్యవహారం మీ బంధువులకు సంబంధించినది అయినాసరే. అల్లాహ్తో చేసుకున్న ఒడంబడికను నెరవేర్చండి. ఈ మాటలను అల్లాహ్ మీకు ఉపదేశిస్తున్నాడు , బహుశా మీరు హితబోధను స్వీకరిస్తారేమో అని. ఇంకా ఆయన ఇలా ఉద్బోధిస్తున్నాడు : నా రుజుమార్గం ఇదే. కనుక మీరు దీనిపైనే నడవండి. వేరే మార్గాలపై నడవకండి. ఎందుకంటే అవి మిమ్మల్ని ఆయన మార్గం నుండి తొలగించి విచ్ఛిన్న పరుస్తాయి. మీ ప్రభువు మీకు చేసిన హితోపదేశం ఇదే, బహుశా మీరు వక్రవైఖరికి దూరంగా ఉంటారని.

**6. అల్ అన్ ఆమ్** 154 - 158 మేము మూసాకు గ్రంథాన్ని ప్రసాదించాము. అది మంచివైఖరిని అవలంబించే మానవుడిపై అనుగ్రహ పరిపూర్తి, ఆవశ్యకమైన సకల విషయాల వివరణ, పూర్తిగా మార్గదర్శకం, పూర్తిగా కారుణ్యం. (ఇది ఇస్రాయీలు వంశీయులకు ఎందుకు ఇవ్వబడిరదంటే) బహుశా ప్రజలు తమ ప్రభువును కలుసుకోవటాన్ని విశ్వసిస్తారని. ఇదేవిధంగా మేము ఈ గ్రంథాన్ని అవతరింపజేశాము. ఇది శుభాలుకల గ్రంథం. కావున మీరు దీనిని అనుసరించండి. భయభక్తుల వైఖరిని అవలంబించండి. మీరు కరుణించబడటం సాధ్యం కావచ్చు. ఇక మీరు , ''మాకు పూర్వం ఉన్న రెండు వర్గాలకు గ్రంథం ఇవ్వబడిరది. వారు ఏమి చదివేవారో , ఏమి చదివించేవారో మాకు తెలియదు'' అని అనలేరు. ఇంకా మీకు , ''మాపై గనక గ్రంథాన్ని అవతరింపజేసి ఉండినట్లయితే , మేము వారిని మించిన రుజువర్తనులముగా నిరూపించుకునేవారము'' అని సాకులుచెప్పే ఆస్కారం కూడా లేదు. మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి ఒక స్పష్టమైన ప్రమాణం, మార్గదర్శకత్వం, కారుణ్యం వచ్చేసింది. ఇక అల్లాహ్ ఆయతులు అసత్యాలు అని పలికేవాడికంటే , వాటిపట్ల వైముఖ్యం ప్రదర్శించే వాడికంటే మించిన దుర్మార్గుడెవడు ? మా ఆయతులపట్ల విముఖులయ్యే వారికి , వారి ఈ వైముఖ్యం ఫలితంగా మేము నీచాతినీచమైన శిక్షను విధించితీరుతాము. దైవదూతలు వచ్చి వారిముందు నిలబడాలనీ లేదా నీ ప్రభువే స్వయంగా రావాలనీ లేదా నీ ప్రభువు యొక్క కొన్ని బహిరంగ నిదర్శనాలు ప్రత్యక్షం కావాలనీ , ప్రజలు నిరీక్షిస్తున్నారా? నీ ప్రభువు యొక్క ప్రత్యేకమైన సూచనలు కొన్ని ప్రత్యక్షమయ్యే రోజున పూర్వం విశ్వసించకుండా ఆ రోజున విశ్వసించిన వ్యక్తికీ , లేదా విశ్వసించి కూడా ఏ మంచినీ సంపాదించుకోని వ్యక్తికీ తమ విశ్వాసంవల్ల ఏ ప్రయోజనమూ చేకూరదు. ప్రవక్తా! వారితో ఇలా అను : ''సరే, మంచిది. మీరూ నిరీక్షించండి. మేమూ నిరీక్షిస్తున్నాము.''

**6. అల్ అన్ ఆమ్** 159 - 160 తమ ధర్మాన్ని ముక్కలు ముక్కలుగా చేసి , ముఠాలుగా చీలిపోయిన వారితో నిశ్చయంగా నీకు ఏ సంబంధమూ లేదు. వారి వ్యవహారం అల్లాహ్ అధీనంలో ఉంది. ఆయనే వారికి తెలుపుతాడు, వారు ఏమేమి చేశారో. అల్లాహ్ వద్దకు సత్కార్యాన్ని తీసుకువచ్చే వానికొరకు పదింతలు ప్రతిఫలం ఉంది. దుష్కార్యాన్ని తీసుకువచ్చే వానికి , అతడు ఎంత తప్పు చేశాడో అంతే ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ అన్యాయం మట్టుకు జరగదు.

**6. అల్ అన్ ఆమ్** 161 - 165 ప్రవక్తా! ఇలా ప్రకటించు : నిశ్చయంగా నా ప్రభువు నాకు రుజుమార్గాన్ని చూపించాడు. అది పూర్తిగా సరియైన ధర్మం. ఏ వక్రతా లేనిది , ఇబ్రాహీమ్ విధానం, దానిని అతను ఏకాగ్రతతో అవలంబించాడు. అతను ముష్రిక్కులలోని వాడు కాదు. ఇలా అను : ''నా నమాజ్ నా సకల ఉపాసనారీతులు, నా జీవనం, నా మరణం-సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు ఏ భాగస్వామీ లేడు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడిరది. అందరికంటే ముందు విధేయతతో తలవంచేవాణ్ణి నేనే.'' ఇలా అను : నేను అల్లాహ్ను కాదని వేరే ప్రభువును అన్వేషించాలా , ఆయనే ప్రతిదానికీ ప్రభువైనప్పుడు ? ప్రతి వ్యక్తీ తాను సంపాదించే దానికి తానే బాధ్యుడు. బరువు మోసేవాడెవడూ ఇతరుని బరువును మోయడు. చివరకు మీరంతా మీ ప్రభువు వైపునకే మరలిపోవలసి ఉంది. అప్పుడు ఆయన మీ విభేదాల యథార్థాన్ని మీకు విశదం చేస్తాడు. ఆయనే మిమ్మల్ని భూమండలానికి ఖలీఫాలుగా చేశాడు, మీలో కొందరికి కొందరిపై ఉన్నత స్థానాలను ప్రసాదించాడు , మీకు ఇచ్చిన దానితోనే మిమ్మల్ని పరీక్షించాలని. నిస్సందేహంగా మీ ప్రభువు శిక్షించటంలో కూడ వడిగలవాడు. ఎక్కువగా మన్నించేవాడు, కరుణించేవాడు కూడా.

7. అల్ ఆరాఫ్

ఆయతులు : 206 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**7. అల్ ఆరాఫ్** 1 - 2 అలిఫ్ లామ్ మీమ్ సాద్. ఇది ఒక గ్రంథం , నీ వైపునకు అవతరింపచెయ్యబడిరది. కనుక ప్రవక్తా! దీనిని గురించి నీ మనస్సులో ఏ సంకోచమూ ఉండకూడదు. దీని అవతరణ ఉద్దేశ్యం - నీవు దీనిద్వారా (తిరస్కారులను) భయపెట్టాలనీ, ఇది విశ్వాసులకు హితోపదేశం కావాలనీ.

**7. అల్ ఆరాఫ్** 3 ప్రజలారా! మీ ప్రభువు తరఫు నుండి మీపై అవతరింపచెయ్యబడిన దానిని అనుసరించండి. మీ ప్రభువును త్రోసిరాజని ఇతర సంరక్షకులను అనుసరించకండి - కాని మీరు హితబోధను స్వీకరించటం అరుదు.

**7. అల్ ఆరాఫ్** 4 - 5 మేము నాశనం చేసిన నగరాలు ఎన్నో ఉన్నాయి. వాటిపై మా శిక్ష రాత్రి సమయంలో హఠాత్తుగా విరుచుకుపడిరది లేక పట్టపగలు వారు విశ్రాంతి తీసుకుంటూ ఉండగా వచ్చిపడిరది. వారిపై మా శిక్ష వచ్చిపడినప్పుడు, ''మేము నిజంగానే దుర్మార్గులం'' అనే రోదన తప్ప వారి నోటినుండి మరేమీ రాలేదు.

**7. అల్ ఆరాఫ్** 6 - 9 కనుక ఇది తప్పకుండా జరుగవలసి ఉంది: మేము ఎవరి వద్దకు ప్రవక్తలను పంపామో, వారిని మేము లెక్క అడుగుతాము. ఇంకా ప్రవక్తలను కూడా అడుగుతాము (వారు సందేశాన్ని అందజేసే తమ విధిని ఎంతవరకు నిర్వహించారు అనీ, దానికి లభించిన సమాధానం ఏమిటీ అనీ). తరువాత స్వయంగా మేమే జరిగిన మొత్తం గాధను పూర్తి జ్ఞానంతో వారి ముందు పెడతాము. అసలు మేము ఎక్కడా లేకుండా ఉండలేదుగదా! బరువు ఆ రోజున సత్యమే అవుతుంది. ఎవరి త్రాసు పళ్ళాలు బరువుగా ఉంటాయో వారే సాఫల్యం పొందేవారు. ఎవరి త్రాసు పళ్ళాలు తేలికగా ఉంటాయో వారే తమను తాము నష్టానికి గురిచేసుకునేవారు. ఎందుకంటే , వారు ఆయతుల పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తూ ఉండేవారు.

**7. అల్ ఆరాఫ్** 10 మేము మిమ్మల్ని ధరణిపై అధికారాలతో వసింపజేశాము. ఇక్కడ మీకొరకు ఉపాధి వసతులను ఏర్పాటు చేశాము. కాని మీరు కృతజ్ఞులు కావటం అనేది అరుదు.

**7. అల్ ఆరాఫ్** 11 మేము మీ సృష్టిక్రియను ప్రారంభించాము. తరువాత మీ రూపాన్ని తీర్చిదిద్దాము. పిదప ఆదముకు సాష్టాంగపడండి అని దైవదూతలను ఆజ్ఞాపించాము. ఈ ఆదేశానుసారం అందరూ సాష్టాంగపడ్డారు. కాని ఇబ్లీసు సాష్టాంగపడేవారిలో చేరలేదు.

**7. అల్ ఆరాఫ్** 12 - 19 అల్లాహ్, ''నిన్ను నేను ఆదేశించినప్పటికీ సాష్టాంగపడకుండా నిన్ను ఏ విషయం నిరోధించింది?'' అని అడిగాడు. ఇలా పలికాడు : ''నేను అతడికంటే శ్రేష్ఠుణ్ణి. నీవు నన్ను అగ్నితో సృష్టించావు. అతణ్ణి మట్టితో.'' ఇలా సెలవిచ్చాడు : ''సరే, అయితే ఇక్కణ్ణుంచి కిందకు దిగు. ఇక్కడ నీ గొప్పతనాన్ని గురించి గర్వపడే హక్కు నీకు లేదు. వెళ్ళిపో. వాస్తవానికి నీవు తమ పరాభవాన్ని తామే కోరుకునే వారిలోని వాడవు. '' ఇలా అన్నాడు : ''వారందరూ మళ్ళీ లేపబడే రోజు వరకు నాకు వ్యవధినివ్వు. '' ఇలా సెలవిచ్చాడు : ''నీకు వ్యవధి ఉంటుంది.'' ఇలా అన్నాడు: ''అలాగే, నీవు నన్ను మార్గభ్రష్టత్వానికి గురిచేసినట్లు నేను కూడా నీ రుజుమార్గంపై ఈ మానవుల కొరకు మాటువేసి కూర్చుంటాను. వెనుకా , ముందూ, కుడీ, ఎడమా అన్ని వైపుల నుండీ వారిని చుట్టుముట్టుతాను. వారిలో అధిక సంఖ్యాకులను కృతజ్ఞులుగా చూడవు. '' ఇలా సెలవిచ్చాడు: ''వెళ్ళిపో ఇక్కణ్ణుంచి, నీచుడవై, తిరస్కృతుడవై. వారిలో నిన్ను అనుసరించే వారందరితో నిన్ను కలిపి నరకాన్ని నింపుతాను. దీనిని నమ్ము. ఆదమ్! నీవూ, నీ భార్యా, ఇద్దరూ ఈ స్వర్గంలో నివసించండి. ఎక్కడ ఏ వస్తువును మీ మనస్సు కోరినా దానిని తినండి. కాని ఈ వృక్షం దరిదాపులకు కూడా పోవద్దు. ఒకవేళ పోయినట్లయితే దుర్మార్గులలో కలసిపోతారు.''

**7. అల్ ఆరాఫ్** 20 - 25 తరువాత షైతాను వారిని మాయకు లోనుచేశాడు , ఒకరిని మరొకరికి గుప్తంగా ఉన్న వారి మర్మాంగాలను వారికి బహిర్గతం చేసేందుకు. వాడు వారితో ఇలా అన్నాడు : ''మీ ప్రభువు మిమ్మల్ని ఈ వృక్షం వద్దకు పోవద్దని వారించటానికి కారణం, మీరు దైవదూతలు అయిపోతారేమో అనేదీ, లేక మీకు శాశ్వతమైన జీవితం లభిస్తుందేమో అనేదీ తప్ప మరొకటి కాదు. '' ఇంకా వాడు ప్రమాణం చేసి వారితో ఇలా అన్నాడు: ''నేను మీ నిజమైన శ్రేయోభిలాషిని.'' ఈ విధంగా మోసంచేసి అతడు వారిద్దరినీ క్రమక్రమంగా తన పన్నుగడ వైపునకు త్రిప్పుకున్నాడు. చివరకు వారు ఆ వృక్షాన్ని రుచిచూడగానే , వారి ఆచ్ఛాదనలు వారిముందే తొలగిపోయాయి. అప్పుడు వారు తమ శరీరాలను స్వర్గంలోని ఆకులతో కప్పుకోసాగారు. తరువాత వారి ప్రభువు వారిని పిలిచి ఇలా అన్నాడు : ''నేను ఆ చెట్టువద్దకు పోవద్దని మిమ్మల్ని వారించలేదా ? షైతాను మీకు బహిరంగ శత్రువని చెప్పలేదా?'' వారు ఉభయులూ ఇలా వేడుకున్నారు : ''ప్రభూ! మాకు మేము అన్యాయం చేసుకున్నాము. నీవు గనక మమ్మల్ని మన్నించకపోతే , కనికరించకపోతే మేము నిశ్చయంగా సర్వనాశనం అయిపోతాము. ఇలా అన్నాడు : ''దిగిపోండి, మీరు ఒకరికొకరు శత్రువులు. ఒక నిర్ణీత కాలం వరకు మీకు భూమిలోనే నివాసమూ ఉపాధి సదుపాయాలూ ఉంటాయి. '' ఇంకా ఇలా అన్నాడు : ''మీరు అక్కడే జీవిస్తారు. అక్కడే మరణిస్తారు. అక్కడినుంచే చివరకు తీయబడతారు.''

**7. అల్ ఆరాఫ్** 26 - 27 ఆదము సంతానమా! మేము మీపై దుస్తులను అవతరింపజేశాము. అవి మీరు సిగ్గుపడే మీ శరీర భాగాలను కప్పుతాయి. మీ శరీర రక్షణకు శోభకు సాధనంగా ఉంటాయి. భయభక్తులు అనే దుస్తులే మంచి దుస్తులు. ఇది అల్లాహ్ సూచనలలోని ఒక సూచన. బహుశా ప్రజలు దీనిద్వారా గుణపాఠం నేర్చుకుంటారేమో! ఆదము సంతానమా! షైతాను మీ మాతాపితరులను స్వర్గం నుంచి బహిష్కరింపజేశాడు. వారి మర్మాంగాలు ఒకరివి ఒకరికి బహిర్గతం కావటానికి వారి వస్త్రాలను , వారిపైనుండి తొలగింపచేశాడు. అదేవిధంగా మిమ్మల్ని మళ్ళీ వాడు ఆపదకు గురిచెయ్యటం అనేది జరగకూడదు. అతడూ , అతడి సహచరులూ, మీరు వారిని చూడలేని ప్రదేశం నుండి మిమ్మల్ని చూస్తారు. మేము ఈ షైతానులను విశ్వసించని వారికి సంరక్షకులుగా చేశాము.

**7. అల్ ఆరాఫ్** 28 - 30 ఏదైనా సిగ్గుమాలిన పనిచేసినప్పుడు , ఈ ప్రజలు ఏమంటారంటే, ''ఈ పద్ధతినే మా తాత ముత్తాతలు అవలంబిస్తూ ఉండగా మేము చూశాము. ఇలా చెయ్యండి అని అల్లాహ్ యే మమ్మల్ని ఆదేశించాడు.'' వారితో ఇలా అను : ''సిగ్గుమాలిన పనిని అల్లాహ్ ఎన్నటికీ ఆదేశించడు. అల్లాహ్ తరఫునుండి వచ్చాయని మీకు తెలియని ఆ విషయాలను మీరు అల్లాహ్ పేరుతో ప్రకటిస్తున్నా రేమిటి?'' ప్రవక్తా! వారితో ఇలా అను : ''నా ప్రభువు సత్యాన్నీ, న్యాయాన్నీ ఆదేశించాడు. ఇంకా ఆయన ఆజ్ఞ ఏమిటంటే , మీరు ప్రతి ఆరాధనలో మీ దిక్కును సరిగ్గా అమర్చుకోండి, ఆయననే వేడుకోండి, మీ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకం చేసుకుని. ఆయన మిమ్మల్ని ఇప్పుడు పుట్టించిన విధంగానే మీరు మళ్ళీ పుట్టించబడతారు. ఒక వర్గానికి ఆయన రుజుమార్గం చూపించాడు. కాని రెండో

వర్గానికి మార్గభ్రష్టత్వం బాగా సరిపోయింది. ఎందుకంటే , వారు అల్లాహ్ కు బదులుగా షైతాను లను తమ సంరక్షకులుగా ఎన్నుకున్నారు. అయినా ''మేము రుజుమార్గంలో ఉన్నాము'' అని వారు భావిస్తున్నారు.

**7. అల్ ఆరాఫ్** 31 ఆదము సంతానమా! ప్రతి ఆరాధనా సమయంలో మీ వస్త్రాలంకరణపట్ల శ్రద్ధ వహించండి. తినండి, త్రాగండి, మితిమీరకండి. అల్లాహ్ మితిమీరేవారిని ప్రేమించడు.

**7. అల్ ఆరాఫ్** 32 ప్రవక్తా! వారితో ఇలా అను: ''అల్లాహ్ తన దాసుల కొరకు ఉద్భవింపజేసిన మంచి వస్త్రాలను ఎవరు నిషేధించారు? ఇంకా అల్లాహ్ ప్రసాదించిన పరిశుద్ధ వస్తువులను నిషేధించింది ఎవరు ?'' ఇలా అను : ఈ వస్తువులన్నీ ఇహలోక జీవితంలో కూడా విశ్వాసుల కొరకే, ప్రళయం నాడు ప్రత్యేకంగా వారికొరకు మాత్రమే. జ్ఞానం కలవారి కొరకు ఈ విధంగా మేము మా మాటలను స్పష్టంగా చెబుతున్నాము.

**7. అల్ ఆరాఫ్** 33 ప్రవక్తా! వారితో ఇలా అను: ''నా ప్రభువు నిషేధించినవి ఇవి : సిగ్గుమాలిన పనులు - బహిరంగ మైనవికాని, లేక గుప్తమైనవికాని - పాపాలు సత్యానికి వ్యతిరేకంగా మేరమీరటం , అల్లాహ్ ఏ ప్రమాణాన్నీ అవతరింపజేయకపోయినా మీరు ఇతరులను అల్లాహ్ కు భాగస్వాములుగా కల్పించటం (వాస్తవంగా అల్లాహ్ యే అన్నాడని) మీకు తెలియని విషయాన్ని మీరు అల్లాహ్ పేరుతో చెప్పటం.''

**7. అల్ ఆరాఫ్** 34 - 39 ప్రతి జాతికి ఒక గడువు నిర్ణయం అయివుంది. ఒక జాతి గడువు పూర్తి అయినప్పుడు , ఒక్క గడియకాలం కూడా అది వెనకా ముందూ అవటం సంభవించదు. (సృష్టి ప్రారంభంలోనే అల్లాహ్ ఈ విషయాన్ని స్పష్టం చేశాడు). ఆదము సంతానమా! జ్ఞాపకం ఉంచుకోండి , ఒకవేళ మీ వద్దకు స్వయంగా మీలోనుండే నా ఆయతులను వినిపించే ప్రవక్తలు వచ్చినప్పుడు , అవిధేయత నుండి తనను తాను కాపాడుకుంటూ తన వైఖరిని సంస్కరించుకునే వానికి భయంకానీ దుఃఖంకానీ కలిగే అవకాశం లేదు. ఇంకా మా ఆయతులు అసత్యాలని తిరస్కరించి వాటిపట్ల తలబిరుసు తనం ప్రదర్శించే వారే నరక నివాసులు అవుతారు. అక్కడే వారు శాశ్వతంగా ఉంటారు. పూర్తిగా అబద్ధాలైన విషయాలను సృష్టించి , అల్లాహ్ కు ఆరోపించి లేక సత్యమైన అల్లాహ్ ఆయతులు అసత్యాలని తిరస్కరించే వాడిని మించిన దుర్మార్గుడెవడు ? అటువంటి వారు తమ విధివ్రాత ప్రకారం తమ భాగాన్ని పొందుతూ ఉంటారు , మేము పంపే దైవదూతలు వారి ఆత్మలను బంధించటానికి వచ్చే ఆ గడియవరకు. అప్పుడు ఆ దూతలు వారిని ఇలా అడుగుతారు : ''చెప్పండి, మీరు అల్లాహ్ కు బదులుగా వేడుకునే ఆ ఆరాధ్య దైవాలు ఇప్పుడెక్కడున్నారు ?'' వారు ఇలా అంటారు : ''వారంతా మా నుండి తప్పుకున్నారు.'' ఇంకా వారు ''మేము నిజంగానే సత్యతిరస్కారులమే'' అని తమకు వ్యతిరేకంగా తామే సాక్ష్యం ఇస్తారు. అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: ''పోండి, మీకు పూర్వం గతించిన జిన్నాతుల వర్గమూ మానవుల వర్గమూ పోయి చేరిన ఆ నరకానికే మీరూ పోండి. '' ప్రతి వర్గమూ, అది నరకంలో ప్రవేశించేటప్పుడు తన పూర్వపు వర్గాన్ని శపిస్తూ ప్రవేశిస్తుంది. చివరకు వారంతా అక్కడకు చేరినప్పుడు , తరువాత వచ్చిన ప్రతివర్గమూ తన పూర్వపు

వర్గాన్ని గురించి ఇలా అంటుంది: ''ప్రభూ! మమ్మల్ని మార్గభ్రష్టులుగా చేసినవారు వీరే. కనుక వీరికి రెట్టింపు అగ్ని శిక్ష విధించు.'' సమాధానంగా ఇలా అనబడుతుంది : ప్రతివాడికీ రెట్టింపు శిక్షే పడుతుంది. కాని అది మీకు తెలియదు.'' మొదటివర్గం రెండో వర్గంతో ఇలా అంటుంది: ''(మేము గనక నిందార్హులమే అయితే) మీరు మాత్రం మాకంటే ఏ విషయంలో మెరుగు, ఇక మీరు మీ సంపాదనకు ఫలితంగా శిక్షను చవిచూడండి.''

**7. అల్ ఆరాఫ్** 40 - 43 నమ్మండి! మా ఆయతులను తిరస్కరించినవారి కొరకూ వాటిపట్ల తలబిరుసుతనం ప్రదర్శించిన వారికొరకూ ఆకాశద్వారాలు ఎంతమాత్రం తెరువబడవు. సూది రంధ్రంగుండా ఒంటె పోవటం ఎంత అసంభవమో, వారు స్వర్గంలోకి పోవటం కూడా అంతే అసంభవం. అపరాధులకు మావద్ద ఇటువంటి ప్రతిఫలమే లభిస్తుంది. వారికి నరకమే పాన్పు, నరకమే దుప్పటి. మేము దుర్మార్గులకు ఇచ్చే ప్రతిఫలం ఇదే. దీనికి భిన్నంగా మా ఆయతులను విశ్వసించి మంచిపనులు చేసినవారు - ఈ విషయంలో మేము ప్రతి వ్యక్తిపైనా అతని శక్తిసామర్థ్యాలకు అనుగుణంగానే బాధ్యతను మోపుతాము - వారు స్వర్గనివాసులు. అక్కడ వారు సదా ఉంటారు. వారి మనస్సులలో పరస్పరం ఏ కాస్త శత్రుభావం ఉన్నా దాన్ని మేము తొలగిస్తాము. వారి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వారు ఇలా అంటారు: ''మాకు ఈ మార్గం చూపిన అల్లాహ్ కే స్తోత్రాలు. ఆయనే గనక మాకు మార్గం చూపి ఉండకపోయినట్లయితే స్వయంగా మేము మార్గం పొంది ఉండేవారము కాదు. మా ప్రభువుచే పంపబడిన ప్రవక్తలు వాస్తవంగా సత్యాన్నే తీసుకువచ్చారు. '' అప్పుడు వారికి ఈ వాణి వినబడుతుంది : ''మీరు వారసులుగా చేయబడిన ఈ స్వర్గం మీరు చేస్తూ ఉండిన పనులకు ప్రతిఫలంగా మీకు లభించింది.''

**7. అల్ ఆరాఫ్** 44 - 45 తరువాత స్వర్గవాసులు నరకవాసులను పిలిచి ఇలా అంటారు : ''మా ప్రభువు మాకు చేసిన వాగ్దానాలను అన్నింటినీ మేము సత్యమైనవిగా కనుగొన్నాము. మరి మీరు కూడా మీ ప్రభువు చేసిన వాగ్దానాలను సత్యమైనవిగా కనుగొన్నారా?'' వారు జవాబుగా, ''అవును'' అని పలుకుతారు. అప్పుడు ప్రకటించే వాడొకడు వారిమధ్య ఇలా ప్రకటిస్తాడు: ''ప్రజలను అల్లాహ్ మార్గం నుండి నిరోధించేవారూ , దానిని వక్రీకరించగోరేవారూ, పరలోకాన్ని తిరస్కరించేవారూ అయిన దుర్మార్గులపై అల్లాహ్ శాపం అవతరించుగాక.''

**7. అల్ ఆరాఫ్** 46 - 49 ఈ ఉభయ వర్గాల మధ్య ఒక తెర అడ్డుగా నిలుస్తుంది. దానియొక్క ఎత్తైన ప్రదేశాల (ఆరాఫ్)పై మరికొందరు ప్రజలు ఉంటారు. వారు ప్రతి ఒకణ్ణీ అతని ముఖాకృతిని బట్టి గుర్తుపడతారు. స్వర్గవాసులను పిలిచి, ''మీకు శాంతి కలుగుగాక'' అని అంటారు. వారు స్వర్గంలోకి ప్రవేశించనేలేదు. కాని దానిని ఆశిస్తున్నారు. వారి దృష్టి నరకవాసుల వైపునకు మళ్ళినప్పుడు ఇలా అంటారు : ''ప్రభూ! మమ్మల్ని మటుకు ఈ దుర్మార్గులలో చేర్చకు. '' తరువాత ఎత్తైన ప్రదేశాలపై ఉన్న ఈ ప్రజలు నరకంలో ఉన్న కొందరు పెద్ద మనుషులను వారి ఆనవాళ్ళ ద్వారా గుర్తుపట్టి ఇలా అంటారు : ''చూశారా మీరూ, మీ అనుచరవర్గాలు గానీ, మీరు గొప్పగా భావించిన ఆస్తిపాస్తులుగానీ, ఈ రోజు మీకు ఏ విధంగానూ పనికిరాలేదు గదా! మీరు 'వీరికి అల్లాహ్ తన

కారుణ్యాన్ని ఏమాత్రం ప్రసాదించడు' అని ప్రమాణాలు చేసి అంటూ ఉండినవారే కదా ఈ స్వర్గ నివాసులు. ఈ రోజు వారితోనే 'స్వర్గంలో ప్రవేశించండి. మీకు భయంగాని దుఃఖంగాని లేదు అని అనటం జరిగింది.''

**7. అల్ ఆరాఫ్** 50 - 51 నరకవాసులు స్వర్గవాసులతో ఇలా మొరపెట్టుకుంటారు : ''కాస్త దయచేసి మాపైని కొద్దిగా నీళ్ళు పోయండి , లేదా అల్లాహ్ మీకు ప్రసాదించిన ఆహారంలో నుంచైనా కొంత ఇటు విసరండి. '' వారు ఇలా సమాధానం చెబుతారు: ''ఈ రెంటినీ అల్లాహ్ సత్యతిరస్కారులకు నిషేధిం చాడు. వారు తమ ధర్మాన్ని ఒక క్రీడగా , ఒక కాలక్షేపంగా చేసుకున్నారు. ఇంకా వారిని ఇహలోక జీవితం మోసానికి గురిచేసింది. '' అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: ''వారు ఈనాటి సమావేశాన్ని మరచి ఉండినవిధంగానే మా ఆయతులను తిరస్కరిస్తూ ఉండిన విధంగానే మేమూ వారిని ఈనాడు మరచిపోతాము.''

**7. అల్ ఆరాఫ్** 52 - 53 మేము ఈ ప్రజల వద్దకు ఒక గ్రంథాన్ని తీసుకువచ్చాము. దానిని మేము జ్ఞానం ఆధారంగా సవివరమైనదిగా చేశాము. అది విశ్వాసులకు మార్గదర్శకత్వం , కారుణ్యం. ఇక వీరు ఈ గ్రంథం తెలియజేసే ముగింపు కోసం కాక మరేదైనా విషయం కొరకు నిరీక్షిస్తున్నారా? ఆ ముగింపు వచ్చే రోజున దానిని నిర్లక్ష్యం చేస్తూ వచ్చినవారే ఇలా అంటారు : ''యథార్థంగానే మా ప్రభువు పంపిన ప్రవక్తలు సత్యం తీసుకుని వచ్చారు. అయితే , మా కొరకు సిఫారసు చెయ్యటానికి , సిఫారసు దారులెవరైనా మాకు లభిస్తారా ? లేదా మేము మళ్ళీ తిరిగి పంపబడగలమా? పూర్వం మేము చేస్తూ ఉండిన దానికి బదులుగా , ఇప్పుడు మరొక పద్ధతి ప్రకారం పనిచేసి చూపించటానికి?'' - వారు తమను తాము నష్టంలో పడవేసుకున్నారు. వారు సృష్టించిన అసత్యాలు సమస్తమూ ఈ రోజు వారినుండి తప్పుకున్నాయి.

**7. అల్ ఆరాఫ్** 54 - 56 వాస్తవంగా మీ ప్రభువు అల్లాహ్ యే. ఆయన ఆకాశాలనూ , భూమినీ ఆరుదినాలలో సృష్టించాడు. తరువాత తన రాజ్యపీఠాన్ని అలంకరించాడు. రాత్రిని పగటిపై కప్పివేస్తాడు. ఆ తరువాత పగలు రాత్రివెంట పరుగుతీస్తూ ఉంటుంది. ఇంకా ఆయన సూర్యుణ్ణి , చంద్రుణ్ణి, నక్షత్రాలను పుట్టించాడు. అన్నీ ఆయన ఆజ్ఞకు కట్టుబడి ఉన్నాయి. తెలుసుకోండి, సృష్టి ఆయనదే. దానిపై ఆధిపత్యమూ ఆయనదే. అల్లాహ్ అనంతమైన శుభాలు కలవాడు. సకల లోకాలకు ప్రభువు , స్వామి, మీ ప్రభువును వేడుకోండి , విలపిస్తూనూ గోప్యంగానూ. నిశ్చయంగా ఆయన మితిమీరి మెలిగేవారిని ప్రేమించడు. ధరణి సంస్కరణ జరిగిన తరువాత , దానిపై సంక్షోభాన్ని సృష్టించకండి. దేవుడినే వేడు కోండి భయంతోనూ , ఆశతోనూ. నిశ్చయంగా అల్లాహ్ కారుణ్యం రుజువర్తనులకు దాపులోనే ఉంది.

**7. అల్ ఆరాఫ్** 57 - 58 తన కారుణ్యానికి ముందుగా శుభవార్తలను మోసుకుపోయే వాయువులను పంపేది అల్లాహ్ యే. తరువాత అవి నీటితో నిండిన మేఘాలను ఎత్తుకునిపోయేటప్పుడు వాటిని నిర్జీవంగా పడివున్న ఏ ప్రదేశం వైపునకైనా కదిలిస్తాడు. అక్కడ వర్షం కురిపించి (ఆ మృత భూమినుండే) రకరకాల పండ్లను వెలికి

తీసుకొస్తాడు. చూడండి! ఈవిధంగా మేము మృతులను నిర్జీవస్థితినుండి ఉద్భవింపజేస్తాము , బహుశా మీరు దానిని చూసి అయినా గుణపాఠం నేర్చుకుంటారేమో అని. మంచి నేల తన ప్రభువు ఆదేశానుసారం పుష్కలంగా పంటనిస్తుంది. చెడ్డ నేలలో నాసిరకం పంట తప్ప మరేమీ పండదు. కృతజ్ఞతలు తెలిపేవారి కొరకుగాను మేము ఈ విధంగా సూచనలను మాటి మాటికీ వివరిస్తూ ఉంటాము.

**7. అల్ ఆరాఫ్** 59 - 64 మేము నూహ్‌ను అతని జాతివద్దకు పంపాము. అతను ఇలా అన్నాడు : ''నా జాతి సోదరులారా! అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు. మీ విషయంలో ఒక భయంకర దినంనాటి శిక్షను గురించి నేను ఆందోళన పడుతున్నాను. '' ఆయన జాతి సర్దారులు ఇలా పలికారు : ''నీవు స్పష్టమైన అపమార్గానికి గురిఅయినట్లు మాకు కనిపిస్తున్నది.'' నూహ్ ఇలా అన్నాడు : ''నా జాతి సోదరులారా! నేను ఏ అపమార్గంలోనూ పడలేదు. యథార్థానికి నేను సకల లోక ప్రభువునకు ప్రవక్తను. నా ప్రభువు సందేశాలను మీకు అందజేస్తాను. మీ శ్రేయోభిలాషిని. మీకు తెలియని విషయాలు నాకు అల్లాహ్ తరఫు నుండి తెలుసు. మీకు ఆశ్చర్యం కలిగిందా , మీ వద్దకు స్వయంగా మీ జాతికి చెందిన ఒక మనిషి ద్వారా మీ ప్రభువు జ్ఞాపిక వచ్చిందని - మిమ్మల్ని హెచ్చరించటానికి , మీరు చెడునడతకు దూరంగా ఉండడానికి , మీపై దయచూపటానికి?'' కాని వారు ఆయనను తిరస్కరించారు. చివరకు మేము ఆయననూ , ఆయన సహచరులనూ ఒక పడవద్వారా విముక్తి కలిగించాము. మా ఆయతులు అసత్యాలని తిరస్కరించిన వారందరినీ మేము ముంచివేశాము. నిశ్చయంగా వారు అంధజనులు.

**7. అల్ ఆరాఫ్** 65 - 72 ఇంకా ఆద్ జాతివద్దకు మేము వారి సోదరుడు హూద్‌ను పంపాము. అతను ఇలా అన్నాడు: ''నా జాతి సోదరులారా! అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు. అలాంటప్పుడు మీరు తప్పుడు నడతను వదులుకోరా?'' అతని మాటలను నమ్మటానికి తిరస్కరించిన అతని జాతి సర్దారులు ఇలా సమాధానం చెప్పారు : ''నీవు తెలివి తక్కువతనానికి గురిఅయినట్లు మేము భావిస్తున్నాము. నీవు అసత్యవాదివని మా అనుమానం. '' అతను ఇలా అన్నాడు : ''నా జాతి సోదరులారా! నేను తెలివితక్కువతనానికేమీ గురికాలేదు. నేను సకల లోకాల ప్రభువునకు ప్రవక్తను. మీకు నా ప్రభువు సందేశాలను అందజేస్తాను. నేను మీయొక్క నమ్మదగిన శ్రేయోభిలాషిని. మీకు ఆశ్చర్యం కలిగిందా , మీ వద్దకు మిమ్మల్ని హెచ్చరించటానికి స్వయంగా మీ జాతికి చెందిన ఒక మనిషిద్వారా మీ ప్రభువు జ్ఞాపిక వచ్చిందని ? మరచిపోకండి! మీ ప్రభువు నూహ్ జాతికి తరువాత మిమ్మల్ని వారసులుగా చేశాడు. మీకు బలాధిక్యతను ప్రసాదించాడు. కనుక అల్లాహ్ శక్తి మహిమలను జ్ఞాపకం ఉంచుకోండి. మీరు సాఫల్యం పొందగలరని ఆశించవచ్చు.'' వారు ఇలా జవాబు ఇచ్చారు : ''నీవు మావద్దకు రావటానికి కారణం , మేము ఒక్క అల్లాహ్నే ఆరాధించాలనా , మా తాత ముత్తాతలు పూజిస్తూ వచ్చిన వాటిని విసర్జించాలనా? సరే, నీవు నిజం చెప్పేవాడివే అయితే నీవు మమ్మల్ని బెదరిస్తూ ఉన్న ఆ శిక్షను తీసుకురా. '' అతను ఇలా అన్నాడు : ''మీపై మీ ప్రభువు శాపం , ఆయన ఆగ్రహం ఇదివరకే

విరుచుకుపడ్డాయి. అల్లాహ్ ఏ ప్రమాణాన్నీ పంపనీ , మీరూ మీ తాత ముత్తాతలూ పెట్టుకున్న పేర్ల విషయంలో మీరు నాతో ఘర్షణపడుతున్నారా ? సరే, అయితే మీరూ నిరీక్షించండి , మీతోపాటు నేనూ నిరీక్షిస్తాను. '' చివరకు మేము మా కృపతో హూద్‌నూ , అతని అనుయాయులనూ రక్షించుకున్నాము. మా ఆయతులు అసత్యాలని తిరస్కరించిన వారినీ విశ్వసించనివారినీ మేము సమూలంగా నాశనం చేశాము.

**7. అల్ ఆరాఫ్** 73 - 74 సమూదు జాతివద్దకు మేము వారి సోదరుడు సాలిహ్‌ను పంపాము. అతను ఇలా అన్నాడు: ''నా జాతి సోదరులారా! అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు. మీవద్దకు మీ ప్రభువు యొక్క స్పష్టమైన ప్రమాణం వచ్చింది. అల్లాహ్ యొక్క ఈ ఆడ ఒంటె మీ కొరకు ఒక సూచన వంటిది. కనుక దానిని విడిచిపెట్టండి , అల్లాహ్ భూమిపై అది స్వేచ్ఛగా మేస్తూ తిరగటానికి. దురుద్దేశ్యంతో దాన్ని ముట్టుకోకండి. అలాచేస్తే మిమ్మల్ని వ్యధాభరితమైన శిక్ష ఒకటి పట్టుకుంటుంది. జ్ఞాపకం తెచ్చుకోండి ఆ సమయాన్ని. అప్పుడు అల్లాహ్ ఆద్ జాతి తరువాత మిమ్మల్ని దానికి వారసులుగా చేశాడు. మీకు భూమిపై ఉన్నతమైన స్థానాన్ని ప్రసాదించగా , మీరు ఈ రోజు దాని చదునైన మైదానాలలో మహోన్నతమైన భవనాలను నిర్మిస్తున్నారు. దాని కొండలను గృహాలుగా చెక్కుతున్నారు. కనుక ఆయన సృష్టి మహిమలను నిర్లక్ష్యం చెయ్యకండి. ధరణిపై సంక్షోభాన్ని సృష్టించకండి.

**7. అల్ ఆరాఫ్** 75 - 76 పెద్ద మనుషులుగా చెలామణిఅయ్యే అతని జాతి సర్దారులు బలహీన వర్గాలలోని విశ్వసించిన ప్రజలను ఇలా అడిగారు : ''సాలిహ్ తన ప్రభువు పంపిన ప్రవక్త అని మీకు నిజంగానే తెలుసా ?'' వారు ఇలా సమాధానం ఇచ్చారు: ''నిస్సందేహంగా అతనితో పంపబడిన సందేశాన్ని మేము విశ్వసిస్తు న్నాము.'' తమ పెద్దరికాన్ని చాటుకునేవారు ఇలా అన్నారు :''మీరు విశ్వసించిన దాన్ని మేము తిరస్క రిస్తున్నాము.''

**7. అల్ ఆరాఫ్** 77 - 79 తరువాత వారు ఆ ఆడ ఒంటెను చంపివేశారు. పచ్చి పొగరుబోతుతనంతో తమ ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘించారు. సాలిహ్‌తో ఇలా అన్నారు : ''నిజంగానే నీవు ప్రవక్తలలోనివాడవే అయితే నీవు మమ్మల్ని బెదిరిస్తూ వచ్చిన ఆ శిక్షను తీసుకురా. '' చివరకు ఊపివేసే ఒక భయంకరమైన ఆపద వారిని చుట్టుముట్టింది. వారు తమ ఇళ్ళల్లోనే బోర్లాపడి , పడినట్లే ఉండిపోయారు. సాలిహ్ ఈ విధంగా అంటూ వారి నగరాల నుండి నిష్క్రమించాడు : ''నా జాతి ప్రజలారా! నేను నా ప్రభువు సందేశాన్ని మీకు అందజేశాను. నేను మీ శ్రేయస్సునే సదా అభిలషించాను. కాని నేనేం చేసేది, మీకు మీ శ్రేయోభిలాషులంటేనే ఇష్టం లేదు.''

**7. అల్ ఆరాఫ్** 80 - 84 లూత్‌ను మేము ప్రవక్తగా చేసి పంపాము. జ్ఞాపకం తెచ్చుకో అతను తన జాతితో ఇలా అన్నాడు : ''మీరు ఇంత సిగ్గులేనివారై పోయారేమిటి , మీకు పూర్వం ప్రపంచంలో ఎవ్వడూ చెయ్యని బూతుపని చేస్తున్నారు? మీరు స్త్రీలను వదలి పురుషులతో మీ కామాన్ని తీర్చుకుంటున్నారు ? వాస్తవానికి మీరు పూర్తిగా హద్దుమీరి ప్రవర్తించేవారు.'' కాని అతని జాతి ఇచ్చిన జవాబు ఇదే: ''గెంటెయ్యండి వీళ్ళను మీ బస్తీల నుండి ,

మహాపవిత్రులట వీళ్ళు.'' చివరకు మేము లూత్‌నూ అతని ఇంటి వాళ్ళనూ - వెనుక ఉండిపోయే వారిలో కలసిపోయిన అతని భార్యను తప్ప - రక్షించాము. ఇంకా ఆ జాతిపై కురిపించాము మేము ఒక వర్షాన్ని. చూడండి, ఆ అపరాధుల ముగింపు ఎలా జరిగిందో.

**7. అల్ ఆరాఫ్** 85 - 87 మేము మద్‌యన్ జాతి వారివద్దకు వారి సోదరుడు షుఐబ్‌ను పంపాము. అతను ఇలా అన్నాడు : ''నా జాతి సోదరులారా! అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు. మీ వద్దకు మీ ప్రభువు యొక్క స్పష్టమైన మార్గదర్శకత్వం వచ్చింది. కనుక తూకాన్ని, కొలతను పూర్తిగా పాటించండి. ప్రజలకు వారి వస్తువుల విషయంలో నష్టం కలిగించకండి. భూమి సంస్కరింపబడిన తరువాత, దానిలో సంక్షోభాన్ని సృష్టించకండి. ఇందులోనే మీ శ్రేయస్సు ఉంది , మీరు (నిజంగానే) విశ్వాసులైతే. ప్రజలను భయపెట్టటానికీ , విశ్వసించేవారిని అల్లాహ్ మార్గం నుండి నిరోధించటానికీ, రుజుమార్గ వక్రీకరణకూ పాల్పడి (జీవితపు) ప్రతిమార్గంలో బందిపోటు దొంగలు మాదిరిగా పొంచి కూర్చోకండి. జ్ఞాపకం తెచ్చుకోండి ఆ కాలాన్ని , అప్పుడు మీరు అల్పసంఖ్యలో ఉండేవారు. తరువాత అల్లాహ్ మీ సంఖ్యను అధికం చేశాడు. కళ్ళు తెరచి చూడండి. సంక్షోభం సృష్టించిన వారి పర్యవసానం ప్రపంచంలో ఏమయిందో! ఏ ఉపదేశాన్ని ఇచ్చి నన్ను పంపటం జరిగిందో దానిని మీలోని ఒక వర్గం విశ్వసించి , మరొక వర్గం విశ్వసించకపోతే అల్లాహ్ మన మధ్య తీర్పు చెప్పేవరకు సహనంతో నిరీక్షించండి. (ఆయనే) అందరికంటే ఉత్తమంగా తీర్పు చెప్పేవాడు.

**7. అల్ ఆరాఫ్** 88 - 89 దురహంకారులైన అతని జాతి సర్దారులు అతనితో ఇలా అన్నారు : ''షుఐబ్, మేము నిన్నూ, నీతోపాటు విశ్వసించిన వారినీ మా నగరం నుండి బహిష్కరిస్తాము , లేదా మీరు మా సంఘంలో తిరిగి చేరవలసి ఉంటుంది.'' షుఐబ్ ఇలా సమాధానం పలికాడు : ''ఏమిటీ, మాకు ఇష్టం లేకపోయినా మమ్మల్ని బలవంతంగా మళ్ళిస్తారా? అల్లాహ్ మాకు మీ సంఘం నుండి విముక్తి కలిగించిన తరువాత ఒకవేళ మళ్ళీ మేము దానిలో చేరితే మేము అల్లాహ్ కు అబద్ధం ఆరోపించినవాళ్ళం అవుతాము. దానివైపునకు మళ్ళటం అనేది మాత్రం మాకు ఏ విధంగానూ సాధ్యం కాదు, మా ప్రభువైన అల్లాహ్ సంకల్పిస్తే తప్ప. మా ప్రభువు జ్ఞానం ప్రతి వస్తువునూ ఆవరించి ఉంది. ఆయననే మేము నమ్ముకున్నాము. ప్రభూ! మాకూ మా జాతికీ మధ్య సరియైన తీర్పు చెయ్యి. నీవు ఉత్తమ న్యాయనిర్ణేతవు.''

**7. అల్ ఆరాఫ్** 90 - 93 అతని మాటలను తిరస్కరించిన అతని జాతి సర్దారులు పరస్పరం ఇలా అనుకున్నారు : ''ఒకవేళ మీరు షుఐబ్‌ను అనుసరించటానికి అంగీకరిస్తే నాశనం అవుతారు. కాని జరిగిందేమిటంటే , ఊపివేసే ఒక పెద్ద ఆపద వారిని పట్టుకుంది. వారు తమ గృహాలలో బోర్లాపడి, పడినట్లే ఉండి పోయారు. షుఐబ్‌ను తిరస్కరించిన వారు ఆ గృహాలలో ఎన్నడూ నివసించని విధంగా తుడుచుకు పోయారు. షుఐబ్‌ను తిరస్కరించినవారే చివరకు సర్వనాశనమయ్యారు. షుఐబ్ ఇలా అంటూ వారి నగరాల నుండి నిష్క్రమించాడు : ''నా జాతి సోదరులారా! నేను

నా ప్రభువు సందేశాలను మీకు అందజేశాను. మీ శ్రేయోభిలాషిగా నేను నా బాధ్యతను పూర్తిగా నెరవేర్చాను. సత్యాన్ని స్వీకరించటానికి తిరస్కరించే జాతి కొరకు నేను ఇప్పుడు ఎలా బాధపడను?''

**7. అల్ ఆరాఫ్** 94 - 99 మేము ఏ నగరానికి ప్రవక్తను పంపినా ఆ నగర ప్రజలను మొదట లేమికీ , కష్టానికీ గురిచెయ్యకుండా ఉండటం జరగలేదు , వారు వినమ్రులు కావాలనే ఉద్దేశ్యంతో. తరువాత మేము వారి దుస్థితిని సుస్థితిగా మార్చాము. చివరకు వారు బాగా అభివృద్ధిచెంది ఇలా అన్నారు : ''మంచిరోజులు చెడ్డరోజులు అనేవి మా పూర్వీకులకు కూడా కలుగుతూ వచ్చాయి.'' తుదకు మేము వారిని అకస్మాత్తుగా పట్టుకున్నాము. వారికి దానిని గురించి ఏమాత్రం తెలియదు. నగరాల ప్రజలు విశ్వసించి , భయభక్తుల వైఖరిని అవలంబించి ఉన్నట్లయితే మేము వారికొరకు ఆకాశంలోని, భూమిలోని శుభాల ద్వారాలను తెరచి ఉండేవారము. కాని వారు ధిక్కరించారు. కనుక మేము వారిని వారు పోగుచేస్తూ ఉన్న చెడుసంపాదన కారణంగా పట్టుకున్నాము. ఏమిటీ ? అయితే ఇక మా శిక్ష రాత్రి సమయంలో వారు గాఢనిద్రలో ఉన్నప్పుడు వారిపై అకస్మాత్తుగా వచ్చి పడదని నగరాల ప్రజలు నిర్భయంగా ఉన్నారా? లేక శక్తిమంతమైన మా హస్తం , పగటివేళ వారు ఆడుకుంటున్నప్పుడు వారిపై హఠాత్తుగా ఎన్నడూ పడదనే తృప్తితో ఉన్నారా వారు ? ఏమిటీ, ఈ ప్రజలు అల్లాహ్ ఎత్తుగడ అంటే నిర్భయంగా ఉన్నారా ? వాస్తవానికి నాశనం కాబోయే జాతి మాత్రమే అల్లాహ్ ఎత్తుగడ అంటే నిర్భయంగా ఉంటుంది.

**7. అల్ ఆరాఫ్** 100 - 102 ఏమిటీ , పూర్వపు భూలోకవాసుల తరువాత భూమికి వారసులయ్యే ప్రజలకు ఈ యథార్థ విషయం ఏ గుణపాఠాన్నీ నేర్పలేదా , మేము కోరితే వారి నేరాలకు వారిని పట్టుకోగలమని ? (కాని వారు గుణపాఠం నేర్పే యథార్థాలను లక్ష్యపెట్టరు). మేము వారి హృదయాలకు ముద్ర వేశాము. కనుక వారు ఏదీ వినరు. ఈ జాతుల ప్రజలు , ఎవరి గాథలను మేము మీకు వినిపిస్తున్నామో (మీ ముందు ఒక దృష్టాంతంగా ఉన్నారు). వారివద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చారు. కాని వారు ఒకసారి తిరస్కరించినదానిని మళ్ళీ అంగీకరించేవారు కాదు. చూడండి! ఈ విధంగా మేము సత్య తిరస్కారుల హృదయాలకు ముద్ర వేస్తాము. మేము వారిలో చాలామందిని తమ వాగ్దానంపట్ల గౌరవం కలవారుగా చూడలేదు. చాలామందిని దుర్మార్గులుగానే చూశాము.

**7. అల్ ఆరాఫ్** 103 (పైన పేర్కొనబడిన) ఈ జాతుల తరువాత మేము మూసాను మా సూచనలతో ఫిరౌను వద్దకూ అతని జాతి సర్దారుల వద్దకూ పంపాము. కాని వారు కూడా మా సూచనలపట్ల అన్యాయంగా ప్రవర్తించారు. కనుక చూడండి, ఆ దుర్మార్గుల గతి ఏమయిందో!

**7. అల్ ఆరాఫ్** 104 - 117 మూసా ఇలా అన్నాడు : ''ఫిరౌన్! నేను విశ్వప్రభువు తన తరఫున పంపగా వచ్చినవాడను. నా పని ఏమిటంటే , అల్లాహ్ పేరుతో సత్యం తప్ప మరే మాటా పలకకుండా ఉండటం. నేను మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి నా నియామకాన్ని గురించిన స్పష్టమైన నిదర్శనం తీసుకొని వచ్చాను. కనుక

నీవు ఇస్రాయీలు సంతానాన్ని నాతో పంపు.'' ఫిరౌను ఇలా అన్నాడు : ''ఒకవేళ నీవు ఏదైనా నిదర్శనాన్ని తెస్తే, నీ ప్రకటనలో సత్యవంతుడవే అయితే , దానిని తీసుకురా.'' మూసా తన చేతికర్రను విసిరాడు. అకస్మాత్తుగా అది ఒక సజీవ సర్పంగా మారిపోయింది. అతను తన జేబునుండి చెయ్యిని పైకి తీశాడు. ప్రేక్షకులందరి ముందూ అది మెరయసాగింది. అప్పుడు ఫిరౌను జాతి సర్దారులు పరస్పరం ఇలా అనుకున్నారు : ''నిశ్చయంగా ఈ వ్యక్తి మహా నైపుణ్యంగల మాంత్రికుడే. మిమ్మల్ని మీ భూమి నుండి వెళ్ళగొట్టగోరుతున్నాడు. ఇప్పుడేమంటారో చెప్పండి ?'' వీళ్ళంతా ఫిరౌనుకు ఇలా సలహా ఇచ్చారు : ''అతన్నీ, అతని సోదరుణ్ణీ ఆపి ఉంచండి. అన్ని పట్టణాలకూ వేగులవాళ్ళను పంపండి, నిపుణుడైన ప్రతి మాంత్రికుణ్ణి మీ వద్దకు తీసుకురావటానికి. '' ఆ విధంగా మాంత్రికులు ఫిరౌను వద్దకు వచ్చారు. వారు ఇలా అన్నారు : ''ఒకవేళ మేము గెలిస్తే మాకు దీని ప్రతిఫలం తప్పకుండా లభిస్తుంది కదా!'' ఫిరౌను ఇలా సమాధానం చెప్పాడు : ''అవును, మీరు మా సాన్నిధ్యానికి చేరువవుతారు. '' తరువాత వారు మూసాతో ఇలా అన్నారు : ''నీవు విసురుతావా లేక మేము విసరాలా ?'' మూసా జవాబు పలికాడు: ''మీరే విసరండి '' అని. వారు తమ పాచికలను విసరి చూపులను మంత్రముగ్ధం , హృదయాలను భీతావహం చేశారు, అద్భుతమైన మాయాజాలాన్ని కల్పించారు. మేము మూసాకు, ''నీ చేతి కర్రను విసరివెయ్యి'' అని సంజ్ఞ చేశాము. అతను విసరగానే తృటిలో అది వారి బూటకపు మాయాజాలాన్ని మ్రింగేసింది.

**7. అల్ ఆరాఫ్** 118 - 122 ఈ విధంగా ఏది సత్యమో అది సత్యంగా నిరూపితమయింది. వారు దేనిని కల్పించారో అది అసత్యంగా మిగిలిపోయింది. ఫిరౌను , అతని సహచరులు పోటీరంగంలో పరాజితులయ్యారు. (విజయానికి బదులుగా) అంతా తారుమారై, అవమానం పాలయ్యారు. ఇక మాంత్రికుల పరిస్థితి , అంతరంగంలోని ఏదో విషయం వారిని సాష్టాంగపడేలా చేసింది. వారు ఇలా అన్నారు : ''మేము విశ్వసించాము సకల లోకాల ప్రభువును, మూసా, హారూనులు విశ్వసిస్తున్న ప్రభువును.''

**7. అల్ ఆరాఫ్** 123 - 124 ఫిరౌను ఇలా అన్నాడు : ''నేను మీకు అనుమతినివ్వక ముందే మీరు అతన్ని విశ్వసించారా? నిశ్చయంగా ఈ రాజధాని నగరంలో దాని పాలకులను అధికారం నుండి తొలగించటానికి మీరంతా కలసి రహస్యంగా పన్నిన కుట్ర ఇది. సరే , అయితే దాని ఫలితం మీకు ఇప్పుడే తెలుస్తుంది. నేను మీ చేతులనూ మీ కాళ్ళనూ వ్యతిరేకదిశలో నరికిస్తాను. ఇంకా దాని తరువాత మీ అందరినీ సిలువనెక్కిస్తాను.''

**7. అల్ ఆరాఫ్** 125 - 126 వారు ఇలా జవాబు పలికారు : ''ఎట్టి పరిస్థితిలోనూ మేము మరలవలసింది మా ప్రభువు వైపునకే. నీవు ఏ విషయంలో మాపై పగతీర్చుకోదలచావో , అది మా ప్రభువు సూచనలు మా ముందుకు వచ్చినప్పుడు మేము వాటిని విశ్వసించామనేది తప్ప మరొకటి కాదు. ప్రభూ , మాకు ఓరిమిని అమితంగా అనుగ్రహించు. మమ్మల్ని ప్రపంచం నుండి లేపినప్పుడు మేము నీకు విధేయులుగా ఉన్న స్థితిలోనే లేపు.''

**7. అల్ ఆరాఫ్** 127 ఫిరౌనుతో అతని జాతి సర్దారులు ఇలా అన్నారు : ''మూసానూ అతని జాతివారినీ రాజ్యంలో కల్లోలం వ్యాపింపచేయటానికీ , వారు నీ దాస్యాన్నీ నీ దేవుళ్ళ దాస్యాన్నీ కాదనటానికి , నీవు వారిని స్వేచ్ఛగా వదలిపెడతావా?'' ఫిరౌను ఇలా జవాబు ఇచ్చాడు : ''నేను వారి కొడుకులను చంపిస్తాను. వారి స్త్రీలను బ్రతకనిస్తాను. వారిపై మా అధికారపు పట్టు పటిష్ఠంగా ఉంది.''

**7. అల్ ఆరాఫ్** 128 - 129 మూసా తన జాతివారితో ఇలా అన్నాడు : ''అల్లాహ్ ను సహాయం కొరకు అర్థించండి , ఓర్పు వహించండి. భూమి అల్లాహ్ది , తన దాసులలో తాను కోరిన వారిని దానికి వారసులుగా చేస్తాడు. అంతిమ సాఫల్యం అల్లాహ్ కు భయపడుతూ పనిచేసేవారి కొరకే. '' అతని జాతివారు ఇలా అన్నారు : ''నీవు రాకపూర్వం కూడా మేము బాధింపబడేవారము. ఇప్పుడు నీవు వచ్చిన తరువాత కూడా బాధింపబడుతున్నాము. '' అతను ఇలా జవాబు పలికాడు : ''మీ ప్రభువు మీ శత్రువులను నాశనం చేసి మిమ్మల్ని ధరణిలో ఖలీఫాలుగా చేసే సమయం సమీపంలోనే ఉంది. అప్పుడు మీరు ఎలా ప్రవర్తిస్తారో ఆయన చూస్తాడు.''

**7. అల్ ఆరాఫ్** 130 - 137 మేము ఫిరౌను ప్రజలను ఎన్నో సంవత్సరాల వరకు కరువుకూ , పంటల కొరతకూ గురిచేశాము, బహుశా వారికి తెలివి వస్తుందేమో అని. కాని వారి పరిస్థితి ఎలా ఉండేదంటే , మంచికాలం వచ్చినప్పుడు వారు, ''మేము దీనికే అర్హులం'' అని అనేవారు. గడ్డుకాలం వచ్చినప్పుడు వారు మూసానూ, అతని సహచరులనూ తమకు అపశకునంగా పేర్కొనేవారు. అసలు వాస్తవానికి వారి అపశకునం అల్లాహ్ చేతులలో ఉంది. కాని వారిలో చాలామంది జ్ఞానహీనులు. వారు మూసాతో ఇలా అన్నారు : ''నీవు మంత్రజాలంగా మాపై ప్రయోగించటానికి ఏ మంత్రసూచనను తెచ్చినా మేము నీ మాటను నమ్మేవాళ్ళము కాము. '' చివరకు మేము వారిపైకి తుఫానును పంపాము. మిడతల దండులను వదిలాము. పేలు వ్యాపింపజేశాము. కప్పలను పుట్టించాము. రక్తము కురిపించాము. ఈ సూచనలనన్నింటినీ వేర్వేరుగా చూపించాము. కాని వారు తలబిరుసుతనం ప్రదర్శిస్తూనే పోయారు. వారు మహాపరాధం చేసిన ప్రజలు. వారిపై ఆపద అవతరించినప్పుడల్లా ఇలా అనేవారు : ''మూసా! నీకు నీ ప్రభువు తరఫు నుండి లభించిన పదవి ఆధారంగా మా కొరకు ప్రార్థించు. ఈసారి నీవు మానుండి ఈ ఆపదను తొలగింపజేస్తే మేము నీ మాటలను విశ్వసిస్తాము. ఇస్రాయీలు సంతానాన్ని నీవెంట పంపుతాము.'' కాని మేము మా శిక్షను వారినుండి ఒక నిర్ణీతమైన కాలం వరకు - ఆ కాలానికి వారు ఎలాగైనా చేరుకోవలసినవారే - తొలగించినప్పుడల్లా వారు తమ వాగ్దానం నుండి ఒక్కసారిగా మరలిపోయేవారు. అప్పుడు మేము వారికి ప్రతీకారం చేశాము. వారిని సముద్రంలో ముంచివేశాము. ఎందుకంటే , వారు మా సూచనలు అసత్యాలని తిరస్కరించారు. వాటిని లెక్క చేయలేదు. ఇంకా వారి స్థానంలో , బలహీనులుగా చెయ్యబడిన వారందరినీ మేము ఆ భూభాగపు తూర్పు పడమరలకు వారసులుగా చేశాము. ఆ భూభాగాన్ని మేము శుభాలతో నింపాము. ఈ విధంగా నీ ప్రభువు ఇస్రాయీలు సంతతికి మేలు చేస్తాను అన్న వాగ్దానం

నెరవేరింది. ఎందుకంటే వారు ఓర్పుతో వ్యవహరించారు. ఇంకా ఫిరౌనూ , అతని జాతివారూ చేసిన నిర్మాణాలూ , లేపిన భవనాలూ సమస్తమూ మేము నేలమట్టం చేశాము.

**7. అల్ ఆరాఫ్** 138 - 141 మేము ఇస్రాయీలు సంతతిని సముద్రం దాటించాము. తరువాత వారు పోసాగారు , మార్గమధ్యంలో ఒక జాతి ప్రజల వద్దకు పోవడం జరిగింది. ఆ జాతివారు తాము ఆరాధించే కొన్ని విగ్రహాల పట్ల ప్రేమకు పూర్తిగా అంకితమైనవారు. (ఇస్రాయీల్ సంతతి) వారు ఇలా అన్నారు : ''మూసా! వాళ్ళ దేవుళ్ళవంటి ఒక దేవుణ్ణి మాకు కూడా చేసిపెట్టు. '' మూసా ఇలా అన్నాడు : ''మీరు చాలా అజ్ఞానపు మాటలు మాట్లాడుతున్నారు. ఈ ప్రజలు అవలంబిస్తున్న విధానం నాశనం అయ్యేదే. ఇంకా వారు చేస్తూ ఉన్న పని పూర్తిగా అసత్యమైనది.'' మళ్ళీ మూసా ఇలా అన్నాడు : ''నేను అల్లాహ్ ను కాదని మరొక దైవాన్ని మీకొరకు అన్వేషించాలా? వాస్తవానికి ప్రపంచంలోని సమస్త జాతుల కంటే మీకు ఔన్నత్యాన్ని ప్రసాదించింది అల్లాహ్ యే. '' (అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు) : మేము మీకు ఫిరౌన్ ప్రజల బారినుండి విముక్తి కలిగించిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. వారు మిమ్మల్ని ఘోర యాతనకు గురిచేసేవారు. మీ కుమారులను చంపేవారు , మీ స్త్రీలను మాత్రం బ్రతకనిచ్చేవారు. ఇందులో మీ ప్రభువు తరఫునుండి మీకు ఒక పెద్ద పరీక్ష ఉండినది.

**7. అల్ ఆరాఫ్** 142 - 144 మేము మూసాను (సినాయ్ కొండపైకి) ముప్పై రేయింబవళ్ళ కోసం పిలిపించాము. తరువాత ఇంకా పదిరోజులు పొడిగించాము. ఈవిధంగా అతని ప్రభువు నిర్ణయించిన గడువు మొత్తం నలభైరోజులు అయింది. మూసా పోతూపోతూ తన సోదరుడు హారూనుతో ఇలా అన్నాడు : ''నా తరువాత నీవు నా జాతి ప్రజలలో నాకు ప్రాతినిధ్యం వహించు. సక్రమంగా వ్యవహరిస్తూ ఉండు. విచ్ఛిన్నకారుల మార్గంలో నడవకు. '' మేము నిర్ణయించిన సమయానికి సరిగ్గా అతను చేరినప్పుడు , అతని ప్రభువు అతనితో సంభాషించాడు. అప్పుడు అతను ఇలా మనవి చేశాడు : ''ప్రభూ! నా చూపునకు బలాన్ని ప్రసాదించు. నిన్ను చూస్తాను.'' ఇలా సెలవిచ్చాడు : ''నీవు నన్ను చూడలేవు. కొంచెం, ముందున్న ఆ కొండవైపు చూడు. అది తన స్థానంలో స్థిరంగా ఉంటే అప్పుడు నీవు నన్ను చూడగలవు. '' ఆ ప్రకారం అతని ప్రభువు ఆ కొండపై తన తేజస్సును ప్రసరింపజేసి దానిని భస్మం చేసేశాడు. మూసా స్పృహతప్పి పడిపోయాడు. తెలివి వచ్చిన తరువాత ఇలా అన్నాడు: ''నీవు పరిశుద్ధు డవు. నేను నీ సన్నిధిలో పశ్చాత్తాపపడుతున్నాను. అందరికంటే మొదట నేనే విశ్వసిస్తున్నాను. '' ఇలా సెలవిచ్చాడు : ''మూసా, నా సందేశాన్ని అందజెయ్యటానికి, నాతో సంభాషించటానికి, ప్రజలందరికంటే నీకు ప్రాధాన్యం ఇచ్చి నేను నిన్ను ఎన్నుకున్నాను. కనుక నేనిచ్చే దానిని తీసుకో. కృతజ్ఞతలు తెలుపు.''

**7. అల్ ఆరాఫ్** 145 - 147 తరువాత మేము జీవితానికి సంబంధించిన ప్రతి రంగానికి కావలసిన హితబోధనూ, ప్రతి వ్యవహారానికి సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకత్వాన్నీ శిలాఫలకాలపై వ్రాసి మూసాకు ఇచ్చాము. అతనితో ఇలా అన్నాము : ''ఈ ఉపదేశాలను నీ చేతులతో గట్టిగా పట్టుకో. వాటి ఉత్తమ భావాలను అనుసరించండి అని నీ

జాతివారిని ఆజ్ఞాపించు. త్వరలోనే నేను నీకు దుర్మార్గుల గృహాలను చూపిస్తాను. ఏ హక్కూ లేకుండా భూమిపై పెద్దలుగా చలామణీ అయ్యే వారి దృష్టిని నేను నా సూచనల నుండి మరలిస్తాను. వారు ఏ సూచనను చూచినా దానిని ఎన్నటికీ విశ్వసించరు. ఒకవేళ సరియైన మార్గం వారి ముందుకు వచ్చినా దానిని వారు అవలంబించరు. ఒకవేళ వక్రమార్గం కనిపిస్తే , వెంటనే ఆ మార్గం మీదకు దుముకుతారు. ఎందుకంటే , వారు మా సూచనలను తిరస్కరిం చారు. వాటిని నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. మా సూచనలను తిరస్కరించి పరలోకంలో హాజరు కావటాన్ని త్రోసిపుచ్చేవాడి కర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ప్రజలు మరేదైనా ప్రతిఫలాన్ని పొందగలరా , వారు ఎంతచేస్తే అంత తప్ప?''

**7. అల్ ఆరాఫ్** 148 - 153 మూసా (వెళ్ళిన) తరువాత , అతని జాతి ప్రజలు తమ ఆభరణాలతో ఒక ఆవుదూడ విగ్రహాన్ని తయారుచేశారు. అందులో నుండి ఆవు అరుపువంటి ధ్వని వచ్చేది. అది వారితో మాట్లాడలేదనీ , మరే వ్యవహారంలోనూ వారికి మార్గం చూపలేదనీ వారికి కనిపించేది కాదా? అయినప్పటికీ వారు దానిని ఆరాధ్యదైవంగా చేసుకున్నారు. వారు పరమ దుర్మార్గులు. వారి నుండి ఆత్మ వంచనపు తెరలు తొలగిపోయినప్పుడు వారు తాము వాస్తవానికి మార్గం తప్పామని కనుగొన్నారు. అప్పుడు ఇలా అన్నారు : ''మా ప్రభువు గనక మాపై దయ చూపకపోతే, మమ్మల్ని మన్నించకపోతే, మేము సర్వనాశనం అయిపోతాము. '' అటునుండి మూసా ఆగ్రహంతో , విచారంతో తన జాతి ప్రజల వద్దకు మరలివచ్చాడు. వచ్చిన వెంటనే ఇలా అన్నాడు : ''నేను లేనప్పుడు నా స్థానంలో మీరు చాలా చెడ్డగా ప్రవర్తించారు. మీ ప్రభువు ఆజ్ఞ కొరకు నిరీక్షించే ఓపిక కూడా మీలో లేకుండా పోయిందా?'' అతను శిలాఫలకాలను విసిరివేశాడు. తన సోదరుడు (హారూను) తలవెంట్రుకలను పట్టుకొని అతన్ని లాగాడు. హారూను ఇలా అన్నాడు: ''నా తల్లి కుమారుడా! ఈ ప్రజలు నన్ను లోబరచుకున్నారు. ఇంకా కాస్తయితే నన్ను చంపేసేవారే. కనుక నీవు శత్రువులకు , నన్ను చూసి నవ్వే అవకాశం ఇవ్వకు. ఈ దుర్మార్గపు ముఠాతో నన్ను కలపకు.'' అప్పుడు మూసా ఇలా అన్నాడు : ''ప్రభూ! నన్నూ నా సోదరుణ్ణీ క్షమించు. మమ్మల్ని నీ కారుణ్యంలోకి ప్రవేశింపజెయ్యి. నీవు అందరికంటే అధికంగా కారుణ్యం చూపేవాడవు. '' (సమాధానంగా ఇలా సెలవియ్యబడిరది) : ''ఆవుదూడను ఆరాధ్యదైవంగా చేసుకున్న వారు తప్పకుండా తమ ప్రభువు ఆగ్రహంలో చిక్కుకుని తీరుతారు. ఇహలోక జీవితంలో అవమానం పాలవుతారు. అబద్ధం సృష్టించే వారికి మేము ఇటువంటి శిక్షనే విధిస్తాము. చెడుకార్యం చేసి , పశ్చాత్తాపపడి, విశ్వసించేవారు నిశ్చయంగా ఈ పశ్చాత్తాప , విశ్వాసాల తరువాత వారు నీ ప్రభువును క్షమించేవాడుగా, కనికరించేవాడుగా చూస్తారు.''

**7. అల్ ఆరాఫ్** 154 - 156 కోపం చల్లారిన పిమ్మట , మూసా ఆ శిలాఫలకాలను తన చేతులలోకి తీసుకున్నాడు. వాటి వ్రాతలో తమ ప్రభువుకు భయపడే వారికొరకు మార్గదర్శకత్వమూ కారుణ్యమూ ఉన్నాయి. మేము నిర్ణయించిన సమయానికి (అతనితో పాటు) హాజరుకావటానికి మూసా తన జాతి ప్రజల నుండి డెబ్బైమందిని ఎన్నుకున్నాడు. వారిని ఒక తీవ్ర భూకంపం వచ్చి పట్టుకున్నప్పుడు మూసా ఇలా మనవి చేసుకున్నాడు : ''నా

స్వామీ! మీరు సంకల్పించి ఉన్నట్లయితే , మొదట్లోనే వీళ్ళనూ, నన్నూ నాశనం చేయగలిగి ఉండేవారు. మాలోని కొందరు అజ్ఞానులు చేసిన తప్పునకు మీరు మా అందరినీ నాశనం చేస్తారా ? ఇది మీరు పెట్టిన ఒక పరీక్ష. దానిద్వారా మీరు కోరినవారిని అపమార్గానికి గురిచేస్తారు. ఇంకా మీరు కోరిన వారికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదిస్తారు. మా సంరక్షకులు మీరే! కనుక మమ్మల్ని క్షమించండి. మాపై దయచూపండి. మీరు అందరికంటే అధికంగా క్షమించేవారు. మా కొరకు ఇహలోకపు మేలునూ వ్రాయండి , పరలోకపు మేలును కూడా వ్రాయండి. మేము మీ వైపునకే మరలాము.'' సమాధానంగా ఇలా సెలవయింది : ''శిక్షను నేను కోరినవారికి విధిస్తాను. కాని నా కారుణ్యం ప్రతి వస్తువునూ ఆవరించి ఉంది. నాపట్ల అవిధేయతకు దూరంగా ఉండేవారి కొరకూ, జకాత్ ఇచ్చేవారి కొరకూ, నా ఆయతులను విశ్వసించేవారి కొరకూ నేను దానిని వ్రాస్తాను.''

**7. అల్ ఆరాఫ్** 157 - 158 ఈ సందేశహరుణ్ణి , చదువనూ వ్రాయనూ రాని ఈ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)ను అనుసరించేవారు (ఈనాడు ఈ కారుణ్యానికి అర్హులు). అతని ప్రస్తావన వారికి తమ వద్ద ఉన్న తౌరాతు ఇంజీలు గ్రంథాలలో వ్రాయబడి లభిస్తుంది. అతను వారికి మంచిని ఆజ్ఞాపిస్తాడు. చెడు నుండి నిరోధిస్తాడు. వారికొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మసమ్మతం చేస్తాడు. అపరిశుద్ధమైన వాటిని నిషిద్ధం చేస్తాడు. వారిపై మోపబడివున్న బరువులను దించుతాడు. వారు బంధింపబడిన శృంఖలాలను త్రెంచుతాడు. కనుక అతనిని విశ్వసించీ సమర్థించీ అతనికి సహకరించీ అతనితో అవతరింపజెయ్యబడిన జ్యోతిని అనుసరించేవారు మాత్రమే సాఫల్యం పొందేవారు. ముహమ్మద్! ఇలా ప్రకటించు: ''మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్ ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను - అతను అల్లాహ్ ను, ఆయన సూక్తులను విశ్వసిస్తాడు - అతనిని అనుసరించండి, మీరు సరియైన మార్గం పొందుతారేమో.

**7. అల్ ఆరాఫ్** 159 - 160 మూసా జాతిలో సత్యం ప్రకారం హితబోధ చేసే , సత్యం ప్రకారమే న్యాయం చేసే ఒక వర్గం కూడా ఉండేది. మేము ఆ జాతిని పన్నెండు వంశాలుగా విభజించి , వాటిని శాశ్వత వర్గాలుగా తీర్చిదిద్దాము. మూసాను అతని జాతివారు నీళ్ళు అడిగినప్పుడు మేము అతనిని తన చేతికర్రతో ఫలానా కొండరాయిని కొట్టు అని సంజ్ఞ చేశాము. అప్పుడు ఆ రాయి నుండి పన్నెండు ఊటలు పెల్లుబికాయి. ప్రతి వర్గం వారు తాము నీళ్ళు పొందే స్థలాన్ని నిర్ణయించుకున్నారు. మేము వారిపై మేఘాల ఛాయను కల్పించాము. వారిపై మన్న్ సల్వాలను దింపాము - ''తినండి మేము మీకు ప్రసాదించిన పరిశుద్ధమైన పదార్థాలను'' అని అన్నాము. కాని తరువాత వారు ఏమి చేశారో అది మాకు అన్యాయం చేయటం కాదు, తమకు తామే అన్యాయం చేసుకున్నారు.

**7. అల్ ఆరాఫ్** 161 - 162 వారికి ఇలా ఆజ్ఞాపించటం జరిగిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో : ''ఈ పట్టణంలోకి పోయి నివసించండి. దాని పంటద్వారా మీ ఇష్టప్రకారం ఆహారం పొందండి. ఇంకా ''హిత్తతున్'' ''హిత్తతున్'' అంటూ వెళ్ళండి. సాష్టాంగపడుతూ పట్టణ ద్వారంలో ప్రవేశించండి , మేము మీ తప్పులను మన్నిస్తాము. సద్వైఖరి కలిగి ఉండేవారిని అధికానుగ్రహంతో సత్కరిస్తాము. '' కాని వారిలోని దుర్మార్గులు తమకు చెప్పిన మాటను మార్చివేశారు. పర్యవసానంగా మేము వారి దుర్మార్గానికి ఫలితంగా వారిపైకి ఆకాశం నుండి శిక్షను పంపాము.

**7. అల్ ఆరాఫ్** 163 - 166 సముద్రపు గట్టున ఉన్న ఆ పట్టణాన్ని గురించి కూడా వారిని కొంచెం అడుగు. ఆ సంఘటనను వారికి గుర్తుచేయి. అక్కడి ప్రజలు సబ్బత్ (శనివారం) రోజున దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించేవారు. ఇంకా చేపలు సబ్బత్‌నాడే వారిముందు ఎగిరెగిరి నీటిపైకి వస్తూ ఉండేవి. సబ్బత్ నాడు తప్ప మిగతా దినాలలో అవి వచ్చేవికావు. ఇలా ఎందుకు జరిగేదంటే , మేము వారి అవిధేయతలు కారణంగా వారిని పరీక్షకు గురిచేస్తూ ఉండేవారము. ఇంకా వారికి ఈ విషయం కూడా గుర్తుచేయి. వారిలోని ఒక వర్గం వారు మరొక వర్గం వారితో ఇలా అన్నారు : ''మీరు హితబోధ ఎందుకు చేస్తున్నారు అల్లాహ్ నాశనం చెయ్యనున్నవారికి లేక కఠినంగా శిక్షించనున్న వారికి?'' వారు ఇలా సమాధానం చెప్పారు : ''మేము మీ ప్రభువు ముందు క్షమింపబడటానికి ఒక కారణంగా చెప్పుకునే నిమిత్తం ఇదంతా చేస్తున్నాము. బహుశా ఈ ప్రజలు ఆయనపట్ల అవిధేయతకు దూరంగా ఉంటారనే ఆశతో చేస్తున్నాము. '' చివరకు వారు తమకు జ్ఞాపకం చెయ్యబడిన హితబోధలను పూర్తిగా విస్మరించినప్పుడు, మేము చెడునుండి ప్రజలను వారించేవారిని రక్షించాము. దుర్మార్గులైన ఇతరులందరినీ వారి అవిధేయతలు కారణంగా కఠినశిక్షకు గురిచేశాము. తరువాత వారు , తాము నిరోధించబడిన పనినే పూర్తి తలబిరుసుతనంతో చేస్తూపోయారు. అప్పుడు మేము ఇలా అన్నాము:''కోతులై పొండి, హీనులుగా నీచులుగా!''

**7. అల్ ఆరాఫ్** 167 జ్ఞాపకం తెచ్చుకో, నీ ప్రభువు ఇలా ప్రకటించిన సందర్భాన్ని : ''ప్రళయదినం వచ్చేవరకు నేను తప్పకుండా ఇస్రాయీలు సంతతివారిని తీవ్రయాతనకు గురిచేసే ప్రజల అదుపులో ఉండేలా చేస్తూ ఉంటాను. '' నిశ్చయంగా నీ ప్రభువు శిక్షించటంలో వడిగలవాడు. నిశ్చయంగా ఆయన మన్నింపుతో కరుణతో వ్యవహరించేవాడూను.

**7. అల్ ఆరాఫ్** 168 - 171 మేము వారిని భువిలో ముక్కలు ముక్కలుగా చేసి నానా జాతులుగా విభజించాము. వారిలో కొందరు సజ్జనులు. కొందరు దానికి భిన్నమైనవారు. మేము వారిని మంచీ చెడూ స్థితుల ద్వారా పరీక్షకు గురిచేస్తూ వచ్చాము. బహుశా వారు మరలివస్తారేమో అని. ఆపై పూర్వపు తరాల తరువాత అయోగ్యులైన వారు వారికి వారసులయ్యారు. వారు దైవగ్రంథానికి వారసులై కూడా తుచ్ఛమైన ఐహిక ప్రయోజనాలను సేకరిస్తున్నారు. పైగా ఇలా అంటారు : ''మేము క్షమింపబడతామని ఆశిస్తున్నాము.'' ఆ ఐహిక సంపదే ముందుకు వస్తే , మళ్ళీ దానిని వారు తటాలున అందుకుంటారు. సత్యమైన దానినే అల్లాహ్ పేరుతో పలకాలని వారినుండి గ్రంథప్రమాణం

తీసుకోవటం జరగలేదా? గ్రంథంలో వ్రాయబడివున్న దానిని స్వయంగా వారే చదివారు. పరలోక నివాసం దైవభక్తి పరాయణులకు మాత్రమే మేలైనది. మీరు ఈమాత్రపు విషయాన్ని అర్థం చేసుకోలేరా ? గ్రంథాన్ని పాటించే , నమాజును స్థాపించే సద్వర్తనుల ప్రతిఫలాన్ని మేము నిశ్చయంగా వ్యర్థం చెయ్యము. ఆ సంఘటన కూడా వారికేమైనా జ్ఞాపకం ఉందా , అప్పుడు మేము పర్వతాన్ని కదలించి దానిని ఒక గొడుగు మాదిరిగా వారిపై కప్పాము. అది తమపై పడుతుందేమో అని వారు భ్రమపడ్డారు. ఆ సమయంలో మేము వారితో ఇలా అన్నాము : ''మేము మీకు ఇస్తున్న గ్రంథాన్ని దృఢంగా పట్టుకోండి. అందులో వ్రాయబడి ఉన్నదానిని జ్ఞాపకం ఉంచుకోండి. అప్పుడు మీరు చెడు నడవడికి దూరంగా ఉంటారని ఆశించబడుతోంది.''

**7. అల్ ఆరాఫ్** 172 - 174 ప్రవక్తా! ప్రజలకు ఆ సమయాన్ని జ్ఞాపకం చెయ్యి. అప్పుడు నీ ప్రభువు ఆదము సంతతి యొక్క వీపుల నుండి వారి సంతానాన్ని తీసి ఇంకా స్వయంగా వారిని వారికే సాక్షులుగా నిలబెట్టి అడిగాడు: ''నేను మీ ప్రభువును కాదా ?'' అని. వారు ఇలా అన్నారు : ''నిశ్చయంగా మీరే మా ప్రభువు. మేము దీనికి సాక్ష్యమిస్తున్నాము.'' మేము ఇలా ఎందుకు చేశామంటే , ప్రళయదినంనాడు మీరు , ''మాకు ఈ విషయం తెలియదు'' అని అనకుండా ఉండేటందుకు , లేదా ''షిర్కును మా తాత ముత్తాతలు మాకంటే ముందే ప్రారంభించారు. తరువాత మేము వారి సంతతికి జన్మించాము. దుర్జనులు చేసిన నేరానికి మీరు మమ్మల్ని పట్టుకుంటారా?'' అని అనకుండా ఉండేటందుకు. చూడండి , ఇలా మేము సూచనలను స్పష్టంగా వివరిస్తాము. వారు మరలిరావాలని ఇలా చేస్తాము.

**7. అల్ ఆరాఫ్** 175 - 176 ప్రవక్తా! వారికి ఆ వ్యక్తి గాధను వినిపించు. అతనికి మేము మా ఆయతుల జ్ఞానాన్ని ప్రసాదించాము. కాని అతడు వాటిని పాటించకుండా విముఖుడై పోయాడు. చివరకు షైతాను అతణ్ణి వెంబడిరచాడు. పర్యవసానంగా అతడు మార్గభ్రష్టులలో కలసిపోయాడు. మేము గనక కోరివున్నట్లయితే అతనికి ఆ ఆయతుల ద్వారా ఔన్నత్యాన్ని ప్రసాదించి ఉండేవారము. కాని అతడు భూమి వైపునకే మ్రొగ్గాడు. తన మనోవాంఛలనే అనుసరించాడు. కనుక అతడి పరిస్థితి కుక్క వంటిదైపోయింది. మీరు దానిపై దాడిచేస్తే అప్పుడు కూడా అది నాలుకను వెళ్ళబెట్టుతుంది. దానిని వదలిపెడితే అప్పుడు కూడా అది నాలుకను వెళ్ళబెట్టుతుంది. మా ఆయతులను తిరస్కరించే వారి దృష్టాంతం కూడా ఇదే. నీవు వారికి ఈ గాథలను వినిపిస్తూ ఉండు , బహుశా వారు యోచిస్తారేమో.

**7. అల్ ఆరాఫ్** 177 - 179 మా ఆయతులను తిరస్కరించిన వారి దృష్టాంతం చాలా చెడ్డది. ఎందుకంటే వారు తమకు తామే అన్యాయం చేసుకుంటున్నారు. అల్లాహ్ ఎవడికి మార్గం చూపుతాడో వాడే సన్మార్గం పొందుతాడు. కాని అల్లాహ్ ఎవడిని తన మార్గదర్శకత్వానికి దూరం చేస్తాడో , వాడే నిష్ఫలుడౌతాడు, నష్టపోతాడు. చాలామంది జిన్నాతులనూ, మానవులనూ మేము నరకం కోసమే సృష్టించాము , ఇది యథార్థం. వారికి హృదయాలున్నాయి

కాని  వారు వాటితో ఆలోచించరు. వారికి కళ్ళు ఉన్నాయి కాని వారు వాటితో చూడరు. వారికి చెవులు ఉన్నాయి కాని వారు వాటితో వినరు. వారు జంతువుల వంటివారు - కాదు వాటికంటే కూడా దిగజారిపోయారు. అలక్ష్యంలో మునిగివున్నవారు వీరే.

**7. అల్ ఆరాఫ్** 180 - 183 అల్లాహ్ మంచి పేర్లకు అర్హుడు. ఆయనను మంచి పేర్లతోనే వేడుకోండి. ఆయనను మంచిపేర్లతో పిలిచే విషయంలో సత్యం నుండి వైదొలగే వారిని వదలిపెట్టండి. వారు తాము చేస్తున్న దానికి ప్రతిఫలం పొంది తీరుతారు. మేము సృష్టించినవారిలో ఖచ్చితంగా సత్యం ప్రకారం ఉపదేశించే , సత్యం ప్రకారం న్యాయం చేసే ఒక వర్గం కూడా ఉంది. ఇక మా ఆయతులు అసత్యాలని తిరస్కరించిన వారు , మేము వారిని క్రమేణా వారికి ఏమాత్రం తెలియని పద్ధతి ప్రకారం వినాశం వైపునకు తీసుకుపోతాము. నేను వారికి సడలింపును ఇస్తున్నాను. నా వ్యూహానికి తిరుగు లేదు.

**7. అల్ ఆరాఫ్** 184 - 186 తమ మిత్రునిపై ఉన్మాదప్రభావం ఏదీ పడలేదు అనే విషయం గురించి వారు ఎప్పుడూ ఆలోచించలేదా? అతను హెచ్చరిక చేసేవాడు మాత్రమే. (చెడు ఫలితం కలుగకముందే) స్పష్టంగా హెచ్చరిక చేస్తున్నాడు. ఇంకా వారు భూమ్యాకాశాలు పనిచేసే తీరును గురించి ఎప్పుడూ యోచిం చలేదా ? అల్లాహ్ సృష్టించిన ఏ వస్తువునూ వారు కళ్ళు తెరచి చూడలేదా ? బహుశా వారి జీవితపు గడువు పూర్తిఅయ్యే సమయం ఆసన్నమయిందనే విషయాన్ని గురించి కూడా వారు ఆలోచించలేదా ? అయితే ప్రవక్త చేసిన ఈ హెచ్చరిక తరువాత అసలు వారు విశ్వసించే విషయం మరొకటి ఏది కాగలదు ?-అల్లాహ్ తన మార్గదర్శకత్వం నుండి దూరం చేసే వ్యక్తికి మరొక మార్గదర్శకుడు ఎవడూ లేడు. అల్లాహ్ అటువంటి వారిని తమ తలబిరుసుతనంలో మార్గం తప్పి తిరగటానికి వదలిపెడతాడు.

**7. అల్ ఆరాఫ్** 187 - 188 వారు నిన్ను ''అసలు ఆ ప్రళయ గడియ ఎప్పుడు అవతరిస్తుంది ?'' అని అడుగుతున్నారు. ఇలా అను : ''దానిని గురించి నా ప్రభువుకే తెలుసు. దానిని దాని సమయం వచ్చినప్పుడే ఆయన ప్రత్యక్ష పరుస్తాడు. ఆకాశాలలో , అవనిలో అది అత్యంత కఠినసమయంగా ఉంటుంది. అది మీపై అకస్మాత్తుగా వచ్చిపడుతుంది.'' నీవు దాని అన్వేషణలో మునిగి వున్నట్లుగా భావించి వారు నిన్ను దానిని గురించి అడుగుతున్నారు. ఇలా అను: ''దానిని గురించి కేవలం అల్లాహ్ కు మాత్రమే తెలుసు. కాని చాలామందికి ఈ యధార్థం తెలియదు.'' ప్రవక్తా! వారితో ఇలా అను : ''నాకు సంబంధించిన లాభనష్టాలపై నాకు ఏ అధికారమూ లేదు. అల్లాహ్ కోరింది మాత్రమే అవుతుంది. నాకే గనక అగోచర విషయ జ్ఞానం ఉన్నట్లయితే , నేను ఎన్నో ప్రయోజనాలను నా కొరకు పొంది ఉండేవాణ్ణి. నాకు ఎన్నటికీ ఏ నష్టమూ వాటిల్లేది కాదు. నేను నా మాటను నమ్మేవారి కొరకు కేవలం హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే. శుభవార్త వినిపించేవాణ్ణి మాత్రమే.''

**7. అల్ ఆరాఫ్** 189 - 198 అల్లాహ్ యే మిమ్మల్ని ఏకైక ప్రాణి నుండి సృష్టించాడు. ఇంకా అదే జాతినుండి అతనికి సహచరిని సృజించాడు, అతను ఆమెతో ప్రశాంత జీవితం గడపటానికి. తరువాత పురుషుడు స్త్రీని కప్పివేసినప్పుడు ఆమె ఒక తేలికైన భారాన్ని ధరించింది. ఆమె దానిని మోసుకుంటూ తిరుగుతూ ఉండేది. తరువాత ఆమె గర్భభారం అధికమయినప్పుడు, వారు ఉభయులూ కలసి తమ ప్రభువైన అల్లాహ్ ను ఇలా వేడుకున్నారు : ‘‘నీవు గనక మాకు మంచి పిల్లవాణ్ణి ఇచ్చినట్లయితే , మేము నీకు కృతజ్ఞులం అవుతాము. ’’ అప్పుడు అల్లాహ్ వారికి ఒక చక్కని, ఏ లోపమూ లేనటువంటి పిల్లవాణ్ణి ప్రసాదించాడు. కాని వారు ఆయన ప్రసాదించిన ఈ కానుక విషయంలో ఇతరులను ఆయనకు భాగస్వాములుగా చేయసాగారు. వారు చేసే ఈ షిర్కు పనులకు అల్లాహ్ అతీతుడు, ఉన్నతుడూను. ఎంత మూఢులు వీళ్ళు! ఏ వస్తువునూ సృష్టించలేనివారిని , స్వయంగా తామే సృష్టించబడేవారిని, ఎవరికీ సహాయం చెయ్యలేనివారిని , స్వయంగా తమకు తామే సహాయం చేసుకోలేని వారిని వీరు అల్లాహ్ కు భాగస్వాములుగా చేస్తున్నారు. ఒకవేళ మీరు వారిని రుజుమార్గం పైకి రమ్మని ఆహ్వానిస్తే వారు మీవెంట రారు. మీరు వారిని పిలిచినా లేక మౌనం వహించినా మీకు రెండూ ఒక్కటే. అల్లాహ్ ను త్రోసిరాజని మీరు వేడుకుంటున్న వారు మీ మాదిరిగానే కేవలం దాసులు. మీరు వారిని ప్రార్థించి చూడండి. మీకు వారిపట్ల ఉన్న భావాలు నిజమే అయితే మీ ప్రార్థనలకు వారు సమాధానం ఇవ్వాలి. వారికి కాళ్ళు ఉన్నాయా వాటితో నడవటానికి? వారికి చేతులు ఉన్నాయా వాటితో పట్టుకోవటానికి ? వారికి కళ్ళు ఉన్నాయా వాటితో చూడడానికి ? వారికి చెవులు ఉన్నాయా వాటితో వినడానికి ? ప్రవక్తా! వారితో ఇలా అను : ‘‘మీరు నిలబెట్టిన భాగస్వాములను పిలవండి. తరువాత మీరంతా కలసి నాకు వ్యతిరేకంగా వ్యూహాలు పన్నండి. నాకు ఎంతమాత్రం గడువు ఇవ్వకండి. ఈ గ్రంథాన్ని అవతరింపజేసిన దేవుడే నాకు రక్షకుడు , సహాయకుడు. ఆయన సజ్జనులకు సహాయపడతాడు. దీనికి భిన్నంగా మీరు అల్లాహ్ ను వదలి వేడుకునేవారు మీకూ సహాయం చెయ్యలేరు , స్వయంగా తమకూ సహాయం చేసుకోలేరు. ఇంకా మీరు గనక వారిని రుజుమార్గం వైపునకు రమ్మని పిలిస్తే , వారు మీ మాటను విననైనా లేరు. పైకి వారు మీవైపు చూస్తూ ఉన్నట్లు కనిపిస్తుంది. కాని వాస్తవానికి వారు దేనినీ చూడలేరు.’’

**7. అల్ ఆరాఫ్** 199 - 202 ప్రవక్తా! మృదుత్వం , మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు. మూర్ఖులతో వాదానికి దిగకు. ఒకవేళ ఎప్పుడైనా షైతాను నిన్ను ఉసిగొలిపితే అల్లాహ్ శరణు వేడు. ఆయన అన్నీ వినేవాడు. అన్నీ తెలిసినవాడు. వాస్తవానికి భయభక్తులు కలవారి స్థితి ఇలా ఉంటుంది. ఎప్పుడైనా షైతాను ప్రభావం వల్ల వారికి ఏదైనా చెడు ఆలోచన తట్టినప్పటికీ , వారు తక్షణం అప్రమత్తులవుతారు. తరువాత వారు అవలంబించవలసిన సరియైన మార్గమేమిటో వారికి స్పష్టంగా కనిపిస్తుంది. ఇక వారి (అంటే షైతాను) సోదరులు , వారు వారిని తమ వక్రమార్గంలోనికే లాక్కుపోతారు. వారిని భ్రష్టులుగా చెయ్యటంలో ఏమాత్రం లోపం చేయరు.

**7. అల్ ఆరాఫ్** 203 - 204 ప్రవక్తా! నీవు వారికి ఏదైనా ఒక సూచనను (మహత్మ్యాన్ని) చూపకపోతే వారు ఇలా అంటారు : ‘‘నీవు నీకొరకు ఏదైనా సూచనను ఎందుకు ఎన్నుకోలేదు ?’’ వారితో ఇలా అను : ‘‘నేను కేవలం నా

ప్రభువు నా వద్దకు పంపిన వహీని మాత్రమే అనుసరిస్తాను. ఇందులో జ్ఞాన కాంతిపుంజాలు ఉన్నాయి. అవి మీ ప్రభువు తరఫు నుండి వచ్చాయి. ఇది మార్గదర్శకత్వం , కారుణ్యం, దానిని స్వీకరించే వారి కొరకు. దివ్య ఖురాను మీ ముందు పఠింపబడుతూ ఉన్నప్పుడు , దానిని శ్రద్ధతో వినండి , మౌనంగా ఉండండి. బహుశా మీరు కూడా కరుణింపబడతారేమో.

**7. అల్ ఆరాఫ్** 205 - 206 ప్రవక్తా! నీ ప్రభువును ఉదయమూ సాయంత్రమూ స్మరించు , లోలోపల వినయంతోనూ భయపడుతూనూ, మెల్లగా నోటితో కూడా. నిర్లక్ష్యం చేసేవారిలో నీవు చేరకు. నీ ప్రభువు సన్నిధిలో సన్నిహిత స్థానం కలిగివుండే దైవదూతలు ఎన్నడూ తమ గొప్పతనానికి గర్వపడి ఆయన ఆరాధనకు విముఖులు కారు. ఆయనను స్తుతిస్తూ ఉంటారు. ఆయన ముందు సజ్దాచేస్తూ వినమ్రులయి ఉంటారు.

**8. అల్ అన్ఫాల్**

ఆయతులు : 75 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**8. అల్ అన్ఫాల్** 1 - 6 వారు నిన్ను ''అన్ఫాల్''ను గురించి అడుగుతున్నారు. ఇలా అను : ''ఈ అన్ఫాల్ అల్లాహ్కూ ఆయన ప్రవక్తకూ చెందుతాయి. కనుక మీరు అల్లాహ్ కు భయపడండి. మీ పరస్పర సంబంధాలను సంస్కరించుకోండి. అల్లాహ్కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి, మీరు గనక విశ్వాసులే అయితే.'' నిజమైన విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావన విన్నంతనే భయంతో కంపిస్తాయి. వారి సమక్షంలో అల్లాహ్ ఆయతులు పారాయణం చెయ్యబడినప్పుడు వారి విశ్వాసం పెరుగుతుంది. వారు తమ ప్రభువు పట్ల నమ్మకం కలిగివుంటారు. వారు నమాజును స్థాపిస్తారు. వారికి మేమిచ్చిన దానినుండి (మా మార్గంలో) ఖర్చుపెడతారు. అటువంటి వారే నిజమైన విశ్వాసులు. వారికొరకు వారి ప్రభువు వద్ద ఉన్నత స్థానాలు ఉన్నాయి. తప్పులకు మన్నింపు ఉంది. శ్రేష్ఠమైన ఆహారం ఉంది. (ఈ అన్ఫాల్ వ్యవహారంలో కూడా ఇదివరకు ఉత్పన్నమైన పరిస్థితి వంటిదే ఇప్పుడూ ఉత్పన్నమౌతోంది. అప్పుడు) నీ ప్రభువు నిన్ను సత్యంతో నీ గృహం నుండి బయటకు తీసుకువచ్చాడు. విశ్వసించిన వారిలోని ఒక వర్గం వారికి ఇది ఇష్టం లేదు. వారు ఈ సత్యం విషయంలో నీతో ఘర్షణపడ్డారు , అది వాస్తవానికి సత్యమని పూర్తిగా రుజువైపోయింది. వారి పరిస్థితి తమ కళ్లముందే తాము మృత్యువు వైపునకు తరుమబడే వారి మాదిరిగా ఉంది.

**8. అల్ అన్ఫాల్** 7 - 8 రెండు వర్గాలలో ఒక వర్గం మీకు దొరికిపోతుందని అల్లాహ్ వాగ్దానం చేసిన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకోండి. మీకు బలహీనవర్గం దొరకాలని మీరు కోరుకున్నారు. కాని తన మాటల ద్వారా సత్యం యొక్క సత్యతను నిరూపించాలనేది, అవిశ్వాసులను సమూలంగా నాశనం చెయ్యాలనేది అల్లాహ్ సంకల్పం. ఎందుకంటే , సత్యం సత్యంగా రూఢ కావాలని, అసత్యం అసత్యంగా రుజువు కావాలని, ఇది అపరాధులకు ఎంత అనిష్టమైనా సరే.

**8. అల్ అన్ఫాల్** 9 - 10 ఇంకా మీరు మీ ప్రభువును సహాయం కొరకు ప్రార్థించిన సందర్భాన్ని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి. సమాధానంగా అప్పుడు ఆయన ఇలా సెలవిచ్చాడు : "నేను మీ సహాయం కొరకు వెయ్యిమంది దైవదూతలను ఒకరి తరువాత ఒకరిని ఎడతెగకుండా పంపుతున్నాను. " మీకు శుభవార్తగానూ మీ మనస్సులు దీనివల్ల నిశ్చింతగా ఉండే నిమిత్తమూ అల్లాహ్ ఈ విషయాన్ని మీకు తెలిపాడు. సహాయమనేది ఎప్పుడు లభించినా అల్లాహ్ తరఫు నుండే లభిస్తుంది. నిశ్చయంగా అల్లాహ్ అత్యంత శక్తిమంతుడు , అత్యంత వివేకవంతుడూను.

**8. అల్ అన్ఫాల్** 11 ఇంకా ఆ సమయాన్ని అప్పుడు అల్లాహ్ తన తరఫు నుండి నిద్రమత్తురూపంలో నిశ్చింతనూ, నిర్భయస్థితినీ మీపై ఆవహింపచేస్తూ ఉన్నాడు. ఆయన ఆకాశం నుండి మీపై నీళ్ళను వర్షింపచేస్తూ ఉన్నాడు , మిమ్మల్ని పరిశుద్ధపరచాలని, మీకు షైతానువల్ల కలిగిన మాలిన్యాన్ని మీనుండి దూరం చెయ్యాలని , మీకు ధైర్యం కలిగించాలని, తద్వారా మీ పాదాలను సుస్థిరం చెయ్యాలని.

**8. అల్ అన్ఫాల్** 12 - 14 ఇంకా ఆ సమయం , అప్పుడు మీ ప్రభువు దైవదూతలకు ఇలా సంజ్ఞ చేశాడు : "నేను మీకు తోడుగా ఉన్నాను. మీరు విశ్వాసులకు ధైర్య స్థైర్యాలను కలిగించండి. నేను ఇప్పుడే ఈ అవిశ్వాసుల హృదయాలలో భయాన్ని సృష్టిస్తాను. కనుక మీరు వారి మెడలపై కొట్టండి. వారి కీలుకీలుపై కొట్టండి. ఎందుకంటే వారు అల్లాహ్ ను , ఆయన ప్రవక్తను ఎదిరించారు. అల్లాహ్నూ , ఆయన ప్రవక్తనూ ఎదిరించే వారిపట్ల అల్లాహ్ అత్యంత కఠినంగా వ్యవహరిస్తాడు - ఇది మీ శిక్ష. ఇక దానిని రుచి చూడండి. సత్యాన్ని తిరస్కరించేవారికి నరకశిక్ష ఉంటుందనే విషయం మీరు తెలుసుకోవాలి.

**8. అల్ అన్ఫాల్** 15 - 16 విశ్వాసులారా! మీరుగనక సైన్యం రూపంలో అవిశ్వాసులను ఎదుర్కొంటే , వారికి వెన్ను చూపకండి. ఎవడు అటువంటి సమయంలో వెన్నుచూపుతాడో - యుద్ధపుటెత్తుగడగా అలా చేస్తే తప్ప లేదా మరొక (విశ్వాసుల) సైన్యాన్ని కలిసేందుకు అలా చేస్తే తప్ప - అతడు అల్లాహ్ ఆగ్రహంలో చిక్కుకుపోతాడు. నరకం అతడి నివాస స్థలం అవుతుంది. అది అతిచెడ్డ పునరాగమన ప్రదేశం.

**8. అల్ అన్ఫాల్** 17 - 19 కనుక యథార్థం ఏమిటంటే, వారిని మీరు చంపలేదు. వారిని అల్లాహ్ చంపాడు. ప్రవక్తా! నీవు విసరలేదు అల్లాహ్ విసిరాడు. ఇది (ఈ పనికొరకు విశ్వాసుల చేతులు వినియోగించబడటం) ఎందుకంటే , అల్లాహ్ ముస్లిములను ఒక మంచి పరీక్షగుండా విజయవంతంగా దాటించదలచాడు. నిశ్చయంగా అల్లాహ్ అన్నీ వినేవాడూ, అన్నీ తెలిసినవాడూను. ఈ వ్యవహారం మీకు సంబంధించి నంతవరకే. అవిశ్వాసుల పట్ల వ్యవహారం ఎలా ఉంటుందంటే, అల్లాహ్ వారి వ్యూహాలను బలహీన పరుస్తాడు. ఈ అవిశ్వాసులతో ఇలా అను : "మీరు గనక తీర్పును కోరితే, ఇదో, తీర్పు మీ ముందుకు వచ్చేసింది. కాబట్టి ఇక మానండి , అది మీకే మేలు. ఒకవేళ మీరు ఈ

బుద్ధితక్కువ పనిని మళ్ళీ చేసినట్లయితే మేము కూడా మళ్ళీ అదే శిక్షను విధిస్తాము. మీ సైనికదళం , అది ఎంత అధికంగా ఉన్నప్పటికీ, మీకు ఏమాత్రం పనికిరాదు. అల్లాహ్ విశ్వాసులతో ఉన్నాడు.''

**8. అల్ అన్ఫాల్** 20 - 23 విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్కూ , ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి. ఆజ్ఞ విన్న తరువాత దాని నుండి మరలకండి. వాస్తవంగా వినకుండానే ''మేము విన్నాము '' అని అనే వారివలె మీరూ అయిపోకండి. తమ బుద్ధిని ఉపయోగించని చెవిటివారూ , మూగవారూ మాత్రమే నిశ్చయంగా అల్లాహ్ దృష్టిలో నీచాతినీచమైన కోవకు చెందిన జంతువులు. వారిలో ఏ కొద్దిపాటి మంచితనమైనా ఉందని అల్లాహ్ కు అనిపించి ఉంటే, ఆయన వారికి తప్పకుండా వినేభాగ్యం కలుగజేసి ఉండేవాడు. (కాని ఆ మంచితనం లేకుండా) ఆయన గనక వారికి వినిపించి ఉండినట్లయితే, వారు నిర్లక్ష్యంగా తమ ముఖాలను త్రిప్పుకుని ఉండేవారే.

**8. అల్ అన్ఫాల్** 24 - 29 విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ పిలుపునకూ , ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి, ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే దానివైపునకు మిమ్మల్ని పిలిచినప్పుడు. తెలుసుకోండి , అల్లాహ్ మనిషికీ అతని హృదయానికీ మధ్య ఉన్నాడనీ, ఆయన వైపునకే మీరు పోగుచేయబడతారనీ. ఆ ఉపద్రవం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. దానివల్ల కలిగే హాని ప్రత్యేకంగా మీలో పాపం చేసిన వారికే పరిమితమై ఉండదు. అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడనే విషయాన్ని తెలుసుకోండి. జ్ఞాపకం తెచ్చుకోండి ఆ సమయాన్ని , అప్పుడు మీరు అల్పసంఖ్యలో ఉండేవారు , భూమిపై మీరు దుర్బలులుగా పరిగణింపబడేవారు , మిమ్మల్ని ప్రజలు రూపుమాపుతారేమో అని మీరు భయపడుతూ ఉండేవారు , తరువాత అల్లాహ్ మీకు ఆశ్రయస్థలాన్ని సమకూర్చాడు. తన సహాయంతో మీ చేతులకు బలం చేకూర్చాడు. మీకు మంచి ఉపాధిని ఏర్పాటు చేశాడు , బహుశా మీరు కృతజ్ఞులు అవుతారేమో అని. విశ్వసించిన ప్రజలారా! బుద్ధిపూర్వకంగా అల్లాహ్కూ ఆయన ప్రవక్తకూ నమ్మకద్రోహం చెయ్యకండి. మీ అమానతుల విషయంలో ద్రోహానికి పాల్పడకండి. మీ సంపద , మీ సంతానమూ వాస్తవంగా పరీక్షాసాధనాలని , అల్లాహ్ వద్ద ప్రతిఫలంగా ఇవ్వటానికి కావలసినంత ఉందనే విషయాన్ని తెలుసుకోండి. విశ్వసించిన ప్రజలారా! మీరు గనక భయభక్తులను అవలంబిస్తే , అల్లాహ్ మీకు గీటురాయిని ప్రసాదిస్తాడు. మీనుండి మీ చెడులను దూరం చేస్తాడు. మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్ అత్యధికంగా అనుగ్రహించేవాడు.

**8. అల్ అన్ఫాల్** 30 - 37 ఆ సమయం కూడా జ్ఞాపకం తెచ్చుకోదగ్గదే అప్పుడు సత్య తిరస్కారులు నీకు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ ఉన్నారు, నిన్ను నిర్బంధించాలని లేదా నిన్ను హత్యచెయ్యాలని లేదా నిన్ను దేశం నుండి బహిష్కరించాలని. వారు తమ ఎత్తులు తాము వేస్తూ ఉన్నారు. అల్లాహ్ తన ఎత్తు తాను వేస్తూ ఉన్నాడు. అల్లాహ్ అందరికంటే బాగా ఎత్తులు వేస్తాడు. మా ఆయతులు వారికి వినిపించబడినప్పుడు వారు ఇలా అనేవారు: ''అవును, మేము విన్నాము. మేము గనక కోరితే , అటువంటి మాటలనే మేమూ సృష్టించగలం. ఇవి

పూర్వం నుండీ ప్రజలు చెప్పుకుంటూ వస్తున్న పాత కథలే. '' వారు అన్న ఆ మాట కూడా జ్ఞాపకం ఉంది : ''దైవమా! ఇది నిజంగా నీ తరఫు నుండి వచ్చిన సత్యమే అయితే, మాపై ఆకాశం నుండి రాళ్ళను కురిపించు లేదా ఏదైనా బాధాకరమైన శిక్షను మాపైకి తీసుకురా. '' నీవు వారిమధ్య ఉన్నప్పుడు , అల్లాహ్ వారిపై ఆపదను అవతరింపజెయ్యడు. ప్రజలు క్షమాభిక్ష కొరకు ప్రార్థిస్తూ ఉంటే , వారిని శిక్షించటం అనేది అల్లాహ్ సంప్రదాయం కాదు. కాని ఇప్పుడు ఆయన వారిపై శిక్షను ఎందుకు అవతరింపచెయ్యకూడదు, వారు ''మస్జిదె హరామ్'' యొక్క మార్గాన్ని ఆటంకపరుస్తూ ఉన్నప్పుడు ? వాస్తవానికి వారు ఈ మసీదుకు ధర్మసమ్మతమైన ముతవల్లీలు (ధర్మకర్తలు) కారు. దీనికి ధర్మసమ్మతమైన ముతవల్లీలు కేవలం భయభక్తులు కలవారే కాగలరు. కాని చాలామంది ఈ విషయాన్ని ఎరుగరు. బైతుల్లాహ్ (అల్లాహ్ గృహం) వద్ద వారు చేసే నమాజేమిటీ ? కేవలం ఈలలు వేయటం, చప్పట్లు కొట్టటం తప్ప. కనుక, ఇదో, ఈ శిక్షను చవి చూడండి, మీరు చేస్తూ ఉండిన సత్యతిరస్కారానికి ఫలితంగా. సత్యాన్ని ఒప్పుకోవడానికి నిరాకరించిన వారు , తమ సంపదను ప్రజలు అల్లాహ్ మార్గం వైపునకు రాకుండా ఆపటానికి వ్యయపరుస్తున్నారు. ఇంకా వ్యయపరుస్తూనే పోతారు. కాని చివరకు ఈ ప్రయత్నాలే వారి దుఃఖానికి కారణభూతమవు తాయి. అప్పుడు వారు పరాధీనులౌతారు. తరువాత ఈ అవిశ్వాసులు పోగుచేయబడి నరకం వైపునకు తరుమబడతారు. అల్లాహ్ మాలిన్యాన్ని పరిశుద్ధత నుండి వేరుచేయటానికి , అన్ని రకాల మాలిన్యాన్ని కలిపి ఒకచోట పోగుచెయ్యటానికి, తరువాత ఆ కుప్పను నరకంలో పడవేయటానికి. అసలు దివాలా తీసినవారు వీరే.

**8. అల్ అన్‌ఫాల్** 38 ప్రవక్తా! ఈ అవిశ్వాసులకు ఇలా చెప్పు: ''ఇప్పుడైనా మానుకుంటే , గతంలో జరిగినదానినంతా మన్నించటం జరుగుతుంది. కాని వారు పూర్వపు వైఖరినే మళ్ళీ అవలంబిస్తే , పూర్వపు జాతులకు ఏమి జరిగిందో, అది అందరికీ తెలుసు.''

**8. అల్ అన్‌ఫాల్** 39 - 40 విశ్వసించిన ప్రజలారా! పీడన ఏమాత్రం మిగలకుండా పోయేవరకు, అల్లాహ్ నిర్ణయించిన ధర్మం పూర్తిగా నెలకొల్పబడేవరకు ఈ అవిశ్వాసులతో యుద్ధం చెయ్యండి. తరువాత వారు పీడనను మానుకుంటే, అల్లాహ్ వారి కర్మలను తప్పకుండా గమనిస్తాడు. ఒకవేళ వారు మానకపోతే , అల్లాహ్ మీకు సంరక్షకుడు అని తెలుసుకోండి. ఆయన ఉత్తమరక్షకుడూ, సహాయకుడూను.

**8. అల్ అన్‌ఫాల్** 41 మీరు ఈ విషయాన్ని తెలుసుకోవాలి: మీరు యుద్ధ సంపదగా పొందిన దానిలో ఐదవభాగం అల్లాహ్కూ, ఆయన ప్రవక్తకూ , బంధువులకూ, అనాథలకూ, బీదవారికీ, బాటసారులకూ చెందుతుంది. మీరు అల్లాహ్నూ, నిర్ణయదినం నాడు అంటే ఉభయ సైన్యాలు ఢీకొన్ననాడు మేము మా దాసునిపై అవతరింపజేసిన విషయాన్నీ విశ్వసించినట్లయితే (ఈ భాగాన్ని సంతోషంగా ఇవ్వండి) అల్లాహ్ కు అన్ని విషయాలపై అధికారం ఉంది.

**8. అల్ అన్‌ఫాల్** 42 ఆ సమయాన్ని గుర్తుకు తెచ్చుకోండి : అప్పుడు మీరు లోయకు ఈ ప్రక్కన ఉన్నారు. వారు ఆ ప్రక్కన మకాము చేశారు. మీకు క్రింది (ఒడ్డు) వైపున బిడారు ఉంది. ఒకవేళ మొదటే మీకూ వారికీ మధ్య యుద్ధం చెయ్యాలి అనే తీర్మానమే జరిగి ఉండినట్లయితే , మీరు తప్పకుండా ఈ సందర్భంలో ఆ తీర్మానాన్ని పాటించకుండా దాటవేసి ఉండేవారు. కాని జరిగింది ఏదో అది అల్లాహ్ తాను తీసుకున్న నిర్ణయాన్ని అమలుపరచటానికి జరిగింది , నశించవలసినవాడు స్పష్టమైన నిదర్శనంతో నశించాలని , జీవించవలసినవాడు స్పష్టమైన నిదర్శనంతో జీవించాలని జరిగింది. నిశ్చయంగా అల్లాహ్ వినేవాడూ తెలిసినవాడూనూ.

**8. అల్ అన్‌ఫాల్** 43 ఆ సమయాన్ని కూడ గుర్తుకు తెచ్చుకోండి , అప్పుడు ఓ ప్రవక్తా! అల్లాహ్ వారిని నీ కలలో కొద్దిమందిగా చూపాడు. ఒకవేళ ఆయన వారిని ఎక్కువ సంఖ్యలో చూపి ఉన్నట్లయితే మీరు తప్పకుండా ధైర్యాన్ని కోల్పోయి ఉండేవారు. యుద్ధం విషయంలో వివాదపడి ఉండేవారు. కాని అల్లాహ్ యే మిమ్మల్ని దీనినుండి రక్షించాడు. నిశ్చయంగా ఆయన హృదయాల స్థితిని సైతం ఎరుగును.

**8. అల్ అన్‌ఫాల్** 44 జ్ఞాపకం తెచ్చుకోండి: యుద్ధ సమయంలో అల్లాహ్ మీ దృష్టికి శత్రువులను కొద్దిమందిగా చూపాడు. వారి దృష్టికి మిమ్మల్ని తగ్గించి చూపాడు , జరుగవలసి ఉన్నదానిని అల్లాహ్ అమలులోకి తీసుకురావడానికి. చివరకు అన్ని వ్యవహారాలూ అల్లాహ్ వద్దకే మరలిపోతాయి.

**8. అల్ అన్‌ఫాల్** 45 - 47 విశ్వాసులారా! మీరు ఒక వర్గాన్ని ఎదుర్కొన్నప్పుడు స్థైర్యముతో ఉండండి. అల్లాహ్ ను అత్యధికంగా స్మరించండి , మీకు విజయభాగ్యం కలుగుతుందని ఆశించవచ్చు. అల్లాహ్కూ ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి. పరస్పరం కలహించుకోకండి. అలా జరిగితే మీలో బలహీనత ప్రవేశిస్తుంది , మీ శక్తి సన్నగిల్లిపోతుంది. సహనంతో మెలగండి. నిశ్చయంగా అల్లాహ్ సహనం చూపేవారితో ఉంటాడు. తమ గృహాల నుండి విర్రవీగుతూ ప్రజల ముందు తమ దర్పాన్ని ప్రదర్శిస్తూ బయలుదేరేవారి మాదిరిగా , అల్లాహ్ మార్గం నుండి ప్రజలను నిరోధించే వైఖరిని కలిగి వున్నవారి మాదిరిగా ప్రవర్తించకండి. వారు చేస్తున్నది ఏదీ అల్లాహ్ పట్టుకు అతీతంగా లేదు.

**8. అల్ అన్‌ఫాల్** 48 - 54 ఆ సమయాన్ని గురించి కొంచెం ఆలోచించండి అప్పుడు షైతాను వారి చేష్టలను వారి దృష్టికి ఆకర్షకములుగా చేసిచూపాడు. ఇంకా వారితో ఇలా అన్నాడు : ''ఈనాడు మిమ్మల్ని ఎవడూ జయించలేడు, (ఎందుకంటే) నేను మీతో ఉన్నాను. '' కాని రెండు పక్షాలు ఒక దానికొకటి ఎదురుపడినప్పుడు , అతడు మడమతిప్పి ఇలా అన్నాడు: ''మీకూ నాకూ ఏ సంబంధమూ లేదు. మీరు చూడనివి ఎన్నో నేను చూస్తున్నాను. నాకు అల్లాహ్ అంటే భయం కలుగుతోంది. అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడు. '' అప్పుడు కపటులూ, హృదయాలకు రోగం తగిలినవారూ, అందరూ ఇలా అన్నారు: ''వారిని వారి ధర్మం పిచ్చివారిని చేసింది. '' వాస్తవానికి ఎవరైనా అల్లాహ్ ను నమ్ముకుంటే , నిశ్చయంగా అల్లాహ్ మహాశక్తిమంతుడూ , మహా వివేకవంతుడూను. దైవదూతలు ,

హతులైన అవిశ్వాసుల ప్రాణాలను తీస్తున్నప్పటి స్థితిని నీవు గనక చూడగలిగితే ఎంత బాగుండేది! వారు వారి ముఖాలపైని, పిరుదులపైని కొట్టేవారు. ఇంకా ఇలా అనేవారు : ''ఇదో, కాల్చే శిక్షను అనుభవించండి. ఇది స్వయంగా మీ చేతులే ముందుగా సేకరించి పెట్టినదానికి ప్రతిఫలం. అంతేకాని అల్లాహ్ తన దాసులకు అన్యాయం చేసేవాడు మాత్రం కాదు.'' ఇది ఫిరౌను జాతివారికీ, వారి పూర్వపు ప్రజలకూ సంభవిస్తూ వచ్చిన విధంగానే వీరికీ సంభవించింది. అంటే, వారు అల్లాహ్ ఆయతులను విశ్వసించ టానికి తిరస్కరించారు. అప్పుడు అల్లాహ్ వారిని వారి పాపాలు కారణంగా పట్టుకున్నాడు. అల్లాహ్ శక్తిగలవాడు, కఠిన శిక్షను విధించేవాడు. ఇది అల్లాహ్ యొక్క ఈ సంప్రదాయం ప్రకారం జరిగింది: ఒక జాతి తన నడవడికను మార్చుకోనంతవరకు , అల్లాహ్ తాను దానికి ప్రసాదించిన ఏ అనుగ్రహాన్నీ ఉపసంహరించడు. అల్లాహ్ అన్నీ వింటాడు. ఆయనకు అంతా తెలుసు. ఫిరౌను జాతివారికీ, వారికి పూర్వపు జాతుల వారికీ ఏమి సంభవించిందో, అది ఈ నియమం ప్రకారమే సంభవించింది. వారు తమ ప్రభువు ఆయతులను తిరస్కరించారు. అప్పుడు మేము వారిని వారి పాపాలకు ఫలితంగా నాశనం చేశాము. ఇంకా ఫిరౌను ప్రజలను (సముద్రంలో) ముంచివేశాము. వారందరూ దుర్మార్గులే.

**8. అల్ అన్ఫాల్** 55 - 59 నిశ్చయంగా భూమిపై సంచరించే ప్రాణులన్నింటిలోకెల్లా అల్లాహ్ దృష్టిలో మిక్కిలి నీచమైనవారు సత్యాన్ని అంగీకరించటానికి తిరస్కరించి , ఇక ఎట్టి పరిస్థితులలోనూ దానిని విశ్వసించ టానికి సిద్ధంగా లేనివారు (ముఖ్యంగా) వారిలో నీవు ఒప్పందం కుదుర్చుకున్నవారు అవకాశం దొరికినప్పుడల్లా వారు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారు. అల్లాహ్ కు ఏమాత్రం భయపడరు. కావున ఒకవేళ మీకు వారు రణరంగంలో ఎదురైతే, వారికి ఎలా బుద్ధిచెప్పాలంటే , వారి తరువాత అదే వైఖరిని అవలంబించనున్న ప్రజలు భయభ్రాంతులై పారిపోవాలి. ఒప్పందాన్ని ఉల్లంఘించేవారి ఈ పర్యవసానాన్ని చూసి వారు గుణపాఠం నేర్చుకుంటారని ఆశించవచ్చు. ఒకవేళ మీకు ఎప్పుడైనా ఏ జాతివల్లనైనా నమ్మక ద్రోహం కలుగుతుందనే భయం ఉంటే బాహాటంగా వారి ఒప్పందాన్ని వారి ముందు విసిరి వెయ్యండి. నిశ్చయంగా అల్లాహ్ నమ్మకద్రోహులను ప్రేమించడు. సత్య తిరస్కారులు తాము గెలిచామనే అపోహకు గురికారాదు. నిశ్చయంగా వారు మమ్మల్ని ఓడిరచలేరు.

**8. అల్ అన్ఫాల్** 60 మీరు మీ శక్తిమేరకు అత్యధికబలాన్నీ , కట్టివేసి సిద్ధంగా ఉన్న గుర్రాలను వారిని ఎదుర్కోవటానికి సమాయత్తపరచుకోండి, తద్వారా అల్లాహ్ శత్రువులనూ మీ శత్రువులనూ , ఇంకా మీరు ఎరుగని, కాని అల్లాహ్ ఎరిగిన ఇతర శత్రువులనూ భయకంపితులుగా చెయ్యండి. అల్లాహ్ మార్గంలో మీరు ఏది ఖర్చుచేసినా, దాని పూర్తి ప్రతిఫలం మీ వైపునకు మళ్ళించబడుతుంది. మీకు ఎంతమాత్రం అన్యాయం జరగదు.

**8. అల్ అన్ఫాల్** 61 - 64 ప్రవక్తా! శత్రువు గనక సంధీ శాంతుల వైపునకు మొగ్గు చూపితే , నీవు కూడా దానికి సిద్ధపడు. అల్లాహ్ పై భారం వెయ్యి ఆయనే అంతా వినేవాడూ అన్నీ తెలిసినవాడూను. ఒకవేళ నిన్ను మోసం చేసే ఉద్దేశ్యమే వారికి ఉంటే , నీకు అల్లాహ్ చాలు. తన సహాయంతోనూ , ముస్లిముల ద్వారానూ నిన్ను

ఆదుకున్నవాడూ, ఇంకా ముస్లిముల మనస్సులను ఒకదానితో ఒకటి కలిపినవాడూ ఆయనేకదా! నీవు సమస్త భూసంపదను ఖర్చుపెట్టినా, వారి మనస్సులను కలపగలిగి ఉండేవాడవు కాదు. కానీ అల్లాహ్ వారి మనస్సులను కలిపాడు. నిశ్చయంగా ఆయన మహా శక్తిమంతుడు , మహా వివేకవంతుడు. ప్రవక్తా! నీకూ , నిన్ను అనుసరించే విశ్వాసులకూ అల్లాహ్ యే చాలు.

**8. అల్ అన్ఫాల్** 65 - 66 ప్రవక్తా! ముస్లిములను యుద్ధానికి పురికొలుపు. మీలోగనక ఇరవైమంది స్థైర్యం కలవారు ఉంటే, వారు రెండువందల మందిని జయిస్తారు. ఇంకా అటువంటి వారు వందమంది గనక ఉంటే , వేయిమంది సత్యతిరస్కారులను జయిస్తారు. ఎందుకంటే, వారు బుద్ధిహీనులైన ప్రజలు. సరే, ఇప్పుడు అల్లాహ్ మీ బరువును తేలిక చేశాడు, ఆయనకు తెలుసు, ఇంకా మీలో బలహీనత ఉందని. కనుక మీలోగనక వందమంది సహనస్థైర్యాలు కలవారు ఉంటే, వారు రెండువందల మందినీ, ఇంకా అటువంటి వారు గనక వేయిమంది ఉంటే, రెండువేల మందినీ, అల్లాహ్ ఆదేశాను సారం జయించగలరు. సహనం కలవారితో అల్లాహ్ ఉంటాడు.

**8. అల్ అన్ఫాల్** 67 - 69 ధరణిలో శత్రువులను పూర్తిగా అణచనంతవరకు, తనవద్ద యుద్ధ ఖైదీలను ఉంచుకోవటం అనేది ఏ ప్రవక్తకూ తగదు. మీరు ప్రాపంచిక ప్రయోజనాలను కాంక్షిస్తున్నారు. కాని అల్లాహ్ (మీకొరకు) పరలోకాన్ని కాంక్షిస్తున్నాడు. అల్లాహ్ శక్తిమంతుడూ , వివేకవంతుడూను. ముందేగనక అల్లాహ్ ఫర్మానా ఒకటి వ్రాయబడి ఉండకపోతే, మీరు తీసుకున్నదానికి పర్యవసానంగా మీకు పెద్ద శిక్ష పడి ఉండేది. కనుక మీరు పొందిన సొమ్మును తినండి. అది ధర్మసమ్మతమైనదీ , పవిత్రమైనదీను. అల్లాహ్ కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ మన్నించేవాడూ కరుణించేవాడూను.

**8. అల్ అన్ఫాల్** 70 - 71 ప్రవక్తా! నీ అధీనంలో బందీలుగా ఉన్న వారితో ఇలా అను : ‘‘మీ హృదయాలలో ఏపాటి మంచితనమైనా ఉన్నదని అల్లాహ్ కు తెలిస్తే, ఆయన మీ వద్దనుండి తీసుకొన్న దానికంటె ఎంతో ఎక్కువగా మీకు ఇస్తాడు. మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్ మన్నించేవాడూ కరుణించేవాడూను. ’’ కాని వారు నీకు నమ్మకద్రోహం చెయ్యాలనే ఉద్దేశం కలిగివున్నట్లయితే - ఇంతకు పూర్వం వారు అల్లాహ్ కు నమ్మకద్రోహం చేసే ఉన్నారు, అందుకుగాను శిక్షగా అల్లాహ్ వారిని నీ అదుపులోకి తెచ్చాడు - అల్లాహ్ కు అంతా తెలుసు , ఆయన వివేచనాపరుడు.

**8. అల్ అన్ఫాల్** 72 - 73 విశ్వాసాన్ని స్వీకరించి వలసపోయినవారూ, అల్లాహ్ మార్గంలో తమ ప్రాణాలనూ తమ సంపదలనూ ఒడ్డి పోరాడిన వారూ , వలసవచ్చిన వారికి ఆశ్రయమిచ్చి సహాయం చేసినవారూ - వారే అసలు ఒకరికొకరు స్నేహితులు, సంరక్షకులూను. ఇక విశ్వసించినప్పటికీ (దారుల్ ఇస్లాంలోకి) వలసపోనివారు వలస రానంతవరకు వారి సంరక్షణతో మీకు సంబంధం లేదు. ఒకవేళ వారు ధర్మ వ్యవహారాలలో మీ సహాయం కోరితే , వారికి సహాయం చెయ్యటం మీ విధ్యుక్త ధర్మం. కాని మీరు ఒప్పందం కుదుర్చుకున్న జాతికి వ్యతిరేకంగా మాత్రం

కాదు. మీరు చేసేదంతా అల్లాహ్ చూస్తున్నాడు. సత్య తిరస్కారులు పరస్పరం సహాయం చేసుకుంటారు. ఒకవేళ మీరు పరస్పరం సహాయం చేసుకోనకపోతే భూమిపై హింసాదౌర్జన్యాలూ, అల్లకల్లోలమూ చెలరేగుతాయి.

**8. అల్ అన్ఫాల్** 74 - 75 విశ్వసించి అల్లాహ్ మార్గంలో ఇల్లూవాకిలీ వదలిపెట్టి కృషిచేసినవారూ , వారికి ఆశ్రయమిచ్చి సహాయం చేసినవారూ , వారే నిజమైన విశ్వాసులు. వారి పాపాలకు మన్నింపూ , వారికి చక్కని ఉపాధీ లభిస్తాయి. ఆ తరువాత విశ్వసించి , వలసవచ్చినవారు మీతో కలిసి కృషిచేసిన వారు కూడా మీతోనే చేరిపోతారు. కాని అల్లాహ్ గ్రంథం ప్రకారం రక్తసంబంధం కలవారు పరస్పరం ఎక్కువ హక్కుదారులు. నిశ్చయంగా అల్లాహ్ కు ప్రతి విషయమూ తెలుసు.

**9. అత్ తౌబా**

ఆయతులు : 129 అవతరణ : మదీనాలో

**9. అత్ తౌబా** 1 - 2 అల్లాహ్ తరఫు నుండి, ఆయన ప్రవక్త తరఫు నుండి మీరు ఒడంబడికలు చేసుకున్న ముష్రిక్కులకు విముక్తి ప్రకటించబడుతోంది. కనుక మీరు దేశంలో స్వేచ్ఛగా ఇంకా నాలుగు నెలలు తిరగండి. మీరు అల్లాహ్ ను అశక్తుడుగా చెయ్యలేరని తెలుసుకోండి. అల్లాహ్ సత్యతిరస్కారులను పరాభవంపాలు చేస్తాడు.

**9. అత్ తౌబా** 3 - 4 పెద్ద హజ్ రోజున సమస్త ప్రజలకు అల్లాహ్ తరఫు నుండీ ఆయన ప్రవక్త తరఫు నుండీ చెయ్యబడే బహిరంగ ప్రకటన ఏమిటంటే , అల్లాహ్ ముష్రిక్కులకు ఏ విధంగానూ బాధ్యుడు కాడు అలాగే ఆయన ప్రవక్త కూడా. ఇప్పుడు మీరు గనక పశ్చాత్తాపపడితే అది మీకే మేలు. ఒకవేళ విముఖులైతే మీరు అల్లాహ్ ను అశక్తుడుగా చెయ్యలేరు అని బాగా అర్థం చేసుకోండి. ప్రవక్తా! తిరస్కరించేవారికి కఠినశిక్షను గురించిన శుభవార్తను వినిపించు, మీరు ఒడంబడికలు కుదుర్చుకున్న ముష్రిక్కులకు తప్ప. ఎందుకంటే వారు తమ ఒడంబడికలు నెరవేర్చటంలో మీపట్ల ఏ లోపమూ చేయలేదు , మీకు వ్యతిరేకంగా ఎవరికీ సహాయం చేయలేదు అటువంటి వారితోపాటు మీరు కూడా ఒడంబడికను గడువు వరకు పాటించండి. ఎందుకంటే , అల్లాహ్ భయభక్తులు గలవారంటేనే ఇష్టపడతాడు.

**9. అత్ తౌబా** 5 - 6 కనుక , నిషిద్ధ మాసాలు గడిచిపోయిన తర్వాత ముష్రిక్కులను చంపండి , ఎక్కడ కనిపిస్తే అక్కడ, ఇంకా వారిని పట్టుకోండి, చుట్టుముట్టండి, ప్రతి మాటువద్ద వారి కొరకు పొంచి కూర్చోండి. తరువాత ఒకవేళ వారు పశ్చాత్తాపపడితే , నమాజును స్థాపిస్తే , జకాత్ ఇస్తే , వారిని విడిచిపెట్టండి. అల్లాహ్ మన్నించేవాడూ , కరుణించేవాడూను. ఒకవేళ ముష్రిక్కులలో ఏ వ్యక్తి అయినా శరణుగోరి మీ వద్దకు రాదలిస్తే (అల్లాహ్ గ్రంథాన్ని వినటానికీ), అతనికి శరణు ఇవ్వండి , అతడు అల్లాహ్ గ్రంథాన్ని వినే అంతవరకు. తరువాత అతనిని అతని భద్రతాస్థలం వరకు చేర్చండి. ఇలా ఎందుకు చెయ్యాలంటే వారికి గ్రంథ జ్ఞానము లేదు కాబట్టి.

**9. అత్ తౌబా** 7 - 12 ఈ ముష్రిక్కులకు అల్లాహ్ వద్ద ఆయన సందేశహరునివద్ద ఒడంబడిక అనేది అసలు ఎలా సాధ్యం? - మీరు 'మస్జిదె హరామ్' వద్ద ఒడంబడిక చేసుకున్నవారితో తప్ప. వారు మీతో సరిగ్గా ఉన్నంతవరకు మీరూ వారితో సరిగ్గా ఉండండి. ఎందుకంటే అల్లాహ్ భయభక్తులు కలవారంటే ఇష్టపడతాడు - కానీ వారితో తప్ప , ఇతర ముష్రిక్కులతో ఏ ఒడంబడికైనా ఎలా సాధ్యం, వారి పరిస్థితి ఇలా ఉన్నప్పుడు? అంటే మీపై ప్రాబల్యం వహిస్తే మీ విషయంలో ఏ బంధుత్వాన్నీ లెక్కచెయ్యరు, ఏ ఒడంబడిక బాధ్యతనూ ఖాతరుచెయ్యరు, వారు నోటిమాటలతో మిమ్మల్ని సమాధానపరచటానికి ప్రయత్నిస్తారు. కాని వారి మనస్సులు మాత్రం తిరస్కరిస్తాయి. వారిలో చాలామంది దుర్మార్గులు. వారు అల్లాహ్ ఆయతులను అల్పధరకు విక్రయించారు. అంతేకాదు , అల్లాహ్ మార్గంలో అవరోధమై నిల్చున్నారు. వారు చేసినవి బహుచెడ్డచేష్టలు. ఏ విశ్వాసి విషయం లోనైనా వారు బంధుత్వాన్నిగానీ, ఒడంబడిక బాధ్యతనుగానీ లెక్కచెయ్యరు. అతిక్రమణ అనేది ఎల్లప్పుడూ వారి వైపునుండే జరిగింది. కనుక ఒకవేళ వారు పశ్చాత్తాపపడితే, నమాజును స్థాపిస్తే, జకాత్ ఇస్తే, వారు మీ ధార్మిక సోదరులే. విజ్ఞుల కొరకు మేము మా ఆజ్ఞలను ఇలా స్పష్టం చేస్తాము. ఒకవేళ ఒడంబడిక కుదుర్చుకున్న తరువాత , వారు మళ్ళీ తమ ప్రమాణాలను భగ్నంచేస్తే, మీ ధర్మంపై దాడులు చెయ్యటం ప్రారంభిస్తే, అవిశ్వాస పతాకధారులతో యుద్ధం చెయ్యండి ఎందుకంటే, వారి ప్రమాణాలు ఏమాత్రం నమ్మదగ్గవి కావు. బహుశా (కరవాల శక్తివల్లనే) వారు మానుకోవచ్చు.

**9. అత్ తౌబా** 13 - 16 తమ వాగ్దానాలను భంగంచేస్తూ ఉన్నవారితో, సందేశహరుణ్ణి దేశం నుండి బహిష్కరించాలని నిర్ణయించుకున్నవారితో మీరు యుద్ధం చెయ్యరా ? అతిక్రమణను ప్రారంభించింది వారే. మీరు వారికి భయపడుతున్నారా? మీరు గనక విశ్వాసులే అయితే మీరు భయపడటానికి అల్లాహ్ యే ఎక్కువ అర్హుడు. కనుక వారితో యుద్ధం చెయ్యండి అల్లాహ్ మీ చేతుల ద్వారా వారిని శిక్షిస్తాడు. వారిని హీనులుగా , నీచులుగా చేసి అవమానంపాలుచేస్తాడు. ఇంకా వారికి ప్రతికూలంగా మీకు సహాయం చేస్తాడు. చాలామంది విశ్వాసుల హృదయాలను చల్లబరుస్తాడు. వారి గుండెల మంటను దూరం చేస్తాడు. ఇంకా తాను కోరినవారికి పశ్చాత్తాప భాగ్యం కలుగజేస్తాడు. అల్లాహ్ అంతా తెలిసినవాడూ వివేకవంతుడూను. మీరు ఊరికే వదలిపెట్టబడతారని అనుకుంటున్నారా? వాస్తవానికి మీలో (తనమార్గంలో) ప్రాణాలొడ్డి పోరాడిన వారు ఎవరో , ఇంకా, అల్లాహ్నూ సందేశహరుణ్ణీ విశ్వాసులనూ తప్ప మరెవరినీ ఆప్తమిత్రులుగా చేసుకోనివారు ఎవరో ఇంకా అల్లాహ్ చూడనేలేదు. మీరు ఏది చేస్తారో అది అల్లాహ్ కు తెలుసు.

**9. అత్ తౌబా** 17 - 22 ముష్రిక్కులు అల్లాహ్ మసీదులలో సంరక్షకులుగా , సేవకులుగా ఉండటానికి పనికిరారు. ఎందుకంటే వారే స్వయంగా అవిశ్వాసులమని తమకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తున్నారు. వారి కర్మలైతే అన్నీ వ్యర్థమైపోయాయి. నరకంలో వారు కలకాలం ఉండాలి. అల్లాహ్నూ , అంతిమదినాన్నీ విశ్వసించి , నమాజును స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు అల్లాహ్ కు తప్ప మరెవరికీ భయపడనివారు మాత్రమే అల్లాహ్ మసీదులకు సంరక్షకులూ, సేవకులూ కాగలగుతారు. వారే సరి j◌ై◌ున మార్గంలో నడుస్తారని ఆశించవచ్చు. అల్లాహ్నూ ,

అంతిమదినాన్నీ విశ్వసించి అల్లాహ్ మార్గంలో ప్రాణాలొడ్డి కృషిచేసే మనిషి పనితో హాజీలకు మంచినీళ్లు త్రాపటాన్ని, మస్జిదె హరామ్‌కు సేవలు చెయ్యటాన్ని మీరు సమానంగా భావించారా ? అల్లాహ్ దగ్గర వారిద్దరూ సమానులు కారు. అల్లాహ్ దుర్మార్గులకు మార్గం చూపడు. విశ్వసించి అల్లాహ్ మార్గంలో ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి తమ ప్రాణాలతో, తమ సంపదలతో పోరాడిన వారి అంతస్తే ఆయన దృష్టిలో గొప్పది. అట్టివారే సఫలీకృతులు. వారి ప్రభువు వారికి తన కారుణ్యం, తన సంతోషాల శుభవార్తనూ, శాశ్వత భోగాల సామగ్రిగల స్వర్గవనాల శుభవార్తనూ ఇస్తున్నాడు. వాటిలో వారు సదా ఉంటారు. నిశ్చయంగా సేవలకు ప్రతిఫలం ఇవ్వటానికి అల్లాహ్ వద్ద ఎంతో ఉంది.

**9. అత్ తౌబా** 23 - 24 విశ్వసించిన ప్రజలారా! మీ తండ్రులను , మీ సోదరులను కూడా మీ సహచరులుగా చేసుకోకండి, ఒకవేళ వారు విశ్వాసం కంటె అవిశ్వాసానికి ప్రాధాన్యం ఇస్తే. మీలో వారిని సహచరులుగా చేసుకునే వారే దుర్మార్గులు. ప్రవక్తా! ఇలా అను : ''ఒకవేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ బంధువులు, మీ ఆప్తులు , మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు , మందగి స్తాయేమో అని మీరు భయపడే మీ వ్యాపారాలు, మీరు ఇష్టపడే మీ గృహాలు అల్లాహ్ కంటే ఆయన ప్రవక్త కంటే ఆయన మార్గంలో శ్రమించటం కంటే మీకు గనక ఎక్కువ ప్రియతరమైతే, అల్లాహ్ తన తీర్పును మీముందుకు తీసుకువచ్చే వరకు నిరీక్షించండి. అల్లాహ్ దోషులకు మార్గం చూపడు.''

**9. అత్ తౌబా** 25 - 27 అల్లాహ్ ఇదివరకు చాలా సందర్భాలలో మీకు సహాయం చేసి ఉన్నాడు , ఇటీవలనే హునైన్ సంగ్రామం రోజున ఆయన సహాయం యొక్క మహిమను మీరు చూసి ఉన్నారు. ఆ రోజు మీరు మీ సంఖ్యాబలాన్ని చూసి గర్వపడ్డారు. కాని అది మీకు ఏవిధంగానూ పనికిరాలేదు. భూమి విశాలమైనది అయినప్పటికీ మీకు ఇరుకైపోయింది. మీరు వెన్నుచూపి పారిపోయారు. తరువాత అల్లాహ్ తన (తరఫు నుండి) ప్రశాంతస్థితిని తన ప్రవక్తపై విశ్వాసులపై అవతరింపజేశాడు ఇంకా మీకు కనిపించని దళాలను దించాడు. సత్యతిరస్కారులను శిక్షించాడు. సత్యాన్ని తిరస్కరించే వారికి లభించే ప్రతిఫలం ఇదే. తరువాత (మీరు దీనిని కూడా చూశారు) ఇలా శిక్షించిన తరువాత , అల్లాహ్ తాను కోరినవారికి పశ్చాత్తాప భాగ్యాన్ని కూడా ప్రసాదిస్తాడు. అల్లాహ్ మన్నించేవాడూ, కరుణించే వాడూను.

**9. అత్ తౌబా** 28 విశ్వసించిన ప్రజలారా! ముష్రిక్కులు అపరిశుద్ధులు. కనుక ఈ సంవత్సరం తరువాత వారు మస్జిదె హరామ్ దరిదాపులకు కూడా రాకూడదు. ఒకవేళ మీకు లేమి భయం కలిగితే , అల్లాహ్ కోరితే మిమ్మల్ని తన అనుగ్రహంతో సంపన్నులుగా చెయ్యటం అసంభవం కాదు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడూ వివేకవంతుడూను.

**9. అత్ తౌబా** 29 - 35 గ్రంథ ప్రజలలో అల్లాహ్నూ , అంతిమదినాన్నీ విశ్వసించనివారునూ, అల్లాహ్, ఆయన ప్రవక్త నిషిద్ధంగా నిర్ణయించినదానిని నిషిద్ధంగా భావించనివారునూ , ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోనివారునూ అయిన వారికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి. వారు స్వయంగా తమ చేతులతో జిజియా

ఇచ్చేవరకూ, లోబడి ఉండేవరకూ (వారితో పోరాడండి). ''ఉజైర్ అల్లాహ్ కుమారుడు'' అని యూదులు అంటారు. ''మసీహ్ అల్లాహ్ కుమారుడు '' అని క్రైస్తవులు అంటారు. వారికి పూర్వం అవిశ్వాసంలో పడివున్న వారి మాటలను అనుకరిస్తూ వారు తమ నోటితో అనే ఈ మాటలు నిరాధారమైనవి. దేవుని దెబ్బ వారిపై పడుగాక! వారెలా మోసపోతున్నారు! వారు అల్లాహ్ ను కాదని తమ పండితులను తమ సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారు. ఇంకా ఇదేవిధంగా మర్యమ్ కుమారుడైన మసీహ్‌ను కూడా. వాస్తవానికి , ఒకే దేవుని దాస్యం తప్ప మరెవరి ద్యాస్యాన్నీ చేసే ఆజ్ఞ వారికి ఇవ్వబడలేదు. ఆయన తప్ప ఆరాధనకు అర్హుడైన వాడెవడూ లేడు. ఆయన పరిశుద్ధుడు. వారు అనే షిర్కు మాటలకు అతీతుడు. వారు అల్లాహ్ జ్యోతిని తమ నోటితో ఊది ఆర్పివేయాలని అనుకుంటున్నారు. కాని అల్లాహ్ తన జ్యోతిని పరిపూర్ణం చెయ్యకుండా వదిలిపెట్ట టానికి అంగీకరించడు, అవిశ్వాసులకు ఇది ఎంత అయిష్టమైనా సరే. తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్నీ ఇచ్చి పంపినవాడు అల్లాహ్ యే. దానిని ఇతర అన్ని జీవన వ్యవస్థలపై ప్రబలింపజెయ్యా లని, ముష్రిక్కులకు ఇది ఎంత సహించరానిదైనా సరే. విశ్వసించిన ప్రజలారా! ఈ గ్రంథ ప్రజల యొక్క చాలామంది పండితుల స్థితీ సన్యాసుల స్థితీ ఎటువంటిదంటే, వారు ప్రజల సొమ్మును అక్రమపద్ధతుల ద్వారా తినేస్తారు. వారిని అల్లాహ్ మార్గం అనుసరించకుండా ఆపుతారు. వెండి బంగారాలను పోగుచేసి వాటిని దైవమార్గంలో ఖర్చుపెట్టని వారికి వ్యధాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను అందజెయ్యండి. ఈ వెండి బంగారాలు నరకాగ్నిలో కాల్చబడే ఒక రోజు వస్తుంది. వాటితోనే వారి నొసటిపై , వారి పార్శ్వాలపై, వీపులపై వాతలు వెయ్యబడతాయి - ఇది మీరు మీ కొరకు కూడబెట్టుకున్నది, ఇదిగో, ఇక మీరు కూడబెట్టిన సంపదను రుచిచూడండి.

**9. అత్ తౌబా** 36 - 37 యథార్థం ఏమిటంటే, ఆకాశాన్నీ భూమినీ అల్లాహ్ సృష్టించినప్పటినుండీ, మాసాల సంఖ్య అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు నిషిద్ధ మాసాలు. ఇదే సరియైన గణనపద్ధతి. కనుక ఈ నాలుగు మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి. ముష్రిక్కులతో అందరూ కలసి పోరాడండి , వారందరూ కలసి మీతో పోరాడేవిధంగా. తెలుసుకోండి, అల్లాహ్ భయభక్తులు కలవారితోనే ఉంటాడని. 'నసీ' అవిశ్వాసంలో ఒక అదనమైన అవిశ్వాసపు చేష్ట. దానిద్వారా ఈ అవిశ్వాసులు మార్గభ్రష్టతకు గురిచెయ్యబడతారు. ఒక సంవత్సరం ఒక మాసాన్ని ధర్మసమ్మతం చేసుకుంటారు, మరొక సంవత్సరం దానినే నిషిద్ధం చేసేస్తారు, అల్లాహ్ నిషిద్ధం చేసిన మాసాల సంఖ్యను పూర్తిచెయ్యాలనీ, అల్లాహ్ నిషిద్ధం చేసిన దానిని ధర్మసమ్మతం చేసుకోవాలని కూడా - వారి దుష్కార్యాలు వారికి మనోహరమైనవిగా చెయ్యబడ్డాయి అల్లాహ్ సత్యతిరస్కారులకు సన్మార్గం చూపడు.

**9. అత్ తౌబా** 38 - 40 విశ్వసించిన ప్రజలారా! మీకు ఏమైనది , మీతో అల్లాహ్ మార్గంలో బయలుదేరండి అని చెప్పినప్పుడు, మీరు నేలకు అతుక్కుపోయారు? మీరు పరలోకానికి మారుగా ప్రాపంచిక జీవితాన్ని కోరుకున్నారా? అలా అయితే మీరు తెలుసుకోవాలి , ప్రాపంచిక జీవితపు సకల సామగ్రి పరలోక సుఖాల ముందు స్వల్పాతి స్వల్పమైనదిగా తేలుతుందని. మీరు గనక లేవకపోతే, దేవుడు మీకు వ్యధాభరితమైన శిక్ష విధిస్తాడు. ఇంకా మీ

స్థానంలో మరొక సంఘాన్ని దేనినయినా లేపుతాడు. మీరు దేవునికి ఏమాత్రం నష్టం కలిగించలేరు. ఆయన ప్రతి వస్తువుపై అధికారం కలిగివున్నాడు. మీరు ఒకవేళ ప్రవక్తకు సహాయం చెయ్యకపోతే , ఏమీ ఫర్వాలేదు. అవిశ్వాసులు అతనిని బహిష్కరించినపుడూ అతను కేవలం ఇద్దరిలో రెండోవాడుగా ఉన్నప్పుడూ , వారిద్దరూ గుహలో ఉన్నప్పుడూ అతడు తన స్నేహితునితో , ''విచారపడకు, అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు '' అని అన్నప్పుడూ అల్లాహ్ అతనికి సహాయం చేశాడు. ఆ సమయంలో అల్లాహ్ అతనిపై తన తరఫునుండి మనశ్శాంతిని అవతరింపజేశాడు. అతనికి మీకు కానరాని దళాలతో సహాయపడ్డాడు. అవిశ్వాసుల మాటను కించపరిచాడు. అల్లాహ్ మాట సర్వదా సర్వోత్కృష్టమైనదే! అల్లాహ్ మహాశక్తి సంపన్నుడూ , మహావివేకవంతుడూనూ.

**9. అత్ తౌబా** 41 బయలుదేరండి , తేలికగానైనా సరే, బరువుగానైనా సరే. అల్లాహ్ మార్గంలో పోరాడండి మీ సంపద లనూ, మీ ప్రాణాలనూ ఒడ్డి. ఇది మీకు శ్రేయస్కరమైనది, మీరు గనక తెలుసుకుంటే.

**9. అత్ తౌబా** 42 ప్రవక్తా! లాభాలు గనక తేలికగా లభిస్తే , ప్రయాణం సులభతరమైతే వారు తప్పకుండా మీ వెంట రావటానికి సిద్ధపడేవారు. కాని వారికి ఈ మార్గం ఎంతో శ్రమతో కూడినదిగా కనిపించింది. ఇప్పుడు వారు దేవునిపై మాటిమాటికీ ప్రమాణం చేసి మరీ అంటారు : మేము గనక రాగల స్థితిలో ఉన్నట్లయితే, నిశ్చయంగా మీవెంట వచ్చి ఉండేవారమని. వారు తమను తాము వినాశంలో పడవేసుకుంటున్నారు. వారు అబద్ధం చెప్పేవారని అల్లాహ్ కు బాగా తెలుసు.

**9. అత్ తౌబా** 43 - 45 ప్రవక్తా! అల్లాహ్ నిన్ను క్షమించుగాక! నీవు వారికి అనుజ్ఞ ఎందుకు ఇచ్చావు? (వారికి నీవై అనుజ్ఞ ఇవ్వకుండా ఉండవలసింది) ఎవరు సత్యవంతులో నీకు స్పష్టమై ఉండేది. ఇంకా అబద్ధం చెప్పేవారిని కూడా నీవు తెలుసుకొని ఉండేవాడవు. అల్లాహ్ పై , అంతిమదినంపై విశ్వాసం కలిగి ఉండే వారు , తమ ప్రాణాలనూ, తమ సంపదలనూ ఒడ్డి పోరాడే విషయంలో తమను మన్నించ వలసినదని నిన్ను ఎన్నటికీ అభ్యర్థించరు. భయభక్తులు కలవారిని అల్లాహ్ బాగా ఎరుగును. అల్లాహ్ను , అంతిమదినాన్ని విశ్వసించనివారు తమ మనస్సులో సంశయాలు ఉండి వాటిలోనే ఊగిసలాడేవారు మాత్రమే అటువంటి అభ్యర్థనలను చేస్తారు.

**9. అత్ తౌబా** 46 - 48 ఒకవేళ నిజంగానే వారికి బయలుదేరాలనే ఉద్దేశం ఉంటే , దాని కొరకు వారు ఏవైనా సన్నాహాలు చేసివుండేవారు. కాని అల్లాహ్ కు వారు బయలుదేరటం అసలు ఇష్టం లేదు. కనుక ఆయన వారికి బద్ధకం కలుగజేశాడు. ఇంకా, ''వెనుక ఉండిపోయేవారితోనే ఉండిపోండి'' అని వారికి చెప్పబడిరది. వారు గనక మీతో బయలుదేరి ఉండినట్లయితే , మీకు కీడు తప్ప మరి దేనినీ అధికం చేసివుండేవారు కాదు. వారు మీ మధ్య విభేదాల్ని సృష్టించే నిమిత్తం తీవ్రప్రయత్నాలు చేస్తూ ఉంటారు. మీ వర్గం వారిలో వారి మాటలను చెవియొగ్గి వినేవారు ఇప్పటికీ చాలామంది ఉన్నారు. అల్లాహ్ ఆ దుర్మార్గులను బాగా ఎరుగును. ఇంతకుముందు కూడా

వారు విభేదాలను సృష్టించే ప్రయత్నాలు చేశారు. మిమ్మల్ని ఓడిరచటానికి వారు అన్ని రకాల వ్యూహాలను మార్చి మార్చి ప్రయోగించారు. చివరకు వారి ఇష్టానికి వ్యతిరేకంగా సత్యం వచ్చేసింది. అల్లాహ్ కార్యం నెరవేరిపోయింది.

**9. అత్ తౌబా** 49 వారిలో ఒకడు ఇలా అంటాడు: ''నాకు అనుజ్ఞ ఇవ్వండి. నన్ను పరీక్షకు గురిచెయ్యకండి '' - వినండి! వారు పరీక్షకే గురిఅయివున్నారు. నరకం ఈ అవిశ్వాసులను చుట్టుముట్టి ఉన్నది.

**9. అత్ తౌబా** 50 - 51 మీకు మేలు కలిగితే వారికి బాధ కలుగుతుంది. ఏదైనా ఆపద మీమీదకు వచ్చిపడినప్పుడు వారు ముఖాన్ని త్రిప్పుకొని సంతోషంతో పొంగిపోతూ మరలిపోతారు. ఇలా అంటూ పోతారు : ''మేము ముందే మా వ్యవహారాన్ని సరిచేసుకోవటం మంచిదయింది''. వారితో ఇలా అనండి : ''అల్లాహ్ మా కొరకు వ్రాసి ఉంచింది తప్ప మాకు ఏదీ (చెడుగానీ మంచిగానీ) ఏమాత్రం కలగదు. అల్లాహ్ యే మా సంరక్షకుడు. విశ్వసించేవారు ఆయననే నమ్ముకోవాలి.''

**9. అత్ తౌబా** 52 వారితో ఇలా అనండి : ''మీరు మా విషయంలో దేనికొరకు నిరీక్షిస్తున్నారో అది , రెండు మేళ్లలో ఒకటితప్ప మరొకటేముంది? ఇక మీ విషయంలో మేము నిరీక్షిస్తున్నది ఏమిటంటే , అల్లాహ్ స్వయంగా మీకు శిక్ష ఇస్తాడా లేక మా చేతుల ద్వారా ఇప్పిస్తాడా అనేది. మంచిది, అయితే ఇక మీరు కూడా నిరీక్షించండి. మేము కూడా మీతోపాటే నిరీక్షిస్తాము.''

**9. అత్ తౌబా** 53 - 55 వారికి ఇలా చెప్పండి : ''మీరు మీ సంపదలను ఇష్టంతో ఖర్చుచేసినా లేదా ఇష్టం లేకుండా ఖర్చుచేసినా అవి ఎట్టి పరిస్థితులలోనూ స్వీకరించబడవు. ఎందుకంటే , మీరు దుర్మార్గులు. వారు ఇచ్చిన సంపద స్వీకరించబడక పోవటానికి దీనికంటే మరొక కారణమేదీలేదు. వారు అల్లాహ్నూ ఆయన ప్రవక్తనూ తిరస్కరించారు. నమాజుకు వస్తే బద్ధకంతో వస్తారు. దేవుని మార్గంలో ఖర్చుపెడితే అయిష్టంగానే ఖర్చుపెడతారు. వారి సిరిసంపదలనూ, వారి అధిక సంతానాన్ని చూసి మోసపోవద్దు. అల్లాహ్ మాత్రం ఈ వస్తువుల ద్వారానే వారిని ప్రాపంచిక జీవితంలో కూడా శిక్షకు గురిచెయ్యాలనీ , వారు ప్రాణత్యాగం చేసినా సత్యతిరస్కార స్థితిలోనే చెయ్యాలనీ కోరుతున్నాడు.

**9. అత్ తౌబా** 56 - 57 వారు దేవునిమీద మాటిమాటికీ ప్రమాణం చేసి , మేము మీ వారమే అని అంటారు. వాస్తవానికి వారు ఎంతమాత్రం మీవారు కారు. అసలు వారు మీరంటే భయపడతారు. వారికి గనక ఏదైనా ఆశ్రయంగానీ, గుహగానీ, దూరి కూర్చుండేస్థలం గానీ దొరికితే గబగబా పరుగెత్తి అందులో దాక్కుంటారు.

**9. అత్ తౌబా** 58 - 60 ప్రవక్తా! వారిలో కొందరు సదఖాత్ పంపకం విషయంలో నీపట్ల ఆక్షేపణలు తెలుపుతారు. ఒకవేళ ఈ నిధుల నుండి ఏదైనా వారికిస్తే సంతోషిస్తారు. ఇవ్వకపోతే ఆగ్రహిస్తారు. అల్లాహ్ , ఆయన ప్రవక్త వారికి ఇచ్చిన దానితో తృప్తిపడి ఇలా అనివుంటే ఎంత బాగుండేది: ''అల్లాహ్ మాకు చాలు. ఆయన తన అనుగ్రహంతో

మాకు ఇంకా చాలా ఇస్తాడు. ఆయన ప్రవక్త కూడా మాపై దయచూపుతాడు. మేము అల్లాహ్ వైపునకే దృష్టిని నిలిపివున్నాము.'' ఈ జకాత్ నిధులు అసలు కేవలం నిరుపేదలకు , అక్కరలు తీరని వారికీ, జకాత్ వ్యవహారాలకై నియుక్తులైన వారికీ, ఇంకా ఎవరి హృదయాలను గెలుచుకోవటం అవసరమో వారికీ , ఇంకా బానిసల విముక్తికీ , రుణగ్రస్తుల సహాయానికీ, దేవుని మార్గంలోనూ బాటసారుల ఆతిథ్యానికీ వినియోగించటం కొరకు , ఇది అల్లాహ్ తరఫు నుండి నిర్ణయించబడిన ఒక విధి. అల్లాహ్ అన్నీ ఎరిగినవాడూ వివేకవంతుడూను.

**9. అత్ తౌబా** 61 వారిలో కొందరు ప్రవక్తను తమ మాటలతో నొప్పించేవారు ఉన్నారు. ''ఈ మనిషి ఎప్పుడూ చెప్పుడు మాటలు వింటాడు'' అని అంటారు. ఇలా చెప్పండి : ''ఆయన మీ మేలుకొరకే అలా ఉన్నాడు. అల్లాహ్ ను విశ్వసిస్తాడు. విశ్వసించినవారిని నమ్ముతాడు. మీలో విశ్వాసులైన వారికొరకు పూర్తిగా కారుణ్యమూర్తి. అల్లాహ్ ప్రవక్తను నొప్పించే వారికి వ్యధాభరితమైన శిక్షపడుతుంది.''

**9. అత్ తౌబా** 62 - 63 వారు మీ ముందు ప్రమాణాలు చేస్తారు , మిమ్మల్నీ సంతోష పెట్టటానికి. వాస్తవానికి వారు విశ్వాసులే అయితే అల్లాహ్నూ ఆయన ప్రవక్తనూ సంతోషపెట్టటానికి వారు చింతన చేయాలి. ఎందుకంటే వారు ఎక్కువ హక్కుదారులు. వారికి తెలియదా, అల్లాహ్నూ ఆయన ప్రవక్తనూ ఎదుర్కొనేవాడి కొరకు నరకాగ్ని ఉందనీ, అందులోనే కలకాలం ఉంటాడనీ? ఇది పెద్ద అవమానం.

**9. అత్ తౌబా** 64 - 66 ఈ కపటులు భయపడుతున్నారు , వారి హృదయాలలో ఉన్న రహస్యాలను బయటపెట్టే సూరా ఏదైనా ముస్లిములపై అవతరిస్తుందేమో అని. ప్రవక్తా! వారితో ఇలా అను : ''ఇంకా ఎగతాళి చెయ్యండి. బయటపడుతుందని మీరు భయపడుతూ ఉన్న ఆ విషయాన్నే అల్లాహ్ బయటపెట్ట బోతున్నాడు. '' మీరు చెప్పుకుంటూ ఉన్న విషయం ఏమిటి ? అని ఒకవేళ వారిని అడిగితే , మేము సరదాగా వేళాకోళంగా మాట్లాడుకుంటున్నాము అని తక్షణం బదులు చెబుతారు. వారితో ఇలా అను : ''మీ వేళాకోళం, అల్లాహ్తోనా ఆయన ఆయతులతోనా, ఆయన ప్రవక్తతోనా? ఇక సాకులు చెప్పకండి. మీరు విశ్వసించిన తరువాత అవిశ్వాసానికి పాల్పడ్డారు. ఒకవేళ మేము మీలో ఒక వర్గాన్ని క్షమించినా , రెండో వర్గానికి మాత్రం తప్పనిసరిగా శిక్ష విధిస్తాము. ఎందుకంటే వారు అపరాధులు.''

**9. అత్ తౌబా** 67 - 70 కపటులైన పురుషులూ , కపటులైన స్త్రీలూ అందరూ ఒకే కోవకు చెందినవారు వారు చెడును చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. మంచిని చెయ్యవద్దు అని వారిస్తారు. ఇంకా తమ చేతులను మేలుచేయకుండా ఆపుతారు. వారు అల్లాహ్ ను మరచిపోయారు. కనుక అల్లాహ్ కూడా వారిని మరచిపోయాడు. నిశ్చయంగా ఈ కపటులే ద్రోహులు. కపటులైన ఈ పురుషులకూ , స్త్రీలకూ అవిశ్వా సులకూ అల్లాహ్ నరకాగ్నిని వాగ్దానం చేశాడు. అందులో వారు కలకాలం ఉంటారు. అదే వారికి యోగ్యమైనది. వారిపై అల్లాహ్ శాపం పడిరది. వారికొరకు శాశ్వతమైన శిక్ష ఉంది - మీవి కూడ మీకు ముందువారి తీరుతెన్నులే. వారు మీకంటే ఎక్కువ

బలాఢ్యులు. ఎక్కువ సంపద, ఎక్కువ సంతానం కలిగివుండేవారు. పైగా వారు ప్రపంచంలో తమ వంతు సుఖాలను జుర్రుకున్నారు. మీరు కూడా మీవంతు సుఖాలను వారు అనుభవించిన మాదిరిగానే అనుభవించారు. ఇంకా వారు పడినటువంటి వాదోపవాదాలలోనే మీరూ పడ్డారు. కనుక వారి ముగింపు ఎలా జరిగిందంటే , వారు చేసినదంతా ప్రపంచంలోనూ వ్యర్థమైపోయింది, పరలోకంలోనూ వ్యర్థమైపోయింది. వారే నష్టానికి గురిఅయ్యారు - వారికి తమ పూర్వీకుల చరిత్ర అందలేదా? నూహ్ జాతి ప్రజలు ఆద్, సమూద్ జాతులు, ఇబ్రాహీమ్ జాతి ప్రజలు మద్‌యన్ ప్రజలు, తల్లక్రిందులు చేయబడిన పట్టణాలు? వారి ప్రవక్తలు వారివద్దకు స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చారు. అయితే వారికి అల్లాహ్ అన్యాయం చెయ్యలేదు. వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు.

**9. అత్ తౌబా** 71 - 72 విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరికొకరు సహచరులు, వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు. నమాజును స్థాపిస్తారు. జకాత్‌ను ఇస్తారు. అల్లాహ్ పట్ల ఆయన ప్రవక్త పట్ల విధేయత పాటిస్తారు. వారిమీదనే అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పకుండా అవతరింపజేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అందరికంటే ప్రబలుడు. వివేకవంతుడూ , వివేచనాపరుడూను. విశ్వాసులైన ఈ పురుషులకూ , స్త్రీలకూ అల్లాహ్ వాగ్దానం చేశాడు , క్రింద కాలువలు ప్రవహించే తోటలను వారికి ఇస్తాను అని. వారు వాటిలో శాశ్వతంగా ఉంటారు. నిత్యమూ కళకళలాడే ఆ ఉద్యాన వనాలలో వారికొరకు పరిశుద్ధమైన నివాసాలు ఉంటాయి. ఇంకా అన్నింటికంటే మించిన అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. అదే గొప్ప సాఫల్యం.

**9. అత్ తౌబా** 73 - 74 ప్రవక్తా! అవిశ్వాసులూ, కపటులూ ఈ ఉభయులనూ పూర్తి శక్తితో ఎదుర్కో. వారితో కఠినంగా వ్యవహరించు. చివరకు వారి నివాసస్థలం నరకమే, అది అతి చెడ్డ నివాసస్థలం. మేము ఆ మాటను అనలేదు అని వారు మాటిమాటికీ దేవునిపై ప్రమాణంచేసి అంటారు. వాస్తవానికి వారు ఆ అవిశ్వాసపు మాటను అన్నారు. వారు ఇస్లామ్‌ను స్వీకరించిన తరువాత అవిశ్వాసానికి ఒడిగట్టారు. వారు దేనిని చెయ్యాలని అనుకున్నారో దానిని చెయ్యలేకపోయారు. అల్లాహ్ , ఆయన ప్రవక్తా తమ అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేశారనే కదా వారు ఆగ్రహిస్తున్నారు. ఇక వారు తమ ఈ వైఖరిని మానుకుంటే, అది వారికే మేలు. వారు గనక మానుకోకపోతే, అల్లాహ్ వారికి అత్యంత బాధాకరమైన శిక్ష విధిస్తాడు. ప్రపంచంలోనూ పరలోకంలోనూ వారిని సమర్థించేవాడూ వారికి సహాయం చేసేవాడూ ఇలలో ఎవడూ లేడు.

**9. అత్ తౌబా** 75 - 80 ఆయన గనక తన అనుగ్రహం నుండి మాకు ప్రసాదిస్తే మేము దానం చేస్తాము, సజ్జనులమై ఉంటాము అని అల్లాహ్ కు ప్రమాణం చేసినవారు కూడా కొందరు వారిలో ఉన్నారు. కాని , అల్లాహ్ తన అనుగ్రహంవల్ల వారిని సంపన్నులుగా చేసినప్పుడు , వారు పిసినారితనానికి దిగారు. తమ ప్రమాణం నుండి మరలిపోయారు. దానిని ఏమాత్రం లెక్కలేయటం లేదు. ఫలితం ఏమయిందంటే , వారు అల్లాహ్ ఎడల చేసిన ఈ

ప్రమాణభంగం కారణంగా, వారు చెబుతూ వచ్చిన అబద్ధం కారణంగా , అల్లాహ్ వారి హృదయాలలో కాపట్యాన్ని నాటాడు. అది ఆయన సమక్షంలో వారు హాజరయ్యే రోజు వరకూ వారిని వెంటాడటం మానదు. వారికి తెలియదా , అల్లాహ్ కు వారి గుప్తరహస్యాలూ , వారి రహస్య సమాలోచనలూ సయితం తెలుసని , ఆయనకు సమస్త అగోచర విషయాలు కూడా పూర్తిగా తెలుసని? (ఆ పిసినారి సంపన్నులను ఆయన బాగా ఎరుగును) సంతోషంతో, ఇష్టంతో విశ్వాసులు చేసే ధనత్యాగాలను కించపరుస్తూ వారు మాట్లాడుతారు. (దేవుని మార్గంలో ఇచ్చేందుకు) తాము శ్రమకోర్చి ఇచ్చేది తప్ప మరేదీ తమ వద్ద లేనివారిని వారు హేళన చేస్తారు. ఈ హేళన చేసేవారిని అల్లాహ్ హేళన చేస్తున్నాడు. వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది. ప్రవక్తా! నీవు అటువంటి ప్రజలను క్షమించవలసినదిగా విజ్ఞాపన చేసినా, చేయకపోయినా (ఒకటే) ఒకవేళ నీవు వారిని క్షమించవలసినదిగా డెబ్బైసార్లు విజ్ఞాపన చేసినా, అల్లాహ్ వారిని ఎంతమాత్రం క్షమించడు. ఎందుకంటే, వారు అల్లాహ్నూ ఆయన ప్రవక్తనూ తిరస్కరించారు. అల్లాహ్ దుర్మార్గులైన ప్రజలకు మోక్షమార్గం చూపడు.

**9. అత్ తౌబా** 81 - 83 వెనుక ఉండిపోవటానికి అనుమతి ఇవ్వబడినవారు అల్లాహ్ ప్రవక్తతో వెళ్ళకపోయినందుకూ, ఇంటివద్దనే కూర్చుండి పోయినందుకూ సంతోషపడ్డారు. అల్లాహ్ మార్గంలో తమ ప్రాణాలనూ , తమ సంపదలనూ ఒడ్డి పోరాడేందుకు వారు ఇష్టపడలేదు. వారు ప్రజలతో , ''ఈ తీవ్రమైన వేడిలో బయల్దేరకండి '' అని అన్నారు. వారితో ఇలా అను : ''నరకాగ్ని దీనికంటే ఎక్కువ వేడిగా ఉంటుంది ''. వారికి దానిని గురించి తెలిస్తే ఎంతబాగుండును! ఇప్పుడు వారు నవ్వటం తగ్గించాలి. ఏడ్వటం హెచ్చించాలి. ఎందుకంటే వారు సంపాదిస్తూ ఉండిన చెడులకు లభించే ప్రతిఫలం అటువంటిది గనక (దానికి వారు ఏడ్వ వలసినదే). ఒకవేళ అల్లాహ్ వారి మధ్యకు నిన్ను తిరిగి తీసుకువెళితే, ఇకముందు వారిలో ఏ వర్గమైనా పోరాటం కొరకు బయలుదేరటానికి నిన్ను అనుమతి అడిగితే వారితో స్పష్టంగా ఇలా చెప్పు : ''ఇక మీరు నాతో ఎంతమాత్రమూ రాలేరు. నా పక్షంలో ఉండి ఏ శత్రువుతోనూ పోరాడనూ లేరు. మీరు మొదట కూర్చుండిపోవటానికే ఇష్టపడ్డారు. కనుక ఇప్పుడు ఇంటివద్ద కూర్చుండిపోయేవారితోనే కూర్చుండిపోండి.''

**9. అత్ తౌబా** 84 - 85 ఇక ముందు వారిలో ఎవడైనా మరణిస్తే, అతడి జనాజా నమాజును కూడా నీవు ఎంతమాత్రం చెయ్యకు. ఎన్నడూ అతడి గోరీ వద్ద నిలబడకు. ఎందుకంటే వారు అల్లాహ్నూ , ఆయన ప్రవక్తనూ తిరస్కరించారు. ఇంకా వారు ద్రోహులుగానే మరణించారు. వారి సంపదా వారి అధిక సంతానమూ నిన్ను మోసానికి గురిచెయ్యకూడదు. ఈ సంపదద్వారా ఈ సంతానం ద్వారా వారిని ఈ ప్రపంచంలోనే శిక్షించాలనీ వారి ప్రాణాలు వారు అవిశ్వాసులుగా ఉన్న స్థితిలోనే పోవాలనీ - అల్లాహ్ సంకల్పించాడు.

**9. అత్ తౌబా** 86 - 89 అల్లాహ్ ను విశ్వసించండి , ఆయన ప్రవక్తతో కలసి పోరాడండి అనే విషయం కల సూరా ఏదైనా అవతరించినప్పుడల్లా, వారిలో సమర్థులైన వారే తమను పోరాటంలో పాల్గొనటం గురించి మన్నించాలని

నీకు విజ్ఞప్తి చేయటాన్ని నీవు గమనించావు. మేము కూర్చుండిపోయేవారితో ఉండిపోతాము , మమ్మల్ని వదలిపెట్టండి అని వారు అన్నారు. వారు ఇంటిలో కూర్చుండిపోయే స్త్రీలలో చేరిపోవటానికి ఇష్టపడ్డారు. వారి హృదయాలపై ముద్రవేయబడిరది. అందువల్ల వారికి ఇప్పుడు ఏమీ అర్థం కాదు. దీనికి భిన్నంగా ప్రవక్తా! ప్రవక్తతోపాటు విశ్వసించినవారూ తమ ప్రాణాలతో తమ సంపదలతో పోరాడారు. కనుక ఇప్పుడు అన్ని మేళ్ళూ వారికే. ఇంకా వారే సాఫల్యాన్ని పొందుతారు. అల్లాహ్ వారికొరకు క్రింద కాలువలు ప్రవహించే ఉపవనాలను సిద్ధంచేసి ఉంచాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. ఇదే గొప్ప సాఫల్యం.

**9. అత్ తౌబా** 90 ఎడారి అరబ్బులు కూడా చాలామంది వచ్చారు. తాము కూడా వెనుక ఉండిపోవటానికి అనుమతి కోసం సాకులు చెప్పారు. ఈవిధంగా అల్లాహ్ కూ ఆయన ప్రవక్తకూ విశ్వాస విషయంలో అబద్ధపు వాగ్దానం చేసినవారు వెనుకనే కూర్చుండిపోయారు. ఎడారి అరబ్బులలో అవిశ్వాస వైఖరిని అవలంబించినవారు త్వరలోనే బాధాకరమైన శిక్షకు గురి అవుతారు.

**9. అత్ తౌబా** 91 - 93 వృద్ధులూ, వ్యాధిగ్రస్తులూ, పోరాటంలో పాల్గొనటానికి దారిభత్యాలు లేనివారూ, ఒకవేళ వెనుక ఉండిపోతే ఏ దోషమూ లేదు, వారు చిత్తశుద్ధితో అల్లాహ్ కూ ఆయన ప్రవక్తకూ విశ్వాస పాత్రులుగా ఉన్నంతవరకు. అటువంటి సజ్జనులపట్ల ఆక్షేపణకు ఏ ఆస్కారమూ లేదు. అల్లాహ్ మన్నించేవాడూ , కరుణించేవాడూను. స్వయంగా వచ్చి ''మా కొరకు వాహనాలు సమకూర్చండి'' అని నీకు విజ్ఞప్తి చేసిన వారిపట్ల కూడా ఇదేవిధంగా ఏ ఆక్షేపణకూ అవకాశం లేదు. నీవు ''నేను మీ కొరకు వాహనాలను ఏర్పాటు చెయ్యలేను '' అని అన్నప్పుడే , గత్యంతరంలేక వారు మరలిపోయారు. వారి కళ్ళనుండి అశ్రువులు ప్రవహించాయి. వారు తమ ఖర్చులతో పోరాటంలో పాల్గొనే శక్తి తమకు లేనందుకు చాలా బాధపడ్డారు. అయితే ధనవంతుల పట్ల ఆక్షేపణ ఉంది. ఎందుకంటే తమను పోరాటంలో పాల్గొనే విషయంలో మన్నించవలసిందిగా నీకు విజ్ఞప్తి చేశారు. వారు ఇంటివద్ద కూర్చుండిపోయే స్త్రీలలో చేరిపోవటానికి ఇష్టపడ్డారు. అల్లాహ్ వారి హృదయాలపై ముద్రవేశాడు. ఇందువల్ల వారికి ఏమీ తెలియదు. (అల్లాహ్ వద్ద వారి ఈ వైఖరికి ఏ ఫలితం కలుగనున్నదో అనేది).

**9. అత్ తౌబా** 94 - 96 మీరు తిరిగి వారివద్దకు పోయినప్పుడు , వారు రకరకాల సాకులు చెబుతారు. కాని మీరు స్పష్టంగా ఇలా చెప్పండి : ''సాకులు చెప్పకండి. మేము మీ ఏ మాటనూ నమ్మం. అల్లాహ్ మాకు మీ పరిస్థితులన్నీ తెలిపాడు. ఇక అల్లాహ్ ఆయన ప్రవక్తా మీ ప్రవర్తనను చూస్తారు. తరువాత మీరు ఆయన వైపునకు మరలింపబడతారు. ఆయన బహిరంగంగా ఉన్నదీ గుప్తంగా ఉన్నదీ , అంతా ఎరిగినవాడు. మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో ఆయన మీకు తెలుపుతాడు. '' నీవు మరలివచ్చిన తరువాత వారు నీ ముందు ప్రమాణాలు చేస్తారు , నీవు వారిని ఉపేక్షించాలని. కనుక నీవు వారిని తప్పకుండా ఉపేక్షించు. ఎందుకంటే, వారొక మాలిన్యం వంటివారు. వారి అసలు స్థానం నరకం. అది వారి సంపాదనకు ప్రతిఫలంగా వారికి లభిస్తుంది. వారు నీ సమక్షంలో ప్రమాణాలు

చేస్తారు, వారికి నీవు ప్రసన్నుడవు కావాలని. వాస్తవానికి , ఒకవేళ నీవు వారిపట్ల ప్రసన్నత చూపినా అల్లాహ్ మటుకు అటువంటి విద్రోహులకు ఎన్నటికీ ప్రసన్నుడు కాడు.

**9. అత్ తౌబా** 97 - 99 ఈ ఎడారి అరబ్బులు అవిశ్వాసం విషయంలో, కాపట్యం విషయంలో బహుమూర్ఖులు. కనుక అల్లాహ్ తన ప్రవక్తపై అవతరింపజేసిన ధర్మం యొక్క హద్దులు వారికి తెలియకుండా ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అల్లాహ్ కు అన్నీ తెలుసు. ఆయన జ్ఞానీ , వివేకవంతుడూను. దేవుని మార్గంలో ఖర్చుపెడుతున్నప్పుడు అది బలవంతంగా తమపై రుద్దబడిరదని భావించేవారు ఈ ఎడారి అరబ్బులలో కొందరు ఉన్నారు. మీ విషయంలో వారు కాలం మార్పుల కోసం నిరీక్షిస్తున్నారు , (మీరు ఏదైనా సంకటంలో చిక్కుకుంటే మీరు వారిని బంధించి ఉంచిన ఈ వ్యవస్థ యొక్క విధేయతా శృంఖలాలను త్రెంచిపారేయాలని) వాస్తవానికి సంకట వలయం స్వయంగా వారినే చుట్టుముట్టి ఉంది. అల్లాహ్ అంతా వింటాడు. ఆయనకు అన్నీ తెలుసు. ఈ ఎడారి అరబ్బులలోనే ఇంకా కొంతమంది ఉన్నారు. వారు అల్లాహ్నూ అంతిమదినాన్నీ విశ్వసిస్తారు. తాము ఖర్చుచేసే దానిని అల్లాహ్ సాన్నిహిత్యం పొందటానికీ ప్రవక్తనుండి దేవుని కారుణ్యానికై ప్రార్థనలు పొందటానికీ సాధనంగా చేసుకుంటారు. అవును! అది నిశ్చయంగా అల్లాహ్ సాన్నిహిత్యాన్ని పొందటానికి సాధనమే. అల్లాహ్ తప్పకుండా వారిని తన కారుణ్యంలో ప్రవేశింపజేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడూ కరుణించేవాడూను.

**9. అత్ తౌబా** 100 అందరికంటే ముందు విశ్వాస సందేశాన్ని స్వీకరించటానికి ముందంజవేసిన ముహాజిరుల (వలస వచ్చినవారి) పట్లా అన్సారుల (ఆశ్రయమిచ్చినవారి) పట్లా తరువాత నిజాయితీతో వారి వెనుక వచ్చినవారిపట్లా అల్లాహ్ తృప్తి చెందాడు. వారు కూడా అల్లాహ్ పట్ల తృప్తి చెందారు. అల్లాహ్ వారి కొరకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యానవనాలను సిద్ధపరచి ఉంచాడు. వారు వాటిలో సదా ఉంటారు. ఇదే మహత్తరమైన సాఫల్యం.

**9. అత్ తౌబా** 101 మీ చుట్టుపక్కల ఉండే ఎడారి అరబ్బులలో కపటులు చాలామంది ఉన్నారు. అలాగే స్వయంగా మదీనా పౌరులలో కూడా కపటులు ఉన్నారు. వారు కాపట్యంలో రాటుదేలారు. మీరు వారిని ఎరుగరు. మేము వారిని ఎరుగుదుము. మేము వారికి రెట్టింపు శిక్షను విధించే సమయం సమీపంలోనే ఉంది. తరువాత వారు మరింత పెద్ద శిక్ష కొరకు తిరిగి తీసుకురాబడతారు.

**9. అత్ తౌబా** 102 - 105 తమ తప్పులను ఒప్పుకున్నవారు కొందరు ఉన్నారు. వారి ఆచరణ మిశ్రమమైనది. కొంత మంచీ, కొంత చెడూ. అల్లాహ్ వారిని మళ్ళీ కరుణించటం అనేది అసంభవమేమీ కాదు. ఎందుకంటే , ఆయన మన్నించేవాడూ కరుణించేవాడూను. ప్రవక్తా! నీవు వారి సంపదల నుండి సదఖా తీసుకొని వారిని పరిశుద్ధపరచు. ఇంకా (సన్మార్గంలో) వారిని ముందుకు నడుపు. వారి కొరకు దేవుని కారుణ్యానికై ప్రార్థించు. ఎందుకంటే నీ ప్రార్థనవల్ల వారికి ఉపశమనం కలుగుతుంది. అల్లాహ్ అంతా వింటాడు. ఆయనకు అంతా తెలుసు. వారికి

తెలియదా, అల్లాహ్ యే తన దాసుల పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తాడని , వారి దానధర్మాలకు స్వీకారాన్ని ప్రసాదిస్తాడని, అల్లాహ్ అమితంగా క్షమించేవాడూ కరుణించేవాడూ అని? ప్రవక్తా! ఇంకా వారితో ఇలా అను : ''మీరు ఆచరించండి. అల్లాహ్, ఆయన ప్రవక్తా, విశ్వాసులూ అందరూ మీ ఆచరణ వైఖరి ఇప్పుడు ఎలా ఉంటుందో అని గమనిస్తారు. తరువాత మీరు ఆయన వైపునకు మరలింపబడతారు. ఆయనకు బహిరంగంగా ఉన్నదీ , గుప్తంగా ఉన్నదీ అంతా తెలుసు. మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో ఆయన మీకు తెలుపుతాడు.''

**9. అత్ తౌబా** 106 మరి కొందరున్నారు. ఇంకా వారి వ్యవహారం దేవుని ఆజ్ఞకోసం ఆగివున్నది. ఆయన వారికి శిక్షనూ విధించవచ్చు. మళ్ళీ కొత్తగా వారిని కనికరించనూవచ్చు. అల్లాహ్ కు అంతా తెలుసు , ఆయన జ్ఞానీ , వివేకవంతుడూను.

**9. అత్ తౌబా** 107 - 110 ఇంకా కొందరువున్నారు. వారు ఒక మసీదును నిర్మించారు , (సత్యసందేశానికి) నష్టం కలిగించాలనే ఉద్దేశ్యంతో , ఇంకా (దేవుని ఆరాధన చెయ్యటానికి బదులుగా) అవిశ్వాసాన్ని అనుసరిం చాలని , విశ్వాసులలో చీలిక తీసుకురావాలని, (ఈ బూటకపు ఆరాధనాలయాన్ని ) ఇదివరకు అల్లాహ్ కూ ఆయన ప్రవక్తకూ వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తికి మాటుగా చెయ్యాలని. వారు మాటిమాటికీ ప్రమాణాలు చేసి , మా ఉద్దేశ్యం మేలు చెయ్యటం తప్ప మరొకటి కాదు అని తప్పకుండా అంటారు. కానీ అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు , వారు పూర్తి అసత్యవాదులు. నీవు ఎన్నడూ ఆ కట్టడంలో నిలబడకు. మొదటి రోజునుండే భయభక్తులు ఆధారంగా స్థాపించబడిన మసీదే నీవు (ఆరాధన కొరకు) నిలబడ టానికి తగినది. అందులో పరిశుద్ధంగా ఉండటానికి ఇష్టపడేవారు ఉన్నారు. అల్లాహ్ కు పరిశుద్ధతను పాటించేవారు అంటేనే ఇష్టం. అయితే నీ అభిప్రాయమేమిటి ? మంచి మానవుడు ఎవడు ? తన కట్టడపు పునాదులను దైవభీతిపై , దైవ సంతోషాన్ని పొందాలనే కాంక్షపై లేపినవాడా లేదా తన కట్టడాన్ని లోయయొక్క డొల్ల అంచుపై లేపినవాడా ? అది అతనిని తీసుకుని సేరుగా నరకాగ్నిలో పడిపోయింది! అటువంటి దుర్మార్గులకు అల్లాహ్ ఎన్నటికీ రుజుమార్గం చూపడు. వారు నిర్మించిన ఈ కట్టడం ఎల్లప్పుడూ వారి హృదయాలలో అపనమ్మకానికి మూలంగా ఉంటుంది. (ఆ అపనమ్మకం బయటపడే మార్గమేదీ ఇక లేదు) వారి హృదయాలు ముక్కలు ముక్కలు అయితేనే తప్ప. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు. వివేకవంతుడూ, మేధావంతుడూను.

**9. అత్ తౌబా** 111 - 112 యథార్థం ఏమిటంటే , విశ్వాసుల నుండి అల్లాహ్ వారి ప్రాణాలనూ , వారి సంపదలనూ స్వర్గానికి బదులుగా కొన్నాడు. వారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు , చంపుతారు, చస్తారు. తౌరాతులో , ఇంజీలులో, ఖురానులో వారికి అల్లాహ్ చేసిన (స్వర్గం యొక్క) వాగ్దానం సత్యమైనది. తన వాగ్దానాన్ని నెరవేర్చటంలో అల్లాహ్ ను మించినవాడెవడు ? కనుక సంబరపడండి, మీరు దేవునితో చేసిన ఈ వర్తకానికి ఇదే అన్నిటికంటే మహత్తరమైన సాఫల్యం. అల్లాహ్ వైపునకు మాటిమాటికీ మరలేవారూ , ఆయనను ఆరాధించేవారూ,

ఆయనను స్తుతించేవారూ , ఆయన కొరకు భూమిమీద సంచారం చేసేవారూ , ఆయన సన్నిధిలో రుకూలూ , సజ్దాలూ చేసేవారూ, మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపించేవారూ , చెడు చెయ్యవద్దు అని నిరోధించేవారూ , అల్లాహ్ విధించిన హద్దులను కాపాడేవారూ (ఇటువంటి గుణవిశేషాలు కల విశ్వాసులు అల్లాహ్తో ఇటువంటి వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంటారు). ప్రవక్తా! ఇటువంటి విశ్వాసులకు శుభవార్త అందజెయ్యి.

**9. అత్ తౌబా** 113 - 114 ముష్రిక్కులను క్షమించవలసినదిగా ప్రార్థన చెయ్యటం ప్రవక్తకూ, విశ్వాసులకూ తగనిపని, వారు వారికి బంధువులైనప్పటికీ , ఇంకా వారు నరకానికి అర్హులని వారికి స్పష్టమైనప్పుడు. ఇబ్రాహీము తన తండ్రిని క్షమించవలసినదిగా చేసిన ప్రార్థన అతను తన తండ్రికి చేసిన వాగ్దానం కారణంగా చేసినటువంటిది. కాని అతని తండ్రి దేవునికి శత్రువని అతనికి స్పష్టమైనప్పుడు , అతను అతనివల్ల విసిగిపోయాడు. వాస్తవానికి , ఇబ్రాహీము మెత్తని మనస్సు కలవాడు. దైవభక్తుడూ, సంయమనము కలవాడూను.

**9. అత్ తౌబా** 115 - 116 ప్రజలకు సన్మార్గం చూపిన తరువాత మళ్ళీ వారిని మార్గభ్రష్టత్వానికి గురిచెయ్యటం అల్లాహ్ విధానం కాదు , వారు దూరంగా ఉండవలసిన విషయాలను గురించి వారికి స్పష్టంగా తెలుపనంతవరకు. వాస్తవానికి అల్లాహ్ కు ప్రతి విషయం గురించీ తెలుసు. భూమ్యాకాశాల సామ్రాజ్యం అల్లాహ్ అధీనంలోనే ఉందనేదీ, ఆయన చేతిలోనే జీవన్మరణాలు ఉన్నాయి అనేదీ , మిమ్మల్ని ఆయన నుండి కాపాడగల సంరక్షకుడూ , సహాయకుడూ మరెవడూ లేడు అనేదీ యథార్థమే.

**9. అత్ తౌబా** 117 - 118 అల్లాహ్ క్షమించాడు ప్రవక్తనూ, బహుకష్టకాలంలో ప్రవక్తకు తోడ్పడిన ముహాజిరులనూ, అన్సారులనూ. వారిలో కొందరి హృదయాలు వక్రత్వం వైపునకు మొగ్గినప్పటికీ (కాని వారు ఆ వక్రత్వాన్ని అనుసరించకుండా ప్రవక్తకు తోడ్పడినప్పుడు) అల్లాహ్ వారిని క్షమించాడు. నిస్సందేహంగా ఆయన వారిపట్ల వాత్సల్యంతో, కనికరంతో వ్యవహరించాడు. ఇంకా వ్యవహారం వాయిదా వెయ్యబడిన ఆ ముగ్గురిని కూడా ఆయన క్షమించాడు. ఇంత పెద్ద వైశాల్యం కలిగి ఉండికూడా , భూమి వారికి ఇరుకైపోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమైపోయాయి. అల్లాహ్ నుండి తమను కాపాడు కోవటానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీలేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్ కనికరంతో వారి వైపునకు మరలాడు , వారు ఆయన వైపునకు మరలి వచ్చేటందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడూ, కరుణించేవాడూను.

**9. అత్ తౌబా** 119 - 121 విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కు భయపడండి. సత్యవంతులకు తోడ్పడండి. మదీనా పౌరులకూ, చుట్టుపక్కల ఉండే ఎడారి అరబ్బులకూ అల్లాహ్ ప్రవక్తను వదిలిపెట్టి ఇళ్ళల్లో కూర్చోవటం , ఆయనను పట్టించుకోకుండా తమను గురించి మాత్రమే ఆదుర్దాపడటం ఎంతమాత్రం శోభించదు. ఎందుకంటే అల్లాహ్ మార్గంలో వారు ఆకలిదప్పులనూ, శరీర శ్రమకు సంబంధించిన ఏదైనా బాధను సహించి ఉంటే, సత్యతిరస్కారులు సహించలేని మార్గంపై వారు ఏదైనా అడుగువేస్తే ఏ శత్రువుకైనా (సత్య విరోధానికి) వారు ప్రతీకారం చేస్తే దానికి బదులుగా

వారికొరకు ఒక సత్కార్యం వ్రాయబడకుండా ఉండటం అనేది ఎన్నటికీ జరగదు. నిశ్చయంగా అల్లాహ్ వద్ద సజ్జనుల సేవాఫలం హక్కు హరించ బడదు. ఇదేవిధంగా వారు (దైవమార్గంలో) కొద్దో గొప్పో, ఏదైనా ఖర్చును భరిస్తే (జిహాద్ ప్రయత్నంలో) వారు ఏదైనా లోయనుదాటితే, వారికొరకు దానిని వ్రాయకపోవటం అనేది కూడా ఎన్నటికీ జరుగదు, అల్లాహ్ వారి ఈ మంచి కార్యానికి ప్రతిఫలాన్ని వారికి ప్రసాదించటానికి.

**9. అత్ తౌబా** 122 విశ్వాసులు అందరికందరూ బయలుదేరవలసిన అవసరం లేదు. కాని వారి జనపదంలోని ప్రతి భాగం నుండి కొందరు బయలుదేరి వచ్చి , ధర్మ అవగాహనను పెంపొందించుకుని , తిరిగి వెళ్ళి తమ ప్రాంతంలోని ప్రజలకు వారు (ఇస్లామ్ వ్యతిరేక వైఖరిని) మానుకోవాలని హెచ్చరిక చెయ్యటం ఎందుకు జరుగలేదు?

**9. అత్ తౌబా** 123 - 127 విశ్వసించిన ప్రజలారా! మీ చెంతనున్న సత్య తిరస్కారులతో పోరాడండి. వారు మీలో కాఠిన్యాన్ని చూడాలి. భయభక్తులు కలవారితో అల్లాహ్ ఉంటాడని తెలుసుకోండి. కొత్త సూరా ఏదైనా అవతరించినప్పుడల్లా వారిలోని కొందరు (హేళనగా ముస్లిములను) ఇలా అడుగుతారు : ''మీలో ఎవరి విశ్వాసం దీనివల్ల పెరిగిందో చెప్పండి ?'' విశ్వసించిన వారి విశ్వాసాన్ని వాస్తవంగానే (అవతరించిన ప్రతి సూరా) పెంచింది. వారు దానికి సంతోషపడుతున్నారు. అయితే (కాపట్యం) రోగం తగిలిన హృదయాలుకల వారి పూర్వపు మాలిన్యానికి (ప్రతి కొత్తసూరా) మరింత మాలిన్యాన్ని చేర్చింది. వారు మరణించే వరకు అవిశ్వాసంలోనే పడివున్నారు. తాము ప్రతి సంవత్సరం ఒకటీ రెండుసార్లు పరీక్షకు గురిచెయ్యబడటాన్ని వారు చూడటం లేదా ? కాని దీని తరువాత కూడా వారు పశ్చాత్తాపము పడటం లేదు. ఏ గుణపాఠాన్నీ నేర్చుకోవటం లేదు. సూరా ఏదైనా అవతరించినప్పుడు వారు కళ్ళతోనే పరస్పరం మాట్లాడుకుంటారు , ఎవరైనా మిమ్మల్ని చూడటం లేదు కదా అని. తరువాత మెల్లగా అక్కడి నుండి జారుకుంటారు. అల్లాహ్ వారి హృదయాలను (ఖురాను నుండి) మళ్ళించాడు. ఎందుకంటే వారు బుద్ధిహీనులు.

**9. అత్ తౌబా** 128 - 129 చూడండి! మీవద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు , కారుణ్యం కలవాడు - ఇక వారు నీకు విముఖులైతే , ప్రవక్తా! వారితో ఇలా అను : ''నాకు అల్లాహ్ యే చాలు. ఆయన తప్ప ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు. ఆయననే నేను నమ్ముకున్నాను. ఆయన మహత్తరమైన అధికార పీఠానికి ప్రభువు.''

**10. యూనుస్**

ఆయతులు : 109 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**10. యూనుస్** 1 - 2 అలిఫ్ లామ్ రా. ఈ ఆయతులు వివేకంతోనూ విజ్ఞానంతోనూ నిండివున్న గ్రంథంలోనివి. (ఏమరుపాటులో పడివున్న ) ప్రజలను హెచ్చరించు అనీ , విశ్వసించిన వారికి తమ ప్రభువువద్ద నిజమైన గౌరవమూ సాఫల్యమూ ఉన్నాయనే శుభవార్త తెలుపు అనీ మేము స్వయంగా వారిలోని ఒక మనిషిపైకి వహీని పంపించటం ప్రజలకు చోద్యమైన విషయంగా కన్పిస్తోందా? (దానికి) తిరస్కారులు ''ఈ మనిషి పచ్చి మాంత్రికుడు'' అని అన్నారు.

**10. యూనుస్** 3 యథార్థం ఏమిటంటే ఆకాశాలనూ , భూమినీ ఆరు రోజులలో సృష్టించి , తరువాత రాజ్యపీఠాన్ని అలంకరించి సృష్టివ్యవహారాలను నడుపుతూవున్న దేవుడే మీ ప్రభువు. ఆయన అనుమతి ఇస్తే తప్ప ఎవడూ సిఫారసు చేయలేడు. ఈ అల్లాహ్ యే మీ ప్రభువు. కనుక మీరు ఆయననే ఆరాధించండి. మీరు ఇక స్పృహలోకి రారా?

**10. యూనుస్** 4 ఆయన వైపునకే మీరంతా మరలిపోవలసి ఉన్నది. ఇది అల్లాహ్ యొక్క తిరుగులేని వాగ్దానం. నిస్సందేహంగా సృష్టిని ఆయనే ప్రారంభిస్తాడు. తరువాత రెండోసారి మళ్ళీ ఆయనే సృష్టిస్తాడు. విశ్వసించి మంచి పనులు చేసిన వారికి ప్రతిఫలం న్యాయంగా ఇవ్వటానికి - అవిశ్వాసవైఖరిని అవలంబించిన వారు సల సల కాగే నీరు త్రాగటానికి, వ్యధాభరితమైన శిక్షను అనుభవించటానికి, వారు ఒడిగట్టిన సత్యతిరస్కారానికి ఫలితంగా.

**10. యూనుస్** 5 - 6 సూర్యుణ్ణి కాంతిమంతునిగా చేసినవాడు ఆయనే. చంద్రుడికి వెలుగును ఇచ్చినవాడూ ఆయనే. చంద్రుని తరిగే పెరిగే దశలను కచ్చితంగా నిర్ణయించినవాడూ ఆయనే. తద్వారా మీరు సంవత్సరాల , తేదీల లెక్కను తెలుసుకోవాలని. అల్లాహ్ ఇదంతా సత్యబద్ధంగానే పుట్టించాడు. జ్ఞానం కల ప్రజలకు ఆయన తన సూచనలను తేటతెల్లంగా తెలియజేస్తున్నాడు. నిశ్చయంగా రేయింబవళ్ళ నిరంతర పరిభ్రమణంలో భూమ్యాకాశాలలో అల్లాహ్ సృష్టించిన ప్రతి వస్తువులో (తప్పుడు దృష్టికోణం నుండి తప్పుడు ప్రవర్తన నుండి) తప్పించుకోగోరే వారికొరకు సూచనలు ఉన్నాయి.

**10. యూనుస్** 7 - 8 యథార్థం ఏమిటంటే మమ్మల్ని కలుసుకోవాలని ఆశించనివారూ ప్రాపంచిక జీవితమునే వరించి దానితోనే తృప్తి చెందినవారూ మా సూచనల పట్ల నిర్లక్ష్య భావం కలిగివున్నవారూ - అటువంటి వారి అంతిమ నివాస స్థలం నరకమే అవుతుంది. వారు (తమ ఈ తప్పుడు విశ్వాసం , తప్పుడు ప్రవర్తనలు కారణంగా) చేస్తూ వచ్చిన చెడులకు ఫలితంగా.

**10. యూనుస్** 9 - 10 ఇదీ యథార్థమే. విశ్వసించి (అంటే ఈ గ్రంథంలో తెలుపబడిన సత్యాలను స్వీకరించి), మంచి పనులు చేస్తూ ఉండినవారిని వారి ప్రభువు వారి విశ్వాసం కారణంగా సరి j[illegible]న మార్గంపై నడుపుతాడు. భోగభాగ్యాలతో నిండివున్న స్వర్గవనాలలో వారి క్రింద కాలువలు ప్రవహిస్తాయి. అక్కడ వారు దైవమా! నీవు

పవిత్రుడవు అని స్తుతిస్తారు , శాంతికలుగుగాక అని ప్రార్థిస్తారు. వారి ప్రతి మాటకు ముగింపు ఇలా ఉంటుంది : స్తోత్రమంతా సకల లోకాల ప్రభువైన అల్లాహ్ కు మాత్రమే.

**10. యూనుస్** 11 - 14 ప్రజలు ప్రాపంచిక ప్రయోజనాలను కోరడంలో ఎంత తొందరపడతారో అల్లాహ్ వారిపట్ల చెడుగా వ్యవహరించడంలో కూడా అంతే తొందరపడితే వారి కర్మాచరణ వ్యవధి ఎప్పుడో అంతం చెయ్యబడి ఉండేది. (కాని మేము అలా చెయ్యము). అందువల్ల మేము మమ్మల్ని కలుసుకునే నమ్మకం లేనివారికి తమ తలబిరుసుతనంతో భ్రష్టులై తిరిగే స్వేచ్చను ఇస్తాము. మానవుడి స్థితి ఎలాంటిదంటే అతడికి కష్టకాలం దాపురించినప్పుడు నిలబడీ , కూర్చుండీ, పరుండీ మాకు మొరపెట్టుకుంటాడు. కాని మేము అతడి ఆపదను తొలగించినప్పుడు అతడు ఎప్పుడూ తనకు కలిగిన ఏ గడ్డు కాలంలోనూ మాకు మొరపెట్టుకోనేలేదు అనేవిధంగా ప్రవర్తిస్తాడు. ఈ విధంగా మితిమీరి ప్రవర్తించేవారికి వారి చేష్టలు ఆకర్షకములుగా చెయ్యబడ్డాయి. ప్రజలారా! మీకు పూర్వం ఉన్న జాతులను మేము నాశనం చేశాము ఎందుకంటే , వారు దుర్మార్గపు వైఖరిని అవలంబించారు. వారి ప్రవక్తలు వారివద్దకు స్పష్టమైన నిదర్శనాలను తీసుకొని వచ్చినప్పుడు వారు విశ్వసించనే లేదు. ఈ విధంగా మేము దోషులకు వారు చేసిన దోషాలకు ప్రతిఫలాన్ని ఇస్తూ ఉంటాము. ఇప్పుడు వారి తరువాత మేము మీకు భూమిపై వారి స్థానాన్ని ఇచ్చాము, మీరు ఎలా ప్రవర్తిస్తారో చూద్దామని.

**10. యూనుస్** 15 - 17 మమ్మల్ని కలిసే నమ్మకం లేని వారికి స్పష్టమైన మా మాటలను వినిపించినప్పుడు ఇలా అంటారు: ''దీనికి బదులుగా మరొక ఖురాను తీసుకురా లేదా ఇందులో సవరణలు చెయ్యి. '' ప్రవక్తా! వారితో ఇలా అను : ''ఇందులో నా అంతట నేను మార్పులూ చేర్పులూ చెయ్యటం నా పని ఎంతమాత్రం కాదు. నేను నా వద్దకు పంపబడే వహీని మాత్రమే అనుసరిస్తాను. నేను గనుక నా ప్రభువుపట్ల అవిధేయత చూపితే , ఒక పెద్ద భయంకరమైన దినంనాడు పడే శిక్షకు నేను భయపడుతాను.'' ఇంకా ఇలా అను : ''అల్లాహ్ సంకల్పం ఇదే గనక అయితే నేను ఈ ఖురానును మీకు ఎన్నటికీ వినిపించి ఉండేవాణ్ణి కాదు. అల్లాహ్ దానిని గురించి మీకు అసలు తెలిపి ఉండేవాడే కాదు. ఈ గ్రంథం అవతరించక పూర్వం నేను మీ మధ్య ఒక జీవిత కాలాన్నంతా గడిపాను. మీరు బుద్ధిని ఉపయోగించరా?'' ఒక అబద్ధ విషయాన్ని సృష్టించి దానిని అల్లాహ్ కు ఆపాదించే వాడికంటే లేదా అల్లాహ్ యొక్క నిజమైన ఆయతులను అబద్ధాలుగా నిర్ధారించే వాడికంటే పరమ దుర్మార్గుడెవడుంటాడు ? నిశ్చయంగా దోషులు ఎన్నటికీ సాఫల్యాన్ని పొందలేరు.

**10. యూనుస్** 18 ఈ ప్రజలు అల్లాహ్ ను కాదని తమకు నష్టాన్నిగానీ లాభాన్నిగానీ కలిగించలేనివారిని పూజిస్తున్నారు. పైగా ఇలా అంటున్నారు : ''వారు అల్లాహ్ వద్ద మా కొరకు సిఫారసు చేస్తారు. '' ప్రవక్తా! వారితో ఇలా అను : ''ఆకాశాలలోగానీ, భూమిలోగానీ అల్లాహ్ ఎరుగని విషయాన్ని గురించి ఆయనకు మీరు తెలుపుతున్నారా?'' ఆయన పరిశుద్ధుడు. ఈ ప్రజలు చేసే షిర్కుకు అతీతుడూ, ఉన్నతుడూను.

**10. యూనుస్** 19 ప్రారంభంలో సర్వమానవులూ ఒకే సంఘంగా ఉండేవారు. తరువాత వారు విభిన్న విశ్వాసాలను, ఆచారాలను సృష్టించుకున్నారు. నీ ప్రభువు తరఫునుండి ముందుగానే ఒక విషయం నిర్ణయించబడకుండా ఉన్నట్లయితే వారు పరస్పరం విభేదించుకుంటున్నటువంటి విషయాన్ని గురించి తీర్పు ఎప్పుడో చెయ్యబడి ఉండేది.

**10. యూనుస్** 20 ఇక ''ఈ ప్రవక్తపై ఇతని ప్రభువు తరఫు నుండి ఏదైనా సూచన ఎందుకు అవతరింపజెయ్య బడలేదు?'' అని వారు అన్నదానికి నీవు ఇలా బదులు చెప్పు : అగోచరాలన్నింటికీ యజమానీ , అధికారీ అల్లాహ్ మాత్రమే. మంచిది, నిరీక్షించండి. నేను కూడా మీతోపాటు నిరీక్షిస్తాను.

**10. యూనుస్** 21 - 30 ప్రజలు ఎలా ప్రవర్తిస్తారంటే ఆపదల బారి పడినప్పుడు మేము వారికి కారుణ్యం రుచి చూపిన వెంటనే వారు మా సూచనల విషయంలో ఎత్తులు వేయటం ప్రారంభిస్తారు. వారితో ఇలా అను : ''అల్లాహ్ ఎత్తులు వేయటంలో మీకంటే శీఘ్రగామి. ఆయన దూతలు మీ పన్నాగాలను వ్రాస్తూపోతున్నారు. '' మిమ్మల్ని నేలపైనా నీటిపైనా నడిపేవాడు అల్లాహ్ యే. కాబట్టి మీరు ఓడలపై ఎక్కి వాయువులు అనుకూలంగా వీస్తూ ఉండగా ఆనందంగా, ఆహ్లాదంగా ప్రయాణం చేస్తూ ఉంటారు. ఆ తరువాత అకస్మాత్తుగా ఎదురుగాలి ఉధృతమై అన్ని దిశలనుండి అలల దెబ్బలు తగలగా ప్రయాణీకులు తాము తుఫానులో చిక్కుకుపోయామని తెలుసుకుంటారు. ఆ సమయంలో అందరూ తమ ధర్మాన్ని కేవలం అల్లాహ్కి ప్రత్యేకం చేసుకొని ఆయనను ఇలా వేడుకుంటారు : ''నీవు గనక మాకు ఈ ఆపద నుండి విముక్తి కలిగిస్తే మేము కృతజ్ఞతలు తెలుపుకునే దాసులమవుతాము. '' కాని ఆయన వారిని రక్షించిన తరువాత వారే సత్యానికి విముఖులై భూతలంపై తిరుగుబాటు చేస్తారు. ప్రజలారా! మీరు చేసే ఈ తిరుగుబాటు మీకే హాని కలిగిస్తుంది. ఇహలోక జీవిత సుఖాలు కొన్ని రోజుల సుఖాలు మాత్రమే. (వాటిని అనుభవించండి). తరువాత మా వైపునకే మీరు మరలి రావలసి ఉన్నది. అప్పుడు మేము మీకు తెలుపుతాము , మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో. ఈ ప్రాపంచిక జీవితాన్ని (దాని నిషాలోపడి మీరు మా సూచనల పట్ల అశ్రద్ధ వహిస్తున్నారు) ఇలా పోల్చవచ్చు - మేము ఆకాశం నుండి నీటిని కురిపించగా మనుషులూ పశువులూ అందరూ తినే భూఉత్పత్తులు బాగా దట్టంగా తయారయ్యాయి. ఆపై భూమి మంచి స్థితిలో ఉన్నప్పుడు పొలాలు బాగా పండి శోభిల్లుతూ ఉన్నప్పుడు వాటి యజమానులు, ''ఇక మేము వాటివల్ల లాభం పొందగలము '' అని అనుకుంటున్న సమయంలో, అకస్మాత్తుగా రాత్రి వేళనో పగటిపూటనో మా ఆజ్ఞ వచ్చేసింది. అప్పుడు మేము అసలు అక్కడ నిన్న ఏమీ లేనట్లు దానిని సర్వనాశనం చేశాము. ఇలా మేము మా సూచనలను స్పష్టంగా వివరిస్తాము. ఆలోచించే వారి కొరకూ అర్థం చేసుకునే వారికొరకు. (మీరు అశాశ్వతమైన ఈ జీవితం యొక్క మోసానికి గురి అవుతున్నారు). అల్లాహ్ మిమ్మల్ని దారుస్సలామ్ వైపునకు ఆహ్వానిస్తున్నాడు. (మార్గదర్శకత్వం ఆయన చేతుల్లో ఉంది) ఆయన తాను కోరుకున్న వారికి సరి [illegible]న మార్గం చూపుతాడు. మంచి పనులు చేసినవారికి మంచి బహుమానాలు లభిస్తాయి. ఇంకా ఎక్కువ అనుగ్రహం లభిస్తుంది. వారి ముఖాలను నల్లదనం గానీ, అవమానంగానీ కప్పివేయవు.

వారు స్వర్గానికి అర్హులు , అక్కడనే శాశ్వతంగా ఉంటారు. చెడులు సంపాదించుకున్నవారు తమ చెడులాంటి ప్రతిఫలాన్నే పొందుతారు అవమానం వారిని కప్పివేస్తుంది అల్లాహ్ నుండి వారిని రక్షించేవాడెవడూ ఉండడు. వారి ముఖాలను చీకటి కప్పివేస్తుంది, రాత్రి యొక్క నల్లని తెరలు వారిపై పడి ఉన్నట్లు. వారు నరకానికి అర్హులు. అక్కడనే వారు శాశ్వతంగా ఉంటారు. మేము వారందరినీ ఒకేసారి (మా న్యాయస్థానంలో) సమావేశపరిచే రోజున షిర్కు చేసిన వారితో ఇలా అంటాము : ''ఆగండి మీరూ, మాకు మీరు భాగస్వాములుగా కల్పించినవారూ! '' ఆ తరువాత మేము వారి మధ్య ఉన్నటువంటి అపరిచయపు తెరను తొలగిస్తాము. వారు కల్పించిన భాగస్వాములు ఇలా అంటారు : ''మీరు మమ్మల్ని ఆరాధించలేదు. మీకూ మాకూ మధ్య అల్లాహ్ సాక్ష్యం చాలు. (ఒకవేళ మీరు మమ్మల్ని ఆరాధించి ఉండినా) మీరు చేసిన ఆ ఆరాధనను గురించి మాకు ఏమాత్రమూ తెలియదు. '' అప్పుడు ప్రతి మనిషీ తాను చేసిన దానిని రుచి చూస్తాడు. అందరూ తమ నిజమైన ప్రభువు వైపునకు మరలింపబడతారు. వారు కల్పించిన అబద్ధాలన్నీ మటుమాయమైపోతాయి.

**10. యూనుస్** 31 - 33 వారిని అడుగు : ఆకాశం నుండీ భూమి నుండీ మీకు ఉపాధినిచ్చేవాడు ఎవడు ? వినేశక్తీ చూసే శక్తీ ఎవడి అధీనంలో ఉన్నాయి ? ప్రాణములేని దానినుండి ప్రాణమున్నదానినీ ప్రాణమున్న దానినుండి ప్రాణము లేని దానినీ వెలికితీసేవాడు ఎవడు ? ఈ విశ్వవ్యవస్థను నడుపుతున్నవాడు ఎవడు ? వారు అల్లాహ్ అని తప్పకుండా అంటారు. ఇలా అను : ''అలాంటప్పుడు మీరు (సత్యానికి వ్యతిరేకంగా నడవటం) మానుకోరేమిటి? ఆ అల్లాహ్ యే మీ నిజమైన ప్రభువు. కనుక సత్యాన్ని తృణీకరిస్తే మార్గభ్రష్టత్వం తప్ప ఇక మిగిలేదేమిటి ? అసలు మీరు ఎటు మరలింపబడుతున్నారు? (ప్రవక్తా చూడు) ఈ విధంగా అవిధేయతకు పాల్పడేవారి విషయంలో వారు విశ్వసించరు అని నీ ప్రభువు అన్నమాట ఇలా రూఢ అయింది.

**10. యూనుస్** 34 వారిని అడుగు : మీరు దేవునికి భాగస్వాములుగా నిలబెట్టిన వారిలో సృష్టిని ప్రారంభించేవాడూ, దానిని తిరిగి సృష్టించేవాడూ ఎవడైనా ఉన్నాడా ? అని. ఇలా అను : సృష్టిని ప్రారంభించేవాడూ , దానిని తిరిగి సృష్టించేవాడూ కేవలం అల్లాహ్ మాత్రమే. అయినా, మీరు ఎలా త్రోవ తప్పించబడు తున్నారు?

**10. యూనుస్** 35 వారిని ఇలా అడుగు : మీరు అల్లాహ్ కు భాగస్వాములుగా నిలబెట్టిన వారిలో సత్యం వైపునకు మార్గం చూపేవాడు కూడా ఎవడైనా ఉన్నాడా ? ఇలా అను : కేవలం అల్లాహ్ యే సత్యం వైపునకు మార్గం చూపుతాడు. అలాంటప్పుడు మీరే చెప్పండి , సత్యం వైపునకు మార్గం చూపేవాడా విధేయతకు ఎక్కువ అర్హుడు ? లేక తనకు ఎవడైనా మార్గం చూపితే తప్ప స్వయంగా మార్గాన్ని పొందలేనివాడా ? అసలు మీకేమయింది , ఇటువంటి తలకిందులు నిర్ణయాలు చేస్తున్నారు?

**10. యూనుస్** 36 వాస్తవం ఏమిటంటే వారిలో చాలామంది కేవలం ఊహ , అనుమానాల వెనుక నడుస్తూ పోతున్నారు. నిజానికి సత్యం అవసరాన్ని అనుమానం ఎంతమాత్రం తీర్చలేదు. వారు చేస్తూ ఉన్నదానినంతా అల్లాహ్ బాగా ఎరుగును.

**10. యూనుస్** 37 అల్లాహ్ పంపిన వహీ, ఆయన చేసిన బోధనలు లేకుండా రచించబడే వస్తువుకాదు ఈ ఖురాను. ఇది పూర్వం వచ్చిన దానికి ధ్రువీకరణ , ''అల్ కితాబ్''కు వివరణ. ఇది విశ్వపాలకుని తరఫునుండి వచ్చిందనే విషయంలో ఎంతమాత్రం సందేహం లేదు.

**10. యూనుస్** 38 - 41 ప్రవక్తయే దీనిని స్వయంగా రచించాడని ఈ ప్రజలు అంటున్నారా ఏమిటి ? ఇలా అను : ''మీరు గనక మీ ఆరోపణలో సత్యవంతులే అయితే ఇటువంటి సూరా ఒకదానిని రచించి తీసుకురండి. ఒక్క అల్లాహ్ ను వదలి ఎవరెవరిని పిలువగలరో సహాయం కొరకు పిలవండి. '' అసలు విషయం ఏమిటంటే వారి జ్ఞానపరిధికి ఆ విషయం రాలేదు కాబట్టి ఇంకా దాని పర్యవసానం వారి ముందుకు రాలేదు. కాబట్టి దానిని వారు (ఆధారం లేకుండా ఇట్టే) తిరస్కరించారు. ఇలాగే వారి పూర్వీకులు కూడా తిరస్కరించారు. చూడు , తరువాత ఆ దుర్మార్గుల ముగింపు ఎలా జరిగిందో ? వారిలో కొందరు విశ్వసిస్తారు , కొందరు విశ్వసించరు. నీ ప్రభువు ఈ కల్లోలకారులను బాగా ఎరుగును. వారు గనక నిన్ను తిరస్కరిస్తే వారితో ఇలా అను: ''నా పనులు నావే , మీ పనులు మీవే. నేను చేసే పని బాధ్యత మీపై లేదు. మీరు చేసే పని బాధ్యత నాపై లేదు.''

**10. యూనుస్** 42 - 46 వారిలో చాలా మంది నీ మాటలను వింటారు. కాని నీవు చెవిటి వారికి వినిపించగలవా , వారు ఏమీ అర్థం చేసుకోకపోయినప్పటికీ ? వారిలో చాలామంది నిన్ను చూస్తారు. కాని నీవు గుడ్డివారికి మార్గం చూపగలవా వారికి ఏమీ కనిపించనప్పటికీ ? యథార్థమేమిటంటే అల్లాహ్ ప్రజలకు అన్యాయం చెయ్యడు. ప్రజలే తమకు తాము అన్యాయం చేసుకుంటారు. (ఈ రోజు వారు ఇహలోక జీవితంలో మునిగి ఉన్నారు) అల్లాహ్ వారిని సమావేశపరిచే రోజున (ఇహలోక జీవితం వారికి ఎలా అనిపిస్తుం దంటే) వారు కేవలం ఒక గడియకాలం వరకు ఒకరినొకరు గుర్తు పట్టటానికి మాత్రమే ఆగారా అన్నట్లు. అల్లాహ్తో సమావేశాన్ని తిరస్కరించినవారు వాస్తవానికి తీవ్రమైన నష్టానికి గురిఅయ్యారు అనీ, వారు సన్మార్గంపై ఎంతమాత్రం లేరు అనీ. (అప్పుడు నిర్ధారణ అవుతుంది) ఏ దుష్ఫలితాలను గురించి మేము వారిని భయపెడుతున్నామో వాటిలో ఒకటో అరో మేము నీవు బ్రతికి ఉండగానే చూపినా, లేదా దానికి ముందే మేము నిన్ను లేపుకున్నా , ఎలా అయినా సరే వారు రావలసింది మా వైపునకే కదా. వారు చేస్తున్న దానికల్లా అల్లాహ్ యే సాక్షి.

**10. యూనుస్** 47 ప్రతి సంఘానికి ఒక ప్రవక్త ఉంటాడు. కనుక ఒక సంఘం వద్దకు దాని ప్రవక్త వచ్చినప్పుడు ఆ సంఘం విషయంలో పూర్తి న్యాయంతో కూడుకున్న తీర్పు చెయ్యబడుతుంది. దానికి రవ్వంత అన్యాయం కూడా జరగదు.

**10. యూనుస్** 48 - 52 వారు ఇలా అడుగుతారు : ''నీ బెదరింపే నిజమైతే అది ఎప్పుడు నెరవేరుతుంది ?'' ఇలా అను : ''నా అధీనంలో స్వయంగా నా లాభనష్టాలు సైతమూ లేవు. అంతా అల్లాహ్ సంకల్పం మీద ఆధారపడి ఉంది. ప్రతి సంఘానికి గడువుకాలం ఒకటి ఉంది. ఈ గడువు పూర్తి అయినప్పుడు ఒక్క గడియకాలం కూడా ముందూ వెనుకా కావటం జరగదు. వారితో ఇలా అను : ''ఎప్పుడైనా మీరు ఈ విషయం గురించి ఆలోచించారా ? ఒకవేళ అల్లాహ్ శిక్ష హఠాత్తుగా రాత్రిగాని పగలుగాని వస్తే (అప్పుడు మీరేమి చెయ్యగలరు?)'' అసలు అది ఎలాంటి విషయమని, దాని కొరకు నేరస్తులు తొందరపెడుతున్నారు , అది మీపై వచ్చిపడినప్పుడే మీరు దానిని నమ్ముతారా? - ఇప్పుడు తప్పించుకోవాలనుకుంటున్నారా? వాస్తవానికి స్వయంగా మీరే అది తొందరగా రావాలని కోరుతూ ఉండేవారు. తరువాత దుష్టులతో ఇలా అనడం జరుగుతుంది : ''ఇక శాశ్వతంగా ఉండే శిక్షను రుచి చూడండి! మీరు సంపాదించిన దానికి అనుగుణమైన ప్రతిఫలం తప్ప మరొక ప్రతిఫలం మీకు ఎలా ఇవ్వబడుతుంది?''

**10. యూనుస్** 53 - 56 ఇంకా ఇలా అడుగుతారు: ''నిజంగా మీరు చెప్పేది సత్యమేనా?'' ఇలా అను : ''నా ప్రభువు సాక్షిగా అది పూర్తిగా సత్యం. అది సంభవించకుండా ఆపే శక్తి మీకు లేదు. '' దుర్మార్గం చేసిన ప్రతి మనిషి వద్ద ఒకవేళ భూమిపై ఉన్న మొత్తం ధనం ఉంటే ఆ బాధనుండి రక్షింపబడేందుకు అతడు దానినంతా కూడా పరిహారంగా ఇవ్వటానికి సిద్ధపడతాడు. వారు ఆ బాధను చూసినప్పుడు లోలోన పశ్చాత్తాపపడతారు అయినా వారిమధ్య పూర్తి న్యాయంతో తీర్పు చెయ్యబడుతుంది. వారికి ఏ విధమైన అన్యాయం జరుగదు. వినండి! ఆకాశాలలో భూమిపై ఉన్న సమస్తం అల్లాహ్దే. తెలుసుకోండి! అల్లాహ్ వాగ్దానం నిజమైనది కాని చాలామందికి తెలియదు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మరణాన్ని కలుగజేస్తాడు. ఆయన వైపునకే మీరంతా మరలిపోవాలి.

**10. యూనుస్** 57 - 60 మానవులారా! మీవద్దకు మీ ప్రభువు తరఫునుండి హితోపదేశం వచ్చేసింది. అది హృదయాల వ్యాధులకు స్వస్థత. దానిని స్వీకరించేవారికి అది మార్గదర్శకత్వం , కారుణ్యం. ప్రవక్తా ఇలా అను : ''అల్లాహ్ తన అనుగ్రహం వల్ల తన కారుణ్యం వల్ల దానిని పంపాడు. దానికి ప్రజలు సంబరపడాలి. ప్రజలు కూడబెట్టే వాటన్నింటికంటే అది ఉత్తమమైనది.'' ప్రవక్తా! వారితో ఇలా అను : ''మీరెప్పుడైనా ఈ విషయం గురించి కూడా ఆలోచించారా? అల్లాహ్ మీ కొరకు అవతరింపజేసిన (రిజ్ఖ్) ఆహార పదార్థాలలో కొన్నింటిని స్వయంగా మీరే నిషిద్ధం చేసుకున్నారు. మరికొన్నింటిని ధర్మసమ్మతం చేసుకున్నారు ?'' వారిని ఇలా అడుగు : ''అల్లాహ్ మీకు దానికి అనుమతి ఇచ్చాడా ? లేక అబద్ధాన్ని మీరు అల్లాహ్ కు ఆపాదిస్తున్నారా ? అల్లాహ్ కు అబద్ధాన్ని ఆపాదించేవారు ప్రళయం నాడు ఆయన తమతో ఎలా వ్యవహరిస్తాడని అనుకుంటున్నారు ? అల్లాహ్ మానవులను దయాదృష్టితో చూస్తాడు. కాని చాలామంది మానవులు కృతజ్ఞతలు చూపరు.

**10. యూనుస్** 61 - 65 ప్రవక్తా! నీవు ఏ స్థితిలో ఉన్నా , ఖురాను నుండి దేనిని వినిపించినా, మానవులారా! మీరు ఏది చేసినా, ఆ అన్ని సందర్భాలలోనూ మేము మిమ్మల్ని చూస్తూనే ఉంటాము. భూమ్యాకాశాలలో ఉన్నటువంటి వస్తువు ఏదైనా సరే , అది చిన్నదిగానీ పెద్దదిగానీ దాని అణువు కూడా నీ ప్రభువు దృష్టికి గోప్యంగా లేదు. ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడకుండానూ లేదు. విను , అల్లాహ్ కు స్నేహితులైనవారికీ ఆయనను విశ్వసించి భయభక్తుల వైఖరిని అవలంబించినవారికీ ఏ విధమైన భయం కానీ , విషాదం కానీ కలిగే అవకాశం లేదు. ఇహపరజీవితాలు రెండిరటిలో కూడా వారికి శుభవార్తలే శుభవార్తలు. అల్లాహ్ మాటలు మారవు. ఇదే ఘన విజయం. ప్రవక్తా! నిన్ను గురించి వారు కల్పించే మాటల వల్ల నీవు శోకానికి గురి కాకూడదు. గౌరవం అంతా అల్లాహ్ అధీనంలోనే ఉంది. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ తెలిసినవాడూను.

**10. యూనుస్** 66 - 67 తెలుసుకో! ఆకాశాలలో ఉండేవారైనా, భూమిలో ఉండేవారైనా సర్వులూ అల్లాహ్ పాలితులే. అల్లాహ్ ను కాదని (తాము కల్పించిన) కొందరు భాగస్వాములను వేడుకుంటున్న వారు కేవలం భ్రమనూ , అనుమానాన్నీ అనుసరిస్తున్నారు. కేవలం ఊహాగానాలు చేస్తున్నారు. మీరు ప్రశాంతిని పొందేటందుకు మీకొరకు రాత్రిని సృష్టించినవాడూ , పగలును కాంతిమంతం చేసినవాడూ అల్లాహ్ యే. (చెవియొగ్గి ప్రవక్త సందేశాన్ని ) వినేవారికి ఇందులో సూచనలు ఉన్నాయి.

**10. యూనుస్** 68 - 70 అల్లాహ్ ఎవరినో కొడుకుగా చేసుకున్నాడు అని ప్రజలు అన్నారు. సుబ్హానల్లాహ్! (అల్లాహ్ అత్యంత పవిత్రుడు) ఆయన ఏ అక్కరా లేనివాడు. ఆకాశాలలో భూమిలో ఉన్నదంతా ఆయన ఆస్తియే. ఈ మాటకు అసలు మీవద్ద ఉన్న నిదర్శనమేమిటి? అల్లాహ్ ను గురించి మీకు తెలియని మాటలంటున్నారా? ప్రవక్తా! ఇలా ప్రకటించు: అల్లాహ్ కు అబద్ధాలను అంటగట్టేవారు ఎన్నటికీ సాఫల్యాన్ని పొందలేరు. కొన్ని రోజుల ఇహలోక జీవితంలో సుఖాలను అనుభవించవచ్చుకానీ తరువాత మా వైపునకే వారు మరలి రావాలి. అప్పుడు మేము వారి అవిశ్వాసానికి ప్రతిఫలంగా వారికి కఠిన బాధను రుచి చూపిస్తాము.

**10. యూనుస్** 71 - 73 వారికి నూహ్ గాధను వినిపించు. అతను తన జాతి వారితో ఇలా అన్నప్పటి గాధను : ‘‘నా జాతి సోదరులారా! నేను మీ మధ్య ఉండటం , అల్లాహ్ ఆయతులను మాటిమాటికి వినిపించి మిమ్మల్ని ఏమరుపాటునుండి మేల్కొలపటం మీకు సహింపశక్యం కాకపోతే సరే , నేను మాత్రం అల్లాహ్ను నమ్ముకున్నాను. మీరు నిలబెట్టిన భాగస్వాములను తోడుగా తీసుకొని మీరు ఒక ఏకగ్రీవ నిర్ణయానికి రండి. మీ దృష్టిలో ఉన్న పథకం గురించి సావధానంగా ఆలోచించి అర్థం చేసుకోండి , దానికి సంబంధించిన ఏ కోణమూ మీ దృష్టికి గోప్యంగా ఉండకుండా ఉండేందుకు. తరువాత దానిని నాకు వ్యతిరేకంగా ప్రయోగించండి. నాకు ఏమాత్రం వ్యవధి నివ్వకండి. మీరు నా హితోపదేశానికి వైముఖ్యం వ్యక్తం చేసి (నాకేమి నష్టం కలిగించారు) నేను మీ నుండి ఏ ప్రతిఫలాన్నీ కోరి ఉండలేదే! నాకు ప్రతిఫలాన్నివ్వటం అనేది అల్లాహ్ బాధ్యత. (ఎవరు విశ్వసించినా , విశ్వసించకపోయినా)

స్వయంగా నేను మాత్రం ముస్లిము అయివుండాలని నాకు ఆజ్ఞ ఇవ్వబడిరది. '' - వారు అతనిని తిరస్కరించారు. దానికి ఫలితంగా మేము అతనినీ, అతనితో పాటు ఓడలో ఉన్నవారినీ కాపాడాము. వారినే భూమిపై వారసులుగా చేశాము. మా ఆయతులను తిరస్కరించిన వారందరినీ ముంచివేశాము. కనుక , హెచ్చరిక చెయ్యబడినా (విశ్వసించని) వారి ముగింపు ఎలా జరిగిందో చూడు!

**10. యూనుస్** 74 నూహ్ తరువాత మేము అనేకమంది ప్రవక్తలను వారి వారి జాతుల వైపునకు పంపాము. వారు వారివద్దకు స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చారు. కాని వారు మొదట తిరస్కరించిన విషయాన్ని మళ్ళీ విశ్వసించలేదు. ఈ విధంగా మేము హద్దులను అతిక్రమించే వారి హృదయాలపై ముద్రవేస్తాము.

**10. యూనుస్** 75 - 82 వారి తరువాత మేము మూసానూ, హారూనునూ మా సూచనలతో ఫిరౌను వద్దకూ అతని సర్దారుల వద్దకూ పంపాము. కాని వారు తమ పెద్దరికపు అహంభావానికి గురి అయ్యారు. వారు అపరాధులైన ప్రజలు. కనుక మా వద్దనుండి వారి ముందుకు సత్యం వచ్చినప్పుడు వారు :''ఇది స్పష్టమైన మంత్రజాలమే'' అని అన్నారు. మూసా ఇలా అన్నాడు : ''సత్యం మీ ముందుకు వచ్చినప్పుడు ఇలా అంటారా ? ఇది ఇంద్రజాలమా? వాస్తవానికి ఇంద్రజాలికులు సాఫల్యం పొందలేరు.'' సమాధానంగా వారు ఇలా అన్నారు: ''మా పూర్వీకులు నడచిన మార్గం నుండి మమ్మల్ని మళ్లించటానికా నీవు వచ్చినది! మీ ఇద్దరి పెద్దరికాన్ని భువిలో స్థాపించటానికా నీవు వచ్చినది? నీ మాటను మేము విశ్వసించము. '' ఫిరౌను (తన మనుషులతో) ''ఆరితేరిన ప్రతి మాంత్రికుణ్ణీ నా ముందు హాజరు పరచండి''-అని అన్నాడు. మాంత్రికులు వచ్చినప్పుడు మూసా వారితో ''మీరు విసరదలచుకున్న దాన్ని విసరండి'' అని అన్నాడు. వారు తమ మంత్రసాధనాలను విసరగానే , మూసా ఇలా అన్నాడు : ''మీరు విసరినది మంత్రజాలం. అల్లాహ్ ఇప్పుడే దానిని మిథ్యగా చేసి చూపిస్తాడు. దుర్మార్గుల పనిని అల్లాహ్ చక్కబడనివ్వడు. అల్లాహ్ తన ఆజ్ఞల ద్వారా సత్యాన్ని సత్యంగా చేసి చూపుతాడు , అది దోషులకు ఎంత సహించరానిదైనా సరే.''

**10. యూనుస్** 83 (చూడండి) మూసాను అతని జాతిలోని కొందరు యువకులు తప్ప మరెవ్వరూ విశ్వసించలేదు. ఎందు కంటే వారు ఫిరౌనుకు భయపడ్డారు. స్వయంగా తమ జాతిలో పెద్దలుగా ఉన్నవారికి భయపడ్డారు. (ఆ పెద్దలు) ఫిరౌను తమను యాతనకు గురిచేస్తాడని భయపడ్డారు. యథార్థం ఏమిటంటే ఫిరౌను భూమిపై ప్రాబల్యం కలిగి ఉండేవాడు. అతడు ఏ హద్దునూ లెక్కచెయ్యనివారి కోవకు చెందినవాడు.

**10. యూనుస్** 84 - 86 మూసా తన జాతివారితో ఇలా అన్నాడు: ''ప్రజలారా! మీకు నిజంగానే అల్లాహ్ పై విశ్వాసం ఉంటే, ఆయనను నమ్మండి, మీరు గనక ముస్లిములే అయితే.'' వారు ఇలా జవాబు పలికారు : ''మేము అల్లాహ్ని నమ్ముకున్నాము. మా ప్రభూ! మమ్మల్ని దుర్మార్గులకు పరీక్షా సాధనంగా చెయ్యకు. నీ కారుణ్యం ద్వారా మాకు అవిశ్వాసుల నుండి విముక్తి కలుగజెయ్యి.''

**10. యూనుస్** 87 మేము మూసాకూ , అతని సోదరునికీ ఇలా సూచించావ :  ''ఈజిప్టులో మీ జాతి వారి కొరకు కొన్ని గృహాలను సమకూర్చండి. ఆ గృహాలను ఖిబ్లాగా నిర్ణయించుకొనండి. నమాజును స్థాపించండి. విశ్వాసులకు శుభవార్తను అందజేయండి.''

**10. యూనుస్** 88 - 89 మూసా ఇలా ప్రార్థించాడు :  ''మా ప్రభూ! నీవు ఫిరౌనుకూ అతని సర్దారులకూ ఇహలోక జీవితంలో వైభవమును సంపదను ప్రసాదించావు. ప్రభూ!  వారు  ప్రజలను నీ మార్గం నుంచి తప్పించటానికా ఇవి? ప్రభూ! వారి సంపదను ధ్వంసం చెయ్యి. వ్యధాభరితమైన శిక్షను చూసేవరకూ వారు విశ్వసించకుండా వారి హృదయాలకు ముద్రవెయ్యి.  ''   సమాధానంగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:          ''మీ ఉభయుల ప్రార్థన అంగీకరించబడిరది. ధృఢచిత్తులై ఉండండి. జ్ఞానహీనుల మార్గాన్ని ఎంతమాత్రం అనుసరించకండి.''

**10. యూనుస్** 90 - 92 మేము ఇస్రాయీలు సంతతిని సముద్రం దాటించాము. తరువాత ఫిరౌనూ, అతని సైన్యాలూ హింసించే ఉద్దేశ్యంతో అణచివేసే ఉద్దేశ్యంతో వారిని వెంబడిరచారు. చివరకు ఫిరౌను మునిగిపోతు న్నప్పుడు ఇలా అరవసాగాడు :  ''ఇస్రాయీలు సంతతివారు విశ్వసించిన దేవుడే నిజమైన దేవుడు అనీ   , ఆయన తప్ప మరొక దేవుడు ఎవడూ లేడు అనీ నేనూ విశ్వసించాను. నేను కూడా విధేయతతో శిరస్సు వంచేవారిలోని వాడనే.  '' ఇలా (జవాబు ఇవ్వబడిరది) :   ''ఇప్పుడు విశ్వసిస్తున్నావా! వాస్తవానికి ఇంతవరకు నీవు అవిధేయత చూపుతూ ఉండేవాడివి. ఇంకా కల్లోలాన్ని రేకెత్తించేవారిలో కూడా ఉన్నావు. ఇప్పుడు మేము కేవలం నీ శవాన్ని మాత్రమే రక్షిస్తాము,  నీవు వచ్చే తరాల వారికి గుణపాఠం గుర్తుగా ఉండేటందుకు. కాని చాలామంది మానవులు మా సూచనలను నిర్లక్ష్యం చేస్తారు.''

**10. యూనుస్** 93 మేము ఇస్రాయీలు సంతతివారికి చాలా చక్కని నివాస స్థలాన్ని ఇచ్చాము. ఎంతో శ్రేష్ఠమైన జీవిత వనరులను వారికి ప్రసాదించాము. తరువాత వారి మధ్య విభేదాలు పొడసూపలేదు. కాని జ్ఞానం వారివద్దకు వచ్చేసినప్పుడు మాత్రమే (అవి పొడసూపాయి). నిశ్చయంగా నీ ప్రభువు ప్రళయం నాడు వారు భిన్నాభిప్రాయములు కలిగివున్న విషయాన్ని గురించి వారిమధ్య తీర్పు చెబుతాడు.

**10. యూనుస్** 94 - 95 ఇప్పుడు ఒకవేళ నీకు , మేము నీపై అవతరింపజేసిన హితబోధను గురించి ఏమాత్రం సందేహం ఉన్నా, నీకు పూర్వం నుండీ గ్రంథాలను చదువుతూ ఉన్న ప్రజలను అడుగు. యథార్థంగా నీ ప్రభువు తరఫు నుండి నీ వద్దకు వచ్చినటువంటిది సత్యమే. కనుక నీవు సందేహించే వారిలోని వాడవు కావద్దు. అల్లాహ్ ఆయతులను తిరస్కరించినవారిలో చేరిపోకు. అలా చేస్తే నీవు నష్టపడే వారిలో చేరిపోతావు.

**10. యూనుస్** 96 - 98 యథార్థం ఏమిటంటే, ఎవరి విషయంలో నీ ప్రభువు వాక్కు నిజమని నిరూపించబడిరదో , వారి ముందుకు ఏ నిదర్శనం వచ్చినా వారు ఎన్నటికీ విశ్వసించరు  , బాధాకరమైన శిక్ష వారి ముందుకు వస్తూ

కనబడితే తప్ప. తరువాత ఒక నగరం శిక్షను చూసి విశ్వసించం అనే విషయమూ , ఇంకా దాని విశ్వాసం దానికి లాభదాయకం కావడం అనే ఉదాహరణా , ఎక్కడైనా ఉందా ఒక్క యూనుస్ జాతి తప్ప ? (అలాంటి ఉదాహరణ లేదు) ఆ జాతి విశ్వసించగానే, మేము దానిపైనుండి ఇహలోక జీవితంలో అవమానకరమైన శిక్షను తొలగించాము. దానికి కొంత కాలం వరకు జీవితాన్ని అనుభవించే అవకాశం కలుగజేశాము.

**10. యూనుస్** 99 - 100 నీ ప్రభువు అభీష్టం గనక ఇదే అయితే (అంటే భూమిపై ఉండేవారంతా విశ్వాసులూ , విధేయులూ అవ్వాలి అనేది) సమస్త భూవాసులూ విశ్వసించి ఉండేవారే. అలాంటప్పుడు నీవు ప్రజలను విశ్వాసులుగా మారండి అని బలవంతం చేస్తావా ? ఏ ప్రాణి అయినాసరే అల్లాహ్ అనుమతి లేకుండా విశ్వసించదు. అల్లాహ్ విధానం ఏమిటంటే, బుద్ధిజ్ఞానాలతో వ్యవహరించని వారిపై ఆయన మాలిన్యాన్ని పడవేస్తాడు.

**10. యూనుస్** 101 - 103 వారితో ఇలా అను: ''భూమిలోనూ, ఆకాశాలలోనూ ఉన్నటువంటి దానిని కళ్ళు తెరచి చూడండి.'' అసలు విశ్వసించటానికే ఇష్టపడని వారికి సూచనలుగానీ, హెచ్చరికలుగానీ ఎలా ఉపయోగపడతాయి? ఇప్పుడు వారు ఇంకా దేనికోసం నిరీక్షిస్తున్నారు, వారికి పూర్వం గతించిన ప్రజలు చూచినటువంటి చెడు దినాలనే చూడటం కోసం తప్ప ? వారితో ఇలా అను : ''మంచిది, నిరీక్షించండి. నేను కూడా మీతోపాటు నిరీక్షిస్తాను. '' తరువాత (అటువంటి సమయం వచ్చినప్పుడు) మేము మా ప్రవక్తలనూ , విశ్వాసులనూ కాపాడుతూ ఉంటాము. మా విధానం ఇదే. విశ్వాసులను రక్షించటం మా విధి.

**10. యూనుస్** 104 - 107 ప్రవక్తా ఇలా అను: ''మానవులారా! మీరు గనక ఇంకా నా ధర్మం గురించి ఏదైనా సంశయం కలిగివుంటే , వినండి, మీరు అల్లాహ్ ను కాదని ఆరాధించే వారిని నేను ఆరాధించను. ఏ దేవుని అధీనంలో మీ మరణం ఉన్నదో ఆ దేవుడినే నేను ఆరాధిస్తాను. నేను విశ్వాసులలో ఒకడిగా ఉండాలని నాకు ఆదేశం ఇవ్వబడిరది. నాతో ఇలా అనబడినది: ఏకాగ్రతతో చిత్తశుద్ధితో నిన్ను నీవు పూర్తిగా ఈ ధర్మానికి సమర్పించుకో. ముష్రిక్కులలో ఎంతమాత్రమూ కలిసిపోకు. అల్లాహ్ ను వదలి నీకు నష్టాన్నిగాని లాభాన్నిగాని కలిగించలేని ఏ శక్తినీ వేడుకోకు. ఒకవేళ అలాచేస్తే నీవూ దుర్మార్గుడవై పోతావు. అల్లాహ్ గనక నిన్ను ఏదైనా ఆపదకు గురిచేస్తే స్వయంగా ఆయన తప్ప ఆ ఆపదను తొలగించేవారు ఎవ్వరూ లేరు. ఇంకా ఆయన గనక నీ విషయంలో ఏదైనా మేలు చెయ్యాలని సంకల్పిస్తే , ఆయన అనుగ్రహాన్ని మళ్ళించేవాడు కూడా ఎవ్వడూ లేడు. ఆయన తన దాసులలో తాను కోరిన వారికి తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. ఆయన క్షమించేవాడూ , కరుణించేవాడూను.''

**10. యూనుస్** 108 - 109 ముహమ్మద్! ఇలా చెప్పు : ''మానవులారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి సత్యం వచ్చేసింది. ఇప్పుడు ఎవడైనా రుజుమార్గాన్ని అవలంబిస్తే అతడి రుజుమార్గ అనుసరణం అతనికే లాభదాయకం. ఎవడైనా మార్గం తప్పితే అతడి ఆ మార్గం తప్పటం అతనికే వినాశకరం. నేను మీకు కావలివాణ్ణి

మాత్రం కాను.''  ప్రవక్తా! నీవు నా వద్దకు వహీ ద్వారా పంపబడుతూవున్న హితబోధను అనుసరిస్తూ ఉండు. అల్లాహ్ తీర్పు చేసేవరకు ఓర్పు వహించు. ఆయన మాత్రమే ఉత్తమంగా తీర్పు చేసేవాడు.

**11. హూద్**

ఆయతులు : 123          అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**11. హూద్** 1 - 4 అలిఫ్ లామ్ రా. ఇది ఒక ఫర్మానా. ఇందులోని ఆయతులు నిర్దుష్టమైనవీ , సవివరంగా చెప్ప బడినవీ - వివేకవంతుడూ అన్నీ ఎరిగినవాడూ అయిన వాని తరఫు నుండి. (ఆ ఫర్మానా ఏమిటంటే) నీవు అల్లాహ్ ను తప్ప మరెవరినీ ఆరాధించకు - నేను ఆయన తరఫు నుండి మీకు హెచ్చరిక చేసేవాణ్ణి శుభవార్తలు అందజేసేవాణ్ణి కూడా. ఇంకా మీరు మీ ప్రభువును క్షమాభిక్ష కోరండి. ఆయన వైపునకు మరలిరండి. అప్పుడు ఆయన ఒక నిర్ణీత కాలం వరకూ మీకు మంచి జీవిత సామగ్రిని అనుగ్రహిస్తాడు. అనుగ్రహాలకు అర్హుడైన ప్రతివానికీ ఆయన తన అనుగ్రహాలు ప్రసాదిస్తాడు. కాని మీరు గనక విముఖులైతే , ఒక అతి భయంకరమైన దినంనాటి యాతనకు మీరు గురి అవుతారేమో అని నేను భయపడుతున్నాను. మీరందరూ అల్లాహ్ వైపునకే మరలవలసివున్నది. ఆయన సర్వమూ చెయ్యగల సమర్థుడు.

**11. హూద్** 5 - 6 చూడండి వారు తమ వక్షములను తిప్పుకుంటారు, అతని నుండి దాక్కుందామని. జాగ్రత్త! వారు బట్టలతో తమను తాము కప్పుకున్నప్పటికీ , అల్లాహ్ వారి గుప్త విషయాలనూ ఎరుగును , వారి బహిరంగ విషయాలనూ ఎరుగును. ఆయన హృదయాలలో ఉన్న రహస్యాలను కూడా ఎరుగును. ధరణిపై సంచరించే ఏ ప్రాణి ఉపాధి అయినా అల్లాహ్ బాధ్యతలో లేకుండా లేదు. ఆ ప్రాణి ఎక్కడ నివసిస్తుందో అది ఎక్కడకు చేర్చబడనున్నదో ఆయనకు తెలియకుండా లేవు. సమస్తమూ ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడి ఉన్నది.

**11. హూద్** 7 - 8 ఆకాశాలనూ , భూమినీ ఆరు దినాలలో సృష్టించినవాడు ఆయనే - దానికి పూర్వం ఆయన సింహాసనం నీళ్ళపై ఉండేది - మీలో ఎవడు మంచిపనులు చేస్తాడో మిమ్మల్ని పరీక్షించి చూద్దామని. ప్రవక్తా! ఇప్పుడు నీవు గనక వారితో ''ప్రజలారా! మరణించిన తరువాత మీరు మళ్ళీ లేపబడతారు '' అని అంటే అవిశ్వాసులు తక్షణం ఇలా అంటారు : ''ఇది స్పష్టమైన ఇంద్రజాలం ''. ఒకవేళ మేము వారి శిక్షను ఒక నిర్ణీత వ్యవధి వరకు వాయిదా వేస్తే వారు , అసలు దానిని ఏ వస్తువు పట్టి ఆపుతోంది ? అని అనటం ప్రారంభిస్తారు. వినండి, ఆ శిక్షా సమయం వచ్చే రోజున దానిని ఎవరూ మరలించలేరు. వారు ఎగతాళి చేస్తూ ఉన్నదే వారిని చుట్టుముట్టుతుంది.

**11. హూద్** 9 - 11 ఒకవేళ మేము ఎప్పుడైనా మానవునికి మా కారుణ్యాన్ని ప్రసాదించి , తరువాత అది అతనికి లేకుండా చేస్తే అతడు నిరాశ చెందుతాడు. కృతఘ్నుత చూపుతాడు. అతనిపై పడిన ఆపద (తొలగిన) తరువాత , ఒకవేళ మేము అతనికి అనుగ్రహాన్ని రుచి చూపిస్తే , ''కష్టాలన్నీ తొలగి పోయాయి '' అని అంటాడు. అతడు తరువాత ఉబ్బితబ్బిబ్బౌతాడు , విర్రవీగుతాడు. సహనశీలురూ , సత్కార్యపరులూ అయినవారు మాత్రమే ఈ దోషానికి అతీతులు. వారికే మన్నింపూ, పెద్ద బహుమానమూను.

**11. హూద్** 12 ప్రవక్తా! వహీ ద్వారా నీకు తెలుపబడుతూవున్న విషయాలలో దేనినైనా (ప్రకటించకుండా) వదలిపెట్టబోకుము సుమా! వారు ''ఈ వ్యక్తిపై ఏదైనా నిధి ఎందుకు దింపబడలేదు ?'' లేదా ''ఇతనితో పాటు దైవదూత ఎవడైనా ఎందుకు రాలేదు ?'' అని అంటారని నీ మనస్సు బాధ పడకూడదు. నీవు కేవలం హెచ్చరిక చేసేవాడవు. ఆపై అన్నింటికీ అల్లాహ్ యే బాధ్యుడు.

**11. హూద్** 13 - 14 ప్రవక్తయే స్వయంగా ఈ గ్రంథాన్ని కల్పించాడని వారు అంటున్నారా ? ఇలా అను : ''సరే విషయం గనక ఇదే అయితే ఇటువంటి కల్పించబడిన పది సూరాలను మీరు రచించి తీసుకురండి. అల్లాహ్ ను తప్ప, (మీ ఆరాధ్య దైవాలలో) ఎవరినైనా సరే సహాయం కొరకు పిలువ గలిగితే పిలుచుకొండి , మీరేగనక (వారిని ఆరాధ్య దైవాలుగా భావించటంలో) సత్యవంతులే అయితే. ఇప్పుడు ఒకవేళ వారు (మీ ఆరాధ్యదైవాలు) మీ సహాయం కొరకు రాలేకపోతే, తెలుసుకోండి, ఈ గ్రంథం అల్లాహ్ ఎరుకతోనే అవతరించిందని, అల్లాహ్ తప్ప నిజమైన దేవుడు మరొకడు లేడని. ఇప్పుడైనా మీరు (ఈ సత్యవిషయాన్ని ) శిరసావహిస్తారా?''

**11. హూద్** 15 - 16 కేవలం ఈ ప్రాపంచిక జీవితాన్నీ , దాని ఆకర్షకాలనూ కోరుకునే వారు చేసిన పనులకు పూర్తి ప్రతిఫలాన్ని మేము వారికి ఇక్కడనే ఇచ్చేస్తాము. ఇందులో వారికి తక్కువచెయ్యటం అంటూ జరుగదు. అయితే పరలోకంలో అటువంటి వారికి అగ్ని తప్ప మరేమీ ఉండదు. (అక్కడ తెలిసిపోతుంది) వారు ప్రపంచంలో చేసినదంతా మట్టిలో కలసిపోయింది అనీ, వారు చేసినదంతా కేవలం మిథ్యఅనీ.

**11. హూద్** 17 ఒక వ్యక్తి తన ప్రభువు తరఫునుండి వచ్చిన ఒక స్పష్టమైన నిదర్శనాన్ని కలిగి ఉన్నాడు. ఆపై ప్రభువు తరఫు నుండి (ఆ నిదర్శనాన్ని బలపరుస్తూ) ఒక సాక్షి కూడా వచ్చింది. ఆ వ్యక్తికి పూర్వం మార్గదర్శకంగా, కారుణ్యంగా వచ్చిన మూసా గ్రంథం కూడా ఉన్నది. (అటువంటి వ్యక్తి కూడా ప్రపంచ పూజారులు మాదిరిగా ఈ సందేశాన్ని తిరస్కరించగలుగుతాడా?) అటువంటి ప్రజలు దానిని తప్పకుండా విశ్వసిస్తారు. మానవ వర్గాలలో ఏ వర్గమైనా సరే దానిని తిరస్కరిస్తే , దానికి వాగ్దానం చెయ్యబడిన నివాస స్థానం నరకము. కనుక ప్రవక్తా! దాని విషయంలో నీవు ఏ సంశయానికీ లోనుకావద్దు. అది నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యము. కాని చాలామంది నమ్మరు.

**11. హూద్** 18 - 24 అల్లాహ్ కు అబద్ధం అంటగట్టే వాడికంటే పరమ దుర్మార్గుడెవడు ? అటువంటి వారు అల్లాహ్ సమక్షంలో హాజరవుతారు. తమ ప్రభువునకు అబద్ధాన్ని అంటగట్టినవారు వారే అని అపుడు సాక్షులు సాక్ష్యం చెబుతారు. విను! దుర్మార్గుల మీద దేవుని శాపం పడుతుంది. దేవుని మార్గం నుండి ప్రజలను ఆపే దుర్మార్గుల మీద, ఆయన మార్గాన్ని వక్రీకరించగోరే దుర్మార్గుల మీద, పరలోకాన్ని తిరస్కరించే దుర్మార్గులమీద-వారు భూమిపై అల్లాహ్ ను నిస్సహాయునిగా చేయలేక పోయారు. అల్లాహ్ కు వ్యతిరేకంగా వారిని రక్షించేవాడు కూడా లేకుండా పోయాడు. వారికి ఇప్పుడు రెట్టింపు శిక్షపడుతుంది. ఎందుకంటే వారు ఎవరి మాటనూ వినేవారూ కాదు , స్వయంగా వారికి ఏ విషయమూ తట్టేదీ కాదు. తమను తాము స్వయంగా నష్టానికి గురిచేసుకున్నవారూ , తాము కల్పించిన దానినంతా కోల్పోయినవారూ వారే. వారు పరలోకంలో అందరికంటే అధికంగా నష్టపోవటం అనివార్యం. ఇక విశ్వసించి సత్కార్యాలు చేసినవారూ, తమ ప్రభువుకే అంకితమై పోయినవారూ నిశ్చయంగా స్వర్గానికి పోతారు. స్వర్గంలోనే వారు శాశ్వతంగా ఉంటారు. ఈ ఉభయపక్షాల పోలిక ఇలా ఉంది : ఒకడు గుడ్డివాడు , చెవిటివాడు. రెండోవాడు చూడగలిగేవాడు , వినగలిగేవాడూ. వారు ఉభయులూ సమానులౌతారా ? మీరు (ఈ పోలిక ద్వారా) గుణపాఠాన్ని గ్రహించరా?

**11. హూద్** 25 - 31 మేము నూహ్ ను అతని జాతి వైపునకు పంపాము (అప్పుడు కూడా ఇటువంటి పరిస్థితులే నెలకొని ఉన్నాయి). (అతను ఇలా ప్రకటించాడు): ''నేను స్పష్టంగా మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. అల్లాహ్ ను తప్ప మరెవరినీ ఆరాధించకండి. అలా చేస్తే మీపై ఒక రోజున బాధాకరమైన శిక్ష వచ్చిపడుతుందని నేను భయపడుతున్నాను.'' సమాధానంగా, అతని మాటను తిరస్కరించిన అతని జాతి సర్దారులు ఇలా అన్నారు : ''మా దృష్టిలో నీవు కేవలం మావంటి ఒక మానవుడు తప్ప మరేమీ కావు. అదీగాక మా జాతిలో అల్పులైన వారే ఆలోచించకుండా, అర్థం చేసుకోకుండా నిన్ను అనుసరించ టాన్ని మేము చూస్తూనే ఉన్నాము. ఏ విషయంలో కూడా మీరు మా కంటే మెరుగుగా ఉన్నట్లు మాకు కనిపించదు. పైగా మేము నిన్ను అసత్యవాదిగా భావిస్తున్నాము.'' అతను ఇలా అన్నాడు : ''నా జాతి సోదరులారా! కొంచెం ఆలోచించండి. ఒకవేళ నేను నా ప్రభువు తరఫు నుండి వచ్చిన ఒక స్పష్టమైన నిదర్శనంపై నిలబడి ఉంటే , తరువాత ఆయన నాకు తన ప్రత్యేక కారుణ్యభాగ్యాన్ని కూడా కలుగజేస్తే - కాని అది మీకు కనిపించకపోతే , మీరు నమ్మటానికి సిద్ధంగా లేకపోయినా , మేము దానిని మీ నెత్తిపై బలవంతంగా ఎలా రుద్దగలము ? నా జాతి సోదరులారా! ఈ పనికి నేను మీ నుండి ధనమేమీ కోరటం లేదు. నాకు ప్రతిఫలం ఇవ్వటం అనేది అల్లాహ్ బాధ్యత. నా మాటను విశ్వసించిన వారిని నేను గెంటివెయ్యలేను. స్వయంగా వారే తమ ప్రభువు సన్నిధానానికి వెళ్ళనున్నారు. అయితే , నేను చూస్తున్నాను. మీరు అజ్ఞానులుగా ప్రవర్తిస్తున్నారు. ప్రజలారా! ఒకవేళ నేను వారిని తరిమివేస్తే , అల్లాహ్ శిక్ష నుండి నన్ను రక్షించటానికి ఎవడు వస్తాడు? మీకు ఈ చిన్న విషయం కూడా అర్థం కాదా ? నా వద్ద అల్లాహ్ నిధులున్నాయని నేను మీతో చెప్పటంలేదే. నాకు అగోచర జ్ఞానం ఉందని కూడా అనటం లేదే. నేను దైవదూతనని కూడా

ప్రకటించలేదు కదా! మీ కళ్ళు అసహ్యతతో చూస్తున్న వారికి అల్లాహ్ ఏ శుభాన్నీ ఇవ్వలేదని కూడా నేను అనలేదు. వారి మనస్సులలో ఏమి ఉన్నదో అల్లాహ్కే బాగా తెలుసు. ఒకవేళ అలా అంటే నేను దుర్మార్గుడనే.''

**11. హూద్** 32 - 34 చివరకు వారు ఇలా అన్నారు: ''నూహ్! నీవు మాతో వాదించావు. ఎన్నోసార్లు వాదించావు. ఇక చాలు. నీవు గనక సత్యవంతుడవే అయితే ఆ శిక్షను తీసుకురా , దానిని గురించి నీవు మమ్మల్ని బెదిరిస్తున్నావు.'' నూహ్ ఇలా జవాబు పలికాడు : దానిని అల్లాహ్ యే తీసుకువస్తాడు , ఆయన గనక కోరితే. దానిని నిరోధించే సామర్థ్యం మీకు లేదు. అల్లాహ్ యే మిమ్మల్ని మార్గభ్రష్టులుగా చెయ్యాలని సంకల్పించుకున్నప్పుడు, నేను ఇప్పుడు మీ శ్రేయస్సును ఎంతగా కోరినా నా శ్రేయోభిలాష మీకు ఏ లాభాన్నీ చేకూర్చలేదు. ఆయనే మీ ప్రభువు. ఆయన వైపునకే మీరు మరలవలసి ఉన్నది.''

**11. హూద్** 35 ప్రవక్తా! ఇదంతా స్వయంగా అతనే కల్పించాడని వారు అంటున్నారా? వారికి ఇలా చెప్పు: ''ఒకవేళ నేనే స్వయంగా దీనిని కల్పించి ఉన్నట్లయితే ఆ నేరము యొక్క బాధ్యత నాపై ఉన్నది. మీరు చేస్తూవున్న నేరం బాధ్యతతో నాకు ఏ సంబంధమూ లేదు.''

**11. హూద్** 36 - 37 నూహ్కు వహీద్వారా ఇలా తెలుపబడిరది : నీ జాతిలో విశ్వసించే వారెవరూ లేరు. వారి అకృత్యాలకు బాధపడటం మానుకో. మా పర్యవేక్షణలో మా వహీకి అనుగుణంగా ఒక పడవను తయారుచెయ్యి. చూడు! దుర్మార్గం చేసిన వారిని గురించి నాకు సిఫారసు చెయ్యకు. వారందరూ ఇప్పుడు మునిగిపోయేవారే.

**11. హూద్** 38 - 39 నూహ్ పడవను తయారుచేస్తున్నాడు. అతని జాతి సర్దారులలో అతనివైపుగా పోయే ప్రతివాడూ అతనిని ఎగతాళి చేసేవాడు. అతను ఇలా అన్నాడు : ''మీరు గనక మమ్మల్ని చూసి నవ్వుతూ ఉంటే మేము కూడా మిమ్మల్ని చూసి నవ్వుతున్నాము. అతి త్వరలో స్వయంగా మీకే తెలుస్తుంది. అవమానం పాలుచేసే శిక్ష ఎవరిపై పడుతుందో, తొలగించినా తొలగని ఆపద ఎవరిపై విరుచుకుపడుతుందో.''

**11. హూద్** 40 - 41 చివరకు మా ఆజ్ఞ వచ్చేసినప్పుడు , పొయ్యి పొంగింది. అప్పుడు మేము ఇలా అన్నాము : ''ప్రతి జాతి నుండి ఒక్కొక్క జంటను పడవలో ఎక్కించు. నీ ఇంటివారిని కూడా - ఇదివరకే సూచింపబడిన వ్యక్తులు తప్ప. ఇందులో ఎక్కించు. ఇంకా విశ్వాసులను కూడా ఎక్కించుకో. నూహ్తో పాటు విశ్వసించిన వారు చాలా కొద్దిమంది మాత్రమే. నూహ్ ఇలా అన్నాడు: ''ఇందులో ఎక్కండి. అల్లాహ్ పేరుతోనే దాని పయనం కూడా , దాని ఆగటం కూడా. నా ప్రభువు క్షమించేవాడూ, కనికరించే వాడూనూ.''

**11. హూద్** 42 - 43 పడవ వారిని తీసుకుని తరలిపోతోంది. ఒక్కొక్క కెరటం పర్వతం మాదిరిగా లేస్తూ ఉంది. నూహ్ కుమారుడు చాలా దూరాన ఉన్నాడు. నూహ్ ఎలుగెత్తి పిలిచాడు: ''బాబూ! మాతోపాటు ఎక్కెయ్యి. అవిశ్వాసులతో ఉండకు.'' అతడు తిరిగి సమాధానం పలికాడు: ''నేను ఇప్పుడే ఒక కొండపైకి ఎక్కుతాను. అది

నన్ను నీళ్ళనుండి కాపాడుతుంది.'' నూహ్ ఇలా అన్నాడు : ''అల్లాహ్ తీర్పునుండి ఈనాడు రక్షించే వస్తువు ఏదీ లేదు, అల్లాహ్ యే ఎవరినైనా కరుణిస్తే తప్ప. '' ఇంతలోనే ఒక కెరటం వారిద్దరికీ మధ్య అడ్డుగా వచ్చింది. అతడు కూడా మునిగిపోయే వారిలో కలసిపోయాడు.

**11. హూద్** 44 ఆజ్ఞ జారీ అయింది : ''భూమీ! నీ నీళ్ళన్నీ మింగివెయ్యి. ఆకాశమా! కురవటం మానివెయ్యి. '' అప్పుడు నీరు భూమిలో ఇంకిపోయింది. తీర్పు జరిగిపోయింది. పడవ జూదీపై ఆగిపోయింది. ''దుర్మార్గుల జాతి తొలగిపోయింది'' అని చెప్పబడిరది.

**11. హూద్** 45 - 47 నూహ్ తన ప్రభువుతో ఇలా మొరపెట్టుకున్నాడు. ''ప్రభూ! నా కుమారుడు నా కుటుంబం లోని వాడు. నీ వాగ్దానం నిజమైనటువంటిది, నీవు పాలకులలోకెల్లా గొప్పవాడవు, ఉత్తముడవు.'' సమాధానంగా ఇలా అనబడిరది : ''నూహ్! అతడు నీ కుటుంబంలోనివాడు కాదు. అతడు ఒక చెడిపోయిన పని. కనుక ఏ విషయం యొక్క యథార్థం నీకు తెలియదో ఆ విషయం గురించి నన్ను వేడుకోకు. నిన్ను నీవు అజ్ఞానుల మాదిరిగా చేసుకోకు అని నేను నీకు ఉపదేశిస్తున్నాను. '' నూహ్ వెంటనే ఇలా విన్నవించుకున్నాడు: ''నా ప్రభూ! నాకు తెలియనిదానిని గురించి నిన్ను అడగటం నుండి నేను నీ శరణు వేడుకుంటున్నాను. నీవు గనక నన్ను క్షమించకపోతే, నన్ను కరుణించకపోతే నేను సర్వనాశనం అయిపోతాను.''

**11. హూద్** 48 ఇలా ఆజ్ఞ ఇవ్వబడిరది : ''నూహ్! దిగిపో. నీపై నీతో పాటు ఉన్న వర్గాలపై మా తరఫు నుండి శాంతీ శుభాలూ కలుగుగాక. కొన్ని వర్గాలకు మేము కొంతకాలం వరకు జీవన సామగ్రిని ప్రసాదిస్తాము. తరువాత మా తరఫు నుండి వ్యధాభరితమైన శిక్ష వారిపై పడుతుంది.''

**11. హూద్** 49 ప్రవక్తా! ఇవి అగోచర సమాచారములు. వాటిని మేము నీకు వహీ ద్వారా తెలుపుతున్నాము. ఇంతకు పూర్వం నీవుగానీ నీ జాతివారుగానీ వాటిని ఎరుగరు. కనుక ఓర్పు వహించు. ఫలితం భయభక్తులుగలవారినే వరిస్తుంది.

**11. హూద్** 50 - 52 ఆద్ జాతి వైపునకు మేము వారి సోదరుడైన హూద్‌ను పంపాము. అతను ఇలా అన్నాడు: ''నా జాతి సోదరులారా! అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు. మీరు సృష్టించినటువంటిది కేవలం అబద్ధమే. నా జాతి సోదరులారా! ఈ పనికై మీ నుండి ఏ ప్రతిఫలాన్నీ కోరను. నాకు ప్రతిఫలం ఇవ్వటం నన్ను సృష్టించిన వాని బాధ్యత - మీరు తెలివిని ఏమాత్రం ఉపయోగించరా? నా జాతి ప్రజలారా! మీ ప్రభువును క్షమాభిక్ష కోరండి. ఆయన వైపునకు పశ్చాత్తాపంతో మరలండి. ఆయన మీకై ఆకాశం ద్వారాలను తెరిచేస్తాడు. ఇప్పుడు మీకున్న శక్తిని మరింత శక్తి ఇచ్చి పెంచుతాడు. దోషులై (ఆరాధనకు) విముఖులు కాకండి.''

**11. హూద్** 53 - 54 వారు ఇలా జవాబు చెప్పారు : హూద్! నీవు మా వద్దకు స్పష్టమైన ఏ సాక్ష్యాన్నీ తీసుకురాలేదు. నీవు చెప్పినంత మాత్రాన మేము మా ఆరాధ్య దైవాలను వదలిపెట్టలేము. నిన్ను మేము విశ్వసించ బోవటం లేదు. నీపై మా ఆరాధ్యదైవాలలో ఎవరి దెబ్బ అయినా పడిరదని మేము అనుకుంటున్నాము.

**11. హూద్** 54 - 57 హూద్ ఇలా అన్నాడు : ''నేను అల్లాహ్ ను సాక్షిగా నిలబెడ్తున్నాను. మీరు కూడా సాక్షులుగా ఉండండి, అల్లాహ్తో పాటు మీరు ఇతరులను దైవత్వంలో భాగస్వాములుగా చేసిన విషయంతో నాకు ఏవిధమైన సంబంధం లేదు అనేదానికి. మీరంతా కలిసి నాకు వ్యతిరేకంగా చెయ్యవలసినదంతా చేయండి. ఏవిధమైన లోటూ రానివ్వకండి. నాకు కొద్దిపాటి వ్యవధికూడా ఇవ్వకండి. నా నమ్మకం అల్లాహ్ మీదనే. ఆయన నాకూ ప్రభువే మీకూ ప్రభువే. ఏ ప్రాణి జుట్టు అయినా ఆయన చేతులలో లేకుండా లేదు. నిశ్చయంగా నా ప్రభువు మార్గమే సరియైన మార్గం. మీరు గనక మీ ముఖాలను తిప్పుకోదలిస్తే తిప్పుకోండి. ఏ సందేశంతో నేను మీ వద్దకు పంపబడ్డానో , ఆ సందేశాన్ని నేను మీకు అందజేశాను. ఇక నా ప్రభువు మీ స్థానంలో మరొక జాతిని ప్రభవింపజేస్తాడు. ఆయనకు మీరు ఏమాత్రం హానిచెయ్యలేరు. నిశ్చయంగా నా ప్రభువు ప్రతి వస్తువునూ కనిపెట్టి ఉంటాడు.

**11. హూద్** 58 తరువాత మా ఆజ్ఞ వచ్చేసినప్పుడు , మేము మా కారుణ్యం ద్వారా హూద్‌కూ , అతనితో పాటు విశ్వసించిన ప్రజలకూ విముక్తిని ప్రసాదించాము. ఒక కఠిన శిక్ష నుండి వారిని రక్షించాము.

**11. హూద్** 59 - 60 వీరే ఆద్ జాతివారు. వారు తమ ప్రభువు ఆయతులను తిరస్కరించారు. ఆయన పంపిన ప్రవక్తల మాటలను వారు పాటించలేదు. అధికారంకల నిరంకుశుడైన ప్రతి సత్యవిరోధికి విధేయత చూపారు. చివరకు ఈ లోకంలో కూడా వారిపై శాపం పడిరది. ప్రళయం నాడు కూడా పడుతుంది. విను! ఆద్ జాతివారు తమ ప్రభువును తిరస్కరించారు. విను! ఆద్, హూద్ జాతుల ప్రజలు దూరంగా విసరివేయబడ్డారు.

**11. హూద్** 61 సమూద్ జాతి వద్దకు మేము వారి సోదరుడైన సాలిహ్ను పంపాము. అతను ఇలా హితోపదేశం చేశాడు: ''నా జాతి ప్రజలారా! అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు. ఆయనే మిమ్మల్ని భూమి నుండి సృష్టించాడు. ఇక్కడ మీకు నివాసం ఏర్పాటు చేశాడు. కనుక మీరు ఆయనను క్షమాభిక్ష కోరండి. ఆయన వైపునకు పశ్చాత్తాపంతో మరలిరండి. నిశ్చయంగా నా ప్రభువు దగ్గరలోనే ఉన్నాడు. ఆయన ప్రార్థనలకు సమాధానం కూడా ఇస్తాడు.

**11. హూద్** 62 వారు ఇలా అన్నారు : ''సాలిహ్! నిన్నటివరకు మా మధ్య ఉన్న నీమీద మేము పెద్ద పెద్ద ఆశలు పెట్టుకున్నాము. మా తాత ముత్తాతలు పూజించిన దేవుళ్ళను పూజించకుండా మమ్మల్ని ఆపదలచు కున్నావా ? నీవు ఏ మార్గం వైపునకు మమ్మల్ని పిలుస్తున్నావో , ఆ మార్గాన్ని గురించి మాకు పెద్ద అనుమానం ఉన్నది. అది మమ్మల్ని కలతకు గురిచేసింది.''

**11. హూద్** 63 - 64 సాలిహ్ ఇలా అన్నాడు : ''నా జాతి సోదరులారా! కొంచెం ఈ విషయాన్ని గురించి కూడా ఆలోచించారా? ఒకవేళ నేను నా ప్రభువు తరఫు నుండి వచ్చిన ఒక స్పష్టమైన నిదర్శనాన్ని కలిగివుంటే , ఇంకా ఆయన నాకు తన కారుణ్యాన్ని కూడా ప్రసాదించి ఉంటే , ఆ తరువాత ఒకవేళ నేను అల్లాహ్ కు అవిధేయత చూపితే ఆయన పట్టునుండి నన్ను ఎవడు రక్షిస్తాడు? మీరు నాకు ఏ విధంగా ఉపయోగపడతారు, నన్ను ఇంకా నష్టంలోకి నెట్టటానికి తప్ప? నా జాతి ప్రజలారా! చూడండి! అల్లాహ్ యొక్క ఈ ఒంటె మీకు ఒక నిదర్శనంగా ఉంది. దానిని అల్లాహ్ భూమిపై మేయటానికి స్వేచ్ఛగా వదలిపెట్టండి. దాని జోలికి ఏమాత్రం పోకండి. ఒకవేళ అలాచేస్తే దైవశిక్ష మీపై పడటానికి ఎంతోసేపు పట్టదు.''

**11. హూద్** 65 కాని వారు ఒంటెను చంపివేశారు. అప్పుడు సాలిహ్ వారిని ఇలా హెచ్చరించాడు : ''ఇంకా మూడు రోజులు మాత్రం మీరు మీ ఇళ్ళల్లో హాయిగా గడపండి. ఈ గడువు అబద్ధం కాబోదు.''

**11. హూద్** 66 - 68 చివరకు మా తీర్పు సమయం వచ్చేసినప్పుడు, మేము మా కారుణ్యంతో సాలిహ్ను, అతనితో పాటు విశ్వసించిన వారినీ రక్షించాము. ఆ దినపు పరాభవం నుండి వారిని కాపాడాము. నిస్సంశయంగా నీ ప్రభువు మాత్రమే శక్తిమంతుడూ ప్రాబల్యం కలవాడూను. ఇక దుర్మార్గానికి పాల్పడిన వారు , వారిపై ఒక పెద్ద ప్రేలుడు విరుచుకుపడిరది. అప్పుడు వారు తమ గృహాలలో చలనమూ చైతన్యమూ లేకుండా పడిపోయారు , అసలు వారు ఎప్పుడూ అక్కడ నివసించనే లేదన్నట్లుగా. విను! సమూద్ జాతివారు తమ ప్రభువును తిరస్కరించారు. విను! సమూద్ జాతివారు దూరంగా విసరివెయ్యబడ్డారు!

**11. హూద్** 69 - 73 చూడు! ఇబ్రాహీమ్ వద్దకు మా దూతలు శుభవార్తను తీసుకుని చేరారు. ''మీకు సలామ్'' అని వారు అన్నారు. ''మీకూ సలామ్'' అని ఇబ్రాహీమ్ బదులుపలికాడు. ఆ తరువాత కొద్దిసేపటికే ఇబ్రాహీమ్ వేపిన ఆవుదూడను (వారి ఆతిధ్యానికి) తీసుకొని వచ్చాడు. కాని వారి చేతులు భోజనం మీదకు పోకుండా ఉండటాన్ని చూసి ఆయన వారిని శంకించాడు. మనస్సులో వారంటే భయ పడసాగాడు. వారు ఇలా అన్నారు: ''భయపడకు, మేము లూత్ జాతి వైపునకు పంపబడ్డాము.'' ఇబ్రాహీము భార్య కూడా అక్కడ నిలబడి ఉన్నది. ఆమె ఇది విని నవ్వింది. అప్పుడు మేము ఆమెకు ఇస్హాఖ్ శుభవార్తనూ , ఇస్హాఖ్ తరువాత యాఖూబ్ శుభవార్తను అందజేశాము. ఆమె ఇలా అన్నది : ''అయ్యో నా దౌర్భాగ్యం! నాకు ఇప్పుడా పిల్లలు పుట్టేది ? నేనూ ముసలిదాన్నే! నా భర్తకూడా ముసలివారే. ఇది చాలా విచిత్రమైన విషయం. దైవదూతలు ఇలా అన్నారు : ''అల్లాహ్ ఆజ్ఞ పట్ల ఆశ్చర్యపడుతున్నావా ? ఇబ్రాహీము కుటుంబ సభ్యులారా! అల్లాహ్ కారుణ్యమూ , ఆయన శుభాశీస్సులూ మీపై ఉన్నాయి. నిశ్చయంగా అల్లాహ్ స్తోత్రానికి ఎంతో అర్హుడూ, మహాఘనత కలవాడూ.''

**11. హూద్** 74 - 76 తరువాత ఇబ్రాహీము యొక్క భయం తొలగిపోయినప్పుడు (సంతానం శుభవార్తవల్ల) అతని మనస్సు ఆనందపడినప్పుడు, అతను లూత్ జాతి వారి వ్యవహారం గురించి నాతో పోట్లాడ సాగాడు. యథార్థంగా

ఇబ్రాహీము సహనశీలుడూ , మృదుహృదయుడూ అయిన మనిషి. అన్ని పరిస్థితులలోనూ మా వైపునకు మరలేవాడు. (చివరకు మా దూతలు అతనితో అన్నారు): ఇబ్రాహీమూ! దీన్ని మానుకో , నీ ప్రభువు ఆజ్ఞ ప్రకటించబడిరది. ఇక వారిపై ఆ శిక్ష వచ్చిపడటం తథ్యం. అది ఎవరు మరలించినా మరలదు.''

**11. హూద్** 77 - 81 మా దూతలు లూత్ వద్దకు వచ్చినప్పుడు , వారి రాకకు అతను చాలా భయపడ్డాడు. అతని హృదయం క్రుంగిపోయింది. ''ఈ రోజు పెద్ద ఆపద రోజు '' అని అతను అనసాగాడు. (ఈ అతిథులు రాగానే) అతని జాతి ప్రజలు అప్రయత్నంగా అతని ఇంటి వైపునకు పరుగెత్తారు. మొదటి నుండీ వారు ఇటువంటి నీచపు పనులకే అలవాటుపడ్డవారు. లూత్ వారితో ఇలా అన్నాడు : ''సోదరులారా! ఇదిగో, నా కూతుళ్ళు ఉన్నారు. వీరు మీకు ఎక్కువ పరిశుద్ధులు అయినవారు. కొంచెమన్నా దేవునికి భయపడండి. నా అతిథుల విషయంలో నన్ను అవమానం పాలు చెయ్యకండి. మీలో ఒక్కడైనా మంచివాడు లేడా ?'' వారు ఇలా సమాధానం చెప్పారు : ''నీ కూతుళ్ళు మాకు అవసరం లేదని నీకు బాగా తెలుసుకదా! అసలు మేము కోరేది ఏమిటో కూడా నీకు తెలుసు. '' లూత్ ఇలా అన్నాడు : ''మీకు బుద్ధి చెప్పే బలం నాకు ఉంటే ఎంత బాగుండేది! లేదా శరణు పొందటానికి ఏదైనా పటిష్ఠమైన ఆధారం అయినా ఉంటే ఎంత బాగుండేది! '' అప్పుడు దైవదూతలు అతనితో ఇలా అన్నారు : ''లూత్! మేము నీ ప్రభువు పంపిన దూతలము. వారు నీకు ఏమాత్రం కీడు చెయ్యలేరు. కనుక కొంతరాత్రి ఉండగానే నీవు నీ ఇంటివారిని తీసుకుని బయలుదేరు. చూడు! మీలో ఎవరూ వెనక్కి తిరిగి చూడకూడదు. కాని నీ భార్య (నీతో రాకూడదు). ఎందుకంటే , వారికి ఏది జరగనున్నదో అదే ఆమెకూ జరుగుతుంది. వారి వినాశానికి ఉదయ సమయం నిర్ణయం అయింది - ఉదయం కావటానికి ఇంకెంత ఆలస్యం ఉందని!''

**11. హూద్** 82 - 83 తరువాత మా తీర్పు సమయం వచ్చేసినప్పుడు , మేము ఆ పట్టణాన్ని తల్లక్రిందులు చేసేశాము. దానిమీద కాల్చిన మట్టితో చేయబడిన రాళ్ళు ఎడతెగకుండా కురిపించాము. వాటిలోని ప్రతి రాయికీ గుర్తు నీ ప్రభువు వద్ద చేయబడిరది. ఈ శిక్ష దుర్మార్గులకు ఎంతో దూరంలో లేదు.

**11. హూద్** 84 - 86 మద్యన్ ప్రజల వైపునకు మేము వారి సోదరుడైన షుఐబ్‌ను పంపాము. అతను ఇలా అన్నాడు : ''నా జాతి ప్రజలారా! అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు ఎవ్వడూ లేడు. కొలుచుటలో, తూచుటలో తక్కువ చెయ్యకండి. నేను ఈనాడు మిమ్మల్ని మంచిస్థితిలో చూస్తున్నాను. కాని రేపు మీపైకి ఒక దినం రానున్నది అనీ, దాని శిక్ష మీ అందరినీ చుట్టుముట్టుతుంది అనీ నేను భయపడుతున్నాను. నా జాతి సోదరులారా! కచ్చితంగా, న్యాయంగా పూర్తిగా కొలవండి, తూచండి. ప్రజలకు వారి వస్తువులను తక్కువచేసి ఇవ్వకండి. భూమిపై సంక్షోభాన్ని వ్యాపింపజేస్తూ తిరగకండి. అల్లాహ్ ప్రసాదించిన మిగులే (అందరికీ న్యాయంగా ఇచ్చిన తరువాత మిగిలినది) మీకు మేలైనది, మీరు విశ్వాసులే అయితే. ఏమైనప్పటికీ, నేను మీపై కావలివాణ్ణి మట్టుకు కాను.''

**11. హూద్** 87 వారు ఇలా సమాధానం చెప్పారు: ''షుఐబ్! మా తాత ముత్తాతలు పూజించిన దేవుళ్ళందరినీ మేము వదిలిపెట్టాలనీ, లేదా మా ధనాన్ని మా ఇష్టానుసారం ఖర్చుచేసుకునే అధికారం మాకు ఉండకూడదనీ , నీకు నీ నమాజు నేర్పుతున్నదా ? ఇక ఉదాత్త హృదయుడవూ , ఋజువర్తనుడవూ కేవలం నీవు ఒక్కడివే మిగిలిపోయావు!''

**11. హూద్** 88 - 90 షుఐబ్ ఇలా అన్నాడు : ''సోదరులారా! స్వయంగా మీరే ఆలోచించండి. ఒకవేళ నేను నా ప్రభువు తరఫునుండి ఒక స్పష్టమైన నిదర్శనాన్ని కలిగివుంటే తరువాత ఆయన నాకు తన వద్ద నుండి మంచి ఉపాధిని కూడా ప్రసాదిస్తే (దాని తరువాత నేను మీ భ్రష్ట మార్గాలలో మీ అక్రమ కార్యాలలో మీతో కలసి నేను ఎలా ఉండగలుగుతాను?) ఏ విషయాల నుండి నేను మిమ్మల్ని వారిస్తున్నానో వాటిని నేనే స్వయంగా చెయ్యటాన్ని నేను సుతరామూ ఇష్టపడను. నేను మాత్రం నా శక్తిమేరకు మిమ్మల్ని సంస్కరించదలచుకున్నాను. నేను చెయ్యదలచుకున్న ఇదంతా పూర్తిగా అల్లాహ్ సహాయంపైనే ఆధారపడివుంది. ఆయననే నేను నమ్ముకున్నాను. ప్రతి వ్యవహారంలో ఆయన వైపునకే మరలుతాను. నా జాతి సోదరులారా! నాకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న మీ మొండివైఖరి చివరకు నూహ్ జాతిపై లేదా హూద్ జాతిపై లేదా సాలిహ్ జాతిపై పడిన శిక్షయే మీపై కూడా పడేవరకు తీసుకునిపోదు కదా! లూత్ జాతివారు మీకు ఎంతో దూరంలో కూడా లేరు. చూడండి! మీ ప్రభువును క్షమాభిక్ష కోరండి. ఆయన వైపునకు పశ్చాత్తాపంతో మరలిరండి. నిస్సందేహంగా నా ప్రభువు కారుణ్యమూర్తి. తన సృష్టిని ప్రేమిస్తాడు.''

**11. హూద్** 91 వారు ఇలా బదులు చెప్పారు : ''షుఐబ్! నీవు చెప్పే చాలా విషయాలు మాకు అర్థమే కావు. మేము చూస్తూ ఉన్నాము - నీవు మాలో ఒక దుర్బలుడవు. నీ వంశం వారే గనక లేకుండా ఉంటే మేము నిన్ను ఎప్పుడో రాళ్ళతో కొట్టి చంపివుండేవాళ్ళం. మాపై ఆధిక్యం పొందగలిగే అంత శక్తి నీకు లేదు.''

**11. హూద్** 92 - 93 షుఐబ్ ఇలా అన్నాడు: ''సోదరులారా! మా వంశం వారు మీపై అల్లాహ్కంటె ఎక్కువ ఆధిక్యం కలవారా, మీరు (మా వంశం వారికి భయపడ్డారు కాని) అల్లాహ్ ను మాత్రం పూర్తిగా వెనక్కు నెట్టేశారు ? తెలుసుకోండి! మీరు చేస్తున్నదంతా అల్లాహ్ శక్తిపరిధికి అతీతంగా లేదు. నా జాతి జనులారా! మీరు మీ విధానం ప్రకారం పనిచేస్తూ పొండి. నేను నా విధానం ప్రకారం పనిచేస్తూ ఉంటాను. త్వరలోనే మీకు తెలిసిపోతుంది , అవమానభరితమైన శిక్ష ఎవరిపై పడుతుందో , అసత్యవాది ఎవడో. మీరూ నిరీక్షించండి. మీతో పాటు నేనూ నిరీక్షిస్తాను.''

**11. హూద్** 94 చివరకు మా తీర్పు సమయం వచ్చేసినప్పుడు మేము మా కారుణ్యంతో షుఐబ్నూ , అతనితోటి విశ్వాసులనూ రక్షించాము. దుర్మార్గం చేసినవారిపై ఒక తీవ్రమైన ప్రేలుడు విరుచుకుపడిరది. వారు తమ నివాసాలలో చలనమూ, చైతన్యమూ లేకుండా పడిపోయారు, అక్కడ వారు ఎప్పుడూ నివసించి ఉండలేదన్నట్లుగా.

**11. హూద్** 95 విను! సమూద్ జాతి వారు విసిరివేయబడినట్లు మద్‌యన్ వారు కూడా దూరంగా విసరివేయ బడ్డారు.

**11. హూద్** 96 - 99 ఇంకా మేము మూసాను మా సూచనలతో , స్పష్టమైన నియామకపు ఉత్తరువుతో ఫిరౌను వద్దకు అతని రాజ్యాధికారుల వద్దకు పంపాము. కాని వారు ఫిరౌను ఆజ్ఞను అనుసరించారు. వాస్తవానికి ఫిరౌను ఆజ్ఞ న్యాయమైనది కాదు. ప్రళయం నాడు అతడు తన జాతివారికి ముందు ముందు ఉంటాడు. తన నాయకత్వంలో వారిని నరకం వైపునకు తీసుకుపోతాడు. ఎవరైనా చేరటానికి అది ఎంత నికృష్టమైన గమ్యస్థానం! ప్రపంచంలో కూడా వారిపై శాపం పడిరది. ప్రళయం నాడు కూడా పడుతుంది. ఎవరికైనా దొరికే ఈ ప్రతిఫలం ఎంత చెడ్డది!

**11. హూద్** 100 - 101 ఇవి కొన్ని పట్టణాల గాథలు. వాటిని మేము నీకు వినిపిస్తున్నాము. ఆ పట్టణాలలో కొన్ని ఇప్పటికీ నిలబడి ఉన్నాయి. కొన్ని పంటపొలాలు మాదిరిగా కొయ్యబడ్డాయి. మేము వారికి అన్యాయం చెయ్యలేదు. వారు తమను తామే ఆపదలకు గురిచేసుకున్నారు. అల్లాహ్ ఆజ్ఞ వచ్చేసినప్పుడు అల్లాహ్ ను వదలి వారు ప్రార్థిస్తూవచ్చిన దేవుళ్ళు వారికి ఏ విధంగానూ సాయపడలేదు. ఆ దేవుళ్ళు వారికి వినాశం, విధ్వంసం తప్ప ఏ ప్రయోజనాన్నీ సమకూర్చలేదు.

**11. హూద్** 102 - 108 నీ ప్రభువు ఒక దుర్మార్గపు నగరాన్ని శిక్షించదలిస్తే ఆయన శిక్ష ఇలాగే ఉంటుంది. నిజంగానే ఆయన శిక్ష బహుకఠినమైనది. వాస్తవానికి పరలోక శిక్షకు భయపడే ప్రతి మనిషికీ ఇందులో ఒక సూచన ఉంది. అది సర్వమానవులు సమావేశమయ్యే రోజు. ఆ రోజు జరిగేదంతా అందరి కళ్ళముందే జరుగుతుంది. మేము దానిని తీసుకురావటంలో అంత ఎక్కువ ఆలస్యం ఏమీ చెయ్యటం లేదు. దాని నిమిత్తం ఒక గడువు నిర్ణయమై ఉంది. అది వచ్చినప్పుడు నోరెత్తటానికి ఎవరికీ గుండెలు ఉండవు. దేవుని అనుమతితో ఏమైనా మనవి చేసుకోవటం తప్ప. ఆ రోజున దురదృష్ట వంతులు కొందరు ఉంటారు. అదృష్టవంతులు కొందరు ఉంటారు. అభాగ్యులైన వారు నరకానికి పోతారు. (అక్కడి తీవ్రమైన వేడి, దప్పికల వల్ల) వారు రొప్పుతూ రోజుతూ ఉంటారు. అదేస్థితిలో వారు కలకాలం ఉంటారు, భూమ్యాకాశాలు ఉన్నంతవరకు, నీ ప్రభువు మరొకటి తలిస్తేతప్ప. నిస్సందేహంగా నీ ప్రభువు తాను కోరినది చెయ్యటానికి సంపూర్ణమైన అధికారం కలిగి వున్నాడు. ఇక అదృష్టవంతులుగా తేలినవారు - వారు స్వర్గానికి పోతారు. అక్కడ శాశ్వతంగా ఉంటారు , భూమ్యాకాశాలు ఉన్నంతవరకు, నీ ప్రభువు మరొకటి తలిస్తే తప్ప. ఎన్నటికీ తరిగిపోని అనుగ్రహం వారికి లభిస్తుంది.

**11. హూద్** 109 కనుక ప్రవక్తా! వారు ఆరాధిస్తున్న దేవుళ్ళను గురించి నీవు ఏ సందేహానికీ గురికాకు. పూర్వం వారి తాత ముత్తాతలు చేసినట్లుగానే వారుకూడా (అంధులై) పూజా పురస్కారాలు చేసుకుంటూ పోతున్నారు , మేము వారికి ఇవ్వవలసిన దానిని వారికి పూర్తిగా ఇస్తాము, ఎలాంటి తగ్గింపు లేకుండా.

**11. హూద్** 110 - 115 మేము ఇదివరకు మూసాకు కూడా గ్రంథాన్ని ఇచ్చివున్నాము. దాని విషయంలో కూడా విభేధించటం జరిగింది. (ఇప్పుడు నీకు ఇవ్వబడిన ఈ గ్రంథం విషయంలో విభేదించటం జరుగుతున్నట్లుగా). నీ ప్రభువు తరఫు నుండి ఒక విషయం ముందే గనక నిర్ణయింపబడి ఉండకపోతే , ఈ విభేదించే వారి విషయంలో ఎప్పుడో తీర్పు జరిగివుండేది. వారు దీని విషయంలో సంశయానికీ , అయోమయానికీ గురిఅయ్యారు అనేది యథార్థం. నీ ప్రభువు వారికి వారు చేసిన పనులకు పూర్తి ప్రతిఫలాన్ని తప్పకుండా ఇస్తాడు అనేదికూడా యథార్థమే. నిశ్చయంగా ఆయన వారి అన్ని చేష్టలను ఎరిగినవాడు. కనుక ప్రవక్తా! నీవూ , (అవిశ్వాసం తిరుగుబాటుల నుండి విశ్వాసం, విధేయతల వైపునకు) మరలివచ్చిన నీ సహచరులూ నీకు ఆజ్ఞాపించిన విధంగా ఋజుమార్గంపై స్థిరంగా ఉండండి. దైవదాస్యపు హద్దులను అతిక్రమించకండి. మీరు చేస్తున్న దానిని మీ ప్రభువు కనిపెట్టి ఉంటాడు. ఈ దుర్మార్గుల వైపునకు కొంచెమైనా మొగ్గకండి. ఒకవేళ మొగ్గినట్లయితే నరకంలో చిక్కుకుపోతారు. మిమ్మల్ని దేవుని నుండి కాపాడగల సహాయకుడూ , సంరక్షకుడూ ఎవ్వడూ మీకు దొరకడు. ఎక్కడి నుండి మీకు సహాయం లభించదు. చూడు! నమాజును స్థాపించు , పగటి యొక్క రెండు సరిహద్దు సమయాలలోనూ, కొంతరాత్రి గడిచిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి. అల్లాహ్ ను జ్ఞాపకం ఉంచుకునే వారికి ఇది ఒక జ్ఞాపిక. ఓర్మి కలిగి ఉండు. అల్లాహ్ మంచి చేసేవారి ప్రతిఫలాన్ని ఎన్నటికీ వృధా చెయ్యడు.

**11. హూద్** 116 - 119 నీకు ముందు గతించిన జాతులలో ప్రజలను భూమిపై కల్లోలాన్ని రేకెత్తించకుండా నిరోధించే సజ్జనులు ఎందుకు లేరు? ఒకవేళ అటువంటివారు ఉండినా, వారు చాలా కొద్దిమంది మాత్రమే! వారిని మేము ఆ జాతుల బారినుండి రక్షించాము. దుర్మార్గులు ఐహిక సుఖాల వెంటనే పడ్డారు. ఆ సుఖసాధనాలు వారికి పుష్కలంగా ఇవ్వబడ్డాయి. వారు దోషులే అయిపోయారు. నీ ప్రభువు పట్టణాలను అన్యాయంగా నాశనం చేసేవాడు ఎంతమాత్రం కాదు, వాటి ప్రజలు సంస్కరణాకార్యాలు చేసేవారైనప్పటికీ. నీ ప్రభువు సంకల్పిస్తే సర్వ మానవులనూ నిస్సందేహంగా ఒకే వర్గంగా చెయ్యగలిగేవాడే కాని ఇప్పుడు వారు విభిన్న మార్గాలలోనే నడుస్తారు. కేవలం నీ ప్రభువు కరుణకు నోచుకున్నవారే అపమార్గాలకు లోనుకాకుండా ఉంటారు. ఆయన వారిని దీని కొరకే (ఎంపిక , ఆచరణల స్వాతంత్ర్యాన్నిచ్చి పరీక్షించే నిమిత్తమే) సృష్టించాడు. ''నేను నరకాన్ని జిన్నాతులతో , మానవులతో నింపుతాను'' అని నీ ప్రభువు అన్నమాట నెరవేరింది.

**11. హూద్** 120 - 123 ప్రవక్తా! మేము నీకు వినిపిస్తున్న ఈ ప్రవక్తల గాథల ద్వారా నీ హృదయాన్ని శక్తిమంతం చేస్తున్నాము. వాటిద్వారా నీకు యథార్థానికి సంబంధించిన జ్ఞానం లభించింది. విశ్వాసులకు హితవూ , జాగృతీ పొందే భాగ్యం కలిగింది. పోతే ఇక అవిశ్వాసులు , వారితో ఇలా అను : మీరు మీ పద్ధతి ప్రకారం పనిచేస్తూ ఉండండి మేము మా పద్ధతి ప్రకారం పనిచేస్తూ ఉంటాము. ముగింపు కొరకు మీరూ వేచిచూడండి , మేమూ వేచివుంటాము. ఆకాశాలలో, భూమిలో దాగివున్నదంతా అల్లాహ్ అధీనంలో ఉన్నది. అన్ని విషయాలూ ఆయన వైపునకే

మరలింపబడతాయి. కనుక ప్రవక్తా! నీవు ఆయననే సేవించు. ఆయననే నమ్ముకో. మీరు చేస్తున్నదంతా నీ ప్రభువుకు తెలియకుండా లేదు.

**12. యూసుఫ్**

ఆయతులు : 111 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**12. యూసుఫ్** 1 - 3 అలిఫ్ లామ్ రా. ఇవి తన ఉద్దేశ్యాన్ని స్పష్టంగా ప్రకటించే గ్రంథంలోని ఆయతులు. మేము దానిని ఖురానుగా చేసి అరబ్బీ భాషలో అవతరింపజేశాము , మీరు (అరేబియా వాసులు) దానిని చక్కగా అర్థం చేసుకోగలందులకు. ప్రవక్తా! మేము ఈ ఖురానును వహీద్వారా నీ వద్దకు పంపి అత్యుత్తమమైనరీతిలో సంఘటనలనూ యథార్థాలనూ నీకు వివరిస్తున్నాము. ఇంతకుముందు (ఈ విషయాలు) నీకు ఎంతమాత్రం తెలియవు.

**12. యూసుఫ్** 4 - 6 ఇది యూసుఫ్ తన తండ్రితో ఇలా అన్నప్పటి ప్రస్తావన : ''తండ్రీ! నేను ఒక కలగన్నాను అందులో పదకొండు నక్షత్రాలనూ, సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ చూశాను. అవి నాముందు సాష్టాంగపడ్డాయి.'' సమాధానంగా అతని తండ్రి ఇలా అన్నాడు: ''కుమారా! నీ స్వప్నాన్ని గురించి నీ సోదరులకు చెప్పకు. ఎందుకంటే వారు నీకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతారు. వాస్తవం ఏమిటంటే షైతాను మనిషికి బహిరంగ శత్రువు. ఆ విధంగానే జరుగుతుంది (నీవు కలలో చూసిన విధంగా). నీ ప్రభువు నిన్ను (తన పనికొరకు) ఎన్నుకుంటాడు. నీకు విషయాల లోతును అందుకోవటం నేర్పుతాడు. నీకూ యాఖూబ్ సంతతికీ తన అనుగ్రహాన్ని పూర్తిగా ప్రసాదిస్తాడు ఇంతకు పూర్వం ఆయన నీ పెద్దలైన ఇబ్రాహీముకూ , ఇస్హాఖుకూ పూర్తిగా ప్రసాదించినట్లు. నిశ్చయంగా నీ ప్రభువు సర్వజ్ఞుడు, మహావివేకి.

**12. యూసుఫ్** 7 - 18 యథార్థానికి యూసుఫ్ అతని సోదరుల గాథలో ఈ అడిగే వారికి గొప్ప సూచనలు ఉన్నాయి. ఈ గాథ ఇలా ప్రారంభమవుతుంది. అతని సోదరులు పరస్పరం ఇలా చెప్పుకున్నారు : ''వాస్తవానికి మనదొక పెద్ద బలగమైనప్పటికీ యూసుఫ్, అతని సొంత సోదరుడూ ఇద్దరూ అంటే మన తండ్రికి, మన అందరికంటే ఎక్కువ ఇష్టం. నిజంగానే మన తండ్రికి పూర్తిగా మతి భ్రమించింది. కనుక పదండి యూసుఫ్‌ను చంపెయ్యండి లేదా అతణ్ణి ఎక్కడైనా పారవెయ్యండి , మీ తండ్రి ధ్యాస కేవలం మీపైనే ఉండేందుకు. ఈ పనిచేసిన తరువాత తిరిగి సజ్జనులుగా ఉండాలి.'' అప్పుడు వారిలో ఒకడు ఇలా అన్నాడు: ''యూసుఫ్‌ను చంపకండి. ఒకవేళ అతన్ని ఏదైనా చెయ్యాలనే అను కుంటే, అతన్ని ఒక చీకటి బావిలో పడవెయ్యండి. వచ్చే పోయే బాటసారుల బృందమేదైనా అతన్ని తీసుకుపోతుంది.'' ఈ నిర్ణయం తరువాత వారు వెళ్ళి తమ తండ్రితో ఇలా అన్నారు : ''నాన్నా! మీరు

యూసుఫ్ విషయంలో మమ్మల్ని ఎందుకని నమ్మరు ? వాస్తవానికి మేము అతని నిజమైన శ్రేయోభిలాషులం. రేపు అతనిని మాతో పంపండి. పండ్లూ ఫలాలూ స్వేచ్ఛగా మెక్కుతాడు. ఆటలతో ఆనందిస్తాడు. అతన్ని కాపాడటానికి మేము ఉన్నాము కదా! '' తండ్రి ఇలా అన్నాడు: ''మీరు అతన్ని తీసుకుపోతే నాకు బాధ కలుగుతుంది. అతని విషయంలో మీరు పరాకుగా ఉన్నప్పుడు ఏదైనా తోడేలు అతనిని తినేస్తుందేమో అని నా భయం.'' వారు ఇలా సమాధానం ఇచ్చారు: ''పెద్ద బలగమైన మేము వెంట వుండికూడా అతనిని గనక తోడేలు తినివేస్తే మేము వట్టి చేతగాని వాళ్ళము అవుతాము. '' ఇలా ఒత్తిడి చేసి వారు అతనిని తీసుకునివెళ్ళి ఒక చీకటి బావిలో పడవేద్దామని నిర్ణయించుకున్నప్పుడు, మేము యూసుఫ్‌కు వహీద్వారా ఇలా తెలిపాము : ''నీవు వారికి వారు చేసిన ఈ చేష్టను ఎత్తి చూపే సమయం వస్తుంది. వారు తమ ఈ దుశ్చర్య ఫలితాలను గ్రహించటం లేదు. '' సాయంత్రం వారు నెత్తీ నోరూ బాదుకుంటూ తమ తండ్రివద్దకు వచ్చి ఇలా అన్నారు: ''నాన్నా! మేము పరుగు పందెంలో మునిగిపోయాము. యూసుఫ్‌ను మేము మా సామానువద్ద వదిలిపెట్టాము. అంతలోనే తోడేలు ఒకటి వచ్చి అతన్ని తినివేసింది. మేము నిజం చెబుతున్నా మీరు మా మాటను నమ్మరు. '' వారు యూసుఫ్ చొక్కాకు బూటకపు రక్తం పూసి తీసుకువచ్చారు. ఇది విని వారి తండ్రి ఇలా అన్నాడు : ''మీ దుష్ట మనస్సులు మీచేత ఒక ఘోరకార్యాన్ని చాలా తేలికగా చేయించాయి. సరే , ఓర్చుకుంటాను. బాగా ఓర్చుకుంటాను. మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కోసం అల్లాహ్నే అర్థించాలి.''

**12. యూసుఫ్** 19 - 20 అటు వైపునకు ఒక బాటసారుల బృందం వచ్చింది. వారు నీళ్ళు తోడే తన నౌకరును , నీళ్ళకొరకు పంపారు. ఆ నౌకరు చేదను బావిలోకి వదలినప్పుడు (యూసుఫ్‌ను చూసి) ''శుభం! ఇక్కడ ఒక బాలుడు ఉన్నాడు'' అని అరిచాడు. వారు అతనిని వ్యాపార సరకుగా భావించి దాచు కున్నారు. వాస్తవానికి వారు చేస్తూ ఉన్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసు. చివరకు వారు స్వల్పధరకు , కొన్ని దిర్హములకు అతనిని అమ్మివేశారు. వారు అతని ధర విషయంలో అంతకన్నా ఎక్కువ ఆశించలేదు.

**12. యూసుఫ్** 21 - 22 అతనిని కొన్న ఈజిప్టు వ్యక్తి తన భార్యతో ఇలా అన్నాడు : ''ఇతనిని బాగా చూసుకో. ఇతను మనకు లాభదాయకం కావచ్చు లేదా మనం ఇతనిని కొడుకుగా చేసుకోవచ్చు.'' ఇలా మేము యూసుఫ్‌కు ఆ భూభాగంపై స్థిరపడే అవకాశాన్ని కల్పించాము. అంతేకాదు అతనికి వ్యవహార జ్ఞానాన్ని నేర్చుకునే ఏర్పాటు చేశాము. అల్లాహ్ తన పనిని చేసి తీరుతాడు. కాని చాలామందికి ఈ విషయం తెలియదు. అతను తన నిండు యౌవనానికి చేరుకున్నప్పుడు, మేము అతనికి నిర్ణయ శక్తినీ, జ్ఞానాన్నీ ప్రసాదించాము. ఇలా మేము సజ్జనులను బహూకరిస్తాము.

**12. యూసుఫ్** 23 - 29 అతను ఉంటున్న ఇంటిలోని స్త్రీ అతని కోసం వల పన్నసాగింది. ఒక రోజున తలుపులు మూసి ''వచ్చెయ్యి!'' అని అన్నది. యూసుఫ్ ఇలా అన్నాడు : ''నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను. నా

ప్రభువు నాకు మంచి స్థానం ప్రసాదించాడు. (నేను ఈ పని ఎలా చెయ్యను ?) అటువంటి దుర్మార్గులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు.'' ఆమె అతని వైపునకు రాసాగింది యూసుఫ్ కూడా ఆమె వైపునకు పోయివుండేవాడే , ఒకవేళ తన ప్రభువు నిదర్శనాన్ని చూసి ఉండకపోతే. మేము చెడునూ , నీతిబాహ్యతనూ అతనికి దూరంగా ఉంచటానికి అలా జరిగింది. వాస్తవానికి అతను మేము వరించిన దాసులలోని వాడు. తుదకు యూసుఫ్ , ఆమె ఒకరి వెనుక ఒకరు తలుపు వైపునకు పరుగెత్తారు. ఆమె వెనుక నుండి యూసుఫ్ చొక్కాను లాగి చింపివేసింది. వాకిలివద్ద ఉభయులూ ఆమె భర్తను చూశారు. ఆయనను చూడగానే ఆ స్త్రీ ఇలా అనసాగింది: ''నీ ఇల్లాలిని పాడుచేసే బుద్ధి కలవాడికి శిక్ష ఏమిటి? అతనిని జైల్లో పెట్టటమో లేక తీవ్రయాతనకు గురిచెయ్యటమో తప్ప మరొక శిక్ష ఏమవుతుంది?'' యూసుఫ్ ఇలా అన్నాడు : ''ఈమెయే నన్ను వలలో వేసుకోవటానికి ప్రయత్నం చేసింది.'' ఆ స్త్రీ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి ఇలా సాక్ష్యమిచ్చాడు : ''యూసుఫ్ చొక్కా గనక ముందుభాగం చినిగివున్నట్లయితే, అప్పుడు ఈ స్త్రీ చెప్పేది నిజం, అతను పలికేది అబద్ధం. కాని అతని చొక్కా గనక వెనుకభాగాన చినిగివున్నట్లయితే, అప్పుడు స్త్రీ చెప్పేది అబద్ధం , ఆయన పలికేది నిజం.'' యూసుఫ్ చొక్కా వెనుకనుంచి చినిగి ఉండటాన్ని చూసిన భర్త ఇలా అన్నాడు: ''ఇవి మీ స్త్రీల పన్నాగాలు. నిజంగా మీ పన్నాగాలు ఎంతో భయంకరంగా ఉంటాయి. యూసుఫ్! ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలెయ్యి. ఓ స్త్రీ! నీవు నీ తప్పునకు క్షమాభిక్ష కోరుకో. అసలు తప్పుచేసినదానివి నీవే.''

**12. యూసుఫ్** 30 - 34 నగర స్త్రీలు పరస్పరం, ఇలా చర్చించుకోసాగారు : ''అజీజ్ భార్య తన పడుచు బానిసవెంట పడినది. వలపు ఆమెను అదుపులో లేకుండా చేసింది. మా దృష్టిలో ఆమె చేసినది స్పష్టంగా తప్పు. '' వారి మోసపు మాటలను విని ఆమె వారికి ఆహ్వానం పంపింది. వారి కొరకు దిండ్లతో అలంకరించబడిన వేదికపై సమావేశాన్ని ఏర్పాటు చేసింది. విందులో ప్రతి ఒక్కరిముందు ఒక్కొక్క కత్తిని పెట్టింది. (తరువాత సరిగ్గా వారు పండ్లు కోసి తినే సమయంలో) ఆమె యూసుఫ్‌కు సైగ చేసింది ''వీరి ముందుకు రా '' అని. ఆ స్త్రీల చూపులు అతనిపై పడినప్పుడు, వారు దిగ్భ్రమచెందారు. తమ చేతులను కోసుకున్నారు. అప్రయత్నంగా ఇలా అరిచారు : ''హాషాలిల్లాహ్! (అల్లాహ్ మహిమ) ఇతను మానవుడు కాదు. ఇతను ఎవరో గొప్ప దైవదూతయే. '' అప్పుడు అజీజ్ భార్య ఇలా అన్నది: ''చూశారా, ఇతనే ఆ మనిషి , ఇతనిని గురించే మీరు నాపై నిందలు వేశారు. నిస్సందేహంగా నేను ఇతనిని మోహింపచేయటానికి ప్రయత్నించాను. కాని , ఇతడు తప్పించుకున్నాడు. ఇతడు గనక నా మాట వినకపోతే చెరసాల పాలౌతాడు , తీవ్ర అవమానానికి గురిఅవుతాడు.'' యూసుఫ్ ఇలా అన్నాడు: ''నా ప్రభూ , చెరసాల నాకు ఇష్టమే , వారు కోరే పనిని చెయ్యటంకంటే , నీవు గనక వారి జిత్తుల నుండి నన్ను తప్పించకపోతే నేను వారి వలలో చిక్కుకుపోతాను. అజ్ఞానులలో కలసిపోతాను'' - అతని ప్రభువు అతని ప్రార్థనను అంగీకరించాడు. ఆ స్త్రీల జిత్తుల నుండి అతనిని తప్పించాడు. నిస్సందేహంగా ఆయనే అందరి మొరలనూ వినేవాడు, అంతా తెలిసినవాడు.

**12. యూసుఫ్** 35 తరువాత అతనిని కొంతకాలం జైలులో పెట్టాలనే ఆలోచన వారికి (పురుషులకు) తట్టింది. వాస్తవానికి వారు (అతని నిర్దోషిత్వానికి తమ స్త్రీల దుశ్శీలతకూ సంబంధించిన) స్పష్టమైన నిదర్శనాలను కూడా చూశారు.

**12. యూసుఫ్** 36 - 41 జైలులో అతనితోపాటు ఇంకా ఇద్దరు బానిసలు కూడా ప్రవేశించారు. ఒకనాడు వారిలో ఒకడు ఇలా అన్నాడు : ''నేను సారాయి పిండుతూ ఉన్నట్లు నన్ను నేను కలలో చూశాను ,'' రెండో అతను ఇలా చెప్పాడు : ''నా తలపై రొట్టెలు ఉన్నాయి , వాటిని పక్షులు తింటున్నట్లు నేను చూశాను. '' ఉభయులూ ఇలా అడిగారు: ''మాకు వాటి భావం వివరించు , మేము చూస్తూ ఉన్నాము , నీవు చాలా మంచి వాడవు. '' యూసుఫ్ ఇలా అన్నాడు : ''ఇక్కడ మీకు ఇవ్వబడే భోజనం రాకముందు నేను ఈ స్వప్నాల భావాన్ని మీకు వివరిస్తాను. ఇది నా ప్రభువు నాకు ప్రసాదించిన విద్యల లోనిదే. అసలు విషయం ఏమిటంటే , అల్లాహ్ ను విశ్వసించనివారి , పరలోకాన్ని తిరస్కరించేవారి విధానాన్ని నేను వదలిపెట్టి , నా పెద్దలైన ఇబ్రాహీమ్ , ఇస్హాఖ్, యాఖూబ్‌ల విధానాన్ని అవలంబించాను. ఎవడినైనా అల్లాహ్ కు భాగస్వామిగా చెయ్యటం మా విధానం కాదు. వాస్తవానికి ఇది అల్లాహ్ అనుగ్రహమే మనపైనా , సమస్త మానవులపైనా (ఆయన మనలను తనకు తప్ప ఇతరులెవ్వరికీ దాసులుగా చెయ్యలేదు అనేది). కాని చాలామంది ప్రజలు కృతజ్ఞతలు చూపరు. నాతోటి ఖైదీలారా! స్వయంగా మీరే ఆలోచించండి, చాలామంది విభిన్న ప్రభువులు మేలా లేక సర్వశక్తిమంతుడు అయిన ఏకైక దేవుడు అల్లాహ్ మేలా? ఆయనను కాదని మీరు దాస్యం చేస్తున్నవారు , మీరూ మీ తాతముత్తాతలూ కల్పించుకున్న కొన్ని పేర్లు మాత్రమే తప్ప మరొకటేమీ కాదు. వారికొరకు అల్లాహ్ ఏ నిదర్శనాన్నీ అవతరింపజెయ్యలేదు. పరిపాలించే అధికారం అల్లాహ్ కు తప్ప మరొకరెవరికీ లేదు. ఆయనను తప్ప మీరు ఎవరి దాస్యాన్నీ చెయ్యకూడదని ఆయన ఆజ్ఞ. ఇదే శుద్ధమైన , సరియైన జీవిత విధానం. కాని ఇది చాలామందికి తెలియదు. తోటి ఖైదీలారా! మీ స్వప్నాలకు భావం ఇదిగో, మీలో ఒకడు తన ప్రభువు (ఈజిప్టు పాదుషా) నకు త్రాగటానికి మధువును అందిస్తాడు. ఇక రెండో అతను, అతడు శిలువ వేయబడతాడు. పక్షులు అతని తలను పొడిచి పొడిచీ తింటాయి. మీరు అడిగిన విషయం పరిష్కారమైపోయింది.''

**12. యూసుఫ్** 42 వారిలో విడుదల అవుతాడు అని తాను భావించిన వానితో యూసుఫ్ ఇలా అన్నాడు : ''నీ ప్రభువు (ఈజిప్టు రాజు) దగ్గర నా ప్రస్తావన చెయ్యి. '' కాని షైతాను అతనిని మరుపునకు లోనుచేశాడు. అతడు తన ప్రభువు (ఈజిప్టు రాజు) దగ్గర అతనిని గురించి ప్రస్తావించటం మరచిపోయాడు. అందుచేత యూసుఫ్ జైలులోనే ఎన్నో సంవత్సరాలు ఉండిపోయాడు.

**12. యూసుఫ్** 43 - 44 ఒకరోజు రాజు ఇలా అన్నాడు : ''నేను కలలో చూశాను. బలిసిన ఏడు ఆవులను బక్కచిక్కిన ఏడు ఆవులు తింటున్నాయి. ఏడు ధాన్యపు వెన్నులు పచ్చగా ఉన్నాయి. మరొక ఏడు ఎండిపోయి

ఉన్నాయి. సభా సదులారా! మీకు స్వప్నాల అర్థం తెలిస్తే నాకు ఈ స్వప్నఫలాన్ని వివరించండి. '' వారు ఇలా చెప్పారు : ''ఇవి పీడ కలలకు సంబంధించిన విషయాలు. మాకు ఇటువంటి కలల భావం తెలియదు.''

**12. యూసుఫ్** 45 ఆ ఇద్దరు ఖైదీలలో విడుదలయిపోయిన వ్యక్తికి చాలా కాలం తరువాత ఇప్పుడు విషయం గుర్తుకు వచ్చింది. అతడు ఇలా అన్నాడు : ''నేను మీకు దీని ఫలాన్ని వివరిస్తాను. నన్ను కొంచెం (జైలులోని యూసుఫ్ వద్దకు) పంపండి.''

**12. యూసుఫ్** 46 - 49 అతడు అక్కడకు పోయి ఇలా అన్నాడు : ''యూసుఫ్, నిలువెల్ల సత్యమైనవాడా! నాకు ఈ స్వప్న ఫలాన్ని తెలుపు. ఏడు లావుపాటి ఆవులను , ఏడు సన్నపాటి ఆవులు తింటున్నాయి. ఏడు వెన్నులు పచ్చగా ఉంటే, మరొక ఏడు ఎండిపోయి ఉన్నాయి. బహుశా నేను వారివద్దకు తిరిగి వెళతాను. అప్పుడు వారు తెలుసుకుంటారు.'' యూసుఫ్ ఇలా అన్నాడు : ''ఏడు సంవత్సరాల వరకు మీరు ఎడతెగకుండా సేద్యం చేస్తూ ఉంటారు. ఆ కాలంలో మీరు కోసిన పంటలో కొంతభాగాన్ని మీకు ఆహారంగా పనికివచ్చేటందుకు తీసిపెట్టుకోండి. మిగతా భాగాన్ని వెన్నులలోనే ఉంచండి. తరువాతి ఏడు సంవత్సరాలు బహు గడ్డుగా ఉంటాయి. ఆ కాలంలో అప్పటికొరకు మీరు నిలువచేసి ఉంచిన ధాన్యం మొత్తం మీరు తింటారు. ఒకవేళ కొద్దిగా ఏమైనా మిగిలితే , అది మీరు దాచిపెట్టి ఉంచుకున్నదే. దాని తరువాత మరొక సంవత్సరం వస్తుంది , అప్పుడు ప్రజల మొరలను ఆలకించి పుష్కలమైన వర్షాలతో వారిని ఆదుకోవటం జరుగుతుంది. వారు రసాన్ని పిండుతారు.''

**12. యూసుఫ్** 50 - 51 రాజు ఇలా అన్నాడు: ''అతనిని నా వద్దకు తీసుకురండి. '' కాని రాజదూత యూసుఫ్ వద్దకు వెళ్ళినప్పుడు యూసుఫ్ ఇలా అన్నాడు : ''నీ ప్రభువు వద్దకు తిరిగి వెళ్ళు. తమ చేతులను కోసుకున్న నారీమణుల వ్యవహారం గురించి అతనిని అడుగు. నా ప్రభువునకు వారి జిత్తులను గురించి బాగానే తెలుసు.'' ఆపై రాజు ఆ స్త్రీలను ఇలా విచారించాడు : ''మీరు యూసుఫ్‌ను మోహింపజెయ్యటానికి ప్రయత్నించినప్పుడు మీకు కలిగిన అనుభవం ఎటువంటిది ?'' వారందరూ ఏకవాక్యంగా ఇలా అన్నారు : ''హాషాలిల్లాహ్! (దేవుడు మమ్మల్ని రక్షించుగాక). మేము అతనిలో దోషలేశాన్ని కూడా చూడలేదు. '' అజీజ్ భార్య ఇలా అన్నది : ''ఇప్పుడు నిజం బయటపడిరది. అతనిని మరులు గొల్పటానికి ప్రయత్నించింది నేనే. నిస్సందేహంగా అతడు పూర్తిగా సత్యవంతుడు.''

**12. యూసుఫ్** 52 - 53 (యూసుఫ్ ఇలా అన్నాడు): ఇలా చెయ్యటంలో నా ఉద్దేశ్యం ఏమిటంటే , నేను చాటుమాటుగా అతనికి ద్రోహం చెయ్యలేదనీ , ద్రోహుల జిత్తులను అల్లాహ్ పారనీయడనీ (అజీజ్) తెలుసుకోవాలి. నేను నా మనస్సు నిర్దోషిత్వాన్ని చాటుకోవటం లేదు. మనస్సు చెడుకై ప్రేరేపిస్తూనే ఉంటుంది , నా ప్రభువు కరుణించినవారిని తప్ప. నిస్సందేహంగా నా ప్రభువు క్షమించేవాడూ, కరుణించేవాడూను.

**12. యూసుఫ్** 54 రాజు ఇలా అన్నాడు: అతనిని నా వద్దకు తీసుకురండి. నేను అతనిని ప్రత్యేకంగా నా కోసం వినియోగించుకుంటాను...

**12. యూసుఫ్** 54 - 55 ... యూసుఫ్ అతనితో మాట్లాడినప్పుడు తను ఇలా అన్నాడు : ''ఇప్పుడు మీకు మా వద్ద గౌరవప్రదమైన స్థానం ఉన్నది. మీరు విశ్వసనీయులు. మాకు మీపై పూర్తి నమ్మకం ఉంది. '' యూసుఫ్ ఇలా అన్నాడు : ''దేశంలోని ఖజానాలను నాకు అప్పగించండి. వాటిని నేను రక్షించగలను. అందుకు తగిన జ్ఞానం నాకు ఉన్నది.''

**12. యూసుఫ్** 56 - 57 ఇలా మేము ఆ భూభాగంపై యూసుఫ్ కొరకు అధికార మార్గాన్ని సుగమం చేశాము. ఆ భూభాగంపై తాను కోరినచోట తన స్థానాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు అతనికి ఉన్నది. మాకు ఇష్టమైనవారికి మా కారుణ్యభాగ్యాన్ని మేము కలుగజేస్తాము. సజ్జనుల ప్రతిఫలం మా వద్ద వృధా కాదు. విశ్వసించి భయభక్తులతో వ్యవహరించే వారికి పరలోక ప్రతిఫలమే ఎక్కువ ఉత్తమమైనది.

**12. యూసుఫ్** 58 - 62 యూసుఫ్ సోదరులు ఈజిప్టుకు వచ్చారు. అతని ముందు హాజరయ్యారు. అతను వారిని గుర్తుపట్టాడు. కాని వారు అతనిని గుర్తుపట్టలేదు. వారు బయలుదేరుతుండగా వారితో ఇలా అన్నాడు: ''మీ మారు సోదరుణ్ణి నా వద్దకు తీసుకురండి. నేను ఎలా కొలపాత్రను నింపి ఇస్తున్నానో , ఎంత చక్కగా అతిథులను సత్కరిస్తున్నానో మీరు చూడటం లేదా! మీరు గనక అతనిని తీసుకురాకపోతే , మీకు నా వద్ద ధాన్యం లభించదు. మీరు నా దరిదాపులకు కూడా రావద్దు. వారు ఇలా అన్నారు : ''తండ్రిగారు అతనిని పంపటానికి సమ్మతించేలా మేము ప్రయత్నం చేస్తాము. మేము అలా తప్పకుండా చేస్తాము.'' యూసుఫ్ తన నౌకర్లకు సంజ్ఞ చేశాడు : ''వారు ధాన్యానికి బదులుగా ఇచ్చిన సొమ్మును మెల్లగా వాళ్ళ సామానులోనే పెట్టెయ్యండి. '' వారు ఇంటికి చేరి , తిరిగి పొందిన తమ సొమ్మును గుర్తిస్తారనీ, (లేక ఈ దాతృత్వానికి కృతజ్ఞులౌతారనీ) వారు తిరిగివచ్చినా ఆశ్చర్యం లేదనీ ఆశించి యూసుఫ్ ఇలా చేశాడు.

**12. యూసుఫ్** 63 - 68 వారు తమ తండ్రివద్దకు పోయి ఇలా అన్నారు : ''నాన్నా! ఇకముందు మనకు ధాన్యం ఇవ్వటానికి తిరస్కరించారు. కనుక , ధాన్యం తెచ్చేందుకు మీరు మా తమ్ముణ్ణి మాతోపాటు పంపండి. అతనిని రక్షించే బాధ్యత మాది.'' తండ్రి ఇలా సమాధానం చెప్పాడు : ''నేను అతని విషయంలో మిమ్మల్ని ఇదివరకు అతని సోదరుని విషయంలో నమ్మినట్లుగానే నమ్మాలా ? అల్లాహ్ యే ఉత్తమ రక్షకుడు. ఆయనే అందరికంటే అధికంగా కరుణించేవాడు.'' తరువాత వారు తమ సామాను సంచులు విప్పగా , వారిసొమ్ము వారికి తిరిగి ఇవ్వబడినట్లు గమనించారు. ఇది చూచి వారు ఇలా అరిచారు : ''నాన్నా! ఇంకా మనకేం కావాలి, చూడండి! మన సొమ్ము కూడ మనకు తిరిగి ఇవ్వబడిరది. కనుక ఇక మేము వెళ్ళుతాము. మా ఆలుబిడ్డల కొరకు ఆహారపదార్థాలను తీసుకొనివస్తాము. మా సోదరుని రక్షణ విషయం కూడా చూసుకుంటాము. అదనంగా ఒక ఒంటె మోసే బరువు

ధాన్యాన్ని కూడా తీసుకువస్తాము. ఇంత అదనంగా ధాన్యం తేలికగా లభిస్తుంది. '' వారి తండ్రి ఇలా అన్నాడు : ''నేను అతనిని మీవెంట ఎంతమాత్రం పంపను, అతనిని తప్పకుండా తిరిగి నా వద్దకు తీసుకుని వస్తామని, అల్లాహ్ పేరుతో నా ముందు మీరు ప్రమాణం చేస్తే తప్ప. మీరు ముట్టడికి గురిఅయితే అది వేరే విషయం. వారు అతని ముందు తమ తమ ప్రమాణాలను చేసినప్పుడు అతను ఇలా అన్నాడు :''చూడండి! మన ఈ మాటలను అల్లాహ్ గమనిస్తున్నాడు.'' అతను ఇలా అన్నాడు : ''కుమారులారా! ఈజిప్టు రాజధాని లోనికి ఒకే ద్వారం గుండా ప్రవేశించకండి. విభిన్న ద్వారాల గుండా పొండి. కాని నేను అల్లాహ్ సంకల్పం నుండి మిమ్మల్ని కాపాడలేను. ఆజ్ఞ ఆయనది తప్ప మరెవరిదీ చెల్లదు. ఆయననే నేను నమ్ముకున్నాను. నమ్మదలచుకున్న వారందరూ ఆయననే నమ్ముకోవాలి. జరిగింది కూడా అదే. వారు తమ తండ్రి ఆజ్ఞానుసారం నగరంలో (విభిన్న ద్వారాల గుండా) ప్రవేశించినప్పుడు, అతని ఈ ముందు జాగ్రత్త చర్య అల్లాహ్ సంకల్పం ముందు దేనికీ పనికిరాకుండా పోయింది. యాఖూబ్ తన మనస్సులో ఉన్న సంకోచాన్ని నివృత్తి చేసుకోవటానికి - తనకు తోచిన కృషి చేశాడు , అంతే. నిస్సందేహంగా అతను మేము నేర్పిన విద్యవల్ల జ్ఞాని అయ్యాడు. కాని చాలామంది వ్యవహారానికి సంబంధించిన యథార్థాన్ని ఎరుగరు.

**12. యూసుఫ్** 69 వారు యూసుఫ్ సమక్షానికి పోయినప్పుడు అతను తన వద్దకు తన సొంత సోదరుణ్ణి వేరుగా పిలిపించుకున్నాడు. అతనికి ఇలా తెలిపాడు : ''నేను (తప్పిపోయిన) నీ అన్నయ్యనే. వారు చేస్తూ ఉండిన పనులకు నీవు ఇప్పుడు చింతించకు.''

**12. యూసుఫ్** 70 - 76 తన సోదరుల సామాను బస్తాలకు ఎత్తించే ఏర్పాట్లు చేస్తూ, యూసుఫ్ తన సొంత సోదరుని సామానులో తన పాత్రను పెట్టాడు. ప్రకటనలు చేసే ఉద్యోగి ఒకడు ఎలుగెత్తి ఇలా అన్నాడు: ''బిడారు జనులారా! అసలు మీరు దొంగలు.'' వారు వెనుకకు తిరిగి ఇలా అడిగారు : ''మీదే వస్తువు పోయిందేమిటీ?'' ప్రభుత్వోద్యోగులు ఇలా అన్నారు : ''రాజు గారి పాత్ర మాకు కనిపించటం లేదు. '' (వారి జమేదారు ఇలా అన్నాడు): ''దానిని తెచ్చినవారికి ఒక ఒంటె బరువు ధాన్యం బహుమానంగా లభిస్తుంది. ఆ బాధ్యత నాది. '' ఆ సోదరులు ఇలా అన్నారు : ''అల్లాహ్ మీద ఒట్టు! మీకు బాగా తెలుసు. మేము ఈ దేశంలో సంక్షోభం సృష్టించటానికి రాలేదు. మేము దొంగతనాలు చేసేవాళ్ళం కాము. '' వారు ఇలా అన్నారు : ''సరే, మీమాట అబద్ధమని తేలితే అప్పుడు దొంగకు శిక్ష ఏమిటి ?'' వారు ఇలా పలికారు : ''వాడికి శిక్ష ఏమిటా ? ఎవడి సామానులో వస్తువు దొరుకుతుందో అతడే తనకు శిక్షగా బానిసగా ఉంచుకోబడాలి. మావద్ద అటువంటి దుర్మార్గులను శిక్షించే పద్ధతి ఇదే. '' అప్పుడు యూసుఫ్ తన సొంత సోదరుని సంచి వెతికేముందు మారు సోదరుల సంచులను వెతకటం ప్రారంభించాడు. తరువాత, తన సోదరుని సంచి నుండి పోయిన వస్తువును బయటకు తీశాడు. ఈ విధంగా మేము యూసుఫ్‌కు మా యుక్తిద్వారా సహాయపడ్డాము. రాజధర్మం (అంటే ఈజిప్టు రాజ శాసనం) ప్రకారం తన సోదరుణ్ణి బంధించటం

అతనికి తగదు. ఒకవేళ అల్లాహ్ యే అలా కోరితే తప్ప. మేము కోరిన వారి స్థానాలను పెంచుతాము. జ్ఞానులందరినీ మించిన జ్ఞాని ఒకడు ఉన్నాడు.

**12. యూసుఫ్** 77 సోదరులు అన్నారు: ''ఇతడు గనక దొంగతనం చేస్తే ఇది అంత ఆశ్చర్యమైన విషయమేమీ కాదు. ఇదివరకు ఇతని సోదరుడు (యూసుఫ్) కూడా దొంగతనం చేసి ఉన్నాడు.'' యూసుఫ్ వారి ఈ మాటలను విని తన భావాలను అణచివుంచాడు. యథార్థాన్ని వారిముందు బయటపెట్టలేదు. అయితే (లోలోన) మాత్రం ఇలా అనుకున్నాడు : ''మీరు చాల దుర్మార్గులు. (నా ముఖం మీదే) నాపై మీరు మోపుతున్న అభియోగం యొక్క వాస్తవాన్ని అల్లాహ్ బాగా ఎరుగును.''

**12. యూసుఫ్** 78 - 79 వారు ఇలా అన్నారు: ''అధికారం గల ఓ నాయకుడా (అజీజ్)! ఇతని తండ్రి చాలా ముసలివాడు. ఇతనికి బదులు మీరు మాలో ఒకరిని ఉంచుకోండి. మేము మిమ్మల్ని మంచి మనస్సు కలవారుగా చూస్తున్నాము.'' యూసుఫ్ ఇలా అన్నాడు : ''అల్లాహ్ రక్షించుగాక! ఎవని వద్ద మా సొమ్ము దొరికినదో అతనిని వదిలిపెట్టి మరొకరిని మేము ఎలా బంధించగలము? ఒకవేళ అలా చేస్తే మేము దుర్మార్గులమైపోతాము!''

**12. యూసుఫ్** 80 - 82 వారు యూసుఫ్ పట్ల నిరాశచెంది , ఒక మూలకుపోయి పరస్పరం సంప్రదించుకున్నారు. వారిలో అందరికంటే పెద్దవాడు ఇలా అన్నాడు : ''మీ తండ్రి అల్లాహ్ పేరు మీద మీ చేత ప్రమాణం చేయించుకున్న విషయం మీకు తెలియదా ? లోగడ యూసుఫ్ విషయంలో మీరు చేసినది కూడా మీకు తెలుసు. ఇప్పుడు నేను మాత్రం ఇక్కడినుంచి వెళ్ళను , నాతండ్రి నాకు అనుమతిని ఇవ్వనంతవరకు లేదా అల్లాహ్ యే నా విషయంలో ఏదైనా తీర్పు చెయ్యనంతవరకు. ఎందుకంటే ఆయన అందరికంటే ఉత్తమముగా తీర్పు చేసేవాడు. మీరు వెళ్ళి మీ తండ్రితో ఇలా అనండి: ''తండ్రీ! మీ కుమారుడు దొంగతనం చేశాడు. మేము అతనిని దొంగతనం చేస్తూ ఉండగా చూడలేదు. మాకు తెలిసిన దానిని మాత్రమే మేము చెబుతున్నాము. రహస్యంగా జరిగే దానిని మేము చూడలేము కదా! మేము బసచేసిన నగరంలోని వారిని మీరు అడిగి తెలుసుకోండి. మేము కలసి తిరుగు ప్రయాణం చేసిన బిడారును విచారించండి. మేము చెప్పేది పూర్తిగా నిజము.''

**12. యూసుఫ్** 83 - 87 వారి తండ్రి ఈ గాథను విని ఇలా అన్నాడు : ''అసలు మీ దుష్ట మనస్సులు మీచేత మరొక ఘోర కార్యాన్ని తేలికగా చేయించాయి. సరే , దీనిని కూడా సహిస్తాను , బాగా సహిస్తాను. అల్లాహ్ చివరకు వారందరినీ తెచ్చి నాతో కలుపుట జరగవచ్చు కదా! ఆయనకు సర్వమూ తెలుసు. ఆయన పనులన్నీ వివేకంతో నిండివుంటాయి.'' తరువాత అతను వారివైపు నుండి తన ముఖాన్ని తిప్పుకుని కూర్చుండిపోయాడు. ''అయ్యో! యూసుఫ్'' అంటూ వాపోయాడు. అతను లోలోన దుఃఖంతో క్రుంగి పోసాగాడు. అతని నేత్రాలు తెలుపెక్కాయి - కొడుకులు ఇలా అన్నారు : ''అయ్యో దైవమా! మీరు ఒక్క యూసుఫ్‌నే జ్ఞాపకం చేసుకుంటూ ఉంటారు. చివరకు అతని పట్ల దుఃఖంతోనే మీరు కృశించిపోతారు లేదా మీ ప్రాణాన్ని తీసుకుంటారు.'' అతను ఇలా అన్నాడు : ''నేను

నా ఆందోళనను గురించి, నా ఆవేదనను గురించి అల్లాహ్ కు తప్ప మరెవరికి ఫిర్యాదు చెయ్యను. అల్లాహ్ ను నేను ఎరిగినట్లు మీరు ఎరుగరు. కుమారులారా! వెళ్ళి , యూసుఫ్‌ను గురించీ అతని సోదరుని గురించీ దర్యాప్తు చెయ్యండి. అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. ఆయన కారుణ్యం పట్ల కేవలం అవిశ్వాసులే నిరాశ చెందుతారు.''

**12. యూసుఫ్** 88 - 93 వారు ఈజిప్టుకు పోయి యూసుఫ్ దర్బారులో ప్రవేశించి ఇలా విన్నవించుకున్నారు : ''అధికారం గల ఓ నాయకుడా! మేమూ, మా కుటుంబమూ పెద్ద ఆపదకు గురిఅయ్యాము. మేము కొద్దిసొమ్మును మాత్రమే తీసుకుని వచ్చాము. కనుక మీరు దయచేసి మాకు ధాన్యాన్ని పూర్తిగా ఇప్పించండి. మాకు దానం చెయ్యండి. దానం చేసేవారికి అల్లాహ్ ప్రతిఫలం ఇస్తాడు. '' (ఇది విని యూసుఫ్ ఉండబట్టలేకపొయ్యాడు). అతను ఇలా అన్నాడు : ''అజ్ఞానంలో పడి మీరు యూసుఫ్ పట్లా అతని సోదరునిపట్లా ఎలా వ్యవహరించారో మీకు తెలుసా?'' వారు ఉలిక్కిపడి ఇలా అన్నారు: ''ఆ! ఏమిటీ నీవు యూసుఫ్‌వా?'' అతను ఇలా చెప్పాడు : ''అవును, నేను యూసుఫ్‌ను. ఇతడు నా సోదరుడు. అల్లాహ్ మాపై దయచూపాడు. వాస్తవం ఏమిటంటే భయభక్తులతో , ఓర్మితో వ్యవహరించే సత్పురుషుల ప్రతిఫలం అల్లాహ్ వద్ద వృధా కాదు. '' వారు ఇలా అన్నారు : ''అల్లాహ్ తోడు! అల్లాహ్ మాకంటే నీకు ఎక్కువ ఔన్నత్యాన్ని ప్రసాదించాడు. మేము నిజంగానే దోషులం. '' అతను ఇలా జవాబు పలికాడు : ''ఈ రోజు మిమ్మల్ని నిందించటం జరగదు. అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక , ఆయన అందరికంటే అధికంగా కరుణించేవాడు. వెళ్ళండి, ఈ నా చొక్కాను తీసుకుని వెళ్ళండి. నా తండ్రి ముఖంపై వేయండి. ఆయనకు తిరిగి దృష్టి వస్తుంది. మీ కుటుంబ సభ్యులందరినీ నా వద్దకు తీసుకురండి.''

**12. యూసుఫ్** 94 - 95 ఇక్కడ ఆ బిడారు (ఈజిప్టు నుండి) బయలుదేరినప్పుడు , అక్కడ (కనాన్‌లో) వారి తండ్రి ఇలా అన్నాడు : ''నాకు యూసుఫ్ పరిమళం స్ఫురిస్తోంది. ముసలితనం వల్ల నా మతి చలించిందని మీరు అనుకోవచ్చు.'' అతని ఇంటివారు ఇలా అన్నారు : ''అల్లాహ్ తోడు! మీరు ఇంకా మీ పాత పిచ్చిలోనే పడివున్నారు.''

**12. యూసుఫ్** 96 - 98 తరువాత శుభవార్తాహరుడు వచ్చి యూసుఫ్ చొక్కాను యాఖూబ్ ముఖంపై వేశాడు. హఠాత్తుగా ఆయనకు మళ్ళీ దృష్టి వచ్చింది. అప్పుడు అతను ఇలా అన్నాడు : ''నేను మీకు చెబుతూ ఉండేవాణ్ణి కాదా? మీకు తెలియంది అల్లాహ్ తరఫు నుండి నాకు తెలుసు అని. '' అంతా ఇలా అన్నారు : ''నాన్నా! మా పాపాలను క్షమించవలసినదిగా మీరు అల్లాహ్ ను ప్రార్థించండి. మేము నిజంగానే దోషులము. '' అతను ఇలా అన్నాడు : ''మిమ్ములను క్షమించవలసినదిగా నేను నా ప్రభువును అర్థిస్తాను. ఆయన అమితంగా క్షమించేవాడూ, కరుణించేవాడూనూ.''

**12. యూసుఫ్** 99 తరువాత వారు యూసుఫ్ వద్దకు వెళ్ళినప్పుడు , అతను తన తల్లిదండ్రులను తన వద్ద కూర్చోబెట్టుకున్నాడు. (తన కుటుంబం వారితో) ఇలా అన్నాడు : ''పదండి, ఇక పట్టణంలోకి పదండి. అల్లాహ్ సంకల్పిస్తే మీరు సుఖశాంతులతో జీవిస్తారు.''

**12. యూసుఫ్** 100 - 101 (పట్టణంలో ప్రవేశించిన తరువాత) అతను తన తల్లిదండ్రులను తన చేతులతో ఎత్తి సింహాసనం మీద తనతో కూర్చోబెట్టుకున్నాడు. అందరూ అతని ముందు అప్రయత్నంగా సజ్దాలో పడిపోయారు. యూసుఫ్ ఇలా అన్నాడు : ''తండ్రీ! నేను పూర్వం కన్న కలకు ఇదీ ఫలం. నా ప్రభువు దానిని నిజం చేశాడు. అంతా ఆయన దయ! ఆయన నన్ను కారాగారం నుండి బయటకు తీశాడు. మిమ్మల్ని ఎడారి నుండి తీసుకొనివచ్చి నాతో కలిపాడు. వాస్తవానికి షైతాను నా మధ్య నా సోదరుల మధ్య కలహాన్ని సృష్టించాడు. యథార్థం ఏమిటంటే , నా ప్రభువు ప్రజలు గ్రహించలేని యుక్తుల ద్వారా తన సంకల్పాన్ని నెరవేరుస్తాడు. నిస్సందేహంగా ఆయన తెలిసినవాడూ వివేకవంతుడూను. నా ప్రభూ! నీవు నాకు అధికారాన్ని ప్రసాదించావు. మాటల లోతును అందుకోవటం నేర్పావు. భూమ్యాకాశాల నిర్మాతా! నీవే ఇహపరలోకాలలో నాకు సంరక్షకుడవు. నేను ఇస్లామ్ ధర్మంలో ఉన్న స్థితిలోనే నా జీవితాన్ని సమాప్తం చెయ్యి. చివరకు నన్ను సజ్జనులలో కలుపు.''

**12. యూసుఫ్** 102 - 104 ప్రవక్తా! ఈ గాథ అగోచర విషయాలలోనిది. దానిని మేము నీకు వహీద్వారా తెలియజేస్తున్నాము. ఎందుకంటే యూసుఫ్ సోదరులు పరస్పరం కూడబలుకుకొని కుట్రపన్నిన సమయంలో నీవు లేవుకదా! కానీ ఎంతగా నీవు కోరినా వీరిలో చాలామంది విశ్వసించరు. వాస్తవానికి నీవు ఈ సేవకు వారినుండి ఏ విధమైన ప్రతిఫలాన్ని కూడా కోరటం లేదు. ప్రపంచంలోని ప్రజలందరికీ ఇది ఒక హితబోధ.

**12. యూసుఫ్** 105 - 108 భూమిలో ఆకాశాలలో ఎన్ని సూచనలు లేవు! కాని వారు వాటిని చూస్తూపోతూ ఉంటారు. కొంచెమైనా గమనించరు. వారిలో అల్లాహ్ ను విశ్వసించేవారు ఎంతమంది లేరు! కాని వారు ఆయనతోపాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతూ ఉంటారు. దైవశిక్షకు సంబంధించిన ఆపద ఏదీ వారిని చుట్టుముట్టదనీ, తెలియకుండా వారిపైకి ప్రళయగడియ అకస్మాత్తుగా వచ్చిపడదనీ వారు నిశ్చింతగా ఉన్నారా ? నీవు వారికి స్పష్టంగా ఇలా తెలియజెయ్యి : ''నా మార్గం ఇది - నేను అల్లాహ్ వైపునకు పిలుస్తాను. స్వయంగా నేను కూడా నిండు వెలుగులో నా మార్గాన్ని చూస్తున్నాను. నా సహచరులు కూడా చూస్తున్నారు. అల్లాహ్ పరిశుద్ధుడు. షిర్కు చేసేవారితో నాకు ఏ సంబంధమూ లేదు.''

**12. యూసుఫ్** 109 - 110 ప్రవక్తా! నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలందరు కూడా మానవులే. ఈ పట్టణవాసులలోని వారే , వారివైపునకే మేము 'వహీ'ని పంపుతూ వచ్చాము. ఆ ప్రజలు భూమిపై సంచారం చెయ్యలేదా, తమకు ముందు గతించిన జాతుల వారి ముగింపును వారు చూడలేదా? నిశ్చయంగా పరలోక గృహం (ప్రవక్తల మాటలను విశ్వసించి) భయభక్తుల వైఖరిని అవలంబించిన వారికి (ఇహలోక గృహం కంటే) ఎంతో

మేలైనది. ఇప్పుడు కూడా మీరు అర్థం చేసుకోరా ? (పూర్వపు ప్రవక్తల విషయంలో కూడా ఇలాసే జరిగింది. వారు ఎంతోకాలం హితబోధ చేశారు. అయినా ప్రజలు వినలేదు). చివరకు ప్రవక్తలు ప్రజలను గురించి నిరాశచెందినప్పుడు, ప్రజలు కూడా తమకు అబద్ధం చెప్పబడిరదని భావించినప్పుడు, అకస్మాత్తుగా మా సహాయం ప్రవక్తలకు చేరింది. అటువంటి సమయం ఆసన్నమైనప్పుడు , మా సంప్రదాయం ఏమిటంటే , మేము కోరినవారిని రక్షించుకుంటాము. కాని మా శిక్షను దోషులపై పడకుండా తొలగించటం సాధ్యం కాదు.

**12. యూసుఫ్** 111 పూర్వపు ప్రజలకు సంబంధించిన ఈ గాథలలో బుద్ధీ , స్పృహ ఉన్న వారికి ఒక గుణపాఠం ఉన్నది. ఖురానులో చెప్పబడుతున్న ఇవన్నీ కల్పిత విషయాలు కావు. వాస్తవానికి ఇవి ఇదివరకు వచ్చిన గ్రంథాలకు ధ్రువీకరణ. ప్రతి విషయానికీ వివరణ. విశ్వసించేవారికి హితబోధ, (దేవుని) కారుణ్యమూను.

**13. అర్రాద్**

ఆయతులు : 43 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**13. అర్రాద్** 1 అలిఫ్ లామ్ మీమ్ రా. ఇవి అల్లాహ్ గ్రంథంలోని ఆయతులు. నీ ప్రభువు తరఫునుండి నీపై అవతరింపచేయబడినదంతా పూర్తిగా సత్యం. కాని (మీ జాతికి చెందిన) చాలామంది విశ్వసించటం లేదు.

**13. అర్రాద్** 2 మీకు కనిపించే ఆధారాలు లేకుండా ఆకాశాలను నిలిపిన వాడు అల్లాహ్ యే. తరువాత ఆయన తన రాజ్యపీఠాన్ని అలంకరించాడు. ఆయన సూర్యుణ్ణీ , చంద్రుణ్ణీ ఒక నియమానికి బద్ధులుగా చేశాడు. ఈ సమస్త వ్యవస్థకు చెందిన ప్రతి వస్తువూ ఒక నిర్ణీతకాలం వరకు పయనిస్తోంది. అల్లాహ్ యే ఈ మొత్తం వ్యవహారాన్ని నడుపుతున్నాడు. ఆయన తన సూచనలను స్పష్టంగా వివరిస్తున్నాడు , బహుశా మీరు మీ ప్రభువును కలుసుకునే విషయాన్ని నమ్ముతారేమో అని.

**13. అర్రాద్** 3 ఆయనే ఈ భూమిని విశాలంగా పరచినవాడు అందులో పర్వతాలను గుంజలవలె పాతిపెట్టినవాడు నదులను ప్రవహింపజేసినవాడు, ఆయనే అన్ని రకాల పండ్ల జతలను పండిరచినవాడు , ఆయనే పగలుపై రాత్రిని కప్పేవాడు, ఈ అన్ని విషయాలలోనూ ఆలోచించే వారికొరకు పెద్ద సూచనలు ఉన్నాయి.

**13. అర్రాద్** 4 చూడండి! భూమిలో వేర్వేరు ప్రదేశాలు ఉన్నాయి. అవి ఒకదానికొకటి ప్రక్కప్రక్కన ఉన్నాయి. ద్రాక్ష తోటలూ ఉన్నాయి , పంటపొలాలూ ఉన్నాయి , ఖర్జూరపు చెట్లూ ఉన్నాయి - వాటిలో కొన్ని ఒక్కొక్కటిగానూ మరికొన్ని జంటలుగానూ ఉన్నాయి - వాటన్నింటికీ ఒకే నీరు పారుతోంది. కానీ మేము కొన్నింటిని ఎక్కువ

రుచికరమైనవిగా చేశాము. మరికొన్నింటిని తక్కువ రుచికరమైనవిగా చేశాము. ఈ అన్ని విషయాలలోనూ బుద్ధిని ఉపయోగించే వారికి చాలా సూచనలు ఉన్నాయి.

**13. అర్రాద్** 5 ఒకవేళ మీరు ఇప్పుడు ఆశ్చర్యపడవలసివుంటే, ఆశ్చర్యపడదగిన విషయం ప్రజలయొక్క ఈ మాట : ''మేము మరణించి మట్టిగా మారిపోయినప్పుడు మళ్ళీ మేము సరికొత్తగా పుట్టించబడతామా ?'' వారే తమ ప్రభువును తిరస్కరించిన వారు. వారి మెడలలోనే కంఠపట్టికలు ఉండేది. వారు నరకవాసులు. నరకంలో కలకాలం ఉంటారు.

**13. అర్రాద్** 6 వారు మేలుకు ముందు కీడుకొరకు తొందర పెడుతున్నారు. వాస్తవానికి వారికి పూర్వం (ఈ వైఖరినే అవలంబించిన వారిపై దేవుని శిక్ష పడిన) గుణపాఠాన్ని నేర్పే దృష్టాంతాలు ఎన్నో జరిగాయి. నిజం ఏమిటంటే ప్రజలు దుర్మార్గాలు చేసిన తరువాత కూడా , నీ ప్రభువు వారిని మన్నించి వదలివేస్తాడు. నీ ప్రభువు కఠినంగా శిక్షించే వాడనేది కూడా నిజమే.

**13. అర్రాద్** 7 నీ మాటను వినటానికి నిరాకరించిన వారు ఇలా అంటారు : ''ఈ వ్యక్తిపై ఇతని ప్రభువు తరఫు నుండి ఒక నిదర్శనం ఏదైనా ఎందుకు అవతరించలేదు ?'' - నీవు కేవలం హెచ్చరించేవాడివి మాత్రమే. ప్రతి జాతి కొరకూ ఒక మార్గదర్శకుడు ఉన్నాడు.

**13. అర్రాద్** 8 - 11 అల్లాహ్ కు ప్రతి గర్భిణి యొక్క గర్భాన్ని గురించి తెలుసు అందులో తయారయ్యేది కూడా ఆయనకు తెలుసు అందులో జరిగే హెచ్చుతగ్గులను గురించి కూడా ఆయనకు తెలుసు. ఆయన వద్ద ప్రతి వస్తువు కొరకు ఒక పరిమాణం నిర్ణయమై ఉన్నది. ఆయన గోప్యంగా ఉన్నటువంటి , బహిరంగంగా ఉన్నటువంటి ప్రతి వస్తువును గురించీ తెలిసిన పండితుడు. ఆయన గొప్పవాడు. సర్వకాల సర్వావస్థలలో ఆధిక్యం కలిగి ఉండేవాడు. మీలో ఎవరైనా బిగ్గరగా మాట్లాడినా లేక మెల్లగా మాట్లాడినా మీలో ఎవరైనా రాత్రి చీకటిలో దాగివున్నా లేక పగటి వెలుగులో నడుస్తూ ఉన్నా, ఆయనకు వారంతా సమానమే. ప్రతి మనిషికీ ముందూ వెనకా ఆయన నియమించిన కావలివాళ్ళు అంటి ఉన్నారు. వారు అల్లాహ్ ఆజ్ఞానుసారం అతనిని కాపాడుతూ ఉంటారు. యథార్థం ఏమిటంటే, ఒక జాతి స్వయంగా తన లక్షణాలను మార్చుకోనంతవరకు అల్లాహ్ దాని స్థితిని మార్చడు. అల్లాహ్ ఒక జాతిని తన శిక్షకు గురిచేసే నిర్ణయం తీసుకున్నప్పుడు , దానిని ఎవరు తొలగించదలచు కున్నా అది తొలగదు అల్లాహ్ కు ప్రతికూలంగా అటువంటి జాతిని రక్షించేవాడూ, ఆదుకునేవాడూ ఎవడూ ఉండడు.

**13. అర్రాద్** 12 - 13 ఆయనే మీ ముందు మెరుపులను మెరిపింపజేస్తున్నాడు. వాటిని చూసి మీలో భయాలూ చెలరేగుతాయి, ఆశలూ చిగురిస్తాయి. ఆయనే నీళ్ళతో బరువెక్కిన మేఘాలను పైకి లేపుతున్నాడు. మేఘాల గర్జన ఆయనను స్తోత్రం చేస్తూ ఆయన పవిత్రతను కొనియాడుతోంది. దైవదూతలు ఆయన భయంవల్ల వణికిపోతూ

ఆయనను కీర్తిస్తూ ఉంటారు. ఆయన ఫెళ ఫెళమనే పిడుగులను పంపుతాడు. (తరచుగా) వాటిని తాను కోరిన వారిపై, సరిగ్గా ప్రజలు అల్లాహ్ ను గురించి ఘర్షణపడే సమయంలో పడవేస్తాడు. వాస్తవంగా ఆయన యుక్తి అతి శక్తిమంతమైనది.

**13. అర్రాద్** 14 - 15 ఆయనను మాత్రమే వేడుకోవటం ధర్మం. ఇక వారు ఆయనను వదలి వేడుకుంటున్న ఇతర శక్తులు - అవి వారి ప్రార్థనలకు ఏ సమాధానమూ ఇవ్వలేవు. వాటిని వేడుకోవటం ఒక మనిషి నీళ్ళవైపు చేతులుచాచి, దానిని ''నీవు నా నోటిదాకా వచ్చెయ్యి '' అని అభ్యర్థన చేసిన మాదిరిగా ఉన్నది. వాస్తవానికి నీరు అతని వద్దకు చేరటం జరగదు. కనుక ఇదేవిధంగా అవిశ్వాసుల ప్రార్థనలు కూడా గురిలేని బాణాలేతప్ప మరేమీ కావు. భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువూ ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా అల్లాహ్కు సజ్దా చేస్తూ ఉన్నది. అన్ని వస్తువుల నీడలు ఉదయం, సాయంత్రం ఆయన ముందు వంగుతాయి.

**13. అర్రాద్** 16 ''భూమ్యాకాశాలకు ప్రభువు ఎవరు ?'' అని వారిని అడుగు. ''అల్లాహ్'' అని అను. తరువాత వారితో ఇలా అను: ''యథార్థం ఇదైనప్పుడు , మీరు ఆయనను వదలి , స్వయంగా తమ విషయంలో కూడా లాభనష్టాల అధికారం లేనటువంటి ఆ దేవుళ్ళనా మీరు మీ పనులు నేరవేర్చేవారుగా ఎన్నుకున్నారు?'' ఇలా అను : ''గుడ్డివారూ కళ్ళున్నవాడూ సమానులు కాగలరా ? వెలుగూ చీకట్లూ ఒకటి కాగలవా ? అలా కాకపోతే , వారు నిలబెట్టిన భాగస్వాములు కూడా అల్లాహ్ మాదిరిగానే దేనినయినా సృష్టించారా , దాని కారణంగా సృష్టి విషయంలో వారికి అనుమానం కలగటానికి ?'' - ఇలా అను : ''ప్రతి వస్తువునూ అల్లాహ్ యే సృష్టించాడు. ఆయన అద్వితీయుడు. అందరిపై ఆధిక్యం కలవాడు.''

**13. అర్రాద్** 17 అల్లాహ్ ఆకాశం నుండి నీళ్ళను కురిపించాడు. ప్రతి నదీ , ప్రతి కాలువా తన శక్తికొలది దానిని గ్రహించి బయలుదేరింది. వరద వచ్చినప్పుడు నీళ్ళ ఉపరితలంపైకి నురుగులు కూడా వచ్చాయి. అటువంటి నురుగులే నగలూ, పాత్రలూ మొదలైనవి చెయ్యటానికి ప్రజలు కరిగించే లోహాలపై కూడా లేస్తాయి. ఇటువంటి ఉదాహరణ ద్వారా అల్లాహ్ సత్యమేదో , అసత్యమేదో సుస్పష్టం చేస్తాడు. నురుగంతా ఎగిరిపోతుంది. మానవులకు లాభం కలిగించే వస్తువు భూమిలో ఉండిపోతుంది. ఈవిధంగా అల్లాహ్ ఉదాహరణల ద్వారా తన మాటలను వివరిస్తాడు.

**13. అర్రాద్** 18 తమ ప్రభువు సందేశాన్ని స్వీకరించిన వారికి మేలు జరుగుతుంది. దానిని స్వీకరించని వారు సమస్త భూసంపదకు యజమానులు అయినా ఇంకా అంతే సమకూర్చుకున్నా , వారు అల్లాహ్ శిక్ష నుండి తప్పించుకోవటానికి దానినంతటినీ పరిహారంగా ఇవ్వటానికి సిద్ధపడతారు. అటువంటి ప్రజల నుండి దారుణంగా లెక్క తీసుకోబడుతుంది. వారి నివాసం నరకం. అది బహుచెడ్డ నివాసం.

**13. అర్రాద్** 19 - 25 నీ ప్రభువు నీపై అవతరింపజేసిన ఈ గ్రంథం సత్యమని గ్రహించిన వ్యక్తీ , ఈ యథార్థం పట్ల అంధుడైన వ్యక్తీ - వారు ఉభయులూ ఎలా సమానులు కాగలరు ? హితబోధను వివేకవంతులు మాత్రమే స్వీకరిస్తారు. వారి ప్రవర్తన ఎలా ఉంటుందంటే, వారు అల్లాహ్‌తో చేసుకున్న తమ ఒడంబడికను నెరవేరుస్తారు. దానిని దృఢపరచిన తరువాత భంగపరచరు. వారి వైఖరి ఎలా ఉంటుందంటే , స్థిరపరచండి అని అల్లాహ్ ఆదేశించిన సంబంధాలను స్థిరపరుస్తారు. తమ ప్రభువునకు భయపడుతూ ఉంటారు. తమ నుండి కఠినంగా లెక్క తీసుకోబడుతుందేమో అని భయపడుతూ ఉంటారు. వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే , తమ ప్రభువు ప్రసన్నత కోసం సహనంతో వ్యవహరిస్తారు. నమాజును స్థాపిస్తారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి బహిరంగంగా , రహస్యంగా ఖర్చు చేస్తారు. చెడును మంచి ద్వారా పారద్రోలుతారు. పరలోక గృహం వారికొరకే ఉన్నది. అంటే వారికి శాశ్వత నివాస స్థలంగా ఉండే ఉద్యానవనములు. వారు కూడా వాటిలో ప్రవేశిస్తారు. వారి పూర్వీకులలో , వారి భార్యలలో, వారి సంతానంలో సజ్జనులైన వారు కూడా వారితో అక్కడకు పోతారు. ప్రతి వైపునుండి దైవదూతలు వారికి స్వాగతం పలకటానికి వస్తారు. వారితో ఇలా అంటారు : ‘‘మీపై శాంతి వర్షించుగాక! ప్రపంచంలో మీరు సహనంతో వ్యవహరించటం వల్ల ఈ రోజు మీరు దీనికి అర్హులయ్యారు. ’’ - ఎంత మంచిది ఈ పరలోక గృహం! ఇక వారు, అల్లాహ్‌తో చేసుకున్న ఒడంబడికను దృఢపరచిన తరువాత భంగపరచేవారు , అల్లాహ్ కలపండి అని ఆదేశించిన సంబంధాలను త్రెంచేవారూ, ధరణిపై కల్లోలాన్ని వ్యాపింపజేసేవారూ, వారు శాపానికి అర్హులు. వారికొరకు పరలోకంలో బహుచెడ్డ నివాసం ఉన్నది.

**13. అర్రాద్** 26 అల్లాహ్ తన ఇష్టప్రకారం కొందరికి ఎక్కువ జీవనోపాధిని ప్రసాదిస్తాడు , మరికొందరికి తక్కువ జీవనోపాధిని ప్రసాదిస్తాడు. వారు ప్రాపంచిక జీవితంలో మునిగిపోయి ఉన్నారు. వాస్తవానికి పరలోకం ముందు ప్రాపంచిక జీవితం ఒక చిరుసంపద తప్ప మరేమీ కాదు.

**13. అర్రాద్** 27 - 29 (ముహమ్మద్‌ను ప్రవక్తగా విశ్వసించటానికి) నిరాకరించిన ఈ ప్రజలు ఇలా అంటారు: ‘‘ఈ వ్యక్తిపై ఇతని ప్రభువు సన్నిధి నుండి ఏదైనా సూచన ఎందుకు అవతరించలేదు ?’’ ఇలా అను: ‘‘అల్లాహ్ తాను కోరినవారిని మార్గభ్రష్టులుగా చేస్తాడు. ఆయన తన వైపునకు మరలేవారికి మాత్రమే తన వైపునకు వచ్చే మార్గాన్ని చూపుతాడు. అటువంటి ప్రజలే (ఈ ప్రవక్త సందేశాన్ని ) విశ్వసించారు. వారి హృదయాలకు అల్లాహ్ సంస్మరణం వల్ల తృప్తి కలుగుతుంది. తెలుసుకోండి! అల్లాహ్ సంస్మరణ ద్వారానే హృదయాలకు తృప్తిని పొందే భాగ్యం లభిస్తుంది. సత్య సందేశాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారు సౌభాగ్యవంతులు. వారికి మంచి ఫలం లభిస్తుంది.

**13. అర్రాద్** 30 ప్రవక్తా! అదేవిధంగా మేము నిన్ను ప్రవక్తగా నియమించి ఒక జాతివద్దకు పంపాము. దానికి పూర్వం ఎన్నో జాతులు గతించాయి , ఆ జాతి ప్రజలకు మేము నీపై అవతరింపజేసిన సందేశాన్ని నీవు

వినిపించేందుకుగాను. వాస్తవానికి వారు ఎంతో కరుణామయుడైన తమ దేవుణ్ణి తిరస్కరించారు. వారితో ఇలా అను : ''ఆయనే నా ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయననే నేను నమ్ముకున్నాను. ఆయనే నా ఏకైక ఆశ్రయం.''

**13. అర్రాద్** 31 - 32 పర్వతాలను నడిపించే, భూమిని బద్దలుచేసే, మృతులను గోరీల నుండి బయటికి రప్పించి మాట్లాడిరచే శక్తి కలిగిన ఖురాను దేనినైనా అవతరింపజేస్తే ఏమై ఉండేది? (ఇటువంటి సూచనలు చూపించటం పెద్ద కష్టమేమీ కాదు) ఎందుకంటే అధికారం సమస్తమూ అల్లాహ్ చేతులలోనే ఉంది. అల్లాహ్ గనక కోరితే మానవులందరికీ మార్గం చూపేవాడు అనే విషయాన్ని (తెలుసుకొని) కూడా విశ్వాసులు (అవిశ్వాసుల కోరికకు సమాధానంగా ఏదైనా సూచన ప్రత్యక్షమవుతుందనే) ఆశ వదులుకోలేదా ? అల్లాహ్ పట్ల అవిశ్వాసవైఖరిని అవలంబించిన వారిపైకి వారి చేష్టలు కారణంగా ఏదో ఒక ఆపద వస్తూనే ఉంటుంది. లేదా వారి ఇళ్ళకు సమీపంలో ఎక్కడైనా దిగుతుంది. అల్లాహ్ వాగ్దానం నెరవేరేవరకు ఈ పరంపర సాగిపోతూనే ఉంటుంది. నిశ్చయంగా అల్లాహ్ తన వాగ్దానాన్ని భంగపరచడు. నీకు పూర్వం కూడా చాలామంది ప్రవక్తలను ఎగతాళి చెయ్యటం జరిగింది. కాని నేను ఎల్లప్పుడూ తిరస్కారులకు కొంత సడలింపు ఇచ్చాను. చివరకు వారిని పట్టుకున్నాను. చూడండి , నా శిక్ష ఎంత కఠినంగా ఉంటుందో!

**13. అర్రాద్** 33 - 35 ఒక్కొక్క మనిషి సంపాదించేదానిపై నిఘూవేసి ఉండేవానికి భాగస్వాములుగా నిలబెట్టే (అంతటి దుస్సాహసానికి పాల్పడుతున్నారా) ప్రజలు ? ప్రవక్తా! వారితో ఇలా అను: ''(నిజంగానే వారు దేవుడు స్వయంగా చేసుకున్న భాగస్వాములే అయితే) కొంచెం వారెవరో వారి పేర్లు ఏమిటో చెప్పండి ?'' - తన భూమిలో ఉన్నట్లు అల్లాహ్ కు తెలియని ఒక కొత్త విషయాన్ని గురించి మీరు ఆయనకు తెలుపుతున్నారా ? లేక మీరు ఇట్టే నోటికి వచ్చినదల్లా వాగుతున్నారా ? యథార్థం ఏమిటంటే, సత్యసందేశాన్ని స్వీకరించటానికి తిరస్కరించినవారికి తమ పన్నుగడలు ఆకర్షకములుగా చెయ్యబడ్డాయి. వారు సన్మార్గం నుండి నిరోధించబడ్డారు. అల్లాహ్ మార్గభ్రష్టత్వంలోకి విసిరివేసిన వాడికి మార్గం చూపే వాడెవడూ లేడు. అటువంటి వారికి ప్రాపంచిక జీవితంలోనే శిక్ష పడుతుంది. పరలోక శిక్ష దీనికంటే కూడా ఎంతో కఠినంగా ఉంటుంది. వారిని దేవుని నుండి రక్షించే వాడెవడూ లేడు. దైవభక్తిగల మానవులకు వాగ్దానం చెయ్యబడిన స్వర్గవైభవం ఇలా ఉంటుంది : దాని క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. దాని ఫలాలు శాశ్వతమైనవి. దాని నీడ నశించనిది. భయభక్తులు కలవారికి లభించే ప్రతిఫలం ఇలా ఉంటుంది. సత్య తిరస్కారులకు లభించే ప్రతిఫలం నరకాగ్ని.

**13. అర్రాద్** 36 - 37 ప్రవక్తా! మేము మునుపు గ్రంథాన్ని ఇచ్చిన వారు, మేము మీపై అవతరింపజేసిన గ్రంథంపట్ల సంతోషంగా ఉన్నారు. దానిలోని కొన్ని విషయాలను నమ్మనివారు కూడా విభిన్న వర్గాలలో కొందరు ఉన్నారు. నీవు స్పష్టంగా ఇలా అను : ''అల్లాహ్ ను మాత్రమే ఆరాధించు అని నాకు ఆజ్ఞాపించబడిరది. ఇతరులను

ఆయనకు భాగస్వాములుగా నిలబెట్టకు అని నాకు నిషేధించబడిరది. కనుక నేను మిమ్మల్ని ఆయన వైపునకే ఆహ్వానిస్తున్నాను. ఆయన వైపునకే నేను మరలుతాను.'' ఈ మార్గదర్శ కత్వంతోనే మేము ఈ అరబ్బీ ఫర్మానాను నీపై అవతరింపజేశాము. ఇక నీవు గనక , నీవద్దకు ఈ జ్ఞానం వచ్చిన తరువాత కూడా , ప్రజల కోరికలను అనుసరిస్తే, అల్లాహ్ సమక్షంలో నిన్ను రక్షించేవాడుగానీ నీకు సహాయపడేవాడుగానీ ఎవడూ ఉండడు. మరెవడూ ఆయన శిక్ష నుండి నిన్ను తప్పించనూ లేడు.

**13. అర్రాద్** 38 - 39 నీకు పూర్వం కూడా మేము చాలామంది ప్రవక్తలను పంపాము. మేము వారిని ఆలుబిడ్డలు కలవారిగానే చేశాము. అల్లాహ్ అనుమతి లేకుండా ఏ సూచననూ స్వయంగా తెచ్చి చూపే శక్తి ఏ ప్రవక్తకూ లేదు. ప్రతి యుగానికీ ఒక గ్రంథం ఉన్నది. అల్లాహ్ తాను రద్దుచేయదలచుకున్న దానిని రద్దుచేస్తాడు. తాను ఉంచదలచుకున్నదానిని స్థిరంగా ఉంచుతాడు. అసలు గ్రంథం ఆయన దగ్గరే ఉన్నది.

**13. అర్రాద్** 40 - 42 ప్రవక్తా! ఏ చెడు పర్యవసానాన్ని గురించి మేము ఈ ప్రజలను బెదరిస్తూ వచ్చామో, అందులో ఒక భాగాన్ని మేము నీ జీవితకాలంలో చూపించినా లేదా అది సంభవించే ముందే మేము నిన్ను లేపుకున్నా ఏ పరిస్థితిలోనైనా, నీ పని కేవలం సందేశాన్ని అందజెయ్యటమే. లెక్క తీసుకోవటం మటుకు మా పని. ఈ ప్రజలు చూడటంలేదా, మేము ఈ భూభాగంపై పురోగమిస్తూ దాని పరిధిని అన్ని వైపుల నుండి తగ్గిస్తూ వస్తున్నాము ? అల్లాహ్ (సృష్టిని) శాసిస్తున్నాడు. ఆయన నిర్ణయాలను పున్ణపరిశీలించగల వాడెవడూ లేడు. లెక్క తీసుకోవటం ఆయనకు ఎంతోసేపు పట్టదు. వారికి పూర్వం గతించిన ప్రజలు కూడా పెద్ద పెద్ద పన్నాగాలు పన్నారు. కాని నిర్ణయాత్మకమైన అసలు పన్నాగం పూర్తిగా అల్లాహ్ చేతులలోనే ఉన్నది. ఎవరు ఏమేమి సంపాదిస్తున్నారో ఆయనకు తెలుసు. త్వరలోనే ఈ సత్య తిరస్కారులు చూస్తారు ఎవరి పర్యవసానం మేలైనది అవుతుందో!

**13. అర్రాద్** 43 ఈ తిరస్కారులు ''నీవు అల్లాహ్ పంపినవాడవు కావు'' అని అంటున్నారు. ఇలా అను : ''నాకూ మీకూ మధ్య అల్లాహ్ సాక్ష్యమే చాలు. ఆపై ఆకాశగ్రంథ జ్ఞానం కలవాడి సాక్ష్యం చాలు.''

**14. ఇబ్రాహీమ్**

ఆయతులు : 52 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**14. ఇబ్రాహీమ్** 1 - 2 అలిఫ్ లామ్ రా. ముహమ్మద్! ఇది ఒక గ్రంథం. మేము దీనిని నీ వైపునకు అవతరింపజేశాము, నీవు ప్రజలను వారి ప్రభువు అనుమతితో చీకట్లలో నుండి వెలికితీసి వెలుగులోకి

తీసుకురావాలని- మహాశక్తిమంతుడూ, స్వతహా స్తోత్రాలకు అర్హుడూ, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తానికీ స్వామి అయిన దేవుని మార్గం మీదకు తీసుకురావాలని.

**14. ఇబ్రాహీమ్** 2 - 3 సత్యాన్ని స్వీకరించటానికి తిరస్కరించేవారికి కఠినమైన , వినాశకరమైన శిక్ష పడుతుంది. వారు పరలోక జీవితం కంటే ఇహలోక జీవితానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వారు ప్రజలను అల్లాహ్ మార్గం నుండి వారిస్తారు. వారు ఈ మార్గం (తమ కోరికలకు అనుగుణంగా) వక్రమైనదిగా కావాలని కోరుతున్నారు. వారు మార్గభ్రష్టత్వంలో చాలాదూరం వెళ్లిపోయారు.

**14. ఇబ్రాహీమ్** 4 మేము మా సందేశాన్ని అందజేసే నిమిత్తం ప్రవక్తను పంపినప్పుడల్లా, అతడు తన జాతి ప్రజలు మాట్లాడే భాషలోనే మా సందేశాన్ని అందజేశాడు, వారికి అతడు విషయాన్ని చక్కగా అర్థమయ్యేటట్టు చెప్పటానికి. అల్లాహ్ తాను మార్గభ్రష్టులుగా చేయదలచుకున్న వారిని మార్గభ్రష్టులుగా చేస్తాడు. తాను మార్గం చూపదలచుకున్నవారికి మార్గం చూపుతాడు. ఆయన శక్తిసంపన్నుడూ, వివేక సంపన్నుడూను.

**14. ఇబ్రాహీమ్** 5 మేము ఇంతకు ముందు మూసాను కూడా మా సూచనలను ఇచ్చి పంపివున్నాము. ఆయనను కూడా మేము ఇలా ఆజ్ఞాపించాము : నీ జాతివారిని చీకట్లలోనుండి బయటికి తీసి వెలుగులోకి తీసుకురా. దైవ చరిత్రలోని గుణపాఠంతో నిండివున్న సంఘటనలను వారికి వినిపించి హితబోధ చెయ్యి. ఈ సంఘటనలలో సహనశీలుడూ కృతజ్ఞుడూ అయిన ప్రతి మనిషికీ గొప్ప నిదర్శనాలు ఉన్నాయి.

**14. ఇబ్రాహీమ్** 6 - 8 ఆ సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు మూసా తన జాతివారితో ఇలా అన్నాడు : ‘‘అల్లాహ్ మీకు చేసిన మేలును జ్ఞాపకం ఉంచుకోండి. ఆయన మీకు ఫిరౌను ప్రజల నుండి విముక్తి కలిగించాడు. వారు మిమ్మల్ని తీవ్రమైన బాధలకు గురిచేస్తూ ఉండేవారు. మీ కొడుకులను చంపేవారు. మీ కూతుళ్ళను బ్రతుకనిచ్చేవారు. ఇది మీ ప్రభువు తరఫు నుండి మీకు పెద్ద పరీక్ష! జ్ఞాపకం ఉంచుకోండి. మీ ప్రభువు ఇలా హెచ్చరిక చేశాడు : మీరు గనక కృతజ్ఞులైతే , నేను మిమ్మల్ని ఇంకా ఎక్కువగా అనుగ్రహిస్తాను. ఒకవేళ కృతఘ్నతకు పాల్పడితే నా శిక్ష చాలా కఠినముగా ఉంటుంది. ’’ మూసా ఇలా అన్నాడు : ‘‘ఒకవేళ మీరు అవిశ్వాసానికి పాల్పడినా, భూమిపై ఉండే వారందరూ అవిశ్వాసులైపోయినా, అల్లాహ్ ఏ అక్కరలేనివాడు, స్వతహా స్తోత్రాలకు అర్హుడు.’’

**14. ఇబ్రాహీమ్** 9 - 12 మీకు పూర్వం గతించిన జాతుల గాథలు మీదాకా చేరలేదా ? నూహ్ జాతి, ఆద్‌జాతి, సమూద్ జాతి, ఇంకా వాటి తరువాత వచ్చిన అనేక జాతులూ, వాటి సంఖ్యా అల్లాహ్ కు మాత్రమే తెలుసు. వారి ప్రవక్తలు వారివద్దకు స్పష్టమైన మాటలను , ప్రస్ఫుటమైన నిదర్శనాలనూ తీసుకుని వచ్చినప్పుడు వారు తమ నోళ్ళల్లో చేతులు బిగబట్టి ఇలా అన్నారు : ‘‘ఏ సందేశంతో నీవు పంపబడ్డావో ఆ సందేశాన్ని మేము

విశ్వసించము. ఏ విషయం వైపునకు నీవు మమ్మల్ని ఆహ్వానిస్తున్నావో, మేము ఆ విషయాన్ని గురించి కలతలో, సందేహంలో పడ్డాము. వారి ప్రవక్తలు ఇలా అన్నారు : ''ఆకాశాలకూ భూమికీ సృష్టికర్త అయిన అల్లాహ్ పట్ల సందేహమా? ఆయన మిమ్మల్ని పిలుస్తున్నాడు, మీ తప్పులను మన్నించటానికి, మీకు ఒక నిర్ణీతకాలం వరకు వ్యవధినివ్వటానికి.'' వారు ఇలా జవాబు పలికారు: ''నీవు మావంటి ఒక మానవుడవు తప్ప మరేమీ కావు. మా తాత ముత్తాతల కాలం నుండీ ఆరాధించ బడుతూ వచ్చిన శక్తుల ఆరాధన నుండి నీవు మమ్మల్ని ఆపాలని అనుకుంటున్నావు. సరే, స్పష్టమైన ప్రమాణాన్ని దేనినైనా తీసుకునిరా.'' వారి ప్రవక్తలు వారితో ఇలా అన్నారు : ''నిజంగానే, మేము మీవంటి మానవులం తప్ప మరేమీ కాము. కాని అల్లాహ్ తన దాసులలో తాను అనుగ్రహించదలచిన వారిని అనుగ్రహిస్తాడు. ఏదైనా ప్రమాణాన్ని తెచ్చి మీకు ఇవ్వటం అనేది మా అధికారంలో లేదు. ప్రమాణం అనేది అల్లాహ్ అనుమతితో మాత్రమే రాగలుగుతుంది. విశ్వాసులు అల్లాహ్నే నమ్ముకోవాలి. మన జీవనమార్గాలలో అల్లాహ్ మనకు మార్గదర్శకత్వం వహించినప్పుడు మనం అల్లాహ్ ను ఎందుకు నమ్ముకోకూడదు? మీరు మమ్మల్ని పెడుతున్న బాధలను ఓర్పుతో సహిస్తాము. నమ్ముకునే వారు అల్లాహ్ ను మాత్రమే నమ్ముకోవాలి.''

**14. ఇబ్రాహీమ్** 13 - 17 చివరకు తిరస్కారులు తమ ప్రవక్తలతో ఇలా అన్నారు: ''మీరు మా మతంలోకి తిరిగి రావాలి. లేకపోతే మేము మిమ్మల్ని మా దేశం నుండి బహిష్కరిస్తాము. '' అప్పుడు వారి ప్రభువు వారికి ఇలా ''వహీ''ని పంపాడు. ''మేము ఈ దుర్మార్గులను నాశనం చేస్తాము. వారి తరువాత మిమ్మల్ని భూమిపై వసింపజేస్తాము. నా సాన్నిధ్యంలో సమాధానం చెప్పుకోవలసి ఉందని భయపడుతూ నా శిక్షకు భయపడే వ్యక్తికే ఈ బహుమానం. '' వారు తీర్పును కోరారు. (అప్పుడు వారికి తీర్పు ఇవ్వబడిరది). బలమదాంధుడైన ప్రతి సత్యవిరోధి అవమానం పాలయ్యాడు.'' దాని తరువాత మున్ముందు అతడి కొరకు నరకం ఉంది. అక్కడ అతడికి త్రాగటానికి చీము , నెత్తురు లాంటి చెడు నీరు ఇవ్వబడుతుంది. దానిని అతడు బలవంతంగా గొంతులోకి దించటానికి ప్రయత్నిస్తారు. అతి కష్టంతో దించగలుగుతాడు. మరణం అతణ్ణి అన్ని వైపుల నుండి చుట్టుముట్టి ఉంటుంది. కాని అతడు మరణించలేడు. అతని ముందు ఒక కఠినమైన శిక్ష అతడి ప్రాణానికి సంకటంగా ఉంటుంది.

**14. ఇబ్రాహీమ్** 18 - 20 తమ ప్రభువును విశ్వసించనివారి పనులను తుఫాను రోజున వీచే పెనుగాలి ఎగురవేసే బూడిదతో పోల్చవచ్చు. వారు తాము చేసిన దానికి ఎటువంటి ప్రతిఫలాన్నీ పొందలేరు. ఇదే మార్గభ్రష్ట త్వానికి పరాకాష్ఠ అంటే. అల్లాహ్ భూమ్యాకాశాల సృష్టిని సత్యంపై నెలకొల్పటాన్ని నీవు చూడటం లేదా? ఆయన సంకల్పిస్తే మిమ్మల్ని తొలగించగలడు. మీ స్థానంలో మరొక క్రొత్త సృష్టిని తీసుకురాగలడు. అలా చెయ్యటం ఆయనకు ఎంతమాత్రం కష్టం కాదు.

**14. ఇబ్రాహీమ్** 21 ఈ ప్రజలందరినీ కలిపి అల్లాహ్ ముందు హాజరుపరచినప్పుడు, వారిలో ప్రపంచంలో బలహీనులుగా ఉన్నవారు ప్రపంచంలో పెద్ద మనుషులుగా చలామణి అయినవారితో ఇలా అంటారు: ''ప్రపం చంలో మేము మిమ్మల్ని అనుసరించాము. ఇప్పుడు అల్లాహ్ శిక్షనుండి మమ్మల్ని కాపాడటానికి మీరేమైనా చెయ్యగలరా ?'' వారు ఇలా సమాధానం చెబుతారు: ''అల్లాహ్ మాకు ముక్తిమార్గాన్ని దేనినైనా చూపి ఉండినట్లయితే మేము తప్పకుండా మీకూ చూపి ఉండేవారము. ఇప్పుడు మనము ఏడ్చి మొత్తుకున్నా లేక ఓర్పు వహించినా రెండూ ఒకటే. ఎట్టి పరిస్థితుల్లోనూ, మనం తప్పించుకునే మార్గం ఏదీ లేదు.''

**14. ఇబ్రాహీమ్** 22 తీర్పు జరిగిపోయినప్పుడు షైతాను ఇలా అంటాడు : ''వాస్తవం ఏమిటంటే, అల్లాహ్ మీకు చేసిన వాగ్దానాలన్నీ నిజమైనవే. నేను మీకు చేసిన వాగ్దానాలలో ఒక్కదానిని కూడా నేను నెరవేర్చలేదు. నాకు మీమీద ఎటువంటి అధికారమూ లేదు. నేను మిమ్మల్ని నా మార్గం వైపునకు ఆహ్వానించటం తప్ప మరేమీ చెయ్యలేదు. మీరు నా ఆహ్వానానికి అంగీకారం వ్యక్తం చేశారు. ఇప్పుడు నన్ను నిందించకండి. మిమ్మల్ని మీరే నిందించుకోండి. ఇక్కడ మీ మొరలను నేనూ ఆలకించలేను, నా మొరలను మీరూ ఆలకించలేరు. ఇంతకు పూర్వం మీరు నన్ను దైవత్వంలో భాగస్థునిగా చేసివుంచారు , దానికి నా బాధ్యత ఏమీ లేదు. అటువంటి దుర్మార్గులకు వ్యధాభరితమైన శిక్ష తథ్యం.''

**14. ఇబ్రాహీమ్** 23 - 27 దీనికి భిన్నంగా , ప్రపంచంలో విశ్వసించి మంచి పనులు చేసినవారు క్రింద కాలువలు ప్రవహించే తోటలలో ప్రవేశింపజెయ్యబడతారు. అక్కడ వారు తమ ప్రభువు అనుమతితో శాశ్వతంగా ఉంటారు. అక్కడ వారికి ''మీకు శాంతి కలుగుగాక '' అని స్వాగతం పలుకబడుతుంది. పరిశుద్ధ వాక్కును అల్లాహ్ ఏ వస్తువుతో పోల్చాడో మీరు గమనించటం లేదా? దాని పోలిక ఇలా ఉంది : ఒక మేలుజాతి చెట్టు వుంది. దాని వేరు భూమిలో లోతుగా నాటుకుపోయింది. కొమ్మలు ఆకాశాన్ని అంటాయి. ప్రతిక్షణం అది తన ప్రభువు ఆజ్ఞానుసారం తన పండ్లను ఇస్తోంది. ప్రజలు గుణపాఠం నేర్చుకోవాలని అల్లాహ్ ఇటువంటి ఉపమానాలను ఇస్తున్నాడు. అపరిశుద్ధ వాక్కును ఒక చెడుజాతి చెట్టుతో పోల్చవచ్చు. అది భూమి ఉపరితలం నుండి పీకిపారవేయబడుతుంది. దానికి స్థిరత్వం అనేదే లేదు. ఒక స్థిరమైన వాక్కు ఆధారంగా ఇహలోకంలోనూ , పరలోకంలోనూ విశ్వాసులకు అల్లాహ్ నిలకడను ప్రసాదిస్తాడు. అల్లాహ్ దుర్మార్గులను మార్గభ్రష్టులుగా చేస్తాడు. తమకు ఇష్టమైన దానిని చేసే అధికారం అల్లాహ్ కు ఉన్నది.

**14. ఇబ్రాహీమ్** 28 - 30 అల్లాహ్ అనుగ్రహాన్ని పొంది , దానికి మారుగా కృతఘ్నతను చూపిన వారిని నీవు చూశావా? వారు (తమతో పాటు) తమ జాతిని కూడా వినాశగృహంలోకి - అంటే నరకంలోకి త్రోసివేశారు. అందులో వారు కాలిపోతారు. అది అతి ఘోరమైన నివాసస్థలం. వారు కొందరిని అల్లాహ్ కు సమానులుగా నిలబెట్టారు -

వారు ప్రజలను అల్లాహ్ మార్గం నుండి తప్పించటానికి ? వారితో ఇలా అను : సరే సుఖాలను అనుభవించండి. చివరకు మీరు మరలి నరకానికేపోవాలి.

**14. ఇబ్రాహీమ్** 31 ప్రవక్తా! విశ్వసించిన నా దాసులకు చెప్పు: నమాజును స్థాపించండి. మేము వారికి ఇచ్చిన దానినుండి బహిరంగంగా, గుప్తంగా (మంచిపనుల కోసం) ఖర్చుపెట్టండి - క్రయ విక్రయాలు జరగటంకానీ , మిత్రుల సాయం పొందటంగానీ సాధ్యపడని రోజు రాకపూర్వమే.

**14. ఇబ్రాహీమ్** 32 - 34 భూమినీ , ఆకాశాలను పుట్టించినవాడూ, ఆకాశం నుండి నీళ్ళను కురిపించినవాడూ , దానిద్వారా మీ ఆహారం కొరకు రక రకాల ఫలాలను సృష్టించినవాడూ , తన ఆజ్ఞానుసారం సముద్రంలో నడవాలని పడవను మీ సేవకై మీకు లోబరచినవాడూ , నదులను మీ సేవకై మీకు లోబరచినవాడూ , నిరంతర ప్రయాణం చేస్తూపోతున్న సూర్య చంద్రులను మీ సేవకై మీకు లోబరచినవాడూ , రాత్రినీ పగలునూ మీ సేవకై మీకు లోబరచినవాడూ, మీరు అడిగిన సమస్తాన్నీ మీకు ఇచ్చినవాడూ అల్లాహ్ యే. మీరు గనక అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే, లెక్కించలేరు. నిజముగా మానవుడు నీతి లేనివాడు, కృతఘ్నుడు.

**14. ఇబ్రాహీమ్** 35 - 41 ఇబ్రాహీమ్ ఇలా ప్రార్థించిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో : ''ప్రభూ! ఈ నగరాన్ని (అంటే మక్కాను) శాంతినగరంగా చెయ్యి. నన్నూ , నా సంతానాన్నీ విగ్రహ పూజనుండి కాపాడు. ప్రభూ ఈ విగ్రహాలు చాలామందిని మార్గం తప్పించాయి. (నా సంతానాన్ని కూడా ఇవి మార్గం తప్పించే అవకాశం ఉంది కనుక వారిలో) నా విధానంపై నడిచేవాడు నావాడు , నాకు వ్యతిరేకంగా ఉన్న విధానాన్ని ఎవడైనా అవలంబిస్తే నిశ్చయంగా నీవు క్షమించేవాడవు, కరుణామయుడవు. ప్రభూ! తృణకాష్ట జలరహితమైన లోయలో నా సంతానంలో కొందరిని తెచ్చి నీ పవిత్ర గృహం వద్ద నివసింపజేశాను. ప్రభూ! వారు ఇక్కడ నమాజును స్థాపించాలని నేను ఇలా చేశాను. కనుక నీవు ప్రజల హృదయాలను ఆసక్తితో వారివైపునకు మొగ్గేలా చెయ్యి, తినటానికి వారికి పండ్లు ప్రసాదించు, బహుశా వారు కృతజ్ఞులౌతారేమో. ప్రభూ! మేము దాచేదానినీ , బహిరంగపరచే దానినీ నీవు ఎరుగుదువు. '' నిశ్చయంగా అల్లాహ్ కు గుప్తంగా ఉన్నది ఏదీ లేదు, భూమిలోకాని, ఆకాశాలలోకాని. ''నాకు ఈ ముసలితనంలో ఇస్మాయీలు, ఇస్హాఖ్ వంటి కొడుకులను ప్రసాదించిన దేవునికి కృతజ్ఞతలు. యథార్థం ఏమిటంటే , నా ప్రభువు తప్పకుండా ప్రార్ధనను ఆలకిస్తాడు. ప్రభూ! నన్ను నమాజును స్థాపించేవాడుగా చెయ్యి. నా సంతతిలో కూడా (ఈ పని చేసేవాళ్ళను లేపు). ప్రభూ! నా ప్రార్థనను స్వీకరించు. ప్రభూ! నన్నూ , నా తల్లిదండ్రులనూ విశ్వసించే వారందరినీ లెక్క ఖరారు అయ్యేరోజున క్షమించు.''

**14. ఇబ్రాహీమ్** 42 - 46 ఇప్పుడు ఈ దుర్మార్గులు చేస్తున్నదానిని అల్లాహ్ పట్టించుకోవటం లేదని నీవు భావించకు. అల్లాహ్ వారి విషయాన్ని ఆనాటికి వాయిదా వేస్తున్నాడు. ఆనాడు పరిస్థితి ఇలా ఉంటుంది : విచ్చుకున్న నేత్రాలు విచ్చుకున్నట్లే ఉంటాయి. వారు తలపైకెత్తి పారిపోతూ ఉంటారు. పైనే దృష్టి నిలిచి ఉంటుంది.

వారు శూన్య హృదయులైపోతారు. ప్రవక్తా! శిక్ష వచ్చి వారిని పట్టుకునే రోజును గురించి నీవు వారిని భయపెట్టు. అప్పుడు ఈ దుర్మార్గులు ఇలా అంటారు : ''ప్రభూ! మాకు మరికొంత వ్యవధిని ప్రసాదించు. మేము నీ సందేశాన్ని స్వీకరిస్తాము. ప్రవక్తలను అనుసరిస్తాము. '' (కాని వారికి స్పష్టంగా ఇలా జవాబు ఇవ్వబడుతుంది) : ''క్షీణదశ మాకు ఎన్నటికీ రాదు అని పూర్వం మాటిమాటికీ ప్రమాణం చేసి చెప్పినవారు మీరు కాదా ? వాస్తవానికి తమకు తాము అన్యాయం చేసుకున్న జాతుల పట్టణాలలో మీరు నివసించారు. మేము వారిపట్ల వ్యవహరించిన తీరు కూడా మీరు చూశారు, వారిని ఉదాహరణగా మాటిమాటికీ ఇచ్చి మేము మీకు నచ్చజెప్పాము కూడా. వారు తమ ఎత్తులన్నీ వేసి చూశారు. కాని అల్లాహ్ వారి ప్రతి ఎత్తునూ చిత్తుచేశాడు. వాస్తవానికి వారి ఎత్తులు కొండలను సైతం కదలించేటంతటి భయంకరమైనవి.''

**14. ఇబ్రాహీమ్** 47 - 51 కనుక ప్రవక్తా! అల్లాహ్ ఎన్నడూ తన ప్రవక్తలకు చేసిన వాగ్దానాలకు భిన్నంగా వ్యవహరిస్తాడని నీవు ఎంతమాత్రం సందేహించకు. అల్లాహ్ శక్తిమంతుడు , ప్రతీకారం చెయ్యగల సమర్థుడు. భూమ్యాకాశాల రూపాలను పూర్తిగా మార్చటం జరిగే రోజును గురించి నీవు వారిని భయపెట్టు. అద్వితీయుడూ , రౌద్రుడూ అయిన అల్లాహ్ ముందు అందరూ హాజరవుతారు. ఆ రోజు నీవు దోషులను చూస్తావు. వారి చేతులూ , కాళ్ళూ బేడీలతో బంధించబడి ఉంటాయి. వారు తారు వస్త్రాలను ధరించి ఉంటారు. అగ్ని జ్వాలలు వారి ముఖాలను క్రమ్ముకుంటాయి. అల్లాహ్ ప్రతి వ్యక్తికీ అతను చేసిన దానికి ప్రతిఫలం ఇచ్చేందుకు ఇలా జరుగుతుంది. లెక్క తీసుకోవటానికి అల్లాహ్ కు ఎంతో ఆలస్యం కాదు.

**14. ఇబ్రాహీమ్** 52 సర్వమానవులకు ఇదొక సందేశం. వారిని హెచ్చరించాలనీ , యథార్థంగా దేవుడు కేవలం ఒక్కడేఅని వారు తెలుసుకోవాలనీ, బుద్ధి ఉన్నవారు గ్రహించాలనీ ఇది పంపబడినది.

**15. అల్ హిజ్ర్**

ఆయతులు : 99 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**15. అల్ హిజ్ర్** 1 అలిఫ్ లామ్ రా. ఇవి దైవ గ్రంథమైనటువంటి స్పష్టమైన ఖురానులోని ఆయతులు.

**15. అల్ హిజ్ర్** 2 - 5 ఆ సమయం ఎంతో దూరంలో లేదు, (ఇస్లామ్ సందేశాన్ని స్వీకరించ టానికి) తిరస్కరించిన వారే అప్పుడు పశ్చాత్తాపపడుతూ: ''అయ్యో! మేము ముస్లిములము అయివుంటే ఎంత బాగుండేది '' అని అంటారు. వారిని వదిలి పెట్టు - తినటానికి త్రాగటానికి సుఖాలు అనుభవించటానికీ , లేనిపోని ఆశలు వారిని భ్రమలో పడవేసి ఉంచటానికీ. అతి త్వరలోనే వారు దానిని గ్రహిస్తారు. మేము ఇంతకు పూర్వం నాశనం చేసిన ప్రతి

పట్టణానికీ ఒక ప్రత్యేకమైన కార్యాచరణ వ్యవధి ఇదివరకే వ్రాయబడి ఉన్నది. ఏ జాతి అయినా తన నిర్ణీత కాలానికి ముందే నాశనమూ కాదు, ఆ తరువాత తప్పించుకోనూ లేదు.

**15. అల్ హిజ్ర్** 6 - 9 ఈ ప్రజలు ఇలా అంటారు: ''ఈ జ్ఞాపిక అవతరించిన మనిషీ! నీవు నిజంగానే పిచ్చివాడవు. నీవు చెప్పేది గనక సత్యమే అయితే మా ముందుకు దైవదూతలను ఎందుకు తీసుకురావు ?'' మేము దైవదూతలను ఊరకే అవతరింపజెయ్యము. వారు అవతరించినప్పుడు సత్యంతోపాటు అవతరిస్తారు , తరువాత ప్రజలకు వ్యవధి ఇవ్వటం అనేది జరగదు. ఇక ఈ జ్ఞాపిక , దానిని మేము అవతరింపజేశాము. స్వయంగా మేమే దానిని రక్షిస్తాము.

**15. అల్ హిజ్ర్** 10 - 15 ప్రవక్తా! మేము నీకు పూర్వం , గతించిన అనేక జాతులవద్దకు ప్రవక్తలను పంపివున్నాము. వారివద్దకు ప్రవక్త రావటమూ , వారు ఆయనను ఎగతాళి చెయ్యకుండా ఉండటమూ అనేది ఎన్నడూ జరగలేదు. దోషుల గుండెలలోకి మేము ఈ జ్ఞాపికను (ఊచలా) పోనిచ్చినా వారు దానిని విశ్వసిం చటం అనేది జరగదు. పూర్వకాలం నుండి కూడా ఇటువంటి ప్రజల విధానం ఇలాగే ఉంటూ వచ్చింది. ఒకవేళ మేము వారికొరకు ఏదైనా ఆకాశద్వారాన్ని తెరిచినా , వారు పట్టపగలు అందులోకి ఎక్కిపోతూ ఉన్నప్పుడు కూడా వారు ఇదే అంటారు: ''మా కళ్ళు మోసపోతున్నాయి. మాపై మంత్రజాలం ప్రయో గించారు.''

**15. అల్ హిజ్ర్** 16 - 18 ఇది మేము చేసిన పని.మేము ఆకాశంలో దృఢతరములైన ఎన్నో కోటలను నిర్మించాము. చూపరుల కోసం వాటిని (నక్షత్రాలతో) అలంకరిం చాము. శాపగ్రస్తుడైన ప్రతి షైతాను నుండి వాటిని సురక్షితం చేశాము. షైతాను ఎవడైనా వాటిలోకి పోలేడు , దొంగచాటుగా ఏదైనా వినటం తప్ప. దొంగచాటుగా వినే ప్రయత్నం వాడు చేసినప్పుడు అగ్నిజ్వాల ఒకటి వాణ్ణి వెంటాడుతుంది.

**15. అల్ హిజ్ర్** 19 - 25 మేము భూమిని పరిచాము. అందులో కొండలను పాతాము. అందులో అన్ని రకాల చెట్లు చేమలను కచ్చితమైన తగిన పరిమాణంలో సృష్టించాము. ఇంకా అందులో జీవనోపాధికి వనరులను ఏర్పాటు చేశాము- మీకూ మీరు పోషింపని అనేక ఇతర ప్రాణికోటికి కూడా. మావద్ద పుష్కలంగా నిలువలు లేని వస్తువంటూ ఏదీ లేదు. మేము ఏ వస్తువును అవవతరింప జేసినా , దానిని ఒక నిర్ణీత పరిమాణంలో అవతరింపజేస్తాము. ఉత్పత్తికారకము లైన గాలులను మేమే పంపుతున్నాము. ఆ తరువాత ఆకాశం నుండి నీళ్ళను వర్షింపజేస్తున్నాము. ఆ నీళ్ళను మీకు తనివితీరా త్రాగటానికి ఇస్తున్నాము. ఈ సంపదకు యజమానులు మీరు కాదు. జీవన మరణాలను మేము కలిగిస్తున్నాము. మేమే అందరికీ వారసులము అయ్యే వారము. మీలో పూర్వం గతించిన వారిని కూడా మేము చూశాము. తరువాత వచ్చేవారు కూడా మా దృష్టిలో ఉన్నారు. నిశ్చయంగా మీ ప్రభువు వారందరినీ సమావేశ పరుస్తాడు. ఆయన వివేకవంతుడూ, అన్నీ తెలిసినవాడూను.

**15. అల్ హిజ్ర్** 26 - 43 మేము మానవుణ్ణి కుళ్ళిన మట్టి యొక్క ఎండిన గారతో సృష్టిం చాము. దీనికి పూర్వం జిన్నాతులను మేము తీవ్రమైన ఉష్ణజ్వాలతో సృష్టించి ఉన్నాము. నీ ప్రభువు దైవదూతలతో ఇలా అన్న సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో: ''నేను కుళ్ళిన మట్టియొక్క ఎండినగారతో ఒక మానవుణ్ణి సృష్టిస్తున్నాను. నేను అతణ్ణి పూర్తిగా తయారుచేసి , అతనిలో నా ఆత్మను కొద్దిగా ఊదినప్పుడు , మీరంతా అతని ముందు సాష్టాంగపడాలి.'' అప్పుడు దైవ దూతలందరూ సాష్టాంగపడ్డారు , ఒక్క ఇబ్లీసు తప్ప. అతడు సాష్టాంగపడేవారితో చేరటానికి తిరస్కరించాడు. ప్రభువు ఇలా అడిగాడు: ''ఇబ్లీస్! నీకేమయిందని నీవు సాష్టాంగపడేవారితో చేరిపోలేదు?'' అతడు ఇలా అన్నాడు: ''కుళ్ళిన మట్టియొక్క ఎండినగారతో నీవు సృష్టించిన ఈ మనిషికి సాష్టాంగపడటం నాకు తగిన పనికాదు. '' ప్రభువు ఇలా సెలవిచ్చాడు: ''సరే, అయితే వెళ్ళిపో ఇక్కడినుంచి , ఎందుకంటే, నీవు శాపగ్రస్తుడవయ్యావు. ఇక తీర్పుదినం వరకూ నీపై శాపం ఉంటుంది. '' అతడు ఇలా విన్నవించుకున్నాడు: ''ప్రభూ! అలాగైతే మానవు లందరూ మళ్ళీ లేపబడే రోజు వరకు నాకు వ్యవధి ప్రసాదించు.'' ఇలా సెలవిచ్చాడు: ''మంచిది, ఆ రోజు వరకు నీకు వ్యవధి ఇవ్వబడుతోంది. ఆ రోజు వచ్చే సమయం మాకు తెలుసు.'' అతడు ఇలా చెప్పాడు: ''ప్రభూ! నీవు నన్ను అపమార్గం పట్టించినట్లే ఇక నేను వారికొరకు మనస్సును మోహింపజేసే విషయాలను భూమిలో సృష్టించి వారందరినీ అపమార్గం పట్టిస్తాను , వారిలో నీవు ప్రత్యేకం చేసుకున్న నీ దాసులను తప్ప. '' ఇలా సెలవిచ్చాడు: ''నన్ను చేరే తిన్నని మార్గం ఇదే. నిస్సందేహంగా , నా నిజమైన దాసులపై నీ అధికారం సాగదు. నీ అధికారం కేవలం నిన్ను అనుసరించే భ్రష్టులపై మాత్రమే సాగుతుంది. వారందరి కొరకు వాగ్దానం చెయ్యబడిన నివాస స్థలం నరకం.''

**15. అల్ హిజ్ర్** 44 - 48 (ఇబ్లీసు అనుచరులకు వాగ్దానం చెయ్యబడిన) ఈ నరకానికి ఏడు ద్వారాలు ఉన్నాయి. ఒక్కొక్క ద్వారం వారిలోని ఒక్కొక్క ప్రత్యేక వర్గానికి కేటాయించబడిరది. దీనికి భిన్నంగా , భయభక్తులు కలవారు తోటలలో చెలమల మధ్య ఉంటారు. వారితో ఇలా అనబడుతుంది : ''ప్రవేశించండి వాటిలోకి , శాంతితోనూ, నిర్భయంగానూ.'' వారి హృదయాలలో ఇంకా మిగిలి వున్న మాలిన్యాన్నీ కాపట్యాన్నీ మేము తొలగిస్తాము. వారు పరస్పరం సోదరులై ఎదురెదురుగా పీఠాలపై కూర్చుంటారు. అక్కడ వారు ఎట్టి శ్రమకూ గురికారు. అక్కడి నుండి వారు బహిష్కరింపనూబడరు.

**15. అల్ హిజ్ర్** 49 - 50 ప్రవక్తా! నేను చాలా క్షమించేవాణ్ణి అనీ , కరుణించేవాణ్ణి అనీ, దీనితోపాటు, నా శిక్షకూడా చాలా బాధాకరమైన శిక్షే అనీ నా దాసులకు చెప్పు.

**15. అల్ హిజ్ర్** 51 - 60 వారికి ఇబ్రాహీము అతిధుల గాధను కొంచెం వినిపించు. వారు అతని వద్దకు వచ్చి , ''మీకు శాంతి కలుగుగాక '' అని అన్నప్పుడు , అతను ఇలా అన్నాడు: ''మేము మిమ్మల్ని చూచి భయపడుతున్నాము.'' వారు ఇలా సమాధానం పలికారు: ''భయపడకండి, మేము మహావివేకవంతుడైన ఒక

కుమారుడు మీకు కలుగుతాడు అనే శుభవార్తను మీకు అందజేస్తున్నాము. '' ఇబ్రాహీము ఇలా అన్నాడు: ''ఏమిటి, ఈ ముసలితనంలో మీరు నాకు సంతాన శుభవార్తను అందజేస్తున్నారా ? కొంచెం ఆలోచించండి , మీరు ఎటువంటి శుభవార్తను నాకు అందజేస్తున్నారో ?'' వారు ఇలా జవాబు ఇచ్చారు: ''మేము మీకు సత్యమైన శుభవార్తను అందజేస్తున్నాము. మీరు నిరాశపడకండి.'' ఇబ్రాహీము ఇలా అన్నాడు: ''తమ ప్రభువు కారుణ్యంపట్ల మార్గం తప్పినవారు మాత్రమే నిరాశపడతారు. '' ఇబ్రాహీము ఇలా అడిగాడు: ''అల్లాహ్ దూతలారా! ఏ కార్యం నిమిత్తం తమరు వేంచేశారు ?'' వారు ఇలా చెప్పారు: ''మేము ఒక నేరస్థజాతి వైపునకు పంపబడ్డాము. కేవలం లూత్ ఇంటివారే మినహాయించబడ్డారు. వారందరినీ మేము రక్షిస్తాము , ఒక్క అతని భార్యను తప్ప. ఎందుకంటే వెనుక ఉండిపోయేవారిలో ఆమె చేరిపోతుందని మేము నిర్ణయించాము'' (అని అల్లాహ్ అన్నాడు).

**15. అల్ హిజ్ర్** 61 - 66 తరువాత ఈ దైవదూతలు లూత్ వద్దకు వెళ్ళినప్పుడు , అతను, ''మీరు కొత్తవారుగా కనిపిస్తున్నారు'' అని అన్నాడు. వారు ఇలా సమాధానం చెప్పారు: ''కాదు, కాని ఈ ప్రజలు దేనిరాకనైతే శంకిస్తున్నారో దాన్ని మేము తీసుకువచ్చాము. మేము నీతో నిజం చెబుతున్నాము. మేము సత్యంతో నీ వద్దకు వచ్చామని. కనుక ఇప్పుడు , నీవు కొంచెం రాత్రి ఉండగానే నీ ఇంటి వారిని తీసుకుని బయలుదేరు. స్వయంగా నీవూ వారి వెనుక నడువు. మీలో ఎవరూ వెనక్కి తిరిగి చూడకూడదు , 'పొండి' అని మిమ్మల్ని ఆజ్ఞాపించే వైపు నకే మీరు నేరుగా పొండి. '' ఉదయం అవుతూ ఉండగానే వారు సమూలంగా నాశనం చెయ్యబడతారని మేము అతనికి మా నిర్ణయాన్ని తెలియజేశాము.

**15. అల్ హిజ్ర్** 67 - 71 ఇంతలోనే నగరవాసులు సంతోషం పట్టలేక లూత్ ఇంటిమీదికి వచ్చారు. లూత్ ఇలా అన్నాడు: ''సోదరులారా! వీరు నా అతిథులు. నన్ను నవ్వులపాలు చెయ్యకండి. అల్లాహ్ కు భయపడండి. నన్ను అవమాన పరచ కండి. '' వారు ఇలా చెప్పారు: ''ప్రపంచంలోని ప్రతివాణ్ణి వెనకేసుకు రావద్దని మేము నిన్ను ఎన్నోసార్లు వారించలేదా?'' లూత్ (బ్రతిమాలుతూ) ఇలా అన్నాడు: ''మీకు ఏదన్నా చెయ్యాలనే ఉంటే, ఇదిగో నా ఈ కూతుళ్ళు ఉన్నారు.''

**15. అల్ హిజ్ర్** 72 - 74 ప్రవక్తా! నీ ప్రాణం సాక్షిగా! ఆ సమయంలో వారికి ఒక కైపులాంటిది ఎక్కింది. దానితో వారు స్వాధీనత కోల్పోయారు. చివరకు తెల్లవారగానే ఒక భయంకరమైన ప్రేలుడు వారిపైకి వచ్చిపడిరది. మేము ఆ నగరాన్ని తల్లక్రిందులు చేసేశాము. వారిపై కాల్చిన మట్టి రాళ్ళ వర్షాన్ని కురిపించాము.

**15. అల్ హిజ్ర్** 75 - 77 దూరదృష్టిగల వారికి ఈ సంఘటనలో గొప్ప సూచనలు ఉన్నాయి. (ఈ సంఘటన జరిగిన) ఆ ప్రాంతం రహదారిపై ఉన్నది. ఇందులో విశ్వాసులకు గుణపాఠం నేర్పే విషయాలు ఉన్నాయి.

**15. అల్ హిజ్ర్** 78 - 79 ''అయికహ్ జాతీయులు'' దుర్మార్గులు. కనుక, చూడండి, మేము కూడా వారికి ప్రతీకారం చేశాము. ఈ రెండు జాతుల శిథిలమైన ప్రాంతాలు రహదారులపై ఉన్నాయి.

**15. అల్ హిజ్ర్** 80 - 84 హిజ్ర్ ప్రజలు కూడా ప్రవక్తలను నిరాకరించారు. మేము మా ఆయతులను వారికడకు పంపాము. మా సూచనలను వారికి చూపాము. కాని వారు వాటన్నింటినీ విస్మరిస్తూనే వచ్చారు. వారు కొండలను తొలిచి గృహాలను నిర్మిస్తూ ఉండేవారు. వారు తమ స్థానంలో నిర్భయంగా , నిశ్చింతగా ఉండేవారు. తుదకు ఉదయం వేళ ఒక తీవ్రమైన ప్రేలుడు వారిపై వచ్చిపడిరది. వారి సంపాదన వారికి ఏ మాత్రం పనికిరాకుండా పోయింది.

**15. అల్ హిజ్ర్** 85 - 93 మేము భూమినీ , ఆకాశాలనూ వాటిలో ఉన్న సమస్తాన్నీ సత్యం పునాదిగా తప్ప మరొకటేదీ పునాదిగా సృష్టించలేదు. తీర్పు గడియ నిశ్చయముగా రానున్నది. కనుక ప్రవక్తా! నీవు (వారి కుచేష్టలను) పెద్దమనిషి తరహాలో మన్నించు. నిశ్చయంగా నీ ప్రభువు అందిరినీ సృష్టించిన వాడూ అంతా తెలిసినవాడూను. మేము నీకు ఏడు ఆయతులను ఇచ్చాము. అవి మాటిమాటికీ పఠింపదగినవి. ఇంకా నీకు మహత్తరమైన ఖురానును ప్రసా దించాము. వారిలోని విభిన్న వర్గాల వారికి మేము ఇచ్చిన ఐహిక సంపద వైపు నీవు కన్నెత్తి కూడా చూడకు. వారి స్థితికి బాధపడకు. వారిని విడిచిపెట్టి విశ్వాసుల వైపునకు మొగ్గు. ఇంకా (అవిశ్వాసులతో) ''నేను స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి మాత్రమే '' అని అను. ఇది తమ ఖురానును తుత్తునియలుగా చేసిన విభేదకారకుల వైపునకు మేము పంపిన హెచ్చరిక వంటిదే. కనుక నీ ప్రభువు సాక్షిగా మేము తప్పకుండా వారందరినీ ''మీరేమి చేస్తూ ఉండేవారు?'' అని అడుగుతాము.

**15. అల్ హిజ్ర్** 94 - 96 కనుక ప్రవక్తా! నీకు ఆజ్ఞాపించబడుతూ ఉండిన విషయాన్ని బహిరంగంగా ఎలుగెత్తి చాటు. షిర్కు చేసేవారిని ఏమాత్రం లెక్కచేయకు. నిన్ను ఎగతాళి చేసేవారికీ , అల్లాహ్తోపాటు ఇతరులను కూడా దేవుళ్ళుగా నిర్ణయించేవారికీ నీ తరఫున బుద్ధి చెప్పటానికి మేము చాలు. త్వరలోనే వారికి తెలిసిపోతుంది.

**15. అల్ హిజ్ర్** 97 - 99 వారు నిన్ను గురించి కల్పిస్తున్న మాటలవల్ల నీ మనస్సుకు మిక్కిలి కష్టం కలుగుతోందని మాకు తెలుసు. (దానికి చికిత్స ఏమిటంటే) నీ ప్రభువు స్తోత్రం చేస్తూ ఆయన పవిత్ర నామాన్ని స్మరించు. ఆయన సన్నిధానంలో సాష్టాంగపడు. తప్పకుండా వచ్చే చివరి గడియవరకూ నీ ప్రభువు దాస్యం చేస్తూ వుండు.

**16. అన్ నహ్ల్**

ఆయతులు : 128 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**16. అస్ నమ్ల్** 1 - 3 అల్లాహ్ తీర్పు వచ్చేసింది. ఇక దానికొరకు తొందరపెట్టకండి. ఆయన పరిశుద్ధుడు. వారు చేస్తూవున్న షిర్కుకు అతీతుడు , ఉన్నతుడు. ఆయన ఈ ఆత్మను తనకు నచ్చిన తన దాసునిపై తన ఆజ్ఞతో దైవదూతల ద్వారా అవతరింపజేస్తాడు. (ఈ ఉపదేశంతో ప్రజలను) హెచ్చరించండి: ''నేను తప్ప మీకు మరొక దేవుడు ఎవ్వడూ లేడు. కనుక మీరు నాకే భయపడండి. '' ఆయన ఆకాశాన్నీ భూమినీ సత్యం పునాదిగా సృష్టించాడు. ఈ ప్రజలు చేసే షిర్కుకు ఆయన అతీతుడు, ఉన్నతుడు.

**16. అస్ నమ్ల్** 4 - 9 ఆయన మానవుణ్ణి స్వల్పమైన బిందువుతో సృష్టించాడు. చూస్తూ చూస్తూ ఉండగానే అతడు ఒక బహిరంగ వివాదిగా మారిపోయాడు. ఆయన పశువులను సృష్టించాడు. వాటిలో మీకొరకు దుస్తులూ ఉన్నాయి, ఆహారమూ ఉన్నది. ఇంకా రకరకాల ఇతర ఉపయోగాలు కూడా ఉన్నాయి. ఉదయంపూట మీరు వాటిని మేపటానికి తోలుకుని వెళ్ళేటప్పుడూ, సాయంత్రం పూట వాటిని తిరిగి తోలుకొని వచ్చేటప్పుడూ అవి మీకు రమణీయంగా కనిపిస్తాయి. ఎంతో కష్టంతో తప్ప మీరు చేరలేని ప్రదేశాలకు సయితం అవి మీకొరకు బరువును మోసుకునిపోతాయి. యథార్థ మేమిటంటే, మీ ప్రభువు ఎంతో వాత్సల్యం కలవాడు, ఎంతో కనికరించేవాడు. ఆయన గుర్రాలనూ, కంచర గాడిదలనూ, గాడిదలనూ సృష్టించాడు. మీరు వాటిపై స్వారీ చెయ్యటానికి, అవి మీ జీవితాలకు శోభను చేకూర్చటానికి. ఆయన ఇంకా చాలా వస్తువులను (మీ ప్రయోజనం కొరకు) సృష్టిస్తాడు. వాటిని గురించి మీకసలు తెలియనే తెలియదు. వక్రములైన మార్గాలు కూడా ఉన్నప్పుడు , సక్రమమైన మార్గం చూపటం అల్లాహ్ బాధ్యతే. ఆయన తలచుకుని ఉంటే మీ అందరికీ సన్మార్గం చూపి ఉండేవాడే.

**16. అస్ నమ్ల్** 10 - 11 ఆకాశం నుండి మీకోసం నీళ్ళను కురిపించేవాడు ఆయనే. ఆ నీటిని మీరూ తనివితీరా త్రాగుతారు, ఆ నీటివల్ల మీ పశువులకు కూడా మేత మొలుస్తుంది. ఆయన ఆ నీటిద్వారా పొలాలను పండిస్తాడు. జైతూను, ఖర్జూరం, ద్రాక్ష ఇంకా రకరకాల ఇతర పండ్లను పండిస్తాడు. ఆలోచించే వారికి ఇందులో ఒక గొప్ప నిదర్శనం ఉంది.

**16. అస్ నమ్ల్** 12 - 13 ఆయన మీ మేలు కోసం రాత్రినీ , పగలునూ సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ మీకు వశపరిచాడు. నక్షత్రాలు కూడా ఆయన ఆజ్ఞ వల్లనే మీకు వశమై ఉన్నాయి. బుద్ధిని ఉపయోగించేవారికి ఇందులో చాలా సూచనలు ఉన్నాయి. ఆయన మీకోసం భూమిలో సృష్టించిన అనేక రంగు రంగుల వస్తువులలో కూడా గుణపాఠం నేర్చుకునేవారికి నిశ్చయంగా సూచన ఉంది.

**16. అస్ నమ్ల్** 14 సముద్రాన్ని మీ సేవకోసం నియోగించినవాడు ఆయనే, దానినుండి మీరు తాజా మాంసాన్ని తీసుకుని తినేటందుకు, మీరు ధరించే ఆభరణాలను దానినుండి వెలికి తీసుకునేటందుకు. సముద్రం రొమ్మును

చీలుస్తూ ఓడ పయనించటాన్ని మీరు చూస్తారు. ఇదంతా ఎందుకంటే , మీరు మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషించాలనీ, ఆయనకు కృతజ్ఞులు కావాలనీ.

**16. అన్ నహ్ల్** 15 - 16 ఆయన భూమిలో పర్వతాలను మేకులుగా పాతాడు , భూమి మిమ్మల్ని తీసుకొని దొర్లిపోకుండా ఉండాలని. ఆయన నదులను ప్రవహింప జేశాడు. సహజ మార్గాలను నిర్మించాడు , మీరు సరైన మార్గం పొందటానికి. ఆయన భూమిలో మార్గం చూపే సంకేతాలను పెట్టాడు. నక్షత్రాల ద్వారా కూడా ప్రజలు మార్గం తెలుసుకుంటారు.

**16. అన్ నహ్ల్**17 - 19 సృష్టించేవాడూ, అసలు ఏమీ సృష్టించనివాడూ ఉభయులూ సమానులేనా ? మీరు ఈ మాత్రం అర్థం చేసుకోలేరా? ఒకవేళ మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే, లెక్కించలేరు. యథార్థమేమిటంటే ఆయన ఎంతో మన్నించేవాడూ, కరుణామయుడూను. ఆయన మీ బాహ్యాన్నీ ఎరుగును, మీ గోప్యాన్నీ ఎరుగును.

**16. అన్ నహ్ల్**20 - 21 అల్లాహ్ ను వదలి, ప్రజలు వేడుకుంటున్న ఇతర శక్తులు ఏ వస్తువుకూ సృష్టికర్తలు కారు. వారు స్వయంగా సృష్టింపబడినవారు , నిర్జీవులే కాని సజీవులు కారు. వారు ఎప్పుడు (మళ్ళీ బ్రతికించబడి) లేపబడనున్నారో వారికెంత మాత్రం తెలియదు.

**16. అన్ నహ్ల్**22 - 23 మీ దేవుడు కేవలం ఒక్కడే. కాని పరలోకాన్ని నమ్మని వారి హృద యాలలో తిరస్కారం తిష్ఠవేసుకొని ఉంది. వారు విర్రవీగుతున్నారు. అల్లాహ్ కు నిశ్చయంగా వారి చేష్టలన్నీ తెలుసు - దాగివున్నవి కూడా, బహిరంగముగా ఉన్నవి కూడా. అహంభావానికి గురైన వారిని ఆయన ఏమాత్రం ప్రేమించడు.

**16. అన్ నహ్ల్**24 - 29 ఎవరైనా వారిని, ''మీ ప్రభువు అవతరింపజేసినటువంటిది ఏమిటి?'' అని అడిగితే ఇలా అంటారు: ''అవండీ, అవి పాతకాలపు కట్టు కథలు. '' ఈ మాటలను అని వారు ప్రళయంనాడు తమ బరువును పూర్తిగా మోస్తారు. దానికితోడు వారు అజ్ఞానం వల్ల అపమార్గం పట్టిస్తున్న వారి బరువును కూడా కొంత మోస్తారు. చూడండి! ఎంత కఠినమైన బాధ్యతను వారు తమ నెత్తిపై వేసుకుంటున్నారో! వారికి పూర్వం కూడా చాలామంది (సత్యాన్ని అణచటానికి) ఇటువంటి దుష్టపన్నాగాలనే పన్నారు. చూడండి , అప్పుడు అల్లాహ్ వారి పన్నాగపు కట్టడాన్ని పునాదులతో సహా పెకలించి పారవేశాడు. పైనుండి దాని కప్పు వారి తలలపై పడిరది. శిక్ష వస్తుందని వారికి అనుమానం కూడా లేనటువంటి దిక్కునుండి అది వారిపైకి వచ్చి పడిరది. తరువాత ప్రళయం నాడు అల్లాహ్ వారిని అవమానపరుస్తాడు , హీనపరుస్తాడు. వారితో ఇలా అంటాడు: మీరు (సత్యవాదులతో) నా భాగస్వాముల తరఫున పోట్లాడుతూ ఉండేవారు కదా! ఇప్పుడు ఆ నా భాగ స్వాములు ఎక్కడ ఉన్నారో చెప్పండి - ప్రపంచంలో జ్ఞానం లభించినవారు ''అవిశ్వాసులకు ఈ రోజు (లభించేది) అవమానమూ , దౌర్భాగ్యమూను'' అని అంటారు. అవును , తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉన్నప్పుడు దైవదూతలు ప్రాణాలు తీసే

అవిశ్వాసులకు. అప్పుడు వారు (తలబిరుసుతనాన్ని విడిచిపెట్టి) వెంటనే పూర్తిగా లొంగిపోయి ''మేము ఏ తప్పూ చేసి ఉండలేదు'' అని అంటారు. దానికి దైవదూతలు ఇలా అంటారు: ''ఎందుకు చేసి ఉండలేదు! అల్లాహ్ మీ చేష్టలను బాగా ఎరుగును. ఇక పొండి. నరక ద్వారాలలో దూరి పొండి. అక్కడనే మీరు శాశ్వతంగా ఉంటారు. '' కనుక యథార్థం ఏమిటంటే, గర్విష్ఠులకు లభించే నివాసం చాలా చెడ్డది.

**16. అన్ నమ్ల్** 30 - 32 మరోవైపు దైవభీతి కలవారిని, మీ ప్రభువు తరఫు నుండి అవతరించినటువంటిది ఏమిటి? అని అడిగినప్పుడు , వారు ''అత్యుత్తమమైనది అవతరించినది '' అని సమాధానం చెబుతారు. ఇటువంటి సజ్జనులకు ఈ ప్రపంచంలోనూ మేలు జరుగుతుంది. ఇక పరలోక గృహం కూడా తప్పని సరిగా వారికి ఎంతో మేలైనదిగా ఉంటుంది. భయభక్తులు కలవారి ఇల్లు ఎంతో మంచి ఇల్లు, శాశ్వత నివాసంగా ఉండే ఉద్యానవనాలు - వాటిలో వారు ప్రవేశిస్తారు. క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ అంతా వారి అభిమతానికి అనుగుణంగానే జరుగుతుంది. భయభక్తులు కలవారికి అల్లాహ్ ఇటువంటి ప్రతిఫలాన్ని ఇస్తాడు. వారు పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు దైవదూతలు వారి ప్రాణాలు తీస్తూ ''మీకు శాంతి కలుగుగాక! మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి'' అని అంటారు.

**16. అన్ నమ్ల్** 33 - 34 ప్రవక్తా! వారు ఇంకా నిరీక్షిస్తున్నారా , వారికి ఇంకా మిగిలింది ఏమిటి , దైవదూతలు వచ్చెయ్యటమో లేదా నీ ప్రభువు తీర్పు జారీ కావటమో తప్ప ? వారికి పూర్వం చాలామంది ఇలానే మొండిగా ప్రవర్తించారు. తరువాత వారి విషయంలో జరిగింది అల్లాహ్ చేసిన అన్యాయం కాదు. ఆ అన్యాయం వారిదే , దానిని వారు తమకు తామే చేసుకున్నారు. వారు చేసిన పనుల దుష్ఫలితాలు చివరకు వారినే పట్టుకున్నాయి. వారు ఎగతాళి చేస్తూ ఉండినదే వారిని చుట్టుముట్టింది.

**16. అన్ నమ్ల్** 35 - 37 ఈ ముష్రిక్కులు ఇలా అంటారు: ''అల్లాహ్ కోరి ఉన్నట్లయితే మేముగానీ మా తాత ముత్తాతలుగానీ ఆయనను తప్ప మరెవ్వరినీ ఆరాధించి ఉండేవారము కాదు. ఆయన ఆజ్ఞ లేకుండా ఏ వస్తువునూ నిషేధించి ఉండేవారము కూడా కాదు.'' ఇటువంటి సాకులనే వారికి పూర్వం వారు కూడా చెప్పేవారు. అయితే విషయాన్ని స్పష్టంగా అందజేసే బాధ్యత తప్ప మరొక బాధ్యత కూడా ప్రవక్తలపై ఏదైనా ఉందా ? మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము: ''అల్లాహ్ ను ఆరాధించండి. మిథ్యాదైవాల ఆరాధనకు దూరంగా ఉండండి. '' దాని తరువాత అల్లాహ్ వారిలో కొందరికి సన్మార్గాన్ని ప్రసాదించాడు. మరికొందరిని అపమార్గం లోగొన్నది. కొంచెం భువిలో సంచారం చేసి చూడండి , తిరస్కారులకు ఏ గతి పట్టిందో - ప్రవక్తా! వారికి సన్మార్గం లభించాలని నీవు ఎంతగా కోరుకున్నా అల్లాహ్ తాను అపమార్గం పట్టించే వాడికి మళ్ళీ సన్మార్గం చూపడు. అటువంటి వారికి ఎవరూ సహాయం చేయలేరు.

**16. అన్ నమ్‌ల్**38 - 40 వీరు అల్లాహ్ పేరుతో దృఢమైన ప్రమాణాలు చేసి ఇలా చెబుతారు: ''చనిపోయినవాణ్ణి ఎవణ్ణీ అల్లాహ్ మళ్ళీ బ్రతికించి లేపడు. ''- ఎందుకు లేపడు ? ఇది ఆయన చేసిన ఒక వాగ్దానం. దానిని నెరవేర్చటాన్ని ఆయన తన విధిగా చేసుకున్నాడు. కాని చాలామందికి ఆ విషయం తెలియదు. అలా తప్పకుండా జరగాలి ఎందుకంటే వారి ముందు అల్లాహ్ వారు విభేదిస్తూ ఉన్నటువంటి యథార్థాన్ని బహిర్గతం చెయ్యటానికి , సత్యతిరస్కారులు తాము అబద్ధీకులమని తెలుసుకోవటానికి. (ఇక అది సంభవించే విషయాన్ని గురించి) ఒక వస్తువును ఉనికి లోనికి తీసుకురావటానికి , దానిని 'అయిపో' అని ఆజ్ఞాపిస్తే చాలు , వెంటనే అది అయిపోతుంది. అంతకంటే ఎక్కువ చేయవలసిన అవసరం మాకు లేదు.

**16. అన్ నమ్‌ల్** 41 - 42 దౌర్జన్యాన్ని అనుభవించిన తరువాత అల్లాహ్ కోసం వలసపోయిన వారికి మేము ప్రపంచంలో తప్పకుండా మంచి నివాసాన్ని ఇస్తాము. పరలోక ప్రతిఫలమైతే ఇంతకంటే గొప్పగా ఉంటుంది, సహనం చూపినటువంటి, తమ ప్రభువుపై నమ్మకంతో పనిచేస్తున్నటువంటి బాధితులు (ఎంతో చక్కని ముగింపు తమ కొరకు వేచి చూస్తోందని) తెలుసుకుంటే ఎంత బాగుండును!

**16. అన్ నమ్‌ల్**43 - 44 ప్రవక్తా! మేము నీకు పూర్వం కూడా ప్రవక్తలను పంపినపుడల్లా మానవులనే ప్రవక్తలుగా పంపాము. వారివైపునకు మేము మా సందేశాలను వహీ ద్వారా పంపుతూ ఉండేవారము. మీకు (మక్కావాసులు) తెలియకపోతే జ్ఞాపిక కలవారిని అడగండి. పూర్వపు ప్రవక్తలను కూడా మేము స్పష్టమైన నిదర్శనాలతోనూ , గ్రంథాలతోనూ పంపివున్నాము. ఇప్పుడు ఈ జ్ఞాపికను నీ (ప్రవక్త)పై అవతరింప జేశాము , నీవు ప్రజల ముందు వారికోసం అవత రింపజేయబడిన ఉపదేశాన్ని స్పష్టంగా వివరించటానికీ , (స్వయంగా) ప్రజలు కూడా ఆలోచించటానికి.

**16. అన్ నమ్‌ల్** 45 - 47 (ప్రవక్త సందేశానికి వ్యతిరేకంగా) అత్యంత దుష్ట పన్నాగాలను పన్నుతున్న వారిని అల్లాహ్ భూమిలో దిగబడిపోయేలా చేస్తాడనీ లేదా వారికి అనుమానం కూడా కలుగని దిక్కునుండి వారిపైకి శిక్షను తీసుకువస్తాడనీ, లేదా వారు తిరుగాడుతూ ఉన్నప్పుడు అకస్మాత్తుగా పట్టుకుంటాడనీ , లేదా రాబోయే ఆపదను గురించి భయపడి దానినుండి తప్పించుకోవటానికి వారు జాగ్రత్త పడుతున్న స్థితిలో వారిని పట్టుకుంటాడనీ వారికి ఏమాత్రం భయం లేకుండా పోయిందా ? ఆయన ఏమి చేయదలచుకున్నా , వారు మాత్రం ఆయనను అశక్తుడుగా చేయలేరు. వాస్తవం ఏమిటంటే, నీ ప్రభువు మృదు హృదయుడూ, కరుణామయుడూను.

**16. అన్ నమ్‌ల్**48 - 50 వారు అల్లాహ్చే సృష్టింపబడిన ఏ వస్తువునూ గమనించరా , అది అల్లాహ్ సాన్నిధ్యంలో సాష్టాంగపడుతూ తన నీడను కుడి వైపునకూ ఎడమ వైపునకూ ఎలా తిప్పుతూ ఉంటుందో ? ఈ విధంగా అన్నీ వినమ్రతను ప్రదర్శిస్తున్నాయి. భూమిలోనూ ఆకాశాలలోనూ ఉన్న సమస్త జీవరాసులూ , సర్వ దైవదూతలూ

అల్లాహ్ ముందు సాష్టాంగపడుతున్నారు. వారు ఎంతమాత్రం తలబిరుసుతనంతో ప్రవర్తించరు. తమపైన ఉన్న ప్రభువునకు భయపడతారు. తమకు ఇవ్వబడిన ఆదేశం ప్రకారమే పనిచేస్తారు.

**16. అన్ నహ్ల్**51 - 52 అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు: ''ఇద్దరిని దేవుళ్ళుగా చేసుకోకండి. దేవుడు మటుకు ఒక్కడే. కనుక మీరు నాకే భయపడండి. ఆకాశాలలో ఉన్నదంతా, భూమిలో ఉన్నదంతా ఆయనదే. కేవలం ఆయన ధర్మం మాత్రమే (సృష్టిలో అంతటా) అనుసరింపబడుతోంది. అలాంటప్పుడు , మీరు అల్లాహ్ ను కాదని మరొకరికి భయపడతారా?

**16. అన్ నహ్ల్**53 - 55 మీకు లభించిన అనుగ్రహం ఏదైనా అది అల్లాహ్ తరఫు నుండే లభించినది. మీకేదైనా గడ్డుకాలం దాపురించినప్పుడు మీరు మీ మొరలతో ఆయన వైపునకే పరుగెడతారు. కాని అల్లాహ్ ఆ గడ్డుకాలాన్ని తొలగించి నప్పుడు (ఈ కనికరానికి కృతజ్ఞతగా) మీలో ఒక వర్గం ఒక్కసారిగా తన ప్రభువునకు ఇతరులను భాగస్వాములుగా చెయ్యటం ప్రారంభిస్తుంది, అల్లాహ్ చేసిన ఉపకారానికి కృతఘ్నుతగా. సరే, మంచిది, సుఖాలను అనుభవించండి. త్వరలోనే మీకు తెలిసిపోతుంది.

**16. అన్ నహ్ల్** 56 ఎవరిని గురించి వీరు ఏమాత్రమూ ఎరుగరో వారికి , మేము ఇచ్చిన ఉపాధిలో భాగాలను నిర్ణయిస్తారు. దేవుని తోడు , ఈ అబద్ధాన్ని మీరు ఎలా కల్పించారు ? అని మిమ్మల్ని తప్పనిసరిగా అడగటం జరుగుతుంది.

**16. అన్ నహ్ల్**57 - 60 వారు దేవునికి కూతుళ్ళను కల్పిస్తారు. అల్లాహ్ పరిశుద్ధుడు. తమ కోసమేమో వారు స్వయంగా కోరుకున్నదా? వారిలో ఎవడికైనా కూతురు పుట్టినదనే శుభవార్తను అందజేస్తే అతడి ముఖాన్ని నల్లని ఛాయలు ఆవరి స్తాయి. అతడు లోలోన కుమిలిపోతాడు. ఈ దుర్వార్త విన్న తరువాత ఇక లోకులకు ఎలా ముఖం చూపాలి అని అతడు నక్కి నక్కి తిరుగుతూ ఉంటాడు. అవమానాన్ని భరిస్తూ కూతుర్ని ఇంట్లో ఉంచుకోవాలా లేక ఆమెను మట్టిలో పాతిపెట్టాలా ? అని ఆలోచిస్తాడు - చూడు! వారు దేవుని విషయంలో చేసే నిర్ణయాలు ఎంత దుష్టమైనవో! పరలోకాన్ని విశ్వసించనివారే , చెడుగుణాలు ఆరోపింపదగినవారు. ఇక అల్లాహ్ - ఆయనకు అందరికంటే ఉన్నతమైన గుణాలు ఉన్నాయి. ఆయనే అందరిపై ప్రాబల్యం కలవాడు. వివేకంలో పరిపూర్ణుడూనూ.

**16. అన్ నహ్ల్**61 - 62 ఒకవేళ అల్లాహ్ ప్రజలను వారి మితిమీరిన ప్రవర్తనకు వెంటనే పట్టుకోదలిస్తే, భూమిపై ఏ ప్రాణినీ వదలిపెట్టడు. కాని ఆయన అందరికీ ఒక నిర్ణీత కాలం వరకు గడువు ఇస్తాడు. ఆ కాలం వచ్చేసినప్పుడు, అది ఒక్క గడియ కూడా వెనుకా ముందూ కాజాలదు. ఈనాడు వారు అల్లాహ్ కోసం తాము తమ కోసం ఇష్టపడని వస్తువులను కల్పిస్తున్నారు. తమకోసం ఉన్నదంతా శుభమే అని వారి నాలుకలు అబద్ధం పలుకుతున్నాయి.

వారికోసం ఉన్నది ఒకే ఒక వస్తువు , అది నరకాగ్ని. వారు అందరికంటే ముందు అందులోకి తప్పనిసరిగా పంపబడతారు.

**16. అస్ నమ్ల్**63 - 64 దేవునితోడు, ప్రవక్తా! నీకు పూర్వం కూడా ఎన్నో జాతుల వద్దకు మేము ప్రవక్తలను పంపి వున్నాము. (పూర్వం కూడా ఇలాగే జరుగుతూ ఉండేది) షైతాన్ వారి చెడ్డపనులను వారికి మనోహరమైనవిగా చేసి చూపాడు. (కాబట్టి ప్రవక్తల మాటను వారు నమ్మలేదు) ఆ షైతానే ఈనాడు వీరికి కూడా సంరక్షకుడై కూర్చున్నాడు. వీరు వేదనా భరితమైన శిక్షకు అర్హులవు తున్నారు. మేము ఈ గ్రంథాన్ని నీపై ఎందుకు అవతరింపజేశామంటే, వారు గురిఅయిన విభేదాల యథార్థాన్ని నీవు వారికి స్పష్టం చెయ్యాలని. ఈ గ్రంథం తనను విశ్వసించే వారికోసం మార్గదర్శకత్వంగానూ, కారుణ్యంగానూ అవతరించింది.

**16. అస్ నమ్ల్** 65 (మీరు ప్రతి వర్షాకాలంలోనూ చూస్తారు) , అల్లాహ్ ఆకాశం నుండి నీళ్ళను కురిపించాడు. నిర్జీవంగా పడివున్న భూమిలో ఒక్కసారిగా దానిద్వారా ప్రాణం పోశాడు. నిశ్చయంగా ఇందులో వినేవారికి ఒక నిదర్శనం ఉన్నది.

**16. అస్ నమ్ల్**66 మీకు పశువులలో కూడా ఒక గుణపాఠం ఉన్నది. వాటి గర్భంలో పేడ , రక్తానికి మధ్య ఉన్న ఒక వస్తువును మేము మీకు త్రాగిస్తాము. అంటే స్వచ్ఛమైన పాలు. అది త్రాగేవారికి ఎంతో కమ్మనిది.

**16. అస్ నమ్ల్** 67 (ఇదేవిధంగా) ఖర్జూరపు చెట్లు , ద్రాక్ష తీగెల నుండి కూడా మేము ఒక పదార్థాన్ని మీకు త్రాగిస్తాము. దానిని మీరు మత్తుపానీయంగా కూడా చేసు కుంటారు , పరిశుద్ధమైన ఆహారంగా కూడా. బుద్ధిని ఉపయోగించే వారికి ఇందులో నిశ్చయంగా ఒక సూచన ఉంది.

**16. అస్ నమ్ల్** 68 - 69 చూడండి , మీ ప్రభువు తేనెటీగకు వహీద్వారా ఈ విషయాన్ని తెలిపాడు. కొండలలో , చెట్లమీద, తడికలపై ఎక్కించబడిన తీగెలలో నీ తెట్టె లను నిర్మించుకో, అన్ని రకాల పండ్లరసాన్ని పీల్చు, నీ ప్రభువు సుగమం చేసిన మార్గాలపై నడుస్తూ ఉండు. '' ఈ ఈగ కడుపులో నుండి రంగు రంగుల పానకం ఒకటి వెలువడుతుంది. అందులో ప్రజల కోసం వ్యాధి నివారణ శక్తి ఉన్నది. ఆలోచించేవారికి ఇందులో కూడా నిశ్చయంగా ఒక సూచన ఉంది.

**16. అస్ నమ్ల్** 70 చూడండి , అల్లాహ్ మిమ్మల్ని పుట్టించాడు. తరువాత ఆయన మీకు మృత్యువును కలుగజేస్తాడు. మీలో ఒకడు అతి నికృష్టమైన వయస్సుకు చేర్చబడతాడు , అంతా తెలిసిన తరువాత కూడా ఏమీ తెలియనివాడుగా అయ్యేందుకు. సత్యం ఏమిటంటే అల్లాహ్ మాత్రమే జ్ఞానంలో కూడా పరిపూర్ణుడు శక్తిలో కూడా.

**16. అస్ నహ్ల్** 71 చూడండి ,  అల్లాహ్ మీలో కొందరికి కొందరికంటె జీవన సామగ్రి విషయంలో ఆధిక్యం ప్రసాదించాడు. అయితే ఈ ఆధిక్యం ఇవ్వబడిన వారు తమ జీవన సామగ్రిని తమ బానిసల వైపునకు మళ్ళించరు కదా?  వారు ఇద్దరూ ఈ జీవన సామగ్రిలో సమాన భాగస్తులు అయ్యేటందుకు. అల్లాహ్ ఉపకారాన్నే ఒప్పుకోవటానికి వారు తిరస్కరిస్తున్నారా?

**16. అస్ నహ్ల్**72 - 74 అల్లాహ్ యే మీకోసం మీ జాతినుండే భార్యలను చేశాడు. ఆయనే ఆ భార్యల ద్వారా మీకు కుమారులను, మనుమలను ప్రసాదించాడు. మంచి మంచి వస్తువులను మీకు తినటానికి ఇచ్చాడు. అయితే వారు (ఇదంతా చూస్తూ కూడా ఇదంతా తెలిసికూడా) అసత్యాన్నే విశ్వసిస్తున్నారా! అల్లాహ్ ఉపకారాన్నే తిరస్కరిస్తున్నారా? అల్లాహ్ ను వదలిపెట్టి ఆకాశాల నుండిగానీ , భూమినుండిగానీ వారికి ఆహారం ఇవ్వనటువంటి వారిని ఆ పని చెయ్యగల శక్తి లేనివారినీ పూజిస్తున్నారా  ? కనుక అల్లాహ్ కు పోలికలను కల్పించకండి. అల్లాహ్ ఎరుగును, మీరెరుగరు.

**16. అస్ నహ్ల్** 75 అల్లాహ్ ఒక ఉదాహరణను ఇస్తున్నాడు:  ఒకడేమో బానిస - ఇతరుల యాజమాన్యంలో ఉన్నవాడు, స్వయంగా ఏ అధికారమూ లేనివాడు. ఇక రెండోవాడు - అతనికి మేము మా తరఫు నుండి  మంచి ఉపాధిని ప్రసాదిం చాము  ,  అతడు అందులో నుండి బహిరంగంగానూ  ,  రహస్యంగానూ బాగా ఖర్చు చేస్తాడు. చెప్పండి,  వారు ఇద్దరూ సమానులేనా  ?  -  అల్ హమ్దులిల్లాహ్ (స్తోత్రం అల్లాహ్ కొరకే). కాని అనేకులు (ఈ సామాన్య విషయాన్ని ) ఎరుగరు.

**16. అస్ నహ్ల్**76 అల్లాహ్ మరొక ఉదాహరణను ఇస్తున్నాడు : ఇద్దరు మనుషులున్నారు. ఒకడు మూగవాడు , చెవిటివాడు. ఏ పనీ చెయ్యలేడు. తన యజమానికి భారమై కూర్చున్నాడు. ఆయన అతన్ని ఎక్కడకు పంపినా అతనివల్ల మంచి పని ఏదీ జరుగదు. ఇక రెండో మనిషి  - అతడు న్యాయం చెయ్యండి అని ఆజ్ఞాపిస్తాడు. స్వయంగా సన్మార్గంలో స్థిరంగా ఉన్నాడు. చెప్పండి, వారు ఇద్దరూ సమానులేనా?

**16. అస్ నహ్ల్** 77 భూమిలోనూ ఆకాశాలలోనూ దాగివున్న యథార్థాల జ్ఞానం అల్లాహ్ కు మాత్రమే ఉన్నది. ప్రళయం సంభవించటానికి ఎంతోసేపు పట్టదు  ,  కేవలం రెప్పపాటు కాలం తప్ప. ఇంకా దానికంటే కూడా కొంచెం తక్కువే - యథార్థ మేమిటంటే, అల్లాహ్ అన్నీ చెయ్యగల సమర్థుడు.

**16. అస్ నహ్ల్**78 అల్లాహ్ మిమ్మల్ని మీ మాతృగర్భాల నుండి మీరు ఏమీ ఎరుగని స్థితిలో ఉండగా బయటికి తీశాడు. ఆయన మీకు చెవులు ఇచ్చాడు. కళ్ళు ఇచ్చాడు. ఆలోచించే మనస్సూ ఇచ్చాడు - మీరు కృతజ్ఞులు కావాలని.

**16. అస్ నమ్ల్** 79 గగనమండలంలో భద్రంగా విహరించే పక్షులను వారు ఎన్నడూ చూడ లేదా ? అల్లాహ్ తప్ప వాటిని క్రిందపడకుండా నిలిపి ఉంచినదెవరు? విశ్వాసు లకు ఇందులో చాలా నిదర్శనాలు ఉన్నాయి.

**16. అస్ నమ్ల్** 80 - 83 అల్లాహ్ మీకోసం మీ గృహాలను శాంతినీ , విశ్రాంతినీ ఇచ్చే స్థలాలుగా తీర్చిదిద్దాడు. పశువుల చర్మాలతో ఆయన మీ కోసం ఇళ్ళను చేశాడు. మీరు ప్రయాణంలో ఉన్నప్పుడూ బసచేసినప్పుడూ ఈ రెండు స్థితులలోనూ అవి మీకు తేలికగా ఉంటాయి. పశువుల మృదు రోమాలతోనూ, ఉన్నితోనూ, వెంట్రుకలతోనూ మీ కోసం తొడుక్కునే వస్తువులనూ, వాడుకునే వస్తువులనూ ఎన్నింటినో సృష్టించాడు. అవి జీవిత కాలం అంతా మీకు పనికొస్తాయి. ఆయన తనచే సృష్టింపబడిన ఎన్నో వస్తువులతో మీకోసం నీడను ఏర్పాటు చేశాడు. పర్వతాలలో మీకోసం ఆశ్రయ స్థలాలను నిర్మిం చాడు. మిమ్మల్ని వేడిమినుండి కాపాడే దుస్తులనూ , యుద్ధ రంగాలలో మిమ్మల్ని రక్షించే కవచాలనూ మీకు ప్రసాదించాడు. ఈ విధంగా ఆయన తన అనుగ్రహా లను మీకు పూర్తిగా ప్రసాదిస్తాడు, మీరు విధేయులౌతారేమో అని. ఇక , వారు ఒకవేళ విముఖులైతే, ప్రవక్తా! సత్యసందేశాన్ని స్పష్టంగా అందజెయ్యటం తప్ప నీపై మరొక బాధ్యత లేదు. వారు అల్లాహ్ ఉపకారాన్ని గుర్తిస్తారు. అయినా దాన్ని తిరస్కరిస్తారు. వారిలో చాలామంది సత్యాన్ని స్వీకరించటానికి సిద్ధంగా లేరు.

**16. అస్ నమ్ల్** 84 - 88 (ఆ రోజున ఏమవుతుందో వారు కొంచెమైనా ఆలోచించారా ?) అప్పుడు మేము ప్రతి సంఘం నుండి ఒక సాక్షిని నిలబెడతాము. అవిశ్వాసు లకు వాదాలు వినిపించే అవకాశం ఇవ్వటంగానీ , వారిని పశ్చాత్తాపపడండి అనిగానీ, క్షమాభిక్షను అర్థించండి అనిగానీ అడగటం జరగదు. దుర్మార్గులు ఒకసారి శిక్షను చూసిన తరువాత వారి శిక్షను తగ్గించటమూ జరగదు. వారికి ఒక క్షణంపాటు వ్యవధి ఇవ్వటమూ జరగదు. ప్రపంచంలో షిర్కు చేసిన వారు , తాము అల్లాహ్ కు భాగస్వాములుగా నిలబెట్టినవారిని చూసి నప్పుడు ఇలా అంటారు: ''ప్రభూ! మేము నిన్ను వదలిపెట్టి వేడుకుంటూ ఉండిన భాగస్వాములు వీరే. అప్పుడు వారు కల్పించిన ఈ దేవుళ్ళు 'మీరు అబద్ధం చెబుతున్నారు' అని స్పష్టంగా సమాధానం ఇస్తారు. ఆ సమయంలో వీరంతా అల్లాహ్ ముందు వినమ్రులౌతారు. వారు ప్రపంచంలో చేస్తూ ఉండిన కల్పనలన్నీ మటుమాయమౌతాయి. స్వయంగా అవిశ్వాస మార్గాన్ని అవలం బించిన వారికీ , ఇతరులను అల్లాహ్ మార్గం నుండి నిరోధించినవారికీ మేము శిక్షపై శిక్షను విధిస్తాము, వారు ప్రపంచంలో రెచ్చగొట్టిన దుర్మార్గానికి ఫలితంగా.

**16. అస్ నమ్ల్** 89 మేము ప్రతి సంఘంలో నుండి ఒక సాక్షిని లేపి నిలబెట్టేరోజును గురించి , ప్రవక్తా! వారిని హెచ్చరించు. ఆ సాక్షి తన సంఘానికి వ్యతిరేకంగా సాక్ష్య మిస్తాడు. వారికి వ్యతిరేకంగా సాక్ష్యమివ్వటానికి మేము నిన్ను తీసుకొని వస్తాము. (ఈ సాక్ష్యం కొరకు సన్నాహంగా) మేము ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. అది ప్రతి విషయాన్నీ స్పష్టంగా వివరిస్తుంది. విధేయులైన వారికి అది ఉపదేశం , కారుణ్యం, శుభవార్త.

**16. అస్ నమ్ల్**90 - 93 న్యాయం చెయ్యండి అనీ, ఉపకారం చెయ్యండి అనీ, బంధువుల హక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. చెడునూ , అశ్లీలతనూ, అన్యాయాన్నీ, మితిమీరి ప్రవర్తించటాన్నీ నిషేధిస్తున్నాడు. ఆయన మీకు హితబోధ చేస్తున్నాడు, మీరు గుణపాఠం నేర్చుకోవాలని. మీరు అల్లాహ్తో ఏదైనా వాగ్దానం చేసివుంటే ఆ వాగ్దానాన్ని నెరవేర్చండి. అల్లాహ్ సాక్షిగా చేసిన ప్రమాణాలను దృఢపరచిన తరువాత భంగపరచకండి. అల్లాహ్ మీ పనులన్నింటినీ ఎరుగును. స్వయంగా తాను శ్రమతో నూలు వడకి , తరువాత తానే దానిని ముక్కలు ముక్కలుగా చేసిన స్త్రీ స్థితి వంటిది మీ స్థితి కాకూడదు. మీరు మీ ప్రమాణాలను మీ వ్యవహారాలలో పరస్పరం మోసగించుకోవటానికి పని ముట్లుగా చేసుకుంటారు, ఒక జాతి రెండోజాతికంటే ఎక్కువగా లాభాలను పొందటానికి. వాస్తవానికి అల్లాహ్ ఈ ప్రమాణాల ద్వారా మిమ్మల్ని పరీక్షకు గురిచేస్తున్నాడు. తప్పకుండా ఆయన ప్రళయం నాడు మీ సమస్త అభిప్రాయ భేదాల తత్వాన్ని మీకు విశదం చేస్తాడు. ఒకవేళ అల్లాహ్ సంకల్పం ఇదే అయివుంటే, (అంటే మీలో ఏ భేదాభిప్రాయమూ ఉండకూడదు అని) ఆయన మీ అందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు. కాని ఆయన తన ఇష్టప్రకారం కొందరిని అపమార్గానికి గురిచేస్తాడు. తన ఇష్టప్రకారం కొందరికి సన్మార్గం చూపుతాడు. తప్పకుండా మీ పనులను గురించి మిమ్మల్ని సంజాయిషీ అడగటం జరిగి తీరుతుంది.

**16. అస్ నమ్ల్** 94 - 97 (ముస్లిములారా!) మీరు మీ ప్రమాణాలను ఒకరినొకరు మోసగించుకోవటానికి సాధనాలుగా చేసుకోకండి. ఇలా చేస్తే స్థిరపడిపోయిన పాదాలు తరువాత చలిస్తాయేమో , మీరు అల్లాహ్ మార్గం నుండి ప్రజలను నిరోధించిన అపరాధానికి దుష్ఫలితాన్ని చూస్తారేమో, శిక్షను అనుభవిస్తారేమో. మీరు అల్లాహ్ కు చేసిన వాగ్దానాన్ని స్వల్ప లాభానికి అమ్మివేయకండి. అల్లాహ్ వద్ద ఉన్నది మీకు ఎక్కువ మేలు కలిగిస్తుంది , మీరు గనక తెలుసుకుంటే. మీ దగ్గరున్నదంతా ఖర్చు అయిపోయేదే. అల్లాహ్ వద్ద ఉన్నదే అసలు మిగిలి వుండేది. సహనంతో వ్యవహరించే వారికి మేము వారి ప్రతిఫలాన్ని వారి ఉత్తమ కార్యాలకు అనుగుణంగా తప్పకుండా ఇస్తాము. పురుషుడైనా స్త్రీ అయినా సత్కర్మలు చేస్తే , విశ్వాసి అయినపక్షంలో మేము అతనిని ప్రపంచంలో పరిశుద్ధ జీవితం గడిపేలా చేస్తాము. (పరలోకంలో) అటువంటి వారికి వారి ఉత్తమ కార్యాలకు అనుగుణంగా ప్రతిఫలాలను ప్రసాదిస్తాము.

**16. అస్ నమ్ల్**98 - 100 మీరు ఖురాను పఠనం ప్రారంభించినప్పుడు శాపగ్రస్తుడైన షైతాను బారినుండి అల్లాహ్ శరణు కోరుకొనండి. విశ్వసించి తమ ప్రభువును నమ్ముకున్న వారిపై వాడి అధికారం సాగదు. వాడిని తమ సంరక్షకుడుగా చేసుకుని వాడి మోసానికి గురిఅయి షిర్క్ చేసేవారిపైనే వాడి అధికారం సాగుతుంది.

**16. అస్ నమ్ల్** 101 - 102 మేము ఒక ఆయత్ స్థానంలో మరొక ఆయత్ను అవతరింప జేసినప్పుడు- దేనిని అవతరింపజెయ్యాలో అల్లాహ్ కు బాగా తెలుసు - నీవు స్వయంగా ఈ ఖురానును కల్పించి వ్రాస్తున్నావు అని వారు అంటారు. అసలు విషయం ఏమిటంటే వారిలో , చాలామందికి యథార్థం ఏమిటో తెలియదు. వారితో ఇలా

అను:  దీనిని పరిశుద్ధాత్మ ఉన్నది ఉన్నట్లుగా నా ప్రభువు తరఫు నుండి క్రమక్రమంగా అవతరింపజేశాడు , విశ్వాసుల విశ్వా సాన్ని పటిష్ఠం చేసేటందుకూ , జీవితానికి సంబంధించిన వ్యవహారాలలో విధేయులకు సరిjైన మార్గం చూపేటందుకూ, వారికి సాఫల్యం, సౌభాగ్యాల శుభవార్తను ఇచ్చేటందుకూ.

**16. అస్ నహ్ల్** 103 - 105 ''ఇతనికి ఒకానొక మనిషి నేర్పుతున్నాడు '' అని వారు నిన్ను గురించి అంటున్న విషయం మాకు తెలుసు. వాస్తవానికి , వారు సూచిస్తున్న మనిషి మాట్లాడే భాష అన్యదేశపు భాష. ఇదేమో స్పష్టమైన అరబ్బీ భాష. యథార్థమేమిటంటే , అల్లాహ్ ఆయతులను విశ్వసించని వారికి అల్లాహ్ ఎన్నడూ సరిjైన విషయం వరకు చేరుకునే భాగ్యాన్ని కలుగజెయ్యడు. అటువంటి వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది. అబద్ధాలను దైవప్రవక్త కల్పించడు , అల్లాహ్ ఆయతులను విశ్వసించనివారే అబద్ధాలను కల్పిస్తున్నారు. అసలు వారే అసత్యవాదులు.

**16. అస్ నహ్ల్** 106 - 111 ఎవరైనా విశ్వసించిన తరువాత బలవంతం చెయ్యబడటం వల్ల అవిశ్వాసిగా మారినపక్షంలో, అప్పుడు అతని హృదయం విశ్వాసం పట్ల తృప్తితో ఉంటే , (అది వేరే విషయం). కాని ఎవరైనా హృదయపూర్వకంగా అవిశ్వాసానికి పాల్పడితే అతనిపై అల్లాహ్ ఆగ్రహం పడుతుంది. అటువంటి వారందరికీ తీవ్రమైన శిక్ష పడుతుంది. ఎందుకంటే, వారు పరలోకానికి బదులుగా ప్రాపంచిక జీవితాన్ని కోరుకున్నారు. అల్లాహ్ తన అనుగ్రహాన్ని తిరస్కరించేవారికి మోక్షమార్గం చూపడు. ఇది ఆయన విధానం. వారి హృదయాలకూ , వారి చెవులకూ, వారి కళ్ళకూ అల్లాహ్ ముద్రవేశాడు. వారు అశ్రద్ధలో మునిగిపోయారు. అందుచేత వారు పరలోకంలో తప్పక నష్టానికి గురిఅవుతారు. దీనికి భిన్నంగా (విశ్వసించిన కారణంగా) బాధలకు గురి చెయ్యబడినప్పుడు ఇల్లూ వాకిలీ విడిచిపెట్టినవారూ , వలసపోయినవారూ దైవమార్గంలో కష్టాలను భరించినవారూ సహనంతో వ్యవహరించినవారూ- వారికొరకు నీ ప్రభువు నిశ్చయంగా క్షమించేవాడుగా కరుణించేవాడుగా ఉంటాడు. ప్రతి ప్రాణీ తనను తాను మాత్రమే రక్షించుకునే ఆలోచనలో మునిగి ఉండేరోజున, ప్రతి ఒక్కనికీ తాను చేసిన దానికి ప్రతిఫలం పూర్తిగా ఇవ్వబడేరోజున , ఎవరికీ ఏమాత్రమూ అన్యాయం జరగనిరోజున (వారందరి విషయంలో తీర్పు జరుగుతుంది).

**16. అస్ నహ్ల్** 112 - 113 అల్లాహ్ ఒక జనపదానికి సంబంధించిన ఉదాహరణ ఇస్తున్నాడు: ఆ జనపదం శాంతిమయమూ సంతృప్తికరమూ అయిన జీవితాన్ని గడుపుతూ ఉండేది. ప్రతి వైపునుండీ దానికి ఆహారం పుష్కలంగా చేరుతూ ఉండేది. అప్పుడు అది అల్లాహ్ కానుకలకు కృతఘ్నత చూపటం ప్రారంభిం చింది. అప్పుడు అల్లాహ్ దాని పౌరులకు వారి అకృత్యాల రుచిని ఇలా చూపాడు: ఆకలీ భయమూ అనే ఆపదలు వారిని చుట్టుముట్టాయి. వారివద్దకు వారి జాతినుండే ఒక ప్రవక్త వచ్చాడు. కాని వారు ఆయనను తిరస్కరించారు. చివరకు వారు పూర్తిగా దుర్మార్గులై పోయినప్పుడు వారిని శిక్ష పట్టుకున్నది.

**16. అస్ నహ్ల్** 114 - 117 కనుక ప్రజలారా! అల్లాహ్ మీకు ప్రసాదించిన ధర్మసమ్మత మైనటువంటి , పరిశుద్ధమైనటువంటి ఆహారాన్ని తినండి , అల్లాహ్ చేసిన మేలునకు కృతజ్ఞతలు తెలుపండి , నిజంగా మీరు ఆయననే ఆరాధించేవారు అయితే. అల్లాహ్ మీకు నిషిద్ధం చేసినవి ఇవి: దానంతట అది చచ్చిన పశువు , రక్తము, పందిమాంసము, అల్లాహ్ తప్ప ఇతరుల పేరు ఉచ్చరిం పబడిన జంతువు. అయితే ఆకలికి తాళలేక గత్యంతరం లేని పరిస్థితిలో ఎవరైనా వాటిని తింటే , అతడు దైవశాసనాన్ని ఉల్లంఘించే ఉద్దేశ్యం కూడా కలిగి ఉండకపోయినట్లయితే, లేదా అవసరానికి మించి తినకుండా ఉన్నట్లయితే- అప్పుడు నిశ్చయంగా అల్లాహ్ క్షమిస్తాడు, కరుణిస్తాడు. ఈ వస్తువు ధర్మసమ్మతం అనీ , ఆ వస్తువు నిషిద్ధం అనీ మీ నాలుకలు అబద్ధపు నిర్ణయాలను జారీ చేస్తున్నాయి. ఇటువంటి నిర్ణయాలను తీసుకొని అల్లాహ్ కు అబద్ధాన్ని ఆపాదించకండి. అల్లాహ్ కు అబద్ధాన్ని ఆపాదించేవారు ఎంత మాత్రం సాఫల్యం పొందలేరు. ప్రాపంచిక సుఖాలు మూడునాళ్ళ ముచ్చటే. చివరకు వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది.

**16. అస్ నహ్ల్** 118 - 124 ఇంతకు పూర్వం మేము నీతో ప్రస్తావించిన వస్తువులను ప్రత్యే కంగా యూదులకు నిషిద్ధం చేశాము. ఇలా వారికి అన్యాయం చేసినది మేము కాదు. వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు. అయితే, అజ్ఞానం వల్ల చెడుపని చేసి తరువాత పశ్చాత్తాపపడి తమ ప్రవర్తనను సంస్కరించుకున్నవారిని నీ ప్రభువు నిశ్చయంగా పశ్చాత్తాపం , సంస్కరణల తరువాత క్షమిస్తాడు , కనికరిస్తాడు. నిజానికి ఇబ్రాహీమ్ తనకు తానే ఒక సంఘం. అల్లాహ్ కు పరమ విధేయుడు. ఆయన యందే మనస్సు నిలిపిన వాడు. అతను ఎన్నడూ ముష్రిక్కుగా ఉండలేదు. అల్లాహ్ అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉండేవాడు. అల్లాహ్ అతనిని ఎన్నుకున్నాడు. అతనికి ఋజుమార్గాన్ని చూపాడు. ప్రపంచంలో అతనికి మేలును ప్రసాదించాడు. పరలోకంలో అతను నిశ్చయంగా సజ్జనులలో ఒకడుగా ఉంటాడు. తరువాత మేము ‘‘ఏకాగ్ర చిత్తుడపై ఇబ్రాహీమ్ విధానాన్ని అనుసరించు - అతను ముష్రిక్కులలోని వాడు కాడు ’’ అనే వహీని నీ వద్దకు పంపాము. ఇక సబ్బత్ విషయం , దానికి సంబంధించిన ఆదేశాలతో విభేదించిన వారిపై మేము దానిని విధించాము. వారు విభేదిస్తూ ఉండిన అన్ని విషయాలను గురించి నిశ్చయంగా నీ ప్రభువు ప్రళయం నాడు తీర్పు చేస్తాడు.

**16. అస్ నహ్ల్** 125 - 128 ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు , వివేకంతో చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమోత్తమమైన రీతిలో వాదించు. నీ ప్రభువుకే బాగా తెలుసు , ఆయన మార్గం నుండి తప్పిపోయిన వాడు ఎవడో, ఋజుమార్గంలో ఉన్నవాడు ఎవడో. ఒకవేళ మీరు ప్రతీకారం చేస్తే కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతీకారం చెయ్యండి. కాని మీరు సహనం చూపితే, అది నిశ్చయంగా సహనం చూపేవారికే మంచిది. ప్రవక్తా! సహనంతో పనిచేస్తూ పో - నీకు ఈ సహన భాగ్యం అల్లాహ్ అనుగ్రహం వల్లనే కలిగింది- వారి చేష్టలకు వగవకు.

వారి పన్నాగాలకు మనస్సులో ఖేదపడకు. భయ భక్తులతో పని చేస్తూ ఉదాత్తవైఖరి కలిగివుండే వారితో అల్లాహ్ ఉంటాడు.

## 17. బనీ ఇస్రాయీల్

ఆయతులు : 111 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**17. బనీ ఇస్రాయీల్** 1 కొన్ని నిదర్శనాలను చూపటానికి తన దాసుణ్ణి ఒక రాత్రి మస్జిదె హరామ్ నుండి , దూరంగా ఉన్న మసీదు వద్దకు తీసుకుపోయిన ఆయన పరిశుద్ధుడు. ఆ మసీదు పరిసరాలను ఆయన శుభవంతం చేశాడు. నిజానికి ఆయనే అన్నీ వినేవాడూ, అన్నీ చూసేవాడూను.

**17. బనీ ఇస్రాయీల్** 2 - 8 మేము ఇంతకుపూర్వం మూసాకు గ్రంథాన్ని ఇచ్చాము. దానిని ఇస్రాయీల్ సంతతికి మార్గదర్శక సాధనంగా చేశాము, మీరు నన్ను తప్ప మరెవరినీ సంరక్షకుడుగా చేసుకోవద్దు అనే ఆజ్ఞతో. మేము నూహ్ ప్రవక్తతో పాటు ఓడలోకి ఎక్కించిన వారి సంతానమే మీరు. నూహ్ ప్రవక్త ఒక కృతజ్ఞుడైన దాసుడు. మేము మా గ్రంథంలో ఇస్రాయీల్ సంతతిని ''మీరు భువిలో రెండుసార్లు గొప్ప సంక్షోభాన్ని సృష్టిస్తారు. దురహంకారాన్ని ప్రదర్శిస్తారు'' అనే విషయాన్ని గురించికూడా హెచ్చరించాము. చివరకు వారిలో మొదటిసారి దురహంకారం వ్యక్తమైనప్పుడు, ఇస్రాయీలు సంతతి ప్రజలారా! మిమ్మల్ని ఎదుర్కోవటానికి మేము మహాబలాఢ్యులైన మా దాసులను లేపాము. వారు మీ దేశంలో చొరబడి అన్ని వైపులా వ్యాపించారు. ఇదొక వాగ్దానం. అది తప్పనిసరిగా నెరవేర్చబడవలసి ఉండిరది. దాని తరువాత మేము మీకు వారిపై ప్రాబల్యం వహించే అవకాశాన్ని కలిగించాము. సంపదతోనూ సంతానంతోనూ మీకు సహాయపడ్డాము. మీ సంఖ్యాబలాన్ని ఇదివరకటికంటె పెంచాము. చూడండి, మీరు మంచిని చేస్తే అది మీకే మీరు మంచిని చేసుకున్నట్లు. చెడును చేస్తే అది మీకు మీరే చెడును చేసు కున్నట్లు. రెండో వాగ్దానం నెరవేర్చవలసిన సమయం ఆసన్నమైనప్పుడు మేము ఇతర శత్రువులను మీపైకి పంపాము , వారు మీ ముఖాలను వికృతం చెయ్యటానికి , మసీదు (బైతుల్ మఖ్దిస్)లోకి పూర్వం శత్రువులు చొరబడిన విధంగా చొరబడటానికి , వారి చేతికందిన ప్రతిదానినీ ధ్వంసం చేసెయ్యటానికి - బహుశా మీ ప్రభువు మీపై ఇప్పుడు కరుణ చూపవచ్చు. కాని ఒకవేళ మీరు మీ పాతవైఖరిని తిరిగి అవలంబిస్తే మేము కూడా మా శిక్షను తిరిగి విధిస్తాము. అనుగ్రహాలను పొంది కృతఘ్నులైన ప్రజలకు మేము నరకాన్ని కారాగారంగా చేసివుంచాము.

**17. బనీ ఇస్రాయీల్** 9 - 10 యథార్థం ఏమిటంటే ఈ ఖురాను పూర్తి సరి j◌ై◌ు◌న సవ్యమైన మార్గాన్ని చూపుతోంది. తనను విశ్వసించి మంచి పనులు చేసేవారికి గొప్ప ప్రతిఫలం ఉంది అనే శుభవార్తను అందజేస్తోంది. పరలోకాన్ని విశ్వసించని వారికి మేము వ్యధాభరితమైన శిక్షను సిద్ధపరచి ఉంచాము అనే వార్తను వినిపిస్తోంది.

**17. బనీ ఇస్రాయీల్** 11 మానవుడు మేలును ఎలా అర్థించాలో కీడును అలా అర్థిస్తాడు. మానవుడు నిజంగానే తొందరపాటు కలవాడు, ఓర్పులేనివాడు.

**17. బనీ ఇస్రాయీల్** 12 చూడండి , మేము రాత్రినీ పగలునూ రెండు సూచనలుగా చేశాము. రాత్రి సూచనను మేము కాంతిహీనం చేశాము , పగటి సూచనను కాంతి మంతం చేశాము , మీరు మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషించగలగటానికి, ఇంకా నెలల , సంవత్సరాల లెక్కను తెలుసుకోగలగటానికి. ఇదేవిధంగా మేము ప్రతి విషయాన్నీ వేరువేరుగా స్పష్టపరచి ఉంచాము.

**17. బనీ ఇస్రాయీల్** 13 - 14 ప్రతి మనిషి జాతకాన్ని మేము అతని మెడకే వ్రేలాడగట్టాము. ప్రళయం నాడు మేము ఒక పుస్తకాన్ని అతని కొరకు బయటికి తీస్తాము. అతడు దాన్ని ఒక తెరచిన గ్రంథం వంటిదని తెలుసుకుంటాడు - చదువు నీ కర్మపత్రాన్ని, ఈనాడు నీ లెక్క కట్టటానికి స్వయంగా నీవే సరిపోతావు.

**17. బనీ ఇస్రాయీల్** 15 ఋజుమార్గాన్ని అవలంబించేవాని ఋజువర్తనం స్వయంగా వానికే ప్రయోజనకరం. మార్గం తప్పినవాడు తన మార్గభ్రష్టత్వం యొక్క దుష్ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. బరువు మోసేవాడెవడూ ఇతరుల బరువును మోయడు. (ప్రజలకు సత్యాసత్యాల భేదాన్ని తెలియజెప్పే) ఒక సందేశహరుణ్ణి పంపనంత వరకు మేము ఎవరినీ శిక్షించము.

**17. బనీ ఇస్రాయీల్** 16 - 17 మేము ఒక పట్టణాన్ని నాశనం చెయ్యదలచుకున్నప్పుడు, అందలి స్థితిమంతులకు మొదట ఒక ఆజ్ఞను పంపుతాము. వారు ఆ ఆజ్ఞ విషయంలో అవిధేయతకు పాల్పడతారు. అప్పుడు శిక్షానిర్ణయానికి ఆ పట్టణం అర్హమవు తుంది. మేము దానిని సర్వనాశనం చేసివేస్తాము. చూడు , నూహ్ తరువాత మా ఆజ్ఞ ప్రకారం నాశనమైన తరాలు ఎన్ని ఉన్నాయో. నీ ప్రభువునకు తన దాసుల పాపాలను గురించి పూర్తిగా తెలుసు. ఆయన సర్వాన్నీ చూస్తూ ఉన్నాడు.

**17. బనీ ఇస్రాయీల్** 18 - 21 (ఈ లోకంలో) తక్షణ లాభాలను కోరుకునే వాడికి ఇక్కడే వాటిని మేము ఇచ్చివేస్తాము, ఎవరికి ఎంత ఇవ్వదలచుకుంటామో అంత మేరకు. తరువాత అతని జాతకంలో నరకం వ్రాసేస్తాము. అందులో అతడు దహింప బడతాడు , దూషింపబడినవాడై కారుణ్యానికి దూరమైనవాడై. పరలోకాన్ని కోరుకుని దానికై కృషి చెయ్యవలసినవిధంగా కృషిచేసేవాడు గనక అయితే పైగా అతడు విశ్వాసి కూడా అయివుంటే -

అటువంటి ప్రతి వ్యక్తి కృషి గుర్తింపబడుతుంది. వీరికీ వారికీ , ఉభయపక్షాల వారికీ మేము (ప్రపంచంలో) జీవనసామగ్రిని ఇస్తూ పోతున్నాము. ఇది నీ ప్రభువు ప్రసాదించినది. నీ ప్రభువు ప్రసాదించినదానిని ఆపగలిగే వాడెవడూ లేడు. కాని చూడండి , ప్రపంచంలోనే మేము ఒక వర్గానికి మరొక వర్గంపై ఎటువంటి ఆధిక్యాన్ని ప్రసాదించామో. పరలోకంలో ఆ వర్గం స్థానాలు మరింత గొప్పగా ఉంటాయి. దాని ఆధిక్యం మరింత పెరుగుతుంది.

**17. బనీ ఇస్రాయీల్** 22 నీవు అల్లాహ్తోపాటు మరొకణ్ణి ఆరాధ్యుడుగా చేసుకోకు. అలా చేసుకుంటే నిందలపాలవుతావు. స్నేహితుడూ, సహాయకుడూ ఎవడూ లేనివాడవై పోతావు.

**17. బనీ ఇస్రాయీల్** 23 - 37 నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు: మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహ రించండి. ఒకవేళ మీవద్ద వారిలో ఒకరు గాని ఇద్దరు గాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా ''ఛీ'' అని కూడా అనకండి.వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ , దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి: ''ప్రభూ! వారిపై కరుణ జూపు, బాల్యంలో వారునన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు.'' మీ హృదయాలలో ఉన్నది ఏమిటో మీ ప్రభువు నకు బాగా తెలుసు. మీరు గనక మంచివారుగా నడుచుకుంటే - తమ తప్పులను గ్రహించి దాస్యవైఖరి వైపునకు మరలివచ్చే ఇలాంటి వారందరినీ ఆయన మన్నిస్తాడు. బంధువుల పట్ల మీ విధులను నిర్వహించండి. పేదవారిపట్ల , బాటసారులపట్ల, మీ విధులను నిర్వర్తించండి. వృథా ఖర్చు చెయ్యకండి. వృథా ఖర్చు చేసేవారు షైతాను సోదరులు. షైతాను తన ప్రభువునకు కృతఘ్నుడు. మీరు ఆశించే అల్లాహ్ కారుణ్యాన్ని మీరు ఇంకా అన్వేషిస్తూ ఉన్నందువల్ల, మీరు వారిని (అంటే అవసరాలు తీరని బంధువులు, లేమికి గురిఅయినవారు,బాటసారులు) తప్పించు కోవలసి ఉంటే, వారికి మృదువుగా సమాధానం చెప్పండి. మీ చేతిని మెడకు బంధించీ ఉంచకండి, దానిని పూర్తిగా స్వేచ్ఛగానూ వదలి పెట్టకండి. అలాచేస్తే నిందల పాలవుతారు, దిక్కులేని వారవుతారు. నీ ప్రభువు తన ఇష్టప్రకారం కొందరి ఉపాధిని సమృద్ధం చేస్తాడు. కొందరి ఉపాధిని పరిమితం చేస్తాడు. ఆయన తన దాసుల స్థితిని బాగా ఎరుగును. ఆయన వారిని పరికిస్తున్నాడు. పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తాము , మీకూ ఇస్తాము. వాస్తవానికి వారిని హత్య చేయటం ఒక పెద్ద నేరం. వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి. అది అతిదుష్ట కార్యం. బహుచెడ్డ మార్గం. ఏ ప్రాణాన్నీ హత మార్చకండి న్యాయంగా తప్ప. దానిని హత మార్చడాన్ని అల్లాహ్ నిషేధించాడు. అన్యాయంగా హత్య చేయబడిన మనిషి వారసునికి మేము ''ఖిసాస్''ను కోరే హక్కును ప్రసాదించాము. కాని ఆ వారసుడు హత్యలో హద్దులు మీరకుండా ఉండాలి. అప్పుడు అతనికి సహాయం చెయ్యటం జరుగుతుంది. సక్రమమైన పద్ధతిలో తప్ప అనాథుని సొమ్ము జోలికి పోకండి , అతడు యుక్త వయస్సునకు చేరేవరకు. చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. నిస్సందేహంగా వాగ్దానం విషయంలో మీరు సమాధానం చెప్పవలసి ఉంటుంది. కొలపాత్రతో ఇస్తే, పూర్తిగా నింపి ఇవ్వండి, తూచినట్లయితే సరైన తరాజుతో తూచండి. ఇది మంచి పద్ధతి.

పర్యవసానాన్ని బట్టి కూడా ఇదే ఉత్తమం. మీకు తెలియని విషయం వెంటపడకండి. నిశ్చయంగా కళ్ళూ , చెవులూ, మనస్సూ అన్నింటి విషయంలోనూ విచారణ జరుగుతుంది. భూమిపై విర్రవీగుతూ నడవకండి. మీరు భూమిని చీల్చనూ లేరు, పర్వతాల ఎత్తుకు చేరనూలేరు.

**17. బనీ ఇస్రాయీల్** 38 - 39 ఈ ఆజ్ఞలలో ఏ ఒక్కదానిని అతిక్రమించినా అది నీ ప్రభువునకు అనిష్టమైనది. ఇవి వివేకంతో నిండివున్న విషయాలు. వాటిని నీ ప్రభువు నీకు వహీద్వారా తెలియజేశాడు...

**17. బనీ ఇస్రాయీల్** 39 - 40 ... చూడు! అల్లాహ్తో పాటు మరొకరిని ఆరాధ్యుడుగా చేసుకోకు. అలా చేస్తే నిందల పాలవుతావు. ప్రతి మేలుకూ దూరమవుతావు. నరకంలో పడవెయ్యబడతావు.- మీ ప్రభువు మీకు కొడుకులను ప్రసాదించాడా, తాను మాత్రం దైవదూతలను తనకు కూతుళ్ళుగా చేసుకున్నాడా ? ఎంత విచిత్రం! మీరు చెప్పే ఈ విషయం పరమ అబద్ధం.

**17. బనీ ఇస్రాయీల్** 41 - 44 మేము ఈ ఖురానులో ప్రజలకు రకరకాలుగా బోధించాము. వారు స్పృహలోకి రావాలని. కాని వారు సత్యానికి మరింత దూరంగానే పారిపోతున్నారు. ప్రవక్తా! వారితో ఇలా అను: ఒకవేళ అల్లాహ్తో పాటు , వారు అనేవిధంగా ఇతర దేవుళ్ళు కూడా ఉంటే వారు సింహాసనాధీశుని స్థానానికి చేరే ప్రయత్నాన్ని తప్పకుండా చేస్తారు. ఆయన పరిశుద్ధుడు. వారు చెప్పే మాటలకు ఎంతో అతీతుడు , ఎంతో ఉన్నతుడు. ఆయన పరిశుద్ధతను సప్తాకాశాలూ , భూమీ, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ కొనియాడు తున్నాయి. ఆయన స్తోత్రంతో పాటు ఆయన పరిశుద్ధతను కొనియాడనటు వంటిది ఏదీ లేదు. కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు. యథార్థానికి ఆయన అత్యంత సౌమ్య మనస్కుడు మన్నించేవాడూను.

**17. బనీ ఇస్రాయీల్** 45 - 48 నీవు ఖురానును పఠించేటప్పుడు మేము నీకూ, పరలోకాన్ని విశ్వసించని వారికీ మధ్య ఒక తెరను అడ్డుగా నిలుపుతాము. వారి హృదయా లకు గలేబులు తొడుగుతాము. ఇక వారు ఏమీ అర్థం చేసుకోలేరు. వారి చెవులను మొద్దుబారజేస్తాము. నీవు ఖురాను పఠిస్తూ నీ ఏకైక ప్రభువును గురించి మాత్రమే ప్రస్తావించినప్పుడు, వారు అసహ్యించుకుంటూ ముఖాలను ప్రక్కకు త్రిప్పుకుంటారు. నీ మాటను చెవియొగ్గి విన్నప్పుడు అసలు వారు ఏమి వింటారో , కూర్చుండి పరస్పరం గుసగుసలాడుకున్నప్పుడు ఏమి చెప్పుకుంటారో మాకు తెలుసు. ఈ దుర్మార్గులు పరస్పరం ఇలా చెప్పు కుంటారు: ''మీరు అనుసరిస్తున్న ఈ మనిషి మంత్రప్రభావానికి గురిఅయిన వాడు.'' చూడు, వారు ఎటువంటి మాటలను నిన్ను గురించి కల్పిస్తున్నారో! వారు మార్గం తప్పారు. కాబట్టి వారికి సరైన మార్గం దొరకదు.

**17. బనీ ఇస్రాయీల్** 49 - 52 వారు ఇలా అంటారు: ''మేము ఎముకలుగా , మట్టిగా మారిపోయి నప్పుడు , సరికొత్తగా సృష్టింపబడి లేపబడతామా?'' - వారితో ఇలా అను: ''మీరు రాయిగాగాని ఇనుముగాగాని మారిపోయినా

లేదా తిరిగి బ్రతికింపబడి లేపబడటానికి అసాధ్యమైనదని మీరు భావిస్తున్నటువంటి వాటికంటే కూడా ఎక్కువ కఠినమైనటువంటి వస్తువుగా మారిపోయినాసరే (మీరు లేచి తీరుతారు).'' వారు తప్పకుండా ఇలా అడుగుతారు: ''మమ్మల్ని మళ్ళీ బ్రతికించి లేపగలవాడు ఎవడు ?'' సమాధానంగా ఇలా అను: ''మిమ్మల్ని మొదటిసారి పుట్టించినవాడే.'' వారు తలలు ఊపుతూ ''సరే, ఇది ఎప్పుడు జరుగుతుంది ?'' అని అడుగుతారు. నీవు ఇలా చెప్పు: ''ఆ సమయం దగ్గరలోనే ఉందన్నా ఆశ్చర్యపడనక్కరలేదు. ఆనాడు ఆయన మిమ్మల్ని పిలుస్తాడు. మీరు ఆయనను స్తుతిస్తూ ఆయన పిలుపునకు సమాధానంగా బయటకు వస్తారు. '' అప్పుడు మీరు ''మేము కేవలం కొంతసేపు మాత్రమే ఈ స్థితిలో పడివున్నాము'' అని అనుకుంటారు.

**17. బనీ ఇస్రాయీల్** 53 - 54 ప్రవక్తా! నా దాసుల (అంటే విశ్వాసులైన దాసుల)కు , వారు తమ నోట అత్యుత్తమమైన మాటనే పలుకుతూ ఉండాలి అని చెప్పు. అసలు మానవుల మధ్య కలహాన్ని సృష్టించటానికి ప్రయత్నం చేసేవాడు షైతానే. నిజానికి షైతాను మానవుడికి బహిరంగ శత్రువు. మీ ప్రభువు మీ పరిస్థితిని బాగా ఎరుగును. ఆయన తన ఇష్టప్రకారం మిమ్మల్ని కరుణిస్తాడు. తన ఇష్టం ప్రకారం మిమ్మల్ని శిక్షిస్తాడు. ప్రవక్తా! మేము నిన్ను ప్రజలకు సంరక్షకుడుగా నియమించి పంపలేదు.

**17. బనీ ఇస్రాయీల్** 55 భూమ్యాకాశాలలోని ప్రాణికోటిని నీ ప్రభువు బాగా ఎరుగును. మేము కొందరు ప్రవక్తలకు మరి కొందరు ప్రవక్తల కంటే ఉన్నత స్థానాలను ఇచ్చాము. మేమే దావూదుకు జబూర్ గ్రంథాన్ని ఇచ్చాము.

**17. బనీ ఇస్రాయీల్** 56 - 57 వారితో ఇలా అను: ''మీరు దేవుణ్ణి కాదని (మీ పనులు నెరవేర్చే వారుగా) భావించి ఆరాధించే వారిని పిలిచి చూడండి. వారు మీ ఏ ఆపదనూ మరల్చనూలేరు , మార్చనూ లేరు. ఈ ప్రజలు మొరపెట్టుకుంటున్న వారే స్వయంగా తమ ప్రభువు సాన్నిధ్యాన్ని పొందటానికి మార్గాన్ని వెతుకుతున్నారు. ఒకరితో ఒకరు పోటీపడుతున్నారు. వారు , ఆయన కారుణ్యాన్ని ఆశిస్తున్నారు. ఆయన శిక్షకు భయపడుతున్నారు. నిజానికి నీ ప్రభువు శిక్షే భయపడదగినటు వంటిది.

**17. బనీ ఇస్రాయీల్** 58 ప్రళయానికి ముందు మేము నాశనం చెయ్యని లేక కఠిన శిక్షకు గురి చెయ్యని పట్టణమంటూ ఏదీ ఉండదు. ఈ విషయం దైవగ్రంథంలో వ్రాయబడి ఉన్నది.

**17. బనీ ఇస్రాయీల్** 59 - 60 నిదర్శనాలను పంపకుండా మమ్మల్ని ఏదీ ఆపలేదు, వారికి పూర్వం ఉన్న ప్రజలు వాటిని తిరస్కరించారు అనే విషయం తప్ప. (ఉదాహ రణకు) సమూదుకు మేము ప్రత్యక్ష నిదర్శనంగా ఒక ఆడ ఒంటెను తెచ్చి ఇచ్చాము. వారు దానిపట్ల క్రూరంగా ప్రవర్తించారు. మేము నిదర్శనాలను పంపుతున్నది ప్రజలు వాటిని చూసి భయపడాలనే. జ్ఞాపకం తెచ్చుకో , ప్రవక్తా! నీ ప్రభువు ఈ ప్రజలను పరివేష్టించి ఉన్నాడని మేము నీకు ఇదివరకే చెప్పివున్నాము. మేము నీకు ఇప్పుడు చూపించిన దానినీ , ఖురానులో శపించ బడిన వృక్షాన్నీ

మేము వారికి ఒక పరీక్షగా చేశాము. మేము వారికి హెచ్చరికపై హెచ్చరిక చేస్తూవున్నాము. కాని ప్రతి హెచ్చరిక వారి మూర్ఖత్వాన్ని పెంచుతూనే ఉన్నది.

**17. బనీ ఇస్రాయీల్** 61 - 65 జ్ఞాపకం తెచ్చుకో: మేము దైవదూతలతో ఆదమ్‌కు సాష్టాంగపడండి అని చెప్పాము. అప్పుడు అంతా సాష్టాంగపడ్డారు. కాని ఇబ్లీసు అలా చెయ్య లేదు. వాడు ''ఏమిటి నీవు మట్టితో చేసినవాడికి నేను సాష్టాంగపడాలా?'' అని అన్నాడు. మళ్ళీ వాడు ఇలా అన్నాడు: ''కొంచెం వాణ్ణి చూడు. వాడు తగినవాడనా, నీవు వాడికి నాపై ఆధిక్యం ఇచ్చావు ? నీవు గనక నాకు ప్రళయదినం వరకు వ్యవధినిస్తే నేను వాడి మొత్తం వంశాన్ని సమూలంగా నాశనం చేస్తాను. కేవలం కొందరు మాత్రమే నానుండి తప్పించుకోగలుగు తారు. '' అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ''సరే, పో. వారిలో నిన్ను అనుసరించే వారందరికీ నీతోపాటు నరకమే పరిపూర్ణమైన ప్రతిఫలంగా లభిస్తుంది. నీవు ఎవరెవరిని నీ సందేశంతో భ్రష్టులుగా చెయ్యగలవో చెయ్యి. వారిపైకి నీ ఆశ్వికదళాన్ని , నీ పదాతిదళాన్ని పంపు. ధనంలోనూ, సంతానంలోనూ వారితో పాటు భాగాన్ని కలిగివుండు. వారిని వాగ్దానాల వలలో బంధించు - షైతాను వాగ్దానాలు ఒక మోసం తప్ప మరేమీ కావు - నిశ్చయంగా నా దాసులపై నీకు ఏ అధికారమూ లభించదు. నమ్ముకోవటానికి నీ ప్రభువే చాలు.''

**17. బనీ ఇస్రాయీల్** 66 - 72 సముద్రంలో మీ ఓడలను నడిపేవాడే మీ (అసలు) ప్రభువు , తద్వారా మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషిస్తారు. వాస్తవానికి ఆయన మీపట్ల ఎంతో కనికరం కలవాడు. సముద్రంలో మీకేదన్నా ఆపద కలిగినప్పుడు ఆయన ఒక్కడు తప్ప మీరు పిలిచేవారంతా మటుమాయమైపోతారు. కాని ఆయన మిమ్మల్ని రక్షించి నేలపైకి చేర్చినప్పుడు మీరు ఆయన నుండి ముఖం తిప్పుకుంటారు. మానవుడు నిజంగా చాలా కృతఘ్నుడు. సరే మీరు ఈ విషయాన్ని గురించి పూర్తిగా నిర్భయంగా ఉన్నారా , దేవుడు మిమ్మల్ని ఎన్నడూ సముద్రం వెలుపలే భూమిలోనికి అణగదొక్కడనీ లేదా మీపైకి రాళ్ళను కురిపించే తుఫానును పంపడనీ మీరు నిర్భయంగా ఉన్నారా ? అప్పుడు మిమ్మల్ని రక్షించే ఏ సహాయకుణ్ణీ మీరు పొందలేరు. దేవుడు మళ్ళీ ఎప్పుడైనా మిమ్మల్ని సముద్రంలోనికి తీసుకుపోతాడనీ , మీ కృతఘ్నతకు ఫలితంగా మీపైకి తీవ్రమైన తుఫాను గాలులను పంపి మిమ్మల్ని ముంచివేస్తాడనీ , మీ ఈ ముగింపును గురించి ఆయనను అడిగే వాడెవ్వడూ మీకు లభించడనీ మీరు భయపడటం లేదా ?-మేము ఆదమ్ సంతతికి పెద్దరికాన్ని ప్రసాదిం చాము. వారికి నేలపై , నీటిలో నడిచే వాహనాలను ప్రసాదించాము. వారికి పరిశుద్ధమైన వస్తువులను ఆహారంగా ఇచ్చాము. మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము. ఇదంతా మా అనుగ్రహం. ఆరోజును గురించి ఆలోచించండి. అప్పుడు మేము ప్రతి మానవ వర్గాన్ని దాని నాయకునితో పాటు పిలుస్తాము. ఆ సమయంలో తమ కుడిచేతికి కర్మ పత్రం ఇవ్వబడినవారు , తాము చేసిన పనులను చదువుకుంటారు. వారికి రవ్వంత అన్యాయం కూడా జరగదు. ఈ ప్రపంచంలో అంధుడై మెలగేవాడు , పరలోకంలో కూడా అంధుడుగానే ఉంటాడు. అంతేకాదు మార్గాన్ని పొందటంలో అంధునికంటే కూడా అధికంగా విఫలుడౌతాడు.

**17. బనీ ఇస్రాయీల్** 73 - 75 ప్రవక్తా! ఈ ప్రజలు నిన్ను పరీక్షకు గురిచేసి మేము నీ వైపునకు పంపిన వహీ నుండి నిన్ను మరలించటానికి ప్రయత్నం చేయటంలో ఏ కొరతా చేయలేదు. నీవు మా పేరుతో నీ తరఫు నుండి ఏదైనా విషయాన్ని కల్పించాలని వారు ఇలా చేశారు. ఒకవేళ నీవు అలా కల్పించివుంటే వారు తప్పకుండా నిన్ను తమ మిత్రుడుగా చేసుకుని ఉండేవారు. మేము గనక నీకు మనోబలాన్ని ఇచ్చివుండకపోతే నీవు వారి వైపునకు కొంతైనా మొగ్గి ఉండేవాడవు అనేది అసంభవమేమీ కాదు. కాని ఒకవేళ నీవు అలా మొగ్గి వుంటే , మేము నీకు ప్రపంచంలో కూడా రెట్టింపు శిక్షను రుచిచూపించి ఉండేవారము. పరలోకంలో కూడా రెట్టింపు శిక్షే. మాకు వ్యతిరేకంగా నీవు ఏ సహాయకుడినీ పొందివుండేవాడవు కాదు.

**17. బనీ ఇస్రాయీల్** 76 వారు నీకు ఈ భూభాగంలో నిలువనీడ లేకుండా చెయ్యటానికీ నిన్ను ఇక్కడ నుండి వెళ్ళగొట్టటానికి పూనుకున్నారు. కాని ఒకవేళ వారు అలా చేస్తే నీ తరువాత వారు కూడా ఇక్కడ ఎంతోకాలం నిలువలేరు.

**17. బనీ ఇస్రాయీల్** 77 ఇది మా సనాతన సంప్రదాయం. దీనినే నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలందరి విషయంలోనూ అనుసరించాము. మా సంప్రదాయంలో నీవు ఏ మార్పునూ చూడలేవు.

**17. బనీ ఇస్రాయీల్** 78 - 79 నమాజును స్థాపించు. పొద్దు వాలినప్పటినుండి రాత్రి చీకటిపడే వరకు , ప్రాత్ణకాలంలో ఖుర్ఆన్ పారాయణం పట్ల ప్రత్యేక శ్రద్ధవహించు. ఎందుకంటే ప్రాత్ణకాలపు ఖుర్ఆన్ పారాయణం సాక్ష్యంగా ఉంటుంది. రాత్రిపూట ''తహజ్జుద్'' నమాజు చెయ్యి. ఇది నీకు అదనపు నమాజు. నీ ప్రభువు నిన్ను ప్రశంసనీయమైన ఉన్నత స్థానంలో ప్రతిష్ఠింపజేయటం అసంభవం ఏమీ కాదు.

**17. బనీ ఇస్రాయీల్** 80 ఇలా ప్రార్థించు: ప్రభూ! నీవు నన్ను ఎక్కడకు తీసుకొనివెళ్ళినా సత్యంతో తీసుకొని వెళ్ళు. ఎక్కడ నుండి తీసినా సత్యంతో తియ్యి. నీ తరఫు నుండి ఒక అధికారాన్ని నాకు సహాయంగా పంపించు.

**17. బనీ ఇస్రాయీల్** 81 ఇలా ప్రకటించు: ''సత్యం వచ్చేసింది. అసత్యం నశించింది. అసత్యం నశించక తప్పదు.''

**17. బనీ ఇస్రాయీల్** 82 - 84 మేము ఈ ఖురాను భాగాల అవతరణ క్రమంలో అవతరింప జేస్తున్నటువంటి ప్రతి భాగమూ విశ్వాసులకు స్వస్థత కారుణ్యమునూ , కాని దుర్మార్గులకు అది నష్టాన్ని తప్ప మరి దేనినీ పెంచదు. మానవుడు ఎలాంటి వాడంటే మేము అతన్ని అనుగ్రహించినప్పుడు విర్రవీగుతాడు. వెనక్కి మరలిపోతాడు. కొంచెం కష్టానికి గురిఅయితే చాలు, నిరాశపడిపోతాడు. ప్రవక్తా! ఈ ప్రజలతో ఇలా అను: ''ప్రతి ఒక్కడూ తన విధానాన్నే అనుసరిస్తు న్నాడు. ఇక ఋజుమార్గంలో ఎవడున్నాడో అనే విషయం నీ ప్రభువునకే బాగా తెలుసు.''

**17. బనీ ఇస్రాయీల్** 85 - 88 ఈ ప్రజలు నిన్ను ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారు. ఇలా అను: ''ఈ ఆత్మ నా ప్రభువు ఆజ్ఞానుసారం వస్తుంది. కాని మీకు ప్రసాదించబడిన జ్ఞానం బహుస్వల్పమైనది. '' ప్రవక్తా! మేము కోరితే, వహీద్వారా మేము నీకు ప్రసాదించిన దాన్నంతా నీనుండి లాక్కోగలము. తరువాత మాకు వ్యతిరేకంగా దానిని తిరిగి ఇప్పించగలిగే సహాయకుణ్ణి ఎవణ్ణీ నీవు పొందలేవు. నీకు లభించినదంతా నీ ప్రభువు కారుణ్యం వల్లనే లభించింది. వాస్తవం ఏమిటంటే నీపై ఆయనకు ఉన్న అనుగ్రహం చాలా గొప్పది. ఇలా అను: ''ఒకవేళ మానవులూ, జిన్నాతులూ, అందరూ కలసి ఈ ఖురాను వంటి దానిని దేనినయినా తీసుకువచ్చే ప్రయత్నం చేసినప్పటికీ తీసుకురాలేరు, వారందరూ ఒకరికొకరు సహాయులైనప్పటికినీ.''

**17. బనీ ఇస్రాయీల్** 89 - 93 మేము ఈ ఖురానులో ప్రజలకు రకరకాలుగా హిత బోధచేశాము. కాని చాలామంది ప్రజలు అవిశ్వాస స్థితిలోనే స్థిరంగా ఉండిపోయారు. వారు ఇలా అన్నారు: ''మేము నీ మాటను నమ్మము. నీవు భూమిని చీల్చి మా కోసం ఒక చెలమను పొంగింపచెయ్యాలి. ఖర్జూరపు చెట్లూ ద్రాక్షాలతలు కల తోట ఒకటి నీకోసం ఉద్భవించాలి. అందులో నీవు కాలువలను ప్రవహిం పజెయ్యాలి. నీవు ప్రకటిస్తున్న విధంగా ఆకాశాన్ని ముక్కలు ముక్కలుగా చేసి మాపై పడవెయ్యాలి. దేవుణ్ణీ , దైవదూతలనూ మా ఎదుటకు తీసుకు రావాలి. నీకోసం ఒక స్వర్ణగృహం తయారు కావాలి. నీవు ఆకాశాన్ని అధిరోహించాలి. అంతవరకు నీ మాటను మేము నమ్మము. అంతేకాదు, మేము చదవటానికి నీవు మాపై ఒక రచన అవతరించేటట్లు చేయనంతవరకు మేము నీ అధిరోహించటాన్ని కూడా నమ్మము. ప్రవక్తా! వారితో ఇలా అను: ''నా ప్రభువు! పరిశుద్ధుడు. నేను సందేశాన్ని తెచ్చే ఒక మానవమాత్రుడు తప్ప మరింకేమైనా అవుతానా?''

**17. బనీ ఇస్రాయీల్** 94 - 95 ప్రజల ముందుకు మార్గదర్శకత్వం వచ్చినప్పుడల్లా , దానిని విశ్వసిం చకుండా వారిని ఆపిన విషయం ''ఏమిటి, అల్లాహ్ మానవుణ్ణి ప్రవక్తగా చేసి పంపాడా ?'' అనే వారి పలుకు తప్ప మరేమీ కాదు. వారికి ఇలా చెప్పు: ''భువిలో దైవదూతలు నిశ్చింతగా తిరుగుతూ ఉండివుంటే , మేము తప్ప కుండా ఆకాశం నుండి దైవదూతనే వారికోసం ప్రవక్తగా పంపి ఉండేవారము.''

**17. బనీ ఇస్రాయీల్** 96 ప్రవక్తా! వారితో ఇలా అను: ''నాకూ మీకూ మధ్య కేవలం ఒక్క అల్లాహ్ సాక్ష్యమే సరిపోతుంది. ఎందుకంటే ఆయన తన దాసుల స్థితిని బాగా ఎరిగినవాడు. అన్నింటినీ చూస్తూ ఉన్నవాడు.''

**17. బనీ ఇస్రాయీల్** 97 - 99 అల్లాహ్ మార్గం చూపినవాడే సన్మార్గాన్ని పొందుతాడు. ఆయన మార్గం తప్పించినవారికి ఆయనను తప్ప, అండగా ఉండేవాణ్ణీ, సహాయపడే వాణ్ని ఎవణ్ణీ నీవు పొందలేవు. వారిని మేము ప్రళయంనాడు గుడ్డివారుగా , మూగవారుగా, చెవిటివారుగా చేసి బోర్లాపడవేసి లాక్కువస్తాము. వారి నివాసం నరకం. దాని మంట మందగించినప్పుడల్లా మేము దానిని మరింత మండిరప జేస్తాము. ఇది ప్రతిఫలం వారి

దుశ్చేష్టకు. వారు మా ఆయతులను తిరస్కరించి ఇలా అన్నారు: ‘‘మేము కేవలం ఎముకలుగా , దుమ్ముగా, ధూళిగా మారి పోయిన తరువాత సరికొత్తగా మమ్మల్ని పుట్టించి లేపి నిలబెట్టడం జరుగు తుందా ?’’ భూమినీ ఆకాశాలనీ సృష్టించిన దేవుడు అటువంటివారిని పుట్టించే శక్తిని కూడా తప్పకుండా కలిగివుంటాడనే విషయం వారికి తోచనే లేదా? ఆయన వారిని తిరిగిలేపటానికి ఒక సమయాన్ని నిర్ణయించి ఉంచాడు. అది రావటం తథ్యం. కాని దుర్మార్గులు మొండిగా దానిని తిరస్కరించటానికే పూనుకున్నారు.

**17. బనీ ఇస్రాయీల్** 100 ప్రవక్తా! వారితో ఇలా అను: ఒకవేళ నా ప్రభువు కారుణ్య నిధులు మీ అధీనంలో ఉండి ఉన్నట్లయితే అవి ఖర్చయిపోతాయనే భయంవల్ల , వాటిని మీరు కదపకుండా ఉంచేవారు. యథార్థానికి మానవుడు ఎంతో సంకుచిత హృదయుడు.

**17. బనీ ఇస్రాయీల్** 101 - 104 మేము మూసాకు ప్రస్ఫుటంగా కనిపించే తొమ్మిది నిదర్శనాలను ప్రసాదించాము. ఇప్పుడు నీవే స్వయంగా ఇస్రాయీలు సంతతిని అడుగు. మూసా వారివద్దకు వచ్చినప్పుడు ఫిరౌను రాజు అన్నది ఇదేకదా , ‘‘మూసా! నీవు నిశ్చయంగా మంత్రజాలానికి గురిఅయిన మనిషివని నేను భావిస్తున్నాను’’ అని. దానికి సమాధానంగా మూసా ఇలా అన్నాడు: ‘‘నీకు బాగా తెలుసు, గుణపాఠం నేర్పే ఈ నిదర్శనాలను భూమ్యాకాశాల ప్రభువు తప్ప మరెవ్వడూ అవతరింపజెయ్యలేదు. ఫిరౌన్! నీవు నిశ్చయంగా శాపానికి గురిఅయిన వాడవు అని నేను భావిస్తున్నాను. ’’ చివరకు ఫిరౌను మూసానూ , ఇస్రాయీలు సంతతినీ భూమిపై లేకుండా చేయాలని సంకల్పించుకున్నాడు. కాని మేము అతడినీ, అతడి సహచరులనూ మూకుమ్మడిగా ముంచివేశాము. ఆ తరువాత ఇస్రాయీలు సంతతితో మేము ఇలా అన్నాము: ‘‘ఇక మీరు భూమిపై సుఖంగా నివసించండి. ప్రళయ వాగ్దాన సమయం ఆసన్నమైనప్పుడు మేము మీ అందరినీ కలిపి హాజరుపరుస్తాము.’’

**17. బనీ ఇస్రాయీల్** 105 - 109 ఈ ఖురానును మేము సత్యంతో అవతరింపజేశాము. సత్యంతోనే అది అవతరించింది. ప్రవక్తా! (విశ్వాసులకు) శుభవార్త అందించటానికి (అవిశ్వాసులకు) హెచ్చరిక చెయ్యటానికి తప్ప మేము నిన్ను మరొక పనికొరకు పంపలేదు. మేము ఈ ఖురానును కొద్దికొద్దిగా అవతరింపజేశాము , నీవు దానిని నెమ్మది నెమ్మదిగా ప్రజలకు వినిపించాలని. మేము దానిని సందర్భాన్ని బట్టి క్రమక్రమంగా అవతరింపజేశాము. ప్రవక్తా! వారితో ఇలా అను: మీరు దీనిని నమ్మండి నమ్మకపోండి. ఇదివరకు జ్ఞానం ఇవ్వబడిన వారికి దానిని వినిపించినప్పుడు వారు ముఖాన్ని నేలకు ఆనించి సాష్టాంగపడి ముక్తకంఠంతో ఇలా అంటారు: ‘‘మా ప్రభువు పరిశుద్ధుడు. ఆయన వాగ్దానం పూర్తిఅయి తీరవలసిందే. ’’ వారు ముఖాన్ని నేలకు ఆనించి విలపిస్తూ పడిపోతారు. దానిని విన్న తరువాత వారి అణకువ మరింత పెరుగుతుంది.

110 - 111 ప్రవక్తా! వారితో ఇలా అను: ‘‘అల్లాహ్ అని అయినా పిలవండి. లేదా రహ్మాన్ అని అయినా సరే. ఏ పేరుతో అయినా పిలవండి. ఆయనకు గల పేర్లు అన్నీ చక్కనివే. మీరు నమాజును చేసేటప్పుడు కంఠాన్ని మరీ

పెంచకండి, మరీ తగ్గించకండి. ఈ రెంటికీ మధ్య సగటు స్థాయిలో ఉండే స్వరంతో నమాజు చేయండి. '' ఇంకా ఇలా అను: ఎవరినీ తన కొడుకుగా చేసుకోనటువంటి , తన రాజ్యంలో ఇతరులెవ్వరూ భాగస్వాములుగా లేనటువంటి , నిస్సహాయుడు కాకపోవటం వల్ల తనకు సంరక్షకుడు ఎవడూ అవసరం లేనటువంటి దేవునికే స్తోత్రము. ఆయన గొప్పతనాన్ని, మహో న్నతమైన శ్రేణికిచెందిన గొప్పతనాన్ని చాటండి.

**18 అల్ కహఫ్**

ఆయతులు : 110 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**18 అల్ కహఫ్** 1 - 5 అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన తన దాసునిపై ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడు అందులో ఏ విధమైన వక్రత్వాన్నీ ఉంచలేదు - అది సూటిగా , ఉన్నది ఉన్నట్లుగా ప్రకటించే గ్రంథం దాని ద్వారా అతను దేవుని కఠిన శిక్షను గురించి ప్రజలను హెచ్చరించాలని , విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి మంచి ప్రతిఫలం లభిస్తుంది అనే శుభవార్తనూ , అందులోనే వారు కలకాలం ఉంటారు అనే శుభవార్తనూ అందజేయాలని, అల్లాహ్ ఎవరినో కుమారుడుగా వరించాడు అని పలికే ప్రజలను భయపెట్టాలని. ఈ విషయం గురించి వారికిగానీ , వారి తాతముత్తాలకు గానీ ఏ జ్ఞానమూ లేదు. వారి నోట వెలువడే ఈ మాట అత్యంత దారుణమైనది. వారు కేవలం అబద్ధాన్ని మాత్రమే వాగుతున్నారు.

**18 అల్ కహఫ్** 6 - 8 అయితే ప్రవక్తా! ఒకవేళ వారు ఈ ఉపదేశాన్ని విశ్వసించకపోతే , బహుశా నీవు వారి కోసం దుఃఖిస్తూ నీ ప్రాణాన్నే కోల్పోతావేమో! నిజానికి , ప్రజలలో మంచి పనులు చేసేవారెవరో పరీక్షించాలని , భూమిపై ఉన్న వస్తు సామగ్రినంతటినీ మేము భూమికి అలంకారంగా చేశాము. చివరకు మేము దీనినంతటినీ చదునైన మైదానంగా చేసివేయనున్నాము.

**18 అల్ కహఫ్** 9 - 12 గుహవారు, శిలాఫలకం వారు మా సూచనలలో ఒక అద్భుతమైన సూచన అని మీరు భావిస్తున్నారా? ఆ గుహలో ఆశ్రయం పొందిన ఆ యువకులు ''ప్రభూ! నీ ప్రత్యేక కారుణ్యాన్ని మాకు ప్రసాదించు మా వ్యవహారాన్ని చక్కబెట్టు! '' అని వేడుకున్నారు. అప్పుడు మేము వారిని అదే గుహలో జోకొట్టి ఏళ్లతరబడి గాఢనిద్రలో ఉంచాము. తరువాత మేము వారిని మేల్కొలిపాము , ఆ రెండు వర్గాలలో ఏ వర్గం వారు తాము గుహలో ఉన్న కాలాన్ని కచ్చితంగా లెక్కకడతారో పరీక్షిద్దామని.

**18 అల్ కహఫ్** 13 - 16 మేము వారి అసలు గాథను నీకు వినిపిస్తున్నాము. వారు తమ ప్రభువును విశ్వసించిన కొందరు యువకులు. మేము వారికి సన్మార్గంపై నడవటంలో అభివృద్ధిని ప్రసాదించాము. వారు లేచి

ఈ ప్రకటన చేసినప్పుడు మేము వారి హృదయాలకు దృఢత్వాన్ని కలుగజేశాము ''ఆకాశాలకూ, భూమికీ ప్రభువైనవాడే మా ప్రభువు. మేము ఆయనను త్రోసిరాజని మరొకణ్ణి దేవుడుగా చేసుకొని వేడుకోము. ఒకవేళ మేము అలా చేస్తే, పూర్తిగా అనుచితమైన దానిని చేసిన వారమవుతాము.'' (తరువాత వారు పరస్పరం ఇలా అనుకున్నారు) మన జాతివారైన వీరు విశ్వప్రభువును కాదని ఇతర దైవాలను సృష్టించుకున్నారు. ఈ దైవాలు ఆరాధ్యులని స్పష్టమైన ప్రమాణాన్ని దేన్నయినా ఈ ప్రజలు ఎందుకు తీసుకురారు ? అల్లాహ్ విషయంలో అభూత కల్పనకు పాల్పడే వాడిని మించిన దుర్మార్గుడెవడు ? ఇప్పుడు మీరు వారితోను , అల్లాహ్ ను కాదని వారు ఆరాధించే దేవుళ్లతోను సంబంధాలను త్రెంచు కున్నారు. కనుక, ఇక పదండి. ఫలానా గుహలో ప్రవేశించి ఆశ్రయం పొందండి. మీ ప్రభువు మీపై తన కారుణ్య ఛాయను విస్తరింపజేస్తాడు , మీ కార్యసిద్ధికై సకల సామగ్రిని సమకూరుస్తాడు.

**18 అల్ కహఫ్** 17 - 18 వారిని నీవు గుహలో చూసినప్పుడు , సూర్యుడు ఉదయించేటప్పుడు, వారి గుహను తాకకుండా కుడి ప్రక్కగా పైకిపోయినట్లునూ , అస్తమించేటప్పుడు వారికి దూరంగా ఎడమ ప్రక్కగా దిగిపోయినట్లునూ నీకు గోచరిస్తుంది. వారేమో గుహలోపల ఒక సువిశాలమైన స్థలంలో పడి ఉన్నారు. ఇది అల్లాహ్ సూచనలలో ఒక సూచన. అల్లాహ్ సన్మార్గం చూపినవాడే అసలు సన్మార్గం పొందేవాడు. అల్లాహ్ - మార్గం తప్పించేవాడికి మార్గం చూపి , సంరక్షించేవాణ్ణి నీవు పొందలేవు. వారిని నీవు చూచి , వారు మేల్కొనే ఉన్నారని అనుకుంటావు. వాస్తవానికి వారు నిద్రపోతున్నారు. మేము వారిని కుడిప్రక్కకూ , ఎడమ ప్రక్కకూ దొరిలేలా మరలిపడుకునేలా చేసేవారము వారి కుక్క గుహ ముఖ ద్వారం వద్ద ముందు కాళ్ళను చాచి కూర్చుండి ఉండేది. ఒకవేళ నీవు వారిని తొంగిచూస్తే , వెనక్కి తిరిగి పారిపోతావు. ఆ దృశ్యాన్ని చూసిన కారణంగా నీవు భయకంపితుడవు అవుతావు.

**18 అల్ కహఫ్** 19 - 21 మేము ఇదే అద్భుత మహిమ ద్వారా వారిని మేల్కొలిపి కూర్చో బెట్టాము. వారు పరస్పరం ప్రశ్నించుకోవాలని వారిలో ఒకడు , ''మనం ఈ స్థితిలో ఎంతకాలం ఉన్నాము ?'' అని అడిగాడు. మిగతావారు, ''బహుశా ఒక రోజంతానో లేక దానికంటే కొంచెం తక్కువగానో ఉండి ఉంటాము'' అని అన్నారు. మళ్లీ ఇలా అన్నారు వారంతా, ''అల్లాహ్ యే బాగా ఎరుగును మనం ఈ స్థితిలో ఎంతకాలం గడిపామో. సరే ఇక ఈ వెండి నాణాన్ని ఇచ్చి మనలో ఎవరినైనా నగరానికి పంపుదాము. అతడు మంచి భోజనం ఎక్కడ దొరుకుతుందో కనుక్కొని, తినటానికేదైనా తీసుకువస్తాడు. అతడు కాస్త తెలివిగా వ్యవహరించాలి. మనం ఇక్కడున్నామని ఎవరికైనా తెలిసే విధంగా అతడు ప్రవర్తించకూడదు. ఒకవేళ వారు మనల్ని పట్టుకుంటే , రాళ్లతో కొట్టి చంపేస్తారు. లేదా బలవంతంగా మనల్ని తమ సంఘంలో మళ్లీ కలుపుకుంటారు. అలా జరిగితే , మనం ఎన్నటికీ సాఫల్యం పొంద లేము.'' ఈ విధంగా మేము నగరవాసులకు వారి ఉనికిని గురించి తెలియ జేశాము. అల్లాహ్ చేసిన వాగ్దానం సత్యమైనదనీ ప్రళయ సమయం నిస్సం దేహంగా వచ్చి తీరుతుందనీ ప్రజలు తెలుసుకోవాలని (అప్పుడు వారు

అసలు ఆలోచించవలసినది పై విషయం గురించి). కాని ప్రజలు వారి (గుహ వాసుల)తో ఎలా వ్యవహరించాలి అనే విషయం గురించి పరస్పరం వాదులాడుకుంటున్నారు. కొందరు ''వారిమీద ఒక గోడ కట్టండి. వారి ప్రభువుకే వారి వ్యవహారం గురించి బాగా తెలుసు '' అని అన్నారు. కాని ఈ వ్యవహారంలో పై చేయిగా ఉన్నవారు , ''మేము వారిమీద ఒక ఆరాధనా మందిరాన్ని నిర్మిస్తాము'' అని అన్నారు.

**18 అల్ కహఫ్** 22 - 26 కొంతమంది, ''వారు ముగ్గురు, నాలుగోది వారి కుక్క '' అని అంటారు. మరికొందరు , ''వారు ఐదుగురు, ఆరోది వారి కుక్క '' అని అంటారు. వారందరూ కేవలం అర్థరహితంగా వాగుతున్నారు. ఇంకా కొందరు, ''వారు ఏడుగురు, ఎనిమిదోది వారి కుక్క'' అని కూడ అంటారు.ఇలా అను: ''వారు ఎందరో నా ప్రభువే బాగా ఎరుగును. కొందరికి మాత్రమే వారి నిజమైన సంఖ్య తెలుసు. కనుక స్థూలంగా తప్ప వారి సంఖ్యను గురించి ప్రజలతో వాదించకు. ఇంకా వారిని గురించి ఎవరినీ ఏమీ అడగవద్దు. చూడు ఏ విషయాన్ని గురించి j◌ై◌◌ునా, ఎన్నడూ ''నేను ఈ పనిని రేపు చేస్తాను '' అని అనకు. (నీవు ఏమీ చేయలేవు) అల్లాహ్ కోరితేనే తప్ప. ఒకవేళ మరపువల్ల నీవు అలా అంటే , వెంటనే నీ ప్రభువును స్మరించుకొని ఇలా అను , ''నా ప్రభువు ఈ వ్యవహారంలో సత్యానికి అతి దగ్గరగా ఉన్న విషయం వైపునకు నాకు మార్గం చూపుతాడని నేను ఆశిస్తున్నాను. '' - వారు తమ గుహలో మూడు వందల సంవత్సరాలు ఉన్నారు , (కొందరు గడువు అంచనాలో) తొమ్మిది సంవత్సరాలు ఇంకా ఎక్కువ పెంచారు. నీవు ఇలా చెప్పు: ''వారు ఆ స్థితిలో ఉన్న కాలాన్ని అల్లాహ్ యే బాగా ఎరుగును. ఆకాశాలలోనూ, భూమిలోనూ గుప్తంగా ఉన్న సమస్త విషయాలు ఆయనకు మాత్రమే తెలుసు. ఎంత అద్భుతమైనవాడు ఆ చూసేవాడు ఆ వినేవాడు (భూమ్యాకాశాలలోని సృజింపబడిన వాటిని) ఆయన తప్ప (ఆదుకునేవాడు) మరెవ్వడూ లేడు. అంతేకాదు ఆయన తన ప్రభుత్వాధికారంలో ఎవరినీ భాగస్వామిగా చేర్చుకోడు.''

**18 అల్ కహఫ్** 27 - 31 ప్రవక్తా! నీ ప్రభువు గ్రంథం నుండి నీపై అవతరింపజేయబడిన దానిని (యథాతథంగా) వినిపించు. ఆయన ప్రవచనాలను మార్చే అధికారం ఎవరికీ లేదు. (ఒకవేళ ఎవరికోసమైనా నీవు అందులో మార్పులు, చేర్పులు చేసినట్లయితే) ఆయనను తప్పించుకొని పారిపోయి నీవు ఏ ఆశ్రయాన్నీ పొందలేవు. తమ ప్రభువు ప్రసన్నతను అర్థిస్తూ ఎవరు ఉదయం , సాయంత్రం ఆయనను వేడుకుంటారో , వారి సాహచర్యం పట్ల నీ హృదయాన్ని సంతృప్తి పరచుకో. వారి నుండి నీ దృష్టిని ఏమాత్రం మరల్చకు. నీవు ఇహలోకపు మెరుగులను కోరుకుంటావా? ఎవని మనస్సును మేము మా ధ్యానం పట్ల శ్రద్ధలేకుండా చేశామో , ఎవడు తన వాంఛలకు అనుగుణంగా వర్తించాడో , ఎవడి పనితీరు అతివాదంపై ఆధారపడి ఉంటుందో అటువంటి వ్యక్తి పట్ల విధేయత చూపకు. స్పష్టంగా ఇలా ప్రకటించు , ''ఇది సత్యం మీ ప్రభువు నుండి వచ్చింది. ఇష్టమైన వారు దానిని స్వీకరించనూవచ్చు, ఇష్టంకాని వారు దానిని తిరస్కరించనూవచ్చు. మేము (సత్యాన్ని తిరస్కరించే) దుర్మార్గుల కొరకు ఒక అగ్నిని సిద్ధపరచి ఉంచాము , దాని జ్వాలలు వారిని చుట్టు ముట్టుతాయి. అక్కడ వారు గనుక

మంచినీళ్లు అడిగితే , నూనె మడ్డిలాంటి నీటితో వారిని సత్కరించటం జరుగుతుంది. అది వారి ముఖాలను మాడుస్తుంది. అది ఎంత జుగుప్సాకరమైన పానీయం! అది ఎంత నికృష్టమైన విశ్రాంతి స్థలం! ఇక విశ్వసించి సత్కార్యాలు చేసేవారి విషయం - మేము నిశ్చయంగా వారి ప్రతిఫలాన్ని వృధాచేయము. వారికై నిత్య హరితవనాలు ఉన్నాయి వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి అక్కడ వారు బంగారు కంకణాలను ధరిస్తారు ఆకు పచ్చని సన్నని జలతారు పట్టువస్త్రాలను ధరిస్తారు ఎత్తైన ఆసనాలపై దిండ్లకు ఆనుకుని ఆసీనులై ఉంటారు. అది ఎంత శ్రేష్ఠమైన ప్రతిఫలం! అది ఎంత మహోన్నతమైన నివాస స్థలం!

**18 అల్ కహఫ్** 32 - 44 ప్రవక్తా! వారి ముందు ఒక ఉపమానం పేర్కొను: ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. వారిలో ఒకనికి మేము రెండు ద్రాక్ష తోటలు ఇచ్చాము. వాటి చుట్టూ ఖర్జూరపు చెట్ల కంచెను పెంచాము. ఇంకా వాటి మధ్య సేద్యపు భూమిని ఉంచాము. ఆ రెండు తోటలు పుష్కలంగా పండాయి. పండటంలో అవి ఎంత మాత్రమూ కొరత చూపలేదు. ఆ తోటల మధ్య ఒక కాలువను ప్రవహింపజేశాము. యజమానికి మంచి లాభాలు వచ్చాయి. ఇదంతా పొంది కూడా అతడు ఒకనాడు తన పొరుగు మిత్రునితో మాట్లాడుతూ ఇలా అన్నాడు: ''నేను నీ కంటే ఎక్కువ ధనం కలవాణ్ణి, ఎక్కువ బలవంతులైన జనం కలవాణ్ణి.'' తరువాత అతడు తన స్వర్గంలో ప్రవేశించాడు తన ఆత్మకు అన్యాయం చేసుకున్నవాడై ఇలా ప్రకటించాడు: ''ఎన్నటికైనా ఈ సంపద నశిస్తుందని నేను భావించటం లేదు. ఎప్పటికైనా ప్రళయ ఘడియ వస్తుందనే నమ్మకం కూడ నాకు లేదు. అయినప్పటికీ , ఒకవేళ ఎప్పుడైనా నేను నా ప్రభువు సన్నిధికి మరలింపబడినట్లయితే తప్పకుండా దీనికంటే మహోజ్వలమైన స్థానాన్ని పొందుతాను.'' అప్పుడు అతని పొరుగువాడు మాట్లాడుతూ అతనితో ఇలా అన్నాడు: ''నిన్ను మట్టితోనూ , తరువాత వీర్య బిందువుతోనూ పుట్టించి ఒక సంపూర్ణ మానవునిగా తీర్చిదిద్దిన ఆయనను నీవు తిరస్కరిస్తున్నావా? ఇక నా విషయం, నా ప్రభువైతే అల్లాహ్ యే. నేను ఎవరినీ ఆయనకు భాగస్వామిగా చేయను. నీవు నీ వనంలోకి ప్రవేశిస్తూ ఉన్న సమయంలో నీ నోట 'మాషా అల్లాహ్' 'లాఖువ్వత ఇల్లా బిల్లాహ్' అనే మాటలు ఎందుకు రాలేదు? ఒకవేళ నీవు నన్ను సంపదలో, సంతానంలో నీ కంటె తక్కువ వాడిగా చూస్తూ ఉన్నప్పటికీ, నా ప్రభువు నీ స్వర్గం కంటే ఉత్తమమైన దానిని నాకు ప్రసాదించటమూ , నీ 'స్వర్గం' మీదకు ఆకాశం నుండి ఏదైనా ఆపదను పంపించటమూ, ఆ కారణంగా అది చదునైన మైదానంగా మారిపోవటమూ లేదా దాని నీరు భూమిలో ఇంకిపోవటమూ తరువాత నీవు దానిని ఏ విధంగానూ తిరిగి పొందలేకపోవటమూ అనేది అసంభవమేమీ కాదు. '' చివరకు జరిగిందేమిటంటే, అతని పంట మొత్తం ధ్వంసం అయింది , తన ద్రాక్షతోట తలక్రిందులుగా తడికలపై కూలి పోవటాన్ని చూచి అతడు తాను పెట్టిన పెట్టుబడిని గురించి చేతులు నులుముకుంటూ ఉండిపోయాడు. ఇంకా ''అయ్యో! నేను నా ప్రభువునకు ఇతరులెవరినీ భాగస్థులుగా చేయకుండా ఉంటే ఎంత బాగుండేది! '' అని వాపోయాడు - అల్లాహ్ కు వ్యతిరేకంగా అతనికి సహాయపడటానికి అతని వద్ద ఏ జన సమూహమూ లేకుండా

పోయింది. అతడు స్వయంగానూ ఆ ఆపదను ఎదుర్కోలేకపోయాడు - అప్పుడు తెలిసింది ఆదుకునే శక్తి ఒక్క సత్యదేవునికే ఉందని, ఆయన ప్రసాదించే బహుమానమే ఉత్తమమైనదని, ఆయన చూపించే ఫలితమే శ్రేష్ఠమైనదని.

**18 అల్ కహఫ్** 45 - 49 ప్రవక్తా! ఐహిక జీవిత వాస్తవాన్ని వారికి ఈ ఉపమానం ద్వారా బోధించు: ఈనాడు మేము ఆకాశం నుండి వర్షాన్ని కురిపిస్తే నేలపై పచ్చిక బాగా దట్టంగా పెరుగుతుంది. మరునాడు అదే పచ్చిక పొట్టుగా మారి పోతుంది. దానిని గాలులు లేపుకుపోయి తిరుగుతూ ఉంటాయి. అల్లాహ్ ప్రతి దానిపై అధికారం కలవాడు. ఈ సంపదా , ఈ సంతానమూ కేవలం ఐహిక జీవితపు తాత్కాలిక అలంకారాలు మాత్రమే. అసలు , శాశ్వతంగా ఉండిపోయే పుణ్యకార్యాలే నీ ప్రభువు దగ్గర పరిణామం రీత్యా ఉత్తమమైనవి. కాబట్టి వాటి మీదనే పెద్ద ఆశలు పెట్టుకోవచ్చు. ఆలోచించవలసినది ఆ రోజును గురించి: ఆ రోజున మేము పర్వతాలను నడిపిస్తాము , భూమి అంతా బోసిపోయినట్లుగా మీరు చూస్తారు. (ఆదిమానవులలో , అంత్య మానవులలో) ఒక్కరు కూడ మిగిలిపోకుండా మేము మానవులందరినీ చుట్టుముట్టి సమావేశపరుస్తాము. వారంతా నీ ప్రభువు సాన్నిధ్యంలో వరుసలు వరుసలుగా ప్రవేశపెట్టబడతారు- ఇదిగో చూడండి, మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించిన స్థితిలోనే మీరు మా వద్దకు వచ్చేశారు కదా! మాతో సమావేశమయ్యే కాలాన్ని దేనినీ మేము మీ కొరకు నిర్ణయించనేలేదని మీరు భ్రమపడ్డారు - అప్పుడు కర్మల పత్రం వారి ముందు ఉంచబడుతుంది. ఆ సమయంలో అపరాధులు తమ జీవిత గ్రంథంలో నమోదు చేయబడిన విషయా లకు భయపడుతూ ఉండటాన్ని నీవు చూస్తావు. వారు ''అయ్యో మా దౌర్భాగ్యం! ఇదేమి గ్రంథం! మేము చేసిన చిన్న పనిగానీ , పెద్దపనిగానీ ఏదీ ఈ గ్రంథంలో నమోదు చేయబడకుండా ఉండలేదే '' అని అంటూ ఉంటారు. వారు ఏమేమి చేశారో అదంతా తమ ముందు ప్రత్యక్షం కావటాన్ని చూస్తారు. నీ ప్రభువు ఎవరికీ ఏమాత్రమూ అన్యాయం చేయడు.

**18 అల్ కహఫ్** 50 - 51 ఈ విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో ఆదమ్‌కు సజ్దా చేయమని మేము దైవదూతలతో అన్నప్పుడు వారు అతనికి సజ్దా చేశారు , కాని ఇబ్లీస్ చేయలేదు. అతడు జిన్నాతులలోనివాడు , కనుకనే తన ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘించటానికి ఒడిగట్టాడు. మీరు నన్ను కాదని వాడూ , వాడి సంతతీ మీకు శత్రువులైనప్పటికీ, మీరు వారిని మీకు సంరక్షకులుగా చేసుకుంటారా ? ఈ దుర్మార్గులెంత చెడ్డ ప్రత్యామ్నాయాన్ని వరిస్తున్నారు! నేను ఆకాశాన్నీ , భూమినీ సృష్టించేటప్పుడు వారిని ఆహ్వానించలేదు. స్వయంగా వారిని సృష్టించే టప్పుడు సైతం వారిని నాకు భాగస్వాములుగా చేసుకోలేదు. మార్గం తప్పించే వారిని సహాయకులుగా చేసుకోవటం నా పనికాదు.

**18 అల్ కహఫ్** 52 - 53 వారి ప్రభువు వారితో ఇలా అనే రోజున వారు ఏమి చేస్తారు ? ''ఇప్పుడు పిలవండి మీరు, నాకు భాగస్వాములని మీరు భావిస్తున్న ఆ శక్తులను. '' అప్పుడు వారు వారిని పిలుస్తారు. కాని వారు వారి సహాయానికై రారు. మేము వారికి ఒకే వినాశ గుండాన్ని ఏర్పాటు చేస్తాము. అపరాధు లందరూ ఆ రోజున

అగ్నిని చూస్తారు. ఇక తాము అందులో పడవలసి ఉన్నదని తెలుసుకుంటారు , దాని నుండి తప్పించుకోవటానికి వారు ఏ ఆశ్రయాన్నీ పొందలేరు.

**18 అల్ కహాఫ్** 54 - 55 మేము ఈ ఖురానులో ప్రజలకు పలు విధాలుగా హితవు గరపాము. కాని మానవుడు పరమ జగడాలమారి. వారి ముందుకు మార్గదర్శకత్వం వచ్చినప్పుడు , దానిని స్వీకరించకుండా, తమ ప్రభువు సన్నిధానంలో క్షమాభిక్షను కోరకుండా, అసలు వారిని ఏ విషయం వారించింది? ఆ విషయం ఇది తప్ప మరొకటేమీ కాదు - పూర్వపు జాతుల విషయంలో జరిగినదే తమ విషయంలో కూడ జరగాలని వారు నిరీక్షిస్తున్నారు. లేదా శిక్ష తమ ముందుకు వస్తూ ఉండగా చూడాలని వారు కోరుకుంటున్నారు.

**18 అల్ కహాఫ్** 56 - 57 మేము ప్రవక్తలను, శుభవార్తను అందజేసేందుకూ హెచ్చరికను చేసేందుకూ తప్ప మరే ఉద్దేశ్యంతోనూ పంపము. కాని , అవిశ్వాసులు అసత్యవాదపు ఆయుధాలతో సత్యాన్ని ఖండిరచటానికి ప్రయత్నం చేస్తారు, వారు నా వాక్యాలనూ, వారికి చేయబడిన హెచ్చరికలనూ హాస్యంగా తీసు కున్నారు. ఇక తన ప్రభువు వాక్యాలను అతనికి వినిపించి హితోపదేశం చేయగా , వాటికి విముఖుడై, తనకు తానే చేతులారా చేసుకున్న దాని యొక్క దుష్పరిణామాన్ని మరచిపోయే వ్యక్తి కంటే దుర్మార్గుడెవడు ? (ఈ వైఖరిని అవలంబించిన) వారి హృదయాలకు మేము గలీబులు తొడిగాము. అవి వారిని ఖురానును అర్థం చేసుకోనీయవు వారి చెవులకు మేము చెవుడు కలిగించాము. నీవు వారిని సన్మార్గం వైపునకు ఎంత పిలిచినా , వారు ఈ స్థితిలో ఎన్నటికీ సన్మార్గాన్ని పొందలేరు.

**18 అల్ కహాఫ్** 58 నీ ప్రభువు ఎంతో మన్నించేవాడు , కరుణించేవాడూను, వారి చేష్టలకు ఆయన వారిని పట్టుకోదలిస్తే, తొందరగానే శిక్షను పంపి ఉండేవాడు. కాని వారి శిక్షకోసం ఒక సమయం నిర్ణయించబడి ఉన్నది. దాని నుండి తప్పించుకుని పారిపోయే ఏ మార్గాన్నీ వారు పొందలేరు.

**18 అల్ కహాఫ్** 59 శిక్షకు గురిఅయిన ఈ పట్టణాలు మీ ఎదుట ఉన్నాయి. వారు దుర్మార్గం చేయగా , మేము వారిని నాశనం చేశాము. వారిలోని ప్రతి ఒక్కరి వినాశానికి మేము సమయం నిర్ణయించేసి ఉంచాము.

**18 అల్ కహాఫ్** 60 - 65 (మూసాకు సంబంధించిన గాధను వారికి వినిపించు) అప్పుడు మూసా తన సేవకునితో ఇలా అన్నాడు : ''రెండు నదుల సంగమ స్థలానికి చేరనంతవరకు , నేను నా ప్రయాణాన్ని ఆపను. లేకపోతే నేను సుదీర్ఘకాలం నడుస్తూనే ఉంటాను.'' తరువాత వారు వాటి సంగమ ప్రదేశానికి చేరినప్పుడు , తమ చేప విషయంలో అశ్రద్ధవహించారు. అది నదిలోకి సొరంగం గుండా పోయినట్లు దూసుకుపోయింది. ముందుకు పోయిన తరువాత , మూసా తన సేవకునితో ఇలా అన్నాడు , ''మా ఉదయపు ఆహారం తీసుకురా. ఈనాటి ప్రయాణంలో మేము బాగా అలసిపోయాము.'' సేవకుడు ఇలా అన్నాడు, ''చూశారా ఏమయిందో! మనం ఆ రాయి వద్ద విశ్రాంతికై ఆగి ఉన్న

సమయంలో నాకు చేప విషయమే జ్ఞాపకం లేకుండాపోయింది. షైతాను నన్ను ఏమరుపాటుకు గురిచేశాడు. నేను దాని ప్రస్తావనను (మీతో చెయ్యటం) మరచిపోయాను. చేప విచిత్రమైన రీతిలో బయటపడి నదిలోకి వెళ్ళిపోయింది.'' మూసా ''మనం అన్వేషిస్తూ వచ్చినది దీని కొరకేకదా!'' అని అన్నాడు. కనుక వారు ఉభయులూ తమ అడుగుజాడలలో వెనక్కి తిరిగి వెళ్ళారు. అక్కడ వారు మా దాసులలోని ఒక దాసుని కనుగొన్నారు మేము అతనికి మా కారుణ్యాన్ని ప్రసాదించాము. మా తరఫునుండి ఒక ప్రత్యేక జ్ఞానాన్ని ప్రసాదించాము.

**18 అల్ కహఫ్** 66 - 70 మూసా అతనితో ఇలా అన్నాడు , ''మీరు నేర్చుకున్న వివేకాన్ని , మీరు నాకు కూడ బోధించేందుకు నేను మీ వెంట ఉండవచ్చా ?'' అతను ఇలా అన్నాడు , ''మీరు నా విషయంలో సహనంతో వ్యవహరించలేరు. అసలు మీకు తెలియని విషయాన్ని గురించి సహనం చూపటం మీకు ఎలా సాధ్యం ?'' మూసా ఇలా జవాబు పలికాడు , ''ఇన్షాఅల్లాహ్ (అల్లాహ్ సంకల్పిస్తే) మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు. ఏ వ్యవహారంలోనూ నేను మీకు అవిధేయత చూపను. '' అతను ఇలా అన్నాడు , ''మంచిది ఒకవేళ మీరు నాతో రాదలిస్తే స్వయంగా నేను మీతో ప్రస్తావించే వరకు నన్ను ఏ విషయమూ అడగకండి.''

**18 అల్ కహఫ్** 71 - 73 అప్పుడు వారు ఉభయులూ బయల్దేరారు, చివరకు వారు ఒక పడవ ఎక్కినప్పుడు, ఆ వ్యక్తి పడవకు రంధ్రం చేశాడు. మూసా అప్పుడు ఇలా అన్నాడు, ''పడవలో ఉన్న వారందరినీ ముంచటానికా మీరు దానికి రంధ్రం చేశారు ? మీరు చేసినది దారుణమైన పనే. '' అతను ఇలా పలికాడు , ''మీరు నా పట్ల సహనం చూపలేరని నేను మీకు చెప్పలేదా?'' మూసా ఇలా అన్నాడు, ''మరచిపోయి చేసిన దానికి నన్ను తప్పు పట్టకండి నా విషయంలో కఠినంగా వ్యవహరించకండి.''

**18 అల్ కహఫ్** 74 - 76 తరువాత వారు ప్రయాణం సాగించారు. చివరకు వారిని ఒక బాలుడు కలిశాడు ఆ వ్యక్తి అతనిని చంపివేశాడు. మూసా ఇలా అన్నాడు , ''మీరు ఒక అమాయకుని ప్రాణాన్ని తీశారు. వాస్తవానికి అతడు ఎవరినీ హత్యచేయలేదు కదా! మీరు చేసిన పని చాల చెడ్డది. '' అతను ఇలా అన్నాడు, ''మీరు నాతో సహనంగా ఉండలేరని నేను మీకు చెప్పలేదా! '' మూసా ఇలా పలికాడు , ''దీని తరువాత ఒకవేళ నేను మిమ్మల్ని ఏదైనా అడిగితే, మీరు నన్ను మీ వెంట ఉండనీయకండి. ఇదిగో, ఇప్పుడు మీకు నా వైపు నుండి సాకు దొరికిపోయింది.''

**18 అల్ కహఫ్** 77 - 82 తరువాత వారు ముందుకు సాగిపోయారు. చివరకు ఒక పట్టణానికి చేరుకున్నారు. అక్కడి ప్రజలను అన్నం పెట్టమని అభ్యర్థించారు. కాని వారు వీరిద్దరికీ ఆతిథ్యమీయటానికి తిరస్కరించారు. అక్కడ వారు కూలిపోనున్న ఒక గోడను చూశారు. ఆ వ్యక్తి ఆ గోడను మళ్ళీ నిలబెట్టాడు. మూసా ఇలా అన్నాడు, ''మీకు ఇష్టమైతే ఈ శ్రమకు ప్రతిఫలం తీసుకునేవారు.'' ఆయన ఇలా అన్నారు, ''ఇక చాలు మన సహవాసం ముగిసింది. ఇక మీరు సహనం చూపలేకపోయిన ఆ విషయాల తత్వాన్ని నేను మీకు వివరిస్తాను. ఆ పడవ వృత్తాంతం ఏమిటంటే, అది నదిలో కష్టపడి పని చేసుకునే కొందరు నిరు పేదలది. నేను దానికి లోపం కల్పించాలని ఎందుకు

అనుకొన్నానంటే ప్రతి పడవను బలవంతంగా వశపరచుకొనే ఒక రాజుకు చెందిన ప్రాంతం ముందు రాబోతోంది. ఇక ఆ బాలుని విషయం - అతని తల్లిదండ్రులు విశ్వాసులు. అతడు తన తలబిరుసుతనం వల్లా, తన అవిశ్వాసం వల్లా, వారిని వేధిస్తాడనే భయం మాకు కలిగింది. ఈ కారణం వల్ల మేము కోరుకున్న దేమిటంటే , వారి ప్రభువు అతనికి మారుగా, నడవడికలో అతనికంటే మంచివాడునూ , రక్త సంబంధీకులను ఎక్కువగా కనికరిస్తాడని ఆశించదగిన వాడునూ అయిన మరొక బిడ్డను వారికి ఇవ్వాలని. ఇక గోడ విషయం ఏమిటంటే , అది ఈ పట్టణంలోనే నివసిస్తున్న ఇద్దరు అనాథబాలురిది. ఆ గోడ క్రింద ఈ బాలుర కోసం ఒక నిధి పాతిపెట్టబడి ఉన్నది. వారి తండ్రి చాల మంచివాడు. అందుకని ఈ ఇద్దరు బాలురూ యుక్తవయస్కులైన పిమ్మట తమ నిధిని తాము తీసుకోవాలని నీ ప్రభువు సంకల్పించాడు. ఇదంతా నీ ప్రభువు కారుణ్యం మూలంగా నేను చేశాను. నా అంతట నేను చేయలేదు. నీవు సహనం చూపలేని విషయాల వాస్తవికత ఇది.''

**18 అల్ కహఫ్** 83 ప్రవక్తా! ఈ ప్రజలు నిన్ను జుల్‌ఖర్‌నైన్‌ను గురించి అడుగుతున్నారు. వారితో ''నేను అతనిని గురించి మీకు కొంచెం వినిపిస్తాను'' అని అను.

**18 అల్ కహఫ్** 84 - 88 మేము అతనికి ధరణిలో అధికారాన్ని ప్రసాదించాము. అతనికి అన్ని రకాల సాధనాలనూ, వనరులనూ ఇచ్చాము. అతను (మొదట పశ్చిమ దిశకు దండయాత్ర చేయటానికి) సన్నాహాలు చేశాడు. చివరకు అతను సూర్యుడు అస్తమించే హద్దుకు చేరినప్పుడు , నల్లని నీటిలో సూర్యుడు మునుగుతూ ఉండగా అతను చూశాడు. అక్కడ అతనికి ఒక జాతి ప్రజలు కనిపించారు. అప్పుడు మేము ఇలా అన్నాము , ''జుల్‌ఖర్‌నైన్! ఆ జాతి ప్రజ లను శిక్షించటానికిగానీ , వారిపట్ల ఉదార వైఖరిని అవలంబించటానికి గానీ నీకు అధికారం ఉన్నది.'' అతను ఇలా అన్నాడు , ''వారిలో దౌర్జన్యం చేసేవాడిని మేము శిక్షిస్తాము. ఆపై అతడు తన ప్రభువు వైపునకు మరలింపబడతాడు. అప్పుడు ఆయన అతనికి మరింత తీవ్రమైన శిక్ష విధిస్తాడు. వారిలో విశ్వసించిన వాడికీ, సత్కార్యాలు చేసేవాడికీ మంచి ప్రతిఫలం లభిస్తుంది. అంతేకాదు మేము అతడికి తేలికపాటి ఆజ్ఞలను ఇస్తాము.''

**18 అల్ కహఫ్** 89 - 91 తరువాత అతను (మరొక దండయాత్ర కోసం) సన్నాహాలు చేశాడు. చివరకు అతను సూర్యుడు ఉదయించే హద్దువరకు పోయాడు. అక్కడ అతను ఒక జాతిపై సూర్యుడు ఉదయించటం చూశాడు, దాని కోసం మేము ఎండనుండి రక్షణ పొందే ఏర్పాటు ఏదీ చేయలేదు. ఇదీ వారి స్థితి. జుల్‌ఖర్‌నైన్ వద్ద ఉన్నది ఏమిటో మాకు తెలుసు.

**18 అల్ కహఫ్** 92 - 98 తరువాత అతను (మరొక దండయాత్రకు) సన్నాహాలు చేశాడు చివరకు అతను రెండు పర్వతాల మధ్యకు చేరినప్పుడు , అక్కడ అతనికి ఒక జాతి కనిపించింది. ఆ జాతి ఏ విషయాన్నైనా అతి కష్టం మీదగాని అర్థం చేసుకోలేదు. వారు ఇలా అన్నారు , ''జుల్‌ఖర్‌నైన్! యాజూజ్ , మాజూజ్‌లు ఈ భూభాగంలో

కల్లోలాన్ని వ్యాపింపజేస్తున్నారు. కనుక నీవు మాకూ వారికీ మధ్య అడ్డంగా ఒక గోడను నిర్మించు. అందుకు మేము నీకు ఏదైనా సుంకం చెల్లించాలా ?'' అప్పుడు అతను ఇలా అన్నాడు, ''నా ప్రభువు నాకు ఇచ్చినదే నాకు చాలు. మీరు మటుకు శ్రమద్వారా నాకు సహాయపడండి, నేను మీకూ, వారికీ మధ్య అడ్డంగా గోడ కడతాను. నాకు ఇనుపరేకులను తెచ్చి ఇవ్వండి.'' చివరకు ఆ రెండు పర్వతాల మధ్య ఉన్న ఖాళీ స్థలాన్ని అతను పూడ్చివేసి , ప్రజలతో ''ఇక మంటలు రగిలించండి '' అని అన్నాడు. తరువాత (ఆ ఇనుప గోడను) పూర్తిగా నిప్పుమాదిరిగా ఎర్రగాచేసి అతను , ''ఇక కరిగిన రాగిని తీసుకురండి. దీనిపై కుమ్మరిస్తాను '' అని అన్నాడు. (ఈ గోడ ఎటువంటిదంటే) యాజూజ్, మాజూజ్‌లు దానిపైకి ఎక్కిరానూలేరు దానికి కన్నం వేయటం వారికి ఇంకా కష్టతరం. జుల్‌ఖర్‌నైన్ ఇలా అన్నాడు, ''ఇది నా ప్రభువు కరుణ, కాని నా ప్రభువు యొక్క వాగ్దాన సమయం ఆసన్నమయి నప్పుడు, ఆయన దానిని నేలమట్టం చేస్తాడు. నా ప్రభువు వాగ్దానం నిజమైనది.''

**18 అల్ కహఫ్** 99 - 101 ఆ రోజున మేము ప్రజలను వదలిపెడతాము. వారు (సముద్రపు అలలు మాదిరిగా) ఒకరితో ఒకరు అల్లకల్లోలంగా కలిసిపోతారు. బాకా ఊదబడుతుంది. మేము మానవులను అందరినీ ఒకేసారి సమావేశపరుస్తాము. ఆ రోజున మేము నరకాన్ని అవిశ్వాసుల ముందుకు తీసుకువస్తాము వారు మా హితోపదేశం పట్ల గుడ్డివారై పోయారు. అసలు దానిని వినటానికి ఏమాత్రం సిద్ధపడలేదు.

**18 అల్ కహఫ్** 102 అయితే ఈ తిరస్కారులు, నన్ను కాదని, నా దాసులను తమ కార్య సాధకులుగా చేసుకునే తలంపు కలిగి ఉన్నారా? అటువంటి అవిశ్వాసులకు ఆతిధ్యంగా మేము నరకాన్ని సిద్ధం చేసి ఉంచాము.

**18 అల్ కహఫ్** 103 - 108 ప్రవక్తా! వారితో ఇలా అను: తాము చేసిన పనుల విషయంలో అందరికంటే ఎక్కువగా విఫలులయ్యేవారు ఎవరో, నష్టపోయే వారెవరో మేము మీకు తెలుపమంటారా ? వారెవరంటే, ప్రాపంచిక జీవితంలో వారి ప్రయత్నాలు అన్నీ ఋజుమార్గం నుండి పైదొలగి ఉంటాయి. అయినా వారు తాము చేసే దంతా సవ్యంగానే ఉందని భావిస్తారు. వారు తమ ప్రభువు వాక్యాలను నమ్మకుండా తిరస్కరించినవారు. ఆయన సాన్నిధ్యంలో హాజరు కావలసి ఉన్నదనే విషయాన్ని విశ్వసించనివారు. ఇందువల్ల వారి కర్మలన్నీ వృధా అయిపోయాయి. ప్రళయదినం నాడు మేము వాటికి ఏమాత్రమూ విలువ నీయము. వారి ప్రతిఫలం నరకం - వారు అవిశ్వాసానికి పాల్పడినందుకు బదులుగా, వారు మా వాక్యాలనూ , మా ప్రవక్తలనూ ఎగతాళి చేసినదానికి ఫలితంగా. అయితే విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి ఆతిధ్యంగా ఫిరదౌసు (స్వర్గపు) ఉద్యానవనాలు ఉంటాయి. వాటిలో వారు కలకాలం ఉంటారు. ఆ స్థలాన్ని వదలి మరెక్కడికైనా పోవాలని వారి మనస్సు ఎన్నడూ కోరదు.

**18 అల్ కహఫ్** 109 ప్రవక్తా! ఇలా ప్రకటించు , ''ఒకవేళ నా ప్రభువు మాటలు వ్రాయటానికి సముద్రజలమే సిరాఅయినా, అది ఖాళీ అయిపోతుంది గాని , నా ప్రభువు మాటలు మాత్రం పూర్తికావు. అంతేకాదు , మేము మళ్లీ ఇంతే సిరాను తెచ్చినా, అది కూడ సరిపోదు.''

**18 అల్ కహఫ్** 110 ప్రవక్తా! ఇలా చెప్పు, ''నేను కేవలం ఒక మానవుణ్ణి, మీలాంటివాణ్ణి, నాకు వహీద్వారా ఇలా తెలుపబడిరది. మీ దైవం కేవలం ఒకే దైవం. కనుక తన ప్రభువును కలుసుకోవాలని ఆశించేవాడు సత్కార్యాలు చేయాలి, ఆరాధనలో తన ప్రభువుతో పాటు మరెవ్వరినీ చేర్చకూడదు.''

**19. మర్యమ్**

ఆయతులు : 98 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**19. మర్యమ్** 1 - 3 కాఫ్.హా.యా.ఐన్.సాద్. ఇది నీ ప్రభువు తన దాసుడైన జకరియ్యాపై చూపిన కారుణ్య ప్రస్తావన - అపుడు అతను తన ప్రభువునకు ఏకాంతంగా మొరపెట్టుకున్నాడు.

**19. మర్యమ్** 4 - 11 అతను ఇలా మనవి చేసుకున్నాడు , ''ప్రభూ! నా ఎముకలు సైతం కృశించిపోయాయి. ముదిమి వల్ల తల (నెరసి) మెరిసిపోతోంది. ప్రభూ! నిన్ను వేడుకుని నేను ఎన్నడూ నిష్ఫలుణ్ణి కాలేదు. నా తరువాత నా బంధు మిత్రులు చేసే చెడు పనులను గురించి నేను భయపడుతున్నాను నా భార్యేమో గొడ్రాలు కనుక నీవు నీ ప్రత్యేక అనుగ్రహం ద్వారా నాకు ఒక వారసుణ్ణి ప్రసాదించు. అతడు నాకు వారసుడూ కావాలి , యాఖూబ్ సంతతి వారసత్వాన్నీ పొందాలి. ప్రభూ! అతనిని అందరికీ ఇష్టుడైన వ్యక్తిగా చేయి. '' (ఇలా జవాబు ఇవ్వబడిరది) ''జకరియ్యా! మేము నీకు యహ్యా అనే పేరుగల ఒక కుమారుని శుభవార్తను తెలియజేస్తున్నాము. ఈ పేరుగల మనిషిని మేము ఇంతకు పూర్వం ఎన్నడూ పుట్టించలేదు. '' ఇలా మనవి చేసుకున్నాడు , ''ప్రభూ! నాకు కుమారుడెలా పుడతాడు, నా భార్యయేమో గొడ్రాలు, నేనా, వృద్ధుడనై కృశించిపోయాను.'' బదులు లభించింది, ''అలాగే జరుగుతుంది.'' నీ ప్రభువు ఇలా సెలవిస్తున్నాడు, ''ఇది నాకు చాల చిన్న విషయం. వాస్తవానికి ఇంతకు ముందు నీవు అసలు ఏమీ కానపుడు, నేను నిన్ను పుట్టించాను కదా!'' జకరియ్యా ఇలా అన్నాడు, ''ప్రభూ! నా కొరకేదైనా గుర్తును నిర్ణయించు.'' సెలవిచ్చాడు, ''నీ కొరకు గుర్తు ఏమిటంటే, నీవు వరుసగా మూడు రోజుల వరకు ప్రజలతో మాట్లాడలేవు.'' తరువాత అతను తన ప్రత్యేకమైన గదినుండి బయటకు వచ్చి తన జాతివారి వద్దకు వెళ్లి, ఉదయం, సాయంత్రం దేవుని పవిత్రతను కొనియాడండి అని సైగ ద్వారా వారికి హితోపదేశం చేశాడు.

**19. మర్యమ్** 12 - 15 మేము అతనితో, ''యహ్యా! దైవగ్రంథాన్ని గట్టిగా పట్టుకో'' అని అన్నాము. మేము అతనికి బాల్యంలోనే 'హుక్మ్(వివేకం)ను ప్రసాదించాము. తరువాత మా తరఫు నుండి అతనికి దయార్ద్ర హృదయాన్నీ , పరిశుద్ధతనూ అనుగ్రహించాము. అతను ఎక్కువ భయభక్తులు కలవాడు. తల్లిదండ్రుల హక్కులను గుర్తించినవాడు. అతను దౌర్జన్యపరుడూ కాడు , అవిధేయుడూ కాడు. అతను పుట్టిన రోజునా , అతను మరణించే రోజునా, అతనిని బ్రతికించి లేపే రోజునా అతనిపై శాంతి నెలకొనుగాక.

**19. మర్యమ్** 16 - 21 ప్రవక్తా! ఈ గ్రంథంలో , మర్యమ్ తన వారినుండి వేరైపోయి , తూర్పు దిక్కున ఏకాంతంగా కూర్చుండి, వారికి చాటుగా తెర కట్టుకుని ఉండిపోయినప్పటి వృత్తాంతాన్ని ప్రస్తావించు. ఈ స్థితిలో మేము ఆమె వద్దకు మా 'ఆత్మ'ను (అంటే దూతను) పంపాము. అప్పుడు అతడు ఆమె ముందు పరిపూర్ణమైన మానవాకారంలో ప్రత్యక్షమయ్యాడు. వెంటనే మర్యమ్ ఇలా పలికింది, ''నీవు దైవభీతి కల మనిషివే అయితే, నేను నీ బారినుండి రక్షించ వలసినదిగా దయామయుడైన దేవుని శరణు కోరుకుంటున్నాను. '' అతను ''నేను నీ ప్రభువు దూతను మాత్రమే. నీకు ఒక పరిశుద్ధ పుత్రుణ్ణి ఇచ్చేందుకు పంపబడ్డాను '' అని చెప్పాడు. మర్యమ్ ''నాకు పుత్రుడు ఎలా పుడతాడు , నన్ను పురుషుడు ఎవడూ తాకనైనా లేదు , నేను చెడు నడత గల దానినీ కాను'' అని అన్నది. దైవదూత ఇలా అన్నాడు, ''అలాగే జరుగుతుంది.'' నీ ప్రభువు, ''అలా చేయటం నాకు చాల సులభం. ఆ బాలుణ్ణి ప్రజల కొరకు ఒక సూచనగా, మా తరఫు నుండి ఒక కారుణ్యంగా చేయాలని మేము ఈ పని చేస్తున్నాము. ఇది జరిగి తీరవలసిన విషయమే' అని సెలవిస్తున్నాడు.

**19. మర్యమ్** 22 - 26 మర్యమ్ ఆ మగ శిశువును గర్భంలో దాల్చింది. గర్భవతి అయిన ఆమె ఒక దూర ప్రదేశానికి వెళ్ళిపోయింది. తరువాత ప్రసవ వేదన పడుతూ ఆమె ఒక ఖర్జూరపు చెట్టు క్రిందకు చేరింది. ఆమె ఇలా వాపోయింది, ''అయ్యో! నేను ఇంతకు ముందే మరణించి ఉంటే, నామరూపాలు లేకుండా నశించి ఉంటే ఎంత బాగుండేది!'' అపుడు దైవదూత కాళ్లవైపు నుండి ఆమెను పిలిచి ఇలా అన్నాడు , ''బాధపడకు. నీ ప్రభువు నీకు దిగువ భాగంలో ఒక సెలయేరును సృజించాడు. నీవు ఈ చెట్టు మొదలు కొంచెం ఊపు. నీపై స్వచ్ఛమైన తాజా ఖర్జూరపు పండ్లు రాల్తాయి. నీవు తిను , త్రాగు, నీ కళ్లను చల్లబరచుకో. తరువాత ఎవరైనా మనిషి నీకు కనిపిస్తే , అతనికి, నేను కరుణా మయుని కోసం ఉపవాసముంటానని మొక్కుకున్నాను. కనుక ఈ రోజు నేను ఎవరితోనూ మాట్లాడను'' అని చెప్పు.

**19. మర్యమ్** 27 - 33 తరువాత ఆమె ఆ బాలుణ్ణి తీసుకొని తన జాతి వారి వద్దకు వచ్చింది. ప్రజలు ఇలా అన్నారు, ''మర్యమ్! నీవు పెద్ద పాపమే చేశావు. ఓ హారున్ సోదరీ! నీ తండ్రి కూడ చెడ్డ మనిషికాడే నీ తల్లి కూడ నీతిబాహ్యమైన నడతగల స్త్రీకాదే! '' మర్యమ్ బాలునివైపు సైగజేసి చూపింది. దానికి ప్రజలు , ''ఉయ్యాలలోని ఈ పసిపిల్లవానితో మేము ఏం మాట్లాడము ?'' అని అన్నారు. పిల్లవాడు ఇలా పలికాడు , ''నేను అల్లాహ్ దాసుణ్ణి. ఆయన నాకు గ్రంథాన్ని ఇచ్చాడు , నన్ను ప్రవక్తగా నియమించాడు. నేను ఎక్కడున్నా సరే , ఆయన నన్ను శుభవంతునిగా చేశాడు. నేను జీవించి ఉన్నంత కాలం నమాజును , జకాతును పాటించు అని ఆజ్ఞాపించాడు. నా తల్లి హక్కును నెరవేర్చేవానిగా నన్ను చేశాడు. నన్ను దౌర్జన్యపరునిగాను , పాషాణ హృదయునిగాను చేయలేదు. నేను పుట్టిన రోజునా, నేను మరణించేరోజునా, బ్రతికింపబడి లేపబడే రోజునా నాకు శాంతి కలుగుతుంది.''

**19. మర్యమ్** 34 - 35 ఇతనే మర్యమ్ కుమారుడు ఈసా ఇదే అతనికి సంబంధించిన అసలు నిజం. దానిని గురించి ప్రజలు సందేహిస్తున్నారు. ఎవరినైనా తన కుమారుడుగా చేసుకోవడం అనేది అల్లాహ్ కు తగిన పద్ధతి కాదు. ఆయన పరమ పవిత్రుడు. ఏ విషయాన్ని గురించైనా ఆయన నిర్ణయం తీసుకుంటే , ''అయిపో'' అని ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది.

**19. మర్యమ్** 36 - 40 (ఈసా ఇలా ప్రకటించాడు) ''నాకూ, మీకూ ప్రభువు అల్లాహ్ యే. కనుక మీరు ఆయనకే దాస్యం చేయండి. ఇదే ఋజుమార్గం. '' కాని తరువాత విభిన్న వర్గాలు పరస్పరం విభేదించుకోసాగాయి. కనుక అవిశ్వాసులకు తాము ఒక మహాదినాన్ని చూడబోయే సమయం ఎంతో వినాశాత్మకంగా ఉంటుంది. వారు మా ముందు హాజరయ్యే రోజున వారి చెవులు కూడ బాగానే వింటాయి , వారి కళ్ళు కూడ బాగానే చూస్తాయి. కాని ఈనాడు ఈ దుర్మార్గులు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడిపోయారు. ప్రవక్తా! వారు ఏమరుపాటులో ఉన్నారు , విశ్వసించటానికి సిద్ధంగా లేరు. ఈ స్థితిలో వారిని దుఃఖం తప్ప మార్గాంతరమే ఉండని తీర్పు దినం గురించి భయపెట్టు. చివరకు మేమొక్కరమే భూమికీ, దానిపై ఉన్న సమస్తానికీ వారసులమవుతాము. ఆపై అందరూ మా వైపునకే మరలింపబడతారు.

**19. మర్యమ్** 41 - 50 ఈ గ్రంథంలో ఇబ్రాహీమ్ గాథను ప్రస్తావించు. నిస్సందేహంగా అతను సత్యసంధుడైన వ్యక్తి. ఒక దైవప్రవక్త. (వారికి ఆ సందర్భాన్ని జ్ఞాపకం చెయ్యి). అప్పుడు అతను తన తండ్రితో ఇలా అన్నాడు , ''తండ్రీ! వినలేని, కనలేని, మీ ఏ పనినీ చేసిపెట్టలేని వాటిని మీరు ఎందుకు ఆరాధిస్తున్నారు ? తండ్రీ! నా వద్దకు వచ్చిన జ్ఞానం మీ వద్దకు రాలేదు. మీరు నన్ను అనుస రించండి , నేను మీకు సరి[illegible]న మార్గం చూపుతాను. తండ్రీ! మీరు షైతానుకు దాస్యం చేయకండి. షైతాను కరుణామయుణ్ణి ధిక్కరించాడు. తండ్రీ! మీరు కరుణామయుని శిక్షకు గురి అవుతారేమో అని , షైతాను సహచరులైపోతారేమో అని నాకు భయంగా ఉంది. '' తండ్రి ఇలా అన్నాడు , ''ఓ ఇబ్రాహీమ్! నీవు నాకు ఆరాధ్యులైన వాటికి విముఖుడవు అయ్యావా ? నీవు దీనిని మానుకోక పోతే, నేను నిన్ను రాళ్లతో కొట్టి చంపేస్తాను. కనుక నీవు శాశ్వతంగా నాకు దూరంగా వెళ్లిపో. '' ఇబ్రాహీమ్ ఇలా అన్నాడు , ''మీకు సలామ్. మిమ్మల్ని మన్నించవలసిందని నేను నా ప్రభువును ప్రార్థిస్తాను. నా ప్రభువు నాపై ఎంతో దయకలవాడు. నేను మిమ్మల్ని కూడ విడిచిపోతున్నాను , మీరు దేవుణ్ణి కాదని ప్రార్థిస్తున్న శక్తులను కూడ విడిచిపోతున్నాను. నేను నా ప్రభువునే ప్రార్థిస్తాను. నా ప్రభువును ప్రార్థించి నేను విఫలుణ్ణి కాబోనని నమ్ముతున్నాను. '' ఈ విధంగా అతను వారి నుండి , వారి అల్లాహ్ యేతర ఆరాధ్యుల నుండి వేరైపోయినపుడు , మేము అతనికి ఇస్హాఖ్ , యాఖూబ్‌ల వంటి సంతానాన్ని ప్రసాదించాము , ప్రతి ఒక్కరినీ ప్రవక్తగా చేశాము , వారికి మా కరుణను ప్రసాదించాము. వారికి నిజమైన, ఉన్నతమైన కీర్తి ప్రతిష్ఠలను కలుగజేశాము.

**19. మర్యమ్** 51 - 53 మూసాను గురించి ఈ గ్రంథంలో ప్రస్తావించు. అతను ఎన్నుకో బడిన వ్యక్తి , ఒక సందేశహరుడైన ప్రవక్త. మేము అతనిని తూర్ పర్వతం కుడివైపు నుండి పిలిచాము. రహస్య సంభాషణల ద్వారా అతనికి సాన్నిధ్యాన్ని ప్రసాదించాము. దయతో మేము అతని సోదరుడు హారూన్‌ను ప్రవక్తగా నియమించి అతనికి (సహాయకునిగా) ఇచ్చాము.

**19. మర్యమ్** 54 - 55 ఈ గ్రంథంలో ఇస్మాయీల్‌ను గురించి ప్రస్తావించు. అతను వాగ్దాన పాలకుడు , సందేశహరుడైన ప్రవక్త. అతను తన ఇంటివారిని నమాజు , జకాత్‌లను పాటించండి అని ఆజ్ఞాపించేవాడు. తన ప్రభువునకు ప్రీతిపాత్రుడు.

**19. మర్యమ్** 56 - 57 ఈ గ్రంథంలో ఇద్రీస్‌ను గురించి ప్రస్తావించు.అతను ఒక నిజాయితీ పరుడైన మనిషి , ఒక ప్రవక్త. మేము అతనిని ఉన్నత స్థాయికి లేపాము.

**19. మర్యమ్** 58 అల్లాహ్ అనుగ్రహించిన దైవప్రవక్తలు వీరు , ఆదమ్ సంతతిలోనివారు, మేము నూహ్‌తోపాటు పడవపైకి ఎక్కించిన వారి వంశంలోనివారు, ఇబ్రాహీమ్ సంతతికి చెందినవారు, ఇస్రాయీల్ వంశానికి చెందినవారు, మేము ఋజుమార్గం చూపినవారు , మేము ఎన్నుకున్న ప్రజలలోనివారు. కరుణామయుని వాక్యాలు వారికి వినిపించినపుడు వారు విలపిస్తూ సజ్దాలో పడిపోయేవారు.

**19. మర్యమ్** 59 - 63 వారి తరువాత కొందరు అయోగ్యులు వారి స్థానంలో వచ్చారు. వారు నమాజును త్యజించారు, మనోవాంఛలను అనుసరించారు. కనుక వారు త్వరలోనే మార్గం తప్పిన దానికి ఫలితం అనుభవిస్తారు. అయితే పశ్చాత్తాపపడి మరలేవారూ , విశ్వసించి సత్కార్యాలు చేసేవారూ స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి రవ్వంత అన్యాయం కూడ జరగదు. వారికై శాశ్వతంగా ఉండే స్వర్గవనాలు ఉన్నాయి. అవి అగోచర జగత్తులో లభిస్తాయని కరుణా మయుడు తన దాసులకు వాగ్దానం చేసి ఉన్నాడు. నిశ్చయంగా ఈ వాగ్దానం నెరవేరితీరుతుంది. అక్కడ వారు వ్యర్థమైన మాట ఏదీ వినరు. అక్కడ దేనిని విన్నా సరియైన దానినే వింటారు. వారి ఆహారం వారికి ఉదయం , సాయంత్రం నియమం తప్పకుండా లభిస్తూ ఉంటుంది. మేము మా దాసులలో భయభక్తుల జీవితం గడిపేవాణ్ణి వారసుడుగా చేసే స్వర్గం ఇదే.

**19. మర్యమ్** 64 - 65 ప్రవక్తా! మేము నీ ప్రభువు ఆజ్ఞలేకుండా క్రిందికి దిగిరాము. మా ముందు ఉన్నదానికీ, మా వెనుక ఉన్నదానికీ , ఈ రెండిరటి మధ్య ఉన్నదానికీ , ప్రతిదానికీ ప్రభువు ఆయనే. నీ ప్రభువు ఎన్నడూ మరచిపోయేవాడు కాడు. ఆకాశాలకూ, భూమికీ, భూమ్యాకాశాల మధ్య ఉన్న సర్వానికి ఆయన ప్రభువు. కాబట్టి మీరు ఆయనకు దాస్యం చేయండి. ఆయన దాస్యంలోనే స్థిరంగా ఉండండి. మీకు తెలిసినంత వరకు , ఆయనతో సమానమైన స్థాయిగలవాడె వడైనా ఉన్నాడా?

**19. మర్యమ్** 66 - 72 ''ఏమిటి, నేను చనిపోయిన తరువాత , మళ్లీ నన్ను బ్రతికించటం నిజంగానే జరుగుతుందా?'' అని అంటాడు మనిషి. అసలు అతడు ఏమీ కానపుడే మేము అతనిని సృష్టించామన్న విషయం అతడికి జ్ఞాపకం రావటం లేదా ? నీ ప్రభువు సాక్షిగా! మేము వారందరినీ , వారితో పాటు షైతానులను కూడ తప్పకుండా పోగు చేస్తాము. తరువాత నరకం చుట్టూ హాజరుపరచి, వారిని మోకాళ్లపై కూలదోస్తాము. ఆ తరువాత కరుణామయునికి వ్యతిరేకంగా అహంకారంతో తిరుగుబాటు చేసిన ప్రతి వ్యక్తినీ ప్రతి వర్గం నుండీ వేరు చేస్తాము. ఇంకా వారిలో నరకంలో త్రోయబడటానికి ఎక్కువగా అర్హులెవరో మాకు తెలుసు. మీలో నరకం దరిదాపులకు పోనివాడెవడూ లేడు. ఇది ఒక నిర్ణీత విషయమే. దానిని నెరవేర్చటం నీ ప్రభువు బాధ్యత. తరువాత మేము (ప్రపంచంలో) భయభక్తులు కలిగి ఉన్నవారిని రక్షిస్తాము. దుర్మార్గులను అందులో వారు పడి ఉన్న స్థితిలోనే విడిచిపెడతాము.

**19. మర్యమ్** 73 - 76 స్పష్టమైన మా ఆయతులను వారికి వినిపించినపుడు , తిరస్కారులు విశ్వాసులతో ఇలా అంటారు ''మన ఇరు వర్గాలలో మంచి స్థితిలో ఉన్న వర్గం ఏదో, ఎవరి సభలు అద్భుతంగా ఉన్నాయో చెప్పండి.'' వాస్తవానికి మేము వారికి పూర్వం ఇలాంటి జాతులను ఎన్నింటినో నాశనం చేశాము. అవి వారికంటే అపారమైన వస్తుసామగ్రిని కలిగి ఉండేవి బాహ్య ఆడంబరాల విషయంలో వారికన్న ఎంతో మిన్నగా ఉండేవి. వారితో ఇలా అనండి, మార్గం తప్పిన వ్యక్తికి కరుణామయుడు వ్యవధినిస్తూ పోతాడు. చిట్టచివరకు ఇలాంటి వ్యక్తులు తమకు వాగ్దానం చేయబడిన దానిని గమనించినప్పుడు- అది దైవశిక్ష అయినా కావచ్చు లేదా ప్రళయవేళ అయినాకావచ్చు - వారు తెలుసుకుంటారు , హీన స్థితిలో ఎవరు ఉన్నారో , బలహీనపక్షం ఎవరిదో, దానికి ప్రతిగా ఋజువైన మార్గం అవలంబించిన వారికి అల్లాహ్ ఋజు మార్గావలంబనలో వృద్ధిని ప్రసాదిస్తాడు. చిరస్థాయిగా ఉండిపోయే సత్కార్యాలు మాత్రమే నీ ప్రభువు దృష్టిలో ప్రతిఫలం రీత్యా పర్యవసానం దృష్ట్యా ఉత్తమ మైనవి.

**19. మర్యమ్** 77 - 80 ఇంకా , మా ఆయతులను తిరస్కరించి , ''నేను సంపదతోనూ , సంతానంతోనూ అనుగ్రహింపబడుతూనే ఉంటాను'' అని ప్రగల్భాలు పలికే వ్యక్తిని నీవు చూశావా? అగోచర విషయమేమైనా అతనికి తెలిసిపోయిందా లేక కరుణామయుడి నుండి అతడేమైనా వాగ్దానం పొంది ఉన్నాడా ?- ఎంతమాత్రం కాదు, అతడు వాగే దానిని మేము వ్రాసుకుంటాము , అతడి శిక్షను మరింత పెంచుతాము. అతడు ప్రస్తావిస్తున్నటువంటి వస్తు సామగ్రీ, మందీ మార్బలమూ , అంతా తిరిగి మా వద్దకే చేరిపోతుంది. అతడు ఒక్కడే ఒంటరిగా మా ముందు హాజరవుతాడు.

**19. మర్యమ్** 81 - 82 వారు అల్లాహ్ ను కాదని, కొందరిని తమ దేవుళ్లుగా చేసుకున్నారు, తమకు వారు అండగా ఉంటారని భావించారు. కాని అండగా ఎవరూ ఉండరు. ఆ దేవుళ్లు అందరూ వారి ఆరాధనను నిరాకరిస్తారు , పైగా వారికి ప్రత్యర్థులవుతారు.

**19. మర్యమ్** 83 - 87 మేము సత్యధిక్కారుల మీదకు షైతానులను వదలిపెట్టి ఉన్న విషయాన్ని నీవు చూడటం లేదా? అవి వారిని (సత్యాన్ని వ్యతిరేకించండి అని) అమితంగా పురికొల్పుతున్నాయి. సరే , ఇక వారిపై శిక్ష అవతరించే విషయంలో నీవు తొందరపడకు. మేము వారి రోజులను లెక్కిస్తున్నాము. భయభక్తులు కలవారిని మేము అతిథులుగా కరుణామయుని సన్నిధిలో ప్రవేశ పెట్టబోయే రోజు , అపరాధులను దప్పికగొన్న జంతువులవలే నరకం వైపునకు తోలుకొని పోయే రోజు రానున్నది. అపుడు ప్రజలు ఏ సిఫారసునూ తీసుకు రాగలిగే శక్తిని కలిగి ఉండరు కరుణామయుని సమ్ముఖం నుండి అనుమతి పత్రం పొంది ఉన్నవాడు తప్ప.

**19. మర్యమ్** 88 - 95 కరుణామయుడు ఎవరినో కుమారునిగా చేసుకున్నాడు అని వారు అంటారు - ఎంత ఘోరమైన విషయాన్ని మీరు కల్పించి తెచ్చారు! కరుణామయునికి సంతానం ఉన్నదని వారు చేసే వాదం కారణంగా, త్వరలోనే ఆకాశాలు పగిలిపోతాయేమో , భూమి బ్రద్దలవుతుందేమో , పర్వతాలు పడిపోతాయేమో! ఎవరినైనా కుమారునిగా చేసుకోవటం అనేది కరుణా మయుని ఔన్నత్యానికి తగినది కాదు. భూమ్యాకాశాలలో ఉన్న వారందరూ ఆయన సమక్షంలో దాసులుగా హాజరు కానున్నారు. ఆయన అందరినీ పరివేష్టించి ఉన్నాడు , వారిని సరిగ్గా లెక్కపెట్టి ఉంచాడు. ప్రళయం నాడు అందరూ ఆయన ముందు ఒక్కొక్కరే హాజరవుతారు.

**19. మర్యమ్** 96 - 98 నిశ్చయంగా, విశ్వసించి, సత్కార్యాలు చేస్తూ ఉన్నవారి పట్ల త్వర లోనే కరుణామయుడు ప్రేమను హృదయాలలో కలుగజేస్తాడు. కనుక ప్రవక్తా! నీవు భయభక్తులు కలవారికి శుభవార్తను అందజేయాలనీ , వితండవాదులను భయపెట్టాలనీ మేము ఈ గ్రంథాన్ని సులభతరం చేసి నీ భాషలో అవతరింప జేశాము. వారికి పూర్వం మేము ఎన్నో జాతులను నాశనం చేశాము. ఈనాడు ఎక్కడైనా నీవు వారి గుర్తులను చూస్తున్నావా ? లేక ఎక్కడన్నా వారిని గురించిన గుస గుస ఏదైనా నీకు వినిపిస్తోందా?

**21. తాహా**

ఆయతులు : 135 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**21. తాహా** 1 - 8 తాహా, మేము ఈ ఖుర్ఆన్‌ను నీపై అవతరింపజేసింది నిన్ను కష్టానికి గురిచేయటానికి మాత్రం కాదు. ఇది భయపడే ప్రతి వ్యక్తికీ ఒక జ్ఞాపిక. భూమినీ , ఎత్తైన ఆకాశాలనూ సృష్టించిన వాని తరఫు నుండి ఇది అవతరింప జేయబడిరది. ఆ కరుణామయుడు (సృష్టి) సామ్రాజ్య పీఠంపై ఆసీనుడై ఉన్నాడు. ఆకాశాలలో , భూమిలో మరియు భూమ్యాకాశాల మధ్య , ఇంకా నేలక్రింద ఉన్న వాటినన్నింటికీ ఆయన యజమాని. నీవు నీ మాటను బిగ్గరగా పలికినా పరవాలేదు. ఆయన మెల్లగా పలికిన మాటను మాత్రమే కాదు , దానికంటే అతి

గోప్యమైన మాటను సైతమూ ఎరుగును. ఆయనే అల్లాహ్ , ఆయన తప్ప మరొక దేవుడే లేడు. ఆయనకు ఉత్తమమైన పేర్లు ఉన్నాయి.

**21. తాహా** 9 - 10 మూసా వృత్తాంతం కూడ నీకేమైనా అందిందా ? అప్పుడు అతను ఒక మంటను చూసి తన ఆలుబిడ్డలతో ఇలా అన్నాడు, ''కొంచెం ఆగండి, నేను ఒక మంటను చూశాను. బహుశా మీ కోసం కాస్త నిప్పును తీసుకురాగల నేమో లేదా ఆ మంట వద్ద నాకేదైనా (దారికి సంబంధించిన) మార్గదర్శకత్వం లభిస్తుందేమో.''

**21. తాహా** 11 - 39 ... అక్కడకు చేరగానే, ఒక వాణి ఇలా పిలిచింది, ''మూసా! నేనే నీ ప్రభువును, చెప్పులు విడు. నీవు పవిత్రమైన తువా లోయలో ఉన్నావు. నేను నిన్ను ఎన్నుకున్నాను. వహీ ద్వారా చెప్పబడే దానిని విను. నేనే అల్లాహ్ ను , నేను తప్ప మరొక దేవుడు లేడు. కనుక నీవు నాకు దాస్యం చెయ్యి. నా జ్ఞాపకం కోసం నమాజును స్థాపించు. ప్రళయ ఘడియ తప్పని సరిగా వస్తుంది. నేను దాని సమయాన్ని గోప్యంగా ఉంచాలనుకున్నాను. ప్రతి వ్యక్తీ తన కృషి ప్రకారం ప్రతిఫలం పొందగలగటానికి. కనుక దానిని విశ్వసించకుండా తన మనోవాంఛలకు దాసుడైపోయిన వ్యక్తి ఎవడైనా , నిన్ను ఆ ఘడియను గురించిన చింతన నుండి మరల్చకూడదు మరల్చితే నీవు వినాశానికి గురిఅవుతావు - మూసా! నీ చేతిలో ఉన్నది ఏమిటి ?'' దానికి మూసా , ''ఇది నా చేతికర్ర దాని ఆధారంగా నడుస్తాను. దానితో నా మేకల కోసం ఆకులు రాలుస్తాను. ఇంకా ఎన్నో పనులు దానితో నెరవేర్చుకుంటాను'' అని సమాధానం చెప్పాడు. ''మూసా! దానిని విసరివెయ్యి '' అని దేవుడు సెలవిచ్చాడు. అతను విసరివేశాడు. అకస్మాత్తుగా అది పరుగెత్తుతున్న ఒక పాముగా మారిపోయింది. దేవుడు ఇంకా ఇలా అన్నాడు, ''దాన్ని పట్టుకో, భయపడకు. మేము దానిని మళ్ళీ అది పూర్వం ఉన్న మాదిరిగానే చేసివేస్తాము. నీ చేతిని కొంచెం నీ చంకలోకి నొక్కు, అది మెరుస్తూ బయటకు వస్తుంది, ఎలాంటి బాధలేకుండానే. ఇది రెండో సూచన. ఎందుకంటే, మేము నీకు మా పెద్ద సూచనలను చూపబోతున్నాము. ఇక నీవు ఫిరౌను వద్దకు వెళ్లు , అతడు ధిక్కారి అయిపోయాడు.'' మూసా ఇలా మనవి చేసుకున్నాడు , ''ప్రభూ! నా హృదయాన్ని తెరువు. నా కార్యాన్ని నా కొరకు సులభతరం చెయ్యి. ప్రజలు నా మాటలు అర్థం చేసుకోగలగటానికి నా నాలుక ముడిని విప్పు. ఇంకా నా కొరకు నా కుటుంబం నుండే ఒక సహాయకుణ్ణి నియమించు - నా సోదరుడు హారూన్‌ని - అతని ద్వారా నా చేతులను పటిష్ఠం చెయ్యి. అతనిని నా కార్యంలో నాకు సహాయపడేలా చెయ్యి. మేము నీ పరిశుద్ధతను అత్యధికంగా ప్రకటించేటందుకు , నిన్ను అమితంగా స్మరించేటందుకు. నీవు నిత్యమూ మా స్థితిని కనిపెట్టే ఉన్నావు.'' ఇలా సెలవిచ్చాడు ''మూసా! నీవు కోరినది ఇవ్వబడిరది. మేము మరొకసారి నీకు ఉపకారం చేశాము. మేము నీ తల్లికి సూచన ఇచ్చిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అది వహీ ద్వారా మాత్రమే ఇవ్వబడే సూచన. అది ఏమిటంటే ఈ బాలుణ్ణి పెట్టెలో పెట్టి, ఆ పెట్టెను నదిలోకి వదలివెయ్యి. నది దానిని ఒడ్డున పడవేస్తుంది. నాకూ, ఈ బాలుడికి శత్రువు అయిన వాడు దానిని పట్టుకువెళతాడు.''

**21. తాహా** ... 39 - 44 నేను నా తరఫు నుండి నీపై ప్రేమను ఆవరింపజేశాను , నీవు నా పర్యవేక్షణలో పెంచబడే ఏర్పాటు చేశాను. జ్ఞాపకం తెచ్చుకో , అప్పుడు నీ సోదరి అనుసరిస్తూ అక్కడకు వెళ్ళి , ''ఈ బాలుణ్ణి చక్కగా పెంచి పోషించే ఆమెను గురించి మీకు తెలుపనా ?'' అని అంటుంది. ఇలా మేము నిన్ను మళ్ళీ నీ తల్లి వద్దకే చేర్చాము , ఆమె కళ్ళు చల్లబడేందుకు, ఆమె దుఃఖించకుండా ఉండేందుకు. ఇంకా (ఈ విషయం కూడ జ్ఞాపకం తెచ్చుకో) నీవు ఒక వ్యక్తిని హత్య చేశావు. మేము ఆ ఉచ్చు నుండి నీకు విముక్తి కలిగించాము , తరువాత నిన్ను విభిన్న పరీక్షలకు గురిచేశాము. నీవు మద్యన్ ప్రజల మధ్య ఎన్నో సంవత్సరాలు గడిపావు. మూసా! ఇప్పుడు నీవు సరిగ్గా సమయానికి వచ్చేశావు. నేను నిన్ను నా కొరకు తీర్చిదిద్దుకున్నాను. వెళ్ళండి , నీవూ, నీ సోదరుడూ, నా సూచనలతో. చూడండి, మీరు నన్ను స్మరించే విషయంలో అశ్రద్ధ చెయ్యకండి. మీరు ఇద్దరూ కలసి ఫిరౌన్ వద్దకు వెళ్లండి, అతడు ధిక్కారి అయిపోయాడు. అతనితో మృదువుగా మాట్లాడండి , బహుశా అతడు హితబోధను స్వీకరిస్తాడేమో లేదా (దేవునికి) భయపడతాడేమో.''

**21. తాహా** 45 - 48 ఉభయులూ ఇలా మనవి చేసుకున్నారు, ''ప్రభూ! అతడు మాపై దౌర్జన్యం చేస్తాడేమో అని లేక మాపై విరుచుకుపడతాడేమో అని మేము భయపడుతున్నాము. '' ఇలా సెలవిచ్చాడు, ''భయపడకండి, మీతో పాటు నేనూ ఉన్నాను , అంతా వింటూ ఉన్నాను. చూస్తూ ఉన్నాను. అతని వద్దకు వెళ్ళి ఇలా అనండి , 'మేము నీ ప్రభువు సందేశహరులము. ఇస్రాయీల్ సంతతివారు మాతో రావటానికి అనుమతించు. వారిని బాధపెట్టకు. మేము నీ వద్దకు నీ ప్రభువు సూచనలు తీసుకుని వచ్చాము. ఋజుమార్గం అనుస రించే వానికి శాంతి ఉంది. తిరస్కరించి విముఖుడయ్యే వానికి శిక్ష ఉంది' అని మాకు వహీ ద్వారా తెలుపబడిరది.''

**21. తాహా** 49 - 55 ఫిరౌను ''సరే, అయితే మూసా! మీ ఇద్దరి ప్రభువు ఎవడు ?'' అని అడిగాడు. దానికి మూసా ''ప్రతి వస్తువుకూ దాని స్వరూపాన్ని ప్రసాదించి, తరువాత దానికి మార్గం చూపినవాడే మా ప్రభువు'' అని జవాబు చెప్పాడు. అప్పుడు ఫిరౌను , ''అయితే పూర్వం గతించిన తరాల వారి స్థితి ఏమిటి ?'' అని అన్నాడు. మూసా , ''దానికి సంబంధించిన జ్ఞానం నా ప్రభువు వద్ద ఒక గ్రంథంలో సురక్షితంగా ఉంది. నా ప్రభువు పొరపాటూ చెయ్యడు మరవడు కూడాను'' అని సమాధానం పలికాడు. ఆయనే మీ కొరకు భూమిని పాన్పుగా పరిచాడు , దానిపై మీరు నడిచేందుకు మార్గాలను నిర్మించాడు పై నుండి నీటిని కురిపించాడు. తరువాత దాని ద్వారా రకరకాల పంటలను పండిర చాడు. వాటిని తినండి , మీ పశువులను కూడ మేపండి. నిశ్చయంగా అర్థం చేసుకోగల వారికి ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి. ఈ నేల నుండే మేము మిమ్మల్ని సృష్టించాము , దానిలోనికే మేము మిమ్మల్ని తిరిగి తీసుకు పోతాము. దాని నుండే మిమ్మల్ని మళ్ళీ వెలికి తీస్తాము.

**21. తాహా** 56 - 61 మేము ఫిరౌనుకు మా సమస్త సూచనలనూ చూపాము. కాని అతడు నిరాకరించాడు , విశ్వసించలేదు. ఇలా అన్నాడు, ''మూసా! నీవు నీ మంత్రజాల శక్తితో మమ్మల్ని మా దేశం నుండి వెళ్లగొట్టటానికి

మా వద్దకు వచ్చావా ? సరే మేము కూడ నీకు పోటీగా అటువంటి మంత్రజాలాన్నే తీసుకువస్తాము. ఎప్పుడు , ఎక్కడ ఎదుర్కోవాలో నిర్ణయించుకో. మేమూ ఈ ఒప్పందం నుండి మళ్లిపోము , నీవూ మళ్ళిపోకూడదు. బహిరంగ మైదానం లోనికి రా.'' మూసా, ''ఉత్సవ దినం నిర్ణయమైంది. పొద్దెక్కిన తరువాత ప్రజలు సమావేశం కావాలి'' అని చెప్పాడు. ఫిరౌను మరలిపోయి , తన కుతంత్ర సామగ్రిని సమీకరించుకుని పోటీకి వచ్చాడు. (పోటీ ప్రారంభంలోనే ప్రత్యర్థి వర్గాన్ని సంబోధిస్తూ) మూసా ఇలా అన్నాడు, ''దౌర్భాగ్యులారా అల్లాహ్ పై అపనిందలు మోపకండి. అలా చేస్తే ఆయన మిమ్మల్ని ఒక కఠిన శిక్ష ద్వారా సర్వనాశనం చేస్తాడు. అబద్ధాన్ని ఎవడు కల్పించినా, వాడు విఫలుడే అయ్యాడు.''

**21. తాహా** 62 - 64 ఇది విన్న తరువాత వారి మధ్య అభిప్రాయ భేదం తలెత్తింది. వారు తమలో తాము రహస్యంగా సంప్రదించుకోసాగారు. చివరకు కొందరు ఇలా అన్నారు, ''ఈ ఇద్దరు కేవలం మాంత్రికులే. వారి ఉద్దేశ్యం తమ మంత్రబలం ద్వారా మిమ్మల్ని మీ దేశం నుండి తరిమివేయటం. అంతేకాదు మీ ఆదర్శ జీవన విధానాన్ని అంతమొందించటం. కావున మీరు ఈనాడు మీ శక్తియుక్తులను సమీకరించుకోండి , సమైక్యంగా రంగంలోకి దిగండి. ఈనాడు ప్రాబల్యం వహించిన వాడే గెలిచాడు అనే విషయం తెలుసుకోండి.''

**21. తాహా** 65 - 76 మాంత్రికులు, ''మూసా! మొదట నీవు విసురుతావా లేక మేము విసరమా?'' అని అడిగారు. దానికి మూసా, ''లేదు, మీరే విసరండి'' అని అన్నాడు. అపుడు అకస్మాత్తుగా వారి త్రాళ్లూ , వారి కర్రలూ వారి మంత్రశక్తి వల్ల పరుగెత్తుతూ ఉన్నట్లు మూసాకు అనిపించింది. మూసా తన మనస్సులో భయపడ్డాడు. మేము ఇలా అన్నాము, ''భయపడకు, నీవే ఆధిక్యం వహిస్తావు. నీ చేతిలో ఉన్న దానిని విసిరివెయ్యి. ఇప్పుడే అది వారు కల్పించిన వాటి నన్నింటినీ మింగివేస్తుంది. వారు కల్పించి తీసుకువచ్చింది కేవలం మాంత్రి కుని తంత్రమే. మాంత్రికుడు ఎన్నడూ సఫలుడు కాలేడు , వాడు ఎంత నేర్పరి అయినాసరే. చివరకు జరిగిందేమిటంటే , మాంత్రికులందరూ సజ్దా (సాష్టాంగపడటం)లో పడవేయబడ్డారు. వారు ఎలుగెత్తి , ''మేము హారూన్ , మూసాల ప్రభువును విశ్వసించాము'' అని ప్రకటించారు. ఫిరౌను ఇలా అన్నాడు , ''నేను మిమ్మల్ని అనుమతించకముందే మీరు ఇతన్ని విశ్వసించారా? ఇతడు మీకు మంత్ర విద్య నేర్పిన గురువని తెలిసిపోయింది. సరే, ఇప్పుడు నేను మీ చేతులను, మీ కాళ్ళను వ్యతిరేక పార్శ్వాల నుండి (కుడిచెయ్యి , ఎడమకాలు, ఎడమ చెయ్యి కుడి కాలు) నరికిస్తాను. ఖర్జూరపు దూలాలపై శిలువ వేయిస్తాను. అప్పుడు మా ఇద్దరి శిక్షలలో ఏది ఎక్కువ కఠినమైనదో, ఏది దీర్ఘకాలికమైనదో మీకు తెలుస్తుంది. (అంటే మీకు నేను ఎక్కువ కఠినమైన శిక్ష విధించగలనా లేక మూసా విధించగలడా అని). మాంత్రికులు ఇలా జవాబు పలికారు , ''మమ్మల్ని సృష్టించిన శక్తి సాక్షిగా! స్పష్టమైన సూచనలు ముందుకు వచ్చిన తరువాత కూడ (సత్యంపై) నీకు ప్రాధాన్యం ఇవ్వటం అనేది జరగని పని. నీవు చెయ్యదలచుకున్నది చేసుకో, మహాఅయితే నీవు ఈ ప్రపంచ జీవితం గురించి మాత్రమే నిర్ణయం చెయ్యగలవు. మేము మా ప్రభువును విశ్వసించాము. మా తప్పులను ఆయన క్షమించాలని , నీవు బలవం తంగా మా చేత

చేయించిన మంత్రతంత్రాలకు మమ్మల్ని మన్నించాలని. అల్లాహ్ యే మంచివాడు , కలకాలం ఉండేవాడు.'' - యథార్థం ఏమిటంటే, దోషిగా తన ప్రభువు ముందు హాజరయ్యే వాడికి నరకం తప్పదు. అందులో వాడు చావనూ లేడు, బ్రతకనూ లేడు. ఆయన సాన్నిధ్యంలో విశ్వాసిగా హాజరు అయి , సత్కార్యాలు చేసి ఉన్నవాడు, - అలాంటి వారందరికీ ఉన్నత స్థానాలు ఉన్నాయి. నిత్యం పచ్చగా ఉండే ఉద్యానవనాలు ఉన్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వాటిలో వారు శాశ్వతంగా ఉంటారు. పరిశుద్ధతను పాటించే వ్యక్తికి లభించే ప్రతిఫలం ఇదే.

**21. తాహా** 77 మేము మూసాకు వహీద్వారా ఇలా తెలిపాము , ''ఇక రాత్రికి రాత్రే నా దాసులను తీసుకుని బయలుదేరు, వారి కొరకు సముద్రంలో పొడిబాటను ఏర్పాటు చెయ్యి, ఎవరైనా వెంటాడుతారేమో అనే భయం నీకు ఏమాత్రం వద్దు, (సముద్రం మధ్యగా పోతున్నప్పుడు) భయపడనూవద్దు.''

**21. తాహా** 78 - 79 వెనుక నుండి ఫిరౌను తన సేనలతో అక్కడకు చేరాడు. తరువాత సముద్రం వారిని క్రమ్ముకుంది, క్రమ్ముకోవలసిన విధంగా, ఫిరౌను తన జాతి ప్రజలను మార్గభ్రష్టులుగానే చేశాడు, వారికి సరియైన మార్గదర్శకత్వాన్ని ఇవ్వలేదు.

**21. తాహా** 80 - 82 ఇస్రాయీల్ సంతానమా! మేము మీకు మీ శత్రువు నుండి విముక్తి కలిగించాము. తూర్ పర్వతం కుడి ప్రక్కన మీరు హాజరయ్యేందుకు గడువు నిర్ణయించాము. ఇంకా మీపై మన్‌న్ను , సల్వాను అవతరింపజేశాము - మేము ఇచ్చిన పరిశుద్ధమైన ఆహారాన్ని తినండి. దానిని తిని తిరుగుబాటు చెయ్యకండి. చేస్తే నా ఆగ్రహం మీపై విరుచుకుపడుతుంది. ఎవడి మీద నా ఆగ్రహం విరుచుకుపడుతుందో , అతడు పతనం కావటం తథ్యం. అయితే ఎవడు పశ్చాత్తాపపడతాడో మరియు విశ్వసించి మంచిపనులు చేస్తాడో , ఆ తరువాత సక్రమంగా నడుచుకుంటాడో, అతనిని నేను అమితంగా మన్నిస్తాను.

**21. తాహా** 83 - 85 మూసా! ఏ విషయం నిన్ను నీ జాతి ప్రజలకంటే , ముందుగానే ఇక్కడకు తీసుకువచ్చింది? అతను ఇలా మనవి చేసుకున్నాడు , ''ఇదిగో వారు నా వెనుక వస్తూనే ఉన్నారు. నేనే త్వరత్వరగా నీ సాన్నిధ్యానికి వచ్చాను, నా ప్రభూ! నీవూ నా పట్ల ప్రసన్నుడవు కావాలని. '' ఇలా సెలవిచ్చాడు, ''అయితే విను మేము నీ వెనుక (నీవు లేనప్పుడు) నీ జాతి ప్రజలను పరీక్షకు గురిచేశాము. 'సామిరీ' వారిని మార్గం తప్పించాడు.

**21. తాహా** 86 - 91 మూసా ఆగ్రహోదగ్రుడై, దుఃఖిస్తూ తన జాతి వారి వైపునకు మరలాడు. అక్కడకు వెళ్ళి ఇలా అన్నాడు, ''నా జాతి ప్రజలారా! మీ ప్రభువు మీకు మంచి వాగ్దానాలు చేయలేదా ? అప్పుడే మీకు ఎన్నో రోజులు గడిచినట్లు అనిపించిందా? లేక మీరు మీ ప్రభువు ఆగ్రహాన్ని మీపైకి కొనితెచ్చుకోవాలని కోరుకున్నందువల్లనే మీరు నాకు చేసిన వాగ్దానాన్ని భంగం చేశారా ?'' దానికి సమాధానంగా వారు ఇలా అన్నారు , ''మేము నీకు చేసిన

వాగ్దానాన్ని మాకు మేమై భంగపరచలేదు. జరిగిందేమిటంటే , ప్రజల ఆభరణాల బరువు మాపై పడగా మేము వాటిని క్రింద పడవేశాము , అంతే - తరువాత ఇలానే సామిరీ కూడ ఏదో కొంత వేశాడు , వారికై ఒక ఆవుదూడ విగ్రహాన్ని చేసి వెలికి తీశాడు , దానిలో నుండి ఎద్దు అరుపువంటి శబ్దం వచ్చేది. ప్రజలు అరుస్తూ ''ఇదే మీ దైవమూ, మూసా దైవము కూడా. మూసా దీనిని మరచిపోయాడు '' అని అన్నారు. అది వారు అడిగిన దానికి సమాధానం చెప్పజాలదనే విషయాన్నీ , వారి లాభనష్టాలపై దానికి ఏ అధికారమూ లేదు అనే విషయాన్నీ వారు గమనించటం లేదా? హారూన్ (మూసా రాకకు) ముందే వారితో ఇలా అన్నాడు , ''ప్రజలారా! దీనివలన మీరు పెద్ద విపత్తులోనే పడిపోయారు. రహ్మానే (కరుణామయుడు) మీ ప్రభువు. కనుక మీరు నన్ను అనుసరించండి , నా మాట వినండి.'' కాని వారు అతనితో ఇలా అననే అన్నారు , ''మావద్దకు మూసా తిరిగి వచ్చేవరకు, మేము దీనినే పూజిస్తూ ఉంటాము.''

**21. తాహ్** 92 - 98 మూసా (తన జాతివారిని మందలించిన తరువాత హారూన్ వైపునకు తిరిగి ఇలా) అన్నాడు, ''హారూన్! వారు మార్గం తప్పుతున్నారనే విషయాన్ని నీవు గమనించినప్పుడు నా మార్గాన్ని అనుసరించకుండా నిన్ను వారించిన విషయం ఏమిటి? నీవు నా ఆజ్ఞను ఉల్లంఘించావా?'' హారూన్ ఇలా జవాబు చెప్పాడు, ''నా తల్లి కుమారుడా! నా గడ్డాన్ని పట్టుకోకు , నా తల వెంట్రుకలను పట్టి లాగకు. 'ఇస్రాయీలు సంతతిలో నీవు చీలికలు తీసుకువచ్చావు. నా మాటను లక్ష్యపెట్టలేదు ' అని నీవు అంటావని నేను భయపడ్డాను. '' అప్పుడు మూసా , ''అయితే, సామిరీ! నీ సంగతేమిటో చెప్పు'' అని అడిగాడు. అతడు ఇలా అన్నాడు, ''నేను వారికి కనిపించని దాన్ని ఒక దానిని చూశాను. అప్పుడు నేను సందేశహరుని అడుగుజాడలలో నుండి ఒక పిడికెడు మట్టిని తీసుకున్నాను. దానిని (ఆవు దూడపై) పోశాను. నా ఆత్మ నాకు అలానే సూచించింది.'' మూసా ఇలా అన్నాడు, ''సరే, వెళ్లిపో, ఇక జీవితాంతం నీవు 'నన్ను ముట్టుకోకండి' అనే అరుస్తూ ఉంటావు. నీ విచారణ కొరకు ఒక సమయం నిర్ణయమయ్యే ఉంది. అది నీ విషయంలో ఏమాత్రం తొలగదు. ఇక చూడు, శ్రద్ధాభక్తులతో నీవు ఆరాధించే నీ ఈ దైవాన్ని, ఇప్పుడు మేము కాల్చి పారవేస్తాము , భస్మంగా చేసి సముద్రంలో కలిపివేస్తాము. ప్రజలారా! మీ దేవుడు కేవలం ఒక్క అల్లాహ్ మాత్రమే. ఆయన తప్ప మరొక దేవుడు లేనేలేడు. ఆయన జ్ఞానం ప్రతి విషయాన్ని ఆవరించి ఉన్నది.''

**21. తాహ్** 99 - 112 ప్రవక్తా! ఇలా మేము పూర్వం జరిగిన సంఘటనల చరిత్రను నీకు వినిపిస్తున్నాము. మేము ప్రత్యేకంగా మా వద్దనుండి నీకు ఒక ''జ్ఞాపిక'' (హితోపదేశం)ను ప్రసాదించాము. దానికి విముఖుడయ్యే వాడు ప్రళయం నాడు పెద్ద పాపభారాన్ని మోస్తాడు. అటువంటి వారందరూ ఆ సంకటంలో సదా చిక్కుకుని ఉంటారు. ప్రళయం నాడు (ఈ నేరం యొక్క బాధ్యతా భారం) వారికి ఎంతో బాధాకరమైన బరువుగా ఉంటుంది. శంఖం ఊదబడే ఆ రోజున మేము అపరాధులను ఒకచోట చేరుస్తాము. వారి కనుగుడ్లు భయంవల్ల తెలిపోయి ఉంటాయి. అప్పుడు వారు ''ప్రపంచంలో మహాఅయితే మీరు పదిరోజులు గడిపారేమో'' అని పరస్పరం గుసగుసలాడుకుంటారు - వారు మాట్లాడుకుంటూ ఉండేది ఏమిటో మాకు బాగా తెలుసు. (ఇది కూడ మాకు తెలుసు). అప్పుడు వారిలో

అతి జాగ్రత్తగా అంచనావేసేవాడు సైతం ''కాదు, ప్రపంచంలో మీ జీవితం కేవలం ఒక రోజు జీవితం మాత్రమే '' అనే అంటాడు. వారు నిన్ను, ''ఇంతకూ, ఆ రోజున ఈ పర్వతాలు ఏమవుతాయి'' అని అడుగుతారు. ఇలా చెప్పు, ''నా ప్రభువు వాటిని ధూళిగా చేసి ఎగుర వేస్తాడు , భూమిని చదునైన ప్రదేశంగా చేస్తాడు. అందులో మీరు వంకరలు గాని, మిట్టపల్లాలు గాని చూడరు.'' - ఆ రోజున ప్రజలందరూ పిలిచేవాని పిలుపు వినగానే నేరుగా వచ్చేస్తారు , ఎవ్వడూ తలబిరుసుగా ప్రవర్తించలేడు. కంఠ స్వరాలన్నీ కరుణామయుని ముందు అణగిపోతాయి. ఒక్క చిరుసవ్వడి తప్ప మీరు ఏమీ వినలేరు. ఆ రోజున సిఫారసు ఏమాత్రమూ పనిచెయ్యదు. కరుణామయుడు ఎవరికైనా దానికి అనుమతిని ఇచ్చి అతని మాటను ఆలకించటానికి ఇష్టపడితే తప్ప - ఆయన ప్రజల పూర్వోత్తరాలను అన్నింటినీ ఎరుగును. ఇతరులకు వాటిని గురించి పూర్తిగా తెలియదు - సజీవుడు , నిత్యుడు అయిన ఆయన ముందు ప్రజల శిరస్సులు వంగిపోతాయి. ఏదైనా అన్యాయం చేసి దాని పాప భారాన్ని తన నెత్తిపై మోసేవాడు అప్పుడు నష్ట పోతాడు. సత్కార్యాలు చేసినవానికి అతడు విశ్వాసి కూడ అయితే , ఏ అన్యా యమూ జరగదు. అతని హక్కులు కాజేయబడే ప్రమాదమూ ఉండదు.

**21. తాహా** 113 ఓ ప్రవక్తా! ఈ విధంగా మేము దీనిని అరబ్బీ ఖురాన్‌గా అవతరింప జేశాము , అందులో పలురకాలుగా హెచ్చరికలు చేశాము, బహుశా వారు వక్ర వైఖరిని విడనాడుతారేమో అని , లేక దీని కారణంగా వారిలో చేతన కలిగే సూచనలు జనిస్తాయేమో అని.

**21. తాహా** 114 కనుక అందరికంటే ఉన్నతుడు , గొప్పవాడు అల్లాహ్ యే , ఆయనే నిజమైన చక్రవర్తి. చూడు , ఖుర్‌ఆన్ చదవటంలో తొందరపడకు, నీ వైపునకు దాని వహీ పూర్తికానంత వరకు, ఇలా ప్రార్థించు, ''ఓ ప్రభూ! నాకు మరింత జ్ఞానం ప్రసాదించు.''

**21. తాహా** 115 - 127 దీనికి పూర్వం మేము ఆదమ్‌కు ఒక ఆజ్ఞ ఇచ్చాము. కాని అతను దానిని మరచిపోయాడు. మేము అతనిలో నిలకడను చూడలేదు. మేము దైవదూతలతో ఆదమ్‌కు సజ్దా చేయండి అని చెప్పిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో. వారందరూ సజ్దా చేశారు. కాని ఒక్క ఇబ్లీస్ మాత్రం తిరస్కరించాడు. అప్పుడు మేము ఆదమ్‌తో ఇలా అన్నాము , ''చూడు, ఇతడు నీకూ, నీ భార్యకూ శత్రువు. కనుక జాగ్రత్త. ఇతడు మిమ్మల్ని స్వర్గం నుండి బహిష్కరింపజేస్తాడేమో , మీరు ఆపదల పాలవుతారేమో, ఇక్కడ మీకు చాల సౌకర్యాలు ఉన్నాయి. పస్తులూ ఉండరు, దిగంబరులుగానూ ఉండరు. దప్పికా, ఎండా మిమ్మల్ని వేధించవు.'' కాని షైతాను అతనిని మోసం చేశాడు, ఇలా అన్నాడు, ''ఓ ఆదమ్! శాశ్వత జీవితాన్నీ అంతంకాని సామ్రాజ్యాన్ని ఇచ్చే వృక్షాన్ని నీకు చూపేదా?'' చివరకు వారు ఉభయులు (భార్యాభర్తలు) ఆ వృక్షఫలాన్ని తినేశారు. పర్యవసానంగా వెంటనే వారి మర్మాంగాలు ఒకరివి ఒకరి ముందు బహిర్గతమయ్యాయి. వారిరువురు స్వర్గపు ఆకులతో తమను తాము కప్పుకోసాగారు. ఆదమ్ తన ప్రభువు పట్ల అవిధేయత చూపాడు. ఋజుమార్గం తప్పిపొయ్యాడు. దాని తరువాత

అతని ప్రభువు అతనిని ఎన్నుకుని , అతని పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు. అంతేకాదు , అతనికి మార్గ దర్శకత్వాన్ని ప్రసాదించాడు. ఇంకా ఇలా సెలవిచ్చాడు, ''మీరిద్దరు (ప్రత్యర్థులు అంటే మానవుడు, షైతాన్) ఇక్కడి నుండి దిగిపోండి. మీరొకరికొకరు శత్రువు లుగా ఉంటారు. ఇక నా తరఫు నుండి మార్గదర్శకత్వం ఏదైనా మీ వద్దకు వస్తే, ఎవడు నా ఈ మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తాడో , అతడు మార్గమూ తప్పడు, దౌర్భాగ్యానికీ గురికాడు. నా జ్ఞాపికకు (హితోపదేశం) విముఖుడైన వానికి ప్రపంచంలో జీవితం ఇరుకవుతుంది. ప్రళయం నాడు మేము అతనిని అంధుడుగా లేపుతాము.'' - అప్పుడు అతడు ''ప్రభూ! ప్రపంచంలో నేను చూడగలవాణ్ణికదా! నన్ను ఇక్కడ అంధునిగా ఎందుకు లేపావు ?'' అని అడుగుతాడు. అల్లాహ్ ఇలా సెలవిస్తాడు , ''మా ఆయతులు , నీ వద్దకు వచ్చినప్పుడు నీవు వాటిని విస్మరించావు. అదేవిధంగా ఈనాడు నీవు కూడ విస్మరించబడుతున్నావు. '' - ఈవిధంగా మేము హద్దులు అతిక్రమించేవాడికీ , తన ప్రభువు ఆయత్‌లను విశ్వసించని వాడికి (ప్రపంచంలో) ప్రతిఫలం ఇస్తాము. ఇక పరలోక శిక్ష అయితే ఎక్కువ కఠినమైనదీ ఎక్కువ కాలం ఉండేదీనూ.

**21. తాహా** 128 వీరికి పూర్వం మేము ఎన్నో జాతులను నాశనం చేసివేశాము. ఆ జాతుల(శిథిలమైన) నివాస స్థలాలలో ఈనాడు వీరు సంచరిస్తున్నారు. అయినా వీరికి (చరిత్ర నేర్పే ఈ గుణపాఠం ద్వారా) మార్గదర్శకత్వం లభించలేదా? వాస్తవంగా వివేకవంతులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.

**21. తాహా** 129 - 132 నీ ప్రభువు తరఫు నుండి మొదట్లోనే ఒక విషయం నిశ్చయమై ఉండకపోతే , ఒక గడువు కాలం నిర్ణయమై ఉండకపోతే, వీరి తీర్పు కూడ జరిగే ఉండేది. కనుక ఓ ప్రవక్తా! వీరు కల్పించే మాటల పట్ల సహనం వహించు నీ ప్రభువు స్తోత్రంతో పాటు , ఆయన పవిత్రతను కొనియాడు, సూర్యుడు ఉదయించే ముందు, అస్తమించే ముందు, రాత్రి సమయాల్లో కూడ పగటి అంచులలో కూడ ఆయనను స్తుతించు. బహుశా నీవు సంతుష్టు డవౌతావేమో. వీరిలోని రకరకాల ప్రజలకు మేము ఇచ్చిన ప్రపంచ జీవితపు శోభావైభవాలను కన్నెత్తి కూడ చూడకు. వాటిని మేము వారిని పరీక్షకు గురిచెయ్యటానికే ఇచ్చాము. నీ ప్రభువు అనుగ్రహించిన హలాల్ ఉపాధియే ఉత్తమమైనది , చిరకాలం ఉండేది. నీ కుటుంబ సభ్యులను నమాజు చెయ్యండి అని ఆజ్ఞాపించు. స్వయంగా నీవు కూడ దానిని పాటించు. మేము నీ నుండి ఉపాధినేమీ కోరడం లేదు. ఉపాధిని మేమే నీకు ఇస్తూ ఉన్నాము. చివరకు మేలు జరిగేది భయభక్తులకే.

**21. తాహా** 133 - 135 వారు, ఈ వ్యక్తి తన ప్రభువు దగ్గర నుండి ఏదైనా సూచనను (మహిమను) ఎందుకు తీసుకురాడూ? అని అడుగుతారు. పూర్వ గ్రంథాలలోని సమస్త బోధలుగల స్పష్టమైన నిదర్శనం వారి వద్దకు రాలేదా? ఒకవేళ మేము దాని రాకకు పూర్వమే వారిని ఏదైనా శిక్ష ద్వారా నాశనం చేసి ఉంటే , వారే తరువాత ఇలా అని ఉండేవారు, ''ఓ ప్రభూ! నీవు మా వద్దకు ప్రవక్తను ఎవరినైనా ఎందుకు పంపలేదు? అగౌరవ అవమానాల పాలుకాక ముందే మేము నీ ఆయత్‌లను అనుసరించి ఉండేవారము కదా! '' ఓ ప్రవక్తా! వారితో ఇలా అను ,

‘‘ప్రతివాడు అంతిమ ఫలితం కోసం నిరీక్షిస్తున్నాడు. కనుక మీరు కూడ నిరీక్షించండి. త్వరలోనే మీరు తెలుసుకుంటారు. ఋజు మార్గంలో నడిచే వారెవరో, మార్గదర్శకత్వం పొందినవారెవరో.’’

**21. అల్ అంబియా**

ఆయతులు : 112 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**21. అల్ అంబియా** 1 - 3 మానవుల లెక్కల (పరిశీలన) సమయం సమీపించింది. అయినా వారు ఏమరుపాటులో పడి విముఖులై ఉన్నారు. వారి ప్రభువు తరఫు నుండి వారి వద్దకు ఏ తాజా ఉపదేశం వచ్చినా , దానిని వారు అనాసక్తితో వింటారు ఆటలలో మునిగిపోయి ఉంటారు. వారి మనస్సులు (వేరే ఆలోచనలలో) లగ్నమై ఉన్నాయి.

దుర్మార్గులు పరస్పరం ఇలా గుసగుసలాడుకుంటారు, ‘‘ఇంతకూ ఈ వ్యక్తి మీలాంటి ఒక మానవుడేకదా! అయినా మీరు చూస్తూ చూస్తూ మాంత్రిక వలయంలో చిక్కుకుపోతారా?’’

**21. అల్ అంబియా** 4 - 6 ప్రవక్త, ‘‘నా ప్రభువు ఆకాశంలోనూ, భూమిపైనా పలుకబడే ప్రతి మాటను ఎరుగును. ఆయన సర్వం వినేవాడూ , సర్వమూ తెలిసినవాడూను అని అన్నాడు. వారు ఇలా అన్నారు , ‘‘కాదు, ఇవి అస్పష్టములైన కలలు, కాదు, ఇది అతని కల్పన , కాదు ఇతను ఒక కవి. పూర్వకాలపు ప్రవక్తలు సూచనలతో పంపబడిన విధంగా ఇతన్ని కూడ ఏదైనా ఒక సూచనను తీసుకు రమ్మనండి. ’’ యధార్థం ఏమిటంటే , వారికి పూర్వం మేము నాశనం చేసిన ఏ జనవాసం కూడా విశ్వసించలేదు. ఇక వీరు మాత్రం విశ్వసిస్తారా?

**21. అల్ అంబియా** 7 - 9 ఓ ప్రవక్తా! నీకు పూర్వం కూడ మేము మానవులనే ప్రవక్తలుగా పంపాము. వారికి మేము వహీని అందజేశాము. ఒకవేళ మీకు ఇది తెలియకపోతే , గ్రంథ ప్రజలను అడగండి. ఆ ప్రవక్తలకు మేము అన్నం తినే అవసరం లేని శరీరాలనూ ఇవ్వలేదు, వారు చిరంజీవులు కూడ కాదు. చూడు, చివరకు మేము వారికి చేసిన వాగ్దానాలను నెరవేర్చాము , వారినీ ఇంకా మేము ఇష్టపడిన వారినీ కాపాడాము హద్దులు మీరిన వారిని నాశనం చేశాము.

**21. అల్ అంబియా** 10 ప్రజలారా! మేము మీ వద్దకు ఒక గ్రంథాన్ని పంపాము , అందులో మీ ప్రస్తావనే ఉంది. అయినా మీరు అర్థం చేసుకోరేమిటీ?

**21. అల్ అంబియా** 11 - 15 దుష్ట జనవాసాలను ఎన్నింటినో మేము పిండి పిండిగా చేసివేశాము వారి తరువాత మరొక జాతి వారిని ఆవిర్భవింపజేశాము. వారు మా శిక్ష (రాక)ను గ్రహించి, అక్కణ్ణుంచి పారిపోసాగారు. (అప్పుడు వారికి ఇలా చెప్పటం జరిగింది) ''పారిపోకండి మీరు సుఖాలు అనుభవిస్తున్న ఆ ఇళ్ళల్లోకే , ఆ విలాస వస్తువుల వైపునకే మరలిపోండి. బహుశా మీరు దానిని గురించి అడగబడతారేమో ?'' అప్పుడు వారు ఇలా అనసాగారు , ''అయ్యో, మా దౌర్భాగ్యం! నిస్సందేహంగా మేము అపరాధులమే. '' మేము వారిని నూర్పిడి చేసిన పంటవలె చేసే వరకు వారు ఇలానే అరుస్తూ ఉండిపోయారు. నిప్పు రవ్వంత ప్రాణమైనా వారిలో మిగలలేదు.

**21. అల్ అంబియా** 16 - 18 మేము ఈ ఆకాశాన్నీ , ఈ భూమినీ వాటిలో ఉన్న సమస్తాన్నీ కాలక్షేపం కోసం సృష్టించలేదు. ఒకవేళ మేము ఏదైనా ఆట వస్తువును చేయదలిస్తే - అసలు మేము చేయవలసింది కేవలం ఇంతే అయితే - మేము మా వద్ద ఉన్న దానినే చేసుకునేవారము. కాని మేము అసత్యాన్ని సత్యంతో దెబ్బతీస్తాము, అది దాని తలను పగలగొడుతుంది. చూస్తూ ఉండగానే అది సమసిపోతుంది. మీరు కల్పన చేస్తున్న విషయాల కారణంగా మీకు సర్వనాశనం తప్పదు.

**21. అల్ అంబియా** 19 - 20 భూమిపైనా , ఆకాశాలలోనూ సృజింపబడినవన్నీ అల్లాహ్వే. ఆయన వద్ద ఉండే (దైవదూతలు) వారు తమను తాము గొప్పవారుగా భావించుకుని ఆయన దాస్యాన్నీ ధిక్కరించరు , బాధపడరు కూడ. రేయింబవళ్లు ఆయన స్తోత్రం చేస్తూనే ఉంటారు, విశ్రమించరు.

**21. అల్ అంబియా** 21 వారు ప్రపంచంలో కల్పించుకున్న దేవుళ్లు (ప్రాణంలేని వాటికి ప్రాణం పోసి) లేపి నిలబెట్టగలరా?

**21. అల్ అంబియా** 22 - 23 ఒకవేళ ఆకాశంలో , భూమిలో ఒక్క అల్లాహ్ తప్ప ఇతర దేవుళ్లు కూడ ఉంటే , అప్పుడు (భూమ్యాకాశాల) రెండిరటి వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది. కనుక అధికార పీఠానికి ప్రభువైన అల్లాహ్ వారు కల్పించే విషయాల నుండి పరిశుద్ధుడు. ఆయన తాను చేసే పనులకు (ఎవరి ముందూ) జవాబుదారుకాడు. కాని అందరూ (ఆయన ముందు) జవాబుదారులే.

**21. అల్ అంబియా** 24 - 25 ఆయనను కాదని వారు వేరే దేవుళ్లను కల్పించుకున్నారా? ఓ ప్రవక్తా! వారితో ఇలా అను, ''మీ రుజువును తీసుకురండి. ఈ గ్రంథం కూడ ఉన్నది. అందులో నా యుగపు ప్రజల కొరకు హితబోధ ఉన్నది. నాకు పూర్వం ఉన్న ప్రజల కొరకు హితబోధ గరిపిన గ్రంథాలు కూడ ఉన్నాయి. '' కాని వారిలో చాల మందికి యథార్థమేమిటో తెలియదు. కాబట్టి వారు విముఖులై ఉన్నారు. మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా, అతనికి వహీ ద్వారా, ''నేను తప్ప దేవుడు లేడు. కనుక మీరు నాకే దాస్యం చేయండి '' అనే విషయాన్నే తెలియజేశాము.

**21. అల్ అంబియా** 26 - 29 వారు , ''కరుణామయుడు సంతానవంతుడు'' అని అంటారు. అల్లాహ్ ఎంతో పరిశుద్ధుడు. వారు (దైవదూతలు) దాసులు, వారికి గౌరవం ఇవ్వబడిరది. వారు ఆయన సాన్నిధ్యంలో ముందుకు వచ్చి మాట్లాడరు , కేవలం ఆయన ఆజ్ఞ ప్రకారమే నడుచుకుంటారు. ఆయన వారికి ముందు ఉన్న దానినీ ఎరుగును, వారికి గుప్తంగా ఉన్నదానినీ ఎరుగును. వారు ఎవరిని గురించీ సిఫారసు చేయరు, సిఫారసు వినటానికి అల్లాహ్ ఇష్టపడిన వాని విషయంలో తప్ప. ఆయన భయం వల్ల వారు భీతావహులై ఉంటారు. వారిలో ఎవరైనా , ''అల్లాహ్తో పాటు, నేను కూడ ఒక దేవుడినే'' అని అంటే, అతనికి మేము నరక శిక్ష విధిస్తాము. దుర్మార్గులకు మా వద్ద లభించే ప్రతిఫలం ఇదే.

**21. అల్ అంబియా** 30 - 33 (ప్రవక్త మాటలను విశ్వసించకుండా) తిరస్కరించిన వారు ఈ విషయాలను గురించి ఆలోచించరా ఆకాశాలూ భూమీ పరస్పరం కలసి ఉండేవనీ, తరువాత మేము వాటిని వేరు చేశామనీ, ప్రాణం ఉన్న ప్రతిదానిని నీళ్లతో సృష్టించామనీ ? వారు (సృష్టించే మా ఈ శక్తిని) అంగీకరించరా ? మేము భూమిపై పర్వతాలను పటిష్ఠంగా నిలబెట్టాము , అది వాటితో దొర్లిపోకుండా ఉండాలని. మేము దానిపై విశాలమైన మార్గాలను నిర్మించాము, బహుశా ప్రజలు తమ దారిని తెలుసుకుంటారని. మేము ఆకాశాన్ని ఒక సురక్షితమైన కప్పుగా చేశాము. కాని వారేమో సృష్టి యొక్క ఈ సూచనల వైపునకు తమ దృష్టినే మళ్లించరు. రాత్రినీ , పగలునూ సృష్టించినవాడూ, సూర్యచంద్రులను పుట్టించిన వాడూ అల్లాహ్ యే. అవన్నీ తమ తమ కక్ష్యలలో తేలియాడుతూ ఉన్నాయి.

**21. అల్ అంబియా** 34 - 35 ఓ ప్రవక్తా! శాశ్వత జీవితాన్ని మేము నీకు పూర్వం కూడ ఏ మానవునికీ ప్రసాదించలేదు. ఒకవేళ నీవు మరణిస్తే , వారు మాత్రం శాశ్వతంగా జీవించి ఉంటారా ? ప్రతి ప్రాణీ మృత్యువును తప్పకుండా చవిచూస్తుంది. మేము మీ అందరినీ మంచి పరిస్థితులకూ చెడు పరిస్థితులకూ గురిచేసి , పరీక్షిస్తున్నాము. చివరకు మీరు మా వైపునకే మరలవలసి ఉన్నది.

**21. అల్ అంబియా** 36 ఈ సత్య తిరస్కారులు నిన్ను చూసినప్పుడు నీ పట్ల పరిహాసంతో వ్యవహ రిస్తారు. ''మీ దేవుళ్లను గురించి ప్రస్తావిస్తూ ఉండే వ్యక్తి ఇతనేనా ?'' అని అంటారు. కాని వారేమో కరుణామయుని ప్రస్తావనను తిరస్కరిస్తున్నారు.

**21. అల్ అంబియా** 37 - 41 మానవుడు తొందరపడే ప్రాణి. ఇప్పుడే నేను నా సూచనలను నీకు చూపిస్తాను , నన్ను తొందరపెట్టకు- వారు ''నీవు సత్యవంతుడవే అయితే , అసలు ఈ బెదిరింపు ఎప్పుడు నెరవేరుతుందో చెప్పు'' అని అంటారు. అయ్యో! ఈ అవిశ్వాసులకు ఆ సమయం గురించి కొద్దిగానైనా తెలిసివుంటే ఎంత బాగుండును! అప్పుడు వారు అగ్ని నుండి తమ ముఖాలను గానీ తమ వీపు లను గానీ కాపాడుకోలేరు. వారికి

ఎక్కడ నుంచీ సహాయమూ అందదు. ఆ విపత్తు అకస్మాత్తుగా వచ్చిపడుతుంది. అది వారిని ఎంత హఠాత్తుగా చుట్టు ముట్టుతుందంటే, వారు దాన్ని వారించనూలేరు , వారికి ఒక్క క్షణం వ్యవధి కూడ దొరకదు. నీకు పూర్వం కూడ దైవప్రవక్తలు ఎగతాళి చేయబడ్డారు. కాని వారిని ఎగతాళి చేసేవారు , తాము ఎగతాళి చేసేసిన దానిలోనే చిక్కుకుపోయారు.

**21. అల్ అంబియా** 42 - 46 ఓ ప్రవక్తా! వారిని ''రాత్రిగానీ, పగలుగానీ మిమ్మల్ని కరుణామయుని నుండి కాపాడగల వాడెవడు?'' అని అడుగు. కాని వారు తమ ప్రభువు హితబోధకు విముఖులవుతున్నారు. మాకు ప్రతికూలంగా వారికి సహాయం చేసే దేవుళ్లు ఎవరైనా వారికి ఉన్నారా ? వారు తమకు తామే సహాయం చేసుకోనూలేరు వారికి మా సహాయ సహకారాలూ లేవు. అసలు విషయం ఏమిటంటే, వారికీ, వారి పూర్వీకులకూ మేము జీవితావసరాలను ఇస్తూ వచ్చాము ఇలా వారిపై చాల కాలం గడచిపోయింది. కాని మేము భూమిని విభిన్న దిశల నుండి తగ్గిస్తూ వస్తున్న విషయం వారికి కనిపించటంలేదా ? వారు ఆధిక్యం వహించగలుగుతారా ? వారితో, ''నేను వహీ ఆధారంగానే మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను '' అని అను - కాని చెవిటివారిని హెచ్చరించి నప్పటికీ వారు పిలుపును వినలేరు. ఒకవేళ నీ ప్రభువు శిక్ష వారిని ఏమాత్రం ముట్టుకున్నా వెంటనే ''అయ్యో మా దౌర్భాగ్యం! నిస్సందేహంగా మేము దోషులమే'' అని ఆక్రందన చేస్తారు.

**21. అల్ అంబియా** 47 కచ్చితంగా తూచేటటువంటి తరాజులను మేము ప్రళయం నాడు ఏర్పాటు చేస్తాము. ఏ వ్యక్తికైనా రవ్వంత అన్యాయం కూడ జరగదు. ఎవరైనా ఆవగిం జంత పనిని చేసి ఉన్నా, దానిని మేము ముందుకు తీసుకువస్తాము. లెక్క చూడటానికి మేమే చాలు.

**21. అల్ అంబియా** 48 - 50 పూర్వం మేము మూసా, హారూన్‌లకు గీటురాయినీ, జ్యోతినీ, జ్ఞాపికనూ ప్రసాదించి ఉన్నాము దైవభీతి కలవారి మేలు కొరకు - వారు తమ ప్రభువుకు భయపడతారు, (లెక్క తీసుకునే) ఘడియను గురించి వారు బెదురుతూ ఉంటారు. ఇప్పుడు శుభప్రదమైన ఈ జ్ఞాపికను మేము (మీ కొరకు) అవతరింపజేశాము. అయితే మీరు దీనిని నిరాకరిస్తున్నారా?

**21. అల్ అంబియా** 51 - 73 దానికి పూర్వమే మేము ఇబ్రాహీమ్‌కు బుద్ధికుశలతను ప్రసాదించాము , అతనిని గురించి మాకు బాగా తెలుసు. అతను తన తండ్రితో , తన జాతి వారితో ఇలా అన్నప్పటి సందర్భాన్నీ జ్ఞాపకం తెచ్చుకో, ''మీరు అమిత భక్తితో ఆరాధిస్తున్న ఈ విగ్రహాలు ఏమిటీ ?'' వారు దానికి ఇలా బదులు చెప్పారు , ''మా పితృపితామహులు వాటిని ఆరాధిస్తూ ఉండగా మేము చూశాము. '' అతను, ''మీరూ మార్గభ్రష్టులే , మీ పితృపితామహులు కూడా పూర్తిగా మార్గభ్రష్టులే '' అని అన్నాడు. వారు , ''నీవు మా ముందు అసలైన నీ ఆలోచనలనే ప్రకటిస్తున్నావా లేక పరిహాసమాడుతున్నావా ?'' అని అడిగారు. అతను ఇలా జవాబు పలికాడు , ''లేదు, వాస్తవానికి భూమికీ, ఆకాశాలకూ ప్రభువైనవాడే, వాటిని సృష్టించిన వాడే మీ ప్రభువు. ఈ విషయం గురించి

నేను మీ ముందు సాక్ష్యమిస్తున్నాను, దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. మీరు లేనప్పుడు తప్పకుండా మీ విగ్రహాల పని పడతాను.'' ఆ విధంగా అతను వాటిని ముక్కలు ముక్కలుగా చేశాడు. కేవలం వాటిలో ఒక పెద్ద విగ్రహాన్ని మాత్రం విడిచిపెట్టాడు, బహుశా వారు దాని వైపునకు మరలటానికేమో (వారు వచ్చి, విగ్రహాల ఈ స్థితిని చూసి) ఇలా అన్నారు , ''మా దేవుళ్లను ఇలా చేసిందెవరు ? వాడెవడో పరమ దుర్మార్గుడే. '' (కొందరు) ఇలా అన్నారు, ''ఒక యువకుడు వీటిని గురించి ప్రస్తావిస్తూ ఉండగా మేము విన్నాము. అతని పేరు ఇబ్రాహీమ్.'' వారు ఇలా అన్నారు, ''అయితే వాణ్ణి అందరిముందుకు పట్టుకురండి (అతన్ని ఎలా శిక్షిస్తారో) ప్రజలు చూస్తారు ,'' వారు (ఇబ్రాహీమ్ వచ్చినప్పుడు) ''ఏమిటి ఇబ్రాహీమ్! మా దేవుళ్లను ఇలా చేసింది నీవేనా ?'' అని అడిగారు. అతను , ''వాస్తవానికి వాటి ఈ నాయకుడే ఇదంతా చేశాడు. వాటినే అడగండి , అవి మాట్లాడగలిగితే'' అని సమాధానం చెప్పాడు. ఇది విని వారు తమ అంతరాత్మల వైపునకు మరలారు. (తమ మనస్సులలో) ఇలా అనుకోసాగారు , ''వాస్తవానికి స్వయంగా మీరే దుర్మార్గులు.'' కాని తరువాత వారి బుద్ధి తలక్రిందులైపోయింది ''ఇవి మాట్లాడలేవని నీకు తెలుసుగా!'' అని అన్నారు. ఇబ్రాహీమ్ ఇలా అన్నాడు, ''అయితే, మీరు అల్లాహ్ ను కాదని మీకు లాభంకానీ, నష్టం కానీ కలిగించగల సామర్థ్యం లేని వాటిని పూజిస్తున్నారా ? ధూత్కారం, మీపైనా, అల్లాహ్ ను కాదని మీరు పూజించే దేవుళ్లపైనా , మీకు ఏమాత్రం బుద్ధిలేదా ?'' వారు ఇలా అన్నారు , ''మీరేదైనా చేయదలిస్తే , ఇతనిని సజీవంగా దహనం చేయండి , మీ దేవుళ్లకు అండగా నిలవండి. '' అప్పుడు మేము ఇలా అన్నాము , ''ఓ అగ్నీ! చల్లగా అయిపో ఇబ్రాహీమ్‌కు భద్రత అయిపో. '' వారు ఇబ్రాహీమ్‌కు కీడు తలపెట్టారు. కాని మేము వారి కుతంత్రాలను వమ్ము చేశాము. మేము అతనిని , లూత్‌నూ కాపాడి , ప్రపంచ వాసులకు మేము శుభాలను నిక్షేపించిన భూభాగం వైపునకు వారిని తీసుకుని వెళ్లాము. మేము అతనికి ఇస్‌హాఖ్‌ను ప్రసాదించాము, అదనంగా యాఖూబ్‌ను కూడ ఇచ్చాము ప్రతి ఒక్కడినీ మేము సౌశీల్యవంతుడుగా చేశాము. మా ఆజ్ఞానుసారం మార్గదర్శకత్వం నెరపేవారిని మేము నాయకులుగా చేశాము. మేము వహీ ద్వారా సత్కార్యాలు చెయ్యండి అనీ , నమాజ్‌ను స్థాపించండి అనీ, జకాత్ ఇవ్వండి అనీ వారికి బోధించాము. వారు మమ్మల్నే ఆరాధించేవారు.

**21. అల్ అంబియా** 74 - 75 మేము లూత్‌కు ఆజ్ఞనూ, జ్ఞానాన్నీ ప్రసాదించాము సిగ్గుమాలిన చేష్టలు చేసే పట్టణం నుండి అతనికి విముక్తి కలిగించాము - వాస్తవంగానే అది పరమ నీచమైన, హద్దులు మీరిన పాపిష్ఠ జాతి - మేము లూత్‌ను మా కారుణ్యంలోకి ప్రవేశింపజేశాము. అతను నిజంగానే సజ్జనులలోని వాడు.

**21. అల్ అంబియా** 76 - 77 ఈ కానుకనే మేము నూహ్ కు ప్రసాదించాము. వీరందరికంటే ముందు అతను మమ్మల్ని వేడుకున్నప్పటి సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో. మేము అతని ప్రార్థనను అంగీకరించాము. అతనికీ , అతని కుటుంబానికీ తీవ్రమైన వ్యధ నుండి విముక్తి కలిగించాము. మా ఆయతులు అసత్యాలని తిరస్కరించిన జాతి వారికి వ్యతిరేకంగా మేము అతనికి సహాయం చేశాము. వారు పరమ దుష్టులు , ఆ కారణంగా మేము వారందరినీ ముంచివేశాము.

**21. అల్ అంబియా** 78 - 79 ఈ కానుకనే ఇచ్చి మేము దావూద్‌నూ , సులైమాన్‌నూ అనుగ్ర హించాము. వారు ఉభయులూ ఒక చేను వ్యాజ్యం విషయంలో తీర్పు చేస్తు న్నప్పటి సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో: రాత్రివేళ ఇతరుల మేకలు ఆ చేనులో పడి తిరిగాయి. వారు తీర్పు చేసే విధానాన్ని స్వయంగా మేము చూస్తూ ఉన్నాము. ఆ సమయంలో మేము సులైమాన్‌కు సరి j◌ై◌◌ున తీర్పు అవగాహననూ కలుగ జేశాము. యధార్థానికి న్యాయాన్నీ, జ్ఞానాన్నీ మేము ఉభయులకూ ప్రసాదించాము.

**21. అల్ అంబియా** 80 - 82 దావూద్‌తో పాటు పర్వతాలు , పక్షులు (మా) స్తోత్రం చేసే కట్టుబాటు మేము చేశాము. ఈ పనిని చేసినవారము మేమే. మేము మీ ప్రయోజనం కోసం అతనికి కవచాలు తయారుచేసే కళను నేర్పాము, తద్వారా మిమ్మల్ని పరస్పర హాని నుండి రక్షిద్దామని. అలాంటప్పుడు మీరు కృతజ్ఞులుగా ఉన్నారా ? మేము తీవ్రంగా వీచే గాలిని సులైమాన్‌కు లొంగేలా చేశాము. అది అతని ఆదేశం ప్రకారం మేము శుభాలను ఉంచిన భూభాగం వైపునకు పయనించేది. మేము సకల విషయ పరిజ్ఞానం కలవారము. మేము షైతానులలో చాలా మందిని అతనికి విధేయులుగా చేశాము. అవి అతని కొరకు సముద్రంలో మునకలు వేసేవి. ఇదేగాక అవి ఇంకా వేరే పనులు కూడ చేసేవి. వీరందరినీ కనిపెట్టి ఉండేవారం కూడ మేమే.

**21. అల్ అంబియా** 83 - 84 మరియు దీనినే (బుద్ధికుశలత, తీర్పు చేసే సామర్థ్యం, జ్ఞానం అనే వరాన్ని ) మేము అయ్యూబ్‌కు ప్రసాదించాము. అతను తన ప్రభువును ఇలా వేడుకున్నప్పటి సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో ''నాకు వ్యాధి సోకింది. నీవు కరుణామయులలోకెల్లా గొప్ప కరుణామయుడవు.'' మేము అతని ప్రార్థనను అంగీకరించాము మరియు అతనికున్న బాధను తొలగించాము. అతనికి కేవలం అతని కుటుంబ సభ్యులను తిరిగి ఇవ్వటమే కాకుండా వారితోపాటు, ఇంకా అంతేమందిని కూడ ఇచ్చాము , మా నుండి ప్రత్యేక అనుగ్రహంగా. ఎందుకంటే ఇది ఆరాధకులకు గుణపాఠంగా ఉండాలని.

**21. అల్ అంబియా** 85 - 86 ఇదే వరాన్ని ఇస్మాయీల్‌కూ , ఇద్రీస్‌కూ, జుల్‌కిఫ్‌ల్‌కూ ఇచ్చాము, ఎందుకంటే వారందరూ సహనశీలురు. వారు సజ్జనుల్లోనివారు కాబట్టి మేము వారిని మా కారుణ్యంలోకి ప్రవేశింపజేశాము.

**21. అల్ అంబియా** 87 - 88 చేప వానిని కూడ మేము అనుగ్రహించాము. అతను కోపంతో వెళ్లిపోయినప్పటి సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో. దానికి మేము సంజాయిషీ అడగబోమని అతను భావించాడు. చివరకు అతను అగాధమైన చీకట్లల్లో నుండి ఇలా మొరపెట్టుకున్నాడు , ''నీవు తప్ప దేవుడు లేనే లేడు. నీవు పరిశుద్ధుడవు. నిస్సందేహంగా నేను తప్పు చేశాను. '' అప్పుడు మేము అతని ప్రార్థనను అంగీకరించి , అతనికి దుఃఖం నుండి విముక్తి కలిగించాము. ఈ విధంగానే మేము విశ్వాసులను కాపాడుతూ ఉంటాము.

**21. అల్ అంబియా** 89 - 90 మరియు జకరియ్యాను కూడా అనుగ్రహించాము. అప్పుడు అతను తన ప్రభువును ఇలా వేడుకున్నాడు, ''ప్రభూ! నన్ను ఒంటరివాడు (సంతానహీనుడు)గా విడిచిపెట్టకు. మేలైన వారసుడవు నీవు మాత్రమే.'' మేము అతని ప్రార్థనను అంగీకరించాము మరియు అతనికి యహ్యాను ప్రసాదించాము. అతని భార్యను అతనికి (సంతానం కనే) యోగ్యురాలుగా సరిచేశాము. వారు మంచి పనుల కోసం ఎక్కువగా శ్రమించేవారు. ప్రేమతోనూ, భయంతోనూ మమ్మల్ని ప్రార్థించేవారు, మా సమక్షంలో వినమ్రులై ఉండేవారు.

**21. అల్ అంబియా** 91 మరియు తన శీలాన్ని కాపాడుకున్న ఆ మహిళను కూడ (అనుగ్రహిం చాము). మేము ఆమెలో మా ఆత్మ నుండి ఊదాము. ఆమెనూ, ఆమె కుమారుణ్ణీ సర్వప్రపంచానికి ఒక సూచనగా చేశాము.

**21. అల్ అంబియా** 92 - 103 మీ ఈ సంఘం వాస్తవానికి ఒకే ఒక సంఘం , నేను మీ ప్రభువును. కనుక మీరు నన్ను ఆరాధించండి. కాని (ఇది ప్రజలు చేసుకున్న నిర్వాకమే) వారు తమలో తాము ధర్మాన్ని ముక్కలు ముక్కలుగా చేసుకున్నారు- అందరూ మా వైపునకు మరలవలసినదే. తరువాత విశ్వాసిగా ఉండి సత్కార్యాలు చేసేవాడి సత్కార్యాలను నిరాదరించటం జరగదు. వాటిని మేము వ్రాస్తున్నాము. మేము నాశనం చేసిన నగరం మళ్లీ మరలి రావటం సంభవం కాని విషయం. చివరకు యాజూజ్ , మాజూజ్‌లు వదలిపెట్టబడినప్పుడు, వారు ప్రతి ఎత్తైన ప్రదేశం నుండి బయల్పడినప్పుడు , సత్యవాగ్దానం నెరవేరే సమయం దగ్గర పడినప్పుడు , హఠాత్తుగా అవిశ్వాసుల కనుగుడ్లు విచ్చుకున్నవి విచ్చుకున్నట్లుగానే ఉండిపోతాయి. వారు ఇలా అంటారు , ''అయ్యో! మా దౌర్భాగ్యం! మేము దీని విషయంలో అశ్రద్ధకు లోనయ్యాము. అంతేకాదు మేము తప్పుచేశాము.'' నిస్సంశయంగా మీరూ, అల్లాహ్ ను కాదని మీరు పూజించే మీ దైవాలూ నరకానికి ఇంధనం అవుతారు. అక్కడికే మీరు పోవలసి ఉన్నది. వారు నిజంగానే దేవుళ్లే అయితే , అక్కడకు పోయేవారు కాదు. ఇక అందరూ శాశ్వతంగా అందులోనే ఉండాలి. అక్కడ వారు రొప్పుతూ రోజుతూ బుసలు కొడతారు. ఇంకా అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందంటే, అందులో వారికి ఏ శబ్దమూ వినిపించదు. ఇక, మా తరఫునుండి మేలు కలుగుతుందని మొదట్లోనే తీర్పు ఇవ్వబడిన ప్రజల విషయానికి వస్తే వారు నిశ్చయంగా దానికి దూరంగా ఉంచబడతారు. దాని రెపరెపను సైతం వారు వినరు. వారు సదా తమ మనస్సులు కోరుకునే వస్తువుల మధ్య ఉంటారు. మిక్కిలి కలవరపెట్టే ఆ సమయం వారిని ఏమాత్రం బాధపెట్టదు. దైవదూతలు ఎదురు వచ్చి వారికి స్వాగతం పలికి, ''మీకు వాగ్దానం చేయబడిన మీ దినం ఇదే'' అని అంటారు.

**21. అల్ అంబియా** 104 - 106 ఆ రోజున మేము ఆకాశాన్ని చిట్టాకాగితాలను చుట్టే విధంగా చుట్టిపడేస్తాము. మేము మొదట్లో సృష్టిని చేసినట్లే మళ్లీ దానిని చేస్తాము. ఇది మాపై బాధ్యతగా ఉన్న ఒక వాగ్దానం. మేము ఈ పనిని ఎలాగైనా చేయవలసే ఉన్నది. మేము జబూర్ గ్రంథంలోనూ హితబోధ చేసిన తరువాత , సౌశీల్యవంతులైన

మా దాసులే భూమికి వారసులవుతారని వ్రాసిపెట్టాము. ఆరాధనాపరుల కొరకు ఇందులో గొప్ప సమాచారం ఉన్నది.

**21. అల్ అంబియా** 107 - 111 ఓ ప్రవక్తా! మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యంగా పంపాము. వారితో ఇలా అను, ''నా వద్దకు వచ్చే వహీ ఏమిటంటే మీ దేవుడు కేవలం ఒక్కడే. ఇకనైనా మీరు విధేయులవుతారా ?'' ఒకవేళ వారు విముఖులైతే , అప్పుడు ఇలా అను , ''నేను బహిరంగంగా మిమ్మల్ని హెచ్చ రించాను. ఇక మీకు వాగ్దానం చేయబడుతూ ఉన్న విషయం దగ్గర్లో ఉందో లేక దూరంలో ఉందో నాకు తెలియదు. బిగ్గరగా పలికే మాటలను కూడ అల్లాహ్ ఎరుగును. మీరు రహస్యంగా పలికే మాటలను కూడ ఆయన ఎరుగును. బహుశా ఇది (ఆలస్యం) మీ కొరకు ఒక పరీక్షయేమో, ఒక ప్రత్యేక వ్యవధి వరకు ప్రపంచాన్ని అనుభవించటానికి మీకు అవకాశం ఇవ్వబడుతూ ఉన్నదేమో అని నేను అనుకుంటున్నాను.''

**21. అల్ అంబియా** 112 (చివరకు) దైవప్రవక్త ఇలా అన్నాడు , ''నా ప్రభూ! సత్యంతో తీర్పు చేయి. ప్రజలారా! మీరు కల్పించే విషయాల బారినుండి కరుణామయుడైన మా ప్రభువే మాకు సహాయపడతాడని మేము నమ్ముకున్నాము.''

**22. హజ్**

ఆయతులు : 78 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**22. హజ్** 1 - 2 మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి మిమ్మల్ని మీరు రక్షించు కోండి. యధార్థం ఏమిటంటే, ప్రళయం నాటి భూకంపం మహా (భయంకర మైన) విషయం. దానిని మీరు చూచినప్పుడు దాని స్థితి ఎలా ఉంటుందంటే పాలు పట్టే ప్రతి స్త్రీ పాలు త్రాగే తన పాపను మరచిపోతుంది , ప్రతి గర్భిణి యొక్క గర్భం పడిపోతుంది, ప్రజలు మీకు మత్తులో ఉన్నట్లు కనిపిస్తారు, వాస్తవానికి వారు త్రాగి ఉండరు. కాని అల్లాహ్ శిక్షయే అంత తీవ్రంగా ఉంటుంది.

**22. హజ్** 3 - 7 ప్రజలలో కొందరు జ్ఞానం లేకపోయినా అల్లాహ్ ను గురించి వాదిస్తారు. తిరగబడిన ప్రతి షైతాన్‌ను అనుసరిస్తారు. వాస్తవానికి అతడి అదృష్టం ఇలా వ్రాయబడి ఉంది : వాడిని స్నేహితుడుగా చేసుకునే మనిషిని వాడు మార్గం తప్పించి మరీ వదలిపెడతాడు, నరకయాతన వైపునకు మార్గం చూపుతాడు. మానవులారా! ఒకవేళ మీకు మరణానంతర జీవితం గురించి ఏదైనా సందేహం ఉంటే , మీరు ఈ విషయాన్ని తెలుసుకోవాలి: మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము, తరువాత వీర్య బిందువుతో, ఆ తరువాత నెత్తుటి గడ్డతో, ఆపై మాంసపు కండతో

అది రూపం కలదిగానూ , రూపం లేనిది గానూ ఉంటుంది. (మేము ఈ విషయాన్ని ) మీకు యధార్థం ఏమిటో స్పష్టం చెయ్యాలని (తెలుపుతున్నాము). మేము కోరిన (వీర్య బిందువును) దానిని ఒక ప్రత్యేక కాలం వరకు మాతృగర్భాలలో నిలిపి ఉంచుతాము. తరువాత మిమ్మల్ని ఒక శిశువు రూపంలో బయటికి తీస్తాము. (ఆ తరువాత మీకు పెట్టి పోషిస్తాము) మీరు నిండు యౌవన దశకు చేరటానికి. మీలో ఒకడు ముందుగానే వెనుకకు పిలుచుకోబడతాడు, మరొకడు అతి నికృష్టమైన వయస్సు వైపునకు మరలింపబడతాడు, అంతా తెలిసిన తరువాత కూడ ఏమీ తెలియకుండా ఉండటానికి. ఎండిపోయిన నేలను మీరు చూస్తున్నారు , తరువాత మేము దానిపై వర్షం కురిపించగానే, అకస్మాత్తుగా అది పులక రిస్తుంది మరియు ఉబుకుతుంది, ఇంకా అది అన్ని రకాల మనోహరమైన మొక్కలను మొలకెత్తించటం ప్రారంభిస్తుంది. దీనికంతటికీ కారణం , అల్లాహ్ యే సత్యం కావటం , ఆయన మృతులను బ్రతికించటం మరియు ప్రతిదానిపై అధికారం కలిగి ఉండటం ఇంకా (ఇది మరొక విషయానిక్కూడ నిదర్శనమే) ఏమిటంటే, ప్రళయఘడియ తప్పకుండా వచ్చి తీరుతుంది , ఇందులో ఏ అనుమానానికీ ఆస్కారం లేదు, గోరీలలోకి వెళ్ళిపోయినవారిని అల్లాహ్ తప్పకుండా లేపుతాడు.

**22. హజ్** 8 - 10 మానవులలో ఇంకా కొందరు ఏ జ్ఞానమూ లేకపోయినా , ఏ మార్గదర్శకత్వమూ లేకపోయినా, జ్యోతిని ప్రసాదించే ఏ గ్రంథమూ లేకుండానే , తలబిరుసుతనంతో అల్లాహ్ ను గురించి తగవులాడుతారు. తద్వారా వారు ప్రజలను అల్లాహ్ మార్గం నుండి తప్పింపజూస్తారు. అలాంటి వ్యక్తి ప్రపం చంలో అవమానం పాలవుతాడు , ప్రళయంనాడు మేము అతనికి అగ్ని బాధను రుచి చూపిస్తాము - ఇది నీ భవిష్యత్తు దానిని స్వయంగా నీ చేతులే నీకై సిద్ధపరచి ఉంచాయి. నిజానికి అల్లాహ్ తన దాసులకు అన్యాయం చేసేవాడు కాడు.

**22. హజ్** 11 - 15 ప్రజలలో ఒకడు (విశ్వాసం) అంచులపై నిలబడి అల్లాహ్ కు దాస్యం చేసేవాడు ఉన్నాడు ఒకవేళ లాభం కలిగితే తృప్తి పొందుతాడు కాని ఏదైనా ఆపద సంభవిస్తే విముఖుడవుతాడు. అతనికి ఇహమూ దక్కదు, పరమూ దక్కదు. స్పష్టమైన నష్టం అంటే ఇదే. అతను అల్లాహ్ ను కాదని , తనకు నష్టంగాని, లాభం గాని కలిగించలేని వారిని వేడుకుంటున్నాడు. ఇది మార్గభ్రష్టత్వానికి పరాకాష్ఠ. ఎవరి నష్టమైతే వారు చేసే లాభానికి అత్యంత సమీపంలో ఉందో , వారిని అతడు వేడుకుంటున్నాడు. ఎంత నికృష్టుడు అతని సంరక్షకుడు , ఎంత నికృష్టుడు అతని సహచరుడు. (దీనికి ప్రతిగా) ఎవరు విశ్వసించారో , మరెవరు మంచిపనులు చేశారో , వారిని అల్లాహ్ నిశ్చయంగా క్రింద సెలయేళ్లు ప్రవహించే ఉద్యానవనాల్లో ప్రవేశింపజేస్తాడు. అల్లాహ్ తాను కోరింది చేస్తాడు. ప్రపంచంలోనూ, పరలోకంలోనూ అల్లాహ్ తనకు ఏ సహాయమూ చేయడని అనుమానించే వ్యక్తి ఒక తాడు ద్వారా ఆకాశాన్ని చేరి దానికి కన్నం వేయాలి , తరువాత తనకు అయిష్టమైన దానిని తన యుక్తి నిరోధించ గలుగుతుందేమో అనే విషయాన్ని ఆ కన్నం ద్వారా అతడు చూసుకోవాలి.

**22. హజ్** 16 ఇటువంటి స్పష్టమైన బోధలతోనే మేము ఈ ఖుర్ఆన్‌ను అవతరింప జేశాము. అల్లాహ్ తాను కోరిన వారికి మార్గం చూపుతాడు.

**22. హజ్** 17 - 18 విశ్వసించినవారు, యూదులుగా మారినవారు, సాబియీలు, క్రైస్తవులు, మజూసీలు (అగ్ని పూజారులు) షిర్కు చేసినవారు - వారందరిని గురించి అల్లాహ్ ప్రళయం నాడు తీర్పు చెబుతాడు. ప్రతి విషయమూ అల్లాహ్ దృష్టిలో ఉన్నది. ఆకాశాలలోనూ , భూమిలోనూ ఉన్న సమస్తమూ , సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, చాలమంది మానవులు, శిక్షకు అర్హులైన చాలమంది ప్రజలు అల్లాహ్ ముందు వినమ్రులై ఉండటాన్ని నీవు చూడటంలేదా ? అల్లాహ్ ఎవరినైతే అవమానం పాలుజేస్తాడో , ఇక అతనికి గౌరవం ఇచ్చేవాడెవ్వడూ ఉండడు. అల్లాహ్ తాను కోరిన దానిని చేస్తాడు.

**22. హజ్** 19 - 24 అవి రెండు వర్గాలు , వాటి మధ్య తమ ప్రభువును గురించి వివాదం తలెత్తింది. వారిలో అవిశ్వాసులైన వారి కొరకు అగ్ని వస్త్రాలు కత్తిరించబడి ఉన్నాయి, వారి శిరస్సులపై మరిగే నీరు పోయబడుతుంది. దానివల్ల వారి చర్మాలే కాదు , కడుపు లోపలి భాగాలు సైతం కరిగిపోతాయి. వారిని దండిరచటానికి ఇనుపగదలు ఉంటాయి. ఎప్పుడైనా వారు కంగారుపడి నరకం నుండి బయటపడే ప్రయత్నం చేస్తే , వారు మళ్లీ అందులోకే నెట్టబడతారు, ‘‘ఇప్పుడు చవి చూడండి దహన శిక్షను ’’ అని అనబడుతూ (మరొకవైపు) విశ్వసించి , మంచి పనులు చేసినవారిని అల్లాహ్, క్రింద సెలయేళ్లు ప్రవహించే ఉద్యానవనాలలో ప్రవేశింపజేస్తాడు. అక్కడ వారు స్వర్ణ కంకణాలతో, ముత్యాలతో అలంకరించబడతారు. వారు పట్టు వస్త్రాలు ధరిస్తారు. (దీనికి కారణం) పరిశుద్ధ వచనాన్ని స్వీకరించే మార్గం వారికి ప్రసాదించబడిరది, స్తుతింపబడే గుణ విశేషాలు గల దేవుని మార్గం వారికి చూపబడిరది.

**22. హజ్** 25 ఎవరు తిరస్కరించారో , ఇంకా (ఈనాడు) అల్లాహ్ మార్గం వైపునకు రాకుండా (ప్రజలను) అడ్డగిస్తున్నారో-మేము సర్వ మానవుల కొరకు నిర్మించిన పరిశుద్ధ మసీదులో స్థానిక ప్రజల యొక్క మరియు బయటనుండి వచ్చే వారి యొక్క హక్కులు సరిసమానంగా ఉన్నాయి - దాని సందర్శనానికి అవరోధంగా ఉన్నారో. (వారి వైఖరి నిశ్చయముగా శిక్షార్హమైనదే). దీని (పరిశుద్ధ మసీదు)లో , నిజాయితీ నుండి వైదొలగి , అన్యాయపు పద్ధతిని అవలంబించే వాడికి మేము వ్యధాభరితమైన శిక్షను రుచి చూపిస్తాము.

**22. హజ్** 26 - 29 మేము ఇబ్రాహీమ్‌కు ఈ గృహం (కాబా గృహం) కొరకు స్థలాన్ని సూచించినప్పటి సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో. (అప్పుడు మేము ఇలా ఉపదేశించాము) నాకు దేనినీ భాగస్వామిగా చేయకు , ప్రదక్షిణం చేసేవారి కొరకూ, ఖియామ్, రుకూ, సజ్దాలు చేసేవారి కొరకూ నా గృహాన్ని పరిశుద్ధంగా ఉంచు , హజ్ కొరకై మానవులందరికీ పిలుపు ఇవ్వు, వారు నీ వద్దకు ప్రతి సుదూర ప్రాంతం నుండి కాలినడకతోనూ, ఒంటెలపైనా ఎక్కి రావాలని మరియు వచ్చి వారు తమ కొరకు ఇక్కడ ఉంచబడిన ప్రయోజ నాలను చూసుకోవాలని. అల్లాహ్ వారికి

ప్రసాదించిన పశువుల మీద కొన్ని నిర్ణీత దినాలలో ఆయన పేరును స్మరించాలి , స్వయంగా వారూ తినాలి, లేమికి గురిఅయిన అగత్యపరులకూ పెట్టాలి. తరువాత వారు తమ మాలి న్యాన్ని దూరం చేసుకోవాలి , తమ మొక్కుబడులను చెల్లించుకోవాలి మరియు ఆ ప్రాచీన గృహానికి ప్రదక్షిణ చెయ్యాలి.

**22. హజ్** 30 ... (కాబా నిర్మాణ లక్ష్యం) ఇది. ఎవడైనా అల్లాహ్ విధించిన పవిత్ర నియమాలను గౌరవిస్తే , అది అతని ప్రభువు దృష్టిలో స్వయంగా అతడికి శ్రేష్ఠమైనది.

**22. హజ్** ... 30 - 31 మీ కొరకు పశువులు ధర్మసమ్మతము చేయబడ్డాయి , ఇదివరకే మీకు తెలుపబడినవి తప్ప. కనుక విగ్రహాల మాలిన్యానికి దూరంగా ఉండండి , అబద్ధపు మాటలు పలక్కండి , ఏకాగ్రతతో అల్లాహ్ కు దాసులు అవండి , దైవత్వంలో ఆయనకు ఎవరినీ భాగస్వాములుగా చేయకండి. ఇతరులను అల్లాహ్ కు భాగస్వాములుగా చేసేవాడు ఆకాశం నుండి క్రిందపడిపోయినట్లే. అతనిని , ఇక పక్షులైనా తన్నుకుపోతాయి లేదా గాలి అతనిని ముక్కలు ముక్కలయ్యే ప్రదేశానికైనా విసరివేస్తుంది.

**22. హజ్** 32 ఇదీ అసలు విషయం. (దానిని అర్థం చేసుకో) ఎవరైనా అల్లాహ్ నిర్ణయిం చిన చిహ్నాలను గౌరవిస్తున్నారంటే అది హృదయాలలోని దైవభీతి వలననే.

**22. హజ్** 33 ఒక నిర్ణీత కాలం వరకు వాటి (హదీ పశువులు) ద్వారా లాభం పొందే హక్కు మీకు ఉన్నది. ఆ తరువాత వాటిని (ఖుర్బానీ చేసే) స్థలం ఆ ప్రాచీన గృహం వద్దనే ఉన్నది.

**22. హజ్** 34 - 35 ప్రతి అనుచర సంఘానికి మేము ఒక ఖుర్బానీ పద్ధతిని నిర్ణయిం చాము (ఆ అనుచర సంఘం) ప్రజలు అల్లాహ్ వారికి ప్రసాదించిన పశువుల మీద ఆయన పేరును స్మరించటానికి. (ఈ విభిన్న పద్ధతుల ఉద్దేశ్యం ఒక్కటే). కనుక మీ దేవుడు ఒక్కడే. మీరు ఆయనకే విధేయులు అవండి. ఓ ప్రవక్తా! అణకువగల వైఖరిని అవలంబించే వారికి శుభవార్తను అందజెయ్యి. వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే , అల్లాహ్ ప్రస్తావన విన్నప్పుడు వారి గుండెలు అదిరిపోతాయి. వారి మీదకు ఏ ఆపద వచ్చిపడినా , దానికి వారు ఓరిమి వహిస్తారు, నమాజ్‌ను స్థాపిస్తారు, మేము వారికి ఇచ్చిన ఉపాధి నుండి ఖర్చు పెడతారు.

**22. హజ్** 36 - 37 (ఖుర్బానీ) ఒంటెలను మేము మీ కొరకు అల్లాహ్ చిహ్నాలలో చేర్చాము. మీకు వాటిలో మేలు ఉన్నది. కనుక వాటిని నిలబెట్టి వాటిపై అల్లాహ్ పేరును స్మరించండి. (ఖుర్బానీ తరువాత) వాటి వీపులు నేలపై ఆనినప్పుడు, వాటిలో నుండి స్వయంగానూ తినండి , (యాచించని) సంతుష్టు లకూ తినిపించండి , తమ అవసరాలకు అడిగేవారికీ తినిపించండి. ఈ విధంగా మేము ఈ జంతువులను మీకు వశపరిచాము , మీరు కృతజ్ఞతలు తెలుపుకునేందుకు. వాటి మాంసమూ అల్లాహ్ కు చేరదు , వాటి రక్తమూ చేరదు. కాని మీ భయభక్తులు ఆయనకు చేరుతాయి. ఆయన వాటిని మీకు ఈవిధంగా వశపరిచాడు ఆయన ప్రసాదించిన

మార్గదర్శకత్వానికి మీరు ఆయన గొప్పతనాన్ని చాటేందుకు. ఓ ప్రవక్తా! సత్కార్యాలు చేసే వారికి శుభవార్త అందించు.

**22. హజ్** 38 - 41 నిశ్చయముగా అల్లాహ్ విశ్వసించినవారిని కాపాడతాడు. నిశ్చయ ముగా అల్లాహ్ నమ్మక ద్రోహి అయిన కృతఘ్నుణ్ణి ప్రేమించడు. ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యబడుతూ ఉందో , వారికి (యుద్ధం చేయటానికి) అనుమతి ఇవ్వబడిరది ఎందుకంటే వారు అన్యాయానికి గురిఅయిన వారు. నిశ్చయముగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు. వారు అన్యాయంగా తమ ఇళ్లనుండి తరిమివేయబడినవారు. వారి తప్పు కేవలం, ‘‘అల్లాహ్ మా ప్రభువు ’’ అని అనటమే. అల్లాహ్ గనక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండకపోతే, ఆశ్రమాలు, చర్చీలు, యూదుల ప్రార్థనాలయాలు , మశీదులు-వేటిలో అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరింప బడుతుందో - అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవే. అల్లాహ్ తనకు సహాయం చేసేవారికి తప్పకుండా సహాయపడతాడు. అల్లాహ్ మహా శక్తిమంతుడు , మహాబలవంతుడూను. మేము గనక వారికి భూమిపై అధికారాన్ని ప్రసాదిస్తే, వారు నమాజ్‌ను స్థాపిస్తారు , జకాత్ ఇస్తారు, మంచి చేయమని ఆజ్ఞాపిస్తారు , చెడునుండి నిరోధిస్తారు. సకల వ్యవహారాల అంతిమ నిర్ణయం అల్లాహ్ చేతులలో ఉంది.

**22. హజ్** 42 - 46 ఓ ప్రవక్తా! వారు (అంటే అవిశ్వాసులు) నిన్ను నిరాకరిస్తున్నారంటే , వారికి పూర్వం నూహ్, ఆద్, సమూద్ జాతులు, ఇంకా ఇబ్రాహీమ్ జాతివారు , లూత్ జాతివారు, మద్యన్ వాసులు కూడ (తమ తమ ప్రవక్తలను) నిరాక రించారు (అనే విషయాన్ని జ్ఞాపకముంచుకో) , ఇంకా మూసా కూడ తిరస్క రించబడ్డారు. ఈ సత్య తిరస్కారులందరికీ మొదట్లో నేను వ్యవధినిచ్చాను , తరువాత పట్టుకున్నాను. ఇక చూడు నా శిక్ష ఎంత భయంకరంగా ఉండినదో! పాపాల పుట్టలైన ఎన్నో జన పదాలను మేము నాశనం చేశాము , ఈనాడు అవి తమ కప్పులపై తలక్రిందులుగా పడి ఉన్నాయి, ఎన్నో బావులు నిరుప యోగంగా పడివున్నాయి, ఎన్నో ఎత్తైన భవనాలు శిధిలాలుగా మారిపోయాయి. వారు భూమిపై సంచరించలేదా వారి హృదయాలు అర్థం చేసుకోగలవిగా , వారి చెవులు వినగలవిగా కావటానికి ? యథార్థం ఏమిటంటే , కళ్లు గుడ్డివి అవవు , కాని వక్షములలోపల ఉన్న హృదయాలు మాత్రం గుడ్డివి అయి పోతాయి.

**22. హజ్** 47 - 48 వారు శిక్షకొరకై తొందరపెడుతున్నారు. అల్లాహ్ తన వాగ్దానానికి భంగకరంగా ఎంతమాత్రం వ్యవహరించడు. కాని నీ ప్రభువు వద్ద ఒక రోజు అంటే మీ లెక్కలో వెయ్యి సంవత్సరాలకు సమానమవుతుంది. దుర్మార్గపు జనపదాలు ఎన్నో ఉండేవి, నేను మొదట వాటికి వ్యవధి ఇచ్చాను, తరువాత పట్టుకున్నాను. అందరూ తిరిగి నా వైపునకే రావలసి ఉంది.

**22. హజ్** 49 - 51 ఓ ప్రవక్తా! ఇలా అను , ''మానవులారా! నేను మీకు కేవలం (కష్టకాలం రాకముందు) స్పష్టంగా హెచ్చరించే వ్యక్తిని మాత్రమే.'' కనుక విశ్వసించి మంచి పనులు చేసేవారికి క్షమాభిక్ష లభిస్తుంది , గౌరవ ప్రదమైన ఉపాధి కూడ లభిస్తుంది. మా ఆయతులను కించపరచటానికి ప్రయత్నం చేసే వారు నరకానికి మిత్రులు.

**22. హజ్** 52 - 54 ఓ ప్రవక్తా! నీకు పూర్వం, అతను కోరుకున్నప్పుడు, అతని ఆ కోరికలో షైతాన్ జోక్యం చేసుకొని ఏ సందేశహరుణ్ణీ, ఏ ప్రవక్తనూ మేము పంపి ఉండలేదు. ఇటువంటి షైతాన్ జోక్యాలను అల్లాహ్ నిర్మూలిస్తాడు మరియు తన ఆయతులను పటిష్ఠపరుస్తాడు. అల్లాహ్ సర్వజ్ఞాని , మహావివేకి. (ఆయన ఇలా ఎందుకు జరగనిస్తాడంటే) ఎవరి హృదయాలకు (కపటం) రోగం తగిలిందో , మరెవరి హృదయాలు మొద్దుబారి పోయాయో , వారికొరకై, షైతాన్ కల్పించిన చెడును , ఒక పరీక్షగా చెయ్యటానికి - యధార్థం ఏమిటంటే ఈ దుర్మార్గులు శత్రుత్వంలో చాల దూరం వెళ్లిపోయారు - జ్ఞాన సంపన్నులైన ప్రజలు ఇది నీ ప్రభువు నుండి వచ్చిన సత్యమని తెలుసుకోవటానికీ, వారు దాన్ని విశ్వసించటానికీ , వారి హృదయాలు ఆయన ముందు వంగిపోవటానికీ. నిశ్చయంగా అల్లాహ్, విశ్వసించే వారికి ఎల్లప్పుడూ ఋజువైన మార్గం చూపుతాడు.

**22. హజ్** 55 - 60 అవిశ్వాసులు దానిని గురించి సంశయంలోనే పడి ఉంటారు, చివరికి వారిపైకి ప్రళయ ఘడియ అయినా వచ్చి పడుతుంది లేదా ఒక దౌర్భాగ్య దినపు శిక్ష అయినా అవతరిస్తుంది. ఆనాడు రాజ్యాధికారం అల్లాహ్దవుతుంది, ఆయన వారి మధ్య తీర్పు చేస్తాడు. విశ్వసించినవారు , మంచి పనులు చేసినవారు వరాలతో నిండి ఉన్న ఉద్యానవనాలలోకి పోతారు. అవిశ్వాసానికి పాల్పడి , మా ఆయతులను తిరస్కరించిన వారికి అవమానకర మైన శిక్షపడుతుంది. ఎవరు అల్లాహ్ మార్గంలో వలసపోయారో , తరువాత చంపబడ్డారో లేక మరణించారో వారికి అల్లాహ్ మంచి ఉపాధిని ప్రసాదిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే ఉత్తమ ఉపాధి ప్రదాత. వారు తృప్తిపడే స్థలానికి ఆయన వారిని చేరుస్తాడు. నిస్సందేహంగా అల్లాహ్ సర్వమూ తెలిసినవాడు , సంయమనం కలవాడూను. ఇదీ వారి పరిణామం. ఇక , ఎవ రయితే తనపై జరిగినమేరకే ప్రతీకారం చేస్తాడో , పైగా అతనిపై అత్యాచారం కూడా జరిగివుంటే అల్లాహ్ అతనికి తప్పకుండా సహాయం చేస్తాడు. అల్లాహ్ క్షమించేవాడు , మన్నించేవాడూను.

**22. హజ్** 61 - 66 ఇలా ఎందుకు జరుగుతుందంటే, రాత్రి నుండి పగలునూ, పగలు నుండి రాత్రినీ వెలికి తీసేవాడు అల్లాహ్ యే గనుక. ఆయన అన్నీ వినేవాడు అన్నీ చూసేవాడు గనుక. ఇలా ఎందుకు జరుగుతుందంటే , అల్లాహ్ యే సత్యం గనుక. అల్లాహ్ ను కాదని వారు వేడుకునేవన్నీ అసత్యం గనుక. అల్లాహ్ యే ఆధిక్యం గలవాడు మరియు మహోన్నతుడు. ఆకాశం నుండి అల్లాహ్ నీటిని కురిపించటాన్నీ , తద్వారా భూమి సస్యశ్యామలం అయిపోవటాన్నీ నీవు చూడటం లేదా ? యధార్థం ఏమిటంటే, ఆయన అత్యంత సూక్ష్మ శక్తికలవాడు , సర్వమూ ఎరిగినవాడు. ఆకాశాలలో ఉన్నదీ , భూమిపై ఉన్నదీ అంతా ఆయనదే. నిస్సందేహంగా ఆయనే నిరపేక్షాపరుడు ,

స్తుతింప బడేవాడు. భూమిపై ఉన్న సమస్తాన్నీ ఆయన మీకు వశపరచాడు. ఆయనే పడవను నియమబద్ధం చేశాడు, అది ఆయన ఆజ్ఞానుసారం సముద్రంలో నడుస్తుంది. ఆయనే ఆకాశాన్ని నిలిపి ఉంచాడు , అది ఆయన అనుమతి లేకుండా నేలపై పడజాలదు. ఇదంతా మీరు చూడటం లేదా ? వాస్తవం ఏమిటంటే, మానవుల పట్ల అల్లాహ్ ఎంతో వాత్సల్యం కలవాడు, ఎంతో కరుణగలవాడు. ఆయనే మీకు జీవితాన్ని ప్రసాదించాడు, ఆయనే మీకు మృత్యువును కలుగజేస్తాడు ఆయనే మిమ్మల్ని మళ్లీ బ్రతికిస్తాడు. నిజంగానే మానవుడు పరమ సత్యధిక్కారి.

**22. హజ్** 67 - 70 ప్రతి అనుచర సంఘానికి మేము ఒక ఆరాధనా పద్ధతిని నిర్ణయిం చాము , అది దానిని అనుసరిస్తోంది. కనుక ఓ ప్రవక్తా! వారు ఈ విషయంలో నీతో తగాదాపడకూడదు. నీవు నీ ప్రభువు వైపునకు పిలువు. నిశ్చయంగా నీవు ఋజుమార్గంలో ఉన్నావు. ఒకవేళ వారు నీతో వివాదానికి తలపడితే , ఇలా అను, ''మీరు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు. ప్రళయం నాడు అల్లాహ్ మీ మధ్య మీరు విభేదించుకుంటూ వచ్చిన అన్ని విషయాలను గురించి తీర్పు చెబుతాడు.'' ఆకాశంలోనూ, భూమిపైనా ఉన్న ప్రతి వస్తువును గురించి అల్లాహ్ కు తెలుసని నీవు ఎరుగవా? అంతా ఒక గ్రంథంలో వ్రాయ బడి ఉంది. అల్లాహ్ కు ఇదేమంత కష్టమైనది కానేకాదు.

**22. హజ్** 71 - 72 ఈ జనం అల్లాహ్ ను కాదని ఎవరినైతే ఆరాధిస్తున్నారో , వారికొరకు అల్లాహ్ కూడ ఏ ప్రమాణాన్నీ అవతరింపజేయలేదు, వీరు కూడ వారిని గురించి ఏమీ ఎరుగరు. ఈ దుర్మార్గులకు సహాయపడే వాడెవ్వడూ లేడు. వారికి స్పష్టమైన మా ఆయతులను వినిపించినప్పుడు , సత్య తిరస్కారుల ముఖాలు మాడిపోవటాన్ని నీవు చూస్తావు. ఇంకా వారు మా ఆయతులను వినిపించే వారిపై వెంటనే విరుచుకుపడతారేమో అనిపిస్తుంది. వారికి ఇలా చెప్పు, ''దీనికంటే కూడ ఘోరమైన విషయమేమిటో నేను మీకు తెలిపేదా ? అది అగ్ని. సత్యాన్ని స్వీకరించక నిరాకరించే వారి విషయంలో అల్లాహ్ దానిని గురించిన వాగ్దానమే చేశాడు. అది అతి చెడ్డనివాస స్థలం.''

**22. హజ్** 73 - 74 మానవులారా! ఒక ఉదాహరణ ఇవ్వబడుతోంది దానిని శ్రద్ధగా వినండి: అల్లాహ్ ను కాదని మీరు ఏ దేవుళ్లను వేడుకుంటున్నారో , వారందరూ కలసి సమైక్యంగా ఒక్క ఈగను సృష్టించదలచినా , అలా చేయలేరు. అంతేకాదు , ఒకవేళ ఈగ వారినుండి ఏదైనా వస్తువును లాక్కుపోయినా , వారు దానిని విడిపించుకురానూలేరు. సహాయాన్ని అర్థించేవారూ బలహీనులే, సహాయం కోసం అర్థింపబడేవారూ బలహీనులే. అల్లాహ్ గొప్పతనాన్నే వారు గుర్తించ వలసిన విధంగా గుర్తించలేదు. నిజానికి అల్లాహ్ మాత్రమే శక్తిమంతుడు , గౌరవనీయుడూను.

**22. హజ్** 75 - 76 యధార్థం ఏమిటంటే, అల్లాహ్ (తన ఉత్తరువులను అందజేయ టానికి) సందేశహరులను దైవదూతల నుండీ, మానవులనుండీ ఎన్ను కుంటాడు. ఆయన అన్నీ వింటాడు, అన్నీ చూస్తాడు. ప్రజల ముందు

ఉన్న దానిని ఆయన ఎరుగును , వారికి గోప్యంగా ఉన్నదాన్నీ ఆయన ఎరుగును. వ్యవహారాలన్నీ ఆయన వైపునకే మరలుతాయి.

**22. హజ్** 77 - 78 విశ్వాసులారా! రుకూ చేయండి , సజ్దా చెయ్యండి , మీ ప్రభువుకు దాస్యం చెయ్యండి , మంచిపనులు చెయ్యండి. దీని ద్వారానే మీకు సాఫల్య భాగ్యం లభిస్తుందని ఆశించవచ్చు. అల్లాహ్ మార్గంలో జిహాద్ చెయ్యండి, జిహాద్ చెయ్యవలసిన విధంగా. ఆయన మిమ్మల్ని తన సేవకై ఎన్ను కున్నాడు. ధర్మంలో మీకు ఏ ఇబ్బందినీ ఉంచలేదు. మీ తండ్రి ఇబ్రాహీమ్ ధర్మంపై స్థిరంగా ఉండండి. పూర్వం కూడ అల్లాహ్ మీకు ''ముస్లిమ్'' అనే పేరునే పెట్టాడు, ఇందులో (ఖుర్ఆన్‌లో) కూడ (మీ పేరు ఇదే) దైవప్రవక్త మీ విషయంలో సాక్షిగా ఉండటానికి మరియు మీరు ప్రజల విషయంలో సాక్షు లుగా ఉండటానికి. కనుక నమాజును స్థాపించండి , జకాతు ఇవ్వండి, అల్లాహ్తో గట్టి సంబంధం కలిగి ఉండండి. ఆయన మీకు సంరక్షకుడు , ఎంతో మంచి సంరక్షకుడు , ఎంతో మంచి సహాయకుడు.

**23. అల్ మూ'మినూన్**

ఆయతులు : 118 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**23. అల్ మూ'మినూన్** 1 - 11 నిశ్చయముగా సాఫల్యం పొందే విశ్వాసులు తమ నమాజులో వినమ్రతను పాటిస్తారు. వ్యర్థ విషయాల జోలికిపోరు. జకాత్ విధానాన్ని ఆచరిస్తారు, తమ మర్మాంగాలను పరిరక్షించుకుంటారు, - తమ భార్యల, తమ అధీనంలో ఉన్న స్త్రీల విషయంలో తప్ప. వీరి విషయంలో పరిరక్షించు కోని పక్షంలో వారు నిందార్హులు కారు. అయితే ఎవరైనా దీనిని మించి కోరుకుంటే వారే అత్యాచారం చేసేవారు- తమ అమానతులకు , తమ వాగ్దానా లకు కట్టుబడి ఉంటారు , తమ నమాజులను శ్రద్ధగా కాపాడుకుంటారు. వారే స్వర్గాన్ని వారసత్వంగా పొందేవారు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

**23. అల్ మూ'మినూన్** 12 - 16 మేము మానవుణ్ణి మట్టియొక్క సారంతో సృష్టించాము తరువాత అతనిని ఒక సురక్షితమైన స్థానంలో పడే బిందువుగా మార్చాము , ఆ తరువాత ఈ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము , ఆపైన ముద్దను కండగా చేశాము , తరువాత మాంసపుకండను ఎముకలుగా చేశాము , ఆ తరువాత ఎముకలకు మాంసాన్ని తొడిగాము, ఆపైన దానిని భిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము. కనుక అల్లాహ్ ఎంతో శుభప్రదుడు , సృజనకారులందరిలోకెల్లా ఉత్తమ సృజన కారుడు. దాని తరువాత మీరు తప్పనిసరిగా మరణిస్తారు. మళ్లీ ప్రళయం నాడు నిస్సందేహంగా లేపబడతారు.

**23. అల్ మూ 'మినూన్** 17 - 20 మీపైన మేము ఏడు మార్గాలను నిర్మించాము సృష్టిక్రియను మేము ఎరుగనివారము కాము. ఆకాశం నుండి మేము సరిగ్గా లెక్క ప్రకారం ఒక ప్రత్యేక పరిమాణంలో నీటిని దింపాము , దానిని భూమిలోపల నిలువ చేశాము. మేము దానిని ఎలా కోరితే అలా మాయం చేయగలం. తరువాత ఆ నీటి ద్వారా మేము మీ కొరకు ఖర్జూరపు తోటలనూ , ద్రాక్ష తోటలనూ సృష్టించాము. ఈ తోటలలో మీ కొరకు అత్యంత రుచికరమైన పండ్లు ఉన్నాయి వాటి ద్వారా మీరు ఉపాధిని పొందుతారు. ఇంకా మేము తూరు సీనా ప్రాంతంలో పుట్టే చెట్టును కూడ సృష్టించాము , అది నూనెను కూడ ఇస్తుంది. ఇంకా తినేవారికి కూరగా కూడ ఉపయోగపడుతుంది.

**23. అల్ మూ'మినూన్** 21 - 22 నిజంగానే పశువులలో కూడ మీకు ఒక గుణపాఠం ఉంది. వాటి గర్భాలలో ఉన్న దానినుంచే మేము ఒక వస్తువును (అంటే పాలు) మీకు త్రాపుతున్నాము. మీకు వాటిలో ఇంకా ఎన్నో ఇతర లాభాలు కూడ ఉన్నాయి. వాటిని మీరు తింటారు, వాటిపైనా, పడవలలోనూ ఎక్కుతారు కూడ.

**23. అల్ మూ 'మినూన్** 23 - 29 మేము నూహ్ ను అతని జాతి వారి వద్దకు పంపాము. అతను ఇలా అన్నాడు, ''ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్ కు దాస్యం చేయండి, ఆయన తప్ప మీకు ఆరాధ్య దైవమెవ్వడూ లేడు. కాబట్టి మీరు ఆయనకు భయపడరా ?'' విశ్వసించటానికి తిరస్కరించిన అతని జాతిలోని సర్దారులు ఇలా అనసాగారు, ''ఈ వ్యక్తి మీవంటి ఒక మానవుడే తప్ప మరేమీ కాడు. మీపై ఆధిక్యత సాధించటం ఇతని అభిమతం. అల్లాహ్ గనుక పంపదలిస్తే, దైవదూతలను పంపిఉండేవాడు. (మానవులు దైవప్రవక్తలుగా వస్తారనే) ఈ విషయాన్ని మేము మా పెద్దల కాలాలలో కూడ ఎన్నడూ వినలేదు. ఏమీలేదు , ఈ మనిషికి కొంచెం పిచ్చిపట్టింది. ఇంకా కొంతకాలం వేచి చూడండి, (బహుశా నయమవుతుందేమో). నూహ్ ఇలా అన్నాడు , ''ప్రభూ! ఈ ప్రజలు నన్ను నిరాకరించారు ఇక నీవే నాకు దిక్కు. '' మేము అతనిపైకి ఇలా వహీ పంపాము , ''మా పర్యవేక్షణలో, మా వహీ ప్రకారం ఒక నావను తయారు చెయ్యి. తరువాత మా ఆజ్ఞ వచ్చినప్పుడు , పొయ్యిపొంగినప్పుడు, ప్రతి రకపు జంతుజాతి నుండి ఒక్కొక్క జంటను తీసుకుని అందులో ఎక్కు, నీ కుటుంబ సభ్యులను కూడ వెంట తీసుకునిపో, ఎవరికి వ్యతిరేకంగానైతే ఇదివరకే నిర్ణయం జరిగినదో వారిని తప్ప. దుర్మార్గుల విషయంలో నాతో ఏమీ చెప్ప వద్దు. ఇక వారు మునిగిపోయేవారే. తరువాత నీవు నీ సహచరులతో పాటు నావపైకి ఎక్కినప్పుడు , ''దుర్మార్గుల నుండి మాకు విమోచనం కలిగించిన దేవునికి కృతజ్ఞతలు '' అని అను. ఇంకా , ''స్వామీ! నన్ను శుభప్రదమైన స్థలంలో దించు, నీవు స్థలం ఇచ్చేవారిలో ఉత్తముడవు'' అని పలుకు.

**23. అల్ మూ'మినూన్** 30 ఈ గాథలో గొప్ప సూచనలు ఉన్నాయి. మేము ప్రజలను తప్పకుండా పరీక్షకు గురిచేస్తాము.

**23. అల్ మూ'మినూన్** 31 - 41 వారి తరువాత మేము మరొక తరం వారిని లేపాము. వారి వద్దకు వారి జాతికే చెందిన ఒక ప్రవక్తను పంపాము. (అతను వారికి ఇలా సందేశమిచ్చాడు) ''అల్లాహ్ కు దాస్యం చెయ్యండి. మీకు ఆయన తప్ప మరొక ఆరాధ్యుడెవ్వడూ లేడు. మీరు ఆయనకు భయపడరా ?'' విశ్వసించటానికి తిరస్కరించినటువంటి, పరలోక సమావేశం అబద్ధమని నిరాకరించినటు వంటి , ఇహలోక జీవితంలో మేము భాగ్యవంతులుగా చేసినటువంటి అతని జాతి సర్దారులు ఇలా అనటం ప్రారంభించారు, ''ఈ వ్యక్తి ఏమీకాడు, మీవంటి ఒక మానవుడు తప్ప. మీరు తినే దాన్నే ఇతడూ తింటాడు , మీరు త్రాగే దాన్నే ఇతడూ త్రాగుతాడు. ఇప్పుడు మీరు గనుక మీ వంటివాడే అయిన ఒక మానవుడికి విధేయతను చూపినట్లైతే , మీరు నష్టానికే గురిఅవుతారు. ఇతను మీకు తెలియజేసేదేమిటంటే , మీరు మరణించి మట్టిగా మారిపోయిన తరువాత , ఎముకల గూడుగా అయిపోయిన తరువాత, మీరు (గోరీల నుండి) బయటికి తీయబడతారట. అసంభవం, మీకు చేయబడే ఈ వాగ్దానం అసంభవం. ఇహలోక జీవితం తప్ప మరొక జీవితం లేనేలేదు. మనం ఇక్కడే జీవిస్తాము , ఇక్కడే మరణిస్తాము. మనం ఎంతమాత్రం తిరిగి లేపబడము. ఈ వ్యక్తి దేవుని పేరుతో కేవలం అబద్ధాలు కల్పిస్తున్నాడు. మేము అతను చెప్పేదానిని ఎన్నటికీ విశ్వసించం.'' దానిపై దైవప్రవక్త ఇలా ప్రార్థించాడు, ''ప్రభూ! ఈ ప్రజలు నన్ను నిరాకరించారు. ఇక దాని విషయంలో నీవే నాకు సహాయపడు. '' దానికి బదులుగా ఇలా సెలవీయబడిరది , ''ఆ సమయం దగ్గరలోనే ఉంది. అప్పుడు వారు తాము చేసిన దానికి పశ్చాత్తాప పడతారు. '' చివరకు సరిగ్గా సత్యం ప్రకారమే ఒక పెద్ద కల్లోలం వారిని చుట్టుముట్టింది. దుష్టులారా దూరంగా పొండి , అని మేము వారిని కసువులాగా ఊడ్చి పారవేశాము.

**23. అల్ మూ'మినూన్** 42 - 44 మేము వారి తరువాత ఇతర జాతులను లేపాము. ఏ జాతి అయినా తన గడువుకు ముందు నశింపనూలేదు, తన గడువుకు తరువాత జీవింపనూ లేదు. తరువాత మేము మా ప్రవక్తలను ఒకరి తరువాత ఒకరిని పంపాము. ఏ జాతి వద్దకైనా దాని ప్రవక్త వచ్చినప్పుడల్లా అది అతనిని నిరాకరిస్తూనే వచ్చింది. మేము ఒక జాతి తరువాత మరొక జాతిని నాశనం చేస్తూనేపోయాము చివరకు వాటిని గాథలుగానే చేసి వదిలాము - విశ్వసించని వారిపై శాపం విరుచుకుపడుగాక!

**23. అల్ మూ'మినూన్** 45 - 49 తరువాత మేము మూసానూ, అతని సోదరుడు హారూన్‌నూ మా సూచనలతో, స్పష్టమైన ఆధికారిక ప్రమాణంతోనూ , ఫిరౌను వద్దకూ అతని అధికారుల వద్దకూ పంపాము. కాని వారు అహంభావం కనబరచారు మరీ పొగరుబోతులై. ''మేము మా వంటివారే అయిన ఇద్దరు మనుషులను విశ్వసించాలా? ఆ మనుషులైనా మా వద్ద బందీగా ఉన్న జాతికి చెందినవారు '' అని వారు ఆ ఇద్దరినీ తిరస్కరించారు , నాశనమయ్యే వారిలో చేరిపోయారు. ప్రజలు మార్గదర్శకత్వాన్ని పొందటానికి మేము మూసాకు గ్రంథాన్ని ప్రసాదించాము.

**23. అల్ మూ'మినూన్** 50 మర్యమ్ కుమారుణ్ణీ , అతని తల్లినీ మేము ఒక సూచనగా చేశాము , వారిని ఒక పీఠభూమిపై ఉంచాము అది మిక్కిలి ప్రశాంతమైన స్థలం, అందులో సెలయేళ్లు ప్రవహించేవి.

**23. అల్ మూ'మినూన్** 51 - 52 ఓ ప్రవక్తలారా! స్వచ్ఛమైన వస్తువులను తినండి , మంచిపనులు చేయండి. మీరు ఏది చేసినా , అది నాకు తెలియకపోదు. మీ ఈ సంఘం ఒకే సంఘం , నేను మీ ప్రభువును , కనుక మీరు నాకు మాత్రమే భయపడండి.

**23. అల్ మూ'మినూన్** 53 - 54 కాని తరువాత ప్రజలు తమ ధర్మాన్ని వారిలో వారే ముక్కలు ముక్కలుగా చేసుకున్నారు. ప్రతివర్గం తన వద్ద ఉన్న దానితోనే ఆనంద పరవశమై ఉన్నది - మంచిది వారిని విడిచిపెట్టండి, ఒక ప్రత్యేక కాలం వరకు తమ అజాగ్రత్తలోనే మునిగి ఉండనివ్వండి.

**23. అల్ మూ 'మినూన్** 55 - 67 మేము వారికి సంపదలూ సంతానమూ ప్రసాదించి సహాయపడుతూ ఉన్నాము అంటే , వారికి మేళ్లు చేయటంలో మేము తొందరపడుతున్నామని వారు అనుకుంటున్నారా ? లేదు, అసలు విషయమేమిటో వారికి తెలియదు. యథార్థానికి, ఎవరు తమ ప్రభువు భయంవల్ల భయపడుతూ ఉంటారో, ఎవరు తమ ప్రభువు వాక్యాలను విశ్వసిస్తారో , ఎవరు తమ ప్రభువునకు ఇతరులను భాగస్వాములుగా చేయరో ఎవరు, తాము ఇవ్వగలిగినది ఇస్తుంటారో, కాని వారి హృదయాలు తమ ప్రభువు వైపునకు మరలి పోవలసి ఉన్నది అనే భావన వల్ల వణుకుతూ ఉంటాయో వారే మేళ్ల వైపునకు పరుగులు తీస్తారు , పోటీపడి వాటిని పొందుతారు. మేము ఏ వ్యక్తినీ అతని శక్తికి మించిన కష్టానికి గురిచేయము. మా వద్ద ఒక గ్రంథం ఉన్నది , అది (ప్రతి వ్యక్తిని గురించి) ఉన్నది ఉన్నట్లుగా తెలుపుతుంది. ప్రజలకు ఎట్టి పరిస్థితు ల్లోనూ అన్యాయం చెయ్యటం జరగదు. కాని వారికి ఈ విషయం గురించి తెలియదు. వారి కర్మలు కూడ (పైన ప్రస్తావించబడిన) పద్ధతికి భిన్నంగా ఉన్నాయి. (వారు తమ ఈ చేష్టలను చేస్తూనేపోతారు) చివరకు మేము వారి లోని భోగలాలసులను శిక్షించే నిమిత్తం పట్టుకున్నప్పుడు, వారు పెడబొబ్బలు పెట్టటం ప్రారంభిస్తారు - ఇక కట్టిపెట్టండి మీ ఫిర్యాదులను , మీ రోదనలను, మా తరఫు నుండి ఇక ఏ సహాయమూ మీకు లభించటం జరగదు. నా వాక్యాలు వినిపించబడేటప్పుడు మీరు (దైవప్రవక్త కంఠం విన్నంతనే) వెనక్కి తిరిగి పరుగెత్తేవారు , మీ అహంకారం వల్ల అతనిని అసలు లక్ష్యపెట్టేవారే కాదు, మీ చావిళ్లలో అతనిని ఎద్దేవా చేసేవారు, అతనిని గురించి వ్యర్థ ప్రలాపాలు పలికేవారు.

**23. అల్ మూ'మినూన్** 68 - 71 వారు ఎన్నడూ ఈ (దైవ) వాక్కును గురించి ఆలోచించనేలేదా ? లేక వారి పూర్వుల వద్దకు ఎన్నడూ రాని విషయాన్ని దేన్నయినా అతను తీసుకువచ్చాడా ? లేక వారు తమ ప్రవక్తను ఇదివరకెన్నడూ ఎరుగరు కాబట్టి (కొత్త మనిషైన కారణంగా) అతనంటే బెదురుతున్నారా ? లేక అతను పిచ్చి వాడని వారి అభిప్రాయమా ? కాదు, పైగా అతను సత్యాన్ని తీసుకువచ్చాడు అసలు వారిలో చాలామందికి

సత్యమంటేనే గిట్టదు - సత్యమే గనక వారి కోరికలను అనుసరించి ఉంటే , భూమ్యాకాశాలూ, వాటిలోని జీవరాశి వ్యవస్థా ఛిన్నాభిన్నమై ఉండేవి - కాదు, అయితే మేమే వారి సొంత ప్రస్తావనను వారి ముందు తీసుకువచ్చాము. కాని వారు తమ ప్రస్తావన నుండి ముఖం తిప్పుకుంటున్నారు.

**23. అల్ మూ'మినూన్** 72 - 74 నీవు వారిని ప్రతిఫలమేదైనా అడుగుతున్నావా ? నీకు నీ ప్రభువు ఇచ్చినదే శ్రేష్ఠమైనది. ఆయన శ్రేష్ఠుడైన ఉపాధిప్రదాత. నీవు వారిని ఋజు మార్గం వైపునకు పిలుస్తున్నావు. కాని పరలోకాన్ని నమ్మనటువంటి వారు ఋజుమార్గం నుండి వైదొలగి నడువగోరుచున్నారు.

**23. అల్ మూ'మినూన్** 75 - 77 ఒకవేళ మేము వారిపై దయచూపితే , వారు ఈనాడు గురిఅయిన ఆపదను తొలగిస్తే, అప్పుడు వారు తమ తలబిరుసుతనంతో పూర్తిగా అంధులై పోతారు. అసలు వారి పరిస్థితి ఎలా ఉందంటే మేము వారిని ఆపదకు గురిచేశాము , అయినా వారు తమ ప్రభువు ముందు వంగలేదు అణకువనూ అవలంబించలేదు. కాని చివరకు మేము వారికై కఠిన శిక్షా ద్వారాన్ని తెరిచే టంతటి పరిస్థితి ఏర్పడినప్పుడు, వారు ప్రతిశుభం పట్ల హతాశులు కావటాన్ని నీవు అకస్మాత్తుగా చూస్తావు.

**23. అల్ మూ 'మినూన్** 78 - 83 మీకు వినేశక్తినీ చూసే శక్తినీ ఇచ్చినవాడు , ఆలోచించటానికి హృదయం ఇచ్చినవాడూ అల్లాహ్ యే. కాని మీరు కృతజ్ఞత చూపటం అనేది చాల అరుదు. మిమ్మల్ని ధరణిపై వ్యాపింప జేసినవాడు ఆయనే, ఆయన వైపునకే మీరు సమీకరింపబడతారు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు మరియు ఆయనే మరణాన్నీ కలిగిస్తాడు. రేయింబవళ్ల పరిభ్రమణం ఆయన అధీనంలోనే ఉన్నది. ఈ విషయం మీకు అర్థం కావటం లేదా? కాని వారు తమ పూర్వీకులు అన్నదానినే అంటున్నారు. వారు ఇలా అంటారు , ''మేము చచ్చి, మట్టిగా మారినప్పుడు , అస్థిపంజరంగా అయిపోయినప్పుడు , మమ్మల్ని మళ్లీ బ్రతికించి లేపటం అనేది జరుగుతుందా? మేము కూడ ఇటువంటి వాగ్దానాలు ఎన్నో విని ఉన్నాము మాకు పూర్వం మా తాతముత్తాతలు కూడ వింటూనే వచ్చారు. ఇవి కేవలం పాతకాలపు కట్టుకథలే.''

**23. అల్ మూ 'మినూన్** 84 - 92 వారిని ఇలా అడుగు , ''మీకు తెలిస్తే చెప్పండి , ఈ భూమీ , దాని లోని ప్రాణులన్నీ ఎవరివో?'' వారు తప్పకుండా, ''అల్లాహ్ కు చెందుతాయి '' అని అంటారు. ''అలాంటప్పుడు మీరు ఈ విషయాన్ని ఎందుకు అర్థం చేసుకోరు ?'' అని అను. వారిని ఇంకా ఇలా అడుగు , ''సప్తాకాశాలకూ, మహోన్నతమైన పీఠానికీ ప్రభువు ఎవరు ?'' వారు తప్పకుండా, ''అల్లాహ్'' అని అంటారు. ''అలాంటప్పుడు మీరు ఎందుకు ఆయనకు భయపడరు?'' అని అను. వారితో ఇంకా ఇలా అను, ''మీరు గనక ఎరిగి ఉంటే చెప్పండి, ప్రతి దానిపై ఆధిపత్యం ఎవరికున్నదో ? ఇంకా శరణు ఇచ్చేవాడెవడో చెప్పండి ? ఆయనకు ప్రతిగా శరణు ఇవ్వగల వాడెవ్వడూ లేడు.'' వారు తప్పకుండా, ''ఈ శక్తిగలవాడు అల్లాహ్ యే'' అని అంటారు. ''అలాంటప్పుడు మీరు ఎలా మోసపోతున్నారు?'' అని అను. సత్య విషయాన్ని మేము వారి ముందుకు తీసుకువచ్చాము. వారు అబద్ధం

చెప్పేవారు అనటంలో ఏమాత్రం సందేహం లేదు. అల్లాహ్ ఎవరినీ తన సంతానంగా చేసుకోలేదు మరియు మరొక దేవుడెవ్వడూ ఆయనతో పాటు లేడు. ఒకవేళ అలా అయితే , ప్రతి దేవుడు తన సృష్టిని తీసుకుని వేరుపడిపోయేవాడు తరువాత వారు ఒకరిపై ఒకరు దండయాత్రలు చేసి ఉండేవారు. వారు కల్పించే విషయాలు ఏమాత్రం వర్తిం చని పరిశుద్ధుడు అల్లాహ్. గోప్యంగా ఉన్నదానినీ , బహిరంగంగా ఉన్నదానినీ ఎరిగినవాడు , దైవత్వంలో వారు ప్రతిపాదించే భాగస్వామ్యానికి ఆయన అతీతుడు.

**23. అల్ మూ'మినూన్** 93 - 95 ఓ ప్రవక్తా! ఇలా ప్రార్థించు , ''ప్రభూ! ఏ శిక్షను గురించి వారిని బెదిరించటం జరుగుతోందో, దానిని నేను ఉన్నప్పుడే నీవు అమలుపరచి నట్లయితే , నా ప్రభూ! నన్ను ఈ దుర్మార్గులలో చేర్చకు.'' యథార్థమేమిటంటే, మేము దేనిని గురించి వారిని బెదిరిస్తున్నామో దానిని నీకళ్ల ముందే అమలుచేయగల సకల శక్తిని మేము కలిగి ఉన్నాము.

**23. అల్ మూ'మినూన్** 96 - 98 ఓ ప్రవక్తా! చెడును ఉత్తమమైన పద్ధతి ద్వారా నివారించు. ఏ విషయాలను వారు నిన్ను గురించి కల్పిస్తున్నారో , అవి మాకు బాగా తెలుసు. ఇలా ప్రార్థించు , ''ప్రభూ! షైతానుల ప్రేరణల నుండి నేను నిన్ను శరణు వేడుకుంటున్నాను. నా ప్రభూ! అవి నా వద్దకు అసలు రాకుండేటట్లు నిన్ను శరణు వేడుకుంటున్నాను.''

**23. అల్ మూ'మినూన్** 99 - 115 (వారు తమ చేష్టలను మానుకోరు) చివరకు వారిలో ఎవడికైనా మరణం వస్తే వాడు ఇలా అనటం ప్రారంభిస్తాడు, ''ఓ నా ప్రభూ! నేను వదలిపెట్టివచ్చిన లోకానికే నన్ను తిరిగి పంపెయ్యి ఇక నేను మంచిపనులు చేస్తానని ఆశిస్తున్నాను. '' ఇది ఎంతమాత్రమూ జరిగేది కాదు , అతడు పలికేది కేవలం ఒక మాట మాత్రమే. ఇప్పుడు ఈ (మరణించేవారి) అందరి వెనుక ఒక గోడ అడ్డంగా ఉన్నది. అది మరొక జీవితం వచ్చే రోజు వరకు ఉంటుంది. తరువాత శంఖం ఊదబడినంతనే వారి మధ్య ఏ బంధుత్వమూ ఉండదు, వారు ఒకరినొకరు పరామర్శించుకోరు. అప్పుడు ఎవరి (త్రాసు) పళ్లెములు బరువుగా ఉంటాయో వారే సాఫల్యం పొందుతారు. ఎవరి (త్రాసు) పళ్లెములు తేలికగా ఉంటాయో , వారే తమను తాము నష్టానికి గురిచేసుకునేవారు. వారు నరకంలో శాశ్వతంగా ఉంటారు, అగ్ని వారి ముఖాల చర్మాన్ని తిని వేస్తుంది , వారి దవడలు బయటపడతాయి - ''నా వాక్యాలు మీకు వినిపించ బడేటప్పుడు వాటిని నిరాకరించినవారు మీరేకదా ?'' వారు ఇలా అంటారు , ''ఓ మా ప్రభూ! మా దౌర్భాగ్యం మమ్మల్ని కప్పేసింది. నిజంగానే మేము మార్గం తప్పిన వారము. ఓ స్వామీ! ఇక మమ్మల్ని ఇక్కణ్ణుంచి బయటకు తీయి. తరువాత మేము అటువంటి పాపాలు చేస్తే , దుర్మార్గులమవుతాము.'' అల్లాహ్ దానికి ఇలా సమాధానం పలుకుతాడు, ''నా ముందునుంచి వెళ్లి పోండి, ఇందులోనే పడి ఉండండి, నాతో మాట్లాడకండి.'' నా దాసులు కొందరు , ''మా ప్రభూ! మేము విశ్వసించాము. మమ్మల్ని క్షమించు. మాపై దయచూపు. నీవు కరుణామయులలోకెల్లా ఉత్తమ కరుణామయుడవు'' అని అన్నప్పుడు, వారిని పరిహసించింది

మీరేకదా! చివరకు వారిపట్ల మీ మంకుపైఖరి మిమ్మల్ని , ''నేను ఒకణ్ణి ఉన్నాను '' అనే విషయాన్ని కూడ మరచిపోయేలా చేసింది. మీరు వారిని పరిహసిస్తూనే పోయారు. ఈనాడు నేను వారి సహనానికి ఈ ప్రతిఫలం ఇచ్చాను. వారే సఫలురు. తరువాత అల్లాహ్ వారిని ఇలా అడుగుతాడు , ''చెప్పండి, భూలోకంలో మీరు ఎన్ని సంవత్సరాలు ఉన్నారు.'' వారు, ''మేము ఒక రోజో లేక రోజులో కొంత భాగమో అక్కడ ఉన్నాము. లెక్కపెట్టేవారిని అడగండి'' అని అంటారు. ఇలా సెలవీయబడుతుంది: ''కొంతకాలమే ఉన్నారు కదా! అయ్యో మీరు ఈ విషయాన్ని అప్పుడు తెలుసుకుని ఉంటే ఎంత బాగుండేది. మేము మిమ్మల్ని వృధాగానే పుట్టించామని , మా వైపునకు మీరు ఎన్నడూ మరలిరావటమనేది జరగదని భావించారా?''

**23. అల్ మూ'మినూన్** 116 - 117 కనుక అల్లాహ్ మహోన్నతుడు , నిజమైన చక్రవర్తి. ఆయన తప్ప మరొక దేవుడు లేనేలేడు, గౌరవ పీఠానికి స్వామి. ఎవడైనా అల్లాహ్తో పాటు మరొక ఆరాధ్యుణ్ణి వేడుకుంటే , దానికి అతని వద్ద ఏ ప్రమాణమూ లేదు. అతని లెక్క అతని ప్రభువు వద్ద ఉన్నది. అటువంటి అవిశ్వాసులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు.

**23. అల్ మూ 'మినూన్** 118 ఓ ప్రవక్తా! ఇలా అను: ''నా ప్రభూ! మన్నించు , కరుణించు. కరుణా మయులందరిలో కెల్లా నీవు ఉత్తమ కరుణామయుడవు.''

**24. అన్ నూర్**

ఆయతులు : 64 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**24. అన్ నూర్** 1 ఇది మేము అవతరింపజేసిన ఒక సూరా. మేము దానిని విధిగా జేశాము , మీరు గుణపాఠం నేర్చుకుంటారేమో అని, అందులో మేము స్పష్టమైన ఉపదేశాలను అవతరింపచేశాము.

**24. అన్ నూర్** 2 వ్యభిచారిణి, వ్యభిచారి - ఈ ఇద్దరిలో ప్రతి ఒక్కరినీ నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి. మీరు అల్లాహ్ పై, అంతిమదినంపై విశ్వాసం ఉన్నవారే అయితే, వారి మీద కనికరం చూపే తలంపు అల్లాహ్ ప్రసాదించిన ధర్మ (నిర్వహణ) విషయంలో మిమ్మల్ని అడ్డుకోరాదు. వారిని శిక్షించేటప్పుడు విశ్వాసుల వర్గం ఒకటి అక్కడ ఉండాలి.

**24. అన్ నూర్** 3 ఒక వ్యభిచారి , వ్యభిచారిణిని లేక ముష్రిక్ స్త్రీని తప్ప మరెవరినీ వివాహం చేసుకోకూడదు. వ్యభిచారిణిని ఒక వ్యభిచారి లేక ఒక ముష్రిక్కు పురుషుడు తప్ప మరెవ్వరూ వివాహం చేసుకోకూడదు. అటువంటి వివాహాలు విశ్వాసు లకు నిషేధించబడ్డాయి.

**24. అస్ నూర్** 4 - 5 ఎవరైనా శీలవతులైన స్త్రీలపై నిందమోపి తరువాత నలుగురు సాక్షులను తీసుకురాకపోతే, వారిని ఎనబై కొరడా దెబ్బలు కొట్టండి, వారి సాక్ష్యాన్ని ఇక ఎన్నడూ అంగీకరించకండి. వారే దుర్మార్గులు- ఈ చేష్ట తరువాత పశ్చాత్తాపపడి తమను తాము సంస్కరించుకునేవారు తప్ప. అల్లాహ్ వారి విషయంలో తప్పకుండా క్షమించేవాడు, కరుణామయుడూను.

**24. అస్ నూర్** 6 - 10 ఎవరైనా తమ భార్యలపై నింద మోపినప్పుడు వారిద్దరూ తప్ప ఇతరులెవ్వరూ సాక్షులుగా వారి వద్ద లేనిపక్షంలో వారిలో ఒక వ్యక్తి సాక్ష్యం (ఏమిటంటే, తాను) నాలుగుసార్లు అల్లాహ్ పై ప్రమాణం చేసి (తన నిందా రోపణ) సత్యమని తాను సాక్ష్యం చెప్పాలి. ఐదోసారి , ఒకవేళ తాను (తన నిందారోపణలో) అబద్ధం చెప్పి ఉంటే, తనపై అల్లాహ్ శాపం అవతరించుగాక! అని అనాలి, భార్యకు శిక్ష ఎలా తప్పుతుందంటే, ఆమె నాలుగుసార్లు అల్లాహ్ పై ప్రమాణం చేసి , ఈ వ్యక్తి (తన నిందా రోపణలో) అబద్ధం చెపుతున్నాడని సాక్ష్యమివ్వాలి. ఐదోసారి , ఒకవేళ అతడు (తన నిందారోపణలో) సత్యవంతుడే అయితే తనపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుగాక! అని ఆమె అనాలి. మీపై అల్లాహ్ అనుగ్రహం , కరుణ లేకపోతే, అల్లాహ్ క్షమించేవాడూ, వివేకవంతుడూ అయి ఉండకపోతే (భార్యలపై నిందమోపే వ్యవహారం మిమ్మల్ని పెద్ద చిక్కులో పడవేసి ఉండేదే).

**24. అస్ నూర్** 11 - 15 ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చినవారు, మీలోని ఒక వర్గం వారే ఈ సంఘటనను మీ విషయంలో కీడుగా భావించకండి, పైగా ఇది మీకు మేలైనదే. ఎవడు ఇందులో ఎంత పాత్ర వహించాడో , వాడు అంతే పాపాన్ని మూటగట్టుకున్నాడు. ఇంకా ఈ బాధ్యతలో పెద్ద భాగాన్ని తన నెత్తిపై వేసుకున్న వ్యక్తికి పెద్ద శిక్షపడుతుంది. మీరు దానిని గురించి విన్నప్పుడే విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ తమను గురించి తాము సదభిప్రాయాన్ని ఎందుకు ఏర్పరచుకోలేదు? ఇది స్పష్టమైన అభాండమని ఎందుకు ఖండిరచలేదు? వారు (తమ నిందారోపణకు రుజువుగా) నలుగురు సాక్షులను ఎందుకు తీసుకురాలేదు ? వారు ఇప్పుడు సాక్షులను తీసుకురాలేదు కాబట్టి, అల్లాహ్ దృష్టిలో వారే అసత్యవాదులు. మీపై ప్రపంచంలోనూ , పరలోకంలోనూ, అల్లాహ్ అనుగ్రహం, ఆయన కారుణ్యం , కృప ఉండకపోతే , మీరు ఏ విషయాలలోనైతే పడిపోయారో , ఆ విషయాల పర్యవసానంగా, ఒక పెద్ద శిక్ష మిమ్మల్ని పట్టుకొని ఉండేది. (కొంచెం ఆలోచించండి, అపుడు మీరు ఎంత ఘోరమైన తప్పుచేశారో) అప్పుడు మీ నాలుకలు ఒక దానినుండి మరొకటి ఈ అబద్ధాన్ని అందుకుంటూ పోయాయి. మీరు మీకు తెలియని దాన్ని మీ నోటితో అంటూ పోయారు. మీరు దానిని మామూలు విషయంగా భావించారు. వాస్తవానికి అల్లాహ్ దృష్టిలో అది చాల పెద్ద విషయం.

**24. అస్ నూర్** 16 - 18 దానిని వినగానే మీరు ఇలా ఎందుకనలేదు , ''ఇటువంటి విషయాన్ని నోటితో అనటం మాకు శోభించదు, అల్లాహ్ పరిశుద్ధుడు. ఇది పెద్ద అభాండం.'' మీరు విశ్వాసులే అయితే, ఇక ముందు ఎన్నడూ

ఇటువంటి చేష్ట చేయకూడదని అల్లాహ్ మీకు ఉపదేశిస్తున్నాడు. అల్లాహ్ మీకు స్పష్టమైన ఉపదేశాలు ఇస్తున్నాడు ఆయన జ్ఞాని, వివేకవంతుడూను.

**24. అస్ నూర్** 19 - 20 విశ్వాసుల వర్గంలో అశ్లీలత వ్యాపించాలని కోరేవారు , ప్రపంచం లోనూ, పరలోకంలోనూ వ్యధాభరితమైన శిక్షకు అర్హులు. అల్లాహ్ ఎరుగును , మీరు ఎరుగరు. ఒకవేళ అల్లాహ్ అనుగ్రహం , ఆయన కృపాకటాక్షాలు మీపైన లేకపోతే, అల్లాహ్ వాత్సల్యం కలవాడు, కరుణామయుడు అయి ఉండకపోతే, (ఇప్పుడు మీ మధ్య వ్యాపింపజేయబడిన విషయం దారుణమైన ఫలితాలకు కారణభూతమై ఉండేది).

**24. అస్ నూర్** 21 విశ్వసించిన ప్రజలారా! షైతాను అడుగుజాడలలో నడవకండి. వాడిని ఎవరైనా అనుసరిస్తే వాడు అతనికి అశ్లీలతనే, చెడునే ఆజ్ఞాపిస్తాడు. ఒకవేళ అల్లాహ్ అనుగ్రహం ఆయన కారుణ్యం మీ మీద లేకపోతే, మీలో ఏ వ్యక్తీ పరిశుద్ధుడు కాలేడు. కాని అల్లాహ్యే తాను కోరిన వారిని పరిశుద్ధులుగా చేస్తాడు. అల్లాహ్ అన్నీ వినేవాడు, అన్నీ తెలిసినవాడూను.

**24. అస్ నూర్** 22 మీలోని ప్రముఖులు , స్థితిపరులు తమ బంధువులకూ, నిరుపేదలకూ, అల్లాహ్ మార్గంలో వలస వచ్చిన ప్రజలకూ, సహాయం చేయకూడదని ప్రమాణం చేయరాదు. వారిని క్షమించాలి , వారి(తప్పులను)ని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా ? అల్లాహ్ గుణం ఏమిటంటే, ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను.

**24. అస్ నూర్** 23 - 25 శీలవతులు , అమాయికలు అయిన విశ్వాసం గల స్త్రీలపై అభాండం వేసేవారు ప్రపంచంలోనూ, పరలోకంలోనూ శపించబడ్డారు. వారికి పెద్ద శిక్షపడుతుంది. వారి నోళ్లూ , వారి కాళ్లూ, చేతులూ వారి చేష్టలను గురించి స్వయంగా సాక్ష్యం పలికేరోజును వారు మరచిపోకూడదు. ఆ రోజు అల్లాహ్ వారికి తగిన ప్రతిఫలాన్ని పూర్తిగా ఇస్తాడు. ఇంకా సత్యాన్ని సత్యంగా చేసి చూపే అల్లాహ్యే సత్యమని వారికి తెలిసిపోతుంది.

**24. అస్ నూర్** 26 అపవిత్ర స్త్రీలు అపవిత్ర పురుషుల కొరకు , అపవిత్ర పురుషులు అపవిత్ర స్త్రీల కొరకే. పవిత్ర స్త్రీలు పవిత్ర పురుషుల కొరకు , పవిత్ర పురుషులు పవిత్ర స్త్రీల కొరకే. నిందలు మోపే వారి నిందల నుండి వారు పరిశుద్ధులు. వారికై క్షమాభిక్ష గౌరవప్రదమైన ఉపాధి ఉన్నాయి.

**24. అస్ నూర్** 27 - 29 విశ్వసించిన ప్రజలారా! మీ ఇళ్లల్లోకి తప్ప ఇతరుల ఇళ్లల్లోకి ప్రవేశించకండి , ఇంటి వారి అంగీకారం పొందనంత వరకు, ఇంటి వారికి సలామ్ చేయనంతవరకు. ఈ పద్ధతి మీకు ఎంతో ఉత్తమమైనది. దీనిని మీరు పాటిస్తారని ఆశించబడుతోంది. ఇంకా ఒకవేళ అక్కడ మీరు ఎవరినీ కనుగొనకపోతే , మీకు అనుమతి ఈయబడనంత వరకు ప్రవేశించకూడదు. ఒకవేళ, తిరిగి వెళ్లిపొమ్మని మీతో అంటే , తిరిగి వెళ్ళిపోండి. ఇది మీకు ఎంతో పరిశుద్ధమైన పద్ధతి. మీరు ఏది చేస్తారో , అది అల్లాహ్ కు బాగా తెలుసు. అయితే ఎవరికీ నివాస స్థలం

కానటువంటి మీకు ప్రయోజనకరమైన (లేక పనికివచ్చే) వస్తువేదైనా ఉన్నటువంటి ఇళ్లల్లోకి ప్రవేశిస్తే అది మీకు దోషమేమీ కాదు. మీరు బహిరంగపరచేది, దాచేదీ అంతా అల్లాహ్ కు తెలుసు.

**24. అస్ నూర్** 30 ప్రవక్తా! విశ్వసించిన పురుషులకు తమ చూపులను కాపాడుకోండి అనీ తమ మర్మాంగాలను రక్షించుకోండి అనీ చెప్పు. ఇది వారికి ఎంతో పరిశుద్ధ మైన పద్ధతి. వారు చేసే దానిని గురించి అల్లాహ్ కు బాగా తెలుసు.

**24. అస్ నూర్** 31 ... ప్రవక్తా! విశ్వసించిన మహిళలకు ఇలా చెప్పు, తమ చూపులను కాపాడుకోండి అని, తమ మర్మాంగాలను రక్షించుకోండి అని , తమ అలంకర ణను ప్రదర్శించవలదని - దానంతట అదే కనిపించేది తప్ప - తమ వక్షస్థలా లను ఓణీ అంచులతో కప్పుకోవాలని , వారు తమ అలంకరణను వీరి ముందు తప్ప మరెవరి ముందూ ప్రదర్శించకూడదని: భర్త, తండ్రి, భర్తల తండ్రులు, తమ కుమారులు, భర్తల కుమారులు, అన్నదమ్ములు, అన్నదమ్ముల కుమారులు , అక్కా చెల్లెళ్ల కుమారులు తమతో కలసి మెలసి ఉండే స్త్రీలు. తమ స్త్రీ పురుష బానిసలు, వేరే ఏ ఉద్దేశ్యమూ లేని వారి కింద పనిచేసే పురుష సేవకులు. స్త్రీల గుప్త విషయాలను గురించి ఇంకా తెలియని బాలురు. తాము గుప్తంగా ఉంచిన తమ అలంకరణ ప్రజలకు తెలిసేలా వారు తమ కాళ్లను నేలపై కొడుతూ నడవరాదని కూడ వారికి చెప్పు.

**24. అస్ నూర్** ... 31 విశ్వసించిన ప్రజలారా! మీరంతా కలసి అల్లాహ్ వైపునకు మరలి క్షమాభిక్షను వేడుకోండి. మీకు సాఫల్యం కలగవచ్చు.

**24. అస్ నూర్** 32 - 33 ... మీలో ఎవరు వివాహం లేకుండా ఒంటరిగా ఉంటున్నారో మీ స్త్రీ పురుష బానిసలలో ఎవరు గుణవంతులో, వారి వివాహాలు చేసివేయండి. వారు గనక పేదవారయితే, అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేస్తాడు. అల్లాహ్ అంతులేని వనరులు కలవాడు. సర్వమూ తెలిసినవాడు. వివాహ అవకాశాన్ని ఇంకా పొందనివారు శీల శుద్ధతను పాటించాలి. అల్లాహ్ తన అనుగ్రహం ద్వారా వారికి కలిమి ఇచ్చేవరకు.

**24. అస్ నూర్** ... 33 ... మీ అధీనంలో ఉన్న వారిలో ఎవరైనా ముకాతబత్ (షరతుల పత్రం) కొరకు విజ్ఞప్తి చేస్తే, వారిలో మంచితనం ఉందని మీరు గ్రహిస్తే , వారితో 'ముకాతబత్'ను కుదుర్చుకోండి. అల్లాహ్ మీకు ఇచ్చిన ధనం నుండి మీరు వారికి ఇవ్వండి.

**24. అస్ నూర్** ... 33 మీ లౌకిక ప్రయోజనాల నిమిత్తం మీ బానిస స్త్రీలను వేశ్యావృత్తికై బలవంతపెట్టకండి. వారే శీలవతులుగా ఉండగోరినపుడు ఎవరైనా వారిని బలవంతపెడితే , ఆ బలత్కారం తరువాత అల్లాహ్ వారి (బానిస స్త్రీల)ని క్షమించేవాడు, కరుణించేవాడూను.

**24. అస్ నూర్** 34 మేము స్పష్టమైన మార్గదర్శకత్వాన్నిచ్చే ఆయత్‌లను మీ వద్దకు పంపాము. మీకు పూర్వం గతించిన జాతుల గుణపాఠం నేర్పే ఉదాహరణలను కూడ మేము మీ ముందు పెట్టాము. భయభక్తులు కలవారికి అవసరమైన ఉపదేశా లను కూడ మేము చేశాము.

**24. అస్ నూర్** 35 - 40 అల్లాహ్ ఆకాశములకూ, భూమికీ వెలుగు. (సృష్టిలో) ఆయన వెలుగు ఉపమానం ఇలా ఉంది: ఒక గూటిలో దీపం ఉన్నది, ఆ దీపం ఒక గాజు చిమ్నీలో ఉన్నది, ఆ గాజు కుప్పె ఆణిముత్యం మాదిరిగా మెరిసే నక్షత్రంలా ఉన్నది. ఆ దీపం శుభవంతమైన ఒక జైతూన్ వృక్షపు నూనెతో ప్రకాశింపజేయబడుతోంది. ఆ వృక్షం తూర్పుకూ చెందదు , పడమరకూ చెందదు దాని నూనె నిప్పు తగలకపోయినా దానంతట అదే మండుతుంది. (ఈ విధంగా) వెలుగుపై వెలుగు (ద్విగుణీకృతమయ్యే కారణాలన్నీ ఏక మయ్యాయి) అల్లాహ్ తన వెలుగు వైపునకు తనకు ఇష్టమైన వారికి మార్గం చూపుతాడు. ఆయన ప్రజలకు దృష్టాంతాల ద్వారా విషయాన్ని బోధిస్తాడు. ఆయన ప్రతి విషయాన్నీ బాగా ఎరుగును. (ఆయన వెలుగు వైపునకు పోయేమార్గం పొందినవారు) ఏ గృహాలను మహోన్నతం చేయటానికీ , ఏ గృహాలలో తన నామాన్ని స్మరించటానికీ అల్లాహ్ అనుమతించాడో , ఆ గృహాలలో ఉంటారు. వ్యాపారంగానీ , క్రయవిక్రయాలుగానీ, అల్లాహ్ సంస్మరణ విషయంలో నమాజు సంస్థాపనం , జకాత్ ఇవ్వడం వంటి విషయా లలో , ఎవరినైతే అశ్రద్ధ వహించేలా చేయవో, అటువంటి వారు ఉదయం, సాయంత్రం ఆయన స్తోత్రం చేస్తారు. హృదయాలు తలక్రిందులై , కనుగ్రుడ్లు తేలిపోయే పరిస్థితి ఏర్పడబోయే రోజును గురించి వారు భయపడుతూ ఉంటారు. (వారు ఇదంతా ఎందుకు చేస్తారంటే) అల్లాహ్ వారి ఉత్తమ కర్మల ప్రతిఫలాన్ని వారికి ఇవ్వాలనీ , అదనంగా తన అనుగ్రహం నుండి ఇంకా ప్రసాదించాలనీ అల్లాహ్ తాను కోరిన వారికి లెక్కలేకుండా ఇస్తాడు. (దానికి వ్యతిరేకంగా) అవిశ్వాసానికి పాల్పడిన వారి కర్మలకు ఉపమానంగా ఎడారిలోని ఎండమావిని చెప్పవచ్చు. దప్పిక గొన్నవాడు దానిని చూసి నీరు అనుకున్నాడు కాని అక్కడకు చేరి ఏమీ పొందలేకపోయాడు. అయితే అతడు అక్కడ అల్లాహ్ ఉన్నట్లు కనుగొన్నాడు. ఆయన అతని లెక్కను పూర్తిగా తేల్చివేశాడు. లెక్క తేల్చడంలో అల్లాహ్ కు ఏమాత్రం ఆలస్యం కాదు. లేదా (వారి కర్మలకు) ఒక లోతైన సముద్రంలోని చీకటిని ఉపమానంగా చెప్పవచ్చు. దాని (ఆ చీకటి) పై ఒక అల వ్యాపించి ఉన్నది. దానిపై మరొక అల, దానిపై మేఘం , చీకటిపై చీకటి. మనిషి తన చేతిని బయటకు సాచితే , దానిని కూడ చూడలేడు. ఎవరికి అల్లాహ్ తన వెలుగును ప్రసాదించడో, అతనికి మరే వెలుగూ లేదు.

**24. అస్ నూర్** 41 - 42 ఆకాశాలలోను, భూమిపైనా ఉన్న సమస్తమూ, రెక్కలు విప్పి ఎగిరే పక్షులు సైతమూ అల్లాహ్ స్తోత్రం చేయటాన్ని నీవు చూడటం లేదా? ప్రతి ఒక్కటీ తన నమాజును, తన స్తోత్రం చేసే పద్ధతిని ఎరుగును. అవి చేసే వాటినన్నింటినీ అల్లాహ్ బాగా ఎరుగును. ఆకాశముల మీద , భూమి మీద సామ్రాజ్యాధికారం అల్లాహ్దే. ఆయన వైపునకే అంతా మరలవలసి ఉన్నది.

**24. అస్ నూర్** 43 - 44 అల్లాహ్ మేఘాన్ని మెల్లమెల్లగా నడపటాన్నీ , దాని తునకలను ఒకదానితో ఒకటి కలపటాన్నీ, తరువాత దానిని పోగుచేసి ఒక దట్టమైన మబ్బుగా మలచటాన్నీ నీవు చూడవా ? తరువాత దాని పైపొరనుండి వర్షపు చినుకులు రాలుతూ ఉండటాన్ని నీవు చూస్తావు. ఆయన ఆకాశం నుండి , దానిలోని ఎత్తైన పర్వతాలు కారణంగా, వడగండ్లను కురిపిస్తాడు. తాను తలచిన వారికి వాటి ద్వారా నష్టం కలిగిస్తాడు, తాను తలచిన వారిని వాటి నుండి రక్షిస్తాడు. దాని పిడుగు యొక్క మెరుపు చూపులను చెదరగొడుతుంది. రేయింబవళ్ల పరిభ్రమణను ఆయనే చేస్తున్నాడు. కళ్ళున్న వారికి ఇందులో గుణపాఠం ఉంది.

**24. అస్ నూర్** 45 అల్లాహ్ ప్రతి ప్రాణిని ఒక విధమైన నీటితో సృష్టించాడు. ఒకటి పొట్టపై నడుస్తుంటే , మరొకటి రెండు కాళ్లపై, ఇంకొకటి నాలుగు కాళ్ళపై నడుస్తోంది. ఆయన తనకు ఇష్టమైన దానిని సృష్టిస్తాడు. ఆయనకు ప్రతిదానిపై అధికారం ఉన్నది.

**24. అస్ నూర్** 46 మేము నిజాన్ని స్పష్టంగా తెలిపే వాక్యాలను అవతరింపజేశాము. ఇక ఋజుమార్గం వైపునకు అల్లాహ్యే తనకు ఇష్టమైన వారికి దారి చూపుతాడు.

**24. అస్ నూర్** 47 - 52 మేము అల్లాహ్ ను , దైవప్రవక్తను విశ్వసించాము, విధేయతను అంగీకరించాము, అని వారు అంటారు. కాని దాని తరువాత వారిలోని ఒక వర్గం (విధేయతపట్ల) విముఖతను చూపింది. అటువంటి వారు ఎంతమాత్రం విశ్వాసులు కారు. దైవప్రవక్త వారి మధ్య ఉన్న వ్యాజ్యం విషయంలో తీర్పు చెప్పటానికి వారిని అల్లాహ్ వైపునకూ, ప్రవక్త వైపునకూ రమ్మని పిలిచినప్పుడు , వారిలోని ఒక ప్రత్యర్థి వర్గం విముఖత చూపుతుంది. కాని ఒకవేళ సత్యం వారికి అనుకూలంగా ఉంటే , దైవప్రవక్త వద్దకు పెద్ద విధేయులు మాదిరిగా వచ్చేస్తారు. వారి హృదయాలకు (కపట) రోగమేదైనా తగిలిందా ? లేదా వారు సంశయంలో పడిపోయారా ? లేదా అల్లాహ్, మరియు ఆయన ప్రవక్త తమకు అన్యాయం చేస్తారని వారికి భయమా ? అసలు విషయమేమిటంటే , అన్యాయపరులు స్వయంగా వారే. విశ్వసించే వారి పని ఏమిటంటే , తమ వ్యాజ్యాన్ని దైవప్రవక్త పరిష్కరించే విషయంలో వారు అల్లాహ్ వైపునకూ , ప్రవక్త వైపునకూ పిలువబడితే , ‘‘మేము విన్నాము , విధేయత చూపాము ’’ అని అనాలి. అటువంటి వారే సాఫల్యం పొందుతారు. అల్లాహ్కూ , ప్రవక్తకూ విధేయత చూపేవారు , అల్లాహ్ కు భయపడేవారు , ఆయన పట్ల అవిధేయతకు దూరంగా ఉండేవారు మాత్రమే విజయం పొందుతారు.

**24. అస్ నూర్** 53 - 54 వారు (కపటులు) అల్లాహ్ పేరుతో గట్టి గట్టి ప్రమాణాలు చేసి , ‘‘మీరు ఆజ్ఞాపిస్తే, మేము ఇళ్లనుండి బయలుదేరుతాము’’ అని అంటారు. వారితో, ‘‘ప్రమాణాలు చేయకండి, మీ విధేయత ఎలాంటిదో తెలుసు, మీ చేష్టలు అల్లాహ్ ఎరుగనివేమీ కావు ’’ అని అను. ఇలా బోధించు , ‘‘అల్లాహ్ కు విధేయులు కండి , దైవప్రవక్త ఆదేశాలను పాటించండి. కాని ఒకవేళ మీరు విముఖులైతే, బాగా తెలుసుకోండి, దైవప్రవక్తపై పెట్టబడిన కర్తవ్యభారం

వరకే అతను బాధ్యుడు. మీపై మోపబడిన కర్తవ్య భారానికి మీరు బాధ్యులు. దైవప్రవక్తకు విధేయులైతే మీరే మార్గదర్శకత్వం పొందుతారు. లేకపోతే స్పష్టంగా ఆజ్ఞను అందజెయ్యటాన్ని మించి ఎక్కువ బాధ్యత దైవప్రవక్తపై లేదు.''

**24. అన్ నూర్** 55 - 57 మీలో విశ్వసించి మంచిపనులు చేసేవారికి అల్లాహ్ చేసిన వాగ్దానమేమిటంటే , ఆయన వారిని, వారికి పూర్వం గతించిన ప్రజలను చేసిన విధంగా, భూమిపై ఖలీఫాలు (ప్రతినిధులు)గా చేస్తాడు, అల్లాహ్ వారికై అంగీకరించిన వారి ధర్మాన్ని వారికొరకు పటిష్ఠమైన పునాదులపై స్థాపిస్తాడు. వారి యొక్క (ప్రస్తుత) భయస్థితిని శాంతిభద్రతలతో కూడిన స్థితిగా మారుస్తాడు. కనుక వారు నాకు దాస్యం చేయాలి , ఎవరినీ నాకు భాగస్వాములుగా చేయకూడదు. దీని తరువాత ఎవరైనా అవిశ్వాసానికి పాల్పడితే , అటువంటి వారే హద్దులు మీరినవారు. నమాజును స్థాపించండి , జకాత్ ఇవ్వండి , దైవప్రవక్తకు విధేయులుగా ఉండండి. అప్పుడు మీరు కరుణింపబడతారని ఆశించవచ్చు. అవిశ్వాసానికి పాల్పడేవారు అల్లాహ్ ను లొంగదీయగలరని భ్రమపడకండి. వారి నివాసం నరకం, అది బహుచెడ్డ నివాసం.

**24. అన్ నూర్** 58 - 59 విశ్వసించిన ప్రజలారా! మీ బానిసలూ , యుక్త వయస్సుకు ఇంకా చేరని మీ పిల్లలు మూడు సమయాలలో తప్పనిసరిగా అనుమతి తీసుకున్న తరువాతనే మీ వద్దకు రావాలి , ఉదయం నమాజుకు ముందు, మధ్యాహ్నం మీరు బట్టలు మార్చుకున్నప్పుడు, ఇషా నమాజు తరువాత. ఈ మూడు సమయాలు మీకు పరదా సమయాలు. అవి మినహా వారు అనుమతి లేకుండా వస్తే , అది మీకూ పాపం కాదు , వారికీ పాపం కాదు. మీరు ఒకరి వద్దకు ఒకరు మాటిమాటికీ రావలసియే ఉంటుంది. ఈ విధంగా అల్లాహ్ మీకు తన సూక్తులను విశదీకరిస్తున్నాడు. ఆయన జ్ఞానీ , వివేకీను. మీ పిల్లలు యుక్త వయస్సుకు చేరుకున్నప్పుడు , తమ పెద్దలు అనుమతి తీసుకునే విధంగానే వారు కూడా అనుమతి తీసుకుని మరీ రావాలి. ఇలా అల్లాహ్ తన వాక్యాలను మీ ముందు విశదం చేస్తున్నాడు. ఆయన జ్ఞాని మరియు వివేకి.

**24. అన్ నూర్** 60 యౌవనం ఉడిగిపోయి, వివాహం పట్ల ఉత్సాహం సన్నగిల్లిన స్త్రీలు తమ దుప్పట్లను తీసివేస్తే, వారు ఏ దోషమూ చేసినట్లు కాదు అయితే వారు తమ అలంకరణను ప్రదర్శించేవారు కాకూడదు. అయినప్పటికీ , వారు సిగ్గునే పాటిస్తే, అది వారికే శ్రేయస్కరమైనది. అల్లాహ్ అన్నీ వింటాడు, అన్నీ తెలిసినవాడు.

**24. అన్ నూర్** 61 ఒకవేళ ఏ అంధుడైనా , ఏ కుంటివాడైనా, ఏ రోగిఅయినా (ఎవరి ఇంట్లోనైనా అన్నం తినివేసి నట్లయితే) అది దోషం కాదు. మీరు మీ ఇంట్లో తిన్నా , మీ తండ్రీ తాతల ఇళ్లల్లో తిన్నా , మీ తల్లీ నాయనమ్మల ఇళ్లల్లో, మీ సోదరుల ఇళ్లల్లో లేదా మీ సోదరీమణుల ఇళ్లల్లో లేదా మీ తండ్రుల సోదరుల ఇళ్లల్లో లేదా మీ మేనత్తల ఇళ్లల్లో లేదా మేనమామల ఇళ్లల్లో లేదా మీ పిన్నమ్మల , పెద్దమ్మల ఇళ్లల్లో లేదా తాళపు చేతులు మీ అధీనంలో ఉన్న ఇళ్లల్లో లేదా మీ స్నేహితుల ఇళ్లల్లో తిన్నా మీకు ఏ ఆక్షేపణా ఉండదు. మీరు కలసి తిన్నా వేర్వేరుగా తిన్నా

దోషమేమీ కాదు. అయితే ఇళ్లల్లోకి ప్రవేశించి నప్పుడు, మీ వారికి సలాము చేయండి. ఇది మేలు కొరకు చేయబడే ప్రార్థన. అల్లాహ్ తరఫు నుండి నిర్ణయించబడిరది. ఎంతో శుభవంతమైనది , పరిశుద్ధ మైనది. ఈవిధంగా అల్లాహ్ తన ఆయతులను మీకు ఉపదేశిస్తున్నాడు, మీరు ఆలోచించి అర్థం చేసుకుని వ్యవహరిస్తారని ఆశించబడుతోంది.

**24. అస్ నూర్** 62 అల్లాహ్నూ , ఆయన ప్రవక్తనూ హృదయపూర్వకంగా విశ్వసించేవారు ఏదైనా సామూహిక కార్యం నిమిత్తం దైవప్రవక్తతో ఉన్నప్పుడు అతని అనుమతి లేకుండా వెళ్లని వారు మాత్రమే అసలైన విశ్వాసులు. ప్రవక్తా! నిన్ను అనుమతి అడిగేవారే అల్లాహ్ ను , ప్రవక్తను విశ్వసించేవారు. కనుక వారు తమ ఏ పనికైనా అనుమతి అడిగితే నీవు కోరిన వారికి అనుమతి ఇస్తూ ఉండు. అటువంటి వారిని క్షమించు అని అల్లాహ్ ను ప్రార్థించు. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను.

**24. అస్ నూర్** 63 - 64 ముస్లిములారా! దైవప్రవక్త పిలుపును మీలో ఒకరినొకరు పిలుచుకునే పిలుపుగా భావించ కండి. మీలో ఒకరి చాటున ఒకరు దాక్కుంటూ మెల్లగా జారిపోయేవారిని అల్లాహ్ బాగా ఎరుగును. దైవప్రవక్త ఆజ్ఞను ఉల్లంఘించేవారు , తాము ఏదైనా ఉపద్రవంలో చిక్కుకుపోతామేమో అనీ , తమపై బాధాకరమైన శిక్ష ఏదైనా అవతరిస్తుందేమో అనీ భయపడాలి. జాగ్రత్త! ఆకాశాలలోనూ , భూమిపైనా ఏది ఉన్నదో అది అల్లాహ్దే. మీరు ఏ వైఖరి అవలంబించినా దానిని అల్లాహ్ ఎరుగును. ప్రజలు ఆయన వైపునకు మరలింపబడేనాడు , వారు ఏమేమి చేసివచ్చారో ఆయన వారికి తెలియజేస్తాడు. ఆయనకు ప్రతి దానిని గురించీ పూర్తిగా తెలుసు.

## 25. అల్ ఫుర్ఖాస్

ఆయతులు : 77 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**25. అల్ ఫుర్ఖాస్** 1 - 3 ఎనలేని శుభాలవాడు ఈ గీటురాయిని తన దాసునిపై అవతరింప జేశాడు. సకల విశ్వవాసులకు హెచ్చరిక చేసేదిగా ఉండేటందుకు. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన ఎవరినీ కొడుకుగా చేసుకో లేదు. విశ్వసామ్రాజ్యాధిపత్యంలో ఆయనకు భాగస్వాములెవ్వరూ లేరు. ఆయన ప్రతి దానినీ సృష్టించాడు. తరువాత దానికి ఒక విధినీ నిర్ణయించాడు. ప్రజలు ఆయనను కాదని కల్పించుకున్నట్టి దేవుళ్లు ఏ వస్తువునూ సృష్టించలేరు, కాని వారే సృష్టింపబడతారు. వారు స్వయంగా తమ కొరకైనా ఏ లాభనష్టాల అధికారాన్నీ కలిగిలేరు. వారు చంపనూలేరు, బ్రతికించనూలేరు, మరణించిన వాణ్ణి మళ్లీ లేపనూ లేరు.

**25. అల్ ఫుర్ఖాస్** 4 - 6 దైవప్రవక్త మాటను విశ్వసించటానికి నిరాకరించిన వారు ఇలా అంటారు, ‘‘ఈ గీటురాయి ఒక కల్పన, దానిని ఇతనే స్వయంగా కల్పించాడు. ఇతరులు కొందరు ఈ పనిలో అతనికి సాయపడ్డారు. ’’ వారు

ఘోర అన్యాయా నికి, పరమ అబద్ధానికి ఒడిగట్టారు. ఇంకా ఇలా అంటారు , ''ఇవి పూర్వకాలం నాటి వారు వ్రాసిన విషయాలు, వాటికి ఇతను నకలు వ్రాయిస్తున్నాడు. అవి ఇతనికి ఉదయం సాయంత్రం వినిపించబడతాయి. '' ప్రవక్తా! వారితో, ''భూమియొక్క ఆకాశముల యొక్క రహస్యాన్ని ఎరిగినవాడు , దానిని అవతరింపజేశాడు'' అని అను. యధార్థమేమిటంటే, ఆయన ఎక్కువగా క్షమించేవాడు, కరుణించేవాడూను.

**25. అల్ ఫుర్ఖాన్** 7 - 10 వారు ఇలా అంటారు , ''ఇతనేమి ప్రవక్త, అన్నం తింటాడు, బజారులో తిరుగుతూ ఉంటాడు? ఇతని వద్దకు ఒక దైవదూత అయినా ఎందుకు పంపబడలేదు , ఇతనితో ఉంటూ (విశ్వసించని వారిని) బెదిరించటానికి? లేదా ఏదిలేకపోయినా కనీసం ఇతని కొరకు ఒక నిధి అయినా ఎందుకు దించబడలేదు ? లేదా ఇతనికి ఒక తోట అయినా ఎందుకు లేదు, దాని ద్వారా ఇతను (నిశ్చింతగా) ఉపాధిని పొందటానికి ?'' ఇంకా ఆ దుర్మార్గులు, ''మీరు చేతబడి చేయబడిన ఒక మనిషి వెంట నడుస్తున్నారు '' అని అంటారు. చూడు , ఎటువంటి విచిత్రమైన వాదాలను నీ ముందు పెడుతున్నారో! వారు ఎంతగా మార్గం తప్పిపోయారంటే , స్థిరమైన మాట అనేది వారికసలు తోచదు. శుభప్రదుడైన ఆయన తాను కోరితే , వారు ప్రతిపాదించిన వస్తువుల కంటే ఎంతో ఎక్కువగా నీకు ఇవ్వగలుగుతాడు. (ఒకటి కాదు) క్రింద కాలువలు ప్రవహించే ఎన్నో తోటలు, పెద్ద పెద్ద భవనాలు.

**25. అల్ ఫుర్ఖాన్** 11 - 14 అసలు విషయమేమిటంటే, వారు ఆ ''ఘడియ''ను తిరస్కరించారు. ఆ ఘడియను తిరస్కరించేవాడి కోసం మేము జ్వలించే అగ్నిని సిద్ధం చేసి ఉంచాము. అది వారిని దూరం నుంచి చూచినప్పుడు, వారు దాని క్రోధ ధ్వనులు , విజృంభణ ధ్వనులను వింటారు. దానిలోని ఒక ఇరుకైన స్థలంలో వారు కాళ్ళూ , చేతులూ బంధించబడిన స్థితిలో క్రుక్కబడినప్పుడు , చావును పిలవటం ప్రారంభిస్తారు. (అప్పుడు వారితో ఇలా అనబడుతుంది), ''ఈనాడు ఒక చావునే కాదు, ఎన్నో చావుల కోసం అరవండి.''

**25. అల్ ఫుర్ఖాన్** 15 - 16 వారిని అడగండి, ఈ పర్యవసానం మంచిదా లేక శాశ్వతంగా ఉండే స్వర్గం మంచిదా అని. ఆ స్వర్గం దైవభక్తి, దైవభీతి కలవారికి వాగ్దానం చేయబడిరది, అది వారి కర్మలకు ప్రతిఫలం. వారి ప్రయాణానికి చివరి గమ్యస్థానం , అందులో వారి ప్రతి కోరికా తీరుతుంది. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. దానిని ప్రసాదించటం అనేది నీ ప్రభువు తప్పనిసరిగా నెరవేర్చవలసిన ఒక వాగ్దానం.

**25. అల్ ఫుర్ఖాన్** 17 - 19 అదే రోజున (నీ ప్రభువు) ఈ ప్రజలను కూడ ఒక చోటకు చేరుస్తాడు. వారు అల్లాహ్ ను కాదని ఈ రోజున పూజిస్తున్న దేవుళ్లను కూడ పిలుస్తాడు. తరువాత ఆయన ఆ దేవుళ్లను , ''నా ఈ దాసులను మీరే మార్గం తప్పించారా లేక స్వయంగా వారే ఋజుమార్గం తప్పిపోయారా ?'' అని అడుగుతాడు. అప్పుడు వారు ఇలా విన్నవించుకుంటారు, ''నీవు అత్యంత పరిశుద్ధుడవు. నిన్ను తప్ప మరొకరిని మా రక్షకుడుగా చేసుకునే ధైర్యం కూడ మాకు లేదు. కాని నీవు వారికి , వారి పూర్వీకులకు జీవితావసర వస్తువులను పుష్కలంగా ఇచ్చావు. చివరకు వారు బోధనను మరచిపోయి దౌర్భాగ్య స్థితికి గురిఅయ్యారు. '' మీరు ఈనాడు అంటున్న మాటలను ఈ

విధంగా వారు (మీ దేవుళ్ళు) తిరస్కరిస్తారు. ఇక మీరు మీ దౌర్భాగ్యాన్నీ ఆపలేరు , ఎక్కడ నుండీ సహాయాన్నీ పొందలేరు. మీలో ఎవడు దుర్మార్గం చేసినా, అతనికి మేము కఠిన శిక్షను రుచి చూపిస్తాము.

**25. అల్ ఫుర్ఖాన్** 20 ''ప్రవక్తా! నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలందరూ అన్నం తినేవారే , బజారులలో సంచరించేవారే. అసలు మేము మిమ్మల్ని ఒకరి కొరకు మరొకరిని పరీక్షా సాధనాలుగా చేశాము. నీవు సహనంతో ఉంటావా? నీ ప్రభువు సర్వాన్నీ చూస్తున్నాడు.''

**25. అల్ ఫుర్ఖాన్** 21 - 30 మా సాన్నిధ్యంలో హాజరు కావలసి ఉన్నది అనే భయంలేని వారు ఇలా అంటారు , ''దైవ దూతలు మా వద్దకు ఎందుకు పంపబడటం లేదు ? మేము మా ప్రభువును ఎందుకు చూడకూడదు ?'' వారి మనస్సులలో మిక్కిలి అహంభావం ఉన్నది. వారు తమ తలబిరుసుతనంతో హద్దులు మీరిపోయారు. వారు దైవదూతలను చూసే రోజు నేరస్తులకు శుభవార్తల రోజేమీ కాదు - ''అల్లాహ్ శరణు '' అని వారు కేకవేస్తారు. అప్పుడు వారు చేసి ఉన్న దానినంతటినీ మేము తీసుకుని దుమ్ము మాదిరిగా ఎగురవేస్తాము. ఇక స్వర్గానికి అర్హులైన వారే ఆ రోజున మంచి స్థలంలో ఉంటారు. అంతేకాదు మధ్యాహ్నం విశ్రాంతి కొరకు చక్కని స్థలాన్ని పొందుతారు. ఆకాశాన్ని చీలుస్తూ ఒక మేఘం ఆ రోజున ప్రత్యక్షమవుతుంది. దైవదూతలు వరుసలు వరుసలుగా దింపబడతారు. ఆ రోజున నిజమైన రాజ్యాధికారం కేవలం కరుణామయుని చేతులలో ఉంటుంది. అది అవిశ్వాసులకు ఎంతో కఠినమైన రోజు. దుర్మార్గపు మానవుడు తన చేతులను కొరుక్కుంటూ ఇలా అంటాడు , ''అయ్యో నేను దైవప్రవక్తకు తోడుగా ఉంటే ఎంత బాగుండేది! అయ్యో నా దౌర్భాగ్యం! నేను ఫలానా వ్యక్తితో స్నేహం చేయకుండా ఉంటే ఎంత బాగుండేది! అతడి మాయలోపడి నేను నా వద్దకు వచ్చిన హితబోధను స్వీకరించలేదు. షైతాను మానవుని విషయంలో నమ్మకద్రోహి అని తేలిపోయింది. '' దైవప్రవక్త ఇలా అంటాడు, ''నా ప్రభూ! నా జాతి వారు ఈ ఖురానును ఒక పరిహాస విషయంగా చేసుకున్నారు.

**25. అల్ ఫుర్ఖాన్** 31 ప్రవక్తా! మేము ఇలానే అపరాధులను ప్రతి దైవప్రవక్తకు శత్రువులుగా చేశాము. నీ కొరకు నీ ప్రభువే మార్గదర్శకత్వం చేయటానికీ, సహాయపడటానికీ సరిపోతాడు.

**25. అల్ ఫుర్ఖాన్** 32 - 34 అవిశ్వాసులు ఇలా అడుగుతారు , ''ఈ వ్యక్తిపై పూర్తి ఖురాను ఒకేసారి ఎందుకు అవతరింప బడలేదు?'' - అవును, అలా ఎందుకు చేయబడిరదంటే , మేము దానిని నీ మనస్సులో నాటుకునేలా చేస్తూ ఉండాలని. (ఈ ఉద్దేశ్యంతోనే) మేము దానిని ఒక ప్రత్యేకమైన క్రమంతో వేర్వేరు భాగాలుగా రూపొందించాము. ఇంకా (ఇందులో ఈ హేతువు కూడ ఉంది). వారు నీ ముందు ఏదైనా వినూత్న విషయాన్ని (వింత ప్రశ్నను) తీసుకువచ్చి నప్పుడల్లా దానికి సరి[illegible]న జవాబును మేము సకాలంలో నీకు ఇచ్చాము. ఉత్తమమైన రీతిలో విషయాన్ని విస్పష్టం చేశాము - బోర్లగా నరకం వైపునకు నెట్టబడనున్న వారి పరిస్థితి ఎంతో చెడ్డది , వారి మార్గం ఎంతో తప్పినది.

**25. అల్ ఫుర్ఖాన్** 35 - 40 మేము మూసాకు గ్రంథాన్ని ఇచ్చాము. అతని సోదరుడు హారూన్‌ను అతనికి సహాయకుడుగా చేశాము. వారితో ఇలా అన్నాము , ''మా ఆయతులను తిరస్కరించిన జాతి వద్దకు వెళ్లండి. చివరకు మేము ఆ జాతి ప్రజలను నాశనం చేసివేశాము. ఇదే గతి నూహు జాతి వారికీ పట్టింది వారు దైవ ప్రవక్తలను తిరస్కరించారు. మేము వారిని ముంచివేశాము. ప్రపంచ ప్రజలం దరికీ గుణపాఠం గరపే గుర్తుగా చేశాము. ఆ దుర్మార్గుల కొరకు ఒక వ్యధా భరితమైన శిక్షను సిద్ధపరచి ఉంచాము. ఈ విధంగానే ఆద్ జాతివారు , సమూద్‌జాతివారు, అర్‌రస్ ప్రజలు, ఇంకా ఆ మధ్యకాలంలో ఎన్నో తరాల వారు నాశనం చేయబడ్డారు. వారిలో ప్రతి ఒక్కరికీ మేము (పూర్వం నాశన మైనవారి) దృష్టాంతాలను ఇచ్చి నచ్చజెప్పాము. చివరకు ప్రతి ఒక్కరినీ నాశనం చేశాము. వారు ఆ పట్టణం మీదుగా ప్రయాణం చేశారు. దాని మీద వినాశ కరమైన వర్షం కురిపించబడిరది. వారు దాని స్థితిని చూచి ఉండరా? అయినా వారు మరణానంతరం మరొక జీవితం సంభవమని తలంచరు.

**25. అల్ ఫుర్ఖాన్** 41 - 42 వారు నిన్ను చూచినప్పుడు నిన్ను పరిహాసనీయ వస్తువుగా చేసు కుంటారు. ఇలా అంటారు, ''ఈ వ్యక్తినేనా దేవుడు ప్రవక్తగా చేసి పంపినది ? మేము మా దేవుళ్ల పట్ల విశ్వాసంపై స్థిరంగా ఉండకపోయినట్లయితే, ఇతను మమ్మల్ని మార్గం తప్పించి వాటికి దూరం చేసి ఉండేవాడు. '' సరే మంచిది, శిక్షను చూచినప్పుడు మార్గభ్రష్టత్వంలో ఎవరు ఎక్కువ దూరం వెళ్ళిపోయారో స్వయంగా వారే తెలిసికొనే సమయం ఎంతో దూరంలో లేదు.

**25. అల్ ఫుర్ఖాన్** 43 - 44 తన మనోవాంఛను తన దేవుడుగా చేసుకున్న వ్యక్తి యొక్క స్థితిని ఎప్పుడైనా నీవు గమనించావా? నీవు అలాంటి వ్యక్తిని రుజుమార్గానికి తెచ్చే బాధ్యతను స్వీకరించగలవా ? వారిలో చాలమంది వింటారని, అర్థం చేసుకుంటారని నీవు అనుకుంటున్నావా ? వారు పశువులలాంటివారు, కాదు వాటికంటే కూడ దిగజారిపోయినవారు.

**25. అల్ ఫుర్ఖాన్** 45 - 46 నీ ప్రభువు ఎలా నీడను విస్తరింపజేస్తాడో నీవు చూడలేదా ? ఒకవేళ ఆయన కోరితే, దానిని శాశ్వతమైన నీడగా చేసేవాడు. మేము సూర్యుణ్ణి దానికి మార్గదర్శి (దలీల్)గా చేశాము. తరువాత (సూర్యుడు పైకి లేస్తూ పోయేకొద్దీ) మేము ఈ నీడను క్రమక్రమంగా మా వైపునకు లాక్కుంటూ పోతాము.

**25. అల్ ఫుర్ఖాన్** 47 మీ కొరకు రాత్రిని వస్త్రంగానూ , నిద్రను మృత్యు శాంతిగానూ , పగలును బ్రతికిలేచే సమయంగాను చేసినవాడు అల్లాహ్ యే.

**25. అల్ ఫుర్ఖాన్** 48 - 50 తన కారుణ్యానికి ముందు గాలులను శుభవార్తలుగా చేసి పంపేవాడూ ఆయనే. తరువాత ఆకాశం నుండి పరిశుద్ధ జలాన్ని అవతరింప జేస్తాడు. దానిద్వారా ఒక మృత ప్రదేశానికి ప్రాణం పోస్తాడు. తన సృష్టిలోని ఎన్నో జంతువులకు, ఎంతోమంది మానవులకు దప్పిక తీర్చుతాడు. మేము ఈ అద్భుతాన్ని వారు

గుణపాఠం నేర్చుకోవాలని మాటిమాటికీ వారి ముందు ప్రదర్శిస్తాము. కాని అధిక సంఖ్యాకులు అవిశ్వాసం , కృతఘ్నుతలు తప్ప మరొక వైఖరిని అవలంబించటానికి తిరస్కరిస్తున్నారు.

**25. అల్ ఫుర్ఖాన్** 51 - 52 ఒకవేళ మేము కోరినట్లయితే , ఒక్కొక్క ఊరిలో ఒక్కొక్క హెచ్చరిక చేసేవాణ్ణి ప్రభవింపజేసి ఉండేవారమే. కనుక ప్రవక్తా! అవిశ్వాసుల మాటను ఎంతమాత్రం నమ్మకు. ఈ ఖురాను ద్వారా వారితో మహత్తరమైన పోరాటం జరుపు.

**25. అల్ ఫుర్ఖాన్** 53 రెండు సముద్రాలనూ కలిపి ఉంచినవాడు ఆయనే. ఒకటేమో రుచికర మైనది , మధురమైనదీను. రెండోది చేదైనది , ఉప్పైనదీను. ఆ రెంటి మధ్య ఒక తెర అడ్డంగా ఉన్నది. అది వాటిని కలసిపోకుండా ఆపి ఉంచే అవరోధం.

**25. అల్ ఫుర్ఖాన్** 54 ఆయనే నీటితో మానవుణ్ణి సృష్టించాడు. తరువాత అతని ద్వారా (తన) వంశము, అత్తవారి వంశము అనే రెండు వేర్వేరు బంధుత్వపు క్రమాలను రూపొందించాడు. నీ ప్రభువు సర్వశక్తి సంపన్నుడు.

**25. అల్ ఫుర్ఖాన్** 55 అయినా, మానవులు అల్లాహ్ ను కాదని తమకు లాభంగాని, నష్టంగాని కలిగించలేని వారిని పూజిస్తున్నారు. అదీగాక , అవిశ్వాసి తన ప్రభువునకు వ్యతిరేకంగా ప్రతి తిరుగుబాటుదారుడికి సహాయపడుతున్నాడు.

**25. అల్ ఫుర్ఖాన్** 56 - 57 ప్రవక్తా! నిన్ను మేము కేవలం ఒక శుభవార్తాహరునిగా , హెచ్చరిక చేసేవానిగా మాత్రమే పంపాము. కనుక వారితో ఇలా అను , ''నేను ఈ పనికై మిమ్మల్ని ఏ ప్రతిఫలాన్నీ కోరను. ఇష్టమున్న వ్యక్తి తన ప్రభువు మార్గాన్ని అవలంబించటమే నా ప్రతిఫలం.''

**25. అల్ ఫుర్ఖాన్** 58 - 59 ప్రవక్తా! సజీవుడూ, ఎన్నడూ మరణించనివాడూ అయిన దేవునిపై నమ్మకం ఉంచు. ఆయనను స్తుతించటంతో పాటు ఆయన పవిత్రతను కొనియాడు. తన దాసుల పాపాలను గురించి కేవలం ఆయనకు తెలిస్తే చాలు. ఆయన ఆరుదినాలలో భూమినీ , ఆకాశాలనూ, భూమ్యాకాశాల మధ్య ఉన్న సకల వస్తుజాలన్నీ సృష్టించాడు. తరువాత ఆయనే ''అర్షీ(అధికార పీఠం)ను అధిష్టించాడు. ఆయన కరుణామయుడు, ఆయన ఘనతను గురించి ఎరిగిన వాడిని అడుగు.

**25. అల్ ఫుర్ఖాన్** 60 ఆ కరుణామయునికి సజ్దా చేయండి అని వారితో అన్నప్పుడు వారు ఇలా అంటారు , ''ఈ కరుణామయుడన్నది ఏమిటి? నీవు చెప్పిన దానికల్లా మేము సజ్దా చేయవలసిందేనా ?'' ఈ సందేశం వారి ద్వేషాన్ని మరింత అధికమే చేస్తుంది.

**25. అల్ ఫుర్ఖాన్** 61 - 62 ఆకాశంలో బురుజులను నిర్మించినవాడూ, అందులో ఒక దీపాన్ని, ఒక మెరిసే చంద్రుణ్ణి వెలిగించినవాడూ ఎంతో శుభప్రదుడు. ఆయనే రేయిం బవళ్లను ఒక దాని వెంట ఒకటి వచ్చేలా చేశాడు, గుణపాఠం నేర్చుకోదలచిన లేదా కృతజ్ఞతలు తెలుపుకోదలచిన ప్రతి వ్యక్తి కోసం.

**25. అల్ ఫుర్ఖాన్** 63 - 76 కరుణామయుని (అసలు) దాసులు ఎవరంటే , నేలపై అణకువతో నడిచేవారూ , మూర్ఖులు వారిని పలుకరించినప్పుడు, మీకో సలామ్ అని అనేవారూ , తమ ప్రభువు సన్నిధిలో సాష్టాంగపడీ (సజ్దాలోను) నిలబడి రాత్రులు గడిపేవారు , ''మా ప్రభూ, నరకయాతన నుండి మమ్మల్ని కాపాడు , దాని శిక్ష ప్రాణాంతకమైనది, అది ఎంతో చెడు ప్రదేశం, ఎంతో చెడు నివాసం'' అని ప్రార్థించేవారు. ఖర్చుపెడితే, దుబారాగానూ ఖర్చు పెట్టకుండా , లోభత్వాన్నీ ప్రదర్శించకుండా ఈ రెండు తీవ్రవైఖరుల మధ్య సమతూకాన్ని పాటించేవారు , అల్లాహ్ ను తప్ప ఏ ఇతర దేవుణ్ణీ వేడుకోనివారు , అల్లాహ్ నిషేధించిన ఏ ప్రాణాన్నీ అన్యాయంగా హతమార్చనివారు, వ్యభిచారానికి పాల్పడనివారు - ఈ పనులను చేసినవాడు ఎవడైనా తన పాపఫలాన్ని పొందితీరుతాడు తీర్పుదినంనాడు అతనికి రెట్టింపు శిక్ష పడుతుంది. అందులోనే అతడు శాశ్వతంగా హీనస్థితిలో పడి ఉంటాడు. (ఈ పాపాల తరువాత) పశ్చాత్తాపపడి , విశ్వసించి మంచిపనులు చెయ్యటం ప్రారంభించే వాడు తప్ప. అటువంటి వాడి చెడులను అల్లాహ్ శుభాలుగా మారుస్తాడు. ఆయన క్షమించేవాడు , కరుణించేవాడూను. పశ్చాత్తాపపడి సద్వర్తనాన్ని అవలంబించే వ్యక్తి అల్లాహ్ వైపునకు మరలివస్తాడు. మరలిరావలసిన రీతిలో - (ఇంకా కరుణామయుని దాసులు ఎలాంటివారంటే) అబద్ధానికి సాక్షులు కానివారు, వ్యర్థమైనవాటి వైపుగా పోవటం జరిగితే, సంస్కారవంతులు మాదిరిగా దాటిపోతారు. వారికి తమ ప్రభువు ఆయతులను వినిపించి హితబోధ చేయటం జరిగితే, వారు దానిని గురించి అంధులుగా , చెవిటి వారుగా ఉండిపోరు. వారు ఇలా ప్రార్థిస్తూ ఉంటారు , ''మా ప్రభూ! మాకు మా భార్యల ద్వారానూ మా సంతానం ద్వారానూ కన్నుల చల్లదనాన్ని ప్రసాదించు , మమ్మల్ని భయభక్తులు కలవారికి ఇమాములుగా చేయి. ''- తమ సహనానికి ప్రతిఫలంగా మహోన్నతమైన సౌధాలను పొందేవారు వారే. అక్కడ గౌరవ మర్యాదలతో , శాంతివచనాలతో వారికి స్వాగతం పలుకబడు తుంది. వారు కలకాలం అక్కడనే ఉంటారు. ఎంత మంచిది ఆ స్థలం, ఎంత మంచిది ఆ నివాసం.

**25. అల్ ఫుర్ఖాన్** 77 ప్రవక్తా! ప్రజలతో ఇలా అను , ''మీరు నా ప్రభువును వేడుకోకపోతే , ఆయన మిమ్మల్ని ఎందుకు పట్టించుకోవాలి ? ఇప్పుడు మీరు నిరాకరించారు , త్వరలోనే తప్పించుకోనలవికాని శిక్షను మీరు అనుభవిస్తారు.

**26. అష్ షుఅరా**

ఆయతులు : 227 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన  అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**26. అష్ షుఅరా** 1 - 2 తా. సీన్. మీమ్. ఇవి స్పష్టమైన గ్రంథంలోని వాక్యాలు.

**26. అష్ షుఅరా** 3 - 6 ప్రవక్తా! వారు విశ్వసించరు అని దుఃఖపడుతూ , బహుశా నీవు నీ ప్రాణాలను కోల్పోతావేమో, మేము కోరితే ఆకాశం నుండి ఒక సూచనను దించి దాని ముందు వారి మెడలు వంగిపోయేలా చేయగలం. కరుణామయుని తరఫు నుండి వారి వద్దకు ఏ కొత్త ఉపదేశం వచ్చినా , దానికి వారు విముఖులే అవుతారు. ఇపుడు వారు తిరస్కరించారు కాబట్టి, త్వరలోనే వారికి, వారు ఎగతాళి చేస్తూ వచ్చిన విషయమందలి యధార్థమేమిటో (విభిన్న రూపాలలో) తెలుస్తుంది.

**26. అష్ షుఅరా** 7 - 9 వారు ఎన్నడూ తమ దృష్టిని భూమి వైపునకు మళ్లించలేదా మేము దానిపై ఎంత పుష్కలంగా శ్రేష్ఠమైన రకరకాల చక్కని వృక్ష సంపదను సృష్టిం చామో ? నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉన్నది. కాని వారిలో అనేకులు విశ్వసించరు. వాస్తవం ఏమిటంటే నీ ప్రభువు శక్తిమంతుడే కాదు , కరుణా మయుడు కూడా.

**26. అష్ షుఅరా** 10 - 17 నీ ప్రభువు మూసాను ఇలా ఆదేశించినప్పటి గాథను వారికి విని పించు , ‘‘దుష్టులైన ఫిరౌను జాతి ప్రజల వద్దకు వెళ్ళు- వారు భయపడరా ?’’ అతడు ఇలా విన్నవించుకున్నాడు , ‘‘నా ప్రభూ! వారు నన్ను అసత్యవాది అని తిరస్కరిస్తారేమో అని నా భయం. నా హృదయం కుంచించుకు పోతోంది. నేను ధారాళంగా మాట్లాడలేను. కనుక నీవు హారూన్‌ను ప్రవక్త పదవిలో నియమించు. నా మీద వారు ఒక నేరాన్ని కూడ మోపారు. ఈ కారణంగా నన్ను వారు హత్య చేస్తారేమో అని నేను భయ పడుతున్నాను. ’’ ఇలా సెలవిచ్చాడు, ‘‘అలా ఎంతమాత్రం జరగదు. మీరు ఉభయులూ నా సూచన లను తీసుకుని వెళ్లండి. మేము మీతో పాటు అంతా వింటూ ఉంటాము. ఫిరౌను వద్దకు వెళ్లి అతనితో ఇలా అనండి - నీవు ఇస్రాయీల్ సంతతి వారిని మాతో పంపు. ఇందుకే సకల లోకాల ప్రభువు మమ్మల్ని (నీ వద్దకు) పంపాడు.’’

**26. అష్ షుఅరా** 18 - 31 ఫిరౌను ఇలా అన్నాడు, ‘‘మేము నిన్ను బాల్యంలో మా ఇంట్లో పెంచలేదా? నీవు నీ వయస్సులోని ఎన్నో సంవత్సరాల కాలం మా వద్ద గడిపావు. దాని తరువాత చేసిందేదో చేశావు. నీవు మిక్కిలి కృతఘ్నుడవు.’’ మూసా ఇలా సమాధానం చెప్పాడు, ‘‘అప్పుడు నేను ఆ పనిని పొరపాటు వల్ల చేశాను. తరువాత నేను మీకు భయపడి పారిపోయాను. ఆ తరువాత నా ప్రభువు నాకు వివేకాన్ని , జ్ఞానాన్ని ప్రసాదించాడు, నన్ను సందేశహరులలో చేర్చుకున్నాడు. పోతే ఇక నీవు నాకు ఉపకారం చేసి ఎత్తిపొడుస్తూ ఉన్న విషయం , దాని యధార్థం ఏమిటంటే, నీవు ఇస్రాయీలు సంతతి వారిని బానిసలుగా చేసుకున్నావు.’’ ఫిరౌను ఇలా అన్నాడు, ‘‘ఈ సకల లోకాల ప్రభువు ఏమిటి ?’’ దానికి మూసా, ‘‘ఆకాశాలకూ, భూమికీ ప్రభువు, భూమ్యా కాశాల మధ్య ఉన్న

సమస్తానికీ ప్రభువు, నీవు (దేవుణ్ణి) నమ్మేవాడివే అయితే '' అని జవాబు చెప్పాడు. ఫిరౌను తన చుట్టూ ఉన్న వారితో, ''వింటున్నారా?'' అని అన్నాడు. మూసా ఇలా అన్నాడు , ''ఆయనే మీ ప్రభువు కూడ , పూర్వం గతించిన మీ తాతముత్తాతల ప్రభువు కూడా. '' ఫిరౌను (అక్కడి వారితో) ఇలా అన్నాడు , ''మీ వద్దకు పంపబడిన మీ దైవప్రవక్త గారు పూర్తిగా పిచ్చి వారుగా కనిపిస్తున్నారు. '' మూసా ఇంకా ఇలా అన్నాడు , ''తూర్పుకూ, పడమరకూ, వాటి మధ్య ఉన్న సర్వానికి ప్రభువు మీరు వివేకం కలవారే అయితే. '' ఫిరౌను ఇలా అన్నాడు , ''నీవు నన్ను కాదని మరెవరినైనా ఆరాధ్యు డుగా చేసుకుంటే , నిన్ను కూడ జైళ్ళల్లో పడి మ్రగ్గిపోతున్న వారిలో చేరుస్తాను.'' మూసా ఇలా అన్నాడు, ''నేను నీ ముందుకు ఒక స్పష్టమైన విషయాన్ని తీసుకువచ్చిన తరువాత కూడానా?'' దానికి ఫిరౌన్, ''మంచిది తీసుకురా, నీవు సత్యవాదివే అయితే'' అని అన్నాడు.

**26. అష్ షుఅరా** 32 - 33 (అతడు ఈ మాట అన్నంతనే) మూసా తన చేతికర్రను విసిరాడు వెంటనే స్పష్టంగా అదొక పెద్ద పామైపోయింది. తరువాత అతను తన చేతిని (చంకనుండి) లాగాడు. అది చూపరుల ముందు మెరిసిపోసాగింది.

**26. అష్ షుఅరా** 34 - 40 ఫిరౌను తన చుట్టూ ఉన్న సర్దారులతో ఇలా అన్నాడు , ''ఈ వ్యక్తి నిజంగానే చేయి తిరిగిన మంత్రగాడు. తన మంత్రబలం ద్వారా మిమ్మల్ని మీ దేశం నుడి తరిమివేయాలని చూస్తున్నాడు. ఇప్పుడు చెప్పండి మీ ఆజ్ఞ ఏమిటో ?'' వారు ఇలా అన్నారు , ''అతనినీ, అతని సోదరుణ్ణీ ఆపి ఉంచండి , పట్టణాలలోకి వార్తాహరులను పంపండి , నేర్పరులైన మంత్రగాళ్లను మీ వద్దకు తీసుకు రమ్మనండి. '' ఆ విధంగా ఒకనాడు నిర్ణీత సమయానికి మంత్రగాళ్లు సమావేశపరచబడ్డారు. ప్రజలకు ఇలా చెప్పబడిరది, ''మీరు సభకు వస్తు న్నారా? మంత్రగాళ్లు గెలిస్తే, బహుశా మనం వారి ధర్మాన్నే అనుసరించవచ్చు.''

**26. అష్ షుఅరా** 41 - 51 మంత్రగాళ్లు రంగంలోకి దిగినప్పుడు, ఫిరౌనుతో ఇలా అన్నారు, ''మేము గెలిస్తే, మాకు బహుమానం దొరుకుతుంది కదా ?'' అతడు, ''అవును. అప్పుడు మీరు నా సన్నిహితులలో చేరిపోతారు '' అని అన్నాడు. అప్పుడు మూసా , ''విసరండి, మీరు విసరదలచుకున్న దానిని '' అని అన్నాడు. వారు వెంటనే తమ త్రాళ్లనూ చేతికర్రలనూ విసిరి, ''ఫిరౌను ఔన్నత్యం సాక్షిగా! మేమే విజయం సాధిస్తాము '' అని అన్నారు. తరువాత మూసా తన చేతి కర్రను విసిరినప్పుడు , అది అకస్మాత్తుగా వారి బూటకపు మహిమలను కబళింపసాగింది. అప్పుడు మాంత్రికులందరూ అమాంతంగా సజ్దాలో పడిపోయారు. ఇలా అన్నారు, ''విశ్వసించాము మేము, సకల లోకాల ప్రభువును- మూసా , హారూన్‌ల ప్రభువును. '' ఫిరౌను ఇలా అన్నాడు , ''నేను మీకు అనుమతి ఇవ్వకముందే మీరు మూసా మాటను విశ్వసించారా? నిస్సందేహంగా ఇతడు మీకు గురువు, మీకు మంత్రవిద్యను నేర్పాడు. సరే మంచిది , ఇప్పుడే మీరు తెలుసుకుంటారు. నేను మీ చేతులను , కాళ్లను అభిముఖదిశలలో నరికివేస్తాను, మీ అందరినీ శిలువపైకి ఎక్కిస్తాను. '' దానికి వారు ఇలా పలికారు , ''ఏమీ పర్వాలేదు, మేము మా

ప్రభువు సాన్నిధ్యానికి చేరుకుంటాము. మా ప్రభువు మా పాపాలను క్షమిస్తాడని మేము ఆశిస్తు న్నాము. ఎందుకంటే, అందరికంటే ముందు మేమే విశ్వసించాము.''

**26. అష్ షుఅరా** 52 - 59 ''రాత్రికి రాత్రే నా దాసులను తీసుకుని వెళ్లిపో. మిమ్మల్ని తప్పక వెంటాడటం జరుగుతుంది'' అని మేము మూసాకు వహీ పంపాము. తరువాత ఫిరౌన్ (సైన్యాన్ని సమాయత్తపరిచే నిమిత్తం) పట్టణాలలోకి వార్తాహరులను పంపి ఇలా ప్రకటన చేయించాడు , ''వీరు గుప్పెడు మంది మాత్రమే , మాకు చాల కోపం తెప్పించారు. మనం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండే లక్షణం గల జాతి ప్రజలం. '' ఈవిధంగా మేము వారిని తమ తోటల నుండీ, చెలమల నుండీ, ఖజానాల నుండీ, మహోన్నతమైన వారి నివాస స్థలాల నుండీ బయటికి తీసుకువచ్చాము. వారి విషయంలో ఇలా జరిగింది. (రెండో వైపు) ఇస్రాయీల్ సంతతి వారిని మేము వీటన్నిటికీ వారసులుగా చేశాము.

**26. అష్ షుఅరా** 60 - 66 తెల్లవారుతూ ఉండగా, వీరు వారిని వెంటాడసాగారు. ఇరు పక్షాలవారు ఒకరికొకరు ఎదురు పడినప్పుడు, మూసా సహచరులు, ''మేము పట్టుబడ్డాము'' అని కేకవేశారు. మూసా, ''అలా ఎంతమాత్రం జరగదు. నా ప్రభువు నాతో ఉన్నాడు. తప్పకుండా ఆయన నాకు మార్గం చూపుతాడు '' అని అన్నాడు. మేము మూసాను, ''నీ చేతికర్రతో సముద్రాన్ని కొట్టు '' అని వహీ ద్వారా ఆజ్ఞాపించాము. అప్పుడు హఠాత్తుగా సముద్రం చీలిపోయింది. దాని ప్రతి భాగం ఒక మహోన్నతమైన పర్వతం మాదిరిగా అయిపోయింది. ఆ చోటికే మేము రెండో వర్గం వారిని కూడ చేర్చాము. మూసానూ, అతనితో ఉన్న వారందరినీ మేము రక్షించాము. మిగతా వారి నందరినీ ముంచివేశాము.

**26. అష్ షుఅరా** 67 - 68 ఈ సంఘటనలో ఒక సూచన ఉన్నది. కాని వారిలో చాలామంది విశ్వసించరు. యధార్థమేమిటంటే, నీ ప్రభువు మహాశక్తిమంతుడు, అనంత కరుణామయుడు.

**26. అష్ షుఅరా** 69 - 89 ఇంకా వారికి ఇబ్రాహీము గాధను వినిపించు, అప్పుడు అతను తన తండ్రినీ, తన జాతి వారినీ, ''మీరు పేటిని పూజిస్తున్నారు?'' అని అడిగాడు. వారు, ''ఇవి కొన్ని విగ్రహాలు, వాటిని మేము పూజిస్తాము. వాటి సేవలోనే మేము నిమగ్నులమై ఉంటాము '' అని జవాబు పలికారు. అతను వారిని ఇలా అడిగాడు , ''మీరు వీటిని పిలిచినప్పుడు , ఇవి మీ మొర ఆలికిస్తాయా ? లేదా ఇవి మీకేమైనా లాభాన్నిగానీ , నష్టాన్నిగానీ కలిగిస్తాయా?'' వారు ఇలా అన్నారు, ''లేదు, కాని మేము మా తాతముత్తాతలు ఇలా చేస్తూ ఉండగా చూశాము. '' అప్పుడు ఇబ్రాహీము ఇలా అన్నాడు , ''మీరూ, పూర్వం మీ తాతముత్తాతలూ పూజిస్తూ వస్తున్న వాటిని ఎప్పుడైనా మీరు (కళ్లు తెరచి) చూశారా ? నాకు ఇవన్నీ శత్రువులే, ఒక్క సకల లోకాల ప్రభువు తప్ప. ఆయన నన్ను సృష్టించాడు. తరువాత ఆయనే నాకు మార్గం చూపుతున్నాడు. ఆయనే నాకు తినిపిస్తాడు , త్రాగిస్తాడు. నేను వ్యాధికి గురి అయినప్పుడు , ఆయనే నాకు స్వస్థతను చేకూరుస్తాడు. ఆయనే నాకు మృత్యువును

కలిగిస్తాడు. తరువాత మళ్లీ నాకు జీవితాన్ని అనుగ్రహిస్తాడు. తీర్పు దినం నాడు నా పాపాలను క్షమిస్తాడని నేను ఆయన మీద ఆశలు పెట్టుకున్నాను.'' (దీని తరువాత ఇబ్రాహీమ్ ఇలా ప్రార్థించాడు): ''నా ప్రభూ! నాకు వివేకాన్ని ప్రసాదించు, నన్ను సజ్జనులలో కలుపు. తరువాత తరాల వారిలో నాకు మంచి పేరు ప్రసాదించు. నన్ను సుఖసౌఖ్యాల స్వర్గవనానికి వారసులైన వారిలో చేర్చు. నా తండ్రిని క్షమించు. నిస్సందేహంగా ఆయన మార్గం తప్పిన వారిలోని వాడే. మానవులందరూ బ్రతికింపబడే రోజున నన్ను అవమానం పాలుజేయకు. అప్పుడు సంపదవల్లగానీ, సంతానం వల్లగానీ ఏ లాభమూ కలగదు ఏ వ్యక్తి అయినా మంచి మనస్సుతో అల్లాహ్ సాన్నిధ్యంలో హాజరైతే తప్ప.''

**26. అష్ షుఅరా** 90 - 102 (ఆ రోజున) స్వర్గం భయభక్తులు కలవారి దగ్గరకు తీసుకు రాబడుతుంది. నరకం మార్గం తప్పిన వారి ముందు తెరువబడుతుంది. వారిని ఇలా అడగటం జరుగుతుంది , ''అల్లాహ్ ను వదలిపెట్టి, మీరు ఆరాధించేవారు ఇప్పుడెక్కడున్నారు ? వారు మీకేమైనా సహాయం చేస్తున్నారా ? లేదా తమను తాము రక్షించుకోగలరా?'' తరువాత ఆ దేవుళ్లూ , మార్గం తప్పిన ఈ మానవులూ , ఇబ్లీస్ సైన్యమూ, అందరూ దానిలోకి ఒకరి మీద ఒకరు పడేటట్లుగా త్రోయబడతారు. అక్కడ వారందరూ పరస్పరం పోట్లాడు కుంటారు. మార్గం తప్పిన ఈ మానవులు (తమ దేవుళ్లతో) ఇలా అంటారు, ''దేవుని సాక్షిగా! సకల లోకాల ప్రభువుతో సమానమైన స్థానాన్ని మీకు ఇచ్చి నప్పుడు మేము స్పష్టమైన మార్గభ్రష్టత్వానికి గురిఅయ్యాము. మమ్మల్ని మార్గం తప్పించినవారు నిజంగానే అపరాధులు. ఇప్పుడు మాకు సిఫారసు చేసేవాడు గానీ, ప్రాణ స్నేహితుడుగానీ, ఎవడూ లేడు. అయ్యో! ఒకసారి మళ్లీ మరలివెళ్లే అవకాశం మాకు దొరికితే, మేము తప్పకుండా విశ్వాసులమవుతాము.''

**26. అష్ షుఅరా** 103 - 104 నిశ్చయంగా ఇందులో ఒక గొప్ప సూచన ఉన్నది. కాని వారిలో అత్యధికులు విశ్వసించరు. యథార్థమేమిటంటే, నీ ప్రభువు అత్యంత శక్తిమంతుడు, కరుణామయుడూను.

**26. అష్ షుఅరా** 105 - 120 నూహు జాతి వారు దైవప్రవక్తలను తిరస్కరించారు. అప్పుడు వారి సోదరుడు నూహు వారితో (ఇలా) అన్న విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో , ''మీరు భయపడరా ? నేను మీ కొరకు ఒక విశ్వసనీయుడైన సందేశహరుడను. కనుక మీరు అల్లాహ్ కు భయపడండి , విధేయత చూపండి. నేను ఈ పనికిగాను మీ నుండి ఏ ప్రతిఫలాన్నీ కోరను. నాకు ప్రతిఫలం ఇవ్వటం అనేది సకల లోకాల ప్రభువు బాధ్యత. కనుక మీరు అల్లాహ్ కు భయపడండి, (నిస్సం కోచంగా) నాకు విధేయత చూపండి.'' వారు ఇలా జవాబు పలికారు, ''ఏమిటీ, మేము నిన్ను విశ్వసించాలా? వాస్తవానికి అధములైన వారే నిన్ను అనుసరి స్తున్నారు.'' దానికి నూహ్ ఇలా అన్నాడు, ''వారు చేసే పనులెలాంటివో నాకేమి తెలుసు? వారి లెక్క చూడటం నా ప్రభువు బాధ్యత. అయ్యో! మీరు కొంచెం తెలివిగా వ్యవహరిస్తే ఎంత బాగుంటుంది. విశ్వసించిన వారిని గెంటివేయడం నా పని కాదు. నేను కేవలం స్పష్టంగా హెచ్చరికచేసే వ్యక్తిని మాత్రమే.'' వారు దానికి, ''ఓ నూహ్! ఒకవేళ నీవు దీనిని మానుకోకపోతే ,

తప్పక శాపగ్రస్తులలో చేరిపోతావు'' అని అన్నారు. నూహ్ ఇలా ప్రార్థించాడు , ''ఓ నా ప్రభూ! నా జాతివారు నేను అసత్యవాదినని నన్ను తిరస్కరించారు. ఇక నాకూ వారికీ మధ్య స్పష్టమైన తీర్పు చెయ్యి. నన్నూ , నాతోపాటు ఉన్న విశ్వాసులనూ కాపాడు.'' చివరకు మేము అతన్నీ, అతని సహచరులనూ ఒక నిండు పడవలో రక్షించాము. దాని తరువాత మిగతా వారినందరినీ ముంచివేశాము.

**26. అష్ షుఅరా** 121 - 122 నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉన్నది. కాని వారిలో చాలామంది విశ్వసించరు. యథార్థమేమిటంటే, నీ ప్రభువు మహాశక్తిమంతుడు, అత్యంత కరుణామయుడు.

**26. అష్ షుఅరా** 123 - 139 ... ఆద్ జాతి దైవప్రవక్తలను తిరస్కరించింది. వారి సోదరుడు హూద్ వారితో ఇలా అన్నప్పటి విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో , ''మీరు భయ పడరా ? నేను మీ కొరకు ఒక విశ్వసనీయుడైన దైవప్రవక్తను. కనుక మీరు అల్లాహ్ కు భయపడండి , విధేయత చూపండి. నేను ఈ పనికి మిమ్మల్ని ఏ ప్రతిఫలమూ కోరను. నాకు ప్రతిఫలం ఇవ్వటం అనేది సకల లోకాల ప్రభువు బాధ్యత. ఏమిటీ మీ వ్యవహారం , ఎత్తుగా ఉన్న ప్రతి స్థలం మీదా ఏమీ ప్రయోజనం లేని ఒక స్మారక కట్టడాన్ని నిర్మిస్తున్నారు, మీరిక్కడే శాశ్వతంగా ఉండిపోతారనే విధంగా పెద్ద పెద్ద భవనాలను కడుతున్నారు ? మీరు ఎవరినైనా పట్టుకుంటే , దౌర్జన్యపరులై పట్టుకుంటారు. కనుక మీరు అల్లాహ్ కు భయ పడండి. నా యెడల విధేయత చూపండి. ఆయనకు భయపడండి. ఆయనే మీకు తెలిసినవన్నీ ప్రసాదించాడు. మీకు పశువులు ఇచ్చాడు , సంతానం అనుగ్రహించాడు , తోటలు ప్రసాదించాడు, చెలమలు ఇచ్చాడు. ఒక మహా దినపు శిక్ష మీకు పడుతుందని నేను భయపడుతున్నాను.'' వారు ఇలా సమా ధానం చెప్పారు , ''నీవు బోధించినా, బోధించకపోయినా, మాకు అంతా ఒకటే. ఈ విషయాలు పూర్వం నుండీ ఇలానే జరుగుతూ వచ్చాయి. మేము శిక్షకు గురిఅయ్యే వారం మాత్రం కాము. '' చివరకు వారు అతనిని తిరస్కరించారు. మేము వారిని నాశనం చేశాము.

**26. అష్ షుఅరా** .... 139 - 140 నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉన్నది. కాని వారిలో చాలమంది విశ్వసించరు. యథార్థమేమిటంటే నీ ప్రభువు అత్యంత శక్తి మంతుడు, అపార కరుణామయుడూను.

**26. అష్ షుఅరా** 141 - 158 ... సమూద్ జాతి దైవప్రవక్తలను తిరస్కరించింది. వారి సోదరుడు సాలెహ్ వారికి ఇలా చెప్పిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో , ''ఏమిటీ మీరు భయపడరా ? నేను మీ కొరకు (వచ్చిన) ఒక విశ్వసనీయుడనైన దైవప్రవక్తను. కనుక మీరు అల్లాహ్ కు భయపడండి. నా యెడల విధేయత చూపండి. నేను ఈ పనికై మీ నుండి ఏ ప్రతిఫలాన్నీ కోరను. నా ప్రతిఫలం సకల లోకాల ప్రభువు బాధ్యత. ఇక్కడున్న ఈ వస్తువుల మధ్య మిమ్మల్ని ఇలానే ప్రశాంతంగా ఉండనివ్వటం జరుగుతుందను కుంటున్నారా , ఈ తోటలలో, ఈ జలధారల మధ్య? ఈ పొలాలలో మాగిన పండ్ల గుత్తులు గల ఈ ఖర్జూరపు చెట్లనడుమ? మీరు కొండలను తొలిచి విర్రవీగుతూ వాటిలో భవనాలను నిర్మిస్తారు. అల్లాహ్ కు భయపడండి, నా యెడల విధేయత చూపండి. హద్దులు మీరే వారి పట్ల

విధేయత చూపకండి వారు భూమిలో ఉపద్రవాన్ని సృష్టిస్తారు. ఏ సంస్కరణనూ చేపట్టరు.'' వారు జవాబుగా ఇలా అన్నారు, ''నీవు చేతబడి చేయబడిన ఒక వ్యక్తివి మాత్రమే. నీవు మా వంటి ఒక మానవుడవు తప్ప మరేమీ కావు. నీవు సత్యవంతుడవే అయితే, ఏదైనా సూచనను తీసుకురా.'' సాలిహ్ ఇలా అన్నాడు, ''ఇదిగో ఈ ఒంటెను చూడండి. ఒకరోజు అది నీళ్లు త్రాగుతుంది , ఒక రోజు మీరందరూ నీళ్లు తోడుకుంటారు. ఆ ఒంటెకు ఏమాత్రం హాని కలిగించకండి. అలాచేస్తే, ఒక మహాదినపు శిక్ష మిమ్మల్ని చుట్టుముట్టుతుంది.'' కాని వారు దాని వెనుక కాలి పెద్ద నరాన్ని కోసివేశారు. చివరకు విచారపడుతూ ఉండిపోయారు. శిక్ష వారిని పట్టుకుంది.

**26. అష్ షుఅరా** .... 158 - 159 నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉన్నది. కాని వారిలో అధికులు విశ్వసించరు. యథార్థమేమిటంటే, నీ ప్రభువు శక్తిమంతుడు, కరుణామయుడు.

**26. అష్ షుఅరా** 160 - 173 లూత్ జాతి దైవప్రవక్తలను తిరస్కరించింది. వారి సోదరుడు లూత్ వారితో ఇలా అన్నప్పటి విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. ''మీరు భయపడరా? నేను మీ కొరకు (వచ్చిన) ఒక విశ్వసనీయుడనైన దైవప్రవక్తను. కనుక మీరు అల్లాహ్ కు భయపడండి. నా యెడల విధేయత చూపండి. నేను ఈ పనికై మీ నుండి ఏ ప్రతిఫలాన్నీ కోరను. నా ప్రతిఫలం సకల లోకాల ప్రభువు బాధ్యత. మీరు ప్రపంచంలోని ప్రాణులలో పురుషుల వద్దకు పోతారేమిటి , మీ ప్రభువు మీ భార్యలలో మీకై సృష్టించిన దానిని విడిచి పెడుతున్నారేమిటి ? మీరు హద్దులన్నీ అతిక్రమించారు.'' వారు ఇలా అన్నారు, ''ఓ లూత్! నీవు ఈ మాటలు మానుకోకపోతే , మా నగరాల నుండి గెంటి వేయబడిన వారిలో నీవు కూడ తప్పక చేరిపోతావు. '' అతను ఇలా అన్నాడు , ''మీ చేష్టలకు కుమిలిపోయేవారిలో నేనూ ఉన్నాను. ఓ ప్రభూ! నన్నూ , నా కుటుంబసభ్యులనూ వారి అశ్లీల చేష్టల నుండి కాపాడు.'' చివరకు మేము అతనినీ, అతని కుటుంబ సభ్యులందరినీ కాపాడాము. వెనుకనే ఉండిపోయిన వారిలోని ఒక ముసలి స్త్రీని తప్ప. తరువాత మిగిలిపోయిన వారిని మేము నాశనం చేశాము , వారిపై ఒక వర్షాన్ని కురిపించాము, అతి భయంకరమైన వర్షాన్ని. అది హెచ్చరింపబడిన వారిపై అవతరించింది.

**26. అష్ షుఅరా** 174 - 175 నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉన్నది. అయితే వారిలో చాలామంది విశ్వసించరు. యథార్థమేమిటంటే నీ ప్రభువు మహాశక్తిమంతుడు, అనంత కరుణామయుడు.

**26. అష్ షుఅరా** 176 - 189 'అయ్‌కహ్' ప్రజలు దైవప్రవక్తలను తిరస్కరించారు. అప్పుడు షుఐబ్ వారితో ఇలా అన్న విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. ''మీరు భయపడరా? నేను మీ కొరకు (వచ్చిన) ఒక విశ్వసనీయుడనైన దైవప్రవక్తను. కనుక మీరు అల్లాహ్ కు భయపడండి. నా యెడల విధేయత చూపండి. నేను ఈ పనికై, మీనుండి ఏ ప్రతిఫలాన్నీ కోరను. నా ప్రతిఫలం సకల లోకాల ప్రభువు బాధ్యత. కొలపాత్రలను పూర్తిగా నింపండి, ఎవరికీ తక్కువ చేసి ఇవ్వకండి. సరిjైన తరాజుతో తూయండి. ప్రజలకు వారి వస్తువులను తక్కువ జేసి ఇవ్వకండి. భూమిపై కల్లోలాన్ని వ్యాపింపజేస్తూ తిరగకండి మిమ్మల్నీ , మీకు పూర్వపు తరాల వారినీ సృష్టించిన ఆయనకు

భయపడండి. వారు ఇలా అన్నారు, ''నీవు కేవలం చేతబడి చేయబడిన ఒక వ్యక్తివి. నీవు ఏమీ కావు , మా వంటి ఒక మానవుడవు తప్ప. మేము నిన్ను అసత్యవాదిగా పరిగణిస్తున్నాము. నీవు సత్యవంతుడవే అయితే , ఆకాశపు తునకను దేని నయినా మా మీద పడేలా చేయి. '' షుఐబ్ ఇలా అన్నాడు , ''నా ప్రభువుకు మీరు చేస్తున్నదంతా తెలుసు.'' వారు అతనిని తిరస్కరించారు. చివరకు ఛత్రదినపు శిక్ష వారిపైకి వచ్చిపడిరది. అది అతి భయంకరమైన దినపు శిక్ష.

**26. అష్ షుఅరా** 190 - 191 నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉన్నది. అయితే వారిలో అత్యధికులు విశ్వసించరు. యథార్థమేమిటంటే, నీ ప్రభువు శక్తిమంతుడు కూడ, కరుణామయుడు కూడ.

**26. అష్ షుఅరా** 192 - 203 ఇది సకల లోకాల ప్రభువు అవతరింపజేసినది. దీనిని తీసుకుని విశ్వసనీయమైన ఆత్మ నీ హృదయ ఫలకంపై అవతరించింది. స్వచ్ఛమైన అరబ్బీ భాషలో (దేవుని తరఫున దైవసృష్టికి) హెచ్చరిక చేసేవారిలో నీవు చేరిపోవాలని. పూర్వీకుల గ్రంథాలలో కూడ ఇది ఉన్నది. దీనిని ఇస్రాయీలు సంతతి వారి విద్వాంసులు ఎరుగుదురనే విషయం వారికి (మక్కావాసులకు) ఏ సూచనా కాదా ? (వారి మంకుపట్టు ఎలా ఉందంటే) ఒకవేళ మేము దీనిని ఏ అరబ్బీయేతరుని పైనయినా అవతరింపజేసి ఉంటే , దీనిని (శిష్ట అరబ్బీ గ్రంథాన్ని ) అతడు వారికి చదివి వినిపించినప్పుడు కూడ వారు విశ్వ సించేవారు కారు. ఇదేవిధంగా మేము దీనిని (ఖురాన్‌ను) అపరాధుల హృదయాలలోకి చొచ్చుకుపోయేలా చేశాము. వ్యధాభరితమైన శిక్షను చూడనంత వరకు వారు దీనిని విశ్వసించరు. తరువాత అనూహ్య స్థితిలో అది వారిపైకి అకస్మాత్తుగా వచ్చిపడినప్పుడు వారు , ''ఇప్పుడు మాకు కొంచెం గడువేమైనా దొరుకుతుందా?'' అని అంటారు.

**26. అష్ షుఅరా** 204 - 207 అయితే వారు మేము విధించే శిక్షకై తొందరపడుతున్నారా ? దీనిని గురించి నీవేమైనా ఆలోచించావా? ఒకవేళ మేము వారికి ఏళ్లతరబడి విలాస జీవితం గడిపే వ్యవధిని ఇచ్చినా, వారిని దేన్ని గురించి భయపెట్టటం జరుగుతూ వచ్చిందో , అదే తరువాత వారిపైకి వచ్చిపడినపుడు , వారికి లభించిన జీవిత సామగ్రి వారికి దేనికి పనికి వస్తుంది?

**26. అష్ షుఅరా** 208 - 209 (చూడు) హితబోధ బాధ్యతను నిర్వహించేందుకు హెచ్చరిక చేయువారు లేకుండానే మేము ఎన్నడూ, ఏ నగరాన్నీ నాశనం చేయలేదు. మేము అన్యాయపరులము కాము.

**26. అష్ షుఅరా** 210 - 212 దీనిని (సుబోధకమైన గ్రంథాన్ని ) తీసుకుని కిందికి దిగినవారు షైతానులు కారు ఈ పని వాటికి యుక్తమైనదీ కాదు , అవి అలా చేయనూ లేవు. దీనిని వినే విషయంలో కూడ అవి దూరంగా ఉంచబడ్డాయి.

**26. అష్ షుఅరా** 213 - 220 కనుక ప్రవక్తా! అల్లాహ్తో పాటు మరొక దేవుణ్ణి ఎవడినీ వేడుకోకు. అలా చేస్తే నీవు కూడ శిక్షింపబడేవారిలో చేరిపోతావు. నీ దగ్గరి బంధువులను భయపెట్టు. విశ్వాసులలో నిన్ను అనుసరించే వారిపట్ల మృదువుగా మెలుగు. కాని ఒకవేళ వారు నీ పట్ల అవిధేయత చూపితే , అపుడు వారితో, ''మీరు చేస్తున్న దానికి నేను బాధ్యుడను కాను '' అని అను. మహాశక్తిమంతుడైన ఆ అనంతకరుణామయుడిపై భారం మోపు. ఆయన నిన్ను , నీవు లేచినపుడు చూస్తాడు , సజ్దా చేసేవారిలో నీ రాకపోకలను గమనిస్తాడు. ఆయన అన్నీ వింటాడు, అన్నీ తెలిసినవాడు.

**26. అష్ షుఅరా** 221 - 223 ప్రజలారా! షైతానులు ఎవరిపై దిగుతాయో నేను మీకు తెలుపనా? అవి వంచకుడైన ప్రతి దుర్మార్గుడిపై దిగుతాయి. గాలి వార్తలను చెవులలో ఊదుతాయి వాటిలో అబద్ధాలు చెప్పేవే ఎక్కువ.

**26. అష్ షుఅరా** 224 - 227 ఇక కవులు. వారి వెనుక మార్గభ్రష్టులే నడుస్తూ ఉంటారు. వారు ప్రతి లోయలో దారి తప్పటాన్నీ , తాము ఆచరించని దానిని చెప్పటాన్నీ నీవు చూడటం లేదా ? - విశ్వసించి మంచి పనులు చేసేవారూ, అల్లాహ్ ను అమితంగా స్మరించేవారూ, తమకు అన్యాయం జరిగినప్పుడు, కేవలం ప్రతిగా చర్యతీసుకునే వారూ తప్ప - అన్యాయం చేసేవారికి త్వరలోనే తెలిసిపోతుంది వారు ఏ పర్యవసానానికి గురిఅవుతారో.

**27. అన్ నమ్ల్**

ఆయతులు : 93 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**27. అన్ నమ్ల్** 1 - 6 తా. సీన్. ఇవి ఖురాన్కు , స్పష్టమైన గ్రంథానికి చెందిన వాక్యాలు విశ్వాసులకు పూర్తిగా మార్గదర్శకత్వం, శుభవార్తలూను. వారు నమాజును స్థాపిస్తారు , జకాత్ను ఇస్తారు ఇంకా వారు పరలోకాన్ని పూర్తిగా నమ్ముతారు. యథార్థం ఏమిటంటే , పరలోకాన్ని విశ్వసించని వారి కొరకు మేము వారి చేష్టలను ఆకర్షవంతమైనవిగా చేశాము. అందువల్ల వారు దారితప్పి తిరుగుతూ ఉంటారు. నీచమైన శిక్షకు గురిఅయ్యేది వారే. పరలోకంలో అందరికంటే ఎక్కువ నష్టపోయేది కూడా వారే. (ఓ ప్రవక్తా!) నిస్సందేహంగా నీవు ఈ ఖురాన్ను వివేకవంతుడూ, జ్ఞానసంపన్నుడూ అయిన వానివైపు నుండి పొందుతున్నావు.

**27. అన్ నమ్ల్** 7 - 12 (వారికి అప్పటి గాథను వినిపించు) అప్పుడు మూసా తన ఇంటి వారితో ఇలా అన్నాడు , ''నాకు అగ్ని లాంటిదొకటి కనిపించింది. నేను ఇప్పుడే అక్కడకు పోయి ఏదైనా వార్తను తీసుకువస్తాను లేదా మీరు కాచుకోవటానికి అగ్ని కణాన్నయినా తీసుకువస్తాను. '' అతను అక్కడకు చేరినప్పుడు , ఒక ధ్వని ఇలా వినిపించింది, ''ఈ అగ్నిలోనూ, దాని పరిసరాలలోనూ ఉన్నవాడు శుభాలు కలవాడు. అల్లాహ్ పరిశుద్ధుడు, సకల

లోకాలకు ప్రభువు. మూసా! ఇదిగో, నేను, అల్లాహ్ ను, సర్వశక్తిమంతుడను, వివేకవంతుడను. ఏదీ, నీవు కొంచెం నీ చేతికర్రను విసరివెయ్యి.'' ఆ చేతికర్ర పాము మాదిరిగా కదలాడుతూ ఉండటం చూడగానే, మూసా వెన్ను చూపి పారిపోయాడు. వెనుకకు తిరిగి అయినా చూడలేదు. ''మూసా! భయపడకు. నా సన్నిధిలో ప్రవక్తలు భయపడరు, తప్పు చేసినవారు తప్ప. దుష్కార్యం చేసిన తరువాత అతను గనక దాన్ని సత్కార్యంగా మార్చుకుంటే , అప్పుడు నేను క్షమించే కరుణామయుణ్ణి. కొంచెం నీ చేతిని చొక్కాలోకి దూర్చు. అది మెరిసిపోతూ ఎలాంటి బాధాలేకుండానే బయటికి వస్తుంది. ఇవి (ఈ రెండు సూచనలు) తొమ్మిది సూచనలలోనివి , ఫిరౌను వద్దకూ అతడి జాతి ప్రజల వద్దకూ (తీసుకు పోయేందుకు ఇవ్వబడినవి) వారు పరమ దుర్మార్గులు.''

**27. అస్ నమ్ల్** 13 - 14 కాని, స్పష్టమైన మా సూచనలు వారి ముందుకు వచ్చినప్పుడు, వారు ''ఇది స్పష్టమైన మాయాజాలమే'' అని అన్నారు. వారు అన్యాయంగా, అహంకారంతో ఆ సూచనలను తిరస్కరించారు. అయితే వారి హృదయాలు మట్టుకు వాటిని అంగీకరించాయి. ఇక చూడు ఆ దుర్మార్గులకు ఎలాంటి గతి పట్టిందో.

**27. అస్ నమ్ల్** 15 - 19 (మరోవైపు) మేము దావూద్‌కు, సులైమాన్‌కు జ్ఞానాన్ని ప్రసాదించాము. ''విశ్వాసులైన అనేకమంది తన దాసులకంటే మాకు ఘనతను ప్రసాదించిన అల్లాహ్ కు కృతజ్ఞతలు '' అని వారు అన్నారు. సులైమాన్, దావూద్‌కు వారసుడయ్యాడు. అతను ఇలా అన్నాడు , ''ప్రజలారా! మాకు పక్షుల భాషలు నేర్పబడ్డాయి. ఇంకా మాకు అన్ని రకాల వస్తువులు ఇవ్వ బడ్డాయి. నిస్సందేహంగా ఇది స్పష్టమైన (దేవుని) అనుగ్రహం.'' సులైమాన్ కొరకు జిన్నాతుల , మానవుల, పక్షుల సైన్యాలు సమీకరించబడ్డాయి. అవి గట్టి క్రమశిక్షణలో ఉంచబడేవి. (ఒకసారి అతను వాటిని తీసుకుని దండ యాత్రకు బయలుదేరాడు). చివరకు వారంతా చీమల లోయకు చేరుకున్న ప్పుడు , ఒక చీమ ఇలా అన్నది , ''చీమలారా! మీరు మీ పుట్టలలోకి దూరిపొండి , లేకపోతే సులైమాన్ , అతని సైనికులు మిమ్మల్ని నలిపివేస్తారు. ఆ సంగతి వారికి తెలియకపోవచ్చు కూడా. '' సులైమాన్ దాని మాటలకు మందహాసంతో నవ్వి ఇలా అన్నాడు , ''ప్రభూ! నన్ను అదుపులో ఉంచు , నీవు నాకూ, నా తల్లిదండ్రులకూ చేసిన ఉపకారానికి నేను కృతజ్ఞతలు తెలుపుతూ ఉండేందుకు , నీకు నచ్చిన మంచిపనులు చేస్తూ ఉండేందుకు. నీ కారుణ్యంతో నన్ను సజ్జనులైన నీ దాసులలో చేర్చు.''

**27. అస్ నమ్ల్** 20 - 26 (మరొక సందర్భంలో) సులైమాన్, పక్షులను పరిశీలించి ఇలా అన్నాడు, ''హుద్ హుద్ పక్షి నాకు కనిపించటం లేదేమిటి ? అది ఎటైనా అదృశ్యమైపోయిందా ? నేను దానిని కఠినంగా శిక్షిస్తాను లేదా నరికివేస్తాను. అలా కాకపోతే , అది నాకు సరైన కారణం చూపవలసి ఉంటుంది. '' ఆ తరువాత ఎంతో సేపు గడవలేదు, అది వచ్చి ఇలా అన్నాది, ''మీకు తెలియని సమాచారాన్ని నేను సేకరించాను. నేను సబాను గురించి నమ్మకమైన సమా చారాన్ని తీసుకువచ్చాను. నేను అక్కడ ఒక స్త్రీని చూశాను. ఆమె ఆ జాతిని ఏలుతోంది. ఆమెకు అన్ని రకాల వస్తుసామగ్రి ప్రసాదించబడిరది. ఆమె సింహాసనం మహోజ్వలంగా ఉంది. నేను చూశాను.

ఆమె, ఆమె జాతివారు అల్లాహ్ కు బదులు సూర్యుడి ముందు సాష్టాంగపడుతున్నారు '' - షైతాన్ వారి పనులను వారికి మనోహరమైనవిగా కనిపించేలా చేశాడు. వారిని రాజమార్గంపైకి పోకుండా నిరోధించాడు. అందువల్ల వారు ఈ ఋజుమార్గాన్ని పొందలేకపోతున్నారు: ఆకాశాలలోనూ, భూమిలోనూ దాగివున్న వస్తువులను వెలికి తీసేవాడూ , మీరు దాచేదాన్ని , వ్యక్తపరిచే దాన్నీ ఎరిగినవాడూ అయిన దేవునికి సాష్టాంగపడటం అనే ఋజుమార్గం. అల్లాహ్ ఆయన తప్ప ఆరాధనకు అర్హుడైన వాడు ఎవ్వడూ లేడు. ఆయన మహోన్నతమైన అధికార పీఠానికి ప్రభువు.

**27. అస్ నమ్ల్** 27 - 28 సులైమాన్ ఇలా అన్నాడు , ''ఇప్పుడే మేము చూస్తాము. నీవు నిజం చెప్పావో లేక అబద్ధాలు చెప్పేవారిలోని దానవో. నా ఈ ఉత్తరాన్ని తీసుకుపో , దానిని వారి వైపునకు విసరివేయి , తరువాత ఒక వైపునకు తొలగి, వారి ప్రతిస్పందన ఎలా ఉంటుందో చూడు.''

**27. అస్ నమ్ల్** 29 - 31 రాణి ఇలా పలికింది , ''ఆస్తాన సభ్యులారా! నా వైపునకు అతి ముఖ్యమైన ఒక లేఖ విసరివేయబడిరది. అది సులైమాన్ తరఫు నుండి వచ్చింది. కరుణామయుడూ , కృపాశీలుడూ అయిన అల్లాహ్ పేరుతో ప్రారం భించబడిరది. అందులోని విషయం ఇలా ఉంది: ''నాకు వ్యతిరేకంగా తిరుగు బాటు వైఖరిని అవలంబించకు. ముస్లిమ్ అయి నా వద్దకు వచ్చెయ్యి.''

**27. అస్ నమ్ల్** 32 - 35 (లేఖ వినిపించిన తరువాత) రాణి ఇలా అన్నది, ''జాతి నాయ కులారా! ఈ విషయంలో మీరు నాకు సలహా ఇవ్వండి. నేను ఏ విషయం లోనూ మిమ్మల్ని సంప్రదించకుండా నిర్ణయం తీసుకోను. '' దానికి వారు ఇలా సమాధానం చెప్పారు , ''మేము బలవంతులం , పోరాడగలవారం. అయితే నిర్ణయం మాత్రం మీ చేతులలో ఉన్నది. ఏ ఆజ్ఞ ఇవ్వాలో స్వయంగా మీరే ఆలోచించుకోండి. '' రాణి ఇలా అన్నది , ''రాజులు ఏ దేశంలోనైనా జొరబడి నప్పుడు, దానిని వారు నాశనం చేస్తారు. అక్కడి గౌరవనీయులను అవమాని స్తారు. వారు చేసేది ఇదే. నేను వారివద్దకు ఒక కానుకను పంపిస్తాను , తరువాత నా దూతలు ఏమి జవాబు తీసుకువస్తారో చూస్తాను.''

**27. అస్ నమ్ల్** 36 - 37 అతడు (రాణిగారి దూత) సులైమాన్ వద్దకు చేరుకున్నాడు. అప్పుడు సులైమాన్ ఇలా అన్నాడు, ''ఏమిటి, మీరు ధనం ఇచ్చి నాకు సహాయం చేయదలచుకున్నారా ? దేవుడు మీకు ఇచ్చిన దానికంటే నాకు ఇచ్చినది ఎంతో ఎక్కువ. మీ కానుకను మీరే అనుభవించండి. (ఓ దూతా) నిన్ను పంపిన వారి వద్దకు తిరిగి వెళ్లిపో, మేము వారిపైకి వారు ఎదిరించలేని సైన్యాలను తీసుకు వస్తాము. మేము వారిని పరాభవించి అక్కడి నుండి పారద్రోలుతాము. వారు అవమానితులై ఉండిపోతారు.''

**27. అస్ నమ్ల్** 38 - 40 సులైమాన్ ఇలా అన్నాడు , ''ఆస్థాన సభ్యులారా! వారు విధేయులై నా వద్దకు రాకమునుపే, మీలో ఎవరు ఆమె సింహాసనాన్ని నా దగ్గరకు తీసుకురాగలరు ?'' జిన్నాతులలో బలిష్ఠుడైన ఒకడు

ఇలా మనవి చేసుకున్నాడు, ‘‘మీరు మీ స్థానం  నుండి లేవకముందే నేను దానిని తీసుకువస్తాను. నాకు ఆ శక్తి ఉంది, నమ్మకస్తుణ్ణి కూడా.’’ గ్రంథజ్ఞానం కల ఒకతను ఇలా అన్నాడు, ‘‘మీరు కళ్లుమూసి తెరిచేలోగా నేను దానిని తీసుకువస్తాను.’’ సులైమాన్ తనముందు సింహాసనం పెట్టబడటం చూడగానే ఇలా అరిచాడు  , ‘‘ఇది నా ప్రభువు అనుగ్రహం,  నేను కృతజ్ఞతలు తెలుపుతానో లేక కృతఘ్నుడనై పోతానో పరీక్షించటానికి ఆయన ఇలా చేశాడు. ఎవడైనా కృతజ్ఞతలు తెలుపుకుంటే  ,  అతని కృతజ్ఞతలు అతనికే లాభదాయకమవుతాయి. అలా చేయకుండా ఎవడైనా కృతఘ్నుతకు పాల్పడితే, నా ప్రభువు నిరపేక్షాపరుడు, తనంతటతానే ఘనుడైనవాడు.’’

**27. అస్ నమ్ల్** 41 - 43 సులైమాన్ ఇలా అన్నాడు, ‘‘మెదలకుండా ఆమె సింహాసనాన్ని ఆమె ముందు పెట్టండి. సరైన విషయానికి చేరుతుందో లేక ఋజుమార్గం పొందని వారిలోనే ఉండిపోతుందో చూద్దాము. రాణి వచ్చినప్పుడు ఆమెను, ‘‘నీ సింహాసనం ఇలాంటిదేనా ?’’  అని అడగబడిరది. దానికి ఆమె , ‘‘ఇది అచ్చంగా అలాంటిదే.  మేము ఇంతకు ముందే విషయం తెలుసుకుని విధేయులమైపోయాము. (లేక ముస్లిములమైపోయాము) అని అన్నది. (విశ్వసించకుండా) ఆమెను ఆపి ఉంచిన విషయం , అల్లాహ్ ను వదలి ఆమె పూజిస్తూ ఉండిన దైవాల ఆరాధనే. ఎందుకంటే, ఆమె అవిశ్వాస జాతికి చెందిన స్త్రీ.

**27. అస్ నమ్ల్**44 రాజగృహంలో ప్రవేశించు అని ఆమెకు చెప్పటం జరిగింది. ఆమె దానిని చూచి, అది నీటికొలను అని అనుకున్నది. అందులో దిగటానికి ఆమె తన కాళ్ల మీద వస్త్రాన్ని పైకి ఎత్తిపట్టుకున్నది. అప్పుడు సులైమాన్, ‘‘ఇది గాజుతో చేయబడిన నున్నని నేల మాత్రమే  ’’ అని అన్నాడు. అప్పుడు ఆమె ఎలుగెత్తి ఇలా అన్నది  , ‘‘నా ప్రభూ! (ఈనాటి వరకు) నేను నా ఆత్మకు అన్యాయం చేసుకుంటూ ఉండేదాన్ని. ఇప్పుడు నేను సులైమాన్‌తోపాటు సకల లోకాల ప్రభుపైన అల్లాహ్ పట్ల విధేయతను స్వీకరిస్తున్నాను.’’

**27.  అస్ నమ్ల్**    45  -  47 సమూద్ జాతి వైపునకు మేము వారి సోదరుడు సాలిహ్ ను        ,  ‘‘అల్లాహ్ ను ఆరాధించండి’’  అనే (సందేశాన్ని ఇచ్చి) పంపాము. అప్పుడు వారు ఒక్కసారిగా ఘర్షించుకునే రెండు వర్గాలుగా చీలిపోయారు. సాలిహ్ ఇలా అన్నాడు      ,  ‘‘నా జాతి ప్రజలారా! మేలుకు బదులు కీడు కోసం ఎందుకు తొందరపెడుతున్నారు? అల్లాహ్ ను క్షమాభిక్ష కోసం ఎందుకు అర్థించరు ? మీరు కనికరించబడ వచ్చుకదా!’’ వారు ఇలా అన్నారు, ‘‘మేము నిన్నూ, నీ సహచరులనూ అపశకునపు సూచనలుగా పరిగణిస్తున్నాము.’’ సాలిహ్ ఇలా జవాబు చెప్పాడు,  ‘‘మీ మంచిశకునాలు మీ చెడ్డ శకునాలు అన్నీ అల్లాహ్ వద్దనే ఉన్నాయి. అసలు విషయం ఏమిటంటే, మీరు పరీక్షింపబడుతున్నారు.’’

**27. అస్ నమ్ల్** 48 - 53 ఆ నగరంలో తొమ్మిదిమంది ముఠానాయకులు ఉన్నారు. వారు దేశంలో అల్లకల్లోలాన్ని సృష్టిస్తూ ఉంటారు, ఎలాంటి సంస్కరణ కార్యాన్నీ చేసేవారు కాదు. వారు పరస్పరం ఇలా అనుకున్నారు, ‘‘దేవునిపై ప్రమాణం చేసి ఇలా ప్రతిజ్ఞ చెయ్యండి  మేము సాలిహ్ పై , అతని కుటుంబ సభ్యులపై దాడి చేస్తాము. ఆ తరువాత

అతని సంరక్షకునితో , అతని కుటుంబం హత్య చేయబడి నప్పుడు మేము అక్కడ లేము. మేము నిజమే పలుకుతున్నాము అని చెబుదాము. '' వారు ఈ విధంగా పన్నాగం పన్నారు. ఒక పన్నాగాన్ని మేము కూడ పన్నాము. దానిని గురించి వారికి తెలియనే తెలియదు. ఇక చూడండి , వారి పన్నాగం పర్యవసానం ఏమయిందో! మేము వారినీ, వారి జాతి మొత్తాన్ని సర్వనాశనం చేసివేశాము. అవిగో వారి గృహాలు, ఎలా ఖాళీగా పడి ఉన్నాయో చూడండి, వారు చేస్తూ ఉన్న దుర్మార్గానికి ఫలితంగా. జ్ఞానులకు ఇందులో ఒక గుణపాఠం ఉంది. విశ్వసించి , అవిధేయతకు దూరంగా ఉన్న వారిని మేము కాపాడాము.

**27. అస్ నమ్ల్** 54 - 58 మేము లూత్‌ను పంపాము. అతను తన జాతి వారితో, ఇలా అనిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో, ''మీరు చూస్తూ అశ్లీల కార్యం చేస్తా రేమిటీ ? ఇదేనా మీ నడవడిక, కామతృష్ణను తీర్చుకోవటానికి స్త్రీలను వదలి పెట్టి పురుషుల వద్దకు పోతారేమిటి ? వాస్తవానికి మీరు చాల అజ్ఞానపు పని చేస్తున్నారు. '' కానీ, ఈ సమాధానం తప్ప మరొకటి అతని జాతివారు ఇవ్వలేదు. వారు ఇలా అన్నారు , ''లూత్ కుటుంబాన్ని మీ పట్టణం నుంచి వెళ్లగొట్టండి. వారు మహాపవిత్రులట! '' చివరకు మేము అతనినీ అతని కుటుం బాన్నీ రక్షించాము , అతని భార్యను తప్ప. ఆమె, వెనుక ఉండిపోవాలని మేము నిర్ణయించాము. మేము వారిపై ఒక వర్షాన్ని కురిపించాము. అది హెచ్చరించబడిన వారి విషయంలో అత్యంత ఘోరమైన వర్షం.

**27. అస్ నమ్ల్** 59.... ఓ ప్రవక్తా! ఇలా అను: ''స్తోత్రం అల్లాహ్ కు మాత్రమే తగినది. ఆయన ఎన్నుకున్న ఆయన దాసులకు శాంతి కలుగుగాక!

**27. అస్ నమ్ల్** ... 59 - 60 (వారిని ఇలా అడగండి) అల్లాహ్ శ్రేష్ఠుడా లేక ఆయనకు సాటిగా వారు కల్పించే దేవుళ్లు శ్రేష్ఠులా? సరే, ఆకాశాలనూ, భూమినీ, ఎవరు సృష్టించారు? మీ కొరకు ఆకాశం నుండి నీటిని కురిపించి , తద్వారా మనోహరమైన తోటలను ఎవరు పండిరచారు ? వాటిలోని చెట్లను మొలిపిం చటం మీకు సాధ్యమయ్యేపనికాదు. అల్లాహ్తోపాటు మరొకదేవుడు కూడ ఎవడైనా ఉన్నాడా (ఈ పనులలో పాలుపంచుకోవటానికి)? (లేడు) కాని వారే ఋజుమార్గం నుండి తొలగిపోతున్నారు.

**27. అస్ నమ్ల్** 61 భూమిని నివాస స్థలంగా చేసినవాడు ఎవడు ? అందులో నదులను ప్రవహింపజేసినవాడు ఎవడు? దానిమీద (పర్వతాల) మేకులను పాతినవాడు ఎవడు ? రెండు రకాల జలధుల మధ్య అడ్డు తెరలను పెట్టినవాడు ఎవడు ? అల్లాహ్తోపాటు మరొక దేవుడు కూడ ఎవడైనా ఉన్నాడా (ఈ పనులలో పాలుపంచుకోవటానికి)? లేడు. కాని వారిలో అనేకమందికి తెలియదు.

**27. అస్ నమ్ల్** 62 బాధితుడు మొరపెట్టుకున్నప్పుడు, అతని మొరను ఆలకించి అతని బాధను తొలగించేవాడు ఎవడు? భూమిపై మిమ్మల్ని ప్రతినిధులుగా చేసిన వాడు ఎవడు ? అల్లాహ్తో పాటు (ఈ పనులు చేసే) మరొక దేవుడు కూడ ఎవడైనా ఉన్నాడా? మీరు చాలా తక్కువగా ఆలోచిస్తారు.

**27. అస్ నమ్ల్** 63 నేలపై, సముద్రంపై అంధకారంలో మీకు దారిచూపే వాడు ఎవడు ? తన కారుణ్యానికి ముందు గాలులలను శుభవార్తతో పంపేవాడు ఎవడు ? అల్లాహ్తో పాటు మరొకదేవుడు ఎవడైనా ఉన్నాడా (ఈ పనులు చేయటానికి)? వారు చేస్తూ ఉన్న షిర్క్కు అల్లాహ్ ఎంతో అతీతుడు, ఎంతో ఉన్నతుడు.

**27. అస్ నమ్ల్** 64 సృష్టిని మొదటిసారిగా చేసినవాడు ఎవడు ? దానిని పున్ణసృష్టించేవాడు ఎవడు? నింగినుండి, నేల నుండీ మీకు ఉపాధినిచ్చే వాడు ఎవడు ? అల్లాహ్తో పాటు మరొక దేవుడు ఎవడైనా ఉన్నాడా (ఈ పనులలో పాలు పంచుకోవటా నికి)? ''మీరు సత్యవంతులే అయితే మీ ఆధారాన్ని తీసుకురండి'' అని అడుగు.

**27. అస్ నమ్ల్** 65 వారితో ఇలా అను, ''ఆకాశాలలోనూ, భూమిలోనూ అల్లాహ్ తప్ప అగోచర జ్ఞానం కలవాడు మరెవ్వడూ లేడు. వారికి (మీ దేవుళ్ళకు) తాము ఎప్పుడు లేపబడతారో కూడ తెలియదు కదా!

**27. అస్ నమ్ల్** 66 - 75 కాని పరలోకం గురించిన జ్ఞానమే వారి నుండి కనుమరుగై పోయింది. కాదు , దానిని గురించి వారు సంశయంలో పడిపోయారు. కాదు , వారు అసలు ఆ విషయం పట్ల అంధులైపోయారు. ఆ సత్యతిరస్కారులు ఇలా అంటారు , ''మేమూ, మా తాతముత్తాతలూ మట్టిలో కలిసిపోయిన తరువాత కూడ నిజంగానే మమ్మల్ని సమాధుల నుండి లేపటం జరుగు తుందా ? ఇలాంటి వార్తలు ఎన్నో మాకు కూడ అందించబడ్డాయి, పూర్వం మా తాతముత్తాతలకు కూడ అందించబడుతూ ఉండేవి. కాని ఇవి మేము పూర్వకాలం నుంచి వింటూ వస్తున్న కట్టుకథలు మాత్రమే.'' ఇలా అను, ''భూమిపై తిరిగి చూడండి, నేరస్తులకు ఎటువంటి గతి పట్టినదో!'' ఓ ప్రవక్తా! వారి స్థితిని గురించి బాధపడకు. వారి కుట్రల విషయంలో వ్యధ చెందకు- వారు , ''నీవు చెబుతున్నది నిజమే అయితే ఈ బెదిరింపు ఎప్పుడు నెరవేరు తుంది ?'' అని అడుగుతారు. ఇలా అను, ''మీరు ఏ శిక్షను గురించి తొందర పెడుతున్నారో , అందులోని ఒక భాగం మీ సమీపంలోనికే వచ్చి ఉందన్నా , ఆశ్చర్యం లేదు.'' యథార్థం ఏమిటంటే, నీ ప్రభువు ప్రజల పట్ల ఎంతో అనుగ్రహం కలవాడు. కాని చాలమంది కృతజ్ఞతలు తెలుపరు. వారి హృదయాలు తమలో ఏమి దాచి ఉంచాయో , మరేమి బహిర్గతం చేస్తున్నాయో, నిస్సందేహంగా నీ ప్రభువుకు బాగా తెలుసు. ఆకాశంలో , భూమిలో దాగి ఉన్న ఏ వస్తువు అయినా , ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడకుండా లేదు.

**27. అస్ నమ్ల్** 76 - 81 ఇస్రాయీల్ సంతతివారు విభేదిస్తూ ఉన్న విషయాల వాస్తవం ఏమిటో, ఈ ఖురాన్ వారికి ఎక్కువగా తెలియజేస్తోంది. ఇది విశ్వసించే వారికి మార్గదర్శకత్వం. కారుణ్యమూను. నిశ్చయంగా (ఇలాగే) నీ

ప్రభువు వీరి మధ్య కూడ తన ఆజ్ఞ ద్వారా తీర్పు చేస్తాడు. ఆయన ఎంతో శక్తిమంతుడు , అన్నీ ఎరిగినవాడూను. కనుక ఓ ప్రవక్తా! అల్లాహ్ మీద భారం వెయ్యి. నిశ్చయంగా నీవు స్పష్టంగా సత్యంపై ఉన్నావు. నీవు మృతులకు వినిపించలేవు. వీపు త్రిప్పి పరుగెత్తే బధిరులకు కూడ నీ పిలుపును వినిపించలేవు. అంధులకు మార్గం చూపి , వారు తప్పిపోకుండా కాపాడనూలేవు. మా వాక్యాలను విశ్వసించి , విధేయులయ్యే వారికి మాత్రమే నీవు నీ మాటను వినిపించగలవు.

**27. అస్ నమ్ల్** 82 - 86 మా మాట నెరవేరే సమయం వారిని సమీపించినప్పుడు , మేము వారి కొరకు భూమినుండి ఒక జంతువును తీస్తాము. అది వారితో ఇలా మాట్లాడుతుంది , ''ప్రజలు మా వాక్యాలను విశ్వసించలేదు.'' ఆ రోజును గురించి కొంచెం ఆలోచించు. అప్పుడు మేము ప్రతి సముదాయం నుండి మా వాక్యాలను తిరస్కరించే ఒక్కొక్క జనసమూహాన్ని సమీకరిస్తాము. ఆపై వారిని (వారి వారి తరగతుల ప్రకారం అంతస్తుల వారీగా) ఒక క్రమపద్ధతిలో ఉంచటం జరుగుతుంది. చివరకు అందరూ వచ్చేసిన తరువాత (వారి ప్రభువు వారిని) ఇలా అడుగుతాడు, ''మీరు నా వాక్యాలను శాస్త్రీయ పరిశీలన చేయకుండానే ఇట్టే తిరస్కరించారు. ఇది కాక మీరు చేసింది ఏమిటి ?'' వారు చేసిన దుర్మార్గం వల్ల శిక్షకు సంబంధించిన వాగ్దానం వారి విషయంలో నెరవేరుతుంది. అప్పుడు వారు ఏమీ మాట్లాడలేరు. వారు విశ్రాంతి పొంద టానికి మేము రాత్రిని సృష్టించాము. మేము పగటిని ప్రకాశవంతంగా చేశాము. వారి బుద్ధికి ఈ విషయాలు తట్టవికావా ? విశ్వసించే వారికి ఇందులో అనేక సూచనలు ఉండేవి.

**27. అస్ నమ్ల్** 87 - 90 శంఖం ఊదబడే రోజున ఏమి జరుగుతుందో? ఆ రోజున, ఆకాశాలలోని, భూమిలోని సకల సృష్టిరాసులు భయంతో కంపించిపోతాయి. - ఆ భయానక పరిస్థితుల నుండి అల్లాహ్ కాపాడ దలచిన వారు తప్ప - అందరూ లొంగిపోయి , వినమ్రులై ఆయన ముందు హాజరవుతారు. ఈ రోజున నీవు పర్వతాలను చూచి అవి బాగా స్థిరంగా ఉన్నాయని అనుకుంటు న్నావు. కాని అప్పుడు మేఘాల మాదిరిగా అవి ఎగురుతూ ఉంటాయి. ఇది అల్లాహ్ శక్తి సామర్థ్యాల మహిమ. ఆయన ప్రతి వస్తువునూ వివేకంతో తీర్చిదిద్దాడు. మీరు చేసేదంతా ఆయనకు బాగా తెలుసు. మంచిని తీసుకువచ్చే వ్యక్తికి అంతకంటే మేలైన ప్రతిఫలం లభిస్తుంది. అటువంటి వారు ఆనాటి భయంకర పరిస్థితినుండి సురక్షితంగా ఉంటారు. చెడును తీసుకువచ్చే వారందరూ బోర్లగా అగ్నిలో విసరివేయబడతారు. మీరు చేసిన కర్మల ప్రకారం తప్ప మీరు మరొక విధమైన ప్రతిఫలాన్ని ఎలా పొందగలుగుతారు?

**27. అస్ నమ్ల్** 91 - 93 (ఓ ప్రవక్తా! వారితో ఇలా అను): ''ఈ నగరం (మక్కా) ప్రభువును మాత్రమే ఆరాధించాలని నాకు ఆజ్ఞ ఇవ్వబడిరది. ఆయన దానిని పవిత్రమైన క్షేత్రంగా చేశాడు ఆయన ప్రతిదానికీ యజమాని. నేను విధేయుడనై ఉండా లనీ , ఈ ఖురాన్‌ను చదివి వినిపించాలనీ నాకు ఆజ్ఞ ఇవ్వబడిరది. ఇక

సన్మార్గాన్ని అవలంబించేవాడు తన మేలు కొరకే సన్మార్గాన్ని అవలంబిస్తాడు. మార్గభ్రష్టుడైన వాడితో , ''నేను కేవలం హెచ్చరించేవాణ్ణి మాత్రమే '' అని అను. వారితో ఇంకా ఇలా అను , ''స్తోత్రం కేవలం అల్లాహ్ కు మాత్రమే తగినది, అతి త్వరలోనే ఆయన మీకు తన సూచనలను చూపుతాడు , మీరు వాటిని గుర్తిస్తారు. '' మీరు చేసే పనులన్నీ నీ ప్రభువునకు తెలియకుండా లేవు.

**28. అల్ ఖసస్**

ఆయతులు : 88 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**28. అల్ ఖసస్** 1 - 3 తా-సీన్-మీమ్. ఇవి స్పష్టమైన గ్రంథంలోని వాక్యాలు. మేము మూసా , ఫిరౌనుల కొంత వృత్తాంతాన్ని విశ్వసించే వారి ప్రయోజనం కోసం జరిగింది జరిగినట్లుగా మీకు వినిపిస్తున్నాము.

**28. అల్ ఖసస్** 4 - 6 అసలు విషయం ఏమిటంటే, ఫిరౌను భూమి మీద తిరుగుబాటు వైఖరిని అవలంబించాడు. దాని ప్రజలను వర్గాలుగా విభజించాడు. వారిలోని ఒక వర్గాన్ని అతడు నీచపరచేవాడు. వారి బాలురను హతమార్చేవాడు వారి బాలికలను మాత్రం బ్రతుకనిచ్చేవాడు. నిశ్చయంగా అతడు దుష్టులలోని వాడు. భూమిలో అణచివేయబడిన వారిని కనికరించాలనీ , వారిని నాయకులుగా చేయాలనీ , వారినే వారసులుగా చేయాలనీ , భూమిలో వారికి అధికారాన్ని ప్రసాదించాలనీ , వారి ద్వారా ఫిరౌను , హామానులకూ, వారి సైన్యాలకూ తాము భయపడుతూ వచ్చిన దానినే చూపాలనీ మేము కోరాము.

**28. అల్ ఖసస్** 7 - 9 మేము మూసా తల్లికి ఇలా సూచించాము , ''అతనికి పాలుపట్టు, అతని ప్రాణానికి ప్రమాదముందని నీకు అనిపిస్తే అపుడు అతనిని నదిలో విడిచిపెట్టు , ఏమాత్రం భయపడకు, బాధపడకు, మేము అతనిని నీ వద్దకే తిరిగి తీసుకువస్తాము , అతనిని ప్రవక్తలలో ఒకడుగా చేస్తాము. '' చివరకు ఫిరౌను ఇంటివారు అతనిని (నదిలో నుండి) బయటికి తీశారు , అతను వారికి శత్రువై శోక కారణం అవటానికి. నిజంగానే ఫిరౌను , హామాను, వారి సైన్యాలు (తమ వ్యూహాల రీత్యా) ఎంతో పాపిష్టులు. ఫిరౌను భార్య (అతడితో) ఇలా అన్నది , ''ఇతడు నీకూ నాకూ కంటి చలువ. ఇతనిని చంపకు. బహుశా ఇతడు మనకు ఉపయోగపడవచ్చు లేదా మనం ఇతనిని కుమారునిగానైనా చేసుకోవచ్చు.'' కాని వారికి (పర్యవసానం) తెలియదు.

**28. అల్ ఖసస్** 10 - 13 అటు మూసా తల్లి హృదయం తల్లడిల్లిపోతోంది. ఆమె (మా వాగ్దానం ఆధారంగా) విశ్వసించే వారిలో ఉండిపోవాలని , మేము ఆమె హృదయాన్ని ధైర్యంతో నింపాము. లేకపోతే , ఆమె అతని రహస్యాన్ని బయటపెట్టి ఉండేదే. ఆమె మూసా సోదరితో , ''అతనిని వెంబడిస్తూ వెళ్ళు '' అని అన్నది.

తదనుగుణంగా ఆమె దూర దూరంగా ఉంటూ అతనిని గమనించసాగింది. కాని అది వారికి (శత్రువులకు) తెలియదు. మేము మొదట్లోనే పాలుపట్టే స్త్రీల స్తనాల నుండి పిల్లవాడు పాలు తాగకుండా నిషేధించాము. (ఈ పరిస్థితిని చూసి) ఆ బాలిక వారితో ఇలా అన్నది, ''అతనిని పెంచి పోషించే బాధ్యతను స్వీకరించే, అతని మేలును కోరే ఇంటి వారిని గురించి నేను మీకు తెలిపేదా ?'' ఈ విధంగా మేము మూసాను అతని తల్లి వద్దకు తిరిగి తీసుకువచ్చాము. ఆమె కన్నులకు చల్లదనం కలగాలని , ఆమె దుఃఖపడకుండా ఉండాలని. అల్లాహ్ వాగ్దానం నిజమైనదని ఆమె తెలుసుకోవాలని. కాని చాలామందికి ఈ విషయం తెలియదు.

**28. అల్ ఖసస్** 14 - 17 మూసా తన నిండు యౌవనదశకు చేరుకున్నప్పుడు, అతని పెరుగుదల పరిపక్వతను సంతరించుకున్నప్పుడు, మేము అతనికి వివేకాన్నీ , జ్ఞానాన్నీ ప్రసాదించాము. మేము సజ్జనులకు ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తూ ఉంటాము. (ఒకనాడు) నగరవాసులు ఏమరుపాటులో ఉన్న సమయంలో అతను నగరంలోకి ప్రవేశించాడు. అక్కడ అతను ఇద్దరు వ్యక్తులు ఘర్షణపడుతూ ఉండటాన్ని చూశాడు. ఒకడు స్వయంగా అతని జాతికి చెందినవాడు, రెండోవాడు అతని శత్రుజాతికి చెందినవాడు. అతని జాతి వ్యక్తి శత్రుజాతి వానికి వ్యతిరేకంగా సహాయపడమని అతనిని పిలిచాడు. మూసా అతనిని ఒక గుద్దుతో కడతేర్చాడు. (ఇది జరగగానే) మూసా , ''ఇది షైతాను నిర్వాకం. అతడు ప్రబల శత్రువు , స్పష్టంగా దారితప్పించేవాడు'' అని అన్నాడు. తరువాత అతను ఇలా అన్నాడు, ''నా ప్రభూ! నేను నా ఆత్మకు అన్యాయం చేశాను , నన్ను క్షమించు.'' అప్పుడు అల్లాహ్ అతనిని క్షమించాడు. ఆయన క్షమించేవాడు , కరుణించేవాడూను. మూసా ఇలా ప్రతిజ్ఞ చేశాడు , ''నా ప్రభూ! నీవు నాకు మహోపకారం చేశావు. ఇకపై నేను ఎన్నడూ నేరస్తులకు సహాయపడబోను.''

**28. అల్ ఖసస్** 18 - 21 మరుసటి రోజు ఉదయం అతను భయపడుతూ, ఏదైనా ప్రమాదం ముంచుకొస్తుందేమో అని జాగ్రత్తగా నలువైపులా పరికిస్తూ నగరంలో పోతు ఉండగా అంతకు ముందురోజు సహాయానికై తనను పిలిచిన వ్యక్తే ఈ రోజు మళ్ళీ తనను పిలుస్తూ ఉండటాన్ని అకస్మాత్తుగా చూశాడు. అపుడు ''నీవు పూర్తిగా మార్గం తప్పిన వాడవు'' అని మూసా అన్నాడు. తరువాత శత్రుజాతి వ్యక్తిపై దాడి చేద్దామని మూసా అనుకున్నప్పుడు , అతడు బిగ్గరగా ఇలా అన్నాడు, ''మూసా! నీవు నిన్న ఒక వ్యక్తిని చంపినట్లుగానే ఈ రోజు నన్ను కూడ చంపేస్తావా ? నీవు ఈ దేశంలో దౌర్జన్యపరుడవుగా ఉండదలచు కున్నావా , సంస్కరణ చేయదలచుకోలేదా?'' దీని తరువాత ఒక వ్యక్తి నగరం యొక్క ఆ చివరనుండి పరుగెత్తుకుంటూ వచ్చి ఇలా చెప్పాడు , ''మూసా! సర్దారులు నిన్ను హత్య చేయటానికి సంప్రదింపులు జరుపుతున్నారు. ఇక్కడ నుంచి వెళ్ళిపో , నేను నీ శ్రేయోభిలాషిని. '' ఈ వార్త విన్నంతనే, మూసా భయపడుతూ జాగ్రత్తగా బయలుదేరాడు. అతను ఇలా ప్రార్థించాడు , ''నా ప్రభూ! నన్ను దుర్మార్గుల నుండి రక్షించు.''

**28. అల్ ఖసస్** 22 - 25 (ఈజిప్టు నుండి బయలుదేరి) మూసా మద్యన్ వైపునకు తిరిగినప్పుడు ఇలా అనుకున్నాడు, ''నా ప్రభువు నన్ను సరిjైన మార్గంలో నడుపుతాడని ఆశిస్తున్నాను.'' అతడు మద్యన్ బావి వద్దకు చేరుకున్నప్పుడు చాలమంది ప్రజలు తమ పశువులకు నీరు త్రాపటాన్నీ, వారికి దూరంగా ఒక ప్రక్క ఇద్దరు స్త్రీలు తమ పశువులను ఆపుతూ ఉండటాన్నీ చూశాడు. మూసా ఆ స్త్రీలను, ''మీకు వచ్చిన చిక్కు ఏమిటి?'' అని అడిగాడు. వారు ఇలా జవాబు చెప్పారు , ''ఈ పశువుల కాపరులు తమ పశువులను తోలుకుపోవనంతవరకు మేము మా పశువులకు నీరు తాపలేము. మా తండ్రి గారు చాలా వృద్ధులు.'' ఇది విని మూసా వారి పశువులకు నీరు త్రాపాడు. తరువాత నీడ ఉన్న ఒక స్థలంలోకి పోయి కూర్చున్నాడు, ఇలా అన్నాడు, ''స్వామీ! నీవు నాపై ఏ మేలును అవతరింపజేసినా, నేను దాని అవసరం కలవాడనే.'' (ఎంతో సేపు కాలేదు) ఆ ఇద్దరు స్త్రీలలోని ఒకామె సిగ్గుపడుతూ, బిడియపడుతూ అతని వద్దకు నడచి వచ్చి ఇలా చెప్పసాగింది , ''నా తండ్రి గారు మిమ్మల్ని పిలుస్తున్నారు, మీరు మా పశువులను నీరు త్రాపించిన దానికి గాను మీకు ప్రతిఫలమీయడానికి. '' మూసా ఆయన వద్దకు వెళ్లి తన పూర్తి వృత్తాంతాన్ని వినిపించినప్పుడు, ఆయన ఇలా అన్నారు, ''ఏ మాత్రం భయపడకు. ఇప్పుడు నీవు దుర్మార్గపు ప్రజల బారినుండి బయటపడ్డావు.''

**28. అల్ ఖసస్** 26 - 28 ఆ ఇద్దరు స్త్రీలలోని ఒకామె తన తండ్రితో ఇలా అన్నది , ''నాన్నా ఈ వ్యక్తిని నౌకరుగా పెట్టుకొనండి. బలవంతుడూ , నమ్మకస్తుడూ అయినవాడే మీరు నౌకరుగా పెట్టుకోవటానికి అన్ని విధాలా ఉత్తముడు.'' ఆమె తండ్రి (మూసాతో) ఇలా అన్నాడు , ''నీవు నా వద్ద ఎనిమిది సంవత్సరాల వరకు నౌకరుగా ఉండే షరతుకు ఒప్పుకుంటే నా ఇద్దరు కుమార్తెలలో ఒకామెను నీకిచ్చి వివాహం చేయదలచుకున్నాను. ఒకవేళ పది సంవత్సరాలు పూర్తిచేయదలిస్తే అది నీ ఇష్టం. నేను నిన్ను బలవంతం చేయదలచుకోలేదు. అల్లాహ్ కోరితే నీవు నన్ను మంచి మనిషిగా చూస్తావు. '' మూసా ఇలా జవాబు పలికాడు , ''ఈ విషయం మీకూ నాకూ మధ్య నిర్ణయమైపోయినట్లే. ఈ రెండు గడువులలో నేను దేన్ని పూర్తిచేసినా , దాని తరువాతమటుకు నాపై ఏ విధమైన ఒత్తిడి తీసుకు రాకూడదు. మనం ఖరారు చేసుకున్న మాటకు అల్లాహ్ యే సాక్షి.''

**28. అల్ ఖసస్** 29 - 35 గడువును పూర్తి చేసిన మూసా తన కుటుంబ సభ్యులను తీసుకుని ప్రయాణమైపోతూ ఉండగా, తూర్ పర్వతం ఉన్న దిక్కున ఒక మంట కనిపించింది. అతను తన ఇంటివారితో ఇలా అన్నాడు, ''ఆగండి, నేను ఒక మంటను చూశాను, బహుశా నేను అక్కడ నుంచి ఏదైనా సమాచారాన్నయినా తీసుకొని వస్తాను , లేదా ఆ మంట నుండి నిప్పురవ్వనైనా పట్టుకొని వస్తాను , దానితో మీరు చలి కాచుకుందురు గాని. '' అక్కడకు చేరినప్పుడు లోయ కుడిగట్టుపై ఉన్న ఒక శుభవంతమైన స్థలంలోని ఒక చెట్టు నుండి ఒక పిలుపు వినవచ్చింది. ''మూసా! నేను అల్లాహ్ ను , సకల లోకాలకు ప్రభువును. '' తరువాత ''నీ కర్రను విసురు '' (అని ఆజ్ఞాపించబడిరది). ఆ కర్ర పాము మాదిరిగా కదలడం చూడగానే మూసా వెనక్కి తిరిగి పరుగెత్తాడు - తిరిగి కూడా

చూడలేదు. (ఇలా సెలవీయబడిరది), ‘‘మూసా! తిరిగి రా, భయపడకు, నీవు సురక్షితంగానే ఉన్నావు. నీ చేతిని ఛాతీ చొక్కాలోనికి పైకి దూర్చు , నీకు ఏ విధమైన నొప్పీ కలిగించకుండానే అది ప్రకాశిస్తూ బయటికి వస్తుంది. భయం నుండి కాపాడుకోవటానికి నీ భుజాన్ని ప్రక్కకు అదుముకో. ఇవి స్పష్టమైన రెండు సూచనలు , నీ ప్రభువు తరఫు నుండి, ఫిరౌన్, అతడి దర్బారీల ముందు ఉంచటానికి. వారు పరమ అవిధేయులు. ’’ మూసా ఇలా మనవి చేసుకున్నాడు. ‘‘నా ప్రభూ! నేను వారి మనిషి నొకణ్ణి హత్య చేశాను. వారు నన్ను హత్య చేస్తారేమో అని భయపడుతున్నాను. నా సోదరుడు హారూన్ నా కంటే మంచి వాగ్ధాటి కలవాడు , నన్ను సమర్థించటానికి అతనిని సహాయకు డుగా నాతో పంపు. వారు నన్ను అసత్యవాదిగా తిరస్కరిస్తారేమో అని భయపడు తున్నాను. ’’ ఇలా సెలవిచ్చాడు, ‘‘మేము నీ సోదరుని ద్వారా నీ చేతులకు బలాన్ని సమకూరుస్తాము. మేము మీ ఉభయులకు ఒక విశేషశక్తిని ప్రసాదిస్తాము. కాబట్టి వారు మీకు ఏమాత్రం హాని చేయలేరు. మా సూచనల బలం ఆధారంగా, ప్రాబల్యం మీదే, మీ అనుచరులదే అవుతుంది.’’

**28. అల్ ఖసస్** 36 - 37 తరువాత మూసా, ఆ ప్రజల వద్దకు స్పష్టమైన మా సూచనలతో వెళ్లినప్పుడు , వారు ఇలా అన్నారు, ‘‘ఇది మాయాజాలం తప్ప మరేమీ కాదు. ఈ మాటలను మేము మా తాతముత్తాతల కాలంలో కూడ ఎన్నడూ వినలేదు.’’ మూసా ఇలా సమాధానమిచ్చాడు, ‘‘నా ప్రభువు తన వద్దనుండి మార్గదర్శకత్వాన్ని తీసుకొనివచ్చిన వ్యక్తి స్థితి ఎటువంటిదో బాగా ఎరుగును. ఇంకా చివర్లో ఎవరి పర్యవసానం మంచిదవుతుందో ఆయనకే బాగా తెలుసు. సత్యం ఏమిటంటే దుర్మార్గులు ఎన్నడూ సాఫల్యం పొందలేరు.’’

**28. అల్ ఖసస్** 38 ఫిరౌను ఇలా అన్నాడు , ‘‘సభ్యులారా! నేను కాక మీకు మరొక దేవుడెవడైనా ఉన్నాడేమో నేను ఎరుగను. హామాన్! ఇటుకలను కాల్చి నాకై ఒక ఎత్తైన కట్టడాన్ని నిర్మాణం చేయించు. దానిపైకి ఎక్కి బహుశా నేను మూసా దేవుణ్ణి చూడగలనేమో. నేను అతణ్ణి అసత్యవాదిగా పరిగణిస్తున్నాను.’’

**28. అల్ ఖసస్** 39 - 42 భూమిపై అతడూ , అతడి సైన్యాలూ ఏ విధమైన హక్కులేకుండానే తమ పెద్దరికపు అహంభావాన్ని ప్రదర్శించారు. మా వైపునకు తాము ఎన్నడూ మరలిరావటమనేదే ఉండదని వారు భావించారు. చివరకు మేము అతనినీ అతని సైన్యాలనూ పట్టుకుని సముద్రంలోకి విసరివేశాము. చూడు ఆ దుర్మార్గులకు ఏ గతి పట్టిందో. మేము వారిని నరకం వైపునకు ప్రజలను ఆహ్వానించే నాయకులుగా చేశాము. ప్రళయం నాడు వారు ఎక్కడ నుంచీ ఏ సహాయాన్నీ పొందలేరు. మేము ఈ ప్రపంచంలో అభిశాపం వారిని వెంటాడేలా చేశాము. ప్రళయం నాడు వారు ఘోర దురవస్థకు గురి అవుతారు.

**28. అల్ ఖసస్** 43 - 47 పూర్వపు తరాల వారిని నాశనం చేసిన తరువాత , మేము మూసాకు గ్రంథాన్ని ప్రసాదించాము మానవుల కొరకు దూరదృష్టి సాధనంగా చేసి, మార్గదర్శకత్వంగా, కారుణ్యంగా చేసి, తద్వారా వారు బహుశా గుణపాఠం చేర్చుకుంటారేమో అని. (ప్రవక్తా!) మేము మూసాకు ఈ షరియత్తు ఆదేశాన్ని

ప్రసాదించినప్పుడు నీవు పశ్చిమ దిశలో లేవు. ఇంకా, నీవు సాక్షులలోనూ లేవు. అంతేకాదు, దాని తరువాత (నీ కాలం వరకు) మేము ఎన్నో తరాల వారిని ప్రభవింపజేశాము , వారి మీదుగా ఒక సుదీర్ఘ కాలం గడిచిపోయింది. నీవు మద్యన్ వాసులలో కూడా నివసించి ఉండలేదు , వారికి మా ఆయతులను వినిపించి ఉండటానికి. కాని (అప్పటి ఈ వార్తలను) పంపేవారము మేమే. మేము (మూసాను ప్రప్రథమంగా) పిలిచినప్పుడు , నీవు తూర్ పర్వతం అడుగుభాగాన కూడా లేవు. కాని ఇది నీ ప్రభువు కారుణ్యం (నీకు ఈ సమాచారం అందించబడుతోంది) , నీకు పూర్వం హెచ్చరిక చేసే వాడెవ్వడూ రాని ప్రజల వద్దకు నీవు పోయి హెచ్చరించటానికి బహుశా వారు స్పృహలోకి వస్తారేమో అని. (మేము ఇలా ఎందుకు చేశామంటే) , వారు స్వయంగా తాము చేసుకున్న కర్మల ఫలితంగా ఏదైనా ఆపద వారిపైకి వచ్చినప్పుడు , వారు ''ప్రభూ! నీవు మా వద్దకు ఒక ప్రవక్తను ఎందుకు పంపలేదు. మేము నీ ఆయతులను తలదాల్చి ఉండేవారము కదా , విశ్వాసులలో చేరి ఉండే వారము కదా!'' అని అనకుండా ఉండేటందుకు.

**28. అల్ ఖసస్** 48 - 51 కాని మా తరఫు నుండి వారి వద్దకు సత్యం వచ్చిన తరువాత వారు ఇలా అన్నారు , ''మూసాకు ఇవ్వబడినదే ఇతనికీ ఎందుకీయబడలేదు. '' ఇదివరకు మూసాకు ఇవ్వబడిన దానిని వారు తిరస్కరించి ఉండలేదా? వారు, ''రెండూ మాయాజాలాలే. అవి ఒకదాని కొకటి సహాయ పడతాయి'' అని అన్నారు. ఇంకా వారు, ''మేము దేనినీ విశ్వసించము '' అని కూడా అన్నారు. (ప్రవక్తా!) వారితో ఇలా అను , ''సరే మీరు నిజాయితీపరులే అయితే అల్లాహ్ దగ్గర నుండి , ఈ రెండిరటి కంటే మెరుగైన మార్గదర్శకత్వాన్ని ప్రసాదించే ఒక గ్రంథాన్ని తీసుకురండి. నేను దానిని అనుసరిస్తాను. ఇప్పుడు వారు నీ ఈ కోర్కెను తీర్చకపోతే అసలు వారు తమ మనోవాంఛలను అనుస రించేవారని తెలుసుకో. దేవుని మార్గదర్శకత్వం లేకుండా కేవలం తన కోరికలను అనుసరించే వ్యక్తి కంటే పరమ మార్గభ్రష్టుడెవడు ? అటువంటి దుర్మార్గులకు అల్లాహ్ తన మార్గదర్శకత్వాన్ని ఎంతమాత్రం ప్రసాదించడు. (హితబోధ యొక్క) వచనాన్ని మేము ఎడతెగకుండా వారికి అందజేశాము , వారు ఏమరుపాటు నుండి మేల్కోవాలని.

**28. అల్ ఖసస్** 52 - 56 ఇంతకు పూర్వం మేము గ్రంథాన్ని ఇచ్చిన ప్రజలు దీనిని(ఖురాన్‌ను) విశ్వసిస్తారు. ఇది వారికి వినిపించబడినప్పుడు, వారు ఇలా అంటారు, ''మేము దీనిని విశ్వసించాము. ఇది నిజంగానే మా ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. మేము మొదటి నుండీ ముస్లిములమే. '' తాము చూపిన స్థైర్యానికి ఫలితంగా తమ ప్రతిఫలాన్ని రెండుసార్లు పొందేవారు వారే. వారు చెడును మంచితో నివారిస్తారు. మేము వారికి ఇచ్చిన జీవనోపాధి నుండి ఖర్చు పెడతారు. వారు ఎప్పుడైనా అసహ్యకరమైన మాటను వింటే , ఇలా అంటూ దూరంగా జరిగిపోతారు , ''మా కర్మలు మావి. మీ కర్మలు మీవి. మీకో సలామ్. మేము అజ్ఞానుల పద్ధతిని అవలంబించదలచుకోలేదు. '' ప్రవక్తా! నీకు ఇష్టమైన వారికి నీవు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించలేవు. కాని అల్లాహ్ తనకు ఇష్టమైన వారికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదించగలడు, ఆయన తన మార్గదర్శకత్వాన్ని స్వీకరించేవారిని బాగా ఎరుగును.

**28. అల్ ఖసస్** 57 ... వారు ఇలా అంటారు , ''ఒకవేళ నీతోపాటు మేము కూడా ఈ మార్గ దర్శకత్వాన్ని అవలంబిస్తే మేము మా భూభాగం నుండి తొలగింపబడతాము.

**28. అల్ ఖసస్** ... 57 మేము శాంతికి నిలయమైన ఒక పవిత్ర స్థలాన్ని వారికి స్థిర నివాసంగా చేయటం , దాని వైపునకు అన్ని రకాల పండ్లూ , ఫలాలూ మా తరఫు నుండి జీవనోపాధిగా రావటం వాస్తవం కాదా ?'' కాని వారిలో చాలా మందికి తెలియదు.

**28. అల్ ఖసస్** 58 మేము ఎన్ని జనపదాలను నాశనం చేయలేదు వాటి ప్రజలు తమ సంపదను చూచుకుని పొంగిపోయేవారు. అవిగో చూడు, వారి నివాసాలు ఎలా పడి ఉన్నాయో, వారి తరువాత వాటిలో నివసించిన వారూ చాలా తక్కువే. చివరకు మేమే వారసులమయ్యాము.

**28. అల్ ఖసస్** 59 నీ ప్రభువు జనపదాలను ఎంతమాత్రం నాశనం చేయడు. వాటి కేంద్రాలకు మా ఆయతులను వినిపించే ప్రవక్తలను పంపనంతవరకు. మేము జనపదాలను, వాటి ప్రజలు దుర్మార్గులయిపోతే తప్ప ఎంతమాత్రం నాశనం చేయము.

**28. అల్ ఖసస్** 60 - 61 మీకు ఇవ్వబడిరది కేవలం ప్రాపంచిక జీవితపు సామగ్రి మరియు అలంకరణలు మాత్రమే. అల్లాహ్ వద్ద ఉన్నది దీనికంటె ఉత్తమమైనది , నిత్యమైనది. మీరు ఆలోచించరా ? మేము తనకు చేసిన మంచి వాగ్దానాన్ని తప్పకుండా పొందనున్న వ్యక్తి , మేము కేవలం ఇహలోక జీవన సామగ్రి ఇచ్చిన తరువాత ప్రళయంనాడు శిక్షకై హాజరుపరచబడనున్న వ్యక్తీ ఒకటవుతారా?

**28. అల్ ఖసస్** 62 - 64 (వారు మరచిపోకూడదు) ఆ దినాన్ని. అప్పుడు ఆయన వారిని పిలిచి , ''మీరు, నా భాగస్వాములుగా భావించిన వారెక్కడున్నారు ?'' అని అడుగుతాడు. ఈ మాట ఎవరికి వర్తిస్తుందో వారు ఇలా అంటారు, ''మా ప్రభూ! నిస్సందేహంగా మేము అపమార్గం పట్టించింది వారినే. స్వయంగా మేము అపమార్గం పట్టిన విధంగానే, మేమూ వారిని అపమార్గం పట్టించాము. వారిని గురించి మాకు ఏ విధమైన బాధ్యత లేదని మేము నీ సమక్షంలో ప్రకటిస్తున్నాము. అసలు వారు మమ్మల్ని పూజించనే లేదు. '' తరువాత వారితో, ''మీరు నిలబెట్టిన భాగస్వాములను ఇప్పుడు పిలవండి ,'' అని అనబడుతుంది. వారు వారిని పిలుస్తారు కాని వారు వారికి ఏ సమాధానమూ ఇవ్వరు. వారు శిక్షను చూస్తారు. అయ్యో! వారు సన్మార్గాన్ని అవలంబించి ఉంటే ఎంత బాగుండేది.

**28. అల్ ఖసస్** 65 - 67 (వారు విస్మరించకూడదు) ఆ దినాన్ని. అప్పుడు ఆయన వారిని పిలిచి , ''పంపబడిన సందేశహరులకు మీరు ఏమని సమాధానమిచ్చారు ?'' అని అడుగుతాడు. ఆ సమయంలో వారికి ఏ సమాధానమూ తోచదు, వారు ఒకరినొకరు సంప్రదించుకోనూలేరు. అయితే ఎవడు ఇక్కడ పశ్చాత్తాప పడతాడో

విశ్వసించి, మంచి పనులు చేస్తాడో , అతడు అక్కడ సాఫల్యం పొందేవారి మధ్య ఉండగలను అని ఆశించగలుగుతాడు.

**28. అల్ ఖసస్** 68 - 73 నీ ప్రభువు తాను కోరిన దానిని సృష్టిస్తాడు. (స్వయంగా ఆయనే తన పని కోసం తాను కోరిన వారిని) ఎన్నుకుంటాడు. ఈ ఎన్నిక చేయటం అనేది వారి పనికాదు. అల్లాహ్ పరిశుద్ధుడు , వారు చేసే షిర్కుకు అతీతుడు. వారు తమ మనస్సులలో దాచిన దానినీ , బహిరంగపరచే దానినీ నీ ప్రభువు ఎరుగును. ఆయనే అల్లాహ్, ఆయన ఒక్కడు. ఆయన తప్ప ఆరాధనకు అర్హుడెవ్వడూ లేడు. ఈ లోకంలోనూ, పరలోకంలోనూ ఆయనే స్తుతింపదగిన వాడు. పరిపాలనాధికారం ఆయనదే , ఆయన వైపునకే మీరంతా మరలింప బడతారు. ప్రవక్తా! వారితో ఇలా అను , ''ఈ విషయం గురించి మీరెప్పుడైనా ఆలోచించారా ఒకవేళ అల్లాహ్ ప్రళయం వచ్చేవరకు మీపై శాశ్వతంగా రాత్రిని ఆవహింపజేస్తే, అల్లాహ్ తప్ప మీకు వెలుగును తెచ్చి ఇచ్చే దేవుడు ఎవడు ? మీరు వినరా?'' వారిని ఇంకా ఇలా అడుగు , ''ఈ విషయం గురించి మీరెప్పుడైనా ఆలోచించారా ఒకవేళ అల్లాహ్ ప్రళయం వరకు మీపై పగలును శాశ్వతంగా ఉండేలా చేస్తే , మీరు విశ్రాంతి పొందటానికి అల్లాహ్ తప్ప మీకు రాత్రిని తెచ్చి ఇచ్చే దేవుడెవడైనా ఉన్నాడా ? మీకేమీ గోచరించటం లేదా ?'' ఇది ఆయన కారుణ్యమే ఆయన మీ కొరకు రాత్రినీ, పగలునూ సృష్టించాడు , మీరు (రాత్రి సమయంలో) విశ్రాంతిని పొందటానికీ , (పగటి సమయంలో) మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషించటానికీ బహుశా మీరు కృతజ్ఞులవుతారేమో అని.

**28. అల్ ఖసస్** 74 - 75 (వారు జ్ఞాపకముంచుకోవాలి) ఆ దినాన్ని, అపుడు ఆయన వారిని పిలిచి, ''మీరు నాకు భాగస్వాములుగా కల్పించిన వారెక్కడున్నారు ?'' అని అడుగుతాడు. మేము ప్రతి సంఘం నుండి ఒక సాక్షిని తీసుకువస్తాము. తరువాత , ''మీ రుజువును ఇప్పుడు తీసుకురండి '' అని అంటాము. అపుడు వారికి తెలిసిపోతుంది, సత్యం అల్లాహ్ వైపే ఉందని, వారు కల్పించిన అసత్యాలన్నీ మటుమాయ మైపోతాయి.

**28. అల్ ఖసస్** 76 - 78 ఇదొక యథార్థం ఖారూన్ మూసా జాతికి చెందిన ఒక వ్యక్తి. అతడు తన జాతికి వ్యతిరేకంగా తిరుగుబాటుచేశాడు. మేము అతనికి ఎన్నో నిధులను ఇచ్చాము. వాటి తాళపు చెవులను బలాఢ్యులైన వ్యక్తుల ఒక సమూహం కూడా చాలా కష్టంగా ఎత్తగలదు. ఒకసారి అతని జాతి ప్రజలు అతనితో ఇలా అన్నారు, ''విఱ్ఱవీగకు, విఱ్ఱవీగే వారిని అల్లాహ్ ప్రేమించడు. అల్లాహ్ నీకు ఇచ్చిన సంపదతో పరలోకంలో గృహాన్ని నిర్మించుకునే యోచన చేయి. ప్రపంచంలో కూడ నీ వాటాను విస్మరించకు అల్లాహ్ నీకు ఉపకారం చేసిన విధంగానే నీవూ ఉపకారం చేయి. భూమిపై కల్లోలాన్ని సృష్టించే ప్రయత్నం చేయకు. అల్లాహ్ కల్లోలం సృష్టించే వారిని ప్రేమించడు.'' అపుడు అతడు ఇలా అన్నాడు, ''నాకు లభ్యమైన జ్ఞానం మూలంగానే ఇదంతా నాకు ఇవ్వబడిరది'' - అతనికి పూర్వం అతనికంటే ఎక్కువ బలాన్నీ , అనుచర వర్గాన్ని కలిగి ఉన్న చాలామందిని అల్లాహ్ నాశనం చేశాడనే విషయం అతనికి తెలియదా? అపరాధులను మాత్రం వారి పాపాలను గురించి అడగటం జరగదు.

**28. అల్ ఖసస్** 79 - 80 ఒకనాడు అతడు తన జాతి ముందు తన పూర్తి వైభవంతో ప్రత్యక్షమయ్యాడు. ఐహిక జీవితం పట్ల వ్యామోహం కలవారు అతణ్ణి చూచి ఇలా అన్నారు , ''ఖారూన్‌కు ఇవ్వబడిరది మాకూ లభిస్తే ఎంత బాగుండును. అతడు చాలా అదృష్టవంతుడు.'' కాని జ్ఞాన సంపన్నులు ఇలా అన్నారు, ''అయ్యో దౌర్భాగ్యులారా! అల్లాహ్ ఇచ్చే ప్రతిఫలమే విశ్వసించి మంచి పనులు చేసే వ్యక్తికి శ్రేష్ఠమైనది. ఈ మహాభాగ్యం సహనం చూపే వారికి తప్ప మరెవరికీ దొరకదు.''

**28. అల్ ఖసస్** 81 - 82 చివరకు మేము అతన్నీ అతని గృహాన్నీ , భూమిలోనికి అణగ ద్రొక్కాము. తరువాత అల్లాహ్ కు వ్యతిరేకంగా, అతనికి సహాయం చేయటానికి ముందుకు వచ్చే అతని మద్దతుదారుల వర్గం ఏదీ లేదు. స్వయంగా అతను కూడా తనకు తాను సహాయం చేసుకోలేకపోయాడు. నిన్న అతని అంతస్తు కోసం ఉవ్విళ్లూరిన వారే ఇప్పుడు ఇలా అంటున్నారు ,''అయ్యో, మా దౌర్భాగ్యం! మేము మరచే పోయాము , అల్లాహ్ తన ఇష్టప్రకారం తన దాసులలో కొందరి జీవనోపాధిని విస్తరింపజేస్తాడు అని , మరికొందరికి ఆచితూచి ఇస్తాడని. అల్లాహ్ మాపై దయచూపి ఉండకపోతే , మమ్మల్నీ కూడా భూమి లోనికి అణగద్రొక్కి ఉండేవాడే. అయ్యో , మా దౌర్భాగ్యం! అవిశ్వాసులు సాఫల్యం పొందరని మాకు జ్ఞాపకమే లేదు.''

**28. అల్ ఖసస్** 83 - 84 ఇక , పరలోకంలోని గృహాన్ని మేము భూమిపై తమ పెద్దరికాన్ని కోరుకోనివారికీ , కల్లోలాన్ని సృష్టించగోరని వారికీ ప్రత్యేకించి ఉంచుతాము. మేలైన పరిణామం మాత్రం భయభక్తులు కలవారికే. మంచిని తెచ్చే వాడికి దానికంటే మేలైన మంచి లభిస్తుంది. ఇక చెడును తెచ్చేవారి విషయం చెడు పనులు చేసేవారికి వారు చేసిన దాని ప్రకారమే ప్రతిఫలం లభిస్తుంది.

**28. అల్ ఖసస్** 85 - 88 ప్రవక్తా! నీపై ఈ ఖురానును విధించినవాడు, నిన్ను ఒక ఉత్తమ మైన ముగింపునకు చేర్చనున్నాడని విశ్వసించు. వారితో ఇలా అను , ''నా ప్రభువునకు బాగా తెలుసు , ఎవడు సన్మార్గం తీసుకువచ్చాడో, ఎవడు స్పష్టమైన మార్గభ్రష్టత్వానికి లోనయ్యాడో. '' నీపై గ్రంథం అవతరింప చేయబడు తుందనే విషయాన్ని నీవు ఏమాత్రం ఆశించలేదు. ఇది కేవలం నీ ప్రభువు కారుణ్యం వల్లనే (నీపై అవతరించింది). కనుక నీవు అవిశ్వాసులకు సహాయకుడవు కాకూడదు. అల్లాహ్ వాక్యాలు నీపై అవతరించినప్పుడు , అవిశ్వాసులు నిన్ను వాటి నుండి పెడొలగించటం అనేది ఎన్నటికీ జరగకూడదు. నీ ప్రభువు వైపునకు ఆహ్వానించు. బహుదైవారాధకులలో ఎంతమాత్రం చేరిపోకు. అల్లాహ్తో పాటు ఏ ఇతర దేవుణ్ణి వేడుకోకు. ఆయన తప్ప మరొక ఆరాధ్యు డెవ్వడూ లేడు. ఒక్క ఆయన ఉనికి తప్ప ప్రతిదీ నశించేదే. విశ్వసామ్రాజ్యాధి కారం ఆయనదే ఆయన వైపునకే మీరంతా మరలింపబడతారు.

**29. అల్ అన్ కబూత్**

ఆయతులు : 69 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**29. అల్ అన్ కబూత్** 1 - 3 అలిఫ్, లామ్, మీమ్. కేవలం ''మేము విశ్వసించాము'' అని అన్నంత మాత్రాన్నే వారిని వదలివేయటం జరుగుతుందనీ, వారిని పరీక్షించటం జరగదనీ ప్రజలు భావిస్తున్నారా ? వాస్తవానికి మేము వారికి పూర్వం గతించిన వారందరినీ పరీక్షించాము, అల్లాహ్ కు సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా చూడవలసి ఉన్నది.

**29. అల్ అన్ కబూత్** 4 చెడు చేష్టలు చేస్తున్నవారు మమ్మల్ని మీరి పోగలమని అనుకుంటున్నారా ? వారి నిర్ణయం చాలా తప్పుడు నిర్ణయం.

**29. అల్ అన్ కబూత్** 5 - 7 ఎవడైనా అల్లాహ్ ను కలిసే ఆశను కలిగి ఉంటే , (అతడు తెలుసు కోవాలి) అల్లాహ్ నిర్ణయించిన సమయం త్వరలోనే రానున్నదనీ , అల్లాహ్ అన్నీ వింటాడనీ , అన్నీ ఎరుగుననీ. ఏ వ్యక్తి అయినా అల్లాహ్ మార్గంలో తీవ్రంగా పరిశ్రమిస్తే అతడు తన మేలు కొరకే అలా చేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ సకల లోకాలలోని వారి అక్కర ఎంతమాత్రం లేనివాడు. విశ్వసించి మంచి పనులు చేసేవారి పాపాలను మేము వారినుండి తొలగిస్తాము, వారికి తాము చేసిన ఉత్తమ కర్మలకు ప్రతిఫలం ఇస్తాము.

**29. అల్ అన్ కబూత్** 8 - 9 తన తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగుమని మేము మానవునికి ఉపదేశించాము. కాని ఒకవేళ వారు నా భాగస్వామిగా నీవు ఎరుగని వానిని (ఆరాధ్యుణ్ణి) నాకు భాగస్వామిగా చేయమని నిన్ను బలవంతపెడితే , అప్పుడు వారి యెడల విధేయత చూపకు. నా వైపునకే మీరందరూ మరలిరావలసి ఉంది. అప్పుడు నేను మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో మీకు తెలియజేస్తాము. ఎవరైనా విశ్వసించి మంచిపనులు చేసి ఉన్నట్లయితే, వారిని మేము తప్పకుండా సజ్జనులలో కలుపుతాము.

**29. అల్ అన్ కబూత్** 10 - 11 ప్రజలలో, ''మేము అల్లాహ్ ను విశ్వసించాము'' అని అనే వ్యక్తి ఒకడు ఉన్నాడు, కాని అతడు అల్లాహ్ మార్గంలో హింసించబడినప్పుడు , లోకులు పెట్టిన పరీక్షను అల్లాహ్ విధించిన శిక్షగా భావిస్తాడు, ఇప్పుడు ఒకవేళ నీ ప్రభువు తరఫు నుండి సహాయం , విజయం వచ్చినట్లయితే, ఈ వ్యక్తియే, ''మేము మీతోనే ఉన్నాము'' అని అంటాడు. భూలోకవాసుల హృద యాల స్థితి అల్లాహ్ కు బాగా తెలియదా ? అల్లాహ్ కు విశ్వాసులెవరో, కపటు లెవరో తప్పనిసరిగా చూడవలసి ఉంది.

**29. అల్ అన్ కబూత్** 12 - 13 ఈ అవిశ్వాసులు విశ్వాసులతో , ''మీరు మా విధానాన్ని అనుస రించండి. అప్పుడు మేము మీ పాపాలను మాపైన వేసుకుంటాము '' అని అంటారు. నిజానికి వారు వారి పాపాలలోని ఏ

పాపాన్నీ తమపై వేసుకోరు. వారు పూర్తిగా అబద్ధం చెపుతున్నారు , ఔను, వారు తప్పకుండా తమ బరువు లనూ మోస్తారు, తమ బరువులతో పాటు అనేక ఇతర బరువులను కూడా మోస్తారు. ప్రళయంనాడు నిశ్చయంగా వారిని వారి అభూత కల్పనలను గురించి అడగటం జరుగుతుంది.

**29. అల్ అన్ కబూత్** 14 - 15 మేము నూహ్ ను అతని జాతి వైపునకు పంపాము. అతను వారి మధ్య యాభై తక్కువ వేయి సంవత్సరాల వరకు ఉన్నాడు. చివరకు తుఫాను వచ్చి వారు దుర్మార్గులుగా ఉన్న స్థితిలో వారిని చుట్టుముట్టింది. తరువాత నూహ్ను , నావలోని వారినీ మేము రక్షించాము , దానిని మేము ప్రపంచ వాసులకు ఒక గుణపాఠం వంటి సూచనగా చేశాము.

**29. అల్ అన్ కబూత్** 16 - 18 ఇబ్రాహీమ్‌ను పంపాము, అప్పుడు అతను తన జాతివారితో ఇలా అన్నాడు , ''అల్లాహ్ ను ఆరాధించండి , ఆయనకు భయపడండి. మీరు అర్థం చేసుకుంటే , ఇదే మీకు మేలైనది. అల్లాహ్ ను కాకుండా మీరు పూజిస్తూ ఉన్నవి కేవలం విగ్రహాలు మాత్రమే. మీరు ఒక అభూత కల్పన చేస్తున్నారు. యథార్థానికి అల్లాహ్ ను కాదని మీరు పూజిస్తున్నవి మీకు ఏ ఉపాధినీ ఇచ్చే అధికారం కలిగి లేవు, ఉపాధి కొరకు అల్లాహ్ ను అడగండి , ఆయనకే దాస్యం చేయండి , ఆయనకు కృతజ్ఞతలు తెలుపండి. ఆయన వైపునకే మీరు మరలింపబడతారు. ఒకవేళ మీరు తిరస్కరిస్తే , మీకు పూర్వం ఎన్నో జాతులు తిరస్కరించాయి. స్పష్టంగా సందేశాన్ని అందజేయటం తప్ప దైవప్రవక్తపై మరొక బాధ్యత ఏదీ లేదు.''

**29. అల్ అన్ కబూత్** 19 - 23 అల్లాహ్ ఏ విధంగా సృష్టిని ప్రారంభిస్తాడో తిరిగి దాని పున్ణసృష్టి ఎలా చేస్తాడో వారు ఎన్నడూ గమనించలేదా ? నిశ్చయంగా ఇది (పున్ణసృష్టి) అల్లాహ్ కు ఎంతో సులువైనది. వారితో ఇలా అను , ''భూమిపై తిరగండి , ఆయన, సృష్టిని ఏ విధంగా ప్రారంభించాడో చూడండి. అల్లాహ్ పునరుజ్జీవ నాన్ని కూడా ప్రసాదిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు. ఆయన తనకు ఇష్టమైన వారిని శిక్షిస్తాడు , తనకు ఇష్టమైన వారిని కరుణిస్తాడు. ఆయన వైపునకే మీరు మరలింపబడతారు. మీరు (ఆయనను) భూమిలోనూ లొంగదీయలేరు, ఆకాశంలోనూ లొంగదీయలేరు. అల్లాహ్ నుండి రక్షించ డానికి మీకు ఏ సంరక్షకుడూ లేడు , ఏ సహాయకుడూ లేడు. అల్లాహ్ ఆయతు లనూ , ఆయన సందర్శనాన్నీ తిరస్కరించిన వారు నా కరుణపట్ల నిరాశ చెందుతారు, వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది.

**29. అల్ అన్ కబూత్** 24 - 27 ఇబ్రాహీమ్ జాతివారు ఇలా సమాధానం పలకటం తప్ప మరొక విషయమేదీ అనలేదు, ''ఇతనిని చంపండి, లేదా కాల్చివేయండి.'' చివరకు అల్లాహ్ అతనిని అగ్ని జ్వాలల నుండి రక్షించాడు. నిశ్చయంగా విశ్వాసులకు ఇందులో సూచనలు ఉన్నాయి. అతను ఇలా అన్నాడు , ''మీరు ప్రపంచ జీవితంలో అల్లాహ్ ను కాదని విగ్రహాలను మీ మధ్య , ప్రేమకు సాధనంగా చేసుకున్నారు , కాని ప్రళయం నాడు మీరు ఒకరినొకరు తిరస్కరించుకుంటారు , ఒకరి నొకరు శపించుకుంటారు. అగ్ని మీ నివాసస్థలమవుతుంది , మీకు

సహాయం చేసేవాడెవ్వడూ ఉండడు.'' అప్పుడు లూత్ అతనిని విశ్వసించాడు. ఇబ్రాహీమ్ ఇలా అన్నాడు , ''నేను నా ప్రభువు వైపునకు వలసపోతాను. ఆయన సర్వశక్తిమంతుడు, మహావివేకవంతుడు.'' మేము అతనికి ఇస్హాఖ్, యాఖూబ్ (వంటి సంతానం)లను ప్రసాదించాము అతని వంశంలో ప్రవక్త పదవినీ , గ్రంథాన్నీ ఉంచాము. ప్రపంచంలో అతనికి అతని ప్రతిఫలం ఇచ్చాము. పరలోకంలో అతను నిశ్చయంగా సజ్జనులలో చేర్చుకోబడతాడు.

**29. అల్ అస్ కబూత్** 28 - 30 మేము లూత్‌ను పంపాము అప్పుడు అతను తన జాతివారితో ఇలా అన్నాడు , ''మీకు పూర్వం ప్రపంచ మానవులలో ఎవ్వరూ చేయని అశ్లీల కార్యాన్ని మీరు చేస్తున్నారు , ఇదేమిటి, మీరు పురుషుల వద్దకుపోతారు, దారి దోపిడీలు చేస్తారు.మీ సభలో అసభ్యకరమైన పనులు చేస్తారు ?'' అప్పుడు అతని జాతివారు ఇలా సమాధానం ఇవ్వటం తప్ప మరొక విషయమేదీ పలుకలేదు. ''నీవు నిజాయితీపరుడవే అయితే, తీసుకురా అల్లాహ్ శిక్షను.'' లూత్ ఇలా అన్నాడు, ''నా ప్రభూ! ఈ దుష్టులకు వ్యతిరేకంగా నాకు సహాయ పడు.''

**29. అల్ అస్ కబూత్** 31 - 32 మా దూతలు ఇబ్రాహీమ్ వద్దకు శుభవార్తను తీసుకువెళ్ళినప్పుడు , అతనితో వారు ఇలా అన్నారు , ''మేము ఈ పట్టణవాసులను నాశనం చేయ బోతున్నాము. దాని ప్రజలు పరమ దుర్మార్గులైపోయారు.'' ఇబ్రాహీమ్, ''అక్కడ లూత్ ఉన్నాడు కదా!'' అని అన్నాడు. వారు ఇలా అన్నారు, ''అక్కడ ఎవరె వరున్నారో మాకు బాగా తెలుసు. అతని భార్యను తప్ప, అతనినీ, మిగిలిన అతని ఇంటిల్లిపాదినీ రక్షిస్తాము.'' అతని భార్య వెనుక ఉండిపోయేవారిలో ఉండిపోయింది.

**29. అల్ అస్ కబూత్** 33 - 35 తరువాత మా దూతలు లూత్ వద్దకు వెళ్లినప్పుడు , వారి రాకను చూచి అతను ఎంతో ఆందోళన చెందాడు, మనస్సులో కుమిలిపోయాడు. వారు ఇలా అన్నారు, ''భయపడకు, బాధపడకు, మేము నిన్నూ నీ ఇంటివారినీ రక్షిస్తాము, ఒక్క నీ భార్యను తప్ప. ఆమె వెనుక ఉండిపోయేవారిలోనిది. మేము ఈ పట్టణ వాసులపై ఆకాశం నుండి శిక్షను అవతరింపజేయ బోతున్నాము. వారు చేస్తూ వచ్చిన ఘోర పాతకం కారణంగా. '' మేము ఆ పట్టణానికి చెందిన ఒక స్పష్టమైన సూచనను వదలిపెట్టాము. బుద్ధి విజ్ఞతలను ఉపయోగించే ప్రజలకొరకు.

**29. అల్ అస్ కబూత్** 36 - 37 మద్యన్ వైపునకు మేము వారి సోదరుడు షుఐబ్‌ను పంపాము. అతను ఇలా అన్నాడు, ''నా జాతి ప్రజలారా! అల్లాహ్ కు దాస్యం చేయండి. అంతిమ దినము కొరకు ఎదురు చూడండి. దుర్మార్గులై భూమిపై అత్యాచారాలు చేస్తూ తిరగకండి. '' కాని, వారు అతనిని తిరస్కరించారు. చివరకు ఒక తీవ్ర మైన భూకంపం వారిని పట్టుకుంది వారు తమ ఇళ్ళల్లో ఎక్కడ పడిపోయిన వారు అక్కడనే ఉండిపోయారు.

**29. అల్ అస్ కబూత్** 38 - 40 ఆద్ , సమూద్ జాతులను మేము నాశనం చేశాము. వారు నివసించిన ప్రదేశాలను నీవు చూసే ఉన్నావు. వారి పనులను షైతాను వారి కొరకు చక్కనివిగా తీర్చిదిద్దాడు వారిని సన్మార్గం

నుండి తప్పించాడు. వాస్తవా నికి వారు తెలివిగలవారే. ఖారూన్ , ఫిరౌన్, హామాన్‌లను మేము నాశనం చేశాము. మూసా వారి వద్దకు స్పష్టమైన సూచనలతో వచ్చాడు. కాని వారు తమ పెద్దరికం గురించి విర్రవీగారు. యథార్థానికి వారు మమ్మల్ని దాటి పోగలిగే వారేమీ కాదు. చివరికి ప్రతివాణ్ణీ మేము అతని పాపానికిగాను పట్టుకున్నాము. తరువాత వారిలోని కొందరిపైకి మేము రాళ్లు విసిరే పెనుగాలిని పంపాము , మరికొందరిని ఒక భయంకరమైన ప్రేలుడు కబళిం చింది , ఇంకా కొందరిని మేము భూమిలో కూరుకుపోయేలా చేశాము. మరికొందరిని ముంచివేశాము. అల్లాహ్ వారికి అన్యాయం చేయలేదు, వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు.

**29. అల్ అన్ కబూత్** 41 - 44 అల్లాహ్ ను కాదని ఇతరులను సంరక్షకులుగా చేసుకున్నవారు సాలె పురుగును పోలి ఉన్నారు. అది తన కొరకు ఒక ఇల్లు కట్టుకుంటుంది. అన్ని ఇళ్ళకంటే అతి బలహీనమైన ఇల్లు సాలెపురుగు ఇల్లే అవుతుంది. అయ్యో! వారికి ఈ విషయం తెలిస్తే ఎంత బాగుంటుంది! వారు అల్లాహ్ ను కాదని దేనిని వేడుకున్నా, అల్లాహ్ దానిని బాగా ఎరుగును. ఆయనే సర్వ శక్తిమంతుడు , వివేచనాపరుడునూ. మేము ఈ దృష్టాంతాలను ప్రజల అవగాహన నిమిత్తం వివరిస్తాము. కాని జ్ఞానసంపన్నులే వాటిని అర్థం చేసు కుంటారు. అల్లాహ్ ఆకాశాలనూ, భూమినీ సత్యంతో సృష్టించాడు. యథార్థం గానే విశ్వాసులకు ఇందులో ఒక సూచన ఉంది.

**29. అల్ అన్ కబూత్** 45 (ప్రవక్తా!) వహీ ద్వారా నీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని పారాయణం చెయ్యి , నమాజును స్థాపించు నిశ్చయంగా నమాజు అశ్లీల కార్యాల నుండి , చెడు పనుల నుండి నిరోధిస్తుంది. అల్లాహ్ సంస్మరణ దీనికంటె కూడా చాలా గొప్ప విషయం, నీవు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు.

**29. అల్ అన్ కబూత్** 46 - 47 గ్రంథ ప్రజలతో వాదించకు , ఉత్తమమైన రీతిలో తప్ప - అయితే వారిలోని దుర్మార్గులతో మాత్రం కాదు - వారితో ఇలా అను , ''మేము మా వద్దకు పంపబడిన దానినీ విశ్వసించాము , మీ వద్దకు పంపబడిన దానినీ విశ్వసించాము. మా దేవుడూ , మీ దేవుడూ ఒక్కడే, మేము ఆయనకే విధే యులం.'' (ఓ ప్రవక్తా!) ఇదే విధంగా మేము నీపై గ్రంథాన్ని అవతరింప జేశాము. అందువల్ల పూర్వం మేము గ్రంథాన్ని ఇచ్చినవారు దీనిని విశ్వసిస్తారు. ఈ ప్రజలలోని వారు కూడ చాలామంది దీనిని విశ్వసిస్తున్నారు. మా ఆయతు లను కేవలం అవిశ్వాసులు మాత్రమే తిరస్కరిస్తారు.

**29. అల్ అన్ కబూత్** 48 - 52 (ప్రవక్తా!) నీవు ఇంతకు పూర్వం ఏ గ్రంథాన్నీ చదివేవాడవు కావు నీ చేతితో వ్రాసేవాడవూ కావు. ఒకవేళ అలా జరిగి ఉంటే , అసత్య వాదులు అనుమానానికి లోనై ఉండేవారు. అసలు ఇవి జ్ఞానం ప్రసాదించబడిన వారి హృదయాలకు స్పష్టమైన సూచనలు. మా ఆయతులను దుర్మార్గపు ప్రజలు తప్ప మరెవ్వరూ తిరస్కరించరు. వారు ఇలా అంటారు , ''ఇతని ప్రభువు తరఫు నుండి ఇతనిపై సూచనలు ఎందుకు దించబడలేదు?'' ఇలా అను , ''సూచనలు అల్లాహ్ వద్ద ఉన్నాయి. నేను కేవలం స్పష్టంగా హెచ్చరించే వాణ్ణి మాత్రమే.'' మేము నీపై అవతరింపజేసిన గ్రంథం వారి ముందు చదివి వినిపించబడుతోంది - ఇది (ఈ సూచన)

వారికొరకు సరిపోదా? వాస్తవానికి ఇందులో కారుణ్యం ఉన్నది. విశ్వాసులకు హితబోధ ఉన్నది. (ప్రవక్తా!) ఇలా అను, ''నాకూ మీకూ మధ్య సాక్షిగా అల్లాహ్ యే సరిపోతాడు. ఆయన ఆకాశాలలోనూ , భూమిలోనూ ఉన్న సమస్తాన్నీ ఎరిగినవాడు, అసత్యాన్ని విశ్వసించి, అల్లాహ్ ను తిరస్కరించేవారే అసలు నష్టానికి గురి అయ్యేవారు.

**29. అల్ అన్ కబూత్** 53 - 55 వారు, శిక్షను త్వరగా తీసుకురావాలని నిన్ను కోరుతున్నారు. సమయం ఒకటి నిర్ణయమై ఉండకపోతే, వారి మీదకు శిక్ష ఎప్పుడో వచ్చిపడి ఉండేది. నిశ్చయంగా (సమయం రాగానే) ఆ శిక్ష వచ్చి తీరుతుంది, అకస్మా త్తుగా వస్తుంది , వారికి ఏమాత్రం తెలియని స్థితిలో వస్తుంది , వారు శిక్షను త్వరగా తీసుకురమ్మని కోరుతున్నారు. వాస్తవానికి ఈ అవిశ్వాసులను నరకం ఎప్పుడో చుట్టుముట్టింది. ఆ రోజున (వారికి ఈ విషయం తెలిసిపోతుంది) అప్పుడు శిక్ష వారిని పైనుండి కూడా కప్పివేస్తుంది , పాదాల క్రిందనుంచి కూడా కప్పివేస్తుంది ''ఇక రుచిచూడండి మీరు చేసిన చేష్టలకు'' అని అంటుంది.

**29. అల్ అన్ కబూత్** 56 - 60 విశ్వసించిన నా దాసులారా! నా భూమి విశాలమైనది. కనుక మీరు నన్ను మాత్రమే ఆరాధించండి. ప్రతి ప్రాణి మరణాన్ని రుచి చూడవలసి ఉన్నది. తరువాత మీరందరూ మా వైపునకే మరలింపబడతారు, విశ్వసించి మంచి పనులు చేసేవారిని మేము స్వర్గంలోని ఎత్తైన భవనాలలో ఉంచుతాము, వాటి క్రింద సెలయేళ్లు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడనే వారు శాశ్వతంగా ఉంటారు. ఎంతమంచి ప్రతిఫలం - ఆచరించేవారికి, సహనం వహించిన వారికి , ఇంకా తమ ప్రభువునే నమ్ముకునే వారికి. తమ ఆహారాన్ని మోసుకుంటూ తిరగని జంతువులు ఎన్నో ఉన్నాయి. అల్లాహ్ వాటికి ఉపాధిని సమకూరుస్తాడు, మీ ఉపాధి ప్రదాత కూడా ఆయనే. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగినవాడూను.

**29. అల్ అన్ కబూత్** 61 - 63 భూమినీ, ఆకాశాలనూ ఎవడు సృష్టించాడు, చంద్రుణ్ణీ, సూర్యుణ్ణీ ఎవడు అదుపులో ఉంచాడు, అని నీవు వారిని అడిగితే , అప్పుడు వారు ''అల్లాహ్'' అని అంటారు. అయితే వారు ఎలా మోసపోతున్నారు? తన దాసులలో తనకు ఇష్టమైన వారి ఉపాధిని విస్తరింపజేసేవాడూ , తనకు ఇష్టమైన వారి ఉపాధిని పరిమితపరిచేవాడూ అల్లాహ్ మాత్రమే. నిశ్చయంగా అల్లాహ్ ప్రతి విషయాన్నీ ఎరిగినవాడు. ఇంకా నీవు వారిని, ''ఆకాశం నుండి ఎవడు వర్షాన్ని కురిపించాడు , దాని ద్వారా మృతభూమిని ఎవడు బ్రతికించాడు '' అని అడిగితే అప్పుడు వారు , ''అల్లాహ్'' అని తప్పకుండా అంటారు. ''అల్ హమ్దులిల్లాహ్ '' (అల్లాహ్ యే స్తుతింపదగినవాడు) అని అను. కాని వారిలో చాలామంది అర్థం చేసుకోరు.

**29. అల్ అన్ కబూత్** 64 - 69 ఈ ప్రాపంచిక జీవితం ఒక క్రీడ , ఒక వినోదం తప్ప మరేమీకాదు, అసలు జీవన గృహం పరలోక గృహమే. అయ్యో! వారు (ఈ విషయాన్ని) తెలుసుకుంటే ఎంత బాగుంటుంది. వారు పడవలోకి ఎక్కినపుడు తమ ధర్మాన్ని అల్లాహ్కు ప్రత్యేకించుకుని ఆయన్ని వేడుకుంటారు. తరువాత ఆయన వారిని రక్షించి నేలపైకి తీసుకురాగానే , అకస్మాత్తుగా వారు బహుదైవారాధన చేయటం ప్రారంభిస్తారు అల్లాహ్ కలుగజేసిన

విముక్తికి కృతఘ్నుత చూపటానికి, (ప్రాపం చిక జీవితపు) భోగాలను అనుభవించటానికి. మంచిది, త్వరలోనే వారికి తెలిసిపోతుంది. వారు ఈ విషయాన్ని చూడటం లేదా మేము శాంతి నిలయ మైన ఒక హరమ్‌ను నెలకొల్పాము. వాస్తవానికి వారి చుట్టుప్రక్కల ఉన్న ప్రజలు మాయం చేయబడుతున్నారు. అయినా వారు అసత్యాన్నే విశ్వసిస్తారా? అల్లాహ్ కానుకలను తిరస్కరిస్తారా ? అల్లాహ్ కు అబద్ధం ఆపాదించేవాణ్ణి , సత్యం తన ముందుకు వచ్చిన తరువాత కూడా దానిని తిరస్కరించేవాణ్ణి మించిన దుర్మార్గుడెవడు ? అటువంటి అవిశ్వాసుల నివాసం నరకం కాదా? మా కొరకు తీవ్రప్రయత్నం చేసేవారికి మేము మా మార్గాలను చూపుతాము , నిశ్చయంగా అల్లాహ్ సజ్జనులతో పాటే ఉంటాడు.

**30. అర్ రూమ్**

ఆయతులు : 60 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**30. అర్ రూమ్** 1 - 6 అలిఫ్. లామ్. మీమ్. రోమన్ ప్రజలు పొరుగు భూభాగంలో పరాజితు లయ్యారు తమ ఈ పరాజయం తరువాత కొన్ని సంవత్సరాలలోనే వారు విజేతలవుతారు. ముందయినా తరువాత అయినా అధికారం మట్టుకు అల్లాహ్దే. ఆ రోజున అల్లాహ్ ప్రసాదించిన విజయానికి విశ్వాసులు వేడుకలు జరుపుకుంటారు. అల్లాహ్ తనకు ఇష్టమైన వారికి సహాయపడతాడు. అల్లాహ్ అత్యంత శక్తిమంతుడు మరియు అనంతకరుణామయుడు, ఈ వాగ్దానం అల్లాహ్ చేసిన వాగ్దానం. అల్లాహ్ ఎన్నడూ తన వాగ్దానాన్ని భంగపరచడు. కాని ఈ విషయాన్ని చాలామంది ఎరుగరు.

**30. అర్ రూమ్** 7 - 10 ప్రజలు ప్రాపంచిక జీవితపు బాహ్యరూపాన్ని మాత్రమే ఎరుగుదురు పరలోకం గురించి స్వయంగా వారే ఉపేక్షాభావంతో ఉన్నారు. వారు తమను గురించి తాము ఎన్నడూ ఆలోచించలేదా ? అల్లాహ్ భూమినీ, ఆకాశాలనూ, వాటి మధ్య ఉన్న సమస్త వస్తువులనూ సత్యంతో , ఒక నిర్ణీత గడువు వరకు మాత్రమే సృష్టించాడు. కాని చాలామంది తమ ప్రభువుతో సమావేశం కావలసి ఉన్నది అనే విషయాన్ని తిరస్కరిస్తున్నారు. వారు భూమిపై ఎన్నడూ ప్రయాణం చేసి ఉండలేదా ? తమకు పూర్వం గతించిన ప్రజల ముగింపును వారు చూడగలందులకు? వారు (పూర్వీకులు) వీరికంటే ఎక్కువ బలవంతులు. వారు భూమిని బాగా త్రవ్వారు. వారు దానిని వీరు చేసిన దానికంటే ఎక్కువగా వసింపచేశారు. వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన సూచనలు తీసుకుని వచ్చారు. ఇంకా అల్లాహ్ వారికి అన్యాయం చేసేవాడు కాదు , కాని స్వయంగా వారే తమకు తాము అన్యాయం చేసుకుంటూ ఉండినారు. చివరకు చెడు పనులు చేసిన వారి ముగింపు చాలా చెడ్డగా జరిగింది. ఎందుకంటే, వారు అల్లాహ్ వాక్యాలను తిరస్కరించారు వాటిని ఎగతాళి చేశారు.

**30. అర్ రూమ్** 11 - 16 అల్లాహ్ యే సృష్టిని ప్రారంభిస్తాడు, ఆయనే దానిని తిరిగి సృష్టిస్తాడు, తరువాత ఆయన వైపునకే మీరు మరలింపబడతారు. ఆ గడియ నెలకొన్ననాడు , అపరాధులు దిగ్భ్రమకు లోనవుతారు , వారు అల్లాహ్ కు భాగస్వాములుగా నిలబెట్టినవారెవరూ వారిని గురించి సిఫారసు చేయరు. అప్పుడు వారు తాము కల్పించుకున్న దైవాలను సైతం తిరస్కరిస్తారు. ఆ గడియ నెలకొన్న రోజున (మానవులందరూ) విభిన్న వర్గాలుగా చీలిపోతారు. విశ్వసించి మంచి పనులు చేసినవారు ఒక ఉద్యానవనంలో సుఖంగా సంతోషంగా ఉంచబడతారు, కాని విశ్వసించనివారు మా వాక్యాలనూ, పరలోక సమావేశాన్నీ నిరాకరించిన వారు శిక్షలోనే ఉంచబడతారు.

**30. అర్ రూమ్** 17 - 19 కనుక నీవు అల్లాహ్ పరిశుద్ధతను కొనియాడు , సాయంత్రం అయినపుడు, ఉదయం అయినపుడు, ఆకాశాలలోనూ, భూమిలోనూ ఆయనే స్తుతింపదగినవాడు , మధ్యాహ్నం అయినపుడు సూర్యాస్తమయం అయినప్పుడు (ఆయనను స్తుతించు). ఆయన జీవిని నిర్జీవి నుండి వెలికి తీస్తాడు , నిర్జీవిని జీవి నుండి వెలికి తీసుకువస్తాడు. భూమి మృతి చెందిన తరువాత దానికి ప్రాణం పోస్తాడు. ఇలానే నీవు కూడా (మరణావస్థ నుండి) వెలికి తీయ బడతావు.

**30. అర్ రూమ్** 20 ఆయన సూచనలలో ఒకటి ఏమిటంటే ఆయన మిమ్మల్ని మట్టితో సృష్టించాడు. తరువాత అకస్మాత్తుగా మీరు మానవులయ్యారు. (భూమిపై) వ్యాపిస్తూ ఉన్నారు.

**30. అర్ రూమ్** 21 ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు- మీరు వారివద్ద శాంతిని పొందటానికి , మీ మధ్య ప్రేమనూ , కారుణ్యాన్నీ సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.

**30. అర్ రూమ్** 22 ఆయన సూచనలలో , ఆకాశాలనూ, భూమినీ సృష్టించటమూ , మీ భాషల , మీ రంగుల వైవిధ్యాలూ ఉన్నాయి. నిశ్చయంగా విజ్ఞులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.

**30. అర్ రూమ్** 23 ఆయన సూచనలలో రాత్రి , పగలు, మీరు నిద్రపోవటం , మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటం కూడా ఉన్నాయి. నిశ్చయంగా, (శ్రద్ధగా) వినే వారికి ఇందులో చాలా సూచనలు ఉన్నాయి.

**30. అర్ రూమ్** 24 ఇంకా ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే ఆయన మీకు మెరుపు తళతళలను చూపిస్తాడు, భయాన్ని కలిగిస్తూనూ, ఆశను రేకెత్తిస్తూనూ, ఆకాశం నుండి నీటిని కురిపిస్తున్నాడు , తరువాత దాని ద్వారా భూమికి , దాని మరణా నంతరం జీవితాన్ని ప్రసాదిస్తున్నాడు , నిశ్చయంగా ఇందులో తెలివిని వినియో గించుకునే వారికి ఎన్నో సూచనలు ఉన్నాయి.

**30. అర్ రూమ్** 25 - 27 ఆయన సూచనలలో ఇంకొకటి ఏమిటంటే, ఆకాశమూ, భూమీ ఆయన ఆజ్ఞ మూలంగానే సుస్థిరంగా ఉన్నాయి. తరువాత ఆయన మిమ్మల్ని భూమి నుండి రమ్మని పిలిచినంతనే , కేవలం ఒకే ఒక పిలుపునకు మీరు అకస్మాత్తుగా బయటికి వచ్చేస్తారు , ఆకాశాలలో, భూమిపై ఉన్న వారెవరైనా ఆయన దాసులే. అందరూ ఆయన ఆజ్ఞకే కట్టుబడి ఉన్నారు. ఆయనే సృష్టిని ప్రారంభిస్తాడు. ఆయనే దానిని మళ్లీ సృష్టిస్తాడు. ఇది ఆయనకు సులభతరం. ఆకాశాలలోనూ , భూమిపైనా ఆయన గుణగణాలు సర్వోన్నతమైనవి , ఆయన శక్తిమంతుడు, వివేకవంతుడూను.

**30. అర్ రూమ్** 28 - 29 ఆయన మీకు స్వయంగా మీకే చెందిన ఒక ఉపమానాన్ని ఇస్తు న్నాడు. మీ అధీనంలో ఉన్న బానిసలలో కొందరు మేము మీకు ఇచ్చిన సిరి సంపదలలో మీతోపాటు సమానమైన భాగ స్వాములుగా ఉన్నవారూ, మీరు పరస్పరం మీ సమానులకు భయపడేవిధంగా, మీరు భయపడేటటువంటి వారు వారిలో ఎవరైనా ఉన్నారా?- ఈవిధంగా బుద్ధి కుశలత కలవారికి మేము సూచనలను స్పష్టంగా వివరిస్తాము. కాని ఈ దుర్మార్గులు జ్ఞానం లేకుండానే తమ భ్రమలవెంట పడ్డారు.అల్లాహ్ అపమార్గం పట్టించిన వ్యక్తికి మార్గం చూపగలవాడెవడు ? అటువంటి వారికి సాయపడేవాడెవడూ ఉండడు.

**30. అర్ రూమ్** 30 - 32 కనుక (ప్రవక్తా! ప్రవక్త యొక్క అనుచరులారా!) ఏకాగ్రచిత్తంతో మీ ముఖాన్ని ఈ ధర్మం దిశలో స్థిరంగా నిలపండి. అల్లాహ్ మానవులను ఏ స్వభావం ఆధారంగా సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి. అల్లాహ్ సృజిం చిన స్వరూప స్వభావాలు మార్చటానికి శక్యం కానివి , ఇదే సవ్యమైన, తిన్నని ధర్మమార్గం, కాని చాలామందికి తెలియదు. (స్థిరముగా ఉండండి ఈ విషయంలో) అల్లాహ్ వైపునకు మరలుతూ ఆయనకు భయపడండి, నమాజును స్థాపించండి , తమ ధర్మాన్ని వేర్వేరుగా రూపొందించుకున్న మరియు వర్గాలుగా చీలిపోయిన ముష్రిక్కులలో కలసిపోవకండి. ప్రతి వర్గమూ తన వద్ద ఉన్న దానితోనే ఆనందపడుతున్నది.

**30. అర్ రూమ్** 33 - 35 మానవుల స్థితి ఎలాంటిదంటే , వారికి ఏదైనా కష్టం కలిగినపుడు , వారు తమ ప్రభువు వైపునకు మరలి ఆయనకు మొరపెట్టుకుంటారు. తరువాత ఆయన తన కారుణ్యపు మాధుర్యాన్ని కొంచెం వారికి రుచి చూపిస్తే అపుడు వారిలో కొందరు వెంటనే షిర్కు చేయటం ప్రారంభిస్తారు , మేము చేసిన ఉపకారానికి కృతఘ్నత చూపటానికిగాను. సరే , మంచిది, సుఖాలు అనుభవించండి , త్వరలోనే మీకు తెలిసిపోతుంది. వారు చేస్తూ ఉన్న షిర్కు యొక్క సత్యతకు సాక్ష్యం పలికే ఏదైనా నిదర్శనాన్ని గానీ , ప్రమాణాన్ని గానీ మేము వారిపై అవతరింపజేశామా?

**30. అర్ రూమ్** 36 - 39 మేము మానవులకు కారుణ్యపు కమ్మదనాన్ని రుచి చూపించి నప్పుడు, వారు దానికి పొంగి పోతారు. స్వయంగా వారు చేసుకున్న చేష్టలు కారణంగా వారిపైకి ఏదైనా ఆపద వచ్చిపడితే, వెంటనే వారు

నిరాశకు లోనవుతారు. అల్లాహ్ యే తనకు ఇష్టమైన వారి ఉపాధిని వృద్ధిపరుస్తాడు , (తనకు ఇష్టమైన వారి ఉపాధిని) తక్కువ చేస్తాడు. ఈ విషయాన్ని వారు చూడటం లేదా ? నిశ్చయంగా ఇందులో విశ్వసించే వారికి ఎన్నో సూచనలు ఉన్నాయి. కనుక (విశ్వాసీ) బంధువునకు అతని హక్కును ఇచ్చివేయి , పేద వానికీ , బాటసారికీ (వారి హక్కులను) ఇచ్చివేయి. అల్లాహ్ ప్రసన్నతను కోరుకునే వారికి ఈ పద్ధతి ఉత్తమమైనది. వారే సాఫల్యం పొందేవారు. ప్రజల సంపదలో చేరి పెరగాలని మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృష్టిలో పెరగదు. అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో , మీరు ఇచ్చే జకాతు - దానిని ఇచ్చే వారే వాస్తవంగా తమ సంపదను వృద్ధి చేసుకుంటారు.

**30. అర్ రూమ్** 40 - 45 అల్లాహ్ యే మిమ్మల్ని పుట్టించాడు. తరువాత మీకు ఉపాధిని ఇచ్చాడు. ఆ తరువాత ఆయన మీకు మరణం కలిగిస్తాడు , తరువాత ఆయన మిమ్మల్ని బ్రతికిస్తాడు. మీరు దైవ సమానులుగా నిర్ణయించుకున్నవారిలో, ఎవడైనా ఈ పనులలో ఏ పనినైనా చేసేవాడు ఉన్నాడా ? ఈ మానవులు చేసే షిర్కునుండి ఆయన పరిశుద్ధుడు, మహోన్నతుడు. మానవులు చేజేతులా సంపాదించుకున్న దాని ఫలితంగానే నేలపైనా, నీటిలోనూ కల్లోలం చెలరేగింది వారి కొన్ని చేష్టల (ఫలితం)ను వారికి చవి చూపటానికి బహుశా వారు తమను సంస్కరించుకుంటారేమో అని. (ప్రవక్తా) వారితో ఇలా అను , భూమిపై సంచారం చేసి చూడండి , పూర్వం గతించిన వారి ముగింపు ఎలా జరిగిందో , వారిలో చాలమంది బహుదైవారాధకులే. కనుక (ప్రవక్తా) ఈ సత్య ధర్మంవైపు నీ ముఖాన్ని స్థిరంగా నిలుపు - ఆ రోజు రాకమునుపే , ఏ రోజు తొలగిపోయే ఏ అవకాశమూ అల్లాహ్ తరఫు నుండి లేదో. ఆ రోజున మానవులు చెదరిపోయి ఒకరినుండి ఒకరు వేరైపోతారు , అవిశ్వాసానికి పాల్పడిన వాడు తన అవిశ్వాసపు దుష్ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. మంచి పనులు చేసేవారు తమ కొరకే (సాఫల్య మార్గాన్ని ) సుగమం చేసుకుంటున్నారు విశ్వసించి మంచి పనులు చేసే వారికి అల్లాహ్ తన అనుగ్రహం నుండి ప్రతిఫలం ఇచ్చేందుకు. నిశ్చయంగా ఆయన అవిశ్వాసులను ప్రేమించడు.

**30. అర్ రూమ్** 46 - 47 ఇది , ఆయన సూచనలలోనిది. ఆయన వాయువులను పంపుతాడు , శుభవార్తను తెలిపేందుకూ, మీకు తన కారుణ్యాన్ని రుచి చూపేందుకూ, ఇంకా ఈ ఉద్దేశ్యంతో కూడా, పడవలు ఆయన ఆజ్ఞతో ప్రయాణించేటందుకు, మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించేటందుకు , ఆయనకు కృతజ్ఞతలు తెలిపేవారుగా అయ్యేటందుకు. మేము నీకు పూర్వం ప్రవక్తలను వారి జాతుల వైపునకు పంపాము, వారు వారి వద్దకు స్పష్టమైన సూచనలను తీసుకుని వచ్చారు. తరువాత నేరం చేసిన వారికి మేము ప్రతీకారం చేశాము. మేము విశ్వాసులకు సహాయపడటం అనేది వారికి మాపై ఉన్న హక్కు.

**30. అర్ రూమ్** 48 - 53 అల్లాహ్ యే గాలులను పంపేవాడు, అవి మేఘాలను లేపుతాయి, తరువాత ఆయన ఆ మేఘాలను తన ఇష్టం ప్రకారం ఆకాశంలో వ్యాపింప జేస్తాడు, వాటిని ఖండికలుగా విభజిస్తాడు, తరువాత మేఘంలో

నుండి వర్షపు బిందువులు కురియటాన్ని నీవు చూస్తావు. ఆయన ఈ వర్షాన్ని తన దాసులలో తనకు ఇష్టమైన వారిపై కురిపించగానే, వారు ఆనందంతో పొంగిపోతారు. వాస్తవానికి దాని అవతరణకు పూర్వం వారు నిరాశకు లోనై ఉండేవారు, అల్లాహ్ కారుణ్యం యొక్క ప్రభావాలను చూడు నిర్జీవంగా పడి ఉన్న భూమిని ఆయన ఎలా బ్రతికించిలేపుతాడో నిశ్చయంగా ఆయన మృతు లకు ప్రాణం పోసేవాడు , ఆయన ప్రతి విషయంపై అధికారం కలవాడు. మేము గాలిని పంపితే , దాని ప్రభావం వల్ల వారు తమ పంటలు పసుపుపచ్చగా మారటాన్ని చూస్తే , అప్పుడు వారు అవిశ్వాసంపై మరింత స్థిరపడిపోతారు , (ప్రవక్తా!) నీవు మృతులకు వినిపించలేవు , వెనుతిరిగి వెళ్ళిపోయే చెవిటి వారికీ నీవు నీ సందేశాన్ని వినిపించలేవు నీవు అంధులను అపమార్గం నుండి తప్పించి వారికి ఋజుమార్గమూ చూపలేవు. నీవు కేవలం మా వాక్యాలను విశ్వసించేవారికే , విధేయతతో తలవంచే వారికే వినిపించగలవు.

**30. అర్ రూమ్** 54 - 57 బలహీనావస్థ నుండి మీ పుట్టుకను ప్రారంభించినవాడూ, మళ్ళీ ఆ బలహీనత తరువాత మీకు బలాన్ని ప్రసాదించినవాడూ , ఆ బలం తరువాత మళ్ళీ మిమ్మల్ని బలహీనులుగా , ముసలివారుగా చేసినవాడూ అల్లాహ్ యేకదా! ఆయన తనకు ఇష్టమైన దానిని సృష్టిస్తాడు. ఆయన అన్నీ తెలిసినవాడు , ప్రతిదానిపై అధికారం కలవాడు. ఆ గడియ సంభవించినప్పుడు, నేరస్తులు ప్రమాణాలు చేసి, మేము ఒక గంటసేపు కంటే ఎక్కువ కాలం ఉండలేదు అని అంటారు. ఈ విధంగానే వారు ప్రాపంచిక జీవితంలో మోసపోతూ ఉండేవారు. కాని జ్ఞానమూ, విశ్వాసమూ అనుగ్రహింపబడిన వారు ఇలా అంటారు , ''దైవలేఖనం ప్రకారం మీరు ప్రళయదినం వరకు పడి ఉన్నారు, కనుక ఇదే ఆ ప్రళయదినం , కాని మీకు తెలియదు.'' కనుక ఆ రోజున దుర్మార్గులకు వారి సాకులు ఏ ప్రయోజనాన్నీ కలిగించలేవు. వారిని క్షమాభిక్ష కోరండి అని అడగటమూ జరగదు.

**30. అర్ రూమ్** 58 - 60 మేము ఈ ఖురానులో మానవులకు రకరకాలుగా బోధించాము. నీవు ఏ సూచనను తెచ్చినా, అవిశ్వాసులు, ''నీవు అసత్యాన్ని ఆశ్రయించావు '' అనే అంటారు. ఈ విధంగా అల్లాహ్ జ్ఞానహీనుల హృదయాలకు ముద్ర వేస్తాడు. ''కనుక (ప్రవక్తా!) సహనంతో ఉండు , నిశ్చయంగా అల్లాహ్ వాగ్దానం సత్యమైనది , అవిశ్వాసులు నిన్ను తేలికగా తీసుకోరాదు.''

**31. లుఖ్మాన్**

ఆయతులు : 34 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**31. లుఖ్మాన్** 1 - 5 అలిఫ్. లామ్. మీమ్. ఇవి వివేచనగల గ్రంథంలోని వాక్యాలు , సజ్జనులకు మార్గమును చూపేది మరియు కారుణ్యమూను. వారు నమాజును స్థాపిస్తారు. జకాత్ ఇస్తారు. పరలోకం పట్ల దృఢమైన

నమ్మకం కలిగి ఉంటారు. ఇటువంటి వారే తమ ప్రభువు తరఫు నుండి లభించిన ఋజుమార్గంలో ఉన్నారు. వారే సాఫల్యం పొందేవారు.

**31. లుఖ్మాన్** 6 - 9 జ్ఞానం లేకుండానే ప్రజలను అల్లాహ్ మార్గం నుండి తప్పించటానికీ , ఈ మార్గం వైపునకు పిలిచే పిలుపును ఎగతాళి చేయటానికీ మానవులలోనే మనస్సును రంజింపజేసే ప్రసంగాన్ని కొనుక్కొని తీసుకువచ్చేవాడు కూడా ఒకడు ఉంటాడు అటువంటి వారికి తీవ్ర అవమానకరమైన శిక్ష పడుతుంది, అతనికి మా వాక్యాలు వినిపించినపుడు , అతను వాటిని అసలు విననేలేద న్నట్లుగా , అతని చెవులలో చెవుడు ఉన్నట్లుగా అహంకారంతో తన ముఖాన్ని తిప్పుకుంటాడు. సరే మంచిది , అతి బాధాకరమైన ఒక శిక్ష ఉన్నది - అనే శుభవార్తను అతనికి వినిపించు. అయితే విశ్వసించి , సత్కార్యాలు చేసేవారికి వరాలతో నిండియున్న ఉద్యానవనాలు ఉన్నాయి. వాటిలో వారు శాశ్వతంగా ఉంటారు. ఇది అల్లాహ్ చేసిన సత్య వాగ్దానం. ఆయన శక్తిమంతుడు మరియు వివేకవంతుడు.

**31. లుఖ్మాన్** 10 - 11 ఆయన , ఆకాశాలను నీవు చూడగలిగే స్తంభాలు లేకుండానే సృష్టించాడు , ఆయన భూమిలో పర్వతాలను అమర్చాడు , మీతో పాటు దొర్లి పోకుండా ఉండేటందుకు. ఆయన అన్ని రకాల జంతువులను భూమిలో వ్యాపింపజేశాడు. ఆకాశం నుండి నీళ్లను కురిపించాడు. భూమిలో రకరకాల శ్రేష్ఠమైన పదార్థాలను పండిరచాడు. ఇది అల్లాహ్ సృష్టి , ఇక నాకు చూపండి ఈ ఇతరులు ఏమి సృష్టించారో ? - అసలు విషయమేమిటంటే, ఈ దుర్మార్గపు ప్రజలు స్పష్టమైన మార్గభ్రష్టత్వానికి గురి అయ్యారు.

**31. లుఖ్మాన్** 12 మేము లుఖ్మాన్‌కు వివేకాన్ని ప్రసాదించాము , అతను అల్లాహ్ కు కృతజ్ఞుడు కావాలని , ఎవడైనా కృతజ్ఞతలు తెలిపితే , అతని కృతజ్ఞతలు అతనికే లాభకరం , ఎవడైనా కృతఘ్నుతకు పాల్పడితే నిజానికి అల్లాహ్ అతీతుడు తనకు తానే స్తుతిపాత్రుడు.

**31. లుఖ్మాన్** 13 - 15 లుఖ్మాన్ తన కుమారునికి హితబోధ చేసిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు అతను ఇలా అన్నాడు , ‘‘కుమారా! దేవునికి భాగస్వాము లుగా ఎవరినీ చేర్చకు , నిజం ఏమిటంటే, ఇతరులను దేవునికి భాగస్వాము లుగా చేర్చటం పరమదుర్మార్గం ’’ - మానవుడు తన తల్లిదండ్రుల హక్కును గుర్తించాలని స్వయంగా మేమే అతనికి నిర్దేశించాము. అతని తల్లి బలహీనతపై బలహీనతను సహించి అతనిని తన కడుపున మోసింది. అతను పాలు విడిచిపెట్టటానికి రెండు సంవత్సరాలు పట్టింది. (ఇందుకే మేము అతనికి ఇలా బోధించాము) ‘‘నాకు కృతజ్ఞుడవై ఉండు, నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపు. నా వైపునకే నీవు మరలి రావలసి ఉన్నది. ఒకవేళ నీవు ఎరుగని వారి నెవరినైనా నాకు భాగస్వామిగా చేర్చు అని వారు నిన్ను బలవంతం చేస్తే , వారి మాటను ఏమాత్రం వినకు, ప్రపంచంలో వారి పట్ల సద్భావంతో మెలగుతూ ఉండు కాని నా వైపునకు మరలిన

వ్యక్తి మార్గాన్నే అనుసరించు. తరువాత మీరందరూ నా వైపునకే మరలవలసి ఉంది. అపుడు నేను మీకు తెలుపుతాను మీరు ఎలాంటి పనులు చేస్తూ ఉండేవారో.

**31. లుఖ్మాన్** 16 - 19 (లుఖ్మాన్ ఇలా అన్నాడు) ''కుమారా! ఒక వస్తువు, అది ఆవగింజంతటిదైనప్పటికీ అది కొండరాయిలోగాని, ఆకాశాలలోగాని, భూమిలోగాని, ఎక్కడ దాగి ఉన్నప్పటికీ, అల్లాహ్ దానిని బయటికి తీసుకు వస్తాడు. ఆయన సూక్ష్మగ్రాహి మరియు సర్వజ్ఞుడు. కుమారా! నమాజును స్థాపించు , మంచిని ఆజ్ఞాపించు , చెడుపనుల నుండి నిరోధించు, ఏ కష్టం కలిగినా దానికి సహనం వహించు. ఈ విషయాలు ఎంతో గట్టిగా ఆజ్ఞాపించ బడిన విషయాలు. ప్రజలతో ముఖం ప్రక్కకు త్రిప్పి మాట్లాడకు , భూమిపై నిక్కుతూ నడవకు. అహంభావి , బడాయికోరు అయిన ఏ వ్యక్తినీ అల్లాహ్ ప్రేమించడు. నీ నడకలో సమమైన తూకం పాటించు , నీ కంఠస్వరాన్ని కొంచెం తగ్గించు, అన్ని స్వరాల కంటే అతి చెడ్డ స్వరం గార్దభాల స్వరం.''

**31. లుఖ్మాన్** 20 - 21 భూమిలోనూ, ఆకాశాలలోనూ ఉన్న సకల వస్తువులను అల్లాహ్ మీకు వశం చేసిన విషయాన్నీ తన గోచర , అగోచర వరాలను మీకు ఇచ్చిన విషయాన్నీ మీరు చూడటం లేదా ? అయినా, పరిస్థితి ఎలా ఉందంటే , మానవులలో కొందరు అల్లాహ్ ను గురించి వాదులాడుతున్నారు. వారి వద్ద , ఏ జ్ఞానమూ , ఏ మార్గదర్శకత్వమూ, వెలుగును చూపే ఏ గ్రంథమూ లేకుండానే. అల్లాహ్ అవతరింపజేసిన దాన్ని అనుసరించండి అని వారితో అన్నప్పుడు , వారు, ''మా పూర్వీకులు దేనిపై నడుస్తూ ఉండగా మేము చూశామో , దానినే మేము అనుసరిస్తాము'' అని అంటారు. షైతాను వారిని జ్వలించే అగ్ని వైపునకే ఆహ్వానిస్తూ ఉండినప్పటికీ వీరు వారినే అనుసరిస్తారా?

**31. లుఖ్మాన్** 22 - 24 ఏ వ్యక్తి అయితే తనను తాను అల్లాహ్ కు సమర్పించుకుంటాడో , ఆచరణ రీత్యా సద్వర్తనుడో, అతను నిజానికి నమ్మదగిన ఒక ఆధారాన్ని పట్టుకున్నాడు. సకల వ్యవహారాలకు సంబంధించిన చివరి తీర్పు అల్లాహ్ చేతులలోనే ఉన్నది , ఇక ఎవడైనా అవిశ్వాసానికి పాల్పడితే , అతని అవిశ్వాసం నిన్ను ద్ణుఖానికి గురిచేయకూడదు. వారు మరలిరావలసినది మా వైపునకే కదా , అప్పుడు మేము వారికి తెలుపుతాము, వారు ఏమేమి చేసివచ్చారో. నిశ్చయంగా అల్లాహ్ హృదయాలలో దాగి వున్న రహస్యాలను సైతం ఎరుగును. మేము వారికి కొంత కాలం ప్రపంచంలో సుఖాలను అనుభవించే అవకాశాన్ని ఇస్తున్నాము , తరువాత వారిని అశక్తులుగా చేసి ఒక కఠోర యాతన వైపునకు లాగుకొనిపోతాము.

**31. లుఖ్మాన్** 25 - 28 ఒకవేళ వారిని నీవు , భూమినీ, ఆకాశాలనూ ఎవడు సృష్టించాడు అని అడిగితే వారు ''అల్లాహ్'' అని తప్పకుండా అంటారు. ఇలా అను , ''అల్ హమ్దులిల్లాహ్ '' (అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు). కాని వారిలో చాలామంది ఎరుగరు , ఆకాశాలలోనూ భూమిపైనా ఉన్నదంతా అల్లాహ్దే. నిస్సందేహంగా అల్లాహ్ అక్కరలేనివాడు , తనకు తానే స్తోత్రాలకు అర్హుడు. భూమిపై ఉన్న వృక్షాలన్నీ కలములై ,

సముద్రం (సిరాబుడ్డి అయి), దానికి ఇంకా ఏడు సముద్రాల సిరాను కలిపినా , అప్పటికీ అల్లాహ్ మాటలు (వ్రాయ టానికి) పూర్తికావు. నిస్సంశయంగా అల్లాహ్ మహాశక్తిసంపన్నుడు , మహా వివేకవంతుడూను , మీ మానవులందరినీ సృష్టించటం , తరువాత మళ్ళీ వారిని బ్రతికించి లేపటం అనేది (ఆయన కొరకు) కేవలం ఒక మానవుణ్ణి, (సృష్టించి, బ్రతికించి తేవటం) వంటిదే. యథార్థమేమిటంటే , అల్లాహ్ సర్వమూ వినేవాడు సర్వమూ చూసేవాడూను.

**31. లుఖ్మాన్** 29 - 30 అల్లాహ్ రాత్రిని పగలులోకీ , పగలును రాత్రిలోకీ చొప్పించటాన్ని నీవు చూడటం లేదా ? ఆయన సూర్యచంద్రులను నియమబద్ధంగా చేసి ఉంచాడు. అన్నీ ఒక నిర్ణీత కాలం వరకు సాగిపోతున్నాయి. నీవు ఏది చేసినా అది అల్లాహ్ కు తెలుసు అని (నీవు ఎరుగవా ?) ఇదంతా ఎందుచేత నంటే అల్లాహ్ యే సత్యం కాబట్టి, ఆయనను కాదని వారు పిలిచేవన్నీ అసత్యాలు కాబట్టి , ఇంకా (ఈ కారణం చేతకూడా) అల్లాహ్ యే మహ నీయుడూ, మహోన్నతుడూ కాబట్టి.

**31. లుఖ్మాన్** 31 - 32 అల్లాహ్ తన అనుగ్రహంతో నావను సముద్రంలో పయనింప చేయటాన్ని నీవు గమనించటం లేదా నీకు తన సూచనలు కొన్నింటిని చూపా లని ? వాస్తవంగానే ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి, సహనం, కృతజ్ఞతా భావం కల ప్రతి వ్యక్తి కొరకు. (సముద్రంలో) వారి మీదకు ఒక కెరటం కప్పుల మాదిరిగా క్రమ్ముకొని వచ్చినప్పుడు వారు అల్లాహ్ కు మొరపెట్టు కుంటారు , తమ ధర్మాన్ని పూర్తిగా ఆయనకే ప్రత్యేకం చేసుకొని. తరువాత ఆయన వారిని రక్షించి నేల మీదకు చేరవేసినప్పుడు, వారిలో కొందరు మితముగా వ్యవహరిస్తారు. మా సూచనలను ద్రోహి, కృతఘ్నుడూ అయిన వ్యక్తి తప్ప మరెవ్వడూ తిరస్కరించడు.

**31. లుఖ్మాన్** 33 మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి. ఏ తండ్రీ తన కుమారునికి బదులుగా ముందుకు రాని , ఏ కుమారుడూ తన తండ్రికి బదులుగా నిలబడని ఆ రోజుకు భయపడండి, నిస్సందేహంగా అల్లాహ్ వాగ్దానం సత్యం. కనుక ఈ ఐహిక జీవితం మిమ్మల్ని మోసానికి గురిచేయకూడదు. వంచకులు మిమ్మల్ని అల్లాహ్ విషయంలో వంచనకు గురి చేయకూడదు.

**31. లుఖ్మాన్** 34 ఆ గడియకు సంబంధించిన జ్ఞానం అల్లాహ్ వద్ద మాత్రమే ఉన్నది. ఆయనే వర్షాన్ని కురిపిస్తాడు, తల్లుల గర్భాలలో పెరుగుతున్నదేమిటో ఆయనే ఎరుగును. తాను రేపటి రోజున ఏమి సంపాదించ నున్నదో ఏ ప్రాణీ ఎరుగదు. ఏ భూభాగంపై తనకు మృత్యువు రానున్నదో ఏ వ్యక్తీ ఎరుగడు , అల్లాహ్ యే అంతా తెలిసినవాడూ, అన్నీ ఎరిగినవాడూను.

## 32. అస్ సజ్దహ్

ఆయతులు : 30 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన  అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**32. అస్ సజ్దహ్**  1 - 3 అలిఫ్. లామ్. మీమ్. నిస్సందేహంగా ఈ గ్రంథం సకల లోకాల ప్రభువు తరఫునుండి అవతరించింది. దీనిని స్వయంగా ఈ వ్యక్తియే కల్పిం చాడని వారు అంటున్నారా  ? కాదు, ఇది నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం  నీకు పూర్వం హెచ్చరించేవారెవరూ రాని జాతికి నీవు హెచ్చరిక చేసేందుకు , బహుశా వారు మార్గదర్శకత్వం పొందుతారేమో అని.

**32. అస్ సజ్దహ్**   4 - 9 ఆకాశాలనూ , భూమినీ, వాటి మధ్య ఉన్న సమస్త వస్తువులనూ ఆరు రోజులలో సృష్టించినవాడు, దాని తరువాత అధికార పీఠాన్ని అధిష్ఠించినవాడు అల్లాహ్ యే     , ఆయన తప్ప మిమ్మల్ని ఆదుకునేవాడూ, మీకు సహాయం చేసేవాడూ ఎవడూ లేడు   , ఆయన సమక్షంలో సిఫారసు చేసేవాడు కూడా ఎవడూ లేడు. అలాంటప్పుడు మీరు ఆలోచించరెందుకని  ? ఆయన ఆకాశం నుండి భూమి వరకు గల ప్రపంచ వ్యవహారాలను నిర్వహిస్తున్నాడు. ఆ నిర్వహణా నివేదిక  ఒక రోజున పైకి ఆయన సమ్ముఖానికి చేరుతుంది. ఆ రోజు పరిమాణం మీ అంచనా ప్రకారం వేయి సంవత్సరాలు. గోప్యంగాను       , బహిరంగంగాను ఉన్న ప్రతిదానిని ఎరిగినవాడూ, శక్తిమంతుడూ, కరుణా మయుడూ ఆయనే , ఆయన ఏ వస్తువును చేసినా చక్కగానే చేశాడు. ఆయన మానవ సృష్టి ప్రారంభాన్ని మట్టితో చేశాడు. తరువాత అతని సంతతిని తుచ్ఛమైన ద్రవపదార్థం వంటి ఒక సారంతో కొనసాగించాడు. ఆ తరువాత అతనిని నఖశిఖ పర్యంతం తీర్చిదిద్దాడు. అతనిలోనికి తన ఆత్మను ఊదాడు. మీకు చెవులిచ్చాడు , కళ్ళిచ్చాడు, హృదయాలిచ్చాడు. అయినా మీరు కృతజ్ఞతలు తెలపటం చాలా తక్కువ.

**32. అస్ సజ్దహ్**  10 - 11 ఈ ప్రజలు ఇలా అంటారు   ''మేము మట్టిలో కలిసి నశించి పోయినా , మళ్లీ మేము క్రొత్తగా సృష్టించబడతామా? అసలు విషయం ఏమిటంటే వారు తమ ప్రభువును కలుసుకోవటాన్ని తిరస్కరిస్తారు. వారితో ఇలా అను, ''మీపై నియమింపబడిన మృత్యుదూత మిమ్మల్ని పూర్తిగా కైవసం చేసుకుంటాడు. తరువాత మీరు మీ ప్రభువు వైపునకు మరలింపబడి తీసుకుపోబడతారు.''

**32. అస్ సజ్దహ్**  12 - 14 ఈ దోషులు తలలు వంచి తమ ప్రభువు సమక్షంలో నిలబడి ఉండే ఆ సమయాన్ని నీవు చూస్తే ఎంత బాగుండును! (అప్పుడు వారు ఇలా అంటారు) , ''మా ప్రభూ! మేము బాగా చూశాము , బాగా విన్నాము, ఇక మమ్మల్ని వెనక్కి పంపించు  , మేము మంచిపనులు చేస్తాము. మాకు ఇప్పుడు నమ్మకం కలిగింది.''  (సమాధానంగా ఇలా అనబడుతుంది). మేము కోరితే    , మొదట్లోనే ప్రతి ఆత్మకూ దాని యొక్క మార్గదర్శకత్వాన్ని ఇచ్చి ఉండేవారము. కాని నేను జిన్నాతులు      , మానవులు అందరినీ కలిపి నరకాన్ని నింపుతాను అని నేను చెప్పిన  నా  మాట నెరవేరింది. మీరు ఈ నాటి సమావేశాన్ని విస్మరించారు  కనుక

ఇప్పుడు మీ ఈ చేష్ట యొక్క రుచిని చూడండి. మేము కూడ ఇప్పుడు మిమ్మల్ని విస్మరించాము , చవిచూడండి శాశ్వతంగా ఉండిపోయే యాతనను మీ చేష్టలకు పర్యవసానంగా.

**32. అస్ సజ్దహ్** 15 - 20 ఈ వాక్యాలను వినిపించి హితబోధ చేసినప్పుడు సజ్దాలో పడేవారూ , తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన పరిశుద్ధతను కొనియాడేవారూ , గర్వపడనివారూ మాత్రమే మా వాక్యాలను విశ్వసిస్తారు. వారి వీపులు పడక లకు ఎడంగా ఉంటాయి తమ ప్రభువును వారు భయంతోనూ , ఆశ తోనూ వేడుకుంటారు. మేము వారికి ప్రసాదించిన ఉపాధి నుండి ఖర్చు పెడతారు. వారి కర్మలకు ప్రతిఫలంగా , కళ్లకు చలువ కలిగించే ఎటువంటి సామగ్రి వారి కొరకు దాచిపెట్టబడిరదో ఆ సామగ్రిని గురించి ఏ ప్రాణికీ తెలియదు. విశ్వాసి అయిన వ్యక్తి విద్రోహిగా మారిపోవటం సాధ్యమేనా ? ఈ ఉభయులూ సమానులు కాలేరు. విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి ఉద్యానవనాలలో నివాసాలు ఉన్నాయి , వారి కర్మలకు ప్రతిఫలంగా వారి ఆతిథ్యానికి. విద్రోహ వైఖరిని అవలంబించిన వారి నివాసం నరకం. వారు దాని నుండి బయటపడ దలచినపుడల్లా , అందులోకే నెట్టబడతారు. వారితో, ''మీరు తిరస్కరిస్తూ ఉండే అగ్ని బాధను ఇపుడు రుచిచూడండి'' అని అనబడుతుంది.

**32. అస్ సజ్దహ్** 21 - 22 ఆ పెద్ద శిక్షకు ముందు , మేము ఈ లోకంలోనే (ఏదో ఒక చిన్న ) శిక్షను వారికి రుచిచూపిస్తూ ఉంటాము, బహుశా వారు (తమ తిరుగుబాటు వైఖరిని) మానుకుంటారేమో అని. తన ప్రభువు వాక్యాల ద్వారా హితబోధ చేయబడినప్పుడు , వాటిపట్ల విముఖుడయ్యే వానికంటె పరమ దుర్మార్గుడెవడు ? అటువంటి అపరాధులకు మేము తప్పనిసరిగా ప్రతీకారం చేసి తీరుతాము.

**32. అస్ సజ్దహ్** 23 - 25 ఇంతకు పూర్వం మేము మూసాకు గ్రంథాన్ని ఇచ్చి ఉన్నాము. కనుక అదే ప్రాప్తమయ్యే విషయంలో నీకు ఎలాంటి సందేహమూ ఉండనక్కర లేదు , ఆ గ్రంథాన్ని మేము ఇస్రాయీల్ సంతతి వారికి మార్గదర్శకత్వంగా చేశాము. వారు సహనం వహించినపుడు, మా వాక్యాలను గట్టిగా నమ్మినపుడు, మేము వారిలో నాయకులను ప్రభవింపజేశాము , వారు మా ఆజ్ఞానుసారం మార్గం చూపేవారు. నిశ్చయంగా నీ ప్రభువే ప్రళయంనాడు (ఇస్రాయీల్ సంతతివారు) పరస్పరం విభేదిస్తూ ఉన్న విషయాలను గురించి తీర్పు చెబుతాడు.

**32. అస్ సజ్దహ్** 26 - 30 ఈ ప్రజలకు (ఈ చారిత్రక సంఘటనలలో) ఏ మార్గదర్శకత్వమూ లభించలేదా ? - వారికి పూర్వం మేము ఎన్నో జాతులను నాశనం చేశాము వారు నివసించిన ప్రదేశాలలోనే ఈనాడు వీరు సంచరిస్తున్నారు కదా? ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి. వారు వినటంలేదా ? వారు ఈ దృశ్యాన్ని ఎన్నడూ చూడలేదా? - మేము ఒక బంజరు భూమి వైపునకు నీళ్లను ప్రవహిం పజేస్తూ తీసుకువస్తాము, తరువాత ఆ భూమి నుండే పంటలు పండిస్తాము, వాటిద్వారా వారి పశువులకూ మేత దొరుకుతుంది, స్వయంగా వారూ తింటారు. వారు దేనినీ చూడరా? వారు ఇలా అంటారు, ''నీవు సత్యవంతుడవే అయితే, అసలు ఈ తీర్పు ఎప్పుడు జరుగుతుందో చెప్పు?'' వారితో ఇలా అను, ''తీర్పు దినం నాడు విశ్వసించటం అనేది అవిశ్వాసులకు ఏమాత్రం లాభదాయకంగా

ఉండబోదు. తరువాత వారికి గడువనేది దొరకదు. '' సరే, మంచిది వారి మానాన వారిని వదలిపెట్టు. నిరీక్షించు. వారూ నిరీక్షిస్తున్నారు.

## 33. అల్ అహ్జాబ్

ఆయతులు : 73 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**33. అల్ అహ్జాబ్** 1 - 3 ప్రవక్తా! అల్లాహ్ కు భయపడు. అవిశ్వాసులకూ , కపటులకూ విధేయత చూపకు. వాస్తవానికి అల్లాహ్ యే జ్ఞాని మరియు వివేకి. నీ ప్రభువు తరఫు నుండి నీకు సూచింపబడే విషయాన్ని మాత్రమే అనుసరించు. అల్లాహ్ కు నీవు చేసే ప్రతిపనీ తెలుసు. అల్లాహ్ పై నమ్మకం ఉంచు , సంరక్షకుడుగా అల్లాహ్ మాత్రమే సరిపోతాడు.

**33. అల్ అహ్జాబ్** 4 - 5 అల్లాహ్ ఏ వ్యక్తి శరీరంలోనూ రెండు హృదయాలను పెట్టలేదు మీరు 'జిహార్' చేసే మీ భార్యలనూ ఆయన మీకు తల్లులుగా చేయలేదు ఇంకా ఆయన మీ దత్త పుత్రులనూ మీ సొంత పుత్రులుగా చేయలేదు ఇవి మీరు పలికే మీ నోటిమాటలు మాత్రమే. కాని అల్లాహ్ మాత్రం సత్యం పునాదిగా ఉన్నమాటనే అంటున్నాడు. ఆయనే సరిjైైనన విధానం వైపునకు మార్గం చూపుతున్నాడు. దత్తపుత్రులను వారి తండ్రులతో ఉన్న సంబంధం ప్రకారం పిలవండి. ఇది అల్లాహ్ దృష్టిలో ఎంతో న్యాయసమ్మతమైన విషయం. ఒకవేళ వారి తండ్రులెవరో మీకు తెలియకపోతే, అప్పుడు వారు మీకు ధార్మిక సోదరులు మరియు సహచరులు. పొరపాటు వల్ల మీరు ఏదైనా మాట అంటే, దానికి మిమ్మల్ని పట్టుకోవటం జరగదు. కాని మీరు బుద్ధి పూర్వకంగా అనే మాటకు తప్పనిసరిగా మిమ్మల్ని పట్టుకోవటం జరుగుతుంది. అల్లాహ్ మన్నించేవాడు కరుణించేవాడూను.

**33. అల్ అహ్జాబ్** 6 నిస్సందేహంగా విశ్వాసులకు దైవప్రవక్త స్వయంగా తమకంటే కూడా ముఖ్యుడు. దైవప్రవక్త భార్యలు వారికి తల్లులు. కాని అల్లాహ్ గ్రంథం ప్రకారం సాధారణ విశ్వాసులు మరియు వలస వచ్చిన వారికంటె రక్తసంబంధీకులు ఒకరిపై ఒకరు ఎక్కువ హక్కులు కలిగి ఉంటారు. అయితే , మీ సహచరులకు మీరు ఏదైనా మేలు (చేయదలిస్తే) చేయవచ్చు. ఈ ఆజ్ఞ దైవగ్రంథంలో వ్రాయబడి ఉంది.

**33. అల్ అహ్జాబ్** 7 - 8 (ఓ ప్రవక్తా!) మేము దైవప్రవక్తలందరి చేత చేయించిన వాగ్దానాన్ని జ్ఞాపకముంచుకో. నీతో కూడ (చేయించాము) మరియు నూహ్ , ఇబ్రాహీమ్, మూసా, మర్యమ్ కుమారుడు ఈసాలతో కూడా

(చేయించాము), అందరితో మేము గట్టి వాగ్దానం చేయించాము నిజాయితీపరులను (వారి ప్రభువు) వారి నిజాయితీని గురించి ప్రశ్నించేందుకు. అవిశ్వాసులకు ఆయన అత్యంత బాధాకరమైన శిక్షను సిద్ధంచేసే ఉంచాడు.

**33. అల్ అహ్జాబ్** 9 - 11 విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్ మీకు (ఈ మధ్యనే) చేసిన ఉపకారాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. సైన్యాలు మీపైకి దండెత్తి వచ్చినప్పుడు , మేము వాటి మీదకు ఒక పెను గాలిని పంపాము మీకు కానరాని సైన్యాలను పంపాము. మీరు ఆ సమయంలో చేస్తున్నదంతా అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు. శత్రువులు మీ మీదకు పై నుండి, క్రిందనుండీ దండెత్తి వచ్చినప్పుడు, భయం వల్ల మీ కళ్లు తేలగిల్లి నప్పుడు మీ గుండెకాయలు గొంతులల్లోనికి వచ్చి నప్పుడు, మీరు అల్లాహ్ ను గురించి రకరకాలుగా అనుమానిస్తున్నప్పుడు, ఆ సమయంలో విశ్వాసులు కఠిన పరీక్షకు గురిఅయ్యారు, తీవ్రంగా ఊపి వేయబడ్డారు.

**33. అల్ అహ్జాబ్** 12 - 15 కపటులూ, రోగగ్రస్త హృదయులూ అందరూ, ‘‘అల్లాహ్, ఆయన ప్రవక్త మనతో చేసిన వాగ్దానాలన్నీ భ్రమలు తప్ప మరేమీ కావు ’’ అని స్పష్టంగా ప్రకటించినప్పటి సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు వారిలోని ఒక వర్గం , ‘‘ఓ యస్రిబ్ ప్రజలారా! ఇక మీకు ఇక్కడ ఉండే అవకాశమేదీ లేదు , వెనక్కి వెళ్ళిపొండి’’ అని అన్నది. అప్పుడు వారిలోని మరొక వర్గం ‘‘మా గృహాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి ’’ అని దైవప్రవక్తకు చెప్పి సెలవు కోరింది. వాస్తవానికి వాటికి ఏ ప్రమాదమూ లేదు. అసలు వారు (యుద్ధ మైదానం నుండి) పారిపోదలచారు. ఒకవేళ నగరం చుట్టుపక్కల నుండి శత్రువులు లోపలకు జొరబడి వారిని విద్రోహ చర్యకు పాల్పడమని పిలుపు ఇస్తే, అప్పుడు వారు తప్పకుండా అలా చేస్తారు విద్రోహ చర్యలో పాల్గొన టానికి వారు చాలా తక్కువగా సంకోచిస్తారు. వారు ఇదివరకు తాము వెన్ను చూపము అని అల్లాహ్ కు వాగ్దానం చేసి ఉన్నారు. అల్లాహ్ కు చేసిన వాగ్దానం గురించి తప్పకుండా ప్రశ్నించటం జరుగుతుంది.

**33. అల్ అహ్జాబ్** 16 - 17 ఓ ప్రవక్తా! వారితో ఇలా అను , ‘‘ఒకవేళ మీరు మృత్యువు బారి నుండి లేదా హత్యబారి నుండి తప్పించుకోవాలని పారిపోతే , ఈ పారిపోవటం మీకు ఏమాత్రం లాభదాయకం కాబోదు. దీని తరువాత జీవిత సుఖాలను అనుభవించటానికి కొద్దిపాటి అవకాశం మాత్రమే మీకు లభిస్తుంది. ’’ వారిని ఇలా అడుగు, ‘‘ఒకవేళ అల్లాహ్ మీకు నష్టం కలిగించదలిస్తే , ఆయన నుండి మిమ్మల్ని కాపాడగలిగేవాడెవడు ? ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని కరుణించదలిస్తే, ఆయన కరుణను ఆపగల వాడెవడు? అల్లాహ్ కు ప్రతిగా వారు ఏ సంరక్షకుణ్ణీ, ఏ సహాయకుణ్ణీ పొందలేరు.’’

**33. అల్ అహ్జాబ్** 18 - 20 మీలో (యుద్ధకార్యంలో) ప్రతిబంధకాలు సృష్టించేవారినీ , తమ సోదరులను ‘‘మా వైపునకు రండి’’ అని పిలిచేవారినీ, లెక్కకు మాత్రమే యుద్ధంలో పాల్గొనేవారినీ , నీకు తోడ్పడే విషయంలో పరమ లోభులైన వారినీ అల్లాహ్ బాగా ఎరుగును. మరణ సమయంలో అపస్మారక స్థితికి గురిఅయిన వానివలె వారు

ప్రమాదం సంభవించినప్పుడు గుడ్లు తిప్పుతూ నీ వైపు చూస్తారు. కాని ప్రమాదం తొలగిపోగానే , వారే లాభాలను పొందాలని దురాశా పరులై కత్తెరలవలె ఆడే నాలుకలతో నీకు స్వాగతం చెప్పటానికి వస్తారు. వారు ఏమాత్రం విశ్వసించినవారు కారు. కనుకనే అల్లాహ్ వారి కర్మలను అన్నింటినీ నిరర్థకం చేశాడు. అల్లాహ్ కు అలా చెయ్యటం చాలా సులభం. దాడి చేసిన వర్గాలు ఇంకా వెళ్ళిపోలేదు అనే వారు భావిస్తున్నారు. ఒకవేళ ఆ వర్గాలు మళ్ళీ దాడిచేస్తే , ఎడారిలో ఎక్కడికైనా పోయి పల్లెలలో అరబ్బుల మధ్య కూర్చుందామనీ , అక్కడ నుండే మీ పరిస్థితులను గురించి తెలుసు కుందామనీ వారి మనస్సు కోరుతోంది. ఒకవేళ వారు మీ మధ్య ఉన్నా , యుద్ధంలో చాలా తక్కువగానే పాల్గొంటారు.

**33. అల్ అహ్జాబ్** 21 - 24 వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది అల్లాహ్ పై , అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్ ను స్మరించే ప్రతి వ్యక్తికి. సత్య విశ్వాసుల (స్థితి అప్పుడు ఇలా ఉంది), వారు దాడి చేసిన సైన్యాలను చూసినప్పుడు , ఇలా పలికారు, ''అల్లాహ్, ఆయన ప్రవక్త మనకు వాగ్దానం చేసిన విషయం ఇదే , అల్లాహ్, ఆయన ప్రవక్త నిజమే పలికారు. '' ఈ సంఘటన వారి విశ్వాసాన్నీ , వారి ఆత్మ సమర్పణనూ మరింత అధికం చేసింది. విశ్వాసులలో , అల్లాహ్ కు తాము చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపినవారు ఉన్నారు , వారిలో కొందరు తమ మొక్కుబడిని తీర్చుకున్నారు , మరికొందరు సమయం కోసం నిరీక్షిస్తున్నారు. వారు తమ వైఖరిని ఏమాత్రం మార్చుకోలేదు. (ఇదంతా ఎందుకు జరిగిం దంటే) నిజాయితీ పరులకు అల్లాహ్ వారి నిజాయితీకి ప్రతిఫలం ఇవ్వటానికి , కపటులకు తనకు ఇష్టమైతే శిక్ష విధించటానికి లేదా తనకు ఇష్టమైతే వారి పశ్చాత్తాపాన్ని స్వీకరించటానికి. నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు , కరుణించే వాడూను.

**33. అల్ అహ్జాబ్** 25 - 27 అల్లాహ్ అవిశ్వాసులను వెనక్కి తరిమాడు వారు ఏ లాభాన్నీ పొందకుండానే , కడుపు మంటతో మరలిపోయారు. విశ్వాసుల పక్షాన యుద్ధం చేయటానికి అల్లాహ్ యే సరిపోయాడు. అల్లాహ్ సర్వశక్తి సంపన్నుడు, సర్వ సమర్థుడూను. ఈ దాడి చేసిన వారికి తోడ్పడిన గ్రంథ ప్రజలను తమ దుర్గాల నుండి అల్లాహ్ క్రిందికి తీసుకువచ్చాడు , వారి హృదయాలను భయంతో నింపాడు. ఈనాడు వారిలోని ఒక వర్గం వారిని మీరు చంపు తున్నారు, మరొక వర్గం వారిని మీరు ఖైదీలుగా చేస్తున్నారు. ఆయన మిమ్మల్ని వారి భూమికీ, వారి గృహాలకూ, వారి ఆస్తులకూ వారసులుగా చేశాడు మీరు ఎన్నడూ అడుగుమోపని ప్రాంతాన్ని ఆయన మీకు ఇచ్చాడు. అల్లాహ్ అన్నీ చేయగల సమర్థుడు.

**33. అల్ అహ్జాబ్** 28 - 29 ఓ ప్రవక్తా! నీ భార్యలతో ఇలా అను ''ఒకవేళ మీరు ప్రాపంచిక జీవితాన్నీ , దాని శోభనూ కోరుతూ ఉన్నట్లయితే, రండి, నేను మీకు ఎంతో కొంత ఇచ్చివేసి మంచి పద్ధతి ప్రకారం సాగనంపుతాను.

కాని ఒకవేళ మీరు అల్లాహ్ ను , ఆయన ప్రవక్తను, పరలోక నివాసాన్ని కోరుతూ ఉన్నట్లయితే , తెలుసుకోండి, మీలోని పుణ్యవతుల నిమిత్తం అల్లాహ్ గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు.''

**33. అల్ అహ్జాబ్** 30 - 31 ఓ ప్రవక్త భార్యలారా! మీలో ఎవరైనా ఏదైనా స్పష్టమైన నీతి బాహ్యమైన పని చేస్తే ఆమెకు రెట్టింపు శిక్ష విధించబడుతుంది. అల్లాహ్ కు ఇది చాల సులభమైన పని. మీలో ఎవరు అల్లాహ్ కు , ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో, సత్కార్యాలు చేస్తారో, ఆమెకు మేము రెట్టింపు ప్రతిఫలం ఇస్తాము. మేము ఆమెకు గౌరవప్రదమైన ఉపాధిని సిద్ధపరచి ఉంచాము.

**33. అల్ అహ్జాబ్** 32 - 34 ఓ ప్రవక్త భార్యలారా! మీరు సాధారణ స్త్రీల వంటి వారు కారు. మీరు అల్లాహ్ కు భయపడేవారు అయితే , తగ్గు స్వరంతో మాట్లాడకండి , ఎందుకంటే దుష్ట మనస్సు గల వ్యక్తి ఎవడైనా వ్యామోహపడవచ్చు. కాబట్టి స్పష్టంగా , సూటిగా మాట్లాడండి. ఇళ్లల్లోనే ఉండిపోండి. పూర్వపు అజ్ఞాన కాలంలో మాదిరిగా అలంకరణను ప్రదర్శిస్తూ తిరగకండి. నమాజును స్థాపిం చండి , జకాత్ ఇవ్వండి. అల్లాహ్కూ , ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి. దైవప్రవక్త కుటుంబీకులైన మీ నుండి కల్మషాన్ని తొలగించాలని, మిమ్మల్ని పూర్తిగా పరిశుద్ధపరచాలని అల్లాహ్ కోరుతున్నాడు. మీ ఇళ్లల్లో వినిపించబడే అల్లాహ్ వాక్యాలనూ , వివేకంతో కూడుకున్న విషయాలనూ జ్ఞాపకముంచు కోండి. నిస్సందేహంగా అల్లాహ్ అత్యంత సూక్ష్మగ్రాహి, అన్నీ తెలిసినవాడు.

**33. అల్ అహ్జాబ్** 35 నిశ్చయంగా ముస్లిములూ , విశ్వాసులూ, విధేయులూ, నిజాయితీపరులూ, సహనశీలురూ, అల్లాహ్ ముందు వినమ్రులయ్యేవారూ, దానధర్మాలు చేసే వారూ, ఉపవాసం ఉండేవారూ, తమ మర్మాంగాలను కాపాడుకునేవారూ, అల్లాహ్ ను అత్యధికంగా స్మరించేవారూ అయిన స్త్రీ పురుషుల నిమిత్తం అల్లాహ్ క్షమాభిక్షను, గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు.

**33. అల్ అహ్జాబ్** 36 అల్లాహ్, ఆయన ప్రవక్తా, ఏ విషయంలోనైనా ఒక తీర్పు చేసినపుడు విశ్వాసి అయిన ఏ పురుషునికైనా, విశ్వాసురాలైన ఏ స్త్రీకైనా, తరువాత తమ యొక్క ఆ విషయంలో స్వయంగా మళ్లీ ఒక నిర్ణయం తీసుకునే హక్కు లేదు. ఇంకా ఎవడైనా అల్లాహ్ కు , ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే , అతను స్పష్టంగా మార్గభ్రష్టతకు గురిఅయినట్లే.

**33. అల్ అహ్జాబ్** 37 - 39 ఓ ప్రవక్తా! అల్లాహ్ , నీవు, ఏ వ్యక్తికి మేలు చేశారో ఆ వ్యక్తితో ''నీవు నీ భార్యను విడిచి పెట్టకు, అల్లాహ్ కు భయపడు'' అని అంటున్న ఆ సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు నీవు అల్లాహ్ బయటపెట్టదలచిన విషయాన్ని మనస్సులో దాచి ఉంచావు. నీవు ప్రజలకు భయపడు తున్నావు. వాస్తవానికి నీవు భయపడటానికి అల్లాహ్ యే ఎక్కువ హక్కుదారుడు. తరువాత జైద్ ఆమె విషయంలో తన అవసరాన్ని

పూర్తి చేసుకున్నప్పుడు, మేము ఆమె (విడాకులు పొందిన స్త్రీ)తో నీకు వివాహం జరిపించాము. విశ్వాసులకు తమ దత్తపుత్రుల భార్యల విషయంలో, వారు తమ భార్యలకు సంబంధించిన తమ అవసరాన్ని పూర్తి చేసుకున్నప్పుడు, ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు. అల్లాహ్ ఆదేశం అమలులోకి రావలసిందే. అల్లాహ్ తనకు విధించిన ఏ పనినైనా చేయటంలో దైవప్రవక్తకు ఏ ప్రతిబంధకమూ లేదు. గతించిన దైవప్రవక్తలందరి విషయంలోనూ అల్లాహ్ యొక్క ఈ సంప్రదాయమే అమలులో ఉండేది. అల్లాహ్ ఆజ్ఞ పూర్తిగా తిరుగులేని తీర్పు. (ఇది అల్లాహ్ సంప్రదాయం) అల్లాహ్ సందేశాలను అందజేసే వారికి , ఆయనకు మాత్రమే భయపడేవారికి , ఒకే దేవునికి తప్ప మరెవరికీ భయపడని వారికి. లెక్క చూడటానికి కేవలం అల్లాహ్ యే చాలు.

**33. అల్ అహ్జాబ్** 40 (మానవులారా) ముహమ్మద్ మీలోని ఏ పురుషునికీ తండ్రికారు. కాని ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త, దైవప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు. అల్లాహ్ సకల విషయాల జ్ఞానం కలవాడు.

**33. అల్ అహ్జాబ్** 41 - 44 విశ్వసించిన ఓ మానవులారా! అల్లాహ్ ను అత్యధికంగా స్మరించండి. ఉదయం , సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండండి. ఆయనే మీపై కరుణచూపేవాడు. ఆయన దూతలు మీ కొరకు కారుణ్యానికై ప్రార్థనలు చేస్తారు , మిమ్మల్ని ఆయన చీకట్లలో నుండి వెలికి తీసి వెలుగులోకి తీసుకు రావాలని. విశ్వాసుల పట్ల ఆయన అమిత దయకలవాడు, వారు ఆయనను కలిసేరోజున వారికి శాంతి వచనాలతో స్వాగతం లభిస్తుంది. అల్లాహ్ వారికి ఎంతో గౌరవప్రదమైన ప్రతిఫలాన్ని సమకూర్చి ఉంచాడు.

**33. అల్ అహ్జాబ్** 45 - 48 ఓ ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా చేసి , శుభవార్తను ఇచ్చేవానిగా , హెచ్చరికచేసేవానిగా చేసి అల్లాహ్ అనుమతితో ఆయన వైపునకు పిలుపు ఇచ్చేవానిగా చేసి , ప్రకాశించే దీపంగా చేసి పంపాము. (నిన్ను) విశ్వసించిన మానవులకు శుభవార్త ఇవ్వు , వారికి అల్లాహ్ తరఫు నుండి గొప్ప అనుగ్రహాలు ఉన్నాయని. అవిశ్వాసుల కపటుల ఒత్తిడికి ఎంతమాత్రం లొంగకు, వారి వేధింపులను లెక్క చేయకు, అల్లాహ్నే నమ్ముకో. మనిషి తన వ్యవహారాలను అప్పగించటానికి అల్లాహ్ యే చాలు.

**33. అల్ అహ్జాబ్** 49 విశ్వాసులైన మానవులారా! మీరు విశ్వాసినులైన స్త్రీలను వివాహం చేసుకుని, తరువాత వారిని ముట్టుకోకమునుపే విడాకులిస్తే, అప్పుడు మీ తరఫు నుండి ''ఇద్దత్'' ఏదీ వారిపై ఖరారు కాదు అది పూర్తి అవ్వాలని మీరు కోరలేరు. కనుక వారికి కొంత ధనం ఇచ్చి మంచి పద్ధతిలో సాగ నంపండి.

**33. అల్ అహ్జాబ్** 50 - 52 ప్రవక్తా! మేము (ఈ క్రింది వారిని) నీకు ధర్మసమ్మతం చేశాము నీవు మహర్ చెల్లించిన నీ భార్యలను, అల్లాహ్ ప్రసాదించిన బానిస స్త్రీలనుండి నీ అధీనంలోకి వచ్చిన స్త్రీలను, నీతోపాటు వలస వచ్చిన నీ పినతండ్రి కుమార్తెలను , నీ మేనత్తల కుమార్తెలను , నీ మేనమామల కుమార్తెలను , నీ పినతల్లుల

కుమార్తెలను, తనను తాను దైవప్రవక్తకు సమర్పించుకున్న విశ్వాసిని అయిన స్త్రీని - ఒకవేళ దైవప్రవక్త ఆమెను వివాహం చేసుకోదలిస్తే, ఈ మినహాయింపు కేవలం నీకే పరిమితం , ఇతర విశ్వాసులకు ఇది లేదు. సాధారణ విశ్వాసులకు, వారి భార్యల, బానిస స్త్రీల విషయంలో మేము విధించిన పరిమితులు మాకు బాగా తెలుసు. నీకు ఏ విధమైన ఇబ్బందీ కలుగకుండా ఉండాలని (మేము నిన్ను ఈ పరిమితుల నుండి మినహా యించాము). అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను. నీ భార్యలలో నీకు ఇష్టమైన వారిని నీ నుండి వేరుగా ఉంచేందుకూ , నీకు ఇష్టమైన వారిని నీతో ఉంచుకునేందుకూ , నీకు ఇష్టమైన వారిని వేరుగా ఉంచిన తరువాత (కూడ) నీ వద్దకు పిలిపించుకునేందుకూ నీకు అధికారం ఇవ్వబడుతోంది. ఈ విషయంలో నీపై ఏ దోషమూ లేదు. ఈ విధంగా వారి కళ్లు చల్లదనం పొందుతాయనీ , వారు బాధపడరనీ, నీవు వారికి ఏది ఇచ్చినా వారు సంతోషి స్తారనీ ఎక్కువగా ఆశించవచ్చు. మీ మనస్సులలో ఏముందో అల్లాహ్ కు తెలుసు. అల్లాహ్ సర్వమూ తెలిసినవాడు సంయమనం కలవాడూను. వీరుగాక ఇతర స్త్రీలు నీకు ధర్మసమ్మతం కారు: వారి స్థానంలో మరెవరినీ భార్యలుగా తీసుకువచ్చే అనుమతి కూడ నీకు లేదు, వారి అంద చందాలు నీకు ఎంత నచ్చినా సరే. అయితే బానిస స్త్రీల విషయంలో నీకు అనుమతి ఉన్నది. అల్లాహ్ ప్రతి విషయాన్నీ కనిపెడుతూనే ఉంటాడు.

**33. అల్ అహ్జాబ్** 53 - 54 విశ్వాసులైన ప్రజలారా! దైవప్రవక్త ఇళ్లల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించకండి. భోజన సమయానికై కాచుకుని కూర్చోకండి. కాని మిమ్మల్ని భోజనానికి పిలిస్తే , తప్పకుండా వెళ్లండి , అయితే భోజనం చేసిన వెంటనే, బయటికి వెళ్లిపొండి. పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఉండిపోవకండి. మీ ఈ చేష్టలు ప్రవక్తకు కష్టం కలిగిస్తాయి. అయినా ఆయన , మొగమాటం వల్ల ఏమీ అనరు. అల్లాహ్ సత్య విషయం చెప్పటానికి మొగమాట పడడు. ప్రవక్త భార్యలను మీరు ఏదైనా అడగవలసి ఉంటే , తెరచాటున ఉండి అడగండి. ఇది మీ హృదయాల, వారి హృదయాల పరిశుద్ధత కొరకు ఎంతో సముచితమైన పద్ధతి. దైవప్రవక్తకు కష్టం కలిగించటం మీకు ఏమాత్రం ధర్మసమ్మతం కాదు. ఇంకా , ఆయన తరువాత ఆయన భార్యలను వివాహం చేసుకోవటం కూడ మీకు ధర్మసమ్మతం కాదు. ఇది అల్లాహ్ దృష్టిలో మహాపాపం. మీరు ఏదైనా విషయాన్ని వ్యక్తం చేసినా లేక దానిని గోప్యంగా ఉంచినా, అల్లాహ్ కు ప్రతి విషయమూ తెలుసు.

**33. అల్ అహ్జాబ్** 55 దైవప్రవక్త భార్యలకు ఈ విషయంలో ఏ దోషమూ అంటదు. వారి తండ్రులు , వారి కొడుకులు, వారి సోదరులు, వారి సోదరుల కొడుకులు , వారి సోదరీమణుల కుమారులు , వారితో కలుపుగోలుగా ఉండే స్త్రీలు , వారి బానిసలు , వారి ఇళ్లల్లోకి రావచ్చు. (మహిళలారా!) మీరు అల్లాహ్ పట్ల అవిధేయతకు పాల్పడకండి అల్లాహ్ ప్రతి విషయాన్నీ గమనిస్తున్నాడు.

**33. అల్ అహ్జాబ్** 56 అల్లాహ్ ఆయన దూతలు దైవప్రవక్తకై 'దురూద్'ను పంపుతారు. విశ్వాసులారా! మీరు కూడ ఆయనకై దురూద్, సలామ్‌లు పంపండి.

**33. అల్ అహ్జాబ్** 57 - 58 అల్లాహ్కూ , ఆయన ప్రవక్తకూ బాధకలిగించిన వారిని అల్లాహ్ ఇహపరాలు రెండిరటిలోనూ శపించాడు వారికి అవమానకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు. ఏ తప్పూ చేయకపోయినా విశ్వాసులైన స్త్రీ పురుషులకు మనస్తాపం కలిగించేవారు , ఒక పెద్ద అభాండభారాన్ని ఒక స్పష్టమైన పాపభారాన్ని తమ తలపై మోపుకున్నట్లే.

**33. అల్ అహ్జాబ్** 59 ప్రవక్తా! నీ భార్యలకూ , నీ కూతుళ్లకూ , విశ్వాసుల యొక్క స్త్రీలకూ తమ దుప్పట్ల కొంగులను తమపై ప్రేలాడతీసుకోమని చెప్పు వారు గుర్తింపబడ టానికీ , వేధింపబడకుండా ఉండేందుకూ ఇది ఎంతో సముచితమైన పద్ధతి. అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను.

**33. అల్ అహ్జాబ్** 60 - 62 ఒకవేళ కపటులూ, కలుషిత హృదయులూ మదీనా నగరంలో సంచలనం కలిగించే వదంతులను వ్యాపింపజేసేవారూ తమ దుశ్చేష్టలను మానుకోకపోతే , వారికి వ్యతిరేకంగా చర్య తీసుకోవటానికి , మేము మిమ్మల్ని నిలబెడతాము. తరువాత వారు ఈ నగరంలో మీతో కలసి ఉండటం అనేది కష్టసాధ్యమవుతుంది. అన్ని వైపుల నుండి వారిపై శాపాలు విరుచుకు పడతాయి. వారు ఎక్కడ కనబడితే అక్కడ పట్టుకోబడతారు. దారుణంగా చంపబడతారు. ఇది అల్లాహ్ సంప్రదాయం పూర్వం నుంచీ అటువంటి వారి విషయంలో అమలవుతూ వస్తున్నదే. మీరు అల్లాహ్ సంప్రదాయంలో ఏ మార్పునూ కానలేరు.

**33. అల్ అహ్జాబ్** 63 - 68 ప్రళయఘడియ ఎప్పుడు వస్తుంది అని ప్రజలు నిన్ను అడుగుతారు. అది అల్లాహ్కే తెలుసు అని చెప్పు. బహుశా అది సమీపంలోనే ఉందో ఏమో, నీకేమి ఎరుక. ఏది ఏమైనా, ఇది మటుకు వాస్తవం: అల్లాహ్ అవిశ్వాసు లను శపించాడు. వారికొరకు మండే అగ్నిని సిద్ధపరచి ఉంచాడు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు ఏ స్నేహితుణ్ణీ , ఏ సహాయకుణ్ణీ పొందలేరు. వారి ముఖాలను నిప్పులపై అటూ ఇటూ త్రిప్పటం జరిగేనాడు వారు ఇలా అంటారు , ''అయ్యో! మేము అల్లాహ్కూ , దైవప్రవక్తకూ విధేయత చూపి ఉంటే ఎంత బాగుండేది!'' ఇంకా ఇలా అంటారు , ''ఓ మా ప్రభూ! మేము మా నాయకులకూ , మా పెద్దలకూ విధేయత చూపాము. వారు మమ్మల్ని ఋజుమార్గం నుండి తప్పించారు. ఓ ప్రభూ! వారికి రెట్టింపు యాతన విధించు, వారిని తీవ్రంగా శపించు.''

**33. అల్ అహ్జాబ్** 69 - 71 విశ్వాసులారా! మూసాకు మనస్తాపం కలిగించిన ప్రజల మాదిరిగా అయిపోకండి. తరువాత అల్లాహ్, వారు కల్పించిన మాటల బారినుండి అతనికి విముక్తి కలిగించాడు. అతను అల్లాహ్ దృష్టిలో ఎంతో గౌరవనీయుడు. విశ్వాసులారా! అల్లాహ్ కు భయపడండి , రుజువాక్కును పలకండి. అప్పుడు అల్లాహ్ మీ కర్మలను చక్కబరుస్తాడు, మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్ కు, ఆయన ప్రవక్తకూ విధేయత చూపేవాడు గొప్ప సాఫల్యం పొందుతాడు.

**33. అల్ అహ్జాబ్** 72 - 73 మేము ఈ అమానతును ఆకాశాల ముందూ , భూమిముందూ, పర్వతాల ముందూ పెట్టాము. అవి దానిని మోయటానికి సిద్ధపడలేదు. దానికి భయపడ్డాయి. కాని మానవుడు దాన్ని తనపై మోపుకున్నాడు. నిస్సందేహంగా, అతడు అన్యాయం చేసుకున్నాడు , మూర్ఖుడు (ఈ అమానతు భారాన్ని పైన వేసుకున్న దాని అనివార్య ఫలితం ఏమిటంటే) కపటులైన స్త్రీ పురుషులనూ , ముష్రిక్కులైన స్త్రీ పురుషులనూ అల్లాహ్ శిక్షించటం , విశ్వాసులైన స్త్రీ పురుషుల పశ్చాత్తాపాన్ని అంగీకరించటం. అల్లాహ్ మన్నించేవాడు , కరుణించేవాడూను.

**34. సబా**

ఆయతులు : 54 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**34. సబా** 1 - 2 కేవలం అల్లాహ్ యే స్తుతికిపాత్రుడు. ఆయన ఆకాశాలలోనూ , భూమి లోనూ ఉన్న ప్రతి వస్తువుకూ స్వామి. పరలోకంలో కూడా ఆయనే స్తోత్రానికి పాత్రుడు. ఆయన వివేచనకలవాడు, అన్నీ ఎరిగినవాడు, భూమిలోకి ప్రవేశిం చేదీ , దానినుండి వెలికి వచ్చేదీ , ఆకాశం నుండి దిగేదీ , దానిలోకి ఎక్కేదీ, ఇదంతా ఆయనకు తెలుసు. ఆయన కరుణించేవాడు, క్షమించేవాడూను.

**34. సబా** 3 - 6 ఏదీ, ప్రళయం ఇంకా మా మీదకు రావటం లేదేమిటి? అని అవిశ్వాసులు అంటారు. వారితో ఇలా అను, ''అగోచర విషయజ్ఞాని అయిన నా ప్రభువు సాక్షిగా! అది మీ మీదకు తప్పకుండా వస్తుంది. రవ్వంత వస్తువైనా సరే ఆయనకు ఆకాశాలలోనూ గోప్యంగా లేదు , భూమిపైనా గోప్యంగా లేదు. రవ్వకంటే పెద్దదైనా సరే దానికంటె చిన్నదైనా సరే అంతా ఒక స్పష్టమైన దస్త్రములో వ్రాయబడి ఉన్నది. '' విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికి అల్లాహ్ మంచి ప్రతిఫలం ఇవ్వటానికి ఈ ప్రళయం వస్తుంది , వారికి క్షమాభిక్ష లభిస్తుంది , గౌరవప్రదమైన ఉపాధి సిద్ధిస్తుంది. మా వాక్యాలను అగౌరవ పరచటానికి విశ్వప్రయత్నాలు చేసినవారికి తీవ్రమైన , బాధాకరమైన శిక్షపడు తుంది. ప్రవక్తా! నీ ప్రభువు తరఫు నుండి ఏదైతే నీపై అవతరించిందో , అది పూర్తిగా సత్యమనీ , శక్తిమంతుడూ, స్తవనీయుడూ అయిన దేవుని మార్గం చూపుతుందనీ జ్ఞానులు బాగా గ్రహిస్తారు.

**34. సబా** 7 - 8 ... అవిశ్వాసులు ప్రజలతో ఇలా అంటారు: ''మీ శరీరంలోని అణువణువు చెల్లాచెదరై పోయినప్పుడు మీరు మళ్ళీ కొత్తగా సృష్టింపబడతారని తెలియజేసే వ్యక్తిని మీకు చూపమంటారా ? ఈ వ్యక్తి అల్లాహ్ పేరుతో అబద్ధాలు కల్పిస్తున్నాడో లేక ఇతనికి పిచ్చి ఏమైనా పట్టిందో తెలియటం లేదు.''

**34. సబా** ... 8 - 9 కాదు. వాస్తవానికి పరలోకాన్ని విశ్వసించినవారే యాతనకు గురి అయ్యేవారు, వారే ఘోరంగా మార్గం తప్పినవారు. వారిని ముందునుంచీ , వెనకనుంచీ చుట్టుముట్టి ఉన్న భూమ్యాకాశాలను వారు ఎన్నడూ చూడలేదా? మేము కోరితే వారిని భూమిలోకి కూరుకుపోయేలా చేయగలము లేదా ఆకాశ ఖండాలను కొన్నింటిని వారి మీద పడవేయగలము. నిజంగానే దేవుని వైపునకు మరలే ప్రతి దాసుని కొరకు ఇందులో ఒక సూచన ఉన్నది.

**34. సబా** 10 - 11 మేము దావూద్‌కు మా తరఫు నుండి గొప్ప అనుగ్రహాన్ని ప్రసాదిం చాము. (మేము ఇలా ఆజ్ఞాపించాము) పర్వతములారా! ఇతనితో కలిసి కీర్తన చేయండి. (ఇదే ఆజ్ఞను మేము) పక్షులకు కూడా ఇచ్చాము. మేము ఇనుమును అతని కొరకు మెత్తపడేటట్లుగా చేశాము. ఇలా ఆదేశిస్తూ ''కవచాలు తయారు చెయ్యి, వాటి వలయాలను సరిగ్గా లెక్క ప్రకారం పేర్చు. '' (దావూద్ ప్రజలారా!) మంచి పనులు చెయ్యండి. మీరు చేస్తున్నదల్లా నేను చూస్తున్నాను.

**34. సబా** 12 - 13 మేము సులేమాన్‌కు గాలిని వశపరచాము. అది ఉదయం పూట ఒక నెల రోజుల పాటి ప్రయాణాన్ని పూర్తి చేయగలిగేది. సాయంకాలం పూట కూడా ఒక నెల రోజుల పాటి ప్రయాణాన్ని చేయగలిగేది. మేము ఆయనకు కరిగిన రాగి ఊటను ప్రవహింపజేశాము. తమ ప్రభువు ఆదేశానుసారం అతని సన్నిధిలో సేవలు చేసే జిన్నాతులను మేము అతనికి వశవర్తులుగా చేశాము. వారిలో మా ఆజ్ఞను ఉల్లంఘించిన వాడికి మేము జ్వలించే అగ్నిని రుచిచూపేవారము. వారు అతనికి అతను కోరినవన్నీ చేసేవారు , ఎత్తైన కట్టడాలు , చిత్రాలు, కోనేరులవంటి పెద్ద పళ్లాలు , తమస్థానం నుండి కదలని భారీ డేగిసాలు - దావూద్ ప్రజలారా! కృతజ్ఞతతో పనిచేయండి, నా దాసులలో కృతజ్ఞతలు తెలిపేవారు తక్కువే.

**34. సబా** 14 ఆ తరువాత సులేమాన్‌పై మేము మరణ నిర్ణయాన్ని అమలు జరిపి నప్పుడు జిన్నాతులకు అతని మరణం గురించి తెలియజేసిన వస్తువు అతని చేతి కర్రను తింటూ ఉన్న చీడపురుగే తప్ప మరొకటేదీ కాదు , ఈ విధంగా సులేమాన్ పడిపోగా , తమకు అగోచర విషయాలు తెలిసి ఉంటే అవమానకరమైన ఈ బాధకు గురిఅయి ఉండేవారము కాము అని జిన్నాతులకు స్పష్టంగా తెలిసిపోయింది.

**34. సబా** 15 - 17 సబా కొరకు స్వయంగా వారి స్వస్థలంలోనే ఒక సూచన ఉండేది కుడిప్రక్కా ఎడమ ప్రక్కా రెండు వైపులా రెండు తోటలు మీ ప్రభువు ప్రసా దించిన దానిని తినండి. ఆయనకు కృతజ్ఞతలు తెలుపండి: దేశమేమో మంచిది, పవిత్రమైనది. ప్రభువేమో మన్నించేవాడు, అయినప్పటికీ వారు విముఖత చూపారు. చివరకు మేము వారిపైకి కట్ట తెంచే వరదను పంపాము, వారి పూర్వపు రెండుతోటల స్థానంలో మరో రెండు తోటలను వారికి ఇచ్చాము. వాటిలో చేదుపండ్లు , రaావుక వృక్షాలు ఉండేవి , కొన్ని రేగిచెట్లు కూడా ఉండేవి. ఇది వారి

అవిశ్వాసానికి మేము వారికిచ్చిన ప్రతిఫలం. కృతఘ్నుడైన మానవుడికి తప్ప ఇటువంటి ప్రతిఫలాన్ని మేము మరెవ్వరికీ ఇవ్వము.

**34. సబా** 18 - 21 మేము వారికీ , మేము శుభాలు ప్రసాదించిన పట్టణాలకూ మధ్య స్పష్టంగా కనిపించే జనపదాలు స్థాపించాము. వాటిలో ప్రయాణ దూరాలను ఒక అంచనా ప్రకారం ఏర్పాటు చేశాము. ''ఈ మార్గాలలో రేయింబవళ్లు సురక్షితంగా ప్రయాణం చేయండి.'' కాని వారు, ''మా ప్రభూ! మా ప్రయాణ దూరాలను పొడిగించు '' అని అన్నారు. వారు తమకు తామే అన్యాయం చేసుకున్నారు. చివరకు మేము వారిని ఒక కథగా మిగిల్చాము , చెల్లాచెదరు చేసివేశాము. నిశ్చయంగా ఇందులో సహనశీలుడూ , కృతజ్ఞుడూ అయిన ప్రతి వ్యక్తికీ సూచనలు ఉన్నాయి. వారి విషయంలో షైతాన్ తన అనుమానం నిజమైందని తెలుసుకున్నాడు. వారు అతడినే అనుసరించారు, విశ్వాసులైన ఒక చిన్న వర్గం వారు తప్ప. షైతానుకు వారిపై ఎలాంటి అధికారమూ లభించి ఉండలేదు. కాని ఇదంతా ఎందుకు జరిగిందంటే , పరలోకాన్ని విశ్వసించినవాడు ఎవడో , దానిని గురించి సంశయపడినవాడు ఎవడో మేము చూడదలచాము. నీ ప్రభువు ప్రతి విషయాన్నీ కనిపెట్టి ఉన్నాడు.

**34. సబా** 22 - 23 (ప్రవక్తా! ఈ ముష్రిక్కులతో) ఇలా అను , ''అల్లాహ్ ను కాదని మీరు ఆరాధ్యులుగా భావించిన వారిని పిలిచి చూడండి. వారు ఆకాశాలలో గాని , భూమిలోగాని, రవ్వంత వస్తువుకు కూడా యజమానులుకారు. ఇంకా వారు భూమ్యాకాశాల ఆధిపత్యంలో భాగస్వాములునూ కారు. వారిలో ఎవ్వడూ అల్లాహ్ కు సహాయకుడూ కాడు, అల్లాహ్ ఏ వ్యక్తి విషయంలో సిఫారసుకు అనుమతి ఇచ్చాడో , ఆ వ్యక్తికి తప్ప మరెవరికినీ ఏ సిఫారసూ అల్లాహ్ సమక్షంలో లాభదాయకం కాదు , చివరకు ప్రజల హృదయాల నుండి భయం తొలగిపోయినపుడు , వారు (సిఫారసు చేసే వారిని) ''మీ ప్రభువు ఏమని సమాధానం పలికాడు ?'' అని అడుగుతారు. వారు , ''సరైన సమాధానమే దొరికింది, ఆయన మహిమాన్వితుడు, మహోన్నతుడూను'' అని చెబుతారు.

**34. సబా** 24 - 27 (ప్రవక్తా!) వారిని ఇలా అడుగు , ''ఆకాశాల నుండీ , భూమినుండీ మీకు ఉపాధిని ఎవడు ఇస్తున్నాడు?'' ఇలా అను, ''అల్లాహ్ యే. ఇప్పుడు నిశ్చయంగా మేమో, మీరో ఎవరో ఒకరు మాత్రమే సన్మార్గంలో ఉన్నాము లేదా స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నాము. '' ఇంకా వారితో ఇలా అను , ''మేము చేసిన తప్పులను గురించి మిమ్మల్ని ఏమాత్రం ప్రశ్నించటం జరగదు , మీరు చేస్తూ ఉన్న దానిని గురించి మమ్మల్నీ అడగటం జరగదు.'' ఇలా అను, ''మన ప్రభువు మనల్ని సమావేశ పరుస్తాడు: తరువాత మన మధ్య సరైన తీర్పు చేస్తాడు. ఆయన సర్వజ్ఞుడైన న్యాయాధిపతి.'' వారితో ఇలా అను, ''ఆయనకు భాగస్వాములుగా మీరు కలిపిన ఆ శక్తులేవో నాకూ కొంచెం చూపించండి.'' ఎంతమాత్రం కాదు అల్లాహ్ మాత్రమే శక్తిమంతుడు వివేకవంతుడూను.

**34. సబా** 28 (ప్రవక్తా!) మేము నిన్ను సర్వమానవులకు శుభవార్తను ఇచ్చేవాడుగా , హెచ్చరిక చేసేవాడుగా నియమించి పంపాము. కాని చాలామంది మానవులు దీనిని ఎరుగరు.

**34. సబా** 29 - 30 వారు నీతో ఇలా అంటారు, ''నీవు నిజాయితీపరుడవే అయితే, ఆ (ప్రళయ) వాగ్దానం ఎప్పుడు నెరవేరుతుంది?'' ఇలా అను, ''మీ కొఱకు ఆ రోజు యొక్క గడువు నిర్ణయమయ్యే ఉన్నది. దాని రాకను మీరు ఒక గంట ఆలస్యమూ చేయలేరు, ఒక గంట శీఘ్రతరమూ చేయలేరు.''

**34. సబా** 31 - 33 ఈ అవిశ్వాసులు ఇలా అంటున్నారు, ''మేము ఈ ఖురానును ఎన్నటికీ విశ్వసించము. దీనికి పూర్వం వచ్చిన ఏ గ్రంథాన్నీ అంగీకరించము.'' ఈ దుర్మార్గులు తమ ప్రభువు సమక్షంలో నిలబడునప్పటి స్థితిని నీవు చూస్తే ఎంత బాగుండును! అప్పుడు వారు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసు కుంటూ ఉంటారు. ప్రపంచంలో అణగద్రొక్కబడిన వారు పెద్దలమనుకున్న వారితో , ''మీరు లేకపోయినట్లయితే మేము విశ్వాసులమై ఉండేవారము'' అని అంటారు. ఆ పెద్దలమనుకున్న వారు , అణగద్రొక్కబడిన వారికి ఇలా జవాబు ఇస్తారు , ''మీ వద్దకు వచ్చిన సన్మార్గాన్ని అవలంబిం చకుండా మేము మిమ్మల్ని ఆపామా ? లేదు. మీరు స్వయంకృతాపరాధులు.'' అణగ ద్రొక్కబడిన వారు ఆ పెద్దలమనుకున్న వారితో ఇలా అంటారు, ''కాదు, ఇది మీరు అహోరాత్రాలు పన్నిన కుట్ర. అల్లాహ్ ను తిరస్కరించండి అనీ ఇతరులను ఆయనకు సహవర్తులుగా చెయ్యండి అనీ మీరు మాకు బోధించారు. '' చివరకు వారు శిక్షను చూసినప్పుడు , తమ మనస్సులలో పశ్చాత్తాప పడతారు. మేము ఈ అవిశ్వాసుల మెడలకు గుదిబండలు వేస్తాము. ప్రజలకు వారి కర్మలు ఎలాంటివో అలాంటి ప్రతిఫలమే దొరుకుతుంది. దానికి భిన్నమైన ప్రతిఫలాన్ని వారికి ఇవ్వటం సాధ్యమా?

**34. సబా** 34 - 38 మేము హెచ్చరిక చేసే వానిని ఏదైనా పట్టణానికి పంపినపుడు , ఆ పట్టణంలోని సంపన్నులు, ''నీవు తీసుకొనివచ్చిన సందేశాన్ని మేము విశ్వసించము'' అని అనకుండా ఉండటం అనేది ఎన్నడూ జరగలేదు. వారు ఎల్లప్పుడు ఇలానే అన్నారు , ''మేము నీకంటె ఎక్కువ సంపదనూ , ఎక్కువ సంతానాన్నీ కలిగి ఉన్నాము. మేము ఎంతమాత్రం శిక్షింపబడే వారము కాము.'' ప్రవక్తా! వారితో ఇలా అను, ''నా ప్రభువు తనకు ఇష్టమైన వారికి విస్తారంగా ఉపాధిని ప్రసాదిస్తాడు , తనకు ఇష్టమైనవారికి ఆచితూచి ఇస్తాడు. కాని చాలామంది దీని యథార్థాన్ని గ్రహించరు.'' మిమ్మల్ని మాకు దగ్గర చేసేది , మీ సంపదకానీ, మీ సంతానం కానీ కాదు , విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మాత్రమే (మాకు దగ్గరవుతారు). ఇటువంటి వారికే తాము చేసిన దానికి రెట్టింపు ప్రతిఫలం లభించేది , వారు ఎత్తైన భవనాలలో సురక్షితంగా ఉంటారు , ఇక మా వాక్యాలను చులకన పరచటానికి నిరంతరం ప్రయత్నం చేసేవారు, వారు యాతనకు గురిఅవుతారు.

**34. సబా** 39 ప్రవక్తా! వారితో ఇలా అను, ''నా ప్రభువు తన దాసులలో తన కిష్టమైన వారికి విస్తృతమైన ఉపాధిని ఇస్తాడు. తనకిష్టమైన వారికి ఆచి తూచి ఇస్తాడు. మీరు దేనిని ఖర్చు చేసినప్పటికీ దాని స్థానంలో ఆయనే మీకు మరింత ఇస్తాడు, ఉపాధి ప్రదాతలందరికంటె ఆయనే శ్రేష్ఠుడైన ఉపాధి దాత.''

**34. సబా** 40 - 42 ఆయన మానవులందరినీ సమావేశపరచే రోజున దైవదూతలను, ‘‘వీరు మిమ్మల్నే ఆరాధిస్తూ ఉండేవారా?’’ అని అడుగుతాడు. అప్పుడు వారు ఇలా జవాబు చెబుతారు , ‘‘నీవు పరిశుద్ధుడవు. మా సంబంధం నీతోనేగాని వీరితో మాత్రం కాదు , అసలు వీరు మమ్మల్ని కాదు , జిన్నాతులను ఆరాధించే వారు , వీరిలో చాలామంది వారినే విశ్వసించారు. ’’ (అప్పుడు మేము ఇలా అంటాము) ఈ రోజున మీలో ఎవరూ ఎవరికీ లాభాన్నిగానీ, నష్టాన్నిగానీ కలిగించలేరు. మేము దుర్మార్గులతో , ‘‘ఇక రుచి చూడండి మీరు తిరస్కరిస్తూ ఉండే నరకబాధను’’ అని అంటాము.

**34. సబా** 43 - 45 స్పష్టమైన మా వాక్యాలను వారికి వినిపించినపుడు , వారు, ‘‘ఈ వ్యక్తి మీ తాతముత్తాతలు ఆరాధించిన ఆరాధ్యుల నుండి మిమ్మల్ని దూరం చేయాలని కోరుతున్నాడు ’’ అని అంటారు. ఇంకా , ‘‘ఇది (ఖురాన్) కేవలం కల్పితమైన అబద్ధం మాత్రమే’’ అని అంటారు. ఈ అవిశ్వాసుల ముందుకు సత్యం వచ్చినప్పుడు, వారు ఇది స్పష్టమైన మంత్రజాలమే అని అన్నారు. వాస్తవానికి మేము వారికి ఇదివరకు కూడా ఏ గ్రంథాన్నీ ఇవ్వలేదు, దానిని వారు చదివేందుకు. నీకు పూర్వం వారి వైపునకు హెచ్చరిక చేసేవారినెవరినీ పంపలేదు , వారికి పూర్వం గతించినవారు ఇదే విధంగా తిరస్కరించారు , మేము వారికి ఇచ్చిన దానిలో పదోవంతుకు కూడ వీరు చేరలేదు, కాని వారు నా ప్రవక్తలను నిరాకరించినపుడు , చూడండి నేను వారికి విధించిన శిక్ష ఎంత కఠినంగా ఉండినదో.

**34. సబా** 46 - 50 ప్రవక్తా! వారితో ఇలా అను , ‘‘నేను మీకు ఒక విషయాన్ని బోధి స్తున్నాను. అల్లాహ్ కోసం , మీరు ఒక్కరొక్కరూ ఇద్దరిద్దరూ కలిసి మీ మేధను ఉపయోగించి ఆలోచించండి , అసలు మీ సహచరుని మాటలలో పిచ్చితనం ఏముందో అని? అతను, ఒక తీవ్రమైన శిక్షరావటానికి ముందు మీకు హెచ్చరిక చేసేవాడు మాత్రమే ’’ వారితో ఇలా అను : ‘‘ఒకవేళ నేను మీనుండి ప్రతిఫలమేదైనా కోరి ఉంటే , దానిని మీరే ఉంచుకోండి , ఇక నా ప్రతిఫలం అది అల్లాహ్ బాధ్యత , ఆయన సర్వసాక్షి.’’ వారితో ఇలా అను , ‘‘నా ప్రభువు (నాకు) సత్యస్ఫూర్తిని పంపుతున్నాడు. ఆయన గుప్తములైన యథార్థాలను అన్నింటినీ ఎరిగినవాడు. ’’ ఇలా అను, ‘‘సత్యం వచ్చేసింది ఇక అసత్యం ఏమి చేసినా నెగ్గజాలదు.’’ ఇలా అను, ‘‘ఒకవేళ నేను మార్గభ్రష్టుడనైతే, నా మార్గభ్రష్టత్వపు పాపఫలం నా మీదనే ఉంటుంది. ఒకవేళ నేను సన్మార్గంపై ఉంటే , నా ప్రభువు నాపై అవతరింపజేసే వహీ ఆధారంగానే ఉన్నాను. ఆయన అన్నీ వింటాడు, దగ్గరలోనే ఉన్నాడు.’’

**34. సబా** 51 - 54 నీవు ఆ సమయంలో వారిని చూస్తే ఎంత బాగుండును. అప్పుడు వారు భయకంపితులై తిరుగుతూ ఉంటారు, ఎటూ తప్పించుకునిపోలేరు. దగ్గరనుండే పట్టుకోబడతారు, అప్పుడు వారు, ‘‘మేము దానిని విశ్వసించాము’’ అని అంటారు. వాస్తవానికి దూరమైపోయిన వస్తువు ఇప్పుడెలా చేతికందు తుంది. ఇదివరకు వారు అవిశ్వాసానికి పాల్పడి ఉన్నారు నిజం తెలుసుకో కుండానే, దూరం నుంచే ఊహాపోహాలు చేశారు- అప్పుడు

వారు తాము ఎక్కువగా కోరుకునే దానికి దూరంచేయబడతారు  వారివంటి వారి పూర్వీకులు దూరం చేయబడినట్లు. వారు, అపమార్గం పట్టించే పెద్ద సంశయంలో పడిపోయారు.

**35. ఫాతిర్**

ఆయతులు : 45                    అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన  అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**35. ఫాతిర్** 1 - 2 అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన ఆకాశాలనూ , భూమినీ సృష్టించాడు. ఆయన దైవదూతలను సందేశహరులుగా నియమిస్తాడు. (ఎటువంటి దైవదూతలంటే) వారికి రెండేసి , మూడేసి, నాలుగేసి బాహువులు ఉంటాయి. ఆయన తన సృష్టి స్వరూపాన్ని తన ఇష్ట ప్రకారం పెంచుతాడు. నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు. అల్లాహ్ ప్రజల కొరకు ఏ కారుణ్యద్వారాన్ని తెరిచినా , దానిని అడ్డుకునే వాడెవ్వడూ లేడు. ఆయన మూసివేసిన దానిని అల్లాహ్ తరువాత మళ్ళీ తెరిచేవాడూ ఎవ్వడూ లేడు. ఆయన శక్తిమంతుడు , వివేచన కలవాడు.

**35. ఫాతిర్** 3 - 4 మానవులారా! అల్లాహ్ మీకు చేసిన ఉపకారాలను జ్ఞాపకం ఉంచుకోండి. అల్లాహ్ కాక , భూమ్యాకాశాల నుండి మీకు ఉపాధినిచ్చే మరొక సృష్టికర్త కూడా ఎవడైనా ఉన్నాడా - ఆయన తప్ప మరొక ఆరాధ్యుడెవ్వడూ లేడు. అసలు మీరు ఎవని వల్ల మోసపోతున్నారు ? ఇప్పుడు ఒకవేళ (ప్రవక్తా) వారు నిన్ను తిరస్కరిస్తున్నారు అంటే (ఇది క్రొత్త విషయమేమీ కాదు). నీకు పూర్వం కూడా చాలామంది దైవప్రవక్తలు తిరస్కరించబడ్డారు. వ్యవహారాలన్నీ చివరకు అల్లాహ్ వైపునకే మరలనున్నాయి.

**35. ఫాతిర్** 5 - 7 మానవులారా! నిశ్చయముగా అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసానికి గురిచేయకూడదు. ఆ మహావంచకుడు కూడా మిమ్మల్ని అల్లాహ్ విషయంలో మోసగించగలగకూడదు. యథార్థానికి షైతాను మీకు శత్రువు. కనుక మీరు కూడా వాడు మీ శత్రువే అని భావించండి. వాడు , తన అనుచరులు నరక వాసులలో చేరిపోవాలని వారిని తన మార్గం వైపునకు పిలుస్తున్నాడు, అవిశ్వాసానికి పాల్పడే వారికి కఠిన శిక్ష పడుతుంది. విశ్వసించి మంచిపనులు చేసేవారికి క్షమాభిక్ష గొప్ప ప్రతిఫలం లభిస్తాయి.

**35. ఫాతిర్** 8 - 9 ఎవనికి తన దుష్కార్యం అందంగా కనిపించేలా చేయబడిరదో మరియు అతడు దానిని మేలైనదిగా భావిస్తున్నాడో (ఆ వ్యక్తి మార్గభ్రష్టత్వానికి అసలు హద్దు అంటూ ఏమైనా ఉందా?) యథార్థం ఏమిటంటే, అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టత్వానికి గురిచేస్తాడు. తాను కోరిన వారికి ఋజుమార్గం చూపుతాడు. కనుక (ప్రవక్తా) అనవసరంగా నీ ప్రాణం ఈ ప్రజలకోసం ద్ణుఖానికీ , బాధకూ గురిఅయి హరించిపోకూడదు. వారు చేస్తూ

ఉన్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసు. వాయువులను పంపేవాడు అల్లాహ్ యే. తరువాత అవి మేఘాన్ని లేపుతాయి, ఆ తరువాత మేము దానిని ఒక పాడుబడ్డ నేల వైపునకు తీసుకుపోతాము , దానిద్వారా చచ్చిపడివున్న ఆ నేలనే బ్రతికిస్తాము. మరణించిన మానవులు బ్రతికి లేవటం కూడా ఇలానే జరుగు తుంది.

**35. ఫాతిర్** 10 అల్లాహ్ మాత్రమే గౌరవానికి పూర్తిగా అర్హుడనే విషయాన్ని గౌరవాభిలాషి అయిన ప్రతివాడూ తెలుసుకోవాలి. ఆయన వద్దకు అధిరోహించే వస్తువు పరిశుద్ధ వాక్కు మాత్రమే , సత్కర్మ దానిని పైకి ఎక్కిస్తుంది. ఇక కుతంత్రాలు చేసేవారు, వారికైతే కఠిన శిక్ష పడుతుంది. వారి కుతంత్రం దానంతట అదే నాశనమై పోతుంది.

**35. ఫాతిర్** 11 - 14 అల్లాహ్ మిమ్మల్ని మట్టితో సృష్టించాడు. తరువాత ఇంద్రియ బిందువులతో , ఆ తరువాత మిమ్మల్ని జంటలుగా చేశాడు (అంటే స్త్రీ పురుషులు). అల్లాహ్ కు తెలియకుండా ఏ స్త్రీ అయిన గర్భం దాల్చనూ లేదు, ప్రసవించనూలేదు. వయసు పెరుగుతున్న వాడెవడూ ఆయువును పొందలేడు. ఎవరి ఆయువులోనూ తగ్గింపు అనేది జరగదు, గ్రంథంలో వ్రాయబడి ఉన్న దాని ప్రకారం తప్ప. ఇది అల్లాహ్ కు చాలా సులభమైన పని. నీటి వనరులు రెండూ సమానం కావు ఒకటేమో తియ్యనిది , దప్పికను తీర్చేది , త్రాగటానికి మధురమైనది. రెండోదేమో గొంతు మండిరచే అంత ఉప్పనిది. కాని రెండిరటి నుంచీ మీరు స్వచ్ఛమైన తాజా మాంసాన్ని పొందు తారు. ధరించటానికి అలంకరణ సామగ్రిని వెలికి తీసుకుంటారు. మీరు చూస్తూనే ఉన్నారు ఈ నీటిలోనే పడవలు దాని గుండెలను చీల్చుకుంటూ పోతూ ఉంటాయి. మీరు అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించేందుకు తద్వారా ఆయనకు కృతజ్ఞులు అయ్యేందుకు. ఆయన పగలులోనికి రాత్రినీ , రాత్రిలోనికి పగలునూ జొనుపుతున్నాడు. సూర్యచంద్రు లను ఆయన నియమబద్ధులను చేసి ఉంచాడు. ఇదంతా ఒక నిర్ణీత వ్యవధి వరకు సాగిపోతోంది. (ఈ పనులన్నీ చేసే) ఆ అల్లాహ్ యే మీ ప్రభువు. సామ్రాజ్యాధికారం ఆయనదే. ఆయనను కాదని మీరు పిలిచే ఇతరులు కనీసం ఒక గడ్డిపోచకు కూడా యజమానులు కారు. వారిని వేడుకుంటే, వారు మీ ప్రార్థనలను వినలేరు. ఒకవేళ విన్నా , వాటికి ఏ సమాధానమూ మీకు ఇవ్వలేరు. మీరు కల్పించిన దైవత్వపు భాగస్వామ్యాన్ని వారు ప్రళయం నాడు తిరస్కరిస్తారు. సత్యాన్ని గురించిన ఈ సరైన సమాచారాన్ని తెలిసినవాడు తప్ప మరొకడెవ్వడూ మీకు అందజేయలేడు.

**35. ఫాతిర్** 15 - 26 మానవులారా! అల్లాహ్ అవసరం కలవారు మీరే. అల్లాహ్ సర్వసంపన్నుడు. స్వయంగానే స్తుతిపాత్రుడు. ఆయన కోరితే , మిమ్మల్ని తొలగించి , మరేదైనా సృష్టిని మీ స్థానంలో తీసుకురాగలడు. అలా చేయటం అల్లాహ్ కు ఏ మాత్రమూ కష్టం కాదు. బరువు మోసే వాడెవ్వడూ మరెవరి బరువునూ మోయడు , బరువును మోసే ఆత్మ ఏదైనా తన బరువును మోయ మని ఇతరులను పిలిచినప్పుడు , దాని బరువు యొక్క రవ్వంత భాగాన్నయినా ఎత్తుకోవటానికి ఎవ్వడూ ముందుకు రాడు , అతడు ఎంత సమీప బంధువైనా సరే. (ప్రవక్తా) చూడకపోయినప్పటికీ తమ ప్రభువునకు భయపడే వారినీ , నమాజును స్థాపించేవారిని మాత్రమే నీవు

హెచ్చరించగలవు. ఏ వ్యక్తి అయినా తన మేలు కొరకే పరిశుద్ధతను అవలంబిస్తాడు. అల్లాహ్ వైపునకే అందరూ మరలవలసి ఉన్నది. గుడ్డివాడూ , కళ్ళున్నవాడూ సమానులు కాలేరు. చీకట్లూ , వెలుగూ, ఒకటి కావు. చల్లని నీడా, ఎండతాపమూ ఒకే విధంగా ఉండవు. బ్రతికి ఉన్నవారూ , చనిపోయిన వారూ సమానులు కాలేరు. అల్లాహ్ తనకు ఇష్టమైన వారికి వినిపింపజేస్తాడు. కాని (ప్రవక్తా) సమాధులలో ఖననమైన వారికి నీవు వినిపించలేవు. నీవు కేవలం హెచ్చరిక చేసేవాడవు మాత్రమే. మేము నిన్ను సత్యంతో పంపాము. శుభవార్త ఇచ్చేవానిగా , భయపెట్టేవానిగా జేసి. హెచ్చరిక చేసే వాడెవ్వడూ రాని జాతి ఏదీ లేదు. ఒకవేళ ఇప్పుడు ఈ ప్రజలు నిన్ను తిరస్కరిస్తున్నారంటే, వీరికి పూర్వం గతించిన వారు కూడా తిరస్కరించారు. వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన ప్రమాణాలనూ, గ్రంథా లనూ , కాంతిమంతమైన మార్గదర్శక సూత్రాలు ఇచ్చే ఉద్గ్రంథాన్నీ తీసుకు వచ్చారు. తరువాత విశ్వసించని వారిని నేను పట్టుకున్నాను చూడండి నా శిక్ష ఎంత కఠినమైనదో.

**35. ఫాతిర్** 27 - 28 ఆకాశం నుండి అల్లాహ్ వర్షం కురిపించటాన్ని నీవు చూడటం లేదా ? తరువాత దాని ద్వారా మేము రకరకాల రంగు రంగుల పండ్లను ఉత్పత్తి చేస్తాము. కొండలలో కూడా తెల్లని , ఎఱ్ఱని, కారునలుపు చారలు కనిపిస్తాయి, వాటి రంగులు వేర్వేరుగా ఉంటాయి. ఈ విధంగానే మానవుల, జంతువుల, పశువుల రంగులు కూడా భిన్నమైనవే. యథార్థమేమిటంటే , అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయపడతారు. నిస్సందేహంగా అల్లాహ్ శక్తిమంతుడు, మన్నించేవాడూను.

**35. ఫాతిర్** 29 - 35 అల్లాహ్ గ్రంథాన్ని పారాయణం చేసేవారూ, నమాజును స్థాపించే వారూ, మేము వారికి ఇచ్చిన ఉపాధినుండి బహిరంగంగానూ, రహస్యంగానూ ఖర్చు చేసేవారూ నిశ్చయంగా ఏమాత్రం నష్టం రాని వ్యాపారాన్ని కోరుకుం టున్నారు. (ఈ వ్యాపారంలో వారు తమ సర్వస్వాన్నీ ఎందుకు ధారపోశారంటే) , అల్లాహ్ వారి ప్రతిఫలాలను పూర్తిగా వారికి ఇవ్వాలని , అదనంగా తన అనుగ్రహం నుండి ఇంకా వారికి ప్రసాదించాలని. నిస్సంశయంగా అల్లాహ్ క్షమించేవాడూ, విలువనిచ్చేవాడూను. (ప్రవక్తా) మేము వహీద్వారా నీ వైపునకు పంపిన గ్రంథమే సత్యమైనది, దానికి పూర్వం వచ్చిన గ్రంథాలను ధ్రువీక రించేది. నిస్సందేహంగా అల్లాహ్ తన దాసుల స్థితిని బాగా ఎరిగినవాడు , ప్రతిదానిపై దృష్టిని ఉంచేవాడు. తరువాత మేము (ఈ గ్రంథ వారసత్వం కోసం) మా దాసులలో నుండి మేము ఎన్నుకున్న వారినే ఈ గ్రంథానికి వారసులుగా చేశాము. ఇప్పుడు వారిలో ఒకడు తన ఆత్మకు అన్యాయం చేసుకుంటున్నాడు. మరొకడు , మధ్యస్థంగా ఉంటున్నాడు, ఇంకొకడు అల్లాహ్ అనుమతితో పుణ్యకార్యాలలో ముందడుగు వేస్తున్నాడు.ఇదే మహా అనుగ్రహం. శాశ్వతంగా ఉండే ఉద్యాన వనాలలోకి వారు ప్రవేశిస్తారు. అక్కడ వారిని సువర్ణ కంకణాలతో , ముత్యాలతో అలంకరించటం జరుగుతుంది. అక్కడ వారు పట్టు వస్త్రాలు ధరిస్తారు. ఇలా అంటారు , ''అల్లాహ్ కు కృతజ్ఞతలు. ఆయన మా దుఃఖాన్ని తొలగించాడు. నిశ్చయంగా మా ప్రభువు క్షమించే వాడూ , విలువ ఇచ్చేవాడూను. ఆయన మమ్మల్ని తన అనుగ్రహం వల్ల శాశ్వత నివాస స్థలంలో నివసింపజేశాడు. ఇక ఇక్కడ మాకు ఏ కష్టమూ ఉండదు, ఏ అలసటా కలుగదు.''

**35. ఫాతిర్** 36 - 37 అవిశ్వాసానికి పాల్పడిన వారికి నరకాగ్ని ఉన్నది. వారు చనిపోవా లనే తీర్పూ ఇవ్వబడదు , వారి నరక యాతనను ఏమాత్రం తగ్గించటమూ జరుగదు. ఇలా మేము అవిశ్వాసానికి పాల్పడే ప్రతి వ్యక్తికీ ప్రతిఫలం ఇస్తాము. వారు అక్కడ పెడబొబ్బలు పెడుతూ ఇలా అంటారు , ''మా ప్రభూ! మమ్మల్ని ఇక్కడ నుండి బయటకు తియ్యి, మేము పూర్వం చేసిన పనులకు భిన్నంగా మంచి పనులు చేయటానికి.'' (వారికి ఇలా జవాబు ఇవ్వబడుతుంది) గుణపాఠం నేర్చుకోదలచినవాడు గుణపాఠం నేర్చుకోవటానికి సరిపడిన ఆయుష్షును మేము మీకు ఇవ్వలేదా? మీ వద్దకు హెచ్చరిక చేసేవాడు కూడా వచ్చి ఉన్నాడు కదా! ఇక రుచి చూడండి (యాతనను). దుర్మార్గులకు ఇక్కడ సహాయం చేసేవాడెవ్వడూ లేడు.

**35. ఫాతిర్** 38 - 39 నిస్సందేహంగా అల్లాహ్ ఆకాశాలలోనూ , భూమిపైనా అగోచరముగా ఉన్న ప్రతి దానిని ఎరుగును. గుండెలలో దాగి ఉన్న రహస్యాలను సయితం ఆయన ఎరుగును. మిమ్మల్ని భూమిపై ఖలీఫాలుగా చేసినవాడు ఆయనేగా! ఇక ఎవడైనా అవిశ్వాసానికి పాల్పడితే , అతని అవిశ్వాసం సంకటమై అతని మీదనే ఉంటుంది. అవిశ్వాసుల అవిశ్వాసం వారి ప్రభువు యొక్క ఆగ్రహాన్ని వారిపై ఉగ్రతరం చేస్తుందే తప్ప వారికి ఏ వృద్ధినీ కలిగించదు. అవిశ్వాసులకు నష్టంలో పెరుగుదల తప్ప అభివృద్ధి ఏమీ ఉండదు.

**35. ఫాతిర్** 40 - 41 (ప్రవక్తా!) వారితో ఇలా అను, ''అల్లాహ్ ను కాదని మీరు వేడుకునే మీ భాగస్వాములను మీరు ఎప్పుడైనా చూశారా ? వారు భూమిపై సృష్టించింది ఏమిటో నాకు చూపండి ? లేక ఆకాశాలలో వారికున్న భాగస్వామ్యం ఏమిటి ?'' (ఒకవేళ వారు చూపలేకపోతే , ఇలా అడుగు) మేము వారికి ఏదైనా పత్రాన్ని వ్రాసి ఇచ్చామా, దాని ఆధారంగా వారు (తమ ఈ షిర్క్ విషయంలో) స్పష్టమైన ఒక ప్రమాణం కలిగి ఉండటానికి? లేదు. అయితే ఈ దుర్మార్గులు ఒకరినొకరు కేవలం కుయుక్తులతో మోసగించుకుంటూ పోతున్నారు. యథార్థమేమిటంటే ఆకాశాలనూ, భూమిని (తమ స్థానాల నుండి) తొలగిపోకుండా ఆపి ఉంచినవాడు అల్లాహ్ యే. ఒకవేళ అవి తొలగిపోతే, అల్లాహ్ తరువాత వాటిని నిలిపి ఉంచేవాడు మరొకడెవడూ లేడు. నిస్సందేహంగా అల్లాహ్ సహనశీలుడు, క్షమించేవాడూను.

**35. ఫాతిర్** 42 - 45 ఒకవేళ హెచ్చరిక చేసేవాడు తమ వద్దకు వచ్చి ఉన్నట్లయితే , తాము ప్రపంచంలోని ప్రతి జాతికంటె మిక్కిలి సన్మార్గగాములమై ఉండేవారము అని వారు కఠోరమైన ప్రమాణాలు చేసి అంటూ ఉండేవారు. కాని హెచ్చరిక జేసేవాడు వారివద్దకు వచ్చినపుడు , అతని ఆగమనం వారిలో సత్యం నుండి పలాయనాన్ని తప్ప మరి దేనినీ అధికం చేయలేకపోయింది. వారు భూమిపై మరింత దురహంకారముతో తిరుగసాగారు , దుష్టపన్నాగాలు పన్నసాగారు. వాస్తవానికి దుష్ట పన్నాగాలు వాటిని పన్నే వారినే ముంచివేస్తాయి. ఇక పూర్వపు జాతుల పట్ల అల్లాహ్ అవలంబించిన విధానాన్నే వారిపట్ల కూడా అవలంబిం చాలని వారు నిరీక్షిస్తున్నారా?

అలా అయితే, నీవు అల్లాహ్ విధానంలో మార్పును ఎంతమాత్రం చూడలేవు. అల్లాహ్ సంప్రదాయాన్ని దాని నిర్ణీత మార్గం నుండి ఏ శక్తి మరల్చటాన్ని కూడా నీవు ఎన్నటికీ చూడలేవు. వారు భూమిపై ఎన్నడూ సంచరించి ఉండలేదా - వారికి పూర్వం గతించిన మరియు వారికంటే అత్యంత బలవం తులైన ప్రజలు ఎదుర్కొన్న పరిణామం ఎలాంటిదో వారికి కనిపించేందుకు? అల్లాహ్ ను అశక్తుడుగా చేసే వస్తువు ఏదీ ఆకాశాలలోనూ లేదు , భూమిపైనా లేదు. ఆయన సర్వమూ ఎరిగినవాడు , సర్వమూ చేయగల సమర్థుడు. ఒకవేళ ఆయన ప్రజలను వారు చేసిన అకృత్యాలకుగాను పట్టుకుంటే, భూమిపై ఏ ప్రాణినీ సజీవంగా వదలిపెట్టేవాడు కాడు. కాని ఆయన వారికి ఒక నిర్ణీత కాలం వరకు గడువు ఇస్తున్నాడు. తరువాత వారి నిర్ణీత వ్యవధి పూర్తి అయినప్పుడు, అల్లాహ్ యే స్వయంగా తన దాసులను చూసుకుంటాడు.

**36. యాసీన్**

ఆయతులు : 83 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**36. యాసీన్** 1 - 6 యాసీన్. వివేక విలసితమైన ఖురాన్ సాక్షిగా! నీవు నిశ్చయముగా దైవ ప్రవక్తలలోని వాడవు ఋజుమార్గంలో ఉన్నావు. (ఈ ఖురాన్) శక్తిమంతుడూ , కరుణామయుడూ అయినవాడు అవతరింప జేసినది నీవు ఒక జాతిని హెచ్చరించేందుకు. దాని పూర్వీకులు హెచ్చరిక చేయబడని కారణంగా అశ్రద్ధకు గురిఅయి ఉన్నారు.

**36. యాసీన్** 7 - 11 వారిలో అనేకులు శిక్షా నిర్ణయానికి అర్హులయ్యే ఉన్నారు. కనుకనే వారు విశ్వసించటం లేదు. మేము వారి మెడలలో పట్టాలు వేశాము , వాటివల్ల వారు గడ్డాల వరకు బంధించబడ్డారు. అందుకని వారు తలను ఎత్తి నిలుచున్నారు. మేము వారి ముందు ఒక గోడనూ, వారి వెనుక మరొక గోడనూ నిలబెట్టాము. మేము వారిని (ఈ విధంగా) కప్పి వేశాము , ఇక వారికి ఏమీ తోచదు. నీవు వారిని హెచ్చరించినా , హెచ్చరించకపోయినా వారికి ఒక్కటే వారు విశ్వసించరు. నీవు హితబోధను అనుసరించేవాణ్ణి మాత్రమే , కరుణామయుడైన దేవుణ్ణి చూడకుండానే భయపడేవాణ్ణి మాత్రమే హెచ్చరించగలవు. అతనికి క్షమాభిక్ష , గొప్ప ప్రతిఫలమూ లభిస్తాయనే శుభవార్త అందించు.

**36. యాసీన్** 12 మేము నిశ్చయంగా ఒక రోజున మృతులను బ్రతికిస్తాము. వారు చేసే పనులన్నింటినీ మేము నమోదు చేస్తూనే ఉన్నాము. వారు తమ వెనుక విడిచివెళ్ళిన చిహ్నాలను కూడా మేము నమోదు చేస్తూ ఉన్నాము. ప్రతి విషయాన్నీ మేము ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాసిపెట్టాము.

**36. యాసీన్** 13 - 15 ఉదాహరణగా వారికి ఆ పట్టణవాసుల గాథను వినిపించు అక్కడకు దైవప్రవక్తలు వచ్చినప్పటి గాథను మేము వారివద్దకు ఇద్దరు ప్రవక్తలను పంపాము. వారు ఆ ఇద్దరినీ అసత్యవాదులు అని తిరస్కరించారు. తరువాత మేము వారికి సహాయంగా మూడో అతన్ని పంపాము. వారందరూ, ''మేము మీ వద్దకు దైవ ప్రవక్తలుగా పంపబడ్డాము '' అని అన్నారు. పట్టణవాసులు ఇలా అన్నారు , ''మీరు మా వంటి కొందరు మానవులు తప్ప మరేమీ కారు. కరుణామయుడైన దేవుడు ఏ విషయాన్నీ అవతరింపజేయలేదు , మీరు కేవలం అబద్ధం పలుకుతున్నారు.''

**36. యాసీన్** 16 - 19 దైవప్రవక్తలు ఇలా అన్నారు , ''మేము నిశ్చయంగా మీ వద్దకు దైవప్రవక్తలుగా పంపబడిన విషయాన్ని మా ప్రభువు ఎరుగును. స్పష్టంగా సందేశాన్ని అందజేయటం తప్ప మాపైని మరొక బాధ్యత ఏదీ లేదు. పట్టణవాసులు ఇలా అన్నారు , ''మేము మిమ్మల్ని (మాకు) ఒక దుశ్శకునంగా పరిగణిస్తున్నాము. మీరు (ఈ పనిని) మానుకోకపోతే , మేము మిమ్మల్ని రాళ్లతో కొట్టి చంపేస్తాము. మీరు మా తరఫు నుండి అత్యంత బాధాకరమైన శిక్షను పొందుతారు.'' దానికి దైవప్రవక్తలు ఇలా అన్నారు : ''మీ దుశ్శకునం స్వయంగా మీ వెంటనే ఉంది. మీకు హితబోధ చేయటం వల్లనేగా మీరు ఇలా మాట్లాడుతున్నారు ? అసలు విషయం , మీరు హద్దులను అతిక్ర మించారు.''

**36. యాసీన్** 20 - 25 ఇంతలోనే పట్టణంలోని ఒక మారుమూల ప్రాంతం నుండి ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి ఇలా అన్నాడు : ''నా జాతి ప్రజలారా! దైవప్రవక్త లను అనుసరించండి. మీ నుండి ఏ ప్రతిఫలమూ కోరనివారిని , సత్యమార్గంలో ఉన్న వారిని అనుసరించండి. ఎవరు నన్ను సృష్టించారో , ఎవరి వైపునకు మీరంతా మరలిపోనున్నారో, ఆయనను నేనెందుకు పూజించకూడదు ? అయనను కాదని నేను ఇతరులను ఆరాధ్యులుగా చేసుకోవాలా? వాస్తవానికి ఒకవేళ కరుణామయుడైన దేవుడు నాకేదైనా నష్టం కలిగించదలిస్తే నాకు వారి సిఫారసూ ఏ విధంగానూ ఉపయోగపడదు , వారు నన్ను విడిపించనూ లేరు. ఒకవేళ నేను అలాచేస్తే , స్పష్టమైన మార్గభ్రష్టత్వానికి గురిఅవుతాను. నేను మీ ప్రభువును విశ్వసించాను. కనుక మీరు కూడా నా మాట వినండి.''

**36. యాసీన్** 26 - 27 (చివరకు వారు అతన్ని హత్య చేశారు) ఆ వ్యక్తితో, ''స్వర్గంలో ప్రవేశించు'' అని అనబడిరది. అతను ఇలా అన్నాడు: ''నా ప్రభువు ఏ విషయాన్నిబట్టి నన్ను క్షమించి, గౌరవనీయులలోకి ప్రవేశింప జేశాడో, నా జాతి వారికి తెలిస్తే ఎంత బాగుండును!''

**36. యాసీన్** 28 - 32 ఆ తరువాత అతని జాతి మీదకు మేము ఆకాశం నుండి ఏ సైన్యాన్నీ దించలేదు. అసలు సైన్యాన్ని పంపే అవసరం మాకు లేదు. కేవలం ఒక ప్రేలుడు మాత్రమే సంభవించింది. అంతే వారంతా ఒక్కసారిగా ఆరిపోయారు. దాసుల స్థితి కడు శోచనీయం. వారి వద్దకు ఏ దైవ ప్రవక్త వచ్చినా, వారు అతన్ని ఎగతాళి చేశారు. వారికి పూర్వం మేము ఎన్నో జాతులను నాశనం చేసిన విషయాన్ని వారు చూడలేదా ? తరువాత అవి మళ్ళీ

ఎన్నడూ వారి వద్దకు తిరిగి రాని విషయాన్ని కూడా వారు గమనించలేదా ? వారందరూ ఒక రోజు మా ముందు హాజరు పరచబడవలసి ఉన్నది.

**36. యాసీన్** 33 - 36 వారికి మృతభూమి ఒక సూచన. మేము దానికి ప్రాణం పోశాము. దానినుండి మీరు తినే ధాన్యం ఉత్పత్తి చేశాము. మేము దానిలో ఖర్జూరం , ద్రాక్ష తోటలను పెంచాము. దానిలో నుండి ఊటలు చిమ్మేలా చేశాము, వారు దాని ఫలాలను తినాలని. ఇదంతా వారి చేతులు సృష్టించింది కాదు కదా! అలాంటప్పుడు వారు కృతజ్ఞతలు తెలుపరా ? అన్ని రకాల జంటలను సృష్టించిన ఆయన పరిశుద్ధుడు. అవి భూమిలో నుండి పుట్టే వృక్షరాసులలోని వైనా సరే లేదా స్వయంగా వారి జాతి (అంటే మానవులు)లో నుండి అయినా సరే లేదా వారు అసలే ఎరుగని వస్తువులలో నుండి అయినాసరే.

**36. యాసీన్** 37 - 40 వారికి, రాత్రి మరొక సూచన. మేము దానిపై నుండి పగలును తొలగించినప్పుడు వారిని చీకటి ఆవరిస్తుంది. ఇక సూర్యుడు - అతడు తన నిజస్థానం దిశగా పయనిస్తున్నాడు. ఇది మహా శక్తిమంతుడూ , గొప్ప జ్ఞానీ అయిన దేవుడు నిర్దేశించిన నియమావళి. ఇక చంద్రుడు, అతడి కొరకు మేము దశలను నిర్దేశించాము. వాటిని దాటుకుంటూ వెళ్లి , చివరకు అతడు మళ్లీ ఎండిన ఖర్జూరపు కొమ్మ మాదిరిగా మారిపోతాడు. చంద్రుణ్ణి పట్టుకోవటం సూర్యుడి తరం కాదు. అదేవిధంగా రాత్రి , పగలును దాటి పోజాలదు. అవన్నీ వేర్వేరు కక్ష్యలలో తేలియాడుతూ ఉన్నాయి.

**36. యాసీన్** 41 - 44 వారికి ఇది కూడా ఒక సూచనే. మేము వారి సంతతిని నిండు నావలోకి ఎక్కించాము , తరువాత అటువంటి నావలనే వారికొరకు ఎన్నో సృజించాము. వాటిలో వారు ప్రయాణం చేస్తున్నారు. మేము తలచుకుంటే వారిని ముంచివేయగలము. అప్పుడు వారి మొర ఆలకించేవాడెవ్వడూ ఉండడు. ఏ విధంగానూ వారు రక్షింపబడలేరు. కేవలం మా అనుగ్రహమే వారిని గట్టెక్కించి ఒక ప్రత్యేక గడువు వరకు జీవితాన్ని అనుభవించే అవకాశాన్ని కలిగిస్తుంది.

**36. యాసీన్** 45 - 47 మీకు ముందు రాబోతున్న పరిణామం నుండి , మీకు పూర్వం జరిగిన పరిణామం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకొనండి. బహుశా మీపై దయచూపటం జరుగుతుంది అని వారితో అన్నపుడు (వారు వినీ విననట్లు వెళ్లిపోతారు). వారి ముందుకు వారి ప్రభువు సూచనలలోని ఏ సూచన వచ్చినా దానిపట్ల వారు ఏమాత్రం శ్రద్ధ వహించరు. ఇంకా , అల్లాహ్, మీకు ప్రసాదించిన ఉపాధినుండి కొంత అల్లాహ్ మార్గంలో కూడా ఖర్చుపెట్టండి అని వారికి చెప్పినపుడు , తిరస్కరించేవారు విశ్వసించేవారితో, ''అల్లాహ్ తలిస్తే తానే స్వయంగా ఆహారమివ్వగల వారికి మేము ఆహారమివ్వాలా? మీరు పూర్తిగా మార్గం తప్పిపోయారు'' అని అంటారు.

**36. యాసీన్** 48 - 53 వారు ‘‘ప్రళయం గురించిన ఈ బెదిరింపు అసలు ఎప్పుడు నెరవేరుతుంది ? నీవు సత్యవంతుడవయితే చెప్పు?’’ అని అడుగుతారు. వాస్తవానికి వారు దేనికొరకు నిరీక్షిస్తున్నారో , అది కేవలం ఒక ప్రేలుడు మాత్రమే. అది వారిని అకస్మాత్తుగా పట్టుకుంటుంది అప్పుడు వారు (తమ ప్రాపంచిక వ్యవహారాలను గురించి) వివాదపడుతూ ఉంటారు. ఆ సమయంలో వారు మరణ శాసనం సయితమూ వ్రాయలేరు. తమ ఇళ్లకు తిరిగి పోనూ లేరు. ఆ తరువాత ఒక శంఖం ఊదబడుతుంది. అప్పుడు వారు హఠాత్తుగా తమ ప్రభువు ముందు హాజరయ్యేందుకు తమ సమాధుల నుండి బయటికి వస్తారు. భయాందోళనలతో వారు‘‘అరే, మనల్ని మన పడకల నుండి లేపి ఎవరు నిలబెట్టారు ?’’ అని అంటారు. ‘‘ఇది దయామయుడైన దేవుడు వాగ్దానం చేసిన విషయమే. దైవప్రవక్తల మాట పూర్తిగా నిజమే ’’ అది భయంకరమైన ఒక ధ్వని మాత్రమే. దానితో అందరూ మా ముందు హాజరు పరచబడతారు.

**36. యాసీన్** 54 - 64 ఈనాడు ఎవరికీ రవ్వంత అన్యాయమైనా జరగదు. మీరు చేస్తూ ఉండిన కర్మల ప్రకారమే మీకు ప్రతిఫలం ఇవ్వబడుతుంది - ఈనాడు స్వర్గవాసులు సుఖాలు అనుభవించటంలో నిమగ్నులై ఉంటారు. వారూ, వారి సతీమణులూ చల్లని నీడలలో , మెత్తని పీఠాలపై విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. వారు తినటానికి , త్రాగటానికీ రుచికరమైన సకల పదార్థాలు అక్కడ ఉంటాయి. వారు కోరేదల్లా వారి కొరకు సిద్ధంగా ఉంటుంది. కారుణ్య ప్రభువు తరఫు నుండి వారికి సలామ్ (శాంతి వచనం) చెప్పబడుతుంది - అపరాధులారా! ఈనాడు మీరు వేరు అయిపోండి. ఆదమ్ సంతానమా! నేను మీకు ఉపదేశించలేదా , సైతానుకు దాస్యం చెయ్యవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువని, నా దాస్యమే చెయ్యండి అని, ఇదే సరైన మార్గమని? కాని, దీని తరువాత కూడా వాడు మీలోని ఒక పెద్ద వర్గాన్ని అపమార్గం పట్టించాడు. మీకు బుద్ధిలేకుండా పోయిందా ? భయపడండి అని మీకు చెబుతూ ఉండిన నరకం ఇదే. ప్రపంచంలో మీరు పాల్పడిన అవిశ్వాసానికి ఫలితంగా ఇపుడు దీనికి ఇంధనం అయిపోండి.

**36. యాసీన్** 65 ఈనాడు మేము వారి నోళ్లు మూయిస్తాము. వారు ప్రపంచంలో ఏమేమి సంపాదిస్తూ ఉండేవారో వారి చేతులు మాకు చెబుతాయి, వారి కాళ్లు సాక్ష్యమిస్తాయి.

**36. యాసీన్** 66 - 68 మేము తలచుకుంటే, వారి కళ్లను మూసివేయగలం, అప్పుడు వారిని దారివైపునకు పరుగిడి చూడమనండి. వారికి దారి ఎలా కనిపిస్తుంది ? మేము తలచుకుంటే వారిని వారి స్థానంలోనే కదలకుండా ఉంచగలం. ఇక వారు ముందుకూ నడవలేరు , వెనుకకూ తిరగలేరు. మేము దీర్ఘాయుష్షునిచ్చే , వ్యక్తి స్వరూపాన్నే మార్చివేస్తాము. (ఈ పరిస్థితులను చూసైనా) వారికి బుద్ధి రాదేమిటి?

**36. యాసీన్** 69 - 70 మేము అతనికి (ఈ ప్రవక్తకు) కవిత్వం నేర్పలేదు, కవిత్వం అతనికి శోభించదు కూడా. ఇది ఒక హితబోధ మాత్రమే , స్పష్టంగా పఠనీయమైన గ్రంథం మాత్రమే - అతను బ్రతికి ఉన్న ప్రతి మనిషినీ హెచ్చరించేందుకూ తిరస్కారులకు వ్యతిరేకంగా అభియోగం స్థాపించ బడేందుకు.

**36. యాసీస్** 71 - 76 మా చేతులు రూపకల్పన చేసిన దాని నుండి ప్రజలకై మేము పశువులను సృజించాము , ఇపుడు వారు వాటికి యజమానులయ్యారు. వారు ఈ విషయాన్ని గమనించరా ? మేము వాటిని వారికి ఇలా స్వాధీనపరిచాము- వాటిలో కొన్నిటిపై వారు స్వారి చేస్తారు , కొన్నిటి మాంసాన్ని తింటారు. వాటిలో వారికి రకరకాల ప్రయోజనాలూ పానీయాలూ ఉన్నాయి. అయినా వారు కృతజ్ఞత చూపరేమిటి ? ఇవన్నీ వాస్తవాలైనప్పటికీ వారు అల్లాహ్ ను కాదని ఇతరులను దేవుళ్ళుగా చేసుకున్నారు. తమకు సహాయం చేయటం జరుగుతుందని వారు ఆశలు పెట్టుకున్నారు. కాని వారు వారికి ఏ సహాయమూ చేయలేరు. అయినా ప్రజలు వారి కొరకు సైన్యం మాదిరిగా సర్వ సన్నద్ధులై ఉన్నారు. సరే కానీ నీవు మాత్రం వారు కల్పిస్తున్న మాటలకు బాధపడకు. వారి రహస్య విషయాలను బహిరంగ విషయాలనూ అన్నింటినీ మేము ఎరుగుదుము.

**36. యాసీస్** 77 - 83 మేము మానవుడిని వీర్య బిందువుతో సృజించిన విషయం అతను చూడటం లేదా? అయినా అతడు బహిరంగ ప్రత్యర్థిగా నిలబడ్డాడు. ఇపుడు అతడు మాకు పోలికలు కల్పిస్తున్నాడు , తన పుట్టుకనే మరిచిపోతున్నాడు. పైగా, శిథిలమై పోయిన ఈ ఎముకలకు తిరిగి ఎవరు జీవం పోస్తారు ? అని వాదిస్తున్నాడు. అతడికి ఇలా చెప్పు , ''మొదట వాటిని సృష్టించిన వాడే మళ్లీ వాటికి జీవం పోస్తాడు. '' సృష్టికి సంబంధించిన ప్రతి విషయమూ ఆయనకు తెలుసు. మీకై ఆయనే పచ్చని వృక్షాల నుండి అగ్నిని సృష్టించాడు. మీరు దానితో కుంపట్లు రాజేసుకుంటారు. ఆకాశాలనూ భూమినీ సృష్టించగలిగిన వాడు వీరిలాంటి వారిని పుట్టించలేడా? ఎందుకు చేయలేడు, ఆయన మహా నిపుణుడైన సృష్టికర్త అయినప్పుడు ? ఆయన ఏదైనా చేయదలచుకున్నప్పుడు, దాన్ని కేవలం ''అయిపో'' అని మాత్రమే ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది. ప్రతి విషయానికి సంబంధించిన సర్వాధికారాలు తన చేతిలో ఇముడ్చుకున్న ఆయన ఎంతో పరిశుద్ధుడు. ఆయన సన్నిధికే మీరంతా మరలిపోవలసి ఉంది.

**37. అస్ సాఫ్ఫాత్**

ఆయతులు : 182 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**37. అస్ సాఫ్ఫాత్** 1 - 5 వరుసగా బారులు తీరి నిలబడే వారు సాక్షిగా , గద్దించేవారూ, శపించేవారూ సాక్షిగా, హితబోధ వాక్కులు వినిపించేవారు సాక్షిగా , మీ నిజమైన ఆరాధ్యదైవం కేవలం ఒక్కడే - ఆయన భూమికీ , ఆకాశాలకూ, భూమ్యా కాశాలలో ఉన్న సమస్తానికీ ప్రభువు, తూర్పు దిక్కులన్నింటికీ ప్రభువు.

**37. అస్ సాఫ్ఫాత్** 6 - 10 మేము ప్రపంచాకాశాన్ని నక్షత్రాల అలంకరణతో తీర్చిదిద్దాము , ధిక్కారి అయిన ప్రతి షైతాన్ బారినుండి దానిని సురక్షితంగా ఉంచాము. ఈ షైతానులు పై లోకపు అధిష్టానపు దూతల మాటలు

వినలేరు, ప్రతి దిశ నుండి కొట్టబడతారు , తరుమబడతారు, వారికి ఎడతెగని శిక్షపడుతుంది. ఒకవేళ వారిలో ఎవడైనా ఏదైనా మాటను ఎగరేసుకుపోతున్నప్పుడు, ఒక తీక్షణమైన అగ్ని జ్వాల అతడిని వెంటాడుతుంది.

**37. అస్ సాఫ్ఫాత్** 11 - 18 ఇపుడు వారిని అడగండి. వారిని సృష్టించటం కష్టతరమా లేక మేము సృష్టించిన ఈ సకల చరాచరాలను సృష్టించటం కష్టతరమా అని. వారిని మేము జిగురు వంటి మట్టితో సృజించాము. మీరు (అల్లాహ్ శక్తి సామర్థ్యాల మహిమలను చూచి) ఆశ్చర్య చకితులవుతున్నారు , వారేమో పరిహసిస్తున్నారు. ఎంత నచ్చజెప్పినా వారు చెవికెక్కించుకోరు. ఏదైనా సూచనను చూస్తే, వారు దానిని ఎగతాళి చేసి ఎగురగొడతారు, ఇలా అంటారు, ''ఇది పూర్తిగా మాయాజాలమే. కాకపోతే , మేము చనిపోయి , మట్టిగా మారి , అస్థిపంజరంగా మిగిలిపోయినపుడు, మళ్ళీ మమ్మల్ని బ్రతికించి లేపటం జరిగేపనేనా ? పూర్వకాలం నాటి మా తాత , ముత్తాతలు సైతం లేపబడతారా?'' వారితో, ''అవును (లేపబడతారు) మీరు (దేవుని ముందు) నిస్సహాయులు' అని అను.

**37. అస్ సాఫ్ఫాత్** 19 - 32 అది కేవలం ఒక పెద్ద గద్దింపు మాత్రమే. హఠాత్తుగా వారు (తమకు తెలుపబడుతూ ఉన్న విషయాలనన్నింటినీ) కళ్ళారా చూస్తూ ఉంటారు. అప్పుడు వారు ''మేమెంత దౌర్భాగ్యులం , ఇది తీర్పుదినం కదా! అని అంటారు - మీరు తిరస్కరిస్తూ ఉండే తీర్పుదినమే ఇది. (ఆజ్ఞ అవుతుంది) దుర్మార్గులందరినీ, వారి సహచరులను దేవుణ్ణి కాదని వారు ఆరాధిస్తూ ఉండిన దైవాలనూ చుట్టుముట్టి తీసుకురండి. తరువాత వారందరికీ నరకానికి దారి చూపండి. '' కాస్త వారిని ఆపండి , ఒక విషయం అడగాలి. ''ఏమయింది మీకు ఇపుడెందుకని ఒకరికొకరు సహాయం చేసుకోరు ? అరే, ఈరోజు వారు తమను తామూ (ఒకరినొకరు) అప్పగిస్తున్నారేమిటి! '' ఆ తరువాత వారు ఒకరి వైపునకు మరొకరు తిరిగి పరస్పరం వాదించుకోవటం ప్రారంభి స్తారు. (అనుచరులు తమ నాయకులతో ఇలా) అంటారు , ''మీరు మా వద్దకు కుడివైపు నుండి వచ్చేవారు.'' వారు సమాధానం ఇస్తారు,''అది కాదు, అసలు మీరే విశ్వసించేవారు కారు , మీ మీద మాకు అధికారం లేదు, మీరు సహజం గానే తలబిరుసువాళ్ళు. చివరకు మీరు తప్పకుండా యాతనను చవిచూస్తారు '' అని మా ప్రభువు అన్న మాటకు మేము అర్హులమైపోయాము. కనుక మేము మిమ్మల్ని మార్గభ్రష్టులుగా చేశాము, స్వయంగా మేము కూడా మార్గభ్రష్టుల మయ్యే ఉన్నాము.

**37. అస్ సాఫ్ఫాత్** 33 - 39 ఈ విధంగా వారందరూ ఆ రోజు ఉమ్మడిగా శిక్ష అనుభవిస్తారు. మేము అపరాధుల విషయంలో ఇలానే చేస్తూ ఉంటాము. వారు ఎలాంటి వారంటే, ''అల్లాహ్ తప్ప మరొక సత్యమైన ఆరాధ్యుడు లేడు'' అని చెప్పినపుడు, వారు అహంకారంతో, ''మేము ఒక పిచ్చి కవి కోసం మా దేవుళ్లను వదలుకో వాలా ?'' అని అనేవారు. వాస్తవానికి అతను సత్యాన్నే తెచ్చాడు , దైవప్రవక్తలను ధ్రువీకరించాడు (ఇపుడు వారితో ఇలా అనటం జరుగుతుంది) మీరు తప్పని సరిగా బాధాకరమైన శిక్ష చవిచూస్తారు. మీకు ఏ ప్రతిఫలం ఇవ్వబడుతూ ఉన్నా అది మీరు చేస్తూ ఉండిన కర్మల ఫలమే.

**37. అస్ సాఫ్ఫాత్** 40 - 49 అయితే , ఎన్నుకోబడిన దైవదాసులు మాత్రం (ఈ దుష్ఫలితానికి గురికాకుండా) సురక్షితంగా ఉంటారు. వారికొరకు అందరూ ఎరిగిన ఆహారమే ఉన్నది , రుచికరమైన అన్ని రకాల పదార్థాలు ఉన్నాయి, భోగభాగ్యాలతో విలసిల్లే ఉద్యానవనాలు ఉన్నాయి. అందు వారు సగౌరవంగా ఉంచబడతారు. సోఫాలపై ఎదురెదురుగా కూర్చుంటారు. మద్యపు చెలమల నుండి పాత్రలు మాటి మాటికీ నింపబడి వారి మధ్య త్రిప్పబడతాయి. మెరిసిపోతున్న మధువు , త్రాగేవారికి అది ఎంతో మధురం. దానివల్ల వారి శరీరానికి నష్టం ఉండదు, వారి బుద్ధీ చెడిపోదు. వారి దగ్గర తమ చూపులను నిగ్రహించుకునే అందమైన కళ్లు గల స్త్రీలు ఉంటారు. వారు గ్రుడ్డు గుల్ల క్రింద దాగి ఉండే పొరలాంటి కోమలాంగులు.

**37. అస్ సాఫ్ఫాత్** 50 - 59 తరువాత వారు ఒకరి వైపునకొకరు తిరిగి పరిస్థితులను గురించి పరస్పరం అడిగి తెలుసుకుంటారు. వారిలో ఒకడు ఇలా అంటాడు : ''ప్రపం చంలో నాకు ఒక మిత్రుడు ఉండేవాడు. అతను నాతో ఇలా అంటూండేవాడు , నీవు కూడా ధ్రువీకరించే వారిలో చేరిపోయావా ? మనం చనిపోయి , మట్టిగా మారి , అస్థిపంజరంగా మిగిలిపోయినపుడు నిజంగానే మనకు ప్రతిఫలమూ , శిక్షా అనేవి ఉంటాయా ? ఇప్పుడతను ఎక్కడున్నాడో, మీరు చూడదలచు కున్నారా ?'' ఇలా చెప్పి అతను తొంగి చూడగానే , అతనికి నరకంలోని ఒక అగాధంలో అతను కనిపిస్తాడు. అపుడు అతన్ని సంబోధిస్తూ ఇలా అంటాడు , ''దేవుని సాక్షిగా, నీవు నన్ను సర్వ నాశనం చేసి ఉండేవాడివి. నా ప్రభువు అనుగ్రహం లేకపోయి ఉంటే, ఈ రోజు నేను కూడా పట్టుబడి వచ్చిన వారిలో ఒకడినై ఉండేవాణ్ణి. సరే , అయితే ఇక మేము చనిపోమా ? మాకు రావలసిన చావేదో ముందు వచ్చేసిందా ? ఇక మాకు ఎలాంటి శిక్షాపడదా?''

**37. అస్ సాఫ్ఫాత్** 60 - 74 నిశ్చయంగా ఇదే మహత్తరమైన విజయం. ఇలాంటి విజయం కోసమే కర్మ శీలురు కర్మలు చేయాలి. చెప్పండి , ఈ ఆతిథ్యం మంచిదా లేక రాకాసి జముడు (జఖ్ఖూమ్) చెట్టు ఆతిథ్యం మంచిదా ? మేము ఆ చెట్టును దుర్మార్గుల పాలిటి పరీక్షగా చేశాము. అది నరకం అడుగు భాగం నుండి మొలిచే ఒక చెట్టు. దాని మొగ్గలు షైతానుల తలలు మాదిరిగా ఉంటాయి. నరకవాసులు వాటిని తింటారు. వాటితోనే కడుపు నింపుకుంటారు. అదీగాక, త్రాగటానికి వారికి సల సల కాగే నీరు లభిస్తుంది. ఆ తరువాత వారు మళ్లీ నరకాగ్ని వైపునకే తిరిగి వస్తారు. తమ తాత ముత్తాతలు మార్గభ్రష్టులవటాన్ని చూసినప్పటికీ , వారి అడుగు జాడలలోనే పరుగెత్తిన వారు వీరే. వాస్తవానికి వారికి పూర్వం కూడా చాలా మంది మార్గభ్రష్టులై పోయారు. వారివద్దకు మేము హెచ్చరిక చేసే సందేశహరులను పంపాము. ఇక చూడండి , హెచ్చరిం చబడిన వారి పర్యవసానం ఏమయిందో , ఈ దుష్పరిణామం నుండి అల్లాహ్ తన కొరకు ప్రత్యేకించుకున్న దాసులు మాత్రమే సురక్షితంగా ఉన్నారు.

**37. అస్ సాఫ్ఫాత్** 75 - 82 మమ్మల్ని (ఇంతకు పూర్వం) నూహ్ వేడుకున్నాడు. కనుక చూడండి , మేము (ప్రార్థనలకు) ఎంత మంచి సమాధానం ఇచ్చేవారమో. మేము అతనినీ అతని కుటుంబాన్నీ పెద్ద విపత్తునుండి

కాపాడాము. అతని సంతతి మాత్రమే మిగిలి ఉండేలా చేశాము. ఇంకా తరువాతి తరాల వారిలో అతని కీర్తి ప్రతిష్ఠలు నిలిచి ఉండేలా చేశాము. సమస్త ప్రపంచ వాసులలో నూహ్ కు శాంతి కలుగుగాక! మేము సత్కార్యం చేసేవారికి ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తూ ఉంటాము. నిశ్చయంగా అతను విశ్వాసులైన మా దాసులలోని వాడు , తరువాత మేము రెండో వర్గాన్ని ముంచి వేశాము.

**37. అస్ సాఫ్ఫాత్** 83 - 87 ఇబ్రాహీమ్, నూహ్ మార్గంలోనే నడిచేవాడు. అతను తన ప్రభువు సాన్నిధ్యానికి నిర్మల హృదయంతో వచ్చినప్పుడు తన తండ్రితోనూ , తన జాతి ప్రజలతోనూ ఇలా అన్నాడు , ''మీరు ఆరాధిస్తున్న ఈ వస్తువులేమిటి? అల్లాహ్ ను కాదని మీరు , మిథ్యా దైవాలను కోరుకుంటున్నారా , అసలు సకల లోకాల ప్రభువు విషయంలో మీ అభిప్రాయమేమిటి?''

**37. అస్ సాఫ్ఫాత్** 88 - 98 ఆ తరువాత అతను తన దృష్టిని నక్షత్రాల వైపు సారించి , వారితో ''నా ఆరోగ్యం బాగాలేదు'' అని అన్నాడు. అందువల్ల వారు అతనిని వదలిపెట్టి వెళ్ళిపోయారు. వారు వెళ్ళిన తరువాత అతను మెల్లగా వారి దేవుళ్ల ఆలయం లోకి జొరబడి, ''మీరు తినరేమిటి? అసలు ఏమయింది మీకు, మీరు పలకను కూడా పలుకుటలేదే?'' అని అడిగాడు. ఆ తరువాత అతను వాటిపై విరుచుకు పడి కుడిచేత్తో వాటిని గట్టిగా కొట్టాడు. వారు (తిరిగి వచ్చి) అతని వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చారు. అపుడు అతను ఇలా అన్నాడు , ''స్వయంగా మీరే చెక్కుకున్న వస్తువులను మీరు పూజిస్తారా? వాస్తవానికి అల్లాహ్ యే మిమ్మల్నీ సృష్టించాడు, మీరు తయారు చేసే వస్తువులనూ సృష్టించాడు.'' వారు పరస్పరం ఇలా చెప్పుకున్నారు, ''ఇతని కొరకు ఒక గుండం తయారు చేసి, భగ భగ మండే అగ్నిలోకి ఇతనిని విసరివేయండి. '' వారు అతనికి ప్రతికూలంగా ఒక చర్య తీసుకోదలచిచారు. కాని మేము వారినే మట్టి కరిపించాము.

**37. అస్ సాఫ్ఫాత్** 99 - 113 ఇబ్రాహీమ్ ఇలా అన్నాడు: ''నేను నా ప్రభువు వైపునకు వెళు తున్నాను , ఆయనే నాకు మార్గం చూపుతాడు. ప్రభూ! నాకు శీలవంతుడైన ఒక కుమారుణ్ణి ప్రసాదించు.'' (ఈ ప్రార్థనకు సమాధానంగా) మేము అతనికి ఒక సహనశీలుడైన కుమారుడు కలుగుతాడనే శుభవార్తను అందజేశాము. ఆ బాలుడు అతనికి తోడుగా పనిచేసే వయస్సుకు చేరుకున్నప్పుడు (ఒకనాడు) ఇబ్రాహీమ్ అతనితో ఇలా అన్నాడు: ''కుమారా! నేను నిన్ను 'జిబహ్' (బలి) చేస్తున్నట్లుగా కలలో చూశాను. ఇక నీ అభిప్రాయమేమిటో చెప్పు.'' అతను ఇలా అన్నాడు: ''నాన్నగారూ! మీకు ఆజ్ఞాపించబడిన దానిని నెరవేర్చండి. అల్లాహ్ సంకల్పిస్తే మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు.'' చివరకు వారు ఉభయులూ (దైవాజ్ఞను) శిరసావహించారు. తరువాత ఇబ్రాహీమ్ తన కుమారుణ్ణి నుదుటిపై బోరగిల పరుండబెట్టాడు. అప్పుడు మేము అతనిని పిలిచి ఇలా అన్నాము: ''ఇబ్రాహీమ్! నీవు కలను నిజం చేసి చూపించావు. సత్కార్యం చేసేవారికి మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిశ్చయంగా ఇది ఒక స్పష్టమైన పరీక్ష.'' మేము ఒక పెద్ద ఖుర్బానీని పరిహారంగా ఇచ్చి ఆ బాలుణ్ణి విడిపించుకున్నాము అతని కీర్తి

ప్రతిష్ఠలు తరువాతి తరాల వారిలో శాశ్వతంగా నిలిచిపోయేలా చేశాము. ఇబ్రాహీమ్‌కు శాంతి కలుగు గాక! మేము సత్కార్యాలు చేసే వారికి ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిశ్చయంగా అతను విశ్వసించిన మా దాసులలోని వాడు. మేము అతనికి ఇస్‌హాఖ్‌ను గురించిన శుభవార్తను అందజేశాము. (అతను) ఒక దైవప్రవక్త , సజ్జనులలోని వాడు. అతనికి ఇస్‌హాఖ్‌కూ మేము శుభాలను ఇచ్చాము. ఇపుడు వారిద్దరి సంతతిలో ఒకడు సత్క్రియాశీలుడైతే మరొకడు స్పష్టంగా తన ఆత్మకు ద్రోహం చేసుకున్నవాడు.

**37. అస్ సాఫ్ఫాత్** 114 - 122 మేము మూసాకు, హారూన్‌కూ మేలు చేశాము. వారికీ వారి జాతి ప్రజలకూ మహా విపత్తు నుండి విముక్తి కలిగించాము. మేము వారికి సహాయం చేశాము. కనుకనే వారు ప్రాబల్యం వహించారు. మేము వారికి స్పష్టమైన గ్రంథాన్ని ప్రసాదించాము. వారికి ఋజుమార్గం చూపాము. తరువాతి తరాల వారిలో వారిని గురించిన మంచి ప్రస్తావన మిగిలి ఉండేలా చేశాము. మూసాకూ , హారూన్‌కూ శాంతి కలుగుగాక! మేము పుణ్యకార్యాలు చేసేవారికి ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిశ్చయంగా వారు విశ్వాసులైన మా దాసులలోని వారు.

**37. అస్ సాఫ్ఫాత్** 123 - 132 నిశ్చయంగా ఇల్యాస్ కూడా మా సందేశహరులలో ఒకడు. జ్ఞాపకం తెచ్చుకో , అప్పుడు అతను తన జాతివారితో ''మీరు భయపడరా? సృష్టికర్తలలోకెల్లా ఉత్తముడైన సృష్టికర్తయున్నూ మీకూ , మీకు పూర్వం ఉండిన మీ తాత ముత్తాతలకూ ప్రభువున్నూ అయిన అల్లాహ్ ను వదలివేసి మీరు 'బఅల్'ను వేడుకుంటున్నారా?'' కాని వారు అతనిని అసత్యవాది అని తిరస్కరించారు. కనుక వారు తప్పనిసరిగా శిక్ష కొరకు హాజరు పరచబడతారు, ప్రత్యేకించుకోబడిన దైవదాసులు తప్ప. ఇల్యాస్‌ను గురించిన మంచి ప్రస్తావ నను మేము తరువాతి తరాలలో నిలిచి ఉండేలా చేశాము. ఇల్యాస్‌కు శాంతి కలుగుగాక! మేము సత్కార్యాలు చేసేవారికి ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిస్సందేహంగా అతను విశ్వాసులైన మా దాసులలో ఒకడు.

**37. అస్ సాఫ్ఫాత్** 133 - 138 లూత్ కూడా దైవప్రవక్తలుగా నియమించి పంపబడిన వారిలో ఒకడు. జ్ఞాపకం తెచ్చుకో, అపుడు మేము అతనికీ, అతని కుటుంబంలోని వారికందరికీ విముక్తి కలిగించాము, ఒక వృద్ధురాలికి తప్ప ఆమె, వెనుక ఉండిపోయిన వారిలో ఉండిపోయింది. ఆ తరువాత మిగతా వారందరినీ సర్వనాశనం చేశాము. ఈనాడు మీరు రేయింబవళ్లు వారి శిథిల ప్రదేశాల మీదుగా పోతూ ఉంటారు. (వాటిని చూచి అయినా) మీకు బుద్ధిరాదా?

**37. అస్ సాఫ్ఫాత్** 139 - 148 నిశ్చయంగా యూనుస్ కూడా దైవప్రవక్తలలోని వాడే. జ్ఞాపకం తెచ్చుకో , అపుడు అతను నిండు పడవ వైపునకు పరుగెత్తాడు. అక్కడ చీటీలో పాల్గొన్నాడు , కానీ ఓడిపోయాడు. చివరకు అతనిని చేప మ్రింగివేసింది. అతను దూషితుడయ్యాడు. అపుడు అతను దైవ నామ స్మరణం చేసేవారిలో ఒకడై ఉండకపోయినట్లయితే, ప్రళయదినం వరకు ఆ చేప కడుపులోనే ఉండిపోయేవాడు. చివరకు మేము అతనిని తీవ్ర

అస్వస్థస్థితిలో ఒక తీర మైదానం మీద పడవేశాము. అతని మీద ఒక తీగల చెట్టును మొలిపించాము. ఆ తరువాత మేము అతన్ని ఒక లక్ష లేక అంతకంటె ఎక్కువ మంది ప్రజల వద్దకు పంపాము. వారు విశ్వసించారు. మేము ఒక నిర్ణీత కాలం వరకు వారు జీవించి ఉండేలా చేశాము.

**37. అస్ సాఫ్ఫాత్** 149 - 157 వారిని కొంచెం ఇలా అడుగు నీ ప్రభువునకు కూతుళ్లున్నూ వారికి కొడుకులూనా? (వారి మనస్సుకు ఇది నచ్చే విషయమేనా). మేము నిజంగా దైవదూతలను స్త్రీలుగానే సృష్టించామా? వారు కళ్లతో చూసిన విషయాన్నే పలుకుతున్నారా? బాగా విను, అల్లాహ్ సంతానవంతుడు అనే విషయాన్ని వారే స్వయంగా కల్పించి అంటున్నారు. వాస్తవంగానే వారు అసత్యవాదులు. అల్లాహ్ తన కొరకు కొడుకులకు బదులుగా కూతుళ్ళను కోరుకున్నాడా? ఏమయింది మీకు, ఇటువంటి నిర్ణయం తీసుకుంటున్నారు? మీకు స్పృహలేదా? లేక మీరు చెబుతున్న ఈ మాటలకు మీ వద్ద స్పష్టమైన ప్రమాణం అంటూ ఏదైనా ఉంటే , మీ గ్రంథాన్ని తీసుకురండి, మీరు సత్య వంతులే అయితే.

**37. అస్ సాఫ్ఫాత్** 158 - 166 వారు అల్లాహ్కూ, దైవదూతలకూ మధ్య రక్త సంబంధాన్ని కల్పించారు. వాస్తవానికి వారు నేరస్తులుగా ప్రవేశపెట్టబడేవారని దైవదూతలకు బాగా తెలుసు. (ఈ దైవ దూతలు ఇలా అంటారు), ''ఆయన విశుద్ధదాసులు తప్ప, ఇతరులు, తనకు ఆపాదించే గుణగణాల నుండి అల్లాహ్ పరిశుద్ధుడు. కనుక మీరూ మీ ఈ దైవాలూ అల్లాహ్ నుండి ఎవరినీ మళ్లించలేరు భగ భగ మండే నరకాగ్నిలో కాలిపోనున్నవాణ్ణి తప్ప. మా పరిస్థితి ఇది : మాలో ప్రతి ఒక్కరికీ ఒక స్థానం అంటూ నిర్ణయమై ఉన్నది. మేము పంక్తులు తీరి ఉన్న సేవకులం , స్తోత్రం చేసేవాళ్లం.''

**37. అస్ సాఫ్ఫాత్** 167 - 179 వారు ఇంతకు పూర్వం ఇలా అంటూ ఉండేవారు , ''పూర్వపు జాతులకు లభించిన 'జిక్ర్ (గ్రంథం) మా వద్ద ఉండినట్లయితే , మేము నిజమైన అల్లాహ్ భక్తులమై ఉండేవారము. '' కాని (అది వచ్చేసినపుడు) వారు దానిని నిరాకరించారు. ఇక త్వరలోనే వారికి (ఈ వైఖరికి పర్యవసానం) తెలిసిపోతుంది. మేము పంపిన మా దాసులకు మేము ఇదివరకే వాగ్దానం చేసి ఉన్నాము , తప్పకుండా వారికి సహాయం చేయబడుతుందనీ మా సైన్యమే ప్రాబల్యం వహించి తీరుతుందనీ. కనుక ప్రవక్తా! కొంతకాలం వరకు , వారిని వారి స్థితిలో వదలిపెట్టి చూస్తూ ఉండు. త్వరలోనే స్వయంగా వారు కూడా చూస్తారు. వారు మా శిక్ష రాకకోసం తొందరపెడుతున్నారా? ఆ శిక్ష వారి ఇంటి ప్రాంగణంలో దిగేరోజున హెచ్చరించబడిన వారికి అత్యంత కఠినంగా ఉంటుంది. కనుక కొంత కాలం పాటు వారిని వారి మానాన వదలిపెట్టి చూస్తూ ఉండు , త్వరలోనే స్వయంగా వారు కూడా చూస్తారు.

**37. అస్ సాఫ్ఫాత్** 180 - 182 నీ ప్రభువు పరిశుద్ధుడు, గొప్ప గౌరవోన్నతులు కలవాడు, వారు కల్పిస్తున్న అన్ని విషయాలకూ అతీతుడు, దైవప్రవక్తలపై శాంతి వర్షించుగాక! సకల లోకాల ప్రభువే సకల స్తోత్రాలకు అర్హుడు.

**38. సాద్**

ఆయతులు : 88                    అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన  అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**38. సాద్** 1 - 3 సాద్. హితబోధతో నిండి ఉన్న ఖుర్ఆన్ సాక్షిగా! అసలు విషయం ఏమిటంటే విశ్వసించటానికి తిరస్కరించిన ఈ ప్రజలే దురహంకారులు , పరమమూర్ఖులు, వారికి పూర్వం మేము ఇటువంటి ఎన్నో జాతులను నాశనం చేశాము. (వారికి వోగాలము దాపురించగా) అపుడు వారు హాహాకారాలు చేశారు. కాని అది తప్పించుకునే సమయం కాదు కదా!

**38. సాద్** 4 - 8 ... భయపెట్టేవాడొకడు స్వయంగా తమనుండే వచ్చాడని వారు ఆశ్చర్యపడ్డారు. సత్యతిరస్కారులు ఇలా అనసాగారు , ''ఇతడు మంత్రవాది , అసత్యవాది, సమస్త దైవాల స్థానంలో కేవలం ఒకే ఒక దైవాన్ని నిలబెట్టాడేమిటి? ఇది ఎంతో విచిత్రమైన విషయం. '' జాతి నాయకులు ఇలా అంటూ వెళ్ళిపోయారు , ''పదండి మీ దైవాల ఆరాధన పట్ల స్థిరంగా ఉండండి. ఈ విషయం ఒక ప్రయోజనం కోరి చెప్పబడుతోంది. ఈ విషయాన్ని మేము ఇటీవలి కాలపు సమాజంలో ఎవరినోటా వినలేదు. ఇది కల్పిత విషయం తప్ప మరేమీ కాదు. మన అందరిలోనూ కేవలం ఇతడొక్కడే అర్హుడా ఇతని మీదనే అల్లాహ్ యొక్క 'హితోపదేశం' అవతరించటానికి?''

**38. సాద్** ... 8 - 10 అసలు విషయం ఏమిటంటే, వారు నా ''జిక్ర్ (గ్రంథం) గురించి సంశయగ్రస్తులయ్యారు. వారు నా శిక్షను రుచి చూడలేదు కాబట్టి ఈ మాటలన్నీ అంటున్నారు. ప్రబలుడు , ప్రదాత అయిన నీ ప్రభువు కారుణ్య నిధులు వారి అధీనంలో ఉన్నాయా ? ఆకాశాలకూ, భూమికీ, వాటికి మధ్య ఉన్న వస్తువులకూ వారు యజమానులా? అలా అయితే, ప్రాపంచిక సాధనాల శిఖరాలకు చేరి చూడమనండి.

**38. సాద్** 11 - 16 ఇది బృందాలలోని ఒక చిన్న బృందం మాత్రమే. ఇదే స్థలంలో అది పరాజయం పాలు కానున్నది. వీరికి పూర్వం నూహ్ జాతివారు , ఆద్ జాతివారు , మేకుల ఫిరౌన్ , సమూద్ జాతివారు , లూత్ జాతివారు, ''అయికా'' వారు తిరస్కరించే ఉన్నారు. వారూ బృందాలే. వాటిలో ప్రతిబృందమూ దైవసందేశహరులు అసత్యవాదులని తిరస్కరించింది. నా శిక్షా నిర్ణయం వారికి సరిగ్గా అతికిపోయింది. వీరు కూడా కేవలం ఒక్క ప్రేలుడు కోసమే ఎదురు చూస్తున్నారు. ఆ తరువాత మరొక ప్రేలుడేదీ సంభవించదు. వారు , ''మా ప్రభూ! లెక్కదినానికి ముందే మా భాగం మాకు తొందరగా ఇచ్చివెయ్యి'' అని అంటున్నారు.

**38. సాద్** 17 - 26 ప్రవక్తా! వారు కల్పించే మాటల పట్ల సహనం వహించు. వారికి మా దాసుడు దావూద్ వృత్తాంతాన్ని వినిపించు. అతను గొప్ప బలవంతుడు , ప్రతి వ్యవహారంలోనూ అల్లాహ్ వైపునకు మరలుతూ ఉండేవాడు. మేము పర్వతాలను అతనికి లొంగిపోయేలా చేశాము. ఉదయం, సాయంత్రం అవి అతనితో పాటు కీర్తన

చేసేవి. పక్షులు గుమిగూడేవి , అవన్నీ అతని కీర్తన వైపునకు శ్రద్ధతో మరలేవి. మేము అతని రాజ్యాన్ని శక్తిమంతమైనదిగా చేశాము. అతనికి వివేకాన్ని ప్రసాదించాము. తిరుగులేని తీర్పు చెప్పే సామర్థ్యాన్ని అనుగ్రహించాము. ఇంకా, గోడపైకి ఎక్కి అతని మేడ గదిలోకి జొరబడిన వ్యాజ్యగాళ్ల వార్త ఏదైనా నీదాకా వచ్చిందా? వారు దావూద్ ముందుకు వచ్చినపుడు అతను వారిని చూచి కలవరపడ్డాడు. వారు ఇలా అన్నారు : ''భయపడకండి. ఒక వ్యాజ్యంలో మేము ఇద్దరం ప్రత్యర్థులం. మాలో ఒకడు మరొకనికి అన్యాయం చేశాడు. కనుక మీరు మా మధ్య సత్యం ప్రకారం సరి ్జైన తీర్పు చెయ్యండి. అన్యాయం చేయకండి. మాకు ఋజుమార్గం చూపండి. ఇతను నా సోదరుడు , ఇతని వద్ద తొంభైతొమ్మిది గొర్రెలు ఉన్నాయి. నా దగ్గరేమో కేవలం ఒకే గొర్రె ఉన్నది. ఈ ఒక్క గొర్రెను కూడా నాకు ఇచ్చివేయి అని ఇతడు అన్నాడు. మాటలతో నన్ను వశపరచు కున్నాడు.'' దావూద్ ఇలా సమాధానం చెప్పాడు : ''ఈ వ్యక్తి తన గొర్రెలలో నీ గొర్రెను కలుపు కోవాలని అనుకుని నిస్సందేహంగా నీకు అన్యాయం చేశాడు. యథార్థం ఏమిటంటే , కలసి ఒకచోట ఉండేవారు తరచూ ఒకరికొకరు అన్యాయం చేసుకుంటూ ఉంటారు. అయితే విశ్వసించి , సత్కార్యాలు చేసేవారు మాత్రం దీనికి దూరంగా ఉంటారు. అటువంటివారు కొందరు మాత్రమే.'' (ఈ విషయం అంటూ) అసలు అతన్ని పరీక్షించేందుకే మేము ఇలా చేశామని దావూద్ అర్థం చేసుకున్నాడు. కనుక అతను తన ప్రభువును క్షమాభిక్ష కోరాడు , సజ్దాలో పడిపోయాడు , పశ్చాత్తాపంతో మరలాడు. అపుడు మేము అతని తప్పును మన్నించాము. నిశ్చయంగా మా వద్ద అతని కొరకు సాన్నిహిత్యం, ఉత్తమ పర్యవసానం ఉన్నాయి. (మేము అతనితో ఇలా అన్నాము) , ''దావూద్! మేము నిన్ను భూమిపై ప్రతినిధిగా నియమించాము. కనుక నీవు ప్రజల మధ్య న్యాయంతో పరిపాలన చెయ్యి. మనోరథాలను అనుసరించకు, ఎందుకంటే అది నిన్ను అల్లాహ్ మార్గం నుండి తప్పిస్తుంది. అల్లాహ్ మార్గం నుండి తప్పిపోయినవారికి తీవ్రమైన శిక్ష పడటం నిశ్చయం. ఎందుకంటే వారు లెక్కల దినాన్ని మరచిపోయారు.

**38. సాద్** 27 - 29 మేము ఈ ఆకాశాన్నీ , ఈ భూమినీ వాటి మధ్య ఉన్న ఈ ప్రపంచాన్నీ వృధాగా సృజించలేదు. ఇది అవిశ్వాసుల భ్రమమాత్రమే. అటువంటి అవిశ్వాసులకు నరకాగ్ని ద్వారా వినాశం తప్పదు. విశ్వసించి సత్కార్యాలు చేసేవారినీ , ధరణిపై కల్లోలాన్ని రేకెత్తించే వారినీ మేము ఒకటిగా చేసెయ్యాలా ? భయభక్తులు కలవారిని మేము పాపాత్ములు మాదిరిగా చేయాలా ? - (ప్రవక్తా!) మేము ఎంతో శుభవంతమైన ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము ప్రజలు దాని వాక్యాలను గురించి ఆలోచించాలనీ , బుద్ధిమంతులూ, ఆలోచనాపరులూ దానినుండి గుణపాఠం నేర్చుకోవాలనీని.

**38. సాద్** 30 - 40 దావూద్‌కు మేము సులైమాన్ (వంటి కొడుకు)ను ప్రసాదించాము అతను మంచిదాసుడు , అత్యధికంగా తన ప్రభువు వైపునకు మరలుతూ ఉండేవాడు. బాగా తర్ఫీదు పొందిన అతివేగంగా పరుగెత్తే గుర్రాలు అతని ముందుకు తీసుకురాబడినప్పటి ఆ సాయంత్ర సమయం ప్రస్తావించదగినది. అప్పుడు అతను ఇలా అన్నాడు: ''నేను ఈ సంపదను నా ప్రభువు సంస్మరణార్థం ప్రేమించాను. '' చివరికి ఆ గుర్రాలు

కనుమరుగైపోయినపుడు, ''వాటిని నా వద్దకు తిరిగి తీసుకురండి '' (అని ఆజ్ఞాపించాడు). తరువాత అతను వాటి పిక్కలనూ, మెడలనూ నిమురసాగాడు. (చూడండి) మేము సులైమాన్‌ను కూడా పరీక్షకు గురిచేశాము. అతని సింహాసనంపై ఒక కళేబరాన్ని తెచ్చి పడవేశాము. అప్పుడు అతను (అల్లాహ్ వైపునకు) మరలి ఇలా అన్నాడు : ''నా ప్రభూ! నన్ను క్షమించు. నా తరువాత మరెవ్వరికీ లభించని రాజ్యాధికారాన్ని నాకు ప్రసాదించు. నిస్సందేహంగా అసలు దాతవు నీవే.'' అప్పుడు మేము గాలిని అతని వశం చేశాము. అది అతని ఆజ్ఞానుసారం అతను కోరిన వైపునకు మృదువుగా వీచేది. మేము షైతానులను అతని అధీనంలో ఉంచాము. వాటిలో నిర్మాణం చేసేవీ, నీటిలో మునిగి వెదికేవీ , సంకెళ్లతో బంధింపబడిన ఇతరమైనవి కూడా ఉన్నాయి. (మేము అతనితో ఇలా అన్నాము), ''ఇది మా అనుగ్రహం, నీకు ఇష్టమైన వాడికి దానిని ఇచ్చివేయి. నీకు ఇష్టం కాని వాడికి ఇవ్వకు నీకు ఆ అధికారం ఉన్నది. లెక్క అడగటం ఉండదు. '' నిశ్చయంగా అతనికి మా వద్ద సమీప స్థానమూ ఉత్తమ ఫలితమూ ఉన్నాయి.

**38. సాద్** 41 - 44 మా దాసుడు అయ్యూబ్‌ను గురించి ప్రస్తావించు అప్పుడు అతను , ''షైతాన్ నన్ను దుఃఖానికీ, యాతనకూ గురిచేశాడు,'' అని తన ప్రభువునకు మొరపెట్టుకున్నాడు. (మేము అతనికి ఇలా ఆజ్ఞాపించాము), ''నీ కాలుతో నేలపై కొట్టు ఇదో చల్లని నీరు స్నానానికీ , త్రాగటానికీను.'' మేము అతనికి అతని కుటుంబాన్ని తిరిగి ఇచ్చాము. వారితో పాటు ఇంకా అంతమందిని కూడా ఇచ్చాము, మా తరఫు నుండి కారుణ్యంగానూ, బుద్ధీ యోచన కలవారి కొరకు హితబోధగా ఉండేందుకు. (మేము అతనితో ఇలా అన్నాము), ''గుప్పెడు పుల్లలు తీసుకో, వాటితో కొట్టు, నీ ఒట్టును భగ్నం చేయకు ,'' మేము అతనిని సహనశీలునిగా చూశాము అతను మంచిదాసుడు , తన ప్రభువు వైపునకు ఎక్కువగా మరలుతూ ఉండేవాడు.

**38. సాద్** 45 - 48 మా దాసులైన ఇబ్రాహీమ్ , ఇస్‌హాఖ్, యాఖూబ్‌లను గురించి ప్రస్తావించు. వారు గొప్ప కార్యశీలురు, దూరదృష్టికలవారు. మేము వారిని ఒక విశిష్టగుణం కారణంగా ఎన్నుకున్నాము- అది వారిలోని పరలోక చింతన. నిశ్చయంగా మా దృష్టిలో వారు ఎన్నుకోబడిన పుణ్యపురుషులలో పరిగణింప బడతారు. ఇస్మాయీల్, అల్ యస్అ, జుల్‌కిఫ్‌ల్‌లను గురించి ప్రస్తావించు వారందరూ పుణ్యపురుషులలోని వారు.

**38. సాద్** 49 - 54 ఇది ఒక ప్రస్తావన: (ఇక వినండి) భయభక్తులు కలవారి కొరకు నిశ్చయంగా ఉత్తమ నివాసం ఉన్నది శాశ్వతమైన స్వర్గవనాలు ఉన్నాయి వాటి ద్వారాలు వారి కొరకు తెరువబడి ఉంటాయి వాటిలో వారు దిండ్లకు ఆనుకుని కూర్చుంటారు ఎక్కువగా పండ్లనూ పానీయాలనూ కోరుతూ ఉంటారు వారి ప్రక్కన సమవయస్కులైన, లజ్జావతులైన భార్యలు ఉంటారు. ఈ వస్తువులే లెక్కల రోజున మీకు ప్రసాదించబడతాయని వాగ్దానం చేయబడు తోంది. ఇది మా ప్రసాదం, ఇది అనంతం.

**38. సాద్** 55 - 64 ఇది భయభక్తులు కలవారి పర్యవసానం. ఇక తలబిరుసుతనం కలవారికి అతి చెడ్డ నివాసం ఉన్నది, అది నరకం అందులో వారు కాల్చ బడుతూ ఉంటారు. అది బహుచెడ్డ నివాస స్థలం. ఇదీ వారికి లభించేది కనుక వారు సల సల మరిగే నీటినీ , చీము, నెత్తురులనూ, ఇంకా ఇటువంటి చేదు పదార్థాలనూ రుచి చూడాలి. (తమ అనుచరులు నరకం వైపునకు రావటాన్ని చూచి వారు పరస్పరం ఇలా అనుకుంటారు) ''ఇది ఒక సైన్యం, మీ వైపునకు తోసుకుంటూ వస్తోంది. వారికి స్వాగతం పలకటం అనేదిలేదు, వారు అగ్నిలో కాలేవాళ్లు'' వారు వీరితో ఇలా అంటారు: ''లేదు, స్వయంగా మీరే కాల్చబడుతున్నారు. మీకు ఏ స్వాగతమూ లేదు. ఈ పర్యవసానాన్ని మా ముందుకు తెచ్చింది మీరేకదా! ఎంత పాపిష్ఠ నివాస స్థలం ఇది. '' వారు ఇంకా ఇలా అంటారు: ''మా ప్రభూ! మమ్మల్ని ఈ దుష్పరిణామానికి చేరవేసే ఏర్పాట్లు చేసిన వాడికి రెట్టింపు నరక శిక్షను ఇవ్వు. '' తరువాత వారు ఒకరితో ఒకరు ఇలా అనుకుంటారు, ''ఏమిటి ఈ విశేషం! మనం ప్రపంచంలో చెడ్డవారుగా భావించినవారు మనకు ఎక్కడా కనిపించరే ? మనం ఊరికే వారిని ఎగతాళి చేశామా లేక వారు మనకు కనుమరుగయ్యారా ?'' నిస్సం దేహంగా ఇది నిజం నరకవాసుల మధ్య ఇటువంటి తగాదాలే జరుగుతాయి.

**38. సాద్** 65 - 68 (ప్రవక్తా!) వారితో ఇలా అను , ''నేను కేవలం హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే. అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్యదైవం ఎవ్వడూ లేడు, ఆయన అద్వితీయుడు, అందరిపై ఆధిక్యం కలవాడు, ఆకాశాలకూ, భూమికీ స్వామి, వాటి మధ్య ఉన్న సకల వస్తువులకూ ప్రభువు , మహాశక్తిమంతుడు, క్షమించేవాడు.'' వారితో ఇంకా ఇలా అను: ''ఇది ఒక గొప్ప వార్త. దానిని విని కూడా మీరు పెడముఖం పెడుతున్నారు.''

**38. సాద్** 69 - 85 (వారితో ఇలా అను), ''ఉన్నత స్థాయిలో ఉన్నవారి మధ్య వివాదం జరిగినప్పటి సమయం గురించి నాకు ఏమీ తెలియదు. నేను స్పష్టంగా బహిరంగంగా హెచ్చరిక చేసేవాణ్ణి అయినందువల్లనే ఈ విషయాలు వహీ ద్వారా నాకు తెలుపబడుతున్నాయి. '' నీ ప్రభువు దైవదూతలతో ఇలా అన్నాడు , ''నేను మట్టితో ఒక మనిషిని సృజించబోతున్నాను. అతని సృష్టిని పూర్తిచేసిన తరువాత , నేను అతనిలోకి నా ఆత్మను ఊదుతాను , అపుడు మీరు అతని ముందు మోకరిల్లి సజ్దా చేయండి. '' ఈ ఆజ్ఞ ప్రకారం దైవదూతలందరూ సజ్దా చేశారు. కాని ఇబ్లీస్ తాను గొప్పవాడినని గర్వించాడు అతడు తిరస్కారులలో కలిసిపోయాడు. ప్రభువు ఇలా సెలవిచ్చాడు, ''ఇబ్లీస్! నేను నా రెండు చేతులతో సృజించినవానికి సజ్దా చెయ్యకుండా నిన్ను ఏ విషయం ఆపింది ? నీవు గొప్ప వాడివైపోయావా లేదా ఉన్నత శ్రేణికి చెందినవారిలోని వాడవా?'' అతడు ఇలా సమాధానం చెప్పాడు: ''నేను అతడి కంటె శ్రేష్ఠుణ్ణి. మీరు నన్ను అగ్నితో పుట్టించారు. ఇతన్నేమో మట్టితో సృష్టించారు. '' ఇలా సెలవిచ్చాడు : ''సరే, ఇక్కడ నుండి వెళ్లిపో. నీవు శపించబడ్డావు. నీ మీద నా శాపం ప్రతిఫలదినం వచ్చేవరకూ ఉంటుంది.'' అతడు ఇలా అన్నాడు: ''ప్రభూ! అలా అయితే వారు మళ్లీ లేపబడే దినం వరకూ నాకు గడువు ఇవ్వు. '' ఇలా సెలవిచ్చాడు, ''సరే, ఆ రోజు వరకూ నీకు గడువు ఉంది. అది వచ్చే కాలం నాకు తెలుసు. '' అతడు ఇలా అన్నాడు, ''నీ గౌరవం సాక్షిగా! నేను వారందరినీ మార్గభ్రష్టులుగా చేసి తీరుతాను, నీవు ప్రత్యేకంగా ఎన్నుకున్న దాసులను తప్ప.'' ఇలా

సెలవిచ్చాడు, ''కనుక సత్యం ఇదే నేను సత్యాన్నే పలుకుతాను. నీతోనూ , ఈ మానవులలో నిన్ను అనుసరించే వారందరితోనూ నరకాన్ని నింపుతాను.''

**38. సాద్** 86 - 88 ప్రవక్తా! వారితో ఇలా అను, ''నేను ఈ ధర్మ ప్రచారానికి మీనుండి ఎటువంటి ప్రతిఫలాన్నీ కోరను నేను వంచకులలోని వాడనుకాను. ఇది ఒక హితబోధ విశ్వప్రజలందరికినీ, అచిర కాలంలోనే మీకు స్వయంగా దీని పరిస్థితి ఏమిటో తెలిసిపోతుంది.''

**39. అజ్ జుమర్**

ఆయతులు : 75 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**39. అజ్ జుమర్** 1 ఈ గ్రంథం మహాశక్తి సంపన్నుడూ , మహా వివేకవంతుడూ అయిన అల్లాహ్ తరఫునుండి అవతరించింది.

**39. అజ్ జుమర్** 2 - 3 (ఓ ప్రవక్తా!) మేము ఈ గ్రంథాన్ని సత్యంతో నీపై అవతరింపజేశాము. కనుక నీవు ధర్మాన్ని అల్లాహ్కు ప్రత్యేకిస్తూ అల్లాహ్ కు మాత్రమే దాస్యం చెయ్యి. జాగ్రత్త! ధర్మం ప్రత్యేకంగా అల్లాహ్ కు చెందిన హక్కు మాత్రమే. ఇక ఆయనను వదలివేసి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్నవారు , (తమ ఈ చర్యకు కారణంగా) ''వారు మమ్మల్ని అల్లాహ్ వద్దకు చేరుస్తారని మాత్రమే మేము వారిని ఆరాధిస్తున్నాము '' అని అంటారు. అల్లాహ్ నిశ్చయంగా వారి మధ్యన వారు విభేదిస్తున్న అన్ని విషయాలను గురించి తీర్పు చెబుతాడు. అసత్యవాదీ , సత్యధిక్కారీ అయిన ఏ వ్యక్తికీ అల్లాహ్ సన్మార్గం చూపడు.

**39. అజ్ జుమర్** 4 - 6 ఒకవేళ అల్లాహ్ ఎవరినైనా తన కుమారుడుగా చేసుకోదలిస్తే , తన సృష్టిలో తాను కోరిన వారిని ఎన్నుకుని ఉండేవాడు. ఆయన పరిశుద్ధుడు. (ఆయనకు కుమారుడు ఉంటాడు అనే విషయానికి) అతీతుడు. ఆయన అల్లాహ్ ఒక్కడే , అందరిపై ఆధిక్యం కలవాడు. ఆయన ఆకాశాలనూ , భూమినీ సత్యంతో సృష్టించాడు. ఆయనే పగటిని రేయితోనూ , రేయిని పగటితోనూ చుట్టివేస్తాడు. ఆయనే సూర్యుణ్ణీ , చంద్రుణ్ణీ నియమబద్ధులుగా చేసి ఉంచాడు. వాటిలో ప్రతి ఒక్కటీ ఒక నిర్ణీతకాలం వరకు సంచరిస్తూ వుంటుంది. తెలుసు కోండి, ఆయన మహాశక్తిమంతుడు మరియు మన్నించేవాడూను. మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించినవాడు ఆయనే, తిరిగి ఆయనే ఆ ప్రాణి నుండి దాని జంటను సృజించాడు. ఇంకా ఆయనే మీ కొరకు పశువులలో ఎనిమిది మగ, ఆడ జాతులను సృష్టించాడు. ఆయన మీ తల్లుల గర్భాలలో మూడేసి చీకటి తెరలలో మీకు ఒక రూపం తరువాత మరొక రూపాన్ని ఇస్తూపోతు న్నాడు. (ఈ కార్యాలు నిర్వహించే) ఈ దేవుడే మీ ప్రభువు , సృష్టి

సామ్రాజ్యం ఆయనదే. ఆయన తప్ప మరొక దేవుడు ఎవ్వడూ లేడు. అలాంటప్పుడు మీరు ఎలా మరలింప బడుతున్నారు?

**39. అజ్ జుమర్** 7 ఒకవేళ మీరు తిరస్కార వైఖరిని అవలంబిస్తే అల్లాహ్ మీ అక్కర ఎంత మాత్రం లేనివాడు. కాని ఆయన తన దాసులు తిరస్కార వైఖరిని అవలంబిం చటాన్ని ఇష్టపడడు. ఒకవేళ మీరు కృతజ్ఞతలు తెలిపితే , దాన్ని ఆయన మీ కొరకు ఇష్టపడతాడు. బరువు మోసేవాడెవ్వడూ ఇతరుల బరువును మోయడు. చివరకు మీరందరూ మీ ప్రభువు వైపునకే మరలవలసి ఉంది. అప్పుడు ఆయన మీకు మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో తెలుపుతాడు. ఆయన హృదయాల స్థితిని సైతం ఎరుగును.

**39. అజ్ జుమర్** 8 - 9 మనిషిపైకి ఎప్పుడైనా ఏదైనా ఆపద వచ్చిపడితే , అతడు తన ప్రభువు వైపునకు మరలి ఆయనకు మొఱ పెట్టుకుంటాడు. తరువాత అతడి ప్రభువు అతడికి తన అనుగ్రహాన్ని ప్రసాదించినపుడు , అతడు గతంలో ఏ ఆపదను గురించి మొఱపెట్టుకున్నాడో , ఆ ఆపదను మరచి పోయి , ఇతరులను అల్లాహ్ కు సమానులుగా నిలబెడతాడు. ఈ విధంగా అతడు (ప్రజలను కూడా) అల్లాహ్ మార్గం నుండి తప్పిస్తాడు. (ఓ ప్రవక్తా!) అతడితో , ''కొన్నాళ్ళపాటు నీ తిరస్కార వైఖరి ద్వారా ఆనందాన్ని అనుభవించు. చివరకు నీవు తప్పకుండా నరకానికి పోయేవాడివే'' అని చెప్పు. (ఈ వ్యక్తి వైఖరి మంచిదా లేక ఆ వ్యక్తి వైఖరి మంచిదా) ఎవడైతే విధేయుడో, రాత్రి గడియలలో (నమాజు చేస్తూ) నిలబడతాడో, సజ్దాలు చేస్తాడో, పరలోకానికి భయ పడతాడో, తన ప్రభువు కారుణ్యాన్ని ఆశిస్తాడో ? వీరిని అడుగు, తెలిసినవారూ, తెలియని వారూ ఇద్దరూ ఎప్పుడైనా సమానులు కాగలరా? బుద్ధిమంతులు మాత్రమే హితబోధను స్వీకరిస్తారు.

**39. అజ్ జుమర్** 10 (ఓ ప్రవక్తా!) ఇలా చెప్పు , ''విశ్వసించిన నా దాసులారా! మీ ప్రభువునకు భయపడండి. ఈ లోకంలో సద్వర్తనను అవలంబించే వారికి మేలు జరుగు తుంది. దేవుని భూమి విశాలమైనటువంటిది. ఓర్పు వహించేవారికి లెక్క లేనంత ప్రతిఫలం ఇవ్వబడుతుంది.''

**39. అజ్ జుమర్** 11 - 18 (ఓ ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు , ''ధర్మాన్ని అల్లాహ్కు ప్రత్యేకించి, ఆయనకు మాత్రమే దాస్యం చేయి అని నాకు ఆజ్ఞ ఇవ్వబడిరది. అందరికంటే ముందు స్వయంగా నేను ముస్లిమ్ అయిపోవాలని కూడ నాకు ఆజ్ఞ ఇవ్వ బడిరది. '' ఇంకా ఇలా చెప్పు , ''ఒకవేళ నేను నా ప్రభువునకు అవిధేయత చూపితే , నేను ఒక మహాదినం నాటి శిక్షను గురించి భయపడుతున్నాను.'' ఇలా కూడ చెప్పు, ''నేను మాత్రం నా ధర్మాన్ని అల్లాహ్కు ప్రత్యేకించి, ఆయనకు మాత్రమే దాస్యం చేస్తాను. మీరు ఆయన దాస్యం తప్ప , ఎవరెవరి దాస్యం చెయ్యదలచుకున్నారో, చేస్తూ ఉండండి. '' ఇలా అను , ''ప్రళయంనాడు తమనూ , తమ భార్యలనూ , పిల్లలనూ నష్టంలో పడవేసుకునేవారే అసలైన దివాళాకోరులు. బాగా వినండి. స్పష్టమైన దివాళా అంటే ఇదే. వారిమీద నిప్పు గొడుగులు పైనుండి కూడ క్రమ్ముకుని ఉంటాయి , క్రింద నుంచి కూడా. ఈ పర్యవసానం గురించే అల్లాహ్ తన

దాసులను భయపెడుతున్నాడు. కనుక నా దాసులారా! నా ఆగ్రహం నుండి తప్పించుకోండి. దీనికి భిన్నంగా తాగూత్ దాస్యాన్ని విసర్జించి , అల్లాహ్ వైపునకు మరలేవారికి శుభవార్త ఉన్నది. కనుక (ఓ ప్రవక్తా!) మాటను శ్రద్ధగా విని, అందులోని మంచి మంచి విషయాలను అనుసరించే నా దాసులకు శుభవార్త అందజెయ్యి. అల్లాహ్ సన్మార్గం చూపిన వారు వీరే. విజ్ఞులు కూడ వీరే.

**39. అజ్ జుమర్** 19 - 20 (ఓ ప్రవక్తా!) శిక్షా నిర్ణయం రూఢ అయిపోయిన వ్యక్తిని ఎవడు రక్షించగలడు? అగ్నిలో పడిపోయినవాణ్ని నీవు రక్షించగలవా ? అయితే, తమ ప్రభువునకు భయపడుతూ ఉండేవారికి అంతస్తుపై అంతస్తుగా కట్టబడిన ఎత్తైన భవనాలు ఉన్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. ఇది అల్లాహ్ వాగ్దానం. అల్లాహ్ ఎన్నడూ తన వాగ్దానాన్ని భంగపరచడు.

**39. అజ్ జుమర్** 21 - 22 మీరు గమనించరా - అల్లాహ్ ఆకాశం నుండి వర్షాన్ని కురిపించాడు. తరువాత దానిని ఊటలు, చలమలు, నదుల రూపాలలో భూమిలో ప్రవేశింపజేశాడు. తరువాత ఈ నీటి ద్వారా ఆయన రకరకాల పంటలు పండిస్తున్నాడు. వాటి రంగులు కూడ భిన్నంగా ఉంటాయి. ఆ తరువాత ఆ పంటలు పండి ఎండిపోతాయి. మళ్ళీ, అవి పసుపు రంగుగా మారిపోవటాన్ని మీరు చూస్తారు. చివరకు అల్లాహ్ వాటిని పొట్టుగా మార్చివేస్తాడు. యథార్థానికి ఇందులో బుద్ధిమంతులకు గుణపాఠం ఉంది. ఇక ఏ వ్యక్తి హృదయాన్ని అల్లాహ్ ఇస్లామ్‌కై తెరిచాడో , ఏ వ్యక్తి తన ప్రభువు చూపిన వెలుగులో నడుస్తున్నాడో , ఆ వ్యక్తి (ఈ విషయాల నుండి ఏ గుణపాఠమూ నేర్చుకోని వ్యక్తిలాంటి వాడు కాగలడా?) అల్లాహ్ హితోపదేశం వల్ల ఎవరి హృదయాలు మరింత కఠినమైపోతాయో , వారికి వినాశం ఉన్నది. వారు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు.

**39. అజ్ జుమర్** 23 - 26 అల్లాహ్ ఎంతో శ్రేష్ఠమైన వచనాన్ని అవతరింపజేశాడు. ఇది ఒకే పోలిక కలిగివున్న భాగాలు కల గ్రంథం. ఇందులో , విషయాలు మాటిమాటికీ పునరుక్తం చేయబడినాయి. దానిని విన్నప్పుడు , తమ ప్రభువునకు భయపడే వారి రోమాలు నిక్క బొడుచుకుంటాయి తరువాత వారి శరీరాలూ , వారి హృదయాలూ మెత్తబడి అల్లాహ్ ధ్యానం వైపునకు మొగ్గుతాయి. ఇది అల్లాహ్ మార్గదర్శకత్వం, దాని ద్వారా ఆయన తాను కోరిన వారిని సత్యమార్గంపైకి తీసుకువస్తాడు. స్వయంగా అల్లాహ్ మార్గం చూపనివాడికి , మరొక మార్గదర్శకుడు ఎవ్వడూ లేడు, ఇక ప్రళయం నాడు శిక్ష యొక్క తీవ్రమైన దెబ్బను తన ముఖం మీద తినేవాడి దుస్థితిని గురించి నీవేమి అంచనా వేయగలవు ? అటువంటి దుర్మార్గులతో, ''ఇక మీరు సంపాదించిన దానిని రుచి చూడండి '' అని అనబడుతుంది. వారికి పూర్వం కూడ చాలమంది ప్రజలు ఇదేవిధంగా తిరస్కరించారు. చివరికి వారిపైకి శిక్ష , వారు ఊహించనుకూడ లేనటువంటి దిశ నుండి వచ్చిపడిరది. తరువాత అల్లాహ్ వారికి ఇహలోక జీవితంలోనే అవమానాన్ని రుచి చూపించాడు. పరలోక శిక్ష అయితే దాని కంటే కూడ ఎంతో తీవ్ర మైనదిగా ఉంటుంది. అయ్యో! వారు గ్రహిస్తే ఎంత బాగుంటుంది.

**39. అజ్ జుమర్** 27 - 35 మేము ఈ ఖురాన్‌లో ప్రజల కొరకు రకరకాల దృష్టాంతాలను ఇచ్చాము , వారు స్పృహలోనికి వస్తారేమో అని. అరబ్బీ భాషలో ఉన్న ఈ ఖురాన్‌లో ఎలాంటి వక్రతా లేదు వారు తమను చెడు పర్యవసానం నుండి కాపాడుకుంటారేమో అని. అల్లాహ్ ఒక దృష్టాంతం ఇస్తున్నాడు - ఒక వ్యక్తి ఉన్నాడు: అతనిని తమ తమ వైపునకు లాగే సంస్కార హీనులైన యజమానులు అనేకమంది ఉన్నారు. మరొక వ్యక్తి ఉన్నాడు: అతను పూర్తిగా ఒకే యజమానికి బానిసగా ఉన్నాడు. ఆ ఇద్దరు వక్తుల పరిస్థితి ఒకటే అవుతుందా ?- ''అల్ హమ్‌దులిల్లాహ్'' (స్తోత్రం కేవలం అల్లాహ్కే) , కాని చాలమంది అజ్ఞానంలో పడి ఉన్నారు , (ఓ ప్రవక్తా!) నీవూ మరణిస్తావు, వారూ మరణిస్తారు. చివరకు ప్రళయం నాడు మీరంతా మీ ప్రభువు సమక్షంలో మీమీ వ్యాజ్యాలను వినిపి స్తారు. ఎవడు అల్లాహ్ కు అబద్ధాన్ని ఆపాదిస్తాడో , సత్యం అతడి ముందుకు వచ్చినప్పుడు అది అబద్ధమని దానిని తిరస్కరిస్తాడో, అతడికంటే పరమ దుర్మార్గుడెవడు? అటువంటి వారికి నరకంలో స్థానమేమీ లేదా? సత్యాన్ని తీసుకు వచ్చిన వ్యక్తీ, అది సత్యమని అంగీకరించిన ప్రజలూ మాత్రమే శిక్ష తప్పించుకుంటారు. వారికి తమ ప్రభువు వద్ద వారు కోరుకునేదంతా లభిస్తుంది. ఇది సత్కార్యాలు చేసే వారికి దొరికే ప్రతిఫలం వారు చేసిన అత్యంత ఘోరమైన పనులను అల్లాహ్ వారి లెక్క నుండి తీసివెయ్యటానికి , వారు చేసిన ఎంతో మంచి పనులకు గాను వారికి ప్రతిఫలం ప్రసాదించ టానికి.

**39. అజ్ జుమర్** 36 - 41 (ఓ ప్రవక్తా!) అల్లాహ్ తన దాసునికి సరిపోడా ? వారు ఆయనను గురించి కాక , ఇతరులను గురించి నిన్ను భయపెడుతున్నారు. వాస్తవానికి, అల్లాహ్ దారి తప్పించేవాడికి దారిచూపే వాడెవ్వడూ లేడు. ఆయన దారి చూపేవాడిని దారి తప్పించేవాడు కూడ ఎవ్వడూ లేడు. అల్లాహ్ మహాశక్తి మంతుడూ , ప్రతీకారం చేసేవాడూ కాడా ? ఒకవేళ నీవు వారిని , భూమ్యా కాశాలను ఎవడు సృష్టించాడు అని అడిగితే , వారే స్వయంగా, ''అల్లాహ్ యే'' అని అంటారు. వారిని ఇలా అడుగు:''యథార్థం ఇదైనప్పుడు, ఒకవేళ అల్లాహ్ నాకేదైనా నష్టాన్ని కలిగించగోరితే, మీరు అల్లాహ్ ను కాదని వేడుకునే మీ దేవీలు , ఆయన కలిగించే నష్టం నుండి నన్ను కాపాడగలరా? లేదా అల్లాహ్ నాపై కనికరం చూపగోరితే , వారు ఆయన కారుణ్యాన్ని అడ్డుకోగలరా ? మీ అభిప్రాయమేమిటి? కనుక వారితో ఇలా అను ,''నాకు అల్లాహ్ ఒక్కడే చాలు , నమ్ముకునే వారు ఆయననే నమ్ముకుంటారు.'' వారికి స్పష్టంగా ఇలా చెప్పు, ''నా జాతి ప్రజలారా! మీరు మీ ఇష్టం ప్రకారం మీ పనులు చేస్తూ ఉండండి. నా పనేదో నేనూ చేస్తూ ఉంటాను. త్వరలోనే మీకు తెలిసిపోతుంది , ఎవరి మీదకు అవమానకరమైన శిక్ష వచ్చిపడుతుందో, ఇంకా ఎవరికి ఎన్నడూ తొలగిపోని శిక్ష లభిస్తుందో.'' (ఓ ప్రవక్తా!) మేము మానవులందరి కోసం ఈ సత్యగ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. ఇక ఎవడు ఋజుమార్గాన్ని అవలంబిస్తాడో , అతడు తన మేలు కోసమే అలా చేస్తాడు. ఎవడు మార్గం తప్పుతాడో, ఆ మార్గం తప్పటమనే కీడుకు అతడే బాధ్యుడు అవుతాడు. నీవు వారికి బాధ్యుడవు కావు.

**39. అజ్ జుమర్** 42 - 44 మరణ సమయంలో ఆత్మలను వశపరచుకునేవాడు అల్లాహ్ యే ఇంకా మరణించని వాడి ఆత్మను అతడు నిద్రావస్థలో ఉన్నప్పుడు వశపరచు కుంటాడు. ఆయన ఎవడి విషయంలో , మరణ నిర్ణయం అమలుచేస్తాడో, దానిని (అతడి ఆత్మను) ఆపి ఉంచుతాడు మిగతావారి ఆత్మలను ఒక నిర్ణీత సమయం వరకు తిరిగి పంపివేస్తాడు. ఆలోచించే వారికి ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి. అటువంటి దేవుణ్ణి వదలిపెట్టి , వారు ఇతరులను సిఫారసుదారులుగా చేసుకున్నారా ? వారికి ఇలా చెప్పు , ''వారికి కించిత్తు అధికారం ఉన్నా లేకపోయినా, వారికి అవగాహన ఉన్నా లేకపోయినా వారు సిఫారసు చేయగలరా ?'' ఇంకా ఇలా అను, ''సిఫారసు అనేది పూర్తిగా అల్లాహ్ చేతిలోనే ఉన్నది. భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి ఆయనే. తరువాత ఆయన వైపునకే మీరు మరలింపబడతారు.''

**39. అజ్ జుమర్** 45 - 48 ఒక్క అల్లాహ్ ను గురించి మాత్రమే ప్రస్తావించటం జరిగినప్పుడు , పరలోకం పట్ల విశ్వాసం లేని వారి హృదయాలు బాధపడతాయి. ఆయనను తప్ప ఇతరులను గురించి ప్రస్తావించటం జరిగినప్పుడు, యకాయకి వారి ముఖాలు సంతోషంతో వెలిగిపోతాయి. ఇలా అను , ''దైవమా! భూమ్యాకాశా లకు సృష్టికర్తా! గోచర అగోచరాలను ఎరిగినవాడా! నీవే నీ దాసుల మధ్య వారు విభేదిస్తూ ఉన్న విషయం గురించి తీర్పు చేస్తావు. ఒకవేళ ఈ దుర్మార్గుల వద్ద భూమిలో ఉన్న మొత్తం సంపద ఉంటే , ఇంకా అంతే సంపదకూడ ఉంటే, వారు ప్రళయం నాటి దారుణ శిక్ష నుండి తప్పించుకోవటానికి ఈ మొత్తం సంపదను పరిహారంగా ఇవ్వటానికి సిద్ధపడతారు. అక్కడ అల్లాహ్ తరఫు నుండి వారి ముందుకు , వారు ఎన్నడూ ఊహించి కూడ ఉండనిదంతా వస్తుంది. అక్కడ తమ సంపాదన యొక్క దుష్ఫలితాలన్నీ వారికి స్పష్టంగా తెలిసిపోతాయి. వారు ఎగతాళి చేస్తూ వచ్చినదే వారిని చుట్టు ముట్టుతుంది.

**39. అజ్ జుమర్** 49 - 52 ఈ మానవుడే తనకు కొంచెం కష్టం కలిగినప్పుడు , మాకు మొరపెట్టుకుంటాడు. మేము అతనికి మా తరఫు నుండి , అనుగ్రహాన్ని ప్రసాదించినప్పుడు, ''నాకు ఉన్న జ్ఞానం కారణంగానే ఇది నాకు ఇవ్వబడిరది'' అని అతడు అంటాడు. కాని అది కాదు , ఇది ఒక పరీక్ష. అయితే వారిలో చాల మంది ఎరుగరు. ఈ మాటనే వారికి పూర్వం గతించిన వారు కూడ అన్నారు. కాని , వారు సంపాదించినదేదీ వారికి ఏ విధంగానూ పనికి రాకుండా పోయింది. తరువాత తమ సంపాదన యొక్క దుష్ఫలితాలను వారు అనుభవించారు. వారిలోని దుర్మార్గులు త్వరలోనే తమ సంపాదన యొక్క దుష్ఫలితాలను అనుభవిస్తారు. వారు మమ్మల్ని అశక్తులుగా చేయలేరు. అల్లాహ్ తాను కోరిన వారికి ఉపాధిని అపరిమితంగా ఇస్తాడనీ , తాను కోరిన వారికి ఉపాధిని పరిమితంగా ఇస్తాడనీ వారికి తెలియదా? ఇందులో విశ్వసించే వారికి సూచనలు ఉన్నాయి.

**39. అజ్ జుమర్** 53 - 61 (ఓ ప్రవక్తా!) ఇలా అను, ''మీ ఆత్మలకు అన్యాయం చేసుకున్న నా దాసులారా అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలనూ క్షమిస్తాడు. ఆయన క్షమించేవాడు ,

కరుణించే వాడూను. మీ మీదకు శిక్ష రాకమునుపే , మీకు ఎవరి నుండీ సహాయం లభించని పరిస్థితి ఏర్పడక మునుపే, మీరు మీ ప్రభువు వైపునకు మరలి, ఆయనకు విధేయత చూపండి. మీకు తెలియకుండానే మీ మీదకు అకస్మాత్తుగా శిక్ష రాకముందే , మీ ప్రభువు పంపిన గ్రంథంలోని ఉత్తమమైన విషయాలను అనుసరించండి. తరువాత ఏ వ్యక్తి అయినా ఇలా అనే పరిస్థితి రాకూడదు సుమా! ''అల్లాహ్ విషయంలో నేను చూపిన నిర్లక్ష్యతకు నేను ఎంతో చింతి స్తున్నా ను. పైగా నేను ఎగతాళి చేసే వారిలో చేరిపోయాను. '' లేదా ''అయ్యో! అల్లాహ్ నాకు సన్మార్గం చూపి ఉంటే, నేను కూడ భయభక్తులు కలవారిలో చేరిపోయేవాణ్ణి.'' లేదా శిక్షనుచూసి, ''అయ్యో! నాకు మరొక అవకాశం దొరికితే ఎంత బాగుండును. నేను కూడ సత్కార్యాలు చేసేవారిలో కలిసి పోతాను. '' (అప్పుడు అతనికి ఈ జవాబు దొరకకూడదు) ''లేదు. నా వాక్యాలు నీ వద్దకు వచ్చాయి. కాని నీవు వాటిని తిరస్కరించావు విర్రవీగావు. నీవు అవిశ్వాసులలోని వాడవు. '' ఈనాడు అల్లాహ్ కు అసత్యాన్ని ఆపాదించిన వారి ముఖాలు , ప్రళయం నాడు నల్లగా మారిపోవటాన్ని నీవు చూస్తావు. నరకంలో గర్విష్ఠులకు సరిపోయే స్థలం లేదా ? దీనికి భిన్నంగా ఇక్కడ అల్లాహ్ కు భయపడిన వారికి, వారి సాఫల్యానికి దోహదం చేసిన కారణాల వల్ల, అల్లాహ్ ముక్తిని ప్రసాదిస్తాడు. వారికి ఏ కష్టమూ కలగదు. వారికి ఎలాంటి విచారమూ ఉండదు.

**39. అజ్ జుమర్** 62 - 66 ప్రతి వస్తువునూ సృష్టించిన వాడు అల్లాహ్ యే. ప్రతి వస్తువునకూ సంరక్షకుడు కూడ ఆయనే. భూమిలో, ఆకాశాలలో ఉన్న నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. అల్లాహ్ వాక్యాలను తిరస్కరించే వారే నష్టానికి గురిఅయ్యేవారు. (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను , ''అయితే, ఓ మూర్ఖులారా! అల్లాహ్ ను కాదని మరొకరికి దాస్యం చేయమని మీరు నాకు చెబుతున్నారా ?'' (ఈ విషయాన్ని నీవు వారికి స్పష్టంగా చెప్పు. ఎందుకంటే) నీ వద్దకూ, నీకు పూర్వం గతించిన ప్రవక్తల వద్దకూ ఇలా వహీ పంపబడిరది: ''ఒకవేళ మీరు షిర్కు (బహుదైవారాధన) చేస్తే, మీ కర్మలన్నీ వ్యర్థమై పోతాయి మీరు నష్టానికి గురి అవుతారు. '' కనుక (ఓ ప్రవక్తా!) నీవు కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించు. కృతజ్ఞులై ఉండే దాసులలో చేరిపో.

**39. అజ్ జుమర్** 67 - 70 వారు అల్లాహ్ ను ఏ విధంగా గౌరవించాలో, ఆ విధంగా గౌరవించనే లేదు. (ఆయన శక్తి సామర్థ్యాలు ఎలాంటివంటే) ప్రళయం నాడు , యావత్తు భూమండలం ఆయన పిడికిలిలో ఉంటుంది. ఆకాశాలు ఆయన కుడి చేతిలో చుట్టబడి ఉంటాయి. వారు చేస్తున్న షిర్కు (బహుదైవారాధన)కు ఆయన అతీతుడు , పరిశుద్ధుడు. ఆ రోజున శంఖం పూరించబడుతుంది , ఆకాశాలలో, భూమిలో ఉన్న వారు అందరూ చచ్చిపడిపోతారు, అల్లాహ్ సజీవంగా ఉంచదలచుకున్న వారు తప్ప. తరువాత రెండోసారి శంఖం పూరించబడుతుంది : అప్పుడు ఒక్కసారిగా అందరూ లేచిచూడటం ప్రారంభిస్తారు. భూమి తన ప్రభువు యొక్క తేజస్సుతో వెలిగిపోతుంది. కర్మల చిట్టా తీసుకురాబడుతుంది. దైవ ప్రవక్తలూ , సాక్షులూ అందరూ హాజరు పరచబడతారు. ప్రజలకు సరిగ్గా, న్యాయంగా తీర్పు చేయబడు తుంది. వారికి ఎలాంటి అన్యాయమూ జరగదు. ప్రతి

ఆత్మకూ అది చేసుకున్న కర్మల ప్రకారం పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ప్రజలు చేస్తున్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

**39. అజ్ జుమర్** 71 - 72 (ఈ తీర్పు తరువాత) సత్యాన్ని తిరస్కరించినవారు , నరకం వైపు నకు గుంపులు , గుంపులుగా తోలబడతారు. చివరకు వారు అక్కడకు చేరి నప్పుడు దాని ద్వారాలు తెరువబడతాయి. దాని కాపలాదారులు వారితో ఇలా అంటారు , ''స్వయంగా మీలో నుండే , మీకు, మీ ప్రభువు వాక్యాలను వినిపించి , ఎప్పుడో ఒకప్పుడు, మీరు ఈ దినాన్ని కూడ చూడవలసి వస్తుందని, మిమ్మల్ని హెచ్చరించిన ప్రవక్తలు మీ వద్దకు రాలేదా?'' వారు, ''అవును, వచ్చారు. కాని శిక్షా నిర్ణయం అవిశ్వాసుల విషయంలో రూఢ అయిపోయింది '' అని సమాధానం చెబుతారు. ఇలా అనబడుతుంది , ''నరక ద్వారాలలో ప్రవేశిం చండి. ఇక్కడ మీరు ఇక శాశ్వతంగా ఉండవలసి ఉంది. ఇది గర్విష్ఠుల నివాసం, చాల చెడ్డ నివాసం.''

**39. అజ్ జుమర్** 73 - 74 తమ ప్రభువు పట్ల అవిధేయతకు దూరంగా ఉన్నవారిని, బృందాలు, బృందాలుగా స్వర్గం వైపునకు తీసుకుపోవటం జరుగుతుంది. చివరకు వారు అక్కడకు చేరినప్పుడు , దాని తలుపులు ముందుగానే తెరువబడి ఉంటాయి. దాని నిర్వహణాధికారులు వారితో ఇలా అంటారు , ''మీకు శాంతి కలుగుగాక! మీరు చక్కగా ప్రవర్తించారు. ప్రవేశించండి ఇందులోకి , శాశ్వతంగా ఉండేటం దుకు. '' వారు ఇలా అంటారు , ''మాకు చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన , మమ్మల్ని భూమికి వారసులుగా చేసిన దేవునికి కృతజ్ఞతలు. ఇక మేము , స్వర్గంలో ఎక్కడ కోరుకుంటే అక్కడ నివాసం ఏర్పరచుకోగలము. '' కనుక (సత్కార్యాలు) ఆచరించేవారికి ఎంత మంచి ప్రతిఫలం!

**39. అజ్ జుమర్** 75 దైవ సింహాసనం చుట్టూ దైవదూతలు వలయంగా ఏర్పడి తమ ప్రభువును స్తుతించటాన్నీ , ఆయన పవిత్ర నామాన్ని కొనియాడుతూ ఉండటాన్నీ నీవు చూస్తావు. ప్రజల మధ్య సక్రమంగా , న్యాయంగా తీర్పు చేయటం జరుగుతుంది. ''స్తోత్రం కేవలం సకల లోకాలకు ప్రభువైన అల్లాహ్ కు మాత్రమే చెందుతుంది '' అని ప్రకటించబడుతుంది.

**40. అల్ మూమిన్**

ఆయతులు : 85 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**40. అల్ మూమిన్** 1 - 3 హా. మీమ్. ఈ గ్రంథం అల్లాహ్ తరఫు నుండి అవతరించింది. ఆయన మహాశక్తిమంతుడు, మహాజ్ఞాని, పాపాలను క్షమించేవాడూ , పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడూను కఠినంగా

శిక్షించేవాడూ, ఘనంగా కరుణించేవాడూను. ఆయన తప్ప ఆరాధ్య దైవం మరెవ్వడూ లేడు. ఆయన వైపునకే అందరూ తిరిగి పోవలసి ఉన్నది.

**40. అల్ మూమిన్** 4 - 6 ఒక్క అవిశ్వాసులు తప్ప మరెవ్వరూ అల్లాహ్ వాక్యాలను గురించి వివాదపడరు. కనుక ప్రపంచ దేశాలలోని వారు అట్టహాసంగా తిరగటాన్ని చూచి మీరు మోసపోకూడదు. వారికి పూర్వం నూహ్ జాతి కూడ తిరస్కరించింది. దాని తరువాత ఎన్నో ఇతర వర్గాలు కూడ ఇలానే చేశాయి. ప్రతి జాతీ తన ప్రవక్తను నిర్బంధించేందుకు అతనిపై విరుచుకుపడిరది. వారందరూ కలిసి అసత్యమనే ఆయుధంతో సత్యాన్ని ఓడిరచటానికి ప్రయత్నిం చారు. కాని చివరకు నేను వారిని పట్టుకున్నాను. చూడండి , నా శిక్ష ఎంత కఠినమో. ఇదేవిధంగా అవిశ్వాసానికి పాల్పడిన వారందరిని గురించి , వారు నరకంలో ప్రవేశిస్తారని నీ ప్రభువు చేసిన తీర్పు కూడా నెరవేరింది.

**40. అల్ మూమిన్** 7 - 9 దైవ సింహాసనాన్ని మోసే దైవదూతలూ , ఆ సింహాసనం చుట్టూ ఉండే దైవదూతలూ , అందరూ తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన పవిత్రతను కొనియాడుతున్నారు. వారు ఆయనను విశ్వసిస్తున్నారు, విశ్వసించేవారిని క్షమించు అని ప్రార్థనలు చేస్తున్నారు. వారు ఇలా అంటారు , ''ప్రభూ! నీవు నీ కారుణ్యంతో , నీ జ్ఞానంతో ప్రతి వస్తువుపై వ్యాపించి ఉన్నావు. కనుక పశ్చాత్తాపంతో నీ వైపునకు మరలినవారిని , నీ మార్గాన్ని అనుసరించినవారిని క్షమించు. వారిని నరకయాతన నుండి కాపాడు , ప్రభూ! ఇంకా, వారిని శాశ్వతంగా ఉండే స్వర్గవనాలలో ప్రవేశింపజెయ్యి వాటిని గురించి నీవు వారికి వాగ్దానం చేసి ఉన్నావు. వారి తల్లిదండ్రులలో , వారి భార్యలలో, వారి సంతానంలో సజ్జనులైన వారిని కూడ (వారితో పాటే అక్కడకు చేర్చు). నిస్సందేహంగా నీవు మహాశక్తిసంపన్నుడవు, మహా వివేకవంతుడవూను. వారిని చెడుల నుండి కాపాడు. ప్రళయం నాడు నీవు చెడుల నుండి కాపాడేవాడిని నీవు ఎంతో కరుణించావన్న మాట. ఇదే గొప్ప సాఫల్యం.

**40. అల్ మూమిన్** 10 - 12 అవిశ్వాసానికి పాల్పడిన వారిని ప్రళయం నాడు పిలిచి, ''ఈనాడు మీకు మీ పట్ల ఎంత తీవ్రమైన కోపం వచ్చిందో, మిమ్మల్ని విశ్వాసం వైపునకు పిలువగా, మీరు నిరాకరించిననాడు అల్లాహ్ కు మీ పట్ల అంతకంటే తీవ్రంగానే కోపం వచ్చింది'' అని అనటం జరుగుతుంది. వారు ఇలా అంటారు : ''ప్రభూ! నిజంగానే నీవు మాకు రెండుసార్లు మరణాన్నీ , రెండుసార్లు జీవితాన్నీ ఇచ్చావు. ఇప్పుడు మేము మా తప్పులను ఒప్పుకుంటున్నాము. కనుక ఇక్కడ నుండి బయటపడే మార్గం కూడా ఏదైనా ఉందా ?'' (ఇలా సమాధానం వస్తుంది): ''మీరు గురిÈÈన ఈ దుస్థితికి కారణం ఏమిటంటే, ఏకైక దేవుడు అయిన అల్లాహ్ వైపునకు మాత్రమే పిలిచినప్పుడు, మీరు విశ్వసించకుండా తిరస్కరించేవారు. ఇతరులను ఆయనకు సమానులుగా చేసినప్పుడు , మీరు వెంటనే విశ్వసించేవారు. ఇప్పుడు తీర్పు , మహనీయుడూ, మహోన్నతుడూ అయిన అల్లాహ్ చేతులలో ఉన్నది.''

**40. అల్ మూమిన్** 13 - 14 ఆయనే మీకు తన సూచనలను చూపిస్తాడు , ఆకాశం నుండి మీ కొరకు ఆహారాన్ని అవతరింపజేస్తాడు. కాని (ఈ సూచనలను చూచి) కేవలం అల్లాహ్ వైపునకు మరలే మనిషి మాత్రమే గుణపాఠం నేర్చుకుంటాడు. (కనుక అల్లాహ్ వైపునకు మరలే ప్రజలారా!) అల్లాహ్ ను మాత్రమే వేడుకోండి , మీ ధర్మాన్ని ఆయనకై ప్రత్యేకించుకొని, మీరు చేసే ఈ పని అవిశ్వాసులకు ఎంత అనిష్టంగా ఉన్నా సరే.

**40. అల్ మూమిన్** 15 - 20 ఆయన మహోన్నతమైన స్థానాలు కలవాడు , విశ్వసామ్రాజ్య పీఠానికి అధిపతి. తన దాసులలో తనకు ఇష్టమైన వారిపై తన ఆజ్ఞ ప్రకారం ఆత్మను అవతరింపజేస్తాడు అతను సమావేశదినం గురించి హెచ్చరించే టందుకు. పరదాలు తొలగిపోయి అందరూ బయటకు వచ్చిన రోజున వారికి సంబంధించిన విషయేమేదీ అల్లాహ్ కు రహస్యంగా ఉండదు. (ఆ రోజున బహిరంగంగా ఇలా అడగటం జరుగుతుంది) ''ఈనాడు విశ్వ సామ్రాజ్యాధికారం ఎవరిది ?'' అని. (విశ్వం మొత్తం ముక్తకంఠంతో ఇలా అంటుంది) , ''అది ఒకే దేవుడూ , సర్వాధిక్యం కలవాడూ అయిన అల్లాహ్ది '' అని. (ఇలా అనటం జరుగుతుంది) , ''ఈనాడు ప్రతి ప్రాణికీ అది సంపాదించిన దాని ప్రకారమే ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఈనాడు ఎవరికీ ఎలాంటి అన్యాయమూ జరగదు. అల్లాహ్ మిక్కిలి వేగంగా లెక్క తీసుకుంటాడు. ఓ ప్రవక్తా! దగ్గర పడిన ఆ రోజును గురించి వారిని భయపెట్టు. అప్పుడు గుండెలు గొంతులకు అడ్డుపడుతూ ఉంటాయి. ప్రజలు ధ్ణుఖాన్ని దిగమ్రింగి మౌనంగా నిలబడి ఉంటారు. దుర్మార్గులకు ఆప్తమిత్రుడుగానీ, మాట చెల్లుబడి అయ్యే సిఫారసు చేసేవాడు గానీ ఎవ్వడూ ఉండడు. అల్లాహ్ , చూపుల చౌర్యాన్ని సైతం ఎరుగును. హృదయాలు దాచి ఉంచిన రహస్యాన్ని సైతం ఆయన ఎరుగును. అల్లాహ్ కచ్చితంగా, న్యాయంగా తీర్పు చేస్తాడు. ఇక అల్లాహ్ ను వదలిపెట్టి (ఈ ముష్రిక్కులు) వేడుకునేవారి విషయం , వారు ఏ విషయం గురించీ తీర్పు చెప్పగలవారు కారు. నిస్సందేహంగా అల్లాహ్ మాత్రమే అన్నీ వినేవాడు , అన్నీ చూచేవాడూను.

**40. అల్ మూమిన్** 21 - 22 వారు భూమిలో ఎన్నడూ సంచరించలేదా, వారికి పూర్వం గతించిన ప్రజల ముగింపు ఎలా జరిగిందో వారికి కనిపించేందుకు ? వారు వీరికంటే ఎక్కువ బలాఢ్యులు , వీరికి మించిన గొప్ప గుర్తులను భూమిపై వదలివెళ్లారు. కాని అల్లాహ్ వారి పాపాలకు గాను వారిని పట్టుకున్నాడు. అల్లాహ్ పట్టునుండి వారిని రక్షించేవాడెవడూ లేకపోయాడు. వారి ముగింపు ఇలా ఎందుకు జరిగిందంటే, వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన సూచనలు తీసుకుని వచ్చారు కాని వారు విశ్వసించకుండా వాటిని తిరస్కరించారు. చివరకు అల్లాహ్ వారిని పట్టుకున్నాడు. నిశ్చయంగా ఆయన అత్యంత శక్తిమంతుడూ, శిక్షించటంలో కఠినుడూను.

**40. అల్ మూమిన్** 23 - 25 మేము మూసాను ఫిరౌన్, హామాన్, ఖారూన్‌ల వద్దకు మా సూచనలతో, స్పష్టమైన నియమాధికారంతో పంపాము. కాని వారు , ''ఇతడు మాంత్రికుడు, అసత్యవాది'' అని అన్నారు. తరువాత అతను మా వద్ద నుండి సత్యాన్ని వారి ముందుకు తీసుకురాగా , వారు ఇలా అన్నారు , ''విశ్వసించి ఇతనితో

చేరిపోయినవారందరి కొడుకులనూ చంపండి , వారి కూతుళ్లను వదలిపెట్టండి. '' కాని అవిశ్వాసుల పన్నాగం విఫలమే అయింది.

**40. అల్ మూమిన్** 26 ఒక రోజు ఫిరౌన్ తన దర్బారు జనులతో ఇలా అన్నాడు , ''నన్ను వదలండి, నేను ఈ మూసాను చంపివేస్తాను. ఇతడు తన ప్రభువును పిలుచుకోనివ్వండి. ఇతడు మీ మతాన్ని మార్చివేస్తాడేమో అని, లేదా దేశంలో సంక్షోభాన్ని రేకెత్తిస్తాడేమో అని నేను భయపడుతున్నాను.''

**40. అల్ మూమిన్** 27 మూసా ఇలా అన్నాడు, ''నేను లెక్కల రోజును విశ్వసించని ప్రతి దురహం కారి బారి నుండి కాపాడు అని నా ప్రభువూ, మీ ప్రభువూ శరణుకోరాను.''

**40. అల్ మూమిన్** 28 - 29 ఈ సందర్భంగా, తన విశ్వాసాన్ని గుప్తంగా ఉంచిన ఫిరౌన్ జాతికి చెందిన ఒక విశ్వాసి ఇలా అన్నాడు, ''మీరు ఒక వ్యక్తిని, కేవలం అతడు, 'నా ప్రభువు అల్లాహ్' అని అన్నంత మాత్రాన్నే చంపేస్తారా ? వాస్తవా నికి అతను మీ ప్రభువు వద్దనుండి మీ వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకు వచ్చాడు. ఒకవేళ అతను అబద్ధాలు చెప్పేవాడే అయితే, అతని అబద్ధం స్వయంగా అతని మీదనే తిరిగి పడుతుంది. కాని ఒకవేళ అతను సత్యమే చెబుతున్నట్లయితే, అతను మిమ్మల్ని భయపెడుతున్న భయంకరమైన పరిణామా లలో కొన్ని అయినా మీ మీదకు తప్పకుండా వచ్చిపడతాయి. హద్దులను అతిక్రమించే , అసత్యాలు పలికే ఏ వ్యక్తికీ అల్లాహ్ సన్మార్గం చూపడు. నా జాతి ప్రజలారా! మీకు ఈనాడు రాజ్యాధికారం ఉన్నది. భూమిపై మీరు ప్రాబల్యం వహించి ఉన్నారు. కాని ఒకవేళ దైవశిక్ష మనపైకి వచ్చిపడితే, అప్పుడు మనకు సహాయం చేయగల వాడెవడైనా ఉన్నాడా ?'' ఫిరౌన్ ఇలా అన్నాడు, ''నాకు సముచితంగా తోచిన సలహాసే నేను మీకు ఇస్తున్నాను. సక్రమమైన మార్గం వైపునకే నేను మిమ్మల్ని నడుపుతున్నాను.''

**40. అల్ మూమిన్** 30 - 35 విశ్వసించిన ఆ వ్యక్తి ఇలా అన్నాడు , ''నా జాతి ప్రజలారా! పూర్వం అనేక జన సమూహాలకు దాపురించిన దినమే, మీకు కూడా దాపురిస్తుందేమో అని నేను భయపడుతున్నాను - నూహ్ జాతి, ఆద్ జాతి, సమూద్ జాతులకూ వారి తరువాత వచ్చిన జాతులకూ దాపురించిన దినం. తన దాసులకు అన్యాయం చేయాలనే ఉద్దేశ్యం అల్లాహ్ కు ఎంతమాత్రం లేదు అనేది వాస్తవం. నాజాతి ప్రజలారా! మీరు రోదించే దినమేదైనా మీపైకి వచ్చిపడుతుందేమో అని నేను భయపడుతున్నాను అప్పుడు మీరు ఒకరినొకరు పిలుచుకుంటారు , పరుగెత్తుతూ తిరుగుతూ ఉంటారు. కాని ఆ సమయంలో అల్లాహ్ నుండి మిమ్మల్ని రక్షించేవాడెవడూ ఉండడు. నిజం ఏమిటంటే, అల్లాహ్, మార్గం తప్పించిన వాడికి మళ్లీ మార్గం చూపేవాడెవడూ ఉండడు. పూర్వం యూసుఫ్ మీ వద్దకు స్పష్టమైన ప్రమాణాలను తీసుకువచ్చాడు. కాని మీరు అతను తెచ్చిన బోధను గురించి అనుమానానికే గురిఅయ్యారు. తరువాత అతను మరణించినప్పుడు మీరు , ''ఇక అతని తరువాత అల్లాహ్ మరొక ప్రవక్తను పంపడు'' అని అన్నారు - ఇదే విధంగా అల్లాహ్ , హద్దులను అతిక్రమించేవారినీ, శంకితులనూ, తమ వద్దకు ఏ

ధ్రువపత్రమూ, ఏ ఆధారమూ రాకపోయినా అల్లాహ్ వాక్యాల విషయంలో వాదించేవారినీ మార్గభ్రష్టత్వానికి గురిచేస్తాడు. వారి ఈ వైఖరి అల్లాహ్ దృష్టిలో , విశ్వాసుల దృష్టిలో మిక్కిలి గర్హనీయ మైనది. ఇలాగే అల్లాహ్ , దురహంకారీ, నిరం కుశుడూ అయిన ప్రతి వ్యక్తి హృదయానికి ముద్రవేస్తాడు.

**40. అల్ మూమిన్** 36 - 37 ఫిరౌన్ ఇలా అన్నాడు , ''హామాన్! నా కోసం ఒక ఎత్తైన సౌధాన్ని నిర్మించు , నేను మార్గాల వరకు- ఆకాశాలకు వెళ్ళే మార్గం వరకు చేరగలిగేం దుకు , మూసా దేవుణ్ణి తొంగి చూసేందుకు. నాకు ఈ మూసా అబద్ధాలకోరు గానే కనిపిస్తున్నాడు- ఈ విధంగా ఫిరౌన్‌కు అతడి దుష్కార్యం మనోహరమైన దిగా చేయబడిరది అతడు సత్యమార్గం వైపునకు రాకుండా ఆపబడ్డాడు. ఫిరౌన్ పన్నాగమంతా (స్వయంగా అతని) వినాశ మార్గానికే వినియోగపడిరది.

**40. అల్ మూమిన్** 38 - 44 విశ్వసించిన ఆ వ్యక్తి ఇంకా ఇలా అన్నాడు , ''నా జాతి ప్రజలారా! నా మాట వినండి. నేను మీకు సరైన మార్గాన్ని చూపిస్తాను. నా జాతీయులారా! ఈ ప్రాపంచిక జీవితం తాత్కాలికం , శాశ్వత నివాస స్థలం పరలోకమే. చెడు చేసినవాడికి , అతడు చేసినంత చెడుకు మాత్రమే ప్రతిఫలం లభిస్తుంది. మంచి పనులు చేసినవ్యక్తి, పురుషుడైనా స్త్రీ అయినా , విశ్వాసి అయితే, అటువంటి వారందరూ స్వర్గంలో ప్రవేశిస్తారు. అక్కడ వారికి అపరిమితమైన జీవన సామగ్రి ఇవ్వబడుతుంది. నా జాతీయులారా! ఇదేమి వైపరీత్యం! నేను మిమ్మల్ని ముక్తివైపునకు పిలుస్తున్నాను , మీరేమో నన్ను అగ్ని వైపునకు పిలుస్తున్నారు! నేను అల్లాహ్ ను తిరస్కరించాలనీ, నేను ఎరుగని శక్తులను ఆయనకు భాగస్వాములుగా నిలబెట్టాలనీ మీరు నాకు పిలుపు ఇస్తున్నారు. నిజానికి నేను మిమ్మల్ని సర్వశక్తి సంపన్నుడూ , క్షమాశీలుడూ అయిన దేవుని వైపునకు పిలుస్తున్నాను. కాదు , సత్యం ఇదే , దీనికి భిన్నంగా జరగటానికి వీల్లేదు : మీరు నన్ను ఎవరి వైపునకు పిలుస్తున్నారో, వారి వైపునకు పిలుపు అనేది ఇహలోకంలోనూ లేదు పరలోకం లోనూ లేదు. మనం అందరం అల్లాహ్ వద్దకే మరలిపోవలసి ఉంది. హద్దులు మీరేవారే అగ్నిలోకి పోయే వారు. ఈనాడు నేను చెప్పేదాన్ని మీరు జ్ఞాపకం చేయనున్న సమయం త్వర లోనే రాబోతోంది. నా వ్యవహారాన్ని నేను అల్లాహ్ కు అప్పగిస్తున్నాను. ఆయన తన దాసులను కనిపెట్టుకుని ఉంటాడు.

**40. అల్ మూమిన్** 45 - 50 చివరకు ఆ విశ్వాసికి వ్యతిరేకంగా వారు , పన్నిన అన్ని కుయుక్తుల నుండి అల్లాహ్ అతనిని రక్షించాడు. ఫిరౌన్ అనుచరులే ఒక భయంకరమైన శిక్షలో చిక్కుకున్నారు. వారు ఉదయం సాయంత్రం నరకాగ్ని ముందు ఉంచ బడుతూ ఉంటారు. ప్రళయ గడియవచ్చినప్పుడు , ''ఫిరౌన్ ప్రజలను తీవ్రమైన శిక్షలోకి ప్రవేశింపజెయ్యండి'' అని ఆజ్ఞాపించబడుతుంది. ఇంకా, వారు నరకంలో ఒకరితో ఒకరు కలహించే సందర్భం గురించి ఆలోచించు. ప్రపం చంలో బలహీనులుగా ఉన్నవారు, పెద్ద మనుషులుగా చెల్లుబడి అయిన వారితో ఇలా అంటారు, ''మేము మిమ్మల్ని అనుసరిస్తూ ఉండేవారము. ఇప్పుడు మీరు ఇక్కడ నరకాగ్ని బాధ నుండి కొంతవరకైనా

మమ్మల్ని కాపాడతారా ?'' ఆ పెద్ద మనుషులు ఇలా జవాబు ఇస్తారు , ''ఇక్కడ మన మందరం ఒకే స్థితిలో ఉన్నాము. దాసుల మధ్య అల్లాహ్ తీర్పు చేసేశాడు. '' తరువాత అగ్నిలో పడి ఉన్నవారు నరకభటులతో , ''మా శిక్షను కనీసం ఒక్కరోజైనా తగ్గించమని మీరు మీ ప్రభువును ప్రార్థించండి '' అని అర్థిస్తారు. భటులు ఇలా అడుగుతారు, ''మీవద్దకు దైవప్రవక్తలు స్పష్టమైన సూచనలు తీసుకుని రాలేదా ?'' అప్పుడు వారు , ''అవును, వచ్చారు'' అని అంటారు. నరకభటులు , ''అలాఅయితే, మీరే ప్రార్థించండి సత్యతిరస్కారుల ప్రార్థన నిరర్థకమే అవుతుంది'' అని అంటారు.

**40. అల్ మూమిన్** 51 - 56 నిశ్చయంగా మేము మా ప్రవక్తలకూ , విశ్వాసులకూ ఇహలోక జీవితంలో కూడా తప్పకుండా సహాయం చేస్తాము సాక్షులు నిలబడే రోజున కూడా సహాయం చేస్తాము. ఆ రోజున దుర్మార్గులకు వారి సాకు ఏమాత్రం ఉపయోగపడదు , వారి మీద శాపం విరుచుకుపడుతుంది , అతి నికృష్టమైన నివాసం వారి వాటాగా లభిస్తుంది. చూడండి , చివరకు మేము మూసాకు దారి చూపాము. బుద్ధీ వివేకాలు కలవారికి మార్గదర్శకత్వం, హితోపదేశం అయిన గ్రంథానికి ఇస్రాయీల్ ప్రజలను వారసులుగా చేశాము. కనుక ఓ ప్రవక్తా! ఓర్మి చూపు. అల్లాహ్ వాగ్దానం సత్యం. నీ తప్పులకు క్షమాభిక్ష వేడుకో. ఉదయం , సాయంత్రం నీ ప్రభువును స్తుతిస్తూ, ఆయన పరిశుద్ధతను కొనియాడు. తమ వద్దకు ఏ అధికారపత్రమూ రాకుండానే అల్లాహ్ వాక్యాల విషయంలో వాదులాడే వారి మనస్సులు గర్వంతో నిండిపోయాయి. కాని తాము గర్వపడుతూ ఉన్నంత గొప్ప తనానికి వారు చేరుకోలేరు. కనుక అల్లాహ్ శరణువేడుకో ఆయన అన్నీ చూస్తాడు అన్నీ వింటాడు.

**40. అల్ మూమిన్** 57 - 59 మానవుణ్ణి సృష్టించటం కంటే ఆకాశాలనూ, భూమినీ సృష్టించటం నిశ్చయంగా ఎంతో గొప్ప పని. కాని అనేకులు ఎరుగరు. కళ్లు లేనివాడూ , కళ్ళు ఉన్నవాడూ సమానం కావటం విశ్వసించి సత్కార్యాలు చేసేవారూ , దుర్వర్తనులూ సరిసమానం కావటం అనేది ఎంతమాత్రం జరగదు. కాని మీరు అర్థం చేసుకోవటం చాలా తక్కువ. నిశ్చయంగా ప్రళయ గడియ తప్పకుండా వస్తుంది. అది వచ్చే విషయం గురించి ఏమాత్రం సందేహం లేదు. కాని చాలామంది నమ్మరు.

**40. అల్ మూమిన్** 60 నీ ప్రభువు ఇలా అంటున్నాడు , ''నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. గర్వానికి లోనై నా ఆరాధనకు విముఖులయ్యేవారు తప్పనిసరిగా అవమానానికీ, పరాభవానికి గురిఅయి నరకంలో ప్రవేశిస్తారు.''

**40. అల్ మూమిన్** 61 - 63 మీరు విశ్రాంతి తీసుకోవటానికి మీ కొరకు రాత్రిని సృష్టించిన వాడూ , పగలును వెలుగుతో నింపినవాడూ అల్లాహ్ యే కదా! వాస్తవానికి అల్లాహ్ ప్రజలపట్ల ఎంతో దయగలవాడు. కాని ఎక్కువ మంది కృతజ్ఞతలు తెలుపరు. ఆ అల్లాహ్ యే (మీ కొరకు ఇదంతా చేసినవాడు) మీ ప్రభువు , ప్రతిదాన్నీ

సృజించినవాడు. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. అలాం టప్పుడు మీరు ఎలా మార్గం తప్పిపోతున్నారు ? ఇదేవిధంగా అల్లాహ్ వాక్యా లను తిరస్కరించేవారందరూ మార్గం నుంచి తప్పించబడుతూ వచ్చారు.

**40. అల్ మూమిన్** 64 - 65 మీకొరకు భూమిని నివాస స్థలంగా చేసినవాడూ , పైని ఆకాశాన్ని కప్పుగా నిర్మించినవాడూ, మీ రూపాన్ని తీర్చిదిద్దినవాడూ , దానిని ఎంతో చక్కగా మలచినవాడూ , మీకు పరిశుభ్రమైన పదార్థాలను ఆహారంగా ఇచ్చిన వాడూ , అల్లాహ్ యే కదా! ఆ అల్లాహ్ యే (ఈ పనులన్నీ చేసినవాడు) మీ ప్రభువు. ఆ విశ్వప్రభువు అసంఖ్యాకమైన శుభాలు కలవాడు. ఆయనే సజీవుడు. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు. ఆయననే మీరు వేడుకోండి , మీ ధర్మాన్ని ఆయనకే ప్రత్యేకం చేసి. సకల ప్రశంసలూ సర్వలోకాలకూ ప్రభువైన అల్లాహ్కే చెందుతాయి.

**40. అల్ మూమిన్** 66 ప్రవక్తా! వారితో ఇలా అను: ‘‘అల్లాహ్ ను కాదని మీరు వేడుకుంటున్న వారి ఆరాధన చేయకూడదని నన్ను వారించటం జరిగింది. నా ప్రభువు వైపు నుండి నా వద్దకు స్పష్టమైన సూచనలు వచ్చాయి. (నేను ఈ పనిని ఎలా చేయగలను) సకల లోకాల ప్రభువునకు విధేయత చూపాలని నేను ఆజ్ఞాపించబడ్డాను.

**40. అల్ మూమిన్** 67 - 68 ఆయనే మిమ్మల్ని మట్టితో సృజించాడు, ఆపై రేతస్సుతో, తరువాత నెత్తురు ముద్దతో, ఆ పిదప ఆయన మిమ్మల్ని శిశువు రూపంలో బయటికి తీస్తాడు. తదనంతరం మీరు పూర్తి బలం పుంజుకునే వరకు మిమ్మల్ని పోషి స్తాడు. ఆ పిమ్మట మీరు ముదిమికి చేరుకునేవరకు , మిమ్మల్ని పెంచుతాడు. మీలో కొందరు ముందే పిలువబడతారు. మీరు మీ నిర్ణీత వ్యవధికి చేరి యధార్థం ఏమిటో అర్థం చేసుకోవాలని ఇదంతా చేయబడుతోంది. ఆయనే జీవితాన్ని ఇస్తాడు , ఆయనే మరణాన్నీ ఇస్తాడు. ఆయన ఏ విషయాన్ని గురించి నిర్ణయం చేసినా, అది అయిపోవాలని కేవలం ఒక ఆజ్ఞ జారీ చేస్తాడు, అంతే, అది అయిపోతుంది.

**40. అల్ మూమిన్** 69 - 77 అల్లాహ్ వాక్యాలను గురించి వాదులాడే వారిని నీవు చూశావా , వారు ఎలా విముఖులుగా చేయబడుతున్నారో? ఈ గ్రంథాన్నీ, మేము (ఇదివరకు) మా ప్రవక్తలతో పంపిన అన్ని గ్రంథాలనూ తిరస్కరించే వారికి త్వరలోనే తెలిసిపోతుంది అప్పుడు వారి మెడలలో కంఠపాశాలు ఉంటాయి , సంకెళ్లు కూడ ఉంటాయి వాటితో వారు కాగే నీటి వైపునకు ఈడ్వబడతారు , తరువాత నరకాగ్నిలోకి నెట్టబడతారు. అప్పుడు వారిని ఇలా అడగటం జరుగుతుంది: ‘‘అల్లాహ్ ను కాదని మీరు అల్లాహ్ కు భాగస్వాములుగా నిలబెట్టిన దేవుళ్లు ఇప్పుడు ఎక్కడున్నారు?’’ వారు ఇలా సమాధానం చెబుతారు , ‘‘వారు మానుండి విడిపోయారు. దీనికి పూర్వం మేము అసలు దేనినీ ప్రార్థించేవారము కాదు. ’’ ఈ విధంగా అల్లాహ్ అవిశ్వాసులు ఎలా మార్గభ్రష్టులయిందీ ఋజువు చేస్తాడు. వారితో ఇలా అనబడుతుంది: ‘‘మీ ఈ ముగింపునకు కారణం మీరు భూమిలో అసత్యాన్ని అనుసరించి ఆనందిం చటమే, దానికి గర్వపడటమే. ఇక వెళ్ళండి, నరక ద్వారాలలో ప్రవేశించండి, కలకాలం మీరు అక్కడనే ఉండవలసి ఉంది. అది దురహంకారుల నివాసం , బహుచెడ్డది.’’ కనుక ప్రవక్తా! సహనం వహించు.

అల్లాహ్ వాగ్దానం సత్య మైనది. ఇప్పుడు నీ సమక్షంలోనే మేము వారిని భయపెడుతూ వచ్చిన దుష్పరిణామాలను కొన్నింటిని వారికి చూపినా లేదా (దానికి ముందే) నిన్ను ప్రపంచం నుండి పిలిపించుకున్నా , వారు తిరిగి రావలసింది మా వైపునకే కదా.''

**40. అల్ మూమిన్** 78 - 81 ఓ ప్రవక్తా! నీకు పూర్వం మేము ఎంతోమంది ప్రవక్తలను పంపాము. వారిలో కొందరి పరిస్థితులను గురించి మేము నీకు తెలిపాము , కొందరిని గురించి తెలుపలేదు. అల్లాహ్ అనుమతిలేకుండా ఏ సూచననైనా స్వయంగా తెచ్చే శక్తి ఏ ప్రవక్తకూ లేదు. అల్లాహ్ ఆజ్ఞ వచ్చేసిన తరువాత , సత్యం ప్రకారం నిర్ణయం జరిగింది, అప్పుడు దుర్జనులు నష్టానికి గురిఅయ్యారు. అల్లాహ్ యే మీ కొరకు ఈ పశువులను సృష్టించాడు వాటిలో కొన్నిటిపై మీరు స్వారి చేస్తారు , కొన్నిటి మాంసం తింటారు. వాటి వల్ల మీకు ఇంకా ఎన్నో లాభాలు ఉన్నాయి. మీరు ఎక్కడకు పోవాలని కోరుకుంటే, అక్కడకు మీరు పోగలగటానికి కూడా అవి ఉపయోగపడతాయి. వాటిపైనా, పడవల పైనా మీరు ప్రయాణం చేస్తూ ఉంటారు. అల్లాహ్ తన ఈ సూచనలను మీకు చూపుతున్నాడు. అసలు మీరు ఆయన యొక్క ఏయే సూచనలను తిరస్కరిస్తారు?

**40. అల్ మూమిన్** 82 - 85 వారు భూమిలో సంచారం చేయలేదా , వారికి పూర్వం గతించిన ప్రజల ముగింపు ఎటువంటిదో వారికి కనిపించటానికి ? వారు సంఖ్యాబలంలో వీరికంటే అధికులు , వీరికంటే ఎక్కువ బలవంతులు , భూమిలో వీరికంటే అత్యంత మహోజ్వలమైన గుర్తులు విడిచివెళ్లారు. అసలు వారి సంపాదన అంతా వారికి దేనికి పనికొచ్చింది? వారి ప్రవక్తలు వారి వద్దకు స్పష్టమైన సూచనలు తెచ్చినప్పుడు , వారు తమ వద్ద ఉన్న జ్ఞానంతోనే ఆనందపరవశులై ఉన్నారు. వారు ఎగతాళి చేస్తూ ఉండే దానిలోనే వారు తరువాత చిక్కుకు పోయారు. వారు మా శిక్షను చూచిన పిమ్మట ఇలా అన్నారు: ''ఒక్కడూ, ఏ భాగస్వాములు లేనివాడూ అయిన అల్లాహ్ ను మేము విశ్వసించాము. మేము ఆయనకు భాగస్వాములుగా నిలబెట్టిన వేల్పులనందరినీ నిరాకరిస్తున్నాము. '' కాని మా శిక్షను చూచిన తర్వాత వారి విశ్వాసం వారికి ఏమాత్రం లాభ దాయకం కాజాలదు. ఎందుకంటే , అల్లాహ్ నిర్ణయించిన నియమావళి ఇదే. ఆయన దాసులలో ఎల్లప్పుడూ అమలులో ఉండేది ఈ నియమావళియే. అప్పుడు అవిశ్వాసులు నష్టానికి గురిఅయ్యారు.

**41. హామీమ్ అస్ సజ్దహ్**

ఆయతులు : 54 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**41. హామీమ్ అస్ సజ్దహ్**

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** 1 - 4 ...హా. మీమ్. ఇది కరుణామయుడూ , కృపాశీలుడూ అయిన దేవుని సన్నిధి నుండి అవతరింప జేయబడిరది స్పష్టంగా వివరించబడిన వాక్యాలు కల గ్రంథం. అరబ్బీ భాషలో ఉన్న (ఈ) ఖుర్‌ఆన్, జ్ఞానుల కొరకు ఇది శుభవార్తలను ఇచ్చేది, భయపెట్టేదీను.

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** ... 4 - 5 కాని వారిలో చాలామంది దాని పట్ల విముఖులయ్యారు, కనుక వారు వినరు. వారు ఇలా అంటారు, ''నీవు దేని వైపునకు మమ్మల్ని పిలుస్తు న్నావో, దానిని గురించి మా హృదయాలను తెరలు కప్పివేశాయి, మా చెవులు చెవిటివైపోయాయి. మాకూ నీకూ మధ్య ఒక తెర అడ్డుపడిరది. నీవు నీ పని చెయ్యి , మేము మా పని చేస్తాము.''

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** 6 - 8 ప్రవక్తా! వారితో ఇలా అను , ''నేను కూడ మీలాంటి ఒక మనిషినే. వహీ ద్వారా నాకు ఇలా తెలుపబడుతోంది: మీ దేవుడు కేవలం ఒకే దేవుడు. కనుక మీరు నేరుగా ఆయన వైపునకే మరలండి క్షమించు అని ఆయనను వేడుకోండి. జకాత్ ఇవ్వనివారునూ , పరలోకాన్ని తిరస్కరించేవారునూ అయిన బహుదైవారాధకులు వినాశం పాలవుతారు. ఇక విశ్వసించి మంచి పనులు చేసినవారు నిశ్చయంగా వారికి ఎడతెగని ప్రతిఫలం లభిస్తుంది.''

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** 9 - 12 ప్రవక్తా! వారితో ఇలా అను: ''భూమిని రెండు రోజులలో సృష్టించిన దేవుణ్ణి మీరు తిరస్కరిస్తారా? ఇతరులను ఆయనకు సమానులుగా నిలబెడ తారా ? సకల లోకాల వారికి ప్రభువు ఆయనేకదా! ఆయన (భూమిని ఉనికి లోనికి తీసుకువచ్చిన తరువాత) దానిమీద పర్వతాలను నెలకొలిపాడు అందులో శుభాలను పెట్టాడు అర్థించేవారందరికోసం దాని లోపల వారి కోరికలకూ , అవసరాలకూ అనుగుణంగా కచ్చితంగా అంచనావేసి ఆహార వస్తువులను సమకూర్చాడు. ఈ పనులన్నీ నాలుగు రోజులలో పూర్తి అయ్యాయి. తరువాత కేవలం పొగగా ఉన్న ఆకాశం వైపునకు ఆయన తన ధ్యానాన్ని మరల్చాడు. ఆయన ఆకాశాన్నీ , భూమినీ ఉద్దేశించి ఇలా అన్నాడు: ''ఉనికిలోకి రండి , మీకు ఇష్టమయినా , ఇష్టం కాకపోయినా.'' అవి రెండూ , ''మేము వచ్చేశాము, విధేయులు మాదిరిగా '' అని అన్నాయి. అప్పుడు ఆయన రెండు రోజులలో ఏడు ఆకాశాలను నిర్మించాడు, ప్రతి ఆకాశంలోనూ దాని చట్టాన్ని వహీ ద్వారా నిర్దేశించాడు. ప్రపంచ ఆకాశాన్ని మేము దీపాలతో అలంకరించాము. దానిని బాగా సురక్షితమైనదిగా చేశాము. ఇదంతా ఒక మహాశక్తిమంతుడైన జ్ఞాని పథకం.

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** 13 - 14 ఇప్పుడు ఒకవేళ వారు విముఖులైతే , వారితో ఇలా అను , ''ఆద్, సమూద్ జాతులపై అవతరించినటువంటిదీ, అకస్మాత్తుగా విరుచుకుపడేదీ అయిన ఒక శిక్షను గురించి నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను.'' దైవప్రవక్తలు వారివద్దకు ముందు నుంచీ, వెనుక నుంచీ అన్ని వైపుల నుంచీ వచ్చి, ''అల్లాహ్ ను తప్ప మరెవరినీ ఆరాధించకండి '' అని వారికి నచ్చజెప్పినప్పుడు , వారు ఇలా అన్నారు , ''మా ప్రభువు

తలచుకుంటే దైవదూతలను పంపి ఉండేవాడు. కనుక నీవు ఏ విషయం కోసమైతే పంపబడ్డావో , ఆ విషయాన్ని మేము నమ్మము.''

**41. హామీమ్ అస్ సజ్దహ్** 15 - 16 ఆద్ జాతి పరిస్థితి ఇలా ఉండేది: వారు ఏ హక్కూ , అర్హతలూ లేకుండానే భూమిపై పెద్దవారై పోయారు. ''మాకంటే ఎక్కువ బలవంతుడెవడు న్నాడు?'' అని అనసాగారు. వారిని సృష్టించిన దేవుడు వారికంటే ఎక్కువ బలవంతుడనే విషయం వారికి స్ఫురించలేదా ? వారు మా వాక్యాలను తిరస్క రిస్తూనే ఉండేవారు. చివరకు మేము వారికి ఈ లోకంలోనే అవమానకరమైన శిక్షను రుచి చూపించాలని , కొన్ని అశుభకరమైన దినాలలో తీవ్రమైన తుఫాను గాలిని వారిపైకి పంపాము. పరలోక శిక్ష అయితే , దీనికంటే కూడా ఎంతో అవమానకరమైనది. అక్కడ వారికి సహాయపడే వాడెవ్వడూ ఉండడు.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 17 - 18 ఇక సమూద్ జాతివారు మేము వారి ముందు సత్యమార్గాన్ని పెట్టాము కాని వారు మార్గాన్ని చూడటానికి బదులుగా , అంధులుగా ఉండి పోవటానికే ఇష్టపడ్డారు. చివరకు వారి అకృత్యాలకు ఫలితంగా, అవమాన కరమైన శిక్ష వారిపై విరుచుకుపడిరది. విశ్వసించి, మార్గభ్రష్టత్వానికీ, దుష్కర్మ లకూ దూరంగా ఉండేవారిని మేము రక్షించాము.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 19 - 25 అల్లాహ్ యొక్క ఈ శత్రువులు నరకం వైపునకు పంపబడటానికి సమీకరింపబడే సమయాన్ని గురించి కొంచెం ఆలోచించు. వారి పూర్వికులను , వారి వెనుకవారు వచ్చేవరకు ఆపటం జరుగుతుంది. తరువాత అందరూ అక్కడకు చేరినప్పుడు, వారి చెవులూ, వారి కళ్లూ, వారి శరీర చర్మాలూ వారు ప్రపంచంలో చేస్తూ ఉన్న దానిని గురించి సాక్ష్యమిస్తాయి. అప్పుడు వారు తమ శరీర చర్మాలను , ''మీరు మాకు వ్యతిరేకంగా ఎందుకు సాక్ష్యం చెప్పారు ?'' అని అడుగుతారు. అవి ఇలా సమాధానం చెబుతాయి , ''ప్రతి వస్తువుకూ మాట్లాడే శక్తిని ఇచ్చిన దేవుడే మాకూ మాట్లాడే శక్తిని ఇచ్చాడు. ఆయనే మిమ్మల్ని మొదట సృజించాడు, ఇప్పుడు ఆయన వైపునకే మీరు మరల్పబడుతున్నారు. ప్రపంచంలో మీరు రహస్యంగా నేరాలు చేస్తూ ఉన్న ప్పుడు , స్వయంగా మీ చెవులే , మీ కళ్లే , మీ శరీర చర్మాలే మీకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయనే ఆలోచన మీకు ఉండేదే కాదు. అంతేకాదు , మీరు చేసే చాలా పనులను గురించి అల్లాహ్ కు కూడా తెలియదని మీరు అనుకునేవారు. మీరు మీ ప్రభువు పట్ల కలిగి ఉన్న ఈ ఆలోచనే మిమ్మల్ని నట్టేట ముంచింది. ఈ కారణం వల్లనే మీరు నష్టానికి గురి అయ్యారు. '' ఈ స్థితిలో వారు సహనం చూపినా (చూపకపోయినా) అగ్నియే వారి నివాస స్థానం అవుతుంది. ఒకవేళ వారు క్షమాభిక్ష కోరినా , అటువంటి అవకాశమేదీ వారికి ఇవ్వబడదు. మేము వారికి సహచరులుగా ఎటువంటి వారిని తగిలించామంటే , వారు వారికి ముందూ వెనుకా ఉన్న ప్రతి వస్తువునూ ఆకర్షకంగా మలచి చూపించే వారు. చివరకు వారికి పూర్వం గతించిన జిన్నాతులు, మానవుల వర్గాల విషయంలో జరిగిన శిక్షా నిర్ణయమే వారి విషయంలో కూడ జరిగింది. నిస్సందేహంగా వారే నష్టానికి గురిఅయినవారు.

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** 26 - 29 ఈ సత్యతిరస్కారులు ఇలా అంటారు: ''ఈ ఖుర్‌ఆన్‌ను అసలు వినకండి. అది వినిపించబడేటప్పుడు వినబడకుండా విఘ్నం కలిగించండి. బహుశా ఇలాగైనా మీరు ప్రాబల్యం వహించవచ్చు.'' మేము ఈ అవిశ్వాసులకు కఠినమైన శిక్షను తప్పకుండా రుచి చూపిస్తాము. వారు చేసిన పరమ దుష్కా ర్యాలకు పూర్తి ప్రతిఫలం వారికి ఇస్తాము. అది నరకం అల్లాహ్ శత్రువులకు ప్రతిఫలంగా దొరికేది. అందులోనే వారు శాశ్వతంగా నివసిస్తారు. వారు మా వాక్యాలను తిరస్కరిస్తూ వచ్చిన నేరానికి ఇది శిక్ష. అక్కడ ఈ అవిశ్వాసులు ఇలా అంటారు , ''మా ప్రభూ! మమ్మల్ని మార్గభ్రష్టు లుగా చేసిన జిన్నాతులనూ , మానవులనూ కొంచెం మాకు చూపించు. మేము వారిని మా పాదాల క్రిందపడవేసి తొక్కుతాము , వారు మరింత పరాభవంపాలు కావటానికి.''

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** 30 - 32 అల్లాహ్ యే మా ప్రభువు అని పలికి ఆ మాట మీదనే స్థిరంగా నిలబడే వారిపై నిశ్చయంగా దైవదూతలు అవతరిస్తారు. వారు వారితో ఇలా అంటారు , ''భయపడకండి, బాధపడకండి మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం అనే శుభవార్తను విని ఆనందించండి. మేము ఈ ప్రాపంచిక జీవితంలో కూడ మీకు సహచరులుగా ఉంటాము, పరలోకంలో కూడ. అక్కడ మీరు కోరినదల్లా మీకు లభిస్తుంది మీరు ఆశించే ప్రతి వస్తువూ మీదవుతుంది. ఇవీ మీకు లభించే ఆతిధ్యపు ఏర్పాట్లు, క్షమాశీలుడు, కరుణామయుడూ అయిన దేవుని వైపు నుండి.

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** 33 అల్లాహ్ వైపునకు, పిలిచి మంచి పనులు చేసి, నేను ముస్లిమ్‌ను అని ప్రకటించే వ్యక్తి మాటకంటే మంచి మాట మరెవరిది కాగలదు.

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** 34 - 36 ప్రవక్తా! మంచీ, చెడూ ఒకటి కావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీపట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణస్నేహితుడై పోవటాన్ని నీవు గమనిస్తావు. ఈ సుగుణయోగం సహనశీలురకు తప్ప మరెవరికీ లభ్యంకాదు. ఈ స్థానం మహా అదృష్టవంతు లకు తప్ప మరెవరికీ దక్కదు. ఒకవేళ నీకు షైతాను నుండి ఏదైనా దుష్ ప్రేరణ కలిగితే అప్పుడు అల్లాహ్ శరణు కోరుకో , ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగినవాడూను.

**41. హామీమ్ అస్ సజ్‌దహ్** 37 - 38 ఈ రేయింబవళ్లూ , ఈ సూర్యచంద్రులూ అల్లాహ్ సూచనలలోనివే. సూర్యచంద్రులకు సాష్టాంగపడకండి వాటిని సృజించిన దేవునికి సాష్టాంగ పడండి నిజంగానే మీరు ఆయనను ఆరాధించే వారు అయితే. కాని ఒకవేళ వారు అహంభావానికి గురిఅయి , తమ మాటే నిజమని మంకుపట్టుపట్టితే ఏమీ పరవాలేదు, నీ ప్రభువునకు దగ్గరగా ఉన్న దైవదూతలు రేయింబవళ్లు ఆయనను స్తుతిస్తూ ఉన్నారు , వారు ఎన్నటికీ అలసిపోరు.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 39 అల్లాహ్ సూచనలలో ఒక సూచన ఏమిటంటే , ఎండిపోయిన నేలపై మేము వర్షం కురిపించగానే, అది అకస్మాత్తుగా పులకించటాన్నీ , ఉబికిపోవ టాన్ని నీవు గమనిస్తావు. నిశ్చయంగా ఈ మృతభూమిని బ్రతికించి లేపే దేవుడే మృతులకు కూడ ప్రాణభిక్ష పెడతాడు. నిస్సందేహంగా ఆయన ప్రతి దానిపై అధికారం కలిగి ఉన్నాడు.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 40 - 42 మా వాక్యాలకు పెడర్థాలు అంటగట్టేవారు మాకు కనిపించకుండా ఏమీలేరు. స్వయంగా మీరు ఆలోచించండి ఏ వ్యక్తి మెరుగైనవాడు, అగ్నిలో పడవేయబడేవాడా లేక ప్రళయం నాడు భద్రమైన స్థితిలో హాజరయ్యేవాడా? మీరు కోరినదెల్లా చేస్తూ ఉండండి , మీ చేష్టలు అన్నింటినీ అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు. తమ ముందుకు హితబోధ వచ్చినప్పుడు , దానిని విశ్వసించకుండా తిరస్కరించిన వారు వీరే. కాని యథార్థమేమిటంటే, ఇది ఒక శక్తిమంతమైన గ్రంథం. అసత్యం దాని మీదకు ముందునుండీ రాజాలదు, వెనుకనుండీ రాజాలదు. వివేకవంతుడూ, స్తుతిపాత్రుడూ అయిన దేవుడే అవతరింపజేసిన గ్రంథం ఇది.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 43 ప్రవక్తా! నిన్ను గురించి అనుకుంటున్న విషయాలలో ఏదీ నీకు పూర్వం గతించిన దైవప్రవక్తలను గురించి అనని విషయం ఏదీ కాదు. నిస్సందేహంగా నీ ప్రభువు అమితంగా మన్నించేవాడు దీనితో పాటు వ్యధాభరితమైన శిక్షను విధించేవాడు కూడాను.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 44 - 45 ఒకవేళ మేము ఈ ఖుర్ఆన్‌ను అరబ్బీయేతర భాషలో పంపి ఉన్నట్లయితే , వారు ఇలా అని ఉండేవారు: ''దీని ఆయతులు స్పష్టంగా ఎందుకు వివరించబడలేదు? ఎంత విచిత్రమైన విషయం, గ్రంథమేమో అరబ్బీయేతర భాషలో, సంబోధితులేమో అరబ్బులు.'' వారితో ఇలా అను, ''ఈ ఖురాన్ విశ్వాసులకు మార్గం చూపేది, స్వస్థత చేకూర్చేది. కాని విశ్వసించని వారి చెవులకు ఇది అవరోధం , వారి కళ్లకు ఇది గంత. వారి స్థితి దూరం నుండి ఎవరో వారిని కేకవేసి పిలిచినట్లుగా ఉన్నది. ఇంతకు పూర్వం మేము మూసాకు గ్రంథాన్ని ఇచ్చాము. దాని విషయంలో కూడా ఈ విభేదమే వ్యక్తమయింది. ఒకవేళ నీ ప్రభువు మొదటే ఒక విషయాన్ని నిర్ణయించి ఉండకపోతే, ఈ విభేదించే వారి మధ్య ఎప్పుడో తీర్పు చేయబడి ఉండేది. యథార్థం ఏమిటంటే , వారు దానిని గురించి తీవ్రమైన ఆందోళన కలిగించే సందేహానికి గురిఅయ్యారు.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 46 మంచిపని చేసేవాడు తనకు తానే మేలు చేసుకుంటాడు. చెడ్డ పని చేసేవాడు, దాని దుష్ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. నీ ప్రభువు తన దాసులకు అన్యాయం చేసేవాడు కాడు.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 47 - 48 ఆ గడియకు సంబంధించిన జ్ఞానం అల్లాహ్ వద్దనే ఉన్నది. తమ తొడిమల నుండి బయటికి వచ్చే ఫలాలనన్నింటినీ ఆయనే ఎరుగును. ఆయ నకు తెలియకుండా ఏ స్త్రీ అయినా గర్భం దాల్చదు, ఏ స్త్రీ అయినా ప్రసవిం చదు. ఆయన వారిని కేకవేసి , ''ఎక్కడ ఉన్నారు ఆ నా భాగస్వాములు ?'' అని

అడిగే రోజున వారు ఇలా అంటారు , ''ఈనాడు మాలో దానికి సాక్ష్య మిచ్చేవాడు ఎవడూ లేడని మేము ఇదివరకే మనవి చేసుకున్నాము.'' ఆ సమయంలో వారు ఇంతకు పూర్వం మొరపెట్టుకున్న దైవాలన్నీ మటుమాయమై పోతాయి. ఇప్పుడు తమ కొరకు ఆశ్రయస్థానమనేది ఏదీ లేదని వారు గ్రహిస్తారు.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 49 - 50 మానవుడు మేలు కోసం ప్రార్థిస్తూ ఎన్నడూ అలసిపోడు. అతనికి ఏదైనా ఆపద కలిగినప్పుడు, నిరాశా నిస్పృహలకు లోనై భగ్నహృదయుడవు తాడు. కాని కష్టకాలం తీరిపోయిన తరువాత మేము అతనికి మా కారుణ్యాన్ని రుచి చూపినప్పుడు ఇలా అంటాడు , ''నేను అసలు దీనికే అర్హుణ్ణి. ప్రళయం ఎప్పుడైనా వస్తుందని నేను అనుకోవటం లేదు. కాని ఒకవేళ నిజంగానే నేను నా ప్రభువు వైపునకు మరలింపబడితే, అక్కడ కూడా నేను సుఖాలనే అనుభవిస్తాను.'' నిశ్చయంగా సత్య తిరస్కారులకు వారు ఏమేమి చేసి వచ్చారో మేము తప్పకుండా తెలియజేస్తాము. వారికి మేము జుగుప్సాకరమైన శిక్షను రుచి చూపిస్తాము.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 51 మానవుడికి మేము కానుకలను ప్రసాదించినప్పుడు , ముఖం త్రిప్పు కుంటాడు , విర్రవీగుతాడు. కాని అతనికి ఏదైనా ఆపద కలిగినప్పుడు, సుదీర్ఘ మైన ప్రార్థనలు చేస్తాడు.

**41. హామీమ్ అస్ సజ్దహ్** 52 ప్రవక్తా! వారితో ఇలా అను : ''ఎప్పుడైనా మీరు ఇలా కూడా ఆలోచించారా - ఒకవేళ నిజంగానే ఈ ఖురాన్ అల్లాహ్ తరపు నుండి వచ్చి , దానిని గనక మీరు తిరస్కరిస్తూ ఉన్నట్లయితే, దానిని వ్యతిరేకించటంలో చాల దూరం వెళ్లిపోయిన వ్యక్తిని మించిన మార్గభ్రష్టుడెవడు?''

**41. హామీమ్ అస్ సజ్దహ్** 53 - 54 మేము త్వరలోనే వారికి మా సూచనలను వారి చుట్టూ ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము, వారిలోనూ చూపిస్తాము. చివరకు ఈ ఖురాన్ నిస్సందేహంగా సత్యమైనదని వారికి విశదమైపోతుంది. నీ ప్రభువు ప్రతిదానికి సాక్షి అనే విషయం సరిపోదా? తెలుసుకో, వారు తమ ప్రభువును కలుసుకునే విషయం పట్ల సందేహం కలిగి ఉన్నారు. విను, ఆయన ప్రతి వస్తువునూ పరివేష్టించి ఉన్నాడు.

**42. అష్ షూరా**

ఆయతులు : 53 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**42. అష్ షూరా** 1 - 6 హా. మీమ్. ఐన్. సీన్. ఖాఫ్. ఇదేవిధంగా శక్తిమంతుడూ, వివేకవం తుడూ అయిన అల్లాహ్ నీ వైపునకూ , నీకు పూర్వం గతించిన (దైవప్రవక్తల) వైపునకూ వహీ ద్వారా సందేశం పంపుతూ వచ్చాడు. ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా ఆయనదే. ఆయన మహోన్నతుడు , మహిమాన్వితుడు. త్వరలోనే ఆకాశం పైనుంచి బ్రద్దలైపోతుంది. దైవదూతలు తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన పవిత్రతను కొనియాడుతున్నారు ,

భూలోక వాసులను మన్నించమని విన్నపాలు చేస్తున్నారు. వాస్తవానికి అల్లాహ్ మన్నించేవాడూ , కరుణించే వాడూను అని తెలుసుకో. ఆయనను త్రోసిరాజని ఇతరులను తమ సంరక్ష కులుగా చేసుకున్న వారిని అల్లాహ్ కనిపెట్టే ఉన్నాడు. నీవు వారికి కాపలా దారువు కావు.

**42. అష్ షూరా** 7 అవును , ప్రవక్తా! ఇదేవిధంగా , ఈ అరబ్బీ ఖురాన్‌ను మేము నీ వైపునకు వహీ ద్వారా పంపాము, నీవు జనపదాల కేంద్రం (మక్కా నగరం) లోనూ దాని పరిసరాలలోనూ ఉండే ప్రజలను హెచ్చరించాలనీ సమావేశదినం గురించి వారిని భయపెట్టాలనీ అది వచ్చే విషయంలో ఏమాత్రం సందేహం లేదు. ఒక వర్గం వారు స్వర్గానికిపోతారు, మరొక వర్గం వారు నరకానికి పోతారు.

**42. అష్ షూరా** 8 - 9 అల్లాహ్ కోరి ఉంటే, వారందరినీ ఒకే సంఘంగా చేసి ఉండేవాడు. కాని ఆయన తాను కోరిన వారిని తమ కృపకు పాత్రులను చేస్తాడు. దుర్మార్గు లను రక్షించేవాడుగానీ , వారికి సహాయపడే వాడు గానీ ఎవ్వడూ లేడు. వారు (ఎంతటి అవివేకులు) ఆయనను కాదని ఇతరులను సంరక్షకులుగా చేసుకున్నారు ? సంరక్షకుడు ఒక్క అల్లాహ్ మాత్రమే. ఆయనే మృతులను బ్రతికిస్తాడు. ఆయన ప్రతి దానిపై అధికారం కలవాడు.

**42. అష్ షూరా** 10 - 12 మీ మధ్య ఏ విషయంలో అభిప్రాయభేదం తలెత్తినా , దానిని గురించి తీర్పు చెప్పటం అల్లాహ్ పని. ఆ అల్లాహ్ యే నా ప్రభువు , ఆయననే నేను నమ్ముకున్నాను , ఆయన దెసకే నేను (పశ్చాత్తాపంతో) మరలుతాను. ఆకాశాలకూ, భూమికీ సృష్టికర్త అయిన ఆయన, స్వయంగా మీ జాతి నుండే మీ కొరకు జంటలను సృజించాడు ఇదేవిధంగా పశువులలో కూడా (వాటి జాతి) జంటలను సృష్టించాడు. ఈ విధంగా ఆయన మీ సంతతులను వ్యాపింప జేస్తాడు. ఆయనను పోలిన వస్తువు సృష్టిలో ఏదీ లేదు. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ చూసేవాడూను. భూమ్యాకాశాలలోని నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. తాను కోరిన వారికి ఆయన పుష్కలంగా ఉపాధిని ఇస్తాడు తాను కోరినవారికి ఆయన ఆచితూచి ఉపాధిని ఇస్తాడు. ఆయనకు ప్రతి విషయం గురించీ తెలుసు.

**42. అష్ షూరా** 13 ఆయన నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకు కూడా నిర్ణయించాడు. దానినే (ముహమ్మద్ (సఅసమ్) ఇప్పుడు నీ వైపునకు మేము వహీ ద్వారా పంపాము దానినే మేము ఇబ్రాహీమ్‌కు , మూసాకు, ఈసాకు బోధించాము ఈ ధర్మాన్ని స్థాపించండి అనీ , దానిని గురించి విభేదాలకు లోను కాకండి అనీ తాకీదు చేస్తూ. ఈ విషయమే ఈ బహుదైవారాధకులకు ఎంతో అసహనం కలిగించింది దాని వైపునకే (ముహమ్మద్ (సఅసమ్) నీవు వారిని ఆహ్వాని స్తున్నావు. అల్లాహ్ తాను కోరిన వారిని తనవారుగా చేసుకుంటాడు. ఆయన తన వైపునకు మరలేవారికి మాత్రమే తన వైపునకు వచ్చే మార్గాన్ని చూపుతాడు.

**42. అష్ షూరా** 14 ప్రజల వద్దకు జ్ఞానం వచ్చిన తరువాతనే వారిలో విభేదం తల ఎత్తింది , వారు ఒకరికొకరు అన్యాయం చేయదలచుకున్న కారణంగానే తల ఎత్తింది. ఒక నిర్ణీత కాలం వరకు తీర్పు నిలిపివేయ బడిరది అని నీ ప్రభువు మొదట్లోనే సెలవిచ్చి ఉండకపోతే , వారి వ్యవహారం తేల్చివేయబడి ఉండేదే. యథార్థం ఏమిటంటే , వారి తరువాత గ్రంథానికి వారసులుగా చేయబడిన వారు దానిని గురించి ఆందోళనకరమైన సంశయానికి గురిఅయ్యారు.

**42. అష్ షూరా** 15 (ఈ పరిస్థితి ఉత్పన్నమయింది కాబట్టి) కనుక ముహమ్మద్! ఇప్పుడు నీవు ఆ ధర్మం వైపునకే ప్రజలను ఆహ్వానించు. నీకు ఆజ్ఞాపించబడిన విధంగా , దానిపై స్థిరంగా ఉండు , వారి కోరికలను అనుసరించకు. వారితో ఇలా అను , ''అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నల్లా నేను విశ్వసించాను. మీ మధ్య న్యాయం చేయమని నాకు ఆజ్ఞాపించబడిరది. మా ప్రభువూ అల్లాహ్ యే , మీ ప్రభువు కూడా అల్లాహ్ యే. మా కర్మలు మాకే, మీ కర్మలు మీకే. మీకూ మాకూ మధ్య ఏ వివాదమూ లేదు. ఒక రోజున అల్లాహ్ మన అందరినీ సమావేశపరుస్తాడు. అందరూ ఆయన వైపునకే పోవలసి ఉన్నది.''

**42. అష్ షూరా** 16 అల్లాహ్ సందేశాన్ని స్వీకరించిన తరువాత , (స్వీకరించిన వారితో) అల్లాహ్ ను గురించి వివాదపడే వారి వాదం వారి ప్రభువు దృష్టిలో అసత్య మైనది, వారిపై అల్లాహ్ ఆగ్రహం పడుతుంది, వారికి కఠిన శిక్ష విధించబడు తుంది.

**42. అష్ షూరా** 17 - 18 సత్యసమేతమైన ఈ గ్రంథాన్నీ , తరాజునూ అల్లాహ్ యే అవతరింపజేశాడు. మీకేమి తెలుసు, బహుశా తీర్పు గడియ సమీపంలోనే ఉన్నదేమో. దాని రాకను విశ్వసించనివారే , దాని కొరకు తొందరపెడతారు. కాని దానిని విశ్వసించేవారు మాత్రం దానికి భయపడతారు. అది తప్పకుండా వస్తుందని వారికి తెలుసు. బాగా వినండి, ఆ గడియను గురించి సందేహం రేకెత్తించే వాదనలు చేసేవారు అపమార్గంలో చాలా దూరం వెళ్లిపోయారు.

**42. అష్ షూరా** 19 - 20 అల్లాహ్ తన దాసుల పట్ల ఎంతో దయకలవాడు తాను ఎవరికి ఏది ఇవ్వాలని కోరుకుంటాడో, అది వారికి ఇస్తాడు. ఆయన ఎంతో బలవం తుడు , ఎంతో శక్తిమంతుడూను. పరలోకపు పంటను ఎవడు కోరుకుంటాడో, మేము అతనికై ఆ పంటను వృద్ధిపరుస్తాము. ఇహలోకపు పంటను ఎవడు కోరుకుంటాడో , మేము అతనికి ఇహలోకంలోనిది మాత్రమే ఇస్తాము. కాని అతనికి పరలోకంలో మాత్రం ఏ వాటా ఉండదు.

**42. అష్ షూరా** 21 - 23 అల్లాహ్ అనుమతించకుండానే, ధర్మం వంటి స్వభావం గల ఒక విధానాన్ని తమ కొరకు రూపొందించిన దైవ భాగస్వాముల నెవరినైనా వారు కలిగి ఉన్నారా ? తీర్పు విషయం నిర్ణయింపబడి ఉండకపోతే , వారి వ్యవహారం ఎప్పుడో తేల్చివేయబడివుండేది. నిశ్చయంగా ఈ దుర్మార్గులకు వ్యధాభరితమైన శిక్ష పడుతుంది. అప్పుడు ఈ దుర్మార్గులు తాము చేసిన దాని పరిణామానికి భయ పడుతూ ఉండటాన్ని నీవు చూస్తావు. అది

తప్పకుండా వారి మీదకు వచ్చిపడుతుంది. దీనికి భిన్నంగా విశ్వసించి , సత్కార్యాలు చేసినవారు స్వర్గ వనాలలో ఉంటారు. వారు తాము కోరిన దానిని తమ ప్రభువు వద్ద పొందు తారు. ఇదే గొప్ప అనుగ్రహం. దీని శుభవార్తనే అల్లాహ్ విశ్వసించి, సత్కా ర్యాలు చేసే తన దాసులకు తెలియజేస్తున్నాడు. ప్రవక్తా! వారితో ఇలా అను , ''నేను ఈ పనికి మీనుండి ఏ ప్రతిఫలాన్నీ కోరను. అయితే బంధుప్రేమను తప్పకుండా కోర్తాను. '' ఎవడు మంచిని సంపాదించుకుంటాడో, మేము అతని మంచిని మరింత పెంచుతాము. నిస్సందేహంగా అల్లాహ్ ఎంతో మన్నించే వాడూ, విలువనిచ్చి గుర్తించేవాడూను.

**42. అష్ షూరా** 24 - 26 అతను అల్లాహ్ ను గురించి అభాండాన్ని కల్పించాడని వారు అంటున్నారా ? అల్లాహ్ కోరితే నీ హృదయానికి సీలువేస్తాడు. ఆయన అసత్యాన్ని రూపుమాపుతాడు , సత్యాన్ని తన వచనాల ద్వారా సత్యంగా నిరూపి స్తాడు. ఆయన , గుండెలలో దాగివున్న రహస్యాలను సైతం ఎరుగును. ఆయనే తన దాసుల నుండి పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు , వారి చెడులను ఉపేక్షిస్తాడు. వాస్తవానికి మీ చేష్టలన్నీ ఆయనకు తెలుసు. ఆయన, విశ్వసించి మంచిపనులు చేసేవారి ప్రార్థనలను అంగీకరిస్తాడు. తన కృపనుండి వారికి ఇంకా ఎక్కువగా ఇస్తాడు. ఇక తిరస్కరించే వారి విషయం వారికైతే కఠిన శిక్షపడుతుంది.

**42. అష్ షూరా** 27 - 35 ఒకవేళ అల్లాహ్ తన దాసులందరికీ పుష్కలంగా ఉపాధి ఇచ్చిన ట్లయితే , వారు ధరణిపై తిరుగుబాటు తుఫాను రేపి ఉండేవారు. కాని ఆయన ఒక లెక్క ప్రకారం తాను కోరినంత దానిని అవతరింపజేస్తాడు. నిశ్చయంగా ఆయన తన దాసులను బాగా ఎరుగును. ఆయన వారిని కనిపెట్టే ఉంటాడు. ప్రజలు నిరాశకు గురిఅయినప్పుడు ఆయనే వర్షాన్ని కురిపిస్తాడు , తన కారుణ్యాన్ని వ్యాపింపజేస్తాడు. ఆయనే సకల ప్రశంసలకూ అర్హుడైన సంరక్షకుడు. ఈ భూమ్యాకాశాల సృష్టి, ఆ రెండు చోట్లా ఆయన వ్యాపింప జేసిన ఈ జీవరాసులూ ఆయన సూచనలలోనివే. ఆయన తాను కోరినప్పుడు వాటిని సమీకరించగలడు. మీపైకి వచ్చిన ఆపద , మీరు మీ చేజేతులా చేసు కున్న దానివల్లనే వచ్చింది. చాలా పొరపాట్లను ఆయన ఇట్టే మన్నించివేస్తాడు. మీరు భూమిలో దేవుణ్ణి అశక్తుడుగా చేయలేరు అల్లాహ్ కు వ్యతిరేకంగా మీకు సహాయపడేవాడూ , మిమ్మల్ని రక్షించేవాడూ ఎవ్వడూ లేడు. సముద్రంలో కొండలు మాదిరిగా కనిపించే ఈ ఓడలు ఆయన సూచనలలోనివే. అల్లాహ్ తాను కోరినప్పుడు గాలిని స్తంభింపజేస్తాడు , అప్పుడు అవి సముద్రం వీపుపై నిలిచి ఉన్నవి నిలిచి ఉన్నట్లుగానే ఉండిపోతాయి - అత్యున్నత శ్రేణికి చెందిన సహనమూ కృతజ్ఞతా కల ప్రతి వ్యక్తికీ ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి. - లేదా (వాటిపై ప్రయాణం చేసేవారి) అనేక పాపాలను క్షమిస్తూనే , వారు చేసిన కొన్ని అకృత్యాల ఫలితంగానే వారిని ముంచివేయవచ్చు. అప్పుడు మా వాక్యాలను గురించి వివాదాలకు దిగే వారికి , తమకు ఆశ్రయం లభించే స్థలం ఏదీ లేదని తెలిసిపోతుంది.

**42. అష్ షూరా** 36 - 43 మీకు ఇవ్వబడినదంతా కేవలం కొన్ని రోజుల ప్రాపంచిక జీవితపు సామగ్రిమాత్రమే. కాని అల్లాహ్ వద్ద ఉన్నది శ్రేష్ఠమైనది , శాశ్వతమైనది కూడా. అది ఎవరికోసమంటే విశ్వసించి , తమ ప్రభువును నమ్ముకున్నవారి కోసం , పెద్ద పెద్ద పాపాలకూ , సిగ్గుమాలిన పనులకూ దూరంగా ఉండేవారి కోసం , కోపం వచ్చినప్పుడు కూడా క్షమించేవారి కోసం , తమ ప్రభువు ఆజ్ఞను పాలించేవారికోసం , నమాజ్‌ను స్థాపించేవారికోసం, తమ వ్యవహారా లను పరస్పర సంప్రదింపుల ద్వారా నడుపుకునే వారి కోసం, మేము వారికి ఇచ్చిన ఉపాధి నుండి ఖర్చుచేసేవారి కోసం, తమపై దౌర్జన్యం జరిగినప్పుడు దానిని ఎదుర్కొనేవారి కోసం - చెడుకు ప్రతిక్రియ అదేరకమైన చెడు. కాని ఎవడైనా క్షమించి , రాజీపడితే దానికి ప్రతిఫలం ఇవ్వటం అల్లాహ్ బాధ్యత. అల్లాహ్ దుర్మార్గులంటే ఇష్టపడడు. తమకు అపకారం జరిగినప్పుడు ఎవరైనా ప్రతీకారం చేస్తే , వారిని నిందించటానికి వీలులేదు. అసలు నిందార్హులు ఇతరులకు అన్యాయం చేసేవారే , భూమిపై అన్యాయంగా దౌర్జన్యాలు చేసేవారే. అటువంటి వారికి వ్యధాభరితమైన శిక్షపడుతుంది. అయితే ఎవరైనా సహనంతో వ్యవహరిస్తే , క్షమించివేస్తే, అది పెద్ద సాహసంతో , దృఢ సంకల్పంతో కూడుకున్న పని.

**42. అష్ షూరా** 44 - 46 అల్లాహ్ యే మార్గం తప్పించిన వాడిని ఆదుకునేవాడు అల్లాహ్ తప్ప మరెవ్వడూ లేడు. ఈ దుర్మార్గులు శిక్షను చూచినప్పుడు , వెనక్కి వెళ్లిపోవ టానికి మార్గమేదైనా ఉందా ? అని అడగటాన్ని నీవు చూస్తావు. వారిని నరకం ముందుకు తీసుకు వచ్చినప్పుడు వారు అవమానభారంతో క్రుంగిపోవటాన్నీ , దానిని దొంగచూపులతో చూడటాన్నీ నీవు గమనిస్తావు. అప్పుడు విశ్వాసులు ఇలా అంటారు , ‘‘ప్రళయదినం నాడు తననూ, తన సంబంధీకులనూ నష్టానికి గురిచేసేవాడే అసలు నష్టపోయేవాడు. జాగ్రత్త! దుర్మార్గులు శాశ్వతమైన యాతనకు గురిఅవుతారు. అల్లాహ్ కు వ్యతిరేకంగా వారి సహాయానికి వచ్చే సహాయకులు గానీ , సంరక్షకులుగానీ ఎవ్వరూ ఉండరు. అల్లాహ్ అపమార్గం పట్టించిన వాడికి దాని నుండి బయటపడే మార్గమేదీ ఉండదు.

**42. అష్ షూరా** 47 - 48 అల్లాహ్ తరఫు నుండి తొలగింపబడే అవకాశం ఏ మాత్రం లేనటువంటి ఆ రోజు రాక మునుపే, మీరు మీ ప్రభువు మాటను స్వీకరిం చండి. ఆ రోజున మీకు ఎక్కడా ఆశ్రయం లభించదు , మీ స్థితిని మార్చటానికి ప్రయత్నం చేసేవాడూ ఎవడూ ఉండడు. ఇప్పుడు ఒకవేళ వారు ముఖం తిప్పుకుంటే , ప్రవక్తా! మేము నిన్ను వారిపై కాపలాదారుగా నియమించి పంపలేదు కదా! కేవలం మాటను అందజేసే బాధ్యత మాత్రమే నీపైన ఉన్నది. మానవుడి స్థితి ఎటువంటిదంటే, మేము అతనికి మా కారుణ్యాన్ని రుచి చూపించినప్పుడు , దానికి అతడు ఆనందంతో పొంగిపోతాడు. ఒకవేళ అతడు తన చేతులతో చేసిందే ఆపద రూపంలో అతడిపైకి వచ్చిపడితే , అతడు కరుడుకట్టిన కృతఘ్నుడైపోతాడు.

**42. అష్ షూరా** 49 - 50 భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అల్లాహ్ ప్రభువు ఆయన తాను కోరిన దానిని సృష్టిస్తాడు తనకు ఇష్టమైన వారికి కూతుళ్ళనూ , తాను కోరినవారికి కొడుకులనూ ఇస్తాడు తనకు ఇష్టమైన వారికి

కొడుకులనూ, కూతుళ్లనూ కలిపి ఇస్తాడు  తాను కోరినవారికి అసలు సంతానమే ఇవ్వడు. ఆయనకు అంతా తెలుసు, ఆయనకు అన్నిటిపైనా అధికారం ఉన్నది.

**42. అష్ షూరా** 51 - 53 అల్లాహ్ ముఖాముఖి మాట్లాడే అంత స్థానం మానవునిది కాదు. ఆయన మాట్లాడటం అనేది వహీ (సంకేతం) ద్వారానైనా జరుగుతుంది లేదా తెర వెనుక నుండి అయినా జరుగుతుంది లేదా ఆయన సందేశహరుణ్ణి (దైవదూత) ఎవరినైనా పంపుతాడు  అతను ఆయన ఆజ్ఞానుసారం ఆయన కోరిన దానిని వహీ చేస్తాడు. ఆయన ఉన్నతుడూ, వివేకవంతుడూనూ. ఇదేవిధంగా ప్రవక్తా! మేము మా ఆజ్ఞ ద్వారా ఒక ఆత్మను నీ వైపునకు వహీ చేశాము. గ్రంథం అంటే ఏమిటో , విశ్వాసం  అంటే ఏమిటో నీవు అసలు ఎరుగవు. కాని మేము ఆ ఆత్మను ఒక జ్యోతిగా చేసి దాని ద్వారా మా దాసు లలో మేము కోరిన వారికి మార్గం చూపుతాము.  నిశ్చయంగా నీవు ఋజు మార్గం వైపునకు దారి చూపుతున్నావు, భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి దానికీ ప్రభువైన దేవుని మార్గం వైపునకు దారి చూపుతున్నావు. జాగ్రత్త! వ్యవహారాలన్నీ అల్లాహ్ వైపునకే మరలుతాయి.

**43. అజ్ జుఖ్రుఫ్**

ఆయతులు : 89                అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన  అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**43. అజ్ జుఖ్రుఫ్** 1 - 4 హా. మీమ్. స్పష్టమైన ఈ గ్రంథం సాక్షిగా! మీరు అర్థం చేసుకోవాలని మేము దీనిని అరబ్బీ భాషలో ఖురానుగా చేశాము. వాస్తవానికి ఇది మా వద్ద ఉన్న మాతృగ్రంథం (ఉమ్ముల్ కితాబ్)లో లిఖించబడి ఉన్నది  మహో న్నతమైన స్థానం గల వివేకంతో నిండిన గ్రంథం అది.

**43. అజ్ జుఖ్రుఫ్** 5 - 8 ఇప్పుడు మేము మీతో విసిగిపోయి (కేవలం మీరు హద్దులు మీరి పోయారనే కారణంగా) ఈ హితబోధను మీ వద్దకు పంపటం మానెయ్యాలా? పూర్వం  గతించిన  జాతుల వద్దకు కూడ మేము ఎంతోమంది ప్రవక్తలను పంపాము, దైవప్రవక్త ఎవరైనా వారి వద్దకు రావటం, వారు అతనిని ఎగతాళి చేయకుండా ఉండటం అనేది ఎన్నడూ జరగలేదు. కనుక వీరికంటె ఎన్నోరెట్లు ఎక్కువ శక్తిమంతులైన వారిని మేము నాశనం చేశాము. పూర్వపు జాతుల దృష్టాంతాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

**43. అజ్ జుఖ్రుఫ్** 9 - 14 ఒకవేళ నీవు వారిని , ''భూమినీ, ఆకాశాలనూ ఎవడు సృష్టించాడు ?'' అని అడిగితే, స్వయంగా వారే, ''వాటిని ఆ మహాబలవంతుడే , ఆ మహా జ్ఞానియే సృష్టించాడు '' అని అంటారు. మీ కొరకు ఈ భూమిని ఊయలగా చేసినవాడూ, అందులో  మీకై  మార్గాలను ఏర్పరచినవాడూ - మీరు మీ గమ్యస్థానానికి చేరే మార్గం పొందాలని - ఒక ప్రత్యేక పరిమాణంలో ఆకాశం నుండి నీటిని దించి , దాని ద్వారా మృతభూమిని బ్రతికించినవాడు ఆయనే కదా! - ఇదే విధంగా ఒకనాడు మీరు నేలనుండి బయటకు తీయబడతారు-ఈ

జంటలనన్నింటినీ పుట్టించిన వాడు ఆయనే కదా! మీ కొరకు పడవలనూ , పశువులనూ వాహనాలుగా చేసినవాడు ఆయనే కదా! మీరు వాటి వీపులపై ఎక్కటానికి మీరు వాటిమీద కూర్చున్నప్పుడు మీ ప్రభువు ఉపకారాన్ని జ్ఞాపకం చేసుకొని ఇలా అనండి , ''వాటిని మాకు వశపరచినవాడు పరిశుద్ధుడు. లేకపోతే , వాటిని వశపరచుకునే శక్తి మాకు లేదు. ఒక రోజున మేము మా ప్రభువు వైపునకు మరలిపోవలసి ఉన్నది.''

**43. అజ్ జుఖ్రుఫ్** 15 (ఇదంతా తెలిసీ, ఒప్పుకుని కూడా) వారు ఆయన దాసులలో కొందరిని ఆయనలో భాగంగా చేసేశారు.మానవుడు పరమకృతఘ్నుడు అనేది యథార్థం.

**43. అజ్ జుఖ్రుఫ్** 16 - 18 అల్లాహ్ తన సృష్టిలో నుండి తన కొరకు కూతుళ్లను ఎన్నుకొని , మీ కొరకు కొడుకులను ప్రసాదించాడా? అసలు పరిస్థితి ఏమిటంటే వారు కరుణామయుడైన దేవునికి అంటగట్టే సంతానమే వారిలోని ఒకడికి కలిగిందనే వార్త అందజేస్తే , అతడి ముఖం నల్లబడిపోతుంది, అతడు దుఃఖంలో మునిగి పోతాడు. నగల మధ్య పెంచబడే సంతానం, వాదప్రతివాదాలలో తన అభిప్రాయాన్ని పూర్తిగా వివరించలేని సంతానం అల్లాహ్ భాగానికి వచ్చిందా?

**43. అజ్ జుఖ్రుఫ్** 19 దయామయుడైన దేవుని ప్రత్యేక దాసులైన దైవదూతలను వారు స్త్రీలుగా నిర్ణయించారు. వారి శరీర నిర్మాణాన్ని వారు చూశారా ? వారి సాక్ష్యం వ్రాయబడుతుంది వారు దానికి సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది.

**43. అజ్ జుఖ్రుఫ్** 20 - 25 ''దయామయుడైన దేవుడు (మేము వారిని ఆరాధించకూడదని) కోరి ఉన్నట్లయితే , మేము వారిని ఎన్నటికీ పూజించి ఉండేవారం కాదు '' అని వారు అంటారు. వారు ఈ వ్యవహారం యొక్క వాస్తవాన్ని ఏమాత్రం ఎరుగరు, కేవలం ఊహాగానాలు చేస్తున్నారు. మేము దీనికి పూర్వం, వారికి ఏదైనా గ్రంథాన్ని ఇచ్చి ఉన్నామా, దాని ప్రమాణం (ఈ దైవదూతలను పూజిం చటానికిగాను) వారి వద్ద ఉండటానికి ? లేదు, కాని వారు ఏమంటారంటే ''మేము మా తాతముత్తాతలు ఒక మార్గంలో నడుస్తూ ఉండగా చూశాము మేము వారి అడుగుజాడలలోనే నడుస్తున్నాము.'' ఇదేవిధంగా నీకు పూర్వం మేము హెచ్చరించేవాణ్ణి ఏ పట్టణానికి పంపినా , అక్కడి సంపన్నులు ఇలానే అన్నారు , ''మేము మా పూర్వీకులు ఒక మార్గంలో నడుస్తూ ఉండగా చూశాము , మేము వారి అడుగు జాడలనే అనుసరిస్తున్నాము. '' ప్రతి దైవప్రవక్తా వారిని ఇలా అడిగాడు ''మీ పూర్వీకులు నడుస్తూ ఉండగా మీరు చూచిన మార్గం కంటే సరి j౦ైన, ఉత్తమమైన మార్గాన్ని నేను మీకు చూపినప్పటికీ మీరు ఆ పూర్వ మార్గంలోనే నడుస్తారా ?'' వారు దైవప్రవక్తలందరికీ ఇలానే సమాధానం ఇచ్చారు, ''నీవు ఏ ధర్మం వైపునకు పిలవటానికి పంపబడ్డావో , మేము ఆ ధర్మాన్ని తిరస్కరిస్తున్నాము. '' చివరకు మేము వారికి తగిన శిక్షను విధించాము. చూడండి, సత్యతిరస్కారుల గతి ఏమయిందో!

**43. అజ్ జుఖ్రుఫ్** 26 - 30 ఇబ్రాహీమ్ తన తండ్రికీ , తన జాతి వారికీ ఇలా చెప్పిన ఆ సమ యాన్ని జ్ఞాపకం తెచ్చుకో, ''మీరు పూజిస్తున్న వాటితో నాకు ఏ సంబంధమూ లేదు. నా సంబంధం కేవలం నన్ను సృష్టించిన వానితోనే ఉన్నది. ఆయనే నాకు మార్గం చూపుతాడు. '' ఇబ్రాహీమ్ ఈ వచనాన్నే తన తరువాత తన సంతానం కోసం విడిచివెళ్లాడు, వారు దాని వైపునకు మరలేందుకు. (దీని తరువాత కూడ వారు ఇతరులను పూజించటం మొదలుపెట్టినప్పుడు, నేను వారిని రూపుమాపలేదు). కాని నేను వారికీ , వారి పూర్వీకులకూ ప్రాపంచిక జీవిత సంపదను ఇస్తూనే వచ్చాను. చివరకు వారి వద్దకు సత్యం వచ్చింది , స్పష్టంగా వివరించి చెప్పే దైవప్రవక్త కూడ వచ్చేశాడు. కాని ఆ సత్యం వారి వద్దకు వచ్చినప్పుడు , వారు, ''ఇది మంత్రజాలం. మేము దానిని విశ్వసించము , తిరస్కరిస్తున్నాము'' అని అనేశారు.

**43. అజ్ జుఖ్రుఫ్** 31 - 35 వారు ఇలా అంటారు: ''ఈ ఖురాను రెండు నగరాలలోని పెద్ద మనుష్యులలో ఏ ఒక్క పెద్ద మనిషిపైనైనా ఎందుకు అవతరించలేదు ?'' నీ ప్రభువు కారుణ్యాన్ని పంచిపెట్టేవారు వారేనా ? ఈ ప్రపంచ జీవితంలో వారి బ్రతుకు తెరువు మార్గాలను మేమే వారి మధ్య పంచాము. వారిలో కొందరికి మరి కొందరిపై అంతస్తులవారిగా ఆధిక్యం ఇచ్చాము, వారు ఒకరినొకరు సేవించుకోవటానికి. నీ ప్రభువు కారుణ్యం (అంటే ప్రవక్త పదవి) వారు సమీకరించే సంపదకంటే ఎంతో విలువైనది. మానవులందరూ ఒకే మార్గాన్ని అనుసరిస్తారేమో అనే భయం లేకపోతే మేము కరుణామయుడైన దేవుణ్ణి తిరస్కరించే వారి ఇళ్లకప్పులనూ, వారు తమ మేడలపైకి ఎక్కే మెట్లనూ, వారి తలుపులనూ, వారు దిండ్లపై ఆనుకుని కూర్చునే తఖతులనూ , అన్నింటినీ వెండితో, బంగారంతో చేయించి ఉండే వారమే. ఇవి కేవలం ఐహిక జీవిత సంపదలు మాత్రమే. నీ ప్రభువు దగ్గర గల పరలోకం కేవలం దేవుని పట్ల భయభక్తులు గల వారికే లభిస్తుంది.

**43. అజ్ జుఖ్రుఫ్** 36 - 39 కరుణామయుని స్మరణను నిర్లక్ష్యం చేసే వ్యక్తిపై మేము ఒక షైతానును నియమిస్తాము, వాడు అతని సహచరుడవుతాడు. ఈ షైతానులు అలాంటి వారిని ఋజుమార్గంపైకి రాకుండా ఆపుతారు. వారు, ''మేము సక్రమమైన మార్గంలోనే పయనిస్తున్నాము'' అని అనుకుంటారు. చివరకు ఆ వ్యక్తి మా వద్దకు వచ్చినప్పుడు, తన వెంట ఉన్న షైతానుతో ఇలా అంటాడు, ''నీకూ, నాకూ మధ్య తూర్పు పడమరల మధ్య ఉన్నంత దూరం ఉండి ఉంటే ఎంత బాగుండేది! నీవు అతి చెడ్డ స్నేహితుడవని నిరూపించుకున్నావు. '' అప్పుడు వారితో ఇలా అనటం జరుగుతుంది: మీరు దుర్మార్గం చేశారు కనుక ఈనాడు మీరూ , మీ షైతానులూ శిక్షను సమిష్టిగా పంచుకుంటారు అనే విషయం మీకు ఏమాత్రం లాభం కలిగించదు.

**43. అజ్ జుఖ్రుఫ్** 40 - 45 ప్రవక్తా! నీవు చెవిటి వారికి వినిపించగలవా ?అంధులకూ, స్పష్టంగా మార్గం తప్పినవారికీ మార్గం చూపగలవా ? ఇప్పుడు మేము వారిని శిక్షించ వలసియే ఉన్నది మేము నిన్ను ప్రపంచం నుండి తీసుకుపోయినా లేదా మేము వారికి వాగ్దానం చేసిన ముగింపును నీకు చూపినా , వారిపై మాకు పూర్తి

అధికారం ఉన్నది. కనుక నీవు వహీ ద్వారా నీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని గట్టిగా పట్టుకో. నిశ్చయంగా నీవు ఋజుమార్గంలో ఉన్నావు. వాస్తవం ఏమిటంటే, ఈ గ్రంథం నీకూ, నీ జాతి వారికీ ఒక పెద్ద గౌరవం. త్వరలోనే మీరు దీనిని గురించి జవాబు చెప్పుకోవలసి ఉన్నది. నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలను అడిగిచూడు , మేము కరుణామయుడైన దేవుణ్ణి తప్ప ఇతర దైవాలను కూడా ఆరాధనకు నిర్ణయించామా అని.

**43. అజ్ జుఖ్రుఫ్** 46 - 53 మేము మూసాను మా సూచనలతో ఫిరౌన్ వద్దకూ, అతని ప్రభు త్వాధికారుల వద్దకూ పంపాము. అతను అక్కడకు పోయి, ''నేను సకల లోకాల ప్రభువు యొక్క ప్రవక్తను,'' అని అన్నాడు. తరువాత అతను మా సూచనలను వారి ముందు పెట్టినప్పుడు , వారు ఎగతాళి చేస్తూ నవ్వసాగారు. మేము వారికి ఎన్నో సూచనలను ఒక దానిని మించిన మరొక దానిని వరు సగా చూపిస్తూపోయాము. వారు తమ వైఖరిని మార్చుకోవాలని మేము వారిని శిక్షకు గురిచేశాము. శిక్షకు గురిఅయినప్పుడల్లా వారు, ''మాంత్రికుడా! నీ ప్రభువు తరఫు నుండి నీకు లభించిన పదవి ఆధారంగా మా కొరకు ఆయనను ప్రార్థించు , మేము తప్పకుండా సన్మార్గం వైపునకు వస్తాము'' అని అనేవారు. కాని మేము వారి మీద నుండి శిక్షను తొలగించినంతనే, వారు ఆడిన మాటను తప్పుతారు. ఒకరోజు ఫిరౌన్ తన జాతివారి మధ్యకు పోయి ఇలా ప్రకటించాడు , ''ప్రజలారా! ఈజిప్టు సామ్రాజ్యం నాదికాదా, ఈ కాలువలు నా క్రింద ప్రవహించటం లేదా ? మీకు కనిపించటం లేదా , శ్రేష్ఠుణ్ణి నేనా లేక నీచుడూ , అల్పుడూ, తన మాటను సైతం స్పష్టంగా వివరించలేని ఇతడా ? ఇతనిపై బంగారు కంకణాలు ఎందుకు దించబడలేదు? దైవదూతల బృందం పరిచారకులుగా ఇతని వెంట ఎందుకు రాలేదు?''

**43. అజ్ జుఖ్రుఫ్** 54 - 56 అతడు తన జాతి వారిని తేలికగా చూశాడు. వారూ అతడు చెప్పి నట్లే విన్నారు. వాస్తవానికి వారు పాపాత్ములు. చివరకు వారు మాకు ఆగ్రహం కలిగించినప్పుడు , మేము వారికి ప్రతీకారం చేశాము. వారందరినీ కలిపి ముంచివేశాము , వారిని ముందు తరాల వారికి పూర్వీకులుగా గుణపాఠం గరిపే ఒక నిదర్శనంగా చేశాము.

**43. అజ్ జుఖ్రుఫ్** 57 - 65 మర్యమ్ కుమారుణ్ణి ఒక ఉదాహరణగా పేర్కొనగానే , నీజాతి ప్రజలు దానిని గురించి పెద్ద గొడవ చేస్తూ , మా దేవుళ్లు మంచివారా లేక అతడా ? అని అనసాగారు. ఈ అభ్యంతరాన్ని వారు కేవలం పిడివాదం కోసమే నీ ముందుకు తీసుకువచ్చారు. వాస్తవం ఏమిటంటే వారు స్వతహాగా కలహప్రియులు. మర్యమ్ కుమారుడు ఒక దాసుడు తప్ప మరేమీ కాడు. మేము అతనిని అనుగ్రహించాము , ఇస్రాయీల్ సంతతి వారికి అతనిని మా శక్తికి నిదర్శనంగా చేశాము. మేము కోరితే మీ తరువాత భూమిపై మీ స్థానాన్ని ఆక్రమించగల దైవదూతలను మీనుండి పుట్టించగలము. నిజానికి అతను (అంటే మర్యమ్ కుమారుడు) ప్రళయానికి సూచన. కనుక మీరు దానిని శంకించకండి , నా మాట నమ్మండి. ఇదే సరి j[illegible]న మార్గం. షైతాన్ మిమ్మల్ని దాని వైపునకు పోకుండా ఆపకూడదు. అతడు మీకు బహిరంగ శత్రువు. స్పష్టమైన సూచనలను తీసుకువచ్చిన ఈసా

ఇలా అన్నాడు , ''నేను మీవద్దకు వివేకం తీసుకుని వచ్చాను , మీరు విభేదాలకు లోనైన కొన్ని విషయాల వాస్తవాన్ని మీకు స్పష్టంగా వివరించటానికి వచ్చాను. కనుక మీరు అల్లాహ్ కు భయపడండి , నన్ను అనుసరించండి. యదార్ధం ఏమిటంటే, అల్లాహ్ యే మీ ప్రభువూ , నా ప్రభువూనూ, ఆయననే మీరు ఆరాధించండి. ఇదే సరి j౨ైఁఁన మార్గం. కాని (అతను చేసిన స్పష్టమైన ఈ బోధ తరువాత కూడా) వర్గాలు విభేదాలకే లోనయ్యాయి, కనుక దుర్మార్గానికి ఒడిగట్టినవారు వ్యధాభరితమైన ఒక దినాన పడే శిక్ష వల్ల సర్వనాశనం అవుతారు.

**43. అజ్ జుఖ్రుఫ్** 66 - 78 ఇప్పుడు వారు కేవలం తమకు తెలియకుండానే తమపైకి అకస్మాత్తుగా ప్రళయం వచ్చి పడాలని నిరీక్షిస్తున్నారా? ఆ దినం వచ్చినప్పుడు- స్నేహితులందరూ భయభక్తులు కలవారు తప్ప ఒకరికొకరు శత్రువులైపోతారు. ఆ రోజున మా వాక్యాలను విశ్వసించి , మా ఆజ్ఞలకు బద్ధులై జీవితం గడిపిన వారితో ఇలా అనబడుతుంది: ''నా దాసులారా! ఈనాడు మీకు ఏ భయమూ లేదు , మీకు ఏ దుఃఖమూ కలుగదు. మీరూ , మీ భార్యలూ స్వర్గంలో ప్రవేశిం చండి , మిమ్మల్ని ఆనందింపచేయటం జరుగుతుంది.'' వారి మధ్య బంగారు పళ్లాలూ , గిన్నెలూ త్రిప్పబడతాయి. మనస్సు ఇష్టపడే, కళ్లకు ఇంపుగా ఉండే ప్రతి వస్తువూ అక్కడ ఉంటుంది. వారితో ఇలా అనబడుతుంది : ''ఇక మీరు ఇక్కడ శాశ్వతంగా ఉంటారు. మీరు ప్రపంచంలో చేసిన కర్మలు కారణంగా మీరు ఈ స్వర్గానికి వారసులయ్యారు. మీకు ఇక్కడ పండ్లూ ఫలాలూ పుష్క లంగా లభిస్తాయి, వాటిని మీరు తింటారు.'' ఇక అపరాధులు వారు నరక శిక్షను శాశ్వతంగా అనుభవిస్తూ ఉంటారు. వారి శిక్ష తగ్గటం అనేది ఎన్నటికీ జరగదు వారు అందులో హతాశులైపడి ఉంటారు. మేము వారికి అన్యాయం చేయలేదు వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు. వారు, ''ఓ మాలిక్! నీ ప్రభువు మమ్మల్ని అంతం చేస్తే బాగుంటుంది '' అని వేడుకుంటారు. దానికి అతడు, ''మీరు ఇలాగే పడి ఉంటారు. మేము మీ దగ్గరకు సత్యాన్ని తీసుకుని వచ్చాము. కాని మీలో చాలామందికి సత్యం అంటేనే గిట్టేది కాదు'' అని సమాధానం చెబుతాడు.

**43. అజ్ జుఖ్రుఫ్** 79 - 80 వారు ఏదైనా చర్యను తీసుకోవటానికి నిర్ణయించుకున్నారా ? అలా అయితే మేము కూడా ఒక నిర్ణయం తీసుకుంటాము. మేము వారి రహస్య విషయాలనూ , వారి గుసగుసలనూ వినటం లేదని వారు అనుకుంటున్నారా ? మేము అన్నీ వింటూనే ఉన్నాము. అంతేకాదు మా దూతలు వారి వద్దనే ఉండి వ్రాస్తున్నారు.

**43. అజ్ జుఖ్రుఫ్** 81 - 83 వారితో ఇలా అను, ''ఒకవేళ నిజంగానే కరుణామయునికి సంతానం ఉంటే, అందరికంటే ముందు నేనే వారిని ఆరాధించి ఉండేవాణ్ణి. '' భూమ్యాకాశాల పాలకుడూ, సింహాసన ప్రభువూ అయిన ఆయన , వారు ఆపాదించే సకల విషయాలకు అతీతుడు , పరిశుద్ధుడునూ. సరే , మంచిది, వారిని తమ అసత్యపు

ఆలోచనలలో మునిగి ఉండనీ , తమ ఆటలలో నిమగ్నులై ఉండనీ. చివరకు వారు , తమను ఏ దినం గురించి భయపెట్టటం జరుగుతుందో, ఆ దినాన్ని చూస్తారు.

**43. అజ్ జుఖ్రుఫ్** 84 - 85 ఆకాశంలోనూ , భూమిలోనూ దేవుడు ఆయన ఒక్కడే. ఆయనే వివేకవంతుడు , జ్ఞానసంప న్నుడు భూమ్యాకాశాల మీదా , వాటి మధ్య ఉన్న ప్రతివస్తువు మీదా అధికారం గల ఆయన ఎంతో ఉన్నతుడు. ప్రళయ గడియను గురించి తెలిసినవాడు కూడ ఆయనే. ఆయన వైపునకే మీరంతా మరలింపబడనున్నారు.

**43. అజ్ జుఖ్రుఫ్** 86 ఆయనను త్రోసిరాజని వారు వేడుకునే దేవుళ్లకు సిఫారసు చేసే అధికారం ఏమాత్రమూ లేదు, ఎవరైనా జ్ఞానం ఆధారంగా ఇది సత్యమని, సాక్ష్యం పలికితే తప్ప.

**43. అజ్ జుఖ్రుఫ్** 87 - 88 నీవు, ''మిమ్మల్ని ఎవరు పుట్టించారు'' అని వారిని అడిగితే, స్వయంగా వారే 'అల్లాహ్' అని అంటారు. అయితే వారు ఎలా మోసపోతు న్నారు ? ప్రవక్త యొక్క ఈ సూక్తి సాక్షిగా! ''ప్రభూ! ఈ ప్రజలు విశ్వసించేవారు కారు.''

**43. అజ్ జుఖ్రుఫ్** 89 మంచిది, ప్రవక్తా! వారిని మన్నించు. 'మీకు సలామ్' అని వారితో అను. త్వరలోనే వారికి తెలిసిపోతుందిలే.

**44. అద్ దుఖాన్**

ఆయతులు : 59 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**44. అద్ దుఖాన్** 1 - 9 హా. మీమ్. స్పష్టమైన ఈ గ్రంథం సాక్షిగా! మేము దానిని ఎంతో మేలైన , అత్యంత శుభవంతమైన రాత్రివేళ అవతరింపజేశాము. ఎందుకంటే మేము ప్రజలను హెచ్చరించదలచాము. ఈ రాత్రే ప్రతి విషయానికీ సంబం ధించిన వివేకవంతమైన నిర్ణయం మా ఆజ్ఞానుసారం జారీ అవుతుంది. మేము ఒక ప్రవక్తను నీ ప్రభువు కారుణ్యంగా పంపాలనుకున్నాము. నిశ్చ యంగా ఆయన మాత్రమే అన్నీ వినేవాడు , అన్నీ ఎరిగినవాడు, ఆకాశాలకూ భూమికీ ప్రభువు , భూమ్యాకాశాల మధ్య ఉన్న ప్రతి వస్తువునకూ ప్రభువు - మీరు నిజంగా విశ్వాసులే అయితే (ఈ విషయాన్ని గ్రహించండి). ఆయన తప్ప ఆరాధ్యదైవం ఎవ్వడూ లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు, ఆయనే మరణాన్నీ ఇస్తాడు. ఆయనే మీ ప్రభువు , గతించిన మీ పూర్వికుల ప్రభువు. (కాని వాస్తవంగా వారికి నమ్మకం లేదు) అయితే వారు శంకతో ఆడుకుం టున్నారు.

**44. అద్ దుఖాన్** 10 - 16 సరే, స్పష్టమైన పొగను ఆకాశం తీసుకుని వచ్చే దినం కొరకు నిరీక్షించండి. అది ప్రజలను కమ్ముకుంటుంది. ఇదే, వ్యధాభరితమైన శిక్ష. (అప్పుడు వారు ఇలా అంటారు) ''ప్రభూ! ఈ శిక్షను మాపై నుండి తొలగించు. మేము విశ్వసిస్తున్నాము.'' వారి అశ్రద్ధ ఎలా దూరం అవుతుంది ? వారి వద్దకు సాక్షాత్తుగా ఒక ప్రవక్త వచ్చినప్పటికీ, వారు అతని పట్ల శ్రద్ధ చూపలేదు సరికదా పైగా , ''ఇతను ఒక పిచ్చివాడు, ఇతరుల నుండి నేర్చుకున్నాడు'' అని అన్నారు. ఇలా ఉంది వారి పరిస్థితి. మేము శిక్షను కొంచెం తొలగిస్తే , మీరు పూర్వం చేస్తూ ఉన్నదానినే మళ్లీ చేస్తారు. మేము గట్టిదెబ్బకొట్టే ఆ రోజు, మేము మీకు ప్రతీకారం చేసేరోజు అవుతుంది.

**44. అద్ దుఖాన్** 17 - 33 మేము వారికి పూర్వం, ఫిరౌన్ జాతి వారిని ఇటువంటి పరీక్షకే గురిచేశాము. వారివద్దకు ఎంతో మర్యాదస్తుడైన ఒక ప్రవక్త వచ్చాడు. అతను ఇలా అన్నాడు , ''అల్లాహ్ సేవకులను నాకు అప్పగించండి. నేను మీ కొరకు వచ్చిన ఒక నమ్మకస్తుడనైన ప్రవక్తను. అల్లాహ్ కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయకండి. నేను మీ ముందు (నా నియామకానికి సంబంధించిన) స్పష్టమైన ప్రమాణాన్ని ఉంచుతున్నాను. మీరు నా మీద దాడిచేయకుండా నేను మన ప్రభువు యొక్క శరణుపొందాను. ఒకవేళ మీరు నా మాట నమ్మకపోతే సరే , నా జోలికి మట్టుకు రాకండి.'' చివరకు అతను, ''ఈ ప్రజలు అపరాధులు'' అని తన ప్రభువుతో చెప్పుకున్నాడు. (ఇలా జవాబు ఇవ్వబడిరది), ''మంచిది. రాత్రికి రాత్రే నా సేవకులను తీసుకుని బయలుదేరు. మిమ్మల్ని వెంటాడటం జరుగుతుంది. సముద్రాన్ని అది ఉన్న స్థితిలోనే విడిచిపెట్టు. అప్పుడు ఈ సైన్యం అంతా మునిగిపోతుంది. '' వారు ఎన్ని తోటలను , ఎన్ని నీటి బుగ్గలను , ఎన్ని పొలాలను , ఎన్ని అందమైన సౌధాలను వదలివెళ్లారు! వారు అనుభవిస్తూ ఉన్న విలాస వస్తువులు ఎన్నో వారి వెనుకనే ఉండిపోయాయి! ఇలా జరిగింది వారి ముగింపు. మేము ఇతరులను ఈ వస్తువులకు వారసులుగా చేశాము. తరువాత వారి కొరకు ఆకాశమూ విలపించలేదు , భూమీ విలపించలేదు. వారికి కొద్దిపాటి వ్యవధి కూడా ఇవ్వబడలేదు. ఈ విధంగా మేము ఇస్రాయీల్ సంతతి వారికి అత్యంత అవమానకరమైన శిక్ష నుండి , ఫిరౌన్ నుండి విమోచనం కలిగించాము. అతడు హద్దులు మీరిన వారిలో నిజంగానే అగ్రశ్రేణికి చెందినవాడు. వారి పరిస్థితిని ఎరిగి ఉండి కూడా వారికి ప్రపం చంలోని ఇతర జాతులపై ప్రాధాన్యం ఇచ్చాము. వారి కొరకు స్పష్టమైన పరీక్షగా సూచనలను వారికి చూపించాము.

**44. అద్ దుఖాన్** 34 - 42 వారు ఇలా అంటారు , ''మాకు మా మొదటి మరణమే తప్ప తరు వాత మరింకేమీ లేదు. దాని తరువాత మేము లేపబడే వారము కానేకాము. నీవు నిజమే పలుకుతున్నట్లయితే , మా తాతముత్తాతలను లేపి తీసుకురా. '' వారు మేలైనవారా లేక తుబ్బా జాతివారా , దానికి ముందువారా ? వారు అపరాధులై పోయిన కారణంగానే మేము వారిని నాశనం చేశాము. ఈ ఆకాశాన్నీ , ఈ భూమినీ, వాటి మధ్య ఉన్న వస్తువులనూ మేము వినోదం కోసం సృష్టించలేదు సుమా. వాటిని మేము సత్యంతోనే సృష్టించాము. కాని వారిలో అనేకులు ఎరుగరు. వారందరూ లేపబడటానికి నిర్ణయించబడిన సమయం తీర్పు దినమే. ఆనాడు దగ్గరబంధువు

అయినాసరే తన దగ్గర బంధువుకి కూడా ఎంతమాత్రం ఉపయోగపడడు ఎవరి నుండీ వారికి ఏ సహాయమూ లభించదు అల్లాహ్ యే ఎవరి మీదనయినా కరుణ చూపితే తప్ప. ఆయన శక్తిమంతుడు కరుణామయుడూను.

**44. అద్ దుఖాన్** 43 - 50 జఖ్ఖూమ్ వృక్షం పాపాత్ములకు ఆహారం అవుతుంది. అది నూనె మడ్డిలాగా ఉంటుంది. సల సల కాగే నీరు మాదిరిగా అది కడుపులో మస లుతూ ఉంటుంది. అతనిని పట్టుకోండి , నరకం మధ్యకు ఈడ్చుకుంటూ తీసుకువెళ్లండి, వాడి తల మీద సల సల కాగే నీటి శిక్షను పోర్లించండి. నీవు గొప్ప బలవంతుడవూ, గౌరవనీయుడవూ అయిన మనిషివి. మీరు ఏ విషయం రాకను గురించి సందేహించేవారో ఆ విషయం ఇదే.

**44. అద్ దుఖాన్** 51 - 57 దైవభీతి గలవారు శాంతి భద్రతల గల ప్రదేశంలో ఉంటారు. ఉద్యానవనాలలో , సెలయేళ్లలో, సన్నని పట్టు వస్త్రాలూ, జరీ పట్టు వస్త్రాలూ ధరించి, ఒకరికొకరు ఎదురుగా కూర్చుండి ఉంటారు. ఇలా ఉంటుంది వారి దర్పం. పసిమి రంగు మేనులూ , అందమైన విశాలమైన కళ్లూ గల స్త్రీలను వారికి ఇచ్చి వివాహం చేస్తాము. అక్కడ వారు రుచికరమైన అన్ని రకాల పదార్థాలనూ నిస్సంకోచంగా అడుగుతారు. అక్కడ వారు మరణాన్ని ఎన్నటికీ రుచి చూడరు. ప్రపంచంలో వచ్చిన మరణమే మరణం. అల్లాహ్ తన కృపతో వారిని నరక శిక్ష నుండి కాపాడుతాడు. ఇదే గొప్ప సాఫల్యం.

**44. అద్ దుఖాన్** 58 - 59 ప్రవక్తా! వారు హితబోధ పొందటానికి మేము ఈ గ్రంథాన్ని నీ భాషలో సరళం చేశాము , ఇక నీవు కూడా నిరీక్షించు, వారు కూడా నిరీక్షి స్తున్నారు.

45. అల్ జాసియహ్

ఆయతులు : 37 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 2 హా. మీమ్. ఈ గ్రంథం శక్తిమంతుడూ, వివేకవంతుడూ అయిన అల్లాహ్ తరఫు నుండి అవతరించింది.

3 - 6 వాస్తవంగానే విశ్వాసుల కొరకు ఆకాశాలలోనూ , భూమిలోనూ అసంఖ్యాకమైన సూచనలు ఉన్నాయి. మిమ్మల్ని సృష్టించటంలోనూ, అల్లాహ్ (భూమిలో) వ్యాపింపజేస్తూ ఉన్నటువంటి జంతువులలోనూ , నమ్మేవారి కొరకు గొప్ప సూచనలు ఉన్నాయి. రేయింబవళ్ల మధ్య ఉన్న వ్యత్యా సంలో , వ్యతిరేక తలో, ఆకాశంనుండి అల్లాహ్ అవతరింపజేస్తున్న ఆహారంలో - దాని ద్వారా ఆయన మృతభూమిని బ్రతికిస్తాడు - వాయువుల పరిభ్రమణంలో , బుద్ధిని ఉపయోగించే వారికి ఎన్నో సూచనలు ఉన్నాయి. ఇవన్నీ అల్లాహ్ సూచనలు , మేము వాటిని నీకు యథాతథంగా వివరిస్తున్నాము. ఇక అసలు వారు అల్లాహ్నూ , ఆయన వాక్యాలనూ కాక మరే విషయాన్ని విశ్వసిస్తారు?

7 - 10 అసత్యవాది, దుష్కార్యపరుడు అయిన ప్రతివ్యక్తి సర్వనాశనమవుతాడు. అతడి ముందు అల్లాహ్ వాక్యాలు పఠించబడతాయి, వాటిని అతడు వింటాడు. ఆ తరువాత అతడు వాటిని ఎన్నడూ విననివాని మాదిరిగా అహంభావంతో తన తిరస్కార వైఖరిపై మొండిగా ఉండిపోతాడు. అటువంటి వ్యక్తికి అత్యంత బాధాకరమైన శిక్షపడుతుందనే శుభవార్తను వినిపించు. మా వాక్యాలకు సంబంధించిన విషయం ఏదైనా అతడికి తెలిసినప్పుడు , దానిని అతడు ఎగతాళి చేస్తాడు. అటువంటి వారందరికీ అవమానకరమైన శిక్షపడుతుంది. వారి ముందు నరకం ఉన్నది. వారు ప్రపంచంలో సముపార్జించుకున్న దానిలో ఏదీ వారికి ఏ విధంగానూ పనికిరాదు. అల్లాహ్ ను కాదని వారు తమ సంరక్షకులుగా చేసు కున్న వారు సైతం వారికొరకు ఏమీ చేయలేరు. వారి కొరకు పెద్దయాతన ఉన్నది.

11 ఈ ఖురాను పూర్తిగా మార్గదర్శకత్వమే. తమ ప్రభువు వాక్యాలను విశ్వసించకుండా తిరస్కరించిన వారికి వ్యధాభరితమైన పెద్ద శిక్ష పడుతుంది.

12 - 13 సముద్రాన్ని మీకు వశపరచినవాడు అల్లాహ్ యే కదా! ఆయన ఆదేశానుసారం అందులో ఓడలు ప్రయాణం చేయటానికి మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి కృతజ్ఞులు కావటానికి : భూమిలోని , ఆకాశాలలోని సకల వస్తువులనూ ఆయన మీకు వశపరచాడు. ఇదంతా తన వద్దనుండే - ఆలోచనాపరులకు ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి.

14 - 15 ప్రవక్తా! విశ్వాసులతో ఇలా అను : ''అల్లాహ్ తరఫు నుండి చెడ్డరోజులు వస్తాయని భయపడని వారి చేష్టలను క్షమించండి స్వయంగా అల్లాహ్ ఒక వర్గం వారికి వారి సంపాదనకు ప్రతిఫలం ఇవ్వటానికి. సత్కార్యం చేసేవాడు దానిని తన కొరకే చేసుకుంటాడు. దుష్కార్యం చేసేవాడు తానే దాని ఫలితాన్ని అనుభవిస్తాడు. తరువాత అందరూ తమ ప్రభువు వైపునకే మరలిపోతారు.

16 - 20 పూర్వం మేము ఇస్రాయీల్ సంతతి వారికి గ్రంథాన్నీ , ఆజ్ఞనూ, ప్రవక్త పదవినీ ప్రసాదించాము. వారికి మేము మంచి జీవన సామగ్రిని అనుగ్రహించాము. ప్రపంచంలోని ప్రజలందరిపై వారికి ఘనతను దయ చేశాము. ధర్మం విషయంలో వారికి స్పష్టమైన ఉపదేశాలను ఇచ్చాము. తరువాత వారి మధ్య తలెత్తిన విభేదాలు (తెలియకపోవటం వల్లకాదు కాని) జ్ఞానం వచ్చిన తరువాతనే తలెత్తాయి , వారు ఒకరికొకరు అన్యాయం చేయ దలచుకున్న కారణంగానే తలెత్తాయి. ప్రళయం నాడు అల్లాహ్ వారు విభేదిస్తూ ఉన్న వ్యవహారాలను గురించి తీర్పు చెబుతాడు. ఇప్పుడు ప్రవక్తా! మేము నిన్ను ధర్మం విషయంలో ఒక స్పష్టమైన రాజమార్గంపై (షరియత్) స్థిరపరి చాము. కనుక నీవు దానిపై మాత్రమే నడువు. జ్ఞానహీనుల కోరికలను అనుసరించకు. అల్లాహ్ కు ప్రతిగా వారు నీకు ఏమాత్రం ఉపయోగపడరు. దుర్మార్గులు ఒకరికొకరు సహాయకులు. భయభక్తులు కలవారి సహాయకుడు అల్లాహ్. దూరదృష్టితో నిండివున్న ఈ కాంతులు ప్రజలందరికొరకు నమ్మే వారికి ఇవి మార్గదర్శకత్వం, కారుణ్యమూను.

21 - 22 చెడులకు పాల్పడినవారు, తమనూ, విశ్వసించి మంచిపనులు చేసేవారినీ మేము సమానంగా చేస్తామనీ , వారి జీవన్మరణాలు ఒకేవిధంగా ఉండేలా చేస్తామనీ అనుకుంటున్నారా ? వారు చేసే నిర్ణయాలు చాల చెడ్డవి. అల్లాహ్ ఆకాశాలనూ, భూమినీ సత్యంతో సృజించాడు , ప్రతి ప్రాణికీ దాని సంపాదన ప్రకారం ప్రతిఫలం ఇవ్వాలని సృజించాడు. ప్రజలకు అన్యాయం ఎంతమాత్రం జరగదు.

23 తన మనోవాంఛలను తన దేవుడుగా చేసుకున్న వ్యక్తి స్థితిని గురించి కూడా నీవు ఎప్పుడైనా ఆలోచించావా ? జ్ఞానం ఉన్నప్పటికీ, అతనిని అల్లాహ్ మార్గభ్రష్టత్వంలోకి విసిరివేశాడు , అతని హృదయం మీదా , చెవుల మీదా ముద్రవేశాడు, అతని కళ్లకు తెరవేశాడు. ఇక అల్లాహ్ తప్ప అతనికి మార్గం చూపేవాడెవడున్నాడు ? మీరు గుణపాఠాన్ని నేర్చుకోరా?

24 - 27 వారు ఇలా అంటారు, ‘‘జీవితం అంటే కేవలం మన ఈ ప్రాపంచిక జీవితం మాత్రమే. ఇక్కడే మన మరణం, ఇక్కడే మన జీవనం. కాల పరిభ్ర మణం తప్ప , మనలను ఏదీ చంపలేదు.’’ వాస్తవంగా ఈ విషయానికి సంబం ధించిన జ్ఞానమేదీ వారివద్ద లేదు. వారు కేవలం ఊహ ఆధారంగా ఈ మాటలు అంటున్నారు. స్పష్టమైన మా వాక్యాలను వారికి వినిపించినప్పుడు , ‘‘నీవు సత్యవంతుడవే అయితే , మా తాతముత్తాతలను లేపి తీసుకురా ’’ అనేది తప్ప వారివద్ద మరొక తర్కం ఏదీ ఉండదు. ప్రవక్తా! వారితో ఇలా అను , ‘‘అల్లాహ్ యే మీకు జీవితం ప్రసాదిస్తున్నాడు, తరువాత ఆయనే మీకు మరణం కలుగజేస్తున్నాడు , ఆపైన ఆయనే మిమ్మల్ని ప్రళయం నాడు సమావేశపరు స్తాడు అది వచ్చే విషయం గురించి ఏమాత్రం సందేహం లేదు. కాని చాలా మందికి ఈ విషయం తెలియదు. భూమి , ఆకాశాల సామ్రాజ్యాధికారం అల్లాహ్దే. ప్రళయగడియ వచ్చిపడే ఆనాడు అసత్యవాదులు నష్టానికి గురి అవుతారు.

28 - 35 అప్పుడు నీవు ప్రతి వర్గమూ మోకరిల్లి ఉండటాన్ని చూస్తావు. వచ్చి , తన కర్మల పత్రాన్ని చూడవలసినదిగా ప్రతి వర్గాన్నీ పిలవటం జరుగు తుంది. వారితో ఇలా అనబడుతుంది , ‘‘ఈనాడు మీకు మీరు చేసిన కర్మలకు ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఇది మేము తయారు చేయించిన కర్మల పత్రం. అది మీ విషయంలో జరిగింది జరిగినట్లుగా సాక్ష్యమిస్తుంది. మీరు చేస్తూ ఉండినదంతా మేము వ్రాయిస్తూపోయాము. ’’ విశ్వసించి, మంచిపనులు చేస్తూ ఉండిన వారిని వారి ప్రభువు తన కారుణ్యంలోకి ప్రవేశింపజేస్తాడు. అసలు స్పష్టమైన సాఫల్యం అంటే ఇదే. అవిశ్వాసులైపోయిన వారితో (ఇలా అనబడు తుంది) , ‘‘నా వాక్యాలు మీకు వినిపించబడుతూ ఉండలేదా? కాని మీరు అహంభావానికి వశులై అపరాధులైపోయారు. అల్లాహ్ వాగ్దానం సత్యమైనదనీ , ప్రళయం వచ్చే విషయం గురించి ఏమాత్రం సందేహం లేదనీ అనబడినప్పుడు , మీరు, ప్రళయం అంటే ఏమిటో మాకు తెలియదు. మేము కేవలం అనుమానా స్పదమైన విషయంగానే తలుస్తాము. మాకు నమ్మకం లేదు ’’ అని అనేవారు. అప్పుడు వారికి తమ కర్మల కీడులు ఏమిటో ప్రస్ఫుటమవుతాయి. వారు తాము ఎగతాళి చేసిన దాని

యొక్క వలయంలోనే చిక్కుకుపోతారు. వారితో ఇలా అనటం జరుగుతుంది , ''మీరు ఈనాటి సమావేశాన్ని మరచిపోయిన విధంగానే, మేము కూడ ఈనాడు మిమ్మల్ని మరచిపోతాము. మీ నివాసం ఇక నరకమే. మీకు సహాయం చేసేవాడెవడూ లేడు. మీరు అల్లాహ్ వాక్యాలను పరిహాసంగా తీసుకోవటంవల్లా , ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసానికి గురిచేయటం వల్లా మీ గతి ఇలా అయింది. కనుక ఈనాడు వారిని నరకం నుండి బయటకు తీయటమూ జరగదు, క్షమాభిక్షను అనుగ్రహించు అని వేడుకొని మీ ప్రభువును ప్రసన్నుడుగా చేసుకోండి అని వారికి చెప్పటమూ జరగదు.''

36 - 37 కనుక అల్లాహ్ మాత్రమే స్తుతిపాత్రుడు. ఆయన భూమికీ , ఆకాశా లకూ ప్రభువు సకల లోకాలకూ ప్రభువు. భూమ్యాకాశాలలో ఘనత ఆయనకు మాత్రమే చెందుతుంది. శక్తిమంతుడూ , వివేకవంతుడూ ఆయన మాత్రమే.

46. అల్ అహ్ఖాఫ్

ఆయతులు : 35 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 2 హా. మీమ్. ఈ గ్రంథం మహాశక్తిమంతుడూ , మహా వివేకవంతుడూ అయిన అల్లాహ్ తరఫు నుండి అవతరించింది.

3 మేము భూమినీ , ఆకాశాలనూ, వాటి మధ్య ఉన్న సకల వస్తువులనూ సత్యం ప్రకారం , ఒక ప్రత్యేక కాల నిర్ణయంతో సృష్టించాము. కాని ఏ యధార్థం గురించి ఈ అవిశ్వాసులకు హెచ్చరిక చేయబడిరదో , ఆ యధార్థా నికి వారు విముఖులయ్యారు.

4 - 6 ప్రవక్తా! వారితో ఇలా అను , ''మీరు దేవుణ్ణి త్రోసిరాజని వేడుకుంటున్న శక్తులు అసలు ఏమిటో ఎప్పుడైనా మీరు కళ్లు తెరచి చూశారా ? భూమిలో వారు సృష్టించింది ఏమిటో , కొంచెం నాకు చూపండి ? లేదా ఆకాశాల సృష్టిలో, వాటి నిర్వహణలో వాటి పాత్ర ఏమైనా ఉందా ? ఒకవేళ ఇదివరకు వచ్చిన ఏదైనా గ్రంథంగానీ లేదా జ్ఞాన అవశేషంగానీ (ఈ విశ్వాసాలకు ఆధారంగా) మీదగ్గర ఉంటే , దాన్నే తీసుకురండి, మీరు సత్యవంతులే అయితే. '' అల్లాహ్ ను కాదని, ప్రళయం వచ్చే వరకు అతనికి సమాధానమైనా ఇవ్వలేని వారిని, మొరపెట్టుకునే వారు తమకు మొరపెట్టుకుంటున్నారనే విషయం కూడ ఎరుగని వారిని వేడుకునే వాడికంటే పరమ భ్రష్టుడైన మానవుడు ఎవడు ఉంటాడు? మానవులందరినీ సమావేశపరచినప్పుడు, వారు తమను వేడుకున్న వారికి విరోధులైపోతారు , వారి ఆరాధనను తిరస్కరిస్తారు.

7 - 8 ఎంతో స్పష్టమైన మా వాక్యాలను వారికి వినిపించినప్పుడు , సత్యం వారి ముందుకు వచ్చినప్పుడు , ఈ అవిశ్వాసులు దానిని గురించి , ''ఇది స్పష్టంగా మంత్రజాలమే'' అని అంటారు. అయితే ప్రవక్తయే దానిని కల్పించాడని వారి భావమా? వారితో ఇలా అను, ''ఒకవేళ నేనే దానిని కల్పించి ఉన్నట్లయితే , మీరు దేవుని శిక్ష నుండి నన్ను ఏమాత్రం కాపాడలేరు. మీరు కల్పించే విషయాలను అల్లాహ్ బాగా ఎరుగును. నాకూ మీకూ మధ్య సాక్షిగా దేవుడే సరిపోతాడు. ఆయన ఎక్కువగా మన్నించేవాడు, కరుణించేవాడూను.''

9 - 10 వారితో ఇలా అను, ''నేను కొత్తప్రవక్తనేమీ కాను. రేపు మీకు ఏమి జరుగనున్నదో, నాకు ఏమి కానున్నదో, నాకైతే తెలియదు. నేను నావద్దకు పంపబడే దైవవాణి (వహీ)ని మాత్రమే అనుసరిస్తున్నాను. నేను స్పష్టంగా హెచ్చరిక చేసేవాణ్ణి తప్ప మరేమీ కాను.'' ప్రవక్తా! వారికి ఇలా చెప్పు: ''ఒకవేళ ఈ గ్రంథం అల్లాహ్ తరఫు నుండి వచ్చి ఉండి, మీరు దానిని తిరస్కరిస్తూ ఉన్నట్లయితే , (అప్పుడు మీ గతి ఏమవుతుందో) అనే విషయం గురించి మీరెప్పుడైనా ఆలోచించారా? ఇటువంటి ఒక గ్రంథాన్ని గురించి ఇస్రాయీల్ సంతతికి చెందిన ఒక సాక్షి సాక్ష్యం కూడ ఇచ్చి ఉన్నాడు. అతడేమో విశ్వసించాడు, మీరేమో అహంభావానికి లోనయ్యారు. అటువంటి దుర్మార్గులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.

11 - 14 విశ్వసించేందుకు తిరస్కరించినవారు , విశ్వసించే వారిని గురించి , ''ఈ గ్రంథాన్ని విశ్వసించటం అనేది మంచి పనే అయితే ,వారు ఈ విషయంలో మాకంటే ముందుకు పోగలిగేవారు కాదు '' అని అంటారు. వారు దానినుండి మార్గదర్శకత్వం పొందలేదు కాబట్టి , ''ఇది పాత అబద్ధమే '' అని తప్ప కుండా అంటారు. వాస్తవానికి ఇంతకు పూర్వం మూసా గ్రంథం మార్గదర్శిగా , కారుణ్యంగా వచ్చేసింది. ఈ గ్రంథం దానిని ధ్రువీకరిస్తూ అరబ్బీ భాషలో వచ్చింది దుర్మార్గులను హెచ్చరించటానికి , సద్వైఖరి అవలంబించే వారికి శుభవార్తలు ఇవ్వటానికిన్నీ. నిశ్చయంగా అల్లాహ్ యే మా ప్రభువు అని ప్రక టించి , దానిపై స్థిరంగా ఉండిపోయిన వారికి ఏ భయమూ లేదు , వారు దుఃఖించటమూ జరగదు. అటువంటి వారే స్వర్గానికి పోయేవారు. అక్కడనే వారు శాశ్వతంగా ఉంటారు , ప్రపంచంలో తాము చేసిన పనులకు ప్రతిఫలంగా.

15 - 20 మేము మానవునికి, అతను తన తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగాలని ఉపదేశించాము. అతని తల్లి అతనిని ఎంతో శ్రమతో తన గర్భంలో పెట్టుకొని మోసింది ఎంతో శ్రమతోనే అతనిని కన్నది. అతనిని గర్భంలో పెట్టుకొని మోసేందుకు, అతనిచే పాలు మాన్పించేందుకు ముప్పై మాసాలు పట్టింది. చివరకు అతను పరిపూర్ణ శక్తిని పొంది , నలభై సంవత్సరాల వయ స్సుకు చేరినప్పుడు , ఇలా అన్నాడు , ''నా ప్రభూ! నాకూ , నా తల్లిదండ్రులకూ నీవు ప్రసాదించిన మహాభాగ్యాలకు గాను, నీకు కృతజ్ఞతలు తెలిపే, నీవు ఇష్టపడే సత్కార్యాలు చేసే సద్బుద్ధిని నాకు ప్రసాదించు. ఇంకా , నా సంతానాన్ని కూడ మంచివారుగా చేసి నాకు సుఖాన్ని ఇవ్వు. నేను నీ సన్నిధిలో పశ్చాత్తాప పడుతూ నీ వైపునకు మరలుతున్నాను. నేను విధేయు(ముస్లిమ్)లైన దాసుల లోని

వాడను.'' ఇటువంటి వారి నుండి మేము వారు చేసిన మంచి కర్మలను స్వీకరిస్తాము వారు చేసిన చెడు కర్మలను మన్నిస్తాము. వారికి చేయబడుతూ వచ్చిన సత్యవాగ్దానం ప్రకారం, వారు స్వర్గవాసులలో చేరిపోతారు. ఏ వ్యక్తి తన తల్లిదండ్రులతో ఇలా అన్నాడో, ''ఛీ, పోండి, మీరు నన్ను విసిగిస్తున్నారు. మరణించిన తరువాత నేను సమాధి నుండి లేపబడతానని మీరు నన్ను భయపెడుతున్నారా ? వాస్తవానికి నాకు పూర్వం ఎన్నో తరాలు గతించాయి (వారిలో నుండి ఎవ్వడూ లేచిరాలేదు కదా!) '' ఆ వ్యక్తిని గురించి తల్లి దండ్రులు ఇద్దరూ సహాయం కోసం అల్లాహ్ కు మొరపెట్టుకొని ఇలా అన్నారు, ''ఓరి దౌర్భాగ్యుడా! విశ్వసించు. అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. '' కాని అతడు, ''ఇవన్నీ పాతకాలపు కట్టుకథలు '' అని కొట్టిపారేశాడు. ఇటువంటి వారి మీదనే శిక్షా నిర్ణయం రూఢీ అయిపోయింది. వారికి పూర్వం గతించిన జిన్నాతులు, మానవుల గుంపులలోనే వారు కూడా పోయి చేరుతారు. నిస్సం దేహంగా వారు నష్టంలోపడి ఉండిపోయేవారు. రెండు వర్గాలలోని ప్రతి ఒక్క వర్గానికి దాని కర్మలను బట్టి దాని అంతస్తు ఉంటుంది. వారు చేసిన దానికి పూర్తి ప్రతిఫలం ఇవ్వటానికి అల్లాహ్ ఇలా చేస్తాడు. వారికి అన్యాయం ఎంతమాత్రం జరగదు. తరువాత ఈ అవిశ్వాసులను అగ్ని ముందుకు తీసుకు వచ్చి నిలబెట్టినప్పుడు, వారితో ఇలా అనటం జరుగుతుంది ''మీరు మీ వంతు వరాలను మీ ప్రాపంచిక జీవితంలో పొందారు. వాటిద్వారా ఆనందాన్ని మీరు అక్కడే అనుభవించారు. ఇక ఏ హక్కూ అర్హతా లేకుండా మీరు భూమిపై ప్రదర్శిస్తూ ఉండిన దురహంకారానికి, మీ అవిధేయతా చేష్టలకు పర్యవ సానంగా , ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతుంది.''

21 - 26 వారికి కొంచెం ఆద్ సోదరుని (హూద్) గాథను వినిపించు. అప్పుడు అతను ఇసుక గుట్టల మధ్య నివసించే తన జాతి వారిని ఇలా హెచ్చరించాడు- అలా హెచ్చరించేవారు అతనికి పూర్వం కూడవచ్చారు , అతని తరువాత కూడ వచ్చారు- ''అల్లాహ్ ను తప్ప మరెవరినీ ఆరాధించకండి. మీ విషయంలో ఒక భయంకర దినాన విధించబడే శిక్షను గురించి నేను భయపడుతున్నాను.'' దానికి వారు ఇలా అన్నారు, ''మాయమాటలు చెప్పి మా దేవతల నుండి మమ్మల్ని దూరం చేయటానికా వచ్చింది నీవు? సరే, మంచిది, నీవు సత్యవంతుడవే అయితే, నీవు మమ్మల్ని భయపెడుతూ ఉన్నటు వంటి ఆ శిక్షను తీసుకు రా. '' అతను ఇలా అన్నాడు , ''దానిని గురించి అల్లాహ్ కు మాత్రమే తెలుసు. ఏ సందేశాన్ని ఇచ్చి నన్ను పంపడం జరిగిందో ఆ సందేశాన్నే నేను మీకు అందజేస్తున్నాను. కాని నేను గమనిస్తున్నాను, మీరు అజ్ఞానులుగా ప్రవర్తిస్తున్నారు.'' తరువాత వారు ఆ శిక్షను తమ లోయల వైపునకు వస్తూ ఉండగా చూసి , ''ఇవి పుష్కలంగా మాకు వర్షాన్ని కురిపించే మేఘాలు '' అని అనసాగారు- కాదు, కాని ఇది మీరు తొందరపెడుతూ ఉన్న విషయం. ఇది తుఫాను గాలి , వ్యధాపూరితమైన శిక్షను తెస్తోంది, తన ప్రభువు ఆజ్ఞానుసారం ప్రతివస్తువునూ సర్వనాశనం చేస్తుంది. చివరకు వారి నివాస స్థలాలు తప్ప అక్కడ ఏమీ కనిపించకుండా పోయింది. ఈ విధంగా మేము నేరస్తులకు ప్రతిఫలం ఇస్తూ ఉంటాము. మీకు ఇవ్వనివి ఎన్నో మేము వారికి ఇచ్చాము. మేము వారికి చెవులూ , కళ్లూ, మనస్సూ అన్నీ ఇచ్చాము. కాని ఆ

చెవులూ వారికి ఏ విధంగానూ పనికి రాలేదు, కళ్లూ మనస్సూ కూడా (పనికిరాలేదు). ఎందుకంటే వారు అల్లాహ్ వాక్యాలను తిరస్కరిస్తూ ఉండేవారు. వారు దేనిని గురించి వేళాకోళం చేస్తూ ఉండేవారో , దాని వలలోనే వారు చిక్కుకు పొయ్యారు.

27 - 28 మీ చుట్టుపక్కల ప్రాంతాలలోని ఎన్నో జనపదాలను మేము నాశనం చేసివేశాము. మేము మా వాక్యాలను పంపి మాటిమాటికి రకరకా లుగా వారికి నచ్చజెప్పాము , బహుశా వారు దారికి వస్తారేమో అని. అల్లాహ్ ను వదలిపెట్టి, వారు ఏ శక్తులను అల్లాహ్ సాన్నిధ్యాన్ని పొందటానికి సాధ నాలుగా భావించి , దైవాలుగా చేసుకున్నా రో, ఆ శక్తులు వారికి ఎందుకు సహాయం చేయవు ? పైగా అవి వారికి కనుమరుగైపోయాయి. ఇది వారి అబద్ధాలకూ, వారు కల్పించుకున్న కృత్రిమ విశ్వాసాలకూ పర్యవసానం.

29 - 32 (ఆ సంఘటన కూడ ప్రస్తావించదగినదే) అప్పుడు మేము జిన్నా తుల ఒక వర్గాన్ని ఖురాన్ వినేందుకు నీ వద్దకు తీసుకువచ్చాము. నీవు ఖురాన్ పఠిస్తూ ఉండిన స్థలానికి చేరిన తరువాత , వారు పరస్పరం ''నిశ్శబ్దంగా ఉండండి'' అని చెప్పుకున్నా రు. అది చదవటం ముగిసిన పిదప, వారు హెచ్చరిక చేసేవారుగా తమ జాతి వైపునకు తిరిగి వెళ్లిపోయారు. వారు అక్కడకు వెళ్లి ఇలా అన్నా రు , ''ఓ మా జాతి ప్రజలారా! మేము ఒక గ్రంథాన్ని విన్నా ము. అది మూసా ప్రవక్త తరువాత అవతరించింది తనకు పూర్వం అవతరించిన గ్రంథాలను ధ్రువీకరిస్తుంది , సత్యం వైపునకూ, ఋజుమార్గం వైపునకూ దారిచూపుతుంది. ఓ మా జాతి ప్రజలారా! అల్లాహ్ వైపునకు పిలిచే వాని సందేశాన్ని స్వీకరించండి, అతనిని విశ్వసించండి. అప్పుడు అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు , మిమ్మల్ని భయంకరమైన శిక్ష నుండి రక్షిస్తాడు.'' అల్లాహ్ వైపునకు పిలిచే వాని మాటను విననివాడు భూమిలో అల్లాహ్ ను అశక్తుడుగా చేసే శక్తిని కలిగిలేడు. అతనిని అల్లాహ్ నుండి రక్షించేందుకు ఎలాంటి మద్దతుదారులు గానీ , సంరక్షకులుగానీ ఎవరూ ఉండరు. అటువంటి వారు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నా రు.

33 - 34 ఏ దేవుడైతే ఈ భూమినీ , ఈ ఆకాశాన్నీ సృష్టించాడో , వాటిని సృష్టించటంలో అలసిపోలేదో , ఆ దేవుడు మృతులను తప్పకుండా బ్రతికించి లేపగల శక్తిని కూడ కలిగి ఉన్నా డనే విషయం వారికి తోచటంలేదా ? ఎందుకు కలిగిలేడు, నిశ్చయంగా ఆయన ప్రతి దానినీ చేయగల శక్తి సామర్థ్యాలు కలవాడు. అవిశ్వాసులు అగ్ని ముందుకు తీసుకురాబడే రోజున వారిని, ''ఇది సత్యం కాదా ?'' అని అడగటం జరుగుతుంది. వారు , ''అవును, మా ప్రభువు సాక్షిగా! (ఇది నిజంగానే సత్యం) '' అని అంటారు. అల్లాహ్ , ''సరే, ఇక మీరు తిరస్కరిస్తూ ఉండిన దాని పర్యవసానంగా, శిక్షను రుచిచూడండి'' అని సెలవిస్తాడు.

35 కనుక ప్రవక్తా! సహనం వహించు , దృఢచిత్తులైన ప్రవక్తలు సహనం వహించినట్లుగా. వారి విషయంలో తొందరపడకు. దేనిని గురించి వారిని ఇప్పుడు భయపెట్టటం జరుగుతోందో , దానిని వారు చూసిన రోజున , వారికి

ప్రపంచంలో దినంలోని ఒక గడియకంటే ఎక్కువ కాలం కూడ ఉండ లేదు అని అనిపిస్తుంది. సందేశం అందజేయబడిరది. ఇక అవిధేయులు తప్ప మరెవరు నాశన మవుతారు?

47. ముహమ్మద్

ఆయతులు : 38 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 3 అవిశ్వాసానికి పాల్పడి, (ప్రజలను) అల్లాహ్ మార్గం వైపునకు పోకుండా నిరోధించిన వారి కర్మలను అల్లాహ్ నిరర్థకమైనవిగా చేశాడు. విశ్వసించి, మంచిపనులు చేసినటువంటి, ముహమ్మద్‌పై అవతరించినది - అది పూర్తిగా సత్యమేనని, అది వారి ప్రభువు వద్దనుండి వచ్చినదని - నమ్మినటువంటి వారి నుండి అల్లాహ్ వారి చెడుగులను దూరం చేసి, వారి స్థితిని చక్కబరిచాడు. దానికి కారణం అవిశ్వాసులు అసత్యాన్ని అనుసరించుటయే. విశ్వాసులు ఈ విధంగా తమ ప్రభువు వద్దనుండి వచ్చిన సత్యాన్ని అనుసరించుటయే. అల్లాహ్, ప్రజలకు తమ నిజమైన స్థానం ఏమిటో తెలియజేస్తాడు.

4 - 6 కనుక మీరు ఈ అవిశ్వాసులతో తలపడినప్పుడు , వారి మెడలను ఖండిరచటమే మీరు చేయవలసిన మొదటి పని. చివరకు మీరు వారిని పూర్తిగా అణచివేసిన తరువాత , ఖైదీలను గట్టిగా బంధించండి. ఆ తరువాత (మీకు ఇలా చేసే అధికారం ఉంది). వారికి మేలైనా చేయండి లేదా వారి నుండి పరిహారం (సొమ్ము) తీసుకొని వదలివేయండి. యుద్ధంలో తన ఆయుధాలు క్రిందపడవేసే వరకు (ఇలా జరగాలి). ఇది మీరు చేయవలసిన పని. అల్లాహ్ తలచుకుంటే స్వయంగా ఆయనే వారిని ఎదుర్కొనేవాడు. అయితే మిమ్మల్ని ఒకరి ద్వారా మరొకరిని పరీక్షించటానికి (ఆయన ఈ పద్ధతిని అవలంబించాడు). అల్లాహ్ తన మార్గంలో చంపబడిన వారి కర్మలను ఎంతమాత్రం వ్యర్థం చేయడు. ఆయన వారికి మార్గం చూపుతాడు , వారి స్థితిని చక్కబరుస్తాడు , తాను వారికి తెలియజేసిన స్వర్గంలో వారిని ప్రవేశింపజేస్తాడు.

7 - 12 విశ్వాసులారా! మీరు అల్లాహ్ కు సహాయం చేస్తే , ఆయన మీకు సహాయం చేస్తాడు, మీ పాదాలను స్థిరంగా ఉంచుతాడు. ఇక అవిశ్వాసుల విషయానికి వస్తే , వారికి వినాశం తప్పదు. అల్లాహ్ వారి కర్మలను తోవ దప్పించాడు. ఎందుకంటే వారు అల్లాహ్ అవతరింపజేసిన దానిని అంగీక రించలేదు. కనుక అల్లాహ్ వారి కర్మలను వ్యర్థపరిచాడు. వారికి పూర్వం గతించిన ప్రజల పర్యవసానం ఎలా జరిగిందో చూసేందుకు వారు భూమిపై సంచరించలేదా? అల్లాహ్ వారిని సమూ లంగా తుడిచిపెట్టాడు. ఇటువంటి ఫలితాలే ఈ అవిశ్వాసులకు వ్రాసిపెట్టబడి ఉన్నాయి. ఎందుకంటే, విశ్వాసు లకు రక్షకుడూ , సహాయకుడూ అల్లాహ్ యే. అయితే అవిశ్వాసులకు సహాయ

కుడూ, రక్షకుడూ అనేవాడు ఎవ్వడూ లేడు. విశ్వసించి , మంచిపనులు చేసే వారిని అల్లాహ్ , క్రింద సెలయేళ్లు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అవిశ్వాసులు కేవలం కొన్నాళ్ల ప్రాపంచిక జీవితంలోని సౌఖ్యాలను జుర్రుకుం టున్నారు. పశువులు మాదిరిగా తింటున్నారు , త్రాగుతున్నారు. వారి అంతిమ నివాసం నరకం అవుతుంది.

13 - 15 ప్రవక్తా! నిన్ను బహిష్కరించిన నగరం కంటే ఎంతో శక్తిమంత ములైన నగరాలు ఎన్నో గతించిపోయాయి. మేము వాటిని ఎవ్వరూ కాపాడలే నంతగా సర్వనాశనం చేశాము. తన ప్రభువు తరఫు నుండి ఒక స్పష్టమైన సన్మార్గం పొందినవాడు, తమ దుష్కార్యాలు మనోహరమైనవిగా కనిపించేలా చేయబడి , తమ కోరికలకు దాసులైన వారి మాదిరిగా ఎలా కాగలుగుతాడు? భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం యొక్క వైభవం ఇలా ఉంది, అందులో నిర్మలమైన నీటి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, ఏ మాత్రమూ మారని రుచిగల పాల కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, సేవించే వారికి మధురంగా ఉండే మద్యపు కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, స్వచ్ఛమైన తేనె కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అందులో వారికొరకు అన్ని రకాల పండ్లు ఉంటాయి. ఇంకా వారి ప్రభువు తరఫు నుండి క్షమాభిక్షకూడ. (ఇలాంటి స్వర్గాన్ని తన వంతు భాగంగా పొందనున్న వ్యక్తి) నరకంలో శాశ్వతంగా ఉండిపోయే వారి మాదిరిగా పేగులను సైతం కోసివేసేటటువంటి సల సల కాగే నీరు ఇవ్వబడే వారి మాదిరిగా కాగలడా?

16 - 18 వారిలో నీ మాటలను చెవియొగ్గి వినేవారు కొందరు ఉన్నారు. అయితే నీ దగ్గర నుండి వెళ్లిపోయిన తరువాత, జ్ఞాన భాగ్యం ప్రసాదించబడిన వారిని , ‘‘ఇంతకు ముందు అతను అన్నది ఏమిటి ?’’ అని అడుగుతారు. హృదయాలపై అల్లాహ్ ముద్రవేసిన వారు వీరే.వారు తమ కోరికలకు దాసులై పోయినవారు. ఇక మార్గం పొందినవారు, అల్లాహ్ వారికి ఇంకా ఎక్కువగా మార్గం చూపుతాడు , వారికి వారి వంతు భయభక్తులను ప్రసాదిస్తాడు. ఇప్పుడు వారు ప్రళయం కొరకే ఎదురు చూస్తున్నారా , అది అకస్మాత్తుగా వారి మీద విరుచుకుపడాలని? దాని సూచనలైతే వచ్చేశాయి. స్వయంగా అదే వచ్చి నప్పుడు , ఇక వారికి హితోపదేశం స్వీకరించే అవకాశం ఎక్కడ మిగిలి ఉంటుంది?

19 కనుక ప్రవక్తా! బాగా తెలుసుకో , అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైనవాడు ఎవ్వడూ లేడు అని. నీ పొరపాట్లకు క్షమాభిక్ష పెట్టుము అని వేడుకో, విశ్వాసు లైన స్త్రీ పురుషుల పొరపాట్లకు కూడ. అల్లాహ్ నీ కార్యకలాపాలను కూడ ఎరుగును, నీ విశ్రాంతి స్థలాన్ని కూడా ఎరుగును.

20 - 28 విశ్వాసులు ‘‘(యుద్ధానికి సంబంధించిన ఆదేశం గల) సూరా ఏదైనా ఎందుకు అవతరించదు ’’ అని అంటూ ఉండేవారు. కాని యుద్ధ ప్రస్తావన గల ఒక నిర్దిష్టమైన సూరా అవతరింప జేయబడినప్పుడు తమ హృదయాలలో వ్యాధిగల వారు, మరణం ఆవహించిన వారి మాదిరిగా నీ వైపు చూడటాన్ని నీవు గమనిస్తావు. వారి

వైఖరి ఎంతో శోచనీయం. విధేయ తను పాటిస్తామనే వారి వాగ్దానమూ , మంచి మంచి మాటలూ (కేవలం నోటి మాటలే) కాని స్పష్టమైన ఆజ్ఞ ఇవ్వబడినప్పుడు , వారు తాము అల్లాహ్ కు చేసిన ప్రమాణాన్ని నెరవేర్చటంలో తమ నిజాయితీని నిరూపించుకుని ఉంటే, అది వారికే శ్రేయస్కరమైనదిగా ఉండేది. ఇక మీ నుండి ఇంతకంటే ఏమి ఆశించవచ్చు ఒకవేళ మీరు విముఖులైపోతే , భూమిపై మళ్లీ కల్లోలాన్ని రేకెత్తిస్తారు. పరస్పరం గొంతులు కోసుకుంటారు. అల్లాహ్ శపించినవారూ , అంధులుగానూ, బధిరులుగానూ, చేసిన వారూ వీరే. వారు ఖురాన్‌ను గురించి ఆలోచించలేదా? లేక వారి హృదయాలకు తాళాలు పడి ఉన్నాయా? యథార్థ మేమిటంటే, మార్గదర్శకత్వం వారికి స్పష్టపడిన తరువాత కూడ దానికి విముఖులైన వారికి షైతాను ఈ వైఖరిని అవలంబించడం సులభతరం చేశాడు, లేనిపోని ఆశల పరంపరను వారికొరకు పెంచిపేశాడు. అందుకే వారు అల్లాహ్ అవతరింపజేసిన ధర్మాన్ని ద్వేషించే వారితో "కొన్ని విషయాలలో మేము మిమ్మల్ని అనుసరిస్తాము " అని అన్నారు. అల్లాహ్ వారి ఈ రహస్యాలోచనలను బాగా ఎరుగును. దైవదూతలు వారి ఆత్మలను వశపరచుకునేటప్పుడు , వారి ముఖాలపై , వీపులపై కొడుతూ వారిని తీసుకువెళ్లేటప్పుడు , వారి పరిస్థితి ఎలా ఉంటుంది ? ఇలా ఎందుకు జరుగుతుందంటే , వారు అల్లాహ్ కు ఆగ్రహం కలిగించే విధానాన్ని అనుసరించారు , ఆయన ప్రసన్నుడయ్యే మార్గాన్ని అవలం బించటానికి ఇష్టపడలేదు. ఈ కారణంగానే ఆయన వారి కర్మలు అన్నింటినీ వృధాచేశాడు.

29 - 31 హృదయాలలో వ్యాధి కలవారు , తమ మనస్సులలోని కల్మషాన్ని అల్లాహ్ బహిర్గతం చేయడని అనుకుంటున్నారా? మేము తలచుకుంటే వారిని నీకు చూపిస్తాము, వారి ముఖాలనుబట్టి నీవు వారిని గుర్తిస్తావు. అసలు వారు మాట్లాడే తీరునుబట్టే నీవు వారిని గురించి తెలుసుకుంటావు. అల్లాహ్ మీ అందరి కర్మలను గురించి బాగా ఎరుగును. మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము , తద్వారా మీ స్థితిని నిర్ణయిస్తాము. మీలో అల్లాహ్ మార్గంలో గట్టిగా కృషిచేసేవారు ఎవరో, స్థిరచిత్తులు ఎవరో చూస్తాము.

32 - 38 ఋజుమార్గం ఏదో స్పష్టంగా తెలిసినప్పటికీ , సత్యాన్ని తిరస్కరించి, అల్లాహ్ మార్గం నుండి (ప్రజలను) నిరోధిస్తూ, ప్రవక్తతో వివాదపడిన వారు నిజానికి అల్లాహ్ కు ఏ మాత్రం నష్టం కలిగించలేరు. పైగా అల్లాహ్ యే వారు చేసిన పనులన్నింటినీ నిష్ఫలం చేస్తాడు. విశ్వాసులారా! మీరు అల్లాహ్ కు విధేయత చూపండి, ప్రవక్తకు విధేయత చూపండి, మీ పనులను వృధా చేసుకోకండి. అవిశ్వాసానికి పాల్పడే వారినీ , దైవమార్గం వైపునకు పోకుండా (ప్రజలను) నిరోధించే వారినీ , మృత్యువు వచ్చేవరకు సత్య తిరస్కారస్థితిపై స్థిరంగా ఉండేవారిని అల్లాహ్ ఎంతమాత్రం క్షమించడు. కనుక మీరు అధైర్యపడకండి , రాజీపడటానికి వారిని పిలవకండి. మీరే ఆధిక్యం పొందే వారు. అల్లాహ్ మీకు తోడుగా ఉన్నాడు. ఆయన మీ కర్మలను నిరర్థకం చేయడు. ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట మాత్రమే. ఒక వినోదం మాత్రమే. మీరు విశ్వసించి , భయభక్తుల వైఖరిని అవలంబిస్తే , అల్లాహ్ మీకు మీ ప్రతిఫలాన్ని ఇస్తాడు. ఆయన మీనుండి మీ ధనాన్ని అడుగడు. ఒకవేళ ఆయన మీనుండి మీ ధనాన్ని అడిగితే , మీ ధనం మొత్తాన్ని కోరితే , మీరు పిసినారితనం చూపుతారు. ఆయన మీ దోషాన్ని వెలికితీస్తాడు. చూడండి!

అల్లాహ్ మార్గంలో ధనం ఖర్చుపెట్టండి అని మీకు పిలుపు ఇవ్వబడుతోంది. దాని విషయంలో మీలో కొందరు పిసినారితనంతో వ్యవహరిస్తారు. కాని పిసినారితనం వహించే వ్యక్తి నిజానికి తనపట్ల తానే పిసినారితనం చూపుతున్నాడు. అల్లాహ్ అయితే ఎంతో సంపన్నుడు , మీరే ఆయనపై ఆధారపడి ఉన్నవారు. ఒకవేళ మీరు విముఖులైతే, అల్లాహ్ మీస్థానంలో మరోజాతిని దేన్నయినా తీసుకువస్తాడు. వారు మీ వంటి వారై ఉండరు.

48.అల్ ఫతహ్

ఆయతులు : 29 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 7 ఓ ప్రవక్తా! మేము నీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము , అల్లాహ్ నీ పూర్వపు పొరపాట్లను , భావికాలపు పొరపాట్లను మన్నించాలని , నీపై తన అనుగ్రహాన్ని పూర్తిచేయాలని , నీకు ఋజుమార్గం చూపాలని , నీకు గొప్ప సహాయం చేయాలని. ఆయనే విశ్వాసుల హృదయాలపై సకీనత్ (శాంతి సంతృప్తుల)ను అవతరింపజేశాడు, తమ విశ్వాసానికి వారు అదనంగా మరొక విశ్వాసాన్ని కలుపుకోవాలని. భూమిలోని , ఆకాశాలలోని సైన్యాలన్నీ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి. ఆయన జ్ఞానీ మరియు వివేకి. (ఆయన ఇలా ఎందుకు చేశాడంటే) విశ్వాసులైన పురుషులూ, స్త్రీలూ శాశ్వతంగా ఉండేటందుకు ఆయన వారిని క్రింద కాలువలు ప్రవహించే వనాలలో ప్రవేశింపజేయాలని వారి పాపాలను వారి నుండి దూరం చేయాలని- అల్లాహ్ దృష్టిలో ఇది గొప్ప విజయం - అల్లాహ్ విషయంలో కుశంకలు గల కపటులైన పురుషులను , స్త్రీలను మరియు బహుదైవోపాసకులైన పురుషులను, స్త్రీలను శిక్షించాలని. చెడుల వలయంలోకి స్వయంగా వారే వచ్చిపడ్డారు. అల్లాహ్ ఆగ్రహం వారిపై పడిరది, ఆయన వారిని శపించాడు, వారికై నరకాన్ని సిద్ధం చేశాడు. అది మహాచెడ్డ నివాసం. భూమ్యాకాశాలలోని సైన్యాలు అన్నీ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి. ఆయన శక్తిమంతుడు, వివేకవంతుడూను.

8 - 9 ప్రవక్తా! మేము నిన్ను సాక్షి (షాహిద్) గాను, శుభవార్త అందజేసేవాని గానూ, హెచ్చరిక చేసేవానిగానూ చేసి పంపాము. ఎందుకంటే , ప్రజలారా! మీరు అల్లాహ్ను , ఆయన ప్రవక్తనూ విశ్వసించాలని , (ప్రవక్తకు) సహకరించాలని, అతనిని గౌరవించాలని ఉదయం, సాయంత్రం అల్లాహ్ ను స్తుతించా లని.

10 ప్రవక్తా! నీతో విధేయతా ప్రమాణం చేసినవారు నిజానికి అల్లాహ్తో విధేయతా ప్రమాణం చేశారు. వారి చేతులపై అల్లాహ్ హస్తం ఉన్నది. ఇప్పుడిక ఎవడు ఈ ప్రమాణాన్ని భంగపరుస్తాడో , అతడి ప్రమాణభంగం వల్ల కలిగే కీడు స్వయంగా అతడినే చుట్టుకుంటుంది. ఎవడు తాను అల్లాహ్తో చేసిన ప్రమాణానికి కట్టుబడి ఉంటాడో అతనికి అల్లాహ్ త్వరలోనే గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

11 - 12 ప్రవక్తా! పల్లెటూరి అరబ్బులలో వెనుక ఉండిపోయిన వారు ఇప్పుడు నీ వద్దకు వచ్చి తప్పకుండా ఇలా అంటారు, ''మా ఆస్తిపాస్తులూ, మా ఆలు బిడ్డలను గురించిన చింతనా మాకు తీరిక లేకుండా చేశాయి. మీరు మాకై క్షమాభిక్ష ప్రార్థన చేయండి. '' వారు తమ మనస్సులలో లేని విషయాలను తమ నోటితో అంటారు.వారితో ఇలా అను: ''మంచిది, అలాగైతే, అల్లాహ్ మీకు ఏదైనా నష్టాన్ని కలుగజేయదలిస్తే లేదా ఏదైనా లాభాన్ని చేకూర్చదలిస్తే, అల్లాహ్ యొక్క ఈ నిర్ణయాన్ని అడ్డుకునే అధికారం ఎవరికైనా కాస్తయినా ఉందా? మీ కర్మలను గురించి అల్లాహ్ కే బాగా తెలుసు. (కాని అసలు విషయం మీరు చెప్పేది కాదు) కాని , ప్రవక్త మరియు విశ్వాసులు తమ ఇంటి వారివద్దకు తిరిగి రానేరారు అని మీరు భావించారు. ఈ ఆలోచన మీ మనస్సులకు బాగా నచ్చింది. మీరు చాలా చెడ్డగా అనుమానిం చారు, మీరు చాలా చెడ్డ ఆంతర్యం కలవారు.''

13 - 14 అల్లాహ్నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించని అవిశ్వాసుల కొరకు మేము భగ భగమండే అగ్నిని సిద్ధపరచి ఉంచాము. భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపత్యానికి యజమాని అల్లాహ్ యే. ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు తాను కోరిన వారిని శిక్షిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించే వాడూను.

15 - 17 నీవు విజయ ధనాన్ని పొందటానికి వెళ్లేటప్పుడు, వెనుక ఉండి పోయినవారు నీతో, ''మమ్మల్ని కూడా మీ వెంట రానీయండి'' అని తప్పకుండా అంటారు. వారు అల్లాహ్ ఉత్తరువును మార్చ గోరుతున్నారు. వారికి స్పష్టంగా ఇలా చెప్పు, ''మీరు మాతో రావటానికి ఎంతమాత్రం వీలులేదు. అల్లాహ్ ఈ విషయాన్ని ముందే చెప్పేశాడు. '' వారు, ''అది కాదు , మీరు మేమంటే అసూయ పడుతున్నారు '' అని అంటారు. (అసలు ఇక్కడ విషయం అసూయకు సంబంధించింది కాదు). కాని వారు సరి j[illegible]న మాటను చాలా తక్కువగానే అర్థం చేసుకుంటారు. వెనుక ఉండిపోయిన ఈ గ్రామీణ అరబ్బులతో ఇలా అను , ''త్వరలోనే, ఎంతో బలాఢ్యులైన ప్రజలతో పోరాడేందుకు మిమ్మల్ని పిలవటం జరుగుతుంది. మీరు వారితో యుద్ధం చేయవలసి ఉంటుంది లేదా వారు లొంగిపోతారు. అప్పుడు మీరు జిహాద్ ఆజ్ఞను శిరసావహిస్తే , అల్లాహ్ మీకు మంచి ప్రతిఫలం ఇస్తాడు. ఒకవేళ మీరు పూర్వం విముఖు లైనట్లు మళ్లీ విముఖులైతే , అల్లాహ్ మీకు అత్యంత బాధాకరమైన శిక్ష విధిస్తాడు. అయితే ఒకవేళ అంధుడూ, కుంటివాడూ, వ్యాధిగ్రస్తుడూ జిహాద్ కొరకు రాకపోతే , అందులో ఎలాంటి దోషమూ లేదు. అల్లాహ్కూ , ఆయన ప్రవక్తకూ విధేయత చూపేవానిని అల్లాహ్ క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. విముఖుడయ్యే వానికి ఆయన వ్యధాభరిత మైన శిక్ష విధిస్తాడు.''

18 - 21 విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు, అల్లాహ్ వారిని చూసి ఆనందించాడు. వారి హృదయాల స్థితి ఆయనకు తెలుసు. కనుక ఆయన వారిపై 'సకీనత్' (శాంతి సంతృప్తుల)ను అవతరింప జేశాడు, వారికి బహుమానంగా సమీపంలోని విజయాన్ని ప్రసాదించాడు అపార విజయ ధనాన్ని వారికి అనుగ్రహించాడు. దానిని వారు (త్వరలోనే) పొందుతారు. అల్లాహ్ అత్యంత శక్తిమంతుడు , మహా

వివేకవంతుడూను. అల్లాహ్ మీకు అమితమైన విజయ ధనాలను వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరు పొందుతారు. వెంటనే ఆయన మీకు ఈ విజయాన్ని ప్రసాదించాడు , ప్రజల చేతులు మీ పైకి లేపకుండా నిరోధించాడు, ఇది విశ్వాసుల కొరకు ఒక సూచన కావాలని , అల్లాహ్ మిమ్మల్ని ఋజుమార్గం వైపునకు నడపాలని. ఇదేకాకుండా, ఇతర విజయ ధనాలను గురించి కూడ ఆయన మీకు వాగ్దానం చేస్తున్నాడు. వాటిపై మీరు ఇంకా అదుపు సాధించలేదు. అల్లాహ్ వాటిని చుట్టుముట్టి ఉన్నాడు. అల్లాహ్ కు ప్రతిదానిపై అధికారం ఉన్నది.

22 - 26 ఈ అవిశ్వాసులు ఈ సమయంలో మీతో యుద్ధానికి దిగి ఉన్న ట్లయితే , నిశ్చయంగా వెన్నుచూపి పారిపోయేవారు. ఇక ఏ సహాయకుణ్ణీ , ఏ రక్షకుణ్ణీ పొంది ఉండేవారు కాదు. ఇది అల్లాహ్ సంప్రదాయం మొదటి నుండే వస్తూ ఉన్నది. మీరు అల్లాహ్ సంప్రదాయంలో ఏ మార్పునూ చూడలేరు. మక్కా లోయలో వారి చేతులను మీనుండి, మీ చేతులను వారినుండి ఆపినవాడు ఆయనే. వాస్తవానికి ఆయన మీకు వారిపై ఆధిక్యం ఇచ్చాడు. మీరు చేస్తూ ఉన్నదంతా అల్లాహ్ చూస్తూ ఉండినాడు. సత్యాన్ని తిరస్కరించి , మిమ్మల్ని మస్జిదే హరామ్‌కు రాకుండా నిరోధించి, ఖుర్బానీ ఒంటెలను వాటి వధ్య స్థలాల దగ్గరకు చేరనీయకుండా చేసినది వారేకదా! (మక్కాలో) నీవు ఎరుగని విశ్వాసులైన స్త్రీ పురుషులు లేకుండా ఉన్నట్లయితే, తెలియకపోవటం వల్ల నీవు వారిని కాలరాస్తావనే ప్రమాదం, దానివల్ల నీపై అపవాదు వస్తుందనే భయం లేకపోయి ఉంటే (యుద్ధాన్ని ఆపటం జరిగేది కాదు. దానిని ఎందువల్ల ఆపటం జరిగిందంటే) అల్లాహ్ తన కారుణ్యంలోకి తాను కోరిన వారిని ప్రవేశింపజేసేటందుకు. ఆ విశ్వాసులు వేరుగా పోయి ఉంటే , (మక్కా వాసులలోని) అవిశ్వాసులను తప్పకుండా మేము కఠినంగా శిక్షించి ఉండేవారము. (ఈ కారణం వల్లనే) ఈ అవిశ్వాసులు తమ హృదయా లలో మూఢాభిమానాన్ని పెంచుకున్నప్పుడు, అల్లాహ్ తన ప్రవక్తపై , విశ్వాసు లపై 'సకీనత్' (శాంతి సంతృప్తుల)ను అవతరింపజేశాడు, విశ్వాసులను భయభక్తుల మాటపై స్థిరంగా ఉంచాడు. వారే దానికి ఎక్కువ హక్కుదారులును , అర్హులూను. అల్లాహ్ కు ప్రతి విషయం గురించి తెలుసు.

27 నిశ్చయంగా అల్లాహ్ తన ప్రవక్తకు సత్యమైన స్వప్నాన్ని చూపించాడు. అది పూర్తిగా సత్యానికి అనుగుణంగా ఉన్నది. అల్లాహ్ సంకల్పిస్తే , మీరు తప్పకుండా మస్జిదే హరామ్‌లో పూర్తి శాంతితో ప్రవేశిస్తారు , మీరు శిరో ముండనం చేయించుకొంటారు, వెండ్రుకలను కత్తిరించుకొంటారు. మీకు ఏ భయమూ ఉండదు. మీకు తెలియని విషయం ఆయనకు తెలుసు. కనుక ఆ స్వప్నం నిజం కాకముందే , ఆయన ఈ సమీప విజయాన్ని మీకు ప్రసాదించాడు.

28 - 29 అల్లాహ్ యే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ , సత్యధర్మాన్నీ ఇచ్చి పంపాడు , అది అన్ని ధర్మాలపై ఆధిక్యం కలిగి ఉండేలా చేయటానికి. ఈ వాస్తవానికి అల్లాహ్ సాక్ష్యమే చాలు. ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త. ఆయన

వెంట ఉన్నవారు అవిశ్వాసుల పట్ల కఠినులుగానూ ఉంటారు , పరస్పరం కరుణామయులుగానూ ఉంటారు. నీవు వారిని చూసినప్పుడు , వారు రుకూ సజ్దాలలో , అల్లాహ్ అనుగ్రహాన్నీ , ఆయన ప్రసన్నతనూ అర్థించటంలో నిమగ్నులై ఉండటం కనిపిస్తుంది. సజ్దాల సూచనలు వారి ముఖాలపై ఉంటాయి , వాటివల్ల వారు ప్రత్యేకంగా గుర్తించబడతారు. వారి గుణగణాలు తౌరాత్‌లో ఇలా ఉన్నాయి. ఇక ఇన్‌జీల్‌లో వారు ఒక పంటపొలంతో పోల్చబడ్డారు. ఆ పొలం మొదట్లో మొలకను అంకురింపజేసింది , తరువాత దానికి బలం చేకూర్చింది, ఆ తరువాత అది లావుగా ఏపుగా పెరిగింది , ఆపై తన కాండంపై నిలబడిరది. రైతులను అది ఆనందపరుస్తుంది , అవిశ్వాసులు వారి వృద్ధీవికాసాలను చూచి అసూయపడాలని, విశ్వసించి సత్కార్యాలు చేసే ఈ వర్గం వారికి క్షమాభిక్షనూ , గొప్ప ప్రతిఫలాన్నీ ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు.

49. అల్ హుజురాత్

ఆయతులు : 18 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**49. అల్ హుజురాత్** 1 విశ్వాసులారా! అల్లాహ్కూ , ఆయన ప్రవక్తకూ ముందు నడవకండి. అల్లాహ్ కు భయపడండి. అల్లాహ్ సమస్తమూ వినేవాడు, సర్వమూ ఎరిగినవాడూను.

2 - 3 విశ్వాసులారా! మీ కంఠస్వరాన్ని ప్రవక్త కంఠస్వరం కంటే పెంచకండి. మీరు పరస్పరం మాట్లాడుకునే విధంగా ప్రవక్తతో బిగ్గరగా మాట్లాడకండి, దానివల్ల, బహుశా మీరు చేసినదంతా మీకు తెలియకుండానే వ్యర్థమైపోవచ్చు. ఆ సంగతి మీకు తెలియను కూడా తెలియకపోవచ్చు. ప్రవక్త సన్నిధిలో తమ కంఠస్వరాన్ని తగ్గించి మాట్లాడేవారి హృదయాలనే వాస్తవానికి భయభక్తుల విషయంలో అల్లాహ్ పరీక్షించాడు. వారికి క్షమాభిక్ష , గొప్ప ప్రతిఫలం లభిస్తాయి.

4 - 5 ప్రవక్తా! నిన్ను నీ గృహాల బయటినుండి బిగ్గరగా పిలిచేవారిలో అనేకులు బుద్ధిహీనులు. వారు గనక నీవు బయటకు వచ్చేవరకు ఓపికపట్టి ఉంటే , అది వారికే శ్రేయస్కరముగా ఉండేది. అల్లాహ్ మన్నించేవాడు , కరుణామయుడూను.

6 - 8 విశ్వాసులారా! ఎవడైనా దుర్మార్గుడు మీ వద్దకు ఏదైనా సమాచారాన్ని తీసుకువస్తే , నిజానిజాలు విచారించి తెలుసుకోండి. లేకపోతే మీకు తెలియకుండానే మీరు ఏదైనా వర్గానికి నష్టం కలిగించవచ్చు , తరువాత చేసినదానికి పశ్చాత్తాపపడవలసి రావచ్చు. మీ మధ్య అల్లాహ్ ప్రవక్త ఉన్నాడనే విషయాన్ని బాగా గుర్తు ఉంచుకోండి , ఒకవేళ ప్రవక్త గనక అనేక వ్యవహారాలలో మీ మాట విన్నట్లయితే , మీరే స్వయంగా కష్టాలలో పడిపోతారు. కాని అల్లాహ్ మీలో విశ్వాసం పట్ల ప్రేమను కలుగజేశాడు , దానిని మీకు మనోరంజకమైనదిగా చేశాడు. అవిశ్వాసం , దుర్మార్గం,

అవిధేయతలపట్ల మీకు వెగటు కలిగేలా చేశాడు. అటువంటి ప్రజలే అల్లాహ్ అనుగ్రహం వల్ల, ఆయన మహోపకారం వల్ల సన్మార్గగాములయ్యారు. అల్లాహ్ సర్వజ్ఞాని, మహావివేకీను.

9 - 10 ఒకవేళ విశ్వాసులలోని రెండు వర్గాలవారు పరస్పరం పోట్లాడుకుంటే , వారి మధ్య రాజీ కుదిరించండి. తరువాత, ఒకవేళ వారిలో ఒక వర్గం వారు రెండో వర్గం వారిపై దౌర్జన్యం చేస్తే , దౌర్జన్యం చేసినవారు అల్లాహ్ ఆజ్ఞ వైపునకు మరలేవరకు వారికి వ్యతిరేకంగా పోరాడండి. తరువాత వారు గనక మరలివస్తే , వారి మధ్య రాజీ కుదర్చండి. న్యాయం చేయండి , ఎందుకంటే అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు. విశ్వాసులు పరస్పరం అన్నదమ్ములు. కనుక మీ సోదరుల మధ్య సంబంధాలను సంస్కరించండి. అల్లాహ్ కు భయపడండి , మీపై దయచూపటం జరగవచ్చు.

11 విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠులై ఉండవచ్చు. అలాగే స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠురాండ్రయి ఉండవచ్చు. ఒకరినొకరు ఎత్తిపొడుచుకోకండి, ఒకరినొకరు చెడ్డ పేర్లతో పిలుచుకోకండి. విశ్వసించిన తరువాత చెడ్డతనంలో పేరు సంపాదించటం చాలా నీచమైన విషయం. ఈ వైఖరిని మానుకోనివారే దుర్మార్గులు.

12 విశ్వాసులారా! అతిగా అనుమానించటం మానివేయండి. కొన్ని అనుమానాలు పాపాలు అవుతాయి. గూఢచారులుగా వ్యవహరించకండి. మీలో ఎవరూ ఎవరినీ పరోక్షంగా నిందించరాదు. మీలో ఎవరైనా మీ మృత సోదరుని మాంసం తినటానికి ఇష్టపడతారా ? చూడండి, మీరే స్వయంగా దీనిని అసహ్యించుకుంటారు. అల్లాహ్ కు భయపడండి, అల్లాహ్ అత్యధికంగా పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడూను.

**49. అల్ హుజురాత్** 13 మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి , ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ , తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను.

14 - 15 ఈ సంచార అరబ్బులు , ''మేము విశ్వసించాము '' అని అంటారు. వారితో ఇలా అను , ''మీరు విశ్వసించలేదు. మేము లొంగిపోయాము'' అని అనండి. విశ్వాసం ఇంకా మీ హృదయాలలోకి ప్రవేశించలేదు. మీరు గనక అల్లాహ్ పట్ల విధేయతనూ , ఆయన ప్రవక్త పట్ల విధేయతనూ పాటిస్తే , ఆయన మీ కర్మల ప్రతిఫలాన్ని ఏమాత్రం తగ్గించడు. నిశ్చయంగా అల్లాహ్ అత్యధికంగా మన్నించేవాడు మరియు కరుణించేవాడూను. అసలు అల్లాహ్నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించి , ఇక ఎలాంటి అనుమానానికీ గురికాకుండా , తమ ప్రాణాలతో , తమ సిరిసంపదలతో అల్లాహ్ మార్గంలో పోరాడేవారే నిజమైన విశ్వాసులు. వారే సత్యసంధులు.

16 - 18 ప్రవక్తా! వారి (విశ్వసించామని చెప్పుకుసేవారి)తో ఇలా అను , ''మీరు అల్లాహ్ కు మీ ధర్మ స్వీకారం గురించి తెలియజేస్తున్నారా? వాస్తవానికి అల్లాహ్, భూమిలోనూ, ఆకాశాలలోనూ ఉన్న ప్రతి వస్తువునూ ఎరుగును. ఆయనకు ప్రతి వస్తువును గురించిన జ్ఞానం ఉన్నది. '' వారు ఇస్లామ్‌ను స్వీకరించి తామేదో మీకు మేలు చేసినట్లు చెబుతున్నారు. వారితో ఇలా అను, ''ఇస్లామ్‌కు సంబంధించిన మేలును నా మీద మోపకండి. అల్లాహ్ మీకు విశ్వాసానికి సంబంధించిన మార్గం చూపి , ఆయనే మీకు ఉపకారం చేశాడు - మీరు గనక (మీ విశ్వాస ప్రకటనలో) నిజాయితీపరులే అయితే. అల్లాహ్ కు భూమిలోనూ , ఆకాశాలలోనూ దాగి ఉన్న ప్రతి వస్తువును గురించీ తెలుసు. మీరు చేసేదంతా ఆయన దృష్టిలో ఉన్నది.

50. ఖాఫ్

ఆయతులు : 45 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 4 ఖాఫ్. మహోన్నతమైన ఖురాన్ సాక్షిగా- అయితే, హెచ్చరిక చేసేవాడు స్వయంగా వారిలో నుండే వారివద్దకు వచ్చాడనే విషయం వారికి ఆశ్చర్యం కలిగించింది. తరువాత సత్య తిరస్కారులు ఇలా అనసాగారు , ''మేము మరణించి మట్టిగా మారిపోయినప్పటికీ , (మళ్లీ బ్రతికింపబడతామా ?) ఇది చాల విచిత్రంగా ఉంది.ఈ తిరుగు ప్రయాణం అనేది బుద్ధికి అందని విషయం. (వాస్తవానికి) వారి శరీరాలలో నుండి భూమి తినేదంతా మాకు తెలుసు. మా వద్ద ఒక గ్రంథం ఉన్నది, అందులో అంతా సురక్షితంగా ఉన్నది.

5 కాని వారు , సత్యం వారి వద్దకు వచ్చినప్పుడే దానిని బాహాటంగా తిరస్క రించారు. ఈ కారణంవల్లనే వారు ఇప్పుడు చిక్కులలో పడిపోయారు.

6 - 11 సరే, అయితే వారు తమపై ఉన్న ఆకాశం వైపు ఎన్నడూ చూడలేదా ? మేము దానిని ఎలా నిర్మించి , అలంకరించామో? అందులో ఎలాంటి పగుళ్లూ లేవు. మేము భూమిని పరిచాము , అందులో పర్వతాలను స్థిరపరచాము. అందులో మనోహరమైన అన్నిరకాల వృక్షజాతులను మొలకెత్తించాము. (సత్యం వైపునకు) మరలే ప్రతి దాసునికి ఇవన్నీ కళ్లు తెరిపించేవీ , గుణపాఠం నేర్పేవీ అయిన విషయాలు. ఆకాశం నుండి మేము శుభవంతమైన నీటిని అవతరింపజేశాము. తరువాత దానిద్వారా తోటలనూ , పంట ధాన్యాలనూ, ఎంతో పొడవైన ఖర్జూరపు వృక్షాలనూ పుట్టించాము. వాటికి పండ్లు గుత్తులు గుత్తులుగా కాస్తాయి. ఇది దాసులకు ఉపాధినిచ్చే ఏర్పాటు. ఈ నీటితో మేము మృత భూమికి ప్రాణం పోస్తాము. (మరణించిన మానవులు భూమినుండి) లేవటం కూడ ఈ విధంగానే జరుగుతుంది.

12 - 14 వారికి పూర్వం నూహ్ జాతి, అర్రస్ వాసులు మరియు సమూద్, ఆద్, ఫిరౌన్ జాతులు, లూత్ సోదరులు, అయ్కా వారు మరియు తుబ్బా జాతి ప్రజలు కూడా తిరస్కరించారు. చివరకు నా హెచ్చరిక వారి విషయంలో యదార్థమని నిరూపితమైపోయింది.

15 మొదటిసారి సృష్టితోనే మేము అశక్తులమైపోయామా ? అయినా వారు కొత్త సృష్టిని గురించి అనుమానంలో పడిపోయారు.

16 - 29 మేము మానవుణ్ణి సృష్టించాము , అతని మనస్సులో మెదిలే ఊహలను సైతం మేము ఎరుగుదుము. మేము అతని కంఠరక్తనాళం కంటే కూడా అతనికి చాలా దగ్గరగా ఉన్నాము. అంతేకాదు (మా ఈ ప్రత్యక్ష సమాచారం కాక) ఇద్దరు లేఖకులు అతనికి కుడి ఎడమ ప్రక్కల కూర్చుండి ప్రతి విషయాన్నీ నమోదు చేస్తూ ఉన్నారు. అతని నోటి నుండి వెడలే ప్రతి మాటనూ వ్రాయటానికి అనుక్షణం ఒక పరిశీలకుడు సిద్ధంగా ఉంటాడు. ఇదిగో, చూడండి, మరణయాతన సత్యంతో వచ్చేసింది. నీవు తప్పించుకోవ టానికి ప్రయత్నం చేసిన విషయం ఇదే. తరువాత శంఖం ఊదబడిరది ఈ దినాన్ని గురించే నిన్ను భయపెట్టటం జరుగుతూ ఉండేది. ప్రతి వ్యక్తీ తన వెంట ఒక తోలేవాడూ, ఒక సాక్ష్యం చెప్పేవాడూ ఉన్న స్థితిలో వస్తాడు. ఈ విషయం గురించి నీవు అశ్రద్ధలో పడి ఉన్నావు. మేము నీ ముందు పడి ఉన్న తెరను తొలగించాము , ఈనాడు నీ దృష్టి చాలా సునిశితంగా ఉన్నది. అతని సహచరుడు, ‘‘ఇదిగో, నా అధీనంలో ఉన్న ఇతనిని హాజరుపరుస్తు న్నాను ’’ అని విన్నవించుకున్నాడు. ఇలా ఆజ్ఞాపించబడుతుంది ‘‘కరుడుకట్టిన ప్రతి అవిశ్వాసిని నరకంలో విసరివేయండి. అతడు సత్యం పట్ల ద్వేషభావం కలిగి ఉండేవాడు, మంచిని నిరోధిస్తూ ఉండేవాడు , హద్దులు అతిక్రమిస్తూ ఉండేవాడు, అనుమానంలో పడి ఉండేవాడు, అల్లాహ్తోపాటు ఇతరులను కూడా దేవుళ్ళుగా చేసుకున్నవాడు. కనుక అతనిని తీవ్రమైన శిక్షకు గురి చేయండి. ’’ అతని సహచరుడు ఇలా మనవి చేసుకున్నాడు , ‘‘స్వామీ! నేను ఇతనిని తిరుగుబాటుదారుగా చేయలేదు. కాని ఇతడే స్వయంగా మార్గం తప్పి చాలా దూరం పోయాడు. ’’ దానికి ఇలా సెలవీయబడిరది , ‘‘నా సమక్షంలో వాదించకండి. నేను ముందుగానే చెడు పర్యవసానం గురించి హెచ్చరికచేసి ఉన్నాను. నా దగ్గర మాట మార్చటం అంటూ జరగదు. నేను నా దాసులపై దౌర్జన్యం చేసేవాడను కాను.’’

30 - 35 ఆనాడు మేము నరకాన్ని , ‘‘నీవు నిండిపోయావా ?’’ అని అడిగి నప్పుడు , అది, ‘‘ఇంకేమైనా మిగిలిఉందా?’’ అని అంటుంది. స్వర్గం భయభక్తులు కలవారికి చాల దగ్గరగా తీసుకురాబడుతుంది , ఏమాత్రం దూరంగా ఉండదు. ఇంకా ఇలా సెలవీయబడుతుంది , ‘‘మీకు వాగ్దానం చేయబడుతూ ఉండిన విషయం ఇదే ఎక్కువగా అల్లాహ్ వైపునకు మరలే వాడూ, అల్లాహ్ హద్దులను పరిరక్షించే వాడూ, చూడకుండానే కరుణామయు డికి భయపడేవాడూ, ఏకాగ్రహృదయంతో వచ్చినవాడూ అయిన ప్రతి వ్యక్తికీ ఇది లభిస్తుంది. స్వర్గంలో ప్రవేశించండి

శాంతిసౌభాగ్యాలతో.'' ఆ దినం శాశ్వత జీవిత దినం అవుతుంది. అక్కడ వారికి వారు కోరుకునేవన్నీ లభి స్తాయి. అవి కాక మా వద్ద వారికి ఇంకా ఎన్నో లభిస్తాయి. అత్యధికంగానూ లభిస్తాయి.

36 - 37 మేము వారికి పూర్వం ఎన్నో జాతులను నాశనం చేసి ఉన్నాము. వారు వీరికంటే ఎంతో ఎక్కువ శక్తిమంతులు, వారు అనేక ప్రపంచ దేశాలను చుట్టివచ్చారు. అయితే వారు ఎక్కడైనా , ఏదైనా ఆశ్రయం పొందగలిగారా? హృదయం ఉండీ, విషయాన్ని శ్రద్ధగా ఆలకించే ప్రతి వ్యక్తికీ ఈ చరిత్రలో గుణపాఠం ఉన్నది.

38 - 40 మేము భూమినీ , ఆకాశాలనూ, వాటి మధ్య ఉన్న సమస్త వస్తువులనూ ఆరు దినాలలో సృష్టించాము. కాని మాకు ఎలాంటి అలసటా కలుగలేదు. కనుక ప్రవక్తా! వారు కల్పిస్తున్న విషయాల పట్ల సహనం వహించు. నీ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పవిత్ర నామాన్ని జపిస్తూ ఉండు. సూర్యోదయానికి ముందు , సూర్యాస్తమయానికి ముందు, రాత్రి సమ యంలో కూడా ఆయన పవిత్ర నామాన్ని జపించు , సజ్దాలు చేయటం పూర్తి అయిన తరువాత కూడా.

41 - 44 ఇంకా విను: ఏ రోజు చాటింపువేసేవాడు (ప్రతి మనిషికీ) అతి దగ్గర నుండే కేకవేస్తాడో , ఏ రోజు ప్రజలందరూ హషర్ కేకను స్పష్టంగా వింటూ ఉంటారో , ఆ రోజు భూమి నుండి మృతులు బయల్పడే రోజు అవు తుంది. మేమే ప్రాణం పోస్తున్నాము , మేమే ప్రాణం తీస్తున్నాము, మా వైపునకే ఆనాడు అందరూ మరలి రావలసి ఉంటుంది. ఆనాడు భూమి బ్రద్దలవుతుంది , మానవులు దాని లోపల నుండి బయల్పడి తొందర తొందరగా పరుగెత్తుతూ ఉంటారు. బ్రతికించి, సమీకరించటం అనే ఈ విషయం మాకు ఎంతో తేలికైన పని.

45 ప్రవక్తా! వారు కల్పిస్తున్న విషయాలు ఏమిటో మేము బాగా ఎరుగుదుము. వారిచేత బలవంతంగా విషయాన్ని ఒప్పించటం నీ పని కాదు. కనుక నీవు ఈ ఖురాన్ ద్వారా నా హెచ్చరికకు భయపడే ప్రతి వ్యక్తికీ హితోపదేశం చేయి

51. అజ్ జారియాత్

ఆయతులు : 60 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 6 దుమారాన్ని లేపే గాలుల సాక్షిగా! ఆ గాలులు నీటితో నిండి ఉన్న మేఘాలను లేపుతాయి. తరువాత అవి మెల్లగా సాగిపోతాయి , ఆ తరువాత అవి ఒక పెద్ద కార్యాన్ని (వర్షాన్ని ) పంచుతాయి. వాస్తవం ఏమిటంటే , మిమ్మల్ని ఏ విషయం గురించి భయపెట్టటం జరుగుతోందో , ఆ విషయం సత్యం. కర్మలకు ప్రతిఫలం లభించటం అనే పని తప్పకుండా జరగవలసి ఉన్నది.

7 - 19 విభిన్న ఆకారాలు గల ఆకాశం సాక్షిగా! (పరలోక విషయం గురించి) మీ మాటలు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. సత్యం నుండి ముఖం తిప్పుకున్నవాడే దానినుండి విముఖుడవుతాడు. ఊహ , అనుమానాలు ఆధారంగా నిర్ణయం చేసేవారు నాశనమవుదురు గాక! వారు అజ్ఞానంలో కూరుకుపోయారు. మరియు ఏమరుపాటు మైకంలో పడి ఉన్నారు. అసలు ఆ తీర్పు దినం ఎప్పుడు వస్తుంది అని అడుగుతున్నారు. అది వారు అగ్నిలో దహింపజేయబడే రోజున వస్తుంది. (వారితో ఇలా అనబడుతుంది) ఇక చవి చూడండి మీ ఆగడాల రుచిని మీరు తొందరపెడుతూ ఉన్న విషయం ఇదే. అయితే భయభక్తులు కలవారు ఆ రోజున ఉద్యానవనాలలో , నీటి బుగ్గల మధ్య ఉంటారు. వారు తమ ప్రభువు తమకు ఇచ్చిన దానిని అమితమైన సంతోషంతో తీసుకుంటారు. ఆ దినం రాకపూర్వం, వారు సత్కార్యాలు చేసే వారుగా, రాత్రి వేళలలో చాలా తక్కువ నిదురపోయేవారుగా, అదే రాత్రి చివరి గడియలలో క్షమాపణ వేడుకునేవారుగా ఉండేవారు. వారి సంపదలో యాచకులకూ , అగత్యం కలవారికీ హక్కు ఉండేది.

20 - 23 (నమ్మేవారి కొరకు) భూమిలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి , స్వయంగా మీలోనూ ఉన్నాయి. మీరు ఆలోచించరా? ఆకాశంలోనే ఉంది మీ ఉపాధి కూడా , మీకు వాగ్దానం చేయబడుతున్నది కూడా. కనుక భూమ్యా కాశాల ప్రభువు సాక్షిగా! ఇది సత్యం, మీరు ఇప్పుడు మాట్లాడుతున్నంత నమ్మకమైనది.

24 - 37 ఓ ప్రవక్తా! ఇబ్రాహీమ్ యొక్క గౌరవనీయులైన అతిధుల గాధ కూడా నీకు చేరిందా ? వారు అతని వద్దకు వచ్చి, ''మీకు సలామ్'' అని అన్నారు. అతను , ''మీకు కూడ సలామ్ - ఎవరో కొత్తవారులాగా ఉన్నారే ?'' అని అన్నాడు. తరువాత అతను మౌనంగా తన ఇంటి వారి దగ్గరకు వెళ్లి , ఒక (వేపబడిన) బలిసిన మంచి ఆవు దూడను తెచ్చి అతిధుల ముందు పెట్టాడు. అతను ''మీరు తినరా ?'' అని అడిగాడు. ఆ తరువాత అతను తన మనస్సులో వారంటే భయపడ్డాడు. వారు ''భయపడకండి'' అని అన్నారు. వారు అతనికి ఒక జ్ఞాన సంపన్నుడైన కుమారుడు జన్మిస్తాడని శుభవార్త వినిపించారు. ఇది విన్నంతనే అతని భార్య అరుస్తూ బయటికి వచ్చి , నెత్తీనోరూ బాదుకుంటూ, ''ముసలిదానికా, గొడ్రాలికా'' అని అన్నది. అప్పుడు వారు , ''నీ ప్రభువు ఇదే అన్నాడు. ఆయన వివేకవంతుడూ, అన్నీ తెలిసిన వాడూను '' అని అన్నారు. ఇబ్రాహీమ్ , ''దైవదూతలారా! మీరు ఏ మహాకార్యం నిమిత్తం వచ్చారు'' అని అడిగాడు. వారు ఇలా అన్నారు , ''మేము ఒక నేరస్తుల జాతి వైపునకు పంపబడ్డాము , దాని మీద కాల్చబడిన మట్టి రాళ్లను వర్షింపజేయ టానికి. అవి నీ ప్రభువు దృష్టిలో హద్దులు మీరిన వారి కొరకు గుర్తు వేయబడిన రాళ్లు. తరువాత మేము విశ్వాసులు అందరినీ ఆ జనపదం నుండి బయటకు తీసుకువచ్చాము. అక్కడ మేము ఒకే ఒక గృహాన్ని తప్ప మరే ముస్లిమ్ గృహాన్ని చూడలేదు. ఆ తరువాత అక్కడ మేము వ్యధాభరితమైన శిక్షకు భయపడే వారి కొరకు కేవలం ఒకే ఒక సూచనను వదలిపెట్టాము.

38 - 40 మరియు మూసా గాథలో (మీ కొరకు సూచన ఉన్నది) మేము అతనిని స్పష్టమైన ప్రమాణంతో ఫిరౌన్ వద్దకు పంపాము. అతడు తన బలాన్ని చూసుకొని విర్రవీగాడు. ఇతడు మాంత్రికుడు లేదా పిచ్చివాడు అని అన్నాడు. చివరకు మేము అతడినీ , అతడి సైన్యాలనూ పట్టుకున్నాము. వారందరినీ సముద్రంలోనికి విసరివేశాము. అతడు నిందింపదగినవాడుగా మిగిలిపోయాడు.

41 - 42 ఆద్ జాతిలో (మీ కొరకు ఒక సూచన ఉన్నది) అప్పుడు మేము వారి మీదకు ఒక వినాశకరమైన గాలిని పంపాము. అది దేనిపై వీచినా, దానిని నాశనం చేసి వదలిపెట్టింది.

43 - 45 సమూద్ జాతిలో (మీ కొరకు సూచన ఉన్నది) అప్పుడు వారికి ఒక నిర్ణీత కాలం వరకు సుఖాలను అనుభవిస్తూ ఉండండి అని చెప్పటం జరిగింది. కాని ఇలా హెచ్చరిక చేసినప్పటికీ వారు తమ ప్రభువు ఆదేశాన్ని ధిక్కరించారు. చివరకు వారు చూస్తూ ఉండగానే అకస్మాత్తుగా విరుచుకుపడే ఒక ఆపద వారిని చుట్టుముట్టింది. తరువాత వారికి లేచి నిలబడే శక్తి కూడా లేకుండాపోయింది వారు తమను తాము రక్షించుకోనూ లేకపోయారు.

46 వారందరికంటే ముందు మేము నూహ్ జాతిని నాశనం చేశాము. ఎందుకంటే వారు కడు దుర్మార్గులు.

47 - 51 మేము ఆకాశాన్ని స్వశక్తితో నిర్మించాము. మేము అలా చేసే సామర్థ్యం కలిగి ఉన్నాము. మేము భూమిని పరిచాము. మేము ఎంతో చక్కగా పరిచేవారము. ప్రతి వస్తువునూ మేము జంటలుగా సృష్టించాము బహుశా మీరు గుణపాఠం నేర్చుకుంటారని , కనుక పరుగెత్తండి అల్లాహ్ వైపునకు నేను ఆయన తరఫున మీకు స్పష్టంగా హెచ్చరిక చేసేవాడుగా వచ్చాను. అల్లాహ్తో పాటు మరెవరినీ ఆరాధ్యులుగా చేసుకోకండి. నేను ఆయన తరఫున మీకు స్పష్టంగా హెచ్చరించేవానిగా వచ్చాను.

52 - 55 ఇలాగే జరుగుతూ వచ్చింది వారికి పూర్వపు జాతుల వద్దకు కూడా , ‘‘ఇతడు మాంత్రికుడు లేదా పిచ్చివాడు’’ అని నిందింపబడనటువంటి ఏ ప్రవక్తా రాలేదు. ఈ విషయం గురించి వారంతా పరస్పరం కూడబలుక్కు న్నారా ఏమిటి ? అది కాదు, అసలు వారంతా హద్దులు మీరినవారు. కనుక ప్రవక్తా! వారి నుండి ముఖం మరల్చుకో. నీపై ఎలాంటి ఆక్షేపణా ఉండదు. అయితే ఉపదేశిస్తూ ఉండు. ఎందుకంటే , ఉపదేశం, విశ్వాసులకు ప్రయోజన కరమైనది.

56 - 60 నేను జిన్నాతులనూ, మానవులనూ నా ఆరాధన కొరకు తప్ప మరదిదేని కొరకూ సృష్టించలేదు. నేను వారి నుండి ఎలాంటి ఉపాధినీ కోరను వారు నాకు అన్నం పెట్టాలనీ నేను కోరను. అల్లాహ్ స్వయంగా ఉపాధి ప్రదాత, గొప్ప శక్తిసంపన్నుడు, అత్యంత దృఢమైనవాడూను. కనుక అన్యాయానికి పాల్పడిన వారి భాగానికి కూడా అటువంటి శిక్షయే సిద్ధంగా ఉంది , ఎటువంటిది వారి వంటి ప్రజల వంతుకు లభించిందో , దానికై వారు నన్ను

తొందరపెట్టకూడదు. చివరకు ఆ రోజున అవిశ్వాసానికి పాల్పడిన వారికి వినాశం కలుగుతుంది. ఆ రోజును గురించే వారిని భయపెట్టటం జరుగుతోంది.

52. అత్ తూర్

ఆయతులు : 49 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 16 తూర్ పర్వతం సాక్షిగా! మృదువైన చర్మపు కాగితంపై వ్రాయబడిన స్పష్టమైన గ్రంథం సాక్షిగా! సందర్శనాలయం (కాబా గృహం) సాక్షిగా! ఎత్తైన కప్పు సాక్షిగా! అల్లకల్లోలపు సముద్రం సాక్షిగా! నీ ప్రభువు శిక్ష తప్పకుండా సంభవించనున్నది. దానిని ఎవ్వడూ అడ్డుకోజాలడు. ఆకాశం భయంకరంగా కనిపించే రోజున పర్వతాలు ఎగురుతూ తిరిగే రోజున అది సంభవిస్తుంది. ఈనాడు ఒక ఆటగా వితండవాదనలు చేస్తున్న సత్యతిరస్కారులకు ఆనాడు వినాశం కలుగుతుంది. ఆ రోజున వారిని కొట్టుతూ , నెట్టుతూ నరకం వైపునకు తీసుకుపెళ్లటం జరుగుతుంది. అప్పుడు వారితో ఇలా అనబడుతుంది, ''మీరు తిరస్కరిస్తూ ఉండిన నరకాగ్ని ఇదే. ఇప్పుడు చెప్పండి , ఇది మంత్రజాలమా లేక మీకేమీ స్ఫురించటం లేదా ? ఇక వెళ్లండి , అందులో కాలిపోతూ ఉండండి. మీరు సహనం వహించినా, వహించకపోయినా, మీకు ఒకటే. మీరు చేస్తూ ఉండిన కర్మల ప్రకారమే మీకు ప్రతిఫలం ఇవ్వబడుతోంది.''

17 - 28 భయభక్తులు కలవారు అక్కడ ఉద్యానవనాలలో , భోగభాగ్యాలతో ఉంటారు. వారి ప్రభువు వారికి ఇచ్చే వాటిని హాయిగా అనుభవిస్తూ ఉంటారు. వారి ప్రభువు వారిని నరకశిక్ష నుండి రక్షించుకుంటాడు. (వారితో ఇలా అనబడుతుంది): ''హాయిగా తినండి , త్రాగండి, మీరు చేస్తూ ఉండిన కర్మలకు ప్రతిఫలంగా , వారు వేయబడిన ఆసనాలపై దిండ్లకు ఆనుకుని ఎదురెదురుగా కూర్చొని ఉంటారు. మేము వారికి అందమైన కళ్లుగల సుందరాంగులనిచ్చి వివాహం చేస్తాము. విశ్వాసుల సంతానం కూడ , విశ్వాసం విషయంలో దాదాపు వారి అడుగుజాడలలో నడిచి ఉంటే, వారి ఈ సంతానాన్ని కూడా మేము (స్వర్గంలో) వారితో కలుపుతాము. ఇంకా వారి కర్మలలో వారికి ఏమాత్రం నష్టం కలుగజేయము. ప్రతి వ్యక్తీ తాను సంపాదించిన దానికి తాకట్టుగా ఉన్నాడు. మేము వారు కోరిన విధంగా వారికి అన్ని రకాల పండ్లు, మాంసం పుష్కలంగా ఇస్తూ ఉంటాము. వారు ఒకరి నుండి ఒకరు మధుపాత్రలను అమితోత్సాహంతో అందుకుంటూ ఉంటారు. దానిని సేవించటం వల్ల ప్రేలాపనలూ ఉండవు , చెడు నడతా ఉండదు. వారి (సేవ) కొరకే ప్రత్యేకించబడిన, దాచబడిన ఆణిముత్యాలవంటి అందమైన బాలురు వారి సేవలో పరుగెడుతూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. వారు పరస్పరం (ప్రపంచంలో జరిగిన) పరిస్థితులను గురించి అడిగి తెలుసుకుంటారు. వారు , ''మేము మొదట మా కుటుంబం వారి మధ్య (దేవునికి) భయపడుతూ

జీవితం గడిపేవారం. చివరకు అల్లాహ్ మాపై కనికరం చూపాడు , మమ్మల్ని తీవ్రమైన వడగాలి శిక్ష నుండి రక్షించాడు. మేము గత జీవితంలో ఆయననే వేడుకుంటూ ఉండేవారము. ఆయన నిజంగానే మహోపకారి మరియు అనంత కరుణామయుడు.

29 కనుక ప్రవక్తా! నీవు హితోపదేశం చేస్తూ ఉండు. నీ ప్రభువు దయవల్ల నీవు జ్యోతిష్యుడవూ కావు , పిచ్చివాడవూ కావు.

30 - 32 ''ఈయన కవి, ఈయన వినాశకాలం కోసం మేము ఎదురు చూస్తున్నాము'' అని వారు అంటున్నారా? సరే, ఎదురు చూడండి, నేను కూడా మీతోపాటు ఎదురుచూస్తాను , అని వారికి చెప్పు. వారి బుద్ధులు వారిని ఇలాంటి మాటలే పలుకండి అని ప్రేరేపిస్తున్నాయా? లేక వారసలు దుర్మార్గంలో హద్దులు మీరినవారా?

33 - 34 ఈయన ఈ ఖురాన్‌ను స్వయంగా కల్పించాడని వారు అంటున్నారా ? అసలు విషయం ఏమిటంటే, వారు విశ్వసించదలచుకోలేదు. ఒకవేళ వారు తమ ఈ మాటలో సత్యవంతులే అయితే , ఇలాంటి ఔన్నత్యం గల వాణినే రచించి తీసుకురావాలి.

35 - 36 వారు సృష్టికర్త లేకుండా తమంతట తామే పుట్టారా ? లేక వారు తమకు తామే సృష్టికర్తలా ? లేక వారు భూమినీ, ఆకాశాలనూ సృష్టించారా? అసలు విషయం ఏమిటంటే, వారికి నమ్మకం లేదు.

37 - 39 నీ ప్రభువు నిక్షేపాలు వారి అధీనంలో ఉన్నాయా ? లేక వాటిపై వారి అధికారమే చలామణీ అవుతుందా ? వారి దగ్గర నిచ్చెన ఏదైనా ఉందా , దానిపై ఎక్కి వారు పై లోకం మాటలు వినిరావటానికి. వారిలో ఎవడైనా విని ఉంటే, వాడు ఏదైనా స్పష్టమైన ప్రమాణం తీసుకురావాలి. అల్లాహ్ కేమో కూతుళ్లా, మీకేమో కొడుకులా?

40 - 41 నీవు ప్రతిఫలమేదైనా ఇవ్వండి అని వారిని అడుగుతున్నావా , బలవంతంగా పడే ఋణభారం క్రింద వారు అణిగిపోవటానికి? అగోచర సత్యాలేమైనా వారికి తెలుసా, వాటి ఆధారంగా వారు వ్రాయటానికి?

42 - 47 వారేదైనా పన్నాగం పన్నదలచారా? (ఇదే గనక నిజం అయితే) అవిశ్వాసుల పన్నాగం స్వయంగా వారికే ఎదిరికొడుతుంది. వారికి అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు ఉన్నాడా ? వారు చేసే షిర్క్ నుండి అల్లాహ్ పరిశుద్ధుడు. వారు ఆకాశపు తునకలు సైతం రాలిపడటం చూసినా, ఇవి దట్టమైన మేఘాలు అని అంటారు. కనుక ప్రవక్తా! వారి మానాన వారిని వదలిపెట్టు , వారిని కొట్టి పడవేసే రోజు వచ్చేవరకు. అప్పుడు వారు దెబ్బలు తిని క్రిందపడిపోతారు. ఆ రోజున వారి పన్నాగాలేవీ వారికి ఏమాత్రమూ పనికిరావు. వారిని ఆదుకోవటానికి కూడా ఎవడూ రాడు. ఇంకా ఆ సమయం రావటానికి ముందు కూడా దుర్మార్గులకు ఒక శిక్ష ఉంది. కాని వారిలో చాలామంది ఎరుగరు.

48 - 49 ప్రవక్తా! నీ ప్రభువు ఉత్తరువు వచ్చేవరకు ఓర్పు వహించు. నీవు మా దృష్టిలో ఉన్నావు. నీవు లేచినప్పుడు, నీ ప్రభువు స్తోత్రం చేయటంతో పాటు , ఆయన పవిత్రనామాన్ని జపించు. రాత్రివేళ కూడా ఆయన పవిత్రనామాన్ని జపించు, నక్షత్రాలు అస్తమిస్తున్నవేళ కూడా.

53. అన్ నజ్మ్

ఆయతులు : 62 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 12 అప్పుడే అస్తమించిన నక్షత్రం సాక్షిగా! మీ సహచరుడు దారీ తప్పలేదు , తప్పుదారీ పట్టలేదు. అతను తన మనోవాంఛలను అనుసరించి చెప్పటం లేదు. ఇది ఒక వహీ , అతనిపై అవతరింపజేయ బడుతుంది. గొప్ప శక్తిసంపన్నుడు అతనికి నేర్పుతున్నాడు. ఆయన గొప్ప వివేకవంతుడు. అతను దిఙ్మండలం ఎగువ భాగంపై ఉన్నప్పుడు ఆయన అతని ముందుకు వచ్చి నిలబడ్డాడు, తరువాత మరింత దగ్గరకు వచ్చి పైన ఆగిపోయాడు. ఈ విధంగా ఆయన రెండు ధనుస్సుల అంత లేదా అంతకంటే కొంచెం తక్కువ దూరంలో ఆగిపోయాడు. అప్పుడు ఆయన అల్లాహ్ భక్తునికి , చేరవేయ వలసి ఉన్న వహీని చేరవేశాడు. (అతని) కళ్లు చూచిన దానిలో (అతని) హృదయం అసత్యాన్ని కలుపలేదు. అయితే మీరు , అతను కళ్లారా చూస్తూ ఉన్నదానిని గురించి అతనితో వివాదానికి దిగుతారా?

13 - 18 తరువాత మరొకసారి అతను ''సిద్‌రతుల్ మున్‌తహా'' వద్ద ఆయనను దిగుతూ ఉండగా చూశాడు. అక్కడికి దగ్గరలోనే ''జన్నతుల్ మావా'' (స్వర్గనివాస స్థలం) ఉంది. ఆ సమయంలో ''సిద్‌రహ్''ను అలముకొనేది అలముకుంటూ ఉన్నది. (అతని) చూపులు తప్పిపోనూ లేదు , హద్దును దాటిపోనూ లేదు. అతను తన ప్రభువు యొక్క గొప్ప గొప్ప సూచనలను చూశాడు.

19 - 25 ఇప్పుడు చెప్పండి ఈ లాత్, ఈ ఉజ్జా, మూడోది ఒక దేవత అయిన మనాత్‌ల వాస్తవికతను గురించి మీరు కాస్తయినా ఆలోచించారా? ఏమిటి, మీ కోసం కుమారులున్నూ, దేవుని కోసం కుమార్తెలూనా? ఇది చాలా ఘోరమైన విభజన! అసలు ఇవి ఏమీ కావు. మీరూ, మీ తాత ముత్తాతలూ పెట్టుకున్న కొన్ని పేర్లు మాత్రమే. అల్లాహ్ వాటికై ఏ ప్రమాణాన్నీ పంపలేదు. యధార్థమేమిటంటే , వారు కేవలం ఊహలనూ , అనుమానాలనూ అనుసరిస్తున్నారు, మనోవాంఛలకు దాసులై పోయారు. వాస్తవానికి వారి ప్రభువు తరఫు నుండి వారి వద్దకు సన్మార్గం వచ్చేసింది. మానవుడు కోరేదెల్లా అతనికి సత్యం అవుతుందా? ప్రపంచానికీ, పరలోకానికీ యజమాని అల్లాహ్ మాత్రమే.

26 - 28 ఆకాశాలలో ఎంతోమంది దైవదూతలు ఉన్నారు. కాని వారి సిఫారసు ఏమాత్రం ఉపయోగపడదు , అల్లాహ్ తాను ఎవరిని గురించైతే ఏదైనా విన్నపం వినదలుస్తాడో , ఎవడైతే ఆయనకు ఇష్టుడో, అటువంటి వ్యక్తి విషయంలో

దానికి (సిఫారసుకు) అనుమతి ఇస్తేనేతప్ప. కాని పరలోకాన్ని విశ్వసించని వారు దైవదూతలను దేవతల పేర్లతో పిలుస్తున్నారు. వాస్తవానికి ఈ విషయంలో వారి వద్ద ఎటువంటి జ్ఞానమూ లేదు. వారు కేవలం అనుమానాలను అనుసరిస్తున్నారు. సత్యం స్థానంలో అనుమానం ఏమాత్రం ఉపయోగపడదు కదా!

29 - 32 కనుక ప్రవక్తా! మా ప్రస్తావన నుండి ముఖం త్రిప్పుకుని, భౌతిక జీవితం తప్ప మరొక తలంపు లేని వ్యక్తిని అతని మానాన అతనిని వదలిపెట్టు - వారికున్న జ్ఞానం మొత్తం ఇంతే. ఆయన మార్గం నుండి ఎవడు తప్పిపోయాడు, ఎవడు ఋజుమార్గంలో ఉన్నాడు అనే విషయాన్ని నీ ప్రభువే బాగా ఎరుగును. భూమ్యాకాశాలలోని ప్రతి వస్తువుకూ యజమాని అల్లాహ్ యే - చెడు చేసేవారికి అల్లాహ్ వారి కర్మలకు ప్రతిఫలం ఇచ్చేందుకు, సదాచరణ వైఖరి అవలంబించిన వారికి మంచి ప్రతిఫలం ప్రసాదించేందుకు. వారు పెద్ద పెద్ద పాపాలకు స్పష్టమైన అసభ్య చేష్టలకు దూరంగా ఉంటారు , కొన్ని పొరపాట్లు తప్ప. నిస్సంశయంగా నీ ప్రభువు క్షమాగుణ పరిధి అత్యంత విశాలమైనది. ఆయన మిమ్మల్ని భూమినుండి సృష్టించినప్పటి నుండీ మీరు మీ మాతృ గర్భాలలో ఇంకా పిండాలుగానే ఉన్నప్పటి నుండీ బాగా ఎరుగును. కనుక మీ పవిత్రతను గురించి గొప్పలు చెప్పుకోకండి. నిజమైన భయభక్తులు గల వాడెవడో ఆయనకే బాగా తెలుసు.

33 - 55 ప్రవక్తా! దైవమార్గం నుండి ముఖం త్రిప్పుకుని కొంచెం మాత్రమే ఇచ్చి ఆగిపోయిన వ్యక్తిని కూడ నీవు చూశావా? అతని వద్ద అతీంద్రియ జ్ఞానమేదైనా ఉందా అతడు యథార్థాన్ని చూసేందుకు ? మూసా ప్రవక్త గ్రంథాలలోనూ, తన వాగ్దానాన్ని నెరవేర్చి తన నిజాయితీని నిరూపించుకున్న ఇబ్రాహీమ్ ప్రవక్త గ్రంథాలలోనూ వివరించబడిన విషయాల సమాచారమేదీ అతనికి అందలేదా? ఆ విషయాలు ఏమిటంటే బరువు మోసేవాడెవడూ ఇతరుల బరువును మోయడు. దేనికై మానవుడు కృషిచేస్తాడో , అది తప్ప అతనికి మరొకటేదీ లభించదు. త్వరలోనే అతని కృషిని చూసి , దాని ప్రతిఫలం పూర్తిగా అతనికి ఇవ్వబడుతుంది. చివరకు నీ ప్రభువు వద్దకే చేరవలసి ఉంది. ఆయనే నవ్విస్తున్నాడు, ఆయనే ఏడిపిస్తున్నాడు. ఆయనే మరణం ఇచ్చాడు, ఆయనే జీవితాన్ని ప్రసాదించాడు. విడిచే ఒక బిందువు ద్వారా ఆడా మగల జంటను ఆయనే సృష్టించాడు. మరొక జీవితాన్ని ప్రసాదించటం కూడా ఆయన బాధ్యతే. సంపన్నునిగా చేసింది ఆయనే , ఆస్తిపాస్తులను ప్రసాదించిందీ ఆయనే. ఆయనే సిరియస్ (అగ్ని నక్షత్రం) నక్షత్రానికి కూడ ప్రభువు ఆయనే ప్రాచీన ఆద్ జాతిని నాశనం చేశాడు సమూద్ జాతిని ఒక్కడూ మిగలకుండా పూర్తిగా తుడిచిపెట్టాడు వారికి పూర్వం నూహ్ జాతిని నాశనం చేశాడు ఎందుకంటే వారు స్వతహాగా పరమ దుర్మార్గులు , పరమ విద్రోహులు. తలక్రిందులుగా పడిపోయిన జనపదాలను ఎత్తి విసిరిపారేశాడు. తరువాత వాటిపై దానిని ఆవరింపజేశాడు, (నీకు తెలిసే ఉంది) దేనిని ఆవరింపజేశాడో. కనుక ఓ మానవుడా! నీ ప్రభువు యొక్క ఏయే భాగ్యాలను గురించి నీవు అనుమానిస్తావు?

56 - 62 ఇదివరకు వచ్చిన హెచ్చరికలలోని ఒక హెచ్చరిక ఇది. రానున్న గడియ సమీపంలోనే ఉన్నది. అల్లాహ్ తప్ప మరెవరూ దానిని తొలగించలేరు. ఇక మీరు ఆశ్చర్యం వెలిబుచ్చే విషయాలు ఇవేనా? మీరు నవ్వుతున్నారా, ఏడ్పు రావటం లేదా మీకు ? పాటలతో, ఆటలతో వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారా ? అల్లాహ్ ముందు మోకరిల్లండి , ఆయనకు దాస్యం చేయండి.

54. అల్ ఖమర్

ఆయతులు : 55 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 3 ప్రళయ గడియ దగ్గరకు వచ్చేసింది. చంద్రుడు చీలిపోయాడు. కాని వారి పరిస్థితి ఎలా ఉందంటే , వారు ఏ సూచనను చూచినా తమ ముఖాలను తిప్పుకుంటున్నారు. ఇది నడుస్తున్న మంత్రజాలమే అని అంటున్నారు. వారు (దీనిని కూడా) తిరస్కరించారు , తమ మనోవాంఛలను అనుసరించారు. ప్రతి వ్యవహారం చివరకు ఒక పర్యవసానానికి చేరవలసి ఉంటుంది.

4 - 8 వారి ముందుకు (పూర్వపు జాతుల స్థితిగతులు వచ్చాయి తలబిరుసు తనం నుండి వారిని దూరంగా ఉంచటానికి వాటిలో కావలసినంత గుణపాఠం ఉంది హితబోధ లక్ష్యం చాల వరకు నెరవేరటానికి కావలసిన వివేకమూ ఉంది. కాని హెచ్చరికలు వారి మీద పనిచేయటం లేదు. కనుక ప్రవక్తా! వారినుండి ముఖం త్రిప్పుకో. పిలిచేవాడు దుర్భరమైన, భయంకరమైన ఒక విషయం వైపునకు పిలిచే రోజున , ప్రజలు బిక్కచచ్చిన చూపులతో తమ సమాధుల నుండి , చెల్లా చెదరైపోయిన మిడుతల మాదిరిగా బయల్పడతారు పిలిచే వాని వైపునకు పరుగెత్తుతూ ఉంటారు. (ఈ విషయాన్ని ప్రపంచంలో నిరాకరిస్తూ ఉండిన) తిరస్కారులే అప్పుడు , ''ఈ రోజుమటుకు చాల కఠినమైన రోజు'' అని అంటారు.

9 - 17 వారికి పూర్వం నూహ్ జాతి వారు తిరస్కరించారు. వారు మా భక్తుణ్ణి అసత్యవాదిగా నిర్ణయించి , ఇతడు పిచ్చివాడు అని అన్నారు. అతను దారుణంగా కసిరికొట్టబడ్డాడు. చివరకు అతను తన ప్రభువును ఇలా వేడు కున్నాడు, ''నేను ఓడిపోయాను. ఇక నీవే వారికి ప్రతీకారం చేయి. '' అప్పుడు మేము కుంభవృష్టి కురిసేలా ఆకాశద్వారాలు తెరిచాము. భూమిని చీల్చి చెలమలుగా మార్చివేశాము. విధి నిర్ణయించిన పనిని పూర్తి చేయటానికి ఈ నీరంతా ఏకమైపోయింది. మేము నూహ్ ను పలకలు , మేకులు గల దానిపైకి ఎక్కించాము. అది మా పర్యవేక్షణలో నడుస్తూ ఉండేది. ఇది విలువ ఇవ్వబడిన వ్యక్తి కోసం చేయబడిన ప్రతీకారం. ఆ నావను మేము ఒక సూచనగా చేసి వదలిపెట్టాము. మరి హితబోధను స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా? చూడండి, నా శిక్ష ఎలా

ఉండినదో, నా హెచ్చరికలు ఎలా ఉండినవో. మేము ఈ ఖురాన్‌ను హితబోధకొరకు సులభమైన మార్గంగా చేశాము. అయితే హితబోధను స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?

18 - 22 ఆద్ జాతి ప్రజలు తిరస్కరించారు. అప్పుడు నా శిక్ష ఎలా ఉండి నదో , నా హెచ్చరికలు ఎలా ఉండినవో చూడండి. పూర్తిగా అరిష్టదాయకమైన ఒక దుర్దినాన మేము ప్రచండమైన ఒక తుఫాను గాలిని వారిపైకి పంపాము. అది ప్రజలను వ్రేళ్లు తెగిపోయిన ఖర్జూరపు బోదెల మాదిరిగా ఎత్తి ఎత్తి విసిరిపడవేస్తుండేది. కనుక చూడండి , ఎటువంటిదో నా శిక్ష , ఎటువంటివో నా హెచ్చరికలు. మేము ఈ ఖురాన్‌ను హితబోధకై సులభమైన మార్గంగా చేశాము. కాబట్టి హితబోధను స్వీకరించేవాడెవడైనా ఉన్నాడా?

23 - 32 సమూద్ జాతి వారు హెచ్చరికలను తిరస్కరించి ఇలా అన్నారు , ''అతను ఒక్కడు , అందులోనూ మనలోనివాడు. మనం అలాంటి వ్యక్తి వెనుక నడవాలా? మనం గనక అతని యెడల విధేయతను ఒప్పుకుంటే, దాని అర్థం, మనం మార్గం తప్పిపోయామన్నమాట , మన మతిపోయిందన్నమాట. మన మధ్య కేవలం అతను ఒక్కడిపైనేనా దేవుని ప్రస్తావన అవతరింపజేయ బడిరది ? కాదు, కాని ఇతడు పెద్ద అబద్ధాలరాయుడు , డంబాలు పలికేవాడు. (మేము మా ప్రవక్తతో ఇలా అన్నాము) , ''అబద్ధాలరాయుడు, డంబాలు పలికేవాడు ఎవడో రేపే వారికి తెలిసిపోతుంది. మేము ఆడ ఒంటెను వారి కొరకు ఒక పరీక్షగా చేసి పంపుతున్నాము. ఇక కొంచెం ఓపికతో చూడు వారి గతి ఏమవుతుందో. వారికీ , ఒంటెకూ మధ్య నీరు పంచబడాలనీ , ప్రతి ఒక్కరూ తమ వంతు రోజున నీటి వద్దకు రావాలనీ వారికి తెలుపు.'' చివరకు వారు తమ మనిషిని పిలిచి చెప్పారు. అతడు ఈ కార్యభారాన్ని తన నెత్తిపై వేసుకుని ఆడ ఒంటెను చంపేశాడు. చూడండి , ఆపైన నా శిక్ష ఎలా ఉండినదో , నా హెచ్చరికలు ఎలా ఉండినవో. మేము వారిపైకి ఒకే ఒక ప్రేలుడును వదిలాము. అప్పుడు వారు త్రొక్కబడిన పశువుల దొడ్డి కంచె మాదిరిగా నుగ్గునుగ్గు అయిపోయారు. మేము ఈ ఖురాన్‌ను హితబోధకై సులభమైన మార్గంగా చేశాము. ఇక హితబోధను స్వీకరించేవాడెవడైనా ఉన్నాడా?

33 - 40 లూత్ జాతి హెచ్చరికలను తిరస్కరించింది. మేము దానిపైకి రాళ్లు విసరివేసే గాలిని పంపాము , కేవలం లూత్ ఇంటివారు మాత్రమే దానినుండి సురక్షితంగా ఉన్నారు. మేము వారిని మా అనుగ్రహంతో రాత్రివేళ వేకువ జామున రక్షించాము. కృతజ్ఞతలు తెలిపే ప్రతి మనిషికీ మేము ఇలా ప్రతిఫలం ఇస్తాము. లూత్ తన జాతి ప్రజలను మా పట్టును గురించి హెచ్చరిం చాడు. కాని వారు హెచ్చరికలనన్నింటినీ సందేహాస్పదమైనవిగా భావించి మాటలతో ఎగరగొట్టేశారు. తరువాత అతనిని వారు తన అతిథులను రక్షించుకోకుండా దూరంగా ఉంచటానికి ప్రయత్నించారు. చివరకు మేము వారి కళ్లుపోగొట్టాము. (వారితో ఇలా అన్నాము) , ''ఇక నా శిక్షను , నా హెచ్చరికలను రుచి చూడండి. ఉదయం పెందలకడనే ఒక తిరుగులేని శిక్ష వారిని పట్టుకుంది. ఇప్పుడు నా శిక్షను

నా హెచ్చరికలను రుచి చూడండి. '' మేము ఈ ఖురాన్‌ను హితబోధకై సులభమైన మార్గంగా చేశాము. కనుక హితబోధను స్వీకరించే వాడెవడైనా ఉన్నాడా?

41 - 42 ఫిరౌన్ ప్రజల వద్దకు కూడా హెచ్చరికలు వచ్చాయి. కాని వారు మా సూచనలు అన్నింటినీ తిరస్కరించారు. చివరకు మేము వారిని పట్టుకున్నాము, మహత్తర శక్తి సంపన్నుడు పట్టుకునే విధంగా.

43 - 48 మీ అవిశ్వాసులు వారికంటే ఏమైనా శ్రేష్ఠులా ? లేక ఆకాశ గ్రంథాలలో మీ కొరకేదైనా మినహాయింపు వ్రాయబడి ఉన్నదా? లేకపోతే వారు, ''మాది ఒక శక్తిమంతమైన వర్గం , మమ్మల్ని మేము రక్షించుకోగలం '' అని అంటారా? త్వరలోనే ఈ వర్గం పరాజయం పాలవుతుంది, వారంతా వెన్ను చూపి పారిపోతూ కనిపిస్తారు. కాని వారి పీచం అణచటానికి అసలు వాగ్దానం చేయబడిన సమయం ప్రళయమే. అది ఎంతో విపత్కరమైన , అత్యంత జుగుప్సాకరమైన సమయం. అసలు నేరస్తులు అపార్థానికి గురి అయ్యారు , వారికి మతిపోయింది. వారు బోర్లా పడవేయబడి, అగ్నిలోకి ఈడ్చబడే రోజున వారితో , ''ఇప్పుడు చవి చూడండి నరకం తాకిడిని '' అని చెప్పబడుతుంది.

49 - 53 మేము ప్రతి వస్తువునూ ఒక విధి నిర్ణయంతో పాటు సృష్టించాము. మా ఆజ్ఞ కేవలం ఒకే ఆజ్ఞ అవుతుంది రెప్పపాటులోనే అది అమలులోకి వస్తుంది. మీవంటి చాలా మందిని మేము నాశనం చేశాము. మరి హితబోధను స్వీకరించే వాడెవడైనా ఉన్నాడా? వారు చేసినదంతా గ్రంథాలలో నమోదు చేయబడి ఉంది. ప్రతి విషయం చిన్నదీ , పెద్దదీ వ్రాయబడి ఉంది.

54 - 55 అవిధేయతకు దూరంగా ఉండేవారు, నిశ్చయంగా తోటలలో, కాలువలలో ఉంటారు, నిజమైన గౌరవ స్థానం, మహత్తరమైన అధికారాలు కల చక్రవర్తికి సమీపంలో.

55. అర్ రహ్మాన్

ఆయతులు : 78 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 4 పరమ కృపాశీలుడు (అయిన దేవుడు) ఈ ఖురాన్ బోధించాడు. ఆయనే మానవుణ్ణి సృష్టించి , అతనికి మాట్లాడటం నేర్పాడు.

5 - 9 సూర్యుడూ, చంద్రుడూ ఒక నియమావళికి కట్టుబడి ఉన్నారు. నక్షత్రాలూ, వృక్షాలూ అన్నీ సాష్టాంగపడుతూ ఉన్నాయి. ఆయన ఆకాశాన్ని పైకిలేపాడు, త్రాసును నెలకొలిపాడు. కనుక మీరు సమతూకాన్ని భంగపరచ కండి న్యాయంగా, కచ్చితంగా తూచండి, తూకంలో తక్కువ చేయకండి.

10 - 13 ఆయన భూమిని సకల సృష్టిరాసులకై సృజించాడు. అందులో అన్నిరకాల రుచికరమైన పండ్లు పుష్కలంగా ఉన్నాయి, ఖర్జూరపు వృక్షాలు ఉన్నాయి వాటి పండ్లు పొరలలో చుట్టబడి ఉన్నాయి. రకరకాల ధాన్యాలు ఉన్నాయి. వాటిలో పొట్టుకూడ ఉంటుంది , గింజలూ ఉంటాయి. కనుక జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు యొక్క ఏయే అనుగ్రహాలను తిరస్కరించగలరు?

14 - 16 ఆయన మానవుణ్ణి పెంకువంటి ఎండిన మురుగుడు మట్టితో సృష్టించాడు జిన్నాతులను అగ్ని జ్వాలలతో పుట్టించాడు. కనుక జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు శక్తిసామర్థ్యాల ఏయే విచిత్రకార్యాలను తిరస్కరిస్తారు?

17 - 18 రెండు తూర్పు (దిక్కు)లకూ , రెండు పడమర (దిక్కు)లకూ, అన్నింటికీ యజమాని, ప్రభువు ఆయనే. కనుక జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు యొక్క ఏయే ప్రతిభా విశేషాలను తిరస్కరిస్తారు?

19 - 23 రెండు సముద్రాలు ఒకదానితో ఒకటి కలిసిపోయేటందుకు ఆయన వాటిని వదలిపెట్టాడు. అయినా వాటిమధ్య ఒక తెర అడ్డంగా ఉన్నది. అవి దానిని అతిక్రమించవు. కనుక జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు శక్తి యుక్తుల ఏయే మహిమలను తిరస్కరిస్తారు ? ఈ సముద్రాలలో ముత్యాలూ , పగడాలూ లభిస్తాయి. కనుక జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు ప్రజ్ఞాపాటవాల ఏయే ఘనకార్యాలను తిరస్కరిస్తారు?

24 - 25 సముద్రంలో కొండలవలె నిలబడి ఉన్న ఎత్తైన ఈ ఓడలు ఆయనవే. కాబట్టి జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు యొక్క ఏయే ఉపకారాలను తిరస్కరించగలరు?

26 - 30 ఈ పుడమిపై ఉన్న ప్రతి వస్తువూ నాశనమై పోయేదే. కేవలం మహోన్నతుడూ , మహోపకారీ అయిన నీ ప్రభువు మాత్రమే మిగిలి ఉండేవాడు. కనుక జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు ప్రజ్ఞాపాటవాల ఏయే ఘనకార్యాలను తిరస్కరిస్తారు ? భూమి మీదా , ఆకాశాలలోనూ ఉన్న సమస్తమూ తమ అవసరాలు తీరే నిమిత్తం ఆయననే అర్థిస్తున్నాయి. ప్రతి క్షణం ఆయన ఒక వినూత్న వైభవంతో వెలుగుతూ ఉంటాడు. కాబట్టి జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు యొక్క ఏయే ప్రశంసనీయ లక్షణాలను తిరస్కరిస్తారు?

31 - 36 భూమికి భారమైన వారలారా! అతి త్వరలోనే మేము తీరిక చేసుకుని మీ లెక్క తీసుకుంటాము (అప్పుడు చూసుకుందాము) మీరు మీ ప్రభువు యొక్క ఏయే ఉపకారాలను నిరాకరిస్తారో. జిన్నాతుల , మానవుల వర్గీయులారా! మీరు గనక భూమ్యాకాశాల సరిహద్దుల నుండి బయటపడి పారిపోగలిగితే , పారిపోయి చూడండి.

మీరు అలా పారిపోలేరు. దానికోసం ఎంతో శక్తి కావలసి ఉంటుంది. మీ ప్రభువు యొక్క ఏయే శక్తి సామర్థ్యాలను నిరాకరిస్తారు? (మీరొకవేళ పారిపోవటానికి ప్రయత్నం చేసినట్లయితే) మీపైకి అగ్ని జ్వాలలను , పొగను వదలటం జరుగుతుంది. దానిని మీరు ఎదుర్కోలేరు. జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు యొక్క ఏయే శక్తిసామర్థ్యాలను తిరస్కరించగలరు?

37 - 38 తరువాత ఆకాశం బ్రద్దలై ఎర్రని చర్మం మాదిరిగా ఎర్రబడిపోయి నప్పుడు (మీ పరిస్థితి ఏమవుతుంది ?) జిన్నాతులారా! మానవులారా! (అప్పుడు) మీరు మీ ప్రభువు యొక్క ఏయే శక్తి సామర్థ్యాలను తిరస్కరించ గలరు?

39 - 45 ఆ రోజున ఏ మానవుణ్ణీ, ఏ జిన్నాతునూ అతని పాపాలను గురించి అడిగే అవసరం ఉండదు (తరువాత) అప్పుడు (చూసుకుందాము) మీ ఇరువర్గాల వారు మీ ప్రభువు యొక్క ఏయే ఉపకారాలను తిరస్కరిస్తారో, అక్కడ నేరస్తులు తమ ముఖాలనుబట్టే గుర్తించబడతారు. వారిని నుదుటి జుత్తు , కాళ్లూ పట్టుకొని ఈడ్చుకుపోవటం జరుగుతుంది. (అప్పుడు) మీరు మీ ప్రభువు యొక్క ఏయే శక్తి సామర్థ్యాలను తిరస్కరించగలరు? (అప్పుడు ఇలా అనటం జరుగుతుంది). నేరస్తులు అబద్ధమని కొట్టిపారేస్తూ ఉండే నరకమే ఇది. అదే నరకంలో , కాగుతున్న నీళ్ల మధ్య వారు అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. అలాంటప్పుడు మీరు మీ ప్రభువు యొక్క ఏయే శక్తి సామర్థ్యాలను తిరస్కరించగలుగుతారు?

46 - 59 తన ప్రభువు సన్నిధిలో హాజరుకావలసి ఉంటుందనే భయం కలిగి ఉండే ప్రతి వ్యక్తికీ రెండు తోటలు లభిస్తాయి. కనుక మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరిస్తారు ? పచ్చగా, కనుల పండువుగా ఉండే కొమ్మలతో , రెమ్మలతో నిండి ఉంటాయి మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరించగలరు? రెండు తోటలలోనూ రెండు సెలయేర్లు ప్రవహిస్తూ ఉంటాయి. మరి మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరించగలరు ? రెండు తోటలలోనూ ప్రతిపండూ రెండు విధాలుగా ఉంటుంది. మీ ప్రభువు యొక్క ఏఏ బహుమానాలను మీరు తిరస్కరించగలరు ? స్వర్గవాసులు దళసరి పట్టు వస్త్రపు అంచుగల తివాచీలపై దిండ్లకు ఆనుకుని ఆసీనులై ఉంటారు. ఆ తోటలలోని చెట్ల కొమ్మలు పండ్లతో వంగిపోయి ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహు మానాలను మీరు తిరస్కరించగలరు? ఈ మహాభాగ్యాల మధ్య సిగ్గులొలికే చూపులు గల సుకన్యలు ఉంటారు. ఈ స్వర్గవాసులకు పూర్వం వారిని ఏ మానవుడుగానీ, ఏ జిన్నాతుగానీ తాకి ఉండలేదు. కనుక మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరించగలరు ? వారు కెంపుల, ముత్యాల మాదిరిగా ఎంతో అందంగా ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహు మానాలను మీరు తిరస్కరించగలరు?

60 - 77 సత్కార్యానికి ప్రతిఫలం సత్కార్యం కాక మరేమవుతుంది ? కనుక జిన్నాతులారా! మానవులారా! మీ ప్రభువు యొక్క ఏయే ప్రశంసనీయ లక్షణాలను మీరు తిరస్కరించగలరు ? ఆ రెండు తోటలు కాక మరో రెండు

తోటలు కూడా ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు ? అవి దట్టమైన ముదురు పచ్చని తోటలు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరించగలరు ? ఆ రెండు తోటలలోనూ రెండు చెలమలు పొంగి పొరలుతూ ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు? వాటిలో పండ్లూ ఫలాలూ , ఖర్జూరాలూ, దానిమ్మ కాయలూ పుష్కలంగా ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు? ఈ మహాభాగ్యాల మధ్య శీలవతులూ, సౌందర్య వతులూ అయిన భార్యలు ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరించగలరు ? గుడారాలలో సురక్షితంగా ఉంచబడిన సుందరీమణులు ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు? ఈ స్వర్గవాసులకు పూర్వం ఎన్నడూ ఏ మానవుడు గాని , ఏ జిన్నాతుగాని వారిని తాకివుండలేదు. మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను తిరస్కరిస్తారు ? ఆ స్వర్గవాసులు ఆకుపచ్చని తివాచీలపై, అందమైన, విలువైన పరుపులపై దిండ్లకు ఆనుకొని ఆసీనులై ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు?

78 మహామహిమాన్వితుడూ, దయామయుడూ అయిన నీ ప్రభువు పేరు ఎంతో శుభకరమైనది.

56. అల్ వాఖిఅహ్

ఆయతులు : 96 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 26 జరుగవలసి ఉన్న ఆ సంఘటన సంభవించినప్పుడు, దాని సంభవాన్ని ఇక ఎవరూ తిరస్కరించలేరు. అది తారుమారు చేసివేసే ఆపద అవుతుంది. భూమి మొత్తం అప్పుడు ఒక్కసారిగా తీవ్రంగా ఊపివేయబడుతుంది, పర్వతాలు చెదరిపోయిన ధూళిరేణువుల మాదిరిగా తుత్తునియలై పోతాయి. మీరు అప్పుడు మూడు వర్గాలుగా విడిపోతారు: కుడిపక్షంవారు కుడిపక్షం వారి (అదృష్టాన్ని)ని గురించి ఏమనాలి. ఎడమ పక్షంవారు ఎడమ పక్షంవారి (దురదృష్టాన్ని)ని గురించి ఏమనాలి. ముందు వారైతే ముందున్నవారే. వారే సాన్నిధ్యులు , సకల భోగభాగ్యాలతో నిండి వున్న స్వర్గవనాలలో ఉంటారు. వారిలో ముందువారి నుండి చాలా మంది ఉంటారు , వెనుక వారి నుండి తక్కువ మంది ఉంటారు. బంగారు జలతారుతో అల్లిన ఆసనాలపై దిండ్లకు ఆనుకొని ఎదురెదురుగా కూర్చుండి ఉంటారు. వారి సమావేశాలలో నిత్య బాల్యం కల బాలురు , మధువు ప్రవహించే చెలమ నుండి నింపిన మధు పాత్రలు, గిన్నెలు, గాజుపాత్రలు కూజాలు తీసుకొని పరుగుతో తిరుగుతూ ఉంటారు. దానిని త్రాగటం వల్ల వారి తల తిరగటం కాని, వారికి బుద్ధి మాంద్యం కలగటం గాని జరగదు. వారు వారి ముందు రకరకాల రుచికరమైన పండ్లను ఉంచుతారు, ఇష్టమైన దానిని తీసుకోవటానికి పక్షుల మాంసాన్ని ఉంచుతారు , ఏ పక్షిమాంసం ఇష్టమైతే

అది తినాలని. వారి కొరకు అందమైన కళ్లుగల 'హూర్'లు (రమణీమణులు) ఉంటారు. వారు దాచిపెట్టిన ఆణి ముత్యాల మాదిరిగా ఎంతో అందంగా ఉంటారు. ఇదంతా వారు ప్రపంచంలో చేస్తూ వచ్చిన కర్మలకు ప్రతిఫలంగా వారికి లభిస్తుంది. అక్కడ వారు పనికి మాలిన విషయాలు గానీ, పాప విషయాలు గానీ వినరు. ఏ మాట అయినా సరే, సరిగానే, సవ్యముగానే ఉంటుంది.

27 - 40 ఇక కుడిపక్షం వారు , కుడిపక్షం వారి (అదృష్టాన్ని)ని గురించి ఏమనాలి. వారు ముళ్లులేని రేగుచెట్లు , అరటి పండ్లగెలలు, దూరంగా వ్యాపించి ఉండే నీడలు , ఎల్లప్పుడూ ప్రవహించే నీరు, ఎన్నటికీ అంతంకాని, నిరాటంకంగా లభించే అసంఖ్యాకమైన పండ్లు మరియు ఎత్తైన ఆసనాలు వీటి మధ్య ఉంటారు. వారి భార్యలను మేము ప్రత్యేకంగా సరిక్రొత్త పంథాలో సృష్టిస్తాము, వారిని కన్యలుగా చేస్తాము. వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు , వయస్సులో సమంగా ఉంటారు. ఇదంతా కుడిపక్షం వారికొరకు. వారిలో ముందువారు చాలామంది ఉంటారు , వెనుక వారు కూడా చాలామంది ఉంటారు.

41 - 56 వామపక్షంవారు వామపక్షం వారి (దౌర్భాగ్యాన్ని)ని గురించి ఏమని చెప్పాలి. వారు వడగాలి మధ్య సలసల కాగే నీటిలో , నల్లని పొగల నీడలో ఉంటారు. అది చల్లగానూ ఉండదు , సుఖంగానూ ఉండదు. ఈ గతి పట్టకముందు వారు సంపన్నులుగా ఉండేవారు, చెప్పినా వినకుండా మూర్ఖంగా మహా పాపాలు చేస్తూ ఉండేవారు. వారు ఇలా అనేవారు , ''మేము మరణించి మట్టిగా మారిపోయినప్పుడు , అస్థిపంజరంగా అయి పోయినప్పుడు , మళ్లీ లేపబడతామా? పూర్వం గతించిన మా తాతముత్తాతలు కూడా లేపబడ తారా ?'' ప్రవక్తా! వారితో ఇలా అను, ''నిశ్చయంగా గతించినవారు, తరువాత వారు, అందరూ ఒక రోజున తప్పకుండా సమావేశపరచబడతారు. దాని కాలం కూడ నిర్ణయమైపోయింది.'' మార్గభ్రష్టులారా! తిరస్కారులారా! మీరు జఖ్ఖూమ్ చెట్టును ఆహారంగా తింటారు. దానితోనే మీరు మీ కడుపులను నింపుకుంటారు. ఆపై సలసల కాగే నీటిని దప్పిక గొన్న ఒంటెల మాదిరిగా త్రాగుతారు. తీర్పు దినంనాడు (ఈ వామపక్షంవారికి లభించే) ఆతిథ్యపు పదార్థాలు ఇవి.

57 - 62 మేము మిమ్మల్ని సృష్టించాము, మరెందుకు మీరు ఈ విషయాన్ని ధ్రువీకరించరు? ఎప్పుడైనా మీరు ఇలా ఆలోచించారా: మీరు విడిచే ఈ రేతస్సుతో బిడ్డను మీరు తయారు చేస్తారా లేక దానిని సృష్టించేవారము మేమా ? మేము మీ మధ్య మరణాన్ని విభజించాము , మీ రూపాలను మార్చివేసి , మీరు ఎరుగని మరేదైనా రూపంలో మిమ్మల్ని సృష్టించే విషయంలో మేము అశక్తులము కాము. మీ మొదటి పుట్టుకను గురించి మీకు తెలిసే ఉంది. మరెందుకు మీరు గుణపాఠం నేర్చుకోరు?

63 - 67 ఎప్పుడైనా మీరు ఇలా ఆలోచించారా మీరు నాటే ఈ విత్తనాలతో పొలాలను మీరు పండిస్తారా లేక వాటిని పండిరచేవారము మేమా ? మేము తలచుకుంటే ఈ పంట పొలాలను పొట్టుగా చేసి వేస్తాము. అప్పుడు మీరు ,

‘‘మేము చాలా నష్టంలో పడిపోయామని , అసలు మా అదృష్టమే కాలిపోయిం దని ’’ రకరకాలుగా మాటలు చెప్పుకుంటారు.

68 - 70 ఎప్పుడైనా మీరు కళ్లు తెరచి చూశారా మీరు త్రాగే ఈ నీటిని మేఘాలనుండి మీరు కురిపించారా లేక దానిని కురిపించే వారము మేమా ? మేము తలచుకుంటే దానిని ఎంతో ఉప్పగా ఉండేలా చేయగలము. అలాం టప్పుడు మీరు కృతజ్ఞులై ఎందుకు ఉండరు?

71 - 74 మీరు రాజేసే అగ్నిని గురించి ఎప్పుడైనా ఆలోచించారా? దానికి సంబంధించిన వృక్షాన్ని మీరు సృష్టించారా లేక దానిని సృష్టించిన వారము మేమా ? మేము దానిని జ్ఞాపక సాధనంగాను , అవసరం ఉన్న వారికొరకు ప్రయోజనకారిగాను చేశాము. కనుక ప్రవక్తా! మహోన్నతుడైన నీ ప్రభువు నామాన్ని స్తుతించు.

75 - 82 కనుక (అది) కాదు, నక్షత్రాల స్థానాలు, కక్ష్యలు సాక్షిగా చెబు తున్నాము: మీరు తెలుసుకుంటే, ఇది చాలా పెద్ద ప్రమాణం: ఇది ఒక మహోన్నతమైన ఖురాన్ ఒక సురక్షితమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది. దానిని పరిశుద్ధులు తప్ప మరెవరూ తాకలేరు. ఇది సకల లోకాల ప్రభువు అవతరింపజేసినటువంటిది. అయినా మీరు ఈ వాణిని తేలిక విషయంగా తీసుకుంటారా ? ఈ మహాభాగ్యాన్ని తిరస్కరించటమే మీరు మీ జీవనోపాధిగా చేసుకున్నారా?

83 - 94 ఇక మీరు గనక ఎవరికీ బానిస కాకపోతే, ఈ అభిప్రాయంలో మీరు గనక సత్యవంతులే అయితే, చనిపోయే వాడి ప్రాణం గొంతులోకి వచ్చినప్పుడు, అతడు చనిపోతున్నాడని మీరు కళ్లారా చూస్తూ ఉంటారు, ఆ సమయంలో పోయే ప్రాణాన్ని మీరు తిరిగి ఎందుకు తీసుకురాలేరు? అప్పుడు మీకంటే మేము అతనికి చాల దగ్గరలో ఉంటాము, కాని మీకు కనిపించము. తరువాత ఆ చనిపోయే మనిషి సాన్నిధ్యులలోని వాడైతే , అతని కొరకు సుఖం , మంచి ఆహారం, మహా భాగ్యాలతో నిండి ఉన్న స్వర్గం ఉంటాయి. ఒకవేళ అతడు కుడిపక్షంలోనివాడై ఉంటే , ‘‘నీకు శాంతి కలుగుగాక! నీవు కుడిపక్షంలోని వాడవు ’’ అని అతనికి స్వాగతం చెప్పబడుతుంది. ఒకవేళ అతడు తిరస్కరించే మార్గభ్రష్టులలోని వాడై ఉంటే, అతనికి ఇవ్వబడే ఆతిథ్యం సల సల కాగే నీరు మరియు నరకంలోకి విసరివేయటం.

95 - 96 ఇదంతా తిరుగులేని సత్యం, కనుక ప్రవక్తా! మహోన్నతుడైన నీ ప్రభువు పేరును స్తుతించు.

## 57. అల్ హదీద్

ఆయతులు : 29 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 6 భూమిలోనూ , ఆకాశాలలోనూ ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతోంది. ఆయనే శక్తిమంతుడు, వివేకవంతుడూను. భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు ఆయనే. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తున్నాడు, మరణాన్ని కలిగిస్తున్నాడు , ప్రతి వస్తువుపై అధికారం కలిగి ఉన్నాడు. ఆయనే ఆరంభమూ , ఆయనే అంతమూ ఆయనే బాహ్యమూ, ఆయనే గూఢమూ. ఆయనకు ప్రతి వస్తువును గురించి తెలుసు. ఆయనే ఆకాశాలనూ, భూమినీ, ఆరు దినాలలో సృష్టించాడు , తరువాత అధికార పీఠాన్ని అధిష్టించాడు. భూమి లోపలకు పోయేదీ, అందులో నుండి వెలుపలకు వచ్చేదీ, ఆకాశం నుండి దిగేదీ, దాని లోపలకు ఎక్కేదీ, అంతా ఆయన జ్ఞాన పరిధిలో ఉన్నది. మీరు ఎక్కడ ఉన్నా ఆయన మీతో ఉన్నాడు. మీరు ఏ పని చేస్తూ ఉన్నా , దానిని ఆయన చూస్తున్నాడు. ఆయనే భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి. సమస్త వ్యవహారాలు నిర్ణయ నిమిత్తం ఆయన వైపునకే తీసుకుపోబడతాయి. ఆయనే రాత్రిని పగలులోకి పగలును రాత్రిలోకి ప్రవేశింపజేస్తాడు. హృదయాలలో దాగి ఉన్న రహస్యాలను సైతం ఆయన ఎరుగును.

7 - 10 అల్లాహ్నూ , ఆయన ప్రవక్తనూ విశ్వసించండి. ఆయన మిమ్మల్ని ఏ వస్తువులపై ఖలీఫా (ప్రతినిధి)గా నియమించాడో, వాటిలో నుండి ఖర్చు పెట్టండి. మీలో విశ్వసించి ధనం ఖర్చుపెట్టే వారికి గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. మీకు ఏమయింది, అల్లాహ్ ను మీరు విశ్వసించరు? వాస్తవానికి ప్రవక్త, మీ ప్రభువును విశ్వసించండని మీకు పిలుపునిస్తున్నాడు, ఆయన మీచేత ప్రమాణం చేయించుకున్నాడు, మీరు నిజమైన విశ్వాసులే అయితే. తన దాసునిపై స్పష్టమైన వాక్యాలను అవతరింపజేస్తూ ఉన్నవాడు అల్లాహ్ యే. ఆయన వాటి ద్వారా మిమ్మల్ని చీకట్ల నుండి వెలుగులోకి తీసుకురాదలచుకున్నాడు. యథార్థం ఏమిటంటే, అల్లాహ్ కు మీరంటే ఎంతో వాత్సల్యం, ఎంతో దయ ఉన్నాయి. అసలు మీరు అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టకపోవటానికి కారణం ఏమిటి ? వాస్తవానికి భూమీ, ఆకాశముల వారసత్వం అల్లాహ్ కు మాత్రమే ఉంది. మీలో విజయం తరువాత ఖర్చు పెట్టినవారు , జిహాద్ చేసినవారు, విజయానికి పూర్వం ఖర్చుపెట్టిన వారితో , జిహాద్ చేసిన వారితో ఎన్నటికీ సమానులు కాలేరు. వారి అంతస్తు, తరువాత ఖర్చుపెట్టిన వారికంటే , జిహాద్ చేసినవారి కంటే గొప్పది. అయినా అల్లాహ్ ఉభయులకూ మంచివాగ్దానాలు చేసి ఉన్నాడు. మీరు చేసిన దానిని అల్లాహ్ బాగా ఎరుగును.

11 - 15 అల్లాహ్ కు రుణం ఇచ్చేవాడెవడైనా ఉన్నాడా? మంచి రుణం: అటువంటి వానికి అల్లాహ్ దానిని ఎన్నోరెట్లు పెంచి తిరిగి ఇస్తాడు. అతనికి ఎంతో శ్రేష్ఠమైన ప్రతిఫలం లభిస్తుంది. విశ్వాసులైన స్త్రీ పురుషుల ముందూ , వారి కుడివైపునా వారి వెలుగు పరుగెడుతూ ఉండటాన్ని నీవు చూస్తావు. ఆ రోజున (వారితో)''ఈనాడు మీకు శుభవార్త ఉన్నది'' అని అనబడుతుంది. క్రిందకాలువలు ప్రవహించే స్వర్గవనాలు ఉంటాయి , అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు. ఇదే మహత్తరమైన సాఫల్యం. ఆనాడు కపట పురుషుల కపట స్త్రీల పరిస్థితి ఎలా ఉంటుందంటే , వారు విశ్వాసులతో, ''కొంచెం మావైపు చూడండి , మేము మీ వెలుగు ద్వారా కొంత ప్రయోజనం పొందుతాము '' అని అంటారు. కాని వారితో, ''వెనక్కి వెళ్లండి. మీ వెలుగును మరొక చోట ఎక్కడైనా వెతుక్కోండి '' అని అనబడుతుంది.

తరువాత వారి మధ్య ఒక గోడను అడ్డుగా నిలబెట్టడం జరుగుతుంది. దానికి ఒక ద్వారం కూడ ఉంటుంది. ఆ ద్వారానికి లోపల సౌఖ్యం, బయట మాత్రం యాతన. వారు విశ్వాసులతో, ''మేము మీతో కలసి ఉండలేదా ?'' అని ఎలుగెత్తి మాటిమాటికీ అరుస్తూ ఉంటారు. విశ్వాసులు ఇలా సమాధానం ఇస్తారు , ''నిజమే, కాని మిమ్మల్ని మీరే స్వయంగా పరీక్షకు గురిచేసుకున్నారు. అవకాశ వాదానికి పాల్పడ్డారు , సందేహంలో పడిపోయారు. లేనిపోని ఆశలు మిమ్మల్ని మోసం చేశాయి. చివరకు అల్లాహ్ నిర్ణయం వచ్చేసింది. అంతిమ క్షణం వరకూ ఆ గజమోసగాడు(షైతాన్) మిమ్మల్ని అల్లాహ్ విషయంలో మోసం చేస్తూ వచ్చాడు. కనుక ఈ రోజు మీనుండి ఎలాంటి పరిహారమూ తీసుకోబడదు. బాహాటంగా అవిశ్వాసానికి ఒడిగట్టిన వారి నుండి కూడా పరిహారమూ తీసుకోవటం జరగదు. మీ నివాస స్థలం నరకం, అదే మీ మంచి సెబ్బరలను చూస్తుంది. ఇది చాలా చెడ్డ పర్యవసానం.

16 - 17 విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావనతో చలించే సమయం, ఆయన అవతరింపజేసిన సత్యం ముందు వంగిపోయే సమయం ఇంకా రాలేదా ? పూర్వం గ్రంథం ఇవ్వబడిన ప్రజల మాదిరిగా వారు మారిపో కూడదు. ఒక సుదీర్ఘకాలం వారిపై గడచిపోయింది. అప్పుడు వారి హృద యాలు కఠిన మయ్యాయి. ఈనాడు వారిలో అనేకులు పరమ దుర్మార్గులు. బాగా తెలుసుకోండి , అల్లాహ్ భూమికీ , మరణం తరువాత జీవం పోస్తాడని మేము సూచనలను మీకు స్పష్టంగా చూపించాము, బహుశా మీరు విజ్ఞతతో వ్యవహరిస్తారని.

18 - 19 స్త్రీ పురుషులలో దానధర్మాలు (సదఖా) చేసి అల్లాహ్ కు మంచి రుణం ఇచ్చేవారికి , ఎన్నో రెట్లు పెంచి దానిని తిరిగి ఇవ్వటం జరుగుతుంది వారికి ఎంతో మంచి ప్రతిఫలం లభిస్తుంది. అల్లాహ్నూ , ఆయన ప్రవక్తలనూ విశ్వసించిన వారే తమ ప్రభువు దృష్టిలో సత్యసంధులు (సిద్దీఖ్) మరియు సాక్షులూను (షహీద్). వారికి వారి ప్రతిఫలం, వారి జ్యోతి లభిస్తాయి. అవి శ్వాసానికి ఒడిగట్టినవారు , మా వాక్యాలను నిరాకరించినవారు నరకవాసు లవుతారు.

20 - 21 బాగా తెలుసుకోండి, ఈ లౌకిక జీవితం ఒక ఆట , ఒక వినోదం, బాహ్య పటాటోపం, పరస్పరం ప్రగల్భాలు పలకటం, సంపద, సంతానాల విషయంలో ఒకరిపై ఒకరు ఆధిక్యం పొందటానికి ప్రయత్నించటం తప్ప మరేమీ కాదు. దాని దృష్టాంతం ఇలా ఉంది: ఒక వర్షం కురిసింది. అప్పుడు దాని వల్ల మొలకెత్తి పెరిగిన చెట్లూ చేమలను చూచి, రైతులు సంబరపడ్డారు. తరువాత , అవే పండుతాయి. ఆ తరువాత అవి పసుపుపచ్చగా మారిపోవటాన్ని నీవు చూస్తావు. ఆపై అవి ఎండిపోయి పొట్టుగా మారిపోతాయి. దీనికి భిన్నంగా , పరలోకం ఇలా ఉంటుంది: అక్కడ తీవ్రమైన శిక్ష ఉంటుంది , అల్లాహ్ క్షమాభిక్ష , ఆయన ప్రసన్నత ఉంటాయి. ప్రాపంచిక జీవితం ఒక మాయ తడిక తప్ప మరేమీ కాదు. మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు పరుగెత్తండి , ఒకరికంటే ఒకరు ముందుకుపోయే కృషి చేయండి ఆకాశాలంత , భూమి యంత విశాలమైన స్వర్గం వైపునకు పరుగెత్తండి. అది అల్లాహ్నూ , ఆయన

ప్రవక్తలనూ విశ్వసించిన వారి కొరకు సిద్ధం చేయబడిరది. ఇది అల్లాహ్ అనుగ్రహం తాను కోరిన వారికి ఆయన దానిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ ఎంతో అనుగ్రహం కలవాడు.

22 - 24 భూమిపై గానీ లేదా స్వయంగా మీ ఆత్మలపై గానీ అవతరించే ఏ ఆపద అయినా సరే , దానిని మేము ఉనికిలోకి తీసుకువచ్చే ముందు ఒక గ్రంథం (అంటే భాగ్యగ్రంథం)లో వ్రాసి పెట్టకుండా ఉండలేదు. అలా చేయటం అల్లాహ్ కు చాలా సులభం. (ఇదంతా ఎందుకంటే) మీకు ఎలాంటి నష్టం జరిగినా , దానికి మీరు బాధపడకుండా ఉండాలని, అల్లాహ్ మీకు ఏదైనా ప్రసాదిస్తే , దానికి మీరు మురిసిపోకుండా ఉండాలని. తమను తాము గొప్ప వారమని భావించి, అహంభావం ప్రదర్శించే వారిని అల్లాహ్ ప్రేమించడు. వారు స్వయంగా లోభత్వం పాటించటమే కాక, ఇతరులను కూడా లోభత్వానికి పురికొలుపుతారు. ఇక , ఒకవేళ ఎవడైనా ముఖం త్రిప్పుకుంటే , సద్గుణ సంపన్నుడైన అల్లాహ్ అక్కరలేనివాడు.

25 మేము మా ప్రవక్తలను స్పష్టమైన సూచనలతో, హితోపదేశాలతో పంపాము. వారితో పాటు గ్రంథాన్నీ, త్రాసునూ అవతరింపజేశాము ప్రజలు న్యాయంపై స్థిరంగా నిలబడాలని. ఇనుమునూ దింపాము. అందులో మహత్తర మైన శక్తి ఉన్నది , ప్రజలకు ప్రయోజనాలూ ఉన్నాయి. ఇలా ఎందుకు చేయ బడిరదంటే , ఆయనను చూడకుండానే ఎవడు ఆయనకూ, ఆయన ప్రవక్తలకూ సహాయపడతాడో అల్లాహ్ కు తెలియాలని. నిశ్చయంగా అల్లాహ్ ఎంతో దృఢమైనవాడు, సర్వశక్తిమంతుడూను.

26 - 27 మేము నూహ్నూ, ఇబ్రాహీమ్‌నూ పంపాము. ఆ ఉభయుల సంతతిలో ప్రవక్త పదవినీ, గ్రంథాన్నీ పెట్టాము. తరువాత వారి సంతానంలో కొందరు సన్మార్గాన్ని అవలంబించారు కాని చాలా మంది అవిధేయులై పోయారు. వారి తరువాత మేము వరుసగా ప్రవక్తలను పంపాము. వారందరి తరువాత మర్యమ్ కుమారుడు ఈసాను ప్రభవింపజేశాము, ఆయనకు ఇన్‌జీల్‌ను ప్రసాదించాము. ఆయనను అనుసరించిన వారి హృదయాలలో మేము జాలిని, కరుణను కలిగించాము. వైరాగ్యాన్ని (రుహ్బానియత్) వారు స్వయంగా కనిపెట్టారు. మేము దానిని వారిపై విధించలేదు. కాని అల్లాహ్ ప్రసన్నతను పొందటానికి వారే స్వయంగా ఈ దురాచారాన్ని సృష్టించారు. తరువాత దానిని పాటించే విషయంలో , న్యాయం చేకూర్చలేకపోయారు. వారిలో విశ్వసించిన వారికి మేము వారి ప్రతిఫలాన్ని ప్రసాదించాము. కాని వారిలో పలువురు అవిధేయులు.

28 - 29 విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కు భయపడండి , ఆయన ప్రవక్త (ముహమ్మద్ - సఅసమ్)ను విశ్వసించండి. అల్లాహ్ మీకు తన కారుణ్యంలో నుంచి రెట్టింపు భాగాన్ని ప్రసాదిస్తాడు , మీకు జ్యోతిని ప్రసాదిస్తాడు, దాని వెలుగులో మీరు నడుస్తారు , మీ పొరపాట్లను క్షమిస్తాడు. అల్లాహ్ ఎంతో క్షమించేవాడు , కనికరించేవాడూను. అల్లాహ్ అనుగ్రహంపై వారికి ఏ విధమైన గుత్తాధిపత్యం లేదనీ, అల్లాహ్ అనుగ్రహం స్వయంగా ఆయన చేతులలోనే

ఉన్నదనీ, తాను కోరిన వారికి ఆయన దానిని ప్రసాదిస్తాడనీ , ఆయన గొప్ప అనుగ్రహశాలి అనీ గ్రంథ ప్రజలు తెలుసుకోవాలని.

58. అల్ ముజాదలహ్

ఆయతులు : 22 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 4 ... తన భర్త వ్యవహారంలో నీతో వాదిస్తూ ఉన్న , అల్లాహ్తో మొరపెట్టు కుంటూ ఉన్న స్త్రీ మాటలను అల్లాహ్ విన్నాడు. అల్లాహ్ మీ ఉభయుల సంభాషణను వింటున్నాడు ఆయన అన్నీ వినేవాడు , అన్నీ చూసేవాడూను. మీలో ఎవరు తమ భార్యలను ''జిహార్'' ద్వారా దూరంగా ఉంచుతారో వారికి వారి భార్యలు తల్లులు కాజాలరు. వారిని కన్నవారే వారి తల్లులు , వారు ఎంతో అనుచితమైన , ఎంతో అసత్యమైన మాటను పలుకుతున్నారు. యథార్థమేమిటంటే అల్లాహ్ ఎంతో క్షమించేవాడు , (దోషాలను) ఉపేక్షించే వాడూను. ఎవరైనా తమ భార్యలను ''జిహార్'' ద్వారా దూరంగా ఉంచి , ఆ తరువాత తాము అన్న మాటను వారు ఉపసంహరించుకోదలిస్తే , వారు ఉభయులు ఒకరినొకరు తాకకముందే, ఒక బానిసను విడుదల చేయవలసి ఉంటుంది. దీనిద్వారా మీకు ఉపదేశం చేయబడుతోంది మీరు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు. ఎవరికైనా బానిస లభించని పక్షంలో , ఉభయులు ఒకరినొకరు తాకకముందే , అతను వరుసగా రెండు నెలలపాటు ఉపవాస ముండాలి. ఈ పనికూడ చేసే శక్తిలేనివాడు, అరవై మంది నిరుపేదలకు భోజనం పెట్టాలి.

... 4 - 6 మీరు అల్లాహ్నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించేందుకు ఈ ఆజ్ఞ ఇవ్వబడుతోంది. ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. తిరస్కారులకు బాధాకరమైన శిక్షపడుతుంది. అల్లాహ్నూ , ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించేవారు తీవ్రంగా అవమానంపాలు చేయబడతారు, వారికి పూర్వం గతించిన వారు అవమానంపాలు చేయబడిన విధంగా. మేము స్పష్టమైన ఆయతులను అవతరింపజేశాము, ఇక తిరస్కారులకు తీవ్ర అవమానంతో కూడుకున్న శిక్షపడుతుంది. అల్లాహ్ వారందరినీ మళ్ళీ బ్రతికించి లేపి వారేమేమి చేసివచ్చిందీ వారికి తెలియజేసే రోజున (వారికి అవమానభరితమైన శిక్ష పడుతుంది). వారు మరచిపోయారు కాని , అల్లాహ్ వారు చేసినవన్నీ ఒక్కొక్క దానిని లెక్కబెట్టి భద్రంగా ఉంచాడు. అల్లాహ్ ప్రతి ఒక్కదానికీ సాక్షిగా ఉన్నాడు.

7 - 8 భూమీ, ఆకాశాలలో ఉన్న ప్రతి వస్తువును గురించి అల్లాహ్ కు తెలుసనే విషయం నీకు తెలియదా? ముగ్గురు వ్యక్తులు కలసి ఏవైనా మంతనాలు జరిపినప్పుడు , వారిమధ్య నాలుగోవాడుగా అల్లాహ్ కాకుండా ఉండటం అనేది ఎన్నడూ జరగదు. లేదా ఐదుగురు వ్యక్తులు కలసి మంతనాలు జరిపినప్పుడు , వారిలో ఆరో వాడుగా అల్లాహ్

కాకుండా ఉండటం అనేది కూడ ఎన్నడూ జరగదు. రహస్యాలోచనలు జరిపేవారు వీరికంటె తక్కువ మంది ఉన్నా లేక ఎక్కువమంది ఉన్నా , వారు ఎక్కడ ఉన్నా , అల్లాహ్ వారితో పాటు ఉంటాడు. ఆ తరువాత ప్రళయదినాన , ఆయన వారికి వారేమేమి చేసివచ్చారో అంతా తెలియజేస్తాడు. అల్లాహ్ ప్రతి విషయం తెలిసినవాడు. రహస్య సమాలోచనలు చేయవద్దని నిషేధించటం జరిగినప్పటికీ , తిరిగి, నిషేధించబడిన దానినే చేస్తున్న వారిని నీవు చూడలేదా? వారు రహస్యంగా, పాపమూ, దౌర్జన్యమూ ప్రవక్త పట్ల అవిధేయతలకూ సంబంధించిన విషయా లను పరస్పరం మాట్లాడుకుంటారు. వారు నీ వద్దకు వచ్చినప్పుడు , అల్లాహ్ నీకు సలామ్ చేయని రీతిలో వారు నీకు సలామ్ చేస్తారు. మనం చెప్పుకునే ఈ మాటలకు అల్లాహ్ మనల్ని ఎందుకు శిక్షించడు ? అని వారు తమ మనస్సులలో అనుకుంటారు - వారికి నరకమే చాలు వారు దానికే ఇంధన మవుతారు. వారి పర్యవసానం అత్యంత ఘోరమైనది.

9 - 10 విశ్వాసులారా! మీరు గనక పరస్పరం రహస్య విషయాలు మాట్లాడు కుంటే , పాపమూ, దౌర్జన్యమూ, దైవప్రవక్త పట్ల అవిధేయతలకూ సంబంధం చిన విషయాలు కాకుండా , సత్యానికీ, దైవభీతికి సంబంధించిన విషయాలు మాట్లాడుకోండి. మీరు దేవునికి భయపడుతూ ఉండండి. పునరుత్థాన దినాన మీరు ఆయన సన్నిధిలో హాజరుకావలసి ఉంది. రహస్య మంతనాలు జరపటం షైతాను చేష్ట. విశ్వాసులకు మనస్తాపం కలిగించటానికే ఈ చేష్టచేయబడు తుంది. వాస్తవానికి దైవాజ్ఞ లేనిదే అది వారికి ఏమాత్రం నష్టం కలిగించ జాలదు , విశ్వాసులు అల్లాహ్నే నమ్ముకోవాలి.

11 విశ్వసించిన ఓ ప్రజలారా! మీ సమావేశాలలో (వచ్చే వారికి) చోటు కల్పించండని మీతో అన్నప్పుడు , మీరు జరిగి, చోటు కల్పించండి. అల్లాహ్ మీకు విశాలమైన చోటును ప్రసాదిస్తాడు. మిమ్మల్ని లేచివెళ్లండి అని అన్న ప్పుడు, లేచివెళ్లండి. మీలో విశ్వసించిన వారికి , జ్ఞానం ప్రసాదించబడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు. మీరు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు.

12 విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు దైవప్రవక్తతో ఏకాంతంలో మాట్లాడ దలిస్తే , మాట్లాడబోయేముందు, ఏదైనా కొంచెం దానం చెయ్యండి. ఇది మీ కొరకు ఉత్తమమైనది , ఎంతో పవిత్రమైనది. అయితే దానం చేయటానికి మీ వద్ద ఏమీ లేకపోతే, అప్పుడు అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు అని తెలుసుకోండి.

13 మీరు ఏకాంతంలో మాట్లాడే ముందు , దానం చేయవలసి వస్తుందని భయపడ్డారా ? సరే, ఒకవేళ మీరు అలా చేయకపోతే, పోనివ్వండి - అల్లాహ్ ఈ విషయంలో మిమ్మల్ని మన్నించాడు- అందువల్ల (కనీసం) నమాజ్‌ను స్థాపిస్తూ ఉండండి, జకాత్ చెల్లిస్తూ ఉండండి, అల్లాహ్కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపుతూ ఉండండి. మీరు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు.

14 - 21 అల్లాహ్ ఆగ్రహానికి గురైన ఒక వర్గం వారిని మిత్రులుగా చేసుకున్న ప్రజలను మీరు చూడలేదా? వారు మీ మనుషులూకారు, వారి మనుషులూ కారు. వారు బుద్ధిపూర్వకంగా అసత్య విషయాలపై ప్రమాణం చేస్తారు. అల్లాహ్ వారి కోసం కఠిన శిక్షను సిద్ధపరచి ఉంచాడు. వారు చేస్తున్నవన్నీ అతి చెడ్డ పనులు. వారు తమ ప్రమాణాలను డాలుగా చేసుకుని , దాని చాటున ప్రజలను అల్లాహ్ మార్గం నుండి నిరోధిస్తున్నారు. దీనికిగాను వారికి అవమానభరితమైన శిక్షపడుతుంది. అల్లాహ్ (శిక్ష)నుండి వారిని కాపాడటానికి వారి సంపదలూ పనికిరావు వారి సంతానమూ ఉపయోగపడదు. వారు నరకవాసులు , అందులోనే వారు శాశ్వతంగా ఉంటారు. అల్లాహ్ వారందరినీ లేపినరోజున, వారు ఆయన ముందుకూడ, మీ ముందు చేసినట్లే ప్రమాణాలు చేస్తారు. దీనివల్ల తమ పని కొంత నెరవేరుతుందని వారు అనుకుంటారు. బాగా తెలుసుకోండి , వారు పరమ అసత్యవాదులు. షైతాను వారిని ఆవహించి ఉన్నాడు , వారు తమ హృదయాలలో దేవుని సంస్మరణను మరచిపోయేలా జేశాడు. వారు షైతాన్ పక్షానికి చెందినవారు. జాగ్రత్త! షైతాన్ పక్షంవారే నష్టానికి గురిఅయ్యేవారు. నిశ్చయంగా అల్లాహ్నూ , ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించేవారు నీచాతి నీచమైన సృష్టికి చెందినవారు. నేనూ , నా ప్రవక్త మాత్రమే ఆధిక్యం వహించితీరుతాము అని అల్లాహ్ వ్రాసిపెట్టాడు. నిజానికి అల్లాహ్ సర్వశక్తిమంతుడు సర్వాధికుడూను.

22 అల్లాహ్నూ, పరలోకాన్నీ విశ్వసించేవారు, అల్లాహ్నూ ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించే వారిని ప్రేమించటాన్ని నీవు ఎన్నడూ చూడలేవు. ఆ వ్యతిరేకించేవారు వారి తల్లిదండ్రులైనా , వారి కుమారు లైనా, వారి సోదరులైనా సరే లేదా వారి కుటుంబీకులైనా సరే. వారి హృదయాలలో అల్లాహ్ విశ్వాసాన్ని స్థిరంగా నాటాడు, తన తరఫునుండి ఒక ఆత్మను ప్రసాదించి వారికి బలాన్ని ఇచ్చాడు. ఆయన వారిని క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింప జేస్తాడు. ఆ వనాలలో వారు శాశ్వతంగా ఉంటారు. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు , వారు అల్లాహ్ పట్ల సంతుష్టి చెందారు. వారు అల్లాహ్ పక్షానికి చెందినవారు. జాగ్రత్త! అల్లాహ్ పక్షం వారే సఫలీకృతులయ్యేవారు.

59. అల్ హష్ర్

ఆయతులు : 24 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 2 ఆకాశాలలోనూ , భూమిలోనూ ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ను స్తుతి స్తోంది. ఆయనే సర్వాధికుడు , వివేకవంతుడూను. ఆయనే గ్రంథ ప్రజలలోని తిరస్కారులను మొదటి దెబ్బలోనే వారి గృహాలనుండి గెంటివేశాడు. వారు వెళ్ళిపోతారని మీరు ఏమాత్రం ఊహించి ఉండలేదు. వారు కూడ తమను అల్లాహ్ నుండి తమ కోటలు రక్షిస్తాయని భావించారు. కాని అల్లాహ్ వారిపైకి వారు ఊహించని దిశనుండి వచ్చాడు. ఆయన వారి హృదయాలలో

బెదురు పుట్టించాడు. తత్ఫలితంగా వారు తమ ఇళ్లను తమ చేతులారా కూడా నాశనం చేసుకున్నారు. విశ్వాసుల చేతుల ద్వారా కూడా నాశనం చేయించుకున్నారు. కనుక కళ్లున్న ప్రజలారా! గుణపాఠం నేర్చుకోండి.

3 - 4 ఒకవేళ అల్లాహ్ దేశబహిష్కార విషయాన్ని వారి నొసట వ్రాసి ఉండకపోతే , ప్రపంచంలోనే ఆయన వారిని శిక్షించి ఉండేవాడు. పరలోకంలో వారి కొరకు నరక శిక్ష ఉండనే ఉంది. వారు అల్లాహ్నూ , ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించి నందువల్లనే ఇదంతా జరిగింది. అల్లాహ్ ను ఎవడు వ్యతిరేకిం చినా , వాడిని అల్లాహ్ చాల కఠినంగా శిక్షిస్తాడు.

5 మీరు ఏ ఖర్జూరపు చెట్లను నరికివేశారో లేక ఏ ఖర్జూరపు చెట్లను వాటి వ్రేళ్లపై యథాతథంగా ఉండనిచ్చారో , ఇదంతా అల్లాహ్ ఆజ్ఞతోనే జరిగింది. (అల్లాహ్ ఈ ఆజ్ఞను) దుర్మార్గులను అవమానపరచేందుకు (ఇచ్చాడు).

6 - 10 ఏ ఆస్తులను అల్లాహ్, వారి అధీనంలో నుండి తీసుకుని తన ప్రవక్త వైపునకు తరలించాడో, అవి మీరు మీ గుర్రాలనూ, ఒంటెలనూ పరుగెత్తించగా లభించినటువంటి ఆస్తులు కావు. అల్లాహ్ తన ప్రవక్తలకు తాను కోరిన వారిపై ఆధిపత్యాన్ని ప్రసాదిస్తాడు. అల్లాహ్ ప్రతిదానిపై అధికారం కలిగి ఉన్నాడు. అల్లాహ్ ఇతర వాడల ప్రజల నుండి దేనినయితే తన ప్రవక్త వైపునకు మరలిస్తాడో , అందులో అల్లాహ్ కు, ప్రవక్తకు, బంధువులకు, అనాధులకు, నిరుపేదలకు, బాటసారులకు హక్కు ఉన్నది. అది మీ ధనికుల మధ్యనే తిరగకుండా ఉండేందుకు ఇలా నిర్ణయించబడిరది. దైవప్రవక్త మీకు ఇచ్చిన దాన్ని తీసుకోండి, ఆయన మిమ్మల్ని నిషేధించిన దాని జోలికిపోకండి. అల్లాహ్ కు భయపడండి, అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడు.(ఇంకా ఆ ఆస్తులలో) తమ ఇళ్లనుండీ, తమ ఆస్తిపాస్తుల నుండీ తరిమివేయబడిన నిరుపేద శరణార్థులకు కూడ హక్కు ఉంది. వారు అల్లాహ్ అనుగ్రహాన్నీ , ఆయన ప్రసన్నతనూ కోరుకుంటున్నారు. ఇంకా వారు అల్లాహ్కూ, ఆయన ప్రవక్తకూ సహాయ పడేందుకు సదా సంసిద్ధంగా ఉంటారు. వారే ఋజువర్తనులు. (ఇంకా ఆ ఆస్తులలో) ఈ శరణార్థుల రాకకు పూర్వమే, విశ్వసించి వలస కేంద్రంలో స్థిరపడిన వారికి కూడ హక్కు ఉంది. వారు తమ వద్దకు వలస వచ్చిన వారిని ప్రేమిస్తారు. వారికి ఏది ఇవ్వబడినా, దాని అవసరం సైతం ఉన్నట్లుగా వారు తమ మనస్సులలో భావించరు. వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ, తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వాస్తవానికి హృదయ లోభత్వం నుండి రక్షింపబడినవారే సాఫల్యం పొందేవారు. (ఇంకా ఆ ఆస్తులలో) వారి తరువాత వచ్చిన వారికి కూడ హక్కు ఉంది. వారు ఇలా అంటారు , ''ఓ ప్రభూ! మమ్మల్నీ , మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులంద రినీ , క్షమించు, మా హృదయాలలో విశ్వాసులపట్ల ఎలాంటి ద్వేషాన్నీ కలిగిం చకు. మా ప్రభూ! నీవు చాలా కనికరించేవాడవు , కరుణామయుడవూను.''

11 - 17 కపట వైఖరి అవలంబించిన వారిని నీవు చూడలేదా ? వీరు గ్రంథ ప్రజలలోని అవిశ్వాసులైన తమ సోదరులతో ఇలా అంటారు, ''ఒకవేళ మిమ్మల్ని బహిష్కరించటం జరిగితే, మేము కూడ మీతో పాటు వస్తాము. మీ

వ్యవహారంలో మేము ఎవరి మాటైనా ఎంతమాత్రం వినము. ఒకవేళ మీతో యుద్ధం జరిగితే , మీకు మేము సహాయపడతాము.'' కాని వీరు పరమ అసత్య పరులు దీనికి అల్లాహ్ యే సాక్షి. వారు గనక బహిష్కరింపబడితే వీరు వారితోపాటు ఎంతమాత్రం వెళ్లరు. ఒకవేళ వారితో యుద్ధం జరిగితే , వీరు వారికి ఏమాత్రం సహాయపడరు. ఒకవేళ వీరు వారికి సహాయపడినా, వెన్ను చూపి పారిపోతారు ఆ తరువాత ఎక్కడ నుండీ ఎలాంటి సహాయాన్నీ పొంద లేరు. వీరి హృదయాలలో అల్లాహ్ భయంకంటే మీ భయమే ఎక్కువగా ఉంది ఎందుకంటే వీరు బుద్ధిహీనులు. వీరు ఎన్నడూ ఒకచోట గుమిగూడి (బహిరంగమైదానంలో) మిమ్మల్ని ఎదుర్కోలేరు. ఒకవేళ పోరాడినా, కోటల రక్షణగల వాడలలో కూర్చుండిగానీ లేదా ప్రాకారాల వెనుక దాగి ఉండిగానీ పోరాడతారు. వీరు పరస్పరం తీవ్రంగా కలహించుకుంటారు. వీరు కలసి కట్టుగా ఉన్నారని నీవు భావిస్తున్నావు. కాని వీరి మనస్సులు పరస్పరం చీలి పోయి ఉన్నాయి. వీరు బుద్ధిహీనులు కావటం వల్లనే వీరి స్థితి ఇలా తయా రయింది. వీరికి కొంతకాలం ముందు , తాము చేసిన దాని ఫలితాన్ని చవిచూసిన ప్రజల మాదిరిగానే వీరూ ఉన్నారు. వీరికి బాధాకరమైన శిక్ష పడుతుంది. వీరి దృష్టాంతం షైతాన్ దృష్టాంతం మాదిరిగా ఉంది ప్రారం భంలో వాడు మానవునితో, ''సత్యాన్ని తిరస్కరించు'' అని అంటాడు. తీరా మానవుడు సత్యాన్ని తిరస్కరిస్తే , వాడు, ''నీ పట్ల నాకు ఏ విధమైన బాధ్యతా లేదు. సకల లోకాల ప్రభువైన అల్లాహ్ అంటే నాకు భయంగా ఉంది '' అని అంటాడు. తరువాత ఆ ఇద్దరి పర్యవసానం, శాశ్వతంగా నరకానికి పోవటమే. దుర్మార్గులకు లభించే ప్రతిఫలం ఇదే.

18 - 20 విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్ కు భయపడండి. ప్రతి వ్యక్తీ తాను రేపటి కొరకు ఏమి సమకూర్చుకున్నాడో చూసుకోవాలి. అల్లాహ్ కు భయపడుతూ ఉండండి , నిశ్చయంగా అల్లాహ్ కు మీరు చేసే పనులన్నీ తెలుసు. అల్లాహ్ ను మరచిపోయిన వారి మాదిరిగా మీరూ అయిపోకండి. (అల్లాహ్ ను మరచిపోవటం వల్ల) అల్లాహ్ వారిని తమను తాము మరచిపోయేలా చేశాడు. వారే దుర్మార్గులు. నరకానికి పోయే వారూ స్వర్గానికి పోయేవారూ ఎన్నటికీ ఒకటి కాలేరు. అసలు స్వర్గానికి పోయేవారే కృతార్థులు.

21 ఒకవేళ మేము ఈ ఖుర్ఆన్‌ను ఏ పర్వతంపైనైనా అవతరింపజేస్తే , అది అల్లాహ్ భయంవల్ల క్రుంగిపోయి , బ్రద్దలైపోవటాన్ని నీవు చూస్తావు. ప్రజలు (తమ స్థితిని గురించి) ఆలోచించాలని మేము ఈ దృష్టాంతాలను వారి ముందు ఉంచుతున్నాము.

22 - 24 ఆయనే అల్లాహ్ ఆయన తప్ప ఆరాధ్యుడెవ్వడూ లేడు దృశ్యాదృశ్య విషయాలన్నీ ఎరిగినవాడు. ఆయనే కరుణామయుడు, కృపాశీలుడు. ఆయనే అల్లాహ్, ఆయన తప్ప ఆరాధ్యుడెవ్వడూ లేడు. ఆయన చక్రవర్తి , ఎంతో పరిశుద్ధుడు, సురక్షితుడు, శాంతిప్రదాత, సంరక్షకుడు, సర్వాధికుడు, తన ఉత్తరువులను తిరుగులేని విధంగా అమలుపరచేవాడు, ఎల్లప్పుడూ గొప్ప వాడుగానే ఉండేవాడు. ప్రజలు కల్పించే దైవత్వపు భాగస్వామ్యం వర్తించని పరిశుద్ధుడు అల్లాహ్, సృష్టివ్యూహాన్ని రచించేవాడు, దానిని అమలుపరచేవాడు, ఆపై దాని ప్రకారం రూపకల్పన

చేసేవాడు. ఆయనకు మంచి పేర్లు ఉన్నాయి. ఆకాశాలలోనూ , భూమిలోనూ ఉన్న ప్రతి వస్తువూ ఆయనను స్మరిస్తోంది. ఆయన సర్వాధికుడు, వివేకవంతుడూను.

60. అల్ ముమ్తహినహ్

ఆయతులు : 13 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 3 విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు గనక నా మార్గంలో జిహాద్ చేయటానికీ , నా ప్రసన్నతను పొందటానికీ (స్వస్థలాన్ని విడిచి ఇళ్లనుండి) బయలుదేరినపుడు నాకూ, మీకూ శత్రువులైన వారితో స్నేహం చేయకండి. అసలు మీరు వారితో స్నేహం ఎలా చేస్తారు మీ వద్దకు వచ్చిన సత్యాన్ని వారు విశ్వసించటానికి నిరాకరించారు కదా! కేవలం మీరు మీ ప్రభువైన అల్లాహ్ ను విశ్వసించారనే నేరంపై వారు దైవప్రవక్తనూ , స్వయంగా మిమ్మల్నీ దేశబహిష్కరణకు గురిచేశారు. ఇదీ వారి వైఖరి. ఇలాంటి వారికి మీరు రహస్యంగా స్నేహ సందేశం పంపుతారా ? వాస్తవానికి మీరు రహస్యంగా చేసేది, బహిరంగంగా చేసేది అంతా నాకు బాగా తెలుసు. మీలో అలా ఎవరు చేసినా అతను నిశ్చయంగా ఋజుమార్గం తప్పిపోయినట్లే. వారి వైఖరి ఎలా ఉందంటే ఒకవేళ మీపై అదుపు సాధిస్తే, వారు మీకు విరోధులై పోయి , చేష్టలతో, మాటలతో మిమ్మల్ని వేధిస్తారు. మీరు ఎలాగైనా సరే అవిశ్వాసులై పోవాలని వారు కోరుతున్నారు. ప్రళయం నాడు మీ బంధుత్వాలు గానీ , మీ సంతానం గానీ ఏ విధంగానూ పనికిరావు. ఆ రోజున అల్లాహ్ మీ మధ్య ఎడబాటు కలిగిస్తాడు ఆయనే మీ కర్మలను చూసేవాడు.

4 - 5 ఇబ్రాహీమ్‌లో ఆయన సహచరులలో మీకై ఒక మంచి ఆదర్శం ఉన్నది. వారు తమ జాతివారితో స్పష్టంగా ఇలా అన్నారు , ''మీపట్ల, దేవుణ్ణి వదలి మీరు పూజించే ఇతర దైవాల పట్ల మేము పూర్తిగా విసిగిపోయాము. మేము మిమ్మల్ని తిరస్కరించాము. మీరు ఏకైక ప్రభువైన అల్లాహ్ ను విశ్వసించనంతవరకు మాకూ మీకూ మధ్య విరోధ, విద్వేషాలు ఉండిపోతాయి. అయితే ఇబ్రాహీమ్ తన తండ్రితో ఇలా అనటం , ''నేను మీ మన్నింపుకొరకు తప్పకుండా అల్లాహ్ కు విన్నవిస్తాను. మీ కొరకు అల్లాహ్నుండి మరేదీ పొందే అధికారం నాకు లేదు. '' (ఈ విషయం దీనినుండి మినహాయించబడిరది). (ఇబ్రాహీమ్ మరియు అతని అనుయాయులు ఇలా ప్రార్థించారు) , ''మా ప్రభూ! మేము నిన్నే నమ్ముకున్నాము, నీ వైపునకే మేము మరలాము, నీ సన్నిధికే మేము మరలిరావలసి ఉన్నది. ప్రభూ! మమ్మల్ని అవిశ్వాసుల కొరకు పరీక్షా విషయంగా చేయకు. ప్రభూ! మా తప్పులను మన్నించు , నిస్సందేహంగా నీవే మహాశక్తి సంపన్నుడవు, గొప్ప వివేకవంతుడవూను.''

6 వారి జీవన సరళిలోనే మీకూ , అల్లాహ్నూ అంతిమదినాన్నీ నమ్ముకున్న ప్రతి వ్యక్తికీ గొప్ప ఆదర్శం ఉన్నది. ఎవడైనా దీనికి విముఖుడైతే, అల్లాహ్ ఏ అవసరమూ లేనివాడు, స్వతహాగా ప్రశంసనీయుడు (అని వారు తెలుసు కోవాలి).

7 మీరు ఈనాడు ఎవరితో విరోధం కొని తెచ్చుకున్నారో, వారికీ మీకూ మధ్య ఎప్పుడో ఒకప్పుడు అల్లాహ్, ప్రేమను కలిగించటం అసంభవమేమీ కాదు. అల్లాహ్ సర్వశక్తిమంతుడు ఇంకా ఆయన క్షమించేవాడు కరుణించేవాడూను.

8 - 9 ఎవరైతే ధర్మం విషయంలో మీతో యుద్ధం చేయలేదో , మిమ్మల్ని మీ ఇళ్లనుండి వెళ్లగొట్టలేదో, వారిపట్ల మీరు మంచితనంతో, న్యాయంతో వ్యవహ రించటాన్ని అల్లాహ్ నిరోధించడు. అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు. ఎవరు మీతో ధర్మం విషయంలో యుద్ధం చేశారో , మిమ్మల్ని మీ ఇళ్లనుండి బహిష్కరించారో , మిమ్మల్ని బహిష్కరించటంలో పరస్పరం సహకరించు కున్నారో , వారితో మీరు స్నేహం చేయటాన్ని మాత్రం అల్లాహ్ వారిస్తున్నాడు. అటువంటి వారితో స్నేహం చేసేవారే దుర్మార్గులు.

10 - 11 విశ్వసించిన ప్రజలారా! విశ్వసించిన స్త్రీలు మీ వద్దకు వలసవచ్చి నప్పుడు (వారు విశ్వసించిన వారవునో కాదో ) పరీక్షించి తెలుసుకోండి. వారి విశ్వాసం ఎంత వాస్తవమైనదో అల్లాహ్ యే బాగా ఎరుగును. తరువాత , వారు విశ్వసించినవారే అని మీకు తెలిస్తే , వారిని అవిశ్వాసుల వద్దకు తిప్పి పంపకండి. వారూ అవిశ్వాసులకు ధర్మసమ్మతం కారు , అవిశ్వాసులూ వారికి ధర్మసమ్మతం కారు , అవిశ్వాసులైన వారి భర్తలు వారికిచ్చిన ‘మహర్’ను వారికి తిరిగి ఇచ్చివెయ్యండి. మీరు వారికి ఇవ్వవలసిన మహర్‌ను వారికి ఇచ్చివేస్తే , అప్పుడు మీరు వారిని వివాహమాడటంలో దోషం లేదు. స్వయంగా మీరు కూడ అవిశ్వాసులైన స్త్రీలను మీ వివాహబంధంలో ఆపివుంచకండి. అవిశ్వాసులైన మీ భార్యలకు మీరు ఇచ్చిన మహర్‌ను అడిగి వెనక్కి తీసుకోండి. అలాగే అవిశ్వాసులు విశ్వాసినులైన తమ భార్యలకు ఇచ్చిన మహర్‌ను వారు తిరిగి తీసుకోవచ్చు. ఇది అల్లాహ్ ఆజ్ఞ. ఆయన మీ మధ్య తీర్పు చేస్తున్నాడు. ఆయన సర్వమూ తెలిసినవాడు వివేకవంతుడూను. ఒకవేళ అవిశ్వాసినులైన మీ భార్యల మహర్‌లోని కొంతభాగమేదైనా అవిశ్వాసుల నుండి మీకు తిరిగి లభించకపోతే , తరువాత మీ వంతు వచ్చినప్పుడు , ఎవరి భార్యలైతే ఆ వైపున ఉండిపోయారో , వారికి వారు ఇచ్చి ఉన్నంత మహర్ మొత్తాన్ని చెల్లించండి. మీరు విశ్వసించిన దేవునికి భయపడుతూ ఉండండి.

12 ప్రవక్తా! విశ్వసించిన స్త్రీలు బైత్ చేయటానికి నీ వద్దకు వచ్చి , తాము ఎవరినీ అల్లాహ్ కు సాటిగా నిలబెట్టము అనీ, దొంగతనం చేయము అనీ, వ్యభిచారం చేయము అనీ, తమ సంతానాన్ని హత్యచేయము అనీ , తమ కాళ్లూ చేతుల మధ్య ఏ అపనిందనూ కల్పించి తీసుకురాము అనీ , ధర్మ సమ్మతమైన మంచి విషయాలలో మీకు అవిధేయత చూపము అనీ ప్రమాణం చేస్తే , వారినుండి బైత్ తీసుకో వారిని క్షమించు అని అల్లాహ్ ను ప్రార్థించు. నిశ్చయంగా అల్లాహ్ ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడూను.

13 విశ్వాసులారా! అల్లాహ్ ఆగ్రహానికి గురిఅయిన వారిని స్నేహితులుగా చేసుకోకండి. సమాధులలో పడి ఉన్న అవిశ్వాసులు నిరాశచెందినట్లుగా, వారు పరలోకం పట్ల నిరాశచెందారు.

61. అస్ సఫ్

ఆయతులు : 14 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 ఆకాశాలలోనూ , భూమిలోనూ ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ను స్తుతిస్తోంది. ఆయన ఆధిక్యత కలవాడు , వివేకవంతుడూను.

2 - 4 విశ్వాసులారా! మీరు చేయని విషయాన్ని చేస్తాము అని చెబుతారెం దుకు ? మీరు చేయని దానిని చేస్తాము అని చెప్పటం అల్లాహ్ దృష్టిలో అత్యంత అప్రియమైన విషయం. అసలు అల్లాహ్ కు ఆయన మార్గంలో సీసంతో పోసిన గోడవలె దృఢమైనబారులు తీరి నిలబడి పోరాడే వారంటేనే ఇష్టం.

5 మూసా తన జాతివారితో అన్న ఈ విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో ‘‘ఓ నాజాతి ప్రజలారా! మీరు నన్ను ఎందుకు వేధిస్తున్నారు? నేను మీ వద్దకు అల్లాహ్చే పంపబడిన ప్రవక్తనని మీకు తెలుసుకదా! ’’ ఆ తరువాత వారు వక్రమార్గాన్ని అవలంబించినప్పుడు, అల్లాహ్ కూడా వారి హృదయాలను వక్రీకరించాడు. అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు.

6 ... మర్యమ్ కుమారుడు ఈసా అనిన మాటలను జ్ఞాపకం తెచ్చుకో, ‘‘ఓ ఇస్రాయీల్ సంతతి వారలారా! నేను మీ వద్దకు అల్లాహ్చే పంపబడిన సందేశహరుణ్ణి నాకు పూర్వం వచ్చిన తౌరాత్ గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను నా తరువాత అహ్మద్ అనే ప్రవక్త రాబోతున్నాడు అనే శుభవార్తను అందజేస్తున్నాను.

... 6 - 9 అయితే ఆయన (ముహమ్మద్ - సఅసమ్) వారి వద్దకు స్పష్టమైన సూచనలను తెచ్చినప్పుడు , వారు ఇది పూర్తిగా మోసమే అని అన్నారు , ఇక ఇస్లామ్ (అల్లాహ్ కు తనను తాను సమర్పించుకోవటం) సందేశం అందజేయబడుతున్నప్పటికీ, అల్లాహ్ పై అపనిందలు మోపేవాడి కంటే పరమ దుర్మార్గుడెవడు ? అటువంటి దుర్మార్గులకు అల్లాహ్ సన్మార్గం చూపడు. వారు అల్లాహ్ జ్యోతిని తమ నోటితో ఊది ఆర్పగోరుతున్నారు. కాని అవిశ్వాసు లకు ఎంత అనిష్టంగా ఉన్నాసరే అల్లాహ్ తన జ్యోతిని పూర్తిగా వ్యాపింపజేయ టానికే నిర్ణయించుకున్నాడు. ఆయనే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ , సత్యధర్మాన్నీ ఇచ్చి పంపాడు. దానిని సకల ధర్మాలపై ఆధిక్యం వహించే ధర్మంగా చేయటానికి ఇది బహుదైవారాధకులకు ఎంత అనిష్టమైనాసరే.

10 - 13 విశ్వసించిన ఓ ప్రజలారా! మిమ్మల్ని వ్యధాభరితమైన శిక్ష నుండి రక్షించే వ్యాపారమేమిటో నేను మీకు తెలుపనా? విశ్వసించండి అల్లాహ్ ను , ఆయన ప్రవక్తను పోరాడండి అల్లాహ్ మార్గంలో మీ సంపదలను , మీ ప్రాణాలను ధారపోసి. మీరు గనక గ్రహిస్తే , ఇదే మీకు మేలైనది. అప్పుడు అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు , మిమ్మల్ని సెలయేళ్లు ప్రవహించే వనాలలో ప్రవేశింపజేస్తాడు. అంతేకాదు శాశ్వతమైన ఆ స్వర్గవనాలలో మీకు ఎంతో అందమైన గృహాలను ప్రసాదిస్తాడు. ఇదే గొప్ప సాఫల్యం. మీరు కోరుకుంటున్న ఇతర వస్తువులు కూడా మీకు అనుగ్రహిస్తాడు- అవి అల్లాహ్ నుండి పొందే సహాయం మరియు త్వరలో లభించబోయే విజయం. ఓ ప్రవక్తా! ఈ శుభవార్తను విశ్వాసులకు అందజెయ్యి.

14 విశ్వసించిన ఓ ప్రజలారా! మర్యమ్ కుమారుడు ఈసా , హవారీలతో అన్నట్లు మీరు అల్లాహ్ కు సహాయకులుకండి. వారితో ఈసా ఇలా అన్నాడు , ''అల్లాహ్ వైపునకు (పిలిచే పనిలో) నాకు సహాయపడేవారు ఎవరైనా ఉన్నారా?'' దానికి హవారీలు, ''మేము ఉన్నాము అల్లాహ్ కు సహాయకులం'' అని సమాధానమిచ్చారు. అప్పుడు ఇస్రాయీల్ సంతతిలోని ఒక వర్గం విశ్వ సించింది , మరొక వర్గం తిరస్కరించింది. తరువాత మేము విశ్వసించిన వారిని వారి శత్రువులకు వ్యతిరేకంగా బలపరిచాము. వారే ఆధిక్యం వహించారు.

62. అల్ జుముఅహ్

ఆయతులు : 11 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 ఆకాశాలలోని ప్రతివస్తువూ , భూమిలోని ప్రతి వస్తువూ అల్లాహ్ ను స్తుతి స్తోంది. ఆయన విశ్వసమ్రాట్టు , ఎంతో పరిశుద్ధుడు, అత్యంత శక్తిమంతుడు, వివేకవంతుడు.

2 - 4 ఆయనే నిరక్షరాస్యులలో (ఉమ్మీలు) ఒక ప్రవక్తను స్వయంగా వారి నుండే లేపాడు. ఆ ప్రవక్త వారికి ఆయన వాక్యాలను వినిపిస్తున్నాడు, వారి జీవితాలను తీర్చిదిద్దుతున్నాడు , వారికి గ్రంథాన్నీ , వివేకాన్నీ బోధిస్తున్నాడు. వాస్తవానికి దీనికి పూర్వం వారు పూర్తిగా మార్గం తప్పి ఉన్నారు. ఇంకా వారితో చేరని ఇతరుల కొరకు కూడ (ఈ ప్రవక్త ప్రభవించబడ్డాడు). అల్లాహ్ అత్యంత శక్తిమంతుడు , వివేకవంతుడూను. ఇది ఆయన అనుగ్రహం , తాను కోరినవారికి దానిని ప్రసాదిస్తాడు. ఆయన గొప్ప అనుగ్రహశాలి.

5 తౌరాత్ గ్రంథబాధ్యతా భారం మోపబడినప్పటికీ , దానిని మోయనివారు, పుస్తకాల బరువును మోసే గాడిదను పోలి ఉన్నారు. అల్లాహ్ వాక్యాలను తిరస్కరించిన వారి పోలిక దీనికంటె కూడ ఘోరమైనది. ఇటువంటి దుర్మార్గు లకు అల్లాహ్ సన్మార్గం చూపడు.

6 - 8 వారితో ఇలా అను, ''యూదులై పోయిన ప్రజలారా! ఒకవేళ మిగతా ప్రజలందరికంటే మీరు మాత్రమే అల్లాహ్ కు ప్రియమైనవారు అనే గర్వం మీకు ఉంటే , చావును కోరుకోండి. మీరు పలికే ఈ ప్రగల్భాలు , నిజమేఅయితే, ఈ పని చెయ్యండి.'' కాని వారు తాము చేసుకున్న అకృత్యాల కారణంగా చావును ఎన్నటికీ కోరుకోరు. అల్లాహ్ ఈ దుర్మార్గులను బాగా ఎరుగును. వారికి ఇలా చెప్పు: ''ఏ చావు నుండి మీరు పారిపోతున్నారో , అది మీకు తప్పకుండా వచ్చి తీరుతుంది. ఆ తరువాత మీరు రహస్య విషయాలు , బహిరంగ విషయాలు అన్నింటినీ ఎరిగినవారి ముందు హాజరుపరచబడతారు. అప్పుడు ఆయన మీకు మీరేమేమి చేస్తూ ఉండేనారో అవన్నీ తెలుపుతాడు.''

9 - 10 విశ్వాసులారా! శుక్రవారం నాడు నమాజుకై పిలిచినప్పుడు , అల్లాహ్ సంస్మరణ వైపునకు పరుగెత్తండి క్రయవిక్రయాలను వదలిపెట్టండి. మీరు గ్రహించగలిగితే , ఇదే మీకు అత్యంత శ్రేయస్కరమైనది. ఆపై నమాజు ముగిసిన తరువాత భూమిపై వ్యాపించండి, అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించండి అల్లాహ్ ను అత్యధికంగా స్మరిస్తూ ఉండండి, బహుశా మీకు సాఫల్యభాగ్యం కలుగవచ్చు.

11 వారు, వ్యాపారం, వినోదక్రీడలు జరుగుతూ ఉండగా చూచి, అటువైపు పరుగెత్తారు నిన్ను నిలబడి ఉన్న స్థితిలో వదలివెళ్లారు. వారితో ఇలా అను , ''వినోదక్రీడల కంటే, వ్యాపారం కంటే అల్లాహ్ వద్ద ఉన్నదే శ్రేష్ఠమైనది. అల్లాహ్ అందరికంటే మేలైన ఉపాధిప్రదాత.''

63. అల్ మునాఫిఖూన్

ఆయతులు : 11 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 3 ఓ ప్రవక్తా! ఈ కపటులు నీ వద్దకు వచ్చినప్పుడు , ''మీరు నిశ్చయంగా అల్లాహ్ ప్రవక్తలే అని మేము సాక్ష్యమిస్తున్నాము'' అని అంటారు. అవును, నీవు నిజంగానే ఆయన ప్రవక్తవు అని అల్లాహ్ కు తెలుసు. కాని ఈ కపటులు పచ్చి అసత్యవాదులని అల్లాహ్ సాక్ష్యమిస్తున్నాడు. వారు తమ ప్రమాణాలను డాలుగా చేసుకున్నారు. మరియు ఈ విధంగా వారు అల్లాహ్ మార్గం అవలం బించకుండా స్వయంగానూ ఆగిపోతున్నారు , లోకాన్ని కూడ ఆపుతున్నారు. వారు చేస్తున్న చేష్టలు ఎంత నీచమైనవి. దీనికంతటికీ కారణం , వారు విశ్వసిం చిన తరువాత తిరస్కరించటమే. అందుకని వారి హృదయాలపై ముద్రవేయ బడిరది ఇక వారు దేనినీ అర్థం చేసుకోరు.

4 వారిని చూస్తే , వారి రూపాలు నీకు ఎంతో అద్భుతంగా ఉన్నట్లు కనిపిస్తాయి. వారు మాట్లాడితే నీవు వారి మాటలను వింటూనే ఉండిపోతావు. కాని వారసలు గోడకు ఆనించబడిన కొయ్యదుంగల వంటివారు. ప్రతి

అరుపును వారు తమకు వ్యతిరేకమైనదిగా భావిస్తారు. వారు ఆగర్భశత్రువులు , వారికి దూరంగా ఉండండి. అల్లాహ్ వారిని నాశనం చేయుగాక! వారు ఎలా పెడమార్గం వైపునకు మరలించబడుతున్నారు!

5 - 6 వారితో , ''రండి, అల్లాహ్ ప్రవక్త మీకొరకు మన్నింపు ప్రార్థన చేస్తాడు '' అని పిలిచినప్పుడు , వారు తల విదిలిస్తారు. వారు పొగరుబోతుతనంతో రాకుండా ఆగిపోవటాన్ని నీవు చూస్తావు. ఓ ప్రవక్తా! నీవు వారి కొరకు మన్నింపు ప్రార్థన చేసినా , చేయకపోయినా, వారి విషయంలో ఒక్కటే అల్లాహ్ వారిని ఎంతమాత్రం మన్నించడు. అల్లాహ్ దుర్మార్గులకు ఎన్నటికీ సన్మార్గం చూపడు.

7 - 8 వారే ఇలా అనేది ''ప్రవక్త అనుచరులకోసం ఖర్చుపెట్టటం ఆపెయ్యండి అప్పుడు వారు చెల్లాచెదరైపోతారు ''. వాస్తవానికి భూమిలో, ఆకాశాలలో ఉన్న నిధులకు యజమాని అల్లాహ్ యే. కాని ఈ కపటులు గ్రహించరు. వారు ఇంకా ఇలా అంటారు , ''మనం మదీనా నగరానికి తిరిగి వెళ్లిన తరు వాత , మనలోని గౌరవనీయులు నీచులను అక్కణ్ణించి వెళ్లగొట్టాలి. '' వాస్తవానికి గౌరవం అనేది అల్లాహ్ కు , ఆయన ప్రవక్తకు , విశ్వాసులకు మాత్రమే చెల్లుతుంది. కాని ఈ కపటులు అది ఎరుగరు.

9 - 11 విశ్వాసులారా! మీ సిరిసంపదలూ , మీ సంతానమూ మిమ్మల్ని అల్లాహ్ సంస్మరణ నుండి మరల్చరాదు. ఎవరైతే ఇలా మరల్చబడతారో వారే నష్టానికి గురి అయ్యేవారు. మీలో ఎవరికైనా మరణ సమయం సమీ పించి , అతను, ''ఓ నా ప్రభూ! నీవు నాకు మరికొంత వ్యవధి ఎందుకివ్వలేదు నేను దానధర్మాలు చేసి సజ్జనులలో కలిసిపోయేవాణ్ణి కదా?'' అని వాపోయే పరిస్థితి రాకముందే మేము మీకు ఇచ్చిన ఉపాధినుండి ఖర్చుపెట్టండి. కాని ఎవరి ఆచరణ వ్యవధి అయినా ముగిసిపోయే సమయం ఆసన్నమైనప్పుడు , అల్లాహ్ ఇక అతనికి ఎంతమాత్రం అదనపు వ్యవధి ఇవ్వడు. మీరు చేస్తున్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

64. అత్ తగాబున్

ఆయతులు : 18 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 4 ఆకాశాలలో ఉన్న ప్రతివస్తువూ , భూమిలో ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ను స్తుతిస్తోంది. విశ్వ సామ్రాజ్యాధిపత్యమూ ఆయనదే , స్తోత్రమూ ఆయనకే. ఆయనకు ప్రతి వస్తువుపై అధికారం ఉన్నది. ఆయనే మిమ్మల్ని సృష్టించాడు, అయినా మీలో కొందరు అవిశ్వాసులుగానూ , మరికొందరు విశ్వాసులుగానూ ఉన్నారు. అల్లాహ్ మీరు చేస్తున్నదంతా చూస్తున్నాడు. ఆయన భూమినీ, ఆకాశాలనూ సత్యం ఆధారంగా సృష్టించాడు, మీకు ఒక రూపాన్ని కల్పించాడు, దానిని చాలా అందంగా రూపొందించాడు. చివరకు మీరు ఆయన వైపునకే మరలవలసి

ఉన్నది. భూమిలోనూ, ఆకాశాల్లోనూ ఉన్న ప్రతి  వస్తువును  గురించి  ఆయనకు తెలుసు. మీరు దాచేదీ , మీరు వెల్లడిచేసేదీ, అంతా ఆయనకు తెలుసు. ఆయన హృదయాల స్థితిని సైతం ఎరుగును.

5 - 6 పూర్వం సత్యాన్ని తిరస్కరించి , తమ కర్మల దుష్ఫలితాలను చవిచూసిన వారి వృత్తాంతం నీకు చేరలేదా ? ముున్ముందు వారి కొరకు బాధాకరమైన శిక్ష ఉన్నది. ఈ పర్యవసానానికి వారు అర్హులు కావటానికి కారణం ఏమిటంటే  వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన ప్రమాణాలనూ  , సూచనలనూ తీసుకుని వచ్చినప్పటికీ, వారు, ''మానవులు మాకు మార్గదర్శకత్వం ఇవ్వగలరా   ?''  అని అన్నారు. ఈ విధంగా వారు విశ్వసించకుండా తిరస్కరించారు,  తమ ముఖాలను తిప్పుకున్నారు. అప్పుడు అల్లాహ్ కూడ వారిని నిర్లక్ష్యం చేశాడు. అసలు అల్లాహ్ ఎవరి అవసరమూ లేనివాడు, తనకు తానే స్తోత్రానికి అర్హుడు.

7 అవిశ్వాసులు తాము మరణించిన పిదప మళ్ళీ లేపబడటం అనేది ఎంత మాత్రం జరగదు అని పెద్ద సవాలు విసిరారు. వారితో ఇలా అను , ''కాదు, నా ప్రభువు సాక్షిగా! మీరు తప్పకుండా లేపబడతారు. తరువాత  , మీరు (ప్రపంచంలో) ఏమేమి చేశారో అదంతా మీకు తప్పకుండా తెలియజేయటం జరుగుతుంది. ఇలా చేయటం అల్లాహ్ కు చాల సులభం.''

8 - 10 కనుక అల్లాహ్నూ, ఆయన ప్రవక్తనూ, మేము అవతరింపజేసిన కాంతినీ విశ్వసించండి.  మీరు  చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు. సమావేశపు రోజున ఆయన మీ అందరినీ సమీకరిస్తాడు. (ఆ రోజున మీకు ఈ సంగతి తెలిసిపోతుంది). అది ప్రజల మధ్య పరస్పర జయాపజయముల రోజు అవుతుంది. ఎవడైతే అల్లాహ్ ను విశ్వసించి, సత్కార్యాలు చేస్తాడో, అల్లాహ్ అతని పాపాలను ప్రక్షాళన చేస్తాడు  , అతనిని సెలయేళ్లు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. వారు శాశ్వతంగా వాటిలోనే ఉంటారు. ఇదే గొప్ప విజయం. ఇక ఎవరు తిరస్కరించారో   , మా ఆయతులను తృణీకరిం చారో, వారు నరకవాసులవుతారు. అందులోనే వారు శాశ్వతంగా ఉంటారు  అది బహుచెడ్డ నివాసం.

11 - 13 ఏ ఆపద అయినా అల్లాహ్ అనుమతి లేనిదే ఎన్నటికీ రాదు. ఎవడు అల్లాహ్ ను విశ్వసిస్తాడో   , అల్లాహ్ అతని హృదయానికి మార్గదర్శకత్వం ప్రసాదిస్తాడు.  అల్లాహ్ కు  ప్రతి వస్తువును గురించీ తెలుసు. అల్లాహ్ కు విధేయత చూపండి, ప్రవక్తకు విధేయత చూపండి. కాని ఒకవేళ మీరు విధేయతకు విముఖులైతే , (తెలుసుకోండి) మా ప్రవక్తపై సత్యాన్ని స్పష్టంగా అందజేసే బాధ్యత తప్ప మరొకటి ఏదీ లేదు. ఆయన అల్లాహ్  ఆయన తప్ప మరొక దేవుడు లేడు. కనుక విశ్వాసులు అల్లాహ్ పైనే ఆధారపడాలి.

14 - 18 విశ్వాసులారా! మీ భార్యలలో  , మీ సంతానంలో కొందరు మీకు శత్రువులు   వారి  విషయంలో అప్రమత్తంగా ఉండండి. ఒకవేళ మీరు ఉపేక్షించి  , మన్నిస్తే అల్లాహ్ క్షమించేవాడు , కరుణించేవాడూను. మీ సిరి

సంపదలూ, మీ సంతానమూ మీకొక పరీక్ష. అల్లాహ్ వద్దనే గొప్ప ప్రతిఫలం ఉంది. కనుక మీకు సాధ్యమైనంతవరకు అల్లాహ్ కు భయపడుతూ ఉండండి. వినండి , విధేయత చూపండి మీ సంపదను ఖర్చుపెట్టండి. ఇది మీకే శ్రేయస్కరం. తమ హృదయలోభత్వం నుండి రక్షణ పొందినవారే సాఫల్యం పొందేవారు. మీరు గనక అల్లాహ్ కు మంచి రుణాన్ని ఇస్తే, ఆయన మీకు దానిని ఎన్నోరెట్లు పెంచి తిరిగి ఇస్తాడు మీ పొరపాట్లను మన్నిస్తాడు. అల్లాహ్ ఎంతో విలువనిచ్చేవాడు, సౌమ్యుడూను గోచర అగోచరాలను ఎరిగినవాడూ, శక్తి సంపన్నుడు, మహా వివేకవంతుడూను.

## 65 అత్ తలాఖ్

ఆయతులు : 12 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 2 ... ఓ ప్రవక్తా! మీరు గనక స్త్రీలకు విడాకులివ్వవలసి వస్తే, వారి నిర్ణీత గడువు (ఇద్దత్) కొరకు విడాకులివ్వండి, మరియు నిర్ణీత గడువు కాలాన్ని కచ్చితంగా లెక్కపెట్టండి మీ ప్రభువైన అల్లాహ్ కు భయపడండి. (ఆ గడువు కాలంలో) వారేదైనా స్పష్టమైన చెడుకు పాల్పడితే తప్ప, మీరూ వారిని వారి ఇళ్లనుండి వెళ్లగొట్టకూడదు, స్వయంగా వారు కూడ పోకూడదు. ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. ఎవడు అల్లాహ్ నిర్ణయించిన హద్దులను అతిక్రమిస్తాడో, అతడు స్వయంగా తనకు తానే అన్యాయం చేసుకుంటాడు. మీకు తెలియదు , బహుశా దీని తరువాత అల్లాహ్ ఏదైనా అనుకూల మార్గం చూపించవచ్చు. తరువాత వారి నిర్ణీత గడువు కాలం ముగిసినప్పుడు వారిని ఉత్తమమైన రీతిలో (మీ వివాహబంధంలో) ఆపి వుంచండి లేదా ఉత్తమమైన రీతిలో వారి నుంచి విడిపొండి. మీలో న్యాయశీలురైన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా పెట్టుకోండి. (ఓ సాక్షులారా) అల్లాహ్ కొరకు ఉన్నది ఉన్నట్లుగా సాక్ష్యం చెప్పండి.

... 2 - 3 అల్లాహ్ ను , అంతిమ దినాన్ని విశ్వసిస్తున్న ప్రతివానికి ఈ విషయాలు బోధించబడుతున్నాయి. ఎవడు అల్లాహ్ కు భయపడుతూ పనిచేస్తాడో , అతనికి అల్లాహ్ కష్టాల నుండి గట్టెక్కే మార్గం చూపుతాడు. ఇంకా అతని ఊహకు కూడ అందనటువంటి మార్గం ద్వారా , అతనికి ఉపాధి ప్రసాదిస్తాడు. అల్లాహ్ ను నమ్ముకున్నవానికి అల్లాహ్ యే చాలు. అల్లాహ్ తన పనిని పూర్తి చేసి తీరుతాడు. అల్లాహ్ ప్రతిదానికి ఒక విధి నిర్ణయించి ఉంచాడు.

4 - 5 మీ స్త్రీలలో ఎవరైనా ఋతుక్రమం విషయంలో ఆశ వదలుకుంటే వారి విషయంలో మీకేదైనా అనుమానం కలిగితే, అప్పుడు వారి నిర్ణీత గడువు మూడు మాసాలు (అని మీరు తెలుసుకోండి). ఇదే ఆజ్ఞ ఇంకా ఋతుక్రమం ప్రారంభం కాని వారికి కూడ వర్తిస్తుంది. గర్భిణీ స్త్రీల నిర్ణీత గడువు వారి కాన్పు అయ్యేవరకు ఉంటుంది. ఎవడు అల్లాహ్ కు భయ పడతాడో , అతని వ్యవహారంలో అల్లాహ్ సౌలభ్యం కలుగజేస్తాడు. ఇది అల్లాహ్ ఆజ్ఞ , దానిని

ఆయన మీపై అవతరింపజేశాడు. ఎవడు అల్లాహ్ కు భయ పడతాడో , అల్లాహ్ అతని పాపాలను అతని నుండి దూరం చేస్తాడు అతనికి గొప్ప ప్రతిఫలం ఇస్తాడు.

6 ... వారిని (నిర్ణీత గడువు కాలంలో) మీరు నివసించే చోటనే ఉంచండి, మీకు ఎలాంటి చోటు లభించినా సరే. వారిని ఇబ్బందులపాలు చేయటానికి వేధించకండి.

... 6 - 7 ఒకవేళ వారు గర్భవతులైతే, వారు ప్రసవించే వరకు వారి కోసం ఖర్చుచేస్తూ ఉండండి. తరువాత ఒకవేళ వారు మీకోసం (బిడ్డకు) పాలుపట్టే పక్షంలో , వారి ప్రతిఫలం వారికి ఇవ్వండి. ఉత్తమ రీతిలో (ప్రతిఫలం వ్యవహారాన్ని ) పరస్పర సంప్రదింపుల ద్వారా నిర్ణయించుకోండి. కాని ఒకవేళ మీరు (ప్రతిఫల నిర్ణయంలో) ఒకరినొకరు ఇబ్బందుల పాల్జేసుకుంటే , బిడ్డకు మరొక స్త్రీ ఎవరైనా పాలుపట్టాలి. సంపన్నుడైన వ్యక్తి తన ఆర్థిక స్తోమతను బట్టి ఖర్చుపెట్టాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడిన వ్యక్తి, అల్లాహ్ తనకు ఇచ్చిన ధనం నుండే ఖర్చుపెట్టాలి. అల్లాహ్ ఎవరికి ఎంత ఇచ్చాడో , దానికి మించి ఆయన అతనిపై భారం వేయడు. అల్లాహ్ , పేదరికం తరువాత సంపన్న స్థితిని ప్రసాదించకపోడు.

8 - 11 ఎన్నో పట్టణాలు తమ ప్రభువు ఆజ్ఞలను, ఆయన ప్రవక్తల ఆజ్ఞలను ధిక్కరించాయి. అప్పుడు మేము వాటి ప్రజల నుండి కఠినంగా లెక్కతీసుకుని, వారిని తీవ్రంగా శిక్షించాము. వారు తాము చేసిన కర్మలను రుచి చూశారు. వారి పర్యవసానం అంతా నష్టమే. అల్లాహ్ (పరలోకంలో) వారి కొరకు కఠిన శిక్షను సిద్ధపరచి ఉంచాడు. కనుక విశ్వాసులైన బుద్ధిమంతులారా! అల్లాహ్ కు భయపడండి. అల్లాహ్ మీ వద్దకు ఒక హితబోధను పంపాడు , ఒక ప్రవక్తను పంపాడు, అతను మీకు స్పష్టమైన మార్గం చూపే అల్లాహ్ ఆయతులను వినిపిస్తున్నాడు , విశ్వసించి, సత్కార్యాలు చేసే వారిని చీకట్ల నుంచి వెలుగులోకి తీసుకురావటానికి. అల్లాహ్ ను విశ్వసించి మంచి పనులు చేసేవాణ్ణి అల్లాహ్ సెలయేళ్లు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. వారు అక్కడ కలకాలం ఉంటారు. అల్లాహ్ అటువంటి వ్యక్తి కొరకు మంచి ఉపాధిని ఉంచాడు.

12 సప్తాకాశాలనూ , అలాంటివే ఎన్నో భూమండలాలనూ సృజించినవాడు అల్లాహ్ యే. వాటిపై అల్లాహ్ ఆజ్ఞ అవతరిస్తూ ఉంటుంది. అల్లాహ్ ప్రతి వస్తువుపై అధికారం కలిగి ఉన్నాడనీ , అల్లాహ్ జ్ఞానం ప్రతి వస్తువును పరివేష్టించి ఉన్నదనీ మీరు తెలుసుకోవటానికి (ఈ విషయం మీకు తెలియజేయబడుతోంది).

66. అత్ తహ్రీమ్

ఆయతులు : 12 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 2 ఓ ప్రవక్తా! అల్లాహ్ నీ కొరకు ధర్మసమ్మతం చేసిన దానిని నీవు ఎందుకు నిషేధించు కుంటున్నావు ? (ఈ విధంగా) నీవు నీ భార్యల సంతోషం పొందగోరుతున్నావా? - అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను. అల్లాహ్ నీ కొరకు నీ ప్రమాణాలు పాటింపు నుండి బయటపడే పద్ధతిని నిర్ణయించాడు. అల్లాహ్ మీ యజమాని, ఆయనే అన్నీ తెలిసినవాడు, వివేచనాపరుడూను.

3 (ఈ క్రింది వ్యవహారం కూడ గమనించదగిందే) ప్రవక్త ఒక విషయాన్ని తన భార్యలలో ఒకామెకు రహస్యంగా చెప్పాడు. తరువాత ఆమె (మరొకరికి) ఆ రహస్యాన్ని వెల్లడిరచింది. ప్రవక్తకు అల్లాహ్ ఆ విషయాన్ని (ఆ రహస్యం బయటపడిరదన్న సంగతిని) తెలియజేశాడు. అప్పుడు ప్రవక్త ఆ విషయాన్ని కొంత (ఆమెకు) తెలియజేసి , కొంత తెలియజేయలేదు. ఆ తరువాత ప్రవక్త ఆమెతో (రహస్యం బయటపడిన ఈ సంగతి) ఈ విషయం ప్రస్తావించినప్పుడు ఆమె ''మీకీ విషయం ఎవరు తెలియ జేశారు ?'' అని అడిగింది. అప్పుడు ప్రవక్త , ''నాకీ విషయాన్ని అన్నీ తెలిసినవాడు, బాగా ఎరిగినవాడు తెలియ జేశాడు'' అని చెప్పారు.

4 - 5 మీరు ఉభయులు పశ్చాత్తాపపడితే (అది మీకే శ్రేయస్కరం). ఎందు కంటే , మీ హృదయాలు ఋజుమార్గం నుండి తొలగిపోయాయి. ఒకవేళ ప్రవక్తకు వ్యతిరేకంగా మీరు ముఠా కట్టితే , తెలుసుకోండి, అల్లాహ్ ఆయన యజమాని. ఇంకా జిబ్రీలు , సజ్జనులైన విశ్వాసులందరూ , దైవదూతలందరూ ఆయన సహచరులు , సహాయకులూను. ఒకవేళ మీ అందరికీ ప్రవక్త విడాకు లిస్తే, అల్లాహ్ మీకు బదులుగా ఆయనకు మీ కంటె మంచి భార్యలను ప్రసాదిస్తాడు వారు నిజమైన ముస్లిమ్‌లుగా , విశ్వాసం కలవారుగా , విధేయత చూపేవారుగా , పశ్చాత్తాపపడేవారుగా, ఆరాధన చేసేవారుగా, ఉపవాసం పాటించేవారుగా ఉంటారు , వారు భర్తృవిహీనులైనా లేదా కన్యలైనా కావచ్చు.

6 - 7 విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ , మీ కుంటుంబ సభ్యులనూ మానవులు , రాళ్లు ఇంధనం కాబోయే అగ్ని నుండి కాపాడుకోండి. దానిపై ఎంతో బలిష్ఠులు, అత్యంత కఠినులు అయిన దైవ దూతలు నియమించబడి ఉంటారు వారు ఎన్నటికీ అల్లాహ్ ఆజ్ఞను ఉల్లంఘించరు, వారు తమకు ఏ ఆజ్ఞ ఇచ్చినా, దానిని పాటిస్తారు. (అప్పుడు ఇలా అనటం జరుగుతుంది) , ''అవిశ్వాసులారా! ఈనాడు సాకులు చెప్పకండి , మీరు చేస్తూ ఉండిన చేతలకు తగినట్టుగానే మీకు ప్రతిఫలం ఇవ్వబడుతుంది.''

8 విశ్వాసులారా! చిత్తశుద్ధితో కూడిన పశ్చాత్తాపంతో అల్లాహ్ వైపునకు మరలండి, అప్పుడు అల్లాహ్ మీ చెడులను మీ నుండి దూరం చేసి , మిమ్మల్ని సెలయేళ్లు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేయవచ్చు. అల్లాహ్ తన ప్రవక్తలనూ ఆయనతో పాటు విశ్వసించిన వారినీ అవమానం పాలు చేయని రోజు అదే. వారి కాంతి వారికి అగ్రభాగంలో, వారికి కుడివైపుగా పరుగెత్తుతూ ఉంటుంది. అప్పుడు వారు ఇలా అంటారు , ''ప్రభూ! మా కాంతిని మా కొరకు పరిపూర్ణం చెయ్యి మమ్మల్ని మన్నించు. నీవు ప్రతి దానిపై అధికారం కలవాడవు.''

9 ఓ ప్రవక్తా! అవిశ్వాసులతో , కపటులతో పోరాడు , వారి పట్ల కఠినంగా వ్యవహరించు , వారి నివాసం నరకమవుతుంది, అది అతి చెడ్డనివాసం.

10 - 12 అల్లాహ్ అవిశ్వాసుల విషయంలో, ప్రవక్త నూహ్, ప్రవక్త లూత్‌ల భార్యలను ఉదాహరణగా పేర్కొంటున్నాడు. వారు సజ్జనులైన మా ఇద్దరు దాసుల వివాహబంధంలో ఉండేవారు. కాని వారు తమ భర్తలకు ద్రోహం చేశారు. వారు అల్లాహ్ కు ప్రతిగా ఆ స్త్రీలకు ఏమాత్రం ఉపయోగపడలేక పోయారు. వారిద్దరితో , ''వెళ్లండి, అగ్నిలోకి వెళ్ళే వారితోపాటు మీరూ వెళ్లండి '' అని చెప్పబడిరది. విశ్వాసుల విషయంలో అల్లాహ్ ఫిరౌన్ భార్యను ఉదాహరణగా పేర్కొంటున్నాడు. అప్పుడు ఆమె ఇలా ప్రార్థించారు, ''ప్రభూ! నా కొరకు నీ వద్ద స్వర్గంలో ఒక గృహాన్ని నిర్మించు. నన్ను ఫిరౌన్ నుండీ , అతని చేష్టల నుండీ కాపాడు , దుర్మార్గపు జాతినుండి నాకు విముక్తి కలిగించు. '' ఇంకా ఇమ్రాన్ కుమార్తె మర్యమ్‌ను కూడ ఉదాహరణగా పేర్కొంటున్నాడు: ఆమె తన మానాన్ని కాపాడు కున్నారు. ఆ తరువాత మేము ఆమెలోకి మా తరఫు నుండి ఆత్మను ఊదాము. ఆమె తన ప్రభువు సూక్తులను , ఆయన గ్రంథాలను ధ్రువపరచారు. ఆమె వినయవిధేయతలు గల వారిలో ఒకరు.

## 67. అల్ ముల్క్

ఆయతులు : 30 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 4 ఎవరి చేతులలో విశ్వసామ్రాజ్యం ఉన్నదో , ఆయన ఎంతో శుభకరుడు, ఎంతో మహోన్నతుడు. ఆయన ప్రతి దానిపై అధికారం కలిగి ఉన్నాడు. మీలో మంచి పనులు చేసేవారెవరో పరీక్షించి చూద్దామని ఆయన చావు బ్రతుకులను సృష్టించాడు. ఆయన అత్యంత శక్తిసంపన్నుడు, అత్యధికంగా మన్నించేవాడూను. ఆయన ఒక దానిపై నొకటి ఏడు ఆకాశాలను సృజించాడు. నీవు కరుణామయుని సృష్టిలో ఎలాంటి క్రమరాహిత్యాన్నీ చూడలేవు. కావాలంటే మరొకసారి చూడు , అందులో నీకేమైనా లోపం కనిపిస్తున్నదా ? మళ్లీ మళ్లీ చూడు , నీ చూపులు అలసిపోయి విఫలమై వెనుకకు తిరిగి వస్తాయి.

5 మేము మీకు దగ్గరగా ఉన్న ఆకాశాన్ని మహోజ్వలమైన దీపాలతో అలంకరిం చాము , వాటిని, షైతానులను తరిమికొట్టే సాధనాలుగా చేశాము. ఈ షైతానుల కొరకు మేము మండే అగ్నిని సిద్ధం చేసి ఉంచాము.

6 - 11 తమ ప్రభువును తిరస్కరించిన ప్రజలకు నరక శిక్ష పడుతుంది : అది చాలా చెడ్డ నివాస స్థలం. వారిని అందులోకి విసిరివేసినప్పుడు, వారికి భయంకరమైన దాని గర్జన ధ్వని వినిపిస్తుంది. అది అప్పుడు ఉద్రేకంతో ఉడికిపోతూ ఉంటుంది , తీవ్రమైన ఆగ్రహంతో బ్రద్దలవుతూ ఉంటుంది. ఏదైనా ఒక గుంపును అందులో వేసిన

ప్రతిసారీ, దాని కాపలాదారులు, ‘‘మీ వద్దకు హెచ్చరించేవారు రాలేదా ?’’ అని వారిని అడుగుతారు. దానికి వారు ఇలా జవాబు ఇస్తారు , ‘‘వచ్చాడు, హెచ్చరిక చేసే అతను మా వద్దకు వచ్చాడు. కాని మేము అతనిని తిరస్కరించాము. అల్లాహ్ దేన్నీ అవతరింప జేయలేదు , నీవు మార్గభ్రష్టుడవైపోయావు అని మేము అతనితో అన్నాము.’’ ఇంకా వారు ఇలా అంటారు , ‘‘అయ్యో! మేము గనక (ఆనాడు) విని ఉంటే , లేదా గ్రహించి ఉంటే , ఈనాడు ఇలా మండే నరకాగ్ని శిక్షకు గురిఅయిన వారిలో చేరి ఉండేవారము కాదుకదా! ’’ ఈ విధంగా వారే స్వయంగా తమ తప్పును ఒప్పుకుంటారు. ఈ నరకవాసులు నాశనమైపోను!

12 - 14 చూడకుండానే తమ ప్రభువుకు భయపడేవారికి , తప్పకుండా మన్నింపు, గొప్ప ప్రతిఫలం లభిస్తాయి. మీరు మెల్లగా మాట్లాడినా లేక బిగ్గరగా పలికినా (అల్లాహ్ కు రెండూ ఒకటే). ఆయన హృదయాల స్థితిని సైతం ఎరుగును. పుట్టించిన వాడికే తెలియదా ? వాస్తవానికి ఆయన సూక్ష్మ గ్రాహి మరియు సమస్తమూ తెలిసినవాడూను.

15 - 23 భూమిని మీ అధీనంలో ఉంచినవాడు ఆయనే, కనుక దానిమీద తిరగండి, దేవుడు ప్రసాదించిన ఆహారాన్ని తినండి. ఆయన సాన్నిధ్యానికే మీరు మళ్ళీ సజీవులై పోవలసి ఉంది. ఆకాశంలో ఉన్నవాడు మిమ్మల్ని భూమి లోకి దిగద్రొక్కడని , భూమి హఠాత్తుగా తీవ్ర కంపనాలకు గురికాదని మీరు నిర్భయంగా ఉన్నారా ? ఆకాశంలో ఉన్నవాడు మీపైకి రాళ్లను విసిరే పెనుగాలిని పంపడని మీరు నిర్భయంగా ఉన్నారా? అప్పుడు నా హెచ్చరిక ఎలా ఉంటుందో మీకు తెలిసిపోతుంది. వారికి పూర్వం గతించినవారు కూడ తిరస్కరించారు అప్పుడు నా పట్టు ఎంత తీవ్రంగా ఉండినదో చూడండి. వారు తమ మీద ఎగిరే పక్షులు రెక్కలను ఎలా చాపుతూ ముడుచుకుంటూ ఎగురుతున్నాయో చూడటం లేదా? కరుణామయుడైన అల్లాహ్ తప్ప వాటిని అలా నిలిపి ఉంచేవారెవ్వరూ లేరు. ఆయనే ప్రతి వస్తువును కనిపెట్టి ఉండే వాడు. కరుణామయుడైన అల్లాహ్ కు ప్రతికూలంగా మీకు సహాయం చేయగల సైన్యమేదైనా మీ వద్ద ఉన్నదా ? చూపించండి? అసలు విషయం ఏమిటంటే, ఈ తిరస్కారులు మోసంలో పడిపోయారు. లేదా ఒకవేళ కరుణామయుడైన అల్లాహ్ తాను ప్రసాదించే ఆహారాన్ని ఆపివేసినట్లయితే , ఇంకెవరు మీకు ఆహారమివ్వగలరు? చెప్పండి? వారసలు తలబిరుసుతనానికీ, సత్య తిరస్కా రానికీ, మూర్ఖంగా అంటిపెట్టుకొని ఉన్నారు. బోర్లాపడుతూ లేస్తూ నడిచే వ్యక్తి సరైన గమ్యానికి చేరుకుంటాడా లేక చదునైన బాటపై తలెత్తి నిటారుగా నడిచే వ్యక్తి గమ్యానికి చేరుకుంటాడా ? కాస్త ఆలోచించండి. వారితో ఇలా అనండి , ‘‘మిమ్మల్ని పుట్టించిన వాడు అల్లాహ్ యే ఆయనే మీకు వినే , చూసే శక్తులు ఇచ్చాడు. ఇంకా ఆయనే మీకు ఆలోచించే , అర్థం చేసుకునే మనస్సు కూడ ఇచ్చాడు. కాని మీరు చాల తక్కువగా కృతజ్ఞతలు తెలుపుతారు.

24 - 27 వారితో ఇలా అను , ‘‘అల్లాహ్ యే మిమ్మల్ని యావద్భూమిపై వ్యాపింపజేశాడు. ఆయన వైపునకే మీరు సమీకరింపబడతారు.’’ అప్పుడు వారు , ‘‘నీవు గనక సత్యవంతుడవే అయితే , ఈ వాగ్దానం ఎప్పుడు నెరవేరు

తుందో చెప్పు'' అని అడుగుతారు. ఇలా చెప్పు,''దీనికి సంబంధించిన జ్ఞానం అల్లాహ్ వద్దనే ఉంది. నేను స్పష్టంగా హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే. '' తరువాత (వారు) దానిని సమీపంలో ఉండటం చూసినప్పుడు , తిరస్కరించిన వారందరి ముఖాలు వెల వెల బోతాయి. అప్పుడు వారితో , ''మీరు మాటిమాటికి అడుగు తుండేది ఇదే '' అని అనటం జరుగుతుంది.

28 - 30 వీరితో ఇలా చెప్పు , ''మీరెప్పుడైనా ఈ విషయం గురించి ఆలోచిం చారా ? అల్లాహ్ నన్నూ , నా అనుచరులనూ నాశనం చేయనూవచ్చు లేదా మమ్మల్ని కరుణించనూవచ్చు. కాని తిరస్కారులను వ్యధాభరితమైన శిక్ష నుండి ఎవరు రక్షిస్తారు ? వారితో ఇంకా ఇలా అను , ''ఆయన ఎంతో కరుణా మయుడు. ఆయననే మేము విశ్వసించాము ఆయననే మేము నమ్ము కున్నాము. ఎవరు పూర్తిగా మార్గభ్రష్టులై ఉన్నారో , త్వరలోనే మీకు తెలిసి పోతుంది. '' వీరికి ఇలా చెప్పు , ''ఎప్పుడైనా మీరు ఈ విషయం గురించి కూడా ఆలోచించారా? ఒకవేళ మీ బావులలోని నీరు భూమిలోపలకు ఇంకి పోతే , ప్రవహించే ఈ నీటి ఊటలను మళ్లీ మీ కోసం బయటకు తెచ్చేదెవరు?''

68. అల్ ఖలమ్

ఆయతులు : 52 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 16 నూన్. కలం సాక్షిగా , లేఖకులు లిఖించే దాని సాక్షిగా నీవు నీ ప్రభువు దయవల్ల పిచ్చివాడవు కావు. నిశ్చయంగా నీకు ఎన్నటికీ తరగిపోని ప్రతిఫలం లభిస్తుంది. నీవు నిస్సందేహంగా మహోన్నతమైన శీలం కలవాడవు. మీలో ఎవరు ఉన్మాదానికి లోనయ్యారో త్వరలోనే నీవూ చూస్తావు , వారూ చూస్తారు. నీ ప్రభువుకు , తన మార్గం నుండి తప్పిపోయిన వారెవరో బాగా తెలుసు , ఋజుమార్గంపై ఉన్నవారెవరో కూడ ఆయనకు బాగా తెలుసు. కనుక నీవు ఈ సత్యతిరస్కారుల ఒత్తిడికి ఏమాత్రం తల ఒగ్గకు. నీవు గనక రాజీపడితే , వారు కూడా రాజీపడదామని అనుకుంటున్నారు. చీటికీ మాటికీ ఒట్టువేసే నీచుడికి ఏమాత్రం లొంగకు.వాడు ఎత్తిపొడుస్తూ ఉంటాడు, చాడీలు చెబుతూ తిరుగుతూ ఉంటాడు , మంచిని నిరోధిస్తూ ఉంటాడు , దౌర్జన్యం చెయ్యటంలోనూ , అత్యాచారం చెయ్యటంలోనూ హద్దులు మీరుతూ ఉంటాడు , పరమపాతకుడు, మిక్కిలి క్రూరుడు. ఈ లోపాలన్నింటితో పాటు వాడు హీన జన్ముడు కూడ. దీనంతటికీ కారణం వాడు అత్యధికంగా సిరిసంపదలూ , సంతానమూ కలిగి ఉండటమే. మా ఆయతులు అతడికి వినిపించినప్పుడు, ఇవి పూర్వకాలం నాటి కట్టుకథలే కదా అని అంటాడు. అతి త్వరలోనే మేము అతడి మూతి మీద వాతలు పెడతాము.

17 - 33 మేము ఒక తోట యజమానులను పరీక్షకు గురిచేసిన విధంగానే వారిని (మక్కావాసులను) కూడ పరీక్షకు గురిచేశాము. ఆ తోట యజమానులు , ''రేపు ఉదయం పెందలకడనే మేము వెళ్లి మా తోటలోని పండ్లు తప్పకుండా కోస్తాము '' అని ప్రమాణం చేసి మరీ అన్నారు. వారు ఎలాంటి మినహాయిం పులకూ (భయసందేహాలకూ) తావీయలేదు. ఆ (రోజు) రాత్రి, వారు ఆదమరచి నిద్రపోతూ ఉండగా, నీ ప్రభువు నుండి ఒక ఆపదవచ్చి ఆ తోటపై విరుచుకు పండిరది. అప్పుడు దాని స్థితి పంట కోసివేసిన తోటమాదిరిగా అయి పోయింది. మరునాడు ఉదయం వారు లేచి , ''పండ్లు కోయదలచుకుంటే , ఉదయాన్నే మనం పొలానికి వెళదాము , బయలుదేరండి'' అని ఒకరినొకరు పిలుచుకున్నారు. ఆ తరువాత వారు బయలుదేరారు దారిలో నడుస్తూ , ''ఈ రోజు బీదవాళ్లెవ్వరూ తోటలో మీ వద్దకు రాకూడదు సుమా'' అని మెల్లగా వారు పరస్పరం చెప్పుకున్నారు. దానం ఏమీ చెయ్యకూడదని నిర్ణయిం చుకుని , వారు తెల్లవారగానే తొందర తొందరగా అక్కడకు వెళ్లారు , తామె లాగైనా పండ్లు కోయగలమనే ధీమాతో. కాని తోటను చూచి వారు, ''ఇదేమిటి, మనం దారి తప్పి వచ్చామా - కాదు, కాదు మనం సర్వమూ కోల్పోయాము '' అని అనసాగారు. వారందరిలో కాస్తంత మంచివాడు ''మీరు దేవుణ్ణి ఎందుకు స్తుతించరు అని నేను మిమ్మల్ని అడగలేదా ?'' అని అన్నాడు. అప్పుడు వారు , ''మా ప్రభువు పరిశుద్ధుడు. నిజంగానే మేము పాపాత్ములం '' అని అన్నారు. తరువాత వారిలోని ప్రతి ఒక్కడూ తోటివాణ్ణి నిందించసాగాడు. చివరకు వారు పశ్చాత్తాపపడుతూ ఇలా అన్నారు , ''మన పరిస్థితి చాల శోచనీయం. నిస్సందేహంగా మనం మితిమీరి ప్రవర్తించాము. మన ప్రభువు మనకు దీనికి బదులుగా దీనికంటె మెరుగైన తోటను ప్రసాదించటం అసంభవమేమీ కాదు. మనం మన ప్రభువు వైపునకు మరలుదాము.'' ఇలా ఉంటుంది శిక్ష. పరలోక శిక్ష దీనికంటె కూడ ఘోరంగా ఉంటుంది. అయ్యో! వారు ఈ విషయాన్ని తెలుసుకుంటే ఎంత బాగుంటుంది.

34 - 41 నిశ్చయంగా దైవభక్తి పరాయణుల కొరకు వారి ప్రభువు వద్ద భోగభాగ్యాలతో నిండిన స్వర్గవనాలు ఉన్నాయి. మేము విధేయుల స్థితిని అపరాధుల స్థితి మాదిరిగా చేస్తామా? ఏమయింది మీకు, ఇలాంటి నిర్ణయాలు చేస్తారు? అక్కడ మీకు తప్పకుండా మీరు మీ కోసం కోరుకునేదే లభిస్తుందని వ్రాసిపెట్టి ఉన్న గ్రంథం ఏదైనా ఉందా మీరు చదవటానికి? మీరు నిర్ణయించు కున్నదే మీకు లభిస్తుందనటానికి ఆధారంగా ప్రళయదినం వరకూ మీరు మాతో చేసుకున్న ఒడంబడిక ఏదైనా ఉందా ? మీలో ఎవరు దీనికి హామీగా ఉంటారు ? అని వారిని అడగండి. లేక వారు నిలబెట్టిన భాగస్వాములెవరైనా ఉన్నారా (దీనికి బాధ్యత వహించటానికి) ? అలాగైతే తాము నిలబెట్టిన భాగస్వాము లను తీసుకురావాలి, వారు గనక సత్యవంతులే అయితే.

42 - 43 కష్టకాలం దాపురించే రోజున సజ్దా చేయటానికి ప్రజలు పిలువ బడతారు. అప్పుడు వారు సజ్దా చేయలేరు, వారి చూపులు క్రిందికి వాలి పోయి ఉంటాయి , అవమానం వారిని ఆవరించి ఉంటుంది. వారు నిక్షేపంగా ఉన్న కాలంలో వారిని సజ్దా చేయండి అని పిలవటం జరిగేది (కాని వారు తిరస్కరించేవారు).

44 - 45 కనుక ఓ ప్రవక్తా! నీవు ఈ గ్రంథాన్ని తిరస్కరించేవారి వ్యవహారాన్ని నాకు వదిలెయ్యి. వారికి ఏమాత్రం తెలియని విధంగా మేము వారిని క్రమేణా వినాశం వైపునకు తీసుకుపోతాము. నేను వారికి కొంత వ్యవధినిస్తున్నాను. నా పన్నాగం ఎంతో పటిష్ఠమైనది.

46 - 50 నీవు వారి నుండి ఏదైనా ప్రతిఫలం అడుగుతున్నావా, వారు దాని భారం క్రింద నలిగిపోతూ ఉండటానికి? వారి వద్ద ఏదైనా అతీంద్రియ జ్ఞానం ఉందా, వారు దాన్ని వ్రాస్తూ ఉండటానికి? సరే నీ ప్రభువు ఆజ్ఞ వెలువడే వరకు, సహనం వహిస్తూ ఉండు , చేపవాని (యూనుస్ - అస్సలామ్) మాదిరిగా వ్యవహరించకు. అతను మొరపెట్టుకున్నప్పుడు ధ్ఖుఖంలో మునిగిఉన్నాడు. ఒకవేళ అతని ప్రభువు అనుగ్రహమే అతనికి తోడ్పడకపోయి ఉంటే, అతను అవమానకరమైన స్థితిలో నిస్సారమైన మైదానంలోకి విసరి వేయబడి ఉండేవాడే. చివరకు అతని ప్రభువు అతనిని ఎన్నుకొని సజ్జనులైన దాసుల్లో చేర్చాడు.

51 - 52 ఈ అవిశ్వాసులు ప్రబోధవాణి (ఖురాన్)ని విన్నప్పుడు , వారు నీ కాళ్ళు ఊడగొడతారా అన్నట్లు నిన్ను కొరాకొరా చూస్తారు. ఇతను తప్పకుండా పిచ్చివాడే అని అంటారు. వాస్తవానికి ఇది సకల లోకాల వారి కొరకు అవతరించిన హితోపదేశం.

69. అల్ హాఖ్ఖహ్

ఆయతులు : 52 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 8 అనివార్యమైన సంఘటన! ఏమిటి ఆ అనివార్యమైన సంఘటన? ఆ అనివార్యమైన సంఘటన ఏమిటో నీకేమి తెలుసు? సమూద్, ఆద్ జాతుల వారు అకస్మాత్తుగా విరుచుకుపడే ఆ విపత్తును నమ్మటానికి నిరాకరించారు. అందువల్ల సమూద్ జాతివారు భయంకరమైన ఒక ఉపద్రవం ద్వారా నాశనం చేయబడ్డారు. ఆద్ జాతివారు ఒక పెద్ద గాలివాన ద్వారా నాశనం చేయ బడ్డారు. అల్లాహ్ వరుసగా ఏడు రాత్రులు , ఎనిమిది పగళ్లు వారిని దానికి గురిచేశాడు. (నీవు అక్కడ ఉండివుంటే) వారు అక్కడ బోసిపోయిన ఖర్జూరపు చెట్ల బోదెలు మాదిరిగా చెల్లాచెదరుగా పడి ఉండటాన్ని నీవు చూస్తావు. ఇప్పుడు వారిలో మిగిలి ఉన్న వాడెవడైనా నీకు కనిపిస్తున్నాడా?

9 - 10 ఇలాంటి మహాపరాధానికే ఫిరౌన్ , అతనికి పూర్వం గతించిన ప్రజలు , తలక్రిందులైన పురముల లోనివారు కూడ పాల్పడ్డారు. వారందరూ తమ ప్రభువు పంపిన ప్రవక్త చేసిన హితబోధను అంగీకరించలేదు. అప్పుడు ఆయన వారిని అతి కఠినంగా పట్టుకున్నాడు.

11 - 12 గాలివాన ఉధృతమయినప్పుడు , మేము మిమ్మల్ని నావలోకి ఎక్కించాము. ఈ విధంగా మేము ఈ సంఘటనను మీకు గుణపాఠం నేర్పే జ్ఞాపికగా ఉండేలా చేశాము. జ్ఞాపకం ఉంచుకునే చెవులు దానిని చిరకాలం జ్ఞాపకం ఉంచుకునేలా కూడ చేశాము.

13 - 18 తరువాత ఒకసారి శంఖం ఊదబడుతుంది. భూమినీ , పర్వతాలనూ లేపి ఒకే ఒక దెబ్బతో తుత్తునియలుగా చేయటం జరుగుతుంది. ఆ రోజున జరగవలసిన సంఘటన జరుగుతుంది. ఆ రోజున ఆకాశం బ్రద్దలవుతుంది, దాని వ్యవస్థ సడలిపోతుంది. దైవదూతలు దాని చుట్టుప్రక్కల చేరి ఉంటారు. ఎనిమిది మంది దైవదూతలు ఆ రోజున నీ ప్రభువు సింహాసనాన్ని తమపై ఎత్తుకుని మోస్తూ ఉంటారు. అదే మీరు హాజరుపరచబడే రోజు. ఆ రోజున మీ రహస్యాలేవీ దాగి ఉండవు.

19 - 24 అప్పుడు తన కర్మలపత్రం తన కుడి చేతికివ్వబడిన వ్యక్తి , ''చూడండి, నా కర్మల పత్రాన్ని తీసుకుని చదవండి. నా లెక్క నాకు తప్పకుండా లభిస్తుందని నేను అనుకుంటూ ఉండేవాణ్ణి'' అని అంటాడు. కనుక అతను తనకిష్టమైన భోగభాగ్యాలలో ఓలలాడుతాడు , అత్యున్నత స్వర్గవనాలలో ఉంటాడు , వాటి పండ్ల గుత్తులు వ్రేలాడుతూ ఉంటాయి. అలాంటి వారితో ఇలా అనబడుతుంది , ''హాయిగా తినండి, త్రాగండి, గత దినాలలో మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా.''

25 - 37 తన కర్మల పత్రం తన ఎడమ చేతికి ఇవ్వబడిన వ్యక్తి ఇలా వాపోతాడు, ''అయ్యో! నా కర్మల పత్రం నాకు అసలు ఇవ్వకుండా ఉంటే, నా లెక్క ఏమిటో నాకు అసలు తెలియకుండా ఉంటే ఎంత బాగుండేది! అయ్యో! నాకు (ప్రపంచంలో వచ్చిన) ఆ మరణమే ఏకంగా అంతిమ మరణమై ఉంటే ఎంత బాగుండేది! ఈనాడు నా ఆస్తి నాకు ఏమాత్రం పనికి రాలేదే. నా అధికారమంతా అంతరించిపోయిందే.'' (అప్పుడు ఇలా ఆజ్ఞాపించ బడుతుంది) అతనిని పట్టుకోండి, అతని మెడకు కంఠపాశం తగిలించండి. ఆపై అతనిని నరకంలోకి విసిరివేయండి. తరువాత అతనిని డెబ్బై గజాల పొడుగు గొలుసుతో బంధించండి. మహనీయుడూ , మహోన్నతుడూ అయిన అల్లాహ్ ను ఇతను విశ్వసించేవాడు కాదు, నిరుపేదలకు అన్నం పెట్టండి అని ప్రోత్సహించేవాడూ కాదు. కనుక ఈనాడు ఇక్కడ ఇతని దుఃఖంలో పాలుపంచుకునే స్నేహితుడెవడూ ఉండడు గాయాల కడుగు తప్ప అతనికి తినటానికి ఆహారం కూడ ఏదీ ఉండదు. దానిని పాపాత్ములు తప్ప మరెవరూ తినరు.

38 - 52 కాదు, అది కాదు. మీరు చూస్తూ ఉన్న వస్తువుల మీద , మీరు చూడలేని వస్తువుల మీద ప్రమాణం చేసి చెబుతున్నాను ఇది గౌరవనీయుడైన ఒక సందేశహరుని వాక్కు , ఏ కవికి చెందిన వాక్కూ కాదు. కాని మీరు విశ్వసించటం అనేది చాల తక్కువ. ఇంకా ఇది ఏ జ్యోతిష్యుని వాక్కు కూడా కాదు. కాని , మీరు ఆలోచించటం అనేది చాల తక్కువ. ఇదసలు సర్వలోకాల ప్రభువు తరఫు నుండి అవతరించింది. ఒకవేళ ఇతను (దైవప్రవక్త) స్వయంగా కల్పించి ఏదైనా విషయాన్ని మాకు ఆపాదించి ఉంటే, మేము ఇతని కుడి చెయ్యిని పట్టుకునేవారము,

ఇతని మెడ నరాన్ని కోసివేసేవారము. అప్పుడు మీలో ఎవ్వరూ (మమ్మల్ని) ఈ పని చేయకుండా ఆపగలిగే వారు కారు. అసలు ఇది దైవభీతి కలవారికి ఒక హితోపదేశం. మీలో కొందరు తిరస్కరించే వారున్నారని మాకు తెలుసు.ఇటువంటి తిరస్కారులకు నిస్సందేహంగా ఇది ధ్ఖఖ కారణం అవుతుంది. ఇది పూర్తిగా నమ్మదగిన సత్యం. కనుక ఓ ప్రవక్తా! మహోన్నతుడైన నీ ప్రభువు నామాన్ని స్తుతించు.

70. అల్ మారిజ్

ఆయతులు : 44 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 18 అడిగేవాడు శిక్షను గురించి అడిగాడు. అది (ఆ శిక్ష) తప్పకుండా సంభవిస్తుంది. అది అవిశ్వాసుల కొరకే. దానిని తప్పించేవారెవ్వరూ లేరు. అది ఆరోహణ సోపానాలకు స్వామి అయిన అల్లాహ్ తరఫు నుండి సంభ విస్తుంది. యాభైవేల సంవత్సరాల ప్రమాణం గల ఒక రోజున దైవదూతలు , ఆత్మ, ఆయన సాన్నిధ్యానికి అధిరోహిస్తారు. కనుక ఓ ప్రవక్తా! సహనం వహించు , హుందాతనంతో కూడిన సహనం. వారు అది దూరంగా ఉన్నదని అనుకుంటున్నారు. కాని మాకు అది దగ్గరలో కనిపిస్తున్నది. ఏ రోజున ఆకాశం కరిగిన వెండి మాదిరిగా అయిపోతుందో, కొండలు ఏకిన రంగు రంగుల ఉన్ని పింజలు మాదిరిగా అయిపోతాయో , ప్రాణస్నేహితులు ఒకరి కొకరు కనిపించినప్పటికీ, ఎవరూ ఎవరిని గురించీ పట్టించుకోవటం జరగదో. (ఆ రోజున ఆ శిక్ష సంభవిస్తుంది) దోషి ఆనాటి శిక్ష నుండి తప్పించుకోవ టానికి తన సంతానాన్నీ , తన భార్యనూ , తన సోదరులనూ , తనకు ఆశ్రయ మిచ్చిన దగ్గరి బంధువులనూ భూమండలంలోని వారందరినీ పరిహారంగా ఇచ్చి , ఈ ఉపాయం ద్వారా విముక్తి పొందాలని కోరుకుంటాడు. ఎంతమాత్రం కాదు. (అలా ఎన్నటికీ జరగదు) అది భగ భగ మండే నరకాగ్ని జ్వాల. మాంసాన్ని, చర్మాన్ని సైతం అది తినేస్తుంది. సత్యం పట్ల విముఖుడై , వెన్ను చూపి, ధనాన్ని కూడబెట్టి దానిని మాటిమాటికి పేర్చి పెట్టిన ప్రతివాణ్ణీ అది బిగ్గరగా అరుస్తూ తన వైపునకు పిలుస్తుంది.

19 - 35 మానవుడు తొందరపడే వాడుగా, సహనం లేనివాడుగా సృష్టించ బడ్డాడు. అతనికి కష్టాలు వచ్చినప్పుడు ఆందోళన చెందుతాడు, సుఖాలు కలిగినప్పుడు పిసినారితనంతో ప్రవర్తిస్తాడు. కాని (ఈ బలహీనతకు ఈ క్రిందివారే దూరంగా ఉంటారు). నమాజు చేసేవారు , తమ నమాజులను ఎల్లప్పుడూ నియమం తప్పకుండా పాటించేవారు , తమ సంపదలలో యాచకు లకూ , దిక్కులేని వారికి ఒక నిర్ణీతమైన హక్కును ఇచ్చేవారు , తీర్పుదినం సత్యమని నమ్మేవారు, తమ ప్రభువు శిక్షకు భయపడేవారు ఎందుకంటే వారి ప్రభువు విధించే శిక్ష ఎవరూ నిర్భయంగా ఉండేటటువంటి శిక్షకాదు, తమ మర్మాంగాలను కాపాడుకునేవారు - తమ భార్యలూ , చట్టరీత్యా తమ అధీనంలో ఉండే స్త్రీలూ తప్ప , వీరి విషయంలో కాపాడుకోకుండా ఉండేవారు నిందార్హులు కారు అయితే ఇదిగాక ఇంకా

ఎక్కువ కావాలని కోరేవారు హద్దులను అతిక్రమించేవారు - తమ అమానతులను పరిరక్షించేవారు , తమ వాగ్దానాలను నిలబెట్టుకునేవారు , తమ సాక్ష్యాల విషయంలో నిజాయితీగా ఉండేవారు , తమ నమాజును కాపాడుకునేవారు- ఇలాంటి వారు సగౌరవంగా స్వర్గవనాలలో ఉంటారు.

36 - 44 కనుక ఓ ప్రవక్తా! ఈ సత్య ధిక్కారులు కుడి ఎడమల నుండి గుంపులు గుంపులుగా నీ వైపునకు ఎందుకు పరుగెత్తుకొస్తున్నారు? వారిలో ప్రతి ఒక్కడూ కానుకలతో నిండిన స్వర్గంలో తనను ప్రవేశపెట్టడం జరుగు తుందనే పేరాశ కలిగిఉన్నాడా? ఎంతమాత్రం కాదు. ఏ వస్తువుతో మేము వారిని పుట్టించామో , ఆ వస్తువేమిటో స్వయంగా వారు ఎరుగుదురు. కనుక అలా కాదు. నేను తూర్పుల , పడమరల స్వామిపై ప్రమాణం చేసి చెబుతు న్నాను , మేము వారి స్థానంలో వారికంటె మేలైన వారిని తీసుకురాగల శక్తి కలిగి ఉన్నాము , మమ్మల్ని మించి పోయేవారెవ్వరూ లేరు. కనుక వారిని వారి వ్యర్థ విషయాలలో, ఆటపాటలలో పడి ఉండనివ్వండి. వారికి వాగ్దానం చేయబడుతున్న దినానికి వారు చేరుకునే వరకు వారిని అలా పడి ఉండ నివ్వండి. అప్పుడు వారు తమ సమాధుల నుండి బయటికి వచ్చి తమ దేవతల మందిరాల వైపునకు పరుగెత్తుతున్నట్లు పరుగెత్తుతూ ఉంటారు. వారి చూపులు క్రిందికి వ్రాలి ఉంటాయి అవమానం వారిని కమ్ముకుంటూ ఉంటుంది. ఈ దినం గురించే వారికి వాగ్దానం చేయబడుతోంది.

71. నూహ్

ఆయతులు : 28 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 మేము ప్రవక్త నూహ్ ను అతని జాతి వద్దకు పంపాము , అతని జాతి ప్రజలపైకి బాధాకరమైన శిక్ష రాకమునుపే వారిని హెచ్చరించమని (ఉపదేశిస్తూ).

2 - 4 అతను ఇలా అన్నాడు , ‘‘నా జాతి ప్రజలారా! నేను మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించటానికి వచ్చిన (సందేశహరుణ్ణి) వాణ్ణి. కనుక (మిమ్మల్ని హెచ్చ రిస్తున్నాను) అల్లాహ్ దాస్యం చెయ్యండి , ఆయనకు భయపడండి. నాకు విధేయత చూపండి , అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు , మిమ్మల్ని ఒక నిర్ణీత కాలం వరకు బ్రతుకనిస్తాడు. వాస్తవం ఏమిటంటే, అల్లాహ్ నిర్ణయించిన కాలం వచ్చినప్పుడు, దానిని తప్పించటం సాధ్యం కాదు. అయ్యో! ఈ విషయం మీకు తెలిస్తే ఎంత బాగుండును.’’

5 - 20 అతను ఇలా విన్నవించుకున్నాడు , ‘‘ప్రభూ! నేను నా జాతి ప్రజలను రేయింబవళ్లూ పిలిచాను. కాని నా పిలుపు వారి పరుగునే పెంచింది. నేను వారిని నీ క్షమాభిక్ష వైపునకు పిలిచినప్పుడల్లా , వారు చెవులలో వ్రేళ్లు

దూర్చు కునేవారు, తమ వస్త్రాలతో ముఖాలను కప్పుకునేవారు మొండి వైఖరి అవలం బించారు మరియు అహంభావం ప్రదర్శించారు. అయినా నేను వారిని ఎలుగెత్తి పిలిచి సందేశం అందజేశాను. ఇంకా నేను బహిరంగంగా కూడ వారిలో ప్రచారం చేశాను , రహస్యంగా కూడా వారికి నచ్చజెప్పాను. నేను ఇలా అన్నాను , మీరు మీ ప్రభువును, క్షమించమని వేడుకోండి, నిస్సందేహంగా ఆయన గొప్ప క్షమావంతుడు. ఆయన మీపై ఆకాశం నుండి పుష్కలంగా వర్షం కురిపిస్తాడు, మీకు సిరిసంపదలనూ, సంతానాన్నీ ప్రసాదిస్తాడు, మీ కొరకు తోటలను సృష్టిస్తాడు మరియు మీ కొరకు కాలువలను ప్రవహింప జేస్తాడు. మీకేమయింది , అల్లాహ్కి మీరు ఎలాంటి గౌరవాన్నీ ఎందుకు ఆశించరు ? వాస్తవానికి ఆయన మిమ్మల్ని విభిన్న రీతులలో సృజించాడు. అల్లాహ్ ఏవిధంగా ఏడు ఆకాశాలను ఒక దానిపై నొకటి సృష్టించాడో , వాటిలో చంద్రుణ్ణి కాంతిగానూ , సూర్యుణ్ణి దీపంగానూ చేశాడో , మీరు చూడటం లేదా? అల్లాహ్ మిమ్మల్ని భూమినుండి చిత్రవిచిత్రంగా మొలిపిం చాడు, తరువాత ఆయన మిమ్మల్ని ఈ భూమిలోకే తిరిగి తీసుకుపోతాడు, మళ్లీ దానినుండే యెకాయెకీ మిమ్మల్ని బయటకు తీసి నిలబెడతాడు. అల్లాహ్ మీ కొరకు భూమిని పాన్పు మాదిరిగా పరిచాడు మీరు దానిపై ఉన్న విశాలమైన మార్గాలలో నడవటానికి వీలు కల్పించాడు.

21 - 24 ప్రవక్త నూహ్ ఇలా అన్నాడు, ''ప్రభూ! వారు నా మాటను కొట్టి పారేశారు, సంపదనూ, సంతానాన్నీ పొంది మరింత నష్టానికే గురి అయిన వారిని (సంపన్నులను) అనుసరించారు. వారు పెద్ద పెద్ద కుట్రలను పన్నారు. వారు, ''మీరు మీ ఆరాధ్య దైవాలను ఎంతమాత్రం విడిచిపెట్టకండి. వద్దా , సువాలను విడిచిపెట్టకండి. యగూస్ను, యఊఖ్ను, నసర్ను కూడ విడనాడ కండి'' అని అన్నారు. వీరు చాలామందిని మార్గచ్యుతులుగా చేశారు. నీవు కూడ ఈ దుర్మార్గులకు మార్గచ్యుతిలో తప్ప మరెందులోనూ వృద్ధిని ఈయకు.

25 - 28 వారు తమ పాపాల మూలంగానే ముంచబడ్డారు , నరకాగ్నిలోకి తోసివేయబడ్డారు. ఆ తరువాత వారు అల్లాహ్ నుండి తమను రక్షించే సహాయకుడెవణ్ణీ పొందలేకపోయారు. ప్రవక్త నూహ్ ఇలా అన్నాడు , ''ప్రభూ! భూమిపై ఈ అవిశ్వాసులలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టకు. ఒకవేళ నీవు వారిని వదలిపెడితే , వారు నీ దాసులను అపమార్గం పట్టిస్తారు. వారి సంతతిలో ఎవడు పుట్టినా పరమ పాపిగా , కరుడుగట్టిన అవిశ్వాసిగా మాత్రమే రూపొందు తాడు. ప్రభూ! నన్నూ నా తల్లిదండ్రులనూ, విశ్వాసిగా నా ఇంట్లోకి ప్రవేశించిన ప్రతి వ్యక్తినీ, విశ్వాసులైన పురుషులూ, స్త్రీలూ అందర్నీ క్షమించు. దుర్మార్గులకు వినాశాన్ని తప్ప మరి దేనినీ అధికం చెయ్యకు.''

## 72. అల్ జిన్న్

ఆయతులు : 28 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 15 ఓ ప్రవక్తా! జిన్నాతుల సమూహం ఒకటి శ్రద్ధగా విని , ఆ తరువాత (తన జాతి ప్రజల వద్దకు పోయి) ఇలా అన్నట్లు నాకు వహీద్వారా తెలియజేయబడిరదని చెప్పు ''మేము ఒక అద్భుతమైన ఖురాన్ విన్నాము , అది సన్మార్గం వైపునకు దారి చూపుతుంది , కనుక మేము దానిని విశ్వసిం చాము. ఇక ఎన్నడూ మేము మా ప్రభువునకు భాగస్వాములుగా మరెవ్వరినీ చేయము. '' ఇంకా ఇలా అన్నారు , ''మా ప్రభువు వైభవం చాలా గొప్పది, ఘనమైనది. ఆయన ఎవరినీ భార్యగాగాని , కుమారునిగా గాని చేసుకోలేదు. '' ఇంకా ఇలా అన్నారు , ''మనలోని అవివేకులు కొందరు అల్లాహ్ విషయంలో ఎన్నో సత్యవిరుద్ధమైన విషయాలు పలుకుతున్నారు.'' ఇంకా ఇలా అన్నారు, ''మానవులు, జిన్నాతులు దేవుని గురించి ఎన్నడూ అబద్ధం పలుకరని మేము భావించాము. '' ఇంకా ఇలా అన్నారు , ''మానవులలో కొందరు జిన్నాతులలోని కొందరిని శరణు వేడుతుండేవారు. ఈ విధంగా వారు జిన్నాతుల గర్వాన్ని మరింత అధికం చేశారు.'' ఇంకా ఇలా అన్నారు, ''అల్లాహ్ ఎవరినీ సందేశహరుడుగా నియమించి పంపడని మీరు భావించినట్లుగానే , మానవులు కూడ భావించారు.'' ఇంకా ఇలా అన్నారు , ''మేము ఆకాశంలో వెతికితే , అది పహారాదారులతో , ఉల్కాపాతంతో నిండిపోయి ఉన్నట్లు కనిపించింది. '' ఇంకా ఇలా అన్నారు, ''మొదట్లో మేము దొంగతనంగా వినటానికి పోయి నప్పుడు , ఆకాశంలో మాకు కూర్చోవటానికి స్థలం దొరికేది. కాని ఇప్పుడు ఎవడైనా దొంగతనంగా వినే ప్రయత్నం చేస్తే , అతడి కొరకు ఒక అగ్ని జ్వాల మాటుకాసి ఉంటుంది.'' ఇంకా ఇలా అన్నారు, ''భూలోక వాసులకేదైనా కీడు చెయ్యాలనే నిర్ణయం జరిగిందా లేక వారి ప్రభువు వారికి సన్మార్గం చూపగోరు తున్నాడా అనే విషయం మాకు అర్థమయ్యేది కాదు.'' ఇంకా ఇలా అన్నారు, ''మనలో కొందరు సజ్జనులు ఉన్నారు , మరికొందరు దీనికి భిన్నంగా ఉన్నారు. మనం విభిన్న పద్ధతులలో విభజింపబడి ఉన్నాము.'' ఇంకా ఇలా అన్నారు , ''అల్లాహ్ ను మనం భూమిపై కూడ అశక్తునిగా చేయ లేము , తప్పించుకుని పారిపోయి ఆయనను ఓడిరచలేము అని మేము భావించే వారము. '' ఇంకా ఇలా అన్నారు , ''మేము సన్మార్గబోధను విని దానిని విశ్వసిం చాము. ఇప్పుడిక ఎవడైనా సరే , తన ప్రభువును విశ్వసిస్తే అతనికి అన్యాయంగానీ, అతనిపై దౌర్జన్యంగాని జరుగుతుందన్న భయం ఉండదు. '' ఇంకా ఇలా అన్నారు , ''మనలో కొందరు ముస్లిమ్‌లు (దేవుని విధేయులు) ఉన్నారు మరికొందరు సత్యానికి దూరమై ఉన్నవారు ఉన్నారు. కనుక ఇస్లామ్ (విధేయతా మార్గం)ను అవలంబించిన వారు ముక్తిమార్గాన్ని కనుగొన్నారు. ఇక సత్యానికి దూరమయిన వారు నరకానికి ఇంధనమవుతారు.''

16 - 23 మరియు (ప్రవక్తా! నాకు ఇలా కూడ సందేశం అందజేయబడిరదని చెప్పు) ప్రజలు గనక ఋజుమార్గంలో స్థిరంగా నడుచుకుంటే, మేము వారికి త్రాగటానికి పుష్కలంగా నీటిని ప్రసాదిస్తాము ఆ వరము ద్వారా వారిని పరీక్షిస్తాము. తన ప్రభువు స్మరణ పట్ల విముఖుడయ్యే అతణ్ణి అతని ప్రభువు కఠిన శిక్షకు గురిచేస్తాడు. ఇంకా ఏమిటంటే, మసీదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కనుక వాటిలో అల్లాహ్తో పాటు ఇతరులెవ్వరినీ ప్రార్థిం

చకండి. అల్లాహ్ దాసుడు ఆయన్ని ప్రార్థించటానికి నిలబడినప్పుడు , ప్రజలు అతనిపై విరుచుకుపడటానికి సిద్ధమయ్యారు. ఓ ప్రవక్తా! ఇలా చెప్పు, ''నేనైతే నా ప్రభువునే ప్రార్థిస్తాను, ఆయనకు భాగస్వాములుగా మరెవ్వరినీ నిలబెట్టను.'' ఇంకా ఇలా నొక్కి చెప్పు, ''మీకు నష్టం కలిగించటం లేదా మీకు మేలు చెయ్యటం అనేది నా వశంలో లేదు.'' ఇలా చెప్పు, ''నన్ను అల్లాహ్ పట్టునుండి ఎవ్వరూ కాపాడలేరు. నాకు ఆయన తప్ప మరొక ఆశ్రయం కూడ లేదు. అయితే అల్లాహ్ మాటలను , ఆయన సందేశాలను అందజెయ్యటమే నా పని. '' ఇక ఎవరైనా సరే, అల్లాహ్, ఆయన ప్రవక్తల మాటలను విశ్వసించక పోతే , వారు నరకాగ్నికి గురిఅవుతారు. అటువంటి వారు అందులోనే శాశ్వతంగా ఉంటారు.

24 - 28 వారు తమకు వాగ్దానం చేయబడుతున్నదానిని కళ్లారా చూడనం తవరకు (తమ ఈ వైఖరిని విడనాడరు). అప్పుడు వారికి తెలిసిపోతుంది, ఎవరి సహాయకులు బలహీనులో, మరెవరి వర్గం సంఖ్యాపరంగా తక్కువో. ఇలా చెప్పు, ''మీకు వాగ్దానం చేయబడుతున్న విషయం సమీపంలోనే ఉందో లేక నా ప్రభువు దానికోసం ఏదైనా దీర్ఘకాలిక వ్యవధి నిర్ణయించాడో, నాకైతే తెలియదు. ఆయన అతీంద్రియ జ్ఞానం కలవాడు, తన అతీంద్రియ విషయాలను తాను ఎంచుకున్న ప్రవక్తకు తప్ప మరెవ్వరికీ తెలియజేయడు. అయితే ఆయన ఆ ప్రవక్తకు ముందూ , వెనుకా రక్షకభటులను నియమిస్తాడు, ఎందు కంటే వారు తమ ప్రభువు సందేశాలను యధాతథంగా అందజేసిన విషయాన్ని ఆయన తెలుసుకోవటానికి. ఆయన వారి పరిసరాలు అన్నింటినీ పరివేష్టించి ఉన్నాడు , ఆయన ఒక్కొక్క విషయాన్ని లెక్కపెట్టి ఉంచాడు.''

73. అల్ ముజ్జమ్మిల్

ఆయతులు : 20 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 14 ఓ దుప్పటి కప్పుకుని పడుకునేవాడా! రాత్రివేళ నమాజులో నిలబడుతూ ఉండు , కాని కొంచెం సేపు మాత్రమే రాత్రిలో సగభాగం లేదా దానిని కొంచెం తగ్గించుకో లేదా దానిని కొంచెం పొడిగించుకో. ఖుర్ఆన్‌ను నెమ్మదిగా ఆగి ఆగి పఠించు. మేము నీపై ఒక గంభీరమైన వాణిని అవతరింప జేయబోతున్నాము. వాస్తవానికి రాత్రివేళ లేవటం మనస్సును అదుపులో ఉంచేందుకు ఎంతో ఉపయుక్తమైనది ఖుర్ఆన్‌ను శ్రద్ధగా పఠించేందుకు ఎంతో అనువైనది: ఎందుకంటే, పగటి వేళ నీకు చాలా పనులుంటాయి. నీ ప్రభువు నామాన్ని స్మరిస్తూ ఉండు అన్నిటినీ వదలి పూర్తిగా ఆయనకే అంకితమైపో. ఆయన తూర్పు పడమరలకు స్వామి , ఆయన తప్ప మరొక దేవుడు లేడు. కనుక నీవు ఆయననే వకీలుగా చేసుకో. లోకులు కల్పించే మాటల పట్ల సహనం వహించి ,

మంచితనంతో వారి నుండి వైదొలగిపో. సత్య తిరస్కారులైన ఈ సంపన్నుల సంగతి నాకు వదలిపెట్టు, నేను చూసు కుంటాను. వీరిని కొంతకాలం ఇదే స్థితిలో ఉండనివ్వు. మా వద్ద (వీరి కొరకు) బరువైన సంకెళ్లు ఉన్నాయి , భగ భగమండే అగ్ని, గొంతులో ఇరుక్కు పోయే ఆహారం, వ్యధాభరితమైన శిక్షా ఉన్నాయి. ఇదంతా భూమీ, పర్వతాలు కంపించే రోజున జరుగుతుంది. ఆ రోజున పర్వతాలు చెల్లాచెదరై పోయే ఇసుక తిప్పలు మాదిరిగా అయిపోతాయి.

15 - 19 మేము ఫిరౌను వద్దకు ఒక ప్రవక్తను పంపిన విధంగా ఒక ప్రవక్తను మీకు సాక్షిగా నియమించి మీ వద్దకు పంపాము.(చూడండి) ఫిరౌను ఆ ప్రవక్త మాటను వినకపోవటం వల్ల మేము అతన్ని చాలా తీవ్రంగా పట్టు కున్నాము. ఒకవేళ మీరు కూడ నమ్మటానికి నిరాకరిస్తే , పిల్లలను వృద్ధులుగా చేసే ఆరోజు నుండి ఎలా బయటపడగలరు? ఆనాటి తీవ్రత వల్ల ఆకాశం బ్రద్దలవుతుంది. అల్లాహ్ చేసిన వాగ్దానం నెరవేరితీరాలి. ఇదొక ఉపదేశం, ఇక ఇష్టమైన వారు తమ ప్రభువు వైపునకు పోయే మార్గాన్ని అవలం బించవచ్చు.

20 ఓ ప్రవక్తా! నీవు ఒక్కొక్కప్పుడు దాదాపు మూడిరట రెండు వంతుల రాత్రి , మరొకప్పుడు సగం రాత్రి , ఇంకొకప్పుడు మూడిరట ఒకవంతు రాత్రి ఆరాధనలో నిలబడి ఉంటావనీ, నీ సహచరులలో కూడ ఒక వర్గం ఇలాగే చేస్తుందనీ నీ ప్రభువుకు తెలుసు. అల్లాహ్ మాత్రమే రేయింబవళ్ల వేళలను గురించి లెక్క కట్టగలడు. నీవు వేళలను కచ్చితంగా లెక్కించలేవని ఆయనకు తెలుసు కనుక ఆయన నీపై దయచూపాడు. ఇప్పుడు నీవు ఖుర్ఆన్‌ను సులభంగా పఠించగలిగినంత మేరకే పఠించు. ఆయనకు తెలుసు , మీలో కొందరు వ్యాధిగ్రస్తులు ఉండవచ్చు, మరికొందరు అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషిస్తూ ప్రయాణాలలో ఉండవచ్చు , ఇంకా కొందరు అల్లాహ్ మార్గంలో యుద్ధం చేస్తూ ఉండవచ్చు. కనుక మీరు ఖుర్ఆన్‌ను సులభంగా పఠించగలి గినంత పఠించండి. నమాజ్‌ను స్థాపించండి, జకాత్ ఇవ్వండి, అల్లాహ్ కు మంచి అప్పును ఇస్తూ ఉండండి. మీరు ఏ సత్కార్యాన్ని మీ కోసం ముందుగా పంపించుకుంటారో, దానిని మీరు అల్లాహ్ వద్ద చూసుకుంటారు. అదే చాలా శ్రేష్ఠమైనది మరియు దాని ప్రతిఫలం చాలా పెద్దది. అల్లాహ్ ను క్షమాభిక్ష కోసం అర్థిస్తూ ఉండండి. నిస్సందేహంగా అల్లాహ్ గొప్ప క్షమాశీలుడు, కరుణామయుడూను.

## 74.అల్ ముద్దస్సిర్

ఆయతులు : 56 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 7 వస్త్రం కప్పుకుని పడుకున్న మనిషీ! లే  లేచి హెచ్చరించు. నీ ప్రభువు ఘనతను చాటి చెప్పు. నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో ,  మాలి న్యానికి దూరంగా ఉండు. ఎక్కువగా పొందాలనే కాంక్షతో ఉపకారం చేయకు. నీ ప్రభువు కొరకు ఓర్పు వహించు.

8  -  37 సరే  శంఖం పూరించబడే రోజు చాలా కఠినమైన రోజు. సత్య తిరస్కారులకు అది తేలికగా ఉండదు. వదలిపెట్టండి నన్నూ, నేను ఒంటరిగా పుట్టించిన వ్యక్తినీ. నేను అతనికి ఎంతో ధనం ఇచ్చాను, ఎల్లప్పుడూ అతన్ని వెన్నంటి ఉండే కుమారులను ప్రసాదించాను , అతని కొరకు రాజ్యాధికార (సకల సౌకర్యాల) మార్గాన్ని సుగమం చేశాను. అయినప్పటికీ నేను అతనికి ఇంకా ఏదో ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నాడు. కాదు , అలా ఎన్నటికీ కాదు , అతను మా వాక్యాల పట్ల విరోధం కలిగి ఉన్నాడు. నేను త్వరలోనే అతనిని దుర్గమమైన స్థానం పైకి ఎక్కిస్తాను. అతడు ఆలోచించి, ఏదో ఎత్తువేయటానికి ప్రయత్నిం చాడు. కనుక దేవుడు అతనిని నాశనం చేయుగాక! అతడు ఎలాంటి ఎత్తుగడ వేయటానికి ప్రయత్నించాడు! తరువాత (ప్రజల వైపు) చూశాడు. ఆ తరువాత కనుబొమలు ముడిచాడు.  ముఖం చిట్లించుకున్నాడు. ఆపై విర్రవీగుతూ తిరిగిపోయాడు , చివరకు, ''ఇది పూర్వం నుండి వస్తూ ఉన్న ఒక మంత్రజాలం తప్ప మరేమీ కాదు. ఇది ఒక మానవవాక్కు మాత్రమే '' అని అన్నాడు. త్వరలోనే నేను అతనిని నరకంలోకి తోసేస్తాను. ఆ నరకం ఏమిటో నీకేమి తెలుసు ? అది మిగిలించదు ,  వదలిపెట్టదు.  అది చర్మాన్ని మాడ్చివేసేది. పందొమ్మిది మంది దానిపై నియమితులై ఉన్నారు  - మేము దైవదూతలను మాత్రమే నరకానికి కార్యనిర్వాహకులుగా నియమించాము. వారి సంఖ్యను అవిశ్వాసుల కొరకు ఒక పరీక్షగా చేశాము ఎందుకంటే గ్రంథ ప్రజలకు నమ్మకం కలగాలని , విశ్వసించే వారి విశ్వాసం అధికం కావాలని , గ్రంథ ప్రజలు , విశ్వాసులు ఎలాంటి సందేహంలో పడకుండా ఉండాలని ఇంకా మానసిక వ్యాధిగ్రస్తులు , సత్య విరోధులు ''ఈ విచిత్రమైన వాక్కుకు అర్థమేమై ఉంటుంది ?''  అని అనాలని. ఈ విధంగా అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టులుగా చేస్తాడు, తాను కోరిన వారికి మార్గం నిర్దేశిస్తాడు. నీ ప్రభువు సైన్యాలను స్వయంగా ఆయన తప్ప మరెవరూ ఎరుగరు - ఈ నరక ప్రస్తావన ప్రజలకు హితోపదేశం కావాలనే ఉద్దేశ్యంతోనే తప్ప మరి దేనికొరకూ చేయ బడలేదు. ఎంతమాత్రం కాదు, చంద్రుడు సాక్షిగా, మరలిపోయే రాత్రి సాక్షిగా, ప్రకాశించే ఉదయం సాక్షిగా ఈ నరకం కూడా గొప్ప విషయాలలోని ఒక గొప్ప విషయం , మానవులకు భీతిగొలిపే విషయం, మీలో ముందడుగు వేసే ప్రతి వ్యక్తికీ, వెనుక ఉండిపోయే ప్రతి వ్యక్తికీ భీతిగొలిపే విషయం.

38 - 48 ప్రతి వ్యక్తీ తాను సంపాదించే దానికి తాకట్టుగా ఉంటాడు, స్వర్గవనాలలో ఉండే కుడిపక్షంవారు తప్ప. వారు అపరాధులను,  ''మిమ్మల్ని ఏ విషయం నరకంలోకి తీసుకువెళ్ళింది ?''  అని అడుగుతారు. దానికి వారు ఇలా అంటారు,  ''మేము నమాజు చేసేవారిలోని వారం కాము , నిరుపేదలకు అన్నం పెట్టేవాళ్ళం కాము , సత్యానికి వ్యతిరేకంగా మాటలు కల్పించే వారితో కలిసి మేము కూడ మాటలను కల్పించేవారము మరియు తీర్పుదినం అబద్ధ

మని చెప్పేవారము  చివరకు ఆ అనివార్య విషయం మాకు ఎదురయింది.        ''  అప్పుడు సిఫారసు చేసే వారి సిఫారసు, వారికి ఏమాత్రం ఉపయోగపడదు.

49 - 56 అసలు వారికేమయింది , ఈ హితబోధ నుండి ముఖం త్రిప్పుకుంటున్నారు , సింహాన్ని చూసి పారిపోయే అడవిగాడిదెల మాదిరిగా. పైగా వారిలో ప్రతి ఒక్కడూ తన పేర బహిరంగ ఉత్తరాలు పంపబడాలని కోరుతున్నాడు , ఎంతమాత్రం కాదు, అసలు విషయం ఏమిటంటే,  వారికి పరలోక భయం  ఏ మాత్రం లేదు. అలా ఎన్నటికీ కాదు ఇదసలు ఒక హితబోధ. ఇక ఇష్టమైన వారు దీనినుండి గుణపాఠం నేర్చుకోవచ్చు. అల్లాహ్ కోరితే తప్ప వీరు ఏ గుణపాఠాన్నీ నేర్చుకోలేరు. ప్రజలు ఆయనకు భయపడాలి     ,  దానికి ఆయన హక్కుదారుడు. (భయభక్తులు కలవారిని) ఆయన మన్నిస్తాడు, దానికి ఆయన అర్హుడు.

75. అల్ ఖియామహ్

ఆయతులు : 40                              అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన  అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1  -  30 కాదు ,  నేను ప్రళయదినం సాక్షిగా చెబుతున్నాను  కాదు       ,  నేను ప్రబోధించే అంతరాత్మ సాక్షిగా చెబుతున్నాను  మేము మానవుని ఎముకలను జత చేయలేమని అతడు అనుకుంటున్నాడా          ?  ఎందుకు జతచేయలేము?  మేము అతని ప్రేళ్ల కొసలను సైతం సముచితమైన రీతిలో రూపొందించగల సమర్థులం. కాని మానవుడు ఇక ముందు కూడ దుష్కార్యాలు చేయగోరు తున్నాడు.         ''ఆ ప్రళయ దినం అసలు ఎప్పుడు వస్తుంది?''  అని ప్రశ్నిస్తున్నాడు. ఆ తరువాత  ,  కనుగుడ్లు తేలవేయటం జరిగినప్పుడు , చంద్రుడు కాంతిహీనుడై పోయినప్పుడు,  సూర్యచంద్రులు  ఒకటిగా  కలిపివేయబడినప్పుడు, ఈ మానవుడే, ''ఎక్కడకు పారిపోవాలి?'' అని అంటాడు.  ఎన్నటికీ జరగదు, అక్కడ ఎలాంటి ఆశ్రయమూ ఉండదు. ఆ రోజున నీ ప్రభువు వద్దకే పోయి ఆగవలసి ఉంటుంది.  ఆ  రోజున మానవుడికి అతడు ముందూ వెనుకా  చేసిందీ    , చేయించిందీ అంతా తెలుపబడుతుంది. అదీగాక, మానవుడు ఎన్ని సాకులు చెప్పినా, స్వయంగా అతనికే తనను గురించి బాగా తెలుసు. - ఓ ప్రవక్తా! ఈ వహీని (సందేశాన్ని ) త్వరత్వరగా జ్ఞాపకం చేసుకోవటానికి నీ నాలుకను ఆడిరచకు   దీనిని జ్ఞాపకం చేయించటం , చదివించటం మా బాధ్యత. కనుక మేము దీనిని పఠిస్తున్నప్పుడు    , నీవు ఆ పారాయణాన్ని శ్రద్ధగా ఆలకించు. ఇంకా దాని భావం అర్థమయ్యేలా చేయటం కూడ మా బాధ్యతే - ఎంతమాత్రం కాదు  , అసలు విషయం ఏమిటంటే, మీరు త్వరగా లభ్యమయ్యే వస్తువుల పట్ల (అంటే ఇహలోకం పట్ల) వ్యామోహం పెంచుకుంటున్నారు  పరలోకాన్ని విడిచిపెడుతున్నారు. ఆ రోజున  కొందరి ముఖాలు కళ కళలాడుతూ ఉంటాయి     , తమ ప్రభువు వైపు చూస్తూ

ఉంటారు, కొందరి ముఖాలు చిన్నబోయి ఉంటాయి , తమ పట్ల నడుములు విరిగే విధంగా వ్యవహరించవచ్చని వారు అనుకుంటూ ఉంటారు. ఎంతమాత్రం కాదు , ప్రాణం గొంతులోకి వచ్చినప్పుడు , మంత్రించి ఊదే వారెవరైనా ఉన్నారా అని అనబడినప్పుడు , ఇది ప్రపంచం నుండి వేరైపోయే సమయమని మనిషి తెలుసుకుంటాడు. ఒక కాలుతో మరొకకాలు కలిసిపోయినప్పుడు, అది నీ ప్రభువు వైపునకు తరలిపోయే రోజు అవుతుంది.

31 - 35 కాని అతడు సత్యాన్నీ నమ్మలేదు , నమాజునూ చేయలేదు , అంతేకాదు తిరస్కరించి ముఖం తిప్పుకున్నాడు. ఆ తరువాత నిక్కుతూ, నీల్గుతూ తన ఇంటివారి దగ్గరకు వెళ్లిపోయాడు. ఈ వైఖరి నీకు మాత్రమే చెల్లుతుంది! నీకు మాత్రమే శోభిస్తుంది! అవును, ఈ వైఖరి నీకు మాత్రమే చెల్లుతుంది! నీకు మాత్రమే శోభిస్తుంది!

36 - 40 మానవుడు తనను విచ్చలవిడిగా వదిలిపెట్టటం జరుగుతుందని భావిస్తున్నాడా ? అతడు (తల్లి గర్భంలో) కార్చబడిన నీచమైన ఒక నీటి బిందువుకాడా ? తరువాత అతడు ఒక నెత్తుటి ముద్దగా మారాడు ఆ తరువాత అల్లాహ్ అతని శరీరాన్ని తయారు చేశాడు ఆపై అతని అవయవాలను రూపొందించాడు. అటుపై దానినుండి స్త్రీ పురుషుల రెండు రకాల (జాతుల)ను సృష్టించాడు. అలాంటప్పుడు ఆయన మరణించిన వారిని మళ్లీ బ్రతికిం చలేడా?

76. అద్ దహ్ర్

ఆయతులు : 31 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 3 అనంతమైన కాలంలో మానవుడు చెప్పుకోదగిన వస్తువు కాకుండా ఉండిన సమయం ఏదైనా అతనిపై గడిచిందా? మేము మానవుణ్ణి పరీక్షించ టానికి అతనిని ఒక మిశ్రమ వీర్యబిందువుతో సృష్టించాము. ఈ లక్ష్యం కోసం మేము అతనిని వినేవాడుగా , చూసేవాడుగా చేశాము. మేము అతనికి మార్గం చూపాము ఇక అతను కృతజ్ఞతలు తెలిపేవాడైనా కావచ్చు లేదా సత్యాన్ని తిరస్కరించే వాడైనా కావచ్చు.

4 - 22 సత్యతిరస్కారుల కొరకు మేము సంకెళ్లను, కంఠపాశాలను, మండే అగ్నిని సిద్ధపరచి ఉంచాము. సజ్జనులు (స్వర్గంలో) కర్పూర జలం కలిపిన మధుపాత్రలను సేవిస్తారు ఇది ప్రవహించే ఒక సెలయేరు దైవదాసులు దాని నీటితోపాటు మద్యం సేవిస్తారు. వారు తాము కోరిన చోటికి దాని పాయలను సులభంగా తీసుకుపోతారు. వారు ఎలాంటి వారంటే, (ప్రపం చంలో) మొక్కుబడి చెల్లించేవారు, నలువైపుల నుండి ఆపదలు కమ్ముకొనివచ్చే దినానికి భయపడేవారు మరియు అల్లాహ్ మీది ప్రేమతో పేదలకూ , అనాధు లకూ, ఖైదీలకూ అన్నం పెట్టేవారు. (వారు వారితో ఇలా అంటారు) , ‘‘మేము కేవలం అల్లాహ్ కోసమే మీకు అన్నం పెడుతున్నాము. మేము మీ నుండి

ఎలాంటి ప్రతిఫలాన్నిగానీ, కృతజ్ఞతలను గానీ ఆశించటం లేదు. దుర్భరమైన ఆపదలతో కూడుకున్న సుదీర్ఘమైన రోజున మా ప్రభువు విధించే శిక్ష గురించి మేము భయపడుతున్నాము. '' కనుక అల్లాహ్ వారిని ఆనాటి కీడు నుండి రక్షిస్తాడు, వారికి తాజాదనాన్నీ, ఆనందాన్నీ ప్రసాదిస్తాడు. వారి సహనానికి ప్రతిఫలంగా వారికి స్వర్గాన్నీ , పట్టువస్త్రాలనూ ప్రసాదిస్తాడు. అక్కడ వారు ఎత్తైన పీఠాలపై దిండ్లకు ఆనుకుని కూర్చొని ఉంటారు. వారిని ఎండవేడీ బాధించదు. చలి తీవ్రతా వేధించదు. స్వర్గచ్ఛాయలు వారిపైకి వంగి నీడను ఇస్తూ ఉంటాయి దాని పండ్లు ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటాయి (వారు తమ ఇష్టానుసారం వాటిని తెంచుకొని తింటారు). వారి మధ్య వెండి పాత్రలు, గాజుగ్లాసులు అటూ ఇటూ త్రిప్పబడుతూ ఉంటాయి ఆ గాజుగ్లాసులు స్ఫటికం వలె తెల్లనైన వెండితో చేయబడినటువంటివి. వాటిని (స్వర్గ నిర్వాహకులు) కచ్చితమైన అంచనా ప్రకారం నింపి ఉంటారు. అక్కడ వారికి సొంటి కలిపిన మధుపాత్రలు ఇవ్వబడతాయి ఇది స్వర్గంలోని 'సల్ సబీల్' అనే పేరుగల ఒక సెలయేరు. వారి సేవకొరకు పరుగెత్తుతూ అటూ ఇటూ తిరిగే బాలురు ఉంటారు వారు ఎల్లప్పుడూ బాలురుగానే ఉంటారు. మీరు వారిని చూస్తే, వెదజల్లబడిన ఆణిముత్యాలా అని అనుకుంటారు. అక్కడ మీరు ఎటు చూచినా దైవానుగ్రహాలే మీకు కనిపిస్తాయి ఇంకా ఒక మహత్తర సామ్రాజ్య వైభవం కనిపిస్తుంది. వారి ఒంటిపై సన్నని ఆకుపచ్చని పట్టు వస్త్రాలు, ఖరీదైన జలతారు అల్లిన దుస్తులు ఉంటాయి. వారికి వెండి మురుగులు తొడుగుతారు. వారి ప్రభువు వారికి ఎంతో పరిశుద్ధమైన మద్యాన్ని ప్రసాదిస్తాడు. మీకు లభించే ప్రతిఫలం ఇది మీరు చేసిన పనులు విలువైనవిగా గుర్తించబడ్డాయి.

23 - 31 ఓ ప్రవక్తా! మేమే ఈ ఖుర్ఆన్‌ను కొంచెం కొంచెంగా నీపైన అవతరింపజేశాము. కనుక నీవు నీ ప్రభువు ఆజ్ఞ విషయంలో సహనం వహించు. వారిలోని ఏ దుర్మార్గుని మాటలుగానీ , ఏ సత్య తిరస్కారి మాటలుగానీ వినకు. నీ ప్రభువు పేరును ఉదయం , సాయంత్రం స్మరించు. రాత్రివేళ కూడ ఆయన సన్నిధిలో సాష్టాంగపడు. రాత్రివేళ సుదీర్ఘ సమయాలు ఆయనను స్తుతించటంలో గడుపుతూ ఉండు. వారైతే తొందరగా లభించే దానిని (ప్రపంచాన్ని ) ప్రేమిస్తున్నారు. మున్ముందు రానున్న భారమైన దినాన్ని విస్మరిస్తున్నారు. మేమే వారిని సృష్టించాము, వారి కీళ్లను పటిష్ఠపరిచాము. మేము ఎప్పుడు కోరితే అప్పుడు వారి రూపాలను మార్చగలము. ఇదొక హితోపదేశం. ఇప్పుడిక ఇష్టమైన వారు తమ ప్రభువు వైపునకు పోయేమార్గాన్ని అవలంబించవచ్చు. అల్లాహ్ కోరనంత వరకు , మీరు కోరినంత మాత్రాన ఏమీ కాదు. నిశ్చయంగా అల్లాహ్ గొప్ప జ్ఞాని , గొప్ప వివేకి తాను కోరిన వారిని తన కారుణ్యచ్ఛాయలోనికి తీసుకుంటాడు. దుర్మార్గుల కొరకు ఆయన అత్యంత బాధాకరమైన శిక్షను తయారుచేసి ఉంచాడు.

77. అల్ ముర్సలాత్

ఆయతులు : 50 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 7 ఒకదాని తరువాత ఒకటి వరుసగా పంపబడే వాటి (గాలులు) సాక్షిగా! అవి తుఫాను వేగంతో వీస్తాయి మరియు (మేఘాలను) లేపి వ్యాపింప జేస్తాయి , తరువాత (వాటిని) చీల్చివేరుచేస్తాయి, అటుపై (హృదయాలలో దేవుని) జ్ఞాపకాన్ని జనింపజేస్తాయి - సాకుగా కాని లేదా హెచ్చరికగా కాని. ఏ విషయం గురించి మీకు వాగ్దానం చేయబడుతోందో, అది తప్పనిసరిగా జరగవలసి ఉన్నది.

8 - 15 ఎప్పుడైతే నక్షత్రాల కాంతి మందగిస్తుందో , ఆకాశం చీల్చివేయబడు తుందో , పర్వతాలు తుత్తునియలుగా చేయబడతాయో దైవప్రవక్తలు హాజరయ్యే సమయం వస్తుందో (ఆ రోజున అది సంభవిస్తుంది). ఏ రోజుకై ఈ పనులన్నీ ఆపి ఉంచబడ్డాయి ? తీర్పు దినానికై. ఆ తీర్పు దినమంటే ఏమిటో నీకేమి తెలుసు ? ఆ రోజున సత్యతిరస్కారులకు వినాశం కలుగుతుంది.

16 - 19 మేము పూర్వీకులను నాశనం చేయలేదా ? తరువాత మేము రాబోవు వారిని కూడ వారి వెనుకనే పంపుతాము. నేరస్థుల పట్ల మేము ఇలానే వ్యవహరిస్తూ ఉంటాము. సత్య తిరస్కారులకు ఆరోజున వినాశం కలుగుతుంది.

20 - 24 మేము తుచ్ఛమైన నీటితో మిమ్మల్ని పుట్టించలేదా ? ఒక నిర్ణీత కాలం వరకు దానిని ఒక సురక్షిత ప్రదేశంలో నిలిపి ఉంచలేదా? చూడండి మేము దీనిని చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాము. కనుక మేము ఎంతో గొప్ప శక్తి సామర్థ్యాలు కలవారము, సత్య తిరస్కారులకు ఆ రోజున వినాశం కలుగుతుంది.

25 - 28 భూమిని మేము జీవులను , నిర్జీవులను సమీకరించే స్థానంగా చేయలేదా ? అందులో ఎత్తైన పర్వతాలను అమర్చలేదా? మీకు త్రాగటానికి మంచి నీరు ప్రసాదించలేదా ? ఆ రోజున సత్య తిరస్కారులకు వినాశం కలుగుతుంది.

29 - 34 ఇక పదండి , మీరు తిరస్కరిస్తూ ఉండిన దాని వైపునకే. నడవండి , మూడు శాఖలుగా చీలిపోయే నీడ వైపునకు - అది చల్లదనాన్ని ఇచ్చేదీకాదు , అగ్ని బారినుండి రక్షించేదీ కాదు , ఆ అగ్ని , మేడల వంటి పెద్ద పెద్ద రవ్వలను విసురుతుంది. ఆ రవ్వలు (ఎగురుతూ) పసుపుపచ్చని ఒంటెలవలె కనిపిస్తాయి. ఆ రోజున సత్య తిరస్కారులకు వినాశం కలుగుతుంది.

35 - 37 వారు ఏమీ మాట్లాడలేని రోజు, వారికి సాకులు చెప్పుకునే అవకాశం సైతం ఇవ్వబడని రోజు ఇదే. ఆ రోజున సత్య తిరస్కారులకు వినాశం కలుగుతుంది.

38 - 40 ఇది తీర్పు దినం. మేము మిమ్మల్నీ, మీకు పూర్వం గతించిన వారినీ సమావేశపరిచాము. ఇప్పుడు మీరు గనుక నాకు వ్యతిరేకంగా ఏదైనా పన్నాగం పన్నగలిగితే, పన్ని చూడండి. ఆ రోజున సత్య తిరస్కారులకు వినాశం కలుగుతుంది.

41 - 45 దైవభీతి కలవారు ఈ రోజున నీడల క్రింద సెలయేళ్ల మధ్య ఉన్నారు. వారు ఏ పండ్లు కోరినా (అవి వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి). హాయిగా తినండి , త్రాగండి, మీరు చేస్తూ ఉండిన కర్మలకు ప్రతిఫలంగా. మేము సజ్జనులకు ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తూ ఉంటాము. ఆ రోజున సత్య తిరస్కారులకు వినాశం కలుగుతుంది.

46 - 50 కొన్నాళ్లపాటు హాయిగా తినండి , సుఖంగా అనుభవించండి. నిజానికి మీరు అపరాధులు. ఆ రోజున సత్యతిరస్కారులకు వినాశం కలుగు తుంది. వారితో ''(అల్లాహ్ ముందు) తలవంచండి'' అని అన్నప్పుడు, వారు తలవంచరు. ఆ రోజున సత్యతిరస్కారులకు వినాశం కలుగుతుంది. ఇక దీని (ఖుర్ఆన్) తరువాత , మరొక విషయమేముంటుంది వారు విశ్వసించటానికి?

78. అన్ నబా

ఆయతులు : 40 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 5 ఏ విషయాన్ని గురించి వీరు అడుగుతున్నారు ? ఆ 'మహావార్త'ను గురించేనా ? దానిని గురించి వారు రకరకాలుగా చెప్పుకుంటున్నారు. కాదు (వారు అనుకునేది) ఎంతమాత్రం కాదు. త్వరలోనే వారికి తెలిసిపోతుంది. అవును అది ఎంతమాత్రం నిజం కాదు. (అదేమిటో) త్వరలోనే వారికి తెలిసిపోతుంది.

6 - 16 మేము భూమిని పాన్పుగా చేశాము అందులో పర్వతాలను మేకులుగా పాతాము మిమ్మల్ని (స్త్రీ , పురుషుల) జంటలుగా సృష్టించాము మీకు నిద్ర ద్వారా సుఖం కలుగజేశాము రేయిని తెరగా , పగటిని ఉపాధి సమయంగా చేశాము మీపైన దృఢమైన ఏడు ఆకాశాలను నిర్మించాము దేదీప్యమానంగా వెలిగే వెచ్చని దీపాన్ని సృష్టించాము ధాన్యం , కూరగాయలు పండేందుకు, దట్టమైన తోటలు పెరిగేందుకు మేఘాల నుండి ధారాపాతంగా వర్షాన్ని కురిపిస్తున్నాము - ఇదంతా వాస్తవం కాదా?

17 - 20 నిస్సందేహంగా తీర్పుదినం ఒక నిర్ణీత సమయం. శంఖం పూరించబడేరోజున మీరంతా గుంపులు గుంపులుగా లేచి వస్తారు. ఆకాశం తెరువబడుతుంది. అది ద్వారాలు ద్వారాలుగా మారిపోతుంది. పర్వతాలు నడిపింపబడతాయి, ఎండమావులుగా మారిపోతాయి.

21 - 30 నిశ్చయంగా నరకం ఒక మాటు. ధిక్కారులకు అది నివాసస్థలం. యుగాల తరబడి వారు అక్కడే పడివుంటారు. అందులో ఎలాంటి చల్లదనాన్నీ , పానీయాన్నీ వారు చవిచూడలేరు. ఒకవేళ ఏదైనా దొరికితే , అది సల సల కాగే నీరు , గాయాల కడుగు మాత్రమే. అది (వారి కర్మలకు) పరిపూర్ణ ప్రతిఫలం. లెక్క అడగబడుతుందని వారు ఆశించలేదు. మా వాక్యాలను వారు అసత్యాలుగా చిత్రించి పూర్తిగా తిరస్కరించారు. కాని అసలు పరిస్థితి ఏమిటంటే, మేము ప్రతి విషయాన్నీ పొల్లుపోకుండా లెక్క పెట్టి ఉంచాము. ఇక (మీరు కూడబెట్టిన దాని ఫలితాన్ని ) చవిచూడండి. మేము మీ బాధను తప్ప దేన్నీ అధికం చెయ్యం.

31 - 37 నిశ్చయంగా భయభక్తులు కలవారి కొరకు ఒక సాఫల్యస్థానం ఉంది ఉద్యానవనాలూ , ద్రాక్షతోటలూ, సమ వయస్సు గల సుకన్యలూ , మద్యంతో నిండిన మధుపాత్రలూ ఉన్నాయి. ఏ విధమైన వ్యర్థ విషయాలనూ , అసత్యాలనూ వారు అక్కడ వినరు. (ఇదంతా) నీ ప్రభువు తరఫు నుండి లభించే ప్రతిఫలం , చాలినంత బహుమానం- దయామయుడైన దేవుని తరఫు నుండి. ఆయన భూమ్యాకాశాలకూ , ఆ రెంటికీ మధ్య ఉన్న ప్రతి వస్తువుకూ యజమాని. ఆయన ముందు మాట్లాడే ధైర్యం ఎవరికీ లేదు.

38 - 39 ఆత్మ , దూతలు బారులు తీరి నిలబడే రోజున , కరుణామయుడు అనుమతించినవారు తప్ప మరెవ్వరూ మాట్లాడలేరు. అదికూడా సవ్యమైన మాట పలికేవారు మాత్రమే మాట్లాడుతారు. ఆ రోజు రావటం తథ్యం. ఇక ఎవరైనాసరే, ఇష్టమైతే, తమ ప్రభువు వైపునకు మరలేమార్గాన్ని అవలంబిం చవచ్చు.

40 సమీపంలోనే ఉన్న శిక్షను గురించి మేము మిమ్మల్ని హెచ్చరించాము. ఆ రోజున మనిషి తన చేజేతులా చేసుకుని ముందు పంపుకున్నదంతా ప్రత్యక్షంగా చూస్తాడు. (అప్పుడు) సత్యతిరస్కారి ''అయ్యో! నేను మట్టినై ఉంటే ఎంత బాగుండేది'' అని గగ్గోలు పెడతాడు.

## 79.అన్ నాజిఆత్

ఆయతులు : 46 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 9 మునిగి లాగి తీసే , నెమ్మదిగా బయటికి తీసుకుని వెళ్లేవారు (దైవదూతలు) సాక్షిగా , విశ్వంలో వేగంగా తేలియాడేవారు (దైవదూతలు) సాక్షిగా , (వారు ఆజ్ఞాపాలనలో) ఒకరినొకరు మించిపోతారు (దైవాజ్ఞల ప్రకారం) సృష్టి వ్యవహారాలను నడుపుతారు. భూకంపం కుదిపివేసే రోజున, ఆ కుదుపు తరువాత మరొక కుదుపు ఆ రోజున కొందరి హృదయాలు భయంతో వణుకుతూ ఉంటాయి, వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి.

10 - 14 వీరు , ''నిజంగానే మేము మరలించబడి మళ్ళీ తీసుకురాబడతామా ? ఎముకలు కుళ్ళి శిథిలమయిన తరువాత కూడానా?'' అని అంటారు. ఇంకా ''ఈ తిరిగి రావటమనేది చాల నష్టంతో కూడుకున్నదే '' అని కూడ అంటారు. వాస్తవానికి ఒకే ఒక తీవ్రమైన గద్దింపు దెబ్బ పడుతుంది , అంతే, వీరు ఒక్క సారిగా బహిరంగ మైదానంలో చేరి ఉంటారు.

15 - 26 నీకు మూసా వృత్తాంతం ఏమైనా అందిందా? అతని ప్రభువు పవిత్రమైన ''తువా''లోయకు పిలిచి అతనితో ఇలా అన్నాడు, ''ఫిరౌన్ వద్దకు వెళ్ళు. అతడు హద్దులుమీరి ప్రవర్తిస్తున్నాడు అతనికి ఇలా బోధించు , పరిశుద్ధ జీవితం అవలంబించటానికి నీవు సిద్ధంగా ఉన్నావా? నేను నీ ప్రభువు మార్గాన్ని నీకు చూపితే, నీలో ఆయన పట్ల భయభక్తులు కలుగుతాయా?'' తరువాత మూసా (ఫిరౌన్ వద్దకు వెళ్ళి) అతనికి గొప్ప సూచనను చూపాడు. కాని అతడు తిరస్కరించాడు , అంగీకరించలేదు. ఆపైన పన్నాగాలు పన్నటానికి వెళ్ళిపోయాడు. ప్రజలను సమావేశపరచి, అతడు, ''మీకు నేను అందరికంటే గొప్ప ప్రభువును '' అని ఎలుగెత్తిచాటాడు. చివరకు అల్లాహ్ అతడిని ప్రపంచంలోను, పరలోకంలోను శిక్షించటానికి పట్టుకున్నాడు. భయపడే ప్రతి వ్యక్తి కొరకు నిశ్చయంగా ఇందులో గుణపాఠం ఉంది.

27 - 33 మిమ్మల్ని సృష్టించటం కష్టమయిన పనా లేక ఆకాశాన్ని సృష్టిం చటమా ? అల్లాహ్ దానిని నిర్మించాడు, దాని కప్పును బాగా పైకి లేపాడు , తరువాత దానికి సమతూకాన్ని ఏర్పరచాడు దాని రాత్రిని చీకటిగా చేశాడు , దాని పగటిని బహిర్గతం చేశాడు. దీని తరువాత ఆయన భూమిని పరిచాడు అందులో నుంచి దాని నీళ్ళను , గ్రాసాన్ని (మొత్తం వృక్షజాతిని) బయటకు తీశాడు పర్వతాలను అందులో పాతాడు - మీకూ , మీ పశువులకూ జీవన సామగ్రిగా.

34 - 41 ఆ పెద్ద అల్లకల్లోలం చెలరేగి మానవుడు తాను చేసుకున్నదంతా జ్ఞాపకం తెచ్చుకున్న రోజున , చూసే ప్రతిదాని ముందు నరకాన్ని తెచ్చి పెట్టి నప్పుడు , హద్దులు మీరి ప్రవర్తించి ఐహిక జీవితానికి ప్రాధాన్యమిచ్చిన వాడికి నరకమే నివాసమవుతుంది. తన ప్రభువు ముందు నిలబడవలసి ఉంటుందని భయపడి, తన మనస్సును దుష్టవాంఛలకు దూరంగా ఉంచిన వ్యక్తి యొక్క నివాసం స్వర్గమవుతుంది.

42 - 46 వీరు నిన్ను, ''అసలు ఆ గడియ ఎప్పుడొస్తుంది?'' అని అడుగుతున్నారు. దాని సమయమేదో చెప్పటానికి నీకేంపని? ఆ విషయం అల్లాహ్ కు మాత్రమే తెలుసు. ఆయనకు భయపడే ప్రతి మనిషికీ నీవు హెచ్చరిక చేసేవాడవు మాత్రమే. వీరు దానిని చూసిననాడు (ప్రపంచంలో గాని లేక మరణావస్థలోగాని) కేవలం ఒక దినంలో ఉదయంగాని సాయంత్రంగాని ఉన్నట్లు వీరికి అనిపిస్తుంది.

80 అబస

ఆయతులు : 42 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 16 విసుగుకొని ముఖం తిప్పుకున్నాడు, ఆ అంధుడు తన వద్దకు వచ్చాడని, నీకేమి తెలుసు, బహుశా అతను దారికి రావచ్చు లేదా హితోపదేశం గురించి ఆలోచించవచ్చు , హితోపదేశం అతనికి లాభదాయకం కూడా కావచ్చు. లక్ష్యపెట్టనివాడి పట్లనైతే నీవు శ్రద్ధ చూపుతావు వాస్తవానికి , ఒకవేళ అతడు దారికి రాకపోతే, దానికి నీపై బాధ్యత లేదుకదా? ఎవడు తనంతటతాను నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాడో మరియు (దేవునికి) భయపడుతూ ఉంటాడో, అతని వైపునుండి నీవు ముఖం తిప్పుకుంటున్నావు. ఎంతమాత్రం కాదు , ఇదసలు ఒక హితబోధ , ఇష్టమైనవారు దీనిని స్వీకరించ వచ్చు. ఇది ప్రతిష్ఠాత్మకమైన , మహోన్నతమైన, పరిశుద్ధమైన పత్రాలలో ఉన్నది: ఇవి గౌరవనీయులు, సద్వర్తనులు అయిన లేఖకుల చేతులలో ఉంటాయి.

17 - 32 మానవుడు నాశనమవుగాక! ఎంత కరుడుగట్టిన సత్యతిరస్కారి ఇతడు! ఏ వస్తువుతో అల్లాహ్ ఇతన్ని సృష్టించాడు? ఒక రేతస్సు బిందువుతో అల్లాహ్ ఇతన్ని సృష్టించాడు, తరువాత ఇతని అదృష్టాన్ని నిర్ణయించాడు, ఆ తరువాత ఇతని కొరకు జీవన మార్గాన్ని సులభతరం చేశాడు , ఆపైన ఇతనికి మరణాన్నిచ్చి సమాధికి చేర్చాడు. మళ్ళీ తాను తలచినప్పుడు ఆయన ఇతన్ని రెండోసారి లేపి నిలబెడతాడు. ఎంతమాత్రం కాదు , అల్లాహ్ ఏ విధిని గురించి ఆజ్ఞాపించాడో, ఆ విధిని ఇతను నెరవేర్చలేదు. తరువాత మానవుడు తాను తీసుకునే ఆహారం గురించి కొంచెం ఆలోచించాలి. మేము పుష్కలంగా నీటిని కురిపించాము, తరువాత నేలను అద్భుతమైన రీతిలో చీల్చాము, ఆ తరువాత అందులో ధాన్యం, ద్రాక్ష, కూరగాయలు, ఆలివ్ (జైతూన్) వృక్షాలు, దట్టమైన తోటలు, ఇంకా రకరకాల పండ్లను, మేతను మీ కొరకు, మీ పశువుల కొరకు జీవన సామగ్రిగా పండిరచాము.

33 - 42 చివరకు చెవులను చెవిటిగా చేసే ధ్వని ఉద్భతమైనప్పుడు - ఆ రోజున మనిషి తన సోదరునికీ తన తల్లికీ, తన తండ్రికీ, తన భార్యకూ, తన సంతానానికీ దూరంగా పరుగెత్తుతాడు. ఆ రోజున వారిలో ప్రతి ఒక్కరికీ తమను గురించి తప్ప ఇతరుల్ని గురించి పట్టించుకోలేని ఆపత్సమయం వస్తుంది. ఆ రోజున కొందరి ముఖాలు దేదీప్యమానంగా వెలుగుతూ ఆనంద పారవశ్యంతో నవ్వులు చిందిస్తూ ఉంటాయి. కొందరి ముఖాలు ఆ రోజున దుమ్మూ ధూళీ కొట్టుకుని ఉంటాయి, వాటిపై నల్లని మసి ఆవరించి మాడిపోయి ఉంటాయి. వీరే సత్య తిరస్కారులు, దుర్మార్గులు.

81 అత్ తక్వీర్

ఆయతులు : 29 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 14 సూర్యుడు చుట్టివేయబడినప్పుడు , నక్షత్రాలు చెదరిపోయినప్పుడు, పర్వతాలు నడిపించ బడినప్పుడు , పదినెలల చూలి ఒంటెలు వాటి మానాన అవి వదిలివేయబడినప్పుడు, అడవి జంతువులు ఒకచోట సమీకరించబడినప్పుడు, సముద్రాలు ప్రజ్వలింపజేయబడినప్పుడు, ప్రాణాలు (శరీరాలతో) తిరిగి కలపబడినప్పుడు , సజీవంగా పాతిపెట్టబడిన బాలికను, నీవు ఏ తప్పువల్ల హత్య చేయబడ్డావని అడిగినప్పుడు , కర్మల పత్రాలు తెరువబడినప్పుడు, ఆకాశానికున్న తెర తొలగించ బడినప్పుడు , నరకం మండిరచ బడినప్పుడు , స్వర్గం దగ్గరకు తీసుకురాబడినప్పుడు - అప్పుడు ప్రతి మనిషికీ తెలిసిపోతుంది తానేమి తీసుకువచ్చాడో.

15 - 29 కనుక (మీరనుకునేది ఎంతమాత్రం నిజం) కాదు. మరలిపోయే , కనుమరుగయ్యే నక్షత్రాలు సాక్షిగా , గడచిపోయినప్పటి రాత్రి సాక్షిగా , ఊపిరి పీల్చుకున్నప్పటి ఉదయం సాక్షిగా , నేను చెబు తున్నాను , ఇది నిశ్చయంగా అత్యంత గౌరవనీయుడైన ఒక సందేశహరుని వాక్కు , ఆయన ఎంతో శక్తి సంపన్నుడు , సింహాసనాధిపతి వద్ద ఆయనకు గొప్ప స్థానం ఉంది. అక్కడ ఆయన ఆజ్ఞలు పాటించబడతాయి , ఆయన ఎంతో నమ్మకస్తుడు. (ఓ మక్కా ప్రజలారా!) మీ సహచరుడు పిచ్చివాడు కాదు. ఆయన ఆ సందేశ హరుణ్ణి ప్రకాశవంతమైన దిఙ్మండలంపై చూశాడు. అదీగాక అగోచర విషయా లకు సంబంధించిన (ఈ జ్ఞానాన్ని ప్రజలకు అందించే) విషయంలో ఆయన లోభికాడు. ఇది శాపగ్రస్తుడైన ఏ షైతాను వాక్కూ కాదు. అలాంటప్పుడు మీరు ఎటు వెళ్ళిపోతున్నారు. ఇది సకల లోకాల వారి కొరకు ఒక హితోప దేశం, మీలో ఋజుమార్గాన నడవదలచిన ప్రతి వ్యక్తి కొరకు. సకల లోకాల ప్రభువైన అల్లాహ్ తలచనంతవరకు మీరు తలచినంత మాత్రాన ఏమీకాదు.

## 82 అల్ ఇన్ ఫితార్

ఆయతులు : 19 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 5 ఆకాశం బ్రద్దలైనప్పుడు , నక్షత్రాలు చెదరిపోయినప్పుడు, సముద్రాలు చీల్చబడినప్పుడు, సమాధులు తెరువబడినప్పుడు - అప్పుడు ప్రతి మనిషికీ తాను ముందూ వెనుకా చేసుకున్నదంతా ఏమిటో తెలిసిపోతుంది.

6 - 12 ఓ మానవుడా! పరమదాత అయిన నీ ప్రభువును గురించి ఏ విషయం నిన్ను మోసంలో పడ వేసింది ? ఆయనే నిన్ను సృష్టించాడు, ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు, నిన్ను తగిన రీతిలో పొందికగా రూపొం

దించాడు, తాను తలచిన ఆకారంలో నిన్ను క్రమబద్ధంగా మలిచాడు. ఎంత మాత్రం కాదు , (అసలు విషయమేమిటంటే) మీరు శిక్షా ప్రతిఫలాలు లేవని తిరస్కరిస్తున్నారు. కాని మీపై కాపలాదారులు నియమించబడి ఉన్నారు, మీ చర్యలను ఒక కంట కనిపెడుతూ ఉండే గౌరవనీయులైన లేఖకులు మీపై నియమించబడ్డారు. మీరు చేసే ప్రతి పనీ వారికి తెలుసు.

13 - 19 నిశ్చయంగా సజ్జనులు సుఖసంతోషాలలో తేలియాడుతూ ఉంటారు. నిస్సందేహంగా దుర్జనులు నరకానికి పోతారు. తీర్పుదినం నాడు వారు అందులో ప్రవేశిస్తారు. ఇక అందులో నుంచి ఎంతమాత్రం బయటపడలేరు. అవును, ఆ తీర్పు దినమేమిటో నీకేమైనా తెలుసా ? ఆ రోజున ఏ మనిషి కొరకూ ఏదైనా చెయ్యటమనేది ఎవరికీ సాధ్యం కాదు. ఆనాడు తీర్పు ఇచ్చే అధికారం పూర్తిగా అల్లాహ్ చేతుల్లోనే ఉంటుంది.

83 అల్ ముతఫ్ఫిఫీన్

ఆయతులు : 36 జీఅవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 6 తూనికలలో , కొలతలలో తగ్గించి ఇచ్చేవారికి వినాశం ఉన్నది. వారు ప్రజల నుండి తీసుకునే టప్పుడు పూర్తిగా తీసుకుంటారు వారికి కొలిచిగాని తూచిగాని ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు. ఒక మహాదినంనాడు వారు బ్రతికించి తీసుకురాబడనున్నారని వారికి తెలియదా ? ఆ రోజున ప్రజలందరూ సకల లోకాల ప్రభువు సమక్షంలో నిలబడతారు.

7 - 17 ఎంతమాత్రం కాదు, నిశ్చయంగా దుర్జనుల కర్మల పత్రం చెరసాల గ్రంథంలో ఉంటుంది. చెరసాల గ్రంథం అంటే ఏమిటో నీకు తెలుసా ? అదొక వ్రాయబడిన గ్రంథం. తీర్పుదినాన్ని తిరస్కరించే తిరస్కారులకు ఆ రోజున వినాశం ఉన్నది. హద్దుమీరి ప్రవర్తించే దుర్మార్గుడు తప్ప ఏ ఒక్కడూ దానిని తిరస్కరించలేడు. అతడికి మా వాక్యాలు వినిపించినప్పుడు, ''ఇవి పూర్వకాలపు కట్టుకథలే'' అని అంటాడు. ఎంతమాత్రం కాదు, అసలు వారి హృదయాలకు వారి దుష్కార్యాల తుప్పు పట్టింది. ఎంతమాత్రం కాదు , నిశ్చయంగా ఆ రోజున వారు తమ ప్రభువు దర్శనం లభించకుండా చేయ బడతారు. తరువాత వారు నరకంలోకి పోయి పడతారు. అప్పుడు వారితో ''మీరు తిరస్కరిస్తూ ఉండినది ఇదే'' అని చెప్పటం జరుగుతుంది.

18 - 28 ఎంతమాత్రం కాదు , నిస్సందేహంగా సజ్జనుల కర్మల పత్రం ఉన్నతస్థాయి వ్యక్తులకు సంబంధించిన గ్రంథంలో ఉంటుంది. ఉన్నతస్థాయి వ్యక్తులకు సంబంధించిన గ్రంథం అంటే ఏమిటో నీకు తెలుసా ? అదొక వ్రాయబడిన గ్రంథం , దేవునికి సన్నిహితులైన దైవదూతలు దాన్ని కాపలా కాస్తూ ఉంటారు. నిస్సందేహంగా

సజ్జనులు సుఖసంతోషాలలో తేలియాడుతూ ఉంటారు, ఉన్నత పీఠాలపై కూర్చుండి (స్వర్గ దృశ్యాలను) తిలకిస్తూ ఉంటారు. వారి ముఖాలలో నీకు సుఖ సంతోషాల కళాకాంతులు కనిపిస్తాయి. ముద్ర వేయబడిన , సుమధుర మధువు వారికి ఇవ్వబడుతుంది. దానిపై కస్తూరి ముద్ర వేయబడి ఉంటుంది. ఇతరుల్ని మించిపోవాలని కోరుకునే వారు దీన్ని పొందే విషయంలో మించిపోవటానికి కృషిచేయాలి. ఆ మధువులో తస్నీమ్ కలిసి ఉంటుంది ఇదొక సెలయేరు, దీని జలముతో పాటు దైవసాన్నిధ్యం పొందిన వారు మధువు సేవిస్తారు.

29 - 36 ప్రపంచంలో విశ్వసించినవారిని నేరస్తులు హేళన చేస్తుంటారు. వారిముందు నుండి వెళ్ళేటప్పుడు మాటిమాటికీ కళ్లు గీటుతూవారి వైపు సైగలు చేసేవారు. తమ కుటుంబసభ్యుల దగ్గరకు వెళ్ళేటప్పుడు సంబరపడుతూ వెళ్ళేవారు. వారిని చూసినప్పుడు, ''వీరు దారి తప్పారు'' అని అనేవారు. వాస్తవానికి వారు వారిపై కాపలాదారులుగా నియమించి పంపబడలేదు. ఈనాడు విశ్వసించినవారు అవిశ్వాసులను చూసి నవ్వుతున్నారు, ఉన్నత పీఠాలపై కూర్చుండి వారి స్థితిని చూస్తున్నారు. దొరికింది కదా అవిశ్వాసులకు వారు చేస్తూవుండిన చేష్టలకు పుణ్యఫలం.

84 అల్ ఇన్ షిఖాఖ్

ఆయతులు : 25 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 15 ఆకాశం బ్రద్దలైపోయినప్పుడు , అది తన ప్రభువు ఆజ్ఞను శిరసా వహించినప్పుడు , అదే (తన ప్రభువు ఆజ్ఞను శిరసావహించటమే) దాని విధ్యుక్త ధర్మం భూమి విస్తరింపజేయబడినప్పుడు, అది తన లోపల ఉన్నదంతా బయటికి విసిరివేసి ఖాళీ అయినప్పుడు , అది తన ప్రభువు ఆజ్ఞను శిరసా వహించినప్పుడు , అదే (తన ప్రభువు ఆజ్ఞను శిరసావహించటమే) దాని విధ్యుక్త ధర్మం. ఓ మానవుడా! నీవు భారంగా , బలవంతంగా నీ ప్రభువు వైపునకు వెళుతున్నావు, ఆయనను కలుసుకోబోతున్నావు. ఆ తరువాత , కర్మల పత్రం కుడిచేతికి ఇవ్వబడిన వ్యక్తినుండి తేలికపాటి లెక్క తీసుకోబడుతుంది. అప్పుడు అతను తెగ సంతోషపడుతూ తన వారి వైపునకు మరలిపోతాడు. ఇక కర్మల పత్రం వీపు వెనుకనుండి ఇవ్వబడే వ్యక్తి మాత్రం చావును పిలుస్తూ మండుతున్న అగ్నిలోకి పోయి పడతాడు. అతడు తన కుటుంబ సభ్యుల మధ్య సుఖసంతోషాలలో మునిగి ఉండేవాడు. తాను ఎన్నడూ (తన ప్రభువు వైపునకు) మరలిపోనని అతడు భావించేవాడు. మరలిపోవటం ఎందుకు జరగదు , అతని ప్రభువు అతని చర్యలను గమనిస్తూనే ఉండేవాడు.

16 - 25 కనుక , కాదు (మీరనుకునేది నిజం కానేకాదు) , సంధ్యారుణిమ సాక్షిగా , రాత్రివేళ సాక్షిగా , అది సమీకరించేవి సాక్షిగా, నిండు చంద్రుడు సాక్షిగా, నేను చెబుతున్నాను, మీరు తప్పనిసరిగా ఒక స్థితినుండి మరొక స్థితికి క్రమేణా తరలిపోవలసి ఉంటుంది. అలాంటప్పుడు వీరికేమయింది విశ్వసించరు ? వీరి ముందు ఖురాన్ పఠించబడేటప్పుడు సజ్దా (సాష్టాంగ ప్రణామం) ఎందుకు చేయరు ? పైగా ఈ అవిశ్వాసులు తిరస్కరిస్తున్నారు. కాని వాస్తవానికి వీరు (తమ కర్మల పత్రాలలో) నమోదు చేసుకుంటున్న వాటిని అల్లాహ్ బాగా ఎరుగు. కాబట్టి వీరికి వ్యధాభరితమైన శిక్ష ఉందన్న శుభవార్తను వినిపించు. అయితే, విశ్వసించి సత్కార్యాలు చేసినవారికి అనంత ప్రతిఫలం ఉంది.

85 అల్ బురూజ్

ఆయతులు : 22 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 9 దృఢమైన బురుజులు గల ఆకాశం సాక్షిగా! వాగ్దానం చేయబడిన (ప్రళయం) దినం సాక్షిగా! చూసేవాడు సాక్షిగా! చూడబడేది సాక్షిగా! - కందకం వాళ్ళు సర్వనాశనమయ్యారు. అది ఇంధనంతో తీవ్రంగా మండే అగ్ని గల కందకం. అప్పుడు వారు ఆ కందకం చుట్టూ కూర్చుండి విశ్వాసుల పట్ల తాము చేసిన నిర్వాకాన్ని చూస్తూ ఉండేవారు. ఆ విశ్వాసుల పట్ల వారి శత్రుత్వానికి కారణం ఇది తప్ప మరేమీ కాదు - మహాశక్తిమంతుడు , సకల స్తోత్రాలకు తగినవాడు, భూమ్యాకాశాల సామ్రాజ్యానికి యజమాని అయిన అల్లాహ్ ను వారు విశ్వసించారు. ఆ దేవుడు సమస్త విషయాలను గమనిస్తు న్నాడు.

10 - 11 ఎవరైతే విశ్వాసులైన పురుషులను , స్త్రీలను హింసించారో , ఆ తరువాత దానికి పశ్చాత్తాపపడరో , నిశ్చయంగా వారు నరక యాతనకు గురిఅవుతారు. ఆపై వారికి కాల్చివేసే శిక్ష పడుతుంది. విశ్వసించి ఆపై సత్కార్యాలు చేసినవారి కొరకు నిశ్చయంగా స్వర్గవనాలు ఉన్నాయి , వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. ఇదే గొప్ప విజయం.

12 - 22 నిశ్చయంగా నీ ప్రభువు పట్టు బహుగట్టిది. ఆయనే మొదటిసారి పుట్టించాడు , మళ్ళీ ఆయనే రెండోసారి పుట్టిస్తాడు. ఆయన క్షమించేవాడు, ప్రేమించేవాడు, అధికార పీఠాధిపతి, మహిమాన్వితుడు, తాను తలచిన దాన్ని చేయగలవాడు. మీకు సైన్యాల గురించిన సమాచారమేదైనా అందిందా? ఫిరౌన్, సమూద్ ల (సైన్యాల) సమాచారం? కాని తిరస్కార వైఖరిని అవలంబిం చిన వారు తిరస్కరించటంలో నిమగ్నులై ఉన్నారు. వాస్తవానికి అల్లాహ్ వారిని

చక్రబంధం చేసి ఉంచాడు. (వారు తిరస్కరించినంత మాత్రాన ఈ ఖురాన్‌కు నష్టమేమీ వాటిల్లదు) ఈ ఖురాన్ మహత్తరమైనది, ఫలకంపై వ్రాయబడి భద్రంగా ఉన్నది.

86 అత్ తారీఖ్

ఆయతులు : 17 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 17 ఆకాశం సాక్షిగా! రాత్రివేళ ప్రత్యక్షమయ్యేది సాక్షిగా! రాత్రివేళ ప్రత్యక్షమయ్యేదేమిటో నీకు తెలుసా ? అది మెరిసే నక్షత్రం - తనకు ఒక సంరక్షకుడంటూ లేని ప్రాణి ఏదీ లేదు. కనుక మానవుడు తాను ఎలాంటి వస్తువుతో పుట్టించబడ్డాడో కొంచెం ఆలోచించాలి. వెన్నెముకకు, ప్రక్కటెముకలకు మధ్య నుండి దూకుడుగా వెలువడే ఒక ద్రవపదార్థంతో అతడు పుట్టించబడ్డాడు. నిశ్చయంగా ఆయన (సృష్టికర్త) అతన్ని మళ్ళీ సృష్టించగల శక్తిమంతుడు. దాగివున్న రహస్యాలు బట్టబయలై పరీక్షించబడే రోజున మానవుని వద్ద స్వయంగా తనదంటూ ఏ శక్తీ ఉండదు. అతనికి సహాయం చేసేవాడు కూడ ఎవడూ ఉండడు. వర్షాన్ని కురిపించే ఆకాశం సాక్షిగా , (వృక్షజాతి మొలకెత్తేటప్పుడు) బ్రద్దలయ్యే నేల సాక్షిగా , ఇదొక నిర్ణయాత్మకమైన విషయం , నవ్వులాట కాదు. వీరు (అంటే మక్కా అవిశ్వాసులు) కొన్ని పన్నాగాలు పన్నుతున్నారు, నేను కూడ ఒక పన్నాగం పన్నుతున్నాను. కనుక ఓ ప్రవక్తా! ఈ అవిశ్వాసులను వదిలెయ్యి కొంతకాలం పాటు వారి మానాన వారిని వదిలెయ్యి.

87 అల్ ఆలా

ఆయతులు : 19 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 5 (ఓ ప్రవక్తా!) మహోన్నతుడైన నీ ప్రభువు నామాన్ని కొనియాడు ఆయన (విశ్వాన్ని) సృష్టించాడు సమమైన తూకాన్ని నెలకొల్పాడు, జాతకం నిర్ణయించాడు, ఆపై, మార్గం చూపించాడు, వృక్షజాతులను పుట్టించాడు, తిరిగి వాటిని నల్లని చెత్తాచెదారంగా మార్చాడు.

6 - 7 మేము నిన్ను చదివిస్తాము , ఆ తరువాత నీవు మరచిపోవు అల్లాహ్ కోరినదాన్ని తప్ప. ఆయనకు బహిరంగమయినవీ తెలుసు, గోప్యమయినవీ తెలుసు.

8 - 13 మేము నీకు సులభమైన మార్గంలో ఉండే సౌకర్యాన్ని కలుగజేస్తు న్నాము , కనుక నీవు హితబోధ చేస్తూ ఉండు, హితబోధ గనక లాభదాయక మయితే. (దేవునికి) భయపడేవాడు హితబోధను స్వీకరిస్తాడు దానిని పెడచెవిని పెట్టేవాడే పరమ దౌర్భాగ్యుడు, అతడు ఘోరమైన అగ్నిలో పడతాడు. ఇక అందులో అతడు చావడూ , బ్రతకడూ.

14 - 19 పరిశుద్ధతను పాటించి , తన ప్రభువు నామాన్ని స్మరించి , ఆ తరువాత నమాజు చేసినవాడు తప్పక సాఫల్యం పొందుతాడు. కాని మీరు ఐహిక జీవితానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వాస్తవానికి పరలోక జీవితమే మేలైనది, శాశ్వతమైనదీను. ఈ విషయమే పూర్వం వచ్చిన గ్రంథాల్లోనూ చెప్పబడిరది , (అంటే) ఇబ్రాహీమ్ , మూసాలపై అవతరించిన గ్రంథాలలో.

88 అల్ గాషియహ్

ఆయతులు : 26 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 16 ముంచుకు వచ్చే ముప్పు (అంటే ప్రళయం)ను గురించిన సమాచారం నీకేమైనా అందిందా ? కొందరి ముఖాలలో ఆ రోజున భయాందోళనలు కనిపిస్తాయి , ఎక్కువ శ్రమపడుతూ , అలసిపోతారు, తీవ్రమైన అగ్నిలో చిక్కుకుపోయి ఉంటారు. త్రాగేందుకు వారికి సలసల కాగే చెలమ నీరు ఇవ్వబడుతుంది. వారి కొరకు ఎండిన ముళ్ల గడ్డి తప్ప మరొక ఆహారం ఉండదు , అది బలమూ నీయదు , ఆకలినీ తీర్చదు. ఆ రోజున కొందరి ముఖాలు కళ కళలాడుతూ ఉంటాయి , తాము చేసుకున్న సత్కార్యాలకు వారు సంతోషపడతారు , అత్యున్నతమైన స్వర్గంలో ఉంటారు. అక్కడ వారు ఎలాంటి వృధా విషయాలను వినరు , అందులో సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి , అక్కడ ఎత్తైన పీఠాలు ఉంటాయి , పాత్రలు పెట్టబడి ఉంటాయి , పెద్ద పెద్ద దిండ్లు వరుసలు వరుసలుగా అమర్చ బడి ఉంటాయి, అందమైన తివాచీలు పరచబడి ఉంటాయి.

17 - 20 అయితే వీరు ఒంటెలను చూడరా అవి ఎలా సృష్టించబడ్డాయో ? ఆకాశాన్ని చూడరా అది పైకి ఎలా ఎత్తబడిరదో? కొండలను చూడరా అవి ఎలా పాతిపెట్టబడ్డాయో? భూమిని చూడరా అది ఎలా పరచబడిరదో?

21 - 26 సరే అయితే , (ప్రవక్తా) హితబోధచేస్తూ ఉండు , నీవు కేవలం హితబోధ చేసేవాడవు మాత్రమే , వారిని ఏ విధంగానూ బలవంతంచేసే వాడవు కావు. కాని ఎవరైతే ముఖాన్ని తిప్పుకుంటారో ,(సత్యాన్ని ) తిరస్కరిస్తారో , అల్లాహ్ అతనికి భారీ శిక్ష విధిస్తాడు. వీరు (చివరికి) మా వైపునకే మరలి రావలసి ఉంది. ఆపై లెక్క చూడవలసిన బాధ్యత మా మీదనే ఉంది.

89 అల్ ఫజ్ర్

ఆయతులు : 30 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 5 ఉదయం సాక్షిగా! పది రాత్రులు సాక్షిగా! సరి , బేసి (సంఖ్య)లు సాక్షిగా! నిష్క్రమిస్తున్నప్పటి రాత్రి సాక్షిగా! వీటిలో విజ్ఞత కలవాని కొరకు ఏ ప్రమాణమూ లేదా?

6 - 14 ఎత్తైన స్తంభాల వారైన ఆదె ఇరమ్ జాతి పట్ల మీ ప్రభువు ఎలా ప్రవర్తించాడో మీరు చూడలేదా ? దానిని పోలిన మరొక జాతి ఏదీ యావత్తు ప్రపంచ దేశాల్లోనే సృష్టించబడలేదు. ఇంకా లోయలో కొండరాళ్లను తొలిచిన సమూద్ జాతిపట్ల, మేకుల వారైన ఫిరౌన్ జాతిపట్ల (మీ ప్రభువు ఎలా ప్రవర్తించాడో మీరు చూడలేదా). ప్రపంచ దేశాల్లో దుర్మార్గానికి ఒడిగట్టి ఘోరమైన ఉపద్రవాలను సృష్టించిన వారు వీరే. చివరకు మీ ప్రభువు వారిపై శిక్ష అనే కొరడాను రaళిపించాడు. యథార్థమేమి టంటే మీ ప్రభువు మాటుపేసి ఉన్నాడు.

15 - 26 అయితే మానవుడు ఎలాంటి వాడంటే , అతని ప్రభువు అతనికి గౌరవాన్నీ , వరాలనూ ప్రసాదించి అతన్ని పరీక్షకు గురిచేసినప్పుడు, ‘‘నా ప్రభువు నా గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడిరపజేశాడు ’’ అని అంటాడు. ఆయన అతనికి లభించే ఉపాధిని తగ్గించి అతన్ని పరీక్షించినప్పుడు , ‘‘నా ప్రభువు నన్ను అవమానపరచాడు ’’ అని అంటాడు. ఎంతమాత్రం కాదు , కాని అసలు మీరు అనాథులను గౌరవంగా చూడరు , నిరుపేదలకు అన్నం పెట్టే విషయంలో మీరు ఒకరినొకరు ప్రోత్సహించుకోరు , వారసత్వపు ఆస్తి మొత్తాన్ని పోగుచేసి తినేస్తారు , ధనవ్యామోహంలో దారుణంగా చిక్కుకుపోయారు. ఎంతమాత్రం కాదు , భూమిని ఎడాపెడా దంచి తుత్తునియలుగా చేయటం జరిగినప్పుడు, మీ ప్రభువు అవతరిస్తాడు , దైవదూతలు బారులుగా తీరి నిలబడి ఉంటారు. ఆ రోజున నరకం ముందుకు తీసుకురాబడుతుంది , ఆనాడు మానవునికి తెలిసివస్తుంది. అప్పుడు అతనికి తెలిసివచ్చినందువల్ల ప్రయోజనం ఏమిటి ? అతను, ‘‘అయ్యో! నా ఈ జీవితం కొరకు నేను ముందుగానే కొంత సామగ్రిని ఏర్పాటు చేసుకుని ఉంటే ఎంత బాగుండేది! ’’ అని అంటాడు. ఇక ఆ రోజున అల్లాహ్ ఎలాంటి శిక్ష విధిస్తాడో, అలాంటి శిక్షను మరెవ్వరూ విధించలేరు. ఇంకా అల్లాహ్ ఎలా బిగించి కట్టిపేస్తాడో , అలా బిగించి మరెవ్వరూ కట్టలేరు.

27 - 30 (మరొకవైపు ఈ విధంగా సెలవీయటం జరుగుతుంది) తృప్తిచెందిన మనసా! పద నీ ప్రభువు సన్నిధికి , (నీకు లభించే సత్ఫలానికి) ఆనందిస్తూ. మరియు (నీ ప్రభువునకు) ఇష్టమైన దానివై. చేరిపో (పుణ్యాత్ములైన) నా దాసులలో, ప్రవేశించు నా స్వర్గంలో.

90 అల్ బలద్

ఆయతులు : 20 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 20 కాదు , నేను ఈ నగరం (మక్కా)పై ప్రమాణం చేసి చెబుతున్నాను : (ఓ ప్రవక్తా) అసలు విషయం ఏమిటంటే, ఈ నగరంలో నిన్ను హలాల్ చేసుకున్నారు. తండ్రి (అంటే ఆదమ్ అస్సలామ్) సాక్షిగా , ఆయనకు పుట్టిన సంతానం సాక్షిగా! మేము మానవుణ్ణి శ్రమకోసం పుట్టించాము. అతడు తన నెవ్వరూ అదుపు చేయలేరని అనుకుంటున్నాడా? నేను అపార ధనరాసుల్ని ఖర్చుపెట్టాను అని అంటాడతను. తనను ఎవరూ గమనించలేదని అతడు భావిస్తున్నాడా? మేము అతనికి రెండు కళ్ళూ , ఒక నాలుకా, రెండు పెదవులూ ప్రసాదించలేదా ? ఇంకా స్పష్టమైన రెండు (మంచీ చెడుల) మార్గాలను అతనికి చూపాము. కాని అతడు కష్టతరమైన కనుమ దాటిపోవటానికి సాహసించలేదు. కష్టతరమైన ఆ కనుమ అంటే ఏమిటో మీకు తెలుసా ? ఎవరినైనా బానిసపు బంధనాల నుండి విముక్తి గావించటం , లేదా ఆకలిగొన్న రోజున సమీప అనాథుడికి లేదా దిక్కులేని నిరుపేదకు అన్నం పెట్టడం. అంతేకాదు , (వీటితో పాటు) విశ్వసించి , సహనం, సానుభూతుల్ని గురించి ఒకరికొకరు బోధించుకునే వారిలో కూడ మనిషి చేరిపోవాలి. వీరే కుడిపక్షం వారు. మా వాక్యాలను తిరస్కరించిన వారు వామపక్షానికి చెందినవారు. వారిని అగ్నిచుట్టుముట్టి ఉంటుంది.

91 అష్షమ్స్

ఆయతులు : 15 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 10 సూర్యుడు సాక్షిగా , అతని ఎండ సాక్షిగా, సూర్యుని తరువాత వచ్చేటప్పటి చంద్రుడు సాక్షిగా, (సూర్యుణ్ణి) దేదీప్యమానం చేసేటప్పటి పగలు సాక్షిగా , (సూర్యుణ్ణి) మరుగుపరచేటప్పటి రాత్రి సాక్షిగా , ఆకాశం సాక్షిగా, దాన్ని నెలకొల్పినవాడు సాక్షిగా, నేలసాక్షిగా, దాన్ని పరచినవాడు సాక్షిగా, మానవాత్మ సాక్షిగా, ఆ ఆత్మను తీర్చిదిద్ది ఆపై దానికి సంబంధించిన మంచీ చెడులను దానికి తెలియజేసినవాడు సాక్షిగా , నిశ్చయంగా తన ఆత్మను పరిశుద్ధపరచుకున్న వ్యక్తి సఫలుడయ్యాడు, దానిని అణచివేసినవాడు విఫలు డయ్యాడు.

11 - 15 సమూద్ జాతి తన దుర్మార్గపు వైఖరి కారణంగా ధిక్కరించింది. ఆ జాతికి చెందిన పరమ దుర్మార్గుడొకడు దిగ్గున లేచాడు, అప్పుడు దైవప్రవక్త ఆ ప్రజల్ని , ''జాగ్రత్త! దేవుని ఒంటె జోలికి పోకండి , దాన్ని నీళ్ళు త్రాగకుండా ఆటంకపరచకండి'' అని హెచ్చరించాడు. కాని వారు ఆయన మాటను ధిక్కరించి ఒంటెను చంపేశారు. చివరకు వారి పాపాల పర్యవసానంగా వారి ప్రభువు వారందరినీ ఒకేసారి సర్వనాశనం చేసే మహావిపత్తును వారిపైకి పంపాడు. (ఈ చర్యవల్ల) ఏదైనా దుష్పరిణామం సంభవిస్తుందన్న ఎలాంటి భయమూ ఆయనకు లేదు.

92 అల్ లైల్

ఆయతులు : 21 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 11 ఆవరించినప్పటి రాత్రి సాక్షిగా! ప్రకాశించునప్పటి పగలు సాక్షిగా! మగ , ఆడ జాతుల్ని సృష్టించినవాడు సాక్షిగా! వాస్తవంగా మీరు చేసే ప్రయత్నాలు విభిన్న రకాలుగా ఉంటాయి. కనుక ఎవరు (దైవమార్గంలో) ధనాన్ని వినియోగించాడో, (దైవ అవిధేయతకు) భయపడ్డాడో , మంచిని సత్య మని అంగీకరించాడో , అతనికి మేము సన్మార్గంలో నడిచేందుకు సౌకర్యాన్ని కలుగజేస్తాము. ఎవరు పిసినారితనం వహించాడో , (దేవునిపట్ల) నిర్లక్ష్యవైఖరి అవలంబించాడో, పైగా మంచిని తృణీకరించాడో , అతనికి మేము కఠిన మార్గంలో నడిచేందుకు సౌకర్యాన్ని కలుగజేస్తాము. అతను నశించి నప్పుడు ఇక అతని ధనం అతనికి ఎలా ఉపయోగపడుతుంది?

12 - 21 నిస్సందేహంగా సన్మార్గం చూపవలసిన బాధ్యత మాపై ఉంది. వాస్తవానికి పరలోకం , ఇహలోకం రెండిటికీ మేమే యజమానులం. కనుక నేను మిమ్మల్ని ప్రజ్వలించే అగ్ని గురించి హెచ్చరించాను. (సత్యాన్ని ) తిరస్క రించి, ముఖం తిప్పుకున్న పరమ దౌర్భాగ్యుడు తప్ప మరెవ్వరూ అందులో కాలిపోరు. పరిశుద్ధుడు కావటానికి తన సంపదను ఖర్చుచేసే పరమ దైవభీతి పరుడు దానికి దూరంగా ఉంచబడతాడు. అతనికి ఎవ్వరూ ఏ విధమైన ఉపకారం చేయలేదు , దానికి అతను బదులు తీర్చేందుకు. అతను కేవలం మహోన్నతుడైన తన ప్రభువు ప్రసన్నతను పొందటానికి మాత్రమే ఈ పని చేస్తున్నాడు. ఆయన తప్పకుండా (అతడంటే) సంతోషిస్తాడు.

93 అజ్ జుహా

ఆయతులు : 11 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన  అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 11 వెలుగు విరజిమ్మే పగలు సాక్షిగా! ప్రశాంతంగా ఆవరించే రాత్రి సాక్షిగా! (ఓ ప్రవక్తా!) నీ ప్రభువు నిన్ను ఏమాత్రం విడనాడలేదు, నీ పట్ల ఆయన అసంతృప్తిచెందనూ లేదు. నిశ్చయంగా రాబోయే కాలం నీ కొరకు గత కాలం కన్నా మేలైనదిగా ఉంటుంది. త్వరలోనే నీకు నీ ప్రభువు నీవు సంతోషపడే అంత అధికంగా ప్రసాదిస్తాడు. నీవు అనాథుడుగా ఉండటం చూసి ఆయన నీకు ఆశ్రయం కల్పించలేదా ? నీవు మార్గమేదో తెలియని వాడవుగా ఉన్నప్పుడు ఆయన నీకు సన్మార్గం చూపించాడు. నీవు నిరుపేదగా ఉన్నప్పుడు, ఆయన నిన్ను ధనవంతుడుగా చేశాడు. కావున నీవు అనాథులపట్ల కఠినంగా ప్రవర్తించకు. యాచకుణ్ణి కసురుకోకు. నీ ప్రభువు వరాలను బహిర్గతం చెయ్యి.

94 అలమ్ నష్రహ్

ఆయతులు : 8                అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన  అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 8 (ఓ ప్రవక్తా) మేము నీ హృదయాన్ని నీ కొరకు తెరవలేదా ? నీ నడుమును విరిచేస్తూవుండిన ఒక పెద్ద భారాన్ని నీపై నుండి దించివేశాము, నీ కొరకు నీ పేరు ప్రఖ్యాతుల్ని ఇనుమడిరపజేశాము. కనుక కష్టాలతోపాటు తప్పనిసరిగా సుఖాలు కూడ ఉన్నాయి. ఇందులో ఎలాంటి సందేహంలేదు. కష్టాలతోపాటు తప్పనిసరిగా సుఖాలు కూడా ఉన్నాయి.  కాబట్టి నీకు తీరిక లభించినప్పుడు, కఠోరమైన ఆరాధనలో నిమగ్నుడవైపో. నీ ప్రభువు మీదనే నీ మనస్సును లగ్నం చెయ్యి.

95 అత్ తీన్

ఆయతులు : 8                అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన  అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 8  అత్తి, ఆలివ్‌లు సాక్షిగా! సీనా పర్వతం సాక్షిగా! ఈ శాంతి నగరం (మక్కా) సాక్షిగా , మేము మానవుణ్ణి అద్భుతమైన  ఆకృతిలో సృజించాము.  తరువాత మేము  అతన్ని వెనక్కి త్రిప్పి నీచాతి నీచుడుగా మార్చివేశాము, విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు తప్ప. అలాంటి వారికి అనంత ప్రతిఫలం లభిస్తుంది. కాబట్టి

(ప్రవక్తా) దీని తరువాత శిక్షా బహుమానాల విషయంలో నిన్ను ఎవరు తిరస్క రించగలరు ? అధికారులందరికన్నా అల్లాహ్ గొప్ప అధికారి కాదా?

96 అల్ అలఖ్

ఆయతులు : 19 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 5 (ఓ ప్రవక్తా) పఠించు సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు. పఠించు: నీ ప్రభువు పరమదయాళువు. ఆయన కలం ద్వారా జ్ఞానం నేర్పాడు , మనిషి ఎరుగని జ్ఞానాన్ని అతనికి ప్రసాదించాడు.

6 - 19 ఎంతమాత్రం కాదు మానవుడు తనను తాను ఎవరి అక్కరలేని వాడననీ , సర్వస్వతంత్రుడననీ మితిమీరి ప్రవర్తిస్తున్నాడు. (అయితే) చివరికి అందరూ నీ ప్రభువు వైపునకే తప్పనిసరిగా మరలిపోవలసి ఉంటుంది. ఒక దాసుడు నమాజు చేస్తుంటే అతన్ని నిరోధించే వ్యక్తిని నీవు చూశావా ? ఒకవేళ (ఆ దాసుడు) ఋజుమార్గంలో ఉంటే లేదా భయభక్తుల్ని బోధిస్తూ ఉంటే , అప్పుడు నీ అభిప్రాయం ఏమిటి ? ఒకవేళ (నిరోధిస్తున్న ఈ వ్యక్తి) సత్యాన్ని తిరస్కరిస్తుంటే , (దాన్నుండి) విముఖుడవుతుంటే , అప్పుడు నీ అభిప్రాయం ఏమిటి ? అల్లాహ్ చూస్తున్నాడనే విషయం అతనికి తెలియదా ? అలా ఎంతమాత్రం జరగదు అతడు గనక మానకపోతే , మేము అతన్ని, అతని నుదుటి వెండ్రుకలు పట్టుకుని ఈడుస్తాము అబద్ధానికి , ఘోరపాపానికి పాల్పడిన నుదురు అది. అతడు తన మద్దతుదారుల మూకను పిలుచుకోమను. మేము కూడ మా శిక్షించే దూతల్ని పిలుచుకుంటాము. ఎంతమాత్రం కాదు, అతని మాటలు వినకు సజ్దా చెయ్యి (నీ ప్రభువు) సాన్నిధ్యాన్ని పొందు.

97 అల్ ఖద్ర్

ఆయతులు : 5 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 5 మేము దీని (ఖురాన్)ని ఘనమైన రాత్రియందు అవతరింపజేశాము. ఆ ఘనమైన రాత్రి ఏమిటో మీకు తెలుసా? ఆ ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే కూడా ఎంతో శ్రేష్ఠమైనది. ఆ రాత్రి ఆత్మ దైవదూతలు తమ ప్రభువు

అనుమతితో ప్రతి ఆజ్ఞను తీసుకుని అవతరిస్తారు. ఆ రాత్రి అంతా తెల్లవారే వరకు పూర్తిగా శాంతి శ్రేయాలే అవతరిస్తూ ఉంటాయి.

98 అల్ బయ్యినహ్

ఆయతులు : 8 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 3 గ్రంథ ప్రజలలోని , బహుదైవారాధకులలోని అవిశ్వాసులు తమ వద్దకు స్పష్టమైన ప్రమాణం వచ్చేవరకు (తమ అవిశ్వాస వైఖరి నుండి) వెనక్కి మరలరు. (స్పష్టమైన ప్రమాణం అంటే) అల్లాహ్ తరఫు నుండి ఒక ప్రవక్త వచ్చి సత్యమైన సవ్యమైన రచనలు గల పరిశుద్ధమైన సహీఫాలను చదివి వినిపించటం.

4 - 5 పూర్వం గ్రంథం ఇవ్వబడిన ప్రజలలో చీలికలు ఏర్పడిరది వారి వద్దకు (ఋజుమార్గానికి సంబంధించిన) స్పష్టమైన బోధవచ్చిన తరువాతనే. వారు అల్లాహ్ కు దాస్యం చెయ్యాలని , పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని , నమాజ్‌ను స్థాపించాలని , జకాత్ ఇస్తూ ఉండాలని మాత్రమే ఆదేశించటం జరిగింది. ఇదే ఎంతో సరి[illegible]న, సవ్యమైన ధర్మం.

6 - 8 గ్రంథ ప్రజలలో , బహుదైవారాధకులలో సత్యాన్ని తిరస్కరించినవారు తప్పనిసరిగా నరకాగ్నిలోకే పోతారు , అందులోనే శాశ్వతంగా ఉండిపోతారు. వారు సృష్టిలోకెల్లా పరమ నీచులు. కాని విశ్వసించి సత్కార్యాలు చేసేవారు నిస్సందేహంగా సృష్టిలో అత్యంత శ్రేష్ఠులు. వారికి వారి ప్రభువు వద్ద లభించే ప్రతిఫలం - శాశ్వత నివాస స్థలాలైన స్వర్గవనాలు, వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి వారు వాటిలో కలకాలం ఉంటారు. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు వారు కూడ అల్లాహ్ పట్ల సంతృప్తిచెందారు. ఇదీ తన ప్రభువు పట్ల భయభక్తులు కలిగి ఉండే వ్యక్తికి లభించే మహాభాగ్యం.

99 అజ్ జిల్ జాల్

ఆయతులు : 8 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 8 భూమి తన పూర్తి తీవ్రతతో ఊపి వేయబడినప్పుడు , భూమి తన లోపల ఉన్న మొత్తం భారాన్ని తీసి బయటవేసినప్పుడు, మానవుడు, ''దీనికే మయింది (ఇలా ఊగిపోతోంది) '' అని అంటాడు. ఆ రోజున అది తన (పైన సంభవించిన) విశేషాలను వివరిస్తుంది. ఎందుకంటే , నీ ప్రభువు దాన్ని (అలా చెయ్యిఅని) ఆజ్ఞాపించి ఉంటాడు. ప్రజలు తమ కర్మలను చూసుకునేం దుకుగాను , ఆ రోజున భిన్న పరిస్థితుల్లో దేవుని వైపునకు మరలుతారు. ఆ తరువాత ఎవడైనా రవ్వంత సత్కార్యం చేసి ఉన్నాసరే దాన్ని అతను చూసుకుం టాడు. అలాగే ఎవడైనా రవ్వంత దుష్కార్యం చేసివున్నాసరే దాన్నీ అతను చూసుకుంటాడు.

100 అల్ ఆదియాత్

ఆయతులు : 11 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 11 నురుగులు క్రక్కుతూ , వగర్చుతూ, పరుగెడుతూ తమ డెక్కలతో నిప్పురవ్వలను చెరుగుతూ పోయి తెల్లవారేటప్పటికి మెరుపుదాడి చేసేవి (గుర్రాలు) సాక్షిగా! ఆ సమయంలో అవి దుమ్ము ధూళి కూడ రేపుతాయి , అదే స్థితిలో అవి ఏదైనా జన సమూహంలోకి జొరబడతాయి కూడ. అసలు విషయం ఏమిటంటే , మానవుడు తన ప్రభువు పట్ల ఎంతో కృతఘ్నుడై ఉన్నాడు. దీనికి స్వయంగా అతడే సాక్షి అతడు సిరిసంపదల వ్యామోహంలో పూర్తిగా మునిగిపోయాడు. సమాధులలో (పాతిపెట్టబడి) ఉన్నది వెలికి తీయ బడే సమయాన్ని గురించి అతనికి తెలియదా? ఇంకా హృదయాల్లో (దాగి) ఉన్న వాటిని బయటికి తీసి పరిశీలించే వేళను గురించి అతనికి తెలియదా ? నిశ్చయంగా ఆ రోజున వారి ప్రభువు వారిని గురించి పూర్తిగా తెలుసుకుని ఉంటాడు.

101 అల్ ఖారిఅహ్

ఆయతులు : 11 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 11 అదొక మహా ఉపద్రవం! ఏమిటా మహా ఉపద్రవం ? ఆ మహా ఉపద్రవమేమిటో నీకేమి తెలుసు ? ఆ రోజున మానవులు చెల్లాచెదరైన దీపపు పురుగుల మాదిరిగా అయిపోతారు. పర్వతాలు ఏకిన రంగు రంగుల ఉన్ని వలె మారిపోతాయి. ఆ తరువాత ఎవరి త్రాసు పళ్ళాలైతే బరువుగా ఉంటాయో , వారు తమకు ఇష్టమైన భోగభాగ్యాల్లో

ఓలలాడుతారు. మరెవరి త్రాసు పళ్ళాలైతే తేలికగా ఉంటాయో , వారి నివాస స్థలం లోతైన గొయ్యి అవుతుంది. అదేమిటో మీకేమైనా తెలుసా? అది భగ భగ మండే అగ్ని గుండం.

102 అత్ తకాసూర్

ఆయతులు : 8 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 8 వీలైనంత ఎక్కువగా ఒకరిని మించి ఒకరు ప్రపంచాన్ని పొందాలనే ధ్యాస మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరకు మీరు (ఈ వ్యామోహం లోనే) శ్మశానికి చేరుకుంటారు. (మీరనుకునేది) ఎంతమాత్రం కాదు , త్వరలోనే మీకు తెలిసిపోతుంది. మరొకసారి (వినండి , మీరనుకునేది) ఎంతమాత్రం నిజం కాదు , అతి త్వరలోనే మీకు తెలిసిపోతుంది. ఎంతమాత్రం కాదు , మీరు గనక నిశ్చయజ్ఞానంతో (మీ ఈ వైఖరి పర్యవసానాన్ని ) తెలుసుకుంటే, (మీ నడవడిక ఇలా ఉండదు). మీరు నరకాన్ని చూసితీరుతారు. మరొకసారి (వినండి) మీరు పూర్తి నమ్మకంతో దాన్ని చూస్తారు. తరువాత ఆ రోజున మీరు తప్పనిసరిగా ఈ సౌఖ్యాలను గురించి ప్రశ్నించబడతారు.

103 అల్ అస్ర్

ఆయతులు : 3 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 3 కాలం సాక్షిగా! నిస్సందేహంగా మానవుడు పెద్ద నష్టానికి గురిఅయి ఉన్నాడు. విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉండేవారూ, ఒకరికొకరు సత్యోపదేశం, సహన బోధ చేసుకునేవారూ తప్ప.

104 అల్ హుమజహ్

ఆయతులు : 9 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 9 ప్రజలను దెప్పి పొడవటంలో , పరోక్షంగా వారి లోపాలను ఎంచటంలో ఆసక్తి కనబరచేవాడూ , ధనాన్ని కూడబెట్టిన దానిని మాటిమాటికి లెక్కబెట్టి ఉంచేవాడూ అయిన ప్రతి వ్యక్తీ సర్వనాశన మవుతాడు. అతడు తన ధనం తన వద్ద కలకాలం ఉంటుందని అనుకుంటున్నాడు. అలా ఎన్నటికీ జరగదు. అతడు నుజ్జు నుజ్జు చేసే స్థలంలో విసరివేయబడతాడు. అలా నుజ్జు నుజ్జుగా చేసే స్థలం ఏమిటో నీకు తెలుసా ? అది తీవ్రంగా ప్రజ్వరిల్లజేయబడిన దైవాగ్ని. అది గుండెల దాక చొచ్చుకు పోతుంది. అందులో వారు పడిన తరువాత అది మూసివేయబడుతుంది. ఆ విధంగా వారు పొడుగాటి అగ్ని కీలల మధ్య (చిక్కుకుని ఉంటారు).

## 105 అల్ ఫీల్

ఆయతులు : 5 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 5 ఏనుగుల వారిపట్ల నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో నీవు చూడలేదా ? ఆయన వారి కుట్రను భగ్నం చెయ్యలేదా? ఆయన వారిపైకి పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి మట్టి కాల్చగా తయారయిన కంకర రాళ్ళను వారిపైకి విసరివేస్తూండేవి. చివరికి వారి స్థితిని (పశువులు) తినేసిన పొట్టు మాదిరిగా మార్చివేశాడు.

## 106 ఖురైష్

ఆయతులు : 4 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 4 చూడండి, ఖురైష్ ప్రజలు ఎలా అలవాటుపడ్డారో! చలి కాలంలోనూ , ఎండాకాలంలోనూ ప్రయాణాలకు ఎలా అలవాటుపడ్డారో! కనుక వారు ఈ ఆలయ ప్రభువును ఆరాధించాలి. ఆయన వారికి ఆహారమిచ్చి ఆకలి బాధనుండి కాపాడాడు శాంతిని ప్రసాదించి భయం నుండి రక్షించాడు.

## 107 అల్ మాఊన్

ఆయతులు : 7 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 7 పరలోక శిక్షను , బహుమానాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా ? అతడే అనాథులను కసరికొట్టేవాడు , పేదవాళ్ళకు అన్నం పెట్టుఅని ప్రోత్సహిం చనివాడు. పోతే , తమ నమాజుల పట్ల అశ్రద్ధవహించేవారు , ప్రదర్శనా బుద్ధితో వ్యవహరించేవారు , వాడుకునే మామూలు వస్తువులను (ప్రజలకు) ఇవ్వటానికి వెనుకాడేవారు సర్వనాశనమవుతారు.

108 అల్ కౌసర్

ఆయతులు : 3 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 3 (ప్రవక్తా) మేము నీకు కౌసర్ ప్రసాదించాము. కనుక నీవు నీ ప్రభువు కొరకే నమాజు చెయ్యి. ఖుర్బానీ కూడా ఇవ్వు. నిస్సందేహంగా నీ శత్రువే నామరూపాలు లేకుండా పోయేవాడు.

109 అల్ కాఫిరూన్

ఆయతులు : 6 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 6 ఇలా ప్రకటించు , ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించేవాటిని నేను ఆరాధించను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు. మీ ధర్మం మీదే నా ధర్మం నాదే.

110 అన్ నస్ర్

ఆయతులు : 3 అవతరణ : మదీనాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 3 అల్లాహ్ సహాయం వచ్చినప్పుడు , విజయ భాగ్యం లభించినప్పుడు , ప్రజలు తండోప తండాలుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించటాన్ని నీవు చూసి నప్పుడు (ప్రవక్తా) నీవు నీ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పవిత్ర

నామాన్ని స్మరించు , ఇంకా ఆయన మన్నింపును వేడుకో. నిస్సందేహంగా ఆయన పశ్చాత్తాపాన్ని ఎంతగానో అంగీకరించేవాడు.

111 అల్ లహాబ్

ఆయతులు : 5 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 5 అబూ లహాబ్ చేతులు విరిగిపోయాయి! అతడు సర్వనాశనం అయిపోయాడు! అతడి ఆస్తి పాస్తులు , అతడి సంపాదన అంతా దేనికీ పనికి రాకుండా పోయింది. చివరికి అతడు తప్పకుండా భగ భగ మండే అగ్నిలో పడవేయబడతాడు. అంతేకాదు (అతడితోపాటు) అతడి భార్య కూడ అందులో పడవేయబడుతుంది. ఆమె చాడీలు చెబుతూ కలహాలు రేపే స్త్రీ. ఆమె మెడలో బాగా పేనిన ఒక త్రాడు ఉంటుంది.

112 అల్ ఇఖ్లాస్

ఆయతులు : 4 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 4 ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షా పరుడు ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడ ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు.

113 అల్ ఫలఖ్

ఆయతులు : 5 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 5 ఇలా అను: నేను ఉదయం ప్రభువు శరణుకోరుతున్నాను - ఆయన సృష్టించిన ప్రతిదాని కీడు నుండి , కమ్ముకునే చీకటి రాత్రి కీడునుండి , ముడులపై మంత్రించే వారి కీడు నుండి , అసూయాపరుడు అసూయపడే టప్పటి కీడు నుండి.

**114 అన్ నాస్**

ఆయతులు : 6 అవతరణ : మక్కాలో

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

1 - 6 ఇలా అను: నేను మానవుల ప్రభువు , మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్య దైవం (అయిన అల్లాహ్) శరణుకోరుతున్నాను - దుష్టభావాలు రేకెత్తించేవాడి కీడునుండి. వాడు మాటిమాటికీ మరలి వస్తూ ప్రజల మనస్సుల్లో దుష్ట భావాలను రేకెత్తిస్తాడు , వాడు జిన్నాతు జాతికి చెందినవాడైనా కావచ్చు లేదా మానవ జాతికి చెందినవాడైనా కావచ్చు.